Declaration to be given by the Author/Publisher to Digiti In-copyright books.

To
The Digital Library of India,
IIIT, Hyderabad

Name of the Author/Publisher: S.B.P.B.K.Sathya

Address: Kapileswarapuram
E.G. Dist

City:
State: A.P.
Phone no:
Email:

We are happy to grant permission to Digital Library of scan all the books published by our organization / written by permission in this letter also authorizes and grants an Non E right to the Digital Library of India to scan, digitize and displa books published by the said publisher / Author in the DLI/UDL with out any financial implications from DLI

We will continue to retain the copyright for the book. can make it free to the read for the general public. DLI/ provide the above contact information for anyone wishing to the physical book from us.

SL.NO	TITLE	LANGUAGE
1	శ్రీమద్వాల్మీకి రామాయణం ఉత్తరకాండం	TELUGU
2	" " యుద్ధకాండం, బాలకాండం	"
3	" " అరణ్య, కిష్కింధ, సుందరకాండం	"
4	" " సుందరకాండం	"
5	" " అయోధ్యకాండం	"
6	కబీరుదాసు చరిత్రము	"
7	తిరుప్పావు	"

PS: please add separate sheet for all your titles.

Sincerely,

Signature: [signature] 8/9/08

Name: S.B.P.B.K.SATYANARAYANA

Designation: KAPILESWARAPURAM-

Company: E.G.Dist. A.P.

Date: 8.9.2008

శ్రీమద్వాల్మీకి రామాయణము



అరణ్యకాండము - కిష్కింధకాండము - సుందరకాండము

శ్రీరస్తు

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః

ఐహికాముష్మికఫలప్రదంబును, వాల్మీకిమహర్షిప్రణీతంబున, నగు

శ్రీమద్వాల్మీకి రామాయణము

ఆరణ్యకాండము-కిష్కింధాకాండము-సుందరకాండము.

ఈ గ్రంథము.

కాశ్యపసగోత్రసంభూతుండును, సీతారామార్యపుత్రుండును,నగు

బరూరు - త్యాగరాయశాస్త్రులచే

నిఖిలజగదుపకారార్థము

యథావాల్మీకముగసులభశైలితో తెనుగునవచనకావ్యముగరచియింపఁబడి

స్వకీయ

గీర్వాణభాషారత్నాకరముద్రాక్షరశాలయందు

ముద్రింపంబడి ప్రకటింపఁబడియె.

చన్నపట్టణము.

౧౮౯౩ సం॥

౨—సంపుటము.

ముద్రణము 2005

ప్రతులు 1000

ప్రచురణ
శ్రీ సర్వారాయ ధార్మిక విద్యా ట్రస్టు
కాకినాడ, తూ గో జిల్లా
పిన్ 533 001

ప్రతులకు
సర్వారాయ ధార్మిక విద్యా ట్రస్టు
పాలనా విభాగము
కపిలేశ్వరపురం - 533 309
తూ గో జిల్లా

ముద్రణ
శ్రీ లక్ష్మి గణపతి బైండింగ్ వర్క్స్
మెయిన్ రోడ్, కొవ్వూరు
ఫోన్ 08813 - 231575

శ్రీ ర స్తు.

శ్రీ మ ద్వా ల్మీ కి రా మా య ణ ము వ చ న కా వ్య ము

ఆ ర ణ్య కాం డ

వి ష యా ను క్ర మ ణి క.

కిష్కింధాకాండ

విషయానుక్రమణిక.

సుందరకాండ

విషయానుక్రమణిక.

శ్రీమత్సుందరకాండవిషయానుక్రమణిక ముగిసెను.

శ్రీ రా మ చం ద్రా ర్ప ణ మ స్తు.

శ్రీరస్తు

శ్రీరామచంద్ర సద్గురుపరబ్రహ్మణేనమః.

శ్రీమద్వాల్మీకి రామాయణము

ఆరణ్యకాండము.

ఇట్లు మిగుల ధైర్యవంతుఁడును, ఇతరులకు నెదిరింపనలవిగానివాఁడును నగు శ్రీరాముఁడు మిగుల గొప్పదియగు దండకారణ్యమునందు బ్రవేశించిపోవుచు ఋషులయొక్క ఆశ్రమ సమూహమును బూచె. అయ్యాశ్రమసమూహము దర్భలచేతను, నారచీరెలచేతను, ఆవరింపఁబడినదియును బ్రహ్మవర్చస్సుచేత వెలుంగుచున్నదియును నై మిగుల ప్రకాశించుచున్నదియును, 'ఆకాశమున వెలుంగుచున్న సూర్యమండలమువలెనే" ఒప్పియుండె. మఱియు నయ్యాశ్రమసమూహము సమస్తములైన జీవరాసులకు నివసింపఁ దగినదియును, అనేకములైన మృగములచేతను పక్షిసమూహములచేతనుఁ బరివేష్టింపఁబడినదియును, అప్సరస్త్రీ సమూహముయొక్క ఆటపాటలచే నిరంతరము నొప్పియున్నదియును, మిగుల విశాలములగు నగ్నిగుండములుగల యిండ్లతోను, యాగపాత్రలతోను, కృష్ణాజినములతోను, దర్భలతోను, సమిధలతోను, నీటితోనిండిన పాత్రలతోను, ఫలములతోను గడ్డలతోను నిండినదియై ప్రకాశించుచుండె. అరణ్యమునందు పండినవియును, మిగుల రుచిగలవియును, నగు పండ్లతో నిండినదియును, మిగుల పావనములగు గొప్పచెట్లచే నావరింపఁబడినదియును సమస్తములగు బలులతో గూడుకొనిన హోమములతో నొప్పుచున్నదియును, వేదములు జదువుటవలన గలిగిన ధ్వనులచే బ్రతిధ్వనింపఁజేయఁబడినదియును, అరణ్యమునందు బుట్టిన సమస్తములైన పుష్పములతో నిండినదియును, తామరపూలతో నిండియుండెడు కొలకులచేత నొప్పియున్నదియును నగు నా తాపసాశ్రమ సమూహమును బూచె. మఱియు కందమూలఫలములు ఆహారముగా గలవారును, జితేంద్రియులును, నారచీరెలును కృష్ణాజినములునే వస్త్రములుగా గలవారును, సూర్యునికాంతివంటియు అగ్నిదేవుని కాంతివంటియు కాంతిగలవారును, మిగుల పురాణులైన వారును, నగు ఋషులచేత బ్రకాశించుచుండుటన రాముఁడు బూచె. మఱియును మిగుల పావనులును, నియతాహారులును, నగు మహర్షులచేత నొప్పుచున్న తాపసాశ్రమసమూహమును బూచె. మిగుల శౌర్యవంతుఁడును, కాంతిమంతుఁడును, నగు నా రాముఁడు, బ్రహ్మలోకముతో సమానమైనదియును, వేదములు జదువుటవలన గలిగెడు ధ్వనులచేత బ్రతిధ్వనింపఁ జేయఁబడినదియును, బ్రహ్మవేత్తలును, మహానుభావులును, నగు బ్రాహ్మణోత్తములతో గూడుకొని మిగుల ప్రకాశించుచున్నదియును నగు తాపసాశ్రమ సమూహమును బూచి తన ధనస్సునందలి యల్లెత్రాడును విప్పి మిగుల వినయముతో బోవుచుండె. అప్పుడచట నివసించుచున్నవారును దివ్యజ్ఞానసంపన్నులును, నగు నమ్మహర్షులు, శ్రీరాముని, మిగుల కీర్తిమంతురాలగు సీతాదేవిని, జూచి మహాసంతోషమును బొంది వారల నెదురుకొనిరి. మిగుల ధర్మాత్ములును, దృఢమైన వ్రతముగలవారును నగు నా ఋషులు, "ఉదయించుచున్న చంద్రునివలెనున్న" శ్రీరాముని, లక్ష్మణుని, మిగుల కీర్తిమంతురాలగు సీతాదేవిని, జూచి వారికి మంగళములు గావించి వారల నెదురుకొనిరి. అట్లెదురుకొనినవారును, వనమునందు వసియించియుండువారును, నగు నమ్మహర్షులు ఆ రామచంద్రునియొక్క దివ్యమంగళవిగ్రహమును దేహకాంతియును, సౌకుమార్యమును, దివ్యవేషమును బూచిరి. అప్పుడు ఆ యరణ్యమునందు నివసించుచున్నవారందరును సీతారామలక్ష్మణులను బూచి పరమాశ్చర్యమును బొంది ఱెప్పలార్పక కండ్లు దెఱచుకొని చూచుచుండిరి. అప్పుడయ్యాశ్రమముల యందుండిన మహర్షులు, సమస్తములైన జీవరాసులకును మేలు జేయుటయం దాశగలవాఁడును, తమకధిపతియును, నగు రాముని పర్ణశాలయందు బ్రవేశింపజేసిరి. అంతట నగ్నిహోత్రునితో సమానమైనవారును, మహానుభావులును, ధర్మవర్తనముగలవారును, నగు నా మునులు శ్రీరామునిని అర్ఘ్య పాద్యాదులచే బూజించిరి. అట్లు అర్ఘ్యపాద్యాదులను యిచ్చి, ధర్మజ్ఞులగు నమ్మునులు మహానుభావుఁడగు రాముని నా వనమునందుగల పుష్పములచే బూజించి కందమూలఫలము

లనొసగి కృతాంజలులై యిట్లనిరి.

మిగుల కీర్తిమంతుఁడవగునో రాముఁడా! నీవు ధర్మమును బరిపాలించువాఁడవు. కావున నిచట నుండెడు వారందరకు సుశరణ్యుండవు అందరిచేతను పూజింపఁదగినవాఁడవు. అందరిచేతను సన్మానింపఁదగినవాఁడవు నీవు రాజవు. శిక్షాశాసనముగలవాఁడవు కావున నీవు స్వతంత్రుడవు ఓరామా! యీ భూలోకమున రాజ్యపరిపాలనము చేసెడివాఁడు "దేవేంద్రుని యంశమునందు నాలవపాలుగొని రంజిల్లించి" సమస్తప్రజలను గాపాడుచుండును మఱియు లోకమునందుండెడు సమస్తజనులచేత నమస్కరింపఁబడుచు మిగుల నుత్తమములగు సుఖములను అనుభవించుచుండును, అదియునుగాక నీవు పాలించునట్టి రాజ్యమునను ఉండెడు మేమందఱము నీచేత రక్షింపఁదగినవారము కావున ప్రభువగు నీవు పట్టణమునందున్నను వనమునందున్నను మాకు రాజవే నీవు రాజవగునో రాముఁడా! విడువఁబడిన దండనగలవారమును, వదలిపెట్టఁబడిన క్రోధముగలవారమును, జితేంద్రియులమును, పసిబిడ్డల వంటివారలమును, తపస్సే ధనముగాగలవారమును, నగు మేము నిరంతరము నీచేత కాపాడఁబడవలసినవారముగా నున్నాము. అనియిట్లు ఋషీశ్వరులు రాముని యనేకవిధముల గొనియాడి, ఆయరణ్యమునందుగల నానావిధములైన పుష్పములతోను కందమూలఫలములతోను మఱియు నానావిధములైన ఆహారములతోను రామలక్ష్మణులను బూజించిరి. మఱియు నగ్నిహోత్రునితో సమానమైనవారును, ధర్మప్రవర్తనగలవారును, తపస్సిద్ధులును, నగు నితరఋషులును బ్రభువగు రాముని శాస్త్రోక్తముగ బూజించి తృప్తిఁబొందించిరి.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి మొదటిసర్గము ముగిసెను.

▸❋◂

దండకారణ్యమునందుండు విరాధుఁడను రాక్షసుఁడు సీతను ఎత్తుకొనిపరుగెత్తుట.

ఇట్లు రాముఁడు ఋషులచేత అతిథిసత్కారమును బొంది మఱునాఁడు సూర్యోదయకాలమున వారలనందఱితోను బోయివచ్చెదనని చెప్పి వనమునందు బ్రవేశించె. అట్లు శ్రీరాముఁడు లక్ష్మణునితో గూడుకొనినవాఁడై యరణ్యమున బ్రవేశించిపోవుచు, పలువిధములగు మృగసమూహములు గలదియును, పెద్దపులులతోను తోడేళ్ళతోను గూడుకొనినదియును, క్షీణించినవృక్షములును, తీగెలును, పొదలును గలదియును, దర్శనమగు సరోవరములు గలదియును, కూయుచుండెడు పలువిధములగు పక్షులు గలదియును, ఈలపురుగుల సమూహములయొక్క ధ్వనులచే నిండియున్నట్టియును, నగు అరణ్యముయొక్క మధ్యప్రదేశమున జూచె. అట్టి యరణ్యమున శ్రీరాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై పోవుచు మిగుల భయంకరమగు నాయరణ్యమధ్యమున పర్వతశిఖరముయొక్క ప్రకాశమువంటి ప్రకాశముగలవాఁడును, గొప్పగా నఱచుచున్న వాఁడును, గుంటకండ్లు గలవాఁడును, పెద్దనోరుగలవాఁడును, వికృతాకారముగలవాఁడును, మిట్టపల్లములతో గూడినకడుపుగలవాఁడును, విషమశరీరుఁడును, మిగుల పొడవైనవాఁడును, వికృతరూపము గలవాఁడును, చూచువారలకు మిగుల భయమును బుట్టించువాఁడును, నెత్తురుమాంసములతో దడిసిన పులిచర్మమును గట్టుకొనియున్నవాఁడును, సకలజీవులకును వెఱపుబుట్టించువాఁడును, "నోరుదెఱచుకొనియున్న యమధర్మరాజువలె" నున్నవాఁడును, మూఁడుసింహములను నాల్గుపెద్దపులులను, రెండుతోడేళ్ళను, పదిజింకలను, దంతములు గలిగి, క్రొవ్వుచే బూయఁబడిన గొప్పయేనుఁగుతలను నొకటిని, గొప్పయినుపశూలమునందు గ్రుచ్చుకొనియున్నవాఁడును గొప్పశబ్దముగలుగునట్లఱచుచున్నవాఁడును నగు నొకరాక్షసుని జూచె అప్పుడా రాక్షసుఁడు సీతారామలక్ష్మణులను జూచి మహాకోపముగలవాఁడై "ప్రళయకాలయముఁడు ప్రజలపైబోవునట్లు" వారలపైకిబోయె. ఆ ఘోరరాక్షసుఁడు వారలపైకిబోయి భూమివడవడవడకునట్లు మిగులభయంకరము గనఱచి సీతాదేవిని ఎత్తికొనిపోవుచు రామలక్ష్మణులను చూచి యిట్లనియె.

ఓమనుజులారా! మీరు కాలముదీరినవారగుటచే జడలు దాల్చినవారును నారచీరలను ధరించినవారును భార్యను వెంటబెట్టుకొనివచ్చినవారును, కత్తిని విల్లును అంబులను ధరించినవారునునై యీదండకారణ్యమును జొచ్చితిరి మఱియు మీరు తాపసులవలె గాన్పించుచున్నారు తాపసులు స్త్రీలతో గూడ నెట్లు నివసింపనగును? మఱియు మునివేషములు దాల్చి, తాపసవిరుద్ధములగు కార్యములను జేయునట్టి పాపకర్ములగు మీరలెవ్వరు? ఓకపటమునులారా! నేను విరాధుఁడను రాక్షసుఁడను ఋషులమాంసములను భక్షించుచు ఆయుధములను ధరించి నిరంతరము యీయరణ్యమునందు సంచరించుచున్నాను మిగుల నందమగు పిఱుదుగల యీస్త్రీని నాకు భార్యగా జేసికొనియెదను. మఱియు మిగుల పాపాత్ములగు మిమ్ములనిద్దఱిని యుద్ధమునందు జంపి మీరక్తమును పానము జేసెదను. అనియిట్లు మిగుల క్రూరముగాను దుర్మార్గముగాను జెప్పుచున్నవాఁడును, మిగుల దురాత్ముఁడును, నగు విరాధునియొక్క మహాగర్వపుమాటను విని, జనకమహారాజపుత్రికయగు సీతాదేవి మిగుల సంభ్రమముతో గూడుకొనినదియై "పెనుగాలిచే గూలు నరటిచెట్టువలె" గడగడ వణకె. అప్పుడు విరాధునియొక్క చం

కలోనున్నదియును, మంగళస్వరూపురాలును, నగునాసీతా దేవినిఁజూచి శ్రీరాముఁడుమిగులవెలవెలబోయిన ముఖముగ లవాఁడై లక్ష్మణునితో నిట్లనియె.

సౌమ్యుఁడవగునోలక్ష్మణా! జనకమహారాజకుమార్తె యును, మిగులశ్రేష్ఠమగు నాచారముగలదియును, మిగులసు ఖమనుభవించుచున్నదియును, రాజపుత్రికయును, మహాకీర్తి మంతురాలును, నగు నాభార్యవిరాధునిచంకయందుండుచుట నబడియున్నది. చూడుము. ఓలక్ష్మణా! మనవిషయమునందు కైకేయికిగలయభిప్రాయమును, ఆకైకేయి మిగులప్రేమతో గోరినవరమును, అతిశీఘ్రముగని ప్పుడేసిద్ధించినది. మనకురెం డవతల్లి యగుకైకేయి మిగులదూరదృష్టిగలదైనందున తనకుమా రునకే రాజ్యమువచ్చుటచేత తృప్తినొందినంతనుండక సమస్త జీవరాసులకునుహితుఁడనగు నేనరణ్యమునకుబంపఁబడవల యునని కోరినది. ఆకోరికమిగులదీర్ఘాలోచనగలదియే ఏలన నగా, నేను పట్టణమునుండు నేని సమస్తప్రజలునునాకురా జ్యమునిప్పింపగోరుదురనియును, నేనరణ్యమునకుబోదునేని నేరయు వారాడవచ్చుననియును, పిదప యిప్పుడు దుష్ట రాక్షసునిచే జానకిని పహరింపఁజేయుటయును, సీతాపహరణము వలనగలిగినదుఃఖముచేతగాని, లేక యితరకష్టములవల్లగాని, నేనిచ్చటనే ప్రాణములువిడుచుకొనుటయును, ఆపిలభరతుఁడుకు నెమ్మదిగరాజ్యమేలుననియును, యోచించి యిట్లువరమడిగిన ది ఆకైకేయికోరికయీదినమున నిప్పుడేసిద్ధించినది ఓల క్ష్మణా! సీతనుయితరపురుషుఁడు తాకుటవలన నాకుగలిగినం తటివ్యసనము, తండ్రిజచ్చుటచేతగాని, రాజ్యములేకపోవు టవలనగాని, గలుగలేదు. అనియిట్లురాముఁడు మహాదుఃఖ ముతో నేడ్చుచు జెప్పగవిని లక్ష్మణుడు మహాకోపమునుబొం ది "అడ్డగింపఁబడిన నాగసర్పమువలె" నిట్టూర్పులనువిడుచు చునిట్లనియె

ఓఅన్నా! రామా! సమస్తజీవరాసులకును ప్రభుఁడవు ను, ఇంద్రునితో సమానమైనవాఁడవును, నావంటిపరిచారకు నితో గూడినవాఁడవును, నగునీవుదిక్కు-లేనివానివలె యిట్లెం వ్యసనమునుబొందెదవు. మిగులకోపమును బొందిన నేనిప్పు డొకబాణముచేత నీవిరాధునిజంపి వీనినెత్తురు భూమికిబలి గానిచ్చెద. ఓఅన్నా! రామా! యిప్పుడు నేను నాభుజబల ముకొలది యీకొప్పబాణమును వీనిఱొమ్మునపై నాటనేసె ద ఇప్పుడేవీనిదేహమునుండి ప్రాణములు బైలువెడలును అంతనీవిరాధుఁడు గిఱగిఱదిరిగి నేలంగూలును

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ద్వితీయసర్గ ము గిసెను.

రాముడు విరాధునిశూలమును నఱికి వేయుట.

అనియిట్లు మిగులకాంతిమంతుఁడగు లక్ష్మణుఁడుశ్రీరా మునితోజెప్ప విరాధుఁడనురాక్షసునిఁజూచి ఒకపకనవ్వుచు నిట్లనియె

ఓరీ రాక్షసాధమా! నీవెవ్వఁడవు? ఈవనమునయందు సుఖ ముగదిరుగుచున్నావు? అని లక్ష్మణుఁడడుగగావిని విరాధుఁడు అడవియంతయు నిండునట్లు గొప్పధ్వనిచేయుచు మఱలని ట్లనియె

మీరలెవ్వరు? ఎచ్చటనుండియిచటికిబోవుచున్నారు? నేనడుగు చున్నాను మీవృత్తాంతమును నాకుజెప్పుమని విరాధుఁడ డిగ అంతమండుచున్నముఖముగలవాఁడును, తన్నడుగుచు న్నవాఁడును, నగువిరాధునకు మిగులపరాక్రమశాలియగు రాముఁడు తనయొక్క యిక్ష్వాకువంశమును విశదముగజె ప్పి మఱియు నిట్లనియె

మేముక్షత్రియులము నేఁడు మొదలు నిత్యము వనము నందుండుచున్నవారము మఱియునీవెవ్వఁడవు? ఈదండ కారణ్యమునందు ఏలదిరుగుచున్నావు చెప్పుమనియడిగెను అంతనవ్విరాధుఁడు సత్యపరాక్రమశాలియగు రామునితో

ఓరాముఁడా! నావృత్తాంతమును జెప్పెదను వినుము నే నుజయుఁడనువానికుమారుఁడను నాతల్లి శతహ్రదయనుపే రుగలది ఈలోకమునందుండెడు సమస్తరాక్షసులును, న న్నువిరాధుఁడనిపిలిచెదరు మఱియు నేను బ్రహ్మదేవునిగూ ర్చి తపస్సుచేసి అతని అనుగ్రహమువలనయీలోకములోనెవరి చేనైనను శస్త్రాస్త్రములచే జావకుండునట్లును, కత్తిచేఛే దింపబడకుండునట్లును, జీల్పబడకుండునట్లును వరమును బొందియున్నాను కావునమీరిప్పుడు యీస్త్రీయందలి యపేక్షవిడిచియతివేగమున, వచ్చినత్రోవనే మరలిపొం డు. అట్లుపోతిరేని మీప్రాణములనుబోగొట్టను మిమ్ములను జంపను అనివిరాధుఁడుజెప్పె ఆమాటవిని రాముఁడుమ హాకోపముచే నెఱ్ఱనైననేత్రములుగలవాఁడగుచు, వికార మైనరూపముగలవాఁడును, మిగుక్రూరమైన మనస్సుగల వాఁడును, రాక్షసుఁడును, నగువిరాధునితో నిట్లనియె.

ఓనీచుఁడా! రాక్షసాధమా! నీవు మిగులనల్పప్రయోజన ముగోరుచున్నావు గాన నీవుదపింపఁబడుదువు. నిశ్చయము గనీవుచచ్చుటకు మార్గమును వెదకుచున్నావు. నీవిఁక నాతో యుద్ధముజేయుము నిన్నుప్రాణములతో తప్పించుకొనిపోని వ్వను. అనిచెప్పి రాముడు ధనుస్సునకు అల్లెత్రాడుగట్టి వి ల్లెక్కు-పెట్టియతివేగమున మిగులదీక్ష్ణములగు బాణములనుసం

〰

ధించి రాక్షసునిం గొట్టె. మఱియు రాముఁడల్లె త్రాటినొసంధించినవింటిచే, బంగారుపింజలుగలవియును, మహావేగము గలవియును, గరుడునితోను వాయుదేవునితోను సమానమైన వేగముతో బోవునవియును, నగు నేడుబాణములను విరాధునిపైఁ బ్రయోగించె. అంతనగ్నిహోత్రునితో సమానమైనవియును నెమలిఈకెలుగట్టబడినవియును, నగు నాబాణములు విరాధుని దేహమునందుఁ బ్రవేశించి వానిశరీరమును భేదించుకొని బైలువెడలినవియును నెత్తుటిచే బూయఁబడినవియునై భూమిపైఁబడె. అంతట నవ్విరాధుఁడు రామునిచే గొట్టఁబడినవాఁడగుచు సీతను నేలపై విడిచి శూలమును చేత బట్టుకొని మిగులఁగోపోద్దీపితుఁడై రామలక్ష్మణులపైకి బరుగెత్తె. మఱియు నారాక్షసుడు మహాధ్వనిగలుగునట్లుగ సింహనాదము సేయుచు దేవేంద్రుని టెక్కెముతో సమానమైన శూలమును చేతబూని నోరు విశాలముగ దెరుచుకొని యమునివలె నేయొప్పియుండె. అట్టియెడ ప్రళయకాలయమునివలెనున్న యావిరాధునిపై రామలక్ష్మణులిరువురును మిగులతీక్ష్ణములగు బాణవర్షము గురిపించిరి. అప్పుడు మిగులభయంకరుఁడగు నవ్విరాధుడు వారలకార్యమునకు నవ్వుచు ఆవులించి ఒళ్లువిఱిచె. అంత మహావేగముగ బోవునట్టి యాబాణములు ఆరాక్షసుడు ఒళ్లువిఱుచుటచే నతనిదేహమునుండి బైలువెడలి జలజలమని నేలంబడినవి. అప్పుడవ్విరాధుఁడు వరమహిమవలన ప్రాణములను గోలుపోక మిగుల ధైర్యమునవలంబించి శూలమునెత్తుకొని రామలక్ష్మణుల నెదుర్కొని వారలపైకి బోయె. అట్లువిరాధుఁడు రామలక్ష్మణులపైకి బోవుచుండగ శస్త్రముల నెఱింగినవారలలో మహాసమర్థుఁడగు రాముఁడు, ఆకాశమార్గమున నగ్నిహోత్రముతో సమానముగ వెలుగుచున్నదియును, వజ్రాయుధముతో సమానమైనదియును నగు నారాక్షసునియొక్క శూలమును రెండు బాణములచే నరికివేసె. అంతనా రామునిబాణములచే నఱకబడిన యాశూలము "దేవేంద్రుని వజ్రాయుధముచే ఖండింపఁబడిన మేరుపర్వతమువలె" విరాధునిచేతినుండి నేలం గూలె అట్లు శూలము విఱిగి క్రిందబడినతోడనే విరాధుఁడు మహాకోపమును బొంది యతివేగముగ వచ్చుచుండుటను రామలక్ష్మణులు బూచి "కృష్ణసర్పమువలె" మిగులతీక్ష్ణములైనవియును శోభనకరములైనవియును నగు ఖడ్గములను నతివేగముగ దీసికొని చక్కగా మర్దించిరి మిగులభయంకరుఁడగు విరాధుఁడు వారలచే మిగుల వ్యసనొందింపఁబడినవాఁడయ్యెను, యితరులకు కదిలింప నలవిగానివారును, పురుషశ్రేష్ఠులను, నగు రామలక్ష్మణుల నిద్దఱిని తన బాహువులచేఁ గౌగలించి యెత్తికొనిపోఁగోరె. అంత రాముఁడు విరాధునియొక్క యభిప్రాయమును దెలిసికొని లక్ష్మణునితో నిట్లనియె.

ఓలక్ష్మణా! ఈరాక్షసుఁడు మనలనీమార్గముననే మోసికొనిపోగోరుచున్నాఁడు ఓసుమిత్రానందనా! లక్ష్మణా! వీనియిష్టము చొప్పున నెత్తుకొనిపోనిమ్ము. ఈరాక్షసుఁడు మనల నెత్తుకొనిపోవు నదియే మనముపోవలసినమార్గము. అనియిట్లు రాముఁడు లక్ష్మణునితో జెప్పుచుండగ నారాక్షసుఁడు తన బలవీర్యములచేత మహాబలులగు రామలక్ష్మణులను "పసిబాలులను బోలె" ఎత్తికొని తన మూపుపై నుంచుకొనె. అట్లువిరాధుఁడు వారలను భుజముపైనుంచుకొని మిగులభయంకరముగ సింహనాదము జేయుచు అడవిమార్గమున బైలువెడలెను. అట్లవ్విరాధుఁడు వారలనెత్తికొని బైలుదేరిపోవుచు గొప్పమేఘమువలె నల్లగానున్నదియును, పలువిధములగు పెద్దచెట్లతో నిండియున్నదియును, నానావిధములగు నేకపక్షులచేత చిత్రింపఁబడినదియును, నక్కలతోను దుష్టమృగములతోను నిండియున్నదియును నగు నొకగొప్పఅరణ్యమున బ్రవేశించె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి మూడవసర్గము ముగిసెను.

విరాధుడు రామలక్ష్మణులచే జచ్చుట

అట్లు విరాధుఁడు రామలక్ష్మణులను దీసికొనిపోవుటను బూచి మిగుల అందములగు చేతులుగల సీతాదేవి చేతులను రెండును గట్టిగబట్టుకొని పెద్దగాగొంతెత్తి యిట్లనియెను.

అయ్యో! దశరథరాజపుత్రుఁడును, సత్యవంతుఁడును, శీలముగలవాఁడును, మహాపరిశుద్ధుఁడును, నగు రాముని లక్ష్మణుని మహాభయంకరస్వరూపుఁడగు రాక్షసుఁడెత్తికొని పోవుచున్నాడే, అయ్యో నేనేమిసేయుదును, అయ్యో యింకనన్నుతోడేళ్లును, బెబ్బులులును, చిఱుతపులులును, తినును అనియిట్లనేకవిధముల విలపించుచు విరాధుని బూచియిట్లనియె.

ఓరాక్షసోత్తమా! నీకు దండముపెట్టెదను. కకుత్థ్సవంశోద్భవులగు నీరామలక్ష్మణులను విడిచిపెట్టి నన్నెత్తికొని పొమ్ము. అని యిట్లనేకవిధముల సీతాదేవి విలపించుటను బూచి మహాశౌర్యవంతులగు రామలక్ష్మణులు, మిగుల దురాత్ముఁడగు నవ్విరాధుని యతివేగమున సంహరించుటకు యత్నించిరి అట్లు ప్రయత్నించి మహాభయంకరుఁడగు నవ్విరాధుని యెడమచేతిని లక్ష్మణుఁడు కరుకుమని నఱికె. మఱియు రాముఁడు కుడిభుజమును నఱికెను. అంత మేఘముతో సరిపోలియున్న యావిరాధుఁడు, తనచేతులు నఱకబడుటచే మిగుల నధైర్యమును బొంది భయపడి "దేవేంద్రుని వజ్రాయుధముచేత నఱి

కబడిన పర్వతమువలె అతివేగముగ నేలంగూలె. అట్లు విరాధుఁడు క్రిందబడుటనుజూచి రామలక్ష్మణులిరువురు నువానినెత్తి నేలంగొట్టియు, మోకాళ్ళతో బాదియు, పిడికిళ్ళతో గుద్దియు, కాళ్లతో దన్నియు, వానియెముకలువిఱిచిముద్దజేసిరి. ఇట్లా రాక్షసుఁడనేక బాణములచే గొట్టఁబడియును, కత్తులచేనఱకఁబడియును, నేలపైగొట్టి ముద్దజేయబడియును, మఱియునసేకవిధముల హింసింపఁబడియును, ప్రాణములనువిడువడయ్యె. అట్టియెడభయమును బొందువారికిఅభయమునిచ్చువాఁడును, శ్రీమంతుఁడును, నగురాముఁడు, చంపుటకలవిగానివాఁడును, పర్వతముతో సమానముగనున్నవాఁడును, నగునవ్విరాధునిచక్కగా జూచిలక్ష్మణునితో నిట్లనియె.

పురుషోత్తముఁడవగునో లక్ష్మణా! ఈరాక్షసుని యొక్కతపోమహిమచే వీనిని యుద్ధమునందుశస్త్రాస్త్రములచే జంపుటకుసాధ్యముగాదు. కావునవీనినిపూడ్చిపెట్టుదము. అని రాముఁడులక్ష్మణునితో జెప్పగ విరాధుఁడువిని పురుషోత్తముఁడగు రామునితో మిగులవినయముగనిట్లనియె.

పురుషశ్రేష్ఠుఁడా! రాముఁడా! నీవు దేవేంద్రునియొక్కబలమువంటి బలముగలవాఁడవు. నీవునన్నుసంహరించితివి. నేను నాయవివేకమువలన నీవుపురుషోత్తముఁడగు ఆదిదేవుఁడవనియెఱుఁగనైతిని. నాయనా! రాముఁడా! నీవుపురుషోత్తముండవనియును కౌసల్యగర్భమున బుట్టితివనియును నేనిప్పుడెఱిగితిని. మహానుభావురాలగు సీతాదేవినిఁగూడ తెలిసికొంటిని. మహాకీర్తిమంతుఁడగు లక్ష్మణునిగూడ తెలిసికొంటిని. ఓదేవా! రామచంద్రా! నేనుతుంబురుఁడను పేరుగలగంధర్వుఁడను. కుబేరుఁడునన్నుశపించె. అతనిశాపమువలనమిగులఘోరమగు నీరాక్షసరూపమును దాల్చితిని అప్పుడుమహాయశుఁడగు కుబేరునినేనుమిగులప్రార్థింపగనాయందుగరుణించికుబేరుడిట్లనియె.

ఎప్పుడు దశరథమహారాజకుమారుఁడగు రాముఁడునిన్నుయుద్ధమునందుసంహరించునో, అప్పుడు నీవుశాపవిముక్తుఁడవై నీనిజరూపమునుదాల్చి దేవలోకమునుబొందెదవు. అనియిట్లునాకనుజ్ఞయిచ్చె. అనఘాత్ముఁడవగునో రాముఁడా! నాశాపకారణముజెప్పెదవినుము. మున్ను నేను రంభయందు మహామోహముగలవాఁడనగుచు రాజగుకుబేరునిసేవింపకుండుటచేత నాయందత్యాగ్రహము గలవాఁడగుచు, నన్నిట్లుశపియించె. విరోధులనుతపింపఁజేయునట్టిఓరాముఁడా! నేనునీదయవలన మహాదారుణముగునీకఠినశాపమువలననుండివిముక్తుండనైతిని. నేనింకనానివాసమగుస్వర్గలోకమునకుఁబోయెదను. నీకుశుభములుగలుగుగాక; నాయనా! రామచంద్రా! ఇచ్చటికొకటిన్నరఆమడదూరమునమిగులధర్మాత్ముఁడును, మహాతపస్సంపన్నుఁడును, సూర్యునితో సమానుఁడునునగు శరభంగుడనుమహర్షి గలఁడు. నీవతివేగమునన చ్చటికిబొమ్ము. ఆశరభంగుఁడునీకు మేలుగలుగజేయును. ఓరాముఁడా! నాయనా! నీవచ్చటికిఁబోవుటకుమునుపేయొకగుంటద్రవ్వి, అందునాకళేబరమునుపూడ్చిసుఖముగబొమ్ము. శ్లో॥ రక్షసాంగతసత్వానామేషధర్మస్సనాతనః॥ ప్రాణముబోయినరాక్షసులయొక్కకళేబరములనుభూమిలోపూడ్చుట సనాతనధర్మము॥ శ్లో॥ అవటేయేనిధీయంతేతేషాంలోకాస్సనాతనాః॥ ఏరాక్షసులయొక్కకళేబరములు పల్లములో పూడ్చిపెట్టఁబడునో యట్టివారికిశాశ్వతమగు లోకములు గలుగును. అనిమిగులబలశాలియును, బాణములచేబీడింపఁబడినవాడును, నగువిరాధుడుజెప్పిరాక్షసకళేబరమును విడిచిస్వర్గమునకుఁబోయెను. అంతరాముఁడు విరాధుఁడు జెప్పినమాటనువినిలక్ష్మణునితోనిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! గొప్పయేనుఁగునకువలె మిగుల భయంకరాకారుఁడును, క్రూరకర్ముఁడు, నగునీరాక్షసునకుయీయరణ్యమునందొక గొప్ప గుంటత్రవ్వుము. అనియిట్లుమిగులపరాక్రమశాలియగు రాముడు లక్ష్మణునితో గుంటత్రవ్వుమనిచెప్పితనకాలవ్విరాధునిమెడపైనసుంచి కదలకుండునట్లుగట్టిగత్రొక్కిపట్టె. అప్పుడు లక్ష్మణుఁడొకపాఱచిప్పఁదీసికొని పెద్దదేహముగలవిరాధుని ప్రక్కనొకగొప్పగుంటత్రవ్వె. అంతనలుఁగఁద్రొక్కఁబడిన కంఠముగలవాఁడును, శంకుకర్ణములుగలవాఁడును, గొప్పకంఠధ్వనిగలవాఁడును, మిగులభయంకరముగ నఱచుచున్నవాఁడును, నగునవ్విరాధునిగుంటలోఁబడవేసిరి మఱియు మిగులతీవ్రమైనశౌర్యముగలవారును, రణరంగమునందుస్థిరముగనిలుచువారును, నగునా రామలక్ష్మణులిరువురును, ఇతరులచే జయింపనలవిగానివాఁడును, చూచువారలకు వెఱపునుబుట్టించువాఁడును, సింహనాదముఁ జేయుచున్నవాఁడును, నగునవ్విరాధునియుద్ధమునందు మహాసంతోషముతో జయించియతనిని గుంటలోఁబడవైచిరి. అట్లు కార్యవిశారదులును, పురుషశ్రేష్ఠులును, నగురామలక్ష్మణులిద్దరును, విరాధుఁడుశస్త్రాస్త్రములచే జంపగూడనివాఁడనినిశ్చయించి గుంటలో వేసిపూడ్చిపెట్టిచంపుటకుయత్నించిరి. అప్పుడువనమునందుదిరుగుచుండెడు రాముఁడుతన్నుబలవంతముగ జంపనిచ్ఛగలవాఁడైయున్నాడని తెలుసుకొనివిరాధుఁడు తనకుశస్త్రాస్త్రములచే జావులేదనియును, తన్ను గుంటత్రవ్విపూడ్చిపెట్టవలయుననియును, తనయొ

కటివధక్రమముతోనే రాముని కౌఁగిలించె. అంతరామచంద్రుఁడతనిమాటవిని యతనినిగుంటలోఁ బూడ్చిపెట్టుట కారంభించె. అట్లు రాముఁడతనిబూడ్చిపెట్టయత్నించి గుంటలోఁద్రోయుచుండఁగ నాతండఱచినమహాధ్వనిచే నాయరణ్యమునందంతటను బ్రతిధ్వనిగలిగె. ఈరీతిగ రామలక్ష్మణులు విరాధునిగుంటలోఁ బడవైచి పులకాంకితదేహులై యామహారణ్యమునందు నిర్భయముగ మహాసంతోషముతోఁ గొప్పడాళ్లు దెచ్చి యాతని శరీరముపైఁగప్పి యాగుంటను బూడ్చిరి. బంగారుచేవిచిత్రముగ జేయఁబడినబాణములుగల రామలక్ష్మణులిట్లు విరాధునిసంహరించి సీతనుదీసికొని పరమసంతోషమును బొందినవారై "చంద్రసూర్యులాకాశమునసంచరించునట్లు" యామహారణ్యమునందు దిరుగుచుండిరి

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నాలుగవసర్గము గిసెను

సీతారామలక్ష్మణులుశరభంగమహామునియాశ్రమమునకుబోవుట.

మిగులశౌర్యవంతుఁడగు రాముఁడు దండకారణ్యమునమిగులభయంకరుఁడును మహాపరాక్రమశాలియునునగు విరాధుఁడను రాక్షసునిసంహరించి సీతాదేవిని కౌఁగలించుకొని యూరడించిమహాకాంతిచే బ్రకాశించుచున్నవాఁడును తమ్ముఁడునునగు లక్ష్మణునిఁజూచియిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! ఈయరణ్యముమిగుల సహాయకరమైనదిగాను, సంచరింపనలవిగానిదిగాను, నున్నది. అదియునుగాక మనముఅడవియందుసంచరించుట కలవాటుపడినవారముగాము, కావుననతివేగమున తపోధనుఁడగుశరభంగమహామునియొద్దకుఁ బోవుదము అనిచెప్పి రాముఁడు, దేవతామహిమవంటి మహిమగలవాఁడును, తపస్సుచే పరమాత్మను ధ్యానించుచున్నవాఁడును, నగుశరభంగమహాముని యాశ్రమమునుగూర్చిపోవుచుండె. అట్లుపోయి రాముఁడుశరభంగమహాముని సమీపముననున్నదియును, దేహముతోఁగూడినదియును మిగులవెలుంగుచున్నదియును, సూర్యునితోను నగ్నిదేవునితోను సమానమైనదియును, మిగులనాశ్చర్యకరమైనదియునునగు నొకగొప్పవస్తువునుజూచె. అంత రాముండు సమీపమునకుఁ బోనుపోను దేవేంద్రునిఁ జూచె. అంతయింద్రుఁడుగగనమున రథమునిలిపిదేవతలుతనవెంటరాగ భూమినంటక యాకాశమార్గముననే శరభంగునియొద్దకువచ్చుచుండె. మఱియు మిగులప్రకాశించుచున్న యాభరణములుగలవాఁడును, శుభ్రములైన వస్త్రములనుధరించియున్నవాఁడును, తనతోసమానులైనవారును, మిగులమహిమగలవారును, నగుననేకులచే బూజింపఁబడుచున్నవాఁడును, నగుదేవేంద్రుని రామచంద్రుండుదూరంబుననుండిచూచె. అట్లు రాముఁడు దేవేంద్రుని చూచిపిదప నాయాశ్రమమునకుసమీపమున ఆకాశమార్గమున పచ్చనిగుఱ్ఱములచే బూన్పఁబడినదియును, బాలసూర్యసితసమానముగ బ్రకాశించుచున్నదియునునగు నాయింద్రునిరథమునుజూచె. పిమ్మట తెల్లనిమేఘములతోసమానముగ బ్రకాశించుచున్నదియును, చంద్రబింబముతోసరిపోలియున్నదియును, మిగులనిర్మలమైనదియును, పలువిధములగురంగులుగలపూదండలచే బ్రకాశింపజేయఁబడినదియునునగు దేవేంద్రునియొక్క శ్వేతచ్ఛత్రమును గొడుగును రాముఁడుజూచె. మఱియుమిగులనధికమైనవియును, బంగారుపిడులుగలవియును, మిగులవెలగలవియును, ఉత్తమస్త్రీలచేగొనిపోఁబడుచున్నవియును, తలకుమీఁదుగవీవంబడుచున్నవియునునగువింజామరములను రామచంద్రుఁడుజూచె. అట్టియెడననేకులైనగంధర్వులును, దేవతలును, సిద్ధులును, పరమఋషులును, ఆకాశముననున్నదేవేంద్రుని వేదవాక్యములచేబొగడుచుండిరి పిమ్మటదేవేంద్రుఁడు శరభంగమహామునితోసంభాషించుచుండరామచంద్రుఁడుచూచియావలనాయింద్రునిరథమును లక్ష్మణునకుఁజూపి యతనితోనిట్లనియె.

ఓతమ్ముఁడా! లక్ష్మణా! మిగులప్రకాశముగనున్నదియై తపింపజేయుచుండెను ఉదయించినసూర్యునివలె నున్నదియును, గగనమార్గముననున్నదియునునగు రథమునుజూడుము ఓతమ్ముఁడా! లక్ష్మణా! యజ్ఞముజేయువారు దేవేంద్రునిపచ్చగుఱ్ఱములను మహావినయముతో బిలుతురని ముందుమనమువినియున్నాముగదా? అవిగోచూడుము. ఆగుఱ్ఱములిప్పుడుఆకాశమార్గముననున్నవి. మఱియుకుండలములుధరించియుండువారును, వయోవంతులును, మిగులవిశాలములగుఱొమ్ములుగలవారును, ఇనుపగుదియలవలె మిగులపొడవులగు చేతులుగలవారును, ఎఱ్ఱనిరంగుగలవస్త్రములనుధరించియుండువారును, బెబ్బులులవలెనెదిరింపనలవిగానివారును, కత్తులుచేతబట్టుకొని రథముచుట్టును దిక్కునకొక్కింటికినూఱ్ఱురివంతుననిలిచియున్న వారునునగునీయుత్తమపురుషులందఱును దేవతలేను. ఓలక్ష్మణా! వీరికంఠలకిఁ ఱొమ్ములందునిప్పువలె ప్రకాశించెడుహారములు గలవుచూడుము ఓసుమిత్రానందనా! తమ్ముఁడా! లక్ష్మణా! వీరందఱును యిరువదియైదుసంవత్సరములకు మించనివయస్సుగలవారుగనే, యున్నారుచూడుము. పురుషశ్రేష్ఠుఁడ

వగునో లక్ష్మణా! దేవతులునిరంతరమును యిరువదియైదు సంవత్సరములవయస్సుగలవారుగనే, యుందురు ఆహా! వీరలెంతసుందరములగు నాకారములుగలవారో, చూడుము.

ఓలక్ష్మణుడా! తమ్ముడా! నీవిచ్చటనె సీతతోగూడనుండుము. నేనతివేగమునరథమునొద్దకుబోయి యారథముపై గూర్చుండియుండు దివ్యసుందరవిగ్రహుండెవడో తెలిసికొని యొక నిమిషమాత్రములో వచ్చెద. అనియిట్లుకకుత్స్థవంశోద్భవుడగు రామచంద్రుండులక్ష్మణునితో నీవిచ్చటనేయుండుమనిచెప్పి యతివేగమున శరభంగమహాముని యాశ్రమమునకుబోయెను. అట్టియెడ దేవేంద్రుడు రాముడు వచ్చుచుండుటనుజూచి శరభంగునియొద్దకిబోయి యాముని తోరహస్యముగ నిట్లనియె.

ఓ తాపసోత్తమా! ఇదిగో రాముండిచ్చటికి వచ్చుచున్నాడు ఈతడునాతో మాటలాడుటకుముందు, తానేపకార్యనిమిత్తముగ నవతరించెనో యాకార్యమునెరవేర్పవలయును. ఆపనినెరవేరినవెనుక నన్నుజూడవచ్చును. తానువచ్చినకార్యమునందు జయప్రదుడును, దేవకార్యముసాధించినవాడు, నగునీ రాముని నేనతిశీఘ్రకాలమున నేజూచెదను. మఱి యితరులకసాధ్యమగు గొప్పకార్యమును నీరాముడుజేయవలసియున్నదిగదా? ఆకార్యము సాధించినపిమ్మట యారాముడునన్నుజూడవలయును. అనియిట్లుదేవేంద్రుడు శరభంగమహామునితోజెప్పి యతనిని బూజించి సెలవుబుచ్చుకొని తనరథమునందెక్కి స్వర్గలోకమునకుబోయెను. అట్లుదేవేంద్రుడు స్వర్గమునకుబోవుటయు రాముండుచూచివెనుకకుబోయి సీతాలక్ష్మణులను వెంటబెట్టుకొని, యగ్నియందుప్రవేశించుటకొఱకు నగ్నిదేవునిబ్రార్థించుచున్న శరభంగమహామునియొద్దకుబోయె. ఇట్లు రాముడు లక్ష్మణుడుసీతయు వీరుముువ్వురును శరభంగమహాముని దగ్గరకుబోయి నమస్కరించినిలువంబడిరి. అంతనాశరభంగమహాముని వారలనుసన్మానించి గూర్చుండుడనిచెప్పె. అంతవారిట్లుగూర్చున్న పిదప రాముడు శరభంగమహామునినిజూచియిట్లనియె.

ఓమహాత్మా! శరభంగఋషీశ్వరా! ఇపుడుతమసమీపమునకు దేవేంద్రుడువచ్చినట్లుండెను. అతండిపుడెట్లుబోయెనో చెప్పవలయుననియడిగె. అట్లురాముండడిగిన శరభంగమహాముని యావృత్తాంతమంతయు రామునకెఱిగించి యిట్లనియె.

ఓ రాముడా! కోరినవారికోరికలీడేర్చునట్టి యీయింద్రుడు, నేజేసినయుగ్రతపస్సుచే నాకులభించి నదియును, తపస్సంపన్నులు గానివారికి పొందశక్యముగానిదియును, నగుబ్రహ్మలోకమునకు నన్నుదీసికొనిపోవుటకువచ్చెను పురుషోత్తముడవగునో రాముడా! నీవుమిగుల దగ్గరకు వచ్చియుండుట నేనెఱింగిమిగులయిష్టుడవైన అతిథియగునిన్నుజూడక పోరాదనియెంచితిని. పురుషోత్తముడవగునో రాముడా! ధర్మమునందు ప్రవర్తించువాడవును, గొప్పమనస్సుగలవాడవును నగునిన్నుజూచినతోమాట్లాడిపిమ్మట స్వర్గమునకుబోదమనినిశ్చయించితిని. మానవోత్తముడవగునో రాముడా! అక్షయములగునవియును మిగులమంగళకరములైనవియును, నగుబ్రహ్మలోకస్వర్గలోకములను నాతపోమహిమచే జయించియున్నాను వాటిని నీకిచ్చెదతీసికొనుము అనియిట్లుశరభంగమహామునిజెప్పె. అంత పురుషోత్తముడును సమస్తశాస్త్రములయందును బండితుడును, నగురాముడుశరభంగమహామునినిజూచి యిట్లనియె.

మునిశ్రేష్ఠుడవగునో శరభంగుడా! సర్వలోకములను నేనేసాధింపగోరియున్నవాడను. కావుననీయరణ్యమునందు నాకునివసింపదగిన ప్రదేశమునుమీరుచూపించితిరేని యదియెచాలును దేవేంద్రునిబలమునకు సరిబోలుబలముగల రాముడిట్లడుగగానే మిగులమతిమంతుడగు శరభంగమహాముని మఱలరామునిజూచి యిట్లనియె.

ఓరామచంద్రా! ఈవనమునందు సమీపముననే, మిగులతేజోవంతుడును ధర్మప్రవర్తనుడును, మహాధర్మబుద్ధిగలవాడును, సుతీక్ష్ణుండనుపేరుచే బరగువాడును, నగు నొకమహామునిగలడు. అతడునీకుమేలును గలుగజేయును. రాముడా! నీవిప్పుడుమహాతపస్సంపన్నుడగుసుతీక్ష్ణునియొద్దకుబొమ్ము ఆమహామునినీకుమిగుల మనోజ్ఞమైనదియును, శుభ్రమైనదియును, నగుప్రదేశమునునివాసస్థలముగ నేర్పఱుపగలడు. ఓరాముడా! నీవిప్పుడుయీమందాకినీప్రవాహమున కభిముఖముగా పడమరదిక్కునకై పొమ్ము అట్లుకొంతదూరముపోగానీనదియందచ్చటచ్చటపుష్పలతో సమానములైనతెప్పలుగాన్పించును నీవామార్గమునబొమ్ము పురుషోత్తముడవగునో రాముడా! నాయనా! నీవొకనిమిషమిచటనుండి నన్నుజూచుచుండుము పాముతనజీర్ణచర్మమునసగా కుబుసమునువిడుచునట్లు నేనీజీర్ణదేహమును విడిచెదను అనియిట్లుమహాతేజుండును మంత్రవేత్తయునునగు శరభంగుడు రామునితోజెప్పుచు అగ్నిని ప్రజ్వలింపజేసి, అందాజ్యమును వేల్చిపిమ్మట తానాయగ్నియందు ప్రవేశించె. అట్లుమహాత్ముడగుశరభంగమహాముని యగ్నియందుజొచ్చి తనశరీరముపైనందురోమములను, తలవెంట్రుకలను ప్రాతదియగుచర్మము

ను, రొమ్ముకలను నెత్తుటితో గూడిన మాంసమును, మఱియు సర్వమును గాల్చెను. అట్టియెడ సీతారామ లక్ష్మణులు మిగుల నాశ్చర్యమును బొందుచుండిరి. అప్పు డా శరభంగుఁడు, అగ్నిదేవునకు సమానమైన తేజస్సు గలవాఁడును, ముప్పదేండ్ల వయస్సు గల యౌవనవంతుఁడును నై యా యగ్నినుండి లేచి వెలుంగుచుండె. అట్లు శరభంగమహాముని యగ్నిహోత్రమునందుండి వెలువడి ప్రకాశించుచున్నవాఁడగుచు ఆహితాగ్నులుండెడి లోకము, మహాత్ములగు ఋషులు నివసించెడు లోకము, దేవలోకము, మొదలగు లోకములను గడచి బ్రహ్మలోకమును జేరె. అట్లు పుణ్యకర్మములను జేసినవాఁడును, బ్రాహ్మణోత్తముఁడును నగు శరభంగమహర్షి బ్రహ్మలోకమున జేరి అందు పరిజనములచే నావరింపఁబడియుండు బ్రహ్మదేవునిఁ జూచె. అట్టియెడ బ్రహ్మదేవుఁడును నా బ్రాహ్మణోత్తముని జూచి మిగుల నానందించి కుశలం బడిగె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యైదవసర్గము ముగిసెను.

ఋషులు మొదలగువారు రాక్షసుల సంహరింపుడని రామలక్ష్మణులను బ్రార్థించుట.

అట్లు శరభంగమహాముని బ్రహ్మలోకము జేరిన పిమ్మట ఋషిసమూహములన్నియు నొక్కటిగ జేరి మహాతేజుఁడును కకుత్స్థవంశోద్భవుఁడును నగు రామునిదగ్గరకు వచ్చిరి. మఱియు బ్రహ్మదేవుని గోళ్లవలన జన్మించిన వైఖానసులను మహర్షులును, బ్రహ్మదేవుని రోమములవలన బుట్టిన వాలఖిల్యులను మునీశ్వరులును, శరీరముయొక్క లోపలి భాగమును గడిగికొనునట్టి మిగులఁ బరిశుద్ధులైనవారును, చంద్రసూర్యుల కిరణములను పానము జేయుచుండువారును, ఱాళ్లచే దేహమును గొట్టుకొనుచుండువారును, ఆకులను భక్షించియుండువారును, పండ్లే ఱోళ్లకు మాఱుగా నుపయోగించి పొట్టను వదిలిపెట్టి దాని గింజలను మాత్రము భక్షించువారును, గొంతులలోతు నీళ్లలోనుండి తపస్సు చేయువారును, శరీరమే శయ్యగా గలవారును, పడుకొని నిద్రించుట బొత్తిగ లేనివారును, బైలుననుండి తపస్సు సేయువారును, నీళ్లు ద్రావి తపము జేయుచున్నవారును, గాలియే యాహారముగా గలవారును, ఆకాశమున నివసించి యుండువారును, భూమిపైఁ బరుండి నిద్రించువారును, వ్రతములకొఱకు నుపవాసములుండువారును, ఇంద్రియములను జయించినవారును, తడిబట్టలనే యెల్లప్పుడును ధరించియుండువారును, నిరంతరము పరమాత్మను ధ్యానించుచుండువారును, మహాతపస్సంపన్నులును, పంచాగ్నిమధ్యంబున తపస్సు జేయువారును, బ్రహ్మతేజస్సుతో గూడినవారును, దృఢముగ యోగాభ్యాసము జేయువారును, సమాధియోగనిష్ఠయందున్నవారునునగు సమస్తఋషులును శరభంగుని యాశ్రమమునందున్న రామచంద్రుని జూచుటకు వచ్చిరి. అట్లు రాముని జూడ వచ్చినవారును, మహాధర్మజ్ఞులును నగు మునులందఱు నొక్కటిగ జేరి, ధర్మవేత్తయును, ధనుర్ధరులలో నుత్తముఁడును నగు రామునితో నిట్లనిరి.

మహారథుఁడవగు నో రాముఁడా! "ఇంద్రుఁడు స్వర్గలోకమునకును, సమస్తదేవతలకును, ప్రభుఁడైనట్లు" నీవీ భూలోకమునకును యిక్ష్వాకువంశమునకు సురాజవైయున్నావు. మఱియు నీవు యశస్సుచేతను, శౌర్యముచేతను మూఁడులోకములయందును బ్రఖ్యాతినొందియున్నావు. నీవు మిగుల పితృభక్తియును, సత్యమును, గలవాఁడవు. ధర్మప్రవర్తనుఁడవు. ప్రభుఁడవగు నో రాముఁడా! మహాత్ముఁడవును ధర్మజ్ఞుఁడవును, ధర్మప్రవర్తనమునం దిష్టము గలవాఁడవును నగు నిన్నొకటి యాచించెదము. అందులకు మమ్ము మన్నించవలయును. శ్లో॥ అధర్మస్తు మహాంస్తాత భవేత్తస్య మహీపతేః। యోహరేద్బలిషడ్భాగం న చ రక్షతి పుత్రవత్॥ ఓ నాయనా! రాముఁడా! ఏరాజు ఆఱవపాలి ఫలితమును పన్నురూపముగ దీసికొని, తన రాజ్యమునందు ప్రజలను బిడ్డలవలెఁ గాపాడకుండునో యట్టిరాజు మిగుల నధర్మవర్తనుండనిపించుకొనును. శ్లో॥ యుంజానస్స్వానివ ప్రాణాన్ ప్రాణైరిష్టాన్ సుతానివ। నిత్యయుక్తస్సదా రక్షన్ సర్వాన్ విషయవాసినః॥ ప్రాప్నోతి శాశ్వతీం రామ కీర్తిం స బహువార్షికమ్। బ్రహ్మణస్స్థానమాసాద్య తత్ర చాపి మహీయతే॥ ఓ రాముఁడా! ఏరాజు యెల్లప్పుడును హెచ్చరిక గలవాఁడగుచు సకలప్రయత్నములచే, తన దేశమునను(ండు) ప్రజలను తన ప్రాణములవలెను, ప్రాణములకంటె నెక్కుడైన బిడ్డలవలెను, నిరంతరముగా పాడుచుండునో ఆరాజు శాశ్వతమైన కీర్తిని బొందును. అంతమున బ్రహ్మలోకము జేరి యందును బూజింపఁబడుచుండును. మఱియు ఋషులు గప్పంబులిచ్చువారుగాకుండుటచే వారల నేలరాజు రక్షింపవలెనని అనవలదు. శ్లో॥ యః కరోతి పరం ధర్మం మునిర్మూలఫలాశనః। తత్ర రాజ్ఞశ్చతుర్భాగః ప్రజాధర్మేణ రక్షితః॥ ఏరాజు ప్రజలను మహాధర్మముతో గాపాడుచుండునో యారాజునకు, కందమూలఫలములను దిని ధర్మప్రవర్తనులై యుండెడు ఋషులు జేయు పుణ్యమునందు నాలవభాగము వచ్చును. ఓ రాముఁడా! విశేషముగ బ్రాహ్మణులతోనే యొప్పుచుండెడు యీ వన వాసుల యొక్క సమూహము, నీవు నాధుఁడుండఁగన

నాథులవలె రాక్షసులచేజంపఁబడుచున్నది. నీవుమాతోడ రమ్ము. మహాక్రూరులగు రాక్షసులీయరణ్యమునందు పలువిధములచేజంపిన అనేకమంది ఋషుల శరీరములను జూపించెదము మఱియునీక్రూరరాక్షసులు మందాకినీతీరమునందును, పంపానదీతీరమునందును, చిత్రకూటపర్వతమున దనునివసించెడు ఋషులనమిక్కిలిగాహింసించుచుందురు మహాభయంకరులగునీరాక్షసు లీవనమునం దివ్విధముగ ఋషులనుహింసించుటనుజూచి మేమెట్లుసహింతుము. ఓతండ్రీ! రామచంద్రా! మేమట్లుసహింపలేక నిన్ను శరణుజొచ్చితిమి వమ్మింకరాక్షసులు జంపకుండునట్లు కాపాడుము మహావీరుడవును, రాజపుత్రుడవును, నగు వో రామండా! ఈభూలోకమునసీకంటె మాకువేరేదిక్కు అగుపడలేగ మమ్మీరాక్షసులయొక్క ఉపద్రవమునసుండి తొలగించి కాపాడుము. అనియిట్లుఋషులందరు ప్రార్థింపగవిని, మహాధార్మికుడును కకుత్స్థవంశోద్భవుడును, నగురాముడు మహాతపస్సంపన్నులగు ఋషులనందఱను జూచియిట్లనెను.

ఓఋషులారా! మీరునన్నీరీతిగ గాపాడుమనియడుగ దగదు. మీరెట్లుఆజ్ఞయిచ్చుచున్నారో అదేరీతిగనడుచుకొనుచున్నాను నేనునాస్వంతకార్యమునకయ్యే యీయరణ్యమును బ్రవేశించితిని, ఇప్పుడిది రెండవకార్యముగనున్నది, ఇందువలన రెండవఫలమును గలిగినట్లదలంచెను ఓతాపసోత్తములారా! నేనునాతండ్రి యాజ్ఞ్ఞాపరిపాలనము నడుచుకొనుటకును, క్రూరరాక్షసులచే మీకుగలిగెడి యుపద్రవమును తొలగించుటకును యీయరణ్యమునకువచ్చితిని. ఓమునిశ్రేష్ఠులారా! మీకార్యమునెరవేరటకై నేనకస్మాత్తుగ నీయరణ్యమునకువచ్చినాను కావుననేనీయరణ్యమునసుండుటచే నాకుమిగులఫలముగలుగును. మఱియు నేనీతపోవంతులయొక్క శత్రువులగు రాక్షసులనందఱిని యుద్ధమునందు జంపగోరియున్నాను ఓతపోధనులారా! యుద్ధమునందు నాపరాక్రమమును నాతమ్మునిశౌర్యమును మీరుజూడగలరు అనియిట్లు, మహాశౌర్యవంతుడును ధర్మమునందే దృఢబుద్ధిగలవాడును, ఋషులచేతనుగూడపూజింపఁదగిన సదాచారముగలవాడును నగురాముడు ఋషులకందఱికిని అభయమునిచ్చి జమవుదీర్చియంత సీతాలక్ష్మణసమేతుడై సుతీక్ష్ణుడనుమహామునియొక్క ఆశ్రమమునకుబోవుటకు బైలుదేరె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ఆరవసర్గ ముగిసెను.

— సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణమహామునిఆశ్రమమునకుబోవుట. —

అంతశత్రువులను బీడించునట్టిరాముడు సీతాలక్ష్మణసమేతుడై యాబ్రాహ్మణులందఱు వెంబడించివచ్చుచుండగ సుతీక్ష్ణమహాముని యాశ్రమప్రదేశమునుగూర్చి బోవుచుండె అట్లుబోవుచు రాముడు మిగులదూరమార్గము గడచి యనేక నదీప్రవాహములను దాటి నీలమేఘమువలెనున్నదియును, మిగులపొడవైనదియును, విరిసిగనున్నదియును నగునొకగొప్పపర్వతమునుజూచె. మఱియునిట్లువారు వంగజులలోనుత్తములగు రామలక్ష్మణులు సీతాదేవితోగూడ దీనివారిగుచు పలువిధములైనచెట్లతో నిండియుండునదియును, ఆపర్వతప్రాంతమందున్నదియును, నగునామహారణ్యమునందుబ్రవేశించిరి. అట్లురాముడు మహాభయంకరమైనదియును, విశేషముగపుష్పఫలములతోను పండ్లతోనునిండియుండెడు వృక్షములతోనొప్పుచున్నదియును, నగునారణ్యమున బ్రవేశించియొకనిర్మలస్థలమునందు నారచీరెలతో నొప్పుచుండెడునొక యాశ్రమమునుజూచిరి అందు సుఖముగ గూర్చుండియున్నవాడును, మిగులమలినముతో గూడుకొనిన జడలనుదాల్చియున్నవాడును, మిగులతపోవృద్ధుడునునగు సుతీక్ష్ణమహామునినిజూచి రాముడుశాస్త్రోక్తముగనిట్లనియె.

భగవంతుడవును, ధర్మమునలెస్సగ నెఱింగినవాడవును, తపోమహిమగలవాడవునునగు నోసుతీక్ష్ణమహామునీ! నేను రాముడనుపేరుగలవాడను. నిన్నుదర్శించుటకైయిచటికివచ్చితిని నీకునమస్కరించెదను. ఆశీర్వదింపుము. అనిశ్రీరాముడుచెప్ప అంతసుతీక్ష్ణమహాముని, మహాశౌర్యవంతుడును, ధర్మమునుసరించువారిలో శ్రేష్ఠుడును, నగురామునిజూచి దిగ్గునలేచిరెండుచేతులతోగట్టిగా గౌగలించుకొని యిట్లనియె.

మహాపరాక్రమవంతుడవును, ధర్మవేత్తలలోనుత్తముడవునునగునో రామచంద్రా! నీకుస్వాగతమగుగాక, నీరాకచే యీయాశ్రమంబిప్పుడు నాథునితోగూడుకొన్నదయ్యె. మహాయశస్సుగలవాడవును, వీరుండవును నగనో రాముడా, నేనునిన్నుజూచుటకై నీకొఱకెదురుచూచుచు నిచ్చటనేగాచియున్నాను. మఱియునాశరీరమును యీభూమిపైబారవైచి స్వర్గమునకుబోవుచున్నాను నీవు రాజ్యభ్రష్టుడవైతివని నేనచిత్రకూటపర్వతమునందుండునప్పుడేవింటిని కకుత్స్థవంశోద్భవుడవగనో రాముడా! దేవతలకురాజగు దేవేంద్రుడిచ్చటికివచ్చిపోయె. దేవరాజగుయింద్రుడిచటికివచ్చి నేనునాతపోమహిమచేత సక

లలోకములను జయించితినని చెప్పె. కావున నా తపోమహిమచే సాధింపఁబడినవియును దేవతలచేతను ఋషులచేతను సేవింపఁబడినవియును నగు నా స్వర్గాదిలోకములను నీకిచ్చెదను నీవు నీభార్యతోడను లక్ష్మణునితోడను గూడుకొన్నవాఁడవై యాలోకములకు బోయి సుఖముగ విహరించుచుండుము అని సుతీక్ష్ణుండు చెప్పె. అంత ఆత్మవేత్తయగు రాముఁడు "కాశ్యపుఁడు బ్రహ్మదేవునితో జెప్పినట్లు" అత్యుగ్రతపస్సంపన్నుఁడును, మహర్షియును, సత్యము నేవచింపువాఁడును, నగు నా సుతీక్ష్ణమహామునిని జూచి యిట్లనియె.

రోషశ్రేష్ఠుఁడవగు నో సుతీక్ష్ణుఁడా! నేనే సమస్తలోకములను సాధించెదను. నాకీ యరణ్యమున నివసించుటకు యుక్తమగు ప్రదేశమును జూపుము. ఓ తాపసోత్తమా! నీవు సర్వవిషయములయందును సామర్థ్యముగలవాఁడవనియును, సకలజీవులకు మేలుజేయుట యందాసక్తిగలవాఁడవనియును, మిగులమహాత్ముఁడైన గౌతమవంశమున జన్మించిన శరభంగమహాముని వలన వింటిని అని చెప్పె. అంత సమస్తలోకములయందును బ్రఖ్యాతివహించినవాఁడును, ఋషిశ్రేష్ఠుఁడును, నగు నా సుతీక్ష్ణుఁడు మహాసంతోషమును బొందినవాఁడగుచు మిగుల మధురములగు మాటలతో నిట్లనియె.

ఓ రామచంద్రా! సమస్తఋషులకును నివాసయోగ్యంబైనదియును, నిరంతరము కందమూలఫలములు సమృద్ధిగ దొరుకునదియును నగు నీ యాశ్రమము అన్నిటిలో నుత్తమముగా నున్నది. నీవు యిందుండవచ్చును అయిన నొక్కవిశేషము జెప్పెదను వినుము సమస్తమృగములును మిగుల నిర్భయముగ నీ యాశ్రమమునకు వచ్చి యిచ్చట దిరుగుచు ఋషిసంఘములను పీడించి పోవుచున్నవి. మహాకీర్తిసంపన్నుఁడవగు నో రామా! ఈ స్థలమునందు మృగబాధ యొక్కటి దప్ప యింకనే దోషమును లేదు అని సుతీక్ష్ణమహర్షి జెప్పె. అంత ధీరుఁడగు రాముఁడు విల్లెక్కుపెట్టి బాణము సంధించి యా ఋషితో నిట్లనియె.

మిగుల పూజ్యమైన భాగ్యముగలయో సుతీక్ష్ణమహాముని! నే నిచ్చట నే యుందునేని యిచ్చటికి వచ్చెడు మృగసమూహములనన్నిటిని, మిగుల కఱుకైన వాఁడి గలవియును, పిడుగుయొక్క కాంతిగలవియును నగు బాణములచేతఁ జంపుదును. అందుచేత మీకు క్రోధము గలుగును. అంతకంటె నాకు వేఱేమి యాపదగలుగఁబోవుచున్నది? కావున నీ యాశ్రమమునందు చిరకాలము నివసించుట యుక్తము గాదు అని యిట్లు రాముఁడు, కోరికెల నీడేర్చునట్టి సుతీక్ష్ణమహామునితో జెప్పి యంత సంధ్యాకాలమగుటచే, కాలోచితకృత్యములను జేయఁబోయెను. అట్లు రాముఁడు సాయం సంధ్య నుపాసించి మిగుల మనోజ్ఞముగ నుండెడు సుతీక్ష్ణాశ్రమమునందా రాత్రి సీతాలక్ష్మణసమేతుఁడై నివసించె అప్పుడు సుతీక్ష్ణమహర్షి సంధ్యావందనాదికృత్యములను దీర్చుకొని పురుషోత్తములగు నా రామలక్ష్మణుల నా రాత్రి లెస్సగ సత్కరించి, మిగుల శ్రేష్ఠమైనదియును తాపసులు భుజింపఁదగినదియు నగు నన్నము దెచ్చి వారలకిచ్చె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేడవసర్గము ముగిసెను.

(*)

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణమహామునిచే సత్కరింపఁబడి బైలువెడలుట

అట్లు రాముఁడు సుతీక్ష్ణునిచే లెస్సగ సత్కరింపఁబడి సీతాలక్ష్మణసమేతుఁడై యా రాత్రి యందుండి మఱునాఁడు దయకాలమున నిదుర మేల్కొనియె. అట్లు రాముఁడు ఉచిత కాలమున నిదుర మేల్కొని, మిగుల జల్లగనున్నవియును, సల్లగలువలయొక్క వాసనతో గూడుకున్నవియును నగు మంచి నీళ్లయందు సీతతో గూడ స్నానము జేసి కాలోచితకృత్యములు దీర్చి యంత, ఋషులకు నిక్కపట్టగు నా యరణ్యమునందు పాపరహితులగు నా సీతారామలక్ష్మణులు ప్రాతఃకాలమునందు అగ్నిహోత్రములు జేసి, విధ్యుక్తశాస్త్రోక్తముగ దేవపూజ గావించి సూర్యుఁ డుదయించుటను జూచి సుతీక్ష్ణమహామునియొద్దకు బోయి మిగుల వినయముగ మధుర వాక్యములతో నిట్లనిరి

మిగుల మహిమగలయో సుతీక్ష్ణమహర్షీ! మేము మిగుల పూజనీయుఁడవగు నీచేత లెస్సగ సన్మానింపఁబడి సౌఖ్యముగ నున్నాము మేము పోయి వచ్చెదము సెలవియ్యవలయును మాతోడ వచ్చిన ఋషులందరు నవసరపడుచున్నారు. అదియును గాక మేమీ దండకారణ్యమున నుండెడు మహర్షులయొక్క యాశ్రమములన్నియుఁ జూడవలయునను కోరికతో త్వరపడుచున్నాము. కావున మేమును, యెడతెగక ధర్మమునందాశగలవారును, తపఃప్రభావముచే జితేంద్రియులును, మంటలేని యగ్నిహోత్రమువలె బ్రకాశించుచున్నవారును, నగు నీ ఋషిశ్రేష్ఠులును, మీ యనుజ్ఞ గోరుచున్నాము. మఱియు "హీనజాతివాఁడు క్రమవృత్తిచే సంపదవడసి యెడతెగక విఱ్ఱవీగినట్లు,, సూర్యుఁడు తన వేడికిరణములచే బ్రకాశింపకమునుపే, యనగా నెండబడకమునుపే పోవలయునని యున్నాము అని చెప్పి రాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై సుతీక్ష్ణమహాముని పాదములకు నమస్కరించె. అట్లు తన పాదములపై బడియున్న రామలక్ష్మణులను, తాపసోత్తముఁడగు సుతీక్ష్ణుఁడు లేవనెత్తి పరమ స్నేహముగా

ఢాలింగనముజేసికొనియిట్లనియె.

ఓరామచంద్రా! నీయొక్కనీడవలెనెడతెగక నీవెంట వచ్చునట్టిసీతాదేవితోను లక్ష్మణునితోను గూడుకున్నవాఁడవగుచు సుఖముగఁబోయిరమ్ము. నీవుపోవునట్టిత్రోవయందు ఏసంకటములులేకయుండుగాక! శౌర్యవంతుఁడవగునో రాముఁడా! ఈదండకారణ్యమునతపస్సుసేయుచు పరమాత్మనుధ్యానించుచుండెడు ఋషులయొక్క మనోజ్ఞములగు నాశ్రమములనుజూతుము. మఱియునీదండకారణ్యమున, విశేషముగ కందమూలఫలములతో నొప్పుచున్నవియును, లెస్సగబూచియున్నవియును, ప్రశస్తములగు మృగసమూహములతోగూడుకున్నవియును, మిగులశాంతినొందినపక్షిసమూహములు గలవియునునగు వనములను, ప్రూచియుండెడు తామరపూలచే నొప్పుచున్నవియును, పరిశుద్ధములగునీళ్లుగలవియును, నీరుకోళ్లచేవ్యాపింపఁబడినవియునునగుచెఱువులను, సరోవరములను, చూచుటకుమనోజ్ఞములగు సెలయేళ్లను, నెమళ్లధ్వనులచే మిగులమనోజ్ఞములగునరణ్యములను, జూచెదవు. పసివాఁడవగునోలక్ష్మణా! పోయిరమ్ము ఓరామా! నీవునుపోయిరమ్ము. నాయనా! రాముఁడా! నేనొక్కటియడిగెదను మఱలనొకతూరినా యాశ్రమమునకురావలయును. అనిసుతీక్ష్ణుఁడు జెప్పగవిని, రాముఁడట్లేకానిమ్మనిచెప్పి, లక్ష్మణసమేతుడై సుతీక్ష్ణునకుఁబ్రదక్షిణముచేసి బయలువెడలె. అట్టియెడమిగులవిశాలములగునేత్రములుగల యాసీతాదేవి, రామలక్ష్మణులకిద్దఱికిశుభకరములగు నమ్ములపొదులను, విల్లులను, నిర్మలములైనపిల్లుగలకత్తులనుయిచ్చె. అంతనా రామలక్ష్మణులిద్దఱునుమంగళకరములగు నాయమ్ములపొదులను ధరించి జ్యావాదముతోఁగూడినవిండ్లనుదీసికొని సుతీక్ష్ణాశ్రమమువిడిచిబైలుదేరిరి మఱియుశ్రీమంతులును, రూపసంపన్నులును, తమదేహకాంతులచే బ్రకాశించుచున్నవారును, నగునా రామలక్ష్మణులుధనుస్సులనుదీసికొనిసీతాసమేతులైబయలుదేరిరి

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యెనిమిదవసర్గముగిసెను.

(*)

సీతాదేవిరామునితో గొన్నిధర్మములను జెప్పుట.

అట్లు సుతీక్ష్ణమహామునిచే నాజ్ఞదీసుకొని బయలుదేరినవాడును, తనభర్తయును, నగురామునిజూచి సీతాదేవి స్నేహయుక్తములగుమనోజ్ఞములైన మాటలతోనిట్లనియె.

ఓప్రాణనాథా! ఈమునియొక్కధర్మము మిగులశ్రేష్ఠమైనది. ఈమునిధర్మము మిగులసూక్ష్మమైనమార్గమునఁబొందదగినది. ఇదికామముచేత గలిగినవ్యసనముగలవానికి సంపాదింపశక్యముగాదు. కామమువలనగలిగిన వ్యసనములు మూడువిధములుగనున్నవి. ఎట్లనిన॥ శ్లో॥ మిథ్యా వాక్యం పరమకంతస్మాద్గురుతరావుభౌ। పరదారాభిగమనంవినా వైరంచరౌద్రతా॥ అబద్ధమాడుట, యితరుల భార్యలను బొందుట, విరోధములేకయేకోపమునుజెందుట, యనునవి. అందులోఅబద్ధమాడుటమిగులనధికమైనది పరభార్యాగమనమును, వైరములేకయేక్రోధమును,నివి అబద్ధమాడుటకంటెగొప్పవి. ఓరామచంద్రా! నీవెన్నడును అబద్ధమాడినవాడవుగావు. ఇకమీదనుఅబద్ధముజెప్పబోవు ధర్మనాశమగు పరస్త్రీకోరికనీకెంతమాత్రమునులేదు మానవేంద్రుఁడవగునో రామా! పరస్త్రీగమనమునీకులేదు ఒకానొకప్పుడునుగలుగలేదు. మఱియునొకప్పుడైనను మనస్సులోగూడగలుగదు. నీవునిరంతరము నీభార్యయందేఆసక్తిగలవాఁడవు ధర్మమునందుండువాఁడవు సత్యసంధుఁడవు తండ్రియుత్తరువుచొప్పుననడుచువాఁడవు. సత్యప్రతిజ్ఞుడవు, మహాభాగుడవు, శ్రీమంతుడవు, లక్ష్మణాగ్రజుఁడవు. మఱియునో రాముఁడా! ధర్మమును, సత్యమును, మఱియుసకలసద్గుణములును, నీయందేనివసించుచున్నవి. మహాబాహుండవగునో రాముఁడా! ధర్మముమొదలగు నీగుణములన్నియు యింద్రియములనుజయించినవారికే గలుగును గానియింద్రియనిగ్రహములేని వారికిగలుగవు. మంగళస్వరూపుఁడవగునో రామా! ప్రాణనాథా! నీవుజితేంద్రియుఁడవనినేనులెస్సగనెఱుగుదును మఱియు విరోధములేకయేప్రాణహింసజేయుటయును, నీకురౌద్రసంబంధమగుమూడవవ్యసనము అజ్ఞానమువలనమూఢులచే జేయఁబడుచుండును. అట్టిదినీకిప్పుడుసంప్రాప్తమైనది. శౌర్యవంతుఁడవగునో రాముఁడా! దండకారణ్యమున నుండెడు మునిజనములబాధదీర్చి వారినిరక్షించుటకొఱకు రాక్షసులనందఱజంపెదనని శపథముచేసితివి. నీవుయీకార్యముకొఱకే తమ్మునితోగూడినవాఁడవై ధనుర్బాణములను దాల్చి దండకారణ్యమును బ్రవేశించితివి అట్లునీవు ధనుర్బాణములను బూనిబయలుదేరుటనుజూచి, నీనడవడికయును నీశ్రేయస్సును గణించి యోచింపగనామనస్సువకఁముగల వ్యసనముగలుగుచున్నది శౌర్యవంతుడవగునో రాముఁడా! దండకారణ్యమునకుబోవుటకు నాకెంతమాత్రమును యిష్టములేదు అందుకుకారణముజెప్పెదవినుము. విల్లును బాణములనుధరించితమ్మునితోగూడ అరణ్యమునందు బ్రవేశించిననీవు, అడవియందుండెడు రాక్షసులనందఱిని జంపు

దువు "అగ్నిసమీపమునచిచ్చున్నయెడల లెస్సగ ప్రజ్వలించునట్లు" రాజులయొద్దధనుర్బాణములున్నయెడలవాని పరాక్రమమతిశయించును ఇందుకునిదర్శనముగనొకకథజెప్పెదవినుము మహాబాహుఁడవగునోరాముఁడా! ప్రాణనాథా! పూర్వము, మిగులపావనంబైనదియును, నిరంతరముఆనందముననుండెడుమృగములును, పక్షులును, గలదియును, నగుయరణ్యమునసత్యసంధుఁడును, మహాపరిశుద్ధుఁడునువగునొకమునీశ్వరుఁడునివసించుచుండె అట్లుండగ దేవేంద్రుడొకనాడు ఆమునిశ్రేష్ఠునికి తపోభంగముగావింపఁదలఁచి బంటురూపముధరించివిగుల పదునుగలదియును శ్రేష్ఠమైనదియునునగుకత్తినిచేతబట్టుకొని యాఋష్యాశ్రమమునకువచ్చితపోనిష్ఠయందున్న యామునినిజూచి యిట్లనియె.

ఓమునిశ్రేష్ఠుఁడా! ఈకత్తినినీయొద్దదాచిపెట్టి నేనడిగినప్పుడిమ్ము అనిచెప్పి ఆయాయుధమును ఆయనవద్దపెట్టిపోయె. అంతవామహర్షి యాకత్తినిదీసికొనితనయందలివిమ్మకమునుగాపాడుకొనుటయందా సక్తిగలవాఁడగుచు దానినివిడువకదగ్గరనుంచుకొనివనమునందుదిరుగుచుండె మఱియుతనయొద్దనుంచినదానిని రక్షించుటయందుఆ సక్తిగలవాఁడయ్యెఫఁడ్లనుగడ్డలను దెచ్చుకొనుటకు బోవునపుడుగూడ, నాకత్తినిగూడదీసికొని పోవుచుండె. అట్లామునీశ్వరుడువిడతెగకకత్తిచేబూనియుండుటచేత క్రమక్రమముగతనతపమునందలి దృఢచిత్తమునువిడిచి కూరబుద్ధివహించె అంతనమ్మహర్షి, ఆయాయుధసంబంధముచేత మూడవదియగు రుద్రసంబంధమైనవ్యసనమునందుజిక్కి మదించిదేహముదెలియక ప్రాణహింసజేయుచు అధర్మతత్పరుడై తుదకునరకమునుబొందె ఇట్లు, పూర్వముఆయుధసంబంధముచేతనే ఆఋషిశ్రేష్ఠునకు నధర్మబుద్ధి గలిగినాశనముగలిగె. అగ్నితోటి సంబంధమువలెనే యాయుధముతోటి సంబంధము నుచెడువునకు గారణమని పెద్దలుజెప్పుదురు. ఓ రామఁడా! నీయందలిస్నేహముచేతను, నీకునాయందుగల గౌరవముచేతను, నీవెఱిగిన యర్థము నేజ్ఞాపకపఱచుచున్నాను గాని నిన్నునేనుశిక్షింపలేదు మఱియునీవువిల్లుచేబట్టి నిర్హేతువుగ దండకారణ్యముననుండెడురాక్షసులనందఱిని నతిరౌద్రబుద్ధిచేఁ జంపవలదు. శౌర్యవంతుఁడువగునోరామా! ప్రాణనాథా! నిరాపరాధులగు లోకులనుజంపుట నాకెంతమాత్రమును యిష్టములేదు అదియునుగాకశౌర్యవంతులగు రాజులుధనుర్ధరులైయున్నందుకు బ్రయోజనము, అరణ్యములయందు బాధింపఁబడుచుండెడు ఋషులనుగాపాడుట మాత్రమేగానిఅడవియందుండెడి రాక్షసులనందఱను జంపుటచేతగాదు. మఱియునుఆయుధమెక్కడ? అరణ్యవాసమెక్కడ? క్షత్రియధర్మమెక్కడ? తపోధర్మమెక్కడ? ఇదిపరస్పరవిరోధములు. కావుననీప్రదేశమునకేదిధర్మమో, దానినిజేయుదము ఆర్యా! రామా! నామనోహరా! ఆయుధములనుధరించుటచేతరౌద్రమగుపాపబుద్ధిగలుగుచున్నది కావునవానిని విడచితపముసేయుదము. మనముమఱల నయోధ్యకుఁబోయినపిమ్మట క్షత్రియధర్మమునాచరింపవచ్చును. అట్లుగాకనీవురాజ్యమునందలి యాశవిడిచియిప్పటికిని మునీశ్వరుడవేయగుదువేని నాయత్తమామలగు కైకేయీదశరథులకు మెడతెగని సంతోషముగలుగును. శ్లో॥ ధర్మాదర్థఃప్రభవతి ధర్మాత్ప్రభవతేసుఖమ్। ధర్మేణలభతేసర్వంధర్మ సారమిదంజగత్॥ ధర్మమాచరించుటచే ధనముగలుగును. ధర్మప్రవర్తనచే సుఖముగలుగును. ధర్మముచేతనే సకలముగలుగుచున్నది. కావుననీప్రపంచమునందు ధర్మమేముఖ్యమైనది. శ్లో॥ ఆత్మానంనియమైస్తైస్తైఃకర్శయిత్వాప్రయత్నతః। ప్రాప్యతేనిపుణైర్ధర్మోన సుఖాల్లభ్యతేసుఖం॥ మిగులనిపుణులైనవారు నానావిధప్రయత్నములచే వ్రతములాచరించుచు శరీరమును కృశింపజేసిధర్మమునుబొందెదరు సుఖమువలన సుఖమెప్పుడునుగలుగదు. కావునసౌమ్యుఁడా! ఓరాముఁడా! నిర్మలమైనమనస్సుగలవాఁడవగుచు నిరంతరము తపోవనమునందుండి ధర్మంబాచరింపుము. వాస్తవముగ ముజ్జగములయందును నీవెఱుగనిధర్మములేదు నేనుస్త్రీనిగావున స్త్రీలకుగలచంచలస్వభావముచేత నిట్లుజెప్పితిని.

నీకుధర్మమునుబోధింప నెవ్వఁడుసమర్థుఁడు? (అనగా సకలధర్మముల నెఱిగినవాడవనుట) నీవునీతమ్ముఁడగులక్ష్మణునితోగూడ లెస్సగ నాలోచించి నీకేది యిష్టమో, దానినిసేయుము అనిసీతరామునితోజెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి తొమ్మిదవసర్గము గిసెను.

▸*◂

రాముడుసీతచెప్పిన ధర్మములకు బ్రత్యుత్తరముజెప్పుట

ధర్మప్రవర్తనుడగురాముడు, పతిభక్తిగల సీతాదేవి చెప్పినమాటనువిని సీతనుజూచియిట్లనియె

ధర్మము నెఱిగినదానవును, జనకమహారాజపుత్రికయును, నగునోసీతా! నీకునాయెడలగల స్నేహముచేత నీవంశమునకుఁదగినట్లు హితవాక్యమునుజెప్పితివి. ఓసీతా! నేనేమిచెప్పగలను, ఆర్తినొందెడివారియొక్క ఆర్తధ్వనియె

చ్చుటను గలుగకూడదని రాజులు ధనుర్బాణములను ధరింపుదురని నీవే చెప్పితివి. మహాకఠినములైన వ్రతములాచరించువారును, శరణు బొందదగినవారును, నగు నీ దండకారణ్యవాసులగు మునులందరు రాక్షసులచే పీడ బొందినవారై తాముగానే నాదగ్గరకు వచ్చి తమ్ములను గాపాడుమని ప్రార్థించిరి. అదియును గాక, ఎల్లప్పుడును ధర్మము నాచరించువారును, అరణ్యమునందు నివసించుచు గడ్డలను, పండ్లను, దినుచుండువారును, నగు ఋషులు, మహాక్రూరకృత్యములను జేయుచుండెడు రాక్షసుల యొక్క భయముచే సౌఖ్యమును బొందకున్నారు. ఓసీతా! మాంసముదిని బ్రతుకువారును, మహాభయంకరులును, నగు రాక్షసులు, అరణ్యమునందుండి ఆయా కాలములయందు నానావిధములగు వ్రతములను నెడతెగక చేయుటయందు మిగుల నాసక్తులై యుండెడు ఋషులను బట్టి భక్షించుచున్నారు. అట్లు బాధపడుచున్నవారును, దండకారణ్యమున నివసించువారును, బ్రాహ్మణోత్తములును, నగు నా మునులు రాక్షసులచే భక్షింపబడుచున్నవారై నాదగ్గరకువచ్చి శరణుజొచ్చి కాపాడవలయునని వేడుకొనిరి ఇట్లా ఋషులు జెప్పుటను విన్నంతనే, నేను వారి పాదములకును నమస్కరించి యిట్లని జెప్పితిని.

ఓ ఋషులారా! మీరు నన్ను క్షమింపవలయును, నేను మిమ్ములను సేవింపవలసియుండగా మీవంటి బ్రాహ్మణులు నాయొద్దకువచ్చి నన్ను వేడుకొనుట నాకు మిగుల నవమానకరముగానున్నది. నేనేమి జేయవలయునో, దానిని నాకు దెల్పుడని నేనా మునులనడిగితిని. అంత నా బ్రాహ్మణోత్తములందఱు నొకకూటిగ జేరి యిట్లనిరి.

ఓ రామచంద్రా! దండకారణ్యమున కామరూపులగు రాక్షసులనేకులు వచ్చి మమ్ములను హింసించుచున్నారు. కావున నీవు మమ్ము బాధనుండి తప్పించి రక్షింపవలయును. పాపరహితుడవగు నో రాముడా! ఎదిరింప గూడనివారును, మాంసమును భక్షించువారును, నగు రాక్షసులు హోమములు జేయు సమయములయందును, పర్వకాలములయందును, వచ్చి యాగములను జెఱచి మమ్ము తొందర జేయుచున్నారు. రాక్షసులచే బాధింపబడుచున్నవారమును, కనికరింపదగినవారమును, దిక్కెవరు దొరకుదురా? యని వెదకుచున్నవారమును, నగు మాకు నీవే గతి మేము మా తపఃప్రభావముచే నా రాక్షసులను శపియించి చంపగలము. వారిని జంపుటచే గొంత తపంబు వ్యర్థముగ నశించును అయినను బహుకాలముగ గావించిన తపస్సు వ్యర్థముగ జేయనేరక యూరకున్నాము ఓరామచంద్రా! తపస్సనునది బహువిఘ్నములు గలదిగానున్నది. తపము గావించుట మహాకష్టము. కావుననే, మేము రాక్షసులచే భక్షింపబడినవారమయ్యును తపఃఫలము వ్యర్థము జేయజాలక వారలను శపింపక యూరకున్నాము ఓరామచంద్రా! దండకారణ్యమున నుండెడు రాక్షసులచే మిగుల బాధింపబడుచుండెడు మమ్ము, నీవు నీ తమ్మునితో గూడినవాడవై వచ్చి రక్షింపుము. మాకీ యరణ్యమున నీవే గతి. ఓ జనకరాజనందనీ! సీతా! అని యిట్లు దండకారణ్యవాసులగు మునులందఱు జెప్పిన నేను యీ ఋషులను గాపాడెదనని ప్రతిజ్ఞ గావించితిని. కావున నేను బ్రతికియుండువరకు ఋషులకు గానే జేసిన ప్రతిజ్ఞ తప్పను. నాకెల్లప్పుడును సత్యమునందు మిగుల ప్రియమని నీకును దెలియునుగదా? శ్లో॥ అప్యహంజీవితం జహ్యాం త్వాంవా సీతే సలక్ష్మణాం। నతు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః॥ ఓసీతా! నేను నా ప్రాణములనైనను, నిన్నైనను, లక్ష్మణునినైనను, విడుతును గాని యెవ్వరికొఱకుగాని, నే జేసిన ప్రతిజ్ఞ మాత్రము తప్పను. అందు విశేషించి బ్రాహ్మణులకొఱకు జేసిన ప్రతిజ్ఞను యెంతమాత్రమును విడువను

ఓసీతా! ఋషులు నన్ను ప్రార్థింపకున్నను నేనే వారల సంకటములను బాపి వారిని రక్షించుట నాపనిగానున్నది అట్లుండ వారిచే బ్రార్థితుడనై వారిని గాపాడెదనని ప్రతిజ్ఞ జేసియుండగ నా పనిని నెఱవేర్చు విషయమునందు జెప్పవలసినదేమియున్నది. అనఘాత్మురాలవగు నో సీతా! నీకు నాయందుగల స్నేహముచేతను, మంచిమనస్సు గలదానవగుటచేతను, యీ మాట జెప్పితివి నేను మిగుల సంతోషమును బొందితిని. ప్రియుడు ప్రియునకే యుపదేశించును గాని అప్రియునకు నుపదేశింపడు. నీవు జెప్పినమాట నీకులమునకును, మనస్సునకును తగియున్నది. నాతో గూడ ధర్మము నాచరించుదానవగు నీవు నా ప్రాణములకన్న నధికురాలవు. అని యిట్లు మహాత్ముడగు రాముడు జనకమహారాజు కూతురును, తనకు ప్రియురాలును నగు సీతాదేవితో నిట్లు జెప్పి ధనుర్బాణములను ధరించి లక్ష్మణసమేతుడై మిగుల రమణీయములగు తాపసాశ్రమములకు బోయె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పదియవ సర్గము ముగిసెను.

సీతారామలక్ష్మణులు అగస్త్యమహాముని ఆశ్రమమునకు బోవుట.

ఇట్లు బోవుచు రాముడు ముందు నడిచె. వెనుక సొగసైన నడుముగల సీతాదేవి బోవుచుండె. ఆ వెనుక లక్ష్మణుడు విల్లు చేత బూని పోవుచుండె. మఱియు నా రామలక్ష్మణులు పోవుమార్గమునందు పలు తెఱగులగు కొండచఱియల

ను, అరణ్యములను, మనోహరములైన అనేకయేళ్లను, ఆ యేళ్లయందుండెడి యిసుకదిన్నెలపైదిరుగుచున్న హంసలను, చక్రవాకములను, తామరపూలతోనిండి యుండు నవియును, నీటిపక్షులతో గూడుకున్నవియునునగు సరోవరములను, గుంపులుగూడియుండెడు జింకలను, మదించి గొప్పకొమ్ములతో గూడుకొనియుండెడు దున్నపోతులను, పందులను, చెట్లనువిఱుచునట్టి యేనుఁగులను, జూచుచుసీతాసమేతులై పోయిరి. అట్లుసీతారామలక్ష్మణులు పోయి పోయిమిగుల దూరమార్గముగడచి సూర్యాస్తమయకాలమునకు, మిగులరమణీయంబైనదియు, ఒకయామడవిరివిగలదియును, తెల్లదామరపూలతోను యెఱ్ఱదామరపూలతోను నిండియుండియున్నదియును, ఏనుగులసమూహములచే నలంకృతంబైనదియున, నీటియందు సంచరించునట్టి బెగ్గురుపక్షులతోను, కలహంసలతోను, రాజహంసలతోను నిండినదియును, నగునొకతటాకముజూచిరి అంతమిగుల పరిశుద్ధములగు నీటితోగూడినదియును, మహారమ్యమైనదియును, నగునాసరోవరముననుండి పాటలయొక్కయు వాద్యములయొక్కయు ధ్వనులువినబడినవిగాని యందెచ్చటను నెవరునుగానంబడరైరి. కావున రామలక్ష్మణులుపరమాశ్చర్యము నుబొంది సమీపముననున్న ధర్మభృత్తనుమునినిజూచి యిట్లనిరి.

ఓమునిశ్రేష్ఠుడా! ధర్మభృత్తా! పరమాశ్చర్యకరమగు నీధ్వనినివింటిమి. దీనిసంగతివినవలయునని మాకెందఱకును మిగుల గుతూహలముగనున్నది. దీనిసంగతియంతయు మాకుసవిస్తరముగ నెఱింగింపవలయును. మఱియునోధర్మభృత్తా! ఇదిచెప్ప గూడనంత యతిగోప్యముగాకుండు నేని చెప్పుము. అనియిట్లురాముఁడడుగగా ధర్మాత్ముఁడగుధర్మభృత్తనుమునివిని యాసరోవరముయొక్క పుట్టుకంతయుసవిస్తరముగ జెప్పనారంభించె. ఓరామచంద్రా! దీనినిమాండకర్ణియను మహామునితనతపోబలముచే నిర్మించె. దీనినిపంచాప్సర సరోవరమందురు ఇదినిరంతరమిట్లు గీతవాద్యధ్వనులచే బ్రకాశించుచుండును. ఓరామా! ఆమాండకర్ణియనుమహర్షి పదివేలసంవత్సరములు గాలినేయాహారముగ జేసికొని నీటియందుండి యత్యుగ్రమగుతపము జేసె. అంతనగ్నిదేవుడు మొదలుగాగల సమస్తదేవతలును మిగులచింతాక్రాంతులైయొకరితో నొకరాలోచించుకొని, అందఱునుయేకమై యిట్లనుకొనిరి. ఈమాండకర్ణుడను తపోధనుడుమనలోఒకనియొక్క స్థానమున బొందగోరితపస్సు జేయుచున్నాండు, అనియిట్లనుకొని మిగులభయమునుబొందిరి. అట్లుభయపడి దేవతలందఱును చక్కగా నాలోచించుకొని మాండకర్ణుని తపోవిఘ్నముజేయనిశ్చయించుకొని మెఱుపుదీగెలవలె దేహకాంతులుగలవైదుగురు ఉత్తమాప్సరసస్త్రీలను మాండకర్ణుని యొద్దకుఁబంపిరి. అంతనాయప్సరస్త్రీలు మాండకర్ణునియొద్దకువచ్చి దేవతల కార్యమునెరవేర్చుటకై, సకలమునెఱింగినయాఋషిని మదనపరవశునిజేసి యావైదుగురు నతనికిభార్యలైరి ఆఋషిశ్రేష్ఠుడు వారలకీసరోవరమునందు మఱుగుచాటుగనుండునట్లు గృహమునునిర్మించె అదిమొదలు, ఆయప్సరస్త్రీలైదుగురునుతపఃప్రభావముచేయావనుడైనయామునినిగూడి యధాసుఖముగ గ్రీడించుచున్నారు. కావుననాయప్సరస్త్రీలుగ్రీడించుచుండగ మనోజ్ఞములగు వారియాభరణములధ్వనులును, ఆటలపాటల వాద్యముల ధ్వనులును నొక్కటగగలసి యీదివ్యగానము వినబడుచున్నది. అనిధర్మభృతుండను మహామునిజెప్పగవిని మిగులకీర్తిమంతుండగు రాముడునులక్ష్మణుడును పరమాశ్చర్యమునుబొందిరి ఇట్లుఆఋషిసత్తముఁడుజెప్పుచుండగనె, రాముడుదర్భలచేతను నారచీరెలచేతను వ్యాప్తమైనదియును, బ్రహ్మతేజస్సుచే బ్రకాశించుచున్నదియును, నగునొకమునిపల్లెనుజూచె. అట్లుజూచిమిగుల కీర్తిమంతుడగు రాముఁడు సీతాలక్ష్మణులతోగూడ నామునిపల్లెయందు బ్రవేశించె. అంతనందలి ఋషిశ్రేష్ఠులందరువారినిపూజించిరి మఱియు రామచంద్రుఁడు మిగులకాంతియుక్తంబగునామునిపల్లెయందు సుఖముగనుండియందలి మునులచే సన్మానింపఁబడినవాఁడగుచువారలకు గలిగెడురాక్షసులవలనిబాధనివారించుటకయ్యేముందుబోయినఋష్యాశ్రమములకు మఱలరెండవమారుబోయి నివసించియుండె అట్లు నివసించుచు నొకయాశ్రమమున బదమూడుమాసములును, ఒకయాశ్రమమున నొకసంవత్సరమును, వేఱొకయాశ్రమమున నెనిమిదిమాసములును, ఇంకొకయాశ్రమమున నేడుమాసములును, ఒకయాశ్రమమున నారుమాసములును, మఱియొకయాశ్రమంబున నయిదుమాసములును, ఒకచోటనాల్గునెలలును, వేఱొకయాశ్రమమున మూడునెలలును, మఱియొకచోటనొకనెలకంటె యధికముగాను, ఒకయాశ్రమమున నొకమాసమును, వేఱొకఋష్యాశ్రమమునం దర్ధమాసమునకంటె నధికముగాను నివసించె. ఇట్లురాముడు ఋష్యాశ్రమములయందొక్కొక్కదానియందు రెండేసి మారులునివసించుచు యిష్టానుసారముగ ప్రొద్దుబుచ్చుచు మహాసంతోషముగనుండె. ఇట్లుమహాసంతోషముగనుండగ బదిసంవత్సరములుగడచె. పిమ్మటఁశ్రీమంతుడును, ధర్మజ్ఞుడును, నగురాముడు సీతాసమేతుడై

మఱలసుతీక్ష్ణమహర్షి యాశ్రమమునకువచ్చె. విరోధులను పశమింపజేయునట్టి రాముఁడు అట్లుసుతీక్ష్ణమహామునియాశ్రమమునకు మఱలవచ్చియచట నుండు మునిగణములచే సన్మానింపఁబడినవాఁడై యచటఁ గొంతకాలము నివసించియుండె. ఇట్లుండియొకనాడు రాముఁడు సుఖాసీనుఁడైయుండి యతివినయమున నాసుతీక్ష్ణమహామునినిఁజూచి యిట్లనియె.

ఓ ఋషిశ్రేష్ఠుఁడా! ఈ యరణ్యమునందెచ్చటనో మిగులమహిమగలవాఁడును, ఋషిశ్రేష్ఠుఁడును, నగుఅగస్త్యమహర్షి యున్నాడని అనేకులు జెప్పుకొనుచుండగ వింటిని. అయితే యీయరణ్యము మిగులగొప్పదిగనుండుటచే ఆయాశ్రమము నాకు దెలియదయ్యె. మతిమంతుడగునాయగస్త్యమహామునియొక్క పుణ్యాశ్రమమెచటనున్నదో నాకెఱిఁగింపుము నీవుకరుణించి చెప్పుదువేని నేనుసీతాలక్ష్మణసమేతుడనైపోయి యామహర్షినిదర్శించి నమస్కరించెదను అదియునుగాక ఆమునిశ్రేష్ఠునకు శుశ్రూషజేయవలయునని నాకుకోరికగలదు అనియిట్లుధర్మాత్ముఁడగు రాముఁడుజెప్పగవిని, సుతీక్ష్ణమహాముని మిగులసంతోషమునుబొందినవాఁడగుచు రామునితో మఱలనిట్లనియె.

ఓ రామచంద్రా! నేనుగూడ, సీతాసమేతులై యగస్త్యమహర్షి యాశ్రమమునకు బోయిరండని నీకును లక్ష్మణునకును జెప్పవలయుననియుంటిని భాగ్యవశమున నీవ యీవిషయమునుగూర్చి నన్నడిగితివి. కావున అగస్త్యమహామునియుండెడుస్థలమును నీకుదెల్పెదను వినుము. ఓ రాముఁడా! నీవీయాశ్రమమునుండి దక్షిణముగనెట్టుగనాలుగామడదూరముపోగానే యచటఅగస్త్యుని తమ్ముఁడగు సుదర్శనమహామునియొక్క యాశ్రమమున్నది అది విశేషముగ బువ్వులును, పండ్లును, గలిగియున్న, మనోజ్ఞమైనదియును, పలువిధములగుపక్షిధ్వనులచే నొప్పుచున్నదియును, పిప్పలిచెట్లచే బ్రకాశించుచున్నదియును, కొంతయెత్తైన భూమిగలదియును, నగునొకవనమునందున్నది ఆప్రదేశమునందు పరిశుద్ధములగు నీళ్ళచే నొప్పుచున్నవియును, మిగులశోభాకరములైనవియును, హంసపక్షులచేతను నీరుకోళ్ళచేతను వ్యాపింపఁబడినవియును, చక్రవాకపక్షులచే దేజరిల్లుచున్నవియును, నగునానావిధములైన అనేకసరోవరములున్నవి. ఓ రాముఁడా! అచటనొకరాత్రియుండి మఱునాడుదయమున లేచిపొమ్ము. ఆసుదర్శనమహాముని యాశ్రమమునుండి దక్షిణపుదిక్కుగా నరణ్యప్రదేశములకు బ్రక్కగ నొకయామడదూరముపొమ్ము అచటఅగస్త్యాశ్రమమున్నది. ఆయాశ్రమస్థానమున, మిగులమనోజ్ఞమైనదియును, అనేకములైనచెట్లతో నిండియుండు నదియును, నగునొకయరణ్యప్రదేశమునందు నీవుసీతాలక్ష్మణసమేతుడవై విహరింపవచ్చును అనేకవృక్షములచే నిండియుండెడు, ఆయరణ్యము మిగులరమ్యముగ నుండును మిగులకీర్తిమంతుఁడవగునో రాముఁడా! నీవాయగస్త్యమహామునిని జూడగోరెదవేని, ఈతక్షణమే బైలుదేఱిపొమ్ము అనియిట్లుసుతీక్ష్ణమహామునిజెప్పగవిని రాముఁడుసీతాలక్ష్మణసమేతుఁడై యాఋషిశ్రేష్ఠునకు నమస్కరించియంత సీతారామలక్ష్మణులుమువ్వురును అగస్త్యాశ్రమమునకుఁ బైనమైపోవుచుండిరి ఇట్లుపోవునపుడు రాముఁడుమార్గమునందుమనోజ్ఞములైన యరణ్యములను, మేఘములవలెనున్న పర్వతములను, అనేకములగు సరోవరములను, మార్గవశమున తమప్రక్కగ బారుచుండెడు నదులనుజూచుచు సుతీక్ష్ణుడు జెప్పినత్రోవనే సుఖముగ బోయిపోయి పరమసంతోషమునుబొందిలక్ష్మణునిజూచియిట్లనియె.

ఓలక్ష్మణా! మహాత్ముఁడును పుణ్యకర్ములను జేయువాఁడును, అగస్త్యమహామునితమ్ముఁడును, నగుసుదర్శనమహర్షి యాశ్రమముయిదియేను. ఏలననగా, సుతీక్ష్ణమహాముని యీవనమునకు గురుతుజెప్పినట్లే, పండ్లబరువుచేతను, పూలబరువుచేతను, వంగియుండెడువృక్షములు విశేషముగనున్నవి అదియునుగాక యీయరణ్యమున లెస్సగ పండియుండెడు పిప్పలిపండ్లయొక్క వగరువాసన గాలి గొట్టుటచే జక్కగావచ్చుచున్నది మఱియు నక్కడక్కడ, ఋషులేరియుంచిన కట్టెలగుట్టలగపడుచున్నవి మఱియుత్రోవనెఁబడి ఋషులచే గోయబడిన దర్భమోటికలు వైడూర్యమణులయొక్క కాంతివంటికాంతిగలవియై యగపడుచున్నవి. ఓలక్ష్మణా! అదిగో చూడుము నీలమేఘముతో సమానమైనదియును, వనమధ్యమున జూపట్టుచున్నదియును, ఆశ్రమమునుండి బైలువెడలినదియును, నగుధూమము గాన్పించుచున్నది మఱియు బ్రాహ్మణులుపావనములగుపుణ్యతీర్థములయందు మునిగి తాముగానే, పుష్పములుగోసి, పుష్పోపహారములుజేయుచున్నారు. సౌమ్యుడవగునోలక్ష్మణా! సుతీక్ష్ణమహామునిచే నేనువిన్నట్లు యిదియే యగస్త్యునితమ్మునియాశ్రమము ఓతమ్ముఁడా! లక్ష్మణా! ఈసుదర్శనమహామునిఅన్నయును, పుణ్యకార్యములుగలవాఁడునునగు అగస్త్యుఁడులోకమునకు మేలుజేయగోరి ఘోరమగుతపస్సునుజేసి మృత్యువునుజయించి యీదక్షిణదిక్కుననుండిన రాక్షసులనువధించి యీదిక్కు ఋషులకు వాసయోగ్యముగజేసె. ఓసుమిత్రానందనా! లక్ష్మణా! ఇచటనొకప్పుడుఇల్వలవాతాపులను యిద్దఱన్నదమ్ములగు భయంకరులైనరాక్షసులు బ్రాహ్మణులనుజం

విభక్షించుచుండిరి. అందులో నిర్దయుడగు నిల్వలుడు బ్రాహ్మణాకారమును ధరించి సంస్కృతమున భాషించుచు శ్రాద్ధమను నెపమున బ్రాహ్మణులను భోజనమునకు బిలుచును. అట్లు బిలచి యిల్వలుడు తన తమ్ముడగు వాతాపిని చక్కగ పచనము జేసి శ్రాద్ధవిధి ప్రకారము బ్రాహ్మణులకు భోజనంబు బెట్టును. ఆ బ్రాహ్మణులు భోజనము జేసిన వెనుక నిల్వలుడు ఓ వాతాపీ! నీవింక రమ్మని గొంతెత్తి పిలుచును. అంత వాతాపి తన యన్నయగు నిల్వలుడు పిలుచుటను విన్నంతనే, మేకవలె నఱచుచు బ్రాహ్మణుల శరీరములను జీల్చుకొని బైటికి వచ్చును. పిమ్మట ఆ బ్రాహ్మణుల మాంసమును వారు భుజింతురు. ఇట్లు కామరూపులును, మాంసాహారులును నగు నా రాక్షసులు ప్రతిదినము నీ ప్రకారముగ జేయుచు వేలకొలది బ్రాహ్మణుల జంపిరి. ఇట్లుండగ నొకనాడు అగస్త్యమహాముని దేవతలచే బ్రార్థింపబడినవాడై యిల్వలుడు పిలిచిన బిలుపునకు నొప్పుకొని శ్రాద్ధభోజనమునందు అక్రూర రాక్షసుడగు వాతాపిని భక్షించె. అంత శ్రాద్ధము యొక్క కట్టకడపట ఆ యిల్వలుడు "సంపన్నం" తృప్తిమైనదా అని యడిగ, ఉత్తరాపోశనము నిచ్చి తమ్ముడా! వాతాపీ! బైటరమ్మని బిలిచెను. అట్లు తమ్ముని బిలుచుచున్నవాడును, బ్రాహ్మణులను జంపునట్టి వాడును, నగు నా యిల్వలుని జూచి ధీమంతుడును ఋషిశ్రేష్ఠుడును నగు అగస్త్యుడు నవ్వుచు నిట్లనియె

ఓరీ రాక్షసాధమా! మేకరూపమును దాల్చిన నీ తమ్ముడగు వాతాపి నా కడుపులో జీర్ణించి యమపురిని జేరెను. ఇంక వాడెట్లు బయలు వెడలి వచ్చును? అని యగస్త్యుడు జెప్పగ విని రాక్షసుడగు నా యిల్వలుడు మిగుల కోపోద్దీపితుడై దీప్తతేజుడగు నయ్యగస్త్యుని బెదరించుచు నతని పైకి పరుగెత్తి వచ్చె. అంత నయ్యగస్త్యుడు కోపించి యాగ్నితో సమానమైన తన నేత్రాగ్నిచే నిల్వలుని దహించె. ఓ లక్ష్మణుడా! సరోవరములతోను అరణ్యములతోను ఒప్పుచుండెడు నీ యాశ్రమమునందు, ఏ మహనీయుడు బ్రాహ్మణులయందు కృపచే నిట్టి దుస్తరమగు కార్యము జేసెనో, ఆ యగస్త్య మహాముని యొక్క తమ్ముడగు సుదర్శన మహర్షి యాశ్రమము యిది అని యిట్లు రాముడు లక్ష్మణునితో జెప్పుచుండగ సూర్యాస్తమానసమయంబయ్యె. అంత సంధ్యాకాలము ప్రాప్తించె. అపుడు రాముడు లక్ష్మణునితో గూడుకొన్నవాడై శాస్త్ర ప్రకారము సాయంసంధ్యావందనమును జేసి యా ఋష్యాశ్రమమున బ్రవేశించి యందున్న సుదర్శన మహర్షికి వందనమును జేసె. అప్పుడా ఋషిశ్రేష్ఠుడు వారలను జక్కగ బహూకరించి సన్మానించె. అంత రామచంద్రుడమ్మునిచే సన్మానింపబడినవాడై అతండిచ్చిన కందమూలఫలములను భుజించి యా రాత్రి యందు నివసించియుండె. అట్లా రాత్రియంతయు గడిపి మరునాడు సూర్యోదయమైనతోడనే రాముడగస్త్య మహాముని తమ్ముని యొద్దకి బోయి యిట్లనియె.

భగవంతుడవగు నో మునిశ్రేష్ఠుడా! నీకు నమస్కరించెదను. రాత్రి సుఖముగ నిచట నివసించియుంటిమి. నీ గురుడును, అన్నయును, నగు అగస్త్యమహర్షిని జూడగోరుచున్నాను. సెలవిమ్ము! పోయి వచ్చెదను. అని చెప్పి రాముడు సెలవు పుచ్చుకొని యచటి యరణ్యమును జూచుచు సుతీక్ష్ణమహాముని జెప్పిన త్రోవనే బోవుచుండె. అట్లు బోవుచు రాముడు మార్గమున, యేనుగుల గుంపులచే విఱువబడినవియును, వానరములచే నొప్పుచున్నవియును, క్రొవ్వి శరీరము తెలియక నానావిధములుగ కూయుచుండెడు అనేక పక్షులతో గూడుకున్నవియును, తెస్పగ బూచియుండునవియును, ప్రాచియుండెడు కొనలుగల తీగలచే జుట్టుకొనబడియున్నవియును, నగు ననేక యడవివృక్షములను, నివ్వరి పైరులను, పనసవృక్షములను, తాడిచెట్లను, తిమిశవృక్షములను, పొగడచెట్లను, చంద్రచెట్లను, కానుగచెట్లను, ఇప్పచెట్లను, మారేడుచెట్లను, తుమ్మిచెట్లను జూచెను. ఇట్లు జూచి తామరతేకులవంటి నేత్రములుగల రాముడు, తనసమీపమున వెంబడి వచ్చుచున్నవాడును, మిగుల శౌర్యవంతుడును, లక్ష్మివర్ధనుడును నగు లక్ష్మణుని తోనిట్లనియె.

ఓ తమ్ముడా! లక్ష్మణా! ఇచ్చటి వృక్షముల యాకులు మిగుల నునుపై యున్నవి. మృగములును పక్షులును మిగుల శాంతిని బొందియున్నవి. ఇవన్నియు జూడగ పరమాత్మవేత్తయగు నయ్యగస్త్యమహర్షి యాశ్రమము సమీపమున నున్నదని తెలుపుచున్నది లక్ష్మణా! అదిగో చూడుము. ఏ దివ్యుడు తన కార్యము చేసినగా వింధ్యపర్వతమును స్తంభింపజేయుటచే నగస్త్యుడను లోకమునందు బ్రఖ్యాతి బొందెనో ఆ మహర్షి యొక్కయు, బడలిక జెందినవారి యొక్క ప్రయాసను బోగొట్టునదియును, విశేషమగు ధూమముచే నిండిన యరణ్యము గలదియును, నారచీరెల వరుసలచే నొప్పుచున్నదియును, మిగుల శాంతిని బొందిన మృగసమూహములు గలదియును, పలువిధములగు పక్షుల యొక్క ధ్వనులచే బ్రతిధ్వనింపజేయబడినదియును, నగు ఆశ్రమము గనబడుచున్నది. ఓ సుమిత్రానందనా! లక్ష్మణా! ఏ ముని యొక్క మాహాత్మ్యముచే భయంకరులగు రాక్షసులు యీ దక్షిణపు దిక్కును సహాభయముం తెరా జూచుచు యుండలి సుఖము లనుభవింప

కుందురో అట్టియగస్త్యమహామునియాశ్రమం బిదియే. పావనమైన వ్రతములు సలుపుచుండెడు నీయగస్త్యమహర్షి యీదక్షిణదిక్కునకు వచ్చినది మొదలు రాక్షసులు ఋషుల యెడల వైరమును మాని శాంతినిబొందిరి. మఱియు నీదక్షిణదిక్కు మిగుల మహిమగలవాడగు నీయగస్త్యమహాముని పేరుచే నగస్త్యదిక్కని ప్రఖ్యాతిబొందినది. ఇది మహాక్రూరకృత్యములుగల రాక్షసులకగేయమై మూడులోకములయందును బ్రఖ్యాతినొందినది. మఱియు నోలక్ష్మణా! మిగుల శ్రీమంతమును, అణకువగలిగిన మునులైనవారిచే సేవింపదగినదియును, నగు నీయాశ్రమము, సూర్యమార్గము నడ్డగింప బ్రయత్నించిన పర్వతోత్తమమగు వింధ్యపర్వతము, యేమహానీయుని యాజ్ఞకులోబడి వృద్ధిబొందకయున్నదో, యట్టి ప్రసిద్ధములగు కార్యములుగలవాడును, చిరకాలజీవియును, నగు నగస్త్యుని యాశ్రమము. మఱియు నీయగస్త్యుడు సర్వలోకపూజితుడు. మహాసాధువు సాధుజనులకెల్లప్పుడును మేలు జేయుచుండును. కావున మన మిమ్మహామునియొద్దకుబోతిమేని మనకు మేలును జేయును. సౌమ్యుడవగు నోలక్ష్మణా! నేను మిగుల పూజ్యుడగు నీయగస్త్యమహామునిని సేవింపుచు నిచటనే వనవాసకాలము యొక్కశేషమును గడపెదను. నియతాహారుడై యుండెడు అగస్త్యమహామునిని సేవించుటకై గంధర్వులును, దేవతలును, సిద్ధులును మహర్షులును నిరంతరము నీయాశ్రమమునందుందురు. మఱియును అసత్యమాడువారును, మహాక్రూరులును, వంచకులును, ద్రోహులును, యథేచ్ఛావిహారులును, నగువారలు ఈయాశ్రమమునకుబోనేరని తత్క్షణము మృతినొందుదురు. ఈయగస్త్యుడట్టి మహిమగలవాడు. తమ్ముడా! లక్ష్మణా! దేవతలును, యక్షులును, నాగులును, పక్షులును, ధర్మమునారాధింపుచు నియతాహారులై యీయాశ్రమముననే నివసింపుచుందురు. మఱియు మహాత్ములగు మునిశ్రేష్ఠులు, ఈయాశ్రమముననే తపస్సును జేసిసిద్ధిబొంది మనుష్యశరీరములను విడిచిక్రొత్తదేహములను ధరించి సూర్యునితోసరిపోలునట్టి విమానములనెక్కి స్వర్గమునకుబోయిరి. దేవతలు యీయాశ్రమమునందారాధింపబడినవారై దేవత్వమును యక్షత్వమును మఱియు నానావిధములగు రాజ్యసంపదలను యిచ్చెదరు. సుమిత్రానందనా! లక్ష్మణా! మనమిప్పుడగస్త్యాశ్రమమును జేరితిమి. నీవుముందుగబోయి సీతతోగూడ నేనిచ్చటికివచ్చియున్నానని అగస్త్యునికిం దెలుపుమని జెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పదకొండవసర్గము గిసెను

సీతారామలక్ష్మణులను అగస్త్యమహర్షి సన్మానించుట.

అంతరామునితమ్ముడగు లక్ష్మణుడు ఆఆశ్రమమునకు బోయి యగస్త్యమహామునిశిష్యునితో నిట్లనియె.

ఓవిప్రోత్తమా! దశరథుండను రాజొకడుగలడు అతని జ్యేష్ఠపుత్రుడును, మహాబలవంతుడునునగు రాముడు, అగస్త్యమహామునిని జూచుటకు తనభార్యయగు సీతాదేవితోగూడవచ్చియున్నాడు. నేనా రామునియొక్క తమ్ముడను. లక్ష్మణుడను పేరుగలవాడను అతనికి మిగుల యిష్టుడను. అతనియిష్టము చొప్పుననటించువాడను మహాభక్తుడను. ఇవన్నియు నీకు దెలిసియేయుండును. మేము మాతండ్రియాజ్ఞాప్రకారము మహాభయంకరమగు నీదండకారణ్యమునబ్రవేశించితిమి మేమందరమును భగవంతుడగు నగస్త్యమహామునిని జూడగోరి యిచ్చటికివచ్చితిమి. మారాకను ఆమునికెఱింగింపుము. అని లక్ష్మణుడు చెప్పగవిని యగస్త్యశిష్యుండట్లే కానిమ్మని చెప్పి వారిరాకను అగస్త్యునికెఱింగించుటకు అగ్నిహోత్రగృహమునందు బ్రవేశించె. అట్లు అగస్త్యునియొక్క ప్రియశిష్యుడు అగ్నిహోత్రగృహమునుజొచ్చి తపస్సంపన్నుడగు నాఋషివర్యునకునమస్కరించి లక్ష్మణుడుజెప్పినరీతిగ రామునిరాక నెఱింగించువాడై యిట్లనియె

ఓ ఋషిశ్రేష్ఠుడా! అగస్త్యుడా! దశరథమహారాజుకుమారులు రామలక్ష్మణులువారిద్దఱును రామునిభార్యయగుసీతతోగూడ మనయాశ్రమమునకు వచ్చియున్నారు. విరోధులనుపశమింపజేయునట్టి రామలక్ష్మణులు నిన్నుజూచిశుశ్రూషసేయుటకు వచ్చియున్నారు. ఇంకనగుణించి చేయవలసినకార్యమును సెలవిండు. అనిశిష్యుడుజెప్పగవిని సీతారామలక్ష్మణులరాకనెఱింగి, అగస్త్యమహామునిశిష్యునిజూచి యిట్లనియె.

నాయదృష్టవశమున బహుకాలమునకు రాముడునన్నుజూడవచ్చె రాముడువచ్చుటకు బహుకాలముగ నేను జూచుచున్నాను. సీతాలక్ష్మణులతోగూడ రాముడు పూజనీయుడు నీవుపోయి వారలనునాయొద్దకి బిలుచుకొనిరమ్ము ముందే, ఏలరానివ్వకపోతివి అనియిట్లు మహాత్ముడును, ధర్మజ్ఞుడును, నగుఅగస్త్యమహామునిచెప్పగవిని శిష్యుడునమస్కరించి చేతులుగట్టుకొనినిలిచి, స్వామీ! మీయాజ్ఞాప్రకారముగ జేయుదునని చెప్పి యతివేగమునబోయి లక్ష్మణునిజూచి యిట్లనియె.

లక్ష్మణుడా! రాముడెక్కడనున్నాడు? రాముడగస్త్యమహామునిని జూచుటకు శీఘ్రముగరావచ్చును? అని చె

ప్రగలక్ష్మణుండు శిష్యునితోగూడ ఆశ్రమద్వారమునకు బోయి రాముని, సీతాదేవిని, అగస్త్యశిష్యునికి జూపె. అంత అగస్త్యశిష్యుడు మిగులనడకువతో సన్మానింపదగినవాడగు రాముని వెంటబెట్టుకొని పోవునప్పుడగస్త్యుడు చెప్పిన మాటలను రామునకు జెప్పుచు యథాన్యాయముగ రాముని లోపల బ్రవేశింపజేసె. అప్పుడు రామచంద్రుడు సీతాలక్ష్మణసమేతుడై మిగుల శాంతిగనుండు జింకలతో గూడుకొనియున్న యయ్యాశ్రమమును నాలుగుప్రక్కలజూచుచు లోనికిబోయె. ఆయాశ్రమమునందు, బ్రహ్మస్థానమును, అగ్నిదేవునిస్థానమును, విష్ణుస్థానమును, దేవేంద్రునిస్థానమును, సూర్యునిస్థానమును, చంద్రునిస్థానమును, భగునిస్థానమును, ధనదునిస్థానమును, ధాతృస్థానమును, విధాతృస్థానమును, వాయుదేవునిస్థానమును, శేషునిస్థానమును, మహిమగలవాడగు వాసుకిస్థానమును, గాయత్రీస్థానమును, అష్టవసువులయొక్క స్థానమును, పాశహస్తుడును, మిగుల మహాత్ముడును నగు వరుణదేవునిస్థానమును, కుమారస్వామిస్థానమును, యమస్థానమును, ధర్మస్థానమును జూచె. అట్టియెడ నయ్యగస్త్యమహాముని యును, శిష్యులచే బరివేష్టితుడై రామునికెదురుగ వచ్చె. అట్లు మహాకాంతియుతులగు ఋషిశ్రేష్ఠులకందఱికన్న ముందు వచ్చుచున్న అగస్త్యమహామునిని రాముడు చూచె. అంత మిగుల శౌర్యవంతుడగు రాముడు సంపద్యుక్తుడగు లక్ష్మణునిజూచి యిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! అదిగో చూడుము మహాత్ముడగు అగస్త్యమహర్షి వచ్చుచున్నాడు. ఇతని యాకారముచేత నేయితడు ఋషిశ్రేష్ఠుడగు అగస్త్యుడని తెలిసికొంటిని అనియిట్లు, విరోధుల గర్వమడచువాడును, మహాబాహుడును, నగు రాముడు, సూర్యుని ప్రకాశముగల అయ్యగస్త్యునిగుఱించి చెప్పుచువచ్చి యతనినిగలసికొని మహాసంతోషమును బొందినవాడగుచు, ఆయగస్త్యుని పాదములను బట్టుకొనె. అట్లు బట్టుకొనినపిమ్మట రామచంద్రుడు సీతాలక్ష్మణసమేతుడై యమ్మహర్షికి నమస్కరించి చేతులుగట్టుకొని నిలుచుండె. అంతనయ్యగస్త్యుడును కకుత్స్థకులోద్భవుడగు రాముని గౌరవించి యర్ఘ్యపాద్యాదులను ఆసనమును ఇచ్చి క్షేమమడిగి కూర్చుండ నియమించె. పిమ్మట ఋషిశ్రేష్ఠుడగు అగస్త్యమహర్షి అగ్నిక్రియలను నెరవేర్చి యతిథులను అర్ఘ్యాదులచే బూజించి వారలకు కందమూలఫలములను ఆహారముగనిచ్చె. అట్లు వారల భుజించినవెనుక ధర్మజ్ఞుడును, ఋషిశ్రేష్ఠుడును, నగునయ్యగస్త్యుడందఱినిగూర్చుండనియమించి, అంజలిబద్ధుడును, ధర్మవేత్తయును, నగు రామునిజూచి యిట్లనియె.

ఓ రాముడా! వైశ్వదేవమును గావించినపిమ్మట అర్ఘ్యమునిచ్చి, యతిథిని పూజింపవలయును. తపసియగు వాడట్లతిథినిబూజసేయకుండునేని, శ్లో॥ అన్యథా ఖలు కాకుత్స్థ తపస్వీ సముదాచరన్। దుస్సాక్షీవ పరేలోకే స్వాని మాంసాని భక్షయేత్॥ "తప్పుసాక్ష్యము చెప్పెడు వానివలె" పరలోకమున తనమాంసమును తానేదినుచుండును అట్లుండగ సకలలోకములకును ప్రభుండవును, ధర్మప్రకారము నడుచువాడవును, మహారథుండవును, పూజింపదగినవాడవును, మాన్యుడవునునగు నీవు మిగులప్రియమైన యతిథివై వచ్చియుండగ బూజింపవలయునని విశేషించి చెప్పనేల? అనియిట్లు అగస్త్యమహాముని చెప్పి కందమూలఫలముల చేతను, పుష్పములచేతను, మఱియు ననేకవిధములచేతను, రాముని మఱల బూజించి యిట్లనియె.

పురుషోత్తముడవగు నో రామచంద్రా! బంగారముచేతను, మణులచేతను, చక్కగ నలంకరింపబడినదియును, ఉత్తమమైనదియును, గొప్పదైనదియును, నగు యీ ధనుస్సు విష్ణుదేవునిది. విశ్వకర్మచే జేయబడినది. ఓ రాముడా! సూర్యునితో సమానమైనకాంతిగల యీ యుత్తమ బాణము అమోఘమైనది. ఇది నాకు బ్రహ్మదేవునిచే నివ్వబడియె. మండుచుండు అగ్నిహోత్రమువలె బ్రకాశించుచుండెడి తీక్ష్ణములగు బాణములతో నిండియుండెడు నీయక్షయతూణీరములను నన్మ్రలపొది నాకు దేవేంద్రుడిచ్చె. బంగారుయొఱ గలదియును, సువర్ణముచే నలంకరింపబడినదియును, నగు నీకత్తినిగూడ నాకు దేవేంద్రుడిచ్చె. ఓ రాముడా! పూర్వము విష్ణుదేవుడు యీ ధనస్సుచేతనే యుద్ధమునందు మహాక్రూరులగు రాక్షసులను జంపి దీప్తతేజులగు దేవతలకు రాజ్యలక్ష్మినియిచ్చె. శరణంబొచ్చి నవారి మానము గాపాడునట్టియో రాముడా! ఆవిల్లును, ఆబాణములను, ఆయమ్ములపొదిని, ఆఖడ్గమును, "దేవేంద్రుడు వజ్రాయుధమును గ్రహించినట్లు" శత్రుజయముకొఱకు నీవు గ్రహింపుము. అనిచెప్పి మహాతేజోవంతుడును భగవంతుడును నగు అగస్త్యమహాముని, ఆయుత్తమ ఆయుధములనన్నింటిని రామునకు ఇచ్చి మఱల యిట్లనియె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పండ్రెండవసర్గము గిసెను.

అగస్త్యుడు రాముని పంచవటీతీరమున నివసింపుమనుట.

ఓ రాముడా! లక్ష్మణుడా! మీరు నాకు నమస్కరించు

టకు సీతాదేవితోఁగూడవచ్చితిరి. నేనుమిగుల సంతసించితిని. మీకుశుభముగలుగుగాక. ఓనాయనలారా! మీకుదారి నడుచుటచే గల్గినశ్రమచేత జెమటబోసి యలసటగలిగి యున్నది. జనకమహారాజు కూతురగు సీతాదేవియువిశేషముగనలసియున్నది. ఓరామా! మహాసుకుమార శరీరము గలదియును, వ్యసనమునదెట్టిదో యెఱుగకుండినదియును, నగునీసీతాదేవి పెనిమిటవైన నీయందలి స్నేహాతిశయముచే ప్రేరేపింపబడినదై మహాదోషయుక్తమగు అనగా సమస్తములైన యాపదలకును స్థానమగు నీయరణ్యమునకువచ్చినది ఓరామచంద్రా! ఈసీత యీయాశ్రమమునందెట్లు శ్రమదీర్చుకొని సంతోషించునో, యట్లుజేయుము. ఈసీతాదేవిగూడ అరణ్యమునకు వచ్చుటచే మిగుల దుష్కరమగు కార్యమునుజేసినది శ్లో॥ ఏషాహిప్రకృతిస్త్రీణా మాసృష్టే రఘునందన । సమస్థమనురంజంతి విషమస్థంత్యజంతిచ॥ ఓరఘునందనా! స్త్రీలు, పెనిమిటిమంచిస్థితియందు బాగుగానున్నపుడు అతనిపై మిగులప్రేమగలవారైయుందురు. అట్టిపెనిమిటి దుర్దశనుబొందెనేని వానినిత్యజింతురు ఇట్లుజేయుట సృష్టికాలము మొదలుకొని స్త్రీల స్వభావముగనున్నది శ్లో॥ శతహ్రదానాం లోలత్వం శస్త్రాణాంతీక్ష్ణతాంతథా । గరుడానిలయోశ్శైఘ్ర్య మనుగచ్ఛంతియోషితః॥ స్త్రీలుమెఱుపులకువలె చిత్తచాంచల్యముగలవారు. కత్తిమొదలగు నాయుధములవలె క్రౌర్యమున నెంతటిపనినైనను జేతురు. గరుత్మంతునకును, వాయువునకును, గలవేగమువంటి వేగముగలవారై విచారింపక యెంతటికార్యమునైన త్వరపడిచేయుదురు. ఓరాముడా! నీభార్యయగునీసీతాదేవిమాత్రము అటువంటి దుర్గుణములులేనిదై యరుంధతీదేవివలె మిగుల స్తోత్రము జేయదగినదిగానున్నది. పతివ్రతలలో మొదట నెన్నదగినదిగానున్నది. శత్రుసంహారకుడవగు నోరామా! నీవులక్ష్మణునితోడను పతివ్రతాగ్రగణ్యయగు సీతాదేవితోడను యిచటవసించుటచే నీదేశము మిగులనలంకృతమై యున్నది. అనియగస్త్యమహాముని జెప్పగా రాముడువిని కృతాంజలియై "మండుచున్న యగ్నిహోత్రునివలె' నున్న యామునిశ్రేష్ఠునితో వినయముగ నిట్లనియె

ఓతాపసోత్తమా! అగస్త్యమహర్షీ! నాతమ్మునిగుణములకును నాభార్యగుణములకును నాగుణములకును వరదుడవును మునిసత్తముడవును, నగునీవు మిగులసంతసించితివిగావున నేనుధన్యుడనైతిని. ఈశ్వరానుగ్రహమును బొందితిని. మిమ్ములనింకొకటి ప్రార్థించెద ఎచ్చటనైనను ఒకయాశ్రమమును, ఏర్పఱచుకొని నియతుడనై సుఖముగనుండుటకు, జలసమృద్ధమైనదియును, అనేకయరణ్యములతో గూడినదియును, నగునొకప్రదేశమును నాకుజూపింపవలయును. అనిరాముఁడు చెప్పె. అంతధర్మాత్ముఁడును, మిగులబ్రజ్ఞావంతుఁడును, ఋషిశ్రేష్ఠుఁడును, నగుఅగస్త్యమహాముని ముహూర్తకాలముఆలోచించి మిగుల ధైర్యముగలుగునట్లుగ నిట్లనియె.

నాయనా! రామచంద్రా! ఇచటికి రెండామడదూరమున, మిగుల కందమూలఫలములతో గూడినదియును, జలసమృద్ధమైనదియును, అనేకమృగముల కాశ్రయమైనదియును, మిగుల కాంతియుక్తమైనదియును, నగుపంచవటి యనుపేరుచే బ్రసిద్ధమగుస్థలము ఒకటిగలదు నీవచటికి సీతాలక్ష్మణ సమేతుఁడవైపోయి యొకయాశ్రమమునేర్పఱచుకొని పితృవాక్యపరిపాలనముసేయుచు సుఖముగనుండుము. ఓరాముఁడా! నీకునీతండ్రియగు దశరథమహారాజు యేర్పఱచిన నియతకాలములో యిపుడుచాలాకాలము గడచినది. ఇంకనీవు నీప్రతిజ్ఞను జెల్లించుకొనిపోయి నీరాజ్యమున సుఖముగనుండగలవు. ఓరఘునందనా! రాముడా! పెద్దకుమారుఁడవగునీచేత "యయాతియుంబోలె' నీతండ్రి తరింపఁజేయఁబడెను నీతండ్రిమిగులధన్యుఁడు. అనఘాత్ముఁడవగు నోరామా! నాకునీతండ్రియగు దశరథమహారాజుయెడల గలస్నేహమునుబట్టి, నీసమాచారమునంతయు నాతపఃప్రభావమువలన దెలిసికొంటని. నీవు నాతోఁగూడ యీతపోవనమున నుండవచ్చును అయినను నీవునీయిష్టముచొప్పున నొకరమ్యప్రదేశమున నుండగోరియున్నావని నాతపోమహిమవలన గనుగొంటిని కావుననే, నిన్నుపంచవటికి బొమ్మనిచెప్పితిని ఓరాముఁడా! ఆయడవిప్రదేశము మిగులమనోజ్ఞమైనది అచటసీతాదేవిమహాసంతోషముగనుండును. ఆప్రదేశము మిగులమనోజ్ఞమైనది. ఇచటికి మిగులసమీపమున నున్నది. మఱియు నాప్రదేశము గోదావరికి మిగులసమీపముగ నుండుటచే సీతాదేవియచట మిగులకుతూహలముగ నుండును దీర్ఘబాహుడవగు నోరాముఁడా! ఆస్థలము విశేషముగ ఫలమూలములుగలది. నానావిధములైన పక్షిసమూహములకు నివాసస్థానమైనది జనులులేనిది. మిగులపావనమైనది. మఱియు మిగులమనోజ్ఞమైనది. ఓరామచంద్రా! అదిమిగులరమణీయమైన ప్రదేశముగావున భార్యాసమేతుడవైయుండెదు నీకుదగియుండును అదియునుగాక నీవుఆర్తజనులను రక్షించుటకు శక్తిమంతుఁడవుగావున నచటపంచవటియందుండెదు ఋషులను గాపాడుచుండుము శౌర్యవంతుఁడవగునోరామా! ఇదిగోచూడుము. ఒకగొప్పయిప్పవన

ముఅగపడుచున్నది. ఆపుష్పవనమునకు ఉత్తరపుతట్టుగ బోయిన నొకమఱ్ఱిచెట్టు దగ్గరకుబోవును అట్లామార్గముననేబోయిన నొకయున్నతప్రదేశము గనబడును. ఆయున్నతప్రదేశమును ఎక్కిచూచిన నొకపర్వత మగపడును ఆపర్వతమునకు సమీపమునందలి ప్రదేశమునెల్లప్పుడును పూచియుండెడు పుష్పవృక్షములుగల యరణ్యములతో గూడుకొనియుండును. ఆప్రదేశమునే పంచవటియని యందురు అనియిట్లుఅగస్త్యమహాముని చెప్పగరామచంద్రుడువిని లక్ష్మణసమేతుడై సత్యవాదియగు నయ్యగస్త్యమహర్షికి నమస్కరించిసెలవుయిమ్మనియె. అట్లుసెలవడిగి యారామలక్ష్మణులు అగస్త్యమహామునియొక్క ఉత్తరవునుబొంది సీతాదేవితో గూడుకొన్నవారగుచు నయ్యగస్త్యాశ్రమమునువిడిచిపంచవటికిబోవుటకుప్రయాణమైరి. అట్లుబైలువెడలి రణమునందు భీతిలేనివారును, రాజపుత్రులును, నగువారామలక్ష్మణులు ధనుర్బాణతూణీరములను ధరించి యేకాగ్రచిత్తులై అగస్త్యుడు చెప్పినత్రోవనే పంచవటికిబోయిరి.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పదమూడవసర్గము ముగిసెను.

రామునకు జటాయువు ప్రజాపతులక్రమమును దెలుపుట.

ఇట్లు రామచంద్రుడు పంచవటికిబోవుచు మార్గమున గొప్పయాకారము గలదియును భయంకరమైన పరాక్రమముగలదియును మఱ్ఱిచెట్టుమీదనున్నదియును నగునొక గృధ్రమునుజూచె ఆగ్రద్దనుజూచి మిగులపూజ్యమైన స్వభావముగల రామలక్ష్మణులు రాక్షసుడనితలచి నీవెవ్వరనియడిగిరి. అందుకాగద్దమిగుల మధురములగు శాంతవచనములతో వారలకు సంతసంబు గలుగునట్లుగ యిట్లనియె

ఓబిడ్డా! రామా! నేనునీతండ్రికి స్నేహితుడను. అనియాగద్దచెప్పగా రాముడువిని అదితనతండ్రియొక్క స్నేహితునిగా దెలిసికొని దానినిపూజించె అట్లురాముడు ఆగృధ్రమునుబూజించి యేమియుబాటులేక దానివంశమును పేరునుఅడిగె. అంతనాగద్ద రామునిమాటనువిని సమస్తప్రాణులయొక్క యుత్పత్తియును తనకులమును తనపేరును జెప్పనారంభించి యిట్లనియె

ఆజానుబాహుడవగు నోరామా! పూర్వకాలమునందు ఎవ్వరెవ్వరు ప్రజాపతులుగనుండిరో వారలందఱిక్రమముగ నెఱింగించెదనువినుము. ప్రజాపతులలో మొదటివాడుకర్దముడు. వానికివెనుక వాడువిక్రీతుడు. వానివెనుక శేషుడు. వానివెనుక ననేకమంది పుత్రులుగలవాడును మహాశౌర్యవంతుడును నగుసంశ్రయుండు, ఆవలస్థాణువు, మరీచి, అత్రి, మహాబలపరాక్రమశాలి యగుక్రతుడు. ఆవలపులస్త్యుడు, అంగిరసుడు, ప్రచేతసుడు, ఆవల పులహుడు, దక్షుడు, వివస్వంతుడు వీరందరుక్రమంబున ప్రజాపతులైరి. ఆవలఆరిష్టనేమియను నామాంతరముచేకాశ్యపుడు ప్రజాపతియయ్యె. ఈకాశ్యపుడు ప్రజాపతులలోనెల్ల గడపటివాడు. మహాకీర్తిమంతుడవగు నోరాముడా! దక్షప్రజాపతికి మిగులకీర్తిమంతులగు నఱువదిమంది కుమార్తెలుగలిగిరి. ఈవిషయము లోకప్రసిద్ధమైనదేగదా? వారలలో సుందరములైన నడుముగలవారగు అదితి, దితి, దనువు, కాళిక, తామ్ర, క్రోధవశ, మనువు, అనల, అనునీయెనిమిదిమందిని కాశ్యపుడుపెండ్లియాడె. అంతగాశ్యపుడు పరమసంతోషమును బొందినవారలనుజూచి యిట్లనియె.

ఓసుందరాంగులారా! మూడులోకములను ఏలువారును, నాతోసమానులును, నగుపుత్రులనుగనుడు. అనియిట్లుఆఋషిశ్రేష్ఠుడుచెప్పగవిని, దితి, అదితి, కాళికయును ముగ్గురునుసమ్మతించిరి. తక్కినవారు యిష్టపడకపోయిరి. విరోధులనుదహింపజేయునట్టియోరామా! అదితియందుద్వాదశాదిత్యులును, అష్టవసువులును, ఏకాదశరుద్రులును, ఇద్దఱశ్వినీదేవతలును ఇట్లుముప్పదిముగ్గురు దేవతలుజన్మించిరి ఆజానుబాహుడవగునో రామచంద్రా! నాయనా! దితికిమహాకీర్తిమంతులగు దైత్యులుబుట్టిరి. పూర్వముసమస్తవనములతో సముద్రములతోను గూడినయీభూమండలమంతయువారలదైయుండెడి శత్రుసంహారకుడవగునో రామా! దనువునకుహయగ్రీవుడను కొడుకుబుట్టె. కాళిక, నరకుడుకాలకుడు అనునిద్దఱుపుత్రులనుగనె తామ్రయనునదిక్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి, శుకియనునామములచే నొప్పుచున్నయైదుగురినిగనె. వారలలోక్రౌంచిగుడ్లగూబలనుగనె. భాసికి, భాసపక్షులుబుట్టె. శ్యేనియందుమహా పరాక్రమముగలడేగలును, గద్దలును, పుట్టె. ధృతరాష్ట్రి, హంసలనుకలహంసలను, చక్రవాకపక్షులనుగనె. మఱియుశుకికినతబుట్టె నతకువినతబుట్టె ఓరామచంద్రా! వినతమహాక్రోధముగలదియై యుండుటచే దానికిమృగి, మృగమంద, హరి, భద్రమద, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, మఱియుసర్వలక్షణసంపన్నయగుసురస, యనునీపదుగురు కొమార్తెలుబుట్టిరి. పురుషోత్తముడవగునోరామచంద్రా! మృగియందుసమ

స్తములైన జింకలుబుట్టినవి. మృగమందకు ఎలుగుబంట్లును, చమరీమృగములునుబుట్టె. హరికిసింహములును, మహావేగముగల వానరములునుగలిగె. భద్రమదకు ఇరావతి యను కుమార్తెగలిగె అయ్యిరావతికి యింద్రవాహనంబైన యేనుగరాజగు నైరావతముబుట్టె. పురుషశ్రేష్ఠుఁడవగునో రాముఁడా! మాతంగికి యేనుగలుబుట్టెను. శార్దూలికికొండముచ్చులును, పెద్దపులులునుబుట్టె. శ్వేతకుదిగ్గజములుబుట్టె. ఓరాముఁడా! సురభియనుదానికి రోహిణియు, మిగులకీర్తిమంతురాలగు గంధర్వియను నిద్దఱుకుమార్తెలుగలిగిరి రోహిణికిగోవులుబుట్టె. గంధర్వికి గుఱ్ఱములుబుట్టె. ఓరామచంద్రా! సురసకు నాగములుబుట్టె. (నాగములనగా ననేక తలలుగలవియని యెఱుగునది) కద్రువకు పన్నగులుబుట్టిరి. పురుషోత్తముఁడ వగునోరామా! మనువునకుబ్రహ్మక్షత్రియ వైశ్యశూద్రులను మానవజాతిపుట్టె. అనలయందు మంచిఫలవృక్షములు సంభవించె మఱియుశుకి మనుమరాలగువినతయొక్కయు సురసచెల్లెలగు కద్రువుయొక్కయు వంశములు జెప్పెదవినుము. కద్రువకు వేయినోళ్లుగలవాఁడును, భూభారమును మోయువాఁడును, నగునాదిశేషువుపుట్టె. వినతకు,గరుడుఁడు, అరుణుడునను నిద్దరుపుత్రులుగలిగిరి. శత్రువులను సంహరించునట్టి రాముఁడా! నేను,అరుణునకును శ్యేనికినిజన్మించినవాఁడను. సంపాతికితమ్ముఁడను. నాపేరుజటాయువనిఅందురు. నీవుకావలయునని కోరుదువేని నీవువనవాసమున నున్నంతమట్టుకు సహాయము జేయుచుండెదను. ఓరామా! నాయనా! ఈయరణ్యముమిగుల దుర్గమమైనది. సమస్తములైన క్రూరమృగములకును, రాక్షసులకును నివాసస్థానమైనది. కావుననీవును లక్ష్మణుడును బైటబోవునపుడు నేనుసీతాదేవిని గాపాడుచుండెదను అనిజటాయువు రామునితోజెప్పె. అపుడుమంచిమనస్సుగల రాముఁడు ఆజటాయువును మిగులసన్మానించి మహాసంతసముతో నాలింగనముజేసికొని నమస్కరించె. మఱియునాజటాయువు తనకును రామునితండ్రికినిగల స్నేహమును బలుమారు జెప్పుచుండగవిని పరమసంతోషమును బొందుచుండె. అంతరామచంద్రుఁడు సీతాలక్ష్మణులతో గూడినవాఁడై జటాయువు తనతోగూడరాగా "మిడుతలను నగ్నియుంబోలె" విరోధులనుగాల్చుటకు పంచవటీ తీరమునకు బోయె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పదునాల్గవసర్గము గిసెను.

లక్ష్మణుడు పంచవటీతీరమునందు ఆశ్రమమునునిర్మించుట.

అంతరామచంద్రుఁడు, పలువిధములగు క్రూరసర్పములతోను, మృగములతోను నొప్పుచుండెడు పంచవటనిజేరి మిగుల తేజోవంతుఁడును, తమ్ముఁడున, నగులక్ష్మణుని జూచి యిట్లనియె

సౌమ్యుడవగునోలక్ష్మణా! మునిశ్రేష్ఠుఁడగు నగస్త్యుఁడుచెప్పిన చోప్పునమనము యీస్థలమునకువచ్చితిమి ఇదిగోచూడుము. తెస్సగపుష్పించిన యరణ్యములుగల యీదేశమేపంచవటి యనబడును. ఓతమ్ముఁడా! ఈయరణ్యమునందంతటను జక్కగాతిరిగిచూడుము. వనమునదరుగుటయందు నీవుమిగుల శక్తిమంతుడవుగదా? ఈయరణ్యమునందు ఆశ్రమమునిర్మించుకొనుటకు ఏప్రదేశము మనకందఱకును సన్నిహితముగనుండునో చూడుము. ఓలక్ష్మణా! నీకునునాకును సీతాదేవికిని మిగుల మనోజ్ఞమైనదియును, రమ్యమగువనములతో గూడుకొన్నదియును, ఉన్నతప్రదేశము గలదియును, సమిధలుదర్భలు పుష్పాలునీళ్లు సమృద్ధిగగలదియును, సమీపమునమంచి కొలనుగలదియును, నగు నొక ప్రదేశమునుజూడుము. అనియిట్లురాముఁడు జెప్పగ విని లక్ష్మణుఁడు చేతులనుముకుళించుకొని సీతాదేవిసమక్షమున రామునితోనిట్లనియె. కకుత్స్థవంశోద్భవుఁడ వగునోరామా! అన్నా! ఈయరణ్యమున నూఱుసంవత్సరములు నివసించియున్నను నేనునీవుజెప్పినకార్యమును జేయుచుందునుగాని, నేనేస్వతంత్రించిచేయను, కావుననీవుబోయి మనోజ్ఞమగుస్థలమును గనుగొనియచట యాశ్రమము నేర్పఱుచుటకు నాకనుజ్ఞయిమ్ము. అనిమహాత్ముడగు లక్ష్మణుఁడుజెప్పగవిని రామచంద్రుఁడు మిగులసంతసించి చక్కగయోచించి సమస్తలక్షణములతో గూడినయొకప్రదేశమును నిశ్చయించె. అట్లునిర్ణయించి, ఆశ్రమముగట్టుటకొఱకు ఆమనోజ్ఞమగు స్థలమును అక్రమింపఁదలచి, రాముడుతనచేతితో లక్ష్మణునిచేతులను బట్టుకొనియిట్లనియె.

సౌమ్యుడవగునోలక్ష్మణా! ఈస్థలము మిట్టపల్లములులేక సమప్రదేశముగనున్నది. మిగులశ్రీమంతమైనది. తెస్సగబూచినచెట్లతో ఒప్పియున్నది. ఈస్థలమునందుశాస్త్రోక్తముగ నాశ్రమమును ఏర్పఱుపుము. మఱియుసూర్యునితో సమానములైనవియును, మంచిసువాసన గలవియును, నగుకమలములు గలదియును, మిగులమనోజ్ఞమైనదియును, నగుకొలను సమీపమునందేయున్నది. ఇదిగోచూడుము ఓలక్ష్మణా! పరమాత్మవేత్తయగు అగస్త్యమహాముని చెప్పినట్లే, మనోజ్ఞమైనదియును, తెస్సగబూచియుం

డెడు చెట్లచేనావరింపఁ బడినదియును, హంసలచేతను, కన్నెలేడి పిట్టలచేతను, చక్రవాకపక్షులచేతను, వ్యాపింపఁబడి ప్రకాశించుచున్నదియును, నగుగోదావరి మిగుల సమీపమునందున్నది. సౌమ్యుఁడవగునో లక్ష్మణా! మృగసమూహములచే నొప్పుచున్నవియును, నెమళులయొక్క మనోహరములైన ధ్వనులచే బ్రతిధ్వనింపఁ జేయఁబడుచున్నవియును, మిగులనున్నతములైనవియును, అనేకములైన గుహలుగలవియును, తెన్నగబూచియుండెడు చెట్లచేఁ గప్పబడినవియును, నగుపర్వతములు యీస్థలమునకు మిగుల దూరమును మిగులదగ్గిరను గాక, యున్నవి-చూడుము. ఆపర్వతములయం దచ్చటచ్చటనుండెడు బంగారవుఛాయగలదియును, వెండివలెతెల్లనిరంగు గలవియును, రాగిఛాయగలదియును నగుధాతువులయొక్క ఛాయలుసమీపమునసుండెడు యేనుఁగులపై వ్యాపించుటచే, కిటికీలచే నొప్పుచున్న గోడలవలెనున్నవి, మఱియు నాపర్వతములయందు,మద్దిచెట్లు,తాటివృక్షములు, చీకటిచెట్లు, ఖర్జూరపుచెట్లు, పనసచెట్లు, పుల్లమామిడిచెట్లు, జలకదంబ వృక్షములు, నేమిచెట్లు, పొన్నచెట్లు, తియ్యమామిడిచెట్లు, అశోకవృక్షములు, తిలకవృక్షములు, సంపెగవృక్షములు, మొగలిపొదలు, పూలతోఁగు, పొదలతోను, తీఁగెలలతోనుఁగూడిన పలువిధములైన వృక్షములు, మంచిగంధపుచెట్లు. నేమివృక్షములు, కదంబచెట్లు, పార్ణాసవృక్షములు, నిమ్మచెట్లు, ఉమ్మెత్తచెట్లు, ఇనుమద్దిచెట్లు, చంద్రచెట్లు, జమ్మిచెట్లు, మోదుగచెట్లు, కలిగొట్టుచెట్లు మొదలగువృక్షము లనేకములుమిగుల రమణీయములైయున్నవి. ఓసుమిత్రానందనా! లక్ష్మణా ! ఈస్థలముమిగుల పుణ్యమును పవిత్రమునునైయున్నది. ఇచ్చటఅనేకములైన మృగములును పక్షులునుగలవు. కావునమనము యీస్థలమునందే యీజటాయువుతోఁగూడ నివసింతుము. అని రామచంద్రుఁడు లక్ష్మణునితోఁజెప్పె. అంతవైరివీరులను సంహరించువాఁడును, మిగులబలముగలవాఁడును, నగు లక్ష్మణుం డతివేగముననొకయాశ్రమమునుగట్టె. మఱియు నతివేగముగ పనులుచేయునట్టి లక్ష్మణుఁడు ఆయాశ్రమమున మట్టినిత్రవ్విగోడలుగావించి పొడవులైమిగుల గట్టిగనుండెడు వెదుళ్లనుగుంజలుగనాటి వానిపైజమ్మికొమ్మలనుబఱచి గట్టిగగట్టి తెల్లుతోను దర్భలతోను ఆకులతోను జక్కగగప్పి నేలను చదరపఱచి మిగులరమణీయమయినదియును మహాశ్రేష్ఠమైనదియుననగు విశాలమైన పర్ణశాలనునిర్మించె. అట్లునిర్మించి శ్రీమంతుడగు లక్ష్మణుడు అతివేగముగ గోదావరికిబోయి స్నానముజేసి పండ్లను బువ్వులను దీసికొని మఱలఅతివేగముగవచ్చె. అట్లువచ్చి లక్ష్మణుఁడు యథాశాస్త్రముగ వాస్తుపూజయును, శాంతియును జేసి తానునిర్మించిన పర్ణశాలను రామునకు జూపె. అంతరామచంద్రుఁడు సీతాసమేతుఁడై మిగులరమణీయమగు నయ్యాశ్రమమును జూచి మహాసంతోషమును బొంది యాపర్ణశాలయందు బ్రవేశించె. అట్లురాముడు పరమసంతోషమును బొంది, అతిస్నేహముతో లక్ష్మణునిగాఢాలింగనముజేసికొని యిట్లనియె.

శక్తిమంతుఁడవగునోలక్ష్మణా!నీవీగొప్పపనిజేసితివిగాన నేనుమిగులసంతసించితిని. దీనికొఱకు నీకివ్వవలసిన బహుమానమునకుగా, నిన్నాలింగనము జేసికొంటిని. ఓతమ్ముడా! లక్ష్మణా! నీవిట్లునాయభిప్రాయమును గనుగొని నాకిష్టమైన పనులను దెలిసికొనిచేయుట, ధర్మముదప్పక నటించుచుండుటచే ధర్మస్వభావుఁడగు నాతండ్రిజీవించియున్నట్లైయున్నది. అనియిట్లుజితేంద్రియుడును, లక్ష్మివర్ధనుడును, నగురాముఁడు లక్ష్మణునితోఁజెప్పి నానావిధధములగు ఫలములుగల యాపంచవటీతీరమున మిగులసుఖముగానుండె. మఱియుధర్మాత్ముఁడగు రాముఁడు, సీతాలక్ష్మణులచే సేవింపఁబడిన వాఁడగుచు "స్వర్గలోకమునందు దేవేంద్రునివలె" కొంతకాలము మిగులసుఖముగనుండె.

ఇట్లు శ్రీమదారణ్య కాండమునందలి పదునైదవసర్గముగిసెను.

హేమంతఋతువుయొక్క లక్షణములనులక్ష్మణుడు రామునకు దెలియజెప్పుట

అట్లుమహాత్ముడగు రాముడుమహాసుఖముగ నాపర్ణశాలయందుండగ శరత్కాలముగడచె. అంత కామినీకాముకులకత్యంత ప్రియమగు హేమంతము సంప్రాప్తమయ్యె. అట్టియెడనొకనాడు తెల్లవారిరాముఁడు స్నానముజేయుటకై మిగలమనోజ్ఞమగు గోదావరికిబోయె, అప్పుడు మహాశౌర్యవంతుఁడును, తమ్ముఁడును, నగులక్ష్మణుఁడు మహావినయముతో గూడుకొన్నవాడగుచు చెంబుచేతబట్టుకొని సీతాదేవితోఁగూడ నారాముని వెంబడించిపోవుచు, రామునితోనిట్లనియె.

ప్రియముసేజెప్పునట్టి రాముఁడా! అన్నా! నీకుమిగుల సంతోషకరమైనదియును, సంవత్సరమునకంతయు శుభకరమైనదియును, మిగులనలంకృతమైనదియును, నగుహేమంతఋతువు సంప్రాప్తమైనది కావుననిప్పుడు మానవులశరీరములు బిఱుసుబారియున్నవి. భూమిపైరులచే నొ

ప్పచున్నది. నీళ్లు పయోగింపదగకున్నవి. అగ్ని మిగుల మనోజ్ఞముగ బ్రకాశించుచున్నది. సత్పురుషులు, నూతనధాన్యములను భుజించుటకు పూర్వము జేయవలసిన ఆగ్రయణ పూజలచేత బితృదేవతలను తృప్తిపొందించి, యుక్తసమయమున వాయాగమును జేసినవారై పాపరహితులగుదురు. గ్రామములయందిపుడు ఆవుపాలు విశేషముగ దొఱకును. సమస్తపదార్థములును సమృద్ధిగనుండును. వైరులను జయింప గోరునట్టి రాజులు యుద్ధయాత్రలయందు దిరుగుచుందురు. అన్నా! రామచంద్రా! సూర్యుఁడు దక్షిణపు దిశయందుండుటచే నుత్తరపుదిక్కు "నుదుటిబొట్టులేని స్త్రీవలె" ప్రకాశహీనమైయున్నది. మఱియు స్వభావముచే మంచుగడ్డలతో నిండియుండెడు హిమవంతము, ఇప్పుడు దక్షిణాయనమువలన సూర్యునకు మిగులదూరమై పోవుటచేత మంచుమఱియునధికమై సార్థకనామముగలదిగనున్నది. ఓరామా! అన్నా! ఈదినములలో మధ్యాహ్నమునందు యెండగాయుటచే మిగులసౌఖ్యముగనున్నది ఈ దినములయందు సూర్యునియొక్క యెండమిగుల మనోజ్ఞముగనుండుటచే నాసూర్యుడు యిపుడుజనులకు మిగుల యిష్టుఁడు. ఈకాలమునందు నీడయునీళ్లునుమిగుల నయిష్టముగనున్నవి. ఇప్పుడుసూర్యుఁడు వేడితక్కువవాడై మిగుల నెమ్మదిగనున్నాఁడు ఈదివసములు మంచుతో మిశ్రితమైయున్నవి. చలియెక్కువగనున్నది. గాలిప్రబలముగనున్నది. అరణ్యములయందుండు జనులుఅరణ్యములను వదలియున్నారు. చెట్లన్నియు మంచుచేగప్పఁబడియున్నవి. పుష్యమాసమువచ్చినది. బైటబండుకొనుటకు శక్యముగాదు ఇప్పుడు రాత్రులు మంచుచేధూమ్రవర్ణములైనవిగను, మిగులచలితో గూడినవిగను, హెచ్చుప్రొద్దు గలవిగనుఉన్నవి. చంద్రునియందున్న మనోజ్ఞతయిప్పుడు సూర్యునియందు జేరినది చంద్రుఁడిపుడుమంచుచే నెఱ్ఱిమండలముగలవాఁడై "నిట్టూర్పులవలనబ్రకాశమునువదలిన యద్దమువలె" బ్రకాశింపకున్నాఁడు. పున్నమనాడుగూడ చంద్రుఁడుమంచుతో మిశ్రితమైయుండుటచే "ఎండచేవాఁడు చామనల్లనైన శరీరముగల సీతాదేవివలెనే" ప్రకాశింపకున్నాఁడు. మఱియు ప్రకృతిచేతనే మిగులచల్లనిదియును, యిపుడు మంచుదగులుటచే నుదయకాలమునందు రెండింతలచల్లదనముగలదియును, నగుపడమర (ఉత్తరపశ్చిము దీనినేకొండగాలియందురు) గాలిగొట్టుచున్నది. సూర్యుడు ఉదయించునపుడు అరణ్యములు, మంచుకణములతో గూడుకొన్నవియును, పండియుండెడు యవలుగోధుమలు గలవియును, మనోజ్ఞముగ గూయుచుండెడి క్రౌంచసారస పక్షులతో గూడినవియునునై మిగుల దేజరిల్లుచున్నవి. ఓఅన్నా! రామా! లెస్సగపండియుండుటచే బంగారపుకాంతివంటి కాంతిగలవరిపైరులు, ఖర్జూరపుష్పములవంటి యాకారముగల గింజలతోనిండియుండెడు కంకులుగలవియై భారాతిశయముచే కొంతవంగి ప్రకాశించుచున్నవి. మఱియుసూర్యకిరణములు చల్లనిమంచు తుంపురులచేగప్పఁబడి యుండుటచేతను, మిగులదూరమున నుదయించుటచేతను, సూర్యుఁడుచంద్రునివలె చూడనలవియై మిగులచల్లగనున్నాడు. ఎండఅన్ననో, ప్రాతఃకాలమునందు వెన్నెలవలె తీక్ష్ణములేనిదియును, మధ్యాహ్నమునందు సుఖస్పర్శగలిగి కొంచెముయెఱ్ఱగను కొంత తెల్లగనున్నదియునునై ఒప్పుచున్నది వనభూమిమంచు గురియుటచేతకొంత తడిసినదియును, లేతయెండచే నొప్పుచున్నదియునునై ప్రకాశించుచున్నది. ఓఅన్నా! రామచంద్రా! అరణ్యమునందుండెడు యేనుఁగులుమిగుల దప్పికొన్నవియై మిగుల నిర్మలమగు చల్లనియుదకములను తొండముతోదాకి శీతమునకు తాళజాలకతొండమును మఱలవెనుకకు తీసుకొనుచున్నవి. జలచరములగు పక్షులుఏటిగట్టుననుండి "వీరులుగాని వారురణరంగమునకువచ్చి భయపడియూరకుండునట్లు" నీటియందుప్రవేశింపక యూరకున్నవి అరణ్యములయందు మంచుగురియుటచేఅందలివృక్షములు మంచునీళ్లను చీకటిచేగప్పఁబడి నిశ్చలములైనవై పూలులేకయుండుటచేకండ్లుమూసుకొని నిద్రించుచున్నవానివలె గాన్పించుచున్నవి. ఇపుడు, నదులలోనుండు నీళ్లు, మంచుతుంపురులచేగప్పఁబడి యుండుటవలన ధ్వనులనుబట్టి సారసపక్షులిచట యున్నవని తెలియబడుచున్నవి తీరములయందుండెడి యిసుకమంచువలన దడుపబడియున్నది. మఱియువిశేషముగ మంచుగురియుటచేతను, సూర్యుఁడుమిగుల నెమ్మదిగనెండగాయుటచేతను చలిచేతను, మిగులలోతుగ నుండెడుసరోవరములయందుండు నీళ్లుగూడ పానముజేయుటకు శక్యముగాకయున్నది. తామరపూలులెస్సగ పూచిముసలితనమువచ్చుటచేత కింజల్కములన్నియు రాలిపోయి నమమునుండుదిన్నెలు మాత్రమున్నవై మంచువేగముచే మిగుల క్షీణించి కాడలుమాత్రముగలవియై యుండుటవలన తామరకొలనులు ప్రకాశములేకయున్నవి. ఓరామచంద్రా! ఇప్పుడు, ఉత్తమపురుషుఁడును, ధర్మాత్ముఁడును, నగుభరతుఁడు పట్టణమునందున్నవాడయ్యును మిగులవ్యసనపీడితుడై నీయందలిభక్తిచే తపస్సు జేయుచుండును. అతను ప్రభుత్వమును మానమును నానావిధములగు ననేకభోగములనువిడిచి మునివృత్తియందుండి నియతాహారుఁడై యా

స్తరణముపయోగింపక చల్లనివట్టి నేలపైబరుండును. ఆభరతుఁడునిత్యమును యి దేసమయమున నిద్రలేచిపౌరజనులచే సేవింపఁబడుచు సరయూనదికి స్నానమునకుబోవును. మఱియు మహాసౌఖ్యముపఁ బెఱిగినవాఁడును, మిగులసుకుమారుడును సుఖమనుభవింపఁ దగినవాఁడును, నగుభరతుఁ డిట్టికాలమున వేకువఝామునసే సరయూనదియం దెట్లు మునుగును ఓఅన్నా! రాముఁడా! తామరతేకులవంటి నేత్రములుగలవాఁడు, సుమహాశౌర్యవంతుఁడును, నీలమేఘవర్ణుఁడును, సన్ననినడుముగలవాఁడును, మహాత్ముఁడును, ధర్మవేత్తయును, సత్యవాదియును, సిగ్గులేనివాఁడును, జితేంద్రియుడును ఎల్లవారలకును ప్రియము నేవచించువాఁడును, మనోహరముగమాట లాడువాఁడును, సుందరవిగ్రహుఁడును. ఆజానుబాహుఁడును, విరోధులగర్వమడచువాఁడును నగు నాభరతుఁడు నానావిధములైన సుఖములనువిడిచి తనపూర్ణహృదయముతో నిన్నేగొలుచుచుండును ఇదియునుగాక నీవుఅరణ్యమునముని వేషముదాల్చియున్నను, మిగులపూజ్యమైన స్వభావముగలవాఁడును, నీతమ్ముఁడును, నగుభరతుఁడు పట్టణమునందుండియే మునివేషము నవలంబించినిన్ననుసరించుటచే స్వర్గలోకమును జయించియున్నాడు. శ్లో॥ నపిత్ర్యమనువర్తంతే మాతృకంద్విపదాఇతి॥ లోకమునందుజనులు తల్లియభిప్రాయమునే గ్రహింతురుగాని తండ్రియభిప్రాయమును గ్రహింపరనెడి లోకోక్తిభరతునియందు వేఱువిధముగనున్నది. అనగాభరతుఁడు తల్లిమాట ననుసరించిరాజ్యసుఖముల ననుభవింపక తండ్రిమతమునే యనుసరించియున్నాఁడు. అయ్యో! కైకేయికిటువంటి క్రూరబుద్ధియెట్లు గలిగెనో? ఈకైకేయియొక్క భర్తయగు దశరథమహారాజును, పుత్రుఁడగుభరతుఁడును, మిగులసజ్జనులు. అనియిట్లుధర్మవిచారుడగు లక్ష్మణుఁడతిస్నేహముతో జెప్పుచుండగ రాముఁడువిని, తల్లియగుకైకేయిని లక్ష్మణుఁడు నిందించుటనుఓర్వక రాముఁడు లక్ష్మణునితో మఱలనిట్లనియె

నాయనా! లక్ష్మణా! తల్లియగుకైకేయిని నీవెంతమాత్రమును నిందింపరాదు ఇంతకుమునుపునీవుజెప్పుచుండినట్లయిక్ష్వాకువంశోద్భవుఁడగు భరతునియొక్క కథయే జెప్పుము. లక్ష్మణా! దృఢవ్రతుఁడనై వనవాసముజేయుటయందు నిశ్చయింపఁబడిన బుద్ధిగలవాఁడనగు నామనస్సుభరతునియందలి స్నేహబలమువలన నతనిజ్ఞాపకమునకు వచ్చునప్పుడెల్లమిగుల తల్లడిల్లుచున్నది. మఱియుమిగుల ప్రియములును, మనోజ్ఞములైనవియును, అమృతతుల్యములైనవియును, మనస్సునురంజింపఁ జేయునవియును నగుభరతుని వాక్యములనుదలచెదను. ఓలక్ష్మణా! నేనుమహాత్ముఁడగు భరతునితోను, మహాశౌర్యవంతుఁడగు శత్రుఘ్నునితోను, సీతతోనుగూడినవాఁడనై యుండగలను. అనియిట్లు రాముడుచెప్పివిలపించుచు గోదావరీనదికిబోయి సీతాలక్ష్మణసమేతుఁడై స్నానమును జేసె. అట్లుస్నానమును జేసి సీతారామలక్ష్మణులు శుద్ధోదకములచే పితృదేవతలకును దేవతలకును దర్పణంబుజేసి, ఉదయించినసూర్యుని మఱియు సమస్తదేవతలనుగూర్చి యేకాగ్రచిత్తులైస్తుతించిరి. అట్టియెడ రాముఁడు స్నానమునుజేసి సీతాలక్ష్మణసమేతుఁడై యుండి "నందికేశ్వరునితో గూడినవాఁడును భగవంతుఁడును జగత్ప్రభుడును నగుపరమేశ్వరునివలె" మిగులఁ బ్రకాశించుచుండె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పదునారవసర్గ ముగిసెను.

(*)

శూర్పణఖయనురాక్షసి రామలక్ష్మణులనుతనతో గ్రీడింపుమనిచెప్పుట.

అట్లుస్నానమును జేసి ప్రాతఃకాలకృత్యములను దీర్చుకొని రాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై గోదావరీతీరముననుండి తనయాశ్రమంబునకువచ్చె. అట్లుఆశ్రమమునకువచ్చి రాముఁడులక్ష్మణసమేతుఁడై పూర్వాహ్ణమునందు జేయవలసినకార్యములను దీర్చికొనిపర్ణశాలయందు ప్రవేశించె. రాముఁడుపర్ణశాలఁజొచ్చి యచటిమునులచేమిగుల సన్మానింపఁబడినవాఁడై సుఖముగనుండి లక్ష్మణునితో పలువిధములగు గథలనుజెప్పుచుండె అట్లురాముఁడు సీతాదేవితోగూడ పర్ణశాలయందు గూర్చున్నవాఁడై "చిత్తానక్షత్రముతో గూడినచంద్రునివలె" జేదీప్యమానముగ ప్రకాశించుచుండె. ఇట్లురామలక్ష్మణులు మిగుల నుల్లాసముగమాట లాడుచుగూర్చుండి యుండగనకస్మాత్తుగ నొకరాక్షసి యచటికివచ్చె. అది రావణాసురునిచెల్లెలు శూర్పణఖయను పేరుగలది. ఆరాక్షసిమిగుల సమీపమునకువచ్చి దేవసమానుండగు రామునిజూచె. మఱియుసింహమునకువలె విశాలమైన ఱొమ్ముగలవాఁడును ఆజాను బాహుడును, తామరతేకులవంటి నేత్రములుగలవాఁడును, మిగులఁబ్రకాశించుచుండెడి ముఖముగలవాఁడును, చూచువారలకు మిగులసంతోషమును గలుగఁజేయువాఁడును, మదగజముయొక్క నడకవంటినడకగలవాఁడును. విశేషముగజడలు దాల్చినవాఁడును, బహుమృదువగు శరీరముగలవాఁడును, మిగులబలము గలవాఁడును, రాజచిహ్నములతో గూడినవాఁడును, నల్లగలువ

లవలె శ్యామలవర్ణముగలవాఁడును, మన్మథునితో సమానుఁడును, దేవేంద్రునితో సమానమైనవాఁడును, నగు రాముని జూచి యాశూర్పణఖయను రాక్షసి మన్మథోద్రేకమును బొందె. అట్లు మన్మథవికారముగలదియై, వికారమైనముఖముగలదియును, బలిసిననడుమును పెద్దకడుపును గలదియును, వికృతములగు నేత్రములుగలదియును, రాగివర్ణమైన వెంట్రుకలుగలదియును, వికృతాకారము గలదియును, భయంకరమైనకంఠధ్వనిగలదియును, గ్రామ్యములగు మాటలనుమాట్లాడునదియును, మిగులదురాచారము గలదియును, భయంకరాకారముగలదియునునగు నాశూర్పణఖ, సుందరమైన ముఖముగలవాఁడును, సన్ననినడుముగలవాఁడును, విశాలములైన నేత్రములుగలవాఁడును, సొగసైన తలవెండ్రుకలుగలవాఁడును, చూచువారలకు సంతోషమునుగలుగఁజేయు నాకారముగలవాఁడును, వినుటకింపైన కంఠస్వరముగలవాఁడును, యౌవనవంతుఁడును, చతురుఁడును, శాస్త్రసమ్మతమైన యాచారముగలవాఁడును, ఎల్లవారలకు ప్రీతిగలవాఁడును, నగురామునిజూచి మోహపరవశురాలై యిట్లనియె.

నీవుతాపసరూపమున జటావల్కలములను దాల్చి, ధనుర్బాణములనుధరించి భార్యాసమేతుఁడవై రాక్షసులు సంచరించెడు యీప్రదేశమున కెట్లువచ్చితివి? నీవిచ్చటికేమిపనిగావచ్చితివి? నీవృత్తాంతమంతయును యథార్థముగ నాకెఱిగింపుమనిచెప్పె. అంతశత్రువుల గర్వమడచునట్టి రాముఁడు కపటములేనివాఁడగుటచే దనసమాచారమంతయుసవిస్తరముగ జెప్పుటకారంభించె. ఏలనగా రాముఁడొకప్పుడును నబద్ధమాడడు మఱియుదపోధర్మమునసందున్నపుడును స్త్రీజనసమీపమునందును నసత్యమాడడనిచెప్పనేల? కావున తనవృత్తాంతమంతయు విశదముగ జెప్పనారంభించె. ఓఆడదానా! దేవతాపరాక్రమమువంటిపరాక్రమముగలదశరథుఁడను నొకరాజుండెను. నేనాదశరథమహారాజుయొక్క జ్యేష్ఠపుత్రుఁడను నాపేరురాముఁడందురు. ఇతఁడు నాతమ్ముఁడగు లక్ష్మణుఁడు. ఇతఁడునన్ననుసరించియేయుండును. ఈస్త్రీరత్నము విదేహదేశపురాజగు జనకమహారాజుకూతురు. నాభార్య సీతయనుపేరుగలది. నేను నాతండ్రియైన దశరథమహారాజుయొక్కయు, నాతల్లియగు కైకేయియొక్కయు, ఆజ్ఞకుబద్ధుఁడనై పితృవాక్యపరిపాలనరూపంబగు ధర్మమును నెరవేర్పగోరి యీయరణ్యమునకువచ్చితిని. నీవెవ్వరో తెలిసికొనగోరుచున్నాను. నీవెవ్వతెవు? ఎవ్వనికూతురవు? చెప్పుము. ఇంతమనోహరాకృతిగల నీవురాక్షసస్త్రీవని నాకుదోచలేదు. నీవు యిక్కడికెందుకొఱకువచ్చితివి? నీవృత్తాంతమంతయు సవిస్తరముగజెప్పుమనిరాముఁడడిగె. ఆమాటలువిని శూర్పణఖమదనబాధచేబీడింపఁబడినదైయిట్లనియె.

ఓరాముఁడా! నాయథార్థస్థితిని నీకువాస్తవముగ దెల్పెదనువినుము. నేనుశూర్పణఖయనుపేరుగలరాక్షసిని. కోరినరూపమునుధరించుదానను. నాపేరన్ననెల్లవారికిని మహాభయము నేనొంటరిగనీయరణ్యమునందు దిరుగుచుందును. మహాబలముగలవాఁడును, శౌర్యవంతుఁడును, విశ్రవస్సుయొక్క కుమారుఁడును, రావణాసురుఁడను పేరుగలవాఁడుననగు రాక్షసేశ్వరుఁడు నాకుసహోదరుఁడు. అతనిసమాచారమును నీవునువినియేయుందువు. ఇదియునుగాక మహాబలముగలవాఁడును, ఎప్పుడును విశేషముగ నిద్రించుచుండువాఁడుననగు కుంభకర్ణుఁడనువాఁడునుగూడ నాకుతోబుట్టువు. మిగులధర్మాత్ముఁడగు విభీషణుఁడనువాఁడును నాకుతోబుట్టువు. అయినను ఆవిభీషణుఁడు రాక్షసకృత్యములను జేయఁడు మఱియు యుద్ధమునందు బ్రఖ్యాతికెక్కిన మహాబల పరాక్రమశాలులగు ఖరదూషణులను రాక్షసులుగూడ నాకుతోబుట్టువులేయగుదురు. రాముఁడా! నేనునిన్నుజూచినతోడనే నాతోబుట్టువులగు వారినందఱినివిడిచి పురుషశ్రేష్ఠుఁడవగు నిన్నుపెనిమిటిగఁజేసికొనవలయునని మనస్సునందు దలచియున్నాను. నేను మిగులమహిమగలదానను నాయిష్టముచొప్పున బలమునందువృద్ధిబొందుదానను. నిరంతరము నీవునాకు పెనిమిటివగుము. ఈసీతతో నేమిప్రయోజనమున్నది. ఈసీతవికృతాకారముగలదిగను, విరూపిగను, నున్నది. నేనునీరూపయౌవన సౌందర్యములకుఁ దగినదానను. నన్నుభార్యనుగాగైకొనుము. వికారమైన యాకారముగలదియును, దురాచారముగలదియును. భయంకరాకారము గలదియును, వ్రేలాడుచుండుకడుపుగలదియును, మనుష్యస్త్రీయును, నగునీసీతనునీతమ్మునితోగూడభుజించెదను. నామనోహరుఁడా! అంతనీవునాతోగూడ పర్వతాగ్రములయందును, నానావిధములగునరణ్యములయందునుదిరుగుచు యీదండకారణ్యమున సంచరింపవచ్చును. అనియిట్లుమహానుదముతోగూడిన కన్నులుగల శూర్పణఖజెప్పె. అంతమాటలాడుటయందు నేర్పరియగురాముడువిని నవ్విశూర్పణఖనుజూచియిట్లనిచెప్పదొడంగె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పదునేడవసర్గము గిసెను

లక్ష్మణుడు శూర్పణఖయొక్క ముక్కు చెవులు గోయుట.

అంత రామచంద్రుడు, మన్మథోద్రేకముగల శూర్పణఖను జూచి మిగుల స్పష్టమును, మధురమును, నగు మాటలతో నవ్వుచు నిట్లని చెప్పె

ఓ శూర్పణఖా! నాకు వివాహమైనది. ఈ స్త్రీ నా ధర్మపత్ని. ఈ సుందరియందు నాకు మిగుల ననురాగము గలదు. నీవంటి స్త్రీలకు సవతితో గూడ నుండుట మిగుల దుఃఖకరము. ఇతడు నా తమ్ముడు. ఇతని పేరు లక్ష్మణుడు. సదాచారసంపన్నుడు. చూచువారలకు మిగుల సంతోషమును బుట్టించువాడు. మిగుల కాంతిమంతుడు. భార్యాసమేతుడై రాలేదు. మహాశౌర్యవంతుడు. ఈ లక్ష్మణుడిదివరకెప్పుడును భార్యతో సుఖమనుభవించిన వాడు గాడు. భార్యను గోరుచున్నవాడు మిగుల వయోవంతుడు. సుందరవిగ్రహుడు. నీరూపసౌందర్యములకు దగినవాడై నీకు పెనిమిటియగును. శ్రేష్ఠములగు పిఱుదులుగలదానవును, విశాలములైన నేత్రములుగలదానవును నగు నో శూర్పణఖా! సవతిలేనిదానవై నా తమ్ముడగు నీ లక్ష్మణుని, "మేరుపర్వతము సూర్యుని కాంతిని బొందినట్లు" నీవు భర్తగా గైకొనుము. అని రాముడు జెప్పగవిని మన్మథోద్రేకముగల యా శూర్పణఖ యతి వేగముగ రాముని విడిచి లక్ష్మణుని తట్టు తిరిగి చూచి యతనితో నిట్లనియె.

ఓ లక్ష్మణుడా! మహాసుందరాంగియగు నేను నీ వయోరూపములకు దగినదానను భార్యను. నీవు నాతో గూడి దండకారణ్యము నందెల్లెడలను సంచరింపుచుందము, అని శూర్పణఖ జెప్పె. అంత వాక్యవిశారదుడగు లక్ష్మణుడు నవ్వుచు చేటలవంటి గోళ్లుగల శూర్పణఖను జూచి మిగుల యుక్తమగు మాటలతో నిట్లనియె.

తామరఱేకులవంటి నేత్రములుగల యో శూర్పణఖా! నేను నా యన్నయగు రామునికి పరిచారకుడను. నీవు పరిచారకుండనగు నాకు భార్యవైతివేని నీవు గూడ దాసిగా నుండవలయు. విశాలములగు నేత్రములుగల యో శూర్పణఖా! నీవు మిగుల సుందరమగు శరీరముగల దానవు. సమృద్ధిమైన యుపయోగముగలవాడును పూజ్యుడును నగు రామునకు రెండవ భార్యవై యీ డేరినకోరికగలదానవై మిగుల సంతోషమును బొందియుండుము. అట్లుంటివేని యీ రాముడు వికారమైన ఆకారము గలదియును, దురాచారప్రవర్తకురాలును, చూచువారలకు వెఱపును గలిగించునదియును, కృశించినకడుపుగలదియును, ముసలిదియును, నగు నీ భార్యను విడిచి నిన్నే బొందగలడు. మహార్హమైన దేహచ్ఛాయగలదానా! శ్రేష్ఠములగు పిఱుదులుగల శూర్పణఖా! మిగుల ధీమంతుడగు వాడెవ్వడైన నిట్టి సుందరాకారముగల నీవంటి స్త్రీని విడచి మనుష్యస్త్రీలయందు మనస్సు నుంచునా? ఉంచడు. కావున నీవు రాముని యొద్దకే పొమ్ము. అని లక్ష్మణుడు జెప్పె. అంత భయంకరాకృతిగలదియును, పెద్దపొట్టగలదియును, అపహాస్యమెట్టిదో తెలియనిదియును, నగు శూర్పణఖ లక్ష్మణుడు జెప్పిన మాట నిశ్చయమని తలచె. అట్లు దలచి మన్మథావేశము నొంది యా శూర్పణఖ, సీతాసమేతుడై పర్ణశాలయందు గూర్చుండియున్నవాడును, విరోధుల గర్వమడంచువాడును, శత్రువులకు నెదిరింప నలవిగానివాడును, నగు రాముని జూచి యిట్లనియె.

ఓ రాముడా! నీవు, వికారమైన యాకారముగలదియును, దురాచారప్రవర్తకురాలును, కృశించిన కడుపుగలదియును, మిగుల ముసలిదియును, నగు భార్యయందు ప్రీతిగలవాడవై నన్ను గౌరవింపకున్నావు. కావున నిప్పుడు నీకన్నుల యెదుటనే యీ మానవస్త్రీని భక్షించెదను. అట్లు భక్షించితినేని సవతిపోరు లేక నీతో గూడి యిష్టోపభోగముల ననుభవించుచుండెదను. అని యిట్లు శూర్పణఖ రామునితో జెప్పి కొఱవులవంటి కన్నులుగల యా శూర్పణఖ మహాకోపమును బొంది జింకపిల్లయొక్క నేత్రములుగల సీతాదేవిపైకి "ఘోరగ్రహము రోహిణిపై కురుకునట్లు" పరుగెత్తె. అపుడు మహాబలుడగు రాముడు, అట్లు మృత్యుపాశముతో సమానముగ వచ్చుచున్న శూర్పణఖను జూచి, మహాకోపమును బొందినవాడగుచు నిలువు నిలువుమని యదల్చి లక్ష్మణుని జూచి యిట్లనియె.

సౌమ్యుడవగు నో లక్ష్మణా! దురాచారప్రవర్తకులును, మిగుల క్రూరులును, నగువారితో నెంతమాత్రము పరిహాసమాడదగదు. ఇప్పుడెవ్విధముచేతైనను సీత బ్రతికియుండు నుపాయము వెదకుము. పురుషోత్తముడవగు నో లక్ష్మణా! వికారస్వరూపము గలదియును, దురాచారప్రవర్తకురాలును, మిగుల గర్వించినదియును, పెద్దకడుపు గలదియును (అనగా బలిసిన నడుముగలదియును) నగు నీ రాక్షసస్త్రీని విరూపినిగా జేయుమని చెప్పె. అంత మిగుల బలపరాక్రమశాలియగు లక్ష్మణుడు మహాకుపితుడై రాముని ప్రక్కనున్న ఖడ్గమును దీసికొని యా శూర్పణఖయొక్క ముక్కును చెవులను గోసె. అంత మహా భయంకరాకారముగల శూర్పణఖ మిగుల భయంకరంబగు వికారస్వరముతో హోరుమని యేడ్చుచు తాను వచ్చిన మార్గముననే యరణ్యమునకు బరుగెత్తిపోవె. మఱియు మహాభయంకరా

కారముగల నా శూర్పణఖ అట్లు అంగవిహీనురాలై రక్తప్రవాహములో మునిగి "వానకాలమునందలి మేఘమువలె" నానావిధములుగ గూయుచుం బోయెను. మఱియు నఘోరమగు రూపుగల యా శూర్పణఖ, నెత్తురు గ్రొల్లునదై పారఁ జేతులతో గట్టిగబట్టుకొని హోరుమని గొంతెత్తి యేడ్చుచు దండకారణ్యమునందు బ్రవేశించె. అట్లు శూర్పణఖ యడవియందు బ్రవేశించిపోయి జనస్థానమునందున్నవాఁడును, మహాభయంకరాకారుఁడును, తోఁబుట్టువును, నగు ఖరుని యొద్దికిఁబోయి "మహాధ్వనితో నాకాశము నుండి పిడుగుబడినట్లు" హోరుమని యేడ్చుచు దుఃఖాక్రాంతురాలై నేలంబడె. అట్లు నేలంబడి కొంతసేపునకు దెలివి తెచ్చుకొని భయమోహములు జెందఁగొని రక్తము ప్రవాహమై పాఱుచుండగ రాముఁడు సీతాలక్ష్మణసమేతుడై యరణ్యమునకు వచ్చుటయును తన్ను అంగవిహీనురాలుగఁ జేయుట మొదలగు వృత్తాంతమంతయు నా ఖరున కెఱింగింప దొడగె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పదునెనిమిదవసర్గ ముగిసెను.

(*)

శూర్పణఖ ఖరునివద్దకు బోయి తన యవస్థను జెప్పుకొనుట.

అట్లు అంగవిహీనురాలును, రక్తప్రవాహమునందు మునుగుచున్నదియును, నేలంబడి పొరలిపొరలి యేడ్చుచున్నదియును, తన సహోదరియును, నగు శూర్పణఖను జూచి మహాకోపముచే దహింపఁబడినవాఁడై యిట్లనియె.

నా ముద్దులసోదరీ! ఓ చెల్లెలా! లెమ్ము దుఃఖమును విడువుము నేనడుగుదానినంతయు జెప్పుము. భయమోహములు విడువుము. ఎవ్వఁడు నిన్నిట్లు అంగవిహీనురాలుగ జేసె. సర్వమును స్పష్టముగ దెలుపుము. ఓయమ్మా! చెల్లెలా! శూర్పణఖా! అపకారము జేయనదియును, తన మార్గమున నెదురుగ వచ్చినదియును, నిరాపరాధియును, నగు కృష్ణసర్పమును వినోదార్థముగ నెవ్వఁడు కాలితో దన్ని హింసించుచున్నాఁడు? ఎవ్వఁడజ్ఞానముచేఁ గాలపాశమును గాలపాశమని తెలియక కంఠమున ధరించుచున్నాఁడు? ఎవండీశ్వరుడు నిన్ను దాకి తీవ్రవిషమును పానము జేయుచున్నాఁడు? మహాబలపరాక్రమములు గలదానవును, కోరిన చోటునకు బోవుదానవును, కోరినరూపమును ధరించుదానవును, మృత్యుసమానురాలవును, నగు నిన్నెవండిట్టి యాపద బొందించెను? ఓ చెల్లెలా! శూర్పణఖా! దేవతలలోగాని, గంధర్వులలోగాని, సమస్తభూతములలోగాని, మహాత్ములగు మునులలోగాని, యెవ్వఁడిట్టి పరాక్రమము వహించి నిన్నిట్లు అంగవిహీనురాలుగ జేసెను? మఱియు వేయికన్నులుగలవాఁడును, పాకశాసనుడును, నగు దేవేంద్రుడును, నాకప్రియము జేయఁజాలడు. అట్లుండ లోకమునం దెవ్వడు నాకపకారమును జేయును? ఓయమ్మా! చెల్లెలా! శూర్పణఖా! "నీటియందు గలసిన పాలను వెలుపలఁబెట్టి పాలను ద్రావునట్టి హంసవలె" ప్రాణంబులను దీయునట్టి బాణములచే నేనిప్పుడు ఎవరి ప్రాణములను దీయవలయును. మఱియు నెవ్వడు నాచేత యుద్ధమునఁ జంపఁబడవలయును, పక్షులు గుంపులు గూడి యెవని దేహమునందు మాంసమును భక్షింపగలవు? ఎవ్వఁడు యుద్ధమునందు బాణములచే ఛేదింపఁబడిన జీవస్థానములు గలవాఁడై చచ్చును? ఎవని యొక్క యెఱ్ఱనిదియును, నురుగతో గూడినదియును, నగు నెత్తురును భూమి పానము జేయును? మఱియు నేనిపుడట్టివానితో యుద్ధమునకు దలపడుదు నేని దేవతలుగాని, గంధర్వులుగాని, పిశాచములుగాని, రాక్షసులుగాని, కాపాడజాలరు. ఓ శూర్పణఖా! ఏదుర్మార్గుడరణ్యమునందు మిగులపరాక్రమించి నిన్ను హింసించెను? నీవు నెమ్మదిగ తెలివి దెచ్చుకొని నిన్ను హింసించినవానిని నాకెఱిగింపుము. అనియిట్లు ఖరుడు మహాకోపమును బొందినవాఁడై యడిగె. అంత శూర్పణఖ మిగుల వ్యసనముతో గొంతెత్తి యేడ్చుచు నిట్లనియె.

ఓ అన్నా! ఖరుడా! మిగుల వయోవంతులును, మహాసుందరవిగ్రహులును, మహాసుకుమారులును, మిగుల బలవంతులును, తెల్లతామరవలె విశాలములను నేత్రములుగలవారును, నారచీరెలును జింకచర్మములనే వస్త్రములుగాగలవారును, కందమూలఫలములను భక్షించువారును, ఇంద్రియనిగ్రహము గలవారును, తపస్సుజేయువారును, ధర్మమును జేయువారును, దశరథమహారాజ పుత్రులును, నగు రామలక్ష్మణులను వారిద్దరన్నదమ్ములుగలరు. వారు గంధర్వరాజుతో సమానులుగను, రాజలక్షణములు గలవారుగనున్నారు. వారు దేవతలో మానవులో నిశ్చయింపనాకలవిగాదు. ఇదిగాక మిగుల వయోవంతురాలును, మహాసౌందర్యవతియును, సమస్తములైన యాభరణములచే నలంకృతంబైనదియును, సన్నని నడుముగలదియును, నగు నొక స్త్రీ వారిద్దఱి నడుమనుండగా జూచితిని. ఓ యన్నా! ఖరుడా! ఆ స్త్రీ కొఱకే వారిద్దఱును గూడి నన్ను దిక్కులేనిదానివలె యీయాపదను బొందించిరి కావున యుద్ధరంగమున జంపఁబడిన రామలక్ష్మణుల యొక్కయు, సీతయొక్కయు నురుగతో గూడిన రక్తమును నేపానముచేయగోరెదను. నాయనా! అన్నా! ఖరుడా! నేను, నాలనయు

ధ్ధమునజంపి వారిముగ్గురి రక్తమును పానముజేయవలయును. ఇది నాకు ముఖ్యమైన కోరిక. దీనిని నీవు సఫలముగ జేయవలయును. అని శూర్పణఖ జెప్పె. అంత ఖరుడు విని మహాకోపమును బొంది "యమధర్మరాజువలె" మహాబలవంతులగు రాక్షసులను పదునాలుగుమందిని జూచి యిట్లనియె.

ఓ రాక్షసశ్రేష్ఠులారా! ఇద్దఱు మనుష్యులు నారచీరెలను కృష్ణాజినములను ధరించి ఆయుధములతో గూడినవారై యొక స్త్రీని వెంటబెట్టుకొని మహాభయంకరమగు దండకారణ్యమున బ్రవేశించియున్నారు. మీరు బోయి వారిలిద్దఱిని, మఱియు దురాచారురాలగు నా స్త్రీని గూడ జంపిరండు. వారల రక్తమును నా సహోదరియగు నీ శూర్పణఖ పానము జేయగోరుచున్నది. ఓ రాక్షసులారా! మీ పరాక్రమము వలన వారిమువ్వురిని వధించి నా సహోదరియగు నీ శూర్పణఖ యిష్టమును నెరవేర్పుడు. అని ఖరుడు ఆ పదునలుగురు రాక్షసుల కాజ్ఞాపించెను. అట్లు ఖరుల చే నాజ్ఞాపింపబడిన యా పదునలుగురు రాక్షసులును "వాయువు చే గొనిపోబడిన మేఘములవలె" మహావేగముగ నా శూర్పణఖతో గూడ రాముని యాశ్రమమునకు బోయిరి. ఆ రాక్షసులు మహాకఠినబాణములుగలవారయ్యును. మహాతేజస్సుగలవాడును, వారిని జూచి లేచినవాడును, నగు రాముని జూచి "కార్చిచ్చుపైకి నశవిమేనుగులురుకునట్లు" పైకిబోవుచుండిరి.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి పందొమ్మిదవ సర్గ ముగిసెను.

రాముడు ఖరునిచే బంపబడిన పదునాలుగుమంది రాక్షసులను సంహరించుట

పిమ్మట మహాభయంకరురాలగు నా శూర్పణఖ రాముని యాశ్రమమునకు బోయి సీతారామలక్ష్మణులను యా రాక్షసులకు జూపె. అప్పుడా రాక్షసులు విదేహరాజపుత్రికయగు సీతాదేవితోడను, లక్ష్మణునితోడను పర్ణశాలయందు గూర్చుండియున్నవాడును, మిగులబలముగలవాడును, నగు రాముని జూచిరి. అంత శ్రీమంతుడగు రాముడట్లు వచ్చిన రాక్షసులను, శూర్పణఖను, జూచి మహాకాంతిమంతుడగు లక్ష్మణునితో నిట్లనియె.

ఓ సుమిత్రానందనా! లక్ష్మణా! నీవు కొంచెము సేపు సీతదగ్గరనుండుము. నేను పోయి అదిగో శూర్పణఖతో గూడ వచ్చుచుండెడి రాక్షసులను చంపివచ్చెదను అని పరమాత్మవేత్తయగు రాముడు జెప్పె. అంత లక్ష్మణుండట్లనే కానిమ్మని రాముని మాటను మిగుల గౌరవించె. అంత మహాధర్మాత్ముడగు రాముడు బంగారుచే నలంకృతంబైనదియును, మిగుల గొప్పదియును, నగు విల్లెక్కుబెట్టి యా రాక్షసులను జూచి యిట్లనియె.

ఓ రాక్షసులారా! మేము దశరథమహారాజు పుత్రులము. రామలక్ష్మణులను పేరుగలవారము. నా భార్యయగు సీతతో గూడ దుర్గమమగు నీదండకారణ్యమున బ్రవేశించితిమి. అట్లు బ్రవేశించి కందమూలఫలములను దినుచు, జితేంద్రియులమై తపస్సు సేసికొనుచు ధర్మమును దప్పక దండకారణ్యమున నివసించియున్నాము. మమ్ములహింసించెదరు. నేనీ యరణ్యముననుండెడు మునుల యాజ్ఞవలన సత్పురుషులను హింసించువారును, మిగుల పాపాత్ములు నగు మిమ్ములను మహాయుద్ధమునందు సంహరించుటకొఱకు ధనుర్బాణములను ధరించివచ్చితిని. దుర్మార్గులగు నో రాక్షసులారా! నిలువుడు, ఇచట నేయుండుడు. మీరు సమీపమునకు రాతగరు. మీరీలోకమున నింకను బ్రతికియుండగోరుదురేని పరుగెత్తిపొండు. అని రాముడు జెప్పె. అంత బ్రాహ్మణులను హింసించువారగు నా రాక్షసులు పదునలువురును, శూలంబులు చేతులం బట్టుకొని మహాకోపముతో నల రామునకిట్లనిరి.

ఓరీ మనుష్యాధమా! నీవు మహాశౌర్యవంతుడును, మా కు బ్రభువును, నగు ఖరునకు మహాకోపమును గలుగజేసితివి. కావున నీవిప్పుడు యుద్ధమునందు మాచే సంహరింపబడి ప్రాణములు పోగొట్టుకొందువు. మఱియు నీవు వొక్కడవే యుద్ధమున ననేకులమగు మా యెదుట నిలువజాలవు. అట్లుండ నీవు మాతో యుద్ధము జేయలేవని చెప్పనేల? మాతో యుద్ధమునకు బ్రారంభించితివేని మేము ప్రయోగించెడు యినుపగుదియల చేతను, శూలముల చేతను, పట్టసముల చేతను, శౌర్యహీనుడవై నీచేతనుండెడు ధనుస్సును వదలి ప్రాణములను విడువగలవు అని యిట్లుచెప్పి ఆ పదునలువురు రాక్షసులు దుర్జయుడగు రామునిపై దమచేతనుండు శూలములను వైచిరి. అంత రాముడు ఆ పదునాలుగు శూలములను కాంచనపుంఖములగు పదునాలుగు బాణముల చేత నరికివేసె. అట్లానరికి మహాశౌర్యవంతుడగు రాముడు మిగుల కోపమును బొంది పండ్లు పటపటగొఱుకుచు జక్కగ సానబెట్టబడినవియును, సూర్యునితో సమానముగ బ్రకాశించుచున్నవియును, నగు పదునాలుగు బాణములను దీసికొనెను. అట్లు రాముడు పదునాలుగు బాణములను గ్రహించి ధనస్సు వంచి విల్లెక్కుబెట్టి తెస్సగు తెజూచి "దేవేంద్రుడు వజ్రాయుధమును విడుచునట్లు", ఆ బాణములను ఆ రాక్షసులపై బ్రయోగించె. అంత కాంచనపుంఖములును, బంగారముచే నలంకరింపబడినవియును, మిగుల బ్రకాశించుచున్నవి

యును, నగుబాణములప్పుడతివేగమున నారాక్షసులయొక్క ఱొమ్ములనుబ్రద్దలుజేసికొని రక్తమునమునిగినవై వెలికివచ్చి "పిడుగువలె మహానాదముజేయుచు" భూమియందుబ్రవేశించె. అప్పుడారాక్షసులు, పగులగొట్టఁబడినఱొమ్ములుగలవారును, నెత్తురునందుదేలుచున్న దేహములుగలవారును, వికృతాకారులునై "వేళ్లునరకబడిన వృక్షములవలె" నేలంబడి విలవిలదన్నుకొని ప్రాణములను విడిచిరి. అంతనారాక్షసియగు శూర్పణఖ నేలంబడియున్న యారాక్షసులనుజూచి మహాభయమునుబొందినదియై పలుమారు మహాభయంకరముగ నఱచె. అట్లాశూర్పణఖ మహాభయంకరముగ ధ్వనిజేయుచు నతివేగముగ ఖరునిదగ్గరకుబోయి రెండింతలుదుఃఖముగలదై గాయములయందుండి జారిన నెత్తురుకొంచెముండియుండుటచే "బంకతోగూడిన నల్లకీవృక్షమువలె" నేలంబడెను. అట్లు అన్నసమీపమున భూమిపైబడి విశేషముగనేడ్చుచు పలుమారఱచుచు, విషణ్ణవదనయై కన్నీరుమున్నీరైపాఱ వెక్కివెక్కియేడ్చుచుండె. మఱియు ఖరునితోబుట్టువగు శూర్పణఖ, యుద్ధమునందు పదునలుగురురాక్షసులును చంపఁబడుటనుజూచి మహావేగముతో ఖరునియొద్దకు బరుగెత్తిపోయి యారాక్షసులు రామునితో యుద్ధముజేసిచచ్చుట మొదలగువృత్తాంతమంతయు విశదముగ నెఱింగించె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదియవసర్గ ముగిసెను

ఖరుడుశూర్పణఖకుఅభయమిచ్చి యుద్ధమునకుబైలుదేరుట.

అట్లు నేలంబడియున్న శూర్పణఖను ఖరుడుజూచిమహాకోపమునుబొంది రాక్షసవినాశముకొఱకు మఱలవచ్చిన శూర్పణఖతో మిగులస్పష్టములగు మాటలచేనిట్లనియె,

ఓయమ్మా! చెల్లెలా! శూర్పణఖా! నీకుసంతోషము గలుగజేయుటకొఱకు, యుద్ధవీరులును, రక్తపానముజేయురును, నగురాక్షసులను నేనిప్పుడేపంపితినే! ఇంతలో మఱలనేల యిచటికివచ్చి యేడ్చుచున్నావు? వారునాయందెల్లప్పుడును అతిభక్తిగలవారు. మహా అనురాగముగలవారు. నాకెప్పుడునుమేలుజేయువారు. వైరివీరులను వధించువారు. విరోధులచేజావనివారు. వారునాయుత్తరువుచొప్పున నడచుచుండువారు. అట్లుండగ నిప్పుడునీవు మఱలవచ్చి అయ్యోఅన్నా! యనినేలంబడి పొరలిపొరలి యేడ్చుచుండుటకు గారణమేమి? నేనుదక్షుడనుండగా ననాథవలె నేలయేడ్చెదవు? లెమ్ములెమ్ము. భీతినిబొందవలదు. వ్యసనమునువిడువుము. అనియిట్లుఖరు డనేకవిధములనూరడించె, అంతదుర్ధర్షయగు నాశూర్పణఖ కన్నీళ్ళనుదుడిచికొనుచు మెల్లమెల్లగ నిట్లనియె.

ఓఅన్నా! ఖరుడా! నేనిపుడు ముక్కును చెవులను బోగొట్టుకొని రక్తప్రవాహములో మునిగినదాననై నీయొద్దకివచ్చితిని. అంతనీవునన్ను మిగులనూరడించితివి. శౌర్యవంతుడవగు నోఖరుఁడా! నీవట్లునన్నాదరించి మహాకుపితుడవై నాకుసంతసముగల్గించుటకై, రామలక్ష్మణులను జంపుటకొఱకు పదునలుగురు రాక్షసులనుబంపితివి. వారు మిగులకోపోద్దీపితులై శూలముద్గరపట్టసములను చేతులంబూని రామునిపైకి యుద్ధమునకుఁబోయిరి. అంతనారాముడు అయ్యుద్ధమున కఱుకుబాణములచే వారినిసంహరించె. మహాబలపరాక్రమశాలులగు నారాక్షసులందరు క్షణమాత్రములోహతులైరి. కావుననట్టియమోఘమగు రామునిప్రతాపమునుజూడగా నాకుమిగుల భయముగలుగుచున్నది. ఓఅన్నా! ఖరుడా! నేనుమహాభయమునుబొంది మిగుల వ్యసనపీడితురాలనై యున్నాను. ఎటుజూచినను నాకుమిగుల భయముగలుగుచున్నది. కావునమఱలనిన్ను శరణుబొందితిని. మఱియు "దిగులనుమొసలితోను, భీతియనెడియలలతోను, గూడిమిగులవిశాలమగు నీవ్యసనసముద్రమునమునిగియున్నదానను" నన్నురక్షింపనీవుదప్ప యితరులెవరునులేరు. నావెంటవచ్చిన రాక్షసులనుగూడ రాముడు మహాకఱుకుబాణములచేజంపె. కావుననీకునాయందును, ఆపదునల్గురు రాక్షసులయందును మిగులప్రేమగలిగియుండినయెడల యుద్ధమునకుబైలుదేరుము. మఱియు మహాబలపరాక్రమశాలియగు రామునితోసమానమైన బలపరాక్రమములు నీకుగలిగియున్నయెడల, దండకారణ్యవాసులగు రాక్షసులకందఱికిని మహాకంటకుడగు రామునినిపుడే సంహరింపుము నీవిపుడునావిరోధియగు రామునిసంహరింపకబోతివేని నేనుసిగ్గుబోయినదాననై నీముందటబడిప్రాణములనువిడిచెదను. ఇదియునుగాక యింకొకవిశేషము చెప్పెదనువినుము. నీవుసేనాసమేతుడవై పోయినను యుద్ధమున మహాబలపరాక్రమశాలియగు రామునియెదుటనిలుచుటకు సమర్థుడవుగావనియెంచెదను. మఱియునీవుమానవులగు రామలక్ష్మణులనుజంపుట కెంతమాత్రమును శక్తిమంతుఁడవుగావు. కావుననీవు వీరుఁడవుగావు. అయినను మహాశూరుడగు వీరునివలెనభినయించుచున్నావు. కులమును చెఱుపునట్టియోఅన్నా! ఖరుడా! నీవురామునితోసమానమైన బలపరాక్రమశాలివగుదువేని, ఇపుడుదండకారణ్యవాసియగు రామునివధింపుము. నీవుమహాబలహీనుఁడవు.

శౌర్యములేనివాఁడవు. కావుననీవీ జనస్థానమునఁనుండఁదగదు. అతిత్వరితముగ బంధుసమేతుఁడవై జనస్థానమునువిడిచిపొమ్ము. అట్లుజేయకున్న నత్యల్పకాలములోనే రాముని శౌర్యమునకు బరాజితుఁడవై నశించెదవు. అదియునుగాక దశరథమహారాజపుత్రుఁడగు రాముఁడు మహాశౌర్యముగలవాఁడు నన్నిట్లువిరూపిగఁజేసిన లక్ష్మణుఁడును మహాపరాక్రమవంతుఁడు. అనియిట్లుజెప్పి పెద్దకడుపుగలయా శూర్పణఖ యనేకవిధంబుల ప్రలాపించుచు మహావ్యసనమునుబొందినదై రెండుచేతులతోను బొమ్మునమోదికొనుచు, అయ్యో, అయ్యో, యనియేడ్వసాగె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదియొకటవసర్గ ముగిసెను.

ఖరుడు యుద్ధమునకు బైలువెడలుడని రాక్షససైన్యమున కాజ్ఞాపించుట.

మిగుల శౌర్యవంతుఁడగు ఖరుఁడపుడు రాక్షసులనడుమ శూర్పణఖచే నవమానింపఁబడి మిగులకోపోద్దీపితుఁడై మహాపరుషవాక్యములతో నిట్లనియె.

ఓచెల్లెలా! శూర్పణఖా! నీకవమానము గలిగిందుటచే నాకుగలిగిన మితిలేనిపరాక్రమము "ప్రళయకాలమునఁబొంగినసముద్రజలమువలె" నడ్డగింపనలవిగాదు. మానవుఁడును, కాలపరిపక్వమైనవాడును నగు రామునిపరాక్రమమును నేనెంతమాత్రమునుగణనసేయను. వాఁడుతనదుష్కార్యములకు బదులుగాప్రాణములనువిడువగలడు. నీవుఏడ్వవలదు. కన్నీళ్లుదుడుచుకొనుము. భయపడవలదు. భీతినివిడువుము. నేనుబోయిరాముని నతనితమ్ముఁడగులక్ష్మణుని యమధర్మరాజువద్దకు బంపెదను. ఓశూర్పణఖా! అల్పాయువగురాముని నేనిపుడుయుద్ధమున గొడ్డలిచేజంపెదను. అంతరాముని వేడివేడిరక్తమును నీవుఆశదీరద్రావుము. అనిఖరుడుజెప్పె. అంతనాశూర్పనఖ మిగులసంతసించినదై మూర్ఖురాలుగావున రాక్షసుఁడగుఖరుని మిగులప్రస్తుతించె. అట్లుశూర్పణఖ మొదటదూషించి పిమ్మటఁబొగడినవెనుక ఖరుడుసేనానాయకుడగు దూషణునిజూచి యిట్లనియె.

ఓదూషణా! నాయిష్టముచొప్పున నడచువారును, చూచువారలకు భయమునుగలిగించునట్టి వేగముగలవారును, రణరంగములందు వెన్నుజూపనివారును, నల్లనిమేఘమువంటి దేహకాంతిగలవారును, మహాభయంకరాకారులును, క్రూరకార్యములను జేయువారును, లోకములనుహింసించుటయే క్రీడగాగలవారును, మహాభయంకరమగు పరాక్రమముగలవారును నగు రాక్షసులు పదునాలుగువేలమంది సిద్ధముగనున్నారుగదా. సౌమ్యుడవగు నోదూషణుండా! బెబ్బులులవంటి శూరత్వముగలవారును, పెద్దనోళ్లుగలవారును, మహాబలముగలవారును, మిగులగర్వించియుండువారును, నగునారాక్షసులకు యుద్ధమునకుగావలసిన ప్రయత్నములన్నియు జేయుము. ఓదూషణుండా! మహావేగముగ పోయినారథమునువిండ్లను, నానావిధములగుబాణములను, శక్తితోమరము మొదలగుఅనేకయాయుధములనునతివేగముగదెమ్మనుము. యుద్ధవీరుఁడగునేను, దుర్మార్గుడగురాముని సంహరించుటకు, మహాశౌర్యవంతులగు రాక్షసులకందఱికిని ముందుగబోవలయును. అనియిట్లు ఖరుడుజెప్పుచుండగ సూర్యునితో సమానమైనకాంతిగలవియును, నానావర్ణములుగలవియును మిగులశ్రేష్ఠములైనవియును నగుగుఱ్ఱములుగట్టఁబడిన నాకగొప్పరథము సిద్ధముజేయబడియున్నదనిదూషణుడుజెప్పె. మఱియు మేరుపర్వతశిఖరమువంటి యాకారముగలదియును, పుటముదీసినబంగారునుచే నలంకరింపఁబడినదియును, సువర్ణచక్రములుగలదియును, మిగులవిశాలమైనదియును, వైడూర్యముతోజేయఁబడినకొనలుగలదియును, బంగారువికారములై మంగళకరములగు చేపలచేతను, వికసించినపువ్వులచే ఒప్పుచుండెడువృక్షములచేతను, కొండలచేతను, చంద్రసూర్యులచేతను, పక్షులసమూహములచేతను, నక్షత్రములచేతను లెస్సగనలంకృతమైనదియును, టెక్కెములతోను కత్తులతోనుకూడినదియును, చిరుగంటలచే బ్రకాశింపఁజేయఁబడినదియును, శ్రేష్ఠములగు గుఱ్ఱములచేగట్టఁబడినదియును, నగురథమును ఖరుడుమహాకోపముతో గూడుకొన్నవాఁడై యెక్కె. అట్లుఖరుడమితమగుక్రోధముగలవాడై రథంబెక్కినతోడనే మహాభయంకరమగు శౌర్యముగలరాక్షసులు ఆఖరునిమహాబలపరాక్రమశాలియగు ఘూషణునిఁబరివేష్టించినిలిచిరి. అంతఖరుడు రథముపైగూర్చుండి నలుదిక్కులనుగలయఁబూచి, గొప్పధనుస్సులను చేతంబట్టుకొనియున్నవారును, భయంకరమగుకవచములుతొడిగికొని సమస్తాయుధములను ధరించియున్నవారును, టెక్కెములను చేతంబట్టుకొనియున్నవారును, నగుసకలరాక్షసులనుజూచి బైలువెడలుడనియాజ్ఞాపించె. అట్లుఖరుడుఆజ్ఞాపించినతోడనే, భయంకరములగుకవచములను, సమస్తాయుధములను, ధరించినవారితోను, టెక్కెములుబట్టుకొని యుండువారితోనుగూడిన యారాక్షససేనంతయు మహాత్వరితముగజనస్థానమునువిడిచిబైలుదేరె. మఱియుచూచువారలకు మహాభీతినిగలుగజేయునట్టి యినుపగుదియలను, అడ్డకత్తులను, శూ

లాయుధములను, మిగులపదునుగలగొడ్డండ్రను, కత్తులను, చక్రాయుధములను, దగద్ధగాయమానముగ ప్రకాశించుచుండుతోమరాయుధములను, ఈటెలను, ముద్గరాయుధములను, మిగులగొప్పధనుస్సులను, బల్లెములను, గదలను, రోకండ్లను, వజ్రాయుధములనుధరించినవారును, మహాభయంకరాకారులును, ఖరునియిష్టముచొప్పున నడుచువారును, నగుపదునాలుగువేలరాక్షసులు జనస్థానముననుండిరామునిపైకి యుద్ధమునకుబైలువెడలిరి. అట్లుబైలుదేరియతివేగముగబోవుచున్నవారును, మహాభయంకరమగుశౌర్యముగలవారును, నగురాక్షసులనుజూచి ఖరునిసారథిరథమును కొంచము వెనుకబోనిచ్చె. అంతసారథిఖరుని యభిప్రాయమునుదెలిసికొని పుటముదీరిన బంగారముచే నలంకరింపఁబడినవియును, నానావిధములగు రంగులుగలవియును, నగుగుఱ్ఱములనునదల్చితోలె. అపుడుసారథిశత్రుసంహారకుడగు ఖరునిరథమునుఅతిశీఘ్రముగదోలుచుండగనారథముయొక్కధ్వని దశదిశలనునిండె. మఱియు మిగులబలముగలవాఁడును, మహాకోపమునుబొందినవాఁడును, కోపాతిశయమువలన పరుషధ్వనిగలవాఁడును, నగుఖరుడుశత్రువులనుజంపుటకొఱకు మహావేగముగలవాఁడై "ప్రళయకాలయముండునుంబోలె" గనుబడుచు "ఱాళ్ళవానగురియునట్టిమేఘమువలె" సింహనాదమును జేయుచు నతివేగముగ రథమునుదోలుమని సారథికినాజ్ఞాపించె.

ఇట్లుశ్రీమదారణ్యకాండమునందలియిరువదిరెండవసర్గ ముగిసెను.

ఖరుడు యుద్ధమునకు బైలువెడలినతోడనే దుశ్శకునములుగలుగుట.

ఇట్లు రాక్షససైన్యము జనస్థానముననుండి బైలువెడలినతోడనేగాడిదెవర్ణమువంటిరంగుగలదియును కొంతెమెట్టనైనదియును, నగుమేఘము, అనిష్టసూచకముగ దట్టముగు రక్తవర్షమునుగురిసె. ఖరునిరథమునకు గట్టియున్నవియును, మహావేగముగలవియును, నగుగుఱ్ఱములు, మిట్టపల్లములులేక చదరముగనున్నదియును, పువ్వులుబరుపబడియున్నదియును,నగురాజమార్గమునందుఅకస్మాత్తుగజారిపడె. అట్టియెడసూర్యునిచుట్టును నల్లగకొఱవివలె చక్రాకారమును దానియంచులయందుమాత్రము రక్తవర్ణముగలదియునునగు పరివేషముగలిగె. మఱియు గొప్పశరీరముగలదియును, మహాభయంకరమైనదియును, నగునొకగద్ధ బంగారపు కఱ్ఱగలదియును, రాజచిహ్నమైనదియును, నగుటెక్కముపైవ్రాలె. అదియునుగాక మాంసముదినునట్టిమృగములుపక్షులును జనస్థానముదగ్గిరజేరి మహాకఠినమగుధ్వనితోనానావిధములును, వికారములును, నగుశబ్దములనుజేసె. నక్కలుసూర్యునికెదురుగజేరి నోరెత్తిరాక్షసులకనిష్టప్రదముగ మిగులభయంకరమైన ధ్వనిగలుగునట్లు గొప్పకంఠస్వరముతోనేడ్చె. బద్దలుజేయబడిన పర్వతముతోసమానముగ నానావర్ణములుగలవియును, మహాభయంకరముగ రక్తవర్షము గురియుచున్నవియును, నగు మేఘములు ఆకాశమునందంతటనుదట్టముగగప్పికొనె. మహాభయమును గలుగజేయునట్టి గాఢాంధకారము దిక్కులుగానరాకుండునట్లుగప్పికొనె. ఆకాశంబంతయు మెట్టకావికమ్మికొనుటచే సంధ్యాకాలముగాక మునుపే సంధ్యాకాలమువలెదోచె. అపుడు మహాభయంకరములగు మృగములునుపక్షులును, కంకపక్షులు నక్కలును గ్రద్దలునుమొదలగునవి ఖరునికెదురుగనిలిచి మహాభయంకరముగ నఱచుచుకీడునుసూచించె. రణరంగమునందుఅశుభముగలుగుటనుసూచించెడినక్కలు రాక్షససైన్యమున కెదుటనిలిచి యగ్నిజ్వాలలను గ్రక్కుచున్ననోళ్ళతో నఱవదొడగె. సూర్యునియొద్ద యినుపగుదియవలె గాన్పించుచున్న యొక మనిషి మొండెముగనబడియె మహాగ్రహమగు రాహుగ్రహముపర్వకాలముగానినాడు సూర్యునిమ్రింగె. మహావేగముగనెదురుగాలిగొట్టదొడంగె. సూర్యుడు నిస్తేజస్కుడయ్యె. పట్టపగలేనక్షత్రములుదయించి మిణుగురుబూచులతోసమానముగ బ్రకాశించుచుండె. మఱియు నట్టియెడ తామరమడుగులలోని నీళ్ళింకిచేపలునీటిపక్షులు మొదలగునవియుణగిపోయె. అందఃకనము ఎండిపోయినవి చెట్లయందున్నపువ్వులును, పండ్లును, రాలిపోయె ఆరాక్షససైన్యమునందుగాలిలేకయే మేఘమువలె నరుణవర్ణముగల దుమ్మురేగె. గోరువంకపక్షులు చీచీకూచి యనుకరణవాక్యములతోనఱవదొడంగె మహాభయంకరములగు పిడుగులుకండ్లుచెదురునట్లు మహాకాంతితోపడినవి. కొండలతోనునుద్యానవనములతోను అరణ్యములతోన గూడిన భూమియంతయు వడవడవడకదొడగె. మఱియు రథముమీదగూర్చున్నవాఁడును మిగులధీమంతుఁడును, సింహనాదమునుజేయుచున్నవాఁడును, నగుఖరునియొక్క యెడమభుజముఅదిరె కంఠధ్వనియును మిగులతడబడియె కడపటనీఖరుడు నలుదిక్కులనుజూచినతోడనే కండ్లనుండినీళ్లు జలజలమనిరాలె నుదుటియందొకవిధమైన తెగులుబుట్టె. అయినను అతఁడుఅజ్ఞానమును విడువడయ్యె నట్టియెడఖరుఁడు మహాభయంకరములగు నాదశ్శకునములనుజూచి

పెట్టివానివలె పకపకనవ్వుచు సైన్యములోనున్న రాక్షసులనుజూచి యిట్లనియె.

ఓరాక్షసులారా! అద్భుతముగలిగిన మహాభయంకరములగు నిమహోత్పాతములనుజూచి "మహాబలశాలియగువాఁడు దుర్బలుని లక్ష్యము జేయనట్లు" నేనెంతమాత్రమును వీటిని లక్ష్యము సేయను. నాకుమిగులఁగోపము గలిగెనేని మిగుల తీక్ష్ణములగు బాణపరంపరలచే నక్షత్రములనైనను ఆకాశమునుండి క్రిందబడునట్లు చేయగలను. మృత్యువునుగూడ జంపగలను. నేను, మహాబలముచే గర్వించియుండెడు రామునినతనితమ్ముడగు లక్ష్మణుని కఱకుబాణములచే జంపక తిరిగిరాను. నాచెల్లెలగు శూర్పణఖయు రామలక్ష్మణుల నెత్తురుద్రావి సఫలమనోరథ యగుగాక. ఆశూర్పణఖకొఱకేగదా యిప్పుడీరామలక్ష్మణులకు చేటువాటిల్లె. ఇంకొకవిశేషమును జెప్పెదవినుఁడు. ఇదివరకు నేనుయుద్ధములయందు పరాజయమును బొందినవాఁడనుగాను. ఇది మీకెల్లవారికిని దెలిసినవిషయమేగదా? ఈవిషయమునందు నేనబద్ధమాడినదిలేదు. నాకుకోపముగలిగెనేని మదించిన యైరావతమునుఎక్కిఁడివజ్రాయుధపాణియగు దేవేంద్రునైనను యుద్ధమునందుజంపుదును. అట్లుండగ కుత్సితమానవులగు రామలక్ష్మణులనుజంపుదునని చెప్పనేల? అనిఖరుడు సింహముయొక్క ధ్వనివంటిధ్వనిగలవాఁడై చెప్పె. అంత యాగొప్పసేనయందుండిన రాక్షసులందరును ఖరునిమాటలనువినిమృత్యుపాశములచే గట్టఁబడినవారుకావున మహాసంతోషమునుబొందిరి. అట్టియెడ మిగుల ప్రభావముగల ఋషులును, దేవగంధర్వ సిద్ధవిద్యాధరులును, చారణులును, యుద్ధమునుజూడఁగోరి యచటికివచ్చిరి. అట్లువచ్చిన ఋషులును దేవగంధర్వ సిద్ధవిద్యాధరులును నొకరితోనొకరుయిట్లనిచెప్పుకొనిరి. శ్లో॥ స్వస్తిగోబ్రాహ్మణేభ్యోస్తు లోకానాం యేభిసంగతాః ॥ ఎవ్వరుగోబ్రాహ్మణులకును లోకులకును మేలుజేయువారో యట్టివారికి మంగళమగుగాక. "చక్రహస్తుఁడగు విష్ణుదేవుఁడు యుద్ధమునందు రాక్షసోత్తములనెల్లజయించినట్లు" రాముడుయీపుల స్త్యవంశజులగు రాక్షసులనందరిని జయించుగాక. అనియుద్ధముజూచుటకు మహాసంతోషముతోవచ్చియున్న మహర్షులును దేవతలుమొదలగు వారందరును విమానారూఢులై యిట్టిమాటలను, మఱియుననేకములైననితరములగు మాటలను జెప్పుకొనుచు అల్పాయువులగు నారాక్షసులసైన్యమునుజూచిరి. ఆరాక్షససేనయందు మహాభయంకరమగుసైన్యమునకధిపతియైనఖరుడు రథముయెక్కియందరికన్న ముందుగమహావేగముతోవచ్చుచుండె. అట్లుఖరుఁడువచ్చుటనుజూచి తక్కినరాక్షసులందరును నతనినివెంబడించి వచ్చుచుండిరి. అందు శ్యేనగామియు, పృథుగ్రీవుఁడును, యజ్ఞశత్రుఁడును, విహంగముడును, దుర్జయుడును, కవిరాక్షుఁడును, పరుషుడును, కాలకార్ముకుడును, మేఘమాలియును, మహామాలియును, సర్పముఖుఁడును, రుధిరాశనుడును, అనునిమహావీరులగు పండ్రెండుమందిరాక్షసులుఖరునిబరివేష్టించి వచ్చుచుండిరి. మఱియు, మహాకపాలియు, స్థూలాక్షుఁడును, ప్రమాథియు, త్రిశిరుఁడునను నీనలువురుసేనానాయకులును దూషణునివెంబడించి వచ్చుచుండిరి. అట్లుమహాభయంకరమైన వేగముగలవారును, యుద్ధమునందు మహోత్సాహముగలవారును, మహాబలపరాక్రమశాలులునునగు నారాక్షస వీరులయొక్క సైన్యమతివేగమున "గ్రహకూటము చంద్రసూర్యులనుబొందునట్లు" రామలక్ష్మణులసమీపమునకు వచ్చిచేరె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదిమూడవ సర్గముగిసెను.

❁

— { రాముడుసీతాలక్ష్మణులనుగుహలో ప్రవేశింపజేసితానుయుద్ధసన్నద్ధుడగుట. } —

అట్లమితపరాక్రమశాలియగు ఖరుఁడు రామునియాశ్రమమునకైపోవుచుండగ రాముడులక్ష్మణసమేతుఁడైయుండి మునులుజెప్పబడిన దుశ్శకునములనేజూచుచుండె. మహాభయంకరములైనవియును, దేహముగడగడ వణకునట్లుజేయునవియును, మానవులకు కీడుగల్గించునవియును, నగునాయుత్పాతములనుజూచి రాముడులక్ష్మణునితో నిట్లనియె.

మహాబాహుఁడవగు నోలక్ష్మణా! సమస్తభూతములను నశింపజేయునట్టివియును మహాభయంకరములైనవియునునగు నీమహోత్పాతములుబుట్టుటజూడగా సర్వరాక్షససంహారకాలము సమీపించినదనితోచుచున్నది. ఈయుత్పాతములనుజూడుము. మఱియు గాడిదవర్ణముగలిగికొంచముయెఱ్ఱనైన యీమేఘములురక్తవర్షమును గురియుచు మహాభయంకరముగ గర్జించుచు ఆకాశమునందు దిరుగులాడుచున్నవి. అదిగోచూడుము. ఓలక్ష్మణా! చూచితివా! నాయొక్కబాణములన్నియు పొగరాజుచుమహాసంతోషముతో యుద్ధమును అపేక్షించుచున్నవి. బంగారముచే నలంకృతమగునావిల్లుగూడ రణోత్సాహమునకెరలుచున్నది. మఱియునిప్పుడీయరణ్యమున సంచరించెడు పక్షులుకూయుచుండుటనుజూడగా మనకేదేనిభయమును ప్రాణహానియును గలుగుననితోచుచున్నది. ఎట్లైనను

మహాగొప్పయుద్ధముసంభవించుటకు సంశయములేదు. ప
లుమారు నాకుడిభుజమునదురుటచే గొప్పయుద్ధముగలు
నని సూచించుచున్నది. మహాశౌర్యవంతుఁడవగు నోలక్ష్మ
ణా! శీఘ్రకాలములోనే మనకుజయమునువిరోధుల కపజ
యముకుగలుగును. అందుకు సూచకముగ నీముఖముమి
గులశోభాయమానముగ ప్రసన్నంబైయున్నది ఓలక్ష్మ
ణా! యుద్ధమునకుప్రయత్నపడినపుడు ఎవరిముఖముకాం
తిహీనమైయుండునో, వారలకుఆయుక్షీణమగును. ప్రా
ణములుబోవును. అదిగో ఆలకించివినుము, మిగులక్రూర
కార్యముజేయునట్టి రాక్షసులయొక్క ఆహాకారములును,
భయంకరములగు భేరీధ్వనులును వినవచ్చుచున్నవి. శ్లో॥
అనాగతవిధానంతు కర్తవ్యంశుభమిచ్ఛతా। ఆపదంశంక
మానేన పురుషేణవిపశ్చితా॥ ఆపదవచ్చుననితోచినపుడు
శ్రేయమునుగోరునట్టి బుద్ధిమంతుఁడగు వాఁడురాబోవ్యా
డియాపదకు ప్రతీకారమును యప్పుడే యోచింపవలయు
ను. కావుననీవనుర్బాణములనుధరించి సీతనుదీసికొనిప్రవే
శింపనలవిగానిదియును, దట్టముగచెట్లుగలదియును, నగు
పర్వతగుహయందు ప్రవేశించియుండుము. చిన్నవాఁడవ
గునోలక్ష్మణా! నామాటకెంతమాత్రము నెదురుజెప్పవ
ద్దు. నాపాదములమీదబట్టుపెట్టెదను. ఆలస్యమునుజేయ
కతివేగముగబొమ్ము. మఱియు నీవుమహాశౌర్యముగల
వాఁడవును, మిగులబలముగలవాఁడవును, నీవు ఈరా
క్షసులనందఱి జంపసమర్థుండవేను అందుకెంతమాత్ర
మునుసంశయములేదు. అయినను నేనేవీరినందఱి జంప
గోరియున్నాను. అనిచెప్పె. అంతలక్ష్మణుడు మారాడక
ధనుర్బాణములనుధరించి సీతాదేవినిబిలుచుకొని, ఇతరుల
కుప్రవేశింపనలవిగాని గుహయందుప్రవేశించె. అట్లులక్ష్మ
ణుడుసీతనుదీసికొనిపోయి గుహయందు ప్రవేశించినతోడ
నే రాముఁడు, "ఆహామంచియుపాయముదోచినది" అని
సంతసించుచు కవచమునుధరించె. అట్లు, రాముడుఅగ్ని
హోత్రమువలె ప్రకాశించుచున్న కవచమునుదొడుగుకొ
ని "గాఢాంధకారమునందుపోగలేకమండుచున్న యగ్ని
హోత్రమువలె' ప్రకాశించుచుండె మఱియుమహాపరా
క్రమశాలియగు రాముఁడుతనగొప్పధనుస్సును చేతబట్టు
కొనియల్లెత్రాడునుసారించిజ్యాఘోషణమును సేయుచుం
డె. ఆధ్వనిదశదిశలునునిండియుండె అంతమహాపరాక్ర
మశాలులగు గంధర్వులును, దేవతలును, సిద్ధులును, చార
ణులును, యుద్ధముజూడగోరినవారైయచ్చటికివచ్చిరి. మ
ఱియు పుణ్యకర్మములనుజేయువారును, మిగులమహిమగ
లవారును, నగులోకమునందుండెడు బ్రహ్మఋషిశ్రేష్ఠ

లందరును, నొకటిగజేరితమలోతామిట్లనిచెప్పుకొనిరి. లో
కులకును, గోవులకును, బ్రాహ్మణులకును, యెవరుసేలు
జేయువారో యట్టివారికిశుభముగలుగుగాక. "చక్ర హ
స్తుఁడగు విష్ణుదేవుఁడు యుద్ధమునందు మహాసుర [illegible]
యించినట్లు" రాముఁడీపౌలస్త్యులనందరినిజంపి జ [illegible]
నుబొందుగాక అనియిట్లుజెప్పుకొనుచుమఱలనిట్లనుకొ[illegible]రి.
మహాక్రూరకర్ములగు రాక్షసులుపదునాలుగువేలమం[illegible]యు
న్నారు. మిగులధర్మస్వభావుఁడగు రాముడొక్కడే[illegible]ల
తోనెట్లుయుద్ధముజేయుగలడు? అనియిట్లు తమలో తా[illegible]ము
జెప్పుకొనుచు రాజర్షులును దేవతలును సిద్ధసాధ్యులును య
క్షగంధర్వరులును బ్రహ్మర్షులుమొదలగు వారందరునుయు
ద్ధమునుజూడగోరి విమానారూఢులై యాకాశమునుండి
చూచుచుండిరి. అప్పుడుమహాతేజస్సుతోప్రకాశించుచు యు
ద్ధాగ్రముననున్నవాఁడగు రామునిజూచి సమస్తభూతము
లును మహాభయమునుబొంది చింతించె. అట్టియెడ వ్యస
నరహితములైన కార్యములుగలరాముడు "మహామహిమ
గలవాడును మిగులకోపోద్దీపితుడుననగు రుద్రునివలెనే"
యుండె. ఇట్లుదేవగంధర్వసిద్ధచారణాదులు జెప్పుకొను
చుండగమిగులగంభీరమగు ధ్వనిగలదియును, భయంకర
ములైనకవచములును, ఆయుధములును, టెక్కెములును
గలదియును, నగునారాక్షససైన్యమెల్లెడలను గనుపించె.
ఆసైన్యమునందు సింహనాదములనుజేయువారును, ఒం
డొరులతో జయోత్సాహమున గర్జించువారును, ధనుస్సు
లుచేతబట్టుకొని జ్యాఘోషణమునుజేయువారును, విశే
షముగ నావులింతలువిడుచుచున్నవారును, విశేషముగనా
హాకారములను జేయుచున్నవారును, భేరీధ్వనులను గా
వించుచున్నవారును, నగునారాక్షసులగుంపుయొక్క శబ్ద
మువాసనంబంతయు నిండియుండె. ఆయరణ్యమునందు
సంచరించుచున్న క్రూరజంతువులన్నియును, ఆమహాధ్వని
నివిని మిగులభీతినొంది వెనుకకుతిరిగిచూడక, నిశ్శబ్దముగ
నుండు ప్రదేశమునకుబరుగెత్తిపోయె అట్టియెడనానావి
ధములగునాయుధములనుధరించినభటులుగలదియును, మ
హాగంభీరమైనదియును, సముద్రముతో సమానమైనదియు
ను, భయమునుగలిగించునదియును, నగునారాక్షససేన
రామునిసమీపించివచ్చుచుండె అంతయుద్ధమునందు నిపు
ణుడగురాముఁడు, నలుదిక్కులనుబాఱజూచి మహాప్రయ
త్నముతో యుద్ధమునకువచ్చుచున్న ఖరునిసేననుజూచె. అ
ట్లుజూచి రాముడుధనస్సును సవరించుకొని అమ్ములపొది
నుండిబాణంబులనుదీసి చేతబట్టుకొని సమస్తరాక్షసులను
సంహరించుటకురౌద్రంబగు కోపమునుబూనె. అట్లురా

ముఁడు మిగులకుపితుఁడై ప్రళయకాలాగ్నిహోత్రమువలె, జ్వలింపుచు చూడశక్యముగానివాఁడైయుండె అట్లు చూడనశక్యమగు తేజస్సుతో వెలుంగుచున్న రామునిజూచి యావనదేవతలు మిగులభయమునుబొంది పరుగెత్తిపోయిరి. అప్పుడట్లు రాక్షసులనుజంపుటకొఱకు మహాకోపమునుబొందియున్న రాముని యాకారము "దక్షప్రజాపతియొక్కయాగము నాశముసేయనుద్యుక్తుఁడైన యీశ్వరునివలె" ప్రకాశించుచుండె. అట్లు రణరంగమునందున్నవాఁడును, మహాతేజోవంతుఁడును, నగు రామునిజూచి సమస్తభూతములును భయము చేఁగులుబొందినవై పాఱిపోయెను. మఱియు నా సమయమున ధనుస్సులను, సమస్తయాభరణములను, అగ్నివలెప్రకాశించుచుండెడి కవచములనుధరించినానావిధకత్తులను చేతబట్టుకొనియున్న రాక్షససైన్యము సూర్యోదయకాలమున గాన్పించుచున్న నల్లని మేఘమువలెగనబడుచుండె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదినాలగవ సర్గముగిసెను.

రాముడు రాక్షసులసైన్యమునంతయు సంహరించుట

అట్లు ఖరుడు సేనాసమేతుఁడై రామునియాశ్రమమును జేరంబోయి, ధనుర్బాణములను ధరించియున్నవాఁడును, మహాకుపితుఁడై యున్నవాఁడును, శత్రుసంహారకుడును, నగు రామునిజూచె అట్లు ఖరుఁడు రామునిజూచి తాను ధనుర్బాణములనుధరించి వింటినారిసారించుచు తనరథమును రామునకెదురుగఁబోలమని సారథికాజ్ఞాపించె. అంతసారథి ఖరునియొక్క యుత్తరువుచొప్పున, మహాబాహుడగు రాముఁడొక్కడే ధనువునుబూనియున్న చోటునకురథముబోవునట్లు గుఱ్ఱములనదలించెను. అట్లు ఖరుఁడు రామునిపైకిబోవుటజూచి యతనిమంత్రులందఱును దిక్కులుపిక్కటిల్లు సింహనాదములజేయుచు నతనిజుట్టుకొని వెంబడించిపోయిరి. అట్టియెడ "నక్షత్రములనడుమ నుదయించియుండు అంగారకగ్రహమువలెనే" రథముపైనున్న యా ఖరుడు రాక్షసులనడుమ ప్రకాశించుచుండె. అంత ఖరుడు యుద్ధమునందు మహాపరాక్రమశాలియగు రాముని వేయిబాణములచేనొప్పించి మహాధ్వనిగలుగునట్లు సింహనాదముజేసె. మఱియు నా ఖరునిసైన్యమునందున్న రాక్షసులందరును, మహాకోపమునుబొంది, మిగులభయంకరమగుధనస్సుగలవాఁడును, దుర్జయుడును, నగు రామునిపై నానావిధములగు బాణవృష్టిని గురిపించిరి. అందుకొందరు రాక్షసులు కోపావేశమునుబొంది, ఇనుపగుదియలతోను, అడ్డకత్తులతోను, శూలములతోను, ఈటెలతోను కత్తులతోను గొడ్డండ్రతోను నానావిధములఁ బ్రహరించి నొప్పించిరి మేఘముతో సమానమైన యాకారముగలవారును, విశేషముగ సింహనాదమునుజేయుచున్నవారును, మహాపరాక్రమశాలులును, నగు నా రాక్షసులు యుద్ధమునందు రామచంద్రునిజంపగోరి కొందఱు రథములపైనుండియు, కొందఱు గుఱ్ఱములపైనుండియు, మఱికొందఱు పర్వతశిఖరములయొక్క కాంతివంటి కాంతిగల యేనుఁగులపైనుండియు, రామునిందఱిమిరి మఱియు "మేఘములు కొండలపైనిలిచినిలిచి జడివానగురియునట్లు" ఆ రాక్షససేనలు రామునిపై పదిపర్యాయములు బాణవర్షమునుగురిపించిరి. అట్టియెడ రాముఁడు మహాభయంకరులగు రాక్షససమూహములచే నావరింపఁబడినవాఁడైయుండె రాముఁడట్లు రాక్షసులచేజుట్టబడియుండి వారుప్రయోగించెడి బాణములనన్నిటిని "సముద్రము నదులప్రవాహములనన్నిటిని యీడ్చుకొనువిధముగ" తనబాణముచే ధ్వంసముజేసి నాశనముజేయుచుండె. అప్పుడు రాముఁడు రాక్షసులచే మహాభయంకరములగు నానావిధాయుధములు ప్రయోగింపఁబడిన దేహముగలవాఁడై కొంచెమైనను చలింపక ప్రకాశించుచు, "అనేకపిడుగులుబడినను భేదింపబడని మహాపర్వతమువలె" నుండె. మఱియు రఘువంశోద్భవుఁడగు రామచంద్రుఁడు, దేహమునందంతటను నానావిధాయుధములచే గాయపరుపబడి యా గాయములనుండి వెడలినరక్తప్రవాహమునందు మునిఁగియుండుటచే "సంధ్యాకాలమునందలి మేఘముచే నావరింపఁబడినసూర్యునివలె" ప్రకాశించుచుండె. అప్పుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు, మొదలగువారందరు, రాముఁడొక్కడే యనేకమంది రాక్షసులచే జుట్టబడియుండుటనుజూచి మిగులవ్యసనమును బొందిరి. అప్పుడు రాముఁడు మహాకోపమునుబొంది వింటికెక్కబెట్టి విశిఖములను పేరుగల యర్ధచంద్రాకారబాణములను వేలువేలుగ రాక్షసులపై ప్రయోగించె మఱియు రాముఁడు, నివారింపగూడనవియును, ఓర్వగూడనవియును, యమదండముతో సమానములైనవియును, వంకరగా బోవునవియును, నగుబాణములనువిలాసార్థముగ నా రాక్షససేనపై ప్రయోగించె అట్లు రాముడు మహావిలాసముతో నా శత్రుసైన్యముపై ప్రయోగించిన బాణములు "యమునిచే విడువఁబడిన కాలపాశమువలె" యా రాక్షసుల ప్రాణముల నపహరించె. అట్లు ప్రాణములనపహరించునట్టి యా బాణములు రాక్షసుల దేహములను భేదించుకొని బైలువెడలి రక్తముచే

దడుపఁబడినవై ఆకాశమార్గమునుబొంది మండుచున్నయగ్నిహోత్రముయొక్క కాంతివంటి కాంతిగలవై ప్రకాశించుచుండె. అప్పుడు రామునియొక్క మండలాకారంబగు విల్లునుండి వెడలినవియును, లెక్కపెట్టుటకు శక్యముగానివియును, మిగులభయమును బుట్టించునవియును, నగు బాణములు రాక్షసులప్రాణములను బోఁగొట్టె. మఱియు రాముఁడట్టిబాణములచే నారాక్షసులయొక్క ధనస్సులను, బాహుపురులతోఁగూడినచేతులను, ఏనుఁగతొండములతోసమానములగు తొడలను, వేలవేలుగ ఖండించె. అట్లు రాముఁడు ఆమహాయుద్ధమునందు బంగారుచేనలంకరింపఁబడి రథములకుఁగట్టఁబడినవియును, సారథితోఁగూడినవియునునగు గుఱ్ఱములతోఁగూడినవారలను, కాల్బలములను సంహరించి యమునిపట్టణమునకుఁబంపె. అంత రాక్షసులనేకులు మహాతీక్ష్ణములగు నానావిధబాణములచేఁ జంపఁబడుటనుజూచి సైన్యముమిక్కిలి మహాభయమునుబొంది నిలువజాలక హాహారుమనియేడ్వఁదొడఁగె.

ఇట్లు రామునివలన మహాతీక్ష్ణములగు బాణములచే భేదింపఁబడిన యారాక్షససైన్యము "అగ్నిదగ్ధమగు వనమువలె" యెంతమాత్రమైనను సుఖమునుబొందదయ్యె. అప్పుడా సేనయందున్నవారును, మహాబలపరాక్రమశాలులును, యుద్ధవీరులును, నగు రాక్షసులు కొందఱు రామునియెదుటబడి మహాశస్త్రములగు శూలములను ఖడ్గములను, గొడ్డండ్రను రామునిపై బ్రయోగించిరి. అట్లు రాక్షసులు బ్రయోగించినను, మహాబాహుఁడగు రాముఁడు వారియాయుధముల నన్నిటిని ఖండించివైచి వారికంఠములను దెగనఱికి ప్రాణములనుబోఁగొట్టె. అప్పుడా రాక్షసులయొక్క ధనుర్బాణములును, కవచములును, తలలును, రాముఁడు ఖండించినతోడనే "గరుత్మంతునియొక్క ఱెక్కలవేగమువలన గలిగినగాలిచే జెకలింపఁబడిన వృక్షములు భూమిపైఁబడినట్లు" రాక్షసులు భూమిపయింబడిరి ఇట్లు క్రిందఁబడినవారుపోఁగా మిగిలినరాక్షసులు రామబాణాగ్నికోర్వజాలక "అయ్యయ్యోమమ్ముల రక్షింపుము రక్షింపుమని" గట్టిగనఱచుచు బరువెత్తిపోయి ఖరునిశరణుజొచ్చిరి. అప్పుడు దూషణుఁడు ఆరాక్షసులనందఱినిబిలిచి బుజ్జగించి, మిగులకుపితుఁడై "రుద్రునిపైకి యముఁడుబోవునట్లు" రామునిపైకి మహావేగమునఁబోయె. అప్పుడా రాక్షసులందఱును మఱలివచ్చి దూషణునిమఱుఁగుఁజేరినవారై బలమును చలమునుపెనఁగొన, మద్దిచెట్లను తాటిచెట్లను ఱాళ్లను యాయుధములుగ గ్రహించి మఱల రామునిపైకిబరుగెత్తి అట్లుపరుగెత్తినవారును, శూలముద్గరగదాద్యాయుధములను, ధనుస్సులనుధరించి సేనయందున్న మహాబలపరాక్రమశాలులును నొక్కటిగఁజేరి, రామునిపై బాణవర్షమును శిలావర్షమును మిక్కుటముగఁగురిపించిరి. అట్టియెడ నారాక్షసులకును రామునకును మహాభయంకరమగు గొప్పయుద్ధముజరిగె మఱియు నారాక్షసులంతకంతకు మహారోషముగలవారై యతిమాత్రముగ రామునిపైకిబోయిరి. అప్పుడు రాముఁడు నలుదిక్కులను బాఱఁజూచె ఎటుఁజూచినను రాక్షసులు గదలు ఈటెలు మొదలగువాటినిధరించి బాణవర్షమును గురిపించుచుండిరి. అట్టియెడ రాముఁడు మహాభయంకరముగ సింహనాదమునుజేసి మహాప్రకాశమానమగు గాంధర్వాస్త్రమును రాక్షసులపైఁబ్రయోగించె. అంతట మడతెగని బాణప్రయోగమువలన వర్తులముగనేర్పడిన ధనువునుండి వేలవేలుగబాణములువెడలి దశదిశలనునిండినవయ్యె. అట్టిబాణములచే బాధింపబడిన రాక్షసులు, రాముఁడు మహాభయంకరములగు బాణములను పొదినుండి తీయుటనుగాని, వాటినిసంధించుటనుగాని మఱలధనుస్సునాకర్షించుటనుగాని యెంతమాత్రము కనుగొనజాలరైరి. (అనగా మహాతీవ్రముగ బాణములను బ్రయోగించె) అప్పుడు సూర్యునితోఁగూడ నాకాశమంతయు బాణములవలన గప్పఁబడుటచేత బాణపరంపరలచే గలిగినయంధకారమంతటను గప్పినదయ్యె. రాముఁడు మాత్రము ఆబాణములను నోటినుండి క్రక్కుచున్నవానివలె గాన్పించె అట్టిసమయమున కట్టలుకట్టలుగగూలువారును, కట్టలుకట్టలుగజచ్చినవారును, కట్టలుకట్టలుగ మూర్ఛనుబొందినవారును, నగురాక్షసులచే నాయుద్ధభూమియంతయు సందులేకనిండిసిబిడీకృతముగనుండె. మఱియు రాక్షసులు కొందఱుచచ్చిపడినవారును, కొందఱుభిన్నాభిన్నముగ నలఁగద్రొక్కఁబడినవారును, కొందఱునఱకఁబడినవారును, కొందఱుచీల్పఁబడినవారును, నైయారణరంగమునందు లెక్కింపనలవిగాక గుట్టలుగుట్టలుగబడియుండిరి. మఱియునునఱకఁబడినతలకాయవుఱ్ఱలతోను, బాహుపురులతోఁగూడి నఱకబడినచేతులతోను, నానావిధములగు నాభరణములచేనలంకరింపబడిన మొండెములతోను, తెగగొట్టఁబడినతొడలతోను మోకాళ్ళతోను, ఛిన్నాభిన్నములుగ నఱకబడినగుఱ్ఱములతోను, ఏనుఁగులతోను రథములతోను, పలువిధములగుఛత్రచామరములతోను విసనకఱ్ఱలతోను, విఱిగిపడియున్నటెక్కెములతోను, రామబాణపరంపరలచే ఖండింపఁబడినశూలములతోను, అడ్డకత్తులతోను, తునకలుతునకలుగజేయఁబడిన యీటెలతోను బల్లెములతోను, వెదచల్లబడిన గొడ్డళ్ళతోను, పిండిపిండిగజేయఁబడిన తాళ్ళతోను, తుం

టలుతుంటలుగ నఱకఁబడిన బాణములతోను నిండినదియై యాయుద్ధభూమి మహాభయంకరమైయుండె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదియైదవ సర్గముగిసెను.

▶(✽)◀

రాముడుదూషణుడు మొదలగురాక్షసులసంహరించుట.

ఇట్లు రామునిచేజంపఁబడుచున్నతనసేనలనుజూచి మహాబాహుఁడగుదూషణుఁడు, భయంకరమగు వేగముగలవారును, రణరంగములయందు వెనుకదీయనివారును, నగు రాక్షసుల నైదువేలమందిని రామునిమీదికి యుద్ధమునకుబంపె. అంతనాయైదువేలమంది రాక్షసులును రామునినాలుగుప్రక్కలనుజుట్టుకొని యతనిపై శూలములను, అడ్డకత్తులను, కత్తులను, రాళ్ళను, చెట్లను, బాణములనుసంయిలేక వైచిరి. అప్పుడుధర్మాత్ముఁడగునా రాముఁడు, మహాభయంకరంబును ప్రాణోపద్రవకరము నునగు నాశిలావృక్షవర్షములను తీక్ష్ణములగుబాణములచేబడగొట్టె. మఱియు రాముడు "ఆబోతువర్షమును లక్ష్యపెట్టక కండ్లుమూసికొనియుండునట్లు" ఆరాక్షసులయుక్క బాణవర్షమును లక్ష్యముసేయకనివారించుచు, సకలరాక్షసులను జంపుటకొఱకు మహాకోపమునుబొందెను. అట్లురాముఁడు మహాకోపమునునవలంబించి అత్యుత్సాహముచే ప్రకాశించుచుదూషణుని అతనిసైన్యమునుసర్వమును బాణములచేగప్పుకొనునట్లుజేసె. అంతవైరులను దూషించువాఁడును, సేనాధిపతియును, నగునాదూషణుడు పరమక్రుద్ధుఁడై పిడుగులతో సమానములగు బాణములను రామునిపైబ్రయోగించె. అప్పుడు మిగులశౌర్యవంతుఁడగురాముఁడు మిగులకోపోద్దీపితుఁడై క్షురమనుపేరుగల యొకయర్ధచంద్రాకారబాణమువలన నతనివిల్లును నాలుగుబాణములచే నతనినాలుగుగుఱ్ఱములనుద్రుంచె. అట్లురాముఁడు తీక్ష్ణములగుబాణములచే నాదూషణుని రథమునుగుఱ్ఱములనుజంపి మఱియొకయర్ధచంద్రాకారబాణముచే సారథియొక్కతలనుఖండించి పిదపమూడుబాణములను దూషణునియొక్కఱొమ్మునజూచిప్రయోగించె. అంతదూషణుఁడు రామునిచేద్రుంచబడినవిల్లును, చంపఁబడినగుఱ్ఱములును సారథియునుగలవాఁడును, విరథుఁడునునై, పర్వతశిఖరముయొక్క కాంతివంటికాంతిగలదియును, మహాభయంకరమైనదియును, బంగారుపుకట్లుగలదియును, దేవతలసైన్యమును లెస్సగబ్రహరించినదియును, ఇనుముతో జేయఁబడిన తీక్ష్ణములగు మేకులచేనావరింపఁబడినదియును, శత్రువులమెదడుచే దడుపఁబడినదియును, వజ్రాయుధముతోను పిడుగుతోనుసమానమైన తాకుడుగలదియును, వైరిపురద్వారములను పగులగొట్టునదియునునగు నొకపరిఘమనునాయుధమును దీసికొనెను. అట్లు మిగులక్రూరకార్యములను జేయునట్టిదూషణుఁడు కాళసర్పముతోసమానమైన యాపరిఘమునుదీసికొని రామునిపైకతివేగమునపరుగెత్తె. అంత రాముఁడు, పరిఘమునుదీసుకొని తనపైకివచ్చుచున్న యాదూషణునిజూచి హస్తాభరణములతో గూడిన యతనిరెండుచేతులను రెండుబాణములతోనరికివైచె అట్లుచేతులునఱకంబడినతోడనే యాదూషణునిచేతనున్నగొప్పపరిఘముజారి "ఇంద్రునిటెక్కెముచలె" నతనిముందుపడె. మఱియుదూషణుండట్లుచేతులుతెగి "దంతములురాలిపోయి మహాగంభీరముగనుండెడుగొప్పయేనుగువలెనే" భూమిపైబడె. అప్పుడట్లుయుద్ధమునఁదుచేతులుతెగి భూమిపైబడియున్న దూషణునిజూచిసమస్తజంతువులును రామునిమిగులస్తుతించె. ఇంతలో మహాకపాలుఁడును, స్థూలాక్షుఁడును, మిగులబలశాలియగుప్రమాథియను సేనానాయకులుముగ్గురును మృత్యువనుత్రాళ్ళచే గట్టఁబడినవారై మహాకోపముతోరామునిపైకిపరుగెత్తిరి. అట్లుపోవువారిలలో మహాకపాలుఁడుమిగులగొప్పశూలమును ధరించియును, స్థూలాక్షుఁడు అడ్డకత్తిచేతబట్టుకొనియును, ప్రమాథియనువాడు పరశ్వథమును తీసికొనియునుబోయిరి. అపుడురాముడు ఆరాక్షసులువచ్చుటనుజూచి "గృహస్థుడుఅతిథికర్ఘ్యమిచ్చునట్లు" ఆరాక్షసులను మహాతీక్ష్ణములగు బాణంబులచేగొట్టె అట్లు రాముడు బాణములనుబ్రయోగించి మహాకపాలునిశిరమునుద్రుంచె. మరియు ననేకబాణసమూహములచే ప్రమాథినిజంపె. అంతనాప్రమాథి "అనేకకొమ్మలతోనొప్పుచున్నచెట్టువలె,, భూమిపయినిబడె. మిగులకఱుకైనబాణములచే స్థూలాక్షునిగ్రుడ్లు చిదుగబొడిచె. పిమ్మటరాముడు మహాకోపమునుబొందినవాడై దూషణునివెంటవచ్చిన యైదువేలరాక్షసులను నైదువేలబాణములచే నొక్కనిమిషమాత్రములోజంపి యమునిపట్టణమునకుబంపె అట్లుదూషణుడును వానివెనువెంటవచ్చిన నైదువేలరాక్షసులను రాముఁడొక్కనిమిషమాత్రములోన జంపుటనుజూచిఖరుడు మిగులకోపోద్దీపితుడై మహాబలపరాక్రమశాలులగు సేనానాయకులనుచూచి వారలతోనిట్లనియెం.

ఓసేనాధ్యక్షులారా ! దూషణుడును వానితోడటోయిన యైదువేలసైన్యమును రామునిచేజంపఁబడిరి. కావున మీరు సమస్తసైన్యములతో గూడఁబోయి పలువిధములైనఆయుధములచే నాకుత్సితమానవుడగు రామునిఁజం

డుదు. అనియిట్లుఖరుడు సేనాధ్యక్షులకాజ్ఞాపించి మహాకోపమునుబొందినవాడై తానును రామునిపైకిఁబోయె. అప్పుడు శ్యేనగామియు, పృథుగ్రీవుడును, యజ్ఞశత్రుఁడును, విహంగముఁడును, దుర్జయుఁడును, కరవీరాక్షుఁడును, పరుషుఁడును, కాలకార్ముకుఁడును, మేఘమాలియును, మహామాలియును, సర్పాస్యుఁడును, రుధిరాశనుఁడును, అనుమహాబలపరాక్రమశాలులగు నీపండ్రెండుమంది సేనానాయకులును తమతమసైన్యములతోఁగూడ మేలైన బాణంబులఁ బ్రయోగించుచు రామునిపైకిఁబోయిరి. అంత మహాశౌర్యవంతుడగు నా రాముడు అగ్నిహోత్రముతో సమానమైనకాంతిగలవియును, బంగారముచేతను వజ్రములచేతను, నలంకరింపఁబడినవియును నగు నాబాణములచే నాసేననంతయునుజంపె. మఱియు పొగరాజుచుండెడి యగ్నివలెనున్న కాంచనపుంఖంబులగు నా రాముని బాణములు "వజ్రాయుధము గొప్పచెట్లను కరుకుక్కుమనిపఱుకునట్లు,, ఆరాక్షసులనందఱిని త్రుంచివైచె. మఱియు రాముఁడు యుద్ధరంగమున నొకని నొకబాణముచేతను నూరుమంది రాక్షసులను నూరుబాణములచేతను వేయుమందిని వేయిబాణములచేతను జంపె అప్పుడు రాక్షసులు రాముఁడు ప్రయోగించిన బాణపరంపరలచే బగులగొట్టఁబడిన కవచములుగలవారును, ఛిన్నాభిన్నముగఁజేయఁబడిన అంబులుగలవారును, విరుగగొట్టబడిన సర్వాభరణములుగలవారును, నై రక్తప్రవాహమునందు దేలుచు నేలంబడిరి. మఱియు నా యుద్ధభూమి యుద్ధముశేయుచుండెడి వేగముచే మాసిపీడిపోయిన తలవెండ్రుకలుగలిగి రణరంగమున జచ్చినవారును, రక్తమునందు దేలుచున్నవారును, నగు రాక్షసులచేఁగప్పఁబడినదై "దర్భలచేఁగప్పఁబడిన యజ్ఞవేదికవలె" నిట్లుప్రకాశించుచుండె నిమిషమాత్రములో, మహాభయంకరముగనున్న ఆయరణ్యము సమస్తరాక్షసులు జంపఁబడుటచే రక్తమాంసములయొక్క యడుసు బురదలుగలదియైన నరకముతో సమానముగనుండె. మానవుఁడును, కాలిబంటువును, నగు రాముడొక్కఁడు మహాక్రూరకర్ములును, రథగజతురగపదాతులతో గూడినవారును, నగు పదునాలుగువేలరాక్షసులను సంహరించె ఆమహాసైన్యమునకంతయును మహారథులగు ఖరుఁడును, త్రిశిరుడును శత్రుసంహారకుడగు రాముడును వీరుముగ్గురుమాత్రము నిలిచిరి. మహాబలపరాక్రమశాలులును, అతిభయంకరాకారులును, యుద్ధమునందు జయింపనలవిగానివారును, నగు తక్కిన రాక్షసులందఱును యుద్ధమునందు రాముని చేజంపఁబడిరి. అట్టియెడ మహాబలపరాక్రమశాలియగు రాముఁడొక్కఁడే యతిభయంకరమగు నమ్మహాసైన్యమునంతయు యుద్ధమునందొక్కపెట్టున జంపుటను జూచి ఖరుడు మిగులకుపితుఁడై యొకమహారథమునునెక్కి పండ్లుపటపటంగొరుకుచు రామునిపైకిబోయె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువైయారవసర్గముగిసెను.

-(*)రాముండు త్రిశిరునిసంహరించుట. (*)——

అంత సేనాధిపతియగు త్రిశిరుఁడు రామునికెదురుగాబోవుచున్న ఖరునకు అడ్డముగబోయి యిట్లనియె.

మహాశౌర్యవంతుఁడవగునో ఖరుఁడా! నన్ను బంపుము. నీవతిసాహసము జేయవలదు. మఱలుము. దీర్ఘబాహుఁడగు నీ రాముని యుద్ధమున నొక్కనిమిషమాత్రములో నేను జంపెదను. చూడుము ఇదిగో చూడుము నేను సత్యముగ జెప్పెదను. నాబాణములసాక్షిగ సమస్తరాక్షసులకును జంపఁదగినవాఁడగు నీ రాముని నేను జంపెదను ఓ ఖరుఁడా! నేనైనను యీ రాముని రణరంగమునందు జంపెదను. కాదేని యతనిచేతనైనను జచ్చెదను కావున నీవు కొంచెము సేపు రణోత్సాహమును విడిచి సాక్షివై చూచుచుండుము. మఱియు రాముఁడు నాచే జంపఁబడునేని నీవు మహాసంతోషమును బొందినవాడవై జనస్థానమునకు బొమ్ము అట్లుగాక నేనాతనిచే జంపఁబడుదునేని నీవు రాముని నెదిరించి యుద్ధము శేయుము అని యిట్లు త్రిశిరుడు ఖరుని ప్రార్థించె. అంత ఖరుడు సమ్మతించి, మంచిది పొమ్ము యుద్ధము జేయుము. అని వాని మాటలకు ఒప్పుకొనెను అంత త్రిశిరుఁడు రాముని నెదిరించి నిలిచె అట్టియెడ త్రిశిరుడు, యుత్తమగుఱ్ఱములచేఁగట్టఁబడినదియును, మిగుల ప్రకాశించుచున్నదియును, నగు రథమును ఎక్కి మూఁడుతలలుగలవాడు కావున మూడు శృంగములుగల పర్వతమువలె ప్రకాశించుచు, రామునిపైకి బరుగెత్తె. అట్లు రామునిపైకిబోయి త్రిశిరుఁడు "గొప్ప మేఘము నీటిధారలను విడుచునట్లు,, బాణవర్షము గురిపించుచు "నీటియందు దడిసిన భేరీధ్వనివలె,, సింహనాదమును జేసె అట్టియెడ త్రిశిరుఁడు యుద్ధమునకు వచ్చుటను జూచి, రాముఁడు తీక్ష్ణములగు బాణములను సంధించుచు వానినెదిరించె. అంత మహాబలపరాక్రమశాలులగు నా రామునకును, త్రిశిరునకును "సింహమునకును మదపుటేనుఁగునకును వలె" మహాయుద్ధము జరిగె ఆయుద్ధమునందు, మిగులఁగోపోద్దీపితుఁడైయున్న రాముని నుదుటిఁజూచి త్రిశిరుడు మూడు బాణములను ప్రయోగించె. అంత రాముఁడు మహా

కోపముగలవాఁడై మిగుల తొట్రుపాటుతో నాత్రిశిరునకిట్లనియె

ఆహా! యేమనిచెప్పుదు, ఈరాక్షసునిబలమును పరాక్రమమును మిగులగొప్పవి ఓరీ నీవు ప్రయోగించిన బాణములు నానుదుటియందు పుష్పములవలెనున్నవి. ఇంక నేను నీపైఁ బ్రయోగింపబోవుబాణములయొక్క రుచినిగనుఁగొనుము అనియిట్లు రాముఁడు త్రిశిరునితో జెప్పి మహాకోపమును బొందినవాడగుచు మిగులసంరంభముతో నాగసర్పములతో సమానములైన పదునాల్గుబాణములను త్రిశిరుని ఱొమ్మును జూచి ప్రయోగించె. మఱియు మహాశౌర్యవంతుఁడగు రాముఁడు, మిగుల వేగవంతములగు నాత్రిశిరునియొక్క నాలుగుగుఱ్ఱములను మహాతీక్ష్ణములగు నాలుగుబాణములచే జంపె. మఱియు రాముడు యెనిమిదిబాణములచే నాత్రిశిరుని సారథిని నేలబడద్రోసె. మఱియునొక బాణముచే రథముపైనున్న టెక్కెమును ఖండించివైచె. అంత త్రిశిరుఁడు ఆహతశేషమగు రథముమీదనుండి పైకెగురుటను రాముఁడుజూచి మహాతీక్ష్ణములగు ననేకబాణములచే నాత్రిశిరుని ఱొమ్ము పగులునట్లు జేసె. అప్పుడు త్రిశిరుఁడు ఆ రామబాణవృష్టిచే మూర్ఛనుబొందె. అంత మహాబలపరాక్రమములుగల రాముఁడు మిగుల కోపోద్దీపితుఁడై మహావేగముగలవియును, అతితీక్ష్ణములైనవియును, నగు మూడుబాణములచే నాత్రిశిరుని మూడుతలలను నఱికె. అట్లు మూడుతలలును ఖండింపఁబడినవాఁడై ఆత్రిశిరుఁడు నెత్తురును గ్రక్కుచున్న మొండెములతోను, శిరస్సులతోను, నేలంగూలె. అంత హతశేషులైన ఖరుని సైనికులు మహాభీతులై "పెద్దపులినిజూచి జింకలు పరుగెత్తిపోవునట్లు" నలుదిక్కులకు బరుగెత్తిరి. అట్లు పరుగెత్తుచున్న రాక్షసులనుజూచి ఖరుడు మహాకోపమును బొంది, వారలను, నిలునిలుడని మరల్చి "రాహుగ్రహము చంద్రుని బట్టబోవునట్లు" తాను రామునిపైకి బరుగెత్తె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదియేడవసర్గముగిసెను,

—※ శ్రీరాముడు ఖరునితో యుద్ధము జేయుట. ※—

అట్లు రాముఁడు యుద్ధమునందు దూషణుని, గూడ చంపుటనుజూచి ఖరుఁడుగూడ రాముని శౌర్యమును ఆలోచించి మిగులభయమును బొందె. మఱియు రాముఁ డొక్కడే సహాయముగూడని రాక్షససైన్యమును జంపి దూషణత్రిశిరులను సంహరించి మఱియు నుత్తమరాక్షసులను గూడ చంపుటను జూచి మహాబలపరాక్రమశాలియగు ఖరుఁడు మిగులవ్యసనమును బొందినవాఁడై "నముచియను రాక్షసుఁ డింద్రునిపైకి యుద్ధమునకు బోయినట్లు" రామునిపైకి బోయె. అట్లు రామునిపైకి బోయి ఖరుఁడు, తనబలముకొలఁదిని విల్లువంచి యల్లెత్రాటిని యాకర్ణాంతము నీడ్చి, మహాక్రోధమును బొందిన కృష్ణసర్పములతో సమానమైనవియును, రక్తపానము జేయునట్టివియును, నగు నారాచములను బాణములను రామునిపై వైచె. మఱియు ఖరుఁడు రథముపైఁ గూర్చుండి, విలువిద్యయందు తనకుగల సామర్థ్యముకొలది అనేకవిధములుగ బాణములను సంధించుచును, అస్త్రప్రయోగమునందు తనకుగల పాండిత్యంబేర్పడునట్లు అనేకవిధములగు శరములను బ్రయోగించుచును, యుద్ధమును జేసె. అంత మహారథుఁడగు రాముఁడును, అట్లు యుద్ధము జేయుచున్న ఖరునిఁ జూచి తన గొప్పవిల్లుచే బాణములను బ్రయోగించుచు దశదిశలను శరములచే నిండించె. మఱియు రాముఁడు, సహింపనలవిగానివియును, మంటలు గ్రక్కుచున్న యగ్నిస్తూలాత్రములవలెనున్నవియును, నగు బాణములను బ్రయోగించుచు "మేఘము వర్షించుచు నాకాశమును గప్పునట్లు" బాణవర్షమును గురిపించుచు బాణములచే నాకాశమును గాఢాంధకారమగునట్లు జేసె. అట్టియెడ నాఖరుఁడును రాముఁడును ఒకరిపైనొకరు బ్రయోగించుచున్న తీక్ష్ణములగు బాణపరంపరలచే నాకాశంబంతయు బాణములవలన నిండినదై యాకాశము గొంచెముగూడ నగపడకయుండె. మఱియు వారు ఒకరినొకరు చంపవలయునని తలంపుగలవారై యుద్ధము జేయుచు బ్రయోగించుకొనుచున్న బాణపరంపరలచే గప్పఁబడినవాఁడగుచు సూర్యుడు కొంచెముగూడ ప్రకాశింపడాయె. అప్పుడు ఖరుడు మహాకోపమును బొంది పండ్లు పటపటగొరుకుచు నాళీకాకారములగు బాణములచేతను, మహాతీక్ష్ణములగు వాదర్లుగల కర్ణికాకారములను బాణములచేతను "ఈటెలతో మదపుటేనుగును బొడుచునట్లు" రామునిగొట్టె. అట్టిసమయమున సకలభూతములును, రథముపైఁగూర్చున్నవాఁడును, ధనుర్బాణములు ధరించి యుద్ధము జేయుచున్నవాఁడును "పాశహస్తుడగు యమధర్మరాజువలె" మహాభయంకరాకారము గలిగినవాడును, నగు ఖరునిజూచి సకలభూతములును మిగులభయమును బొందె. మఱియు, మహాబలపరాక్రమశాలియగు రాముఁడు గొప్ప రాక్షససేనను జంపుటచే మిగుల శ్రమను బొందియున్నాఁడని ఖరుడు దలంచె. అట్లు దలఁచి ఖరుడు సింహమువలె పరాక్రమించి, "సింహము యేనుగుపైకి దుముకునట్లు" రామునిపై బరుగెత్తివచ్చె. అంత రాముడు తనపైకి బరుగెత్తివచ్చెడి ఖరుని చూచి "సింహము క్షుద్రమృగము

లనులక్ష్యము సేయనట్లు లక్ష్యము సేయఁడయ్యె. అంతఖరుఁడు సూర్యునితో సమానమైనకాంతిగలరథము నెక్కి "మిడుతఅగ్నిమైకిఁదుముకునట్లు" రాముని పైకిదుమికె. అట్లుఖరుఁడు రామునిపయికిదుమికితనహస్తలాఘవమునుజూపుచు నొకబాణముచే, శరసహితమగు రామునియొక్క ధనుస్సునుపిడికిటిపయిభాగమునకు సమముగనఱికివేసె. మఱియు ఖరుఁడుమహాకుపితుఁడై దేవేంద్రుని వజ్రాయుధముతో సమానములైన యేడుబాణములను రాముని కవచము పయిప్రయోగించె. అట్లుఖరుడు వేసినయేడుబాణముల చే, సూర్యునితో సమానమైనవర్చస్సుగలవాడగు, రామునికవచమువీడి నేలయందుబడె అంతఖరుఁడు మహాపరాక్రమశాలియగు రాముని వేయిబాణములచేనొప్పించి యమితసంతోషమునుబొంది సింహనాదమునుజేసె. అట్లు యుద్ధమునందు ఖరుఁడు రామునియొక్క సమస్తావయవములను నొచ్చునట్లు బాణములచేఁగొట్టె.

అట్లు బాణములచే గొట్టబడి మహాకోపము నొంది యుండు రాముఁడు "పొగలేకమండుచుండెడి యగ్నివలెనే" ప్రకాశించుచుండె. అంతవిరోధులను సంహరించునట్టి రాముఁడు శత్రునాశమును జేయుటకొఱకు మహాభయంకరమగు ధ్వనిగలదియును, మిగులగొప్పదియును, నగువేఱొకధనుస్సునకు నల్లెత్రాటిని సంధించె. అట్లు రాముఁడగస్త్యమహర్షిచే నివ్వఁబడినదియును, మిగులగొప్పదియును, విష్ణుదేవుని సంబంధమైనదియును, మహాశ్రేష్ఠమైనదియును, నగు నాయుత్తమధనుస్సును ఎక్కుబెట్టి ఖరునిపైకిబోయె. అట్లుబోయి రాముఁడుమిగులకుపితుఁడై, కనకపుంఖములుగలవియును, వంకరలేని గణువులుగలవియును, నగుబాణములచే నాఖరునిటెక్కెమును ద్రుంచె. అంతఆరమణీయమగు బంగారపుటెక్కెము అనేకతునకలుగావిఱిగి నేలపైఁబడె. అట్టియెడ నాటెక్కెపుతునకలు భూమిపైబ్రకాశించుటచే "దేవతలయాజ్ఞచే సూర్యుఁడు భూమికిదిగివచ్చెనో" అనునట్లు చూచువారలకు మహాశ్చర్యకరముగనుండె. అంతమర్మస్థానములను జక్కగదెలిసిన ఖరుఁడు మహాకోపమునుబొంది "చిల్లకోలలచే మదపుటేనుఁగుఁను బొడుచునట్లు" రామునిమర్మస్థానములయందు నాలుగుబాణములనుప్రయోగించె. అట్లుఖరుడువిడిచిన యనేకబాణంబులచేత పీడితుఁడై రాముఁడు రక్తప్రవాహమునందు దేలుచు మహాకోపమునుబొందె. విలువిద్యయందు మహాబుద్ధిమంతుఁడును, మిగులశ్రేష్ఠమగుధనుస్సుగలవాఁడును, నగురాముఁడు వేఱొక విల్లునుదీసికొని మహాశ్రేష్ఠములగు బాణములనుసంధించి యొకబాణమును శిరముమీఁదను, రెండుబాణములను రెండుభుజములయందును, ఱొమ్మునందు మూఁడర్ధచంద్రాకార బాణములనుప్రయోగించి యాఖరుని మిగులనొప్పించె. అట్లునొప్పించి పిమ్మటమహాశౌర్యవంతుడగురాముఁడు మిగులకోపోద్దీపితుఁడై ఖరునిసంహరింపగోరి సూర్యునితో సమానమైన తేజస్సుగలబాణములను పదమూఁడింటిని చేతికెత్తుకొనె. మఱియు దేవేంద్రునితో సమానుడును మిగులబలపరాక్రమశాలియును, నగురాముఁడు ఆపదమూఁడు బాణములనుగ్రహించినప్పుడునొకబాణముచేనాఖరునిరథముయొక్క కాడినినఱికి, నాలుగుబాణములచే గుఱ్ఱములను, ఆఱవబాణముచే నతనిసారథియొక్క తలను, మూఁడుబాణములచే రథముయొక్క నొగను, రెండుబాణములచేబండికంటెను, పండ్రెండవబాణముచే నాఖరునిచేతనున్నవిల్లును, ఖండించి పదమూఁడవబాణముచే నతనిని, మిగులనొప్పించె అంతఖరుఁడు విఱిగిపోయినవిల్లుగలవాఁడును, భగ్నమైనరథముగలవాఁడును, చంపఁబడినగుఱ్ఱములును సారథియునుగలవాఁడును నై గదచేతబుచ్చుకొని రథముపైనుండి క్రిందికిదుమికి భూమిపైనిలుచుండె అప్పుడు వేడుకజూచుటకు విమానారూఢులైవచ్చి యాకాశముననిలిచి యుద్ధమునుజూచుచున్న దేవతలును, మహర్షులును, మిగులసంతసించినవారై, అందరునువొకటిగజేరి చేతులుమొగిడ్చి మహారథుఁడగు రాముని మిగులప్రస్తుతించిరి.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదియెనిమిదవసర్గ ముగిసెను.

———(*) రాముడు ఖరుని సంహరించుట. (*)———

అంత మహాశౌర్యవంతుఁడగు రాముడు, అట్లువిరథుఁడై గదచేతబట్టుకొని నిలిచియున్న ఖరునిజూచి మృదువాక్యములవలెనున్న కఠినవాక్యములతో నిట్లనియె

ఓరిఖరుఁడా! నీవుయేనుఁగులతోను గుఱ్ఱములతోనురథములతోను నిండియున్న గొప్పసేనతోగూడినవాఁడవై సమస్తలోకములనుబాధింపుచు మహాభయంకరములగు కార్యములననేకములనుజేసితివి శ్లో॥ ఉద్వేజనీయో భూతానాం నృశంసః పాపకర్మకృత్। త్రయాణామపిలోకానామీశ్వరోపినతిష్ఠతి॥ సమస్తజీవరాసులకును వ్యసనముగలుగఁజేయువాఁడును, మహాఘాతుకుఁడును, పాపకృత్యములనుజేయువాఁడును క్రూరుఁడును, నగువాఁడుమూఁడులోకములకును ప్రభువైయున్నను నతఁడుసుఖమును బొందఁడు. ఓఖరుఁడా! లోకవిరుద్ధములగు కార్యములను జేయువాఁడును, మహాభయంకరుఁడును, నగువానిని "దుష్టసర్పమును

వలె" సర్వజనులును జంపఁ బ్రయత్నింతురు. మఱియు లోభముచేతగాని, కామముచేతగాని, శరీరము దెలియక పాపమును జేయునట్టివాఁడు భ్రష్టుఁడై "వడగండ్లుదిన్న నలికిండ్లపాము వలె" దానిఫలమును బొందును. ఓఖరుఁడా! దండకారణ్యవాసులును, ధర్మమార్గప్రవర్తకులును, మిగుల పూజ్యమైన స్వభావముగలవారును, నగు తాపసోత్తములను వధించితివే? దానివలన నీ కేమిఫలము గలిగె? శ్లో॥ నచిరంపాపకర్మాణః క్రూరాలోకజుగుప్సితాః। ఐశ్వర్యం ప్రాప్యతిష్ఠంతి శీర్ణమూలా ఇవద్రుమాః॥ పాపకృత్యములను జేయువారును, మహాక్రూరులును, లోకమునందుండెడు సమస్తజనులచే నిందింపఁబడువారును, నగు మానవులు బహుకాలము అయిశ్వర్యముగలిగి యుండజాలరు. అట్టివారు "వేరునశించిన వృక్షము వలె" స్వల్పకాలములోనే నశింతురు. శ్లో॥ అవశ్యంలభతే జంతుః ఫలం పాపస్యకర్మణః। ఘోరంపర్యాగతే కాలే ద్రుమః పుష్పమివార్తవం॥ ఋతుకాలము వచ్చినపుడు వృక్షములు పుష్పించునట్లు పురుషుఁడు అనుభవకాలము వచ్చినప్పుడు తాను జేసిన క్రూరకృత్యములయొక్క ఫలమును అవశ్యముగ ననుభవించితీరును. "శ్లో॥ నచిరాత్ప్రాప్యతే లోకే పాపానాం కర్మణాంఫలం। సవిషాణామివాన్నానాం భుక్తానాం క్షణదాచర॥ రాక్షసుఁడవగు నోఖరుఁడా! విషముగలిసిన యన్నమును భక్షించినయెడల దానిఫలము అతిస్వల్పకాలములోనే అనుభవమునకు వచ్చునట్లు, ఘోరములగు పాపకృత్యములయొక్క ఫలమును, అతిశీఘ్రకాలములోనే అనుభవమునకు వచ్చును ఓరాక్షసుఁడా! ఖరుఁడా! మహాఘోరములగు పాపకార్యములు జేయుచున్నవారును, లోకమునకు గీడుసేయుచున్నవారును, నగు దుర్మార్గులను జంపుటకై నేను ప్రభువగు దశరథమహారాజుయొక్క అజ్ఞచే వచ్చినాను మఱియును, "పాములు పుట్టలలో జొరబడి అవతలికి వెళ్ళిపోవునట్లు" ఇప్పుడు నేను ప్రయోగించెడు కాంచన భూషణములతో గూడిన బాణములు నీ దేహమునందు జొచ్చి భేదించుకొని యవతలికి వెళ్ళిపోవును ఓరిరాక్షసుఁడా! నీవిపుడు యుద్ధమునందు నాచేఁ జంపఁబడి నీసైన్యముతో గూడినవాఁడవై, ధర్మమార్గప్రవర్తకులును, దండకారణ్యవాసులును, నగు ఋషులను నీవు ఎవరెవరిని జంపి భక్షించియున్నావో వారితో గూడ జేరగలవు. మఱియు పూర్వము నీచేత హింసింపఁబడిన పరమ ఋషులిపుడు ఆకాశమునందు విమానారూఢులై యుండి ఇపుడు నా బాణపరంపరలచే నేలగూలి మిగుల దుఃఖపడుచుండెడు నిన్ను జూడగలరు. కులాధముఁడా! ఖరుఁడా! నీ యిష్టము చొప్పున యిప్పుడే నన్ను గొట్టుము. నీ చేతనైనమట్టుకు జూడుము. ఇదిగో యిప్పుడే "తాటిపండు నేలంబడునట్లు" నీతల నేలంబడవైచెదను. అనియిట్లు రాముఁడు జెప్పగవిని ఖరుఁడు మిగుల కోపోద్దీపితుడై నేత్రములను నెఱ్ఱగజేసి యందుండి నిప్పులం గ్రక్కుచు పండ్లు పటపటగొరుకుచు కోపాతిశయమున శరీరము దెలియక పకపకనవ్వి రామునిజూచి యిట్లనియె.

దశరథరాజనందనుండవగు నోరాముఁడా! నీవు రణరంగమున సామాన్యులగు రాక్షసులను జంపి మహాశూరుని వలె నిన్ను నీవే స్తుతిజేసికొనుచున్నావు మఱియు మహాబలపరాక్రమశాలులగువారు తమ శౌర్యధైర్యములను గణించి గర్వించి యెంతమాత్రమును దమ్ముతాము పొగడుకొనరు ఓరాముఁడా! ఇపుడు నిన్ను నీవే స్తుతిజేసికొనునట్లు, లోకమునందు మిగుల నల్పబుద్ధులును, పిఱికివారును నగు క్షత్రియాధములు, తమ్ము తామే నిష్ప్రయోజనముగ స్తుతించుకొందురు. మఱియు నిపుడప్ప అన్యుఁడగు వీరుఁ డెవఁడును, యుద్ధమునందు అంత్యకాలము సమీపించియుండగ సమయముగాని యపుడు తనకులమును తన్నును పొగడుకొనునా? (పొగడుకొనఁడు) ఓరాముఁడా! సమస్తవిధములచేత నిన్ను నీవు బొగడుకొనుటచేత నీయందలి చులకదనము స్పష్టముగ దెలియవచ్చుచున్నది. "బంగారుతో సమానమైన కాంతితో మండుచుండెడు దర్భలయొక్క నిప్పు యితరవస్తువులను గాల్పలేక తానే నశించినట్లు" ఆత్మస్తుతిజేసికొనువాఁడు యితరులను జంపలేక తానే జచ్చును ఓరాముఁడా! "కదలింపనలవి గానిదియును, ధరామినిధగించునట్టిదియును, గైరికాదిధాతువులచే నొప్పుచున్నదియును, నగు పర్వతము వలె' నీయెదుట గదాధరుఁడనై యుండెడు నన్ను జూచుచున్నావుగదా! "మూడులోకములను నశింపజేయుటకు పాశహస్తుఁడగు యముఁ డొక్కఁడే చాలియున్నట్లు" యుద్ధమున నీప్రాణములను దీయుటకు గదాపాణినై యుండెడు నేనొక్కఁడనే చాలుదును. ఇట్లు తన్నుదాను పొగడుకొననట్టి నిన్ను గణించి యనేకములు చెప్పవలసియున్నవి. అయినను వాటినన్నిటిని యిప్పుడు చెప్పను. అట్లు జెప్పుచుండినచో నాలస్యమగును. సూర్యుఁడస్తమించును. అంత యుద్ధమునకు విఘ్నముగలుగును నీవు పదునాలుగువేలరాక్షసులను జంపితివి. కావున నేనిపుడు నిన్ను వధించి వారియొక్క కన్నీళ్ళను దుడిచెదను. అనియిట్లు మహాశ్రేష్ఠములగు బాహువులుగల యాఖరుఁడు రామునితో జెప్పి మిగుల కోపోద్దీపితుఁడై వజ్రాయుధముతో సమానముగ తనచేతియందు బ్రకాశించుచున్న గదను గిరగిర త్రిప్పి విసరి రామునిపైవైచె. అట్లు ఖరునిచే బ్రయోగింపఁబడినదియును, నగు

ప్రకాశముగ నున్నదియును, మింగులగొప్పదియును నగు నాగద, త్రోవలోనున్న వృక్షములను బొదలను భస్మము జేయుచు రామునిసమీపమునకుబోయెం. అట్లువచ్చుచున్నదియును, మృత్యుపాశముతో సమానముగ ప్రకాశించుచు వచ్చుచున్నదియును, నగునాగదను, అనేకబాణములచే నాకాశముననే, యనేకతునకలుగనరికెను. అంతననేకతునకలుతునకలుగ నఱకఁబడినయాగద "మంత్రౌషధముల యొక్క బలముచే నశింపఁజేయఁబడిన సర్పమువలె" నేలంబడె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యిరువదితొమ్మిదవసర్గ ముగిసెను.

▸(✻)◂

———✻ రామునిచే ఖరుడు సంహరింపబడుట ✻–

అట్లు ధర్మాత్ముఁడగురాముఁడు ఖరునియొక్క గదను తనబాణములచే తునకలుతునకలుగనరికివైచి ఖరునిజూచి పరిహసించుచు సంభ్రమముతో నిట్లనియె

రాక్షసాధమా! ఖరుఁడా! నీవునీబలమంతయును జూపితివి. నీవునాకన్నతక్కువవాడవేయగుదువు నీకుబలము తక్కువయ్యును నిష్ప్రయోజనముగా ప్రేలుచున్నావు. నీవు మాటలయందుమాత్రము మహాశక్తిమంతుఁడవు. నీకు యీగదచే జయముగలుగుననివిశేషముగ నమ్మియుంటివి. అట్టియీగద నాబాణములచే తునకలుతునకలుగ జేయఁబడియిదిగోభూమిపైబడియున్నది. చూడుము. ఇదిగాక "నేనునిన్నుజంపి, నీచేవధింపఁబడినరాక్షసులకందఱికిని కన్నీళ్లుదుడిచెదనని" నీవింతకుముందుజెప్పినమాటగూడ నబద్ధమైపోయెను "గరుడుఁడు అమృతమునుహరించినట్లు" మహానీచుడవును, దుస్స్వభావముగలవాఁడవును, అనాచారుఁడవును, రాక్షసాధముడవునునగు నీప్రాణములనునేను బోగొట్టెద. ఇప్పుడు నిన్నునాబాణములచే నీదేహమంతయుజీల్చి నీశిరమునుఖండించెదనుజూడుము. అంతనురుగుడబ్బలతోగూడిన నీకొత్తనెత్తురునుభూమిలెస్సగ పానముజేయును మఱియునీవునేలంబడి దుమ్ములోపొరలుచు మట్టికమ్ముకొనినదేహముగలవాడవై చేతులనుసాచికొని పొందగూడని స్త్రీనివలె భూమినిగాఢముగ నాలింగనముచేసుకొనిపెద్దనిద్దురబోగలవు రాక్షసాధముఁడవగు నీవిట్లు పెద్దనిద్దురపోయినవెనుక యీదండకారణ్యవాసులగు ఋషులుమిగులసుఖముగనిచటనివసింతురు ఓఖరుఁడా! నాబాణపరంపరలచే నీజనస్థానముననుండెడు రాక్షసులందఱును నిశ్శేషముగజచ్చిన వెనుక దండకారణ్యమున నుండెడు ఋషులందఱునిర్భయముగ సమస్తప్రదేశములయందును తిరుగగలరు. మఱియునదివరకుసమస్తఋషులకును వెరవుబుట్టించుచున్న రాక్షసస్త్రీలు, ఇప్పుడు తమబంధువులందఱుచంపఁబడుచేత మహాభయమునుబొంది కన్నీళ్ళు విడుచుచు పరమదుఃఖితులై పారిపోవుదురు. నీతోసమానులును, నీకుభార్యలును, నగురాక్షసస్త్రీలు, పురుషార్థములు లేనివారై వ్యసనమునుజక్కగ దెలిసికొనగలరు ప్రాణులనుజంపువాఁడవును, మహానీచుడవును, దుష్టబుద్ధిగలవాడవును, నిరంతరముబ్రాహ్మణులకు కంటకుడవును, నగునో ఖరుఁడా! నిన్నుగుఱించిసమస్తఋషులును హావిస్సు హోమమునవేల్చునపుడు మహాభయమునుబొందుచుండిరి. అట్టిఋషులుయికమీద మహాసుఖముగనునిర్భయముగను, అగ్నికార్యములనుజేసికొనగలరు అనియిట్లు రాముఁడుమహాకోపముతో జెప్పె. అంతఖరుఁడు మిగులకోపోద్దీపితుఁడై మహాధ్వనిచేదిక్కులువిక్కటిల్లినట్లు సింహనాదమును సేయుచు రామునియిట్లనిబెదరించె. నీవుమహాగర్వముగలవాడవు. అందుచేతనేభీతినిబొందవలసిన కాలములయందుగూడ లక్ష్యములేకయున్నావు. నీవుమృత్యుపాశ బద్ధుఁడవైయుండుటచేత ఇదిచెప్పవచ్చుననియును, ఇదిచెప్పరాదనియును తెలిసికొనజాలకున్నావు మఱియునెవరుకాలపాశములచే గట్టఁబడినవారగుదురో, అట్టివారు యింద్రియాధీనముదప్పిమంచిచెడుగులు దెలిసికొనజాలరు. నీవిపుడుమృత్యుపాశబద్ధుఁడవై యుండుటచే నిట్లుప్రేలుచున్నావు. అనియిట్లుఖరుడురామునిజూచిచెప్పి మహాకోపమును బొంది బొమలుముడిబడ నాయుధమునకై నలుదిక్కులను జూచి సమీపమున నొకగొప్పచెట్టునుజూచె. అట్లుజూచి ఖరుడుమహారోషముతో పండ్లుపటపటకొఱుకుచు, తటాలున నావృక్షమును బెకలించె. మహాబలవంతుఁడగు ఖరుఁడు ఆవృక్షమును బెరికియెత్తుకొని గొప్పసింహనాదమును జేసి ఆవృక్షమునురామునిపైవైచుచు "ఓరామా! నీవుదీనితోసరి. చచ్చితివి' అనిచెప్పె అంతమహాబలపరాక్రమశాలియగు రాముఁడుతనపైవచ్చుచున్న యమ్మహావృక్షమును బాణపరంపరలచేఖండించివైచి ఖరునిజంపుటకై రౌద్రమగుకోపమునుసవలంబించె. రాముఁడట్లు కోపమునవలంబించి యాకోపాతిశయమువలన దేహమంతయు జెమటగారుచుండగ, కన్నులనుండినిప్పులనురాల్చుచు వేయిబాణములను ఖరునిపైప్రయోగించె ఆబాణములచే ఖరునిదేహమంతయుచిల్లులుబడె. ఆగాయములనుండి రక్తధారలునురుగుడబ్బలతోగూడ బైలువెడలి "ప్రస్రవణ పర్వతమునుండి జలధారలేయులై పారునట్లు" ప్రవాహముగబా

రెను. అట్టినెండమదోన్మత్తుండగు నా ఖరుండు రామునిబాణములచే విహ్వలాంగుడై నెత్తురుకంపుతో నతివేగముగ రాముని పైకిదుమికెను. అస్త్రశస్త్రసమస్తాస్త్రములను తెలిసినవాండును, మహాత్వరితమగు పరాక్రమముగలవాండును, నగు రాముండు, అతివేగముగవచ్చుచున్నవాండును, రక్తపూరితమైనదేహముతోడను దుర్గంధముతోడను గూడుకొన్నవాండును, నగుఖరునిజూచి కొంతవెనుకకుంబోయెను. అట్లు రాముడువెనుకకుబోయి ఖరునిజంపుటకు, అగ్నిశిఖతోసరిపోలునదియును, రెండవబ్రహ్మదండమువలె నున్నదియును, నగుబాణమునుబుచ్చుకొనెను. అట్టిబాణమునుదీసికొని, ధర్మాత్ముండగురాముండు, బుద్ధిమంతుండగు దేవేంద్రుడిచ్చినయాదివ్యబాణమునుసంధించిఖరునిపైబ్రయోగించెను. అంతనాబాణమునురాముండు ఆకర్ణాంతమునుదీర్చి విడుచుటచేనతివేగముగ "పిడుగువలె" మహాధ్వనినిజేయుచుంబోయి ఖరునియొక్కఱొమ్మునందుబడెను. అట్లాబాణముఱొమ్మునబడగానే ఖరుండుదహింపంబడినవాడై "శ్వేతారణ్యమునందురుద్రనేత్రాగ్నిచేత దహింపంబడిన యంధకాసురునివలె" నేలపైగూలెను. మఱియుదేవేంద్రునివజ్రాయుధముచేగూలినవృత్రాసురునివలెను, నురుగుచేతంజచ్చిననముచివలెను, ఇంద్రునివజ్రాయుధముచే హతుండైనబలాసురునివలెను, ఖరుండునేలంగూలి హతుండయ్యెను. అంతరాజఋషులు, బ్రహ్మఋషులు, మొదలగువారందఱునుమహాసంతోషమునుబొంది యచటికివచ్చి రామునిననేకవిధములంబ్రస్తుతించిరామునిజూచియిట్లనిరి.

ఓరాముండా! మహాతేజస్సుగలవాండును, వృత్రాసురపాకాసురులను సంహరించినవాండును, దేవతలకుబ్రభువును, నగుయింద్రుండు, ఖరుండుమొదలగు నీరాక్షసులను జంపుటకొఱకయ్యే పావనమగు శరభంగమహామునియాశ్రమమునకువచ్చె. అంతలోనే, నీవువచ్చుటనుజూచి యీకార్యమునీచే సమగ్రముగ నెరవేర్పింపదలచి యింద్రుండు మఱల తననివాసస్థానమునకుబోయెను. అంతమహామునులందఱునుజేరి, క్రూరాత్ములును, మిగుల పాపకర్ములును, నగు నీరాక్షసులనుజంపుటకొఱకు ఉపాయముగనిన్నుయీస్థలముజేరునట్లుజేసిరి. దశరథమహారాజ పుత్రుండవగు నో రాముండా! నీవుమాకొఱకుయీమహత్కార్యమునుజేసితివి. ఇదిమొదలు, మహర్షులందఱు దండకారణ్యమునందు సుఖముగధర్మమునాచరింపంగలరు. అనియిట్లుమహర్షులుచెప్పుచుండగ దేవతలుచారణులుమొదలగు వారందఱునుమహాసంతోషమునుబొందియొకటిగజేరి పరమాశ్చర్యముతో భేరులనువాయించిరామునిపై బుష్పవృష్టినిగురిపించి యిట్లనుకొనిరి. రాముండొకటన్నర ముహూర్తకాలములోనన్న మహాయుద్ధమునందు మిగులతీక్ష్ణములగు బాణములచేత మహాక్రూరకర్ములగు ఖరదూషణాది రాక్షసులను, పదునాలుగువేలమందినిసంహరించెను. విదితాత్ముండగు రాముండు మిగులగొప్పకార్యముజేసెను. ఇదిమిగులనాశ్చర్యము. ఇతనిపరాక్రమమును, సామర్థ్యమును, విష్ణుదేవునిపరాక్రమసామర్థ్యములవలె" అత్యద్భుతములైయున్నవి. ఆహా! ఇదిమిగులనాశ్చర్యము. అనియిట్లు దేవతలుమొదలగు వారందఱునుజెప్పకొనుచు రాముని అనేకప్రకారములుగ స్తుతించివారివారిస్థానములకుబోయిరి. పిమ్మటమహాశౌర్యవంతుండగులక్ష్మణుండు, రాముండు సర్వరాక్షసులనుజంపి జయమునుబొందెననివిని మహాసంతోషమువొంది సీతాసమేతుండై పర్వతగుహనుండివెలుదేరివచ్చి యాశ్రమమునందుబ్రవేశించె. అంతజయమును బొందినవాండును, మహాశౌర్యవంతుండును, నగురాముండట్లు మహర్షులచేగొనియాడంబడినవాండును లక్ష్మణునిచేనెదురుకొనంబడి పూజింపంబడినవాండును, నైయాశ్రమమునందుబ్రవేశించె. అపుడుసీతాదేవి, విరోధులను జంపువాండును, మహర్షులకు సుఖముగలిగించువాండును, నగురామునిజూచి అత్యంతానందమునుబొందినదైయె తనభర్తను గాఢాలింగనముజేసికొనె. మఱియు జనకమహారాజపుత్రికయగు సీతాదేవి చంపంబడిన రాక్షససమూహములనుజూచి సంతసించె. అట్లు రాక్షసులనందరినిజంపిన రాముండు బాధనొందకుండుటకు పరమానందమునుబొందె. అంతచంద్రునికాంతివంటికాంతితోసమానమైనకాంతిగలసీతాదేవి, రాక్షససమూహములను జంపినవాండును, మహాసంతోషమును బొందినపరమర్షులచేత బూజింపంబడినవాండును, నగురాముని మఱిమఱి గాఢాలింగనముజేసికొని పరమానందమును బొందె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ముప్పదియవసర్గ ముగిసెను.

—{ అకంపనుడు రావణాసురునివద్దకుబోయిసీతను అపహరించుమనిచెప్పుట. }—

అంతరావణునిచారుండగు అకంపనుడనువాండు మహావేగముగ జనస్థానముననుండి లంకకుబోయి రావణాసురునిజూచియిట్లనియె.

రాక్షసేశ్వరుడవగు నో రావణాసురుండా! జనస్థానమననున్న రాక్షసులందఱును జంపంబడిరి. ఖరుండుగూడ యుద్ధమునజంపంబడె. నేనుమాత్రము మహాప్రయాసము

చేతదప్పించుకొనివచ్చితిని. అనియకంపనుడు జెప్పె. అంత రావణాసురుడు మిగులకోపోద్దీపితుండై కండ్లెఱ్ఱజేసి నిప్పులంగ్రక్కుచు, "సమస్తప్రపంచమును తగులబెట్టువాని వలె" చుఱుకుచూపులచే జూచుచునిట్లనియె.

ఓరీ! అకంపనా! ఎవ్వడు మృత్యుపాశవశుండై మిగులరమణీయమగు నాజనస్థానమునయున్న రాక్షసులనందఱిని జంపె? అట్లు చంపినవాడిక సమస్తలోకములయందును ఎవరిమఱుగు జేరగలడు? ఇంద్రుడుగాని, కుబేరుడుగాని, యముడుగాని, నాకపకృతిజేసి సుఖమును బొందజాలరు. నేనుయమునికి యమధర్మరాజను. అగ్నిహోత్రునినైన తగలబెట్టుదును. మృత్యువునుగూడ మరణమును బొందింతును. ఓయకంపనుడా! నేనుకుపితుండనగుదునేని నాపరాక్రమముచే సూర్యాగ్ని జ్వాలాత్రములనుగూడ దహింతును. వేగమునందు వాయువేగమును జయింతును. అనిరావణాసురుడకంపనునితో జెప్పె అంతఅకంపనుడట్లుకోపమునుబొందిన రావణాసురునిజూచి మహాభయమునుబొంది చేతులనుముకుళించుకొని భయమువలన మాటలుతొట్రుపడుచుండ అభయంబివ్వమని ప్రార్థించె. అంత రాక్షసోత్తముండగు రావణాసురుడు ఆయకంపనునకభయంబిచ్చె. ఆయకంపనుడు భయమునువిడిచి ధైర్యముతో మఱల రావణాసురునిజూచి యిట్లనియె.

ఓమహాప్రభూ! రావణేశ్వరా! మహాశ్రేష్ఠమగు రూపముగలవాడును, మిగులయౌవనవంతుడును, ఎఱ్ఱదమ్మిపూవు వంటి మోవిగలవాడును, గుండ్రమును నునుపునైనభుజములుగల మహాశౌర్యవంతుడును, మిగుల కీర్తిగలవాడును, ఈడులేని బలపరాక్రమములు గలవాడును, దశరథమహారాజపుత్రుడును, నగురాముడనువాడొకడుగలడు. అయ్యో! నేనేమిచెప్పుదును ఆరాముడనువాడే జనస్థానమునందున్న ఖరదూషణాది రాక్షసులనందఱినిజంపె. అనియకంపనుడుజెప్పె. అంతరాక్షసేశ్వరుడగు రావణాసురుడు నాగుపామువలె నిట్టూర్పులనువిడుచుచు నకంపనునిజూచి యిట్లనియె.

ఓయకంపనా! ఆరాముడు దేవేంద్రునితోను, సమస్తదేవతలతోను, గూడినవాడై జనస్థానమునకువచ్చినాడా? ఏమి? అదినాకు సవిస్తరముగజెప్పుము. అనిరావణాసురుడడిగె. అంతఅకంపనుడు యిట్లనియె.

ఓరావణేశ్వరా! రాముడు మహాపరాక్రమశాలి. ధనుస్సుపట్టెడివారలలో నెల్లనుత్తముడు. సమస్తములైన దివ్యాస్త్రములను తెలిసినవాడు. యుద్ధమునందు దేవేంద్రునితోసమానుడు. ఆరామునకు, మహాబలపరాక్రమశాలియును, ఎఱ్ఱనినేత్రములుగలవాడును, భేరీధ్వనివంటి కంఠధ్వనిగలవాడును, చంద్రునితోసరిపోలు ముఖముగలవాడును, లక్ష్మణుడనుపేరుగలవాడును, నగునొకతమ్ముడుగలడు. శ్రీమంతుడును, రాజోత్తముడును, నగునారాముడు ఆలక్ష్మణునితో గూడుకొనియున్నవాడై "అగ్ని, వాయువుతో గూడుకొని ఒప్పుచున్నట్లు" ప్రకాశించుచు జనస్థానమునయున్న రాక్షసులనందఱినిజంపె. మిగులపూజ్యమైనగుణములుగల దేవతలెవరును రామునికిసహాయముగ నచటికిరాలేదు. ఓరావణాసురుడా! రామునిచే బ్రయోగింపబడినవియును, బంగారుపింజలుగలవియును, తెకరలతో నొప్పుచున్నవియును, నగుబాణములు అయిదుతలలుగలపాములై సమస్తరాక్షసులను భక్షించె. రాక్షసులుమిగులభీతినిబొంది యుద్ధమునందు తమ్మునుగాపాడుకొనుటకొఱకు ఏయేయాయుధములతో యుద్ధముజేసిరో, రాముడును ఆయాఆయుధములనుధరించి వారికెదుటనగపడుచుండె. పావనుడవగునోరావణుడా! ఈప్రకారముగనారాముడు జనస్థానమునయున్న రాక్షసులనందఱినిజంపెనని యకంపనుడుజెప్పె. అంతరావణాసురుడు మఱల నిట్లనియె.

ఓరియకంపనా! నేనుజనస్థానమునకుబోయి యారామలక్ష్మణులను జంపెదను. అని రావణాసురుడుచెప్పగ అకంపనుడు మఱల యిట్లనియె.

ప్రభుండవగు నోరావణేశ్వరా! రామునియొక్క శౌర్యధైర్యములను యథార్థముగ చెప్పెదనువినుము. మహాకీర్తిమంతుడగు రాముడు అన్యులకసాధ్యుడు. అతడు కుపితుడయ్యెనేని పరాక్రమించి పూర్ణముగపాఱుచుండెడు నదీప్రవాహమును తనబాణములచే నిలుపగలడు. మఱియునతడు కోపించెనేని నక్షత్రములతోను, నవగ్రహములతోను, సకలనక్షత్రములతోనుగూడిన ఆకాశమునునశింపజేయును. ఓరావణాసురుడా! శ్రీమంతుడగురాముడు నశించెడు భూమినైనలేవనెత్తును. సమస్తమునకునుప్రభుడగురాముడు సముద్రముయొక్క చెలియలికట్టను జంపి సమస్తలోకములనుముంచి నశింపజేయును. మఱియునతనిబాణప్రయోగము వాయువేగమును, సముద్రజలమును గూడవర్ధించును. మహాకీర్తిమంతుడగురాముడు తనపరాక్రమముచేత సమస్తలోకములను నశింపజేయుటకును, మఱలసృజించుటకును శక్తిమంతుడు. పదితలలుగలరావణాసురుడా! "పాపులకు స్వర్గమునుబొందనలవిగానట్లు" రామునియుద్ధమునందు జయించుటకునీకును, సమస్తరాక్షసులకును కొంతమాత్రమును సాధ్యముగాదు. వేయి జె

ప్పనేల? దేవదానవులందఱు నొకటిగఁజేరివచ్చినను, ముని జంపఁజాలరని తలచెద. ఓరావణాసురుఁడా! రాముని జంపుటకు నుపాయమొకటిగలదు. దానిని జెప్పెదనువినుము. ఆరామునకు, సమస్తలోకములలోనుండెడు స్త్రీలలోనెల్ల శ్రేష్ఠురాలును, శ్యామైన నడుముగలదియును, మహాసౌందర్యముగలదియును, హెచ్చుతక్కువలులేక సమముగానుండెడు సర్వావయవములుగలదియును, స్త్రీలలోనెల్ల యధికురాలును, సమస్తములైన రత్నభూషణములతో నలంకరింపబడినదియును, సీతయనుపేరుచేనొప్పుచున్నదియును నగునొకభార్యయున్నది ఆసీతకుసమానురాలగుస్త్రీ, దేవతాస్త్రీలయందుగాని, గంధర్వస్త్రీలయందుగాని, యప్సరస్త్రీలయందుగాని, దానవవనితలయందుగాని, లేదు. ఇంకమనుష్యస్త్రీలయందుండదరనిచెప్పనేల? నీవిపుడు దండకారణ్యమునకుబోయి బలవంతముచేనారాముని భార్యనుదీసికొనిరమ్ము అంతనారాముఁడు అమితకాముకుడు కావునసీతాదేవిని విడిచియుండలేనివాఁడైచచ్చును. అనియకంపనుడుచెప్పె అంతరాక్షసేశ్వరుఁడగు రావణాసురుడువిని ఓరియకంపనా! బలేబహుమంచియుపాయమునుజెప్పితివనిచెప్పి చక్కగానాలోచించి మఱలఅకంపనుని జూచియిట్లనియె.

ఓయకంపనా! బహుబాగాజెప్పితివి. మంచిది. నేనొక్కఁడనే సారథిసహితుఁడనై ఉదయమునబైలుదేరిపోయి మహాసంతోషముతో సీతనునాలంకానగరమునకు దీసికొనివచ్చెదను అనిరావణాసురుఁడకంపనునితోజెప్పి,ఉదయమునలేచి, గాడిదలచే నీడ్వబడినదియును, సూర్యునికాంతివంటికాంతిగలదియును, సమస్తదిక్కులను ప్రకాశింపజేయునదియును, నగురథమునెక్కినవాఁడై ఆకాశమార్గమునబోయె అట్లాకాశమార్గమున బోవుచున్న రాక్షసేశ్వరుఁడగురావణాసురునియొక్క మహారథము మేఘములలోనిచంద్రునివలెనొప్పుచుండె అట్లుపోయిపోయి రావణాసురుడుమారీచునియొక్క యాశ్రమమునుజేరి రథమునునిలిపి తాటకీపుత్రుడగు మారీచునియొద్దకుఁబోయె. అంతనామారీచుఁడు రావణాసురుని అర్ఘ్యపాద్యాది విధులచేబూజించి అమానుషములగు భక్ష్యభోజ్యములచేత రావణాసురునితృప్తిబొందించి మిగులసన్మానించి, అర్థయుక్తములగుమంచిమాటలతో రావణాసురునిజూచి యిట్లనియె

రాక్షసేశ్వరుడవగు నోరావణుఁడా! రాక్షసులకందఱికిని క్షేమమేగదా? నీవింతవేగముగవచ్చుటచేత నేదైనఒకవిశేషముగలదని నాకుసందేహముగలుగుచున్నది అనియిట్లు మారీచుఁడుజెప్పె. అంతమహాపరాక్రమశాలియునుమాటలయందునిపుణుఁడును, నగురావణాసురుడు మఱలమారీచునిజూచి యి.

మారీచుఁడా! నాయనా! యేమనిచెప్పుదును జనస్థానమునందుండు నాబంటువాఁడైనఖరుని, వ్యసనరహితములగుకార్యములుగల రాముఁడుచంపె. మఱియునట్టివారిచేనైనను జంపనలవిగానివారైన జనస్థానమునందున్న రాక్షసులందఱును రామునిచేతనేజంపఁబడిరి. కావుననారాముని జంపుటకై నేనొకయుపాయమును వెదకితిని. ఆరాముని భార్యయగు సీతనపహరించితినేని నతఁడుభార్యావియోగవ్యసనముచేజచ్చును. కావుననారామునిభార్య నపహరించుటయందు నీవునాకుసహాయముగ నుండవలయు. అని రావణాసురుఁడుజెప్పె అంతమారీచుఁడు రావణునిజూచియిట్లనియె.

రాక్షసోత్తముఁడవగు నోరావణాసురుడా! మిత్రునివలెనటించుచు నీకుపరమశత్రువై నీనాశనమును గోరుచున్నవాఁడెవ్వఁడునీకు సీతపేరుజెప్పె? ఎవఁడునీచేత తిరస్కరింపఁబడి నిన్నుజూచి యోర్వలేకయున్నాఁడు? సీతాదేవిని లంకకుదెమ్మని యేమూర్ఖుఁడుజెప్పె? నాకతనిపేరు జెప్పుము సమస్తరాక్షసగణములకు నాయకుడవగు నిన్నెవడు నశింపజేయఁగోరుచున్నాఁడు? నిన్నిట్లుప్రేరేపించినవాఁడునీకుపరమశత్రువు ఈవిషయమునందెంతమాత్రమును సంశయములేదు ఓయన్నా! రావణేశ్వరా! దుష్టసర్పముయొక్క నోటనున్న కోరలనుబెరుకుమని నీకెవ్వఁడుచెప్పెను? అయ్యో ఇట్టియుపాయముచేత నీకెవడిట్టి యవినీతులుగరపె? రాక్షసేశ్వరుఁడవగు నోరావణాసురుడా! సుఖముగ నిదురించుచున్న నీతలపై నెవఁడు గొట్టెను? (అనగాకారణములేకయే నీకాపదను బుట్టింపదలచినవాఁడెవఁడు) రావణుఁడా! నేనొకవిశేషము జెప్పెదవినుము. పావనమైన కులమందుజన్మించుటే శ్రేష్ఠమగుతొండము గాగలదియును, పరాక్రమమే మదజలము గాగలదియును, మిగులనున్నతములైనచేతులే దంతములుగాగలదియును, నగురాముఁడను మదపుటేనుఁగను రణరంగమునందు, దలయెత్తిచూచుటకైన, నెవరికిని సాధ్యముగాదు. మఱియు రణరంగమున నుండుటయే క్రోధముచేత నడుమునంటియుండెడు తోకగలదియును, మహాపరాక్రమవంతులగు రాక్షసులనుమెకముల జంపునదియును, బాణములేగోళ్లుమొదలగు నవయవములుగాగలదియును, మిగులపదునుగల కత్తులే కోరలుగాగలదియును, నైనిదురించుచున్న పురుషోత్తముఁడగు రాముఁడనుసింహమును నీవెంతమాత్రమును మేలుకొలుపవద్దు. రాక్షసులకు ప్రభుఁడవగు

నోరావణాసురుఁడా! అన్నా! విల్లను మొసలిగలదియును, భుజబలమను బురదగలదియును, బాణములను అలలవరుసలుగలదియును, గొప్పయుద్ధమను నీటివెల్లువగలదియును, మహాభయంకరమైనదియునునగు రాముఁడను పాతాళబిలమునందుఁజొచ్చుట నీకెంతమాత్రముఁ దగదు. లంకేశ్వరుఁడా! రాక్షసోత్తమా! రావణాసురుఁడా! అట్లగుటంజేసి నీవుక్రోధమును విడువుము. శాంతుఁడవగుము. నామాట వినుము నీవుకుదురుగ లంకకుఁబొమ్ము. నీభార్యలతోఁగూడి యిష్టోపభోగములననుభవించుచు సుఖముగనుండుము రాముఁడు తనభార్యాసమేతుఁడై యరణ్యమున సంచరించుచుండును. అనియిట్లు మారీచుండు చెప్పె. అంతబదితలలుగలరావణాసురుఁడు బదులుమాటాడక అచటనుండి మఱలి లంకకుఁబోయి మిగులరమణీయమగు తనయింటియందుఁ బ్రవేశించె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ముప్పదియొకటవ సర్గముగిసెను.

శూర్పణఖ మహాకోపముతో లంకాపట్టణమునకుబోయి రావణాసురునిజూచుట.

పిమ్మట రాముఁడొక్కఁడే మిగులక్రూరకర్ములగు పదునాలుగువేలరాక్షసులను, ఖరదూషణత్రిశిరులను జంపుటనుజూచి శూర్పణఖగొంతెత్తి హాహాయని ఏడ్చుచు మేఘగర్జనవలె మహాధ్వనిగలుగునట్లఱచె అట్లఱచుచు శూర్పణఖ యితరులకుఁ జేయనలవిగానిదగు రామునియొక్క కార్యమునుఁజూచి మహాభయమునుబొందినదియై కన్నులనుండి నీరు ప్రవహింపగా నేడ్చుచు లంకానగరమునందు రావణాసురుఁడున్న స్థలమునకుబోయె అట్లుబోయి దేవతలతోఁగూడ విమానముపైగూర్చుండియున్న దేవేంద్రునివలె మంత్రులతోఁగూడ పుష్పకవిమానముమీద గూర్చుండియున్నవాఁడును, దీప్తతేజుఁడును, నగురావణాసురుని శూర్పణఖ చూచె. మఱియు సూర్యునితోసమానమైన కాంతిగలవాఁడును, బంగారుసింహాసనముపైగూర్చున్నవాఁడును, "బంగారువేదికయందున్నదియును, విశేషముగ నేతితో హోమముజేయుటచే జక్కఁగ వెలుఁగుచున్నదియునునగు నగ్నిహోత్రమువలె" ప్రకాశించుచున్నవాఁడునునైన రావణాసురుని శూర్పణఖజూచె మఱియు, దేవతలకును, గంధర్వులకును సమస్తభూతములకును, మహర్షులకును యుద్ధమునందు జయింపశక్యముగానివాఁడును, యుద్ధవీరుఁడును, "నోఱుదెఱచుకొనియున్న యమధర్మరాజువలె," నున్నవాఁడును, నగురావణాసురుని శూర్పణఖ చూచె. మఱియు దేవాసురులకు జరిగిన రణరంగములయందు వజ్రాయుధమువల్లనైన గాయములుగలవాఁడును, ఐరావతమనెడి దేవేంద్రుని యేనుఁగుయొక్క కొనకొమ్ములచే గీరబడిన గాయములతో నొప్పుచుండెడు ఱొమ్ముగలవాఁడును, నగురావణాసురుని శూర్పణఖ చూచె మఱియు ఇరువదిచేతులుగలవాఁడును, పదికంఠములుగలవాఁడును, మిగులరమణీయములైన ఛత్రచామరములు మొదలగు పరికరణములుగలవాఁడును, విశాలమగు ఱొమ్ముగలవాఁడును, మహాశూరుఁడును, రాజచిహ్నములతో నొప్పుచున్నవాఁడును నగురావణాసురుని శూర్పణఖ చూచె. మఱియు వైడూర్యపుమణులు చెక్కబడిన యాభరణములతో ప్రకాశించుచున్నవాఁడును, పుటముదీసిన బంగారుకుండలములుగలవాఁడును, మంచిభుజములుగలవాఁడును, తెల్లనిపండ్లుగలవాఁడును, గొప్పనోరుగలవాఁడును, పర్వతాకారుఁడునునగు రావణాసురుని శూర్పణఖజూచె మఱియు దేవతలతో యుద్ధముజేయునపు డనేకమారులు విష్ణుచక్రాయుధముచేతను, యితరములైన గొప్పరణరంగములయం దనేకబాణములచేతను, గొట్టబడియా దెబ్బలను లక్ష్యముసేయకున్నట్టి రావణాసురుని శూర్పణఖ చూచె. మఱియు సమస్తయుద్ధములయందును దేవతలతోటి వైరమునుబూని సర్వాయుధములచేతఁగొట్టఁబడిన శరీరముగలవాఁడును, కలతపెట్టుటకుశక్యముగాని మహాసముద్రములను కలతనుబొందించువాఁడును, సకలకార్యములను మహాశీఘ్రముగఁ జేయువాఁడును, నగురావణాసురుని శూర్పణఖ చూచె మఱియు కులపర్వతములను బంతిచెండువలె పైకెగరవేయువాఁడును, దేవతలను జక్కఁగ బ్రహరించువాఁడును, ధర్మములను నాశనముజేయువాఁడును, పరులభార్యలను చెరపట్టువాఁడును, నగురావణాసురుని శూర్పణఖ చూచె. మఱియు సమస్తములగు దివ్యాస్త్రములయొక్క ప్రయోగమును జక్కఁగ దెలిసినవాఁడును, నిరంతరమును యజ్ఞములను జెరుచువాఁడును, భోగవతీపురమునకుబోయి వాసుకినిజయించి బలవంతముచేత తక్షకునిప్రియభార్య నపహరించినవాఁడును, నగురావణాసురుని శూర్పణఖ చూచె ఎవ్వఁడు కైలాసమునకుబోయి కుబేరునిజయించి యాకుబేరునిదియును, కామగమనముగలదియునునగు పుష్పకవిమానమును దెచ్చెనో యట్టి రావణాసురుని శూర్పణఖజూచె. మఱియు నెవ్వఁడు మహాకుపితుఁడై దివ్యమగు చైత్రరథమను కుబేరునియుద్యానవనమును, నళినిపుష్కరిణియును, దేవేంద్రునినందనవనమును, ఇతరదేవతలయొక్క యుద్యానవనములను, పాడుచేసెనో, యట్టి రావణాసురుని శూర్పణఖజూచె. ప

ర్వతశృంగముతో సమానుఁడగునెవఁడు, పూజ్యులైనవారును, విరోధులను దపింపఁజేయువారును, నగుచంద్రసూర్యులుదయించునపుడు చేతులతోనడ్డగించెనో, యట్టిరావణాసురునిశూర్పణఖచూచె. మఱియునేధీరుఁడు పూర్వముమహారణ్యమునందు పదివేలసంవత్సరము లత్యుగ్రతపముఁజేసి తనతలలనుగోసి బ్రహ్మదేవునికి సమర్పించెనోయట్టిమహాత్ముఁడగు రావణాసురుని శూర్పణఖచూచె. ఎవనికిమానవుఁడొకఁడుదప్ప దేవతలవలనగాని, దానవులవలనగాని, గంధర్వులవలనగాని, పిశాచములవలనగాని, పక్షులవలనగాని, ఉరగులవలనగాని, యుద్ధములయందుచావులేకుండునట్లు వరమునుజెందెనో, అట్టిరావణాసురుని శూర్పణఖచూచె ఏమహాబలిష్ఠుఁడు, యజ్ఞములయందు బ్రాహ్మణులవలన మంత్రములచేత నుతింపఁబడినదియును, మిగుల పావనమైనదియును, నగు యజ్ఞశాలలయందలి సోమమును పాడుసేయునో, యట్టి రావణాసురుని శూర్పణఖ చూచె. మఱియు యజ్ఞపూర్తియందు దక్షిణలిచ్చు సమయమున నాశనముఁజేయువాఁడును, మిగులక్రూరుఁడును, బ్రాహ్మణులనుజంపువాఁడును, దుర్నడతగలవాఁడును, మహాకఠినుఁడును, నిర్దయుఁడును, జనులకుగీడుచేయుటయందు దాసక్తిగలవాఁడును, నగురావణాసురుని శూర్పణఖచూచె. మఱియుసకలభూతముల నేడ్పించువాఁడును, సమస్తలోకములకును భయమునుగల్పించువాఁడును, మహాశౌర్యవంతుఁడును, మిగులబలశాలియును తనతోబుట్టువును, నగురావణాసురునిశూర్పణఖచూచె. మిగులనుత్తమములైన వస్త్రములును, భూషణములును, గలవాఁడును, శ్రేష్ఠములైనపూలదండలచే బ్రకాశించుచున్నవాఁడును, సింహాసనమునందుసుఖముగ గూర్చుండియున్నవాఁడును, "సంహరింపబ్రయత్నించియున్న మృత్యువునకుమృత్యువువలె' నున్నవాఁడును, రాక్షసేశ్వరుఁడును, మహాభాగుఁడును, పులస్త్యబ్రహ్మవంశమునందుబుట్టినవాఁడును, వైరివీరులను జంపువాఁడును, ప్రధానులచేఁబరివేష్టింపఁబడినవాఁడును, నగు రావణాసురునియొద్దకుఁబోయి శూర్పణఖ మహాభయముచేస్వాధీనముదప్పినయవయవములుగలదియై రావణాసురునితోనిట్లనియె.

మఱియు మహాత్ముఁడగు లక్ష్మణునిచేత విరూపిగఁజేయఁబడినదియును, నిర్భయురాలుగ నెల్లెడల సంచరించునదియును, నగుశూర్పణఖ మహావిశాలములగు నేత్రములచేఁబ్రకాశించుచున్న రావణాసురునిజూచి మహాభయంకరమగుమాటలతోనిట్లనిజెప్పదొడఁగె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలిముప్పదిరెండవసర్గముగిసెను.

——— ❋ శూర్పణఖరావణాసురునినిందించుట. ❋ ———

అంతశూర్పణఖ, ప్రధానులనడుమ గూర్చుండియున్నవాఁడును, సర్వలోకములనుదుఃఖింపఁజేయువాఁడును, నగు రావణాసురునిజూచి గొంతెత్తివెక్కివెక్కియేడ్చుచు మహాకోపమునుబొంది, కఠినములగుమాటలతోనిట్లనియె.

ఓయన్నా! రావణాసురుఁడా! నీవుమత్తుఁడవైశరీరముదెలియకనీయిష్టానుసారముగ కామసుఖము లనుభవించుచున్నావు. నీకెవరును నెదురులేరని యెంచియుండుటచే నిపుడు నీకుసంభవించినమహాభయమును నీవుతెలిసికొనవలసినదయ్యును తెలిసికొనకయున్నావు శ్లో॥ సక్తంగ్రామ్యేషుభోగేషు కామవృత్తంమహీపతిః। లుబ్ధంనబహుమన్యంతేశ్మశానాగ్నిమివప్రజాః॥ గ్రామ్యసుఖములయందాసక్తుఁడైయున్నవాఁడును, తనయిష్టముచొప్పున కార్యములనుజేయువాఁడును, పరమలోభియును, నగురాజును, ప్రజలు "రుద్రభూమియందలి యగ్నిహోత్రమువలె" నెంతమాత్రముసన్మానింపరు. ఏప్రభువు యేయేకాలములయందు జేయవలసినకార్యములను తానుగాజేయఁడో యట్టివానికార్యములన్నియుజెడును. అట్లుకార్యములుజెడుటచే తానునుపదభ్రష్టుఁడైచెడిపోవును "ఏనుఁగులునదిని జూచిదానిలోనికిబోతిమేని బురదలోదగులుకొందుమనితలచివెనుకకుదిరిగిపోవునట్లు" చారులులేనివాఁడును, చూచుటకువచ్చినవారికి దర్శనమివ్వనివాఁడును, తనస్వబుద్ధిచే నటింపనివాఁడును. స్త్రీలోలుఁడును, నగురాజును, ప్రజలుఅతనిసమీపమునకుబోయిన చెడుపుగలుగునని నట్టిరాజునుత్యజింతురు. శ్లో॥ యేనరక్షంతివిషయ మస్వాధీనానరాధిపాః తేనవృద్ధ్యాప్రకాశంతే గిరయస్సాగరేయథా॥ ఏరాజుస్త్రీలోలతచేబరతంత్రుఁడైరాజ్యమునుజక్కఁగగాపాడఁడో యట్టిరాజు "సముద్రమునందు మునిఁగియుండెడుపర్వతమువలె" నెంతమాత్రమునువృద్ధినిబొంది ప్రకాశింపనేరఁడు. కావునసీవుమహాబలులగు దేవదానవగంధర్వులతో బద్ధవైరమునుజేసికొని, చారులననియోగింపకవిషయాసక్తుఁడవైయున్నయెడల నీరాజ్యసంపదలెట్లునిలుచును? అన్నా! రావణాసురుఁడా! నీవుబాలురస్వభావమువంటిస్వభావముగలవాఁడవు (అనగాదేనియందు బుద్ధిదగులునో దానినేనవలంబించి యితరవిషయములను మఱచువాడవు. బుద్ధిలేనివాఁడవు. నీవుముఖ్యముగ విచారిం

చి తెలిసికొనుచుండవలసిన కార్యములనుగూడ విచారించి తెలిసికొనకున్నావు. నీవెట్లు రాజ్యమును గాపాడుకొని రాజుగానుండగలవు? శ్లో॥ యేషాంచారశ్చకోశశ్చనయశ్చజయతాంవర! అస్వాధీనా నరేంద్రాణాంప్రాకృతైస్తేజనైస్సమాః॥ జయశాలురలోనుత్తముఁడవగునో రావణాసురుడా! ఏ రాజులకు, చారులు, బొక్కసము, నీతి, ఇవి లేకుండునో, వారు పరమమూఢులవంటివారు. రాజులు బహుదూరమునజరిగెడు కార్యములను చారులవలన దెలిసికొనుచుండుటచేతనే "దూరపుకండ్లుగలవారని" పేరువచ్చె. అట్లుండగ జనస్థానమునందున్న నీస్వజనంబంతయు నాశనముబొందిన సమాచారముగూడ నీవెఱుంగకుండుటం జేసి నీయొద్ద చారులు లేరనియును, నీమంత్రులెల్ల తెలివి లేనివారనియును దలచెదను. రాముఁడొక్కడే మహాక్రూరకార్యములను జేయునట్టి రాక్షసులను పదునాలుగువేలమందినిజంపి, ఖరదూషణులను గూడ యమపురమునకు బంపెను. వ్యసనరహితమైన కార్యములుగల రాముఁడు సకలఋషులకును అభయంబిచ్చి జనస్థానముననున్న రాక్షసులనందఱినిజంపి దండకాటవియందుండు ఋషులకు క్షేమమును గలుగజేసె.

ఓ అన్నా! రావణాసురుడా! నీవు నీదేశమునందు గలిగిన శత్రుభయమును నెఱుగకున్నావు. కావున నీవు మహాకుత్సితుఁడవనియును, ప్రమత్తుఁడవనియును స్త్రీలోలుడవై పరాధీనమున నుండువాడవనియును నమ్మెదను. శ్లో॥ తీక్ష్ణమల్పప్రదాతారం ప్రమత్తంగర్వితంశఠం। వ్యసనేసర్వభూతాని నాభిధావంతిపార్థివం॥ క్రూరుఁడును, లోభియును, ప్రమత్తుఁడును, మదించినవాఁడును, మూర్ఖుఁడును నగు ప్రభువునకు గష్టకాలము వచ్చినపుడు సమస్తప్రజలును నతనికి సహాయులై యతనిని గాపాడరు. శ్లో॥ అతిమానినమగ్రాహ్య మాత్మసంభావితంనరం। క్రోధినంవ్యసనేహంతి స్వజనోపిమహీపతిం॥ మహాగర్వితుఁడును, బుద్ధిమంతులకు గూడ చేరదీసికొనరానివాఁడును, తన్నుదానే హెచ్చుగజెప్పుకొనువాఁడును, మహాక్రోధముగలవాఁడును, నగు మానవుఁడు ప్రభువగునేని, యతనికి కీడువచ్చునప్పుడు స్వజనులుగూడ యతనిని జంపదలతురు. ఆయా కాలములయందు ఆయా పనులు జేయనివాఁడును, భయముగలుగునపుడు భయపడి జాగ్రతను బొందనివాఁడును, నగు రాజు రాజ్యపదభ్రష్టుఁడై మహాదైన్యమును బొంది తృణముతో సమానుఁడగును. శ్లో॥ శుష్కైఃకాష్ఠైర్భవేత్కార్యం లోష్టైరపిచపాంసుభిః। నతుస్థానాత్పరిభ్రష్టైః కార్యంస్యాద్వసుధాధిపైః॥ ఎండుకట్టెలతోను, మంటిపెళ్ళలతోను, దుమ్ముతోను కార్యముగలదుగాని రాజ్యపదభ్రష్టుఁడైన రాజుతో కొంచమైనను బ్రయోజనములేదు. కట్టివిడిచిన వస్త్రములును, ధరించికొనినలిగిన పూదండలును, ఇతరులకుపయోగములుగానియట్లు రాజ్యపదభ్రష్టుఁడగు రాజు, యెంతటి సమర్థుడైనను వానివలన కొంచమైనను బ్రయోజనములేదు. కావున ఏమఱుపాటులేనివాఁడును, సమస్తవిషయములను జక్కగ దెలిసినవాఁడును, జితేంద్రియుడును, తనకితరులు సేసిన మేలుమఱవనివాఁడును, ధర్మస్వభావుఁడును, నగు రాజు చిరకాలము సౌఖ్యముతో రాజ్యపరిపాలనమును జేయుచుండును. మఱియుకన్నులుమూసికొని నిదురించుచున్నను నీతియనెడి నేత్రములచే సమస్తమును జూచుచుండువాఁడును, కోపమువచ్చినను, అనుగ్రహముగలిగినను, వానిని క్రమముగ నెరవేర్చువాఁడును, నగు రాజు ప్రజలచే జక్కగ సన్మానింపఁబడును అన్నా! రావణాసురుఁడా! రాక్షసులననేకులను రాముఁడు చంపినసమాచారమును చారులచే తెలిసికొనకున్నావు. కావున నీవు దుర్బుద్ధివి. నేను పైన జెప్పినవియును, రాజునకుండవలసినవియును, నగు గుణములు నీయందు లేవు. నీవు పరుల నవమానించువాఁడవు. దుర్విషయాసక్తుఁడవు. ఏయే దేశమున, ఏయే కాలమున, ఏయే కార్యములను జేయవలయునో దానిని దెలిసికొనినవాఁడవు కావు. గుణదోషములను దెలిసికొనెడి బుద్ధినీకు లేదు. కావున నీవు అతిశీఘ్రముగ రాజ్యపదభ్రష్టుఁడవై చెడిపోదువు. అనియిట్లు శూర్పణఖ చెప్పె. అంత ధనబలశౌర్యములుగలవాఁడును, రాక్షసేశ్వరుఁడును, నగు రావణాసురుడు తనవలన నేమిదోషముగలిగెనని స్వబుద్ధితో చాలాసేపు ఆలోచించె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ముప్పదిమూడవసర్గము గిసెను.

శూర్పణఖ సీతనునపహరింపుమని రావణాసురునితో జెప్పుట.

అనియిట్లు శూర్పణఖ చెప్పగవిని మిగుల కోపోద్దీపితుఁడై మంత్రులనడుమనున్న రావణాసురుడు, మహాకోపముతో బహుకఠినముగ మాటలాడుచున్న శూర్పణఖను జూచి యిట్లనియె.

ఓ శూర్పణఖా! రాముఁడనువాఁడెవఁడు? అతని పరాక్రమమెట్టిది? ఎటువంటి రూపముగలవాఁడు? ఎవ్వరికిని బ్రవేశింపనలవిగాని దండకారణ్యమున కేమిపనిగలిగివచ్చె? ఖరదూషణ త్రిశిరులు మొదలగు పదునాలుగువేల రాక్షసులను ఏయాయుధముచే జంపె? అని రాక్షసరాజగు రావణాసురుఁడడిగె. అంత మహాకోపముచే శరీరము దెలియక మా

టలాడుచుండెడి శూర్పణఖ రాముని గుఱించి యున్నదున్నట్లు చెప్పటకారంభించె అన్నా! రావణాసురుడా! రాజనందనుఁడగు రాముఁడు ఆజానుబాహుఁడు వెడల్పైనసేత్రములుగలవాఁడు. నారచీరెలను కృష్ణాజినమును ధరించియున్నవాఁడు. మన్మథాకారుఁడు. ఆ రాముఁడు, ఇంద్రచాపముతో సమానమైనదియును, బంగారుపట్టబంధముగలదియును, నగుధనుస్సుచేతంబూని మహావిషసర్పములతో సమానములైనవియును, మిగులతీక్ష్ణములైనవియును, నగు బాణములను వదలును యుద్ధమునందు రాముఁడు మహాభయంకరములగు బాణములను తీసికొనుటనుగాని, వాటిని సంధించుటనుగాని, వదలుటనుగాని, విల్లునారిని ఆకర్షించుటనుగాని, నేనుచూచినది లేదుగాని, "ఇంద్రుఁడు శిలావర్షమును గురిపించి పైరులను నాశము జేయునట్లు" రాముఁడు బాణవృష్టిగురిపించి సైన్యమునంతయు నాశనమును జేయుచుండుటను మాత్రము జూచుచుంటిని. మఱియు కాలిభటుండగు రాముఁడొక్కఁడె, ఒకటిన్నర ముహూర్తకాలములో ఖరదూషణులు మొదలగు పదునాలుగువేల రాక్షసులను మహాతీక్ష్ణములగు బాణములచే జంపె. రాముఁడు దండకారణ్యవాసులగు మునులకభయమిచ్చి అందుండువారలకు ఏలాటిబాధయును లేకుండ సుఖమును గలుగజేసె. మహాశౌర్యవంతుఁడును, ఆత్మవేత్తయును, నగు రాముఁడు, స్త్రీని జంపరాదని యోచించి నన్నొకతెను మాత్రము మహాప్రయాసమున అవమానముగలుగునట్లు చేసివదలె. ఈ రామునకు, మహాతేజస్సుగలవాఁడును, గుణవంతుఁడును, రామునితో సమానమగు పరాక్రమము గలవాఁడును, రామునియందు మిగులననురక్తుండును, మహాభక్తుఁడును, అధికశౌర్యము గలవాఁడును, నగులక్ష్మణుఁడను పేరుగల తమ్ముఁడుగలడు. అతఁడు మహాక్రోధముగలవాఁడు. ఇతరులచే జయింపనలవిగానివాఁడు. సమస్తశత్రువులను జయించువాఁడు యుద్ధములయందు మహాపరాక్రమము గలవాఁడు మిగులమతిమంతుఁడు. మహాబలముగలవాఁడు. రామునకు కుడిభుజమువంటివాఁడు నిరంతరము రామునకు బహిఃప్రాణము వంటివాఁడు అనగా నిరంతరము వెలుపల దిరుగుచుండెడు ప్రాణమువంటివాఁడు మఱియు రాముని భార్యయున్నదో, విశాలములగు నేత్రములుగలది పున్నమచంద్రునితో సమానమైన ముఖముగలది. మగనికి మహాయిష్టురాలు. నిరంతరము పెనిమిటికి హితమును, మేలును, నగుపనిజేయుటయందు ఆసక్తురాలు. సొగసైనకుఱులుగలది. సుందరమైనముక్కుగలది. శ్రేష్ఠములగు తొడలుగలది. మహాసౌందర్యవతి. మిగులకీర్తిమంతురాలు. వనదేవతయోలేక యితర దేవతలయందు లక్ష్మికేవిరో యనదగియున్నది. పుటముపెట్టిన బంగారువంటి దేహచ్ఛాయగలది. ఎఱ్ఱగను, ఉన్నతములును నైన గోళ్లుగలది. మంగళస్వరూపురాలు. రమణీయములైన పిఱుదులుగలది. సన్ననినడుముగలది. విదేహదేశపురాజగు జనకమహారాజుకూతురు సీతయను పేరుగలది. ఇట్టి రూపురేఖ సౌందర్యములుగల స్త్రీని దేవతలలోగాని, యక్షులలోగాని, గంధర్వులలోగాని, కిన్నరులలోగాని, నేనిదివరకు చూచినది లేదు. భూలోకమున జూడలేదని చెప్పనేల? ఓ అన్నా! రావణాసురుడా! ఆసీత యెవనిపెండ్లాముగ నుండునో, మహాసంతసముచే నెవ్వని కౌగలించుకొననో, అట్టిమహాత్ముఁడు ఏలోకమనునున్నను దేవేంద్రునికన్న నధికుడనవలెను. రావణాసురుడా! మంచియాచారముగలదియును, మిగులసుందరాంగియును, భూలోకమునసెచటను సాటిలేని సౌందర్యముగలదియును, నగు నాసీత నీకు దగినభార్యగానున్నది నీవును రూపురేఖ సౌందర్యవిభవములచే నాసీతకు తగినమగడుగనున్నావు. విశాలమైన జఘనముగలదియును, బలిసినపిఱ్ఱలును, స్తనములును, గలదియును, సౌందర్యమైన ముఖముగలదియును, నగు నాసీతను నీకు భార్యగా నిచ్చుటకై దెచ్చుటకు, ఎత్నించితిని మహాభుజుడవగు రావణాసురుడా! అన్నా! నేనిట్లు యెత్నించుటచేత క్రూరుఁడగు లక్ష్మణుఁడు నన్నిట్లు విరూపినిగా జేసె. పున్నమచంద్రునితో సమానమైనముఖముగల యాసీతను నీవు జూచినతోడనే మదనబాణాగ్నిచే దహింపజేయబడుదువు. ఆ సీత నీకు భార్యగావలయునను నభిప్రాయముగలదేని తక్షణము బైలువెడలి రామలక్ష్మణులను జయించుటకై కుడికాలును ముందెత్తిపెట్టుము. రాక్షసేశ్వరుఁడవగు నో రావణాసురుడా! ఆశ్రమమునందున్నవాఁడును, నిర్దయుఁడును, నగు రాముని జంపి యతనిచేజంపఁబడిన రాక్షసులకందఱికిని ఆనందమును గలుగ జేయుము. మఱియు నా రాముని, మహారథుడగు లక్ష్మణుని, మహాతీక్ష్ణములగు బాణములచేత జంపి పిమ్మట అనాథయగు సీతను భార్యగా జేసికొని సుఖముల ననుభవింపుము. రాక్షసులకు ప్రభువగు నో రావణాసురుఁడా! అన్నా! నేను జెప్పినమాట నీకు సమ్మతముగనుండునేని నిర్భయుడవై నామాటప్రకారము చేయుము. రావణాసురుడా! నీకుగలశక్తిని జక్కఁగ దెలిసికొని సర్వాంగసుందరియగు సీతను నపహరించి తెచ్చి భార్యనుగా జేసికొనుము. ఇదిగాక రాముఁడు జనస్థానమునందున్న రాక్షసులను పదునాలుగువేలమందిని ఖరదూషణత్రిశిరులను, మహాకరుకు బాణములచే జంపినసమాచారమునుగూడ వినియున్నా

వు. ఇకఁజేయవలసిన కార్యమును గుఱించి నీవే చక్కఁగా నాలోచించి నిశ్చయింపుము, అని శూర్పణఖ రావణాసురునితో జెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండము నందలి ముప్పదినాలుగవ సర్గముగిసెను.

రావణాసురుడు మారీచునియాశ్రమమునకు బోవుట.

పిమ్మట రావణాసురుడు, మిగుల భయావహమైనదియు, శూర్పణఖ చెప్పినదియునునగు నామాటవిని కార్యంబెఱిగి మంత్రులకు సెలవిచ్చి పంపి తాను తనగృహమునకు బోయెను. అట్లుపోయి రావణుఁడొంటరిగా గూర్చుండి సీతను దీసికొనివచ్చుటను గుఱించి చక్కఁగ నాలోచించి గుణదోషములను, బలాబలములను, నిశ్చయించి దొంగతనముగ నపహరించి తెచ్చుటయే సరియైన కార్యమని తలచి, తన మనస్సునందు దృఢపఱచుకొని మహాస్థిరబుద్ధితో మిగులరమణీయమగు గుఱ్ఱపుశాలకుఁబోయెను. అట్లు రాక్షసేశ్వరుఁడగు రావణాసురుడు నెవరికిని తెలియకుండ మాఱువేషముతో గుఱ్ఱపుశాలకుబోయి సారథిఁ బిలిచి రథమును సిద్ధపఱచుమని జెప్పె. అంత మహావేగవంతుఁడగు నాసారథి రావణాసురుడు చెప్పినతోడనే యొకక్షణమాత్రములోన నతనికిష్టమైనదియును, మిగుల సుందరమైనదియునునగు, నొకరథమునుగట్టి సిద్ధముజేసె. కుబేరుని తమ్ముఁడును, శ్రీమంతుఁడును, రాక్షసేశ్వరుఁడునునగు రావణాసురుడు, బంగారుతో జేయఁబడినదియును, రథికుఁడు కోరినచోటునకు బోవునదియును, నవరత్నములచే నలంకరింపఁబడినదియును, పిశాచములయొక్క ముఖములవంటి ముఖములుగలవియును, బంగారునగలచే శృంగారింపఁబడినదియును, గాడిదెలచే బూన్పఁబడినదియునునగు రథమును ఎక్కి మేఘధ్వనితో సమానమైన ధ్వనిగలుగునట్లు మహావేగమున సముద్రసమీపమునకుఁ బోయెను. అప్పుడు ఇరువదిచేతులును, పదికంఠములును, గలవాఁడును, వైడూర్యమణులకాంతితో సమానమైన దేహచ్ఛాయగలవాఁడును, కుటముదీరిన బంగారుకుండలములు ధరించియున్నవాఁడును, సొగసైన వస్త్రములు ధరించియున్నవాఁడును, తెల్లనివింజామరములు గలవాఁడును, తెల్లనిగొడుగు గలవాఁడును, దేవతలకు విరోధియును, ఋషిశ్రేష్ఠులను జంపువాఁడును, పదిశృంగములతో గూడిన మహాపర్వతమువలె నున్నవాఁడును, రాక్షసులకు ప్రభుడును, నగు రావణాసురుడు తన యిష్టము చొప్పున బోవునట్టి రథమును ఎక్కి ఆకాశమునందు మెఱుములతోను కొంగలతోను గూడిన మేఘమువలెనే ప్రకాశించుచుండె. అంత మహాశౌర్యవంతుఁడగు రావణాసురుఁడు, అనేకములైన కొండలుగలదియును, నానావిధములగు పువ్వులతోను పండ్లతోను గూడిన చెట్లతో నిండియున్నదియును, నగు సముద్రపుదరిని జూచుచుబోయె. మఱియు, చల్లని మంచియుదకముగల సరోవరములతోను, విశాలములగు యజ్ఞవేదులచే నొప్పుచున్న యాశ్రమములతోను నెచటను ప్రకాశించుచున్న సముద్రతీరమును జూచుచు రావణాసురుఁడు పోయెను. అరటిచెట్లతోను, కందితీగెలతోను దట్టమైయున్నదియును, నారికేళవృక్షములతో ప్రకాశించుచున్నదియును సాలవృక్షములతోను, తాటిచెట్లతోను, చీకటివృక్షములతోను, పూచియుండెడు చెట్లతోను నిండియున్నదియునగు సముద్రతీరమును జూచుచు రావణాసురుడు పోయెను. మఱియును, అనేకులగు నాగలతోను, గరుడలతోను, గంధర్వులతోను, కిన్నరులతోను, నొప్పుచున్నదియును, అయోనిజులై చంద్రసూర్యులకిరణములను ఆహారముగా గలిగి యత్యంతనియతాహారులగు వైఖానసులు, మాషగోత్రజులు, వాలఖిల్యులు మొదలగు ఋషిశ్రేష్ఠులకు నివాసస్థానమగు సముద్రతీరమును జూచుచు రావణుఁడు పోయెను. ఈడేరిన కోరికలుగల మహాపురుషులచేతను, సిద్ధులచేతను, చారణులచేతను, ప్రకాశించుచుండెడు సముద్రతీరమును జూచుచ పోయెను. శ్రేష్ఠములైన ఆభరణములను, పూలదండలను ధరించినవారును, ప్రతిలేనిసుందరరూపములును, ఆటలయందును క్రీడలయందును మహానేర్పుగలవారును, నగు నప్సరస్త్రీసమూహములతో నొప్పుచున్న సముద్రతీరమును జూచుచు రావణాసురుడు పోయెను. కాంతిమంతులగు దేవతలభార్యలు సంచరించుటచే ప్రకాశించుచున్నదియును, మహాకాంతిచే నొప్పుచున్నదియును, అమృతపానము జేయువారగు దేవదానవసమూహములు సంచరించుటకు స్థానమునునగు సముద్రతీరమును రావణాసురుడు చూచుచుపోయెను. మఱియు హంసలు, క్రౌంచపక్షులు, సారసపక్షులు, నీరుకోళ్లు మొదలగు పక్షులయొక్క మనోహరములగు ధ్వనులతో గూడుకున్నదియును, వైడూర్యమణులతో నొప్పుచున్నదియును, మహారమణీయమైనదియును, సముద్రపుఛాయ ప్రతిఫలించుటచే మిగులమనోజ్ఞమగునున్నదియును, నగుసముద్రతీరమును జూచుచపోయెను. కుబేరుని తమ్ముఁడగు రావణాసురుఁడట్లుపోవుచు మార్గమునందు శ్వేతవర్ణముగలవియును, మిగుల విశాలములైనవియును, మహార్హములగు పూలదండలతో నొప్పుచున్నవియును, నానావిధములగు వాద్యములతోను గీతములతో

నుఁ గూడియున్నవియును, ఇష్టముచొప్పున బోవునవియును, తపోమహిమచే సమస్తలోకములను జయించినమహాత్ములవియునగు విమానములను, గంధర్వులను, అప్సరస్త్రీలను మార్గమునందు కడవరకు రావణాసురుడు చూచుచుపోయె. చెట్లమొదటి మొద్దులయందు బంకగలవియును, మహాసౌందర్యములైనవియును, మంచిసువాసనగలవియును నగుశ్రీగంధపువనముల ననేకములను జూచుచు రావణాసురుడుపోయె మఱియు మేలైనయగరుమ్రాఁకులయొక్కయు, తక్కోలవృక్షముల యొక్కయు, సువాసనగల జాతిచెట్లయొక్కయు ఉవనములను ఉపవనములనుజూచుచు పోయె. మఱియు చీకటిచెట్లపువ్వులను, మిరియపుతీగెల పొదలను, సముద్రపుగట్టునఁబడి యెండుచున్న ముత్యములసముదాయములను జూచుచు రావణాసురుఁడు పోయె. మఱియును శంఖ సమూహములను, పవడములగుంపులను, వెండికొండలను, బంగారుపర్వతములను జూచుచుపోయె రమణీయములగు కొండకాలువలను, స్వచ్ఛములగు నీళ్లుగలమడుగులను జూచుచు రావణాసురుడు పోయె. మఱియు ధనధాన్యసమృద్ధములును, ఉత్తమస్త్రీలచే బ్రకాశించుచున్నవియును, గజాశ్వరథసమృద్ధములును, నగుపురములనుజూచుచు రావణాసురుఁడుపోయె. అట్లుపోయిపోయి మెచ్చుతక్కువలులేక సమభూమిగనున్నదియును, మనోజ్ఞమైనదియును, మందమారుతము గలదియును. స్వర్గలోకమునకు సమానమైనదియును, నగునాసముద్రతీరమును రావణాసురుడు చూచె. అచ్చట నలుదిక్కులయందును నూరుయోజనముల పొడవులగు శాఖలుగలదియును, మేఘచ్ఛాయ గలదియును మునిశ్రేష్ఠులకు నివాసస్థానమైనదియును, నగునొకమఱ్ఱిచెట్టును రావణుఁడుచూచె. పూర్వము ఆమఱ్ఱిచెట్టుకొమ్మమీఁద, మిగుల బలవంతుఁడగు గరుత్మంతుఁడు ఒకయేనుఁగను, గొప్పశరీరముగల యొకతాఁబేటిని, ఆహారార్థముదెచ్చితినువాఁడై, వ్రాలె. అట్లుగరుత్మంతుఁడువ్రాలగానే, దట్టముగ నాకులతో నిండియుండెడు నాకొమ్మభారమున కోర్వజాలక తటుక్కున విఱిగె అప్పుడాకొమ్మక్రింద చంద్రసూర్యుల కిరణములను పానము సేయువారును, ధూమాహారులును, అయోనిసంభూతులును, నగువైఖానసులు, వాలఖిల్యులు, మాషులు మొదలగు పరమర్షులు వాసము జేయుచుండిరి అంతగరుత్మంతుఁడు ఆఋషులయెడల మిగుల అనురాగము గలవాఁడై నూరుయోజనములు నిడుపుగల నాకొమ్మను, యేనుగను, తాఁబేటిని, యీయూడింటిని మహావేగమున దన్నుకొనిపోయె అట్లుపోయి మహాధర్మాత్ముఁడును పక్షిరాజును, నగుగరుత్మంతుఁడు బంటికాలిపైనిలిచి యాయేనుగను తాఁబేటిని భక్షించి యాకొమ్మతో నిషాదదేశమునకు బోయి వారినందరనుజంపి, మహర్షులకుగలిగిన యాపదను నివారించి మహాసంతోషమును బొందె మహామతిమంతుఁడగు నాగరుత్మంతుఁడు అనంతసమునరెట్టించిన తేజస్సుతో నమృతమునుదెచ్చుటకుయత్నించెను. అట్లుయత్నించి గరుత్మంతుఁడు పైలువెడలిపోయి యినుపకిటికలుగలవియును, రత్నమయంబైనవియును, నగునిఁటిపగులగొట్టి, దేవేంద్రునియింటియందుగాపాడఁబడుచున్న యమృతమునుదీసికొనివచ్చె. కావుననట్టిమహాత్ముడగు గరుత్మంతునిచేగుర్తేర్పఱుపఁబడి నదియును, మహర్షిసమూహములకు నివాసస్థానమైనదియును, సుభద్రమనుపేరుగలదియును, నగునామఱ్ఱిచెట్టును కుబేరునితమ్ముఁడగు రావణాసురుఁడు చూచె. అట్లామఱ్ఱిచెట్టునుజూచి పిమ్మట రావణాసురుడు నదీపతియగు సముద్రముయొక్క యవతలిగట్టుజేరి యచట ఏకాంతముగ నుండునదియును, మిగులమనోజ్ఞమైనదియును, మహాపావనమైనదియును, నగునయ్యరణ్యమధ్యమున నొకయాశ్రమమునుజూచె. ఆయాశ్రమము నందుఁ బ్రవేశించి యచట కృష్ణాజినమును జటావల్కలములను దాల్చి నియతాహారుఁడైయున్న మారీచుఁడగు రాక్షసుని జూచె. అప్పుడమ్మారీచుఁడు రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు వచ్చుటనుజూచి యెదురుగబోయిదోడ్కొనివచ్చి అర్ఘ్యపాద్యాది విధులచేబూజించి యాసనంబిచ్చి మనుష్యులకసాధ్యములగు సమస్తపదార్థములచేత సంతృప్తిపరచి సుఖాసీనునిజేసి పిమ్మటమిగులవిశేషార్థముతో గూడినమాటలతో నిట్లనియె.

రాక్షసేశ్వరుఁడవగు నోరావణాసురుఁడా! లంకానగరమునందెల్లవారికిని క్షేమమేగదా? నీవుగానేమఁఱల నిచటికి యింతశీఘ్రముగా నేమిపనిగలిగివచ్చితివి? అనిమారీచుండడిగె అంత, మహాశౌర్యవంతుఁడును మాటలాడుటయందు నేర్పరియునునగు రావణాసురుఁడు మారీచుని జూచి యిట్లని చెప్పదొడగె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలిముప్పదియైదవసర్గ ముగిసెను.

▶✻◀

రావణాసురుడు మారీచునిసహాయము జేయుమనిచెప్పుట.

నాయనా! మారీచుఁడా! నామాటవినుము. నేనమహావ్యసనమును బొందియున్నాను. ఇట్లుపరమదుఃఖితుఁడనగునాకునీవుదప్పనన్యుఁడు దిక్కెవ్వడున్నాఁడు నాత

మ్ముఁడగు ఖరుఁడును, దీర్ఘబాహుఁడగు దూషణుఁడును, నా చెల్లెలగు శూర్పణఖయును, మహాశౌర్యవంతుఁడును, మాంసాహారియును, నగు త్రిశిరుఁడును, మఱియు మహోత్సాహులును, యుద్ధవీరులును, నగు నితర రాక్షసులనేకులును, నాయుత్తరువుచొప్పున దండకారణ్యమునందు ధర్మమాచరించునట్టి ఋషులను హింసించుచు జనస్థానమును నివాసస్థానముగ జేసికొని మహాసుఖముగ నుండుటను నీవెఱుఁగుదువుగదా? మఱియు లోకభయంకరములైన కార్యములను జేయువారును, యుద్ధవీరులును, మహోత్సాహులును నగు రాక్షసులు పదునాలుగు వేలమంది ఖరుని యాజ్ఞకులోబడి యున్నారు. అట్లు జనస్థానమునందు నివసించియున్నవారును, మహాబలపరాక్రమశాలులును, నగు నా ఖరుఁడు మొదలగు రాక్షసులందఱును సమస్తాయుధములను దరించియుద్ధసన్నద్ధులై రాముని పైకి యుద్ధమునకు బోయిరి. అంతనా రాముఁడు మిగుల కోపోద్దీపితుఁడై యుద్ధమున నెదిరించి నిలిచి కొంచెమైనను పరుషములాడక కొంచమైనను సావకాశము జేయక ధనుస్సునందు బాణములను సంధించె. అట్లు సంధించి కాలిభటుడును మానవుడును, నగు రాముఁడొక్కఁడే మిగుల తీక్ష్ణములగు బాణముల చే మహాభయంకరముగు శౌర్యముగల రాక్షసులను పదునాలుగు వేలమందిని హతము సేసె మఱియు ఖరదూషణ త్రిశిరులను గూడ వధించి దండకారణ్యవాసులగు మునులకు రాక్షసుల వలన బాధలు లేకుండునట్లు చేసె కోపమును బొందిన తండ్రి చే విడువఁబడినవాఁడును, భార్యాసమేతుఁడై యున్నవాఁడును, చావు సమీపించియున్నవాడును, క్షత్రియులలో పరమనీచుఁడును, నగు రాముడు ఆ సేననంతయు నుజంపె. ఆ రాముఁడు దురాచారుఁడు. మహాకౄరబుద్ధిగలవాఁడు. కఠినమనస్సుగలవాడు మూఢుడు పామరుఁడు.

డు అధర్మమునందుండువాఁడు జీవులకుఁగీడు సేయుటయందాసక్తిగలవాఁడు. మారీచుడా! ఆ రాముడు కొంచెమైనను వైరములేకయే బలగర్వితుఁడై నా చెల్లెలగు శూర్పణఖను ముక్కుచెవులు గోసి విరూపినిగ జేసె. కావున నేను పరాక్రమించి యా రాముని భార్యయును, దేవతాస్త్రీలతో సమానురాలును, నగు సీతను దీసికొని వచ్చెదను అందునిమిత్తము నీవు నాకు సహాయము చేయవలయును మిగుల బలశాలివగు మారీచుఁడా! నీవును, నాతమ్ములును, నాకు సహాయులైయుండునప్పుడు, యుద్ధమునందు దేవతులందఱును నొక్కటైవచ్చినను, నేనెంతమాత్రమును శంకింపను గదా? మారీచుఁడా! నీవు నాకు సహాయుడవు కావలయును. నీవు మహాశక్తిమంతుఁడవు. శౌర్యమునందును, దర్పమునందును, యుద్ధము చేయుటయందును నీకు సమానుఁడెవ్వఁడును లేడు. నీవు సమస్త ఉపాయములను జక్కఁగ దెలిసినవాఁడవు. దొడ్డవాఁడవు. మహాశూరుఁడవు. సమస్తమాయోపాయములను దెలిసినవాఁడవు రాక్షసుఁడవగు నో మారీచుఁడా! ఇందునిమిత్తమయ్యే నేను నీదగ్గరకు వచ్చితిని. నీవు నాకు సహాయుడవైయుండి చేయవలసిన కార్యమును జెప్పెదను వినుము. నీవు వెండి మచ్చలచేత విచిత్రమగు బంగారు జింకరూపమును ధరించి రాముని యాశ్రమమునకు బోయి సీత యెదుట యిటు అటు తిరుగుచుండుము అంత సీత బం

రులేడి రూపమును ధరించియున్న నిన్ను జూచినతోడనే, "దీని నాకు బట్టియిమ్మని" తన మగనిని, లక్ష్మణుని, నిశ్చయము గనడుగును. అంత రామలక్ష్మణులు నిన్ను బట్టవత్తురు. నీవిటు అటు దిరుగుచు దూరముగ బొమ్ము. అప్పుడు రామలక్ష్మణులు దూరముగ బోయిన వెనుక నిర్జనమగు స్థలమునందు యే యాటంకమును లేనివాఁడనగుచు "రాహుగ్రహము చంద్రుని యొక్క కాంతిని హరించినట్లు" యథాసుఖముగ నేను సీతను దీసికొని వచ్చెదను అంత రాముడు భార్యనపహరింపబడుట చే గలిగిన వ్యసనము వలన మిగుల కృశించును. అట్లు కృశించియుండి రాముడు యుద్ధమునకు వచ్చినను గూడ నేను కృతకృత్యుఁడనై నిర్భయముగను అతిసులభముగను రాముని వధించెదను. అని రావణాసురుఁడు రాముని గుఱించి చెప్పె అంత మహాబలపరాక్రమశాలియగు మారీచుడు రావణాసురుడు చెప్పిన దానిని వినినతోడనే నోరెండిపోయె. మహాభయమును బొందె. ఇట్లు మారీచుఁడు యేమియును దోచక పెదవులు దడుపుకొనుచు, ప్రాణము బోయిన శవము వలె ఱెప్పపాటు లేనివాఁడై మహాదుఃఖమును బొంది కండ్లనీళ్ళు గారగా చిత్తరువున వ్రాసిన ప్రతిమ వలె దిగ్భ్రముఁడై రావణాసురుని జూచుచుండె. అట్లుండి కొంత సేపునకు తెలివిని బొంది, మహారణ్యమగు దండకారణ్యమునందు యిదివరకే రాముని బలపరాక్రమములను జక్కఁగ గుర్తెఱిగినట్టి మారీచుఁడు మహాభయము చేత వ్యసనమును బొందిన మనస్సు గలవాఁడగుచు, పరమదీనుఁడై రావణాసురునకును తనకును మేలు గలిగించునట్టిదియును యథార్థమైనదియును. నగు మాటను చెప్పదలచి యిట్లనియె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ముప్పదియాఱవ సర్గము ముగిసెను.

*)◀

—{ మారీచుడు రావణాసురునకు రాముని యొక్క బలపరాక్రమములను తెలియ జేయుట }—

మాటలయందు నేర్పఱియును మిగుల బుద్ధిమంతుఁడు

ను, నగుమారీచుఁడు రాక్షసేశ్వరుఁడగు రావణాసురునితో నిట్లనియె.

శ్లో॥ సులభాఃపురుషా రాజన్ సతతంప్రియవాదినః। అప్రియస్యతు పథ్యస్యవక్తాశ్రోతాచదుర్లభః॥ ఓరాక్షస ప్రభువగు రావణాసురుఁడా! ఎల్లప్పుడను ప్రియమగుమాటలను చెప్పువారు సకలకాలములయందునుసులభముగదొరుకుదురు, అప్రియములగు హితవాక్యములను జెప్పువారును వినువారును నెవరును లేరు. అనగానిచ్చకములాడు వారనేకులు గలరుగాని శ్రేయస్సుగలుగునట్టి మాటచెప్పువారును వినువారును లేరనుట రావణాసురుఁడా! నీవు చారులను నియోగించి శత్రువుల యొక్క బలాబలములను తెలిసికొన్నవాఁడవు కావు. నీవు చెంచలుఁడవు. రాముఁడు మహాబలపరాక్రమశాలియనియును, సకలసద్గుణములచేనధికుడనియును, దేవేంద్రునితోనువరుణునితోను సమానుఁడనియును, నీవెఱుగవు ఈమాటనిశ్చయము. నాయనా! రావణాసురుఁడా! ఇకలోకములోనుండు సకలరాక్షసులకును మేలుగలుగునని దలంచుచున్నావా? రాముఁడుకుపితుఁడయ్యెనేని భూమియందుండెడి సమస్తరాక్షసులను నాశముజేయును. జనక మహారాజపుత్రికయగు సీతాదేవినీయొక్క నాశముకొఱకే వుట్టినది. సీతనిమిత్తమున నాకువ్యసనము సంభవించును. ఆటంకమేమియును లేక యిష్టము చొప్పున నడుచునట్టి నీవు ప్రభువగుటచేత లంకానగరమునీతోగూడ సమస్తరాక్షస సమేతమైనశించిపోవును. ఎవ్వడు నీవలెయథేచ్ఛావిహారముగలిగి, దుస్స్వభావుఁడైపాపాలోచనమును సేయుచుండునో యట్టిదురాత్ముఁడురాజగునేని, తన్నుతనచుట్టములను, దేశమును, నాశనమొందించును. ఓరావణాసురుఁడా! కౌసల్యాపుత్రుఁడగు రాముడుతండ్రిచే దఱుమఁబడినవాఁడు కాఁడు. రాముడు మర్యాదహీనుఁడు కాఁడు. నీచుఁడుకాడు ఎంతమాత్రమునుదుస్స్వభావుఁడు కాఁడు. రాముఁడుక్షత్రియులలో నెల్లనీచుఁడు కాడు. అధర్మపరుఁడు కాఁడు. సత్యముతప్పువాఁడు కాఁడు. క్రౌర్యముగలవాఁడు కాఁడు. సమస్తప్రాణులకును గీడుజేయుటయందాసక్తిగలవాఁడు కాఁడు. నాయనా! రావణాసురుఁడా! తనతండ్రియగు దశరథమహారాజు, రెండవభార్యయగు కైకేయిచే మోసపోయిసత్యముతప్పనివాఁడు కావునబద్ధుఁడై మిగులచింతించుచుండుటనుజూచి, ధర్మాత్ముఁడగు రాముఁడు కైకేయియొక్క యిష్టమును నెరవేర్చి తండ్రినిసత్యముతప్పకుండునట్లు చేసెదనని చెప్పి రాముఁడడవికివచ్చె. మఱియు నా రాముఁడు కైకేయీదశరథులయొక్క యిష్టమును నెరవేర్చుటకై రాజ్యమును సమస్తభోగములనువిడిచిదండకారణ్యమునుజొచ్చె. నాయనా! రావణాసురుఁడా! రాముఁడుకఠినుఁడుకాఁడు. మూర్ఖుఁడుకాఁడు. ఇంద్రియములకులోఁబడిన వాఁడు కాఁడు. కావునఅబద్ధములైన చెప్పుడుమాటలనువిని నీవిట్లు చెప్పతగదు. రాముఁడురూపమును దాల్చినధర్మఁబనవచ్చును. మహాసాధువు. సత్యమైన పరాక్రమముగలవాఁడు. ఇంద్రుఁడు దేవతలకు రాజైనట్లు రాముఁడు సర్వలోకములకును ప్రభువైనవాడు సూర్యుఁడును సూర్యునికాంతియు నేకమైయున్నట్లు రాముని పరాక్రమమువలన జక్కఁగ గాపాడబడుచుండెడు సీతాదేవిని నీ వెట్లు బలాత్కారమునఁ పహరింపగలవు. సూర్యునికాంతినెవరైన దొంగలింపగలరా యేమి? రణరంగమునందు బాణములే మంటలుగఁగలదియును, విల్లును, కత్తియునే, కట్టెలుగఁగలదియును, తేరిచూడనలవిగాక మండుచున్నదియునునగు రాముండను అగ్నిహోత్రమునందు నీవెంతమాత్రమును ప్రవేశింపవలదు. నాయనా! రావణాసురుఁడా! నీవు ప్రభుత్వమును, సమస్తసౌఖ్యములను, మిగులతీపిగలజీవితమునువిడిచిపెట్టి, విల్లె తెఱువఁబడి మండుచుండెడు నోరుగఁగలవాఁడును, బాణములే జ్వాలలుగఁగలవాఁడును, మహాకోపమునుబొందినవాఁడును, ధనుస్సును పాశమును దాల్చినవాఁడును, మహాశౌర్యవంతుఁడును, విరోధులయొక్క సేనలను నాశనము జేయువాఁడును, నగు రాముఁడను యమునిదగ్గరకుఁబోవద్దు. ఓరావణాసురుఁడా! జనకమహారాజపుత్రికయగు సీతాదేవికిఁ బెనిమిటియగు రామునిపరాక్రమము మితిలేనిది. అట్టిరామునివింటిని ఆశ్రయించియుండెడు సీతాదేవినిదొంగలించి తెచ్చుటకు నీవెంతమాత్రమును శక్తిమంతుఁడవుకావు. మఱియు నాసీతాదేవిని, పురుషశ్రేష్ఠుఁడును, సింహముఱొమ్మువలె విశాలమైనఱొమ్ముగలవాఁడును, నగురామచంద్రుఁడు, తనప్రాణములకన్ననధికముగనెంచి గాపాడుచుండును. ఆసీతాదేవియును నెప్పుడును తనభర్తననుసరించి యే ప్రవర్తించుచుండును. జ్వలించుచున్న అగ్నిహోత్రముయొక్క మంటలను దాకుటకు సాధ్యముగానియట్లు సన్నని నడుముగలదియును, మిథిలయందుబుట్టినదియును, మహాశౌర్యవంతుఁడగు రాముని ప్రియభార్యయును, నగుసీతాదేవిని దాకుటకెంతమాత్రమును సాధ్యముగాదు రాక్షసేశ్వరుఁడవగు రావణాసురుఁడా! నీవువ్యర్థమగు ప్రయత్నముచేయుటవలననేమిఫలముగలదు? నీవెప్పుడురణరంగమునందు రామునికంటఁబడుదువో అప్పుడే నీప్రాణములుపోవును. నీవుజీవించియుండుటను, సౌఖ్యమును, మహాకష్టసాధ్యమగు, రాజ్యమును, చిరకాలమనుభవింప గోరుదువేని రామునకువి

రోధము చేయవద్దు. మఱియు నీవు యిచటనుండి లంకకు బోయి విభీషణుండు మొదలగు ధర్మాత్ములైన మంత్రులనందఱితో జక్కగా నాలోచించి, పిమ్మట నీస్వబుద్ధితో గూడ యోచించి గుణదోషములను దెలిసికొని, కార్యసాధనమునందు బలాబలములునిశ్చయించి, నీబలమును రామునిబలమును నిశ్చయముగ నెఱింగి, మేలుకీడులను జక్కగనాలోచించి తెలిసికొని, పిదప, చేయఁదగినకార్యమును జేయుము. రాక్షసేశ్వరుఁడవగు రావణాసురుడా! నీవుకోసల దేశాధీశుఁడగు దశరథమహారాజపుత్రుఁడైన రామునితో యుద్ధము జేయుట యుచితము గాదని నాకుదోచుచున్నది. మహాశ్రేష్ఠమై నదియును, ఉచితమైనదియును, శ్రేయస్సునుగలుగజేయునదియును, నగునామాటలను ముమ్మాటకి వినుము. దీనివలననీకు మేలుగలుగును. అని మారీచుండు రావణాసురునితోఁ జెప్పె

ఇట్లు శ్రీమదారణ్యకాండము నందలి ముప్పదియేడవ సర్గ ముగిసెను

(✽)

మారీచుడు పూర్వము తాను రాముని చేబొంది నబాధను రావణాసురునితో జెప్పుట.

ఇట్లు చెప్పి మారీచుఁడు మఱల రావణాసురునిజూచి యిట్లనియె రాక్షసేశ్వరుడవగు రావణాసురుడా! పూర్వము నేను వేయియేనుగులఁబలముగలవాడను, కొండవంటి శరీరముగలవాఁడును, నల్లనిమేఘములతో సమానమైన దేహచ్ఛాయగలవాఁడను, పుటముదీరిన బంగారుపోగులుగల వాఁడను, కిరీటముధరించినవాఁడను, ఇనుపగుదియలనే ఆయుధములుగ గలవాఁడను సకలలోకములకును భీతినిగలుగజేయు వాడను మహాపరాక్రమువంతుఁడనునై భూలోకంబంతయును దిరుగుచు, ఋషులయొక్క మాంసము నేఆహారముగదినుచు దండకారణ్యమున సంచరించు చుంటిని అంత మహాధర్మాత్ముఁడగు విశ్వామిత్రమహర్షి నాకువెఱచి, తానుపోయి దశరథమహారాజునుజూచి యిట్లనియె

ఓదశరథుడా! మారీచునివలన నాకు మహాబాధగలుగుచున్నది. కావుననిపుడు రాముఁడువచ్చి పర్వకాలములయందు మహాహెచ్చరికగలవాఁడైయుండి మారీచునిభయమువలన మమ్ముఁగాపాడవలయును అనియిట్లు, మహానుభావుఁడగు విశ్వామిత్రమహర్షి చెప్పె అంత, ధర్మాత్ముఁడగు నాదశరథమహారాజు ఆవిశ్వామిత్రుని జూచి యిట్లనియె.

ఈరాముఁడుపదునైదేండ్ల పసిబాలుడు అస్త్రవిద్యావిశారదుఁడుగాఁడు. నేను నా సేననంతయు వెంటనివచ్చెదను. తాపసోత్తమా! విశ్వామిత్రుడా! నేనుచతురంగబలములతో గూడి సేనాసమేతుఁడనైవచ్చి నీకు విరోధులగు రాక్షసులనుజంపి నీకోరిక దీర్చెదనని దశరథమహారాజు విశ్వామిత్రునిజూచి చెప్పె అంతవిశ్వామిత్రమహర్షి మఱలనిట్లనియె.

ఓదశరథుడా! లోకమునందు రాముఁడుదప్పఅన్యుడు మఱియెంతబలముగలవాఁడైనను మారీచునిఁ జంపఁజాలఁడు. నీవురణరంగములయందు దేవతలనుగూడ కాపాడినవాఁడవే? అందుకెంతమాత్రమును సంశయములేదు ఓదశరథుడా! నీవుచేసినకార్యము ముల్లోకములయందును ప్రసిద్ధికెక్కియున్నది. వైరి వీరులనేడ్పించునట్టి దశరథమహారాజా! నీసైన్యముమిగుల గొప్పదేయగును. అయిననట్లుండనిమ్ము దానితోఁబనిలేదు. నీసైన్యమంతయు నిచటనేయుండుగాక ఈరాముఁడుపసివాఁడైనను మహాపరాక్రమశాలిగావున నామారీచుని సంహరింపఁగలఁడు పరంతపుఁడవగు నోదశరథుడా! నేనీరాముని దీసికొనిపోయెదను నీకుశుభమగుగాక. అనియిట్లు విశ్వామిత్రమహాముని దశరథమహారాజుతో జెప్పి రాజపుత్రుఁడగు నా రాముని వెంటబెట్టుకొని మహాసంతోషముతో దనయాశ్రమమును జేరె అపుడు రాముఁడు దండకారణ్యమున విశ్వామిత్రుని ఆశ్రమమునందు, చిత్రవర్ణములుగల విల్లుచేబూని జ్యాఘోషణము జేయుచు యజ్ఞదీక్షఁబొందియున్న విశ్వామిత్రుని సమీపమున గాచియుండె మఱియు పురుషచిహ్నములుగలుగని పసిబాలుఁడును, మహాతేజస్సు గలవాఁడును, తామరఱేకులతో సమానములైన నేత్రములు గలవాఁడును, ఏకవస్త్రమునే ధరించియున్నవాఁడును, (అనగాపసిబాలుఁడనుట), బంగారు పూదండ జుట్టునధరించియున్నవాఁడును, తనతేజస్సుచే నాదండకారణ్యమునంతయు ప్రకాశింపజేయుచున్నవాఁడును ధనుస్సుచేతంబూని అప్పు డుదయించుచున్న చంద్రబింబమువలె నున్నవాఁడును, నగు రాముని నేను అపుడచటజూచితిని. అంత, మేఘముతో సమానమైన యాకారము గలవాఁడను, పుటముదీరిన బంగారుపోగులు ధరించియున్నవాఁడను, మహాబలముగలవాఁడను, బ్రహ్మదేవునిచే వరమునుబొందియున్నవాఁడనునగు నేను మహాగర్వమున విశ్వామిత్రుని యాగమును విఘ్నముజేయుటకు నేనాయాగశాలకుబోతిని అపుడు ఆయుధములనుదాల్చియున్న యారాముఁడు చూచుచుండగనే నేనులోపలజొరబడితిని అట్లుప్రవేశించిన నన్నుచూచి రాముఁడెంతమాత్రమును తొట్రుపాటులేక ధనుష్టంకారమును జేసె. నేను తెలివిమాలినతనముచేత "ఇతడు పసివాఁ

డు" అనితలచి రామునిలక్ష్యపెట్టక అతిత్వరితముగవిశ్వామిత్రుని యాగమును జెరుపుటకై యజ్ఞవేదికపైకిఁ బోతిని. అంతనా రాముఁడు మహాతీక్ష్ణమైనదియును, శత్రువులను జంపునదియును, నగునొకబాణమును బ్రయోగించె. ఆబాణముయొక్క తాకుడుచేత నేను సముద్రమునందు నూరుయోజనములకావలబడితిని. మఱియు మహాపరాక్రమశాలియగునా రాముఁడు నన్నుజంపనిచ్ఛ లేనివాఁడై రక్షించె నాయనా! రావణాసురుఁడా! నేనా రామునిబాణవేగముచే సముద్రమునందుబడిమూర్ఛఁజెందితిని. అప్పుడాబాణవేగమువలన సముద్రమునందు నూరుయోజనములకావలమహాలోతున్నీళ్లలోబడి యెంతకొంతకాలమునకు మూర్ఛదేరిలంకానగరమునకువచ్చితిని. నాయనా! రావణాసురుఁడా! అప్పటికిరాముఁడు బాలుడుగనుండె. అస్త్రవిద్య చక్కఁగనేర్చుకొనలేదు అట్లుండియే వ్యసనరహితములగు కార్యములుగల రాముఁడు నాకుసహాయులుగ నున్నవారినందఱిని జంపి నన్నుమాత్రమియీరీతిగ విడిచిపెట్టె రావణాసురుఁడా! రాముఁడట్టిమహాసమర్థుఁడు. కావున, నేనిట్లువలదనిచెప్పుచున్నను, నామాటనువినక రామునితోవైరమునుబెట్టుకొందువేని స్వల్పకాలములోనే మహాభయంకరమగునాపదను బొందెదవు. నీవు ఆపదనుబొందుటయకాఁక, పలువిధములుగ గ్రీడింపుచు, నానావిధములగు రతులందేలుచు, అచ్చటచ్చటసభలుచేరుటచేతను, మహోత్సవములచేతను, సమస్తసుఖములననుభవించుచు, వ్యసనమెఱుగకుండెడి రాక్షసులకునుగూడ దుఃఖమునుకీడును దెచ్చిపెట్టినవాఁడవగుదువు. మఱియుమిద్దెలతోను యంతఃపురములతోనునిండియున్నదియును, పలువిధములగు రత్నములచే నలంకరింపఁబడినదియును, నగులంకానగరము సీతాదేవికారణముగ నశించిపోవుటను నీవుచూడగలవు. శ్లో॥ అకుర్వంతోపిపాపాని శుచయః పాపసంశ్రయాత్। పరపాపైర్వినశ్యంతిమత్స్యానాగహ్రదే యథా ॥ "సర్పములువసించునట్టి సరోవరమునందున్న చేపలుగూడ గరుడునిచే తినఁబడునట్లు" పాపకార్యములు చేయనట్టి పరిశుద్ధులు గూడ పాపులతోటి సాంగత్యముచేత వారిపాపహేతువువలన వీనునశింతురు. ఆరీతిగనే, నీదోషమువలన, మంచిసువాసనతోగూడుకొనియున్న గంధమునుబూసికొనియున్నవారును, మిగులనర్ఘ్యములగు నాభరణములను ధరించియున్నవారును, నగు రాక్షసులందఱును, రామునిచేఁజంపఁబడినేలంగూలియుండుటను నీవుచూడగలవు మఱియురాముడుచంపగమిగిలినవారు రక్షకుడు లేనివారైకొందఱు తమతమభార్యలనువిడిచియు, మఱికొందఱుభార్యలనువెంటబెట్టుకొనియును, దశదిశలకును బరుగిడుచుండుటను నీవుచూడగలవు. ఇదియునుగాక బాణములచేదట్టముగ ముంచఁబడినదియును, నిప్పులమంటలచే గప్పఁబడినదియును, దహింపబడినదియును, దహింపబడుచున్నదియును, నగు నిండ్లతోనొప్పుచున్న లంకానగరమునునీవుచూడగలవు. ఇందుకెంతమాత్రమునుసందేహములేదు. శ్లో॥ పరదారాభిమర్శాత్తునాన్యత్పాపతరంమహత్ ॥ పరస్త్రీసంగమమునకన్ననధికపాపము వేఱెమియును లేదు. రాక్షసేశ్వరుఁడవగునో రావణాసురుఁడా! నీక వేయిమందిభార్యలుండగ పరస్త్రీలనుఏలగోరెదవు? నీభార్యయందే యిచ్ఛగలవాఁడవగుము. నీకులమును, మానమును, సంపదను, ప్రభుత్వమును, మహాయిష్టమగుప్రాణమును, గాపాడుకొనుము అట్లు గాకనీవు, స్నేహితుడనగు నేను యింతదూరము వలదనిచెప్పినను నామాటవినక బలవంతముగ సీతనపహరించితీసికొనివచ్చితివేని, బంధుసమేతముగ రామబాణములచే నాకర్షింపఁబడిన ప్రాణములుగలవాఁడవగుచు నాశమునుబొంది యముని పట్టణమునకుబోయి చేరగలవు.

ఇట్లు శ్రీమదారణ్యకాండము నందలి ముప్పదిమూడవసర్గ ముగిసెను.

{ మారీచుడు రావణాసురునితో రామునివిరోధముచేసికొంటివేని నాశనమగుదువనిచెప్పుట. }

ఇదియునుగాక యింకొకవిశేషము జెప్పెదనువినుము. అప్పుడు పసివాఁడుగనున్నరాముఁడు యుద్ధమునందునన్ను తిరస్కరించెను గదా; ఇటీవలజరిగినవృత్తాంత మొకటిచెప్పెదను. అడ్డముచెప్పకవినుము నేనట్లురాముని బాణముచే సముద్రమునందుదూరముగ బాఱవేయఁబడినవాడనై మహాప్రయాసతోలంకానగరమునుజేరి యంతటితో నూరకుండక మృగరూపమునుధరించియున్న యిద్దఱురాక్షసులతోగూడ దండకారణ్యమును బ్రవేశించితిని అట్లుప్రవేశించినేనును, మిగులప్రకాశించుచున్న నాలుకగలదియును, మహాతీక్ష్ణములగు పండ్లుగలదియును, పెద్దశరీరముగలదియును, మిగులబలముతో గూడుకున్నదియును, మాంసముతినునదియును నగునొకగొప్పజింకనై దండకారణ్యమున దిరుగుచుంటిని. ఓరావణాసురుఁడా! నేను మిగులభయంకరాకారము గలవాఁడనై, అగ్నిహోత్రములసమీపమునను, పుణ్యతీర్థములచెంతను, రచ్చచేరెడు చెట్లయొద్దను, సంచరించుచు, తాపసోత్తములగుఋషులను భయపెట్టుచుంటిని. నేనట్లువర్తించుచుదండకారణ్యమున ధర్మాచరణులగు మునులనుజంపి వారలరక్తమునుద్రావుచుమాం

సమును దినుచుంటిని. మఱియు నేను ఋషుల మాంసమే యాహారముగా గలవాఁడనై మహాక్రూరుఁడనై యరణ్యమునం దగుపడువారలనెల్ల భయపఱచుచు, నెత్తురు ద్రావుటచే గలిగినమత్తుచేత ధర్మమును పాడుసేయుచు సంచరించుచుంటిని. నేనీప్రకారముగ జరుగుచు, తపసియును, ధర్మాచరణుండును నగు రాముని, మహాపూజ్యురాలగు సీతాదేవిని, మహారథుఁడగు లక్ష్మణుని జూచితిని.

అట్లు చూచి మిగులవాడిగల కొమ్ములతో జింకరూపము ధరించి యున్న నేను, రాముని జూచినతోడనే మును పటి దెబ్బలను దలచుకొని పూర్వపు విరోధమును జ్ఞాపకము చేసికొని మిగుల కుపితుఁడనై తెలివిహీనతచేత ఈ రాముడు తపసియై ఋషివేషముతో నున్నాఁడు ఋషి యేమి చేయగలడని యెంచి, తాపసవేషుండును నియతాహారుఁడును, సమస్తప్రాణులకును మేలు జేయుటయందాసక్తిగలవాఁడును, అరణ్యమున నున్నవాఁడును, మహాబలపరాక్రమశాలియును, నగు రాముని లక్ష్యపెట్టక చంపనిశ్చయించి యాతనిపైకి పరుగెత్తితిని. అంతనా రాముఁడు విల్లెక్కుబెట్టి మహాబలముతో ధనుస్సును ఆకర్ణాంతమున నీడ్చి గరుత్మంతుని యొక్కయు వాయువు యొక్కయు వేగమువంటి వేగము గలవియును, మహాతీక్ష్ణములైనవియును, పరోధులను జంపునవియును, నగు మూడు బాణములను మా ముగ్గురిపై బ్రయోగించె, అట్లు రాముఁడు ప్రయోగించినతోడనే, వజ్రమునకు సరిపోలునవియును, చక్కగ నెక్కుబెట్టి విడువఁబడినవియును, రక్తాహారము సేయునవియును, వంగిన కణుపులుగలవియును, నగు బాణములు మూడును నొక్కటే తూరిగ మాపైకి వచ్చె. అంత నేనిదివఱకొకతూరి రాముని బాణము యొక్క చురుకును, నతని పరాక్రమమును అనుభవించి యున్నవాడను, గాన, నేను పరుగెత్తిపోయి తప్పించుకొంటిని వారిద్దరు ఆ బాణముల యొక్క తాకుడు చేఁజచ్చిరి. అట్లు నేను రాముని బాణముల యొక్క బాధను అతిప్రయాసముచే దప్పించుకొని ప్రాణములు కాపాడుకొంటిని. అది మొదలు దుష్కార్యములను జేయుటను విడిచి సకలమును వదిలిపెట్టి తపోనియతుఁడనై యోగాభ్యాసమును జేయుచు నిచట కాలమును గడుపుచున్నాను. రావణాసురుడా! రాముఁడు జటావల్కలములను కృష్ణాజినమును ధరించి విల్లు చేతఁబట్టుకొని యున్నవాఁడై, కాలపాశమును చేతబట్టుకొని యున్న యమునివలె" ప్రతిచెట్టు క్రిందను నాకగపడుచున్నాఁడు. రాక్షసేశ్వరుడవగు రావణాసురుడా! నేను మహాభయమును బొందియున్నాను. అనేకవేల సంఖ్యలుగల రాములు నాకంటికగపడుచున్నారు. ఇంతేల యీ యరణ్యమునం దెచటఁజూచినను నాకంటికి రామమయముగనే యున్నది. రావణాసురుడా! జనులెవ్వరును లేని చోటనుగూడ నాకు రాముఁ డగుపడుచున్నాడు కలలో గూడ రాముని జూచి మూర్ఛను బొంది మహాభయముచే కలవరించుచున్నాను. శ్లో॥ రకారాదీని నామాని రామత్రస్తస్య రావణ। రత్నాని చ రథాశ్చైవ త్రాసం సంజనయంతి మే॥ ఓ రావణాసురుఁడా! రామునివలని భయముచేత, రత్నములు రథములు మొదలగు రకారము మొదటియందుగల పేళ్ళన్నియును, నాకు మహాభయమును గలిగించుచున్నవి కావున రాముని మహిమ నాకు జక్కగ దెలుసును. నీకు రామునితోటి వైరము ఎంతమాత్రము నుతగదు. రాముఁడు కోపించెనేని బలిచక్రవర్తినైనను, నముచినైనను సంహరించుననుటకు సంశయము లేద. రావణాసురుడా! నీవు రామునితో యుద్ధమును జేసినను జేసికొందువుగాక. లేక మానుకొన్నను మానుకొందువుగాక. నీవు నన్ను జూడ కోరికగలవాఁడవైతివేని రాముని మాటను నాదగ్గిర నెంతమాత్రము ప్రస్తాపింపవద్దు. శ్లో॥ బహవస్సాధవో లోకే యుక్తా ధర్మమనుష్ఠితాః। పరేషామపరాధేన వినష్టాస్స పరిచ్ఛదాః॥ లోకమునందు ధర్మమనుష్ఠించుచుండినవారును, మహాయోగ్యులును, సాధువులును నగు మానవులనేకులు పరుల యపరాధమువలన సపరివార సమేతముగ నాశమును బొందిరి అట్టులనే, నేను నీ యపరాధదోషము వలన నాశమును బొందగలను కావున నీకేది యుచితమని తోచుచున్నదో దానిని చేయుము. నాకక్కర లేదు. నేను నీ వెంబడి యెంతమాత్రము రాను. రాత్రియందు సంచరించువాఁడవగు నో రావణాసురుడా! మహాశౌర్యవంతుఁడును మహాధైర్యవంతుఁడును, మహాబలవంతుఁడును, నగు రాముఁడు రాక్షసలోకమునకంతయు నంతకుడని తెలంపుము. ఇది నిశ్చయము. నా మాటను మ్ము. రాముఁడితరులకు వ్యసనము గలిగించు కార్యములను జేయువాఁడు గాఁడు. నీవు ఒకవేళ శూర్పణఖను ముక్కుచెవులు గోసెను; ఖరుడు మొదలగు రాక్షసులను వధించెను; అని చెప్పుదువేమో? శూర్పణఖ సీతాదేవి విషయమున నపచారము జేయుటచే నా శూర్పణఖ యొక్క ముక్కుచెవులను గోసె. ఆ శూర్పణఖ నిమిత్తమున ఖరుడు సపరివారముతో రామునిపైకి బోవుటచేత తన్ను రక్షించుకొనుటకై వారని జంపె ఈ విషయమునందు రాముని యందేమి తప్పున్నది? నిజము చెప్పుము? నేను నీకు బంధువును. నీ క్షేమము గోరినవాఁడను కావున నేను నిశ్చయమును జెప్పుచున్నాను. నా మాట వినక బోతివేని యుద్ధమునందు వ్యర్థముగా నట్టి రామ బాణముచే గొట్టబడి బంధుమిత్ర సమేతముగ ప్రాణము

లనువిడిచి నశింపగలవు. అనిమారీచుఁడు రావణునితోఁ జెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ముప్పదితొమ్మిదవ సర్గముగిసెను.

రావణాసురుఁడు మారీచునితో నేను జెప్పినట్లు నకపోతివేని చంపెదనని చెప్పుట.

అనియిట్లు మారీచుండు హితముగను యుక్తియుక్తములుగను, ఎంత జెప్పినను, "చావనిష్టముగలవాఁడు మందుదినుటకిష్టపడనియట్లు" రావణాసురుఁడువినదయ్యె. మఱియు రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు మృత్యువుచేత బ్రేరితుండౌటచే సత్యమును, మేలుగలిగించునదియును, నగుమాటలుచెప్పుచున్న మారీచునిజూచి మహాకఠినమును చెప్పరానిదియును, నగుమాటను జెప్పదలచి యిట్లనియె.

ఓమారీచుఁడా! నావిషయమై నీవిట్లనుచితములైన మాటలుచెప్పుచున్నావు. ఇవన్నియు "చవిటిభూమియందు విత్తఁబడినవిత్తనములవలె" నిష్ఫలములు. మఱియు పాపాచరణుఁడును, మూర్ఖుఁడును, మానవుఁడును, నగు రామునితో యుద్ధమునకుబోకుండ నన్ను మఱల్చుటకు నీవలనగాదు. నీవు చెప్పినమాటలకు నేనుభయపడియూరకుండను. మూర్ఖురాలగునాయుది (కైకేయి) చెప్పినమాటవినినంతనె, విహితులను, రాజ్యమును, తల్లిని, తండ్రినివిడిచి, యరణ్యమునకువచ్చినట్టి మహామూర్ఖుఁడు రాముఁడు. మఱియురణరంగమున ఖరునిజంపినట్టి రామునకు, నతనిప్రాణములకన్ననధికమగు నట్టిసీతను నీకండ్లయెదుట నవశ్యముగనపహరించి తెచ్చెదను. మారీచుఁడా! ఇట్లునామనస్సునందు నిశ్చయించియున్నాను. ఈనిశ్చయమును సురాసురులును, ఇంద్రునితోఁగూడిన సమస్తదేవతలును మఱలింపజాలరు. ఈకార్యమును నిశ్చయించుటయందుగుణదోషములుగాని, ఉపాయాపాయములుగాని నేనునిన్నడిగినయెడల నీవిట్లుచెప్పవచ్చును. ఐశ్వర్యమునుగోరువాఁడును, మహామతిమంతుఁడును, నగుప్రధానిమైనను, తన్నురాజడిగినవెనుక, చేతులుముకుళించుకొని, తనకుదోచినయర్థమును ప్రభువునకుఁజెప్పవలయును. అట్లుచెప్పవపుడుకూడ రాజునకువిరోధముకానిదియును, మహామృదువైనదియును, మేలుకలుగజేయునదియును, శుభకరంబైనదియును, మిగులవినయముతోఁగూడినదియును, నగుమాటచెప్పవలయును. మారీచుఁడా! నిర్లక్ష్యముగజెప్పునట్టి మాటమేలుగలిగించునదైయున్నను, తిరస్కారపూర్వకమైనదైనందున, సన్మానార్హుఁడగురాజు ఆమాటనుఅంగీకరింపడు, మఱియుమహా పరాక్రమశాలులగురాజులు, అగ్నిహోత్రునియొక్కయు, ఇంద్రునియొక్కయు, చంద్రునియొక్కయు, వరుణునియొక్కయు, యమునియొక్కయు రూపములనైదింటినిధరించియుందురు. రాక్షసుఁడవగు నోమారీచుఁడా! మహాత్ములగురాజులుఅట్లు, అగ్నిహోత్రునియొక్క యుష్ణమును, దేవేంద్రునియొక్క పరాక్రమమును, చంద్రునియొక్కచల్లదనమును, యమునియొక్క శిక్షాశక్తియును, ధరించియుందురు. కావునరాజులను సమస్తావస్థలయందును గౌరవింపుచు బూజింపుచునుండవలయును. నీవురాజధర్మములను తెలియనివాఁడవగుటచేత నీవజ్ఞానమున నవలంబించి, మిగులదుస్స్వభావుఁడవై అభ్యాగతినైవచ్చిననన్నిటు పరుషములగు మాటలాడితివి. మారీచుఁడా! నేనుచేయబూనుకున్న కార్యమునుగుఱించి గుణదోషములనుగాని యుక్తాయుక్తములనుగాని నిన్ను నేనడుగలేదు. మహాపరాక్రమవంతుఁడవగు నోమారీచుఁడా! ఇప్పుడు నేనునీకుఁ జెప్పడమేమంటే; ఈగొప్పకార్యమును నెరవేర్చుటకొఱకు నీవునాకుసహాయము చేయవలసినది. అట్లుసహాయముచేయుటయందు నీవునాయిష్టముచొప్పున జేయవలసినకార్యమును జెప్పెదవినుము మారీచుఁడా! నీవువెండిమచ్చలతో నానావర్ణములుగల బంగారు జింకరూపమును ధరించి యారామునియాశ్రమమునందు సీతకుముందుప్రక్క సంచరింపుచుండుము. మఱియు అట్లుసంచరింపుచుండి యాసీతకు నీపైయాశబుట్టునట్లు చేయుటకై నీయిష్టము చొప్పున సంచరింపుచుండుము అంతనాసీత బంగారుజింకరూపమునుధరించియున్న నిన్నుజూచి మిగులఆశ్చర్యమునుబొంది యీజింకనతిశీఘ్రముగ బట్టితెచ్చినాకిమ్మని తనమగడగు రామునిఅడుగును ఆరాముఁడు నిన్నుబట్టుకొనుటకు సీతాలక్ష్మణులనువిడిచి రాగానే నీవతిదూరముగపోయి, హాలక్ష్మణా! హాసీతా! అనిరాముఁడు చెప్పినట్లువలె యరువుము. ఆశబ్దమునువిన్నతోడనే లక్ష్మణుఁడుమిగులతొట్రుపాటునుబొంది, రామునియందలి స్నేహముచేతను, సీతయొక్క ప్రేరేపణవలనను రాముఁడు పోయినత్రోవనేబోవును. అట్లురామలక్ష్మణులిరువురును బైటపోయినవెనుక వేయికన్నులుగలయింద్రుడు శచీదేవినిదెచ్చినట్లు యథాసుఖముగ సీతనుదీసికొనివచ్చెదను. సువ్రతుఁడవగునోమారీచుఁడా! నీవీకార్యమునుమాత్రముచేసి పిమ్మటనీయిష్టముచొప్పునబొమ్ము. నీకునారాజ్యములోనర్ధరాజ్యమును యిచ్చెదను సౌమ్యుఁడవగు నోమారీచుఁడా! ఈకార్యము చక్కగనెరవేరుటకొఱకునీవుమహాసౌందర్యముగు మృగరూపమునుదాల్చి దండకారణ్యమునందుండు రామునియాశ్రమ

మునకుఁబొమ్ము. నేనును రథసమేతుఁడనై నీవెనువెంట వచ్చెదను. ఈరీతిగ రాముని మోసపుచ్చి యుద్ధములేకయే సులభోపాయముచేత సీతను ఎత్తికొని సీతోగూడ లంకానగరమునకుఁ వచ్చెదను. మారీచుఁడా! నీవీపని జేయకపోతివేని యిప్పుడే నిన్నుజంపెదను. నాయొక్కపనిని నీచేత బలవంతముగనైనను చేయించెదను. రాజునకు విరోధముగనుండువానికి ఒకానొకప్పుడుగూడ సౌఖ్యము గలుగనేరదు. అదియునుగాక నీవిపుడు రామునియొద్దకు బోదువేని బ్రతికియుండుటయందుగాని చచ్చుటయందుగాని సంశయము అట్లుండగా నీవిపుడు నాతోటివైరమును బెట్టుకుందువేని నిన్నిప్పుడె చంపెదను. ఇందుకుసందియములేదు. నీవీ రెంటిని చక్కగనాలోచించి యేదినీకుమేలని తోచుచున్నదో అట్లుచేయుము అనిరావణాసురుడు మారీచునితోఁ జెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండము నందలి నలుబదియవసర్గ ముగిసెను.

మారీచుడు రావణాసురునితో నీకాయుస్సు మూడినదనిచెప్పుట

ఇట్లు రావణాసురుడు తనకు సూటిగానిమాటను రాజమార్గముగ నాజ్ఞాపింపరాక్షసుండగు మారీచుడు, రాక్షసేశ్వరుఁడగు రావణాసురునిఁజూచి మిగులఁగఠినమగు మాటలను జెప్పదలచి యిట్లనియె.

ఓ రావణాసురుడా! నీకును, నీపుత్రులకును, నీరాజ్యమునకును, నీమంత్రులకును, వినాశము బుట్టించునట్టి యీయుపాయమును నీకేపాపాత్ముఁడు బోధించె? ఓ రాక్షసరాజా! నీవుసౌఖ్యముగ రాజ్యలక్ష్మి ననుభవించుచుండుటను యేపాపిష్ఠుఁడు చూడలేక బోయె? మృత్యుద్వారమగు నీకార్యమును కపటోపాయము వలన నీకెవ్వఁడు బోధించె? నీకంటె పరాక్రమమునందు తక్కువవారగు రాక్షసులు నీకు విరోధులనుట కెంతమాత్రమును సంశయములేదు కావుననట్టివారునీకంటెబలవంతుఁడగు రామునిచేజిక్కి నీవు నశించిపోవలయునని దలంచుచున్నారు. నిశాచరుడవగు నో రావణాసురుడా! ఏనీచుఁడు నీకిట్టిఅహితవాక్యములను ఉపదేశించిఅతని దుష్కార్యములచేనిన్ను నాశనమొందింప గోరియున్నాఁడు? రావణాసురుఁడా! నీమంత్రులలో నెవ్వరైనను, దేహమెఱుగక తప్పుమార్గమునబోయెడినిన్ను హితోపదేశమున మరల్పకున్నారు. కావున వారందఱును చంపదగినవారయ్యును, వారిని జంపకున్నావు. అదిగాక రాజు యథేచ్ఛావ్యాపారము గలవాఁడై తప్పుమార్గమున బోవుచుండెనేని యోగ్యులగు మంత్రులు సమస్తప్రయత్నములచేనతని నడ్డగింపవలయును. నీవు తప్పుమార్గమున బోవుచు నిగ్రహింపఁదగినవాఁడవయ్యును నిన్నునీమంత్రులడ్డగించి మంచిమార్గమునకేల మరల్పకున్నారు? జయించువారలలో నుత్తముఁడవగు నోరావణాసురుడా! రాజు నిర్మలుఁడగునేని మంత్రులు ధర్మార్థకామములను కీర్తిని బొందుదురు. రావణాసురుఁడా! రాజుదోషయుక్తప్రవర్తనుఁడగునేని మంత్రులకుఁ గొంచమైనను ప్రయోజనము లేదు. మఱియు నితరజనములకును రాజుయొక్క దుర్గుణములవలన సమస్తసంకటములు సంభవించును. జయమునకును, ధర్మమునకును, రాజేమూలము. కావున సమస్తావస్థలయందును రాజును రక్షింపవలయును. రాక్షసుఁడవగు రావణాసురుఁడా! రాజుక్రూరుఁడైనను ప్రజలకనుకూలుఁడు కానివాఁడైనను, నీతిలేనివాఁడైనను రాజ్యమును బాలింపఁజాలఁడు చేతగానిసారథులు, మహావేగముగబోవునట్టిగుఱ్ఱములంబూన్చిన రథమును మిట్టపల్లపు ప్రదేశములయందుదోలుచు గుఱ్ఱములతోగూడ సారథియునునశించునట్లు దురాలోచనను జెప్పునట్టి మంత్రులు రాజుతోగూడ నశింతురు. లోకమునందు నీతిమార్గప్రవర్తకులై ధర్మమాచరించుచుండెడి సత్పురుషులనేకులు, పరులయపరాధము వలన, బంధుమిత్రపుత్రాది జనములతోఁగూడ నశించియున్నారు. రావణాసురుడా! "నక్కచేఁగాపాడఁబడుచున్నమేకలవలె" ప్రతికూలుఁడును, మహాక్రూరుఁడును, నగు రాజుచేఁబాలింపఁబడుచుండు ప్రజలు క్రమక్రమముగ క్షీణింపుదురు ఆలాగుననే, మహాక్రూరుడవును, దుర్మదముగలవాడవును, ఇంద్రియములకు లోఁబడినవాఁడవును, నగునీవురాక్షసులకు ప్రభువగుటచే రాక్షసులందఱును అవశ్యముగా నాశమొందెదరు. రావణాసురుడా! ఇది నేను కావలయునని తెచ్చుకొన్నదికాదు అకస్మాత్తుగ సంభవించుచున్నది. అట్లయ్యెనేని నేనొక్కడనే నశించెదను కావున నావిషయమైచింతింపనక్కఱలేదు నీవిషయమనిననో నావలెగాదు. నీవొక్కడవుకావు సేనాసమేతముగ సమస్తరాక్షసులును నాశనమొందెదరు కావున నవశ్యముగ చింతింపవలయును. మఱియు రాముని యెదుటఁబడినతోడనే రాముఁడవశ్యముగ నన్నుజంపును పిమ్మట శీఘ్రకాలములోనే నిన్నునుజంపును కావున నీచేఁజచ్చుటకన్న రామునిచేఁజచ్చి కృతార్థుఁడనయ్యెదను. రావణాసురుడా! రామునిదర్శనమైనతోడనే నేను జచ్చినాననినిశ్చయింపుము. సీతనపహరించినతోడనే నీవునీసమస్తబంధుజనులతోగూడ చచ్చినవాడవేయనినమ్ముము ఇప్పుడుమనమిద్దర

మును రామునియాశ్రమమునకుబోయి యచట పర్ణశాల నుండిసీతనుదీసికొనివచ్చితివేని నీవుప్రాణముతో నుండబోవునదిలేదు. నేనంతకుమున్నే చత్తును మఱియు లంకనశించును. లోకమునందుసమస్తరాక్షసులును నాశనమును బొందెదరు. రావణాసురుడా! నేనెంతహితమునుబోధించి నిన్నడ్డగించినను నామాటలు నీకుచెవిదూరకున్నది. ఆయుస్సుతీరిమరణకాలము సమీపించినపుడు, మానవులు విహితులుచెప్పెడిహితోక్తుల నెంతమాత్రమునువినరు.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నలుబదియొకటవ సర్గ ముగిసెను.

▶❀◀

—{ మారీచుడుజింకరూపమునుధరించిరామునియాశ్రమమునందుసంచరించుట. }—

అంత మారీచుడు రావణునితో నీప్రకారముగజెప్పి, రాక్షసేశ్వరుడగు రావణాసురునివలని భయమునకు వెఱచి పరమదుఃఖితుడై, నీయిష్టప్రకారముగ బోవుదమనిరావణాసురునితోడజెప్పి మఱల నిట్లనియె.

రావణాసురుడా! నన్నుజంపుటకొఱకు ధనుర్బాణములును ఖడ్గమునుధరించియున్న రామునిజూచినంతనేనాప్రాణములుపోవును. రామునిపైకిలంఘించి యెట్టిపరాక్రమశాలియైనను మఱలప్రాణములతోతప్పించుకొని రాలేడు నీవుఒకటరుడవుయమదండముచే గొట్టబడినవాడవైయున్నావు. నీతోసమానుడను నేనొకడ నున్నాను(అనగామనకిద్దఱికిని ఆయుస్సుమూడియున్నది) నీకీరీతిగదుర్బుద్ధిపొసగియుండగా నేనేమిసేయగలను నాయనా! రావణాసురుడా! ఇదిగోనేనుపోవుచున్నాను. నీకుమంగళమగుగాక అనిమారీచుడుచెప్పగవిని, రావణాసురుడుఆమాటకుమహాసంతోషమునుబొంది గాఢాలింగనము చేసుకొని యిట్లనియె

ఓమారీచుడా! నాయిష్టము ననుసరించి మహాశౌర్యముగలవాడవై నీవిప్పుడు జెప్పినమాటయేనీది. ఇప్పుడుగదా నీవుమారీచుడవు ఇంతకుముందునీవు వేరేయితరరాక్షసుడవు. మంచిది. నవరత్నములచే నలంకరింపబడి నదియును, పిశాచముఖములుగల గాడిదెలచే బూన్పబడినదియుననగు నీరథమునైయతిశీఘ్రముగ నాతోగూడకూర్చుండుము. అచ్చటికిపోయినవెనుక నీవుసీతనుమోసపుచ్చి నీయిష్టముచొప్పునబొమ్ము. నేనచటనెవ్వరులేనిసమయమున సీతనపహరించుకొనివచ్చెదను. అనిరావణాసురుడు మారీచునితోడజెప్పె. అంతనారావణమారీచులిద్దరును విమానమువలెనున్నరథమునెక్కి యాయాశ్రమమునువిడిచి యతివేగముగబోయిరి. అట్లారావణమారీచులు రథారూఢులైపోవుచుమార్గమునఅనేకపట్టణములను, అరణ్యములను, పర్వతములను, నదులను, సమస్తదేశములను, నగరములనుజూచుచుబోయిరి. అట్లుపోయిపోయి రావణమారీచులిద్దఱును దండకారణ్యమునందు ప్రవేశించి రాముని యాశ్రమమును జూచిరి. అంతరావణాసురుడు బంగారుచే నలంకరింపబడిన యారథమును దిగి మారీచుని చెయ్యిబట్టుకొని యిట్లనియె.

స్నేహితుడా! మారీచుడా! ఇదిగోఅరటిచెట్లచేబరివేష్టింపబడియుండెడు రామునియొక్క ఆశ్రమమును జూచుము. ఇంకమనమువేకార్యముకొఱకు వచ్చితిమో ఆకార్యమునుఅతిశీఘ్రముగజేయుము. అనిరావణాసురుడుచెప్పె. అంత మారీచుడుజింకరూపమునుధరించి రాముని యాశ్రమముయొక్క వాకిటిముందర సంచరింపుచుండె. మఱియునమ్మారీచుడు చూచువారలకు మిగులనాశ్చర్యకరమగు గొప్పలేడిరూపమునుధరించి, శ్రేష్ఠములైన యింద్రనీలములవంటి కొనకొమ్ములను, కొంతవరకుతెలుపును కొంతవరకు నలుపునుగలిసిన వర్ణముతో నొప్పుచుండెడు ముఖమును, పైభాగమునెఱ్ఱతామరవంటివర్ణముగలదియు క్రిందిభాగము నల్లగలువవంటిరంగుగలదియుననగు నోరును, ఒకవైపున నింద్రనీలమణుల కాంతిగలవియును, మఱియొకవైపున నల్లగలువలకాంతివంటికాంతిగలవియును, నగు చెవులును, ఇంద్రనీలపుమణుల పలుకులవంటి పెదవులను, మొల్లలలోనుచంద్రునితెరానువజ్రముతోను సమానమైనకాంతిగలకడుపును, ఇప్పపువ్వుతోసమానమైనవర్ణముగలయొకప్రక్కయును, తామరకింజల్కములతో సమానమైనవర్ణముగలమఱియొకప్రక్కయును, వైడూర్యపుమణులతోసమానములైన గిట్టలను, సూక్ష్మములైనపిక్కలను, దృఢమైన సంధిబంధంబులనుధరించి, సమస్తావయవములను మహాసుందరములై యొప్పుచుండెను. మఱియునమ్మారీచునితోక యింద్రధనస్సుతోసరిపోలువర్ణముగలిగి పైకెత్తుకొనబడియుండె. ఈరీతిగనమ్మారీచుడు మనోజ్ఞమైనయాకారముగలవాడును, సమస్తరత్నములచే నలంకరింపబడినవాడునునై ఒప్పుచు, క్షణమాత్రములోనమనోహరాకృతినిదాల్చి మిగులమనోజ్ఞమగు నయ్యరణ్యమున రామునియాశ్రమముముందరనిలిచె అట్లామారీచుడు, మిగులమనోజ్ఞమైనదియును, చూడదగినదియును, పలువిధములగు గైరికాదిధాతువులయొక్క వర్ణముచే విచిత్రమైనదియుననగు నాకారమును దాల్చి సీతాదేవిని మోసపుచ్చుటకై యయ్యాశ్రమప్రాంతములనుండెడు పచ్చికనుమే

యుదుండెడి మఱియు నమ్మారీచుఁడు వెండిచుక్కలచే విచిత్రమైనవర్ణముగలవాఁడై చూచువారలకు మహానందమును బుట్టించుచు చెట్లపై చెంగలించుచు చిగుళ్లు మేయుచు సంచరించుచుండెను. అట్లు దిరుగుచు కుటిలమృగరూపధారి యగు నామారీచుఁడు, కృపహరూపముగనుండెడు కదళీవనములను కొండగోగులను చెంగలించుచు మఱియవ్వలికిబోయి సీతాదేవిదృష్టికి గోచరమగు స్థానమును జేరి యచటనిటునటు సంచరించుచుండెను. మఱియు తామరకింజల్కములయొక్క వర్ణమువంటి వర్ణముతో నొప్పుచుండెడి వీపుగలయా గొప్పజింక రామునియాశ్రమముయొక్క సమీపమునందు మహావినోదముగ సంచరించుచుండెను. ఉత్తమమృగరూపమును దాల్చినయమ్మారీచుఁడు, అస్థలమునందుండి యవ్వలికిబోయి మఱల నాప్రదేశమునకువచ్చి యచటదిరుగుచు మఱలబోవుచు తిరుగవచ్చుచు నిట్లనేకవిధముల విహరించుచుండెను.

ఇట్లమ్మారీచుఁ డనేకవిధములఁ గ్రీడించుచు, ఒకచోట భూమిపై కొంతసేపు కూర్చుండును. అంత నచటనుండి లేచి యాశ్రమద్వారము పొంతనుండెడు మృగములగుంపులతో చేరంబోవును. మృగరూపమును దాల్చి సీతాదేవితన్ను జూడగోరుచున్న యమ్మారీచుఁడట్లు మృగములసమీపమునకుఁబోయి నపుడవితన్ను చేరరాగా తానుమఱల దూరముగబోవును. ఇట్లు నానావిధములుగ సంచరించుచు ఆశ్రమమునకు ముందు ప్రక్కను నేచుట్టిచుట్టితిరుగుచుండెను. అప్పుడా యరణ్యముననున్న యితరమృగములన్నియు మృగరూపధారియగు నమ్మారీచునిజూచి దగ్గిరకుబోయి వాసనజూచి యిదిమాయామృగమని తెలిసికొని దశదిశలకును పఱుగులిడుచుండెను. ఇతరమృగములట్లు పరుగెత్తుచున్నను, మృగములజంపితినుటయందాసక్తుఁడగు రాక్షసుఁడు తనకృత్రిమరూపము బైలుపడకుండుటకై అయ్యరణ్యముననున్న మృగములనువాసనజూచి చంపిభక్షింపడయ్యె. అట్లుండ శోభనకరములగు నేత్రములుగల సీతాదేవిపువ్వులుకోయుట కిచ్ఛగలదియగుచు పూలచెట్లయొద్దకువచ్చె. మహాసుందరమైనముఖముగల యాసీతాదేవి పుష్పములను గోయుచు కొండగోగులు యశోకములు మామిడిచెట్లు మొగలుగు వృక్షములసమీపమునకుఁబోయెను. అడవిలోనుండఁదగిన యుత్తమురాలగుసీతాదేవి, అట్లావృక్షములసమీపమునకుబోయి ముత్తెములురత్నములవలె నుండుచుక్కలతో విచిత్రమైనదేహముగల యాజింకనుజూచె. అట్లకస్మాత్తుగజూచి సుందరములైనపండ్లును పెదవులునుగల యాసీతాదేవి మిగులనాశ్చర్యమునుబొంది కన్నులు తెఱచి విప్పిచూచి గైరికాదిధాతువులయొక్క వర్ణములతో నొప్పుచుండెడి వెండుకలుగల యాజింకను మిగులప్రీతితో జూచుచుండెను. అట్టియెడ నమ్మాయామృగము రామునిభార్యయగు సీతాదేవివచ్చుటను జూచి, యావనమును మిగుల నాశ్చర్యకరముగ ప్రకాశింపఁజేసితిరుగుచుండెను. అంత జనకమహారాజపుత్త్రికయగు సీతాదేవియిదివరకెప్పుడును జూడనిదియును సమస్తమణుల యొక్క కాంతిచే ప్రకాశించుచున్నదియునునగు నాజింకను జూచి పరమాశ్చర్యమును బొందె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నలుబదిరెండవసర్గము ముగిసెను.

(*)

సీతాదేవిమాయామృగముగ జింకను బట్టియిమ్మని రాముని నడుగుట.

సుందరములగు పిరుదులుగలదియును, కుటిలములుగాని యవయవములుగలదియును, మలినములేని బంగారువర్ణముగలదియును, నగు నాసీతాదేవి, వెండిబంగారువన్నెలతోఁ బ్రకాశించుచుండెడు నుభయపార్శ్వములుగల యామృగమునుజూచి మహాసంతోషమునుబొంది పెనిమిటియైనరాముని, ఆయుధధారియగులక్ష్మణుని, బిలిచె అట్లు సీతాదేవి పిలిచినతోడనే పురుషోత్తములగు రామలక్ష్మణులిరువురు నచటికివచ్చి యాప్రదేశమున నిటునటుజూచుచు నాజింకనుజూచిరి అంతలక్ష్మణుఁడు మాత్రము ఆమృగమునుజూచినతోడనే సంశయమునుబొంది రామునిజూచి యిట్లనియె

ఓ అన్నా! ఈమృగము మారీచుఁడను రాక్షసుఁడేయని నాకుఁదోచుచున్నది రాముఁడా! కామరూపియగు నీమారీచుఁడు, పాపహేతువగు నీవేషముతోనుండి, ఉల్లాసముగ వనమునందు వేటలాడవచ్చిన రాజులనేకులను జంపియున్నాఁడు పురుషోత్తముఁడవగునో రాముఁడా! అన్నా ఈమారీచుఁడు సకలమాయలనెఱింగినవాఁడు తనమాయచేత మిగులకాంతిగలదియును, గంధర్వనగరముతో సమానమైన యాకారముగలదియును, నగునీమృగరూపమును ధరించియున్నాఁడు మహాప్రభో! అన్నా! రామచంద్రా! ఇట్లు రత్నములయాకృతిగల మచ్చలతో సృష్టింపబడిన విచిత్రమగుజింక భూలోకమునం దెచటను లేదు కావున నిది మాయయేగాని వేరుగాదు. ఎంతమాత్రమును సందియము లేదు అనిలక్ష్మణుఁడు రామునితో జెప్పె అంతమంచిచిఱునగవుగల సీతాదేవి యామాయామృగముయొక్క చర్మసౌందర్యమునకు మోహమునుబొంది పరమసంతసముగలదియై రామునిజూచియిట్లనియె.

పూజ్యుడవగు దశరథరాజనందనా! రామచంద్రా! మహాసుందరమగు నీమృగమునందు నాకుమిగుల యిష్టము లుగుచున్నది. ఇది నామనస్సును లాగుచున్నది. దీనిని బట్టితీసి కొనిరమ్ము. మనముదీనితో ఆటలాడుటకొఱకు నుంచుకొందము. మహాబాహుడవగు నోరాముడా! ప్రాణనాథా ఇచట మనయాశ్రమస్థానమునందనేకములైన పుణ్యదర్శనములగు మృగములును, సృమరమృగములును, చమరమృగములును, గుంపులుగుంపులుగనున్నవి. మఱియు మంచిరూపములుగలవియును, మనోజ్ఞములైనవియునునగు నేలుగుబంట్లు, మచ్చలతో నొప్పుచుండెడు జింకలగుంపులు, వానరములు. కిన్నరమృగములు, మొదలగుమృగములనేకములున్నవి. రాముడా! అట్లనేకములున్నను, ఈమృగశ్రేష్ఠమునకువలె దేహకాంతియు, ఒప్పు మొదలగునవియును ఏమృగమునకును లేదు. దీనికిసమానమైనమృగమును యిదివఱకెప్పుడును జూచిందిలేదు. ఈజింక పలువిధములైన వర్ణములు గలిగి మహావిచిత్రమగు శరీరముతోను, రత్నములవంటిమచ్చలతోను నొప్పుచున్నదియై చంద్రుడు భూమిని ప్రకాశింపజేయునట్లు యీయరణ్యమునంతయును మిగులప్రకాశింపజేయుచున్నది ఆహా యిదియేమిసౌందర్యము! ఆహా యేమిదీనిప్రకాశము! ఆహా యేమిదీనికంఠస్వనము! ఆహా యేమిదీనియవయవసౌష్ఠవము! అన్నియు పరమాశ్చర్యముగనున్నవి చిత్రవర్ణమైన దేహముగల యీజింక నామనస్సును మిక్కిలియును హరించుచున్నది. కావున నీవీమృగమును ప్రాణముతోనే దీసికొనివచ్చితివేని నాకు మహాసంతోషముగనుండును. చూచువారికందరికిని పరమాశ్చర్యకరముగనుండును. మఱియు మనము వనవాసవ్రతము నెరవేర్చుకొనిపోయి మఱల రాజ్యసంపదయందుండు నప్పుడు, ఈమృగము మనయంతఃపురమునందు వేడుకార్థముగ నుండును ఓరాముడా! ప్రాణనాథా! మనమయోధ్యకుబోయినవెనుక నచటనీమృగము భరతునకును నీకును నాకును నాయత్తలకును మహాసంతోషమును గలిగించుచుండును. పురుషోత్తముడవగు నోరాముడా! ఈమృగోత్తమము ప్రాణముతో నీకుపట్టుబడదేని దీనినిజంపి దీనిచర్మమునైననుదెచ్చి నాకిమ్ము. అంతనే నాబంగారు వికారమైనచర్మమును, దర్భాసనముపైబఱచుకొని దానిపై శయనింపవలయునని నాకుమిగులకోరికగలదు. ఇట్లుస్త్రీలు తమయిష్టముచొప్పున కోరుటయుక్తముగాదు. ఇదిమహాదుర్నీతి. ఎంతమాత్రమునుతగదు. అయినను నీజింకయొక్క దేహచ్ఛాయనుజూచిన నాకుపరమాశ్చర్యముగలిగినది కావున నేనడిగితిని అని సీతచెప్పె అంత బంగారువర్ణముగలిగి కొనలు యింద్రనీలపుమణులతో సరిపోలుకొమ్ములుగలదియును, అప్పుడుదయించిన సూర్యునికాంతివంటి కాంతిగలదియును, నక్షత్రములతో గూడినయాకాశమువలెనున్నమేనుగలదియునునగు నామృగమునుజూచినతోడనే రాముడును మిగులనాశ్చర్యమునుబొందెను. అట్లాశ్చర్యమును బొంది రాముడు సీతాదేవియడుగుటవలనను, మిగులనద్భుతమగు నామృగముయొక్క రూపసౌందర్యములనుజూచుటవలనను, భ్రమించియాశగలవాడై, సీతప్రేరేపించుటచే సంతసమునుబొంది తమ్ముడగులక్ష్మణునిజూచి యిట్లనియె.

లక్ష్మణా! సీతకీమృగముపై నెంతయాశగలిగినదో చూడుము. సౌందర్యాతిశయములచే నొప్పుచుండెడు నీలాటి జింక యీవనమునందెచటనుదొరకదు లక్ష్మణా! దీనికిసమానమైనమృగము నందనవనమునందును చైత్రరథమునందును నొకమృగమైనను దొరకదు ఇంకభూమియందలి యరణ్యములలో దొరకదని జెప్పనేల? అనులోమవిలోమములుగనున్నవియును, చిత్రవర్ణములుగలవియును, బంగారుమచ్చలుగలవియును, నగువెంట్రుకలు (అనగా రోమములు) యీజింకయొక్క శరీరమునందు మిగుల ప్రకాశింపుచున్నవి ఈజింక ఆవులించునప్పుడు, మిగుల ప్రకాశించుచు నగ్నిశిఖవలె వెలికివచ్చెడు నాలుక "మేఘమునుండివచ్చెడు మెఱుపుతీగవలెనే" యున్నది చూడుము ఇంద్రనీలపుమణితో చేయబడిన గిన్నెవంటినోరుగలదియును. శంఖముతోను ముత్యముతోను సరిపోలు వన్నెగలకడుపుగలదియును, ఇట్టిదనినిరూపించిచెప్పుటకలవిగాక యున్నదియును, నగుసీజింకనుజూచినంతనె యెవనికిఆశగలుగదు? ఓలక్ష్మణా! బంగారుమయమైనదియును, సమస్తమణులచే నేర్పరుపబడినట్లువలెనుండెడు మచ్చలుగలదియును, మహాసౌందర్యమైనదియును, నగునీజింకనుజూచినంతనె యెవనిమనస్సునకు ఆశ్చర్యముగలుగదు? లక్ష్మణా! రాజులుమాంసముసంపాదించుకొనుటకును, ధనుర్విద్యయందు నేర్పుగలుగుటకును, మహారణ్యములందు ప్రవేశించి మృగములను జంపుదురు అట్లు మహారణ్యములయందు వేటాడుటకుంబోయి మఱుగకస్థలములయందు పొంచులుండుటకు ప్రయత్నముసేయుచో నట్టిప్రదేశములయందు, శ్రేష్ఠమైనరత్నములు, బంగారు, నానావిధములైనధాతువులు మొదలగు, ధనములు దొరుకును లక్ష్మణా! మానవులు మనస్సునందుదంచునట్టిధనమునంతయు శుక్రుడు ప్రయత్నములేకయే నకోశమును నింపుకొనునట్లు, రాజులరణ్యములయందున్నమహార్హములగు ధనములనన్నింటిని సునాయాసము

గగాంవచ్చి తమకోశములను నిండించుకొందురు. లక్ష్మణా! ఒకకొత్తవస్తువును సంగ్రహింపగోరువాఁడు, యితరవిషయములనుగుఱించి యాలోచింపక తానుప్రయత్నించినవస్తువునే నెట్టులయినను సంపాదింప బ్రయత్నించునో, అట్టివారా శాస్త్రజ్ఞులును, అర్థార్జనసమర్థులును, అట్టిదానినే అర్థమనిచెప్పుదురు (అనఁగా సంపాదనజేయఁదగిన పదార్థమందురు) ఈమృగము అట్టివస్తువులలో నొకటికావునదీనిని సంపాదింపవాకిచ్ఛగలదు ఉత్తమమృగమగు దీనియొక్క బంగారుమయమైనచర్మముపైన మిగులనందమగు సన్నని నడుముగల సీతనాతోగూడఁ గూర్చుండును. లక్ష్మణా! మృదుస్వామునంత, కదళీమృగముగాని, ప్రియకీమృగముగాని, ప్రవేణీమృగముగాని, అవిమృగముగాని, దీనికి సమానముగావని నాబుద్ధికిదోఁచుచున్నది అనగా పైనజెప్పిన మృగములన్నియు మిగులమృదువగుచర్మములుగలవి. మఱియుమిగుల కాంతియుక్తమగు నీమృగమును, దివ్యమగునాకాశమున నక్షత్రరాశియందుదిరిగెడు మృగశీర్షమనుమృగమును, భూమికిదియును, ఆకాశమునకదియునునీ రెండే మహాశ్రేష్ఠములైనమృగములు, ఓలక్ష్మణా! నీవుచెప్పినట్లు ఇదిమారీచుని మాయయేయగు నేని, నేనుదీనినితప్పక చంపవలయును పూర్వము, బుద్ధిహీనుఁడును, దయలేనివాఁడును, నగునీమారీచుఁడు, ఈయారణ్యమునందుమృగరూపమున సంచరించుచు మునిశ్రేష్ఠులననేకులఁజంపియున్నాఁడు మఱియునీమృగము, వేటకువచ్చినవారును, గొప్పధనుస్సులనుబూనియున్నవారును, నగురాజులననేకులను జంపియున్నది కావునదీనిముఖ్యముగజంపవలయును పూర్వము యీయరణ్యమునందు, వాతాపియను రాక్షసుండొకఁడు ఋషులను మోసముచేయుటకు తాను మేకరూపమునుధరించి వారికాహారమైవారిగర్భమునందు బ్రవేశించిపిమ్మట "ఆడుగుఱ్ఱమునందు మగగాడిదెకుపుట్టినయాఁడుది పెద్దదై గర్భముధరించి యీనునప్పుడు, దూడతల్లిగర్భము చీల్చుకొని వెలికివచ్చి తల్లినిజంపునట్లు" బ్రాహ్మణోత్తములైనఋషులగర్భములనుజీల్చికొని వెలికివచ్చుచుండె. అట్లుబహుకాలముజరగిన వెనుక నొకనాడుఆవాతాపి,మాంసమునందలియాశచే మిగులమహనీయుఁడగు నగస్త్యమహర్షి సమీపమునకుఁబోయి పైనజెప్పినప్రకారముగ నాహారమయ్యె. అట్లాహారమై ఆయగస్త్యమహర్షి గర్భమునందుజొచ్చె అంతభగవంతుఁడగు నయ్యగస్త్య మహామునిభోజనముజేసిన వెనుకతనకడుపుచీల్చుటకు నావాతాపితనస్వభావరూపమును ధరింపఁగోరుచున్నవానిగ దెలిసికొనిచిరునగవుతోనిట్లనియె.

ఓవాతాపీ! నీవిట్టికార్యము చేయుట పాపమనియెంచక, నీబలగర్వముచేత అనేకబ్రాహ్మణోత్తములను జంపితివి. కావుననీవు నాకడుపులోజీర్ణమగుము. అనియగస్త్య మహాముని వాతాపికిఁజెప్పె. లక్ష్మణా! అపేరీతిగ, మొడతెగక ధర్మమునాచరించువాఁడను, ఇంద్రియములనుజయించినవాడను, నగునావంటివానిని అతిక్రమించెనేనియామారీచుఁడు వాతాపివలె నాశమునుబొందును "వాతాపియగస్త్యునిచేహతమైనట్లు" యీమారీచుఁడు నాచేఁజచ్చును. ఇందుసంశయములేదు రఘునందనుఁడవగు లక్ష్మణా! నీవుయుద్ధసన్నద్ధుడవై యిచ్చటనేయుండి మహాజాగరూకతతో సీతాదేవినిఁ గాపాడుచుండుము. మనపనులన్నియునీ సీతయందేయున్నవి. (అనగానీసీత లేనియెడల మనకేకార్యమునులేదు) సుమిత్రానందనా! తమ్ముఁడా! లక్ష్మణా! నేనుపోయి యీమృగమును జీవముతోఁ బట్టితెచ్చినను తెత్తును. లేనియెడల చంపియైనను దెత్తును. లక్ష్మణా! ఈజింకచర్మముపై సీతకుమిగులనాశగలిగియున్నది కావుననీని చర్మమే మనకుకావలసినది ఇదిగోయిప్పుడుదీనిజంపి చర్మముతెచ్చెదను నేనీమృగమును నొకబాణముతోఁ జంపివచ్చువరకు నీవీయాశ్రమమునందుండెడు సీతను యేమఱక కాచియుండుము నేనుపోయి యీజింకచర్మముచు తీసికొని యొకక్షణమాత్రములో వచ్చెదను. తమ్ముఁడా! లక్ష్మణా! నీవుమహాసామర్థ్యముగలవాఁడును, మహాబలశాలియును నగు జటాయువుతోగూడినవాఁడవై "సమస్తవిషయములందును సంశయముగలవాఁడున్నట్లు" మహాజాగ్రతతో నుండుము.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నలుబదిమూడవసర్గముగిసెను.

*)(

జింకరూపమునుధరించిన మారీచుని రాముఁడు సంహరించుట.

అనియిట్లు మహాశౌర్యసంపన్నుఁడగు రాముఁడుతమ్మునితోజెప్పి బంగారుతోఁజేయఁబడిన పిడిగలకత్తిని మొలకుఁగట్టుకొన అట్లుకత్తిమొలకుఁగట్టుకొని మహాపరాక్రమశాలియగురాముఁడు తనకుభూషణంబును మూడేటవంగినదియునునగు శార్ఙ్గధనస్సును చేతబట్టుకొని యమ్ములపొదులరురెంటినిఁగట్టుకొని బైలుదేరిపోయె. అట్లుబైలువెడలివచ్చుచున్నవాఁడును, రాజోత్తముఁడును, నగురామునిజూచిమారీచుడు వంచింపఁదలచి భయమునుబొందినట్లగపడకపోవుచు మఱలనగపడుచునుండె అంతరాముఁడుకత్తిమొలలోఁగట్టుకొని ధనుర్బాణములనుధరించి యామృగ

ముపోయినమార్గమును అనుసరించిపోయెను. అట్లుపోవుచు, మహాకాంతితోఁగూడి సమీపమున ముందరనున్నట్లుతోఁచువాఁడును, ధనుర్ధరుఁడునగు రాముని యభిప్రాయమును దెలిసికొని రాముడు బాణములనువిడుచునపుడు దానిని తప్పించుకొనుచున్నవాఁడును, ఒకప్పుడు రామునకు ఆశఁబుట్టించుటకై సమీపమునకువచ్చువాఁడును, మఱియొకప్పుడు భయభ్రాంతుఁడై ఆకాశమునకెగురునట్లతివేగమునఁబరుగెత్తిపోవుచున్నవాఁడును కొన్నియరణ్యప్రదేశములలో జూడనలవిగాక మఱిక్షణమాత్రములో నగపడుచు "మేఘఖండములచే గప్పఁబడి మఱల నవిదాటిపోయిన వెనుక నగపడు చంద్రబింబమువలె" నున్నవాఁడును నగుమారీచుని రాముఁడుచూచె. ఆజింక యొకనిమిషమాత్రములోన నతిసమీపమున నున్నట్లగపడుచు మఱల నిమిషములో నతిదూరమున నుండును. మృగరూపమును దాల్చియున్న యామారీచుడట్లు నిమిషమాత్రములోననగపడుచు మఱలనగపడకుండబోవుచు, రాముని ఆశ్రమస్థానమునుండి బహుదూరముయీడ్చుకొనిపోయెను. అట్లుపోయిపోయి రాముఁడా మృగముయొక్క పోకలకు మహాకుపితుడయ్యె. మఱలదాని సౌందర్యసంపదచే నాశగలవాఁడై భ్రాంతినిబొంది యొక మ్రానినీడయందు పచ్చికనేలపై నిలుచుండె. ఇటు, మృగరూపధారియగు నమ్మారీచుఁడు రాముని భ్రాంతచిత్తునిఁజేసి మఱలనాశబుట్టించుటకై యావనమునందుండెడి మృగములచేఁ బరివేష్టింపఁబడినవాఁడగుచు నతిసమీపమునఁ జూపట్టె. అట్లుగనిపించినయామృగమును, రాముఁడుతన్ను బట్టుకొనవచ్చుటనుజూచి మఱలనతిదూరము పరుగెత్తిపోయె. పరుగెత్తిపోయి యంతలోనే మహాభయమునఁబొందినదానివలె నంతర్హితమయ్యె. మఱినిమిషములోన నొకచెట్లగుంపుననుండి బైలువెడలె. ఇట్లుమారీచుడు జింకరూపముతో రాముని నానావిధములుగ శ్రమనొందించె. అంతమిగులశౌర్యవంతుఁడగు రాముఁడు ఆమృగము ఒకవృక్షసమూహమునుండి బైలుదేరివచ్చుటనుజూచి దానినెటులయినను జంపవలయునని నిశ్చయించె. అట్లుచంపనిశ్చయించి రాముఁడు బాణములనుఎత్తికొని మిగులకోపోద్దీపితుఁడైయుండె. మఱియు, విరోధులనుజంపువాఁడును, మహాబలపరాక్రమశాలియును నగురాముఁడు, సూర్యునికాంతితో సమానమైనదియును, మండుచున్నట్లున్నదియును, మిగులదృఢమగు ధనుస్సునందు సంధింపఁబడినదియును, ఆకర్ణాంతము లాగబడినదియును, మహాభయంకరమగు పామువలె నిట్టూర్పులను విడుచుచున్నదియును, ఆమృగమునే యుద్దేశించి మెక్కబెట్టబడినదియును, భగభగమండుచున్నదియును, బ్రహ్మదేవతాకమైనదియును, నగుఅస్త్రమును బ్రయోగించె. అంతఁబిడుగుతోసమానమైన యాశ్రేష్ఠమగుబాణము, ముందుమృగరూపమును భేదించి పిమ్మట ఆమారీచుని హృదయమును భేదించె. అట్లుమారీచుఁడు బాణముచేఁగొట్టబడి తాటిచెట్టుపొడవునపైకెగిరి, మహాభయంకరముగ పెద్దగా నఱచుచు నల్పజీవుఁడై నేలపైబడెను. అట్లునేలపైబడిచచ్చువాఁడై కపటమృగరూపమును విడిచి తనమొదటిరూపమును ధరించె. అట్లుతనరూపమును ధరించి మారీచుఁడు రావణాసురుని మాటనుదలచుకొని యిట్లనిచింతించె. ఏయుపాయమువలన సీతాదేవి లక్ష్మణుని నిచటికిఁబంపును? ఎవ్వరులేనికాలమున రావణాసురుడు సీతనువెవ్విధమున దొంగిలించికొనిపోవును? అని యోచించి రావణాసురుడు చెప్పినట్లుచేయవలయు. అందుకిది యుచితకాలమనిమెఱిగి, రాముని కంఠస్వరమువంటిధ్వనితో, హాసీతా! హాలక్ష్మణా! యనిగట్టిగానఱచె. అట్లఱచి పిమ్మటమిక్కిలిగొప్పదేహముగల యమ్మారీచుఁడు రాముఁడుప్రయోగించిన యాదివ్యమగు బాణముచేజీవస్థానమునందుగొట్టబడి ప్రాణములనువిడుచువాఁడై మృగరూపమునువదలి, తనమొదటి రాక్షసరూపమునుధరించి చచ్చె. అట్లుచచ్చుటకుమునుపే రామునిబాణముచేఁగొట్టబడినయామృగము, విచిత్రమైన బాహుపురులుగలవాఁడును, సమస్తదివ్యాభరణములను ధరించినవాఁడును, బంగారుహారములు ధరించినవాఁడును, పెద్దకోఱపండ్లుగలవాఁడును, నగురాక్షసుఁడాయె. అప్పుడురాముఁడు, నేలపైబడియున్నవాఁడును, భయంకరాకారము గలవాఁడును, నెత్తుటచేఁదడుపఁబడిన సర్వావయవములు గలవాఁడును, నేలపైబడి పొరలుచున్నవాఁడును, నగునారాక్షసునిజూచి, లక్ష్మణుడుచెప్పినమాటను జ్ఞాపకమునకుదెచ్చుకొని మనస్సునందు సీతాదేవినిదలచుకొనె. అట్లురాముఁడు సీతాదేవినిఁదలంచుకొని తనలోతానిట్లుచింతించె. ఇదిమారీచునిమాయయేగాని వేఱుగాదని లక్ష్మణుఁడు మునుపేచెప్పెను. అదినిజమయ్యె. ఇప్పుడునేను చంపినరాక్షసుఁడు మారీచుఁడుగాని వేఱుగాదు. ఈరాక్షసుఁడు, హాసీతా! హాలక్ష్మణా! యనినాకంఠస్వరముతో మహాశబ్దముగలుగునట్లు గట్టిగానఱచెను. ఈమాటనువినిసీతయేమాయెనో? మహాబాహుఁడగులక్ష్మణుఁడు నేమియవస్థనుబొందెనో? అనియిట్లు మహాత్ముఁడగు రాముడుచింతించి గగుర్పాటునొందిన రోమములుగలవాడయ్యె. మఱియుమృగరూపముతోవచ్చిన మాయారాక్షసుఁడగు మారీచునిజంపి, వాఁడుక్రిందపడునప్పుడు అట్లఱచుటనుదలంచి యిదిమ

హావ్యసనమునకు గారణమనితలంచి మిగులభయమును బొందె. అట్లుభయమునుబొంది రాముఁడు కేలోకజింక నుజంపి దానిమాంసమునుదీసికొని యతిశీఘ్రముగ జనస్థానసమీపముననున్న తనయాశ్రమమార్గమును బట్టిపోయె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నలుబదినాల్గవసర్గ ముగిసెను.

—{ సీతాదేవిలక్ష్మణునినిందించి రామునియొద్దకు బొమ్మనుట }—

అట్టియెడ నచట పర్ణశాలయందున్న సీతాదేవి రాముని కంఠధ్వనివలెనున్న ఆదుఃఖకరమగు ధ్వనినివిని, లక్ష్మణునిజూచి యిట్లనియె.

లక్ష్మణా! నీవుపోయి రాముని కనుగొనుము. పరమపీడితుఁడై గట్టిగానఱచుచున్న రామునికంఠధ్వనినివింటిని. కావున నికనాశరీరమునందు నామనస్సుగాని ప్రాణముగాని నిలువదు. అరణ్యమునందు అనాథవలె ఏడ్చుచున్న నీయన్నను రక్షింపుము లక్ష్మణా! రాక్షసులవశములో జిక్కి, "సింహములచేజిక్కి రక్షించువారెవ్వరినిగానక మహాదుఃఖమును బొందియున్న యాబోతువలె" పరితపించుచుండెడి నియన్ననురక్షించుటకు అతివేగముగఁబరుగెత్తిపొమ్ము. అనిసీతాదేవి యెన్నివిధములఁ జెప్పినను, లక్ష్మణుఁడు అన్నయాజ్ఞను నిర్లక్ష్యముజేసి బైలువెడలిపోడయ్యె. అంతసీతాదేవి మహాకోపముగలదియై లక్ష్మణుని జూచి యిట్లనియె.

ఓసుమిత్రానందనా! లక్ష్మణా! నీవిట్టిదుర్దశయందు గూడ నీయన్నకుసహాయముగఁ బోవకున్నావు. కావున నీవు నీయన్నకుమిత్రునివలెనటించెడు పరమశత్రువుగాని వేఱుగాదు. నీవునాయందిచ్ఛగలవాడవై రాముఁడుచచ్చిన నంతే చాలుననియున్నావు. లక్ష్మణుఁడా! నీవునిశ్చయముగ నామీదియాశచేత రామునికి సహాయముగ బోకున్నావు. అన్నకువ్యసనముసంభవించుట నీకుమహాసంతోషముగనున్నది నీకునీయన్నయందు ప్రియము యెంతమాత్రమునులేదు. కావున నమ్మహాతేజుఁడగు రామునివెదకుటకుఁబోక స్వస్థముగనున్నావు. నీవురామునిననుసరించి యిచటికివచ్చినవాఁడవుగాని, నన్నుగావలసి వచ్చినవాఁడవుకావు. అట్లుండగా రామునికి ప్రాణసంశయము గలిగినవెనుక నీవిచటనన్నుగాచికొనియుండి యేమిప్రయోజనము? నన్నింకనీవు గాపాడనక్కఱలేదు. అనియిట్లు మహాకోపముతో జెప్పుచున్నదియును, పరమదుఃఖముచేత కండ్లనుండినీరు ప్రవాహమువలె విడుచుచున్నదియును, నైమహాభయమునుబొందిన లేడివలెనున్న సీతాదేవినిజూచి లక్ష్మణుఁడిట్లనియె.

ఓసీతాదేవీ! పన్నగులుగాని, అసురులుగాని, గంధర్వులుగాని, దేవతులుగాని, రాక్షసులుగాని, నీపెనిమిటియగు రామునిజయింపలేరు ఇందుకెంతమాత్రమును సంశయములేదు. మంగళస్వరూపురాలవగు యోసీతాదేవీ! యుద్ధమున నింద్రునితోసమానుఁడగు రామునితోనెదిరించి యుద్ధము జేయువాఁడు, దేవతలయందుగాని, మానవులయందుగాని, గంధర్వులయందుగాని, పక్షులయందుగాని, రాక్షసులయందుగాని, పిశాచములయందుగాని, కిన్నరులయందుగాని, మృగములయందుగాని, మహాభయంకరులగు దానవులయందుగాని నొక్కఁడైనను లేఁడు. రాముఁడు యెవ్వరికిగాని యుద్ధమునందు జయింపశక్యమైనవాఁడుకాఁడు నీవిట్లుపలుకుట యుచితముగాదు. నిన్నీయరణ్యమున నొంటరిగ విడిచిపెట్టిపోవుటకు నాకిష్టములేదు. మహాబలవంతులైనను రాముని నెదిరింప శక్యముగాదు. మఱియుదేవేంద్రుఁడు సమస్తదేవతలతోగూడ సన్నద్ధుఁడైవచ్చినను, ముల్లోకము లొక్కటిగావచ్చినను, రాముని నెదిరింపఁజాలరు కావుననిమనస్సునందు సంతాపము నువిడువుము. దుఃఖింపకుము. నీభర్తయగురాముఁడు ఆ మృగశ్రేష్ఠమును జంప యతివేగముగవచ్చును. ఈశబ్దము రామునియొక్క కంఠధ్వనిచే గలిగినదికాదు. మారీచుఁడు తనమాయచే నిట్టిధ్వనిగలుగునట్లుచేసె. ఆమారీచునిమాయ గంధర్వనగరమువంటిది సొగసైన పలుకులుగల యో సీతాదేవీ! మహానుభావుఁడగు రాముఁడు "నేవచ్చువరకు నీసీతను మహాజాగ్రతతో గాపాడుచుండుమని" నన్ను నాకువప్పగించిపోయె. కావున నిన్నువిడిచిపోవుట కెంతమాత్రము నాకిష్టములేదు ఓసీతాదేవీ! ఖరుడుమొదలుగాగల జనస్థానమునందు రాక్షసులనుజంపుటవలన మనకునువారికిని బద్ధవైరముగలిగినది కావున హింసించుటకొఱకు వనమునందుసంచరించెడి యారాక్షసులు పలువిధములుగ నఱచుచున్నారు. ఈవిషయమునందు నివెంతమాత్రమును దుఃఖింపవలదు అనియిట్లు లక్ష్మణుడుచెప్పగవిని, సీతాదేవి మహాకోపముగలదై కన్నులెఱ్ఱజేసి యిందుండి నిష్ఠురముగఁబలుకుచు, సత్యవాదియగు లక్ష్మణునిజూచి కఠినవాక్యములను జెప్పదలచి యిట్లనియె.

ఆయ్యో! అన్యాయుఁడా! కులపాంసకుఁడా! చేయరానికార్యమును జేయఁగోరినవాఁడా! రామునకిట్టిమహా ఆపదసంభవించుట నీకుపరమసంతోషముగనున్నది. కావుననే రామునకిట్టి విపత్తుగలిగినప్పుడు యిలాటిమాటలను

జెప్పుచున్నావు లక్ష్మణుడా! ఎప్పుడుగాని, కపటమునడవడికగలవారును, క్రోధులును, ఘాతకులును నగునీవంటివారికిట్టి పాపాలోచనకలుగుట యెంతమాత్రమును ఆశ్చర్యముగాదు నీవు మహాదుష్టుడవు. నీవు, నానిమిత్తమయ్యో లేక, భరతునిచే ప్రేరేపింపబడియో, కపటవేషము ధరించి, ఎల్లవారిని విడిచి యొక్కడవె రాముని వెంబడించి యరణ్యమునకు వచ్చితివి. లక్ష్మణా! నీకుగాని భరతునకు గాని యాకోరిక సిద్ధింపదు. నల్లగలువలవంటి నల్లనిదేహకాంతిగలవాఁడును, తామరరేకులతో సమానమైన నేత్రములుగలవాఁడును, నగు రామునకు భార్యగానుండి అన్యపురుషుని నెట్లు అంగీకరింతును? ఓలక్ష్మణుడా! ఇదిగో! యిప్పుడె నీయెదుట ప్రాణములను విడుచుచున్నాను. సందేహము లేదు. రాముని విడిచి క్షణమైనను భూమిపై బ్రతికియుండను. అనియిట్లు సీతాదేవి మహాకఠినమును, గగుర్పాటును గలుగజేయునదియును నగు మాటను జెప్పె. అంత జితేంద్రియుడగు లక్ష్మణుఁడు చేతులు మొగిడ్చి సీతాదేవినిజూచి యిట్లనియె.

హా, హా, ఏమిమాటను జెప్పితివి నేను నీకు బదులు చెప్పనోపను. నీవు నాకు దేవతవు. శ్లో॥ వాక్యమప్రతిరూపంతు నచిత్రం స్త్రీషు మైథిలి। స్వభావస్త్వేష నారీణా మేవం లోకేషు దృశ్యతే॥ విముక్తధర్మాశ్చపలా స్తీక్ష్ణా భేదకరాః స్త్రియః॥ ఓసీతాదేవీ! ఇట్లనుచితమగు మాటను జెప్పుట స్త్రీలకు స్వభావమే గాని యాశ్చర్యముగాదు సమస్తలోకములయందును యిట్లే అగబడుచున్నది. స్త్రీలు ధర్మముతప్పినవారు చపలచిత్తులు మహాక్రూరులు విరోధముగలుగజేయువారు జనకమహారాజపుత్రికవగు నోసీతాదేవీ! అహా! నేనేమని చెప్పుదును నీవిపుడాడినమాట కాల్పఁబడిన నారసములను దెచ్చి నా రెండు చెవులలో నెక్కించినట్లున్నది ఇట్టివాక్యమును నేనెంతమాత్రమును ఓర్వజాలను. మిగుల న్యాయవాదినగు నన్ను నీవిట్లు అన్యాయముగ పరుషములాడితివి ఈవిషయమున నీవనమునందు సంచరించెడు దేవతలందఱు నాకు సాక్షులై వినియున్నారు నేను నాయన్న చెప్పినమాట జవదాటకయున్నాను నన్నిట్లు సందేహించితివి. కావున నీవు "మండిపోదువుగాక" నిన్నిప్పుడే నాశము నొందగుము. శ్లో॥ స్త్రీత్వందుష్టంస్వభావేన గురువాక్యేవ్యవస్థితమ్॥ స్త్రీజన్మమె మహాదోషకరమైనది. దుష్టత్వము స్త్రీలజన్మముతోగూడ బుట్టినది. అనిచెప్పి మఱియుని ట్లనెను

మిగుల దర్శనీయ ముఖముగలయో సీతాదేవీ! నేను ఇప్పుడు సలమునకు బోయెదను నీకు శుభమగుగాక. నిన్నీవనదేవతలందఱును గాపాడుచుందురుగాక జనకమహారాజపుత్రికవగు నోసీతాదేవీ! ఇప్పుడు మహాభయంకరములగు నిట్టిదుర్నిమిత్తములు నీకుఁదోచుచుండగా, నేను తిరుగవచ్చినతరువాత, రామునితోగూడనుండెడు నిన్నుజూతునో, చూడనో, యనినాకు మిగుల సందేహము గలుగుచున్నది. అనిలక్ష్మణుఁడు చెప్పె అంత జనకమహారాజపుత్రికయగు సీతాదేవి కండ్లనుండి నీళ్లు ప్రవాహముగ తెగారగా వెక్కి వెక్కి గట్టిగా నేడ్చుచు మహాతీక్ష్ణమగు వాక్యమును జెప్పదలచి లక్ష్మణునిజూచి మఱలనిట్లనియె.

లక్ష్మణుఁడా! రాముని విడిచి నేనొకక్షణమైనను బ్రతికియుండజాలను. ఈగోదావరీనదిలో దుమికి నా ప్రాణములను బోగొట్టుకొనెదను లేక ఉరియైనను బోసుకొనెదను. లేక కొండపైన నెక్కి దుమికియైనను జచ్చెదను. లేక మహాతీక్ష్ణమగు విషమును ద్రావియైనను దేహమును విడిచెదను. లేక అగ్నిలోఁ బడియైనను ప్రాణములను వదిలెదను నేను రామునికన్న నితరపురుషుని కాలితోనైన నను ముట్టను. అనియిట్లు సీతాదేవి యనేకప్రకారములుగ లక్ష్మణుని నిందించుచు మహాదుఃఖముతో గూడుకొన్నదియై గట్టిగా నేడ్చుచు, దుఃఖమును బట్టజాలక హాదైవమా యని రెండు చేతులతో కడుపుమీద గొట్టుకొనుచు నేడ్చుచునుండె. అట్టియెడ లక్ష్మణుఁడు. మహావ్యసనమును బొందినదియును, విశాలములగు నేత్రములనుండి కన్నీళ్లు గారగా గట్టిగా నేడ్చుచున్నదియును, నగు సీతాదేవిని జూచి తానును మహావ్యసనమును బొంది యాసీతాదేవిని నూరడించె అప్పుడు సీతాదేవి తనమఱఁదియగు లక్ష్మణునితో నేమియు బలుకకుండె అంత మహాబుద్ధిమంతుఁడగు లక్ష్మణుఁడు తన్నయొద్దకు బోవువాఁడై సీతాదేవినిజూచి యంజలిబద్ధుఁడై పలుమారు నమస్కరించి బోవుచు వెనుకకు తిరిగి మఱల సీతను జూచుచు రామునియొద్దకుఁ బోయె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నలుబదియైదవసర్గము ముగిసెను.

సీతచే నిందింపబడిన లక్ష్మణుడు రామునిదగ్గరకు బోవుట

అట్లు లక్ష్మణుడు సీతాదేవిచే మహాక్రూరముగ నిందింపబడుటవలన మిగుల కోపోద్దీపితుడయ్యెను, అన్నమాటను అతిక్రమించి సీతాదేవిని నొంటిగ విడిచిపోవుట కిష్టము లేనందున తానుత్వరగా రామునియొద్దకుఁ బోవ నెత్నించినను యడుగులు తడబడి కాళ్ళాడక తుదకు మహాప్రయాసముతో రామునియొద్దకు బోయె. అట్టియెడ

సమయముకనిపెట్టియుండిన రావణాసురుఁడు అతివేగముతో సన్న్యాసిరూపమును ధరించి సన్నని కాషాయవస్త్రమును గట్టుకొనినవాఁడును, జడలు దాల్చినవాఁడును, గొడుగు చేతఁబట్టుకొన్నవాఁడును, పాదుకలు ధరించినవాఁడును, ఎడమభుజముమీఁద దండకమండలముల నుంచుకొన్నవాఁడునునై సీతాదేవి దగ్గరకుఁబోయెను. మఱియు మహాబలుఁడగు రావణాసురుఁడు "చంద్రసూర్యులిద్దరు లేనికాలమున అగాధమగు చీకటి సంధ్యను జెందునట్లు" రామలక్ష్మణులిద్దరును లేనికాలమున సన్న్యాసిరూపమును ధరించి సీతాదేవియొద్దకుఁబోయెను. "మిగుల భయంకరమగు నంగారకగ్రహము చంద్రహీనమైయుండెడు రోహిణీనక్షత్రమును జూచునట్లు" రావణాసురుఁడు మిగుల నబలయగు సీతాదేవియొద్దకుఁబోయెను. అట్టియెడ మహాభయంకరమగు పరాక్రమముచేత క్రూరకృత్యములను జేయునట్టి రావణాసురుని జూచి జనస్థానమున నున్న వృక్షములన్నియును వడవడవడకె. వాయువు వీచుటకు భయపడియెను. అతివేగముగఁ బారుచున్న గోదావరీనదియును, చింతనిప్పులవలె నెఱ్ఱని కండ్లతోఁ జూచుచున్న రావణాసురుని జూచి భీతిచే నెమ్మదిగఁ బారుటకారంభించె. అంత రాముఁడు లేకుండగనుండు సమయమునకై యెదురుచూచుచున్న రావణాసురుఁడు ఆసమయమున కపటసన్న్యాసి వేషమును ధరించి సీతాదేవి సమీపమునకుఁబోయెను. మఱియు చిత్రానక్షత్రమును శనైశ్చరుఁడు పొందునట్లు దురాత్ముఁడగు రావణాసురుఁడు సజ్జనవేషమును ధరించి, తనభర్తను గుఱించి దుఃఖించుచున్న సీతాదేవి యొద్దకుఁబోయెను. అట్లుపోయి, మహాపాపిష్ఠుఁడగు రావణాసురుఁడు మంచిసన్న్యాసిరూపమును ధరించి "కసవుచేఁ గప్పఁబడిన పాడుబావివలె" నున్నవాఁడగుచు, మహాకీర్తిమంతురాలును, రామునిభార్యయును, నగు సీతాదేవిని జూచుచు నిలుచుండె. మఱియు దురాత్ముఁడగు రావణాసురుఁడు, శోభనాంగియును, మిగులసుందరములగు పండ్లును పెదవులును గలదియును, పున్నమచంద్రునితో సమానమైన మోముగలదియును, తామరఱేకులతో సరిపోలు కన్నులుగలదియును, బొటబొట కన్నీరు గారగా నేడ్చుచున్నదియును, పచ్చనిపట్టువస్త్రమును ధరించియున్నదియును, పర్ణశాలయందు గూర్చుండియున్నదియును, నగు సీతాదేవిని జూచుచు నిలుచుండె. అట్లు రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు సీతాదేవిని జూచిచూచి మన్మథబాణములచే గొట్టఁబడినవాఁడగుచు వేదమును జెప్పుచు, చుట్టుప్రక్కల నెవరును లేకుండఁగ జూచి మహావినయముతో మెల్లమెల్లగ నిట్లనియె.

మఱియు లోకోత్తరమైన స్త్రీయును, రాముఁడు సమీపమున లేకుండుటచే కమలహీనమైన లక్ష్మివలె నున్నదియును, తనదేహకాంతిచే మిగులఁ బ్రకాశించుచున్నదియును, నగు సీతాదేవిని జూచి రావణాసురుఁ డిట్లనియె.

సువర్ణపుఛాయతో నొప్పెడి దేహముగలదానవును, పచ్చపట్టువస్త్రమును ధరించియున్నదానవును నగు నో స్త్రీరత్నమా! నీవు తామరలతో సమానములైన ముఖము, కండ్లు, చేతులు పాదములుగలదానవై, తామరలమొక్కలను ధరించియుండెడు తామరతీగవలెనే యున్నావు. నీ వెవరవు? మిగుల సుందరమైన ముఖమును, శ్రేష్ఠములైన పిఱుదులును గల యో భాగ్యశాలీ! నీవు పార్వతివా? యేమి? లేక కీర్తిదేవతవా? లేక మహాలక్ష్మివా? అదిగాకున్న నప్సరస్త్రీవా? అదియును గాదేని సంపదధిష్ఠానదేవతవా? అదియును గాదేని స్వైరచారిణివగు రతీదేవివా? ఓ స్త్రీరత్నమా! నీదంతములు హెచ్చుతక్కువ లేక సమములైనవిగను, మంచికొనలుగలవిగను, సన్ననివిగను, తెల్లనివిగను నున్నవి. మఱియు నీనేత్రములు మిగుల విశాలములైనవిగను, మాలిన్యము లేనివిగను, కొనలయం దెఱ్ఱచారలుగలవిగను, నల్లనిపాపలుగలవిగను నున్నవి. నీజఘనము మిగుల విశాలముగ నున్నది. నీతొడలు యేనుఁగుతొండముతో సమానములై యున్నవి. ఓపుణ్యాత్మురాలా! నీ స్తనములు మిగుల నున్నతములైనవిగను, గుండ్రములైనవిగను, నడుమ సందు లేక నొకటితో నొకటి చేరినవిగను, భారాతిశయముచే గొంచెము కదలుచున్నవిగను, మిగుల బలసి యున్నతములైన మొనలుగలవిగను, కోరికబుట్టించునవిగను, మిగుల నునుపై గట్టిగనున్నవిగను, గొప్పతాటిపండంతటి ప్రమాణముగలవిగను, నవరత్నములతోఁ జేయఁబడిన ఆభరణములచే నలంకరింపబడినవిగను, మిగుల మనోజ్ఞములైనవిగను నున్నవి. నీవు మహాసుందరమైన చిఱునవ్వుగలదానవు. నీదంతములు మిగుల యందములైనవి నీనేత్రములు మహారమణీయములైనవి. నీవు మిగుల విలాసవతివి. మనోజ్ఞముగనుండు ఓభాగ్యశాలీ! మైపజెప్పి నశృంగారములతోఁ గూడుకొన్నదానవై "నదీప్రవాహము యేటిగట్టును హరించునట్లు" నీవు నా మనస్సును నపహరించుచున్నావు. ఓ చిన్నదానా! నీవు పిడికిటిలోఁ బిడికెడు నడుము గలదానవు. మహాసుందరములైన కురులుగలదానవు. ఒకటితో నొకటి యొఱయుచుండెడి స్తనములుగలదానవు. భూమియందుండెడు మనుష్యులలోగాని, దేవతాస్త్రీలలోగాని, గంధర్వస్త్రీలలోగాని, యక్షస్త్రీలలోగాని, కిన్నరస్త్రీలలోగాని నీవంటి రూపలావణ్యముగల స్త్రీని యింతవఱకెప్పుడు నేను చూచినదిలేదు. సమస్త

లోకములయందును దుర్లభంబగు నట్టిరూపు రేఖావిలాసములును, యౌవనమునుగలిగి యీయరణ్యమునందుండుట జూడగానామనస్సు మిగులకలతనొందుచున్నది. ఓస్త్రీరత్నమా! మిక్కిలిరూపురేఖావిలాసాదులుగల నీవుయీమహారణ్యముననుండఁదగదు. ఇదిమహాభయంకరులును, కామరూపులును నగు రాక్షసులకు నివాసస్థానమగు ప్రదేశము అదియునుగాకనీవుదట్టమగు సుగంధవాసనలతోగూడి మిగులరమణీయములగు మేడలమీదను, ఉద్యానవనములందును సంచరింపఁదగినదానవు. ఓమంగళస్వరూపురాలా! నల్లనినేత్రములుగల యోయౌవనవతురాలా! నీవుధరించెడు పూలదండలుచేసికొన్న ఫలమేమనిచెప్పుదును. నీవుభుజించెడుపదార్థములు మహాసుకృతమునుజేసినవి. నీవుధరించెడువస్త్రములుచేసికొన్న పూజాఫలముయింతింతనిచెప్పనలవిగాదు. నిన్నుభార్యగా బొందినవాఁడు ఉత్తమోత్తముఁడు. మహాసుందరమగు ముఖముగల స్త్రీరత్నమా! నిన్నుజూచిననీవు దేవతాస్త్రీవని నాకుఁదోఁచుచున్నది. నీవు, యేకాదశరుద్రులలోగాని అష్టవసువులలోగాని, ద్వాదశాదిత్యులలోగాని, సప్తవాయువులలోగానియెవనిభార్యవగుదువు. ఓసుందరాంగి! ఇదిరాక్షసులకు నివాసంబగుటచే నిచటికిదేవతలుగాని గంధర్వులుగాని కిన్నరులుగానిరారు. నీవెట్లువచ్చినివసించియున్నావు? అదియునుగాక ఈయరణ్యమునకోతులు, సింహములు, బెబ్బులులు, చిఱుతపులులు, జింకలు, యెలుగుబంట్లు, పులులు, పద్మమృగములుమొదలగు క్రూరమృగములనేకములున్నవి వానినన్నిటినిజూచి నీవెట్లుభయపడకున్నావు? శ్రేష్ఠమైనముఖముగల యోసుందరాంగీ! మదముతోగూడుకొన్నవియును, మహాభయంకరములైనవియును, మిగులబలముగలవియును, నగుఏనుఁగులుండెడి యీమహారణ్యంబునందుఒంటరిగభయములేకఎట్లున్నావు? ఓకల్యాణీ! నీవెవరవు? ఎవరికిసంబంధించినదానవు? ఎచటనుండివచ్చితివి? మహాభయంకరమును, రాక్షసులకు నివాసస్థానమును, నగు నీదండకారణ్యముననొంటరిగ ఏలసంచరించెదవు? అనియిట్లు దుష్టబుద్ధియగు రావణాసురుఁడడిగె. అంతమిథిలానగరమునబుట్టిన విదేహరాజపుత్రికయగు సీత, బ్రాహ్మణవేషధారియగు నారావణాసురునిజూచి యతఁడుయథార్థమగు సన్యాసియనితలచియతనికతిథిపూజసేయనారంభించె. అట్లుపూజింపయత్నించి, ముందుగ పీటనుదెచ్చియిచ్చి, పాద్యమునిచ్చి, సన్యాసితో సర్వమునుసిద్ధముగనున్నదనిచెప్పె. మఱియుబ్రాహ్మణవేషముతో నున్నవాఁడునుకాషాయములనుగట్టుకొని దండకమండలములను ధరించియున్నవాఁడును, దుష్టుఁడనిమొన్న నలవిగాకున్నవాఁడును, దుర్మార్గముచేయుటకొఱకువచ్చినవాఁడును, నగునారావణాసురుని సీతాదేవియథార్థమైన బ్రాహ్మణుఁడనిదలచిభోజనమునకుబిలువయత్నించియిట్లనె.

బ్రాహ్మణుఁడా! ఇదిగోపీటయున్నది. సుఖముగగూర్చుండుము ఇదిగోకాళ్ళకునీళ్ళుదెచ్చియిచ్చెదఁ బుచ్చుకొనుము నీకొఱకుసిద్ధముచేయఁబడినవియును, మిగులశ్రేష్ఠములైనవియును, యీయరణ్యమునందుగలవియును, నగు పదార్థములనుకొదవలేకుండతృప్తిగభుజింపుము. అనియిట్లు ఆకపటసన్యాసివేషముగల రావణాసురుని భోజనార్థముప్రార్థించుచున్నదియును నోటినిండ మాటలాడుచున్నదియును, మానవేశ్వరుఁడగు రామునిభార్యయును, నగు సీతాదేవిని జక్కగజూచి, తనచావుకొఱకు ధైర్యమునవలంబించి సీతాదేవినిబలాత్కారముగ నపహరించుటకొఱకుమనస్సునందు నిశ్చయించుకొనె. అట్టియెడసీతాదేవి, మంచిరూపముగలవాఁడును, వేటాడుటకుఁ బోయినవాఁడును, నగుపెనిమిటిని, పిమ్మటబోయినలక్ష్మణుని యెదురుచూచుచు నలుదిక్కులనుజూచె. ఎంతసేపుచూచినను ఆసీతాదేవికిమహారణ్యమేఁగనపడెనుగాని రామలక్ష్మణులు అగపడరైరి.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలినలుబదియవసర్గము ముగిసెను.

——— * సీతాదేవిరావణాసురునినిందించుట. * ———

ఇట్లు సీతాదేవినిఅపహరించుటకు సన్యాసివేషముధరించివచ్చిన రావణాసురుఁడు, సీతాదేవినిజూచి సీతయొక్కవృత్తాంతమంతయునడిగె. అంతసీతాదేవి యతండుకృత్రిమసన్యాసియనితెలియక తనసమాచారమంతయు జెప్పుటకారంభించె. మఱియుసీతాదేవి, యిట్లనిదలచె. ఇతడుబ్రాహ్మణుఁడు. అదియునుగాకనతిథి. కావుననితండడిగినయర్థమునుజెప్పకుంటినేనిశపించునేమోయని కొంతసేపుఆలోచించియిట్లనిచెప్పదొడంగె.

ఓబ్రాహ్మణోత్తముఁడా! నీకుశుభమగుగాక. నేనుమహాత్ముఁడును, మిథిలాధీశ్వరుఁడును, నగుజనకమహారాజుయొక్కకూతురను. జనులునన్ను సీతయనిచెప్పుదురు. నేనురామునిభార్యను. నేనునాఅత్తవారియింటియందు పండ్రెండుసంవత్సరములుండి, మనుష్యులకు దుర్లభములైన సమస్తసుఖములను సమృద్ధిగ ననుభవించుచుంటిని. అంతపదమూడవయేట నామామగారగు దశరథమహారాజు,

సమస్తరాజులతోను మంత్రులతోను గూడినవాఁడై నాభర్తయగు రామునకు రాజ్యపట్టాభిషేకమును జేయుటకు బ్రయత్నించె. అట్లు రామునకు బట్టాభిషేకము సేయయత్నించుటనువిని నాఅత్తగారలలోనొకతెయగు కైకేయి తనపెనిమిటిని యిట్లనివరమడిగె.

మఱియు నాకైకేయి, సత్యసంధుఁడును, రాజశ్రేష్ఠుఁడును, నామామగారును, తనకుభర్తయును, నగుదశరథమహారాజునకు తానుమున్నుచేసిన ఉపకారముచేత నమ్మహారాజును లోఁబఱచుకొని, నాపెనిమిటియగు రాముని నరణ్యమునకు బంపవలయుననియును, తనపుత్రుఁడగు భరతునకు బట్టాభిషేకము సేయవలయుననియును అడిగె అనిమఱియు నిట్లనియె.

అట్లుగాక నీవిప్పుడేమిచెప్పినను నేనువినను. భరతునకు బట్టాభిషేకము సేయనియెడల నేనుభోజనముసేయుటలేదు. నిదురించను. నీళ్లుత్రాగను. నీవిప్పుడు రామునికి బట్టాభిషేకము సేయుదువేని నేనిప్పుడే ప్రాణములనువిడుతును. అనికైకేయి చెప్పె. అంతనామామగారగు దశరథమహారాజు కైకేయినిజూచి. ఓకైకేయీ! నానావిధములైన వెలలేనివస్తువులనిచ్చెదను. కోరినధనములనెల్లనిచ్చెదను నీవూరకుండుము అనియనేకవిధముల బ్రార్థించినను కైకేయివినదయ్యె అప్పటికి మహాశౌర్యవంతుఁడగు నాపెనిమిటి యిరువదియైదేండ్ల వాఁడుగనుండె నాకుపదునెనిమిదిసంవత్సరముల వయస్సుగలిగియుండె. రాముఁడనుపేరుచేఁ బ్రసిద్ధినిబొందిన నాపెనిమిటి మహాగుణవంతుఁడు. సత్యసంధుఁడు. పరిశుద్ధుఁడు. విశాలములైననేత్రములుగలవాఁడు ఆజానుబాహుఁడు సమస్తప్రాణులకును మేలుచేయుటయందాసక్తిగలవాఁడు. ఇట్టిరామునకుతండ్రియును మహాతేజుఁడును, నగుదశరథమహారాజు మన్మథపరవశుఁడై యాకైకేయికి ఆనందముగలుగుటకొఱకు రామునకు బట్టాభిషేకము సేయఁడయ్యె అప్పుడుపట్టాభిషేకముకొఱకు తండ్రియొద్దకు బోయియున్నవాఁడును, నాభర్తయును, నగురామునిఁజూచి కైకేయిమహాధైర్యముతో నిట్లనియె.

ఓరాముఁడా! నీతండ్రినీకాజ్ఞాపించిన విధమును నేజెప్పెదవినుము. శత్రువులులేని యీరాజ్యమునకు భరతుని బట్టాభిషిక్తునిఁ జేయవలయును. నీవుపదునాలుగేండ్లు వనవాసము సేయవలయుననిచెప్పెను. కావుననీవుఅరణ్యమునకుబొమ్ము. నీతండ్రికిబద్ధదోషము గలుగకుండునట్లు చేయుము. అనియిట్లు కైకేయిచెప్పినవిని, మహానిర్భయుఁడును, దృఢవ్రతుఁడును, నగునాపెనిమిటి అట్లేచేసెదనని నొప్పుకొని ఆకైకేయితో పోయివచ్చెదనని చెప్పి యరణ్యమునకువచ్చె. ఓబ్రాహ్మణశ్రేష్ఠుఁడా! నాపెనిమిటియగు రాముఁడు దానమిచ్చును గాని పుచ్చుకొనఁడు. సత్యమేపలుకును గాని యబద్ధమెప్పుడును చెప్పఁడు. ఇదిరామునకుస్థిరమైనవ్రతము. ఈరామునకు సవతితల్లికుమారుఁడును, ఇతనికితమ్ముఁడును, మహాశౌర్యవంతుఁడును, యుద్ధమునందుశత్రువులనుజంపువాఁడును, పురుషశ్రేష్ఠుఁడును, నగులక్ష్మణుఁడుమాత్రము రామునెడబాయక రామునితోఁగూడ యుండును. బ్రాహ్మణోత్తముఁడా! ధర్మాచరణుఁడును, మిగుల దృఢవ్రతముగలవాఁడును, నగులక్ష్మణుఁడు ధనుర్ధరుఁడై, నన్నువెంటఁబెట్టుకొని యరణ్యమునకువచ్చుచున్న రామునివెంబడించివచ్చె ఎడతెగక ధర్మమునాచరించువాఁడును, జితేంద్రియుఁడును, నగురాముఁడుజటావల్కలములుధరించి తాపసవేషియైనేనును, తమ్ముఁడును వెంబడించివచ్చుచుండగా నీదండకారణ్యముప్రవేశించె బ్రాహ్మణోత్తముఁడా! కైకేయినిమిత్తముగ రాజ్యభ్రష్టులమైన మేముముగ్గురమును మహాభయంకరమగు నీదండకారణ్యమునందు బలపరాక్రమములచే సంచరించుచున్నాము. తపోధనుఁడా! కొంచెముసేపు అలసటదీర్చుకొనుము ఇచటనీకు సుఖముగనుండును నాపెనిమిటిజింకలను, ఉడుములను పందులనువేటాడి వాటిమాంసమును, కందమూలములు మొదలగు వనమునందలిపదార్థములను దీసికొని అతివేగముగవచ్చును ఓబ్రాహ్మణశ్రేష్ఠుఁడా! ఇంకనీవునీనామగోత్రవంశములను యథార్థముగఁజెప్పుము. నీవీదండకారణ్యమున నొంటరిగనేలసంచరించుచున్నావు? అనియిట్లు రామునిభార్యయగు సీతాదేవియడిగె. అంతమహాబలవంతుఁడును రాక్షసేశ్వరుఁడును, నగునారావణాసురుఁడుమహాక్రూరముగ నిట్లనియె.

ఓసీతా! దేవతలు, అసురులు, పన్నగలు మొదలగువారితోఁగూడిన సమస్తలోకములును యెవనిపేరుజెప్పిన భయమునుబొందునో యట్టిరాక్షసేశ్వరుఁడగు రావణాసురుడనునేను. అనింద్యమగు సౌందర్యముగలయోసీతా! సుందరాంగీ! బంగారుఛాయవంటి దేహకాంతిగలదానవును, పట్టువస్త్రమును ధరించియున్నదానవును నగునిన్నుజూచినదిమొదలు నాభార్యలయందెంతమాత్రము నాకిష్టములేకయున్నది. నీకుశుభమగుగాక. అనేకస్థలములనుండి తేబడిన యుత్తమస్త్రీలనేకులు నావద్దయున్నారు. వారందఱిలోపల నీవుపెద్దభార్యవుగా నుండుము. ఓసీతా! నాకునివాసస్థానము లంకానగరము. అదిసముద్రమధ్యమునయున్నది. దానికిసముద్రమేయగడ్త. మఱియు నదిపర్వ

తశిఖరముననున్నది. ఓసుందరాంగీ! నీవునాతోగూడనా లంకయందుండేడి యుద్యానవనములయందు విహరింపవచ్చును. ఈయరణ్యమున నీవునివసింపవలదు. ఓసీతా! నీవునాకుభార్యవైనయెడల సమస్తభూషణాలంకృతులగు నైదువేల దాసీలు నీకుపరిచర్యసేయుదురు. అనియిట్లు రావణాసురుఁడు చెప్పె. అంతమిగులసుందరములైన సమస్తావయవములుగల సీతాదేవి రావణాసురుని తృణీకరించి యిట్లనియె.

ఓరీ! రావణాసురుడా! నేను, ఆజానుబాహుఁడునువిశాలవక్షుఁడును, పరాక్రమించిన సింహముయొక్క నడకవంటినడకగలవాడును, పురుషోత్తముఁడును, నగుశ్రీరామునకుభార్యనై అతనియిష్టముచొప్పున నున్నదానను. మఱియుపున్నమచంద్రునితో సమానమైన ముఖముగలవాఁడును, సమస్తలోకములను రమింపఁజేయువాఁడును, రాజపుత్రుఁడును, జితేంద్రియుడును, మహాకీర్తిమంతుఁడును, మిగుల మహిమగలవాఁడును, నగురామచంద్రుని నేననుసరించియున్నాను. ఇంకనీసంగతిచెప్పెదవినుము నీవ్నక్కవు నేనుఆడసింహము. నన్నునీవుకోరుచున్నావు "సూర్యునికాంతి నెవ్వరునుతాకజాలనియట్లు" నీవునన్నంటజాలవు. ఓరీ! రావణాసురుఁడా! రామునకత్యంత ప్రియభార్యనైన నన్నుకోరుచున్నావు కావుననీవు నిర్భాగ్యుఁడవై అనేకబంగారుచెట్లనుజూచెదవు (అనగామరణము సమీపించినవారికి బంగారువృక్షము లగుపడుననువాడు కనుబట్టినీకాయుస్సు మూడినదియనెను) ఓరీ! రావణాసురుడా! నీవు, ఆకలిగొనియున్నదియును, మహాబలముగలదియును, జింకలకుశత్రువును, నగుసింహముయొక్కయు, మహావిషసర్పముయొక్కయు నోళ్ళనుండికోరలుపీకఁగోరునట్లు నీవునన్ను రామలక్ష్మణులయొద్దనుండి యపహరింపఁగోరుచున్నావు "పర్వతోత్తమమైన మందరపర్వతమును జేతఁబట్టుకొనిపోఁగోరినట్లు" నన్నెత్తికొనిపోఁగోరుచున్నావు. "కాలకూటవిషమునుభక్షించి సౌఖ్యముగ" బాధలేకపోఁగోరుచున్నావు. రామునిప్రియభార్యనగు నన్నుపొందఁగోరుటచేనీవు "సూదితోకన్ను దుడుచుకొనువానివలెను" "కత్తితోనాలుక గీచుకొనువానివలెను" నశింతువు. రావణాసురుడా! రామునిప్రియభార్యనగునన్ను నీవుఅవమానింపగోరుటవలన, "బండను మెడకుగట్టుకొని సముద్రమును దాటఁగోరినవాఁడవును, సూర్యచంద్రులఁ బట్టుకొనఁగోరినవాఁడవును" నగుచున్నావు. నీవు, సదాచారసంపన్నురాలును, రామునిప్రియభార్యయును, నగునన్నపహరింపగోరుటచే "మండుచుండెడియగ్నినివస్త్రమునందుఁగట్టుకొనిపోవుచున్నవాఁడవుగా" నున్నావు. మఱియు రామునకుఁ దగినభార్యనగునన్ను నీవుపొందఁగోరుటచే "ఉక్కుశూలములకొనలపై సంచరింపఁ గోరినవాఁడవుగా" నున్నావు. రావణాసురుఁడా! రామునకునునీకును, అడవియందుండెడు "సింహమునకును నక్కకును" "సముద్రమునకును స్వల్పచెలమకును" "శ్రేష్ఠమైనకల్లునకును, కడుగునీళ్ళకును" నెంత తారతమ్యమున్నదో అంతతారతమ్యమున్నది మఱియును "బంగారమునకును, సీసమునకును" "శ్రీగంధమునకును, బురదకును" "ఏనుఁగునకును, పిల్లికిని" నెంత తారతమ్యమున్నదో అంతతారతమ్యము రామునకునునీకునుగలదు. ఇంతయగాక "కాకికిని, గరుడునకును" "నీరుకాకికిని, నెమలికిని" "గద్దకును, హంసకును" నెంత తారతమ్యమున్నదో అంత తారతమ్యము నీకును రామునకునుగలదు. రావణాసురుడా! ఇంద్రునితో సమానమైన మహిమగలరాముఁడు ధనుర్బాణములను ధరించినిలిచియుండగ నీవునన్నపహరింతువేని "వజ్రమును మ్రింగినయీగ జీర్ణమునుజేసికొనలేనట్లు" నేనునీచేతంబడను. నానిమిత్తముగనీవుజత్తువు అనియిట్లు, మిక్కిలిసామ్యహృదయురాలగు సీతాదేవి మిగులధైర్యముతో రాక్షసుఁడగు రావణాసురునకుఁజెప్పి "గాలిచేఁ గదులుచున్న యరటిచెట్టువలె" మహాభయముచే గడగడవణకుచుండె. అప్పుడుమృత్యువునకు తుల్యముగుప్రభావముగల యారావణాసురుఁడు అట్లువడవడవడకుచున్న సీతాదేవినిజూచి మఱియును భీతిగలిగించుటకై తనకులమును బలమును వంశమును పేరును, తాను జేసినకార్యములను సీతాదేవితో జెప్పటకారంభించె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలినలుబదియేడవసర్గ ముగిసెను.

(*)

రావణాసురుడుసీతాదేవితో తనప్రతాపమును జెప్పుకొనుట.

అట్లు సీతాదేవిచెప్పగానే రావణాసురుడువిని మిగులఁగోపోద్దీపితుఁడై కనుబొమలుముడిబడ మహాకఠినవాక్యములతోనిట్లనియె.

ఉత్తమవర్ణముగలయోసీతా! నేనుకుబేరునకు సవతితల్లికుమారుఁడను అతనికితమ్ముఁడను. రావణాసురుడను పేరుగలవాడను. పదికంఠములుగలవాఁడను. మహాశౌర్యవంతుఁడను "మృత్యువునుజూచి ప్రజలుభీతిని బొందునట్లు" నన్నుజూచి దేవతలు, గంధర్వులు, పిశాచములు, పక్షులు, పన్నగులుభీతులైపరుగెత్తిపోదురు. ఇదిగాకపూ

ర్యమునొక కారణముచేత నాసవతితల్లికుమారుఁడగు కుబేరునకును, నాకును, యుద్ధముసంభవించి మిగులక్రుద్ధుఁడనై పరాక్రమించియతనిజయించితిని అంతకుబేరుఁడు నాకుభయపడి తనకునివాసస్థానమైన లంకానగరమును విడిచిపెట్టి పర్వతశ్రేష్ఠమగు కైలాసపర్వతమునకుబోయి అందు నివసించియున్నాఁడు కల్యాణస్వరూపురాలవగు నోసీతా! ఇప్పుడు నేను మెక్కి యాకాశమార్గమున సంచరించెడిదియును, కామగమనముగలదియును, శుభస్కరమైనదియును, పుష్పకమను పేరుగలదియును, నగు విమానముకుబేరునిదేను దీనినినేను నాపరాక్రమమువలన నాకుబేరునిజయించి తీసికొంటిని. ఓసీతా! నాకుకోపమువచ్చినపుడు నాముఖమునుజూచి రేని యింద్రుఁడు మొదలగు దేవతలందఱును మహాభయమునుబొంది పాఱిపోదురు నేనెచటయుందునో యచటవాయువునాకుభయపడి మెల్లగ వీచును. మఱియు వేడికిరణములుగలసూర్యుఁడును మహాభయమునుబొంది చల్లనికిరణములుగలవాఁడగును (అనగా నెండకాయ వెఱచుననుట) నేనుసంచరించెడి స్థలములయందును, నేనుండెడి తావులయందును, చెట్లలోనుండెడి యాకులుగూడకదలవు ఆయాస్థలములయందుండు నదులుపాఱకనీళ్లునిలబడియుండును. ఇంద్రునకు అమరావతీపట్టణమున్నట్లు నాకు, సముద్రమున కావలితీరమున నున్నదియును, మహాభయంకరులగు రాక్షసులచేతనిండినదియును, మిగుల శోభనకరమైనదియును, నగు లంకయనుపట్టణమున్నది. ఆలంకానగరముచుట్టును తెల్లగ ప్రకాశమానములై యుండెడు ప్రాకారములున్నది ఆపట్టణముననుండెడు మేడలు బంగారముతోఁ గట్టఁబడియున్నవి. ఆనగరద్వారములు వైడూర్యపుమణులతో గట్టఁబడియున్నవి ఆపురముయేనుఁగులతోను, గుఱ్ఱములతోను, రథములతోను, నిండియుండును. ఆపట్టణమెల్లప్పుడు వాద్యధ్వనులచే ప్రతిధ్వనింపబడుచుండును అదిసర్వకాలములయందును ఫలించెడువృక్షములతోనిండియుండెడి యుద్యానవనములచే బ్రకాశించుచుండును. మంచిమనస్సుగలదానవును రాజపుత్రికయును నగు నోసీతా! నీవుఆలంకానగరమునందు నాతోగూడసంచరింపుచుండు నేని మానవస్త్రీలను ఎంతమాత్రము తలఁపవు. మంచివర్ణముగలయోసీతా! నీవుఆలంకాపట్టణమున నుండి మనుష్యభోగములను దేవతాభోగములను అనుభవించుచుమానవుఁడును, మరణముసమీపించినవాఁడును, నగు రాముని ఎంతమాత్రమునుస్మరింపవు రాముఁడు పరాక్రమహీనుఁడౌటచేత నేగదా, దశరథమహారాజు తనప్రియపుత్రుఁడగు భరతునిపట్టాభిషిక్తునిజేసి, పెద్దకుమారుఁడగు నీరామునియడవులకుఁబంపెను. అటువంటిరాముని ఎందుకొఱకు బాగడెదవు. విశాలములగు నేత్రములుగలయోసీతా! రాజ్యముపోయినవాఁడును, రాజ్యభ్రష్టుఁడగుటచేబుద్ధిచెడినవాఁడును, తపసియును, తపసియగుటచే శౌర్యముడిగినవాఁడును శోచనీయుఁడును నగు రామునితో నీకేమిప్రయోజనముగలదు. సమస్తరాక్షసులకును రాజునగు నేనుమన్మథబాణములచే గొట్టఁబడినవాఁడనై నీయొద్దకువచ్చితిని. అట్టినన్నునీవు లక్ష్యముపెట్టక యవమానింపఁదగదు భయపడెడి స్వభావముగలయోసీతా! నీవునన్నిపుడు తిరస్కరింతువేనిమున్ను "ఊర్వశితనకాళ్ళపైఁబడినపురూరవస్సునుకాలందన్నిఅవతలపరితాపమునుబొందినట్టువలె' నీవువెనకపరితాపమునుబొందెదవు. మహాసౌందర్యవతివగునోసీతా! మానవుఁడగు నారాముఁడు యుద్ధమునందు నాకునొకవేలితో సమానుఁడుకాఁడు. నేననీయదృష్టవశమున నిచటికివచ్చితిని. నన్నుగైకొనుము అని యిట్లు రాక్షసేశ్వరుఁడగు రావణాసురుడుచెప్పినవిని సీతాదేవిమిగులకోపోద్దీపితయై కండ్లెఱ్ఱచేసి సహాయమెవ్వరునులేకనొంటిగనున్నదయ్యును, మహాపరుష వాక్యములతో రావణాసురునిజూచియిట్లనియె.

రావణాసురుడా! నీవు, సమస్తజీవులచేతను నమస్కరింపఁబడెడివాఁడును, దైవమును, నగు కుబేరుఁడునీకన్నయనిచెప్పుకొని యిట్టిపాపకార్యమును ఎట్లుచేయగోరుచున్నావు? రావణాసురుడా! మహాక్రూరుఁడవును, దుష్టుఁడవును, ఇంద్రియములకులోపడినవాఁడవును, నగు నీవు రాజగుటచే సమస్తరాక్షసులునాశనమొందెదరు. మఱియు దేవేంద్రునిభార్యయగు శచీదేవి నపహరించినైనను జీవించియుండవచ్చునుగాని, రామునిభార్యనగు నన్నుదొంగిలించికొనిపోయి బ్రతికియుండుట కొంతమాత్రమును శక్యముకాదు రావణాసురుఁడా! వజ్రాయుధమును ధరించియుండెడు దేవేంద్రునిచేతనున్న శచీదేవి నపహరించియైనఁబ్రతుకవచ్చునుగాని, నావంటిదానినవమానించియమృతపానముచేసియైనను జీవించియుండజాలవు అనిసీతాదేవిచెప్పె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నలుబదియెనిమిదవ సర్గముగిసెను

—(*)—

సన్యాసిరూపముతోనుండిన రావణాసురుడు తననిజరూపమునుధరించిసీతనెత్తికొనిపోవుట.

అంతమహాశౌర్యవంతుఁడగు రావణాసురుఁడు సీతాదేవిచెప్పినమాటనువిని మహాకోపమునుబొంది శరీరము

దెలియక పళపళమని చేతులను తట్టి, హా, యని, మిగుల పెద్దశరీరమును ధరించె. అట్లు రావణాసురుడు గొప్పదేహమును దాల్చి సీతాదేవిని జూచి మహాకఠినములగు మాటలతో మఱల నిట్లనియె.

నీవు పిచ్చిదానివలె నున్నావు. నా బలపరాక్రమములను నేను చెప్పినపుడు నీవు వినలేదని నాకు తోచుచున్నది. ఓసీతా! నేను ఆకాశమునందుండి భూమిని రెండుచేతులతో పైకెత్తగలను. సముద్రమును వొక్క నిమిషములో ద్రాగగలను. రణరంగమున మృత్యువునైనను వధింపగలను. నేను మహాతీక్ష్ణబాణములచే సూర్యునిగూడ నడ్డగింతును. భూమిని బ్రద్దలు చేయుదును. ఓపిచ్చిదానా! నేను కామరూపిని. నేను కోరిన కోరికల నెల్లనిచ్చువాఁడను. నన్ను బొందుము అని యిట్లు రావణాసురుడు చెప్పుచు మహాకోపోద్దీపితుఁడై సూర్యునివలె నెఱ్ఱనివియును, నిప్పుముఁటల యొక్క కాంతివంటి కాంతిగలవియును, గోరోచనపు ఛాయతో నొప్పెడి కొనలుగలవియును నగు తన నేత్రములను మిగుల నెఱ్ఱబారునట్లు చేసె. కుబేరుని తమ్ముఁడగు రావణాసురుఁడు, మహాశాంతమును, పూజార్హమును, నగు సన్యాసిరూపమును విడిచి "కాలయమునివలె" మహాభయంకరరూపమును ధరించె. మఱియు రాక్షసుఁడగు రావణాసురుఁడు, మిగుల కోపావేశుఁడై ఎఱ్ఱనైన నేత్రములు గలవాఁడును, మహాకాంతితో గూడుకున్నవాఁడును పుటముదీరిన బంగారుపోగులు ధరించినవాఁడును, నీలమేఘముతో సమానమైనవాఁడును, పదితలలు గలవాఁడును, ధనుర్బాణములను ధరించినవాఁడునునై యగపడె. గొప్పదేహముగలవాఁడును, రాక్షసేశ్వరుఁడును, నగు రావణాసురుఁడు ఆసన్యాసివేషమును విడిచి తననిజరూపమును ధరించి, మహాకోపమున నెఱ్ఱనైన నేత్రములుగలవాఁడును, మేఘసమూహముల కాంతివంటి కాంతిగలవాఁడును, ఎఱ్ఱని వస్త్రములను ధరించినవాఁడునునై యుత్తమస్త్రీయగు సీతాదేవిని జూచి నిలుచుకొని యుండె. అట్లు నిలుచుకొని యుండి యా రావణాసురుఁడు, నల్లని కొనవెంట్రుకలు గలదియును, సూర్యుని కాంతివంటి కాంతిగలదియును, మేలైన వస్త్రమును దివ్యాభరణములను ధరించియున్నదియును నగు నా సీతాదేవిని జూచి యిట్లనియె.

శ్రేష్ఠములగు పిఱుదులుగలయోసీతా! మూఁడులోకములయందును ప్రఖ్యాతిగాంచిన పెనిమిటిగావలెనంటె నన్ను గైకొనుము. నేనే నీకు సరియైన మగడను. కల్యాణరూపురాలవగు నోసీతా! నేను నీకు బహుకాలమునకు లభించితిని. నీకు వినుతిఁ జేయదగిన పెనిమిటిని నేనేను. నీకొకానొకప్పుడైనను విరోధమైన కార్యమును జేయను. కావున నీవు మానవుని పై ప్రేమను విడిచి నాయందు మనసునుంచుము. ఓ మూర్ఖురాలా! ఏమియుఁ దెలియకున్నను సమస్తమును తెలిసినదానివలె నటియించెదవు యోసీతా! ఆడుదాని మాటలు విని స్నేహితులను బంధువులను చుట్టాలను రాజ్యమును వదలి క్రూరమృగములు సంచరించుచుండెడి యీ మహారణ్యమునందు సంచరించునట్టి దురాత్ముఁడును, రాజ్యభ్రష్టుఁడును, సిద్ధింపని కోరికలు గలవాఁడును, కాలము సమీపించియున్నవాడును, నగు రామునియందు ఏసుగుణసంపదను జూచి భ్రమసి యతనిపైనను రాగముగలదానవై యున్నావో తెలియదు అని యిట్లు దురాత్ముఁడగు రావణాసురుఁడు అతికఠినముగఁ జెప్పి, ప్రియవాక్యములకు తగినదియును, యెప్పుడు గాని యప్రియములాడనదియును, నగు సీతాదేవిని "నక్షత్రమండలమునందు బుధుడు రోహిణీనక్షత్రమును గవియునట్లు" సీతాదేవినిఁ బట్టుకొనియె. అట్లు బట్టుకొనునపుడు, రావణాసురుఁడు, కమలపత్రములవంటి నేత్రములుగల సీతాదేవి యొక్క తలవెంట్రుకలను తన యెడమచేతితో బట్టుకొని కుడిచేయి తొడలక్రింద వేసి పట్టుకొని లేవనెత్తె. అప్పుడు మృత్యువువలె మహాభయంకరుఁడును, కఱుకోఱలుగలవాఁడును, గొప్పచేతులుగలవాఁడును, పర్వతమువలె గొప్పశరీరముగలవాఁడును, సీతను బట్టుకొన్నవాఁడును, నగు రావణాసురుని యావనదేవతలందఱునుజూచి భయభ్రాంతులై నలుదిక్కులకును బఱుగులిడిరి. అంత, నదివరకు రాక్షసమాయచే నగపడక యుండినదియును, స్వర్గసంబంధమైనదియును, కంకరగాడిదెలచే బూన్పఁబడినదియును, మహాభయంకరమైన ధ్వనిగలదియును, బంగారుమయమైనదియును, నగు రావణాసురుని మహారథము అప్పుడు గనబడె. అట్టిసమయమున మహాభయంకరమగు ధ్వనిగల రావణాసురుడు సీతాదేవిని పరుషవాక్యములాడుచు బెదరించుచు తలవెంట్రుకలొక చేతను తొడలొకచేతనుఁ బట్టుకొని యెత్తి తనరథముపై గూర్చుండబెట్టుకొనె. అంత మహాకీర్తిమంతురాలగు సీతాదేవి, అట్లు రావణాసురునిచేఁ బట్టువడి మిగుల వ్యసనపీడితురాలై యరణ్యమున బహుదూరముననున్న రాముని నుద్దేశించి, రామా! రామా! రామా! యనియనేకమారులు అఱచె. మిగుల కామపీడితుఁడగు నా రావణాసురుడు, తనపై కోరికలేనిదియును, మహావ్యసనమువలన నాగకన్యకవలె పొరలుచున్నదియును, నగు నా సీతాదేవిని దీసికొని యంత గగనమున కెగిరెను. అట్లు రావణాసురుడు సీతను ఎత్తుకొని గగనమార్గమునఁ బోవుచుండగా సీత మిగులభయమునొందినదైయెదు:

ఖంబుచేశరీరము దెలియక పలువిధములవిలపించుచు యిట్లని గట్టిగనఱచె. ఓఅన్నయిష్టమునకెదురులేక నడచువాఁడా! ఓమహాబాహుఁడా! ఓలక్ష్మణుఁడా! అయ్యో! మహాక్రూరకర్ముఁడగు నీరాక్షసుఁడు నన్నుదొంగిలించి యెత్తికొనిపోవుచున్నాఁడనినీకుఁ దెలియదుగదా? ఓరాముఁడా! ధర్మముకొఱకుప్రాణమును, సమస్తసుఖములను, ధనమునువిడిచి పాటుపడునట్టినీవుగూడ, అక్రమముచే నన్నీరాక్షసుఁడపహరించికొనిపోవుచున్నాఁడని యెఱుఁగవుగదా? ఓశత్రుసంహారకుండనగునో రాముఁడా! నీవునీతిలేనివారలనందఱి నిదండించువాఁడవయ్యును యిట్టిదురాత్ముఁడగు రావణాసురునిఏలదండింపకున్నావు? అనియిట్లనేకప్రకారములుగవిలపించుచుమఱల రావణాసురునుద్దేశించియిట్లనియె.

శ్లో॥ ననుసద్యోవినీతస్య దృశ్యతేకర్మణః ఫలం। కాలోప్యంగీభవత్యత్ర సస్యానామివపక్తయే॥ ఓరావణాసురుఁడా! దుష్టుఁడు తానుజేసినదుష్కార్యమునకు ఫలమునువెంటనేయనుభవించును. అదితప్పదు. ఐననుపైరులు పండిపక్వమగుటకు కాలముసహాయమగునట్లు దీనికిని కాలముసహాయమగును అరీతిగానేనీకుకాలము పరిపక్వమగుటచే తనిట్టిదుష్కార్యముచేసితివి. కావుననీవు మిగులఘోరమగుదురవస్థనుబొంది రామునిచేజంపఁబడుదువు. అనిచెప్పి మఱలతనలోతానిట్లనియె.

ధర్మమాచరించువాఁడును, కీర్తిమంతుఁడును నైన రామునిధర్మపత్నినగు నన్నురాక్షసుఁ డపహరించుకొనిపోవుచున్నాఁడు. కావునకైకేయియును, కైకేయికిష్టబంధువులగువారలును వారికోరికనెరవేరినవారై మహాసంతోషముగానుందురు. జనస్థానమునబూచియుండెడి ఓకొండగోగువృక్షములారా! మిమ్ముప్రార్థించెదను; మీరురావణాసురుడు సీతాదేవినిఅపహరించెనని రామునకుఁజెప్పుడు. విశేషముగపువ్వులుగలదియును, మంచిశృంగములుగలదియునునగు ఓప్రస్రవణపర్వతమా! నీకునమస్కారమునుజేసెదను; రావణాసురుడుసీతను దొంగిలికొనిపోవుచున్నాఁడని యతివేగముగనీవు రామునకుఁజెప్పుము. హంససారసపక్షులయొక్క ధ్వనులచేనొప్పుచుండెడి ఓగోదావరీనదీ! తల్లీ! నీకుదండమునుబెట్టెదను, రావణాసురుఁడు సీతను ఎత్తికొనిపోవుచున్నాఁడని నీవురామునకు అతివేగముగ జెప్పుము. నానావిధములగు చెట్లతోనొప్పుచుండెడి యీయరణ్యముననుండెడు ఓవనదేవతలారా! మీకునేనునమస్కారమును జేయుచున్నాను; మీరైననునన్ను రావణాసురుడపహరించుకొని పోవుచున్నాఁడని రామునితోఁజెప్పుడు. ఈయరణ్యముననుండెడు మృగములు పక్షులు మొదలగు ఓజంతుసమూహములారా! మీకందఱికిని శరణుజొచ్చెదను; నీప్రాణములకన్నను ప్రియురాలగు నీభార్యను రావణాసురుఁడు దొంగిలించుకొనిపోవుచున్నాఁడని మీరు రామునితో జెప్పుడు ఆజానుబాహుఁడును, మహాబలపరాక్రమశాలియును నగురామునకు నేనుండుచోటు తెలిసినచో, నేనుస్వర్గలోకమునందున్నను, లేకయమునిచే నపహరింపఁబడి యమలోకమునందున్నను, తనపరాక్రమముచే నన్నుమఱలతీసికొనిపోఁగలఁడు అనియిట్లు, విశాలములగునేత్రములుగల యాసీతాదేవి మహావ్యసనముతోఁగూడుకొన్నదియై వినువారలకుగూడ వ్యసనముగలుగునట్లనేకవిధములుగ విలపించుచు చెట్టుమీదనున్న జటాయువును జూచె అట్లుసుందరములైన పిరుదులుగలదియును రావణాసురునిచే జిక్కియున్నదియును, నగుసీతాదేవి జటాయువునుజూచినంతనే, భయమును దుఃఖమును రెట్టింపగా, గద్గదస్వరముతో నిట్లనియఱచె.

పూజ్యుఁడవగు ఓజటాయువా! పాపకార్యములుచేయువాఁడును, రాక్షసరాజునునగు నీరావణాసురుడు, నేను కుయ్యోమొఱ్ఱోయని యఱచుచుండగా "దిక్కులేనిదానినిబోలె" నన్నెత్తికొనిపోవుచున్నాఁడు చూడుము. ఈరాక్షసుఁడు మహాక్రూరుఁడు. మిగులబలముగలవాఁడు. జయముగలవాఁడు. ఆయుధసమేతుఁడు. దుర్మతియగునీరాక్షసునియడ్డగింప నీకుసాధ్యముగాదు. ఓజటాయువా! కావునరావణాసురుడు నన్నుదొంగలించికొనిపోయినసమాచారమంతయును కొదువలేక యథార్థముగ రామలక్ష్మణులకు జెప్పుమనిచెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి నలుబదితొమ్మిదవ సర్గముగిసెను.

▸✱◂

—✱ { జటాయువు రావణాసురునిపోనివ్వకఅడ్డగించుట. } ✱—

అంత వృక్షముమీద నిదురించుచున్న జటాయువు ఆధ్వనినివిని మేల్కొని నాలుగుదిక్కులనుజూచి యంతశీఘ్రముగ రావణాసురుని సీతాదేవినిజూచె. మఱియు పర్వతశిఖరమువలె ప్రకాశించుచున్నవాఁడును, మిగులకఱకైనముక్కుగలవాఁడును, మహాకాంతిమంతుఁడును, పక్షిశ్రేష్ఠుఁడును, నగుజటాయువు రావణాసురునిజూచినంతనే యాచెట్టుమీదనుండియే మిగుల మంచిమాటలతోనిట్లనియె.

పదితలలుగల ఓరావణాసురుడా! నేనుపెద్దలాచరించెడుధర్మమునుతప్పక నడచువాఁడను. సత్యవాదిని నన్ను

జటాయువందురు. నేనుపక్షిరాజును. నేనుమహాబలపరాక్రమశాలిని. నేఁజెప్పెడుమాటవినుము. దశరథమహారాజపుత్రుఁడగు రాముఁడు సర్వలోకములకునురాజు. దేవేంద్రునితోను, వరుణునితోను, సమానుఁడు. సకలలోకములకును మేలుచేయుటయం దాసక్తిగలవాఁడు. నీవిప్పుడు అపహరింపఁగోరి యెత్తుకొనిపోయెడు నీయుత్తమస్త్రీయగుసీతాదేవి లోకనాథుఁడగు రామునిధర్మపత్ని మహాకీర్తిమంతురాలు, పతివ్రత. మిగులబలముగలవాఁడవగు ఓ రావణాసురుఁడా! ధర్మమార్గప్రవర్తకుఁడగురాజు, పరులభార్యలను తాకరాదు. అందులోవిశేషించి రాజస్త్రీలకాపాడవలయును. మిగుల హేయమైనకార్యమగు పరస్త్రీలనంటుటనువిడువుము బుద్ధిమంతుఁడగువాఁడు, పరులచేనిందింపఁదగిన కార్యమునుజేయరాదు. శ్లో॥ యథాత్మనస్తథాన్యేషాం దారారక్ష్యా విమర్శనాత్ ॥ ఎవఁడుగాని తనభార్యను యితరులుతాకకుండునట్లు కాపాడుకొనుచుండునో, అట్లేయితరులభార్యలనుగూడ కాపాడవలయును. పౌలస్త్యనికుమారుఁడవగు ఓరావణాసురుఁడా! శిష్టాచారప్రవర్తకులగురాజులు రాజశాస్త్రవిరుద్ధములైనధర్మార్థకామముల నెంతమాత్రమునుబొందఁగోరరు. ఇదిముఖ్యమైనధర్మము శ్లో॥ రాజాధర్మస్యకామస్య ద్రవ్యాణాం చోత్తమోనిధిః । ధర్మశ్శుభంవాపాపంవా రాజమూలంప్రవర్తతే॥ ధర్మార్థకామములకు గారణమురాజగుచున్నాఁడు ధర్మముగాని పుణ్యముగాని పాపముగాని రాజుద్వారాగలుగుచున్నవి. అనగారాజు ధార్మికుండగునేని ప్రజలునుధర్మమునాచరింతురు రాజుపుణ్యమునాచరించినప్రజలునుపుణ్యమునాచరింతురు. రాజుపాపముజేసెనేని ప్రజలును పాపమునేజెయుదురు కావున రాక్షసశ్రేష్ఠుఁడవగు నోరావణాసురుఁడా! పాపముచేసినవానికి విమానముదొఱికినట్లు "పాపముచేయుటయేస్వభావముగాగలవాఁడవును, చపలచిత్తుఁడవును, నగునీకైశ్వర్యం బెట్లుసిద్ధించినది? శ్లో॥ కామంస్వభావోయోయస్యనశక్యః పరిమార్జితుమ్ । నహిదుష్టాత్మనామార్యమావసత్యాలయేచిరం॥ ఎవనికేదిస్వభావమో దానినిపోగొట్టుట కొంతమాత్రమును సాధ్యముకాదు ఇదినిశ్చయము దురాత్ములగువారియింట సంపదబహుకాలముండదు. మహావేగమునశించును. ఓరావణాసురుఁడా! మహాబలవంతుఁడును, ధర్మాత్ముఁడును, నగురాముఁడు నీరాజ్యమునందుగాని నగరమునందుగాని యేలాటియపరాధమునుగావింపకుండగా యీస్త్రీకియెట్లు అపకారమునుజేసెదవు? ఇతరులకువ్యసనముగలిగింప నట్టికార్యములుగల రాముఁడు, మునుపుశూర్పణఖనిమిత్తముగ నధికప్రసంగమునుగావించినవాఁడును, జనస్థానముననున్నవాఁడును నగుఖరునిజంపినవాఁడనిన్ని, అందుకుబదులుగ లోకనాథుఁడగురామునిభార్య నపహరించెదనన్ని చెప్పెదవేమో! యీవిషయమునందు రామునియందేమిదోషమున్నది. నీవేవాస్తవముగఁజెప్పుము. ఓరాక్షసేశ్వరుఁడా! రావణాసురుఁడా! సీతాదేవిని యతివేగముగవిడిచిపెట్టుము. లేకున్నదేవేంద్రుఁడు వజ్రాయుధముతో వృత్రాసురునిజంపినట్లు" రాముఁడు మిగులకోపోద్దీపితుఁడై తననేత్రాగ్నిచేనిన్నుదహించును. నీవుమహావిషసర్పమును చీరచెంగునముడుచుకొని శరీరముదెలియకున్నావు. మఱియు మెడలోకాలపాశము తగులుకొనియుండుటను దెలియకున్నావు. శ్లో॥ నభారస్సమ్యభర్తవ్యో యోనరంనావసాదయేత్ । తదన్నమపిభోక్తవ్యం జీర్యతేయదనామయం । సౌమ్యుఁడవగు నోరావణాసురుఁడా! మానవుఁడు తాను మోయఁదగినభారమును మోయవలయునుగాని, తనచావునకుదగినంతబరువునెత్తికొనరాదు. మఱియును ఏయన్నము వ్యాధినిపుట్టింపకజీర్ణమగునో యాభోజనమును భుజింపవలయును ఓ రావణాసురుఁడా! లోకమునందుఏకార్యముచేసినధర్మముగాని కీర్తిగాని యశస్సుగాని కలుగక మహావ్యసనముమాత్రముకలుగఁజేయునో యట్టిపనినిఎవ్వఁడుజేయును? నీవట్టికార్యమును ఏలచేసెదవు? రావణాసురుఁడా! నేనుపుట్టినదిమొదలు నాతండ్రితాతలవలన లభించినరాజ్యమునుయథాక్రమముగ పాలించుచున్నాను. ఇప్పటికినాకరువదివేలయేండ్లైనది నేనుముసలివాఁడను. నీవుయౌవనవంతుఁడవు. నేనునిరాయుధుఁడను. నీవుధనుర్బాణములను ధరించియున్నావు. నీకుఁగవచములున్నవి. నాకులేవు అయినను సీతాదేవినితీసికొని నిన్నుక్షేమముగఁబోనివ్వను. మఱియు "న్యాయశాస్త్రముతోఁగూడియుండెడి హేతువులవలనవేదముఖండింపనలవిగానియట్లు" నాకండ్లయెదుటసీతాదేవినిఎత్తికొనిపోవుటకు నీకెంతమాత్రమును సాధ్యముకాదు ఓరావణాసురుఁడా! నీవుశూరుఁడవగుదువేని క్షణముసేపునిలిచి నాతోయుద్ధమును జేయుము. "పూర్వము ఖరుడుచంపబడి నేలంగూలినట్లు" నీవుఒకనిమిషములోఁజచ్చి నేలంబడెదవు రాక్షసాధమా! పెక్కుమారులుయుద్ధములయందు దైత్యదానవులను సంహరించినవాఁడును, జటావల్కలములను ధరించియున్నవాఁడును, నగురాముఁడు నిన్ను అతివేగముగజంపును ఓరినీచుఁడా! రాజపుత్రులగు రామలక్ష్మణులు బహుదూరముగఁ బోయియున్నారనియును, వారినినేను బిలుచుకొనిరాలేననియును, వారికిభయప

డివారువచ్చుటకుమునుపే పోవలయుననియును, అతివేగముగపారిపోవుచున్నావు. అయినను నేనుజీవించియుండగా, తామరతేకులవంటి కండ్లుగలదియును, మంగళస్వరూపురాలును, రాముని ప్రియభార్యయును, నగుసీతాదేవిని నీవెంతమాత్రము ఎత్తికొనిపోజాలవు. నాప్రాణములుపోయినను పోవునుగాక. మహాత్ముఁడగు రామునకును దశరథునకును నేనవశ్యముగ ప్రియమునుజేసెదను. నిశాచరుఁడా! రావణాసురుఁడా! అక్కడనేనిలువుము నిలువుము, పోకుము. కొంచెము సేపు నాతోయుద్ధమునుజేయుము. నాబలముకొలఁది యుద్ధమునుజేసెదను. "తొడిమనుండిపండునురాల్చినట్లు" నిన్నురథమునుండి క్రిందికిబడద్రోసెదను. అనిజటాయువు రావణునితోఁజెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి ఏబదియవసర్గముగిసెను.

* రావణాసురునిచేజటాయువుజచ్చుట. *

ఇట్లు యథాన్యాయముగ జటాయువుచెప్పినవిని రావణాసురుఁడు మిగులకోపోద్దీపితుఁడైతనయిరువదికండ్లనుండినిప్పుకణములనురాల్చుచు పండ్లుపటపటగొరుకుచు జటాయువునుజూచె. అట్లుచూచి, పుటముదీరినబంగారుకుండలములుగలవాఁడును, రాక్షసేశ్వరుఁడును, నగురావణాసురుఁడుకండ్లెఱ్ఱజేసి కోపాతిశయమువలన శరీరముచెలియకపక్షిశ్రేష్ఠమగు జటాయువుపైకి పరుగెత్తె. అప్పుడమ్మహాయరణ్యమున రావణజటాయువులు "ఆకాశమునందుగాలిచేనెగురఁగొట్టబడిన మేఘములొకటితోనొకటితాకునట్లు" ఒకరితోనొకరుడీకొనిరి. అంతనారావణజటాయువులయుద్ధము "మాల్యవంతములను ఱెక్కలుగలపర్వతములయుద్ధమువలె చూచువారలకు మిగుల నాశ్చర్యకరముగనుండె. అట్టియెడ మిగులబలవంతుఁడగు రావణాసురుఁడుమిగులభయంకరములగు నాళీకబాణములచేతను, కర్ణాకారబాణములచేతను నాజటాయువుపై బాణవర్షమునుగురిపించె. పక్షిరాజగుజటాయువు, యుద్ధమునందు రావణాసురుఁడు ప్రయోగించిన యాకటుకు బాణములనన్నిటినిసహించి, కఱకుగోళ్లుగల తనకాళ్ళతోతన్ని, గోళ్ళతోగీరి, రావణాసురుని దేహమంతయునుజీల్చి యనేకగాయములనుజేసె. అంతరావణాసురుఁడు మహాకోపమునుబొంది జటాయువునుజంపఁగోరి కాలదండముతోసమానములైనబాణములను పదింటినెత్తికొనె. అట్లెత్తికొని, మహాశౌర్యవంతుఁడగు రావణాసురుఁడు, లెస్సగపదునుపెట్టఁబడినవియును, మహాతీక్ష్ణములైనవియును, మహాభయంకరములైనవియును, వంకరలేకపోవునవియును, నగునాబాణములను ఆకర్ణాంతములాగివిడిచె. అంతనాబాణములు జటాయువుపైఁబడి జటాయువునునొప్పించె. అప్పుడు జటాయువుఆబాణములచే మిగులనొచ్చియును రావణాసురునిరథముపైగూర్చుండి మిగులదుఃఖించుచున్న సీతాదేవినిజూచి వాటినిలక్ష్యపెట్టక రావణాసురునిపైకి దుమికె. అట్లుపైకిబోయి మహాశౌర్యవంతుఁడగు జటాయువు, ముత్తెములచేనలంకృతమైయున్న యారావణాసురునిధనుస్సును బాణసమేతముగ విఱుగునట్లు తనకాళ్ళతోతన్నె. అంతరావణాసురుఁడు మిగులకోపోద్దీపితుఁడై యతిశీఘ్రముగ వేఱొకవిల్లునుతీసికొని యనేకసహస్రములబాణవర్షమును జటాయువుపైగురిపించె. అప్పుడు రణరంగమునందు జటాయువురావణాసురునివలన విడువఁబడినబాణములచేఁగప్పఁబడినవాఁడై గూటిలోనున్నపక్షివలెనేయొప్పుచుండె. అంతమహాశౌర్యవంతుఁడగు జటాయువు, ఆబాణములను తనఱెక్కలచేతఁదట్టివేసి రావణాసురునిచేతనున్న యారెండవధనుస్సునుగూడవిరుగఁదన్నె. అట్లువిఱుగఁదన్ని మహాపరాక్రమశాలియగు నాజటాయువు, అగ్నితోసమానముగ ప్రకాశించుచున్న యారావణాసురుని కవచమును తుత్తుమురుకలగునట్లుగ విఱుగఁదన్ని ఱెక్కలతోనెగుఱగొట్టె. మహాబలవంతుఁడగుజటాయువు, బంగారుకవచములుతొడిగియున్నవియును, మిగుల నుత్తమములైనవియును, పిశాచముఖములుగలవియును, రావణునిరథంబునకుఁగట్టియున్నవియును, నగు గాడిదెలనుబలముగాగాళ్ళతోతన్నిచంపె. మఱియుమహార్హమైనదియును, కామగమనముగలదియును, బంగారుచేవిచిత్రముగ జేయబడినదియును, రత్నములుచెక్కఁబడినదియును, అగ్నికాంతివంటికాంతితోఁ బ్రకాశించుచున్నదియును నగు నామహారథమునునొగతోఁగూడ తునకలుతునకలగునట్లుగజేసె. అంతనూరకుండక యాజటాయువు, పున్నమచంద్రునితో సరిపోలుకాంతిగలశ్వేతచ్ఛత్రమును, వింజామరులను తునకలుతునకలుగవిఱుగఁగొట్టి, వాటినిపట్టుకొనియున్న రాక్షసులనుగూడచంపె. మఱియుశ్రీమంతుఁడును మిగులబలముగలవాఁడును పక్షిరాజును, నగుజటాయువు మహావేగమునుఅవలంబించి, రావణాసురునియొక్క రథసారథితలను తనముక్కుతోపొడిచి తుతుకనుకొఱికివైచె. అంతరావణాసురుఁడువిఱిగినధనుస్సును, ఛత్రచామరములును, రథమును, చంపంబడినగుఱ్ఱములును, సారథియునుగలవాఁడై దిక్కుతెలియక సీతాదేవిని చంకబెట్టుకొని భూమిపైదు

మికి అట్లు రావణాసురుడు రథము విఱిగిపోవుటచే నిరాయుధుఁడై నేలపై దుముకుటను జూచి సమస్తభూతములు బళే బళే, బహుగట్టివాఁడని జటాయువును బ్రస్తుతించినవి అంత పక్షిశ్రేష్ఠుఁడగు జటాయువు వృద్ధాప్యముచేత బడలియుండుటను జూచి రావణాసురుడు మిగుల సంతసించిమరల సీతాదేవిని ఎత్తికొని ఆకాశమున కెగరె. అట్లు రావణాసురుడు సీతాదేవిని చంక బెట్టుకొని ఎగురుటను జూచి మహాశౌర్యవంతుఁడగు జటాయువు, తానును తోడనే ఆకాశమున కెగిరి వానినడ్డగించి యతనితో నిట్లనియె.

బుద్ధిహీనుఁడవగునో రావణాసురుడా! వజ్రాయుధము యొక్క వ్రేటువలె' మహాతీక్ష్ణములగు బాణములుగల రాముని భార్యను, రాక్షసవినాశముకొఱకు దొంగిలించికొని పోవుచున్నావు మఱియు "దాహముగొన్నవాఁడు నీళ్లు ద్రావునట్లు" నీవు నీ స్నేహితులతోను, బంధువులతోను, మంత్రులతోను, సేనలతోను, పరివారజనముతోనుఁ గూడినవాఁడవగుచు, సీతాపహరణమను, విషమును ద్రావుచున్నావు. తెలివిలేనివారు తాము చేయుచుండెడి కార్యముల యొక్క ఫలములను తెలిసికొనజాలక నీవలెమహా వేగముగ నాశనమును బొందుదరు నీవు కాలపాశముచేతఁ గట్టఁబడి చావుకుసిద్ధమైయున్నావు. మఱియు "మాంసముతోగూడియుండెడు గాలమును మ్రింగిన చేపవలె" నీ వెచటికిపోయినను తప్పించుకొనిపోజాలవు. ఓరీ! రావణాసురుడా! దురాధర్షులగు రామలక్ష్మణులు, నీవు జేసెడి యపరాధమును ఎంతమాత్రమును మన్నింపరు. నీవు పందవై దొంగతనముగ లోకనింద్యమగు నీకార్యమును జేసితివి. ఇది దొంగవాఁడు చేయుపని. శూరుఁడు యిట్టి కార్యమును ఎంతమాత్రమును జేయడు. రావణా! నీవు శూరుఁడవైతివేని కొంచెము సేపు నిలిచి యుద్ధమును జేయుము. నీతమ్ముఁడగు ఖరునివలె నీవును చంపఁబడినవాఁడవై నేలంబడెదవు. పురుషుఁడు మృత్యుసన్నిహితమైనపుడు తనవినాశముకొఱకు ఎట్టి కార్యమును జేయునో అట్టిపనిని నీవు చేసితివి. కావున నీకు చావు నిశ్చయము రావణాసురుడా! ఏపని జేసిన పాపము గలుగునో యట్టికార్యమును లోకనాయకుఁడును, భగవంతుఁడును, ఒకరిచే సృష్టింపఁబడక తానుగా జన్మించినవాఁడును, నగు బ్రహ్మదేవుఁడు గూడ చేయఁడు. అని యిట్లు జటాయువు రావణాసురునకు ధర్మమార్గమును ఉపదేశించుచునే, వాని వీపుమీద వ్రాలె అట్లా జటాయువు రావణాసురుని వీపుపై లెస్సగ గూర్చుండి "మదపుటేనుఁగుపైనెక్కిన మావటివాడు అనేకవిధముల చేదానిని అంకుశముతో బాడిచి నొప్పించునట్లు" తన తీక్ష్ణములగు గోళ్ళతో రావణాసురుని వీపంతయును పెఱికె మఱియు గోళ్లు ఱెక్కలు ముక్కునే, యాయుధములుగా గలజటాయువు రావణాసురుని వీపంతయు ముక్కుతో పొడిచి గోళ్ళతో చీల్చి రక్తప్రవాహమును గావించి, తలవెండ్రుకలనన్నిటిని పెఱికిపారవైచె. అంత రావణాసురుఁడు జటాయువుచే నానావిధములుగ శ్రమఁబడి మిగులఁ గోపోద్దీపితుఁడైకోపాతిశయముచే పెదవులుబ్బగా దేహమంతయు వడవడ వడకె. అట్లు రావణాసురుడు శరీరము జలియని కోపమును బొంది, సీతాదేవిని యెడమచంకయందుంచుకొని గట్టిగాఁబట్టుకొని కుడివైపునసుండు నఱచేతితో జటాయువును మోదె అంత శత్రుసంహారకుడును, పక్షీంద్రుడును, నగు జటాయువు కోపముతో రావణాసురుని నెదిరించి తనముక్కుతో రావణాసురుని యెడమచేతుల నుపదింటిని తెగకొఱికె. అట్లు తెగకొఱకఁబడిన రావణాసురుని చేతులు "విషజ్వాలలతో గూడుకొన్న సర్పములు పుట్టలోనుండి వెలువడునట్లు" తత్క్షణమె మహావేగముగ చేతులుమఱల పుట్టినవి అంత దశగ్రీవుఁడగు రావణాసురుఁడుమహాకోపమును బొంది సీతను దిగవిడిచి పక్షిరాజగు జటాయువును కాళ్ళతో దన్ని పిడికెళ్ళతో గుద్దె అట్టియెడ, మహాపరాక్రమశాలియును రాక్షసేశ్వరుఁడును నగు రావణాసురునకును పక్షిరాజగు జటాయువునకును, ముహూర్తకాలము మహాయుద్ధము జరిగె. అపుడు రావణాసురుఁడు కత్తిని దీసికొని, రామకార్యార్థముగ యుద్ధము నుజేయుచున్న యా జటాయువు యొక్క ఱెక్కలను పక్కలను పాదములను, నఱికివేసె. అంత జటాయువు, మహాభయంకరముగు కార్యముగల రావణాసురునిచే ఱెక్కలు పక్కలు నఱుకబడినంతనే ప్రాణములు పోయి నేలయందుబడె అట్లు నేలయందు బడి రక్తప్రవాహములో మునుగుచున్న జటాయువును జూచి సీతాదేవి "తన బంధువగు వాఁడు ఎవడయినను జచ్చెనేని చింతించునట్లు" మహావ్యసనముతో గూడినదియగుచు హోరుమని పెద్దపెట్టున నేడ్చుచు జటాయువునొద్దకు పరుగెత్తె. అప్పుడు, నీలమేఘవర్ణము గలవాఁడును, తెల్లనిరొమ్ముగలవాఁడును, మహాశౌర్యవంతుఁడును, విగతజీవుఁడై చల్లారిన నిప్పువలెనున్నవాఁడును, నగు జటాయువు నేలయందుంబడి యుండుటను, లంకాధిపతియగు రావణాసురుడు చూచె అట్టియెడ, చంద్రకాంతితో సరిబోలు ముఖముగలదియును, జనకమహారాజపుత్రికయును, నగు సీతాదేవి, రావణాసురునిచే జంపఁబడినవాఁడును, భూమిపైబడియున్నవాఁడును నగు జటాయువును పలుమారు కౌగలించుకొని కండ్లనుండి నీళ్లు ప్రవాహములై పారగా హోరుమని పెద్ద పెట్టున నేడ్చె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబదియొకటవ సర్గముగిసెను.

(శ్రీ)

రావణాసురుడు సీతనపహరించుకొని పోవుచుండగ పశుపక్షిమృగాదులు దుఃఖించుట

అంత రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు, రాముని యాశ్రమస్థానమునకు సమీపమున నేలంబడియున్న జటాయువును చూచె. అప్పుడు చంద్రునివంటి ముఖముగల సీతాదేవి, రావణాసురునిచేఁ జంపఁబడిన పక్షిరాజమగు జటాయువునుజూచి మహావ్యసనముచే ననేకప్రకారములుగ విలపించె మఱియు చంద్రబింబముతో సరిబోలుముఖముగల సీతాదేవి యాజటాయువును కౌఁగలించుకొని దుఃఖమును బట్టజాలక హోరుమని పెద్దపెట్టున నేడ్చె. అట్లుసీతాదేవి కొంతసేపువిలపించి పిమ్మటతనలో తానిట్లని చింతించె

శ్లో॥ నిమిత్తంలక్షణజ్ఞానం శకునిస్వరదర్శనం। అవశ్యం సుఖదుఃఖేషు నరాణాంప్రతిదృశ్యతే ॥ కండ్లుఅదురుట, మొదలగులక్షణములును, పక్షులయొక్క ధ్వనులు చలనములు మొదలగునవియును, మానవులకు అవశ్యముగ సుఖదుఃఖములను సూచించుచుండును ఓరామచంద్రా! నీకిప్పుడు సంభవించిన మహావిపత్తు యింకను నీకు తెలియకున్నదా? ఈపరుగెత్తెడి మృగములు పక్షులు మొదలయినవి నాకొఱకయ్యే రాముని యొద్దకు పరుగెత్తుచున్నవని నిశ్చయముగ తలచెదను. నన్నురక్షించుటకుగావచ్చిన యీజటాయువు నాదురదృష్టముచేత పాపాత్ముఁడగు నీరావణాసురునిచేఁ జంపఁబడి నేలఁబడియున్నాఁడు. అని చెప్పి సీతాదేవి మహాభయముగలదై దగ్గరనుండి వినుచున్నవారికి జెప్పినట్లు "అయ్యో రామా! రామా! నన్నురక్షింపుము. రక్షింపుము లక్ష్మణా! నన్నుకాపాఁడుము కాపాడుము. అనియిట్లనేకప్రకారములుగ సీతాదేవి విలపించుచుండె అంత రాక్షసేశ్వరుఁడగు రావణాసురుడు, నలిగినపూలదండలును, సొమ్ములును, గలదియును, దిక్కులేనిదానివలె ననేకవిధములుగ నేడ్చుచున్నదియును, నగుసీతాదేవియొద్దకు పరుగెత్తిపోయె. అట్లురావణాసురుడు సీతాదేవిదగ్గరకు పరుగెత్తిపోవుటనుజూచి పొదలలో జొరఁబడుచున్నదియును, పెద్దమ్రాకులనుగట్టిగ కౌఁగలించిపట్టుకొనుచున్నదియును, అవనమునందు రాముని యెడబాయుటచేత, రామా! రామా! రామా! యనిగొంతెత్తి గట్టిగానఱచుచున్నదియును నగు సీతాదేవిని, "యమునిబోలెనున్న" రావణాసురుఁడు, "చాలుచాలు, ఇకవిడిచిపెట్టుము" అనియిట్లనేకవిధముల జెప్పుచు తనచావుకొఱకు నాసీతాదేవియొక్క వెంట్రుకలనుపట్టుకొనియె అంత రావణాసురుఁడట్లు సీతాదేవినిపట్టుకొన్నంతనే స్థావరజంగమములతోఁగూడిన లోకమంతయును మర్యాదలేనిదై గాఢాంధకారమగు చీకటిగమ్మినది. అట్టియెడగాలిగొట్టదయ్యె సూర్యునికాంతితగ్గిపోయె శ్రీమంతుఁడగు బ్రహ్మదేవుఁడు, సీతాదేవిని రావణాసురుడు తాకుటచే నాసీతాదేవి మహావ్యసనముతో గూడియుండుటను, తనదివ్యదృష్టిచే నెఱిఁగి "కార్యము నెరవేరినది" యనిచెప్పె (అనగా రావణాసురుని కాయుస్సుతీరినదియనుట) మఱియు దండకారణ్యముననున్న మహామునులందఱును, సీతాదేవి రావణాసురునిచే తలబట్టియీడ్వఁబడుటనుజూచి "అతిత్వరితకాలములోనే రావణాసురునికి నాశనముగలుగుచున్నదిగదా" యనిసంతసించినవారును, సీతాదేవికి సంభవించినకష్టమునకు దుఃఖించినవారును నైరి. అప్పుడు రాక్షసేశ్వరుఁడగు రావణాసురుడు, హా రామా! రామా! యనియును, హా లక్ష్మణా! లక్ష్మణా! యనియును మహాదుఃఖముతో పొరలిపొరలి యేడ్చుచున్న సీతాదేవిని ఎత్తికొని ఆకాశమునకెగరె. అట్టియెడ పుటముదీరినబంగారుతో సమానమైన దేహచ్ఛాయగలదియును, పట్టువస్త్రము గట్టుకొనియున్నదియును, రాజపుత్రికయును, నగుసీతాదేవి గగనమున రావణాసురునిచే నెత్తికొనిపోఁబడినదియై మిగులప్రకాశించుచుండెడి మెఱుపుతీగవలెనే యొప్పియుండెను. మఱియు నాసీతాదేవి ధరించియుండెడు పీతాంబరముయొక్క చెఱగు, గాలికెగిరికదులుటచే "అగ్నిజ్వాలలచే నావరింపఁబడినపర్వతమువలె" రావణాసురుడు మిగుల ప్రకాశించుచుండె. మఱియును మంగళస్వరూపురాలగు, నాసీతాదేవి ధరించియున్నవియును, మంచి వాసనగలవియును, నగుతామరఱేకులు గాలికెగిరి రావణాసురునిపైనబడె. అప్పుడు, బంగారుకాంతివంటి కాంతిగలదియును గాలిచే నెగురగొట్టఁబడినదియును, నగునాసీతాదేవియొక్క పీతాంబరము సూర్యునికాంతిచే నెఱ్ఱనైనయాకాశమువలెనే ప్రకాశించుచుండె. మఱియు గగనమార్గమునందు రావణాసురుని చంకయందున్నదియును, సొగసైనముక్కుగలదియును, నగుసీతాదేవియొక్క ముఖము రాముని యెడబాసియుండుటచే వాడినదియై కాడలేనితామరపువ్వువలెనే ప్రకాశింపకుండె శ్రేష్ఠమగులలాటముగలదియును, మిగులనాణ్యములగు కొనవెంట్రుకలుగలదియును, వికసించినతామరపువ్వువంటి కాంతిగలదియును, వచ్ఛములేనిదియును, నగుసీతాదేవిమిగులతెల్లనివియును, మహానిర్మలములైనవియును, మిగులఁబ్రకాశించుచున్నవియును, నగుపండ్లతో నొప్పుచుండె. యేడ్చినప్పుడు

కారినకన్నీళ్లు తుడువఁబడినదియును, చంద్రునివలెసంతోషకరమైన చూపుగలదియును, శ్రేష్ఠమైనముక్కుగలదియును, మనోజ్ఞములై యెఱ్ఱనైన పెదవులుగలదియును, బంగారపుకాంతివంటి కాంతిగలదియును, గగనముననున్నదియును, స్వచ్ఛమైనదియును, నగునాసీతాదేవియొక్కముఖము, నల్లనిమేఘములసమూహమును భేదించుకొనియగుపడుచుండు చంద్రబింబమువలెనే ప్రకాశించుచుండెను. అదియునుగాక రావణాసురునిచేజిక్కి వానిభయమువల మిగుల వడవడవడకుచున్నదియును, శుభస్వరూపురాలును, నగునాసీతాదేవియొక్కముఖము, రామునియెడబాసియుండుటచే పగటికాలమునందుదయించిన చంద్రబింబమువలెనేప్రకాశింపకుండె బంగారముతోసరిబోలుదేహచ్ఛాయగలయాసీతాదేవి నల్లనిశరీరముగలవాఁడగు రావణాసురుని చంకయందున్నదై నీలమణినిబొందిన బంగారుమొలనూలువలెనే యొప్పుచుండె. మఱియు, బంగారుసొమ్ములు ధరించియున్నదియును, కమలములతోసమానమైన పసపువన్నెగలదియును, బంగారుకాంతివంటి కాంతిగలదియును, జనకమహారాజ పుత్రికయును, నగునాసీతాదేవి రావణాసురుని చంకయందున్నదియగుచు మేఘమునందున్న మెఱుమువలెనే చక్కఁగ బ్రకాశించుచుండె అట్టియెడ రావణాసురుఁడు, సీతాదేవిధరించియుండెడు భూషణధ్వనులతో గూడియుండుటచే మెఱుములతోను యుఱుములతోను గూడినమేఘమువలెనేయొప్పుచుండె. అట్లురావణాసురునిచే నపహరించుకొనిపోబడుచున్న సీతాదేవియొక్కతలనుండి రాలినపువ్వులు భూమియందంతటను పడె ఆతిరున నేలంబడినపుష్పములు రావణాసురుఁడుపోయెడివేగముచేత మఱలనతనితట్టు లాగుకొనఁబడియతనిఁజేరినవి. అట్లతనిబొందినయాపువ్వులు, నిర్మలమగునక్షత్రములవరుస మిగులపొడవగుమేరుపర్వతమును నావరించునట్లు, రావణాసురునికప్పనవి. అప్పుడుసీతాదేవి కాలియందున్నదియును, నవరత్నఖచితమైనదియును, మెఱుపులసమూహమువలె మహాకాంతితోగూడుకొన్నదియును, నగునందె, కాలినుండిజారి మిగులమనోజ్ఞమగు ధ్వనితోఁగూడుకొన్నదియై భూమిపైబడె. చిగురుటాకువంటి ఛాయగలదేహముతోనొప్పుచున్న యాసీతాదేవి రావణాసురునినడుమునందుండుటచేత నారావణాసురుఁడు, బంగారుతోఁ చేయఁబడి మొకుతోసదుముసగట్టబడిన యేనుఁగువలెనే ప్రకాశించుచుండె కుబేరునితమ్ముఁడగు రావణాసురుడు, సీతాదేవిని గగనమార్గముననెత్తికొనిపోవుచుండగా నాసీతతనశరీరకాంతిచే గొప్పలోకచుక్కవలె బ్రకాశించుచుండగాలంకకు దీసికొనిపోయె. అప్పుడాసీతాదేవి ధరించియుండినవియును, అగ్నిహోత్రమువలె బ్రకాశించుచుండినవియును, నగుభూషణములు గొప్పధ్వనితోగూడుకొన్నవియై, ఆకాశమునందుండి నేలంబడిన నక్షత్రములవలెనేభూమిపైఁబడె. మఱియు సీతాదేవిధరించియుండినచంద్రహారము మహాకాంతితోగూడుకొని స్తనమధ్యమునసుండిజారిపడినదియై "ఆకాశమునందుండి భూమికైపడినయాకాశగంగవలెనే" యొప్పియుండె. అట్టియెడమిగులనుత్పాతముగ ప్రళయకాలపుగాలిగొట్టుచుండె. నానావిధములగు పక్షులతోగూడుకొనియున్న వృక్షములు పెనుగాలిచే గదులుచున్నకొనలుగలవియై "చేతులతో భయపడవద్దని సీతాదేవితోజెప్పుచున్నవానివలె" యొప్పియుండె అప్పుడుతామరకొలకులు, వాడినకమలములతోనుభయమునుబొందిన మత్స్యములు మొదలగు జలచరములతోనుగూడుకొన్నవియగుచు, మహావ్యసనముచే నిట్టూర్పులుడిగిన చెలికత్తెవలెనే సీతాదేవినిజూచి వ్యసనపడుచున్నట్లుగాన్పించినవి. ఆసమయమున సింహములు పెద్దపులులు మొదలగుమృగములును, సమస్తపక్షిసమూహములును, నిడననుసరించి పరుగెత్తుచున్నవియై రావణాసురునిపై మహాకోపమునుబొంది సీతాదేవిని వెంబడించిపోవునట్లు చూపట్టుచుండినవి పర్వతములు,వాటిలోనుండి వెలువడిన, జలప్రవాహములే కన్నీళ్లుగాగలవియును, శిఖరములేపైకెత్తఁబడిన చేతులుగాగలవియునునై సీతాదేవినిరావణాసురుడపహరించుటనుజూచి మిగులవ్యసనపడుచున్నవాటివలెనేగాన్పించినవి అప్పుడుసీతాదేవిని రావణాసురుడుగొనిపోవుటనుజూచి సూర్యుఁడు మహాదైన్యమునుబొందినవాఁడై చక్కఁగబ్రకాశింపక వెలవెలమని తెల్లచాఱియుండె అప్పుడుసమస్తభూతములునొకటిగఁజేరి, "అయ్యో! రామునిభార్యను రావణాసురుఁడపహరించుకొనిపోవుచున్నాడే. ఇఁకధర్మమెక్కడ? సత్యమెక్కడ? దయయనునదిలేనేలేదుగదా? నిష్కాపట్యమనునది అంతకుమునుపే లేదు" అనియిట్లనేకప్రకారములుగ జెప్పుచు మిగులదుఃఖించినవి ఆయరణ్యముననున్న జింకపిల్లలు మహావ్యసనముతోగూడుకున్నవై కండ్లనుండినీళ్ళు గారగా తలలుమీదికెత్తికొని సీతాదేవినిజూచుచు మహాభయముచేదైన్యమునుబొంది గట్టిగాహోరుమనియేడ్చినవి. అంతపరమదుఃఖితయైహోరుమనియేడ్చుచున్నదియును,హా! రామా! హా లక్ష్మణా! యనిమహామధురముగ నఱచుచున్నదియును, పలుమారు భూమితట్టుచూచుచున్నదియును, నగుసీతాదేవినిజూచి యావనదేవతలందఱును పరమదుఃఖితులై మహా

భయముచే వడవడవడఁకిరి. మహావ్యసనముచే గలతనొందిన ముంగురుగలదియును, చెడిపోయిన బొట్టుగలదియును, మహాపతివ్రతయును, నగునాసీతాదేవిని రావణాసురుఁడు తనవినాశముకొఱకు దొంగలికొనిపోయె. అప్పుడు సుందరములైన పండ్లుగలదియును, తెల్లనిచిరునగవుగలదియును సమస్తబంధువులను విడిచినదియును, నగునాసీతాదేవి రామలక్ష్మణులనుగానక మహాభయముచే వివర్ణయైయుండె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబది రెండవసర్గ ముగిసెను.

▸✱◂

సీతాదేవిని ఆకాశమార్గమున నెత్తుకొనిపోవుచున్న రావణాసురుని సీతాదేవినిందించుట.

అంత జనకమహారాజపుత్రికయగు సీతాదేవితన్నెత్తికొని ఆకాశమార్గమున నెగిరిపోవుచున్న రావణాసురుని జూచి మహాభయముచే వ్యసనమును బొందినదియై వడవడవడకుచుండె అట్లువడవడవడకుచు, పెద్దపెట్టున నేడ్చుచు, కోపముచేతను వ్యసనముచేతను నెఱ్ఱబారిననేత్రములుగలదియై సీతాదేవి మహాభయంకరమగు నేత్రములుగల రావణాసురునిజూచి యిట్లనియె

మహానీచుఁడవగు నోరాక్షసాధమా! రావణా! రామలక్ష్మణులు లేకుండుసమయముగుర్తెఱిగి నన్నుదొంగిలించుకొని పరుగెత్తిపోవుచున్నావే? నీకుకొంచెమైనను సిగ్గులేదా! ఏమి? మిగులదురాత్ముఁడవగు నోరావణాసురుడా! నీవునన్నపహరింపగోరి నీమాయచే మృగరూపమునునిర్మించి నాపెనిమిటియగురాముని బహుదూరము తీసికొనిపోవునట్లుచేసితివి మఱియునన్నురక్షించుటకు మహాప్రయత్నముచేసిననాఁడును, మామామయగు దశరథమహారాజునకు పరమస్నేహితుడును మిగులవృద్ధుఁడును నగుజటాయువునుగూడ సంహరించితివి. రాక్షసాధముఁడవగు నోరావణాసురుడా! నీపేరు, కీర్తి, మొదలగునవియన్నియు నుపొగడుకొనియును, యుద్ధమునందు రామునిజయించలేకనన్నుదొంగతనముగా దీసికొనిపోవుచున్నావు. ఆహా! నీ పరాక్రమముఏమనిచెప్పవచ్చును? మహాయధికమైనపరాక్రమమేమి? ఓరినీచుఁడా! ఎవ్వరు లేనికాలమున పరస్త్రీనపహరించుటయనునిట్టి నింద్యమగుకార్యమును జేసిన నీకెందుకులజ్జతోచలేదు? నీవు, నేనుమహాశూరుఁడనని గర్వపడుచుండియు మిగులనిందితమైనదియును, మహాక్రూరమైనదియును, అధర్మమైనదియును, నగునీకార్యమును జేసితివి కావున సమస్తలోకములయందును నీగుణములను పురుషులు చెప్పుకొందురు. నీచుఁడా! నీవుచెప్పుకొన్న నీబలపరాక్రమములనుయేమిచేయను? కాల్పనా? కులనాశకుఁడవగు నీచరిత్రము లోకమునందులేకుండగ నాశమొందును. ఇప్పుడునీవిట్లతివేగముగపారిపోయిన మాత్రముననేఏమిచేయగలవు. (ఏమియును జేయజాలవు) ముహూర్తమాత్రమిచ్చటనిలిచియుందువేని నీప్రాణముదక్కించుకొని బ్రతికిపోజాలవు నీవుసేనాసమేతుఁడవైవచ్చినను గూడ రామలక్ష్మణులకండ్లకగపడుదువేని నిమిషమునేపైనను బ్రతికియుండలేవు. మఱియు నరణ్యమునందుమండుచున్న నిప్పుశకునపక్షులుఓర్వజాలక పరుగెత్తిపోవునట్లు నీవురామలక్ష్మణుల బాణాగ్నిదెబ్బలకు తాళజాలక మలమల మాడిపోదువు కావున నారామలక్ష్మణులతోటిహితము నీకు శ్రేయమని యెంచినన్నువిడిచిపెట్టుము. నీవట్లునన్నువిడువవేని నాభర్తయగురాముఁడు లక్ష్మణసమేతుఁడైవచ్చి నన్నపహరించిననిన్నుజంపుట కెంతమాత్రమునుసంశయములేదు. ఓరి నీచుఁడా! నీవుయేఅభిప్రాయముతో నన్నుబలవంతముగ నపహరింపగోరుచున్నావో యట్టితలంపులన్నియు నిరర్థకములైపోవును అందుకెంతమాత్రమును సంశయములేదు. నేనుదేవసమానుఁడగు నాభర్తనుఁబాడనిదాననై శత్రువుచేఁజిక్కి బహుకాలముజీవించియుండను. శ్లో॥ మృత్యుకాలేయథామర్త్యో విపరీతాని సేవతే ॥ "మరణకాలముసమీపించినపుడు మానవునకువ్యత్యస్తమైనబుద్ధిగలుగునట్లు" నీకునేనుజెప్పెడి మేలైనహితవాక్యమునువినవు నిశ్చయము శ్లో ॥ ముమూర్షూణాంహిసర్వేషాం యత్పథ్యంతన్నరోచతే॥ కాలముసమీపించియుండువారికందఱికని హితవాక్యములు యెంతమాత్రమునురుచింపవు నీవుమెడలోకాలపాశమును వైచుకొనియున్నావు. అదినేనుచూచుచున్నాను నామాటనికెట్లురుచించును? ఓరీ! రాక్షసుఁడా! భయమునుబొందవలసినసమయమున నీవుభయపడకున్నావు. కావుననీవతిత్వరితకాలములోనే బంగారువృక్షములను చూడగలవు. (అనగాజావగలవు) ఇందుకెంతమాత్రమును సంశయములేదు రావణాసురుడా! నీవు, మహాభయంకరమైన రక్తమేప్రవాహముగా పారుచుండెడివైతరణీనదియును, కత్తులేయాకులుగాగల యసిపత్రవనమునుజూచెదవు మఱియుపుటముదీరిన బంగారుఛాయగల పుష్పములతోనొప్పుచున్నదియును, శ్రేష్ఠములైనవైడూర్యముల మణులవంటియాకులుగలదియును, మహాతీక్ష్ణములగు ఇనుపముండ్లతోనొప్పుచున్నదియును నగుబూరుగచెట్టును (శాల్మలీ వృక్షము) చూడగలవు. నీవుమిగులనిర్దయుఁడవై మహానుభావుఁడగు రామునకు యీలాటియపకృతిని గావించితివి. కావుననిష

ముభక్షించినవానివలె నల్పకాలములోనే ప్రాణములనువిడుతువు. ఓరావణాసురుఁడా! మహాత్ముఁడగునాకెనమిటి చేసీవుఅనివార్యమగు కాలపాశబద్ధుఁడవై యెచటికేగినను బావుతప్పించుకొని సుఖముగనుండగలవా? మఱియు రాముఁడొకఁడె తమ్మునిసహాయముకూడలేక నిమిషమాత్రములో పదునాలుగువేలరాక్షసులనుజంపెను కావున నట్టిమహాబలపరాక్రమశాలియును సమస్తశస్త్రాస్త్రముల నెఱిఁగినవాఁడునునగు రాముఁడు తనభార్యనపహరించిన నీయట్టిదురాత్ముని మహాతీక్ష్ణములగుబాణములచేవధింపక యెట్లువిడుచును? అనియిట్లనేకవిధములగు పరుషవాక్యములాడుచు భయశోకములెట్టింప చూచువారలకు కనికరముగలుగునట్లు హోరుమనియేడ్చుచుండె. అట్లు రావణాసురునిచేజిక్కి యున్నదియును, దుఃఖసముద్రమున మునిఁగి విలపించుచున్నదియును, మిగులభయముచే వడవడవడకుచున్నదియును, మహావ్యసనపీడితయై నన్నురక్షింపుడని నానావిధములుగా నేడ్చుచున్నదియును నగుసీతాదేవిని రావణాసురుఁడెత్తికొనిపోవుచుండె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేఁబదిమూఁడవసర్గముగిసెను.

సీతాదేవిని రావణాసురుఁడు లంకాపట్టణమునకుదీసికొనిపోయి అంతఃపురమునందు భద్రముగానుంచుట

ఇట్లుసీతాదేవి రావణాసురునిచేఁగొనిపోఁబడుచు నెచటను రక్షకునిగానక యొకపర్వతాగ్రముననైదుగురువానరోత్తములనుజూచె. అట్లుచూచి సుందరములైన పిరుదులుగలదియును విశాలములైననేత్రములుగలదియును, నగునాసీతాదేవి "యీవానరులునావృత్తాంతమును రామునకెఱింగింతురనితలచి, సొగసైనతనసొమ్ములను, బంగారుకాంతివంటికాంతిగల తనపైటచెఱఁగగు పట్టువస్త్రమునందుఁగట్టి వారినడుమపడునట్లువిసరివైచె. అట్లుసీతాదేవితనపైవస్త్రముననగలుగట్టి యీవానరులమధ్య పారవేయుటను రావణాసురుఁడుచూడఁడయ్యె. అతఁడుసీతాపహరణసంభ్రమమునందేయుండె. అప్పుడుపింగళవర్ణముతో నొప్పుచుండెడినేత్రములుగల వానరోత్తములు, అట్లఱచుచున్న సీతాదేవిని కన్నార్పక చూచుచుండిరి. అంతరాక్షసేశ్వరుఁడగురావణాసురుఁడు మిగులనాక్రోశించుచున్న సీతాదేవిని యెత్తికొని పంపాసరోవరమునుదాటి లంకాపట్టణమునకైపోయె. మఱియు రావణాసురుఁడు మహాసంతోషముతోఁగూడుకొన్నవాఁడగుచు తనచావునకు కారణభూతురాలగుసీతాదేవిని, "మహాతీక్ష్ణములగు కోఱలుగలదియును, మిగులవిషముతోఁ గూడుకున్నదియును నగు నాడుసర్పమును యెత్తికొనిపోవునట్లు" యెత్తుకొనిపోయె. అప్పుడుఆరావణాసురుఁడు "ధనుస్సుననుండివిడువఁబడిన బాణమువలెవడిగలవేగముతో నాకాశమార్గమునఁబోవుచు భూమిపైనున్నపర్వతములనునదులను వనములనుసరోవరములను దాటిపోయె. అట్లుపోయిపోయి రావణాసురుఁడు, తిములకును, మొసళ్ళకునువాసస్థానమైనదియును, అక్షయమైనదియును, సమస్తనదులకు స్థానభూతమైనదియును, నగుసముద్రమును కూడదాటిపోయె. అట్లురావణాసురుఁడు సీతాదేవినపహరించుకొనిపోవుటనుజూచి సముద్రము మహాతొట్రుపాటుతోఁగూడుకున్నదై యలలులేకయుండె. సముద్రములోనున్న చేపలు, విషసర్పములు, మొదలగుజంతువులన్నియుభయసంభ్రమమున కదలకుండె. అప్పుడుగగనమునందున్న సిద్ధచారణులు తమలోతామిట్లనుకొనుచుండిరి. రావణాసురుఁడు సీతాదేవినపహరించుకొని పోవుచున్నాఁడు. ఇదియే యీరావణుని కంత్యకాలమనిరి. అట్టియెడరావణాసురుఁడు, తనచావుకొఱకురూపమునుధరించిన మృత్యువవలెనున్నదియును, మహావ్యసనముచే జుట్టుకొనిచుట్టుకొనియేడ్చుచున్నదియును, నగసీతాదేవిని చంకయందుంచుకొని లంకానగరమునందుఁబ్రవేశించె. అట్లురావణాసురుఁడు, చక్కఁగతీర్పఁబడినరాజమార్గములుగల లంకానగరమునందుఁబ్రవేశించి, జనులచేనిండియుండెడు తొట్టికట్లతోఁగూడియున్న తనయంతఃపురమునందుఁజొచ్చె. అట్లుఅంతఃపురమునందుఁజొచ్చి "మయుఁడు రాక్షససంబంధమైనమాయనులంకయందుంచినట్లు" రావణాసురుఁడు, నల్లనినేత్రములుగలదియును, మహావ్యసనముచే దేహముచెలియకున్నదియును, నగుసీతాదేవినచటనుంచె అంతరావణాసురుఁడు మిగులభయంకరాకారులగు రాక్షసస్త్రీలనుజూచియిట్లనిచెప్పె.

ఓరాక్షసస్త్రీలారా! నాయనుజ్ఞలేక యేపురుషుఁడుగాని, స్త్రీగాని యీసీతనుచూడఁగూడదు మీరుమహాజాగ్రతతో నీసీతనుకాచియుండుఁడు, మఱియు నీసీత, ముత్యములు, రత్నములు, బంగారు, వస్త్రములు, నగలుమొదలగువాటిలో నేదినిగోరినను వానినన్నిటిని నాయిష్టముచొప్పునయిచ్చినట్లె అడ్డిలేకయివ్వవలయును. బ్రతుకవలయుననియాశగలప్రతివారును, తెలిసిగానితెలియకగాని యీసీతకుఅప్రియముబలుకకూడదు. అట్లుఅప్రియములుపలుకుదురేనివారినినిశ్చయముగసంహరింతునని చెప్పె. మహాశౌర్యవంతుఁడును రాక్షసేశ్వరుఁడును నగురావణాసురుఁడు యిట్లుఆస్త్రీలకుఆజ్ఞాపించియంత నంతఃపురమునుండి బైదేరిపో

వుచు నింకఁ జేయవలసిన కార్యమును గురించి లెస్సగనాలోచించి, మాంసాహారులును మహాశౌర్యవంతులును నగు నెనిమిదిమంది రాక్షసులనుజూచె. తానుపొందియుండు వరముచే గర్వించి యుండువాఁడును. మహావీరుఁడును నగు రావణాసురుఁడు ఆయెనమండ్రఁ గురించి జూచి వారిబలశౌర్యములను మిగులఁ గొనియాడి వారల తోనిట్లనియె

ఓ రాక్షసులారా! మీరిప్పుడు సమస్తాయుధములను ధరించి యతివేగముగఁ బోయి, పూర్వము, ఖరునికి వాసస్థానముగనున్నదియును, యిప్పుడు సర్వశూన్యంబైనదియును, నగు జనస్థానమును జేరుఁడు. అట్లు చేరి బలశౌర్యోత్సాహములు గలవారై భయమును దూరముగ బారఁదోలి, రాక్షసులందరు జంపబడుటచే పాడుపడియుండెడు జనస్థానమున నుండవలయును. నేను జనస్థానమునందుంచియుండిన మహాసైన్యమును, ఖరదూషణసమేతముగ యుద్ధమునందు రాముఁడు చంపె. కావున ఆవిషయమై నాకు సహింపరాని కోపముగలిగియున్నది. ఆరాముని యెడల మహాదారుణమగు విరోధముగలిగియున్నది నేను శత్రువగు రామునిపై పగదీర్చుకొనఁ గోరుచున్నాను యుద్ధమునందు శత్రువును చంపక గాని నాకు నిదుర పట్టదు. ఇప్పుడు నేను ఖరదూషణులను జంపిన రాముని జంపుదు నేని "పెన్నిధిని గన్న పేదవానివలె సుఖమును బొందెదను. అంతవరకు నాకు సుఖము గలుగదు కావున మీరు జనస్థానమునందుండి రాముఁడు ఎప్పుడు ఏకార్యమును జేయునో దానినంతయు యధార్థముగ తెలిసికొని యావృత్తాంతమును నాకెఱింగింపుచుండవలయును. ఓ రాక్షసులారా! మీ రెంతమాత్రము మరుపాటు లేక మహాజాగ్రతతో పోయి యుండవలయును మఱియు రాముని జంపుటకు దగిన ప్రయత్నములు నిరంతరము చేయుచుండవలయును రాక్షసులారా! రణరంగమున మీ బలపరాక్రమములను పెక్కుమారులు చూచియున్నాను కావున నే జనస్థానమునందుండుటకు మిమ్ములను నియోగించుచున్నాను. అని రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు విశేషార్థముగల మాటను చెప్పగా విని యారాక్షసులెనమండుగురును అప్రియవాక్యములకు మిగుల సంతసించి రావణాసురునికి నమస్కరించి, అందఱు వొక్కటిగ చేరి లంకానగరమును విడిచి, యెవ్వరికిని గపడకుండునట్లుగ నంతర్హితమగు రూపమును దాల్చి జనస్థానమునకు పోయిరి. అంత రావణాసురుఁడు సీతాదేవిని జూచి "సీత నపహరించితిని గదా" యని మహాసంతోషమును బొందె మఱియు రావణాసురుడు రామునితో బద్ధవైరము గావించుకొని తెలివిమాలినతనముచేత మిగుల సంతసించినవాఁడాయె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబదినాల్గవసర్గ ముగిసెను.

రావణాసురుఁడు సీతాదేవికి తన బంగారు గృహములు మొదలగునాటిని జూపి వంచించుట.

అట్లు రావణాసురుఁడు. మహాభయంకరులును, మిగుల బలపరాక్రమశాలులును, నగు రాక్షసుల నెనిమిదిమందిని జనస్థానమునకు బంపి, బుద్ధిహీనుఁడగుటచే నంతట తాను కృతకృత్యుఁడనైతి నని తలచె అట్లు తలచి అంత రావణాసురుఁడు సీతను దలచుకొని మన్మథబాణములచే గొట్టఁబడినవాఁడై సీతాదేవిని జూడగోరి యతివేగముగ సుందరమగు తన యంతఃపురమునకు బోయె. అట్లుపోయి రాక్షసరాజగు రావణాసురుఁడు తన యంతఃపురమునందు ప్రవేశించి, రాక్షసస్త్రీల నడుమ గూర్చుండి మహావ్యసనముచే బరితపించుచుండెడి సీతాదేవిని జూచె. అంత రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు, కన్నీరు మున్నీరుగ నేడ్చుచున్నదియును, మిగుల దైన్యమును బొంది యున్నదియును, మహావ్యసనముచేతఁ బీడింపఁబడినదియునునై "వాయువేగముచే సముద్రమున మునుగుచున్న యోడవలె" నున్నదియును, "జింకల గుంపుననుండి తప్పించుకొని కుక్కల నడుమ చిక్కిన లేడివలె" నున్నదియును, ముఖమెత్తక తలవంచుకొని యున్నదియును, నగు నా సీతాదేవిని జూచె. అట్లు చూచి రాక్షసేశ్వరుఁడగు రావణాసురుడు, మహావ్యసనమును బొందియున్నదియును, మిగుల దైన్యము నొందియున్నదియును, పరాధీనురాలై యున్నదియును, నగు నా సీతాదేవిని బలవంతముంగ గొనిపోయి దేవతాగృహముతో సరిపోలియున్న తన గృహమును జూపె. మఱియు మిద్దెలతోను మేడలతోను నిండి యున్నదియును, అనేక వేలమంది స్త్రీలతో నొప్పియున్నదియును, నానావిధములైన పక్షిసమూహములతో నొప్పియున్నదియును, సమస్తమణులచే జెక్కఁబడియున్నదియును, యేనుఁగుదంతముల వికారమైనదియును, బంగారుతోను వెండితోను గట్టఁబడినదియును, స్ఫటికమణులతోఁ గట్టఁబడినదియును, వజ్రములతో విచిత్రముగ గట్టఁబడి చూచుటకు మనోహరముగ నుండెడు స్తంభములతో నొప్పుచున్నదియును. నగు దివ్యమగు గృహమును రావణాసురుడు సీతాదేవికి జూపె.

అట్లు రావణాసురుడు సీతాదేవికి తనగృహమును జూపుచు నొక మిద్దెనుండి మఱియొక మిద్దెకుఁ బోవునపుడు, శ్రేష్ఠమగు భేరీశబ్దమువంటి ధ్వనిగలదియును, పుటముదీరిన బంగారుతో జేయఁబడిన ద్వారముగలదియును, బంగారు

తో జేయఁబడినదియును, మిగులవిచిత్రమైనదియును, నగు పడికట్లవరుసను రావణాసురుఁడు సీతాదేవితోఁగూడ నెక్కె. అచ్చటనా పడికట్ల ప్రక్కనుండు కిటికీలు దంతముతోను వెండితోను జేయబడినవియును, చూచువారలకు మిగులఆనందమును గలుగజేయునవియును నైయుండె. మఱియు మేడలయందుండు కిటికీలు బంగారుమయములైయుండె. అప్పుడు రావణాసురుఁడు, తనగృహమునందు రత్నములచే నలంకరింపఁబడినవియును, సున్నపుపూఁత పూసియున్నవియును నగుమిద్దెలపై భూప్రదేశములను సీతాదేవికిఁ జూపె. అంత రావణాసురుఁడు, మహాదుఃఖముచే నేడ్చుచున్న సీతాదేవికి నడబావులను, సమస్తవృక్షములచే నావరింపఁబడియున్న కొలనులనుఁ జూపె. అట్లు పాపాత్ముఁడగు రావణాసురుఁడు, మహార్హమగు తనగృహంబంతయును సీతాదేవికిఁ జూపి యంతనామెకు ఆశగల్పించి వంచింపఁగోరి యిట్లనియె.

ఓసీతా! ఈలంకానగరమునందు పదియిరువైకోట్లకంటె నెక్కువసంఖ్యగల క్రూరరాక్షసులున్నారు. వారికందఱికిని నేను రాజును. వారిలో ముసలివారును, పసివారును దప్పతక్కినవారిలో నొక్కొక్కరికిని వేయిమంది పరిచారజనములున్నారు. విశాలములగు నేత్రములుగలయోసీతా! నాకు రాజసంబంధమైన పరికరములేవియున్నవో, అవన్నియు నీ దేను. నా ప్రాణములుగూడ నీయధీనములై యున్నవి. కావుననవియును నీవే యగును. నీవు నాకు నా ప్రాణములకన్న నధికురాలవు ప్రియురాలవగునోసీతా! నీవు నాకు భార్యవగుదువేని నాయంతఃపురమున నుండెడి యనేకయుత్తమస్త్రీలలో నాభార్యలెవరుగలరో వారికందఱికిని, నీవు రాణివై యుండవచ్చును. నీవితరచింతనుమానుము. మన్మథాగ్నిచే బరితపించెడు నాయందు దయయుంచుము. ఓసీతా! ఈలంకానగరము నూరుయోజనముల వెడల్పుగల సముద్రముచే నావరింపఁబడియున్నది. ఇది దేవేంద్రునితోఁగూడిన దేవాసురులకైన నలవిగాదు. అదియునుగాక పరాక్రమమున నాకు సమానుఁడు యీసమస్తలోకములయందును, దేవతలలోగాని, గంధర్వులలోగాని, యక్షులలోగాని, పక్షులలోగాని. లేడు. అట్లుండగా రాజ్యభ్రష్టుఁడును, మహాదైన్యమును బొందినవాఁడును, తాపసవేషముతో నున్నవాఁడును, పరాక్రమహీనుఁడును, గతాయువును, నగు రామునితో నీకేమి ప్రయోజనమున్నది. ఓసీతా! నీవు నాకు భార్యవగుము. నేను నీకు తగిన పెనిమిటిని. యౌవనము మిగుల నస్థిరము. కావున నీవిప్పుడు నన్నుగూడి యిష్టోపభోగముల ననుభవింపుచుండుము. సుందరమగు ముఖముగలయోసీతా! నీవింక రాముని జూడవలయునను తలంపు విడువుము. ఆ రాముఁడిచటికి రాలేడనునది సిద్ధమేగదా! యీస్థలమును మనస్సుయందైనను తలపఁజాలఁడు. అతిశీఘ్రముగ నాకాశమున సంచరించెడి వాయువు నుబంధించుటకును, మిగుల నిర్మలముగ మండుచుండెడు అగ్నిజ్వాలను పట్టుకొనుటకును, యెట్లు సాధ్యముకాదో, అట్లే యీలంకానగరమునందు ప్రవేశించుటకు శక్యముగాదు. మంగళస్వరూపురాలవగునోసీతా! నా భుజబలముచే బరిపాలింపబడుచుండెడు నిన్నిచటనుండి పరాక్రమమువలన గొనిపోవ సమర్థుఁడగు వీరుఁడు ముల్లోకములయందును నాకగపడలేదు. కావున నీవీలంకానగరమునందు విశాలమగు నీ రాజ్యమును పరిపాలింపుచుండుము. నేనును, నాయట్టివారును, సమస్తదేవతలును సమస్తములైన స్థావరజంగమములును, నీకు పరిచర్య చేయుచుందుము. నీవు పట్టాభిషిక్తురాలవై మిగుల సంతోషముతో గూడుకొని నన్ను సంతసింపఁ జేయుచుండుము. ఓసీతా! నీవు పూర్వజన్మమునందు జేసిన పాపకార్యముల యొక్కఫలము వనవాసముతోఁ దీరనది. ఇంక నీవు పూర్వజన్మమునందు జేసిన పుణ్యమును యిచ్చట ననుభవింపుము. ఈ నాగృహమునందు మంచిసువాసనతో గూడిన పూలదండలను, మంచిసొమ్ములను, ధరించుకొని నాతోఁగూడ సుఖము ననుభవింపుచుండుము. ఓసీతా! నాయన్నయగు కుబేరునిదియును, సూర్యుని కాంతితో సమానమైన కాంతిగలదియును, పుష్పకమను పేరుగలదియును, నగు విమానమును నా బలపరాక్రమములచే నతనిని జయించి తెచ్చితిని. మిగుల శ్రేష్ఠమగు నా విమానము మిగుల విశాలముగను రమణీయముగను నున్నది. నీవు నాతోఁగూడ నా విమానముపైఁగూర్చుండి యథేచ్ఛావిహారముగ సంచరింపుచుందుము. మిగుల సౌందర్యమగు ముఖముగలయోసీతా! కమలముతో సమానమైనదియును, వంకరలేక మిగుల నిర్మలమైనదియును, మిగుల రమణీయమైనదియును, నగు నీముఖము వ్యసనముచే బీడింపఁబడియుండుటచే నెంతమాత్రము ప్రకాశింపకున్నది అని యిట్లు రావణాసురుఁడు చెప్పుచుండగ సీతాదేవి చంద్రునితో సమానమైన తన ముఖమును పైటచెరగుచే గప్పుకొని కన్నీరు మున్నీరై పార నేడ్చుచుండె. ఇట్లు మహాదుఃఖమును బొందియున్నదియును, రామునే ధ్యానించుచున్నదియును, మిగుల దైన్యము నొంది యున్నదియును, మహావ్యసనముచే కాంతిహీనమై యున్నదియును, నగు సీతాదేవితో పాపాత్ముఁడును, రాక్షసేశ్వరుఁడును, నగు రావణాసురుడిట్లనియె

ఓసీతా! ధర్మలోపమగునని నీవెంతమాత్రమును సిగ్గుచెందవలదు. దైవయోగమువలన నీకుతటస్థించిన యీసంబంధము ఋషిప్రోక్తమైనదిగాని వేరుకాదు. మహాసుందరములగు నీపాదములు నాతలలుతాకునట్లు యిదిగోనమస్కారము చేయుచున్నాను. నన్నతివేగముగ మన్నించుము. నాయందు దయయుంచుము. నేనునీకువశ్యుఁడను. దాసుఁడను. నేనునిన్నుజూచి మన్మథాగ్నిచే దహింపఁబడినవాడనగుచు యిట్టినీచపుమాటలు చెప్పుచున్నాను సీతా! రావణాసురుడు యిదివరకుఏస్త్రీకిగాని తలవంచినవాఁడు కాడని చక్కగ తెలిసికొనుము. అనియిట్లు రావణాసురుడు జనకమహారాజు కూతురగుసీతతోజెప్పి, అయుఃప్రమాణము తీరియుండుటచే సీతతనకు స్వాధీనురాలగునని తలచియుండె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబదియైదవసర్గము ముగిసెను.

—{ సీతాదేవి రావణాసురుని నానావిధములనిందించుట. }—

అట్లుమహావ్యసనముచే బరితపించుచున్న సీతాదేవి రావణాసురుడు చెప్పినమాటవిని తనకును రావణాసురునికి మధ్య నొకతృణమునుంచుకొని, మిగులనిర్భయముగ నిట్లనియె.

ఓరీ! రావణాసురుడా! దశరథుడను రాజొకడుగలడు అతఁడుధర్మసముద్రుఁడు. ఎట్టిసంకటములయందుగాని స్థిరముగనుండువాఁడు. సత్యసంధుఁడని లోకప్రసిద్ధుఁడు. అట్టిదశరథునియొక్క జ్యేష్ఠపుత్రుఁడు రాముఁడనుపేరుచే ప్రసిద్ధినొందినవాఁడు మహాధార్మికుఁడు. మూడులోకములయందును ప్రఖ్యాతిజెందినవాఁడు. అజానుబాహుఁడు. విశాలములగు నేత్రములుగలవాఁడు. అట్టిరాముఁడు నామగఁడు. అతఁడునాకు దేవుఁడు. ఇక్ష్వాకువంశమునందుబుట్టినయీరాముఁడు సింహమునకువలె మెగుభుజములుగలవాఁడు. మహాకాంతిమంతుఁడు. అతఁడులక్ష్మణసమేతుఁడైవచ్చినిన్నుజంపును రావణాసురుడా! నీవునన్ను రామునియెదుట బలవంతముగదెచ్చియుండువేని నీవునుఖరునివలెనే, రణరంగమునజచ్చి జనస్థానమున బడియుందువు ఇదిగాక మహాభయంకరాకారులును మిగులబలపరాక్రమశాలులును, నగురాక్షసులనేకమంది యున్నారనిచెప్పితివి వారందఱును "గరుత్మంతునియెదుట విషసర్పములయొక్క విషమునిర్విషమైపోవునట్లు" రామునియెదుట నెంతమాత్రను ప్రయోజనములేనివారగుదురు. మఱియు నారాముఁడు ఆకర్ణాంతము అల్లెత్రాటిని లాగివిడిచినవియును, బంగారుచే నలంకరింపఁబడినవియును, నగుబాణములతాకునకు "అలలుతాకునకు గంగానదియొడ్డు విఱిగిపడునట్లు" నీదేహముగుల్లలుగుల్లలుగ విఱిగినేలపడును ఓరావణాసురుడా! నీవుసురాసురులకజేయుడనని గర్వించి రామునితో బద్ధద్వేషమునుబెట్టుకొంటివి. కావుననీవింకప్రాణములతో తప్పించుకొనిబోజాలవు. నీవింకబ్రతకవలసినకాలమునకు మహాబలశాలియగు రాముఁడంతకుఁడు. యూపస్తంభమునకు గట్టినపశువువలె నీవింకబ్రతుకుటదుర్లభము. రావణాసురుడా! రాముఁడిప్పుడు మహాకోపముతో నిన్నుకంటినిండచూచనేని నీవాతనినేత్రాగ్నిచే మండిపోదువు మఱియు రాముఁడుకోపించెనేని యాకాశమునుండి చంద్రునినేలబడద్రోసినను పడద్రోయును లేక రూపుమాపినను మాపును సముద్రమునుగూడ యింకిపోవునట్లుచేయును కావుననట్టిరాముఁడిప్పుడే సీతనుయీనిర్బంధమునుండి విడిపించుకొనిపోవును. రావణాసురుడా! నీవుగతాయువుగలవాడవు. కాంతిహీనుడవు. దుర్బలుఁడవు జ్ఞానహీనుఁడవు బుద్ధిలేనివాఁడవు. నీదుష్కార్యమువలనలంకానగరము విధవత్వమునుబొందగలదు. రాక్షసాధమా! నీవరణ్యమునందు నాపెనిమిటియగురాముని పార్శ్వమునుండి నన్నారాముడు యెడబాయునట్లుచేసి దొంగతనముగ నిచటికిగొనివచ్చితివి. నీవుచేసినయీపాపకార్యము నీకెంతమాత్రమును సుఖమునుగలుగజేయదు దైవబలముగలవాఁడును, మహాకాంతిమంతుఁడును, నాపెనిమిటియును, నగురాముఁడు మహాపరాక్రమములతోగూడినవాఁడై విజనమగుదండకారణ్యమున నిర్భయముగ సంచరించుచున్నాఁడు అట్టిరాముఁడు రణరంగమునబాణవృష్టికురిపించి నీశరీరమునుండెడుదర్పమును, బలమును, శౌర్యమును, నిర్లజ్యమును, మదమును పరుగెత్తిపోవునట్లుచేయును. కాలచోదితమైసమస్తజంతువినాశనము గలుగునపుడు మానవులుకాలమునకు లోబడినవారై కార్యాకార్యములెఱుఁగక, యేమఱుపాటుచే దుష్కార్యములుచేయుదురు. రాక్షసాధముఁడవగు నోరావణాసురుడా! నీవుకాలచోదితుఁడవై కార్యాకార్యమెఱుఁగక నన్నవమానించితివి. కావుననీసంబంధమగు రాక్షసులకును, నీయంతఃపురజనములకును నీకునుమరణకాలము సమీపించినది ఓరినీచుడా! రాక్షసాధమా! యజ్ఞశాలమధ్యముననున్నదియును, స్రుక్కులుమొదలైన యుపకరణములుంచినపాత్రలచే నలంకృతమైనదియును, బ్రాహ్మణులవలనమంత్రములచే పవిత్రమైనదియును నగుయాగవేదిక చండాలు

నికిగాకుటకు అలవిగానియట్లు మహాధర్మాత్ముఁడగు రాముని ధర్మపత్నియును, మహాపతివ్రతయును నైన నన్నుతాకుటకు పాపాత్ముఁడవగు నీకెంతమాత్రమును సాధ్యముకాదు. "నిరంతరము తామరతూండ్లపై రాజహంసతోఁగూడ క్రీడించుచుండెడి యాఁడుహంస, గడ్డిపరకలయందు సంచరించెడు నీరుకాకిని ఎట్లుకన్నెత్తి చూచును" ఓరీ! రాక్షసుఁడా! నీవు తాకితివేని యీశరీరము తెలివిలేనిదియగును. (అనగా స్మృతిలేనిదగును) అంత నీవు దీనికట్టివేసినను కట్టివేయుము. భక్షించినను భక్షింపుము. ఈశరీరమును గాని ప్రాణమును గాని కాపాడుకొనవలయుననుఆశ నాకంతమాత్రమును లేదు. నేను పాతివ్రత్యవ్రతమును విడిచినను లోకాపవాదమును నేను సహించుదానను గాను అని యిట్లు సీతాదేవి మహాకోపముచే మిగులపరుషముగ రావణాసురునితో జెప్పి, అంత నేమియు మాటలాడక యూరకుండె. అంత రావణాసురుఁడు సీతాదేవిచెప్పిన పరుషమును, రోమహర్షమును, నగు మాటవిని పరమక్రుద్ధుడై సీతాదేవిని జూచి మహాభయంకరమగు మాటలతో నిట్లనియె.

సుందరమగు చిరునగవుగలయోసీతా! నామాటవినుము. నేను నీకు పండ్రెండుమాసములు గడువుపెట్టుచున్నాను. ఈగడువుకాలములోపల నన్ను పొందకపోతివేని పిమ్మట ప్రాతఃకాల భోజనమునకుగాను నిన్ను నావంటవాండ్రు తునకలుతునకలుగ తరిగి పచనము చేయుదురు. అని యిట్లు శత్రురావణుఁడగు రావణాసురుడు సీతాదేవితో జెప్పి యంత మహాకోపముతో రాక్షసస్త్రీలను జూచి యిట్లనియె.

రక్తమాంసములను భక్షించెడి యో రాక్షసస్త్రీలారా! మీరు అతివేగముగ మహాభయంకరమగు వికారాకారములుగలవారై యీసీత గర్వమడచి శిక్షింపుడు. అని రావణాసురుడు చెప్పగా విని మహాభయంకరాకారులగు నా రాక్షసస్త్రీలు రావణాసురునికి నమస్కరించి సీతాదేవి చుట్టును బరివేష్టించిరి. అంత మహాభయంకరాకారుఁడును రాక్షసేశ్వరుఁడును, నగు రావణాసురుడు పండ్లు పటపటగొఱుకుచు కాళ్ళతో భూమిని అదరదన్నుచు రాక్షసస్త్రీలను జూచి మహాకోపముతో నిట్లనియె.

ఓరాక్షసస్త్రీలారా! మీరీసీతను అశోకవనమధ్యమున కుదీసికొనిపొండు. అచట మిగుల గోప్యమగు స్థలమున మీరందరును యీసీతను పరివేష్టించి కాపాడుచుండుడు. అట్లు కాపాడుచు మీరందఱు యీసీతను మహాభయంకరముగ బెదరించియు మంచిమాటలు చెప్పియు "అరణ్యమునందు, ఆడయేనుఁగును యేనుఁగులే సాధువుగ జేయునట్లు" మీరీసీతను నాయధీనమగునట్లు జేయుడు. అని రావణాసురుడు వారితో జెప్పె. అంత నా రాక్షసస్త్రీలు రావణాసురుని మాటనుశిరసావహించి, సమస్తఋతువులయందును పూయుచు కాయుచు నుండునదియును, నానావిధములగు పూలతోను పండ్లతోను ఒప్పియున్న వృక్షములతో నిండియున్నదియును, సర్వకాలములయందును నానావిధములైన పక్షులతో నొప్పుచున్నదియును, నగు నశోకవనమునకును సీతాదేవిని దోడ్కొనిపోయిరి. అప్పుడు జనకమహారాజు కూతురగు సీతాదేవి యా రాక్షసస్త్రీలచే జిక్కినదియై "అడవులనడుమ చిక్కిన లేడిపిల్లవలె" మహావ్యసనముచే బీడింపబడుచుండె. మఱియు సీతాదేవి మిగుల భయపడు స్వభావముగలదియగుటచే దుఃఖసముద్రమున మునిగి "త్రాళ్ళచే గట్టబడిన యాఁడుజింకవలె" మహావ్యసనపీడితయై యెంతమాత్రమును సుఖమును బొందదాయె. అట్టియెడ సీతాదేవి, వికృతాకారములును, నేత్రములును, గల రాక్షసస్త్రీలచే నానావిధముల బెదరింపఁబడినదియై యెంతమాత్రమును సౌఖ్యమును గానక తనకత్యంతప్రియుడును, దైవమును, పెనిమిటియును, నగు రాముని దలంచుచు భయశోకములచేఁ బీడింపబడి మూర్ఛనుబొందె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబదియారవసర్గము ముగిసెను.

(*)

రాముడు దుశ్శకునములను జూచి దిగులుపడుట.

అంతనచట దండకారణ్యమున మృగరూపమును దాల్చి తిరుగుచున్న కామరూపియును, రాక్షసుఁడును, నగు మారీచుని జంపి రాముఁడు అతివేగముగ ఆశ్రమమార్గమును గూర్చి మరలిపోవుచుండె అట్లు రాముఁడు సీతను జూడగోరి యతివేగముగ బోవుచుండగ రాముని వెనుక మహాభయంకరధ్వనితో నక్కలు అఱచుచుండె మిగుల దారుణమును రోమహర్షణమును నగు నానక్కలధ్వనిని విని మిగుల సంశయమును బొంది. తనలో తానిట్లని యాలోచించె.

అయ్యో! నక్కలు యీరీతిగ గూయుచున్నదే. ఇది అశుభమునకు గురుతుగదా. కావున సీతను రాక్షసులు భక్షించిరేమో? మృగరూపమును దాల్చిన మారీచుఁడు నాకంఠధ్వని లెస్సగ దెలిసికొని, దానిననుసరించి యఱచినయఱపును లక్ష్మణుఁడు వినియును, అతనితోఁగూడనుండి విన్న సీతచేఁ బ్రేరేపింపఁబడినవాడగుచు సీతను విడచి నన్ను వెదకుచు నేనున్నచోటికి వచ్చియుండును. అదియునుగాక మారీచుఁడు బంగారు లేడిరూపమును దాల్చి నన్నాశ్రమమున

నుండి బహుదూరముగొనిపోయి యవటబాణముచే హతుఁడై మఱలరాక్షసరూపమును దాల్చి "హా! లక్ష్మణా! హతుడనైతిని" అనిగట్టిగానఱచివచ్చె. ఇట్టితంత్రమును బన్నిన రాక్షసులందఱునొక్కటిగజేరి సీతనుజంపవలయునని యెత్నించిరి. ఇందు కెంతమాత్రమును సంశయములేదు జనస్థానమునందున్న రాక్షసులనందఱిని యుద్ధమునందు జంపుటచే రాక్షసులకును మనకును బద్ధవైరముగలిగినది. మిగులభయంకరమగు నీయడవియం దొంటిగనున్నసీతాలక్ష్మణులు క్షేమముగనున్నట్లు నాకుతోచదు. అయ్యో! ఇంకేమిచేయుదును. మహాభయంకరములగు కారణములనేకములుగనుపించుచున్నవి అనియిట్లురఘువంశోద్భవుఁడగు రాముఁడు నక్కలుయఱచినధ్వనివిని, మారీచుఁడుమృగరూపముధరించి తన్నాశ్రమస్థానముననుండిబహుదూరముగొనిపోవుటచేమిగులసందియమునుబొందియనేకప్రకారములుగ నాలోచించుచు జనస్థానముయొక్క సమీపమునకుబోయె. అంతనచటనుండు మృగములును, పక్షులును మహాదైన్యమును బొందినవియగుచు, మిగులచింతాక్రాంతుఁడైయున్న రామునియొద్దకుఁబోయి మహాత్ముఁడగు రానకు అప్రదక్షిణముచేసి మహాభయంకరమగు ధ్వనితోనఱచినవి. అప్పుడురాముఁడు మహాభయంకరములగు నాకారణములనుజూచి దిగులుపడి యతివేగముగ నాశ్రమమునకుఁ బోవలయునని బోవుచుండె మఱియు రాముఁడు ఉత్తమస్త్రీయగు సీతాదేవిని, మహాబలపరాక్రమశాలియగులక్ష్మణుని, తలచుచునే జనస్థానముననున్న తనయాశ్రమమునకుబోవుచుండె. అట్లుపోవుచున్నరాముఁడు, కాంతిహీనమైనముఖముతో దనయొద్దకువచ్చుచున్న లక్ష్మణుని జూచె. అంతదిగులుపడి మహావ్యసనముతోనున్న లక్ష్మణుడు, మిగులదిగులుబొంది పరమదుఃఖితుఁడై వచ్చుచున్న రామునిచేరంబోయె. అట్లులక్ష్మణుఁడు రామునిసమీపమునకుబోగానే అన్నయగురాముఁడు, రాక్షసులస్థానమగు ప్రదేశమున సీతనుఒంటిగవిడిచివచ్చిన లక్ష్మణుని మిగుల నిందించె. మఱియురాముఁడు లక్ష్మణుని యెడమచేయిబట్టుకొని ముందుమిగులపరుషముగను, పిమ్మట మధురముగను, మహావ్యసనకరముగను, నతనితోనిట్లనియె

లక్ష్మణా! నీవుసీతనునొక్కదానినివిడచివచ్చితివి. ఇదిమహాతప్పుకార్యము. ఆహా! మిగులనాశ్చర్యముగనున్నది. మనకిప్పుడు క్షేమముగలుగునని నాకుతోచదు శౌర్యవంతుఁడవగు నోలక్ష్మణా! నాకిప్పుడు అనేకములగు దుశ్శకునములు గాన్పించుచున్నవి. ఇదిచూడగా సీతనుయీయరణ్యముననుండెడి రాక్షసులు అపహరించుకొనిపోయిరో, లేకతినివేసిరోయని నాకుమిగుల సంశయముతోచుచున్నది. పురుషశ్రేష్ఠుఁడవగు నోలక్ష్మణుండా! జనకమహారాజుకూఁతురగు సీతక్షేమముగనుండుటను మనముచూడగలమని నాకుతోచలేరు. ఏలననగా మృగసమూహములు, నక్కలు, పక్షులు, మొదలైనవి సూర్యుడుండుదిక్కునజేరి మహాభయంకరముగ నఱచుచున్నవి. కావుననారాజపుత్రికయగు సీతసుఖముగనున్నదని నాకుతోచదు. మృగరూపధారియగు నామారీచుఁడు, తన్ను వెంటనంటితరుముచున్న నన్ను మోసముచే నధికదూరముగ దీసికొనిపోయి కడపటమహాప్రయాసముతో నాచేజంపఁబడి మరణకాలమునందు రాక్షసరూపమును దాల్చివచ్చెను. ఇప్పుడునావనస్సు మిగులదైన్యమునుబొంది సంతసింపకున్నది. మఱియు నాయెడమకన్నుఅదరుచున్నది. లక్ష్మణా! సీతరాక్షసులచే నపహరింపఁబడినదో, లేకజీవమువిడిచినదో, కాదేనిరాక్షసులచేమార్గములోగొనిపోఁబడుచున్నదో, గాని, యాశ్రమమునలేదు ఇందుకెంతమాత్రమును సంశయములేదు. అనిరాముఁడు లక్ష్మణునితోఁజెప్పె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబదియేడవసర్గముగిసెను.

▶ ✻ ◀

రాముఁడులక్ష్మణుని మార్గములోజూచిసీతచనిపోయియుండునని వ్యసనపడుట.

మిగులధర్మాత్ముఁడును, దశరథరాజనందనుడును, నగు రాముఁడు, నిర్జనమగునరణ్యమునందు సీతనొక్కదానినివిడచివచ్చినవాఁడును, మిగులదీనుడును, నగులక్ష్మణునిజూచిమఱలనిట్లనియె

లక్ష్మణా! దండకారణ్యమునకువచ్చుచున్న నన్ను వెంబడించివచ్చిన సీతయిప్పుడెచ్చటనున్నది? మఱియు రాజ్యభ్రష్టుఁడను, పరమదుఃఖితుఁడనై దండకారణ్యమునసంచరించుచున్న నాతోగూడవ్యసన మనుభవించుచు, నాకుసహాయురాలైయున్నదియును, మిగులసుందరమగు నడుముగలదియును, నగుసీతయిప్పుడెచటయున్నది? మహాశౌర్యవంతుఁడవగు నోలక్ష్మణుడా! నేనాసీతనువిడిచి క్షణమైనను బ్రతికియుండజాలను. దేవకన్యతో సమానమైనదియును, నాప్రాణసఖియును, నగుసీతయెచటనున్నది? తమ్ముడా! లక్ష్మణా! బంగారుతోసమానమైన దేహకాంతిగలదియును, జనకమహారాజుకూతురును, నగునాసీతాదేవిలేనిచో భూమండలాధిపత్యముగాని, యింద్రాధిపత్యముగాని, నాకక్కరలేదు. సౌమ్యుడవగులక్ష్మణా! నాప్రాణములకన్న ప్రియురాలగు సీతజీవించియున్నదా? లేదా? మఱియునా

వనవాసవ్రతము అబద్ధమైపోవునా యేమి? లక్ష్మణా! సీతకొఱకు నేను ప్రాణములను విడిచిన వెనుక నీవయోధ్యానగరమునకుబోయి యీవృత్తాంతమును చెప్పగా విని యా కైకేయి కోరినకోరిక యీడేరినదియై సంతసింపగలదా? యేమి? రాజ్యపరిపాలనము చేయుచుండెడి కుమారుడుగలదియును, రాజ్యసంపదగలదియును, యీడేరినకోరికగలదియును, నగు కైకేయిని, కుమారుడనగు నేను జచ్చినపుత్రశోకముచే నేడ్చుచున్నదియును, మిగులతపస్వియును, నగు కౌసల్యాదేవి మహావినయముతో సేవించుచుండవలయునే మో? లక్ష్మణా! ఇప్పుడుసీత బ్రతికియుడునేని యాశ్రమమునకుంబోయెదను మిగులనుత్తమమగు నడవడికగలసీత చచ్చియుండునేని యిచ్చటనే ప్రాణములనువిడిచెదను. మఱియు చిరునవ్వుతో నొప్పుచుండెడి ముఖముగలసీత, నేనుఆశ్రమమునకు రాగానే నాతో మాటలాడకుండునేని తత్క్షణమే, ప్రాణములనువిడిచెదను లక్ష్మణా! సీతజీవించియున్నదా లేదా? నీవుఅజాగ్రతగ నుండుటనుజూచి రాక్షసులుసీతనుతినిరా, ఏమి? చెప్పుము. మహాసుకుమారమైన దేహముగలదియును, పసిదియును, ఎప్పుడుగాని వ్యసనమెఱుగనిదియును, నగుసీత నన్నెడబాయుటచే గలిగినవ్యసనమువలన బరితపించుచుండును. ఇందు కెంతమాత్రముసందియము లేదు లక్ష్మణా! మహాకుత్సితుడును, దురాత్ముడును, నగు నారాక్షసుడు, హాలక్ష్మణాయని నాకంఠధ్వనితో గట్టిగానరచుటచే నీకుగూడ మహాభయముగలిగియుండును మఱియు నారాక్షసుడు నాకంఠధ్వనివంటిధ్వనితో నఱచుటనువిని సీతమహాభయమునుబొంది నన్నుజూచుటకు నిన్నతివేగముగ బంపియుండునని యెంచెదను. లక్ష్మణా! నీవుఅరణ్యమునందు సీతనొకర్తెనువిడిచివచ్చుటచేత సమస్తవిధములచే నాకుకష్టముకలుగ జేసితివి మహాక్రూరులును, దయారహితులును, నగురాక్షసులు మనపైపగదీర్చుకొనుటకు అవకాశముగలుగ జేసితివి నేనుఖరునిజంపుటచేత రాక్షసులందఱును పరమదుఃఖితులైయున్నారు. మహాభయంకరులును, మాంసాహారులును, నగురాక్షసులు సీతనుజంపితినియుందురు. అందు కెంతమాత్రమును సంశయములేదు. శత్రుసంహారకుడవగు నోలక్ష్మణుడా! అయ్యో! ఇప్పుడు సమస్తవిధములచే దుఃఖసముద్రములో మునిగియుండు నేనేమిచేయుదును ఇట్టికష్టమును బొందవలసియున్నదనితలచెదను అనియిట్లు రాముడు మహాసౌందర్యవతియగు సీతనుగుఱించిచింతించుచు లక్ష్మణునితోంగూడనతివేగముగా జనస్థానమునుండు తనయాశ్రమసమీపమునకుబోయె. అట్లుపోయి మహాశౌర్యవంతుడగు రాముడు, వ్యసనపీడితుడైయున్న లక్ష్మణునినిందించుచు, అలసటచేతను, ఆకలిచేతను, దప్పిచేతను నిట్టూర్పులనువిడుచుచు, నోరెండి తెల్లబారిన మోముగలవాడగుచు ఆశ్రమమునందుబ్రవేశించె. అట్లాశ్రమమునందుజొచ్చి అందుసీతనుగానక యంతపర్ణశాలయందుబ్రవేశించి యచ్చటనుసీతనుగానక యందుండిసీతాదేవిసంచరించెడి స్థలములయందుజూచి యచటసీతనుజూడక మఱియునాసీతవేడుకగావిహరించెడి స్థానమునుజూచియచటనుగానక, యీస్థలముయిటువంటిది. ఆచోటుఅటువంటిది (అనగానీస్థలమున సీతయీప్రకారముగనుండెను. ఆప్రదేశమునందట్లు క్రీడింపుచుండెనుయనుట) అనిచెప్పుచు పులకాంకితశరీరుడై మహావ్యసనమును బొందినవాడాయె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబదియెనిమిదవసర్గముగిసెను.

లక్ష్మణుడు రామునితో సీతకునుతనకునుజరిగిన సంవాదమును జెప్పుట

అంత రఘువంశోద్భవుడగు రాముడు, ఆశ్రమమునుండి వచ్చి మార్గములో తన్నుగలుసుకొన్నవాడును, మహావ్యసనగ్రస్తుడై యున్నవాడును, నగులక్ష్మణునిజూచి మఱలనిట్లనియె

లక్ష్మణా! నేనునీయందలినమ్మకముచేత సీతనువనమునందుపిడిచిపెట్టిపోతిని. అట్లుండగ నీవుసీతనుఒంటరిగవిడిచి నాయొద్దకేలవచ్చితివి? ఓలక్ష్మణా! నీవుసీతనుఒంటరిగ విడచివచ్చుచుండుటను జూచినతోడనే, సీతకేమోఅపాయముగలిగినదని నేనునామనస్సునందుసందేహపడి చింతనుబొందితిని. అదియిప్పుడుయథార్థమాయె. లక్ష్మణా! సీతనువిడచివచ్చుచున్న నిన్నుఅతిదూరమున జూచినంతనే నాయెడమకన్నును యెడమభుజమును, బొమ్మయును, అదరుచుండినవని రాముడుచెప్పె. అనియిట్లుపరమదుఃఖితుడై రాముడుచెప్పగావిని, శుభలక్షణలక్షితుడును, సుమిత్రాపుత్రుడును, నగులక్ష్మణుడు తానును మహావ్యసనముతోగూడుకొన్నవాడగుచు రామునిజూచిమఱలనిట్లనియె

అన్నా! రామచంద్రా! నేనునాయంతట స్వతంత్రించి సీతనొంటరిగా విడచివచ్చినవాడనుకాను ఆసీతయే మహాక్రూరములగు మాటలాడి నీయొద్దకుంబొమ్మని ప్రేరేపింపగావచ్చినవాడను. రాముడా! నీకంఠధ్వనినిఅనుసరించి, హా! సీతా! హా! లక్ష్మణా! నన్నురక్షింపుమని మహాదైన్యముగ నఱవబడినమాటను సీతాదేవివినెను. అట్టియార్తస్వరమును సీతాదేవివిని, నీకుఅపాయముగలిగెన

నీమెంచి నీయందలి స్నేహాతిశయముచే నేడ్చుచు, భయమునుబొంది భయముచే నోడలెఱుగనిదయగుచు నన్ను నీయొద్దకుపొమ్మని చెప్పె. అట్లుసీతాదేవినన్నుపొమ్మని పలుమారుపీడింపగా నీకెంతమాత్రమును ఆపదగలుగదని నేను మహానమ్మకముగలవాఁడనై యామెతోనిట్లని చెప్పితిని అమ్మా! సీతాదేవీ! రామునకు అపాయమును గలిగించునంతటిరాక్షసుఁడు లోకమునందులేడు ఇదిరామునిమాటగాదు. నీవుధైర్యముగ యుండుము. ఎవడోయీరీతిగ నఱచినాడు మఱియు దేవతలైనను భయమునుబొందియున్నపుడు కాపాడునంతటిశక్తిగలరాముఁడు "సీతా! నన్నురక్షింపుమని" స్త్రీనిబిలుచునా? ఇంతనీచమును నింద్యమునగు కార్యమెప్పుడునుచేయఁడు మంగళస్వరూపురాలవగునోసీతా! ఎవడోయొకరాక్షసుఁడు, ఏదియోయొకకార్యమునుద్దేశించి, నాయన్నయగు రాముని కంఠధ్వనివంటిధ్వనితో "కాపాడుము కాపాడుముఅని" యఱచినవాడుగాని వేరుకాదు ఇదియునుగాక "లక్ష్మణా! నన్ను కాపాడుము" అని చెప్పినమాట వికారమైనధ్వనితో వినఁబడినది యోచింపగానది రామునికంఠధ్వనికాదు కావున నీచపుస్త్రీలుచేయునట్లు నీవిట్లుఏడ్చుట యుచితముగాదు. నీవింక చింతింపవలదు. ధైర్యముబొందుము. నన్నుతొందరపరచవద్దు. యుద్ధమునందు రామునిజయించునంతటి పురుషుడు ముల్లోకములయందును యిదివరకుపుట్టలేదు. ఇంకనుపుట్టబోడు దేవతలందఱును దేవేంద్రునిముందిడుకొని రామునితో యుద్ధమునకువచ్చినను జయింపజాలరు. అని నేనుసీతతోఁజెప్పితిని. ఈరీతిగ నేను సీతాదేవితోఁజెప్పగా నాసీతాదేవివిని మోహబుద్ధితో కన్నీరుమున్నీరైపారగానేడ్చుచు నన్నుజూచి మహాభయంకరముగ నిట్లనియె

లక్ష్మణా! నీయన్ననశించినపిమ్మట నన్నుబొందవలయునని మహాదురభిప్రాయముతోనున్నావు. అయినను నీవెంతమాత్రము నన్నుబొందజాలవు. రాముఁడుతన్నురక్షింపుమని యెంతఅఱచినను నీవురామునియొద్దకుఁ బోకున్నావు కావుననీవుభరతునితో నేదోయొకయేర్పాటుచేసికొని కపటముతో రాముని వెంబడించివచ్చినావు మఱియునీవుశత్రుఁడవు. కపటవేషముతోనున్నావు. రామునకేదేనివిపత్తుసంభవింపవలయుననియును, నన్నుఅపహరింపవలయుననియును కోరికగలవాఁడవై మమ్ము వెంబడించివచ్చినావు కావుననే, యిట్టియాపదయందుగూడ రామునియొద్దకుఁబోకయున్నావు అనిసీతాదేవి నాతోఁజెప్పెను. ఇట్లుసీతాదేవి వినసహింపని మాటనుచెప్పగా నేమహాకుపితుఁడనైకోపముచే కన్నులెఱ్ఱబార, పెదవులదుర అతివేగముగ ఆశ్రమమునువిడిచి నీకెదురుగావచ్చితిని. అనిలక్ష్మణుఁడు రామునితోఁజెప్పె. ఇట్లుచెప్పుచున్న లక్ష్మణునిమాటవిని రాముడుదుఃఖముచేత శరీరమును దెలియకలక్ష్మణునితో నిట్లనియె.

సౌమ్యుఁడవగు నోలక్ష్మణా! నీవుసీతను ఒంటరిగవిడిచివచ్చినది మహాతప్పుకార్యము. నేను రాక్షసులనుజయించుటయందు సమర్థుఁడనని యెఱిగియు సీతఅజ్ఞానమువలన కోపముతో జెప్పినమాటలకు వెఱచి నీవాసీతనువిడిచివచ్చితివి నీవుసీతనుఒకర్తెనే యాశ్రమమునందు విడిచివచ్చితివి. కావుననిన్నుజూచుటకు నాకెంతమాత్రమును సంతోషముగలుగలేదు ఆడుదికోపమునుబొంది పరుషముగ మాటలాడినంతనే యాసీతనువిడిచివచ్చితివి. మఱియునీవు సీతచేఁబ్రేరేపింపఁబడి కోపపరవశుఁడవై నాయాజ్ఞనుతిరస్కరించినది, అన్నిటికంటేమహాగొప్పతప్పు. జింకరూపమును దాల్చి నన్నాశ్రమప్రదేశముననుండి బహుదూరముఆవల దీసికొనిపోయినరాక్షసుఁడు నాబాణముయొక్క వ్రేటుచేజంపఁబడి నేలంబడియున్నాడు ఆరాక్షసుఁడు నేనుధనుస్సునందు బాణమున సంధించి విలాసముగ విడువగానే యాదెబ్బకోర్వక మిగులదుఃఖితుఁడై మృగరూపమునువిడిచి, బాహుపురులతోనొప్పుచున్న రాక్షసదేహమును దాల్చె. అట్లునాబాణముచే హతుఁడుకాగానే రాక్షసరూపమునుబొందిన యామారీచుడు పరమదుఃఖితుఁడై నాకంఠధ్వనిననుసరించి భయంకరమగుధ్వనితో బహుదూరము వినఁబడునట్లఱచె. అదివినినీవు సీతనువిడిచివచ్చితివి అనిరాముఁడు లక్ష్మణునితోఁజెప్పె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యేబదితొమ్మిదవ సర్గముగిసెను.

{ రాముడుఆశ్రమమునందుసీతాదేవిలేకుండుటనుజూచిమహావ్యసనమునుబొందుట. }

అట్లు రాముఁడువచ్చుచుండగ నతనియెడమకంటి క్రిందిభాగముమిగులనదరినది నడచునపుడుకాళ్ళుతడబడెను. దేహమంతయును గడగడవడకె మఱియురాముఁడు మాటిమాటికి దుశ్శకునములనేకములనుజూచి సీతక్షేమముగనున్నదోలేదోయని యాలోచించె. ఇట్లాలోచించుచు రాముఁడు సీతనుజూచుటయందు మహాయిష్టముతోనతివేగముగ తనయాశ్రమమునకుఁబోయి యచటసీతలేకుండుటఁజూచి మిగులచింతాక్రాంతుఁడాయె. మఱియురఘువంశోద్భవుఁడగు రాముఁడుమహావ్యసనముచేగాళ్ళను చేతులను విదిలించుచు, సీతయుండుప్రదేశములయం

దంతటను లెస్సగ జూచి, యెచటను సీత లేకుండుటచేఁ గళాహీనంబై, హేమంతఋతువునందు కళాహీనంబైయుండెడు తామరకొలనువలె నున్న పర్ణశాలను జూచె. అదియును గాక గాలివలన వృక్షములచే గలిగిన ధ్వనిచే నేడ్చుచున్నట్లున్నదియును, వాడిపోయిన పుష్పములును, దైన్యమునొందిన మృగపక్షులును, గలదియును, కళాహీనంబై చెడియున్నదియును, వనదేవతలచే విడువంబడినదియును, వెదచల్లబడిన దర్భలును కృష్ణాజినములును గలదియును, కీలాభిలముగనుండెడి యాసనములును చాపలును గలదియును, పాడుపడిన దానివలె నున్నదియును, నగు తన యాశ్రమమును జూచి, చెప్పి తీరని వ్యసనమును బొందె. అట్లు మహావ్యసనమును బొంది తనలో తానిట్లు చింతించె. భయపడెడు స్వభావము గల సీత రాక్షసులచే నపహరింపఁబడినదో, లేక భక్షింపఁబడినదో, మరణమును బొందినదో, లేక నష్టమైనదో, అట్లుగాదేని పరిహాసార్థమెచటనైన దాగియున్నదో, లేక అడవికి పోయినదో, పూలు పండ్లు గోయుటకు పోయెనో యేమియును తెలియలేదే. లేదేని వేడుకార్థము తామరకొలనుకు బోయెనా? కాదేని యేటికి నీళ్ళకుఁ బోయెనా? యేమి. అని యిట్లనేక ప్రకారములుగ విలపించుచు రాముఁడతి ప్రయాసముతో నడవియందెచట వెదకినను ప్రియురాలగు సీతను గానడయ్యె. అట్లు ఎచట వెదకినను సీతను గానక వ్యసనముచే నెఱ్ఱవారిన నేత్రములుగలవాఁడగుచు దుఃఖవేగమును బట్టజాలక పిచ్చివానివలె యొక చెట్టు యొద్దనుండి మఱియొక చెట్టు యొద్దకును, ఒక కొండనుండి మఱియొక కొండకును, ఒక యేటినుండి మఱియొక యేటికిని, పరుగెత్తుచుండె. రాముఁడు యీరీతిగ వ్యసనసముద్రమున మునిగి మిగుల విలపించుచు పరుగెత్తుచు, తన శ్రోవయం దగుపడు వానినన్నిటిని యిట్లని యడిగె. ఓ కదంబవృక్షమా! కదంబపూలయందు మిగుల ప్రీతిగలదియును, నా ప్రియురాలును, నగు సీతను జూచితివా? నీవు చూచియుందువేని సుందరమైన ముఖముగల సీత యెచటనున్నదో నకుఁ జెప్పుము. ఓ మారేడువృక్షమా! మారేడుపండ్లతో సమానములైన స్తనములుగలదియును, మహాసుందరమగు చిగురుటాకుతో సరిబోలు దేహముగలదియును, పచ్చపట్టువస్త్రమును గట్టుకొనియున్నదియును, నగు సీతను జూచియుందువేని నాకెఱింగింపుము ఓ యర్జునవృక్షమా! అర్జునవృక్షము (ఏఱుమద్దిచెట్టు) నందు అతిప్రేమగలదియును, నా ప్రియురాలును, నగు సీత యెచటనున్నదో చెప్పుము. మిగుల భయపడు స్వభావముగలదియును, జనకమహారాజ పుత్రికయును, నగు సీత బ్రతికి ప్రాణములతో నున్నదా? లేదా? నీ వెఱిగియుంటివేని చెప్పుము. ఓ కకుభవృక్షమా! కకుభవృక్షమువంటి తొడలుగల సీతను నీ వెఱింగియుందువు. ఇప్పుడు ఎచటికి బోయెను. చెప్పుము. నీవు సొగసైన చిగురుటాకులతోను పుష్పములతోను ప్రకాశించుచున్నావు గాన నీవు సీతను నిశ్చయముగ జూచియుందువు ఓ భ్రమరగానముతో నొప్పియుండెడి యో తిలకవృక్షమా! (బొట్టుగుచెట్టు) తిలకమున నధిక ప్రీతిగల సీతను నీవు నిశ్చయముగఁ జూచియుందువు. నా ప్రియురాలగు సీత యెటు బోయినదో చెప్పుము వ్యసనమును పోగొట్టునట్టి ఓ అశోకవృక్షమా! వ్యసనపీడితుఁడనై యుండు నాకు నా ప్రియురాలిని జూపి యతివేగముగ నా దుఃఖమును బోగొట్టి నన్ను అశోకునిగఁ జేయుము. ఓ తాటివృక్షమా! పండిన తాటిపండంతటి స్తనములుగల సీతాదేవిని జూచియుందువేనియు, నాయందు నీకు దయగలదేనియు, సుందరములగు పిరుదులుగల సీత యెచటనున్నదో నాకు చెప్పుము. ఓ నేరేడిచెట్టా! నేరేడిపఁడ్లవలె స్నిగ్ధమైన దేహముగలదియును, నా ప్రియురాలును, నగు సీత యుండెడిచోటు నీ వెఱిఁగియుందువేని నాకు దెల్పుము. ఓ కొండగోగుచెట్టా! నీవిప్పుడు లెస్సగ పూచి మిగుల ప్రకాశించుచున్నావు. అట్టి నీ పుష్పములయందు మహాప్రేమగలదియును, పతివ్రతయును, నా ప్రియురాలును, నగు సీతను జూచియుందువేని యా సీత యుండెడిచోటును నాకు దెల్పుము. అని యిట్లు మిగుల కీర్తిమంతుఁడగు రాముఁడు మామిడిచెట్లను కదంబవృక్షములను, సాలవృక్షములను, పనసచెట్లను, గోరంటచెట్లను, చంద్రచెట్లను, దాడిమచెట్లను, వేగిసచెట్లను, మల్లెపొదలను, గురివెందచెట్లను, సంపెగచెట్లను, మొగలిపొదలను జూచి వానినన్నిటని వేర్వేర సీతను జూడలేదా? యని యడుగుచు పిచ్చిపట్టినవానివలె అరణ్యమునందు దిరుగుచుండె. అట్లు తిరుగుచు వృక్షములనన్నిటిని యడిగి యంతనవి యెవ్వియు ప్రత్యుత్తరమీయకుండుటచే మృగములను జూచి యిట్లనియె.

ఓ జింకా! జింకపిల్ల నేత్రములవంటి నేత్రములుగల సీతను నీవు చూచియుందువేని నాకుఁ జెప్పుము. ఆ సీత జింకవలె మిగుల చపలములైన చూపులుగలది కావున నాడుజింకలతోఁ జేరియుండును. కావున నా ప్రియురాలిని నాకు చూపుము. ఓ గజమా! (ఏనుగు) యేనుగుతొండమువంటి తొడలుగల సీతాదేవిని నీవు చూచియుందువేని యెచటనున్నదో నాకు దెల్పుము ఓ గజశ్రేష్ఠమా! సీత యొక్క సమాచారము నీకుఁ దెలిసియుండునని నమ్మెదను. చూచియుంటివేని చెప్పుము. ఓ పెద్దపులీ! చంద్రునితో సరిబోలు ముఖముగలదియును, నా ప్రియురాలును, నగు సీతను నీవు చూచియుందువేని భయపడక నాకు దెల్పుము. నీ వెంతమాత్రమును భయ

మును బొందవలదు. అనియిట్లనేకప్రకారములుగ విలపించుచు అరణ్యమునందు నలుదిక్కులకు బరుగులెత్తుచు, తదేకధ్యానముగనుండుటచే సీతతనకండ్లకుపొడచూపినట్లు దోపగాయిట్లనిచెప్పదొడగె ఓప్రియురాలా! సీతా! నిన్నుదూరమునందు చూచితిని. నీ వేలపరుగెత్తెదవు. తామరఱేకులవంటినేత్రములుగలయోసీతా! చెట్లచాటునదాగినాతో ఏలమాట్లాడకున్నావు సొగసైనపిఱుదులుగల యోసీతా! సుందరాంగీ! నిలునిలుపరుగెత్తకుము నీకుకొంచెమైనను నాయందుకరుణలేదు. నీవుయింతపరిహాసపు స్వభావముగలదానవుకాకయుండియును, యిప్పుడేలనన్నిట్లుబాధపెట్టెదవు మిగులసౌందర్యవతివగునోసీతా! నీవుపరుగెత్తుచున్నను నీపసపుపట్టుచీర నాకగపడుచున్నది నిన్నునేను కనుగొంటిని. నీవింకేలపరుగెత్తెదవు. నీకునాయందుప్రీతిగలదేనిపరుగెత్తకనిలువుము అనియిట్లనేకప్రకారములుగ బరితపించుచు నడవియందుతిరిగితిరిగి యెచటనుసీతనుగానకమలలనిట్లనియాలోచించె. మనోజ్ఞమగు చిరునగవుతో నొప్పుచుండెడి సీత యెచటనులేనేలేదు. రాక్షసులుచంపియుందురు. అట్లుగాకబ్రతికియుండునేని యిట్లుపరమవ్యసనపీడితుడనగునన్నెంతమాత్రమువిడనాడదు మాంసాహారులగు రాక్షసులు నేనులేనికాలమున, పసిదియునునాప్రియురాలును, నగుసీత యొక్క అవయవములనన్నిటిని వేరువేరుగవిడదీసిభక్షించియుందురు. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. మహాసౌందర్యముతో నొప్పుచుండెడిపండ్లును, పెదవులును, గలదియును, సొగసైనముక్కుగలదియును, మనోజ్ఞములైన కుండలములుగలదియును, పున్నమచంద్రునితో సమానమైనదియును, నగు ముఖము రాక్షసులచే మ్రింగఁబడి కాంతిహీనమైయుండును. సందియములేదు. సంపెగపువ్వులకాంతివంటికాంతిగలదియును, కంఠాభరణముచే మిగులప్రకాశించుచున్నదియును, మహాసుకుమారముగనున్నదియును, శోభనకరంబైనదియును, నగు సీతయొక్క కంఠము రాక్షసులచే భక్షింపఁబడియుండును. మఱియుభక్షించునపుడు ప్రాణముపోకతన్నుకొనుచు కదలుచున్నవియును, వడవడవడకుచున్నవియును, హస్తాభరణములతోనుబాహుపురులతోనునొప్పుచున్నవియును, చిగురుటాకులవలె మిగులమృదువైనవియును, నగుచేతులను రాక్షసులుభక్షించియుందురు. ఇందుకేమియును సంశయములేదు. అయ్యో! ముగ్ధరాలగుసీతను రాక్షసులుతినుటకొఱకయ్యో నేనువిడిచిపోతినికాబోలు అనేకబంధువులుగల సీత "బాటసారులచేనొంటరిగ విడువఁబడినస్త్రీవలె' దిక్కులేనిదై రాక్షసులచే భక్షింపఁబడినది. అయ్యో! మహాబాహుఁడవగులక్ష్మణా! నీవెచటనైన నాప్రియురాలినిచూచితివా? అయ్యో! ప్రియురాలా! హాసీతా! మంగళస్వరూపురాలా! నీవెందుబోతివే? అయ్యో! సీతా! సీతా! సీతా! యనియిట్లు పలుమారువిలపించుచుండె ఇట్లనేకప్రకారములుగ రాముఁడువిలపించుచు, ఒకయడవినుండి మఱియొక యడవికిబరుగెత్తుచు, ఒక్కొక్కచోటవ్యసనముయొక్క తీవ్రముచే శరీరముదెలియక భ్రాంతినిబొందినీతనడుగుచు, మఱియొకచోట సీతతనకంటి కగుబడినట్లే భ్రమించిచింతించుచు, వేఱొకచోట తనభార్యనువెదకుటయందు పరమాసక్తిచే కైపెక్కినవానివలె దోవయనియును, డొంకయనియును తెలియలేకతిరుగుచునుండె అట్లురాముఁడు నిలుకడలేనివాఁడై వనములయందును, యేళ్ళయందును, పర్వతములయందును, తిప్పలయందును, సెలయేళ్ళయందును, చీకారణ్యములయందును, సీతనువెదకుచుతిరుగుచుండె అట్లుతిరుగుచు మిగులవిశాలమగు నమ్మహారణ్యమునందు ఎచటనుసీతనుగానక యంతటసమాధానపడక తనప్రాణప్రియయగు సీతనువెదకుటకై మిగులశ్రమపడుటకారంభించె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువదియవసర్గ ముగిసెను.

— రామునిలక్ష్మణుడువ్యసనపడకుమనిఊరడించుట —

దశరథరాజనందనుడగు రాముఁడు, పాడబడియుండెడియాశ్రమమును, నిర్జనమగుపర్ణశాలను, చెడినయాసనములనుజూచి యెచటనుసీతనుగానకవెదకివెదకి, సీతా! సీతా! సీతా! యనియఱచుచు, హోరుమనిగట్టిగానేడ్చుచు సుందరములైనతనచేతులతో లక్ష్మణుని చేతులను పట్టుకొని యిట్లనియడిగె తమ్ముడా! లక్ష్మణా! సీతయెక్కడనున్నది? ఇందుండియెచటకిబోయెను? ఓలక్ష్మణా! యెవ్వఁడు దొంగిలించుకొనిపోయెను? లేక యెవఁడుభక్షించెను? అని అడిగిసీతానవిసిఉద్దేశించియిట్లనియె

సీతా! నీవుచెట్టుచాటునదాగియుండి నన్నునవ్వింపగోరినట్లున్నది ఈనవ్వుచాలును, నేనువ్యసనపీడితుఁడనైయున్నాను నాదగ్గిరికిరమ్ము. సౌమ్యరాలవగునోసీతా! నీతోగూడనిర్భయముగ నాటలాడుచున్న జింకపిల్లలిప్పుడునీవులేకపోవుటచే మహావ్యసనమునుబొందినవై కన్నీరుగార్చుచున్నవి. అని చెప్పి మఱలలక్ష్మణునితోనిట్లనియె

తమ్ముడా! లక్ష్మణా! నేనుసీతనువిడిచి జీవించియుండజాలను. ఇట్లుసీతాపహరణమువలన గలిగినవ్యసనముచే

జచ్చి పరలోకమునందు నాతండ్రియగు దశరథమహారాజును చూడగలను. అట్లు పరలోకమునందు నేనుతండ్రినిజూడగా నే,అతను నాతో నిట్లనును. ఓరీ! నీవు నేనుఆజ్ఞాపించిన ప్రకారము జేసెదనని యొప్పుకొని యరణ్యమునకుబోయి నేననిర్ణయించినగడువుకాలము పూర్తిగాకమును పే నాయొద్ద కేలవచ్చితివి? నీవుసీయిష్టముచొప్పున నడుచునాడవు. ఎరమదుర్మార్గుడవు అబద్ధమాడువాడవు నీముఖముచూడరాదు. నిపుమండిపోదువుగాక, అనినన్నునాతద్రిశపించును. అందుకుసంశయములేదు. అనియిట్లుచింతించుచుమఱలసీతనుడద్దేశించి యిట్లనియె సొగసైన పిఱుదులుగలదానా! సన్ననినడుముగలదానా! సీతా! వ్యసనపీడితుడను, వివశుడను, దైన్యమునుబొందినవాడను, చెడినకోరికలుగలవాఁడను, నగునన్ను "కపటమానవునికీర్తినిడిచిపెట్టునట్లు" యిచటనన్నువిడిచిపెట్టి నీవెచటికిబోతివి? నేనునిన్నెడబాసియొకక్షణమైనను బ్రతికియుండజాలను. ప్రాణములనువిడిచిపెట్టెదను అనియిట్లు రాముఁడుసీతాదేవినిజూడవలయునను అపేక్షగలిగియనేకవిధముల విలపించుచు మహావ్యసనపీడితుఁడయ్యును సీతనుజూడలేదు. అప్పుడు, "పెనురొంపియందుబడి మునుగుచున్నయేనుఁగువలె" సీతాదేవినిజూడక మహావ్యసనమునందుమునిగియున్నవాఁడును, దశరథమహారాజపుత్రుడును నగు రాముని లక్ష్మణుడుజూచిఅతనిహితమునగోరియిట్లనియె.

ఆజానుబాహుఁడవగుఅన్నా! రాముఁడా! వ్యసనమునువిడువుము మనమిద్దరముచేరి సీతాదేవిని వెదుకుటకు యత్నింపుదము శూరుఁడవగునో రామచంద్రా! ఈయరణ్యమునందు అనేకగుహలున్నవిగదా? వాటియందంతటనుసీతాదేవినివెదకుము సీతాదేవి అరణ్యమునసంచరించుటయందు మహాయిష్టముగలదిగదా? నీటియందత్యాశగలదియునుఔను. కావుననాసీతాదేవి యరణ్యములకుగాని, లేకచక్కగబూచియుండెడు తామరకొలనులకుగాని, పోయియుండును మఱియు సీతాదేవిమత్స్యములతోను, ప్రబ్బలిచెట్లతోను నొప్పుచుండెడి యేటికిస్నానము చేయుటకుఁ బోయియుండును. లేకపరిహాసార్థముగ నరణ్యమునందుఎచటనోయొకచోటదాగియుండను పురుషోత్తముఁడవగునో రామా! అన్నా! సీతాదేవిమనలనుభయపెట్టుపగోరియో, లేకమనసంగతి తెలిసికొనగోరియో యరణ్యమునఎచటనోయొకచోటదాగియుండును శ్రీమంతుఁడవగునోఅన్నా! రాముఁడా! కావునమనముసీతాదేవినివెదకుటకతివేగముతోయత్నింపుదము కకుత్స్థవంశోద్భవుఁడవగునో రామా! నీకుయిష్టముగానుండినయెడల జనకమహారాజపుత్రికయగు సీతాదేవియుండెడు స్థలమును కనుగొనుటకై యీయరణ్యమునందంతటను వెదకుదము. వ్యసనపడవద్దు. మనస్సునందునుగూడ చింతవిడువుము. అనిలక్ష్మణుఁడు రామునితోఁజెప్పె. అంతరాముఁడు, తనయందలిస్నేహమువలన లక్ష్మణుఁడుచెప్పినమాటనువిని సమ్మతించిలక్ష్మణునితోఁగూడసీతాదేవిని వెదకుట కారంభించి, దశరథమహారాజపుత్రులగు నా రామలక్ష్మణులు, అడవులయందునుకొండలయందును యేళ్ళయందును సరస్సులయందునుమఱియుసమస్తప్రదేశములయందునుసీతాదేవిని వెదకుచుండిరి. అట్లువెదకుచునా రామలక్ష్మణులు ప్రస్రవణపర్వతముయొక్క చఱియలయందును, గుహలయందును, శిఖరములయందును, చక్కగా వెదకిసీతాదేవినిజూడజాలరైరి అట్లుఆప్రస్రవణపర్వతమునందంతటను వెదకిరాముఁడులక్ష్మణునిజూచియిట్లనియె.

ఓసుమిత్రానందనా! లక్ష్మణా! యీపర్వతమునందెచటనుమంగళస్వరూపురాలగుసీతగనుబడలేదు. ఇకనేమిచేయవచ్చునని రాముఁడు చెప్పె. అంతదండకారణ్యమున సీతాదేవిని వెదకుచున్న లక్ష్మణుఁడు మహావ్యసనమునుబొంది, మిగులకాంతిమంతుఁడగురామునిజూచియిట్లనియె.

మిగులబుద్ధిమంతుఁడవగునో అన్నా! రామచంద్రా! "మహాబాహుఁడగు విష్ణుదేవుఁడు బలిచక్రవర్తినిబంధించి యీభూలోకమునంతయు గైకొన్నట్లు" జనకమహారాజపుత్రికయగుసీతాదేవినిదీసికొనిపోయినవానినిశిక్షించి, నీవు సీతాదేవినిపొందగలవు. అనియిట్లులక్ష్మణుఁడు పరమస్నేహముచేజెప్పినమాటనువిని రాముఁడుశోకపీడితుఁడై మహాదీనమగువాక్యములతోమఱలలక్ష్మణునిజూచియిట్లనియె

మిగులప్రజ్ఞావంతుఁడవగునోలక్ష్మణుఁడా! ఈయరణ్యమునందంతటను చక్కగా వెదికితిమి పూచియుండెడుతామరకమలములతోనొప్పెడు సరోవరములన్నియును వెదకితిమి అనేకములైన గుహలతోను సెలయేళ్ళతోను నొప్పుచుండెడి యీప్రస్రవణపర్వతమునందంతటను చక్కగా వెదకితిమి. నాప్రాణములకన్నయెక్కువయగు సీతనుయెచటనుగానము అనియిట్లు రాముఁడులక్ష్మణునితోజెప్పి, సీతాదేవియపహరింపఁబడుటచే గలిగినదుఃఖమువలనమిగులకృశించినవాఁడును, మహాదైన్యమును బొందినవాడును, మిగులవ్యసనపీడితుఁడునునై యనేకప్రకారములుగవిలపించుచుశోకవేగముచే కొంతదడవుమూర్ఛనుబొందె అంత రాముఁడు కొంతదడవునకు కొంచముతెలివొంది మిగులసంతాపమునుబొందినవాఁడును, కృశించినయవయవములుగలవాఁడును, తెలివిదప్పినవాడును, నిశ్చేష్టితుఁడు

ను, మిగుల శోకాతురుఁడును, మహాదైన్యమునుబొందినవాఁడును, నై వేడినిట్టూర్పులను నిగుడించుచునుండెను. మఱియు కమలములవంటి నేత్రములుగల రాముఁడు అట్లు విశేషముగ నిట్టూర్పులను విడుచుచు మహావ్యసనపీడితుఁడై గద్గదస్వరముతో, హా ప్రియురాలా! సీతా! యని గట్టిగా నేడ్చె. అంత ప్రియబంధువును, ధర్మజ్ఞుఁడును, నగు లక్ష్మణుఁడు చేతులను జోడించుకొని యనేక ప్రకారములుగ నా రాముని యూరడించెను. అంత రాముఁడు, మహావినయముతో లక్ష్మణుడు జెప్పిన సాంత్వవచనములచే నూరడిలక ప్రియురాలగు సీతను గాననివాఁడగుచు పలుమారు గట్టిగా నేడ్చుచుండెను.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువదియొకటవ సర్గము ముగిసెను.

▶❋◀

రాముడు సీతను గానక తాను మరణమును బొందెదనని చెప్పుట.

అంత మహాధర్మబుద్ధిగలవాఁడును, ఆజానుబాహుఁడును, కమలములవంటి కన్నులుగలవాఁడును, నగు రాముఁడు సీతాదేవిని గానక కామపరవశుఁడై మిగుల విలపించుచుండెను. మఱియు రాముఁడు సీతాదేవిని జూడకున్నను మదనపీడితుఁడై యుండుటచే సీతను జూచుచున్నవానివలె దుఃఖము నాశ్రయించినవియును, చెప్పనలవిగాని యును, నగు మాటలతో నిట్లనియె.

హా ప్రియురాలా! సీతా! నీవు పూలయందు మహాయిష్టముగలదానవు కావున నే నా వ్యసనమును వృద్ధిజేయుటకు నీ శరీరమును అశోకకొమ్మలతో గప్పుకొనుచున్నావు ఓ సీతా! అరటిచెట్లతో సమానములైనవియును, అరఁటిచెట్టు చాటుననున్నవియును, నగు నీ తొడలను నేను చూచుచున్నాను. చక్కగా దాచుకొనుటకు నీవు సమర్థురాలవు కావు. శుభస్వరూపురాలవగు నో సీతా! నీవు నవ్వుచు కొండగోగుచెట్లలో సంచరించుచున్నావు. నీ పరిహాసము నాకు మిగుల బాధగలిగించుచున్నది ఇంక చాలును రమ్ము ఓ ప్రియురాలా! సీతా! ఇట్లు పరిహాసము చేయుటచే నీకేమి ప్రయోజనము. ఓ సీతా! నేనిపుడు మిగుల నలసటను బొందియున్నాను. కావున మంచి కాలమునందు నాకు మిగుల యిష్టముగనున్నను, యిప్పుడు నాకు మిగుల బాధగనున్నది. ఓ ప్రియురాలా! ఆశ్రమస్థానమునందున్నపుడు పరిహాసమును విశేషముగ జేయరాదు. నీవు పరిహాసమునందు మహాప్రీతిగలదానవని నీస్వభావము నాకు తెలుసును. విశాలములగు నేత్రములుగల యో సీతా! ఇంక చాలును. నీవు రమ్ము. నీ పర్ణశాల పాడుబడియున్నది. అనియిట్లు కొంతసేపు సీతాదేవిని నుద్దేశించి మాటలాడి వెనుక లక్ష్మణుని జూచి యిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! నే నెంతవిలపించినను సీత నాయొద్దకు రాకున్నది. కావున సీతను రాక్షసులు భక్షించియుందురు. లేక అపహరించియైనను యుందురు ఇందు కెంతమాత్రమును సంశయము లేదు. తమ్ముడా! లక్ష్మణా! ఈ జింకలగుంపులు కన్నీళ్లు గార్చుటను జూడగా సీతను రాక్షసులు భక్షించినారని చెప్పుచున్నట్లున్నది అని లక్ష్మణునితో జెప్పి మఱల తనలో తా నిట్లని చింతించె హా! నా ప్రియురాలా! హా మిగుల పూజ్యురాలా! హా! పతివ్రతాశిరోమణీ! హా సుందరాంగీ! నీ వెచటకి బోతివే? సీతా! కైకేయి యొక్క కోరిక యీడేఱెనుగదా? నేను పూర్వము అయోధ్యానగరమునుండి సీతతోఁగూడ బైలుదేరివచ్చి యిప్పుడు సీతను యిచట పోగొట్టుకొని అయోధ్యకు మఱలఁబోయి సీత లేక శూన్యముగ నుండెడి యంతఃపురమునం దెట్లు ప్రవేశింతును. అదియును గాక లోకమునందుండెడు సర్వజనులును నన్ను శౌర్యము లేనివాఁడనియును, దయ లేనివాఁడనియును, జెప్పుదురుగదా? సీతను రాక్షసులపహరించుటచే నా పిరికితనమెల్లవారికి విశదముగ దెలిసినదగును. నేను వనవాసవ్రతమును పూర్తిగా జేసికొని పట్టణమునకుఁ జేరగానే మిధిలాధిపుఁడగు జనకమహారాజు క్షేమమును అడుగవచ్చినపుడు నేను ఆ జనకమహారాజును యెట్లు చూతును. మఱియు జనకమహారాజు సీతను పోగొట్టుకొని నే నొకడనే వచ్చియుండుటను జూచి కూతురియందు తనకుగల ప్రేమాతిశయముచే బరమదుఃఖితుఁడై మూర్ఛను బొందును. కావున భరతునిచే బరిపాలింపఁబడెడి అయోధ్యానగరమునకు నే నెంతమాత్రము నుపోను. సీత లేనియెడల స్వర్గముగూడ నాకు పాడుబడిన దానివలెనే యుండును. అనియిట్లు కొంతసేపు చింతించి మఱల లక్ష్మణుని జూచి యిట్లనియె.

ఓ తమ్ముడా! లక్ష్మణా! నీవు నన్నీ యరణ్యమునందే విడిచిపెట్టి శుభకరమగు నయోధ్యానగరమునకు బొమ్ము నేను సీతను ఎడబాసి యెంతమాత్రమును బ్రతికియుండను. కావున నీవు పోయి భరతుని గాఢాలింగనము చేసికొని "రాజ్యపరిపాలనము చేయుచుండుమని రాముఁడు నీకి సజ్ఞ యిచ్చెను" అని చెప్పుము. ఓ లక్ష్మణా! నా తల్లులగు కైకేయి, సుమిత్ర, కౌసల్యలకు నేను చెప్పినానని నమస్కారము యధాన్యాయముగ సమస్కారమును చేయుము లక్ష్మణా! నీవు చెప్పినట్లు చేయువాఁడవు కావున నా తల్లియగు కౌసల్యను మహాప్రయత్నముచే గాపాడుచుండవలయును శత్రువులను జంపునట్టి లక్ష్మణా! ఈరీతిగ సీతయు నేనును నశిం

చితిమని నాతల్లియగు కౌసల్యాదేవికి విశదముగ జెప్పుము. అనియిట్లు రాముఁడు అరణ్యమునందు ఎచటను సీతాదేవిని గానక మహావ్యసనపీడితుఁడై విలపించుచుండగా లక్ష్మణుఁడును మహాభయమును బొంది తెల్లబారిన ముఖముతో పరమదుఃఖితుఁడైయుండె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువది రెండవసర్గ ముగిసెను.

రాముఁడు సీతను గానక మహావ్యసనమును బొందుట.

అట్లు రాజపుత్రుఁడగు రాముఁడు, తనప్రియురాలగు సీతాదేవిని యెడబాసి వ్యసనముచేతను, మోహముచేతను, పీడితుఁడైయుండుటను జూచి తనతమ్ముఁడును పరమదుఃఖపీడితుఁడగుటను రాముడు జూచి మఱల మహాతీవ్రమగు వ్యసనమును బొందినవాఁడాయె. మఱియు రాముఁడు దుఃఖసాగరమున మునిఁగినవాఁడగుచు, మహావ్యసనపీడితుఁడైయున్న లక్ష్మణుని దుఃఖమునకు తగినట్లు వేడినిట్టూర్పులను నిగుడించుచు హూరుమని గట్టిగా నేడ్చుచు శోకయుక్తమగు నీమాటను జెప్పె. లక్ష్మణా! నావలె పాపకర్మములు చేసినవాఁడు భూలోకమునం దెచటను నాకు ప్రతిలేఁడని తలఁచెదను. ఒకటివెంబడియొకటి దుఃఖపరంపరలై తటస్థించుచు నామనస్సును భేదించుచున్నవి. నేను పూర్వజన్మమునందు కావలయునని పెక్కుపాపములను అనేకమారులు చేసియుందును. అందు కెంతమాత్రమును సంశయములేదు కావుననే యిప్పుడు కష్టములు ఒకటివెంబడి ఒకటి సంభవించుచున్నవి వాటిఫలము నిప్పుడనుభవింపక తీరదు. లక్ష్మణా! రాజ్యభ్రష్టత్వము, బంధువియోగము, తండ్రిచచ్చుట, తల్లిని యెడబాయుట మొదలగునవియన్నియును ఒకటొకటిగా తలంపునకు వచ్చి నాకు మహావ్యసనమును గలిగించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! నేను నిర్జనమగు నీయరణ్యమునకు వచ్చినతరువాత నావ్యసనమునంతయును కడుపులోని ముచ్చుకొనియుంటిని. "మండుచున్న నిప్పులో కట్టెలు వేయుటచే మఱింత మండునట్లు" యిప్పుడు సీతావియోగదుఃఖము వలన అవి అన్నియు మఱల బైలునకు పొంగినవి. నాప్రియురాలును, భయపడుస్వభావముగలదియును, మహాపతివ్రతయును, నగు సీతను రాక్షసుండు బలవంతముగ నపహరించి గగనమున కెత్తికొనిపోవునపుడు మిగులభయమును బొంది నానావిధములుగ వికారమైనధ్వనితో నేడ్చియుండును. సంశయములేదు. చూచుటకత్యంత ప్రీతికరమైనవియును, సమస్తవాసనలతోఁగూడియుండెడి రక్తచందనపూతకుఁ దగినవియును, మిగుల గుండ్రముగనుండునవియును, నగు నాప్రియురాలియొక్క స్తనములు నెత్తురనుగంధముచేఁ బూయబడినవగుచు, మిగుల ప్రకాశహీనములై యుండును. ఇందుకు సందియములేదు. మిగుల మనోజ్ఞములును స్పష్టములును, మృదువులును, నగుమాటలు గలదియును, వంకలుతిరిగి యున్నవియును, దట్టముగనున్నవియును, నగు ముంగురులతో నొప్పుచున్నదియును, నగు నా సీతముఖము రాక్షసుని అధీనమును బొందుటచే "రాహుగ్రహముచేత మ్రింగఁబడిన చంద్రబింబమువలె" కొంచముగూడ ప్రకాశింపకుండును. సంశయములేదు. మఱియు మహాపతివ్రతయగు నా ప్రియభార్యయొక్క కంఠము, నిరంతరము ముత్యాలహారములు మొదలగుహారములను ధరించుటకుఁ దగినదైయుండియు, నిర్జనమగువనమునందు రక్తపానమును జేయునట్టి రాక్షసుల చేవిరువంబడి రక్తము ద్రావబడియుండును. సందియములేదు. అయ్యో! మిగుల విశాలములును, సుందరములును నగు నేత్రములుగల సీత జనహీనమగు నరణ్యమునందు నన్నెడబాసి యొంటరిగనుండు నెడ రాక్షసులు తన్నపహరించి యెత్తికొనిపోవునపుడు మహావ్యసనమును బొంది, "దుఃఖముగలదియైన లేడివలె" కన్నీరుమున్నీరై పారహూరుమని యేడ్చియుండును. ఇందు కెంతమాత్రమును సంశయములేదు. తమ్ముఁడా! లక్ష్మణా! మిగుల శ్రేష్ఠమైన స్వభావముగలదియును, మనోజ్ఞమగు చిరునవ్వుగలదియును, నగు సీత పూర్వము నాతోఁగూడ నీ రాతిమీద గూర్చుండి చిరునగవుతో నవ్వుచు నీతో పెక్కుమాటలాడుచుండును. నాయనా! తమ్ముడా! లక్ష్మణా! ఏళ్ళలోనెల్లనుత్తమయేరగు నీగోదావరియందు నాప్రియురాలికి నిరంతరము అధికయిష్టము గావున నొకవేళ యీగోదావరీనదికిఁ బోయియుండునా? ఏమి? అయినను సీత యొంటరిగ నెప్పుడును పోదు. తామరకమలమువలె మృదువైనముఖముగలదియును, తామరరేకులవలె విశాలములైన నేత్రములుగలదియును, నగు సీత పూలుగోయుటకొఱకు తామరకొలనుకుఁ బోయియుండునా? ఏమి? అయిన నెప్పుడుగాని నిన్ను విడచి యొంటరిగ కొలనుకుఁబోవునది కాదు. ఇప్పుడెంతమాత్రమును పోయియుండదు. మఱియు నీయరణ్యము జక్కఁగఁ బూచి నానావిధములైన పక్షిసమూహములతో నొప్పియున్నది. లక్ష్మణా! యీయరణ్యమునకు బోయియుండునా? అయిననది యుక్తముగాదు. ఆసీత మహాభయస్థురాలు అందులో నొంటరిగనుండ నపుడు చెప్పనక్కఱలేదు. మిగులభయముచే బైటఁబోయియుండదు. అనియిట్లనేక ప్రకారములుగ విలపించుచు మోహాతిశయముచే గొంతెత్తి గట్టిగానిట్లనియె.

ఓసూర్యుఁడా! నీవులోకమునందుజరిగెడి భూతభవిష్యద్వర్తమానకార్యముల నెఱిఁగినవాఁడవు. లోకులుచేయుచుండెడి పుణ్యపాపకార్యములకు సాక్షిభూతుఁడవు. కావుననాప్రియురాలగు సీతయెచటికేఁబోయెను? ఎవరైన నపహరించుకొనిపోయిరో? ఏమి? మహావ్యసనపరవశుఁడనై యున్ననాకు సీతావృత్తాంతమును జెప్పుము. ఓవాయుదేవుఁడా! సమస్తలోకములయందును నీకుఁ దెలియని వృత్తాంతము గొంచెమైననొకప్పుడును లేదు. కావునమంచికులమునందుబుట్టినదియగు, నాభార్యయెచటనున్నది? ఎవరైననపహరించిరా? లేకమృతినొందెనా? అదియునుగాదేని, త్రోవలోనెచటనైననున్నదా యేమి? అనియిట్లుపలువిధములుగవిలపించుచు శోకపరవశతచే నిశ్చేష్టితుఁడైయున్నరామునిజూచి లక్ష్మణుఁడు, మహాధైర్యమును న్యాయయుక్తమును, కాలోచితమునునగు నీమాటనుజెప్పె. పూజ్యుఁడవగునోయన్నా! రాముడా! వ్యసనమునువిడువుము ధైర్యమునవలంబింపుము. సీతాదేవిని వెదకుటయందు పరమోత్సాహము గలవాఁడవగుము. శ్లో॥ ఉత్సాహవంతోహినరానలోకే సీదంతికర్మస్వతిదుష్కరేషు॥ లోకమునందుఉత్సాహముగలమానవులు యెంతటియసాధ్యకార్యమునైనను ధైర్యముచేజేయుదురు. అనియిట్లుఊరడించుచున్నవాఁడును, మహాశౌర్యవంతుఁడును, నగులక్ష్మణుండు చెప్పినమాటనువినక రఘువంశోద్భవుఁడగురాముఁడు ధైర్యముచెడి మఱింత దుఃఖపరవశుడాయె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి యరువదిమూడవ సర్గముగిసెను.

రామలక్ష్మణులుసీతను వెదకుచుబోయి మృతినొందిన గుఱ్ఱములు మొదలగువానినిజూచుట

అట్లురాముఁడు మహావ్యసనపీడితుఁడై దీనవాక్యములతో లక్ష్మణునిజూచి యిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! సీతతామరపువ్వులు గోయుటకై గోదావరీనదికేమైనబోయినదేమో? నీవతివేగముగా నానదికిఁబోయి చూచిరమ్ము. అనిరాముఁడు చెప్పగా నేవైరులను సంహరించునట్టిలక్ష్మణుఁ డతిశీఘ్రముగమిగులరమణీయమగు గోదావరీనదికిఁబోయె అట్లులక్ష్మణుఁడతివేగముగ గోదావరీనదికిబోయి యందలి రేవులయందంతటను వెదకి మఱలరామునొద్దకువచ్చి యిట్లనియె

అన్నా! రామచంద్రా! నేనానదియొక్క రేవులయందంతటనుసీతాదేవిని వెదకితిని అందెచటనుసీతాదేవినాకుగనబడలేదు. నేనుగట్టిగాకూతవేసినను పలుకలేదు. నీవ్యసనమునుపోగొట్టునట్టి సీతాదేవియెచటికిబోయినదియును యెచటనున్నదియును, నాకు తెలియలేదు. అనిలక్ష్మణుఁడు రామునితోఁజెప్పె అంతమిగులదీనుఁడును, పరమదుఃఖితుఁడును, నై రాముడు తానేగోదావరీనదికిబోయె. అట్లు రాముఁడు గోదావరీనదియొద్దకుబోయి ఓగోదావరీనదీ! తల్లీ! సీతయెచటనున్నదిఅనియడిగె. అనియడుగగా, వధార్హుఁడును, రాక్షసేశ్వరుఁడును, నగురావణాసురుఁ డెత్తుకొనిపోయెనని సమస్తభూతములును జెప్పినట్లే గోదావరీనదియును రామునకుజెప్పినదికాదు. అంతసమస్తభూతములును "రామునిప్రియభార్యను రావణాసురుడుదీసికొనిపోయెనని చెప్పుమని" గోదావరీనదిని యెంతప్రార్థించినను వ్యసనపీడితుఁడగు రామునకుగోదావరీనది చెప్పదాయె మఱియు నాగోదావరీనది దుష్టుఁడగు రావణాసురునియొక్క రూపమును వానికార్యములనుదలఁచి మిగులభయమునుబొందినదయ్యె సీతాదేవియొక్క వృత్తాంతమును రామునకుఁజెప్పదాయె అంతగోదావరి తన్నుజూడకుండుటచే రాముఁడు, మిగులవ్యసనపీడితుడై సీతావృత్తాంతమును ఆనదివలన నేమియు నెఱుఁగక నిరాశుఁడై లక్ష్మణునిజూచియిట్లనియె.

సౌమ్యుడవగునోలక్ష్మణా! ఈగోదావరిని ఎంతయడిగినను సీతావృత్తాంతమును జెప్పకున్నది. నేనిప్పుడుసీతనువిడిచి జనకమహారాజుయొద్దకిని, మాతల్లియగు కౌసల్యాదేవియొద్దకినిబోయి మహావ్యసనకరమైన యీసమాచారమునువారలకెట్లుచెప్పుదును? అయ్యో! రాజ్యభ్రష్టుఁడనైయరణ్యమున గందమూలఫలములనుదిని బ్రతుకుచుండినను, నాయొక్క సర్వవ్యసనములనుపోగొట్టునట్టి సీతయెచ్చటికిబోయెను? నేనిప్పుడుసమస్తబంధువులను విడిచియుండుటచేతను, సీతనుఎడబాసియుండుటచేను, రాత్రులయందు నాకు నిదురపట్టకుండుటవలన రాత్రిమహాదీర్ఘముగనున్నది. ఇప్పుడు నాకుసీతగనబడునేని నేనుసీతతోగూడగోదావరీతీరమునందును, జనస్థానమునందును, యీప్రస్రవణపర్వతమునందును, అన్నిప్రదేశములయందును, సంచరించుచుందును అనియిట్లుచింతించుచు లక్ష్మణునిజూచి యిటనియె

మహాశౌర్యవంతుఁడవగు నోతమ్ముడా! లక్ష్మణా! ఈమృగములు పలుమారు నన్నుజూచుచుండుటను జూడగా సీతావృత్తాంతమును నాకుఁజెప్పఁగోరినట్లు వానియభిప్రాయమును దెలుపుచున్నవి. అనిపురుషోత్తముఁడగు రాముఁడు లక్ష్మణునితోఁజెప్పి యామృగములనుజూచి కన్నీరుమున్నీరైపారనేడ్చుచు "ఓమృగములారా! సీతయెక్కడనున్న

ది అనియడిగె. అంతనామృగములన్నియు రామునిమాటనువినియతివేగముగలేచి మోరలెత్తికొనియాకాశమునుజూపుచు దక్షిణదిశనుగూర్చి పరుగెత్తుచు, సీతాదేవినిరావణుఁడపహరించుకొని పోయినమార్గం బిదియనిచూపుచు, మఱలమఱల రామునితట్టుతిరిగితిరిగిచూచుచునుండినవి. అప్పుడుఆమృగములు దక్షిణదిక్కునకుబోవుచు, తిరిగితిరిగి చూచుచు, యింకనుబోవయత్నించియుండుటనుజూచి, లక్ష్మణుఁడు వాటియభిప్రాయమును దెలిసికొనె. అట్లుబుద్ధిమంతుఁడగులక్ష్మణుఁడు ఆమృగముల యభిప్రాయమును మాటలవలనవలెనేఎఱింగి మహాదీనముతో అన్నయగు రామునిజూచి యిట్లనియె.

అన్నా! రామచంద్రా! నీవు "సీత యెచ్చటనున్నదని" యడుగగానే యీమృగములుఅతివేగముగ దక్షిణదిక్కునకుఁబోవుచు నాదిక్కునకేసీతాదేవిపోయెనని చూపుచున్నట్లున్నది కావునమనము ఆదిక్కునకేపోదము. అట్లుపోతిమేని ఏదైననొకయుపాయమును గనిపెట్టవచ్చును. ఒకవేళసీతాదేవికనుబడినను గనుబడును. అనిలక్ష్మణుఁడుచెప్పగావిని శ్రీమంతుఁడగురాముఁడు సమ్మతించిలక్ష్మణునితోగూడినవాఁడై దక్షిణపుభూములనుజూచుచు దక్షిణపుదిక్కునకుఁబోయె. అట్లారామలక్ష్మణులిద్దఱునొండొరులతోసంభాషించుచుబోయి త్రోవయందు నేలపైరాలియున్నపుష్పములనుజూచిరి. అంతమిగులశౌర్యవంతుఁడగు రాముఁడు భూమిపైబడియున్న యాపువ్వులనుజూచి పరమదుఃఖితుఁడై మహావ్యసనముతోనున్న లక్ష్మణునిజూచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! ఈపుష్పములను నేనుజక్కఁగా గుర్తించితిని. ఈపువ్వులను నేనుఅరణ్యమునందు కోసితెచ్చి సీతకుయిచ్చితిని. ఆసీతయీపువ్వులనుధరించె మఱియు సూర్యుఁడును, వాయుదేవుఁడును, మిగులయశస్వినియగు భూమియును, నాకుసంతోషమునుబుట్టించుటకొఱకు యీపుష్పములనుగాపాడినారు. అనిపురుషోత్తముఁడగు ముడు మహాబాహుఁడగులక్ష్మణునితోఁజెప్పి, విశేషముగసెలయేళ్ళతోనొప్పుచుండెడి ప్రస్రవణపర్వతమునుజూచి రాముఁడిట్లనియె.

పర్వతోత్తమమగు నోప్రస్రవణపర్వతమా! నన్నెడబాసిపరితపించుచున్నదియును, సర్వాంగసుందరియును,నగుసీతను రమ్యమగునీయరణ్యప్రదేశమునందు ఎచటనైననుజూచితివా? ఏమి? అని రాముఁడడుగ నాపర్వతమేమియునుబలుకకుండె అంతరాముఁడుపరమకుపితుఁడై "సింహమునీచమృగమును బెదరించునట్లు" ప్రస్రవణపర్వతముతోనిట్లనియె. ఓపర్వతమా! నేనుకుపితుఁడనై నీచెఱియలనన్నిటిని ధ్వంసముసేయకమునుపే బంగారుకాంతివంటికాంతిగలిగి బంగారుప్రతిమవలెనుండెడి సీతనుజూపుము. అనిరాముఁడుగట్టిగాజెప్పె. అంతనాపర్వతము సీతాదేవినిగురించి యేమోచెప్పుచున్నదానివలె ప్రతిధ్వనిచేసెనుగాని సీతనురామునికి జూపదయ్యె. అంతదశరథాత్మజుఁడగురాముఁడు. ఆపర్వతమునుజూచి మఱలనిట్లనియె ఓపర్వతమా! నేనుయిప్పుడే నిన్నుబాణాగ్నిచేకాల్చి బూడిదెచేసెదనుచూడుము. అంతనీయందుకసువుగాని మొలకలుగాని చెట్లుగాని చిగుళ్లుగాని యెప్పుడునునుండవు అంతనిన్నెవ్వరును సేవింపరు అనియిట్లు ప్రస్రవణపర్వతముతో జెప్పి లక్ష్మణునిజూచియిట్లనియె. తమ్ముడా! లక్ష్మణా! మిగులపూజ్యురాలును చంద్రబింబముతో సమానమైనముఖముగలదియును, నగుసీతావృత్తాంతమును యిప్పటికైనదియైననునాతో జెప్పకపోయెనేని యీనదినిగూడ యిప్పుడేయింకఁజేసెదను. అనిరాముఁడుయిట్లు మహాకోపముచేత నేత్రములమండినిప్పులురాల సర్వమును తగలబెట్టువానివలెనుండె అట్టియెడఆప్రదేశమునందలి నేలయందు రాక్షసునిపెద్దయడుగులను, ఆరాక్షసునివలనిభయముచేత పరమభీతయైరామునిజూడగోరి రాక్షసుఁడుతన్ను వెంబడించుటచేత యిటుఅటు పరుగెత్తుచున్న సీతాదేవియడుగులను, రాముడుజూచె మఱియురాముఁడు సీతయడుగులను రాక్షసునియడుగులనుజూచి, ఛిన్నాభిన్నములుగ విఱిగిపడియున్న బాణతూణీరములను రథముయొక్కతునకలనుజూచిమిగుల తొట్రుబాటునుబొందినమనస్సుగలవాఁడై తనకుపరమయిష్టుఁడగు తమ్మునిజూచి యిట్లనియె.

ఓలక్ష్మణా! ఇదిగోచూడుము సీతధరించియున్నయాభరణములలోనుండి బంగారుతునకలురాలియున్నవి. పూలదండలు వెదజల్లబడియున్నవి. లక్ష్మణా! ఇదిగోచూడుము బంగారుబిందువులవలెనుండు రక్తబిందువులుమిగులనాశ్చర్యకరముగ భూమిమీదనంతటను బడియున్నవి అయ్యయో! లక్ష్మణా! కామరూపులగురాక్షసులు సీతనుఖండించి పంచుకొని భక్షించిరనినాకుతోచుచున్నది ఓతమ్ముడా! లక్ష్మణా! సీతకొఱకిద్దఱురాక్షసులు జగడమాడియిచటమహాభయంకరమగు యుద్ధమునుజేసిరనితోచుచున్నది. సౌమ్యుఁడవగునోలక్ష్మణా! విరగగొట్టఁబడి నేలపైబడియున్నదియున్నదియును, ముత్యములచేతను మణులచేతను పొదగఁబడినదియును, బంగారుమయమైనదియును, నగునీగొప్పవిల్లుఎవనిది? మఱియు బాలసూర్యునికాంతితో సమానమైనకాంతిగలదియును, వైడూర్యపుమణులచేఁబొదుగఁబడినదియును, విఱిగినేలంబడి యున్న యు

నునకు నీబంగారుకవచమువవనిది? లక్ష్మణా! ఇదిగో చూడుము, నూరుకమ్ములుగలదియును, మహార్హములగు పూలదండలచేఁ బ్రకాశింపజేయ బడినదియును, విఱిగిపోయిన కఱ్ఱగలదియును, నేలంబడియున్నదియును, నగునీగొడుగువవ్వనిది? మఱియుబంగారు కవచముగలవియును, మహాభయంకరాకారములు గలవియును, గొప్పదేహములుఁగలవియును, పిశాచముఖములు గలవియును, యుద్ధమునందు చంపఁబడినవియును, నగునీగాడిదెలెవ్వనివి? లక్ష్మణా! ప్రజ్వలించుచున్న యగ్నిహోత్రముతో సరిబోలిమహాకాంతి మంతంబులై యున్నవియును, యుద్ధసంబంధమ్మైనవియును, విఱిగిపడియున్నవియును, నగునీ టెక్కెమును, రధమును, యెవ్వనిది? మఱియువన్నూరు యంగుళము లనిడువుగలవియును, బంగారుచేనలంకరింప బడినవియును, మొనలులేనివియును, విఱిగిపడియున్నవియును, వెదజల్లఁబడినవియును, నగునీబాణములు, ఏభయంకరమగు కార్యములుచేయువానివి? లక్ష్మణా! బాణములతో నిండియుండెడి అంబులపొదులు రెండువిఱిగిపడియున్నవి, చూడుము జాటీకోలను, ఖడ్గములను చేతులంబట్టికొని చచ్చిపడయుండు నీసారధి యెవనిసారథి? పురుషశ్రేష్ఠుఁడవగునో లక్ష్మణా! తలగుడ్డలతోను రత్నకుండలములతోను గూడినవారలగుచు యుద్ధమునందు చంపబడియుండు నీయిద్దఱు యెవనికి వింజామరలు వీచువారు? లక్ష్మణా! యీమార్గ మెవనిదో యొక పురుషరాక్షసునిది. ఇందు కెంతమాత్రమును సంశయములేదు ఇదిచూడగా నే రాక్షసులపైనాకు నూరింతలు విరోధమతిశయించినది. ఇంక నేను రాక్షసుల ప్రాణములను అపహరించెదను నాపరాక్రమమునుజూడుము సౌమ్యుఁడవగునో లక్ష్మణా! మహాతపస్వినియగు సీతను, కామరూపులును మిగులభయంకరులును, క్రూరహృదయులును, నగురాక్షసులు అపహరించి భక్షించియుందురు సీతమృతిబొంది యుండును. ఆహా నేనేమిచెప్పుదును. ఈమహారణ్యమునందు ధర్మమైనను, సీతను గాపాడకున్నదే ఇదిమిగులచిత్రము. సౌమ్యుఁడవగు లక్ష్మణా! సీత రాక్షసులచే భక్షింపబడినదిగాని అపహరింపబడినదిగాని అయ్యో నేనిలోకమునందు ఏప్రభువునాకు సంతోషమును గలుగజేయ సమర్థుడగును

శ్లో॥ కర్తారమపిలోకానాం శూరంకరుణవేదినమ్। అజ్ఞానాదవమన్యేరన్ సర్వభూతానిలక్ష్మణ॥

ఓలక్ష్మణా! సమస్తలోకములను సృజించువాఁడైనను, మహాశౌర్యవంతుఁడైనను, దయాశీలుడగు నేని సమస్తభూతములును తెలివిలేమితనముచేత వానినవమానించును కావున నేను లోకమునకు మేలుచేయుటయందాసక్తిగలవాఁడను, జితేంద్రియుడను, దయాశీలుఁడను, నగునన్ను పరాక్రమహీనుఁ డనని తలఁతురు. ఇందు కెంతమాత్రమును సంశయములేదు. ఓతమ్ముడా! లక్ష్మణా! సద్గుణములుగూడ నన్నుబొంది దోషయుతములైనవిచూడుము. కావుననిప్పుడు నేను, సమస్తభూతములయొక్కయు, రాక్షసులయొక్కయు, వినాశముకొఱకు "మహాత్ముడగు సూర్యుడుచంద్రునియొక్క కాంతినిబోగొట్టి తానుప్రకాశించునట్లు" నాసుగుణముల నన్నిటిని విడిచి నాపరాక్రమమును ప్రకాశింపఁజేసెదను. లక్ష్మణా! యక్షులుగాని, గంధర్వులుగాని, పిశాచములుగాని, రాక్షసులుగాని, కిన్నరులుగాని మానవులుగాని, యెంతమాత్రముయికను సుఖమునుబొందజాలరు. తమ్ముడా! లక్ష్మణా! దివ్యాస్త్రములచేతను, బాణములచేతను, ఆకాశమునునిప్పుడే నిండించెదను. మఱియుముల్లోకములయందును సంచరించువారలకు సందులేనట్లు బాణపరంపరలచే నిండించెదను. మఱియునిప్పుడే నేనుచంద్రునిచలనమును నడ్డగింపజేసెదను సూర్యునినాశమును బొందించెదను అగ్నినిజల్లార్చెదను. నీళ్లనుయింకఁజేసెదను. పర్వతశిఖరములను చూర్ణములుగ చేసెదను. సముద్రములుమొదలగు జలాశయములను యింకజేసెదను.వృక్షములను తీగెలను, పొదలను, నాశమునుబొందించెదను, మఱియుశీఘ్రముగముల్లోకములను నాశముజేసెదనుచూడుము. లక్ష్మణా! దేవతలిప్పుడు నాకుసీతను క్షేమముగ నియ్యకున్నారుగదా. ఈక్షణమునందే నా పరాక్రమమును వారలకుజూపెదను చూడుము. లక్ష్మణా! సర్వభూతములును ఆకాశమునందు దిరుగుటకుసందులేకుండునట్లు నావింటియల్లెత్రాటినుండి విడువఁబడిన బాణపరంపరలచే నాకాశ బంతయునునిండించెదనుచూడుము మరియుప్రపంచమును నాబాణపరంపరలచే పీడింపఁబడినదిగను, భ్రాంతినొందినశించిన మృగములు పక్షులుగలదిగను, మిగులవ్యాకులమునుబొంది మర్యాదహీనంబైనదిగను చేసెదనుచూడుము లక్ష్మణా! నేనిప్పుడుయితరులచే, నడ్డగింప శక్యముగానివియును, ఆకర్ణాంతములాగి విడువఁబడినవియును, నగుబాణపరంపరలచే జీవలోకమునందు పిశాచములుగాని రాక్షసులుగాని లేకుండునట్లు చేసెదనుచూడుము మరియునిప్పుడుమహాకోపముచే ప్రయోగింపబడినవియును, బహుదూరము పోవునవియును, నగునాబాణముల బలమును దేవతలుచూడగలరు. లక్ష్మణా! నాకోపముచేత ముల్లోకములును నశించునేని, దేవదానవయక్షరాక్షసపిశాచములన్నియు వానితోడ నశించును మరియు దేవదానవయక్ష రాక్షసలోకములన్నియు నిప్పుడే నాబాణ పరంపరలచేత ననేకతునుకలైపోవును. లక్ష్మణా! అపహరింపఁబడినదా

నినైనను, లేకచచ్చినదానినైనను, నగుసీతనుదేవతలు నాకి
వ్వారు. కావుననిప్పుడు నాబాణపరంపరలచే సమస్తలోక
ములను నాశనముజేసెదను. మఱియు నాప్రియురాలగు సీ
తను నాకిప్పుడుయివ్వరేని చరాచరములతోగూడిన ప్రపం
చమును,మఱియుముల్లోకములను,నశింపజేసెదను, అనియి
ట్లు చెప్పి శ్రీమంతుఁడును వైరిపురములను జయించువాఁడు
ను, నగు రాముఁడు "ప్రళయకాలాగ్ని హోత్రమువలె"
మహాకోపమునుబొంది కోపాతిశయముచే నెఱ్ఱనైననేత్ర
ములు గలవాఁడగుచు కన్నులనుండి నిప్పులురాలఁజూచుచు,
ధనస్సుచేతబూని మిగులప్రకాశించు చున్నదియును, విషస
ర్పముతోసరిబోలి మహాభయంకరంబైనదియును, నగుబా
ణమునుసంధించి లక్ష్మణునిజూచి యిట్లనియె.

ఓతమ్ముడా! లక్ష్మణా! లోకమునందుండు సమస్తభూ
తములును, రాజాజ్ఞనుగాని, కాలమునుగాని, మరణమును
గాని, అదృష్టమునుగాని, దురదృష్టమునుగాని, యెప్పుడు
గాని, యెంతమాత్రముతప్పించు కొనజాలనియట్లు, మిగు
లకోపోద్దీపితుఁడనగు నన్నునివారింప సమస్తవిధములచేత
ను నెవరికినిశక్యముగాదు. మఱియుమిగుల అందములగు
దంతములు గలదియును, నింద్యముగాని నడవడికగలదియు
ను, నగుసీతనుయిప్పుడు మునుపటివలె నావద్దకు దెచ్చియియ్యం
చరేని, నేనిప్పుడు దేవతలతోను, గంధర్వులతోను, పన్నగు
లతోను, మనుష్యులతోను, పర్వతములుమొదలగు వాటితో
నుగూడిన సమస్తప్రపంచమును తలక్రిందుగజేసి నాశము
నుజేసెదను

ఇట్లుశ్రీమదారణ్యకాండమునందలి అరువదినాల్గవసర్గ
ముగిసెను.

—(*)—

{ రామలక్ష్మణులు మార్గమునందు తుత్తునకలైయుండు
రావణాసురుని రథముమొదలగు వాటినిజూచుట. }

అట్లుసీతాదేవినిగానక మిగులపరితపించు చున్నవాఁడు
ను, సమస్తలోకములను నశింపఁజేయ యత్నించినవాఁడు
ను, "ప్రళయకాలాగ్ని హోత్రమువలె" మహాకోపమును
బొందినవాఁడును, ఎక్కుపెట్టినవింటిని పలుమారుచూచు
చున్నవాఁడును, పలుమారునిట్టూర్పులను విడుచుచున్నవాఁ
డును, సమస్తప్రపంచమును నాశమునొందింపగోరి ప్రళ
యకాలరుద్రునివలెనున్నవాఁడును, అంతకుమున్నెపుడు
గాని జూడబడనిరూపమునుబొంది మహాకోపముతోనున్న
వాఁడును, నైనరామునిజూచి లక్ష్మణుఁడు చేతులనుజోడిం
చుకొని నమస్కరించి మెల్లగనిట్లనియె.

అన్నా! రామచంద్రా! నీవిదివఱకుమృదు స్వభావుడవు
ను, జితేంద్రియుండవును, సర్వభూతములకును మేలుచేయు
వాఁడవునునైయుండి యిపుడుకోపావేశమునుబొంది నీస
హజగుణమును విడుచుటన్యాయముగాదు. మఱియుచంద్రు
నియందు కాంతియును, సూర్యునియందు వెలుతురును, వా
యువునందు గమనశక్తియును, భూమియందు ఓర్పుగుణ
మును ఇట్లొక్కొకదానియం దొక్కొకగుణము మహోదృ
ఢముగనున్నవి, అయిననునీయందు యీగుణములన్నియు
ను, కీర్తియును, అసమానంబులైయున్నవి. కావుననొక్క
ని యపరాధమునకు సమస్తలోకములను నశింపఁజేయుట
యుచితముగాదు అదియునుగాక ఆయుధములతోను
యుద్ధసంబంధమైన పరికరములతోను, గూడియుద్ధమునకై
వచ్చి విఱిగిపడియుండు నీరథమెవ్వనిది? ఎవ్వనిచేతవిఱు
గఁ గొట్ట బడినది? ఏకారణముచేత విఱుగఁగొట్టఁబడినది?
యీవృత్తాంత మంతయు నాకుదెలియలేదు. రాజపుత్రుడ
వగునో రాముఁడా! యీప్రదేశమునందు గుఱ్ఱపుఅడుగు
లును, రథచక్రముయొక్క జాడలును, ఏర్పడియున్నవి. మఱి
యునెత్తురు బొట్లచేపడుపబడి మిగులభయంకరముగనున్న
ది. కావుననిచట మహాయుద్ధముజరిగినదనుట కెంతమాత్ర
మును సంశయములేదు. మాటలయందు పండితుడవగునో
రాముడా! ఈయుద్ధముఒకనిదేగాని, యిద్దఱిదిగాని బహు
మందిదిగానికాదు. ఏలననగానిచట గొప్పసైన్యముయొక్క
యడుగు జాడలగుబడలేదు. కావునఒకనికొఱకు లోకము
లనన్నిటిని నశింపజేయుట యుక్తముగాదు మరియురాజు
లు నేరమునకుదగిన శిక్షనువిధించువారును, దయాపరులు
ను, మిగులశాంతిమంతులును, నై యుందురు. నీవుసమస్త
ప్రాణులకును శరణ్యుడవు. పరమగతివి. రాముడా! నీకుభా
ర్యావియోగము గలుగుటమేలని యెవ్వడుచెప్పును? "యజ్ఞ
దీక్షితునకు ఋత్విక్కులు విరోధము చేయజాలనియట్లు" లో
కనాయకుడవగునీకు నదులుగాని సముద్రములుగాని, పర్వ
తములుగాని, దేవతలుగాని, గంధర్వులుగాని, దానవులు
గాని, విరోధమును చేయజాలరు. ఓఅన్నా! రామచంద్రా!
నీవుధనుర్బాణములను ధరించినేను వెంట నంటినడువమహ
ర్షుల సహాయమువలన సీతనుఅపహరించినవానిని వెదుకు
ము మనమిద్దరమును ఒకటిగజేరి మహామెళుకువతో దేవ
లోకములయందును గంధర్వలోక ములయందును నీభార్య
నపహరించిన వాడగపడువరకు వెదకుము. కోసలదేశాధీ
శుండవగునో రామా! దేవతలునీభార్యను సామోపాయ
ముచే నివ్వరేనిపిమ్మట కాలానుగుణ్యముగ జేయవచ్చును.
రాముడా! సదాచారముచేతను, సామోపాయముచేత
ను, వినయముచేతనునయముచేతను సీతనుయివ్వరేనిపిదప

కాంచనభూషణములుగల దేవేంద్రుని వజ్రాయుధముతో సమానములైనవియును, నగు బాణములచే సమస్తమును నాశనము జేయవచ్చును.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువదిరెండవసర్గ ముగిసెను.

▶(❋)◀

రామునకు లక్ష్మణుడు నీతిని దెలియ జెప్పుట

అంత మహావ్యసనముచే బరితపించుచున్నవాడును, అనాథవలె విలపించుచున్నవాడును, మిగుల వ్యామోహమును బొంది హాహాయని యేడ్చుచున్నవాడును, మిగుల జడునివలెనున్నవాడును, నగు రాముని సుమిత్రాపుత్రుడగు లక్ష్మణుడు ముహూర్తకాలములో నూరడింపజేసి పాదములను బట్టుకొని యిట్లనియె.

అన్నా! రాముడా! మహాప్రయత్నముచే దేవతలు అమృతము సంపాదించినట్లు దశరథమహారాజు గొప్పతపస్సును గావించుటచేతను, మహాయజ్ఞము జేయుటచేతను, నిన్ను బొందె. మఱియు దశరథమహారాజు నీ సుగుణములసంపత్తిచే బద్ధుడైయుండి నీవియోగముచేత స్వర్గస్థుడాయెనని భరతునివలన వింటిమి అన్నా! రామచంద్రా! ఇప్పుడీవ్యసనమును నీవే సహింపజాలవేని యల్పుడును, అల్పబలము గలవాడును, నగు మానవుడెవడు యిట్టిదుఃఖమును సహింపగలడు? పురుషోత్తముడవగు నో రామా! నీవు మహావ్యసనపీడితుడవై నీ తేజస్సుచే సమస్త లోకములను దహింతువేని, ఆపదను బొందిన జనులు ఎవ్వనివలన సుఖమును బొందగలరు? మఱియును కష్టములను బొందుట లోకసహజముగనున్నది. నహుషునిపుత్రుడగు యయాతి యింద్రసాలోక్యమును బొందియును మఱలనతడు మహాదుఃఖమును బొందె. అదియునుగాక మనతండ్రికిని మనకును పురోహితుడును, మహర్షి యని ప్రఖ్యాతిని బొందినవాడును, నగు వసిష్ఠునికి నూర్గురుపుత్రులు గలిగి నూరుగురును చంపబడిరి. సత్యపరిపాలుడవగు నో రామా! సమస్తలోకములకును తల్లియును, సమస్తలోకములకును వందనీయురాలును, నగు భూదేవికిగూడ చలనము గలుగుచున్నది. మఱియు ధర్మస్వరూపులును, సర్వలోకములకును నేత్రములవంటివారును, సమస్తమును తనయందు గలవారును, మహాబలులునునగు చంద్రసూర్యులునుగూడ గ్రహణముయొక్క బాధను బొందుచున్నారు. పురుషశ్రేష్ఠుడవగు నో రాముడా! సమస్తభూతములును దేవతలును, సర్వభూతాంతర్యామియగు దైవమును అతిక్రమింపజాలరు. శ్లో॥ శక్రాదిష్వపి దేవేషు వర్తమానౌ నయానయౌ ॥ అన్నా! రామచంద్రా! దేవేంద్రుడాదిగాగల దేవతలయందును గూడ సుఖదుఃఖములున్నట్లు వినబడుచున్నది. కావున నీవు వ్యసనపడవలదు. అనఘాత్ముడవును శౌర్యవంతుడవును నగు నో రామా! సీతాదేవి నశించిపోయినను, లేక నపహరింపబడినను, నీవు మూఢుడగు మానవునివలె వ్యసనమును బొందుట యుచితముగాదు అన్నా! రామా! నిరంతరము సత్యపరిపాలనము జేయువారును, కల్మషము లేని వివేకముగలవారును, నగు నీవంటివారు యెంతగొప్పకష్టములయందును వ్యసనమును బొందరు పురుషోత్తముడవగు నో రాముడా! నీ తత్త్వబుద్ధిచే లెస్సగ నాలోచించి చూడుము. మిగుల పండితులగువారు తమకు రాబోవు మేలుకీడులను లెస్సగ నాలోచించి తెలిసికొందురు. మఱియు పూర్వజన్మమునందు జేసిన కార్యములయొక్క ఫలములు యిప్పు డనుభవమునకు వచ్చును. అవి యిట్టివని నిశ్చయింపనలవిగావు. వాటిని యనుభవము వలననే తెలిసికొనవలయును. రాముడా! నీవేమున్న నాకీసంగతుల నన్నిటిని జక్కగా బోధించితివి. సాక్షాద్బృహస్పతిగూడ నీకు బోధింపసమర్థుడుగాడు. అట్లుండగా నీకెవ్వడు బోధింపగలడు? మహామతిమంతుడవగు నో అన్నా! రామా! నీప్రజ్ఞను దేవతలుగూడ తెలిసికొనసమర్థులుగారు. ఇప్పుడు తెలివి వ్యసనవేగముచే మఱుగుబడియున్నది కావున నేను నీకు దానిని జ్ఞాపకపరుచుచున్నాను. ఇక్ష్వాకువంశోద్భవులలో నుత్తముడవగు నో రామా! స్వర్గమునందలి జీవకోట్లును, మనుష్యలోకమునందలి జీవకోట్లును, చంపగూడని వని యెఱిగి నీపరాక్రమమునకు తగినట్లు శత్రువును చంపుటకు యత్నింపుము. పురుషోత్తముడా! అన్నా! రామచంద్రా! శత్రువునిమిత్తమై సమస్తలోకములను నాశమునొందించుటచే నేమిప్రయోజనము? నీవు, మహాపాపియగు శత్రువును దెలిసికొని వానిని వధింపుమని లక్ష్మణుడు రామునితో జెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువదియాఱవ సర్గము ముగిసెను.

రామలక్ష్మణులు మార్గమునందు జటాయువును జూచుట.

ఇట్లు లక్ష్మణుడు యుక్తియుక్తమగు మాటను మిగుల నింపుగా జెప్పినంతనే, విషయమును జక్కగా గ్రహించువాడగు రాముడు తాను పెద్దవాడైనను లక్ష్మణుని మాటను వినెను అట్లు విని పిదప మహాబాహుడగు రాముడు తనకు గలిగిన కోపమును పశమింపజేసికొని చిత్రవర్ణమగు ధనుస్సునందలి బాణములను అంబులపొదిలో వేసి లక్ష్మణుని జూచి యిట్లనియె

వత్సా! లక్ష్మణా! ఏమిచేయుదము? ఎక్కడికి బోవుదము? ఏయుపాయముచే సీతనుకనుగొందును? అనిరాముడు లక్ష్మణునడిగె. అంతలక్ష్మణుడు మహావ్యసనపీడితుడగు రామునితో నిట్లనియె. రామా! మునను, అనేకమందిరాక్షసులచే నొప్పుచున్నదియును, పలువిధములైన చెట్లతోను తీగెలతోను ప్రకాశించుచున్నదియును, నగుసీజనస్థానమునందే వెదుకవలయును. మఱియు నీజనస్థానమునందు పర్వతదుర్గములును, విఱిగినరాళ్లసందులును, తిప్పలసందులును, నానావిధములైన మృగములచే నిండియుండెడు పలుతెరంగులైన గుహలును, గంధర్వులుండెడి స్థలములును, కిన్నరులు వాసముచేసెడి స్థలములును గలవు. మనమిద్దఱమునుయీస్థలములయందంతటను సీతను వెదకుదము. పురుషోత్తముడవగు రాముడా! మిగుల బుద్ధిమంతులును మహాత్ములును, నగునీవంటివారు "వాయువేగమునకు పర్వతములుచెలింపనియట్లు" యెట్టియాపదలకును భీతినొందరు. అనియిట్లు లక్ష్మణుడు చెప్పగావిని రాముడు కుపితుడై యర్ధచంద్రాకారబాణమునుధనువునందు సంధించి లక్ష్మణసమేతుడై యావనమునందంతటను దిరిగె. అట్లాయడవియందు తిరుగుచు రాముడు, పర్వతశిఖరమువలె ప్రకాశించుచున్నవాడును, మహాభాగుడును, పక్షిశ్రేష్ఠుడును, నేలపైబడి నెత్తురుగ్రక్కి పొరలుచున్నవాడును, నగుజటాయువును జూచె. రాముడట్లుపర్వతమువలెఆకారము గలవాడైయున్న జటాయువును జూచిలక్ష్మణునితో నిట్లనియె.

లక్ష్మణా! జనకమహారాజపుత్రికయగు సీతను యితడే భక్షించియుండును అందుకొంతమాత్రమును సంశయముండదు. లక్ష్మణుడా! వీడురాక్షసుడు. గృధ్రరూపమునుధరించి యీయరణ్యమునసున్నాడు. ఇదినిశ్చయము. వీడువిశాలములగు నేత్రములుగల సీతను భక్షించి యథాసుఖముగనున్నాడు కావున మండుచున్న ముఖములుగలవియును, మహాభయంకరములైనవియును, చక్కగబోవునవియునగు బాణములచే నీరాక్షసునిజంపెదను అని రాముడు లక్ష్మణునితో జెప్పిమహాక్రుద్ధుడై ధనువునెక్కుపెట్టి బాణమును సంధించి సముద్రముచేజుట్టబడిన భూమినంతయు గడగడవడకునట్లుచేయుచు నాగద్దయొద్దకుబోయె అతజటాయువు, మిగులదీనుడగు రామునిజూచి, మహాదీనవాక్యములతో నెత్తురుదబ్బలు గ్రక్కుచు నిట్లనియె.

దీర్ఘాయుష్మంతుడవగు రాముడా! నీవు ఎవతెను "దివ్యౌషధమునువలె" యీయరణ్యమునందు వెదకుచున్నావో యాసీతాదేవిని, నాప్రాణములను, రావణాసురుడపహరించె. రాముడా! నీవునులక్ష్మణుడును లేనికాలమున మహాబలవంతుడగు రావణాసురుడు సీతాదేవిని అపహరించుకొని పోవుటను నేనుజూచితిని. అంత నేను సీతకొఱకు రావణాసురునిపైకి యుద్ధమునకుబోయి అతనిరథమును విఱుగగొట్టి యతనిని నేలపైబడద్రోసితిని. రాముడా! యుద్ధమునందు నాచేవిఱువబడిన యారావణాసురుని ధనస్సుయిదిగో చూడుము. నేనువిఱుగగొట్టిన యతనికవచము యిదిగోనున్నది చూడుము యుద్ధమున నేనువిఱుగగొట్టిన యాతనియుద్ధరథంబిదిగో చూడుము. వీడురావణాసురుని సారధి. ఇతనినియుద్ధమునందు నాఱెక్కలచేజంపి నేలంగూల్చితిని. పిమ్మట నేను మిగులనలసియుండుటనుజూచి యారావణాసురుడు ఖడ్గమును తీసికొని నాఱెక్కలను ఖండించి జనకమహారాజకూతురగు సీతాదేవిని యెత్తికొని యాకాశమార్గమున నెగిరిపోయె. కావున నేను ఆరాక్షసునిచే జంపబడితిని. నన్నునీవు మఱలజంపవలదు. అనిజటాయువు చెప్పగావిని సీతనుగుఱించినదియును, మిగుల ప్రియమైనదియును, నగువృత్తాంతమును ఎఱింగి మహావ్యసనపీడితులై కండ్లనిండనీళ్లుగ్రక్కుకొనుచు మిగుల నార్తుడయ్యె. అట్టురాముడు మిగులదుఃఖితుడై చేతనున్న గొప్పధనుస్సును నేలంబడవైచి గృధ్రరాజమగు జటాయువును కౌగిలించుకొని మహాదుఃఖపరవశుడై నేలంబడె లక్ష్మణుడును తానును గట్టిగా నేడ్చిరి. మఱియు జటాయువు ఒక్కడే ప్రవేశింపనలవిగానియిరుకుమార్గమునందుబడి అతిప్రయాసముచే నిట్టూర్పులను విడుచుచుండె అట్టిజటాయువునుజూచి రాముడు మఱియును వ్యసనపీడితుడై లక్ష్మణునితో నిట్లనియె

లక్ష్మణా! రాజ్యభ్రంశమునుబొందుట, అరణ్యవాసముజేయుట, సీతనుపోగొట్టుకొనుట, జటాయువుచంపబడుట, అనునీనాదౌర్భాగ్యము అగ్నినైనను కాల్చును. లక్ష్మణా! ఇప్పుడు నేను పూర్ణముగనిండియుండెడు సముద్రమునందు ప్రవేశించినను, నాదౌర్భాగ్యముచే నదీపతియగు సముద్రుడుగూడ యింకిపోవును మఱియు నిట్టిమహావ్యసనములందు జిక్కియుండు నాకన్నునధికదౌర్భాగ్యుడు స్థావరజంగమరూపములతోనిండియుండు యీప్రపంచమునందెచటనులేడు. సౌమ్యుడా! లక్ష్మణా! నాతండ్రికి పరమహితుడును, మిగులముసలివాడును, నగునీజటాయువు నాదౌర్భాగ్యమువలన హతుడై భూమియందు బడియున్నాడు. అనియిట్లు రాముడనేకవిధముల జెప్పుచు, లక్ష్మణుడును తానును తమతండ్రియందలి స్నేహగౌరవములనుజూపుచు నాజటాయువుశరీరమునంతయు స్పృశించిరి. మఱియునట్లు రెక్కలదిగిన యంతరాముడు, ఱెక్కలు తెగనఱుకబడినవాడును, రక్తప్రవాహమునను మునుగుచున్నవాడును, నగుజటా

యువునుకౌఁగలించుకొని జటాయువా! నాప్రాణములతోసమానమైనసీత యెచటనున్నది? అని యడిగి దుఃఖపరవశుఁడై నేలపైఁబడె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువదియేడవసర్గ ముగిసెను.

—{ రావణాసురునిచే జంపబడిన జటాయువును రామలక్ష్మణులుసంహరించుట. }—

అంతకొంతదడవునకు రాముఁడు తెలివినొంది, మహాభయంకరుఁడగు రావణాసురునిచేవధింపఁబడి భూమిపైఁబడియున్నజటాయువునుజూచి, యంత పరమమిత్రుఁడగు సుమిత్రాపుత్రుఁడైనలక్ష్మణునితోనిట్లనియె.

లక్ష్మణా! ఈపక్షిరాజమగు జటాయువునాకొఱకుమహాప్రయత్నముతోయుద్ధమును జేసి రావణాసురునిచేవధింపఁబడి విడువరాని ప్రాణములను యిప్పుడు విడుచుచున్నది. లక్ష్మణా! ఈతఁడింకనుచావలేదు. దేహమునందుప్రాణములున్నవి. ఇదిమనకు మేలైనది. అయినసితఁడుమిగులహీనస్వరముతోఁగూడినవాఁడును పరవశుఁడును నై యున్నాఁడు. అని యిట్లు రాముఁడులక్ష్మణునితోఁజెప్పి యంతజటాయువుదిక్కునకుఁ దిరిగిచూచియిట్లనియె.

జటాయువా! నీకిప్పుడు మాటలాడుటకుశక్తిగలదేని సీతావృత్తాంతమునువిశదముగ జెప్పుము. నీకుమంగళమగుగాక! నీయొక్కవధాక్రమమునుగూడ జెప్పుము రావణాసురుఁడు ఏమికారణముచే సీతనపహరించె? ఏయపరాధముననైనా ప్రియురాలిని యతఁడపహరించె? అంతటి యపరాధమతనికి నేనేమిచేసితిని? పక్షిరాజమగు జటాయువా! చంద్రబింబముతో సమానమైనదియును, మిగులమనోజ్ఞమైనదియును, నగు నాసీతముఖమప్పుడెట్లుండె? అప్పుడుసీతయేమిచెప్పినది? నాయనా! జటాయువా! ఆ రాక్షసునిశౌర్యమెట్టిది? ఎట్టిరూపముగలవాఁడు? అతనికార్యములెట్టివి? అతనివాసస్థానం బెక్కడ? ఇవన్నియు నాకువిశదముగ దెల్పుము. అనియిట్లు పరమవ్యసనపీడితుఁడై యడిగిన రాముని జూచిజటాయువు మిగులదీనవాక్యములతోనిట్లనియె. నాయనా! రాముఁడా! రాక్షసరాజగు రావణాసురుఁడు తనమాయచేమహావాయువును, మేఘమునుకల్పించి చీకట్లుగమ్మునట్లుచేసి గగనమార్గమున సీతాదేవినెత్తికొనిపోయె. నాయనా! రామచంద్రా! ఆ రాక్షసుఁడు నేనుమిగులనలసియుండుటనుజూచి, నా ఱెక్కలు తెగనఱికి, వైదేహునికూతురగు సీతాదేవినిదీసికొని దక్షిణాభిముఖుఁడైపోయె. రాముఁడా! నాప్రాణములడ్డగింపఁబడుచున్నవి. దృష్టిచెదరుచున్నవి. వట్టివేరువంటిమూర్ధజములుగల బంగారువృక్షములుగనబడుచున్నవి. నాయనా! రాముడా! రావణాసురుడుసీతాదేవిని యేముహూర్తమున నపహరించుకొని వేచెనో, ఆముహూర్తమునందుబోయిన ధనముస్వల్పకాలములోనేయజమానునిచేరును. రాముఁడా! ఆముహూర్తమునకు విందముహూర్తమనిపేరు. ఇదిరావణాసురునకుఁదెలియదు. మఱియునీప్రియురాలగు సీతాదేవినపహరించినరాక్షసేశ్వరుఁడగు రావణాసురుడు "గాలమును మ్రింగినమత్స్యమువలె" శీఘ్రకాలములోనే నాశనమొందును. నాయనా! రామచంద్రా! జనకమహారాజుకూతురగుసీతాదేవివిషయమైనీవెంతమాత్రమును వ్యసనపడవలదు. శీఘ్రకాలములోనే నీవా రాక్షసుని యుద్ధమునందుజంపి సీతనుగూడిసుఖముగనుండగలవు అనియిట్లు మహాతెలివితో మాటలాడుచున్నవాఁడున, మరణావస్థయందున్నవాఁడును, నగునాజటాయువుయొక్కనోటనుండి కండలనురక్తమును బైలువెడలెను. అప్పుడుజటాయువు, రామునిజూచినాయనా! రామచంద్రా! "ఆరావణాసుఁడు విశ్రవసునికుమారుఁడు, కుబేరునితమ్ముఁడు" అనిచెప్పి యాపైనేమియుం జెప్పజాలక దుర్లభములగు ప్రాణములనువిడిచె. అట్టియెడ రాముఁడు చేతులనుముకుళించుకొని జటాయువా! జటాయువా! "చెప్పుము, చెప్పుము" ఇంకను జెప్పుము. అని యడుగుచుండగానే జటాయువుయొక్కప్రాణములు దేహమునందుండి బైలువెడలి ఆకాశమునుబొందె. అట్లుప్రాణములుపోవునప్పుడుఆజటాయువుతనతలనుభూమిమీదనుంచి, కాళ్ళనుజాచుకొనిపడుండి దేహముఅదురిదుర ప్రాణములనువిడిచె. అంతయెఱ్ఱనికన్నులనొప్పుచున్నవాఁడును, పర్వతాకారముతో పడియున్నవాఁడును, నగు నాజటాయువునుజూచి రాముఁడు మహాదుఃఖపీడితుఁడై లక్ష్మణునితో నిట్లనియె.

లక్ష్మణా! ఈజటాయువు, అనేకసంవత్సరములనుండి రాక్షసావాసంబగు నీదండకారణ్యమున సుఖముగనుండియిపుడు మనకుమిత్రుఁడుగా ప్రాణములను పోగొట్టుకొనెను. మఱియు ననేకవేలసంవత్సరముల వయసుగలవాఁడును, బహుకాలమువృద్ధినొందినవాఁడును, నగుజటాయువుగూడచచ్చి నేలపైబడియున్నాఁడు శ్లో॥ కాలోహిదురతిక్రమః॥ కాలమతిక్రమింపఁగూడనిది అనగా కాలమతిక్రమింప నెవ్వరికినిశక్యముగాదు లక్ష్మణా! ఈజటాయువు నాకుఉపకారముచేయుటకై సీతనుసంరక్షింపఁబోయిమహాబలశాలియగు రావణాసురునిచే జంపఁబడెను. చూడుము. మఱియు నీపక్షిరాజగుజటాయువు, తనతండ్రితాతలవలన బొందఁబడినదియును, మిగులగొప్పదియు

ను, నగు ప్రభుత్వమును విడిచి నాకొఱకు ప్రాణములను పోగొట్టుకొనె. శ్లో॥ సర్వత్ర ఖలు దృశ్యంతే సాధవో ధర్మచారిణః। శూరాశ్శరణ్యాస్సౌమిత్రే తిర్యగ్యోనిగతేష్వపి॥ సుమిత్రానందనా! లక్ష్మణా! ప్రపంచమున మృగపక్షిజాతులలోఁ బుట్టినవారియందును గూడ సాధువులును, ధర్మమునాచరించువారును, యుద్ధవీరులును, శరణుఁబొందఁదగినవారును, గనఁబడుచున్నారు గదా! సౌమ్యుఁడా! శత్రువులను జంపునట్టి లక్ష్మణుఁడా! నాకొఱకు యీ జటాయువు చచ్చుటచే గలిగిన వ్యసనము, నాకు సీతాపహరణముచేతగూడ కలుగలేదు. పక్షియు శ్రీమంతుఁడును, మిగుల కీర్తిమంతుఁడును, నగు దశరథమహారాజువలెనే యీ జటాయువును నాకు మిగుల పూజనీయుఁడు గౌరవింపఁదగినవాఁడు. కావున నో లక్ష్మణా! కట్టెలు తీసికొనిరమ్ము కట్టెలను మథించి నిప్పు సంపాదించి నానిమిత్తమై చచ్చిన యీ జటాయువును దహనముచేసెదను. సుమిత్రానందనా! లక్ష్మణా! పక్షిసమూహములకు రాజును, మహాభయంకరుఁడగు రాక్షసునిచేఁ జంపఁబడినవాఁడును నగు నీ జటాయువును చితిమీఁద బెట్టి దహనము చేసెదను అని ల[illegible] [illegible]ణితోఁ జెప్పి యంత రాముఁడు జటాయు[illegible] ట్లనియె.

[illegible]ఁడవును గృధ్రరాజవును, నగు నో జటాయువా! నీవు నాచే నగ్నిసంస్కారము చేయఁబడినవాఁడవై, యజ్ఞయాగాది క్రతువులు చేయువారు ఏలోకమును బొందుదురో, ఆహితాగ్నులు ఏలోకమును బొందుదురో, సన్యసించినవారు ఏలోకమును బొందుదురో, భూదానగోదానములు చేసినవారు ఏలోకమును బొందుదురో యట్టి యుత్తమలోకములన్నిటిని నావలన ననుజ్ఞ వడసి నీవు పొందుము. అని యిట్లు ధర్మాత్ముఁడగు రాముఁడు చెప్పి, పరమ దుఃఖితుఁడై పక్షిరాజగు జటాయువును చితిపైనుంచి తన బంధువునువలె మంత్రసహితముగ దహనమును జేసె. అట్లు దహనకర్మ గావించి యంత మహాశౌర్యవంతుఁడగు రాముఁడు లక్ష్మణసమేతుఁడై యరణ్యమునకుఁబోయి గొప్ప కేసరిమృగములను జంపి తెచ్చి యా జటాయువునకు బిండదానము సేయుటకొఱకు దర్భలను బఱచె. అంత మిగుల కీర్తిమంతుఁడగు రాముఁడు ఆ కేసరీమృగమాంసమును దీసి ముద్దజేసి మిగుల రమణీయమగు పచ్చిక నేలపై యా జటాయువునకుఁ బిండప్రదానము గావించె. అట్లు పిండప్రదానమును గావించి యంత "వచ్చినవానికి స్వర్గలోకమును గలిగించుమని" బ్రాహ్మణులు చెప్పెడి పితృదేవతాకమైన మంత్రమును ఆ జటాయువుకొఱకు రాముఁడు జపించె, అంత నా రాజపుత్రులగు రామలక్ష్మణులిద్దరును గోదావరీనదికిఁబోయి యా జటాయువునకు జలతర్పణమును జేసిరి. ఆ జటాయువు మహాకీర్తికరంబైనదియును, మిగుల దుష్కరంబైనదియును, నగు కార్యమును జేసి యుద్ధమునందు జచ్చెను కావున, మహర్షిసమానుఁడగు రామునిచే నగ్నిసంస్కారాదిక్రియలను బొంది మంగళకరమును బుణ్యమును, నగు స్వర్గలోకమును బొందెను. అంత దేవతలకు ప్రభువులైన విష్ణుదేవునితోను నింద్రునితోను సమానులగు నా రామలక్ష్మణులు, జటాయువునకు జలతర్పణమును గావించి జటాయువు చెప్పిన మాటయందు దృఢవిశ్వాసము గలవారై సీతాదేవిని వెదకుటకొఱకు నరణ్యమునందు బ్రవేశించిరి.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువదియెనిమిదవసర్గము ముగిసెను.

-(*)

రామలక్ష్మణులు కబంధుఁడను రాక్షసుని జూచుట.

అంత రామలక్ష్మణులు జటాయువునకు జలతర్పణము [illegible] లు వెడలి యరణ్యమునందు సీతాదేవిని వెదకుచు పశ్చిమదిశకుఁబోయిరి. ఇక్ష్వాకువంశోద్భవులగు నా రామలక్ష్మణులు ధనుర్బాణములను ఖడ్గమును ధరించి కొంతదూరముబోయి యంత దక్షిణాభిముఖులై, అనేకములైన పొదలతోను, చెట్లతోను తీగెలతోను, దట్టముగ గప్పఁబడియున్నదియును, ఎవరికిని జొరనశక్యంబైనదియును, మహాభయంకరమైనదియును, సంచారము లేనిదియును, నగు నొక మార్గమునందు బ్రవేశించిరి. అట్లా మార్గమునఁబోయి మహాబలపరాక్రమశాలులగు నా రామలక్ష్మణులు, సింహములు మొదలగు క్రూరమృగముల సంచారముచే మహాభయంకరముగనుండు ఆ యరణ్యమును యతివేగముగ దాటిపోయిరి. అంత మహాశౌర్యవంతులగు నా రామలక్ష్మణులు జనస్థానమును అతిక్రమించి మూఁడుకోసుల దూరముపోయి దుర్గమమగు క్రౌంచారణ్యమునందు బ్రవేశించిరి. అట్లు క్రౌంచారణ్యమును బ్రవేశించి, సీతాపహరణముచే మహావ్యసనపీడితులైయున్న యా రామలక్ష్మణులు, పలువిధములైన మేఘసమూహములవలెనున్నదియును, ఎచట జూచినను మహాసంతోషకరముగనున్నదియును, నానావిధములైన పక్షులతో నొప్పుచున్నదియును, పలువిధములైన సర్పములతోను దుష్టమృగములతోను నొప్పియున్నదియును నగు నా క్రౌంచారణ్యమునందు అచ్చటచ్చట విశ్రమించుచు సీతను వెదకుచుబోయిరి.

అంత నా రామలక్ష్మణులు ఆ క్రౌంచవనమునందు తూ

ర్భుసికుఁడనై మూడు క్రోసులదూరముపోయి యాక్రౌంచారణ్యమును అతిక్రమించి మతంగాశ్రమ సమీపమునందు మహాభయంకరమైనదియును, మహాభయంకరములగు మృగపక్షులతో నొప్పుచున్నదియును, నగు నొకయరణ్యమును జూచి యావనమునందంతటను తిరిగి యందు దశరథమహారాజపుత్రులగు నా రామలక్ష్మణులు, పాతాళలోకమువలె అతిగంభీరంబైనదియును, ఎన్నటెన్నటికి చీకటితో నొప్పుచున్నదియును, నగు నొక గుహను జూచిరి అట్లా గుహను జూచి, పురుషశ్రేష్ఠులగు నా రామలక్ష్మణులు ఆగుహాయొద్దికిఁ బోయి యచట గొప్ప యాకారముగలదియును, వికారమైన నోరుగలదియును, నగు నొక రాక్షసిని జూచిరి మఱియు అన్నదమ్ములగు నా రామలక్ష్మణులు, అల్పజంతువులకు భయము గలుగజేయునదియును, వికృతరూపముగలదియును, భయంకరమైన మోముగలదియును, వ్రేలుచుండు కడుపుగలదియును, మహాతీక్ష్ణములగు కోరలు గలదియును, గొప్పదేహముగలదియును, మహాకఠినమైన చర్మముగలదియును, మహాభయంకరములగు మృగములను దినునదియును, భయంకరమైన యాకారముగలదియును, తలవెండ్రుకలు విరియబోసికొని యున్నదియును, నగు రాక్షసిని జూచిరి. అంత నా రాక్షసి మహాపరాక్రమశాలులగు నా రామలక్ష్మణులు సమీపమునకు రాగానే మనమిరువురము సంభోగము జేయుదము రమ్మని, అన్నకు ముందర బోవుచున్న లక్ష్మణుని చేయిబట్టుకొనెను. అట్లా రాక్షసి లక్ష్మణుని బట్టుకొని గట్టిగా కౌగలించుకొని యిట్లనియె.

పరాక్రమవంతుఁడవగు నో ప్రాణనాథా! నన్ను అయోముఖియందురు. నేను నీకు లభ్యమైతిని నీవు నాకు పెనిమిటివి ఇంక నీవు నీజీవితకాలమంతయు పర్వతశిఖములయందును, యేళ్ళలోని యిసుకదిన్నెలయందును నాతోఁ గూడి రమింపుచు సుఖము ననుభవింపుచుండుము. అని యా రాక్షసి చెప్పె. అంతట శత్రుసంహారకుఁడగు లక్ష్మణుఁడు మిగుల కోపోద్దీపితుఁడై కత్తిదీసికొని యా రాక్షసి యొక్క ముక్కు చెవులును స్తనములను తెగగోసివైచె అట్లు లక్ష్మణుండు ముక్కు చెవులును స్తనములను కోయగానే, మహాభయంకరస్వరూపురాలగు నా రాక్షసి వికృతస్వరముతో నేడ్చుచు వచ్చినదారి నే బట్టి పరుగెత్తిపోయెను అంత నా రాక్షసి పరుగెత్తిపోగానే శత్రుసంహారకులగు నా రామలక్ష్మణులు మిగులపరాక్రమముతో దుష్ప్రవేశమగు నవ్వనమునందు ప్రవేశించి కొన్ని దుర్నిమిత్తములను గనిరి అంత మహాబలపరాక్రమశాలియును దీప్తతేజుఁడును, నగు లక్ష్మణుఁడు మిగులపరాక్రమశాలియగు రామునకు చేతులను ముకుళించుకొని నమస్కరించి యిట్లనియె.

అన్నా! రాముడా! నా యెడమభుజము మిగుల నదరుచున్నది. నామనస్సు మిగుల జాలిగనున్నది. అనేకములగు దుర్నిమిత్తములు గనుపించుచున్నవి. పూజ్యుఁడవగు రామా! కావున నీ విప్పుడు సన్నద్ధుఁడవై యుండుము, హితముగు నా మాట వినుము. ఈదుర్నిమిత్తములను చూడగా యిప్పుడే యేదైనను తొందర గలుగునని తోచుచున్నది. మఱియు నీ వంచులక మను పక్షి మహాభయంకరముగ నఱచుటను జూడగా యుద్ధమునందు మనకు జయము గలుగునని చెప్పుచున్నట్లున్నది అని లక్ష్మణుఁడు రామునితోఁ జెప్పె. అట్లు రామలక్ష్మణులు మహాపరాక్రమముతో నాయరణ్యమునందంతటను సీతాదేవిని వెదకుచుండగా నావనమునంతయు విఱుచుచున్నట్లు యొక మహాధ్వని గలిగె ఆయ్యరణ్యమున గలిగిన యామహాధ్వని వాయువుతో మిళితంబై యాకాశమునిండి యుండినది. అంత రాముఁడు ఆశబ్దము యొక్క మూలమును దెలియఁగోరి తమ్మునితోఁ గూడపోయి వెదకి ఒకచోట మిగుల గొప్ప దేహముగలవాఁడును, విశాలమగు ఱొమ్ము గలవాఁడును నగు నొక రాక్షసుని జూచిరి మఱియు నచటికి సమీపమున నున్నవాఁడును, గొప్ప యాకారముగలవాఁడును, తలయును మెడయును లేనివాఁడును, కడుపులో నోరుగలవాఁడును, శరీరమునందంతటను దట్టముగ కఱుకైన వెండ్రుకలుగలవాఁడును, అత్యున్నతమై మహాపర్వతము వలెనున్నవాఁడును, నీలమేఘచ్ఛాయతో నున్నవాఁడును, మహాభయంకరుఁడును, మేఘగర్జనమువంటి ధ్వనితో నఱచుచున్నవాఁడును, నిప్పుమంటతో సమానమైనదియును మండుచున్నట్లున్నదియును, గొప్ప ఱెప్పలు గలదియును, పింగళవర్ణమైనదియును, మిగుల నిడుపై విశాలమైనదియును, ఱొమ్మునందున్నదియును, మిగుల ఘోరంబైనదియును, శీఘ్రదృష్టిగలదియును, నగు నొక కన్నుగలవాఁడును, పెద్దకోఱలుగలవాఁడును, నాలుకను గదలించుచున్నవాఁడును, పెద్దనోరుగలవాఁడును, మహాభయంకరములగు సింహములను యెలుగుబంట్లను యేనుఁగులను తినుచున్నవాఁడును, ఒక ఆమడ నిడుపుగలవియును, మహాభయంకరములైనవియును, నగు రెండుచేతులను జాచుచున్నవాఁడును, ఆచేతులతో పలువిధములైన యెలుగుబంట్లను పక్షిసమూహములను జింకలను మఱియు నానావిధములగు మృగసమూహములను బట్టియీడ్చి భక్షించుచున్నవాఁడును, సమీపమునకు వచ్చిన యా రామలక్ష్మణుల మార్గము నడ్డగించుచున్నవాఁడును, నగు నా రాక్షసుని రామలక్ష్మణులు చేరంబోయిరి అట్లు రామలక్ష్మణులు దెగ్గఱగబోయి,

గొప్పదేహము గలవాఁడును, మిగులభయంకరమైన యాకారముగలవాఁడును, చేతులతోనన్నిటిని లాగికొనుచున్నవాఁడును, మొండెమువలెనున్నవాఁడును భయంకరమైన మూపుగలవాఁడును, నగుకబంధుని క్రోశమాత్రమువఱాచిరి అంతపొడవైనచేతులుగల యాకబంధుఁడు విశాలములగు తనబాహువులనుచాచి రామలక్ష్మణులనిద్దఱిని ఒకటిగచేర్చి పట్టి తనభుజబలముచేలాగుకొనెను. అట్టియెడకత్తులను ధనుర్బాణములనుధరించినవారును, మహాకాంతిచేఁ ప్రకాశించుచున్న దేహములుగలవారును, మహాబలపరాక్రమశాలులును, నగురామలక్ష్మణులు కబంధునిచేనాకర్షింపఁబడివివశులైరి. ఆసమయమున మిగులశౌర్యవంతుఁడగు రాముఁడు మహాధైర్యమునుఅవలంబించి కొంచమైనను వ్యథనొందఁడాయె. లక్ష్మణుఁడు పసివాఁడౌటచే నంతధైర్యముచాలక మహాభయపీడితుఁడాయె. రామునితమ్ముఁడగులక్ష్మణుఁడట్లు పరమవ్యసనపీడితుఁడై రామునితోనిట్లనిచెప్పె. వీరుఁడవగునోరామా! నేనురాక్షసునిచేజిక్కిపరవశుఁడనైతినిచూడుము. నన్నువినియోగపఱచి నీవువిడిపించుకొనిపొమ్ము. నన్నీభూతమునకుబలిగానిచ్చి నీవువిడిపించుకొని సుఖముగపరుగెత్తిపొమ్ము. శీఘ్రకాలములోనె నీవుసీతాదేవిని బొడగలవని నాయభిప్రాయము. కాకుత్స్థవంశోద్భవుఁడవగు నోరామా! నీవుపోయి తండ్రితాతలవలన వచ్చినరాజ్యమునుబొంది రాజ్యపరిపాలనమును జేయుచు నిరంతరము నన్నుదలచుచుండుము. అనిలక్ష్మణుఁడు చెప్పె. అంతరాముఁడు లక్ష్మణునితో మఱలనిట్లనియె.

మహాశౌర్యవంతుఁడవగు నోలక్ష్మణా! సంతాపమును బొందకుము. నీవంటివాఁడు దుఃఖించుట యుచితముగాదు అనిరాముఁడులక్ష్మణునితోఁ జెప్పె. ఇట్లు రామలక్ష్మణులు మాటలాడుచుండగానే, మహాక్రూరుఁడును మేఘగర్జనమువంటి ధ్వనిగలవాఁడును, దానవోత్తముఁడును, నగుకబంధుఁడు రామలక్ష్మణులనిట్లనియడిగె. ఆబోతులమూపులవంటి మూపులుగలవారును, గొప్పకత్తులను ధనుస్సులనుధరించియున్నవారును, నగుమీరెవ్వరు? మహాభయంకరమగు నీప్రదేశమున కేలవచ్చితిరి? మీరిప్పుడు నాకుఆహారమైతిరి ఇచటికిమీరేమి పనిగలిగివచ్చితిరి? నేనమిగులక్షుద్బాధనుబొందియుండగా మీరిచటికి నాకాహారముగనేలవచ్చితిరి? ధనుర్బాణములను కత్తులనుధరించి "కఱకుకొమ్ములతోనొప్పుచున్న యాబోతులవలెనున్నవారై" మీరు నానోటిదగ్గిరకువచ్చితిరి ఇకమీరుజీవితులైపోఁజాలరు. అనిదురాత్ముఁడగు కబంధుఁడుచెప్పె. అంతరాముఁడునోటతడిలేక లక్ష్మణునిఁజూచి యిట్లనియె.

సత్యపరాక్రమవంతుఁడవగు లక్ష్మణా! ఆపదమైఆపదసంభవించుచున్నది కడపట నాప్రియురాలిని బొందకయే ప్రాణనాశమును మహాభయంకరమును, నగునీయాపదనుబొందితిమి. పురుషశ్రేష్ఠుఁడవగునోలక్ష్మణా! చూడుము, నీవును నేనును యిట్టికష్టములనుబొందితిమి. పురుషోత్తముఁడవగు నోలక్ష్మణా! సమస్తభూతములయందును కాలబలముమిగులగొప్పది. దానికెదురులేదు తమ్ముఁడా! లక్ష్మణా! సర్వభూతములయందును, కాలమునకు ఎదురైనది ఏదియునులేదు. మఱియు యుద్ధభూమియందు, మహాబలపరాక్రమశాలులును సమస్తాస్త్రవేత్తలును, నగువారుకాలహతులై యిసుకతోఁగట్టఁబడిన యనకట్టవలెనాశమొందుదురు. అనిచెప్పి దృఢమైన సత్యపరాక్రమముగలవాఁడును, మిగులకీర్తిమంతుఁడును, మహాశౌర్యవంతుఁడును, దశరథమహారాజపుత్రుఁడును, నగురాముఁడు మిగులభయంకరమైన పౌరుషముగల లక్ష్మణునిఁజూచి ధైర్యమునుఅవలంబించి తనబుద్ధిని నిలుకడఁబఱచుకొనె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి అరువదితొమ్మిదవసర్గ ముగిసెను.

రామలక్ష్మణులు కబంధుని సంహరించుట.

అట్లు కబంధునియొక్క బాహువులను త్రాళ్ళచేబంధింపఁబడినవారును, ఇటునటుకదలలేక నిలిచియున్నవారును, అన్నదమ్ములును, నగురామలక్ష్మణులనుజూచి కబంధుఁడు వారలతో నిట్లనియె.

రాజోత్తములారా! దైవముమిమ్ముల నాకాహారముగపంపెను. మీరిప్పుడు తెలివిదప్పినవారై క్షుధాతురుఁడనగునన్నుఁజూచి యేలనిలిచియున్నారు? అనిరాక్షసుఁడు చెప్పె అంతలక్ష్మణుఁడు మహావ్యసనపీడితుఁడై యతిప్రయత్నమును పరాక్రమమున నవలంబించి, కాలోచితమును హితమును నగుమాటను రామునితోఁజెప్పె. అన్నా! రాముఁడా! ఈరాక్షసాధముఁడు యింకనిన్నునునన్నును, మ్రింగును కావుననీరాక్షసునియొక్క దీర్ఘబాహువులనురెంటిని కత్తులచే శీఘ్రముగనఱుకుదము గొప్పశరీరముగలవాఁడును, మిగులభయంకరుఁడును, భుజములయందుమాత్రమే పరాక్రమముగలవాఁడును, నగునీరాక్షసుఁడు లోకమునంతయుజయించి యిప్పుడుమనలను జంపయత్నించుచున్నాఁడు. ప్రభువగునోరామా! యజ్ఞమధ్యమునకు తేబడిన పశువునుచంపరానియట్లు యేమియుఁజేయకనూరకుం

డు వారలనుజంపుట రాజునకు నింద్యమైనకార్యము అనిలక్ష్మణుడు రామునితోజెప్పె. ఇట్లు రామలక్ష్మణులు చెప్పుకొనుచుండుటనువిని, మహాభయంకరాకారుండగు కబంధుడు మిగులక్రుద్ధుడై నోరుదెరచి రామలక్ష్మణులను మ్రింగబోయె. అంత దేశకాలముల నెఱిగినయా రామలక్ష్మణులు, భయముచే వడవడవడకుచున్న యాకబంధునిచేతులను కత్తులచేమూపువఱకు కసుకసుమని ఖండించివైచిరి. అందు సమర్థుడగు రాముడు కత్తిదీసికొని అడ్డిలేకనతివేగముగ కుడిభుజమునునఱికె. శౌర్యవంతుడగులక్ష్మణుడు యెడమభుజమునునఱికె. అంతమహాబాహుడగు నాకబంధుడు చేతులు తెగనఱుకబడినవాడగుచు, మహాధ్వనిగదుర మేఘగర్జనమువలె భూమ్యాకాశములును సమస్తదిక్కులును నిండునట్లు అఱచుచు భూమిపైబడెను. అట్లు నేలంబడియాకబంధుడు రక్తప్రవాహమునమునిగి తేలుచు తెగపడియున్న తనచేతులనుజూచి మిగులదైన్యమునుబొంది శూరులగు నారామలక్ష్మణులనుజూచి మీరెవ్వరనియడిగె. అనియిట్లు కబంధుడడుగగానే శుభలక్షణలక్షితుడగు లక్ష్మణుడు మహాశౌర్యవంతుడగు నాకబంధునికి రామువృత్తాంతమంతయును యిట్లని తేటపడంజెప్పె. ఓరీ! కబంధా! ఈతడు యిక్ష్వాకు వంశోద్భవుడగు దశరథమహారాజపుత్రుడు. రాముడను పేరుచే ప్రసిద్ధిబొందినవాడు. నేనీతనికి తమ్ముడను. నన్ను లక్ష్మణుడందురు. మేము విజనమగు నరణ్యమునందు వనవాసముచేయుచుండగా దేవతాప్రభావముగల యీరామునిభార్యను రాక్షసుడపహరించుకొనిపోయె. మేము ఆసీతాదేవిని వెదకుచునిచ్చటికివచ్చితిమి. ఇంక నీవృత్తాంతమునుజెప్పుము. నీవెవ్వడవు? కబంధరూపముదాల్చి వికృతమగు కంఠముతోనొప్పుచు, ఱొమ్మున పెద్దనోరుగలవాడవై యీయరణ్యమునందు పొరలుచున్నావేల? అనిలక్ష్మణుడడుగగానే, కబంధుడు పూర్వము యింద్రుడు తనకు జెప్పినసంగతిని తలచుకొని తనకుశాపవిమోచన కాలమువచ్చినదని మిగులసంతసించి యిట్లనియె.

పురుషశ్రేష్ఠులారా! మీకుస్వాగతమగుగాక! నాభాగ్యవశముచే మిమ్ములనుజూచితిని. నాభాగ్యవశముననే నాభుజములుమీచేత నఱుకబడినవి. పురుషోత్తముడవగునో రాముడా! నాదుర్మార్గమువలన నాకీవికృతరూపమువచ్చిన వృత్తాంతమంతయు నీకువిశదముగ నెఱింగించెదనువినుము.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందు డెబ్బదియవసర్గముగిసెను.

—{రామలక్ష్మణులకు కబంధుడు తనశాపకారణమును జెప్పుట.}—

ఆజానుబాహుడవును, మిగులబలపరాక్రమవంతుడవునగు రాముడా! నాకు, పూర్వము, ఇంద్రునకును చంద్రునకును సూర్యునకునువలె యెన్నశక్యముగానిదియును, మూడులోకములయందును ప్రసిద్ధమైనదియును, నగుదివ్యరూపముగలిగియుండినది. రామచంద్రా! అట్టిరూపముతోనున్న నేను సర్వలోకములకును భయమునుగలిగించునట్టి యీఘోరరూపమునుధరించియచ్చటచ్చటవనమునందున్న ఋషులను భయపరచుచుంటిని. అంతనొకనాడు స్థూలశిరుడను మహర్షి వనమునందలి కందమూలఫలములకొఱకు యీయడవికివచ్చె. నేనీరూపమున నామహర్షిని బెదరించి రోషమునొందజేసితిని. అంతట నాస్థూలశిరుడు నన్నుజూచి "మహాక్రూరమును మిగులనిందితమునునగు నీరూపమే నీకునిరంతరముండుగాక" అనిమహాభయంకరముగ శపించె. అట్లుమహాక్రోధముచే శపించినయమ్మహర్షినిజూచి నాయపరాధముచేగలిగిన యీశాపమునకు అంతమునుఅనుగ్రహింపవలయునని ప్రార్థించితిని. అంతనాఋషి యిట్లనిచెప్పె

ఎప్పుడు రాముడు విజనమగు అరణ్యమునకువచ్చి నీచేతులను తెగనఱికి నిన్నుదహనముజేయునో అప్పుడు శుభమగు నీదివ్యరూపమును నీవుపొందుదువు. అనియిట్లు ఆనతిచ్చె. రామలక్ష్మణులారా! నేనుదనువంశోద్భవుడగు శ్రీయనువానికుమారుడను. రణరంగమున నింద్రునికోపమువలన నాకిట్టికబంధరూపము ప్రాప్తమైనది. మున్ను నేనుయుగ్రతపమునుగావించి బ్రహ్మదేవుని సంతోషపరచితిని. అంతబ్రహ్మదేవుడు నాకుదీర్ఘాయువునొసంగె. ఆవరప్రభావమువలన గర్వించితిని. అట్లుగర్వించి, నేనుదీర్ఘాయుష్మంతుడనైతిని. ఇంకనన్ను దేవేంద్రుడు ఏమిచేయగలడు. అనియెంచి యుద్ధమున నింద్రునియెదిరించితిని. అప్పుడు యింద్రుడు నూరంచులుగల వజ్రాయుధమును తనభుజబలముకొలది ప్రయోగించె. అంతనావజ్రాయుధము యొక్క దెబ్బవలన తలయును తొడలును దేహములోనికిపోయినవి. అప్పుడు నేను యింద్రునిజూచి యిట్టిరూపముతో నుండజాలను, నన్నుజంపుమని నేనెంతప్రార్థించినను యింద్రుడు నన్నువధింపక బ్రహ్మదేవుని వరముసత్యముగనుండవలయునని చెప్పె. అంతనేను, అయ్యో! వజ్రాయుధముయొక్క దెబ్బచేత తలయును మెడలును నోరునువిఱిగి, ఆహారముతినుటకు నోరులేకనిరాహారినై బహుకాలమెట్లుజీవింతునని యింద్రునితో మొఱపెట్టుకొంటిని. అంతయింద్రుడు నామొఱను ఆలకించి యొకయోజనముపొడవుచేతులనిచ్చి కడుపున దుర్ఘటకుక్షితో

నొప్పుచుండెడు నోటినినిర్మించె. అంత నేనీయరణ్యమునందు నీ యీ యుదరమును పెద్దదిగానుండెడి యేనుఁగులను పెద్దపులులను జింకలను సింహములు మొదలగు మృగములనన్నిటిని నాపొడవుచేతులతోఁబట్టి తినుచున్నాను. మఱియును యింద్రు డిట్లనియె.

ఎప్పుడు రాముడు లక్ష్మణసమేతుఁడైవచ్చి యుద్ధమునందు నీచేతులను తెగనఱుకునో అప్పుడ నీవుస్వర్గమును బొందగలవని చెప్పె. రాజోత్తముఁడవగునో రాముఁడా! నాకీదేహమును ప్రాప్తించినది మొదలు నాచేతికందబడినదాని నంతయు బట్టి తినుచున్నాను. భక్ష్యాభక్ష్యములను నియమములేక నన్నిటినిమంచివనియేయెంచి తినుచున్నాను. మరియు రాముడు తప్పక నీయొద్దకువచ్చునని చెప్పినమాటయందు మహానమ్మకముగలవాడనగుచు, శరీరమును గాపాడుకొనుటయందు మెంతశ్రమగాయున్నను ఓర్చియీదృఢబుద్ధితో నేనునీరాకకెదురు చూచుచుకాలము గడుపుచున్నాను. రాముడా! నీవుఆరాముడవే నేను ఇందుకెంతమాత్రమును సంశయములేదు. నీకుమంగళమగుగాక! మరియునితరుడు నిన్నుజంపలేడని యామహర్షి నాకు దృఢముగజెప్పె పురుషోత్తముడవగునో రామా! మిరిద్దఱును నాకు అగ్నిసంస్కారముజేతురేని నేనునాబుద్ధికొలదిని మీకుయోచనజెప్పి మీకుతగినవి హితునిగూడ చెప్పెదను అనికబంధుడు రామునితోజెప్పె. అంతధర్మాత్ముడగు రాముడు అజనువంశోద్భవుడగు కబంధునిమాటనువిని, లక్ష్మణుడు సమీపముననుండి వినుచుండగా కబంధునితోనిట్లనియె.

ఓకబంధుడా! నేనునాతమ్మునితోగూడజనస్థానమునను౦డి దూరముగబోయి యుండగ మహాకీర్తిమంతురాలగు నాభార్యను రావణాసురుడుఅపహరించుకొనిపోయె. ఆరాక్షసుని పేరుమాత్రేను మాకుదెలిసెను గాని యాతనినివాసస్థలముగాని, రూపునుగాని, ప్రభావముగాని మాకు తెలియదు. కావుననిట్లుమహావ్యసన పీడితులమైనవారమును, అనాథులవలెనున్నవారమును, అరణ్యమునందంతటనుదిరిగి అల్లాడుచున్నవారమును, పరోపకారము చేయుటయందాసక్తిగలవారమును, నగుమావంటివారి విషయమునందు దయయుంచుటయుక్తము. శూరుడవగునోకబంధుడా! మేమిప్పుడు, బహుకాలమునందు యేనుగులచేవిఱువబడి యెండిపోయియుండెడు కట్టెలను దెచ్చి గొప్పగుంటనుత్రవ్వి యాగుంటయందు నిన్నుంచి దహనము జేసెదము. కావునసీతావృత్తాంతమును నీవుయథార్థముగ నెఱుగుదువేని యెవడుతీసికొనిపోయినదియును, యెచటికిగొనిపోయినదియును, మాకెరింగించిమాకుశుభమునుగలుగజేయుము అనియిట్లుబుద్ధిమంతుడగురాముడు చెప్పె. అంతమాటలయందు రాముకౌశలమానుడగుకబంధుడు రాముని జూచి యిట్లనియె.

రాముడా! నాకుదివ్యజ్ఞానములేదు. సీతాదేవివృత్తాంతము నాకు తెలియదు. నన్నుమీరుదహించుతురేని నానిజరూపమునుబొంది సీతావృత్తాంతమును జెప్పెదను. ఓరాముడా! నన్నుదహించుటకుమునుపు, నీభార్యయగసీతాదేవిని అపహరించిన మహాశౌర్యవంతుఁడగు రాక్షసునిదెలిసికొనుటకు నాకుశక్తిలేదు. రామచంద్రా! శాపదోషముచే నాదివ్యజ్ఞానము చెడిపోయినది. నాతప్పుకార్యముచేతనే లోకనింద్యమగు నీవికృతరూపము గలిగినది నాయనా! రామా! ఇంకసూర్యాస్తమయమగులోపల నాకళేబరమును త్రవ్వినగుంటలోనుంచి యథావిధిగదహనముసేయుము. మహాశౌర్యవంతుఁడవగునో రఘునందనా! రామా! నీవునన్నుయథావిధిగ వల్లమునందు దహించినవెనుక, సీతాదేవిని యపహరించిన రాక్షసునియెఱుగఁగలవానిని నీకుచెప్పెదను. రాముఁడా! న్యాయమైనస్నేహ ముఁజేయుము మహాశౌర్యవంతుఁడగు నాతఁడు నీకుపరమసంతోషముతో సహాయముచేయును. ఓరామా! అతనికిదెలియనిచోటు ముల్లోకములయందెచ్చటనులేదు. అతడునున్నొక కారణముచే సమస్తలోకములను దిరిగియున్నాడు.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి డెబ్బదియొకటవసర్గముగిసెను.

కబంధుడు దివ్యరూపమునుబొంది సుగ్రీవునితో స్నేహము సేయుమని రామలక్ష్మణులతో జెప్పుట.

అంతమానవశ్రేష్ఠులును, మిగులశౌర్యవంతులును, నగు నారామలక్ష్మణులు కబంధుఁడట్లుచెప్పుటనువిని, అతనిఒకపర్వతమునందలి గుంటలోనునిచి అగ్నినివేసిదహించిరి అప్పుడులక్ష్మణుఁడు చక్కగామండుచున్న కొఱవులను దీసికొని చితినినలుప్రక్కలను ముట్టించిచక్కగా మండునట్లుచేసె. అయినను ఆకబంధుని మహాకళేబరము గొప్పనేతిముద్దతో సమానముగనున్నను క్రొవ్వుతోనిండి యుండుటచేత అగ్నిహోత్రుండు దానినిమెల్లమెల్లగ దహించుచుండె. అట్టియెడ మహాబలశాలియగు నాకబంధుఁడు అతివేగముగ చితినితోసికొని పరిశుద్ధములగు వస్త్రములను దివ్యమాలికలను ధరించి పొగలేకనిర్మలముగ మండుచుండెడి యగ్నివలెపైకిలేచె మఱియునాకబంధుఁడు మహాతేజోవంతుఁడును, నిర్మలములైన వస్త్రములనుదాల్చినవాఁడును, సర్వావయవములయందును సొమ్ములనుధరించినవాఁడును, మహాసంతో

షముతోనున్న వాఁడునునై యతివేగముగాచితినుండి పైకిలు వెడలె. అంతమహాతేజుఁడగు నాకబంధుఁడు, మిగులగాంతిచే నొప్పుచున్నదియును, హంసపక్షులతో గూడినదియును, కీర్తికరంబైనదియును, నగువిమానమును ఎక్కి తనకాంతిచే దశదిశలను ప్రకాశింపఁజేయుచుండె అట్లు వెలుంగుచు నాకబంధుఁడు గగనమార్గమునుబొంది రామునితో యిట్లనియె.

రాముడా! నీకుసీతాదేవి లభ్యమయ్యెడి యుపాయము నునిశ్చయముగ జెప్పెదనువినుము. నాయనా! రాముడా! లోకమునందు ఆరుఉపాయములుగలవు. ఆయుపాయములచే సమస్తకార్యములను చక్కబెట్టుకొనవలయును. (అవియేవియనగా, సంధివిగ్రహయానాసనద్వైధీభావసమాశ్రయములు) మఱియును ఆపదబొందినవాఁడు తనవలెనేయాపదనుబొందిన మఱియొకనితోచేరి తనకార్యమును చక్కబెట్టుకొనవలయును. రామచంద్రా! భార్యాపహరణముచే నీవుమహావ్యసనమునుబొంది, లక్ష్మణుఁడును నీవునుమిగుల దురవస్థను బొందినవారై హీనదశను బొందియున్నారు. ఓరామచంద్రా! కావున నీవవశ్యముగ నీవలెఆపదను బొందినవానితో స్నేహమును గావింపవలయును. అట్లుచేయనేని నీకుకార్యసిద్ధియగునని నాబుద్ధికి తోచలేదు. రాముఁడా! నీకట్టివానినొకని జెప్పెదవినుము సుగ్రీవుఁడను వానరుఁడొకఁడుగలడు. అతనిపైనానియన్నయును, యింద్రునికొడుకును నగువాలికోపించి, వానినిరాజ్యమునందుండి వెళ్ళగొట్టె. అంతమహాబల పరాక్రమశాలియగు నాసుగ్రీవుఁడు, పంపాసరోవర ప్రాంతముననుండు ఋశ్యమూకపర్వతమున నల్గురువానరులతో గూడుకొనినివసించి యున్నాడు. రాముడా! వానరేశ్వరుడగు నాసుగ్రీవుడు మహాశౌర్యవంతుఁడు. మిగులతేజోవంతుఁడు. మహాకాంతిమంతుఁడు. సత్యసంధుఁడు. మహావినయవంతుఁడు. ధైర్యవంతుఁడు. మతిమంతుఁడు. పూజ్యుఁడు. సమర్థుఁడు. ప్రగల్భుఁడు. ద్యుతిమంతుఁడు. మహాబలపరాక్రమములు గలవాఁడు. రామచంద్రా! అట్టిమహాబలపరాక్రమ శాలియగుసుగ్రీవుఁడు, రాజ్యనిమిత్తమై యతనియన్నచేఁ దరుమగొట్టఁబడె. కావుననాసుగ్రీవుఁడు సీతనువెదకుటయందును నీకుమేలుచేయుటయందును, నీకుపరమమిత్రుఁడు కాఁగలఁడు. నీవుమనస్సునందు వ్యసనముంచకుము. శ్లో॥ భవితవ్యంహియచ్చాపి నతచ్ఛక్యమిహాన్యథా। కర్తుమిక్ష్వాకుశార్దూల కాలోహిదురతిక్రమః॥ ఇక్ష్వాకువంశోద్భవులలో నుత్తముఁడవగునోరాముఁడా! ఏదియెవ్విధముగ గావలయునో అట్లేయగునుగానిదానిని వేరురీతిగాఁజేయుటకు నెవ్వరికిని సాధ్యముగాదు. కాలమునతిక్రమింప నెవ్వరికినితరముగాదు కావుననీవిచటనుండి బయలుదేరి యతివేగముగ మిగుల బలవంతుఁడగు నాసుగ్రీవునియొద్దకుబొమ్ము. రాముఁడా! అట్లునీవుసుగ్రీవునివద్దకుబోయి యతనికినీకును మఱలనన్యోన్యద్రోహచింత లేకుండునట్లు, అగ్నిసాక్షిగ సఖ్యముచేయుము. రాముఁడా! పరులుతనకుజేసినమేలు మఱువనివాఁడును, కామరూపము గలవాఁడును, సహాయము గోరుచున్నవాఁడును, మహాశౌర్యవంతుఁడును, వానరరాజునునగు నాసుగ్రీవుని నీవుచులకనగఁజూడకుము. మఱియుమీరు ఆసుగ్రీవుఁడు చేయగోరియుండు కార్యమును జేయుటకు శక్తిమంతులై యుదురు. ఆసుగ్రీవుఁడును తనకార్యమునీడేరినను యీడేరకున్నను మీపనినిసెఱవేర్చును రాముఁడా! ఋక్షరజునిపుత్రుఁడును, సూర్యునివీర్యమునకు బుట్టినవాఁడును, నగుసుగ్రీవుఁడువాలితో విరోధముగావించి యతనికిభయపడి పంపాసరోవర ప్రాంతముననున్నాఁడు. నీవుఅతివేగముగబోయి, వనచరుఁడును, ఋశ్యమూకపర్వతము యిల్లుగాగలవాఁడును, నగుసుగ్రీవునితో నాయుధసాక్షికముగ స్నేహముచేయుము. నాయనా! రాముడా! వానరోత్తముఁడగు నాసుగ్రీవుఁడు తనశక్తిచేతలోకమునందు రాక్షసులుండెడి స్థలములనన్నిటిని పూర్తిగగుర్తెరిగియున్నాఁడు వేయిచెప్పనేల? వేయికిరణములుగల సూర్యుడు ఎండగాచెడిలోకములందు సుగ్రీవునికి తెలియని స్థలముకొంచమైనను లేదు. శత్రుసంహారకుండవగునో రాముఁడా! ఆసుగ్రీవుఁడు వానరసమేతుఁడై యేళ్ళయందును, విశాలములగు కొండలయందును, పర్వతదుర్గములయందును గుహలయందును వెదకినీభార్యయుండు ప్రదేశమును దెలిసికొనగలఁడు. ఓరామా! నిస్నేహదానిమిగుల దుఃఖించుచుండు సీతాదేవినివెదకుటకు సుగ్రీవుఁడు మహాకాయులగు వానరులను సమస్తదిక్కులకు నుబంపును మఱియునాసుగ్రీవుఁడు, రావణాసురుని యింటియందున్నదియును, కల్మషరహితమైనదియును, సొగసైనశిరుదులు గలదియునునగు సీతాదేవినికనుగొనగలడు రాముడా! వానరశ్రేష్ఠుఁడగు నాసుగ్రీవుఁడు, నీప్రియభార్యయగు సీతాదేవిమేరుపర్వత శిఖరమునందున్నను, పాతళలోకమునందున్నను, అచ్చటికిబోయి రాక్షసులనుజంపి యాసీతాదేవిని దెచ్చినీకివ్వఁగలఁడు. అనికబంధుఁడు రామునకుజెప్పె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి డెబ్బదిరెండవసర్గ ముగిసెను.

కబంధుఁడు రామలక్ష్మణులకు సుగ్రీవుఁడుండు స్థలమును దెలియఁజేయుట.

కార్యసాధనముల నెఱిఁగినవాఁడగు కబంధుఁడు రామునకు సీతాదేవిని పొందదగిన యుపాయమును జెప్పి మఱల నర్థయుక్తమగు నీమాటను జెప్పె. రామచంద్రా! అదిగో పడమరదిక్కునందు చక్కఁగాబుష్పించి మిగులమనోహరములైన నేరేడుచెట్లతోను, మొరటచెట్లతోను, పనసచెట్లతోను, జువ్విచెట్లతోను, మఱ్ఱివృక్షములతోను, తుమ్మిచెట్లతోను, రావిచెట్లతోను, కొండగోఁగులతోను, మామిడిచెట్లతోను, చంద్రచెట్లతోను, పొన్నచెట్లతోను, బొట్టుగుచెట్లతోను, నల్లనియశోకవృక్షములతోను, కదంబవృక్షములతోను, కానుగుచెట్లతోను, పూచినగన్నేరుచెట్లతోను, భల్లాతకవృక్షములతోను, అశోకవృక్షములతోను, రక్తచందనవృక్షములతోను, వేపచెట్లతోను మరియు ననేక వృక్షములతోను నొప్పుచున్నదే, అదియే మీకు శుభమగుమార్గము మీరలు వృక్షములను ఎక్కిగాని, లేక బలవంతముగ వాటిని నేలపైబడద్రోసిగాని, అమృతతుల్యములగు వానిపండ్లను భక్షింపుచుఁబొండు. కకుత్స్థవంశోద్భవుఁడవగునో రాముఁడా! మీరు ఆయడవిని దాటగానే, పూచిన చెట్లతో నొప్పుచున్నదియు నందనవనముతో సమానముగనున్నదియును, ఉత్తరకురుదేశమువలె ప్రకాశించుచున్నదియును, నగు మరియొకవనముగలదు. అచ్చటనుండు చెట్లు సమస్తజీవులచే గోరఁబడుఫలములుగలవిగనుండును. ఆపండ్లు తేనె లొలుకుచుండును. మచైత్రరథమను వనమునందువలె యెల్లప్పుడు సమస్త ఋతువులును నచటగలిగియుండును. ఆవనమునందుండు వృక్షములు పెద్దపెద్దకొమ్మలుగలవియై ఫలభారముచేత వంగి మేఘములతోను పర్వతములతోను సమానములై యొప్పుచుండును. కావున లక్ష్మణుఁడ! ఆచెట్లనుఎక్కిగాని, లేక భూమిమీదఁబడద్రోసిగాని యమృతసమానములగు పండ్లను గోసి నీకాహారముగనివ్వగలడు. ఓరామా! మిగులశౌర్యవంతులగు మీరు, ఒకకొండనుండి మరియొకకొండకును, ఒకయరణ్యమునందుండి మరియొకయరణ్యమునకును బోవుచునిట్లు శుభకరములగు స్థలములనన్నిటిని జూచుచుపోయి, మొరపరాళ్ళుగాని, పాచిగాని, జాఱుటగాని, లేనిదియును, మిట్టపల్లములులేని రేవులుగలదియును, మంచియిసుకగలదియును, తామరకమలములతోను, నల్లగలువలతోను, ఒప్పుచున్నదియును, నగు పంపాసరోవరము నొద్దకుపోఁగలరు. రాముఁడా! ఆపంపాసరోవరమునందు, హంసలు, నీరుకోళ్లు, క్రౌంచములుమొదలగు పక్షులు మిగుల మనోజ్ఞముగ గూయుచుండును. ఆపక్షులు యిదివరకు చంపుటయనునది యెట్టిదో యెఱుఁగకుండుటచేత [illegible] ర ఘువంశోద్భవుఁడ వగునోరామా! [illegible] శక్తిగలవాఁడు. కావున నాపంపాసరోవరమునందున్నవియును మిగులశ్రేష్ఠమైనవియును చర్మము గట్టిగ నుండునవి యును, గాలముచే నింతవరకు తపింపఁజేయఁబడనివియును, పెక్కుముండ్లులేనివియును, నగు చేపలను, గండుచేపలను, సారచేపలను, రొయ్యలను బాణముచే జంపి పక్వముచేసి నీకిచ్చును అంతనీవు తృప్తిగ చేపలను దినుచుండగా లక్ష్మణుఁడు, మితిలేని తామర పుష్పములతోనుండుటచే పద్మగంధముగలదియును, పాపహరంబైనదియును, సుఖశీతంబైనదియును, మిగుల నారోగ్యమైనదియును, నిరంతరము నిర్మలముగనుండు నదియును, వెండితోను స్ఫటికమణులతోను, సమానమైనదియును, నగు జలమును పంపాసరోవరమునందుండి తెచ్చి నీకుద్రాగుటకియ్యగలడు. పురుషోత్తముఁడవగు నోరామా! మిగులబలసిసవియును, పర్వతగుహలయందుండునవియును, అరణ్యమునందు సంచరించుచున్నవియును, ఆబోతులవలె గర్జించుచున్నవియును, మెక్కులవలెనావ్రముగనుండునవియునునగు పందులు పంపాసరోవరమునకు నీరుద్రావుటకువచ్చును; వాటిని నీవుచూడగలవు మరియు నీవు సంధ్యవేళయందిటునటుదిరుగుచు, విశేషముగ బూచియుండుటచేఁ బూలదండలను ధరించియున్నట్లు మహాశృంగారముగనుండు వృక్షములను, పంపాసరోవరమునందలి శీతోదకములనుఁజూచి వ్యసనమునువిడువగలవు. రామచంద్రా! నీవచట, మిగులనందముగఁ బూచియుండెడు బొట్టుగుచెట్లను, కానుగుచెట్లను, చక్కగవికసించియుండెడు కమలములను నల్లగలువలనుఁజూచి వ్యసనమును విడువగలవు. రాముఁడా! అచటఆపుష్పములను ధరించెడి మానవుఁడొకఁడుగూడలేఁడు. మఱియు నాపుష్పము లెప్పుడుగాని రాలవు. నిరంతరమువాడకుండును అచట మతంగమహాముని శిష్యులగు నుత్తమఋషులుండిరి. వారుగురువాజ్ఞచే వనమునకుఁబోయి కందమూలఫలములను దెచ్చుచుండగ మిగుల భారాతిశయముచే బీడనొంది శరీరమునుండి చెమటబిందువులను విడిచిరి. ఆచెమటబిందువులు భూమిపైఁబడినతోడనే యాఋషులయొక్క తపోమహిమచేతనవియన్నియు దివ్యపుష్పములైనవి రాముఁడా! ఆఋషుల చెమటవలనఁగలిగిన యాపుష్పములువారి తపోమహిమచే నెప్పటికినాశమొందకయున్నవి కాకుత్స్థకులోద్భవుఁడవగు నోరామా! ఆమతంగునిశిష్యులందఱును గతించిరి. వారిపరిచారికయును, చిరకాలజీవియును, శబరియనుపేరుగలదియును, నగు నొకసన్యాసస్త్రీమాత్రము యిప్పటి[redacted]టనున్నది. నిరంతరము ధర్మప్ర

మృత్తవముగలయాశబరి, సకలప్రాణులచే నమస్కరింపఁబడినదానడవును, దేవసమానుఁడవును, నగు నిన్నుజూచిన తోడనే స్వర్గమునకుఁబోగలదు. ఓరాముఁడా! అంతనీవు, ఆపంపాసరోవరముయొక్క పడమటిదరికిఁబోదువేని యాస్థలమునందు మిగుల శ్రేష్ఠమైనదియును, గోప్యమైనదియును, నగు నొకయాశ్రమమునుజూతువు. అచటివనమునందును, పర్వతమునందును పలువిధములైన యేనుఁగులుగలవు. ఆయేనుఁగులు ఆయాశ్రమములోపల ప్రవేశింపఁజాలవు ఆయరణ్యముగూడ నామతంగమహాముని తపోమహిమవలననిర్మింపఁబడినదిగాననందలి యేనుగులు ఆయాశ్రమములో ప్రవేశింపవు. ఓరామచంద్రా! నందనవనముతోను, తక్కినసమస్త దేవోద్యానములతోను, సమానమైనదియును, పలువిధములయిన పక్షులసమూహములతో నొప్పియున్నదియును, నగునాయరణ్యమునందు నీవువ్యసనమునువిడిచి సుఖముగవిహరింపుచుందువు. రాముఁడా! చక్కగబూచియుండెడి చెట్లతోనొప్పుచున్నదియును, యేనుఁగుగున్నలచేఁ గాపాడఁబడినదియై యెవ్వరికిని యెక్కనలవిగానిదియును, మిగులప్రశస్తమైనదియును పూర్వముబ్రహ్మదేవునిచే నిర్మింపఁబడినదియును, నగు ఋశ్యమూకపర్వతము పంపాసరోవరమునకు ముందరిప్రక్క నున్నది. రాముఁడా! ఆఋశ్యమూకపర్వతశిఖరమునందు బవళించుచూనవుఁడుకలయందు ఏయర్థమునుబొందినట్లు కలగనునోయాయర్థమును మేలుకొనిన పిమ్మటబొందును. మఱియు దురాచారుఁడును, పాపకర్ముఁడును, నగు మానవుఁడెంతమాత్రము యీపర్వతమును ఎక్కజాలఁడు. అట్లుదురాచారుఁడును, పాపిష్ఠుఁడును నగు మానవుఁడుఆపర్వతము నెక్కనేని యచటనుండురాక్షసులు ఆతఁడు నిద్రించియుండునపుడతనిఁబట్టిచంపుదురు. రాముఁడా! మాతంగారణ్యమునందుండునదియును, పంపాసరోవరమున క్రీడించుచున్నదియును, నగు యేనుఁగుపిల్లలధ్వనులు అచ్చట ఋశ్యమూకమునకువినఁబడుచుండును. నీలమేఘముతో సమానమైన దేహముగలవియును, మహాబలముగలవియును, నగునాయుత్తమగజములు ఒక్కొక్కసమయమున నెత్తురువెల్లువలై పారునట్లుపోట్లాడుకొని వేరువేరుగ తిరుగుచుండును. వనవాసులగు నాయేనుగులుఆపంపాసరోవరమునందుండెడి నిర్మలమగు నారోగ్యజలమునుద్రావి పరమసంతుష్టినొందినవై యరణ్యమున మఱలప్రవేశించును రామచంద్రా! నీవచటనుండెడు నెలుగుబంట్లను పెద్దపులులను మఱియు నీలమువలె మిగులమనోజ్ఞమైనకాంతిగలవియును, నల్లనిచారలుగలవియును, భయమునుపొందినెంతమాత్రమెఱుగునవియును, నగుమృగములనుజూచివ్యసనమును విడువఁగలవు. కకుత్స్థవంశోద్భవుఁడవగునోరామా! ఆకొండయందు నొకగొప్పరాయిచేమూతగగల యొకగుహగలదు. ఆగుహయందు ప్రవేశింపవలెననిన, మిగులకష్టముగనుండును. ఆగుహయొక్క తూర్పుద్వారమున, మిగులగొప్పదియును, చల్లనినీటితో నొప్పుచున్నదియును, చెట్లునుఫలవృక్షములతోను కందమూలములతోను నొప్పుచున్నదియును, మిగులమనోజ్ఞమైనదియును, నానావిధములైనమృగములతో నొప్పుచున్నదియును, నగునొకమడుగున్నది రాముఁడా! సుగ్రీవుడు నలువురువానరులతోగూడ నాగుహయందు నివసించుచున్నాఁడు. అతఁడొకానొకప్పుడు ఆఋశ్యమూకపర్వతశిఖరమునకువచ్చి విహరించుచుండును. అనియిట్లుమహాశౌర్యవంతుఁడును పూలదండలను ధరించియున్నవాఁడును, సూర్యునికాంతివంటి కాంతితో ప్రకాశించుచున్న వాఁడును, నగునాకబంధుఁడు గగనవీథియందుండి రామలక్ష్మణులతోజెప్పె. అంతనారామలక్ష్మణులిద్దఱు దేరి తమసమీపమున గగనమార్గమునందున్నవాఁడును మహాభాగుఁడును నగు నాకబంధునిజూచి "నీవింకపొమ్ము" అనిచెప్పిరి. అంత నాకబంధుఁడు రామలక్ష్మణులతో "మీకు కార్యసిద్ధియగును. పొండు" అనిచెప్పివారిచేననుజ్ఞవడసి పరమసంతుష్టుఁడైపోయె. అట్లుపోవుచునాకబంధుఁడు దివ్యరూపముతో నొప్పుచున్నవాఁడును, మహాకాంతితోగూడి సూర్యునివలెనున్నవాఁడునునై ఆకాశమునందుండి రామునకుఋశ్యమూకపర్వతమునకు మార్గమునుజూపుచు "నీవుఆసుగ్రీవునితో సఖ్యముచేయుము" అనిచెప్పె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి డెబ్బదిమూడవసర్గము ముగిసెను.

శబరి రామలక్ష్మణులను బూజించుట.

అంతరావణోమకులగు నారామలక్ష్మణులు కబంధుఁడుచెప్పినమార్గమును అవలంబించి పడమటిదిక్కునకుబోయిరి అట్లుబయలుదేఱి యారామలక్ష్మణులిద్దఱు, పర్వతప్రదేశములయందున్నవియును, తేనెతో సమానములైన పండ్లుగలవియును, నగువృక్షములనుజూచుచు సుగ్రీవుఁడున్నచోటునకుఁబోయిరి. మఱియు నారామలక్ష్మణులుఆపర్వతముపైనొకరాత్రియుండి మఱునాఁడుదయమునలేచి పంపాసరోవరముయొక్క పడమటిదిక్కుఁబోయిరి అట్లురామలక్ష్మణులు పంపాసరోవరముయొక్క పడమటిదిక్కునకుఁబోయి యచటమనోజ్ఞమగు శబరియాశ్రమమును

జూచిరి అనేకములైన కొట్లతో నొప్పుచుండెడి యాశబరి యాశ్రమమునకుబోయి యందలి సౌందర్యములను జక్కఁగ జూచి యచటనుండి రామలక్ష్మణులు శబరినిజూచుటకుఁబోయిరి. అప్పుడు యోగసిద్ధిబొందియున్న యాశబరి రామలక్ష్మణులనుజూచినతోడనె లేచి కృతాంజలియై బుద్ధిమంతులగునా రామలక్ష్మణుల పాదములపైఁబడి నమస్కరించె. అట్లు ఆశబరి వారి పాదములకు నమస్కరించి అర్ఘ్యపాద్యములను, ఆచమనమును యథావిధిగనిచ్చె అంత రాముఁడు మహాతీక్ష్ణవ్రతమునవలంబించి యున్న యాసన్న్యాసినియైన శబరినిజూచి యిట్లనియె.

తపోధనురాలవగు నోశబరీ! నీవు సమస్తవిఘ్నములను జయించితివా? నీతపము పండినదా? నీవు క్రోధమును జయించితివా? ఆహారమును దగ్గించితివా? మిగుల మనోజ్ఞముగ మాటలాడెడి యోశబరీ! నీవు సమస్తములైన నియమవ్రతములను సలిపితివా? నీమనస్సు మిగుల తృప్తినొంది సుఖముగనున్నదా? నీవు నీగురువునకు జేసిన శుశ్రూష సఫలమైనదా? అని యిట్లు రాముఁడడిగె. అంత తపోవంతురాలును, సిద్ధినొందినదియును, సిద్ధాత్ములచే బూజింపబడినదియును, మిగుల వృద్ధురాలును, నగు నాశబరి రామునిజూచి యిట్లనియె.

ఓరామచంద్రా! నిన్ను జూచుటవలన నాతపస్సు సిద్ధించినది. నావ్రతములన్నియు సఫలములైనవి. నేను జేసినగురుశుశ్రూషయును సఫలమైనది. పురుషోత్తముఁడా! దేవదేవోత్తమా! రామచంద్రా! ఇప్పుడు నిన్ను పూజించుటచే నాజన్మము సఫలమైనది, నేనింక స్వర్గాదిభోగముల ననుభవింపగలను. శత్రుసంహారకుఁడవగు నోరామా! నీచల్లని చూపులచేత నేను పరిశుద్ధురాలనైతిని. ఇంక నీయనుగ్రహముచే నక్షయలోకసుఖముల ననుభవించెదను. ఓమహాత్మా! రామా! నేను పరిచర్య జేయుచుండిన మునులందఱును, నీవు చిత్రకూటమునకు చేరినప్పుడే దివ్యవిమానారూఢులై స్వర్గమునకుఁబోయిరి, వారు స్వర్గమునకు బోవుచుండి, ధర్మాత్ములును మిగుల పూజ్యమైన స్వభావముగలవారును, నగు నామునులు నాతో నిట్లనిరి [redacted]గీ! రాముఁడును, లక్ష్మణుఁడును, యీపుణ్యాశ్రమమునకు వత్తురు. నీవు ఆరామలక్ష్మణులకు జక్కఁగ నతిథిసత్కారమును గావింపవలయును. నీవు ఆరామునిజూచినతోడనే యుత్తమమగు నక్షయలోకములను బొందగలవు. అని నాకు జెప్పిపోయిరి. పురుషోత్తముఁడవగు నోరామా! నీకొఱకు యీపంపాసరోవరప్రాంతమునందు పండ్లు మొదలగు నడవియందుగల పదార్థములను సంపాదించి తెచ్చి పెట్టియున్నాను. అని చెప్పె. అంత ధర్మాత్ముఁడగు నా రాముఁడు నిరంతరము బ్రహ్మజ్ఞాన సంధానపరాయణయైన యాశబరినిజూచి యిట్లనియె.

ఓశబరీ! దనువంశోద్భవుఁడును, మహానుభావుఁడును, నగు కబంధుఁడు నీయొక్కయు నీగురువులయొక్కయు, ప్రభావమును మాకు జక్కఁగ దెలిపెను. నీవిష్టపడుదువేని వాటినన్నిటిని నేను జక్కఁగ జూడగోరుచున్నాను. అని రామచంద్రుఁడు చెప్పె. అంతట శబరి యా రామలక్ష్మణులకిరువురకును నమ్మహావనమునంతయును జూపె. అట్లు ఆశబరి వారిరువురన్నదమ్ములకును ఆయాశ్రమమునంతయు జక్కఁగ జూపుచు నిట్లని చెప్పె. రఘువంశోద్భవుఁడవగు నోరామా! మేఘములతో సమానమైనదియును, సమస్తములైన మృగపక్షులకు నివాసయోగ్యమైనదియును, మతంగవనమని పేరు వడసినదియును, నగు నీయరణ్యమును జూడుము. కాంతిమంతుఁడవగు రాముఁడా! ఆత్మవేత్తలగు నాగురువులు, వేదవేత్తలగు ఋత్విక్కులను జేర్చుకొని మంత్రపూతముగ యాగము చేసిన స్థలంబిదిగో నున్నది చూడుము. నాచే బూజింపబడుచుండిన మిగుల పూజనీయులగు నాగురువులు వార్ధక్యముచే వడవడవడకుచున్న చేతులతో బూజించిన యాగవేదిక యిచటనున్నది. ఓరామచంద్రా! ఈయాగవేదికలు వారియొక్క తపోమహిమవలన యిప్పటికిని సరిలేని కాంతిగలవియై మహాకాంతిచే సమస్తదిక్కులను ప్రకాశింపఁజేయుచున్నవి చూడుము. మఱియు వారలు ఉపవాసములచేతనైన యలసటచేతను, ముసలితనముచేతను, పోవుటకు శక్తిలేనివారై యమ్మునులు తమమనంబులయందు దలచిన మాత్రముననే, సప్తసముద్రములును పొక్కసారిగ వారియాశ్రమమునకు వచ్చియున్నవి, చూడుము. రఘునందనా! రామా! ఆఋషులు యిందు స్నానమును జేసి వృక్షములకు ఆరగట్టిన నారచీరెలు యిప్పటికిని వారి తపోమహిమవలన ఎండకున్నవి. చూడుము. మఱియు దేవపూజసేయుచున్న యామునులు పూజార్థముగ నల్లగలువలను యితరపుష్పములను చేర్చికట్టిన యీపుష్పమాలికలు యిప్పటికిని వారి తపఃప్రభావముచే వాడిపోకయున్నవి. చూడుము.

రాముఁడా? నీవీయరణ్యమునంతయు జక్కఁగ జూచితివి. వినవలసిన విషయములన్నిటిని జక్కఁగ వింటివి. కావున నింక నాకనుజ్ఞ యిచ్చితివేని యీకళేబరమును విడిచెదను. ఇది యెవనియాశ్రమమో, నేనెవరికి పరిచర్య జేయుచుంటినో యాపరమాత్మవేత్తలగు ఋషుల పాదపద్మములను జేరగోరుచున్నాను. అని శబరి చెప్పె. అంత రామలక్ష్మణు లిరువురును పరమసంతోషభరితులైయుండిరి. అట్టియెడ రాము



రామునకు శబరి ఆతిద్యం

ను మిక్కిలి తీవ్రవ్రతములగల యాశబరినిజూచియిట్లనెను.

శబరీ! నీవు పరమభక్తితో నన్ను బూజించితివి. కావున యథాసుఖముగ బొమ్మని చెప్పె. అంత జటావల్కలములను ధరించియున్నదియును, కృష్ణాజినమును, వస్త్రములను, ధరించియున్నదియును, మిగుల వృద్ధురాలును, నగు నాశబరి రాముడు చెప్పినమాటను విని రాముని యనుమతిని బొంది యాక్షణముననే జీర్ణమైన దేహమును విడువగోరి యగ్నియందు దేహమును దహింపజేసి మండుచున్న అగ్నితో సమానమైన దేహమును ధరించి స్వర్గమునకు బోయెను. మఱియు నాశబరి దివ్యాభరణములను, శ్రేష్ఠములైన పూలదండలును, దివ్యగంధమును, దివ్యవస్త్రములను ధరించి మిగుల ప్రకాశింపుచు మెఱుపువలె నాప్రదేశమునంతయు దేదీప్యమానముగ ప్రకాశింపజేయుచుండె. అట్లు ప్రకాశింపజేయుచున్న యాశబరి సుకృతాత్ములగు మహర్షులెచట సంచరించుచుండిరో యాస్థానమునకు సమాధినిష్ఠురాలగుచు బోయెను.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి డెబ్బదినాలగవ సర్గ ముగిసెను.

రామలక్ష్మణులు ఋశ్యమూక పర్వతమునకు బోవుట.

అట్లు శబరి తన కాంతితో సమస్తమును ప్రకాశింపజేయుచు స్వర్గమునకు బోయినతోడనే రాముడు తన తమ్ముడగు లక్ష్మణుని జూచి యిట్లని యాలోచించె. మఱియు ధర్మాత్ముడగు రాముడు మహాత్ములగు నమ్మునుల మహిమను దలంచుచు, ఏకాగ్రచిత్తుడును, తనకు మిగుల మేలుచేయువాడును, నగు లక్ష్మణునితో నిట్లనియె.

సౌమ్యుడవగు లక్ష్మణా! అనేకములైన యాశ్చర్యములు గలదియును, నిర్భయముగ దిరుగుచుండెడి మృగములు పెద్దపులులు గలదియును, నానావిధములైన పక్షులతో నొప్పియున్నదియును, నగు నీ పరమాత్మవేత్తలగు ఋషుల యాశ్రమములను చూడుము, లక్ష్మణా! యీసప్తసముద్రములయొక్క తీర్థమునందు యథాశాస్త్రముగ స్నానము జేసితిమి. పితృతర్పణము గూడ జేసితిమి లక్ష్మణా! సమస్త పాపములును నశించినవి ఇంక శుభములు గలుగును. కావున నేయథార్థముగ నామనస్సు మిగుల సంతసించుచున్నది శ్లో॥ హృదయే హీనరవ్యాఘ్రశుభమావిర్భవిష్యతి॥ పురుషశ్రేష్ఠుడవగు నో లక్ష్మణా! యేదేని మేలు గలుగబోవునపుడది మనస్సునకు ముందుగ గోచరమగును. కావున నతివేగముగ రమ్ము మిగుల ధార్మికుడును, సూర్యపుత్రుడును, నగు సుగ్రీవుడు వాలివలని భయముచే మిగుల భీతినొంది నలుగురు వానరులతో గూడి నిరంతరము వాసము చేయుచుండెడి ఋశ్యమూక పర్వతమునకు సమీపముననుండెడి సుందరంబగు పంపాసరోవరమునకు బోదము. సౌమ్యుడవగు నో లక్ష్మణా! వానరోత్తముడగు సుగ్రీవుని జూచుటయందు అమితయుత్సాహముగల వాడనైయున్నాను. సుమిత్రానందనా! లక్ష్మణా! సీతను వెదకుటయను కార్యమంతయును ఆ సుగ్రీవుని వలననే గదా నెరవేరవలయును. అని రాముడు చెప్పె. అంత రాముని జూచి లక్ష్మణుడిట్లనియె.

అన్నా! రామచంద్రా! అతివేగముగ పంపాసరోవరమునకు బోదము. శీఘ్రముగ బోవలయునని నామనస్సు యందును ఉత్సాహముగలుగుచున్నది. అని లక్ష్మణుడు చెప్పె. అంత శత్రుమర్దనుడగు రాముడు లక్ష్మణసమేతుడై శబరి యాశ్రమమును విడిచి బయలుదేరి పంపాసరోవరమునకు బోయెను. అట్లు పంపాసరస్సును గూర్చి పోవుచు మిగుల పావనంబైనదియును, ఋషిశ్రేష్ఠులచే సేవింపబడినదియును పలువిధములైన చెట్లతోను, తీగలతోను, పరివేష్టితమైనదియును, త్రాగుటకర్హమైన యుదకముగలదియును, ఎఱ్ఱతామరపూలచేతను, ఎఱ్ఱగలువలచేతను, ఎఱ్ఱనైనదియును, తెల్లదామరచే తెల్లనైనదియును, నల్లగలువలచే నల్లనైనదియునునై యనేకరంగులుగల చిత్రకంబళమువలె నొప్పుచున్న యాపంపాసరోవరమును రాముడు దూరముననుండియే చూచె. రాముడు ఆపంపాసరోవరమును దూరముననుండి చూచి దానిసమీపముననున్న మతంగసరోవరమునందు స్నానమును జేసె. అట్లు రాముడు ఆమతంగసరోవరమునందు స్నానమును చేసి యచ్చటనుండి పోవుచు. ఎఱ్ఱతామరలతోను నల్లగలువలతోను నొప్పుచున్నదియును, తెల్లతామరపూలతోను ఎఱ్ఱగలువలతోను ప్రకాశించుచున్నదియును, తీరములయందు, చక్కగ బూచియుండెడి మామిడితోపులతో నొప్పుచున్నదియును, బొట్టుగుచెట్లతోను దానిమ్మచెట్లతోను, చండ్రచెట్లతోను, యేలుమద్దిచెట్లతోను, చక్కగా బూచియుండెడు గన్నేరుచెట్లతోను, చక్కగ వికసించియుండెడు పొన్నచెట్లతోను, నొప్పుచున్నదియును జాజిపొదలతోను, మల్లెపొదలతోను, ప్రకాశించుచున్నదియును, పత్తిచెట్లతోను, తినాసపుచెట్లతోను, అశోకవృక్షములతోను, యేడాకులయరటిచెట్లతోను, మొగలిపొదలతోను, పూగురివిందచెట్లతోను, మఱియు నానావిధములైన యితరవృక్షములతోను చక్కగ నలంకృతంబై యొప్పుచు శృంగారవతియగు స్త్రీవలె నొప్పుచున్న యాపంపాసరోవరమును చక్కగా జూచుచు, దానిసమీపమునందున్న

దియును, జక్కగఁబూచియుండెడు గొప్పవృక్షములతో నొప్పుచున్నదియును, చీకుకొక్కెరలతోను, నెమళ్లతోను బెగ్గురుపక్షులతోను, చిలుకలతోను మఱియునితరములైన పక్షులతోను నొప్పుచువాటిధ్వనులచే బ్రతిధ్వనించుచున్నదియును, నగువనమును జూచుచుపోయిరి. అట్లుపోయిపోయి చల్లనినీళ్లతోనొప్పుచున్నదియును, మిగులరమణీయమైనదియును, బొట్టుగుచెట్లతోను, అశోకవృక్షములతోను పొన్నచెట్లతోను పొగడవృక్షములతోను, విరిగిచెట్లతోను నొప్పుచుమిగుల బ్రకాశమానంబైయున్న యాపంపాసరోవరమును రాముడుచూచె.

మఱియు నానావిధములైనచెట్లను, పలువిధములగు సరోవరములను జూచుచుపోయి మన్మథపీడితుడైన యారాముడు పరమపావనమగు నాసరోవరమునుజేరె అట్లు సత్యపరాక్రముడగు నారాముడు, సమీపమునబూచియుండెడు అరణ్యములతో నొప్పుచున్నదియును, మద్దిచెట్లతోను సంపెగచెట్లతోను ఒప్పుచున్నదియును, తుమ్మెదలగుంపులతో నొప్పుచున్నదియును, ఈడులేనికాంతితో నొప్పుచున్నదియును, స్ఫటికమణులతో సమానమగు తెల్లనినీళ్లుగలదియును, మెత్తనియిసుకతో బ్రకాశించుచున్నదియును, తామరపుష్పలతోను మెట్టగలువలతోను ఒప్పియున్నదియును, నగునాపంపాసరోవరమునుజూచి లక్ష్మణునితో నిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! సమస్తధాతువులచే విచిత్రమైనదియును, మిగులపవిత్రమైనదియును, నిరంతరముపూచియుండెడి వృక్షములచే నొప్పుచున్నదియును, మిగులప్రసిద్ధమైనదియును, నగుఋశ్యమూకపర్వతము యీపంపాసరోవరమునకు సమీపమునందున్నదని పూర్వముకబంధుడుచెప్పె. మఱియు మహాత్ముడగు ఋక్షరజుడనువానికి మారుడును, మహాశౌర్యవంతుడును, నగుసుగ్రీవుడు ఆపర్వతమునందున్నవాడనియును, వింటిని. పురుషోత్తముడవగునోలక్ష్మణా! నీవు ఆవానరరాజగు సుగ్రీవునొద్దకుబొమ్ము అనిచెప్పి రాముడు సత్యపరాక్రముడగు నాలక్ష్మణునితో మఱలనిట్లనియె.

లక్ష్మణా! రాజ్యభ్రష్టుడను, దీనుడను, సీతయందు మిగుల నపేక్షగలవాడను, నగు నేను ఆసీతనువిడిచి యెట్లుబ్రదుకగలను. అనియిట్లు రామచంద్రుడు మదనపీడితుడును, దుఃఖావేశవివశుడును నైయాతనమాటకెదురుపలకనిలక్ష్మణునితో నిట్లుచెప్పి మిగులరమణీయమగు నాపంపాసరోవరతీరమునసంచరించుచుండె. అట్లురాముడు ఆపంపాసరోవర ప్రాంతమునందు మిగులవిశాలమునగను మనోజ్ఞముగను నుండెడి యరణ్యమునుజూచుచుపోయిపోయి, మిగులరమ మగు నరణ్యములతో నొప్పుచున్నదియును, నానావిధములగు పక్షిసమూహములధ్వనులచే మనోహరంబైనదియును, నగునాపంపాసరోవరమును జూచుచుండె.

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందలి డెబ్బదియైదవసర్గ ముగిసెను

ఇట్లు సకలకళాకలాప దురంధరుడును-బరూరు - సీతారామార్యతనూభవుడునునగు

బరూరు - త్యాగరాయశాస్త్రిచే రచియింపబడిన యాంధ్రవచనకావ్య

శ్రీమద్వాల్మీకిరామాయణమునందు ఆరణ్యకాండము - ముగిసెను.

శ్రీ రామచంద్రార్పణమస్తు.

శ్రీరస్తు

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః

శ్రీమద్వాల్మీకిరామాయణము

కిష్కింధాకాండము.

అట్లు, విరాధుఁడు, ఖరుఁడు, త్రిశిరుఁడు, దూషణుఁడు, కబంధుఁడు మొదలుగాఁగల రాక్షసులను సంహరించుటచేతఁ బ్రసిద్ధమైన పరాక్రమముగల రాముఁడు, లక్ష్మణునితోఁ గూడుకొనినవాఁడై, ముందు సేయఁబోవుచున్న రావణాసురునివధకు ఉపయోగించునట్టి సుగ్రీవునిచేత నధిష్ఠింపఁబడియున్న ఋశ్యమూకపర్వతముయొక్క సమీపమునందుఁ బ్రవహించుచున్నదియును, నానావిధములగు పద్మములచేతను, నల్లకలువలచేతను, చేపలచేతను, మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నదియును, పంపయనియెడు పేరుచేత మిగులఁ బ్రసిద్ధమైనదియును, నగుసరస్సును జూచి వ్యాకులమైనయింద్రియములు గలవాఁడై యధికముగవిలాపమును బొందెను. (అనఁగా నాపంపాసరోవరము మిగులమనోహరముగానుండుటచేతఁ జూచినతోడనే సంతోషమును బొందఁదగియున్నప్పటికిని నాసరోవరమునందలిపద్మములు మొదలుగునవి రాముఁడు భార్యావియోగమును బొందియుండుటచేత మిగులవ్యసనమును బొందుటకుఁ దగినకారణములయ్యెఁ. మఱియును, పద్మములనుజూచినతోడనే సీతాదేవియొక్క ముఖమును, కలువలనుజూచినతోడనే సీతాదేవియొక్క నేత్రములు, చేపలనుజూచినతోడనే సీతాదేవియొక్క తళుకుచూపులు జ్ఞప్తికివచ్చి రాముఁడు వ్యసనమును బొందెనని గ్రహింపవలయును) అట్లు పంపాసరస్సును జూచినతోడనే రాముని యవయవములన్నియును ఉత్సుకత్వముగల శరీరమును విడిచిపోవునట్లుండె అప్పుడు రాముఁడు మన్మథవికారముగలవాఁడై లక్ష్మణునితో నిట్లనియె

తమ్ముఁడా! లక్ష్మణా! తీరమునందలి నానావిధములగు వృక్షములచేత మిగులమనోహరముగాఁ బ్రకాశింపఁ జేయఁబడినదియును, వికసించిన తామరపువ్వులును, నల్లకలువలునుగలదియును, వైడూర్యమణివలె నిర్మలమైనయుదకముగల పంపాసరోవరము మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! చూడుము. ఈ పంపాసరోవరమునకు సమీపమునందున్న యరణ్యము చూచుటకు మిగులఁ జక్కఁగనున్నది కావున నేయీయరణ్యము మిగులమనోహరముగనున్నది. మఱియు నోలక్ష్మణా! ఇక్కడనున్న వృక్షములన్నియును మిగులఁ బొడవులైన కొమ్మలయొక్క యగ్రములుగలవై గొప్పవగు శిఖరములుగల పర్వతములవలె మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! నేనిదివఱకే రాజ్యభ్రష్టుఁడనగుటచేతను, బంధుజనవియోగముచేతను దుఃఖమును బొందుచున్నాను. ఇప్పుడు భరతుఁడు నానిమిత్తముగ నయోధ్యాపట్టణమును, సౌఖ్యములను, వదలి నందిగ్రామమునందు మునివృత్తిచేత నుండుటచేతను, సీతాదేవిని మనకుఁ దెలియకుండ రావణాసురుఁడో మఱియెవ్వఁడో యపహరించుటచేతను నాకు మనోవ్యథలు మిక్కిలి యధికమగుచున్నవి మఱియు నోలక్ష్మణుఁడా! భరతుఁడు నందిగ్రామమునందు మునివృత్తిచేత నుండుటవలన దుఃఖముచేతను, సీతావియోగమువలన దుఃఖముచేతను వ్యసనమును బొందుచున్న నన్ను నీవసంతకాలము మఱింత యధికముగా దుఃఖమును బొందించుచున్నది తమ్ముఁడా! లక్ష్మణా! చిత్రమైనయగన్యాప్రదేశములుగలదియును, నానావిధములగు పుష్పములచేత వ్యాప్తమైనసమీపప్రదేశములుగలదియును, నిర్మలమైనయుదకముగలదియును, మంగళకరమైనదియును నగు నీ పంపాసరోవరము దుఃఖముచేతఁ బీడింపఁబడుచున్న నాకుఁ గూడ మిగులమనోహరమైనదై ప్రకాశించుచున్నది అనేకతలలుగలపాములు, సామాన్యములగుపాములు, సింహములు మొదలుగాఁగల మృగములు, పక్షులు మొదలగువానితోఁ గూడుకొని సమీపప్రదేశముగలదియును, చూచుటకు మిగులసుందరముగనున్నదియును, నగునీపంపాసరోవరము తామరపూలచేత నిండుగావ్యాప్తమైనదై మిగుల మనోహరముగఁ బ్రకాశించుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! వృక్షములయొక్క నానావిధములగు పుష్పములనియు

డుమెత్తలచేతవ్యాప్తమైనదియును, నల్లనిదియును, పచ్చనిదియును, నగుపచ్చికగడ్డిగలయీప్రదేశము మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నది తమ్ముఁడా! లక్ష్మణా! పూలగుత్తులచేత వ్యాప్తమైనవృక్షములయొక్క యగ్రభాగములు, పుష్పించినయగ్రభాగములచేత నాలింగనముచేసికొనఁబడినవైయున్నిచోట్లను మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! పుష్పములును, ఫలములునుగల వృక్షములుగలదియును, పరిమళించుచున్నదియునునగు నీకాలమువసంతకాలమగుటచేత మిగులజల్లనిదియును, సుఖస్పర్శగలదియుననగువాయువువీచుచున్నది. కావుననిప్పుడు నాకువిశేషముగా మన్మథవికారముగలుగుచున్నది. తమ్ముఁడా! పుష్పములనువర్షించుచున్న యీవనములయొక్క యీకాంతులనుజూడుము. ఇవిపుష్పములవర్షించుచు, ఉదకమునువర్షించుచున్న మేఘములవలె బ్రకాశించుచున్నవి. మఱియునోలక్ష్మణా! నానావిధములగు వనమునందలివృక్షములన్నియును, గాలియొక్కవేగముచేతఁ గదల్పఁబడినవై మిగులమనోహరములగుశిలలయందలి ప్రదేశమునందు, పుష్పములనుజల్లుచున్నవి. మఱియు నోతమ్ముఁడా! లక్ష్మణా! చూడుము. వాయువు, ఇదివఱకుచెట్లనుండిపడినవియును, ఇప్పుడుపడుచున్నవియును, ఇప్పుడువృక్షములయందున్నవియుననగు పుష్పములచేత సర్వస్థలములయందును గ్రీడించుచున్నవానివలె సంచరించుచున్నాఁడు.

మఱియునోలక్ష్మణా! వాయువు, పుష్పములచేతనిండియున్నవియును, నానావిధములైనవియును, నగుచెట్లకొమ్మలనుగదల్చుచున్నాఁడు. అట్లుకదల్చుటచే నిలుచుటకువీలులేక పుష్పములనువదలి యిటునటుసంచరించుచు గానమునుజేయుచున్న తుమ్మెదలననుసరించి తానుగూడగానమునుజేయుచున్నవానివలెఁ గనఁబడుచున్నాఁడు. చూడుము మఱియునోలక్ష్మణా! పర్వతపుగుహలలోనుండి బయలువెడలినయీవాయువు, మదించినకోకిలయొక్క ధ్వనులనియెడుపిల్లనగ్రోవి మొదలగువాద్యములచేత వృక్షములనియెడునర్తకులను నాట్యమునుజేయించుచున్నవానివలె వృక్షములను గదల్చుచున్నాడు. వాయువు, పర్వతపుగుహలలోనుండివచ్చునపుడు ఆగుహలనుండివచ్చుచున్న ధ్వనితోఁగూడుకొనినవాఁడగుటచేతఁ దానుగూడసంగీతమును బాడుట కారంభించినవానివలెనున్నాఁడు మఱియునోలక్ష్మణా! ఆగాలిచేతనధికముగాఁ గదల్పఁబడిన యీచెట్లన్నియును, నొకదానితోనొకటిగాఁ జేరుకొన్నకొమ్మలుగలవై యొకటిగాఁ జేర్పఁబడియున్నవి. కాఁబట్టి యీవృక్షములన్నియు సుమాలాకారముగఁ జేయఁబడినవై యున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈవాయువు, మనయొక్కమార్గాయాసమును బోఁగొట్టునదియును, పరిమళమునుగొనివచ్చుచున్నదియును, చందనమువలెఁజల్లనిదియును, సుఖస్పర్శగలదియును నైవీచుచున్నది కాఁబట్టియీవాయువు మిగులమనోహరముగనున్నది. మద్యగంధమువంటి గంధముగలయీవనములయందలి వృక్షములన్నియును, వాయువుచేతఁగదల్పఁబడినవైతుమ్మెదలయొక్క ధ్వనితోఁగూడుకొనినవై తామును గూడధ్వనినిజేయుచున్నవానివలెఁ గనఁబడుచున్నవి. మఱియునోలక్ష్మణా! మనోహరములగు కొండచరియలయందుఁబుట్టినవియును, పుష్పములుగలవిగనుక నేమనోహరములైనవియును, నగుగొప్పగొప్పచెట్లతోఁ గూడుకొనినశిఖరములయొక్కయగ్రభాగములుగల పర్వతములుమిగులమనోహరముగనున్నవి. చూడుము. మఱియునోలక్ష్మణా! ఈవనమునందలి వృక్షములన్నియును, పుష్పములచేత వ్యాప్తములైన కొనలుగలవియును, గాలిచేతఁగదల్పఁబడినవియును, తుమ్మెదలనియెడుతలపాగలుగలవియును, నై సంగీతమునుజేయుట కారంభించినవారలవలెఁ గనఁబడుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! పుష్పించినయగ్రభాగములుగలయీకొండగోగుచెట్లు "బంగారుపట్టువస్త్రమునుధరించినమానవులవలె" మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! నానావిధములగుపక్షులయొక్కఅవ్యక్తమధురమైనధ్వనిగలది, యగునీవసంతకాలము సీతావియోగమునుబొందిననాకు వ్యసనమును మిగులనధికముగా వృద్ధినిబొందించుచున్నది. సీతావియోగముచేతవ్యసనమునుబొందుచున్ననన్ను నిప్పుడుమన్మథుఁడు అధికముగా సంతాపమునుబొందించుచున్నాఁడు. ఈవసంతకాలమునందు మామిడిచిగుళ్లనుదిని సంతోషముగలదై కూయుచున్న యీకోకిల నన్నుఁబిలుచుచున్నదానివలెనున్నది చూడుము తమ్ముఁడా! లక్ష్మణా! మిగులమనోహరమయిన యీకొండకాలవయందు సంచరించుచున్న యీనీటికోడి మిగులసంతోషముగలదై ధ్వనిచేయుచు మన్మథునిచేతఁ బీడింపఁబడుచున్న నన్ను మిక్కిలియధికముగాఁ బీడించుచున్నది. (అనఁగానివియన్నియును మన్మథవికారమునునధికముగాఁ జేయుచున్నవనుట.) తమ్ముఁడా! పూర్వము యీయాశ్రమమునందు సంచరించుచున్నదియును, నాకుఁబ్రియురాలును, నగుసీతాదేవి యీనీరుకోడియొక్కకూతనువిని మిగులనధికముగా సంతోషించినదై యధికముగారతికేళులనుజేయుచు నన్నునధికముగా సంతోషమునుబొందించుచువచ్చె. తమ్ముఁడా! లక్ష్మణా! యిక్క

డసర్వస్థలములయందును, నానావిధములుగఁ గూయుచున్నవియును, విచిత్రములైనవియును, నగుపక్షులును, వృక్షములును, తీఁగెలును, పొదలును, మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నవి వినినన్నంటనిచూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఇక్కడఁదిరుగుచున్నయాఁడుపక్షులన్నియును మగపక్షులతోఁగూడి తమవారిచేతఁ దగినమగనితోఁ జేరితిరేయనికొనియాడఁబడుచున్నవి. చూడుము. మఱియును శ్రేష్ఠములగు తుమ్మెదలయొక్కఝంకారములచేత సంతోషమునుబొందినవై తాముగూడ మనోహరముగఁ గూయుచున్నవి చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఇక్కడనున్నయీవృక్షములన్నియును, నాకుమన్మథబాధను వృద్ధినిబొందించుచున్నవై భరతపక్షులయొక్క కూతలనియెడునెపముచేతను, పుంస్కోకిలయొక్కధ్వనులచేతను ధ్వనిచేయుచున్నవానివలెఁ గనఁబడుచున్నవి. చూడుము. మఱియునోతమ్ముఁడా! లక్ష్మణా! అశోకపుష్పములనియెడుకోరవినిప్పులుగలదియును, తుమ్మెదలయొక్క ధ్వనియనియెడుభుగుభుగుధ్వనులుగలదియును, చిగురుటాకులనియెడు ఎఱ్ఱనిజ్వాలలుగలదియును, నగువసంతకాలమనియెడు నగ్ని, భార్యావియోగమును బొందియున్న నన్నుశీఘ్రకాలములోనేకాల్చివేయఁగలదు. తమ్ముఁడా! లక్ష్మణుఁడా! సూక్ష్మములగు రెప్పలతోఁగూడిన నేత్రములుగలదియును, మిగులఁబొడవులగుతలవెండ్రుకలుగలదియును, మిగులమనోహరముగ సంభాషించునదియును, నగుసీతనుజూడకనేనుజీవించుటవలనఁ బ్రయోజనమేమిగలదు. పాపరహితుఁడవైనయోలక్ష్మణా! మిగులమనోహరమయినయరణ్యముగలదియును, నాలుగువైపులను గోకిలలయొక్కధ్వనితోఁగూడుకొనినదియునునగు నీవసంతకాలము నాప్రియురాలగు సీతకుమిగులఁబ్రియమయినది ఇట్టికాలమునందునాకుఁగలిగిన యీసీతావియోగము మిగులవ్యసనమునుగలుగఁజేయుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! మన్మథబాధవలనఁబుట్టినదియును, వసంతునియొక్క గుణములచేత వృద్ధిని బొందింపఁబడినదియునునగు నీవియోగదుఃఖమనియెడు అగ్నినన్నుశీఘ్రముగాఁగాల్చివేయఁగలదు. తమ్ముఁడా! లక్ష్మణా! ఇప్పుడుసీతనుజూడకపుష్పించిన వృక్షములనుజూచుచున్న నాకుమనస్సునందుఁ బుట్టినవ్యసనము మిక్కిలియధికమగుచున్నది. తమ్ముఁడా! రతికేళులయందలి యాయాసమువలనఁ బుట్టెడుచెమటనుబోఁగొట్టునట్టి మలయమారుతముగల వసంతకాలమువచ్చి కనఁబడుచున్నది. ఈకాలమునందు సీతాదేవికనఁబడనిదై నాకుదుఃఖమునునధికముగాఁజేయుచున్నది. (అనఁగాభార్యావియోగమువలనదుఃఖమునుబొందుచున్న నన్నునీవసంతకాలము మిక్కిలిగా దుఃఖపరచుచున్నది.) తమ్ముఁడా! సుమిత్రాపుత్రుఁడా! లక్ష్మణా! సర్వకాలములయందును సీతనుస్మరించుచు దుఃఖపరవశుఁడనైయున్ననన్ను, మన్మథోద్దీపకమగు నీమలయమారుతము మిగులనధికముగాఁ దాపమునుగలుగఁజేయుచున్నది తమ్ముఁడా! లక్ష్మణా! వాయువుచేతఁగదల్పఁబడినవిగనుకనే స్ఫటికములతోఁ జేయఁబడినకిటికీలవలెనున్న రెక్కలతోఁగూడుకొనిన నెమళ్ళుసకలప్రదేశములయందును మిగులవినోదముగా నృత్యమునుజేయుచున్నవి. ఈనృత్యమునుజూడుము ఈనెమళ్ళయొక్క యాటకూడనాకుమన్మథబాధను మిగులనధికముగాఁజేయుచున్నది మఱియునోలక్ష్మణుఁడా! మిగులమదించినవియును, ఆడునెమళ్ళతోఁగూడినవియునునగు నీనెమళ్లుమదనబాధనుబొందుచున్న నాకుమఱియు నధికముగామన్మథబాధనుగలిగించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! మన్మథబాధతోఁగవాడినయీయాఁడునెమలి, నాట్యమునుజేయుచున్నతనమగనితోఁగూడుకొని యీకొండచరియలయొక్కసమీపమునందుఁదానుగూడ నాడుచున్నదిచూడుము.

తమ్ముఁడా! లక్ష్మణా! ఈమగనెమలికూడ మిగులమనోహరములగు ఱెక్కలనువిప్పుకొని ధ్వనులచేతనన్నుజూచి పరిహాసమునుజేయుచున్నవానివలెఁ దనప్రియురాలగు ఆడునెమలియొద్దకు పరుగెత్తికొనిపోవుచున్నది. చూడుము తమ్ముఁడా! లక్ష్మణా! ఈవనమునందలి యీనెమలియొక్కభార్యయగు ఆడనెమలి రాక్షసునిచేత నపహరింపఁబడలేదు. కావుననేయీనెమలి తనప్రియురాలితోఁగూడమిగులరమ్యములగు వనములయందునాడుచుఁ దిరుగుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! ఈవసంత ఋతుదినములయందుఁ బ్రియురాలగుసీతనువదలి యిక్కడనుండుటనాకుమిగులఁగష్టముగనున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! చూడుము పక్షులకుఁగూడ భార్యావిషయికమైన ప్రియముగలిగియున్నది చూడుము మఱియునోలక్ష్మణా! ఈయాఁడునెమలి కామపరతంత్రురాలై తనభర్తయొక్కసమీపమునందుఁ గ్రీడించుచున్నది. చూడుము. లోకములో సహజముగాఁ బురుషులు స్త్రీలనువెంబడించి వారలప్రియమునుగోరి సంచరించుదురు వసంతకాలమునందు స్త్రీలేపురుషులననుగోరుదురు. కావుననే యీయాఁడునెమలి తనభర్తనుగోరుచున్నది ఈకాలమునందు విశాలములగునేత్రములుగల సీతయపహరింపఁబడకయుండెనేని మన్మథావేశముచేతమిగులఁద్వరగలదై నన్నుఁగోరుచునావెంటనంటి విహారమునుజేయుచుండునుగదా? నాకిట్టియదృష్టము లేకపోయెనుగ

దాయనిచింతించెను. తమ్ముఁడా! లక్ష్మణా! ఈవసంతకాలమునందుఁ బుష్పలభారముతోనిండియున్న వనమునందలి వృక్షములయొక్క పుష్పములన్నియును నాయెడలనిష్ఫలములైనవి. తమ్ముఁడా! లక్ష్మణా! అధికమగుకాంతిచేతసుందరములగు యీచెట్లపూలుతుమ్మెదల సముదాయముతోఁగూడనిష్ఫలములై క్రిందఁబడుచున్నవి. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఈపక్షులన్నియును, సంతోషముతోఁగూడినవై గుంపులుగుంపులు గాఁ జేరి యవ్యక్తమధురముగా ధ్వనిని జేయుచు నాకుమన్మథబాధను వృద్ధినిబొందించుటకు ఒకదానినొకటి పిలుచుచున్నవి. చూడుము. ఇట్టికాలమునందునేను సీతావియోగమును ఎట్లుసహింతును. తమ్ముఁడా! లక్ష్మణా! సీతయున్నచోటఁగూడ నిప్పుడువసంతకాలమయ్యెనేని నేనేవిధముగా దుఃఖమునుబొందుచున్నానోయటులనే సీతాదేవికూడనిశ్చయముగా మన్మథబాధకుఁ దాళఁజాలక వ్యసనమునుబొందుచుండును. తమ్ముఁడా! లక్ష్మణా! నిశ్చయముగా సీతాదేవియున్నచోటఁగూడ యీవసంతకాలముండియుండెనేని పద్మపత్రములవంటికన్నులుగల యాసీతాదేవినన్నువదలి యెట్లుజీవింపఁగలదు ఒకవేళసీతాదేవి, వసంతకాలము సీతాదేవియున్నచోటనున్నప్పటికిని, శత్రువులచేత భయపరుపఁబడిదుఃఖించుచున్నదై యేమిచేయఁగలదు. తమ్ముఁడా! లక్ష్మణా! మధ్యవయస్సునందున్నదియును, మిగులవిశాలములగు నేత్రములుగలదియును, మిగులమృదువుగసంభాషణనుజేయుచుండునదియును, నగుసీతాదేవినిశ్చయముగా యీవసంతకాలమునందు, ప్రాణములనుభరింపఁజాలక మరణమునుబొందును. పతివ్రతయగుసీతాదేవి నావియోగమునునిశ్చయముగా సహింపఁజాలదని నామనస్సునందు దృఢముగాఁదోచుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! సీతాదేవికినాయందుఁ బరిపూర్ణమగుప్రేమగలదు. నాకునుసీతయందు మిగులఁబూర్ణమగు ప్రేమగలదు. కావుననేయీవసంతకాలము మమ్ములనిరువురనుసమముగానే బాధించుననితోఁచుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! సర్వకాలములయందునుసీతను స్మరించుచున్ననాకు, పుష్పములయందలి పరిమళమును గొనివచ్చుచున్నదియును, సుఖస్పర్శగలదియును, మంచుకణములను గొనివచ్చుచుండుటచేత మిగులఁజల్లనిదియును, మెల్లగావీచుచున్నదియును, నగుయీగాలినిప్పువలె తాపమును గలుగఁ జేయుచున్నది తమ్ముఁడా! లక్ష్మణా! పూర్వముయిటువంటిగాలి సీతతోఁగూడుకొనియున్ననాకు మిగులమనోహరమయినదైయుండెడి. ఇప్పుడుఆగాలిసీతాదేవి నాయొద్దలేకపోవుటవలన నాకుదుఃఖమును అధికముగాఁగలిగించుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! పంచవటీతీరమునందు సీతతోనేను గూడుకొనియున్నసమయమునందు యీకాకిఆకాశమునందు సంచరించుచుఁ గర్ణకఠోరముగఁ గూయుచుండె. ఇప్పుడువృక్షమునందు ఎక్కికూర్చుండి మిగులసంతోషముగలదానివలెఁ గూయుచున్నది తమ్ముఁడా! లక్ష్మణా! పూర్వమునందు యీకాకిఆకాశమునందుఁ దిరుగుచుఁగూయుచుండుటచేత సీతావియోగముగలిగెను. ఇప్పుడుయీకాకి చెట్టుమీఁదఁ గూర్చుండికూయుచుండుటచేత విశాలములగునేత్రములుగల సీతాదేవియొక్కసంయోగము గలుగుననితోఁచుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! పుష్పించినకొనలుగల చెట్లయందుఁగూర్చుండి గూయుచున్న యీపక్షులయొక్కకూతలు మన్మథబాధను మిగులవృద్ధినిబొందించుచున్నవి. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! వాయువుచేతఁగదల్పఁబడిన యీబొట్టుగుచెట్టుయొక్కపుష్పించియున్న తీఁగెలమీఁదికి యీతుమ్మెద, మిగులమదముగలదియగు ప్రియురాలిమీఁదికి రమించుటకుఁ బోవువిధముగ మిగులవేగముతోఁబోవుచున్నది. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! కాముకులకు మిగులదుఃఖమును వృద్ధిచేయునట్టియీయశోకవృక్షము, వాయువుచేతమీఁదికిఎగురఁగొట్టఁబడుచున్న పూలగుత్తులచేత నాకుమిక్కిలిదుఃఖమునుగలిగించెదనని బెదరించుచున్నదానివలెనున్నది తమ్ముఁడా! లక్ష్మణా! పుష్పములచేతఁబ్రకాశించుచున్న యీమామిడిచెట్లువిలాసముచేత గర్వముతోఁగూడిన మనస్సుగలవారును, అనురాగముగలవారునునగు మానవులవలెఁగనఁబడుచున్నవి చూడుము సుమిత్రానందనుఁడవును, మానవోత్తముఁడవును, నైనయోలక్ష్మణా! ఈపంపాసరోవరముయొక్క సమీపమునందున్నవియును, మిగులఁజిత్రములైనవియును, నగువనపఙ్క్తులయందంతటను, కిన్నరులు మిగులమనోహరముగ సంచరించుచున్నారు. తమ్ముఁడా! లక్ష్మణా! మిగులఁబరిమళముగల యీయెఱ్ఱకలువలు, పంపాసరోవరమునందలి యుదకమునందు లేతసూర్యునిప్రతిబింబములు ప్రకాశించుచున్నవిధముగఁ బ్రకాశించుచున్నవి చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! నిర్మలమయినయుదకములుగలదియును, అనేకములగుపద్మములను, నల్లగలువలను, గలదియును, హంసలయొక్కయు, బెగ్గురుపక్షులయొక్కయు, సముదాయముగలదియును, అనేకవేలయెఱ్ఱకలువలతోఁగూడుకొనినదియును, నగునీపంపాసరోవరము మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నది చూడుము. మతిమన్నోలక్ష్మణా! నీటియందుఁబ్రతిబింబించిన బాలసూర్యునియొక్క కాంతివంటి కాంతిగలవియును,

తుమ్మెదలచేతఁ గొట్టఁబడినకింజల్కములుగలవియును, నగుపద్మములతోఁగూడుకొనిన యీపంపాసరోవరము సర్వస్థలములయందును మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నది. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! చక్రవాకపక్షులతోఁగూడుకొనినదియును, తీరమునందలిచిత్రమగు వనమే కట్టువస్త్రముగాఁ గలదియును, ఉదకమును త్రాగవలయునని వచ్చుచున్న యేనుఁగులగుంపుతోఁ గూడుకొని నదియున్నదై యీపంపాసరోవరము మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నది తమ్ముఁడా! లక్ష్మణా! గాలిదెబ్బచేత మిగుల వేగముగలతరంగములచేఁ నిర్మలమైన యుదకమునందలిపద్మములన్నియును, కెరటములచేతఁ గొట్టఁబడుచున్నవిధముగఁ గొట్టఁబడుచున్నవి. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! సర్వకాలములయందును బద్మములయందుఁ బ్రేమగలదియును, తామరపువ్వులయందలి రేకులవలెవిశాలములైననేత్రములుగలదియును, నగుసీతాదేవి లేకపోవుటవలన నాకుజీవించియుండవలయుననియెడు కోరికకొంచెమైనను లేకయున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! మన్మథునియొక్కమాహాత్మ్యమునుజూడుము. దూరమునందున్నదియును, చూచుటకుఁగూడదుర్లభమైయున్నదియును, మంగళకరురాలును, మిగులమంగళకరములైన మాటలనుమాట్లాడునదియును, నగుసీతాదేవిని మన్మథుఁడుతలఁచునట్లుచేయుచున్నాఁడు కావుననే, మన్మథుఁడుమిగులమాహాత్మ్యముగలవాఁడనితోఁచుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! ఇప్పుడుపుష్పించినవృక్షములుగల యీవసంతుఁడు నన్నుబాధింపకుండెనేని యీమన్మథబాధను నేనుసహింపఁగలను ఈ మన్మథునకు సహాయముగావసంతుఁడుండుటచేత మన్మథునిజయించుటమిగులదుర్లభమైనది. తమ్ముఁడా! లక్ష్మణా! పూర్వముసీత నాయొద్దనున్న సమయమునందుఏవియెవి రమణీయములైయున్నవో యవియే సీతావియోగము గలిగియుండుటచేత మిగులవ్యసనమునుగలుగఁజేయుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈతామరమొగ్గయందలి రేకులనుజూచుటచేతనివిసీతాదేవియొక్క కనురెప్పలనుస్మరణకుఁ దెచ్చుచున్నవి. (అనఁగా తామరమొగ్గలయందలిరేకులు సీతాదేవియొక్కకనురెప్పలతో సమముగానున్నవనుట తమ్ముఁడా! లక్ష్మణా! పద్మములయందలి కింజల్కములను, తాకియక్కడనుండివచ్చుచున్నదగుటచేత మిగులఁబరిమళముగలదియును, చెట్లసందుగాదాగిదాగివచ్చుచుండుటచేత మిగులమెల్లనిగతిగలదియును, మిగులమనోహరమైనది యునునగుమలయమారుతముసీతాదేవియొక్క నిశ్వాసమువలె మిగులమనోహరముగ నాశరీరమునఁదాకుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! పంపానదికిదక్షిణపువైపుననున్న కొండచరియయందు, పుష్పించియున్నదియును, మిగులశుభకరమైనదియును, నగుతీగెవంటికొండగోగుచెట్టునుజూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఈపర్వతశ్రేష్ఠమునానావిధములగుగైరికాదిధాతువులచేతఁ జక్కగానలంకరింపఁబడినదై గాలిదెబ్బచేతఁ గొట్టఁబడినదై లేవఁదీయఁబడినదియును, నానావిధములగు వర్ణములు గలదియైనునగు పరాగమును (దుమ్మును) సర్వస్థలములయందును వ్యాపింపఁజేయుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! ఈపర్వతమునందలిచరియలన్నియును, సర్వస్థలములయందునునున్నవియును, చక్కగాఁబుష్పించినవియును, ఆకులేమియును లేనివియును, సర్వప్రకారములచేతను మిగులమనోహరము లయినవియును, నగుమోదుగుచెట్లచేతమిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! పంపాతీరమునందు మొలిచిన యీవృక్షములన్నియును, మిగులఁబరిమళముగల గంధముగలవై యొకదానితోనొకటిచేరుకొని యున్నవి. మఱియునో లక్ష్మణా! అడవిమల్లెచెట్లును, సాధారణములగుమల్లెచెట్లయొక్కపొదలును, పుష్పించినగన్నేరుచెట్లును, మొగలిచెట్లును, నల్లవావిలిచెట్లును, పుష్పించినపువ్వులగులివిందచెట్లును, పరిమళించుచున్నగంధముగల బండిగురివిందచెట్లును, మల్లెపొదలును, కానుగుచెట్లును, ఇప్పచెట్లును, ప్రబ్బలిచెట్లును, పొగడచెట్లును, సంపెగచెట్లును, బొట్టుగుచెట్లును, పుష్పించిననాగకేసరివృక్షములును, నీరుప్రబ్బలిచెట్లును, ఉలిమిరిచెట్లును, పుష్పించినఖర్జూరివృక్షములును, ఏనుఁగుపల్లేరుచెట్లును, మిగులమనోహరముగాఁ ఈ పర్వతముయొక్క మీఁదిభాగములయందు బ్రకాశించుచున్నవి. మఱియునో లక్ష్మణా! సింహముయొక్కశిరోభాగమునందలి జూలుయొక్కవర్ణమువంటివర్ణముగల లొద్దుగచెట్లును, చక్కగాఁబుష్పించియున్నవియగు నల్లనియశోకవృక్షములును, ఊడుగుచెట్లును, పచ్చనిపువ్వులుగలగోరంటచెట్లును, బూరుగచెట్లును, వేపచెట్లును, తియ్యమామిడిచెట్లును, పాటలీవృక్షములును, ఎఱ్ఱకాంచనపుచెట్లును, నారింజచెట్లును, మద్దిచెట్లును, కొండచరియలయందు మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నవిచూడుము మఱియునో లక్ష్మణా! బంగారముయొక్క కాంతివంటికాంతితోఁగూడుకొనినమొగిలిచెట్లును, విరిగిచెట్లును, దిరిసెపుచెట్లును, ఇరుగుడుచెట్లును, చంద్రచెట్లును, బూరుగుచెట్లును, ఎఱ్ఱనిపూలతోఁగూడినమోదుగుచెట్లును, ఎఱ్ఱపూలగోరంటచెట్లును, నెమ్మిచెట్లును, కానుగుచెట్లును, మంచిగంధపుచెట్లును, స్పందనవృక్షములును, నీపర్వతమునయు

క్కచరియలయందు మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈవృక్షములన్నియు నుత్పుష్పించినకొనలుగలతీగెలచేతఁ జుట్టుకొనఁబడినవియు నై మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నవి. చూడుము ఇవియన్నియును మిగులసుందరములై యున్నవి ఇట్లు సుందరములైనవియును, గాలిచేతఁ గదల్పఁబడిన కొమ్మలుగలవియును, సమీపమునందున్నవియు నగువృక్షములతో, సీతీఁగెలన్నియును, యౌవనమదముగల స్త్రీలుపురుషులతోఁ గలిసికొనువిధముగాఁ గలియుచున్నవి. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఈగాలి, ఒకచెట్టునుండి మఱియొక చెట్టుమీఁదికిని, ఒకపర్వతమునుండి మఱియొకపర్వతముమీఁదికిని, ఒకపొదలోనుండి మఱియొకపొదమీఁదికిని బోవుచున్నదియును, నగుటచేత నానావిధములగుపుష్పములయందలి మకరందమును ద్రాగినదై మిగులసంతోషముగలదానివలె వీచుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! కొన్నివృక్షములు తియ్యనిగంధముగలవై నిండుగా వికసించినపుష్పములుగలవై యున్నవి కొన్నివృక్షములు విశేషముగా మొగ్గలుగలవై యున్నవి. ఇవ్విధముగనున్నవై తొడిమెలయొక్క కాంతిచేత నల్లనివర్ణముగలవై మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! తుమ్మెదలగుంపు, ఈపుష్పము రమ్యమైనదనియును, ఈపుష్పము మిగులరుచిగలదియనియును, ఈపుష్పము చక్కగా వికసించినదనియును దలఁచినదై మిగులఁ బ్రియముగలదగుచు బుష్పములయందుఁ బ్రవేశించుచున్నది. చూడుము. నాయనా! లక్ష్మణా! మకరందమునందాశగల యీతుమ్మెదలయొక్కగుంపు పంపాతీరమునందలి వృక్షములలో ముందుగా నొకదానిమీఁద నెక్కి పిమ్మట మఱియొక్కదానియందెక్కి తిరుగుచున్నది అట్లు తిరుగుచు నీతుమ్మెదలు సకలపుష్పములయందలి మకరందములను ద్రాగుచున్నవి. చూడుము తమ్ముఁడా! లక్ష్మణుఁడా! ఈభూమియంతయును దమంతటఁ దామే జారినపుష్పములచేత వ్యాప్తమయినదై పరుండుటకు అనుకూలమగు మెత్తని పరుపులచేత వ్యాప్తమయిన దానివలె మిగుల సుఖకరమయియున్నది చూడుము తమ్ముఁడా! లక్ష్మణా! ఈకొండచరియలయందు స్వయముగా నుండినవియును, నానావిధములగు నాపుష్పములచేత, పచ్చనివర్ణముగలవియును, ఎఱ్ఱనివర్ణముగలవియును, నగుననేకవిధశయ్యలు నిర్మింపఁబడియున్నవి. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! హేమవంతఋతువు పోయినపిమ్మట వచ్చిన యీవసంతకాలమునందలి పుష్పసమృద్ధిని జూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఈవసంతఋతువునందు పుష్పములతోఁ గూడినకొనలుగల వృక్షములన్నియును, పరస్పరసంఘర్షణవలనఁ బుష్పించినవానివలెనున్నవై యొకదానితో నొకటి, యేమీమీరుమాతో సమముగా నెందుకుఁ బుష్పించలేదని తుమ్మెదలయొక్క రొదలచేత నడుగుచున్నవానివలె మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈకన్నెలేడిపిట్ట (నీరుకాకి) పరిశుద్ధమగునుదకమునందుమునిఁగి స్నానమును జేసి తనభార్యతోఁగూడ విహరించుచు నాకుఁ గామమును మిగులవృద్ధిని బొందించుచున్నది. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఈపంపాసరోవరమునకుఁ గల గుణములు గంగానదియందుండెనేని లోకములో ప్రసిద్ధముగానున్న గుణములు మనోహరములును, సుప్రసిద్ధములును నై యుండుటకు గొంచమయినను సందేహములేదు. తమ్ముఁడా, లక్ష్మణా, పతివ్రతయగు నాసీతాదేవి యిక్కడనుండఁగా మనము నివసించియుంటిమేని నేను దేవేంద్రపదవినిఁ గూడఁ గోరను. మఱియును అయోధ్యాపట్టణమునందుఁ గూడ నివసింపవలయునని యెడుకోరిక గూడ నుండదు. తమ్ముఁడా, లక్ష్మణా, ఈప్రకారము మిగులసుందరములగు ప్రదేశములయందు నేను సీతతోఁ గూడ సంచరించుచుంటినేని నాకు యితరవస్తువులయందు దేనియందును గోరిక గలుగదు తమ్ముఁడా, లక్ష్మణా, ఇక్కడనున్న వృక్షములన్నియును పుష్పములచేత వ్యాప్తములైనవై (అనఁగా సంపూర్ణముగాఁ బుష్పించిన పుష్పములుగలవై) సీతను వదలి యీయడవియందు ఒంటిగా సంచరించుచున్న నామనస్సునకుఁ బిచ్చిని పుట్టించుచున్నవి తమ్ముఁడా, లక్ష్మణా, చల్లని యుదకముగలదియును, తామరపువ్వుల తోఁగూడుకొనినదియును, చక్రవాకపక్షుల తోడను, నీరుకాకుల తోడను కూడుకొనినదియును, నగునీపంపాసరోవరమును, చూడుము తమ్ముఁడా, లక్ష్మణా, మఱియును, నీరుకోళ్ళచేతను, క్రౌంచపక్షులచేతను, నిండియున్నదియును, తీరమునందలి పందులతోడను, లేళ్ళతోడను నిండియున్నదియును, నగునీపంపాసరోవరమును జూడుము. తమ్ముఁడా, లక్ష్మణా, మిగులమనోహరముగఁ గూయుచున్న పక్షులతోఁ గూడుకొనిన యీపంపాసరోవరము మఱియు నధికముగాఁ బ్రకాశించుచున్నది.

తమ్ముఁడా! లక్ష్మణా! మంచినడివయస్సుగలదియును, చంద్రునివంటి ముఖముగలదియును, పద్మములతో సమానమైన నేత్రములుగలదియును, నగు సీతాదేవిని స్మరించుచున్న నన్ను నానావిధ జాతిభేదములుగలవియును, పరమసంతోషముతోఁ గూడినవియును నగు నీపక్షులన్నియును, నన్ను బహువిధములఁ బీడించుచున్నవి. (అనఁగా మన్మథోద్రేకమును అధికముగాఁ గలిగించుచున్నవి) తమ్ముఁడా! లక్ష్మ

ణా, చిత్రములగు నీకొండచరియలయందు, ఆడలేళ్లతోఁ గూడ మిగులసంతోషముగా విహరించుచున్న యీమగలేళ్లనుజూడుము. లేడినేత్రములవంటి నేత్రములుగల సీతాదేవినివదలుకొని వియోగదుఃఖముననుభవించుచున్న నన్నుఁ జూడుము తమ్ముఁడా, లక్ష్మణా, మదించిన పక్షులసముదాయముతోఁ గూడుకొనినదియును, మిగులమనోహరమైనదియును, నగునీకొండచరియలయందు, తమభార్యలతోఁ గూడసంచరించుచున్న యీమృగములనుజూడఁగాఁ నాకుఁ గూడ మనోవ్యథగలుగుచున్నది అనఁగానివియన్నియును నాకుమన్మథోద్రేకమును అధికముగాఁగలుగఁజేయుచున్నవి) తమ్ముఁడా,లక్ష్మణా, నేనుసీతాదేవిని జూచితినేనిప్పుటనాకుశుభముగలుగును తమ్ముఁడా, లక్ష్మణా, సన్ననినడుముగలసీతాదేవి నాతోఁగూడ నీపంపాసరోవరమునందలివాయువువలనఁగలిగెడు సుఖమునుఅనుభవించెనేని, నేనుజీవింపఁగలను లేనియెడల నాప్రాణములుండునని తోఁచలేదు తమ్ముఁడా, లక్ష్మణా, పద్మములయందలి పరిమళముగలదియును, మంగళకరమైనదియును, దుఃఖమునునశింపఁజేయునట్టిదియును, పంపాసరోవరమునకు సమీపమునందుసంచరించుచున్నదియును, నగువాయువును, ధన్యులగువారుసేవించుచున్నారు తమ్ముఁడా, లక్ష్మణా, మంచినడివయస్సుగలదియును, పద్మపత్రములవంటి నేత్రములుగలదియును, నాయొక్కవియోగమునుబొందినదియును, ప్రియురాలును, నగుసీతాదేవి మిగులదుఃఖమును బొందుచునెట్లుజీవించునో నాకుఁదోఁచలేదు. తమ్ముఁడా, లక్ష్మణా, సీతాదేవిబాగుగనున్నదా? యనియడిగినప్పుడు పరమందిలోరాజును, ధర్మములనుదెలిసినవాఁడును, సత్యముగమాటలాడువాఁడును, నగుజనకచక్రవర్తితో నేనేమిచెప్పుదును. తమ్ముఁడా, తండ్రియనుమతమునుబొంది యరణ్యమునకువచ్చిననాతోఁగూడ సీతాదేవివచ్చెను. ఇట్లువచ్చినసీతాదేవిసన్మార్గమునుదప్పక నాతోఁగూడ సంచరించుచుండె. ఆసీతాదేవియిప్పుడెక్కడనున్నదోగదా? తమ్ముఁడా, లక్ష్మణా, అటువంటిసీతాదేవినన్నువదలి ప్రాణములెట్లు భరించునో, యనినాకుసందేహముగలిగియున్నది తమ్ముఁడా, లక్ష్మణా, నేనటువంటిసీతనువదలి యెట్లుప్రాణములనుభరింపఁగలను. తమ్ముఁడా, లక్ష్మణా, రాజ్యమునువదలిమతిచెడినవాఁడనై యరణ్యమునకువచ్చుచున్న నాతోఁగూడసీతాదేవివచ్చుచుండె తమ్ముఁడా, లక్ష్మణా, మిక్కిలిసుందరములగు రెప్పలతోఁగూడిన నేత్రములుగలదియును, పరిమళించుచున్నగంధముగలదియును, మంగళకరమైనదియును, దోషగుణములేమియునులేనదియును, నగునాసీతాదేవియొక్క ముఖముకనఁబడకపోవుటవలన నామనస్సుమిగుల నధికముగాదుఃఖమునుబొందుచున్నది. తమ్ముఁడా, లక్ష్మణా. మిక్కిలిప్రేమనుజూపించుచున్న సత్వతోఁగూడినవియును, ఉపచారగుణమును దెలుపుచున్నవియును, మిగులమనోహరమైనవియును, హితమైనవియును, ఈసులేనివియును, నగసీతాదేవియొక్కమాటను నేనెప్పుడువినఁగలను. తమ్ముఁడా, లక్ష్మణా, మంచినడివయస్సుగలదియును, పతివ్రతయును, నగుసీత యీయరణ్యమునందుమన్మథబాధచేత వ్యసనమునుబొందుచున్న నన్నుఁజూచి తానువనవాసదుఃఖముగలదయ్యును, తనదుఃఖమునుసర్వమునునణఁచుకొని సంతోషముగలదానివలెఁ బూర్వమునాకు మిగులమనోహరములగుమాటలను జెప్పుచువచ్చెను తమ్ముఁడా, లక్ష్మణా, మనమయోధ్యాపట్టణమునకుఁబోయినప్పుడు అక్కడనెల్లవారలచేతను అయోధ్యాపవసి దయతలఁచఁదగియున్న కౌసల్యాదేవివాకొడలగుసీతాదేవి యేదియనియడిగెనేని నేనుసీతాదేవియెక్కడనున్నదనిచెప్పుదును? మఱియునేనేమనిచెప్పఁగలను? తమ్ముఁడా, లక్ష్మణా నీవుపోయియున్నదమ్ములయందుఁ బ్రేమగలభరతునిఁజూచి యతనియొద్దనుండుము. నేనుసీతాదేవిని వదలిజీవింపఁజాలను కావుననాప్రాణము పోవునట్లగుచున్నది కాఁబట్టినీవిక్కడనుండి నన్నువదలిపొమ్మనియె ఇవ్విధముగాదిక్కులేనివానివలె దుఃఖించుచున్నవాఁడును మహానుభావుఁడును, నగురామునితోఁ తోఁబుట్టువగు లక్ష్మణుఁడుయుక్తులచేత ఖండించుటకునలవిగాని మాటలను జెప్పఁదలఁచి యిట్లనియె

అన్నా, రామచంద్రా, దుఃఖమునువిడిచికొనుము. పురుషోత్తముఁడవైన యోరామా, నీవుదుఃఖమునుబొందకుము. నీయట్టిమహానుభావులు ధైర్యమునవలంబించిరేని బుద్ధిమందపడిపోదు. ధైర్యములేకపోవుటచేత నీబుద్ధిమందపడిపోవుచున్నది అన్నా, రామా, "శ్లో॥ స్మృత్వాపియోగజందుఃఖం త్యజస్నేహంప్రియేజనే। అతిస్నేహపరిష్వంగాద్వర్తిరార్ద్రాపిదహ్యతే,, ఇట్టివియోగమువలనఁ గలిగినదుఃఖమునువదలిపెట్టి ప్రియజనమునందలి ప్రేమనువదలుకొనుము ప్రేమనుబెట్టుకొనుటవలనఁగదా? వియోగకాలమునందు యింతదుఃఖముగలిగెనని యెన్నికొనుము అతిస్నేహముయొక్క సంబంధమువలనఁ దడిసియున్నవత్తి తగలఁబడిపోవుచున్నదిగదా? (స్నేహమనఁగ చమురు. చమురుతోఁ తడపఁబడినవత్తితగలఁబడిపోవుటనుమనముచూచుచున్నాముగదా) (కాఁబట్టియతిస్నేహముచేత స్నేహవారునుపాడైపోదురు. కాఁబట్టిస్నేహమువలన మనకుయిం

తదుఃఖముగలిగెను. స్నేహమునువదలుకొంటి మేని యింత దుఃఖముగలుగదు. కాఁబట్టిదుఃఖమునకుఁ గారణమయిన స్నేహమును వదలుకొనుమనుట) అన్నా, రామా, శోనిమ్ము, ప్రేమనువదలవద్దు. ధైర్యమునుమాత్ర మవలంబింపుము రఘుకులమునందుఁబుట్టినరామచంద్రా, అన్నా, నీవుధైర్యమునవలంబించితివేని రావణాసురుఁడు పాతాళలోకమునకుఁబోయినను, అంతకంటెనెక్కువదగు లోకమునకుఁబోయినను చావఁగలఁడు. కావునధైర్యమునవలంబింపుము. రావణాసురునిఁజంపి సీతనుదోడ్కొనివత్తము. మఱియునో రామా, రావణాసురుఁడు సీతాదేవితోఁగూడనింద్రునితల్లియగు నదితియొక్కగర్భమునందుఁ బ్రవేశించినప్పటికిని రావణాసురునిఁజంపి సీతనుబిలుచుకొనిరాఁగలను. పూజ్యుఁడవైనయో రామా, మంగళకరమగుధైర్యమునవలంబింపుము. ఈస్వల్పమయినబుద్ధినివిడిచిపెట్టుము. అన్నా, రామా, "శ్లో॥ అర్థోహినష్టకార్యార్థైర్నాయత్నేనాధిగమ్యతే। ఉత్సాహోబలవానార్య నాస్త్యుత్సాహాత్పరంబలం। సోత్సాహస్యాస్తిలోకేస్మిన్నకించిదపి దుర్లభం॥ ఉత్సాహవంతఃపురుషా నావసీదంతికర్మసు,, నశించిపోయిన కార్యములుగలవారు, లాభమును, విశేషముగాఁబ్రయత్నమును జేయకపొందఁజాలరు. సకలకార్యములయందును ఉత్సాహమేమిగులబలముగలది. కావునునుత్సాహముకంటె బలముగలదిమరియొక్కటి యేదియును లేదు. ఉత్సాహముగలవానికియీలోకమునందుఁ బొందఁదగనికార్య మేదియునులేదు. ఉత్సాహముగలవారు సకలకార్యములయందును జయమునుబొందుదురు. కావునఅన్నా, రామా, నేనుఉత్సాహమునవలంబించి సీతనుబొందఁగలను. పూజ్యుఁడవైనయో రామా, దుఃఖమును వెనుకకుఁద్రోసి మన్మథబాధనువిడిచిపెట్టుము నీవుమహానుభావుఁడవు. ఇంతయగాకమనస్సును స్వాధీనముగాఁజేసికొనినవాఁడవు. అదియునుగాక నీవుమిగుల ధైర్యముగలవాఁడవు. ఇట్టిసద్గుణములుగలనీవు వ్యసనమునుబొందుట యుచితముగానుండలేదనియె అంతమిగులదుఃఖముచేత మనస్సుచెడియున్న రాముఁడివ్విధముగా లక్ష్మణుఁడుచెప్పినమాటలనువిని శోకమోహములనువదిలిపెట్టి ధైర్యమునవలంబించెను. అంతటనపరిమితమయిన పరాక్రమముగలరాముఁడు కొంచెమయినను తత్తరపాటులేనివాఁడై మిగుల సుందరమయినదియును, చంచలమయిన వృక్షములుగలదియునునగు పంపాసరోవరతీరమునువదలి వేరొకచోటునకుబయలువెడలె. అంతటమహాత్ముఁడైన నారాముఁడు మిక్కిలివేగముగా నచ్చటివనమునుసర్వమును, కొండకాలువలను, కొండచరియలను, జూచుచున్నవాఁడును, మిగులఁదత్తరపాటుతోఁ గూడుకొనినమనస్సుగలవాఁడును, దుఃఖముచేత మిగులబాధను బొందుచున్నవాఁడును, నైలక్ష్మణునితోఁగూడ నక్కడనుండిబయలువెడలిపోయె. అప్పుడుమదపుటేనుఁగువలె విలాసముగ నడచుచున్నవాఁడును, తత్తరపాటులేని మనస్సుగలవాఁడును, మహానుభావుఁడును, నగులక్ష్మణుఁడు అట్లువ్యసనమునుబొందుచున్న రామునితో ధైర్యమునవలంబింపుమని, నీతిని, రావణాసురుఁడెక్కడనున్నను సంహరించెదనని ధైర్యమును, జెప్పుచు, అతనినిగాపాడుచు నతనివెంట నంటిపోవుచుండె అట్లు పోవుచున్నవారును, మిగులఆశ్చర్యముగాఁ జూడఁదగినవారును, నగురామలక్ష్మణులను ఋశ్యమూకపర్వతమునకుసమీపమునందు సంచరించుచున్నవాఁడును, వానరులకందఱకునధిపతియును, మిగులబలవంతుఁడును, నగుసుగ్రీవుఁడుజూచి మిగులభయమునుబొందినవాఁడును, నిశ్చేష్టితుఁడునయ్యె. మహానుభావుఁడును, మందముగనడచుచున్నవాఁడును, వానరాధిపతియును, నగుసుగ్రీవుఁడు తానునివసించిన ఋశ్యమూకపర్వతమునకు సమీపమునందుఁదిరుగుచున్న రామలక్ష్మణులనుజూచి మిగులవిచారముగలవాఁడును, భయముగలవాఁడును, నైమిక్కిలివ్యసనమునుబొందె. మఱియునారామలక్ష్మణులను ఇరువురనుజూచి యందలివానరులుగూడ మిగులభయమునుబొందినవారై పుణ్యమును వృద్ధినిబొందించునదియును, సుఖమునుగలుగఁజేయునదియును, వానరులచేతసేవింపఁబడుచున్న మధ్యప్రదేశముగలదియును, మతంగమహామునియొక్క మాహాత్మ్యముచేత నెవ్వరికినిబ్రవేశింపనలవిగానిదియునునగు మతంగమునివరుని యాశ్రమమునకభిముఖముగాఁ బరుగిడిరి.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి మొదటిసర్గ ముగిసెను.

సుగ్రీవుడు హనుమంతుని రామలక్ష్మణుల సన్నిధికిబంపుట.

మహానుబాహులును, శ్రేష్ఠములగునాయుధములనుధరించినవారును, వీరులును, అన్నదమ్ములును, నగునారామలక్ష్మణులనుజూచిసుగ్రీవుఁడు మిగులసందేహముగలవాఁడయ్యె. అంతటనాసుగ్రీవుఁడు మిగులభయముతోఁ గూడినమనస్సుగలవాఁడును, సకలదిక్కులఁజూచుచున్నవాఁడును, నగుచునొక్కచోటఁగూడనుండనివాఁడయ్యె. మఱియుమిక్కిలిభయమును బొందిన యాసుగ్రీవునియొక్క మనస్సుమహాబలముగలవారలగు రామలక్ష్మణులనుజూచి

నతోడనేమిక్కిలిభయముబొందినదయ్యె. మఱియునాసమయమునందు సుగ్రీవునియొక్కమనస్సు మిగులఁజాపల్యముగలదయ్యె. అంతట రాజధర్మములయందు దృఢమైనబుద్ధిగల సుగ్రీవుఁడు, తనమంత్రులతోఁగూడ మనముపరుగెత్తుటమంచిదా? లేకయిక్కడనేయుండుటమంచిదా? యనియాలోచించియును, మిగులభయముతోఁ గూడినమనస్సుగలవాఁడయ్యె. అంతటవానరాధిపతియగు నాసుగ్రీవుఁడుమరల రామలక్ష్మణులనుజూచి యధికముగ భయమును బొందినవాఁడగుచుఁ దనయొక్క మంత్రులతో నిట్లనియె.

ఓమంత్రులారా! ఈవచ్చుచున్నపురుషులిద్దఱును, వాలిచేతఁబంపఁబడి కపటవ్యాపారము నవలంబించినవారై యితరులచేతఁ బ్రవేశింపనలవిగానియీవనమునందు మనలవధించుటకొఱకు సంచరించుచున్నట్లున్నదనియె. అంతట నాసుగ్రీవునిమంత్రులందఱును ధనుస్సును ధరించినవారలలో శ్రేష్ఠులగు నారామలక్ష్మణులనుజూచి మిగులభయముగలవారై తామువసించిన పర్వతశిఖరమునుండియుత్తమమగు మఱియొకశిఖరముమీఁదికిఁబోయిరి. అవ్విధముగవానరులందఱును భయముచేత నలుదిక్కులకును విచ్చలవిడిగాఁబరుగెత్తికొంతసేపటికి వానరోత్తముఁడగుసుగ్రీవునియొద్దకువచ్చి యతనిచుట్టునునిలిచియుండిరి. ఇవ్విధముగనందఱును మరలనొక్కచోటునకువచ్చినవారై యొకకొండమీఁదనుండి మరియొకకొండమీఁదికిదుముకుచుఁ బర్వతములయొక్క శిఖరములనన్నింటినివణఁకించిరి. అంతటమహాబలవంతులగు నావానరులందఱును గబగబయొకచోటనుండి మఱియొకచోటునకుదుముకుచుఁ గొండలమీఁదనున్నవియును, చక్కగాఁబుష్పించినవియునునగు వృక్షములను విరిచివేసిరి. మఱియువానరులందఱును నాపర్వతమునందంతటను అల్లకల్లోలముగాఁదిరుగుచు నాపర్వతమునందున్నలేళ్ళను, పిల్లులను,పులులను, మఱియునితరములగు క్రూరమృగములనుభయపఱచుచుఁ బరుగెత్తుచుండిరి. అంతటనాసుగ్రీవునియొక్క మంత్రులందఱును నాఋశ్యమూకపర్వతమునందొకచోట గుంపుగూడినవారై యాసుగ్రీవునొద్దకుఁబోయి చేతులనుముకుళించుకొనినిలుచుండిరి. అటుపిమ్మట చక్కగమాటలాడనేర్చిన హనుమంతుఁడు భయముచేత మిగులఁదత్తరపాటును బొందుచున్నవాఁడును, వాలికపటవ్యాపారముచేత నీవీరులనుమననుజంపుటకుబంపెనని సందేహించుచున్నవాఁడును, నగునాసుగ్రీవునితో నిట్లనియె.

ఓవానరరాజోత్తమా! సుగ్రీవా! మీరందఱును వాలివలనఁ గీడుగలుగునని యొడుతలంపుచేతఁ గలిగినయీపెద్దభయమునువిడిచిపెట్టుఁడు. ఇదిమలయపర్వతము. ఇక్కడవాలివలనఁ గొంచెమైనను భయముగలుగదు. వానరోత్తముఁడవైనయోసుగ్రీవా! నీవుఏవాలికిభయఁపడితత్తరపాటుతోఁ గూడినమనస్సుగలవాఁడవై మిగులవేగముగాఁ బరుగిడితివో యట్టిక్రూరకర్ముఁడగువాలియిక్కడ లేదు. మఱియునోవానరరాజా! క్రూరకర్ముఁడును, చూచుటచేతనే భయమునుగలుగఁజేయువాఁడును, నీకన్నయును, నగువాలిచేత నధికముగా భయమునుబొందుచున్నావో యట్టిపాపాత్ముఁడగువాలియిక్కడలేఁడు. ఆవాలియిక్కడఁ గనఁబడలేదు. వానరశ్రేష్ఠుఁడా! సుగ్రీవా! నీకోతితనము చక్కగాఁదెలిసినది. ఆహా యెంత యాశ్చర్యముగనున్నది నీవుమిగులబుద్ధిమంతుఁడవు కాకపోవుటచేత నివ్విధముగామనస్సునునిలుపలేక భయమునుబొందిపరుగెత్తుచున్నావుగాని, మఱియొకటిగాదని నాకుఁదోచుచున్నది. సామాన్యజ్ఞానవిశేషజ్ఞానములతోఁగూడినయోసుగ్రీవుఁడా! మహారాజా! అభిప్రాయమును సూచనచేయునట్టి వ్యాపారములచేత సర్వమును నాచరింపుము. సుగ్రీవుఁడా! "శ్లో॥ నహ్యబుద్ధింగతో రాజాసర్వభూతానిశాస్తిహి,, సామాన్యవిశేషజ్ఞానములను బొందనిరాజుసకలభూతములను శిక్షింపలేఁడుగదా? కావునసామాన్యజ్ఞానవిశేష జ్ఞానములుగలవాఁడవగుమనిచెప్పె. అంతనాసుగ్రీవుఁడు హనుమంతునియొక్కశుభకరములగు మాటలనన్నిటినివిని యాహనుమంతునితోమిగులమంగళకరమగు మాటనుజెప్పఁదలఁచి యిట్లనియె.

వానరోత్తమా! ఆంజనేయా! మిగులఁబొడవులగుభుజములుగలవారును, విశాలములగునేత్రములుగలవారును, ధనుస్సునుబాణములను, ఖడ్గములనుధరించినవారును, దేవతలయొక్క పుత్రులతోసమానులును, నగునీవచ్చుచుండెడుపురుషోత్తములనుజూచినప్పుడు ఎవ్వనికి భయముగలుగదు. మఱియునోయాంజనేయా! ఈపురుషోత్తము లిరువురును వాలిచేతఁబంపఁబడినవారని నేనదలఁచుచున్నాను. హనుమంతుఁడా! రాజులకు స్నేహితులనేకులుందురుగదా? కావున మనమీరాజువిషయమునందు నమ్మకమునుబొంది యూరకుండుటతగదు. శత్రువులు మాయావేషములనుధరించి సంచరింతురని శత్రువులుగలవాఁడు తెలిసికొనవలయును. శత్రువులు తాము నమ్మకములేనివారై తమనునమ్మియున్నవారికిఁ బొరపాటుగలిగినసమయమునందు సంహరించుచున్నారు. మఱియునోయాంజనేయా! వాలి,చేయఁదగినకార్యములయందు మిగులసూక్ష్మబుద్ధిగలవాఁడు. మ

ఱియు శత్రువులసంహరించునట్టి రాజులు బహువిధములగు మాయోపాయములతో సంచరింతురని శత్రువులుగలవారు మారువేషములచేతఁ దెలిసికొనవలయును కావున నో వానరోత్తమా! నీవు మారువేషమును వేసికొని యావచ్చుచున్నపురుషులయొద్దకుఁబోయి వారిచేష్టలయొక్క రీతులచేతను, వారిరూపములచేతను, వారిసంభాషణలచేతను, వారెవ్వరో తెలిసికొనుము మఱియు నోయాంజనేయుఁడా! వారియభిప్రాయమును దెలిసికొనుము. వారు దుర్మార్గబుద్ధిగలవారని తెలిసినయెడల మాటిమాటికిని దగినమాటలచేత వారలకునమ్మకమును బుట్టించుచు నాకెదురుగా నిలిపి యోపురుషోత్తములారా! మీరు ధనుస్సులనుధరించి యీవనమునందుఁ బ్రవేశించుటకుఁ గారణమేమని యడుగుము మఱియు నోవానరశ్రేష్ఠుఁడా! ఆంజనేయా! సంభాషించునప్పుడు వారు మంచిమనస్సుగలవారేయని తెలిసినయెడల సంతటితో నమ్మకమును బొందక మఱియును వారిసంభాషణచేతను, చేష్టలచేతను, వారియందలి మంచిచెడ్డలను జక్కగాఁ దెలిసికొనుమని చెప్పె. ఇవ్విధముగా వానరరాజగు సుగ్రీవుఁడు చెప్పినమాటలనువిని హనుమంతుఁడు రామలక్ష్మణు లెక్కడనున్నారో అక్కడకుఁ బోవుటకొఱకు నిశ్చయింపఁబడినబుద్ధిగలవాఁడయ్యె. అంతట సుగ్రీవునితో మంచిది పోయివచ్చెదనని చెప్పి మహానుభావుఁడును, శత్రువులకు అభేద్యుఁడును నగు నా సుగ్రీవుని మాటలు చక్కగానున్నవని కొనియాడి మహానుభావుఁడగు నా హనుమంతుఁడు మహాబలముగల యా రామలక్ష్మణులెక్కడనున్నారో యక్కడకు బయలుదేఱిపోయె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి రెండవసర్గము ముగిసెను.

రామలక్ష్మణులయొద్దకు హనుమంతుఁడు పోయి సంభాషించుట.

మహాత్ముఁడగు సుగ్రీవుఁడు చెప్పినమాటను దెలిసికొని యాహనుమంతుఁడు ఋశ్యమూకపర్వతమునుండి రామలక్ష్మణులున్నచోటున [illegible] దుమికె. అట్లు దుమికి వాయుపుత్రుఁడగు నాహనుమంతుఁడు వానరరూపమును వదలి వంచనచేయవలయునని యెడు బుద్ధితో భిక్షుకునియొక్క యాకారమును ధరించె. అట్లు భిక్షుకరూపమును ధరించినపిమ్మట నాహనుమంతుఁడు మిగుల వినయముతోఁ గూడినవాఁడై యా రామలక్ష్మణులయొద్దకుఁ బోయి వారలకు నమస్కరించి మిగుల మృదువైనదియును, మనోజ్ఞమైనదియును, నగుమాటలచేత వీరులగు నా రామలక్ష్మణులను బహువిధములఁ బ్రశంసించె. అట్లు ప్రశంసించిన పిమ్మట వీరుఁడును, వాయుపుత్రుఁడును, నగుహనుమంతుఁడు శాస్త్రప్రకారముగఁ బూజించి సుగ్రీవుఁడు చెప్పినవిషయమును వదలి తనయిచ్ఛవచ్చినట్లు మాటాడఁదలఁచి మృదువచనములతో నిట్లనియె.

ఓపురుషోత్తములారా! సత్యమైనపరాక్రమముగలవారును, రాజర్షులతోడను, దేవతలతోడను, సమానులును, తపోవంతులును, వ్రతమునవలంబించినవారును, మిగులమనోహరమగు నాకారముగలవారును, మృగములసముదాయమును, మఱియు నితరములైనవియును, వనమునందు సంచరించుచున్నవియును, నగుక్రూరమృగములను, భయపరచుచున్నవారును, సర్వస్థలములయందును బంపానదీతీరమునందు మొలిచినవృక్షములను బాచుచున్నవారలును, నగుమీరీవనమునందు ఏమినిమిత్తముగఁ బ్రవేశించితిరి. మఱియు నోపురుషోత్తములారా! మంగళకరమైన యుదకముగలదియగు నీనదిని బ్రకాశింపఁ జేయుచున్నవారును, తపోవంతులును, ధైర్యముగలవారును, బంగారముయొక్క కాంతివంటి కాంతిగలవారును, నారచీరలను గట్టుకొనినవారును, నిట్టూర్పులను విడుచుచున్నవారును, శ్రేష్ఠములగుభుజములుగలవారును, ఇక్కడనున్నపక్షులను, మృగములను, భయపరచుచున్నవారలును, సింహములయొక్క చూపులవంటి చూపులుగలవారును, పరాక్రమవంతులును, సింహపరాక్రమమువంటి పరాక్రమముగలవారు, ఇంద్రధనుస్సుతో సమానమైనధనుస్సులను ధరించినవారును, శత్రువులనువధించుటయందు మిగులసామర్థ్యముగలవారును, శ్రీమంతులును, మిగులమనోహరమగురూపసంపాదనగలవారును, ఆబోతెద్దులయొక్క నడకకు సమానమైననడకగలవారును, ఏనుఁగుతొండములతో సమానములగుభుజములుగలవారును, మిగులఁ గాంతిగలవారును, మానవోత్తములును, నగుమీరలెవ్వరు? ఓపురుషోత్తములారా! మీయొక్క దేహకాంతిచేత నీపర్వతము మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నది మఱియు నోపురుషశ్రేష్ఠులారా! రాజ్యమును జేయుటకుఁ దగినవారును, దేవతలవలె మిగులఁ బ్రసిద్ధులును, తామరరేకులవంటి నేత్రములుగలవారును, జటామండలమును, ధరించినవారును, ఒకరికొకరు తగ్గనిసమానములగు రూపలావణ్యాదులుగలవారును, దేవలోకమునుండివచ్చినవారివలెనున్నవారును, స్వేచ్ఛగా భూలోకమునకువచ్చిన చంద్రసూర్యులవలెనున్నవారును, మిగులవిశాలములగు ఱొమ్ములుగలవారును, మానవాకారముగలదేవతలవలెనున్నవారును, సింహము



హనుమంతుడు మారువేషమున రామలక్ష్మణులను దర్శించుట

లయొక్క యూపురములవంటి భుజశిరస్సులుగలవారును, మిక్కిలి ఉత్సాహముగలవారును, మిగుల మదముగల యాబోతులవలెనున్నవారును, నరులమీరు ఏమినిమిత్తముగ నీయరణ్యమునకు వచ్చితిరి. మఱియు నో పురుషోత్తములారా! మిగుల నిడుపుగలవియును, సర్పములయొక్క పడగలవలె నున్నవియును, గుండ్రముగానున్నవియును, అర్గళలను బోలియున్నవియును, సకలభూషణములచేతను నలంకరించుటకుఁ దగినవియును, నగు మీబాహువులెందుకు నలంకరింపఁబడలేదు. మఱియు నో పురుషోత్తములారా! మీరిద్దఱును సముద్రములతోడను, వనములతోడను గూడుకొనినదియును, వింధ్యపర్వతముచేతను, మేరుపర్వతముచేతను, నలంకరింపఁబడినదియును, నగు నీభూమినిసర్వమును బరిపాలించుటకుఁ దగినవారని నామనస్సునందుఁ దోచుచున్నది. ఇట్టిమహానుభావత్వముగలమీర లెవ్వరు? ఏమినిమిత్తముగ నిక్కడకు వచ్చితిరి.

మఱియు నో పురుషోత్తములారా! మీరు ధరించిన యీధనుస్సులు మిగులఁజిత్రములును, మృదువులైనవియును, మిగుల నాశ్చర్యమును గలుగఁజేయునట్టి మైపూఁతగలవియును, బంగారముచేత నలంకరింపఁబడినవియును నై యింద్రునియొక్క వజ్రాయుధములవలెఁ బ్రకాశించుచు మిగుల నాశ్చర్యమును గలుగఁజేయుచున్నవి. మఱియు నో పురుషోత్తములారా! మిగుల దీక్ష్ణములగు బాణములచేత, ప్రాణాంతమును జేయునట్టివియును, భయంకరములైనవియును, నిప్పులను విడుచుచున్నవియును, నగు సర్పములచేతవలె నిండినవై యీయంబులపొదులు మిగుల మనోహరములుగానున్నవి. మఱియు నో పురుషోత్తములారా! అధికమైన ప్రమాణముగలవియును, మిగుల వెడల్పుగలవియును, పుటము వేయఁబడిన బంగారముచేత నలంకరింపఁబడినవియును, మీచేత ధరింపఁబడినవియును నగు నీఖడ్గములు "కుబుసమును వదలిన పాములవలె,, ప్రకాశించుచున్నవి. ఓ పురుషోత్తములారా! ఇవ్విధముగా మిగుల వినయముతో మాటలాడుచున్న నాతో మీ రేల మాటలాడరు? ఓ పురుషోత్తములారా! ధర్మాత్ముఁడును, వానరులకధిపతియును, నగు సుగ్రీవుఁడనియెడు వానరోత్తముఁడొకఁడు గలఁడు. అతఁడు తనయన్నయగు వాలిచేతఁ దఱుమఁబడినవాఁడై భూమియందంతటను మిగుల దుఃఖముతోఁ దిరుగుచున్నాఁడు. మహానుభావుఁడును, వానరులకందఱకును, ప్రభువును, నగు సుగ్రీవునిచేత హనుమంతుఁడనియెడు పేరుగల నేను ప్రేరణ చేయఁబడి యిక్కడకువచ్చితిని. ఓ పురుషోత్తములారా! ధర్మాత్ముఁడగు సుగ్రీవుఁడు మీతో స్నేహమును జేయవలయునని కోరుచున్నాఁడు. నేను సుగ్రీవునకు మంత్రిననియును, వాయుదేవునకుఁ బుత్రుఁడననియును దెలిసికొనుఁడు ఓ పురుషోత్తములారా! నేను సుగ్రీవునకుఁ బ్రియమును జేయవలయునని యెడు సంకల్పముతో భిక్షుకరూపము నుధరించి ఋశ్యమూకపర్వతమునుండి యిక్కడకువచ్చితిని. మఱియు నేను కామరూపముగలవాఁడను. ఇంతియగాక యిచ్ఛానుసారముగ సంచరించుటకుఁ దగినసామర్థ్యముగలవాఁడనని హనుమంతుఁడు వీరులగు నా రామలక్ష్మణులతోఁ జెప్పి యంతటవాక్యములయొక్క యర్థమును జక్కఁగాఁ దెలిసిన యా రామలక్ష్మణులమాటలను వినవలయునని యెడుతలంపుతో నేమియును జెప్పక యూరకుండెను. ఇవ్విధముగా హనుమంతుఁడు చెప్పినమాటలను విని శ్రీమంతుఁడగు రాముఁడు మిగుల సంతోషమును బొందినవాఁడై తనప్రక్క నున్న లక్ష్మణునిఁ జూచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! మహానుభావుఁడును, వానరులకు అధిపతియును, తనకు మేలును గోరుచున్నవాఁడును, నగు సుగ్రీవునకు ఇతఁడు మంత్రియగుటచేత నతనికిఁబనింగా నిక్కడకు వచ్చెను. కావున, శత్రువుల నింపఁజేయుటకుఁ దగిన సామర్థ్యముగల యో లక్ష్మణా! సుగ్రీవునకు మంత్రియును, వానరోత్తముఁడును, చక్కఁగా మాటలాడనేర్చినవాఁడును, స్నేహముగలవాఁడును, నగు నీతనితో మిగుల మనోహరములగు మాటల నుచ్చరించుచు సంభాషింపుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఋగ్వేదమును జదువనివాఁడును, యజుర్వేదము నధ్యయనము జేయనివాఁడును, సామవేదమును నెఱుఁగనివాఁడును, నీవిధముగా మాటలాడలేఁడు. మఱియు నో తమ్ముఁడా! లక్ష్మణా! ఈవానరుఁడు వ్యాకరణశాస్త్రమును సర్వమును సంపూర్ణముగాఁ జదివెను. అట్లు చదువని యెడల నింతసేపు మాట్లాడుచుండఁగా నొక్కయపశబ్దమైనను గలుగదా? ఒక్కటియైనను అపశబ్దము గాకుండు నట్లు మాట్లాడుటచేత నితఁడు వ్యాకరణశాస్త్రము సంపూర్ణముగాఁ జదివినాఁడని తోఁచుచున్నది. మఱియు నో తమ్ముఁడా! లక్ష్మణా! ఇతఁడు మాట్లాడునపుడు ముఖమునందును, నేత్రములయందును, లలాటమునందును, కనుబొమలయందును, మఱియు నితరములగు నవయవములయందును గొంచెమైన దోషము గనఁబడలేదు. కావున నితఁడు సకలశాస్త్రములయందును సంపూర్ణమైన ప్రజ్ఞగలవాఁడని తోఁచుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! ఈతనిమాటలు విశేషపదములుగలవి గావు. మఱియు సందేహముగలవి గావు. శీఘ్రముగ నర్థమును బోధించుచున్నవి. పరులను వంచనజేయుటను బోధింపటలేదు. మఱియు నీతనివచనములయందుఁ

గానుస్వరములు మొదలగునవి యేవియును లేవు. మఱియు నోతమ్ముఁడా! లక్ష్మణా! ఈహనుమంతుఁడు శబ్దశుద్ధిగలదియును, కాకుస్వరము మొదలుగాఁగల దుష్టస్వరములు లేనిదియును, శీఘ్రముగనర్థజ్ఞానమును గలిగించునదియును మంగళకరమైనదియును, మనోహరమైనదియును నగువాక్యమును జెప్పుచున్నాఁడు. తమ్ముఁడా! లక్ష్మణా! ఉదాత్తానుదాత్తస్వరితములతోఁ గూడుకొనియున్నదియును, మిగులవిచిత్రములైన పదములుగలదియునునగు నీతని మాటలచేత ఖండింపవలయునని ఖడ్గమునెత్తిన శత్రువునియొక్క మనస్సుగూడ శాంతినిబొందును. పాపరహితుఁడవైన యోతమ్ముఁడా! లక్ష్మణా! ఏరాజునకు నిటువంటిదూత యుండఁడో అటువంటిరాజుయొక్క కార్యములెట్లు నెరవేరును? ఇటువంటిసద్గుణములుగలవారు కార్యములను నెరవేర్చువారైయుండిరేని యజమానుఁడగు రాజుయొక్క కార్యములన్నియును నవశ్యముగా నెరవేరఁగలవు మఱియు నురాజులపనులన్నియును, దూతలమాటలవలననే గదా తెలియఁబడునని చెప్పె. ఇవ్విధముగా రాముఁడు చెప్పినమాటలనువిని మాటలయొక్కయర్థమును దెలిసినవాఁడును, చక్కగా మాటలాడనేర్చినవాఁడును, నగులక్ష్మణుఁడు సుగ్రీవునకుమంత్రియును, చక్కగామాటలాడనేర్చినవాఁడును, చక్కగా మాటలయొక్క యర్థమును దెలియఁదగినవాఁడును, నగుహనుమంతునితో నిట్లనియె.

విద్వాంసుఁడవైన యోహనుమంతుఁడా! మహానుభావుఁడగు సుగ్రీవునియొక్క గుణములు సుప్రసిద్ధములైనవని కబంధునివలన నిదివఱకే మేమువినియున్నాము. కావున వానరాధిపతి యగుసుగ్రీవుని మేముచూడవలయునని వెదకుచున్నాము. ఆంజనేయా! నీవుసుగ్రీవునిమాటలననుసరించి నీవేవిధముగా జెప్పితివో మేముగూడనదేప్రకారముగఁ జేయుటకు సిద్ధముగనున్నాము మఱియును నీవుచెప్పినచొప్పున సంచరించుటకు నాకేమియును సందేహములేదని చెప్పె ఇవ్విధముగా లక్ష్మణుఁడుచెప్పినమాటలనువిని వాయుదేవునకుఁబుత్రుఁడగు హనుమంతుఁడు పరమసంతోషమునుబొందినవాఁడై యికనుజయముగలుగునని మనస్సునందునిశ్చయమును జేసికొని యీరామలక్ష్మణులతోఁ గూడఁ స్నేహమును జేయవలయునని తలఁచె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి మూఁడవసర్గముగిసెను

హనుమంతుఁడు రామలక్ష్మణులనుసుగ్రీవునియొద్దకుబిలుచుకొనివచ్చుట.

అటుపిమ్మట రామునకుఁగూడ సుగ్రీవునితోఁ బనియున్నదని తెలిసికొనినవాఁడగుటచేత హనుమంతుఁడు పరమసంతోషమును బొందినవాఁడగుచు లక్ష్మణుఁడుచెప్పిన తియ్యనిమాటలనువిని యికను సుగ్రీవుని కార్యములన్నియును నెరవేరునని మనస్సునందుఁ దలఁచెను. మఱియు నీరాముఁడు పనిగలవాఁడైవచ్చుటచేతను, ఈతనికార్యము మిగులఁద్వరగాఁ జేయఁదగినదగుటచేతను, మహానుభావుఁడగు సుగ్రీవునకు రాజ్యముశీఘ్రముగా వచ్చునని యెన్నఁదగియున్నదనితలఁచె. అట్లుతలఁచినపిమ్మటఁ జక్కగామాటలాడుటయందు మిగులనేర్పరియును, వానరోత్తముఁడును, నగు హనుమంతుఁడు పరమసంతోషమునుబొందినవాఁడై మరలనారామునితో నిట్లనియె.

పురుషోత్తమా! నీవునీతమ్మునితోఁ గూడుకొనినవాఁడవై యనేకములగు క్రూరమృగములతోఁ గూడుకొనినదియును, మిగుల భయంకరమైనదియును, పంపాసరోవరతీరమునందలి వనముచేత నలంకరింపఁబడినదియును, నగు నీవనమునకు ఏమినిమిత్తముగవచ్చితివనియె అట్లుఆంజనేయుఁడు చెప్పినమాటనువిని రామునియనుమతమునుబొంది లక్ష్మణుఁడు తనయన్నయగు రాముఁడు దశరథమహారాజునకుఁ బుత్రుఁడనియును, మహానుభావుఁడనియును జెప్పె. మఱియును విశేషముగాఁ జెప్పఁదలఁచి యిట్లనియె.

వానరశ్రేష్ఠుఁడా! ఆంజనేయా! కాంతిమంతుఁడును, ధర్మమునందు మిగులప్రేమనుగలవాఁడును, నగుదశరథుఁడనుమహారాజుగలఁడు. ఆదశరథమహారాజు ధర్మమునుదప్పక నాలుగువర్ణములవారిని సర్వకాలములయందును జక్కఁగఁబాలించుచుండె ఆదశరథమహారాజున కొక్కఁడును శత్రువుఁడగువాఁడు లేఁడు ఆదశరథమహారాజునకొకనిమీదనైన శత్రుత్వములేదు. ఆదశరథమహారాజు, సకలభూతములయందును బ్రహ్మదేవుఁడెవ్విధముగ దయగలవాఁడైసంచరించునో యావిధముగా సంచరించును. మఱియు నాదశరథమహారాజు భూరిదక్షిణలుగలవియును, అగ్నిష్టోమములనియెడు నామధేయములుగలవియును, నగు యజ్ఞములను జేసె ఆదశరథమహారాజునకుఁ బెద్దకుమారుఁడును, రాముఁడను నామధేయముగలవాఁడును, సర్వభూతములకును రక్షకుఁడును, తండ్రియొక్కయాజ్ఞను సంపూర్ణముగ నెరవేర్చినవాఁడును, నగునీపురుషోత్తముఁడు మిగులఁబ్రసిద్ధినిబొందె ఇంతియగాక యీరాముఁడు దశరథ మహారాజుయొక్క పుత్రులలోఁ బెద్దవాఁడు. మఱియు గుణములయందుగూడ నుత్తముఁడు. మఱియు ననేకములగు రాజలక్షణములతోఁ గూడుకొనినవాఁడు రాజసంపదగలవాఁడు. జితేంద్రియుఁడును, మహానుభావు

తును మిగులఁ దేజస్సుగలవాఁడును, నగునీరాముఁడు రాజ్యపదభ్రష్టుఁడై నన్ను వెంటఁబెట్టుకొని భార్యయగుసీతతోఁగూడ "గొప్పదగు తేజస్సుగలసూర్యుఁడు, సాయంకాలమునందు, తనకాంతితోఁగూడబోవువిధముగ,, బయలువెడలి యీయరణ్యమునకువచ్చె, వానరోత్తమా! ఆంజనేయా! చేసినమేలునుమరవనివాఁడును, అనేకసంగతులను దెలిసినవాఁడును, నగునీరామునకు నేనుదమ్ముఁడను. గుణములచేతఁగూడనీతనికంటె జిన్నవాఁడను. కావుననితని కింకరిచారకుఁడనై యున్నవాఁడను. లక్ష్మణుఁడనునామధేయముగలవాఁడను. మఱియు సుఖమునుబొందుటకుఁదగినవాఁడును, మిగులఁబూజ్యుఁడును, సర్వభూతములకును హితమైనవాఁడును, ఐశ్వర్యములేనివాఁడును, వనవాసమునకువచ్చినవాఁడును, నగునీరామునకు నేనుదాస్యమును జేయుచున్నాను. మఱియునోవానరోత్తమా! ఆంజనేయా! మేమిరువురమునుసమీపమునందు లేనపుడు కామరూపియగు రాక్షసునిచేత నీతనిభార్య యపహరింపఁబడినది. ఈరామునిభార్య ఏరాక్షసునిచేత నపహరింపఁబడినదియు ను దెలియలేదు. శ్రీదేవికిఁబుత్రుఁడగు దనుఁడనువాఁడుశాపముచేత రాక్షసత్వమునుబొందె ఆరాక్షసుఁడువానరాధిపతియగుసుగ్రీవుఁడుమిగులసమర్థుఁడనిచెప్పి రామునిజూచియిట్లనియె.

ఓపురుషోత్తముఁడా! నీభార్యనపహరించిన వానిజాడనుగొప్పదగుపరాక్రమముగల సుగ్రీవుఁడు తెలిసికొనఁగలఁడనిచెప్పి యాదనువనువాఁడు మిగులసుఖకరమగు స్వర్గలోకమునకుఁబోయె. వానరోత్తమా! ఆంజనేయా! నీవడుగుటచేత జరిగినవృత్తాంతమును సర్వమును సంపూర్ణముగఁజెప్పితిని. నేనును, నీరాముఁడును, సుగ్రీవునిశరణుఁ జొచ్చితిమి. మఱియునోహనుమంతుఁడా! సకలలోకనాథుఁడగు నీరాముఁడు తానువ్యాయముగఁ బొందఁదగినధనమునుసర్వమునునిచ్చి యధికమగు కీర్తినిసంపాదించె మఱియునీతఁడుసకలలోకనాథుఁడయ్యును దిక్కులేనివాఁడై సుగ్రీవునిరక్షకునిగాఁ గోరుచున్నాఁడు. పూర్వమే, ధర్మవత్సలుఁడగుపితంఁడ్రి యితనికి రక్షకుఁడయ్యెనో యట్టితండ్రికిత దురక్షకుఁడయ్యె అట్టిమహానుభావుఁడు నేటికిసుగ్రీవుని శరణుఁజొచ్చె పూర్వమునందు సకలలోకములవారికినిరక్షకుఁడును, సకలధర్మములను దెలిసినవాఁడును, నాకుగురుఁడునునగు నీరాముఁడుసుగ్రీవుని శరణుఁ జొచ్చె. ఇదివఱకు, ఏరామునియొక్కయనుగ్రహమును సకలజనులును సర్వకాలములయందునుగోరుచుండిరో యట్టిరాముఁడిప్పుడుసుగ్రీవునియొక్క యనుగ్రహమునుగావలయుననికోరుచున్నాఁడు. ఓవానరోత్తమా! సకలగుణసంపన్నుఁడగు లోకములోని రాజులందఱును, ఏదశరథమహారాజుచేత సర్వకాలములయందును గౌరవింపఁబడుచుండిరో యట్టివంటిదశరథమహారాజునకు, మూఁడులోకములయందును బ్రసిద్ధుఁడగు నీరాముఁడు పెద్దకుమారుఁడు అట్టిమహానుభావుఁడగు రాముఁడిప్పుడు వానరాధిపతియగు సుగ్రీవునిశరణుఁజొచ్చె దుఃఖముతోఁగూడియున్న యీరాముఁడు దుఃఖముచేతఁ బీడింపఁబడినవాఁడై శరణునుబొందుచుండఁగావానరాధిపతియగుసుగ్రీవుఁడ నుగ్రహించుటకుఁదగినవాఁడని నాకుఁదోఁచుచున్నది. ఇవ్విధముగా కన్నీళ్ళను బెట్టుకొనిమిగులదీనుఁడై మాటలాడుచున్న లక్ష్మణునితో మిగులమనోహరముగా మాటలాడ నేర్చిన హనుమంతుఁడుమధురములగుమాటలను జెప్పఁదలఁచియిట్లనియె.

రఘుకులోత్తమా! లక్ష్మణా! ఇట్టిమహానుభావులను, మిగులనిపుణమగు బుద్ధితోఁగూడుకొనినవారును, కోపములేనివారును, ఇంద్రియములనుజయించినవారును, నగుమీరు దైవయోగముచేత సుగ్రీవునకుదర్శనమిచ్చితిరి. ఆసుగ్రీవుఁడువాలితో వైరమును బెట్టుకొనిరాజ్యభ్రష్టుఁడయ్యె మఱియు నీతనిభార్యనువాలియపహరించె. అన్నయగువాలిచేతఁదరుమఁబడి యరణ్యమునందు నివసించుచున్నాఁడు. కావునసూర్యదేవునకుఁ బుత్రుఁడగు సుగ్రీవుఁడు మిగులఁగష్టముల ననుభవించుచుండుటచేత మీకుసహాయముగనుండఁగలఁడు మఱియునాసుగ్రీవుఁడుమాతోఁగూడ సీతను వెదకుటయందుఁ దగినప్రయత్నమును జేయఁగలఁడని చెప్పి ఇవ్విధముగానాహనుమంతుఁడు మిగులమనోహరములగు మాటలనుజెప్పి సుగ్రీవునియొద్దకుఁ బోదమని యాలక్ష్మణునితోఁజెప్పె. ఇవ్విధముగామాటలాడుచున్న హనుమంతునిధర్మాత్ముఁడగు లక్ష్మణుఁడుశాస్త్రోక్తప్రకారముగఁ బూజించియాసంగతిని రామునితోఁజెప్పఁదలఁచి యిట్లనియె

అన్నా! రామా! వాయుదేవునకుఁబుత్రుఁడగు నీహనుమంతుఁడు మిగులసంతోషముగలవాఁడై చెప్పుచున్నాఁడు. మనము స్నేహమును జేయఁదలఁచిన సుగ్రీవునకుఁగూడమనతోఁబని యున్నది. కావుననోఅన్నా! రామా! నీకార్యము నెరవేరినదనితలఁచుచున్నాను మఱియునోరామచంద్రా! ఈహనుమంతుఁడు మిగులఁబ్రసన్నమైనముఖవర్ణముగలవాఁడును, సంతోషముగలవాఁడునునై సంభాషించుచున్నాఁడు. ఇదియంతయును యోచించిచూడఁగా వాయుదేవునకుఁబుత్రుఁడగు నీహనుమంతుఁ డబద్ధమును జెప్పువాఁడుగాదనియె. అంతటవాయుదేవునకుఁ బుత్రుఁడు

ను, మిగులబుద్ధిమంతుఁడునునగు నాహనుమంతుఁడు, వీరులగు నారామలక్ష్మణులను వెంటఁబెట్టుకొని సుగ్రీవుని యొద్దకుఁబోయె అట్లుపోవునపుడు ఆహనుమంతుఁడు భిక్షుకునిరూపమునువదలి వానరరూపమునుధరించి వీరులగు నారామలక్ష్మణులను వీపుమీఁద నెక్కించుకొని సుగ్రీవునొద్దకుఁబోయెను. మఱియునుమిగులవిశాలమగు కీర్తిగలవాఁడును, వానరులలోపల మిగులఁబ్రసిద్ధుఁడును, "కార్యమును నెరవేర్చుకొనినవాఁడు సంతోషమును బొందువిధముగా,, సంతోషమునుబొందుచున్నవాఁడును, మిగుల గొప్పదగుపరాక్రమముగలవాఁడును, మిగులమంగళకరమగుబుద్ధిగలవాఁడును, నగునాహనుమంతుఁడు రామలక్ష్మణులతోఁగూడ సుగ్రీవునియొద్దకుఁబోయెను.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నాల్గవసర్గ ముగిసెను.

శ్రీరాముఁడునుసుగ్రీవుఁడును అగ్నిసాక్షిగస్నేహమును జేయుట.

అవ్విధముగ నాహనుమంతుఁడు ఋశ్యమూకపర్వతమునుండిమలయపర్వతముయొద్దకుఁబోయెను. పోయినపిమ్మట సుగ్రీవునితో వీరిరువురును రఘుకులమునందుఁ బుట్టినవారనిచెప్పె. అట్లుచెప్పి మఱియు నాహనుమంతుఁ డిట్లనియె.

వానరరాజా! సుగ్రీవుఁడా! సత్యమైన పరాక్రమముగలవాఁడును, గొప్పదగుప్రజ్ఞగలవాఁడును, దృఢమైనపరాక్రమముగలవాఁడును, నగునిరాముఁడుతమ్ముఁడగు లక్ష్మణునితోఁగూడ నిక్కడకువచ్చెను. మఱియునోసుగ్రీవుఁడా! ఈరాముఁడిక్ష్వాకుయొక్కకులమునందుఁ బుట్టినవాఁడు. దశరథమహారాజునకుఁబుత్రుఁడు ధర్మముగసంచరించుటయందు మిగులఁబ్రసిద్ధుఁడు. తండ్రియొక్కయాజ్ఞను సంపూర్ణముగ నెరవేర్చుచున్నవాఁడు. ఇట్టినియమములుగలవాఁడును, మహానుభావుఁడును, అరణ్యమునందునివసించుచున్నవాఁడును, నగునీరామునియొక్కభార్య రావణాసురునిచేత నపహరింపఁబడెను. కావునరాముఁడునిన్నుశరణుఁబొందె మఱియునోవానరాధిపతీ! సుగ్రీవమహారాజా! ఏదశరథమహారాజునానావిధములైన యశ్వమేధయాగములచేత నగ్నిదేవునిదృప్తినొందించెనో, అటులనేయజ్ఞములయందు భూరిదక్షిణలనిచ్చెనో, అనేకవేలగోవులనుగూడవదలెనో, సత్యవాక్యముచేత భూమండలమును సర్వమునుబాలించెనో, యట్టిదశరథమహారాజునకుఁబుత్రుఁడగురాముఁడు భార్యకొఱకుఁ గానిన్నుశరణుఁజొచ్చె. మఱియునోసుగ్రీవుఁడా! అన్నదమ్ములగురామలక్ష్మణులిరువురును, నితోస్నేహమును జేయవలయునని కోరికగలవారైయున్నారు. కావుననోసుగ్రీవా! ఈరామలక్ష్మణులననుగ్రహించి యీయిద్దఱకును బూజనుజేయుమనియె. ఇవ్విధముగాహనుమంతుఁడు చెప్పినమాటనుసుగ్రీవుఁడువిని మిగులసంతోషమునుబొందినమనస్సుగలవాఁడును, అడివఱకు గలిగియున్న పరితాపమునువదలినవాఁడునునై యారామునివలనతనకుకీడుగలుగునను భయమునువదలె. అంతటవానరాధిపతియగు సుగ్రీవుఁడు, మానుషరూపమునుధరించి చూచుటకుమిగులమనోహరమగు రూపముగలవాఁడై, పరమప్రేమతో రఘుకులమునందుఁ బుట్టినరామునిజూచి యిట్లనియె.

రఘుకులోత్తముఁడా! రామా! నీవుధర్మమునందాశగలవాఁడవనియును, మిగులఁ బరాక్రమముగలవాఁడవనియును, సకలభూతములయందును బ్రియముగలవాఁడవనియును, నీగుణములన్నియునాకువాయుపుత్రుఁడగు హనుమంతునిచేతఁజెప్పఁబడియె. కావునఁబ్రభుఁడవైన యోరామా! మహానుభావుఁడవగునీవువానరుఁడనైన నాతోఁగూడస్నేహమును జేయవలయుననితలఁచుటయే నాకుగొప్పసన్మానమును, లాభమునునైయున్నది. ఇంతకంటెనధికమగులాభమునాకు మరియొకటియేదియునులేదు. ఓరామా! నీకునాతోసహవాసమును జేయుటయందిష్టము గలిగియున్నయెడలనిదిగో నాచేయిచాచఁబడినది. ఈనాచేతిని నీచేతితోఁబట్టుకొనుము. పట్టుకొనిస్నేహితులమర్యాదనుధ్రువపఱుపుమనియె. (అనఁగా నాచేతిలోఁజేయివేసినిశ్చయముగాస్నేహమునుజేసెదననిచెప్పుము) ఈప్రకారము సుగ్రీవునిచేతఁ జెప్పఁబడినమాటనువిని రాముఁడుమిగులసంతోషించినమనస్సుగలవాఁడై తనచేతసుగ్రీవునిచేతినిబట్టుకొని స్నేహితులమర్యాదనుసలిపె. అట్లుమనోహరమగుస్నేహితులమర్యాదజరిగినపిమ్మట నారామసుగ్రీవులిరువురును గట్టిగాఁ గౌగలించుకొనిరి. అటుపిమ్మట శత్రువులను నశింపఁజేయునట్టిహనుమంతుఁడుగూడభిక్షురూపమునువదలి వానరరూపమునుధరించి యరణులకుఁదగినజమ్మికట్టెలయందుఅగ్నినిబెట్టిరగులఁబెట్టె. అట్లురగులఁబెట్టి యాయగ్నిచక్కగామండినపిమ్మటఁ బుష్పములచేత నాయగ్నిహోత్రమునుబూజించె. అట్లుపూజించినపిమ్మటనేకాగ్రచిత్తుఁడును, మిగులసంతోషించినవాఁడునునై యాయగ్నిహోత్రమును నారామసుగ్రీవులమధ్యయందుఁబెట్టె. అంతటఁబ్రజ్వలించుచున్న యాయగ్నిహోత్రమునకుఁజుట్టును, నారామసుగ్రీవులిరువురును

స్నేహము నవలంబించినవారై ప్రదక్షిణమును జేసిరి అంతట నారామసుగ్రీవులిద్దఱును మిగులసంతోషించిన మనస్సులుగలవారై యొకరినొకరధికప్రియముతోఁ జూచికొనియును దృప్తినిజెందరైరి. అంతటసుగ్రీవుఁడు మిగుల సంతోషముగలవాఁడై యారామునితో నిట్లనియె.

పూజ్యుఁడవగునో రామా! నీవు నాకుమనోహరమైన స్నేహితుఁడవైతివి. కావుననిఁక మనకిరువురకునుసుఖదుఃఖము లొక్కటిగా నుండవలయుననియె సుగ్రీవుఁడివ్విధముగాఁ జెప్పినపిమ్మటపిపిచెట్టుయొక్క విశేషముగాఁబుష్పించియున్న యొకకొమ్మను విరిచితీసుకొనివచ్చి యచ్చటఁబరచి రామునితోఁగూడ దానియందుఁగూర్చుండె. అంతటవానరోత్తముఁడగు హనుమంతుఁడును అధికముగాఁ బుష్పించియున్న చందనవృక్షముయొక్క కొమ్మ నొకదానిని విరిచితెచ్చి లక్ష్మణునిదానిమీఁదఁగూర్చుండఁబెట్టె. అట్లుసేసితనపనియంతయును నెరవేరినందుకుఁ బరమానందమునుబొందె

అంతటసుగ్రీవుఁడు పరమసంతోషముగలవాఁడును, సంతోషముచేత వికసించిననేత్రములుగలవాఁడునునై మృదుమధురవచనములచేత నారామునకిట్లనియె

రఘునందనా! రామా! నేనువాలిచేత నపకారమును బొందఁబడినవాఁడను, మిగులనధికమగు భయముచేతఁ బీడింపఁబడినవాఁడను, అపహరింపఁబడిన భార్యగలవాఁడను, పరులచేతఁ బ్రవేశింపనలవిగాని యీదుర్గము నాశ్రయించినవాఁడను, మిగులభయముగలవాఁడనునైవచ్చి యీవనమునందు భయము లేనివాఁడనై సంచరించుచున్నాను. మఱియునో రామా! నేనుమిగులభయముగలవాఁడనై యీవనమునందు మిగులభ్రాంతిని బొందుచున్నమనస్సుగలవాఁడనై సంచరించుచున్నాను రఘుకులోద్భవుఁడవైన యో రామా! నేనుఅన్నయగువాలిచేత నపకారముచేయఁబడినవాఁడను, వాలితోవైరమును బెట్టుకొనినవాఁడను, నై యీయరణ్యమునందుఁ దిరుగుచున్నాను. వాలివలనిభయముచేత నధికముగా దుఃఖమునుబొందుచున్న నాకుఅభయమునివ్వుము. నాకుభయములేకుండునట్లు సేయుటకుఁ గకుత్థ్సవంశమునందుఁ బుట్టినయోరామచంద్రా! నీవుతగుదువు కావుననిన్నుఁ బ్రార్థించుచున్నాననియె. ఇవ్విధముగా సుగ్రీవుఁడుచెప్పినపిమ్మట మిగులఁదేజోవంతుఁడును, సకలధర్మములను దెలిసినవాఁడును, ధర్మమునందు మిగుల ప్రేమగలవాఁడును, కకుత్థ్సవంశమునందుఁ బుట్టినవాఁడును, నగు రాముఁడు పరిహాసమును జేయుచున్నవానివలెనవ్వుచు సుగ్రీవునితో నిట్లనియె

వానరులలో నుత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! స్నేహితుఁడు ఉపకారమే ఫలముగాఁగలవాఁడని నేనెఱుఁగుదును. కావుననోసుగ్రీవుఁడా! నీభార్యనపహరించినవాలిని నేను వధింపఁగలను. ఓసుగ్రీవుఁడా! నాయొక్క యీబాణములు మిగులఁదీక్ష్ణములును, సూర్యునితో సమానములును, వ్యర్థములు గానివియును, నైయున్నవి. కావుననీబాణములు దుర్మార్గుఁడగు నావాలినిజంపుటయందు మిగులవేగిరపాటుగలవైయున్నవి. మఱియునోసుగ్రీవుఁడా! నాబాణములు, కంకపత్రములచేతఁ గప్పఁబడినవియును, దేవేంద్రునియొక్క వజ్రాయుధముతో సమానమైనవియును, మిగులఁదీక్ష్ణములైన కొనలుగలవియును, సరళములైన రెక్కలుగలవియును, నైమిగులఁగోపముగల పాములవలెభయంకరములైయున్నవి. ఇట్లుక్రూరములగు సర్పములతోసమానములైన నాబాణముచేతఁజచ్చి వాలి ''పర్వతమువలెఁ,, గ్రిందఁ బడియుండఁగలఁడు. చూడుము. నీవుభయమును బొందకుమనియె. ఇట్లుతనకుహితముగాఁ జెప్పుచున్నరామునిమాటలనువిని సుగ్రీవుఁడు పరమానందమును బొందినవాఁడైమిగులనధికమగు మాటనుజెప్పఁదలఁచియిట్లనియె.

రఘుకులోద్భవుఁడవును, పురుషోత్తముఁడవును నైన యోరామా! నీయనుగ్రహముచేత నేనుభార్యను, రాజ్యమునుగూడఁ బొందఁగలను. నాకుఁబరమశత్రువుఁడగు వాలియేవిధముచేతఁ బ్రయత్నించినయెడలఁజచ్చునో యావిధముగాఁ బ్రయత్నమును జేయుమనిచెప్పె. ఇవ్విధముగా రామసుగ్రీవులిరువురును మాటలాడుకొనుచున్నసమయమునందుఁ దామరపువ్వులయందలి రేకులతోను, బంగారముతోను, నిప్పుతోనుసమానములగు, సీతాదేవియొక్కయు, వాలియొక్కయు, రావణాసురునియొక్కయు, నేత్రములలో వామనేత్రముచలించెను. ఇట్లువామనేత్రము అదురుటచేత వాలిరావణాసురులకు నాశమనియును, సీతకుమేలుగలుగుననియును, నెరుంగవలయు.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యైదవసర్గ ముగిసెను.

సీతాదేవియొక్క ఆభరణములను సుగ్రీవుడు రామునిచేతికిచ్చుట.

అంతటసుగ్రీవుఁడు మిగులఁబ్రియమును బొందినవాఁడై రఘుకులమునందుఁ బుట్టినవాఁడును, రఘుకులమువారికిసంతోషమును గలుగఁజేయువాఁడును, నగురామునితో మరలనిట్లనియె.

పూజ్యుఁడవైన యోరాముఁడా! నాకుమంత్రియును, మంత్రులలో నుత్తముఁడునునగు హనుమంతుఁడు, నీ చెం

దునిమిత్తముగ నరణ్యమునకువచ్చినదియును, నీవుసీతాల
క్ష్మణులతోఁగూడ వనమునందుండుటయును, జనకమహా
రాజునకుఁగూతురును, నీకుభార్యయునగుసీతాదేవి, నీ
వునుబుద్ధిమంతుఁడగు లక్ష్మణుఁడును లేనిసమయమునందు,
రావణాసురు డపహరించినదియును, ఆలస్యమైనయెడల
మీరువత్తురేమో యనుభయముచేత మార్గమునందడ్డముగ
వచ్చిన జటాయువును రావణాసురుడు జంపినదియును జె
ప్పినాడు. కావుననీహనుమంతునివలన నీవృత్తాంతమును
సర్వమును దెలిసికొంటిని పూజ్యుఁడవైనయోరామా! నీవు
మిగులశీఘ్రముగ భార్యావియోగమువలనఁ గలిగినదుఃఖ
మునుండి ముక్తుఁడవుకాఁగలవు (అనఁగానీవునీభార్యనుశీ
ఘ్రకాలములోనేచూడఁగలవు) పూజ్యుఁడవైనయోరాము
డా! పూర్వము వేదమునుదొంగిలించి సముద్రమునందుదా
గియున్న మధుకైటభాసురులను నారాయణుఁడు మత్స్యా
వతారమునవలంబించి వానినిజంపి వేదమునుదీసికొనివచ్చి
నవిధముగ నేనుగూడ రావణాసురునిఁజంపి సీతాదేవినిదీసి
కొనిరాఁగలను శత్రువులనునశింపఁజేయునట్టి యోరా
ముఁడా! నీభార్యయగుసీతాదేవి పాతాళలోకమునందు
న్నను, అంతరిక్షలోకమునందున్నను, దీసికొనివచ్చినీకివ్వఁ
గలను. రఘుకులమునందుఁబుట్టిన యోరామఁడా! నేనుజె
ప్పుచున్న యీమాటయథార్థమైనదని తెలిసికొనుము. మహా
బాహుడవగునోరాముఁడా! నీభార్యయగుసీతాదేవి, "వి
షముకలిసినభక్ష్యమువలె' నింద్రునితోఁగూడిన దేవదాన
వులకుఁగూడ స్వాధీనురాలుగాదు. (అనగాముప్పదిమూ
డుకోట్లదేవతలును, రాక్షసులునునింద్రునితోఁగూడఁ జేరు
కొనిప్రయత్నించినప్పటికిని నీభార్యయగుసీతను స్వాధీనప
రచుకొనఁజాలరు) మిగులగొప్పవగు భుజములుగలయో
రామా! నీవుదుఃఖమును వదిలిపెట్టుము. నీకుఁబ్రియురాల
గుసీతాదేవిని దీసికొనిరాఁగలను. ఆచిన్నదిసీతాదేవియై
యుండునని యిప్పుడునేనునిస్సందేహముగా నూహించుచు
న్నాను. ఆవిషయమునుసర్వమును విస్పష్టముగఁజెప్పెద
ను వినుము. పూజ్యుఁడవైనయోరామా! ఒకచిన్నదిక్రూ
రములగు వ్యాపారములుగల రావణాసురునిచేతఁ దీసికొ
నిపోఁబడుచు హారామా! రామా! యనుచుగద్గదస్వరము
తోరోదనమును జేసె. మఱియునాచిన్నది రావణాసురుని
యొక్కతొడయందు "నాగకన్యకవలె" బ్రకాశించుచున్నద
య్యును వ్యసనముచేతఁబ్రకాశింపకుండె అప్పడామహ
నీయురాలగుసీతాదేవి, యీపర్వతపుచరియయందు నలు
గురుమంత్రులతోఁగూడఁ గూర్చుండియున్న నన్నుఁజూచి
యుత్తరీయమును, ఆభరణములను నామీఁదఁబడవైచె
రఘుకులమునందుఁబుట్టిన యోరామా! ఆయాభరణము
నుయెత్తి నేనుదాచిపెట్టితిని. ఆయాభరణములన్నియును
దీసికొనివచ్చెదను. చూడుము. చూచినయెడల సీతాదేవి
సంబంధమైనవగునో కావోనీవుగుర్తును బట్టఁగలవనిచెప్పె.
ఆమాటలనువిని ప్రియముగమాటలాడుచున్న యాసుగ్రీవు
నిజూచి రాముఁడిట్లనియె.

మిత్రుఁడా! సుగ్రీవా! ఎందుకు ఆలస్యమునజేసెదవు.
శీఘ్రముగ నాయాభరణములనుదీసికొనిరమ్ము చూచెదన
నియె ఆమాటనువిననతోడనే సుగ్రీవుఁడు రామునకుఁ బ్రి
యమును జేయవలయునని యెడు తలంపుతో మిగులశీఘ్ర
ముగ నాపర్వతముయొక్క గుహలోనికిఁబోయె. అట్లుపో
యియావస్త్రమును, ఆభరణములను దీసికొనివచ్చి వీని
నిజూడుమని యాసుగ్రీవుఁడు రామునకుసమర్పించె. అంత
టనారాముఁడు ఆవస్త్రమును, శుభకంములగు నాభరణ
ములను చేతదీసికొనిజూచి మంచుఁచేతఁజంద్రుఁడుగప్పఁబడి
నవిధముగఁ గన్నీళ్ళచేతఁగప్పఁబడియె మఱియునుసీత
యందలిస్నేహముచేతఁ గలిగినకన్నీటిచేతఁ బీడింపఁబడిన
వాఁడైహాప్రియురాలా! నాప్రాణనాయకీ! సీతా! యని
యేడ్చుచు ధైర్యమునువదలి భూమియందుఁబడెను. అంతఁ
గొంతసేపటికిఁదెలివొంది మిగులఁబ్రశస్తములైనవియును,
మిగులవెలగలవియును, నగునాసొమ్ములను రొమ్మునందు
బెట్టుకొని "కోపముతోఁగూడుకొన్నదియును, బిలమునం
దున్నదియును, నగుపామువలె" మిగులనధికముగానిట్టూ
ర్పునువదలె అట్లుకొంతసేపుదుఃఖమును జెంది రెండ తెగ
కకారుచున్న కన్నీరుగలవాఁడై తనప్రక్కనున్న లక్ష్మ
ణునిఁజూచి మిగులదైన్యముతో నేడ్పుమాటలను జెప్పఁదలఁ
చియిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! రావణాసురునిచేతఁ దీసికొని
పోఁబడుచున్న సీతాదేవిచేతఁగ్రిందఁబడవేయఁబడిన యీ
యుత్తరీయమును, మంగళకరములగు నాభరణములనుజూ
డుము రావణాసురునిచేతఁ దీసికొనిపోఁబడుచున్న సీతా
దేవిచేత పచ్చిగడ్డిగలభూమియందుఁ బడవేయఁబడినయీ
యాభరణములు మునుపటివలెనేయున్నవిగాని కొంచెమై
నను, చెడిపోలేదు. చూడుమనిచెప్పె ఆమాటనువిననతో
డనే యాలక్ష్మణుఁ డిట్లనియె.

పూజ్యుఁడవైనయోరామా! నేనుసీతాదేవియొక్క భు
జబందులనియెడుసొమ్ముల నేనెప్పుడును జూచియుండలే
దు మఱియు నాసీతాదేవియొక్కచెవులకు బెట్టుకొనియె
డుకమ్మలనియెడు సొమ్ములనుగూడఁజూచియుండలేదు. ప్ర
తిదినమునందును నేనుసీతాదేవియొక్కపాదములకు నమ

సాకారమును జేయుచుండుటవలనఁ బాదములయందలి యందెలను మాత్రము చూచియున్నాను. కావున నీయాభరణముల స్థితిని నేనెఱుఁగననియె. అట్లు లక్ష్మణుఁడు చెప్పినపిమ్మట రఘుకులమునందుఁ బుట్టిన యారాముఁడు సుగ్రీవునిఁజూచి యిట్లనియె.

సుగ్రీవుఁడా! చెప్పుము. ఎక్కడకుఁ దీసికొనిపోఁబడుచున్న సీతాదేవి నీచేతఁ జూడఁబడెనో భయంకరమైనరూపముగల రావణాసురుఁడు నాప్రాణములకంటెఁ బ్రియమైన సీతను ఏస్థలమునకుఁ దీసికొనిపోయె? మిత్రుఁడా! సుగ్రీవా! నాకు మిగుల దుఃఖమును గలుగఁజేసిన యారాక్షసుఁ డెక్కడ నివసించియున్నాఁడు. మఱియు నోసుగ్రీవుఁడా! నేనెవ్వనికొఱకు సకలరాక్షసకులమును సంహరింతునో, నాకుఁ గోపమును గలుగఁజేసి యెవ్వఁడు సీతనపహరించెనో, యారాక్షసుఁ డెక్కడనున్నాఁడు? మఱియు నోసుగ్రీవుఁడా! నాకు మిగులఁ బ్రియమును గలుగఁజేయునట్టి సీతాదేవిని బాధించి యపహరించిన రాక్షసుఁడు చావుకొఱకు మృత్యుదేవత యొక్క యింటివాకిలిని దెరచెను. మిత్రుఁడా! సుగ్రీవా! నాశత్రువుఁడగు రావణాసురుఁ డెక్కడ నున్నాఁడో చెప్పుము? వానినిప్పుడే యమలోకమునకుఁ బంపెదననిచెప్పె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యాఱవసర్గ ముగిసెను.

సుగ్రీవుడు రాముని దుఃఖోపశమనము జేయుట.

ఇవ్విధముగా మిగుల దుఃఖవంతుఁడగు రాముఁడు చెప్పిన మాటను విని సుగ్రీవుఁడు చేతులను ముకుళించుకొని కన్నీటితోఁ గూడుకొనినవాఁడును, గద్గదస్వరము గలవాఁడును నగుచు నిట్లనియె.

పూజ్యుఁడవైన యోరామా! సకలవిధముల చేతను బాపాత్ముఁడగు నారావణాసురుఁ డెక్కడనుండునదియును నేనెఱుఁగను. మఱియును దుష్టకులమునందుఁ బుట్టిన యా రావణాసురుని యొక్క కులము, పరాక్రమము, నడవడిక మొదలగువానిలో దేనిని నేనెఱుఁగను. పూజ్యుఁడవైనయో రామా! నేనే విధముగాఁ బ్రయత్నమును జేసిన యెడల నీవు సీతను బొందఁగలవో, యావిధముగా నేను బ్రయత్నమును జేసెదను. నేను సత్యముగాఁ జెప్పుచున్నాను. కావున శత్రువులను దండించునట్టి యోరామా! నీవు శోకమును వదలిపెట్టుము. పూజ్యుఁడవైనయో రాముఁడా! రావణాసురునిఁ బుత్రమిత్రకళత్రాదులతోఁ గూడఁ జంపి నీకు సంతోషమును గల్పించెదను. మఱియు నీ వేవిధముగా నాపౌరుషమును జూచిన యెడల సంతోషమును బొందుదువో నేనావిధముగా నా పౌరుషమును జూపెదను. పూజ్యుఁడవైన యోరాముఁడా! ఇఁకను వ్యసనమును బొందకుము. నీమనస్సునందు ధైర్యము నవలంబింపుము. నీయట్టి మహానుభావులీవిధముగా స్వల్పబుద్ధి నవలంబించుట యుచితముగాదు. పూజ్యుఁడవైనయో రాముఁడా! నాకుఁ గూడా భార్యావియోగమువలన నధికమగు వ్యసనము గలిగియున్నది. అయినప్పటికిని నేనుయీ విధముగా వ్యసనమును బొందలేదు. ఇంతియగాక ధైర్యమును గూడ వదలినవాఁడను గాను. నేను హీనుఁడను, వానరుఁడను నయ్యును, భార్యను గుఱించి విశేషముగ దుఃఖమును బొందలేదు. నాయట్టివాఁడే వ్యసనమును బొందుటకుఁ దగనివాఁడనైయుండఁగా మహానుభావుఁడవును, పెద్దలచే తశిక్షింపఁబడినవాఁడవును, మిగుల ధైర్యము గలవాఁడవును, నగు నీవు దుఃఖమును బొందుటకుఁ దగినవాఁడవుగావని నేను జెప్పవలయునా? పూజ్యుఁడవైనయో రాముఁడా! బయలునకు వచ్చుచున్న కన్నీళ్ళను ధైర్యముచేత నణఁచివేయుటకు నీవు తగినవాఁడవు. కావున నీవు మిగులఁ బ్రయత్నమును జేయువారలయొక్క మర్యాదనవలంబింపుము. ధైర్యమును విడిచిపెట్టకుము. పూజ్యుఁడవైనయో రాముఁడా! "శ్లో॥ వ్యసనే వార్థకృచ్ఛ్రే వా భయే వా జీవితాంతకే। విమృశన్వై స్వయా బుద్ధ్యా ధృతిమాన్నావసీదతి,, వ్యసనము వచ్చినప్పుడును, ద్రవ్యనాశమైనపుడును, భయము గలిగినపుడును, ప్రాణావసానసమయమునందును, బుద్ధిమంతుఁడగువాఁడు తనబుద్ధిచేతఁ జక్కగా విచారించుచు వ్యసనమును వదలవలయును. మఱియు నోరాముఁడా! "శ్లో॥ బాలిశస్తు నరో నిత్యం వైక్లబ్యం యోఽనువర్తతే। సమజ్జత్యవశః శోకే భారాక్రాంతేవ నార్జలే,, లోకములో ఏనీచుఁడు సర్వకాలములయందును వ్యసనమును బొందుచుండునో, అటువంటి నీచుఁడు మిగుల దుఃఖితుఁడై "ఉదకమునందు బళువు అధికమైనపుడు ఓడమునిఁగిపోవువిధముగ" దుఃఖమునందుఁ బడి మునిఁగిపోవును. కావున నీవు వ్యసనమును బొందుట యుచితము గాదు. పూజ్యుఁడవైనయోరాముఁడా! నేను చేతులను ముకుళించుకొని నీయందలి స్నేహము చేత నిన్నుఁ బ్రార్థించుచున్నాను కాఁబట్టి నీవు పౌరుషమునాక్రమింపుము. నీవు దుఃఖమునకవకాశమిచ్చుట యుచితముగాదు పూజ్యుఁడవైనయోరామా! దుఃఖము చేత సర్వకాలములయందును భీడింపఁబడుచున్నవాఁడు జీవించుననుటయందుఁ గూడ సందేహము గలదు. మఱియును సర్వకాలములయందును దుఃఖించువానికిఁ దేజస్సుగూడ నాశమును బొందును. కా

పుననీవు వ్యసనమునుబొందుటతగదు. సర్వకాలములయందును వ్యసనమునుబొందెడువానికి సుఖముగలుగనేరదు. కాఁబట్టి రాజేన్ద్రుఁడవైన యోరామచంద్రా! దుఃఖమును వదలి ముఖ్యముగా ధైర్యమునవలంబింపుము పూజ్యుఁడవైనయోరాముఁడా! నీవు స్నేహితుఁడవు. కావుననేనడుగుచున్నానుగాని యీవిషయమును ఉపదేశించుచున్నవాఁడనుగాను నీయట్టిమహానుభావునకునీచుఁడనగునేనుఉపదేశింపఁగలనా? ఉపదేశమునుజేయఁజాలను. కాఁబట్టియోరాముఁడా! నాయందలి మిత్రత్వమునుబట్టి నామాటలనువిందుఃఖమునువదలిపెట్టుము ఇట్లుచేయుటకుఁ దగినవాఁడవగుటచేత నిన్నుఁబ్రార్థించుచున్నానని చె. ఇవ్విధముగాసుగ్రీవుఁడుపలికిన మృదుమధురవచనములనువిని రఘుకులోద్భవుఁడగురాముఁడు కన్నీళ్ళచేత వ్యాప్తమైయున్న ముఖమును దనయుత్తరీయముయొక్క యంచుచేతఁదుడిచెను. మఱియును కకుత్స్థునివంశమునందుఁ బుట్టినవాఁడును, ప్రభువును నగురాముఁడు తనయొక్కయథాస్థితిని (అనఁగా ధైర్యమును) పొందిసుగ్రీవుని కౌఁగలించుకొని యిట్లనియె.

సుగ్రీవుఁడా! స్నేహితుఁడవును, మనోహరముగమాటలాడువాఁడవును, హితుఁడవునునైన నీచేతఁ జేయఁదగినపనియేదియో (అనఁగా నెటువంటిమాటలుచెప్పఁదగునో) యట్టికార్యముచేయఁబడినది స్నేహితుఁడవైనయోసుగ్రీవుఁడా! నీచేతనోదార్పఁబడినవాఁడనై నేనుధైర్యమునవలంబించితిని. ఇట్టివ్యసనకాలమునందు విశేషముగానిట్లుప్రియవచనములను బలుకునట్టిస్నేహితుఁడు దొరకుటదుర్లభము మఱియునోసుగ్రీవుఁడా! సీతాదేవిని వెదకుటకొఱకు నీవు తగినప్రయత్నమును జేయవలయును మఱియుభయంకరములగు కార్యములనుజేయువాఁడును, రాక్షసుఁడును, దురాత్ముఁడును నగురావణాసురుఁ డెక్కడనున్నదియును దెలిసికొనుటకొఱకుఁ దగినయత్నమును జేయవలయును. మిత్రుఁడా! సుగ్రీవా! నేనుజేయఁదగిన పనియేదియో తెలుపుము? ఆపనినిజేయుటకు సిద్ధముగనున్నాను. వర్షాకాలమునందు మంచిపొలములయందు సకలసస్యములునుఫలించువిధముగ నీకార్యములన్నియును నాయందుసఫలముకాఁగలవు. వానరోత్తముఁడవైనసుగ్రీవా! నేనుపరాక్రమాభిమానమువలనను, నీయందలి స్నేహాభిమానమువలనను ఏమిచెప్పితినో, యావిషయమును సత్యముగానే చెప్పితినని తలంపుము. మిత్రుఁడా! సుగ్రీవుఁడా! నేనెప్పుడునునబద్ధపువచనములను జెప్పియుండలేదు. ఇఁకమీఁదటనుగూడఁ నబద్ధమును జెప్పువాఁడను గాను. మిత్రుఁడా! సుగ్రీవుఁడా! నేనుజెప్పినపనిని జేయకపోతినేని నేనుసత్యమునకుఁ దప్పినవాఁడనగుదునని యొట్టునుబెట్టికొనియెదనని చెప్పె. అట్లు రాముఁడు చెప్పినమాటలనువిని సుగ్రీవుఁడు తనమంత్రులతోఁగూడ మిగులసంతోషమునుబొందినవాఁడై రాముఁడు చెప్పినపనిని జేయుననినిశ్చయించె ఇవ్విధముగ నారామసుగ్రీవులిద్దఱును ఏకాంతమునందుఁ బరస్పరమునుదగినవిధముగఁ దమతమసుఖదుఃఖములనుగురించి సంభాషించుకొనుచుండిరి మఱియునుమహానుభావుఁడును, మానవోత్తముఁడునునగు నారాముఁడుచెప్పినమాటనువిని వానరోత్తముఁడగుసుగ్రీవుఁడు తనకార్యమంతయును నెరవేరినదని యెంచెను

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యేడవసర్గ ముగిసెను.

రాముఁడువాలినిచంపెదనని సుగ్రీవునకు ధైర్యమును జెప్పుట.

అట్లు రాముఁడుపలికిన మృదుమధురవచనములనువిని సుగ్రీవుఁడు పరమసంతోషమునుబొందినవాఁడై లక్ష్మణుని ముందరఁబెట్టుకొని రామునిజూచి యిట్లనియె.

పూజ్యుఁడవైన యోరాముఁడా! సకలసద్గుణములును గలనీవు నాకుస్నేహితుఁడవగుటచే నేనుసర్వప్రకారములచేతను దేవతలకుఁగూడదయతలఁపఁదగినవాఁడనైతిని. ఇందుకేమియును సందేహము లేదు. పాపరహితుఁడవైన యోరాముఁడా! నీసహాయముచేత నేనుస్వర్గపట్టణమునకుఁగూడఁ బ్రభుఁడనుగాఁగలను. ఇట్టినేను యీకనారాజ్యమునుబొందుటకుసందియమేమిగలదు. నారాజ్యమును నేనుబొందుటకు సందేహమేమియును లేదు. రఘుకులమునందుఁ బుట్టినయోరాముఁడా! నేనుఅగ్నిసాక్షికముగా రఘువంశమునందుఁబుట్టిన నిన్నుస్నేహితునిగాఁ బొందినవాఁడనగుటచేత బంధువులకును స్నేహితులకును బూజింపఁదగినవాఁడనైతిని. పూజ్యుఁడవైన యోరామచంద్రా! నన్నునీకుఁదగినస్నేహితునిగాఁ దలఁచుచున్నావా? నేనుస్వయముగా నాగుణములనుజెప్పుటకు శక్తిలేనివాఁడనైతిని. కాఁబట్టినాయందలిగుణములు మెల్లగానీవే తెలిసికొనవలయును. స్వాధీనమైనమనస్సుగలవారును, మహానుభావులునునగు నీయట్టివారికి విశేషముగా నాత్మవేత్తలగువారికివలెనే ప్రేమనిశ్చలమైనదై యుండఁగలదు. పూజ్యుఁడవైనయోరామా! సజ్జనులగువారు సజ్జనులయొక్కబంగారము, వెండి, వస్త్రములు, ఆభరణములు, మొదలగువానిని భేదమునుబెట్టకనే యుపయోగించుకొనుచుందురు. మఱియునోరామా! "శ్లో॥ ఆఢ్యోవాపి దరిద్రోవాదుఃఖి

తస్సుఖతో౽పివా। నిర్దోషోవాసదోషోవా వయస్యః పరమాగతిః,, భాగ్యవంతుఁడైనను, దరిద్రుఁడైనను, దుఃఖముగలవాఁడైనను, సుఖముగలవాఁడైనను, దోషవంతుఁడైనను, దోషహీనుఁడైనను, స్నేహితుఁడే స్నేహితునకుదిక్కుగాని మఱియొకఁడుదిక్కుగానేరఁడు పూజ్యుఁడవైనయోరామా! "శ్లో॥ ధనత్యాగస్సుఖత్యాగో దేహత్యాగో౽పివాపునః। వయస్యార్థే ప్రవర్తంతే స్నేహందృష్ట్వాతథావిధమ్,, లోకములో స్నేహితుఁడగువాఁడు తనకుసమానుఁడగు స్నేహితునికొఱకుధనమును, సుఖమును, దేహమును, వదలుటకుఁగూడఁ బ్రయత్నమునుజేయును. ఇట్లుసేయుటయందు సందేహమేమియునులేదుగదా? అని సుగ్రీవుఁడుపలికె. ఇవ్విధముగాబుద్ధిమంతుఁడును, దేవేన్ద్రునితోసమానుఁడునునగు లక్ష్మణుఁడుగూడ వినుచుండఁగా సుగ్రీవుఁడుచెప్పిన ప్రియవచనములనువిని రాముఁడుసుగ్రీవునిజూచి సుగ్రీవుఁడా! ఔనౌననియె. అట్లుపలుకుచున్న రాముని, మహాబలుఁడగు లక్ష్మణునిజూచి సుగ్రీవుఁడు రాముఁడుకూర్చుండుటకుఁ దగినయాసనమును గల్పించుటకే చెట్టుకొమ్మను దీసికొనివత్తమనియెడుతలంపుతో వనమునందంతటను దనచూపునునిగుడ్చె. అంతటసుగ్రీవుఁడుసమీపమునందొక్క యేపిచెట్టునుజూచె. ఆవృక్షమునందుఁదుమ్మెదలచేత వ్యాప్తమైనదియును, మిగులమనోహరముగా బుష్పించినదియును, కొంచెముగానాకులుగలదియును నగునాకకొమ్మనుజూచె. అట్లుజూచి మిగులఁజక్కగాఁబుష్పించినదియును, ఆకులచేతనిండియున్నదియును నగునాకొమ్మనువిరిచితెచ్చి రామునితోఁగూడఁ దానుగూర్చుండె. అట్లుకూర్చున్న రామసుగ్రీవులనుజూచినపిమ్మట హనుమంతుఁడు రామసుగ్రీవులతో సమముగఁ గూర్చుండుటకు లక్ష్మణుఁడు సందేహించుచున్నాఁడనితలఁచి మఱియొకకొమ్మనువిరిచితెచ్చి దానియందులక్ష్మణుని గూర్చుండఁబెట్టె ఫలములచేతను, పుష్పములచేతను వ్యాప్తమైనయాపర్వతశ్రేష్ఠమునందుఁ దరంగములులేని సముద్రమువలె సుఖముగాఁగూర్చుండి ప్రకాశించుచున్నరామునిఁజూచి సుగ్రీవుఁడు మిగులసంతోషమునుబొందినవాఁడై మనోహరమగు వాక్కుతో సంతోషముచేత వ్యాకులమైన యక్షరములుగలుగునట్లుగా మిగులఁబ్రియముతో నారామునకిట్లనియె.

పూజ్యుఁడవైనయోరామా! నేనుతోఁడఁబుట్టువగువాలిచేత వెడలఁగొట్టఁబడినవాఁడను, భయముచేతనధికముగాఁబీడింపఁబడినవాఁడను, అపహరింపఁబడిన భార్యగలవాఁడను, మిగులదుఃఖముగలవాఁడను, నైసర్వోత్తమమైనయీఋశ్యమూకపర్వతమునందు సంచరించుచున్నాను. మఱియు నోరామచంద్రా! నేనుమిగులభయమును బొందినవాఁడను, కలతనొందినమనస్సుగలవాఁడనునై యిక్కడసంచరించుచున్నాను. రఘుకులమునందుఁబుట్టినయోరామా! అన్నయగువాలిచేతఁదఱుమఁబడి భయసముద్రమునందుమునిఁగి యీయరణ్యమునందు సంచరించుచున్నాను సర్వలోకములకును అభయమునిచ్చునట్టియోరాముఁడా! వాలివలన మిగులభయమును బొందినవాఁడను, దిక్కులేనివాఁడనునైన నాకభయమునిచ్చి నన్నుఅనుగ్రహించుటకు నీవుతగుదువనిచెప్పె ఇవ్విధముగా సుగ్రీవుఁడుచెప్పినమాటనువిని తేజోవంతుఁడును, సకలధర్మములనుదెలిసినవాఁడును, ధర్మమునందుఁబ్రేమగలవాఁడును, కకుత్థ్సవంశమునందుఁబుట్టినవాఁడును, నగురాముఁడు, మిగులస్వల్పమునకుగాభయమునుబొందుచున్నావా? సుగ్రీవుఁడా? యనిచెప్పినవ్వుచుమరలనాసుగ్రీవునితో నిట్లనియె.

మిత్రుఁడా! సుగ్రీవా! స్నేహితుఁడుపకారమే ఫలముగాఁగలవాఁడు (అనఁగానుపకారమునుజేసినవాఁడే స్నేహితుఁడు) శత్రువుఁడగువాఁడు అపకారమునేజేయుచుండును. నీవుభయమునుబొందకుము నీకపకారమునుజేసినవాఁడును, నీభార్యను అపహరించినవాఁడును నగువాలినిప్పుడేచంపఁగలను. మిత్రుఁడా! సుగ్రీవా! ఈనాబాణములు, మిగులవేగముగలవియును, రెక్కలుగలవియును, మిగులఁదీక్ష్ణమైన తేజస్సుగలవియును, కార్తికేయవనమునందుఁబుట్టినవియును, బంగారముచేత నలంకరింపఁబడినవియును, కంకపత్రములచేతఁ గప్పఁబడినవియును, దేవేన్ద్రునియొక్క వజ్రాయుధముతో సమానమైనవియును, మంచిపర్వములుగలవియును, మిగులఁదీక్ష్ణములైన కొనలుగలవియును, రోషముగలసర్పములతో సమానములైనవియును నైయున్నవి. మిత్రుఁడా! సుగ్రీవుఁడా! ఈబాణములచేత, నీకుభ్రాతృసంజ్ఞను బొందినవాఁడును, శత్రువుఁడును, పాపాచరణనుజేసినవాఁడును, నగువాలినిఁజంపితినని యెన్నుము. మఱియు నీబాణములచేతఁజంపఁబడి కొండవలెఁగ్రిందఁబడియున్న వాలినిశీఘ్రముగా జూడగలవనిచెప్పె ఇవ్విధముగా రాముఁడుచెప్పినమాటలువిని వానరసేనాధిపతియగు సుగ్రీవుఁడుపరమానందమునుబొంది మంచిది, మంచిదని, చెప్పి మఱియునిట్లనియె.

పూజ్యుఁడవైన యోరాముఁడా! నేనుదుఃఖముచేతఁదిరస్కరింపఁబడియున్నాను. దుఃఖముచేతఁ బీడింపఁబడినవారలకునీవేగతివి నీవుస్నేహితుఁడవుగదాయని తలఁచినేను నీదగ్గరవ్యసనమునుబొందుచున్నాను. నీవునాచేతినిచేతితోఁబట్టుకొని అగ్నిసాక్షికముగానాతో స్నేహమునుజే

సితివి. కావున నీవు ప్రాణములకంటె నధికమైన స్నేహితుఁడవు. ఈ విషయమునందు సందేహము లేదని సత్యముగా బట్టును బెట్టుకొనుచున్నాను. పూజ్యుఁడవైన యో రామా! నీవు స్నేహితుఁడవగుటవలన నేను నమ్మకముతో నా దుఃఖవృత్తాంతమును జెప్పుకొనుచున్నాను పూజ్యుఁడవైన యో రామచంద్రా! నా మనస్సులోపలనున్న దుఃఖము నా మనస్సును సర్వకాలములయందును బాధించుచున్నదనియె. ఇంతమట్టుకుఁ జెప్పి పిమ్మటఁ గన్నీళ్ళచేత వ్యాప్తమైన కంఠముగలవాఁడయ్యె. అట్లు కన్నీళ్ళచేత నడ్డపరుపఁబడిన కంఠధ్వని గలవాఁడై మాటలాడ నేరక యూరకుండె. అట్లు కొంతసేపు యూరకుండి మఱల నిట్లనియె.

పూజ్యుఁడవైన యో రాముఁడా! అతిశీఘ్రముగా బయలు వెడలుచున్న కన్నీటి వేగము, "మిగుల వేగముతో వచ్చుచున్న నదీవేగము వలె,, వచ్చుచున్నది. ఇట్లు మిగుల వేగముతో వచ్చుచున్న కన్నీటి వేగమును నీ సన్నిధియందు ధైర్యముచేత నడ్డగించుచున్నానని చెప్పి యా కన్నీటి వేగమును నడ్డగించి శుభకరములగు నేత్రములను దుడిచికొని తేజోవంతుఁడగు నా సుగ్రీవుఁడు నిట్టూర్పులను విడిచి మరల రామునితో నిట్లనియె.

పూజ్యుఁడవైన యో రాముఁడా! పూర్వము నేను బలవంతుఁడగు వాలిచేత యావరాజ్యమునందు నియమింపఁబడితిని. పిమ్మట నా వాలియే కఠినముగా నన్నుఁ దిట్టి యావరాజ్యపదభ్రష్టునిగాఁ జేసె. పూజ్యుఁడవైన యో రాముఁడా! దుర్మార్గుఁడగు నా వాలి నా ప్రాణములకంటెఁ బ్రియముగలదియగు నా భార్యను అపహరించె. మఱియు నాకుఁ బంమిత్రులగువారలు అనేకులు కారాగృహమునందుఁ బ్రవేశపెట్టఁబడిరి. రఘుకులోద్భవుఁడవైన యో రామచంద్రా! దుష్టాత్ముఁడగు నా వాలి యెప్పుడును నన్నుఁ జంపుటకు అనేకములయిన యత్నములను జేయుచుండును అనేకపర్యాయములు నన్నుఁ జంపుటకు వాలిచేతఁ బంపఁబడిన వానరులు నాచేతఁ జంపఁబడిరి. రఘుకులోద్భవుఁడవైనయో రామా! ఈ సందేహము చేతనే నిన్నుఁ జూచి నేను మిగుల భయమును బొందినవాఁడనై నీయొద్దకు రాలేకపోతిని. భయమును బొందుటకుఁ దగిన కారణముండఁగా సకల ప్రాణులును భయమును బొందును గదా? పూజ్యుఁడవైన యో రామా! హనుమంతుఁడు మొదలుగాఁ గల నలుగురు వానరోత్తములు మాత్రము నాకు సర్వకాలములయందును సహాయులై యున్నారు. ఈ నలుగురును సహాయులుగా నుండుటచేత నేను మిగులఁ గష్టమును బొందినవాఁడనయ్యును, ప్రాణములను వదలకయున్నాను. పూజ్యుఁడవైన యో రాముఁడా! మనోహరులగు నీ వానరోత్తములు నల్వురును సర్వకాలములయందును నన్నుఁ గాపాడుచుందురు. మఱియు నీ నలుగురును నేనెక్కడకుఁ బోదునో యక్కడకు వత్తురు. మఱియు నేను గూర్చున్నచోటఁ గూర్చుందురు. పూజ్యుఁడవైనయో రామా! నా విషయమును సర్వమును నీకు సంగ్రహముగాఁ జెప్పితిని. నీవు మిగుల బుద్ధిమంతుఁడవగుటచేత నీకు విశేషముగాఁ జెప్పనక్కఱలేదు. పూజ్యుఁడవైన యో రామచంద్రా! నాకు జ్యేష్ఠభ్రాతయగు వాలి యధికమైన పరాక్రమముగలవాఁడు. పూజ్యుఁడవైనయో రాముఁడా! ఆ వాలి నాశమును బొందిన పిమ్మట నా దుఃఖము తీరును. అతఁడు మరణమును బొందిన పిమ్మట నాకు సుఖము గలుగుననుటకు సందేహము లేదు. నా సుఖము వాలి చావడమే కారణమైయున్నది, పూజ్యుఁడవైనయో రాముఁడా! నేను దుఃఖముచేతఁ బీడింపఁబడుచున్నవాఁడనగుటచేత నా దుఃఖము తీరేవిధమును జెప్పితిని. పూజ్యుఁడవైన యో రాముఁడా! స్నేహితుఁడు సుఖవంతుఁడైనను, దుఃఖవంతుఁడైనను స్నేహితునకు గతియగునని చెప్పె. ఇవ్విధముగా సుగ్రీవుఁడు చెప్పిన మాటను విని యా రాముఁడు సుగ్రీవునితో మరల నిట్లనియె.

మిత్రుఁడా! సుగ్రీవుఁడా! ఎందుకొఱకు నీకును నీ యన్నయగు వాలికిని విరోధము గలిగెనో యా విషయమును సంపూర్ణముగా వినవలయునని యభిలాష గలిగియున్నది. వానరశ్రేష్ఠుఁడా! సుగ్రీవా! ముందుగా వైరమునకుఁ దగిన కారణమును విని గుణదోషములను విచారించి పిమ్మటఁ జేయఁదగిన కార్యమేదియో విచారించి నీకు సుఖము గలుగునట్లు చేయఁగలను. మిత్రుఁడా! సుగ్రీవుఁడా! వాలిచేత నవమానింపఁబడిన నీ వృత్తాంతమును వినినతోడనే నాకుఁ గూడఁ గోపము వర్షాకాలమునందలి నదీవేగము వలె మిగుల వేగముగలదై హృదయమును ఒరయుచున్నది. (అనఁగా నీ వృత్తాంతమును వినుటచేతఁ గలిగిన కోపము నా మనస్సును మిగుల బాధించుచున్నది.) మిత్రుఁడా! సుగ్రీవుఁడా! నీ వే విధముగాఁ జెప్పిన యెడల నేను సంతోషమును బొంది ధనుస్సును నెక్కుపెట్టుదునో యా విధముగాఁ జెప్పుము. నేను సంతోషమును బొంది బాణమును బ్రయోగించితినేని నీ శత్రువు అవశ్యముగాఁ జావఁగలఁడనియె. ఇవ్విధముగా మహానుభావుఁడైన రాముఁడు చెప్పిన మాటను విని సుగ్రీవుఁడు హనుమంతుఁడు మొదలుగాఁ గల నలుగురు మంత్రులతోఁ గూడఁ బరమానందమును బొందె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యెనిమిదవ సర్గము ముగిసెను.

సుగ్రీవుఁడు రామునితోఁ దనకును వాలికిని విరోధము సంభవించుటకుఁ గారణము జెప్పుట.

పూజ్యుఁడవైనయో రామా! వాలియనువాఁడు నాకు జ్యేష్ఠభ్రాత. శత్రువులను విరాటంకముగ వధించునట్టి సామర్థ్యముగలవాఁడు. ఆవాలి పూర్వము మాతండ్రికిని నాకును మిగులఁ బూజ్యుఁడైయుండెను. మాతండ్రి మరణమును బొందిన పిమ్మట మంత్రులందఱును, వాలి జ్యేష్ఠుఁడగుటచేత వానరులకందఱకును రాజుగానుండుటకుఁ దగువని తలఁచి పట్టాభిషిక్తునిగాఁ జేసిరి. మఱియు నావాలి సకలవానరులకును సమ్మతుఁడైయుండెను. అంతట నావాలి తాతతండ్రులనాటినుండి వచ్చుచున్న రాజ్యమును మిగులఁ జక్కఁగాఁ బాలించుచుండెను. అప్పుడు సర్వకాలములయందును నేను వాలికి మిగులవణఁగి నడచుచున్నవాఁడనై యతఁడు సెప్పినపనులను మిగుల జాగ్రతతో జేయుచుంటిని. అట్లు సంచరించుచుండఁగా దుందుభికిఁ బెద్దకుమారుఁడును, మిగులఁ దేజోవంతుఁడును, నగు మాయావియను రాక్షసుఁడొకఁడుండెను. అతనితోఁ గూడ నావాలికి నాఁడుదాని మూలకముగ నధికమగు విరోధము గలిగెను. మఱియు నోరామఁడా! ఈవిరోధముయొక్క సంగతి యెల్లవారికిని సుప్రసిద్ధముగాఁ దెలిసినవిషయమే గనుక నేను విశేషించి చెప్పనక్కఱలేదు. కావునఁ దక్కిన విషయమును జెప్పెదను వినుము.

పూజ్యుఁడవైన యోరామఁడా! ఆమాయావియను రాక్షసుఁడు జనులందఱును నిద్రించునట్టి యర్ధరాత్రమునందుఁ గిష్కింధాపట్టణముయొక్క బహిర్ద్వారమునందుఁ బ్రవేశించెను. అట్లు ప్రవేశించి మిగులఁ బూనికగలవాఁడై ధ్వనిని జేసి వాలిని యుద్ధమునకు రమ్మనియెను. ఆసమయమునందు నిద్రను బొందుచున్న వాలి మిగుల భయంకరమైన మాయావియొక్క ధ్వనిని విని యత్యంతశీఘ్రముగఁ బయలువెడలెను. అట్లు బయలువెడలి కోపముచేత నారాక్షసోత్తముఁడగు నామాయావిని జంపుటకు నుద్యుక్తుఁడయ్యెను. అప్పుడు నేనును, స్త్రీలును, వినయముతో నావాలిని బహువిధముల యుద్ధమునకుఁ బోవద్దని చెప్పుచుఁ బ్రార్థించితిమి. అట్లు మేమెన్నివిధములఁ బ్రార్థించినప్పటికిని మహాబలుఁడగు నావాలి మమ్మలనందఱఁ దిరస్కరించి బయలువెడలెను. అప్పుడు నేనుగూడ సహోదరస్నేహముచేత నవ్వాలితోఁగూడ బయలువెడలిపోతిని. అంత నామాయావియను రాక్షసుఁడు నాయన్నయగు వాలిని, దూరముగాఁ గూర్చున్న నన్నును జూచి మిగుల భయముగలవాఁడై యధికవేగముతోఁ బఱుగెత్తెను. అవ్విధమున నతఁడు బరుగెత్తుటను జూచి యతనితో మేముగూడఁ బరుగిడితిమి. ఆసమయమునందుఁ జంద్రోదయమయ్యెను. ఆచంద్రుని ప్రకాశముచేత మార్గము చక్కఁగాఁ గనుబడుచుండెను. అంతట నామాయావి తృణములచేతఁ గప్పఁబడినదియును, మిగుల గొప్పదియును, దుర్గంధముగలదియును, నగు భూమియందలి యొకబిలమునందుఁ బ్రవేశించెను. అంతనతనితోఁగూడ నాబిలమునందు మేమిరువురమును బ్రవేశించితిమి. అట్లు రాక్షసుఁడు గుహయందుఁ బ్రవేశించుటను జూచి యావాలి యధికముగఁ గోపముతోఁ గూడుకొనినవాఁడును, క్షోభపెట్టఁబడిన యింద్రియములుగలవాఁడును నై నాతో నిట్లనియెను.

తమ్ముఁడా! సుగ్రీవుఁడా! నీవిక్కడనుండుము. ఈమాయావియను రాక్షసుఁడు బిలద్వారమునందుఁ బ్రవేశించెను. కావున నేనుగూడ నీబిలమునందుఁ బ్రవేశించి యతిశీఘ్రముగ నీరాక్షసునిఁ జంపివచ్చెదను. నేను వచ్చువఱకును నీవిక్కడనుండుమని చెప్పె. ఆవచనమును విని నేను బిలములోనికిఁ బోవద్దని శత్రుసంహారమునందు సామర్థ్యముగల వాలిని బహువిధములఁ బ్రార్థించితి. మఱియు బిలమునందుఁ బ్రవేశింపఁదగదని నామీఁదను బట్టును బెట్టుకొంటిని. పాదములయందుఁబడి యనేకవిధములఁ బ్రార్థించితి. అంతనతఁడు నామాటను వినక యతిశీఘ్రముగ గొప్పదగు నాబిలమునందుఁ బ్రవేశించె. పిమ్మట నతనితోఁగూడ నొకసంవత్సరమునకెక్కువకాలము యుద్ధమును జేయుచుండె. ఆద్వారమునందు నేనుగూడ నంతకాలమును నివసించియుంటిని. అంతఁ గొన్ని దినములకు నాయన్నయగు వాలి నశించియుండునని తలఁచి మిగుల భయమును బొందినవాఁడనైతిని. మఱియు నామనస్సునం దనేకవిధముల సందేహములు గలిగెను. అంతఁ గొన్నదినములకా బిలములోనుండి నురుగుతోఁగూడ నెత్తురు, ప్రవాహరూపముగ వచ్చుటకారంభించెను. ఆరక్తప్రవాహమును జూచి నేను మిగుల దుఃఖమును బొందితిని. మఱియు నాబిలములోనుండి రాక్షసులయొక్క యార్భాటపుధ్వనులు అపరిమితముగా వినఁబడియెను. మఱియు నాయన్నయగు వాలియొక్క కంఠధ్వని మిగుల దీనముగా వినఁబడియె. అంతట నేను మఱికొన్ని గుర్తులచేతఁ గూడ నాయన్నయగు వాలి చంపఁబడెనని నిశ్చయించి యనేకవిధముల దుఃఖించితిని. అంతట నాకేమియును దోఁచదయ్యె. పిమ్మటఁ గొంతసేపటికి ధైర్యమును దెచ్చుకొని యారాక్షసుఁడు బిలద్వారమునకు వచ్చి నన్నుఁ జంపునేమో యని యెంచి, భయముచేతఁ బర్వతమువంటి యొకశిలను దెచ్చి యాబిలద్వారమునకడ్డముగవైచి నేను మిగుల దుఃఖమును బొందితిని. పిమ్మట నాయన్నయగు వాలికిఁ బరలోకక్రియలను జేసి కిష్కింధాపట్టణమునకు వచ్చితి. అట్లు వచ్చినపిమ్మట నేను వాలిమ

రణవృత్తాంతమును వెల్లడిచేయకయే సంచరించుచుంటిని. అంతఁగొన్నిదినములకు మంత్రులందఱును దెలిసికొని నన్ను బహువిధముల నిర్బంధించియెల్లవారును నొకటిగాఁ జేరుకొని రాజ్యాభిషేకమును జేసిరి. అంతట నేను న్యాయమునుదప్పక రాజ్యమును బాలించుచుంటిని. ఇట్లుండఁగఁ గొన్నిదినములకు మాయావియను రాక్షసునిఁజంపి నాయన్నయగు వాలివచ్చె. అట్లువచ్చి పట్టాభిషిక్తుఁడనై యున్న నన్నుఁజూచి యధికమగు కోపముగలవాఁడై కన్నులెఱ్ఱగాఁ జేసి యేమియును విచారింపకయే నామంత్రులను బంధించి బహువిధములఁ బెట్టె. రఘుకులోత్తముఁడవైన యో రామా! అప్పుడు నేను వాలిని నిగ్రహించుటకుఁ దగిన సామర్థ్యముగలవాఁడనయ్యును, అన్నతో యుద్ధమును జేయుటయు నాదరించిమాటలాడుటయును ఉచితముగాదని తలఁచి యతనియందలి గురుత్వముచేత నూరకనుంటిని. మఱియు నవ్విధముగా శత్రువునిజంపి పట్టణములోనికివచ్చిన నాయన్నయగు వాలికి నేను దగినమర్యాదలతో నెదురుగఁబోయి యతని పాదములయందుఁబడి నమస్కారమును జేసితిని. అట్లు వినయముతో నమస్కారమును జేయుచున్న నాకాశీర్వచనమును జేయక సంతుష్టుఁడుగాక యూరకుండె. అంతట నేను నాశిరస్సును నతనిపాదములయందుఁబడునట్లు చేసి నమస్కారమును జేసితిని. అట్లు చేసినప్పటికిని నావాలియనుగ్రహమును జూపలేదు.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి తొమ్మిదవ సర్గము ముగిసెను.

సుగ్రీవుడు రామునితో వాలి మాయావియను రాక్షసునిజంపినవిధమును జెప్పుట.

పూజ్యుఁడవైనయో రామా! అంతటితో నేనూరకుండక మిగులఁగోపమును బొందియున్నవాఁడును, మిగులనాటోపమును బొందియున్నవాఁడును, అన్నయును, నగువాలికిఁ బ్రియమును జేయవలెనని యెడు కోరికతో ననేకవిధములఁ బ్రార్థించి ప్రసన్నునిఁగాఁ జేసితిని. అట్లు జేసి యిట్లని పలికితి. అన్నా! వానరోత్తమా! వాలీ! దైవయోగముచేత నీవు క్షేమముగా నిక్కడకు వచ్చితివి. మా అదృష్టముచేత నీవు శత్రువునిజంపితివి. ఇంతవఱకు నేను దిక్కులేనివాఁడనై యుంటిని. నీవు పుత్రుఁడగు అంగదుఁడు దిక్కులేనివాఁడై యుండె. మాయిరువురకును రక్షకుఁడవగు నీవిక్కడకు వచ్చుటవలన మేము దిక్కుగలవారమైతిమి. అహో నాయదృష్టముచేతఁ బూర్ణచంద్రునకు సమానమగు నీముఖమును జూడఁగలిగితిని. నేను ఛత్రచామరములను బట్టెదను, నాచేతఁబట్టఁబడుచున్న ఛత్రచామరములను గ్రహింపుము. నేను మిగులదీనుఁడను, దుఃఖముగలవాఁడనునై బిలద్వారమునందొక సంవత్సరము నివసించియుంటిని పిమ్మట నాబిలములోనుండి నురుగుతోఁగూడ రక్తప్రవాహంబయలు వెడలె. ఆరక్తప్రవాహమును జూచి నేను మిగులదుఃఖముగలవాఁడను, మిగులఁగలతనొందినయింద్రియములు గలవాఁడనునైతిని. అంతట నేమియును దోచక రాక్షసుఁడు వచ్చి నన్నుఁగూడఁ జంపునేమోయను భయముచేత నాబిలద్వారమునందుఁ బర్వతమువంటియొకబండను వైచితి. అట్లు వైచి నక్కడనుండి బయలువెడలి యీకిష్కింధాపట్టణమునకు వచ్చితి. అప్పుడు మిగులదుఃఖమును బొందుచున్న నన్నుఁజూచి పురజనులును, మంత్రులును, మిగులవ్యసనముగలవారై కొంతతడవునకు దుఃఖమును వదలి నన్నుఁబట్టాభిషిక్తునిఁగాఁ జేసిరి. నేను నాబుద్ధిపూర్వకముగఁ బట్టాభిషిక్తుఁడను గాలేదు కాఁబట్టి నన్ను మన్నింపుము. మఱియు నో వానరోత్తమా! వాలీ! అన్నా! నీవే గౌరవమును బొందఁదగినవాఁడవు ఇంతయగాక రాజుగానుండఁదగినవాఁడవును నీవేగాని నేను గాదు. ఈమంత్రులు నన్ను నిర్బంధించి పట్టాభిషిక్తునిగాఁ జేసిరి గాని వేరొకటిగాదు. నీవు లేకపోవుటవలన రాజ్యమునకు హానిగలుగునని నేను రాజునైయుంటిని గాని వేరొకటిగాదు కాఁబట్టి నన్ను మన్నింపుము. శత్రునాశమును బొందియున్నదియును, మంత్రులతోడను, పురజనులతోడను, నగరులతోడను గూడుకొన్నదియును, నగు నీరాజ్యమంతయును మంత్రులచేత దాచిపెట్టఁబడినది. కావున నీవు వచ్చినతోడనే మరల నీరాజ్యమును నీకు సమర్పించుచున్నాను. మంచిస్వభావముగలవాఁడవును, శత్రువులను నశింపఁజేయునట్టి సామర్థ్యముగలవాఁడవును నైన యో వాలీ! అన్నా! నాయందు గోపమును జేయకుము. వానరరాజవైనయో వాలీ! నీకు శిరస్సుతో నమస్కారమును జేసి నిన్ను యాచించుచున్నాను మఱియును జేతులను ముకుళించుకొని నీకు విధేయుఁడనైయున్నాను. వానరరాజోత్తమా! అన్నా! పట్టణమునందుండు మంత్రులందఱును రాజు లేనిది దేశమునకు హానిగలుగునని యెడు సంకల్పముతో బలాత్కారముగా నన్ను రాజ్యమునకధిపతినిగాఁ జేసిరి. మంత్రులందఱును బలాత్కరించి చెప్పుటచేత నేను సమ్మతించితినని మిగుల మృదువుగాను, మధురముగాను, నుండునట్టిమాటలను జెప్పుచుంటిని. ఇట్లు మృదుమధురములగు మాటలను జెప్పుచున్న నన్ను నావాలి బహువిధముల బెదిరించె. మఱియును, ఛీ! నీముఖమును జూడఁగూడదని చెప్పి యనేకవిధముల నిందించె. అంతటఁ బురజనులను, సకలజనసమ్మతులగు మంత్రులను రప్పిం

చినాస్నేహితులుమొదలగు వారుచూచుచుండఁగ సభలో నన్నుఅనేకవిధములనిందించి యిట్లనియె.

ఓప్రకృతిజనోత్తములారా! అర్ధరాత్రసమయమునం దీమాయావియనియెడు ఘోరరాక్షసుఁడువచ్చిన సంగతి నమీరందఱును నెఱుఁగుదురుగదా? మఱియుఁ గ్రూరుఁడును, దుష్టబుద్ధిగలవాఁడును, నగునారాక్షసుఁడునన్నుయుద్ధమునకురమ్మని పిలిచినసంగతినిగూడ మీరందఱునునెఱుఁగుదురుగదా? అంతటనేనుఆరాక్షసునిమాటను వినినతోడనే రాజమందిరమునుండి బయలువెడలిపోతిని. అప్పుడుమిగులఁగ్రూరుఁడును, నాకుఁదమ్ముఁడునునగు నీసుగ్రీవుఁడుగూడనావెంటవచ్చె. అట్లు మేమిద్దఱమునువచ్చుటనుజూచి యీరాక్షసుఁడుమహాభయమునుబొందినవాఁడై పరుగెత్తె అట్లుపరుగెత్తిపోవఁగ నొకబిలమునందుఁ బ్రవేశించె అవ్విధముగామిగులభయంకరమైన గుహయందారాక్షసుఁడు ప్రవేశించుటను, జూచిదుర్మార్గమునందు సంచరించువాఁడును, నాకుఁదమ్ముఁడునునగు నీసుగ్రీవుఁడుభయముగలవాఁడై యాగుహయందుఁ బ్రవేశింపఁజాలకయూరకుండె ఆసమయమునందునే నిట్లనిచెప్పితిని. తమ్ముఁడా! సుగ్రీవుఁడా! నేనీరాక్షసునిజంపకనే కిష్కింధాపట్టణమునందుఁ బ్రవేశింపను. నేనువచ్చువఱకునునీవీగుహయొక్కద్వారమునందుఁ గావలియుండుము. నేనిరాక్షసునిఁ జంపకగుహలోనుండిరానని చెప్పితిని. అందులకితఁడుసమాధానమునుబొందె పిమ్మటనేను యితనుగుహయందుఁగావలియుండుననితలఁచి యాగుహలోనికిఁబోతిని. అట్లుగుహలోనికిపోయియీరాక్షసుని వెదకుచుంటిని. అట్లువెదకుటకేయొకసంవత్సరకాలముపట్టె. అట్లుసంవత్సరమైనపిమ్మట నేనునిశ్చయముగాభయంకరుఁడగు నారాక్షసునిఁజూచితిని. అంతటఁగొంతసేపటికారాక్షసుని బంధుసహితముగాఁజంపితిని. అప్పుడారాక్షసునియొక్కనోటనుండి రక్తముప్రవాహరూపముగబయలువెడలివచ్చె మఱియునాసమయమునందారాక్షసుఁడు మిగులభయంకరముగా ధ్వనిచేసె. అప్పుడుమిగులఁబరాక్రమముగలవాఁడును, దుందుభియొక్కపుత్త్రుఁడును, నగునారాక్షసునిఁజంపి యంతటబయలువెడలివచ్చితిని. ఆసమయమునందుగుహయొక్క ద్వారము పర్వతమువంటిరాయిచేత మూయఁబడియుండె. కాఁబట్టిగుహయొక్క ద్వారమిదియని తెలియక కొంతసేపు వెదకితిని పిమ్మటఓసుగ్రీవుఁడా!ఓసుగ్రీవుఁడా!యని గొంతెత్తిపిలిచితిని అట్లెన్నిపర్యాయములుపిలిచినను,బదులుపలుకువాఁడులేఁడయ్యె. అట్లుప్రతివచనములేకపోవుటవలననేనుఅనేకవిధములదుఃఖమునుజెందితిని.అంతటనేనాద్వారమునుగాళ్ళతోఁదన్నితిని అట్లుదన్నిపిమ్మట నాద్వారమునందలిరాయినదీసిపూర్వముప్రవేశించినవిధముగానే బయలువెడలివచ్చితిని. జనులారా! దుర్మార్గుఁడును, రాజ్యముకాలయునని కోరికగలవాఁడును, నగునాసుగ్రీవుఁడు సోదరస్నేహమునువదలి నన్నుబిలములోనికిఁబోనిచ్చి యాబిలమునురాతిచేతఁగప్పెనని యీవాలిసభలోని వారందఱునువినునట్లుచెప్పె. అంతటనావాలికొంచెమైనను భయములేనివాఁడైయీవిధముగాఁబలికి కిష్కింధాపట్టణమునను యొకవస్త్రముతోనన్నువెడలఁగొట్టె. అంతటనేనుగట్టువస్త్రముతోడనేబయలువెడలివచ్చితిని. మఱియునావాలి నన్నుఁగొట్టె. ఇంతియగాకరఘుకులోత్తముఁడవైనయోరాముఁడా! నాభార్యనుగూడనపహరించె. అంతటనేను ప్రాణములయందలి యాశచేతవాలివలనిభయమునకుఁగా నాలుగుసముద్రములలోపలనుండునట్టి భూమియందంతట నుదిరిగితిని. మఱియునోరాముఁడా! నేనుభార్యావియోగదుఃఖమువలన వేరొకకారణముచేత వాలికిఁబ్రవేశింపనలవిగానిదియును, ఋశ్యమూకమను పేరుగలదియునునగు నీపర్వతోత్తమమునందుఁ బ్రవేశించితిని రఘుకులోత్తముఁడవైన యోరాముఁడా! మాయన్నదమ్ముల కిరువురకును వైరము గలుగుటకుఁ దగినకారణమును జెప్పితిని నేననిరపరాధుఁడనై యుండియును వ్యసనమునుబొందితిని. నాకుఁగలిగినవ్యసనమునుజూడుము పరాక్రమవంతుఁడవును, సర్వలోకములకును అభయమిచ్చువాఁడవును, నైనయోరాముఁడా! వాలివలనమిగులభయమునుబొంది దుఃఖపడుచున్న నాయందనుగ్రహమును జేయుటకునీవుతగుదువు నీకంటెనితరుఁడగువాఁడెవ్వఁడును భయమునుబోఁగొట్టి నన్నుఁగాపాడు వాఁడెవ్వఁడును లేఁడనిసుగ్రీవుఁడుచెప్పె ఇవ్విధముగా సుగ్రీవుఁడుచెప్పిన మాటనువిని తేజోవంతుఁడును, సకలధర్మములనుదెలిసినవాఁడును, నగురాముఁడునవ్వుచు నాసుగ్రీవునిమృదుమధురవచనములచేతనోదార్పఁదలఁచియిట్లనియె

మిత్త్రుఁడా! సుగ్రీవా! ఈనాబాణములుప్రయోగించినతోడనే శత్రునాశమును జేయఁగలవు మఱియునీబాణములుసూర్యునితోసమానమైనవి. దుర్మార్గమునందుసంచరించుచున్నయీవాలియందు మిగులశీఘ్రముగాఁ బడఁగలవు. మిత్త్రుఁడా! సుగ్రీవా! నీభార్యనపహరించినవాఁడును, పాపకృత్యములనుజేసినవాఁడును, దుష్టనడవడి కలుగలవాఁడును, నగువాలినాకంటఁగనఁబడువఱకును జీవించును అటుపిమ్మట జీవింపఁడు. మిత్త్రుఁడా! సుగ్రీవుఁడా! నేను భార్యావియోగమువలని దుఃఖమనుభవించుచున్నాను

గావున నావలెనే నీవుగూడ దుఃఖసముద్రమునందు మునిఁగితివని తలఁచుచున్నాను. మిత్రుఁడా! సుగ్రీవుఁడా! నిన్ను దుఃఖసముద్రములోనుండి లేవఁదీయఁగలను. నీవిఁకమీఁద సంపూర్ణముగా నీయభిలాషను దీర్చుకొనఁగలవు. నీవేమియు నునిఁకమీఁద దుఃఖమును బొందకుమనియె. ఇవ్విధముగా రఘుకులమునందుఁ బుట్టిన రాముఁడు చెప్పినమాటను విని యావనసుత నమనస్సునకు హితమును గలుగఁజేయునదియై యుండుటచేత నాసుగ్రీవుఁడు పరమసంతోషముగలవాఁడై రామునితో నిట్లనియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదియవసర్గ ముగిసెను.

సుగ్రీవుడు రామునితో వాలిదుందుభియను రాక్షసునిజంపినవిధమును జెప్పుట.

అంతట నాసుగ్రీవుఁడు వాలిచేతఁ జెప్పఁబడినదియును, సంతోషమును, పరాక్రమమును వృద్ధినిబొందించునట్టిదియును, నగు రామునిమాటను విని మిగులసంతోషముగలవాఁడై యారాముని అనేకవిధములఁ బొగడుచుఁ బూజించి మఱియు నిట్లనియె.

పూజ్యుఁడవైన యోరాముఁడా! నీవు గోపమును బొందితివేని ప్రళయకాలమునందలి సూర్యునివలెనే మిగులఁ దీక్ష్ణములైనవియును, మర్మస్థానములను భేదించునట్టి సామర్థ్యముగలవియును, అధికమగు వేగము గలవియును నగు నీ బాణములచేత సకలలోకములను దగులఁబెట్టఁగలవు ఇందు కేమియును సందేహము లేదు. మిత్రుఁడా! రామా! ముందుగా వాలియొక్క పౌరుషమును, పరాక్రమమును, ధైర్యమును నావలన విని పిమ్మటఁ జేయఁదగిన కార్యమును గుఱించి యాలోచింపుము ప్రతిదినమునందు బ్రాహ్మ్యముహూర్తమునందు నిద్రలేచి సూర్యోదయమగు నంతలో సంధ్యావందనమును జేయుటకుఁగాను బశ్చిమసముద్రమునుండి తూర్పుసముద్రమునొద్దకును, దక్షిణపుసముద్రమునుండియుత్తరసముద్రము దగ్గరకును బోవుచుండును మఱియును బరాక్రమవంతుఁడగు నా వాలి పర్వతములయొక్క యగ్రభాగములమీఁదికిఁ బోయి గొప్పవగు శిఖరములను దనబలముచేతఁ బైకెగరవేసి బంతులను బట్టుకొనువిధముగఁ బట్టుకొనుచుండును. మఱియును దనబలమును బ్రకటనచేయవలయునని మొద: కోరికగల వాలిచేత ననేకములును, నానావిధములును, మిగులసారముగలవియునునగు వనమునందలి వృక్షములను, పెళపెళ విఱుచుచుండును, ఇవ్విధముగ వాలి మిగులబలవంతుఁడై సంచరించుచుండె. ఇట్లుండగా నొకకాలమునందు కైలాసపర్వతముయొక్క యాకారమువంటి యాకారముగలవాఁడును, ప్రసిద్ధమగు పరాక్రమముగలవాఁడును, నగు దుందుభియను పేరుగల యొక మహాషాకారముగల రాక్షసుఁడు వేయియేనుఁగులయొక్క బలముగలవాఁడైయుండెను. దుర్మార్గుఁడగు నా దుందుభియను రాక్షసుఁడు తనయొక్క పరాక్రమాతిశయముచేతను, వరదానమువలనను, నధికముగ గర్వమును బొందినవాఁడును, గొప్పదగు దేహముగలవాఁడును నై సముద్రుని యొద్దకుఁ బోయెను. అట్లుపోయి యధికములయిన యలలుగలవాఁడును, రత్నములుగలవాఁడును, నగు సాగరుని వతిక్రమించి మహాసముద్రుని యొద్దకుఁ బోయి నాతో యుద్ధమునకు రమ్మని పిలిచె. అంతట నధికమగు బలముగలవాఁడును, ధర్మాత్ముఁడును నగు నా సముద్రుఁడు పురుషాకారమును ధరించి బయలునకు వచ్చి సమీపించియున్న మరణకాలముగల యా దుందుభిని జూచి యిట్లనియె.

ఓదుందుభీ! నేను నీతో యుద్ధమును జేయఁజాలను. యుద్ధమునందు మిగుల నేర్పుగల యోదుందుభీ! నీతో సమానముగ యుద్ధమును జేసి నీకు సంతోషమును గలుగఁజేయువానిని జెప్పెదను. సావధానుఁడవై వినుము. ఓదుందుభీ! గొప్పదగు నరణ్యమునందుఁ దపోవంతులకందఱకును గతుకుడును, పరమేశ్వరునకు మామగారును, మిగులఁ బ్రసిద్ధుఁడును నగు హిమవంతుఁడని యెడు పర్వతరాజు గలఁడు. అతఁడు మిగులగొప్పవగు కొండయాటలుగలవాఁడు. ఇంతియగాక యనేకములగు చరియలును గొండకాలువలును గలవాఁడు. ఆమహానుభావుఁడు. యుద్ధమునందు నీకుఁ బ్రియమును జేయుటకుఁదగిన సామర్థ్యముగలవాఁడు కావున నతని యొద్దకుఁ బొమ్మని చెప్పె. అంతట నా దుందుభియను రాక్షసుఁడు, సముద్రుఁడు తనతో యుద్ధమును జేయఁజాలక భయపడెనని తలఁచి "బాణము ధనుస్సుననుండి యతివేగముగాఁ బోవునట్లు,, మిగుల వేగముతో హిమవత్పర్వతమునందలి వనమునకుఁ బోయెను అట్లుపోయిన పిమ్మట నా దుందుభియను రాక్షసుఁడు మిగులఁ దెల్లనివియును, నేనుఁగులవలెనున్నవియును నగు నా పర్వతమునందలి శిలల ననేకవిధములుగాఁ జిమ్మి మిగుల భయముగలుగునట్లు ధ్వనిచేసె. అప్పుడు హిమవంతుఁడు మిగుల మనోహరమైనవియును, తెల్లనిదియును, మంచిస్వభావముగలదియును నగు నాకారమును ధరించినవాఁడై తనశిఖరమునందు నిలిచి యా దుందుభితో నిట్లనియె.

ధర్మమునందు వాత్సల్యముగల యోదుందుభీ! నీవు నన్ను దుఃఖపెట్టుటకుఁదగదు. నేను యుద్ధమును జేయుటయం

దుసమర్థుఁడనుగాను. నేనుదపోవంతులకు రక్షకుఁడనై యున్నాను. కావుననన్నుమన్నింపుమనియె. బుద్ధిమంతుఁడగు హిమవంతుఁడీప్రకారముగాఁ జెప్పినమాటనువినికోపమువలననెఱ్ఱగాఁజేయఁబడిన నేత్రములుగలవాఁడై యాదుందుభియిట్లనియె.

ఓరీహిమవంతుఁడా! నీవుయుద్ధమునుజేయుటకు సమర్థుఁడవైననాకేమి? యుద్ధమునుజేయలేక పోయిననాకేమి? నీవునాకువెఱచి నేనుయుద్ధమునుజేయఁజాలనని చెప్పితివి. కావుననేను నీతోయుద్ధమునుజేయను. యుద్ధమునుజేయవలయుననియెడుకోరికగల నాతోయుద్ధమునుజేయుటకుఁదగినవాఁడెవ్వఁడైన నుండెనేనిచెప్పుము. నేనుబోయెదననియె. ఆమాటనువినిమాటలాడుటయందు మిగులనేర్పరియును, ధర్మాత్ముఁడునునగు హిమవంతుఁడు అదివఱకెవ్వరునుజెప్పనివిషయమును కోపవశముచేత నాదుందుభితోఁజెప్పఁదలఁచియిట్లనియె.

ఓరాక్షసోత్తమా! బుద్ధిమంతులలోమిగులగొప్పవాఁడును, దేవేన్ద్రునిపరాక్రమమునకుసమమైనపరాక్రమముగలవాఁడును, శ్రీమంతుఁడునునగువాలియనియెడు వానరుఁడుసామ్యములేనిశోభగల కిష్కింధాపట్టణమునందు నివసించియున్నాఁడు. బుద్ధిమంతులలో మిగుల గొప్పవాఁడును, యుద్ధమునందు అధికమగుసామర్థ్యముగలవాఁడును, నగునావాలినీతోయుద్ధమునుజేయుటకుఁ దగినసామర్థ్యముగలవాఁడు. మఱియునావాలి "యింద్రుఁడునముచితోద్వంద్వయుద్ధమునుజేసినవిధముగ" నీతోనతఁడుద్వంద్వ యుద్ధమునుజేయఁగలఁడు. కావుననీవువాస్తవముగ యుద్ధమునుజేయఁదలఁచితివేని శీఘ్రముగనతనియొద్దకుఁబొమ్ము. అతఁడెట్టివారిచేతను యుద్ధమునందుజయింపనలవిగానివాఁడు. మఱియుయుద్ధమునందు మహాశూరుఁడని ప్రసిద్ధిని బొందినవాఁడనిచెప్పె. అట్లుహిమవంతుఁడు చెప్పినమాటనువిని యాదుందుభికోపముతోఁగూడుకొనినవాఁడై వాలినివసించియున్న కిష్కింధాపట్టణమున కప్పుడేబయలువెడలిపోయె. అంతటనాదుందుభియను రాక్షసుఁడుమహిషరూపమును (అనఁగాదున్నపోతుయొక్క యాకారమును) ధరించినవాఁడును, మిగులఁదీక్ష్ణములగు కొమ్ములుగలవాఁడును, భయంకరుఁడును, నైవర్షాకాలమునందు ఉదకముతోనిండియున్నమేఘము ఆకాశమునందు ప్రకాశించుచుండువిధముగప్రకాశించుచుండె

అంతట మహాబలుఁడగు నాదుందుభి కిష్కింధాపట్టణముయొక్కద్వారములోనికివచ్చి రణభేరిమ్రోగినట్లు భూమియదరునట్లుఅరచె. మఱియునుదనయొక్కగిట్టలచేతభూమినిబ్రద్దలుసేయుచు సమీపమునందున్నవృక్షములనువిరిచివైచె. ఇంతయుగాకయేనుఁగువలెఁ దనకొమ్ములచేత సర్వమునుదర్పముచేత వ్రాయుచుండె. ఆసమయమునందు అంతఃపురములోనున్న వాలియామహాధ్వనినివినితనస్త్రీలతోఁగూడ నక్షత్రములతోఁగూడుకొనిన చంద్రునివలెదుముకుచు నచ్చోటునకువచ్చె. వచ్చియాదుందుభితోమితమయినదియును, స్పష్టమైనయక్షరములుగలదియును, నగుమాటనుయిట్లనిజెప్పె. ఓరీరాక్షసుఁడా నేనువనమునందుసంచరించునట్టి వానరులకందఱకును బ్రభుఁడనగువాలిని. రాక్షసాధమా! నీవుఏమినిమిత్తముగవచ్చి నాద్వారమునందునిలిచి యరచుచున్నావు. ఆవిషయమునిన్నడుగనేల? నేనుదెలిసికొంటిని మహాబలుఁడవగునోరిరాక్షసుఁడా! నీప్రాణములనుగాపాడుకొనుము. వ్యర్థముగానేలచచ్చెదవనిజెప్పె. బుద్ధిమంతుఁడును, వానరోత్తముఁడునునగువాలిచెప్పినమాటనువిని యాదుందుభియనురాక్షసుఁడుకోపముచేతఁగన్నెఱ్ఱచేసియిట్లనియె.

ఓరీవానరా! స్త్రీలదగ్గరనుండి స్త్రీలుసంతోషించుటకొఱకిట్టిమాటలను జెప్పుచున్నావు ఇట్లుచెప్పుటతగదు. నాతోనిప్పుడుయుద్ధమునుజేయుము. నీబలమునుదెలిసికొనియెద. వట్టిమాటలవలనఁబ్రయోజనమేమి? ఓరీవానరాధమా! ఈరాత్రియందుఏవిధముగానైనను నాకోపమును నణచుకొనియుండెదను నీవుసూర్యోదయమగు వఱకును నీయిష్టానుసారముగఁ గోరికెలనన్నిఁటిని ననుభవింపుము. సూర్యోదయమైనపిమ్మట యుద్ధమునుజేయుదము. ఓరీవానరాధమా! నీబంధువులగువానరులనందఱను నాలింగనమునుజేసికొని నీవారలకివ్వఁదగినపదార్థములనివ్వుము ఓరీవానరుఁడా! సకలవానరులకునుబ్రభుఁడవైన నీస్నేహితులనందఱనుజూచిరమ్ము. మఱియు నీకిష్కింధాపట్టణమునుజూచిరమ్ము. కిష్కింధాపట్టణమునందు నీయట్టిరాజునకుఁబట్టాభిషేకమునుజేసిగమ్ము. మఱియునీవు నీభార్యలతోఁగూడభోగించి కొరతలనన్నింటినిదీర్చికొనుము. నేను నీదర్పమునునశింపఁజేయువాఁడను. కాఁబట్టినీకీవిషయమునుజెప్పుచున్నాను మఱియునోవానరోత్తమా! "శ్లో॥ యోహిమత్తంప్రమత్తంవాసుప్తంవారహితంభృశం। హన్యాత్సభ్రూణహాలోకేత్వద్విధంమదమోహితమ్,, కల్లుమొదలగువానినిద్రాగుటచేత మదించినవాఁడును, చిత్తస్వాస్థ్యములేనివాఁడును, నిద్రను బొందుచున్నవాఁడును, ఆయుధాదికములేనివాఁడును, నీవలెస్త్రీలనడుమనున్నవాఁడును, స్త్రీసంభోగముకొఱకుగాఁజేసినమద్యపానముచేతమత్తుఁడును, నగుమానవుని సంహరించువాఁడు

భ్రూణహత్యకుఁదుల్యమైనపాపమునుబొందును. కావున నోవాలీ! నీవుజనుభవింపఁదగినవానినన్నిటిని అనుభవించిరమ్మనియె. ఇట్లుదుందుభి చెప్పినమాటలనువిని మెల్లగా నవ్వి యధికమగుకోపముగల యావాలితాను మొదలుగాఁగల స్త్రీలనందఱనువిడిచిపెట్టి రాక్షసోత్తముఁడగు నాదుందుభితోనిట్లనియె.

ఓ రాక్షసనాథమా! నీవుయుద్ధమునుజేయుటయందు భయములేనివాఁడవైనయెడల నీవాలిమత్తుఁడయ్యెనని యెంచకుము. ఇప్పుడునేనుమద్యపానమునుజేసి నందువలనఁగలిగినమదముయుద్ధమునందుఁజేయఁదగిన మద్యపానముచేతఁగలిగినమదమనియెఱుంగుము యుద్ధములయందు వీరపానమునుజేయుట యుచితమేగదా? యనిచెప్పియపరిమితమగుకోపముగలవాఁడై తనతండ్రియగు దేవేంద్రునిచేతనివ్వఁబడినదియును, కనకమయమైనదియునునగు మాలికను ధరించి యుద్ధమునుజేయుటకుఉద్యుక్తుఁడయ్యె. (పూర్వము దేవేంద్రుఁడు మాలికనిచ్చునపుడు యుద్ధమునందీమాలికనుధరించితివేని శత్రువునకుఁగల బలమంతయునునీకువచ్చునని వరమిచ్చె. కావునవాలి దేవేంద్రునిచేత నివ్వఁబడిన మాలికనుధరియించెననుట) అంతట వానరోత్తముఁడగు వాలిపర్వతమువంటి యాదుందుభియొక్క కొమ్ములను బట్టుకొనిగిరగిరఁద్రిప్పె. అట్లుత్రిప్పి యాదుందుభినివిసరిక్రిందఁబడవైచి భూమ్యాకాశములుబ్రద్దలగునట్లు ధ్వనిచేసె అట్లువిసరిక్రిందఁబడవేయుటవలన నారాక్షసునియొక్క చెవులలోనుండి యపరిమితముగారక్తముప్రవహించె. మఱియు నారాక్షసునికొమ్ములు పెరకఁబడియె. అంతటఁగోపాతిశయమువల వానరరాక్షసులిద్దఱును ఒకరినొకరుజయింపవలయుననియెడు కోరికగలవారై మిగులభయంకరమగుయుద్ధమునుజేసిరి. మఱియు నాసమయమునందు దేవేంద్రునియొక్కపరాక్రమమువంటి పరాక్రమముగలయా వాలియొక్కపిడికిటిపోటులచేతను, మోకాటదెబ్బలచేతను, రాళ్ళచేతను, వృక్షములచేతను, చక్కగామర్దించి యారాక్షసునిబాధించె. అవ్విధముగ నావానరరాక్షసులిద్దఱును గొట్టుకొనుచుండఁగా నారాక్షసుఁడుతగ్గినబలముగలవాఁడయ్యె. ఇంద్రునిపుత్రుఁడగు వాలియధికమైన బలముగలవాఁడయ్యె. పిమ్మటనావాలి, తనయొక్కవ్యాపారములచేతను, శౌర్యముచేతను, ధైర్యముచేతను, పరాక్రమములచేతను, తక్కువస్థితినిబొందినయాదుందుభిని, ఎత్తిగిరగిరఁద్రిప్పిభూమియందుఁబడవైచె. ప్రాణములకునాశమును గల్పించునట్టి యాయుద్ధమునందప్పుడుగొప్పదగుశరీరముగల యాదుందుభియనురాక్షసుఁడు మర్దింపఁబడినవాఁడును, మరణమునుబొందినవాఁడునునై భూమియందుఁబడెను అవ్విధముగారాక్షసుడు మరణమును బొందినపిమ్మట వాలియాదుందుభియొక్క కళేబరమును, తనబాహువులచేతనూగించి యొక్కమాటుగానొకఆమడదూరముపోవునట్లువిసరివైచె. అట్లుమిగులవేగముగా విసరివేయునపుడు ఆదుందుభియొక్కనోటనుండి బయలువెడలినరక్తముగాలిచేత నెగురఁగొట్టఁబడినదై యక్కడకుసమీపమునఁ దపస్సునుజేయుచున్న మతంగమహామునియొక్క యాశ్రమమునందుఁ బడియె అంతనమ్మునీశ్వరుడు తనయాశ్రమమునందుఁబడిన నెత్తురుబొట్లనుజూచె. అట్లుచూచినపిమ్మటమహానుభావుఁడైన యామతంగమహాముని యెవఁడీపనిని జేసెననివిచారించియిట్లనియె

నాయాశ్రమమునందున, నాయందును నెత్తురుబొట్లనుజల్లినయీదురాత్ముఁడెవ్వఁడు? మఱియునిదుష్కృత్యమునుజేసినవాఁడు దురాత్ముఁడనియును, దుర్బుద్ధియనియును, చక్కనికార్యములనుజేయనివాఁడనియును, మూర్ఖుఁడనియునుదోచుచున్నదనిపలికి మునికులోత్తముఁడైనయామతంగమహాముని లేచి తనయాశ్రమమునందంతటను వెదకి యొకచోటఁజచ్చి భూమియందుఁబడినవాఁడును, పర్వతమువంటిశరీరముగలవాఁడునునగు దుందుభియనురాక్షసునిజూచె అంతటనామతంగమహాముని తనతపోమహిమచేత నాకార్యమునుజేసినవాఁడువాలియనిదెలిసి యాకళేబరమును జిమ్మినవాలికిగొప్పదగుశాపమును యివ్వఁదలఁచియిట్లనియె

ఇక్కడనికమీఁద నీదుష్కృత్యమునుజేసినవాలి ప్రవేశింపఁగూడదు. ఒకవేళఁబ్రవేశించినయెడల మరణమును బొందును నాయాశ్రమమునందును, నాయందును నెత్తురుబొట్లనుచల్లినవాఁడు యీవిధముగా మరణమునుబొందుటకుఁగొంచెమైనను సందేహములేదు. దుందుభియను పేరుగలరాక్షసునియొక్క యీశరీరమును విసరివేసినవాలిచేత నామడదూరమువఱకునువ్యాపించియున్న నాయాశ్రమమునందలి వృక్షములన్నియును విరిచివేయఁబడినవయ్యె. ఒకవేళదుష్టబుద్ధిగలయావాలిబుద్ధిలేక యీవనమునందుఁబ్రవేశించెనేని యవశ్యముగా మరణమునుబొందును. మఱియునతనిమంత్రులీవనమునందుఁ బ్రవేశించినను మరణమునుబొందఁగలరు. ఇంతియగాక యిఁకమీఁదట నిక్కడనతనికిసంబంధించినవానరులెవ్వరును బ్రవేశింపఁగూడదు. కావుననిక్కడనున్నవానరులందఱును నీవృత్తాంతమునువినిపోవలయుననియె. పోనియెడలవారుగూడమరణమునుబొందుదురనిచెప్పి యతిశీఘ్రముగశాపము నివ్వఁగూడ

దనితలంచిమరలసిట్లనియె.

ఈదినమే యిక్కడనున్నవానరులందఱును లేచిపోవలయును. రేపుసూర్యోదయమగు నంతలోఁబోనివానరులందఱును వేయిసంవత్సరములు రాళ్లై యుందురుగాక యనిశపించె మఱియునిట్లనిశా.

ఈవనమునుసర్వమును నేనుపుత్రునిఁ గాపాడువిధముగాఁగాపాడితిని ఈవనమునందలిపత్రములు నంకురములును, ఫలములును, మూలములును, వృద్ధిపొందునట్లుచేయుచుండఁగా నీవానరులందఱును నాశముచేయుటకుఁ బ్రయత్నమును జేయుచురు. కావుననికమీఁద నిక్కడనెవ్వరును నుండఁగూడదనిచెప్పె. అటుపిమ్మట నావానరులంగఱును మతంగమహాముని చెప్పినమాటనువిని యాయాశ్రమమునుండి బయలువెడలి వాలియొద్దకుఁబోయిరి. అంతటవాలితనయొద్దకువచ్చిన వానరులనందఱనుజూచి యిట్లనియె.

వానరోత్తములారా! మీరందఱును నిదివఱకుమతంగమహామునియొక్క యాశ్రమమునందు నివసించుచున్నారుగదా? ఇప్పుడుమీరందఱును నిక్కడకువచ్చుటకుఁ గారణమేమి? వానరులందఱును సుఖముగనున్నారుగదా? యనియడిగె. అంతటనావానరులందఱును దామువచ్చుటకుఁ గారణమును, మతంగమహాముని శాపమునిచ్చుటకుఁగారణమును నవ్వాలితోఁజెప్పిరి. సువర్ణమాలికను ధరించునట్టివాలి యావృత్తాంతమునుసర్వమునువిని యామతంగమహామునియొద్దకుబోయి చేతులనుముకుళించుకొని యనేకవిధములఁబ్రార్థించె అట్లెన్నివిధములచేతఁ బ్రార్థించినను, నమ్మహాముని వానియందుఁ గొంచెమైననుగరుణించక తనయాశ్రమమునకుఁబోయె. అంతటవాలి యాయాశ్రమములోనికిఁబోవుటకువెరచి యతనిశాపమునకు భయమునుబొందినవాఁడై యధికవ్యసనమునుబొందె రాజోత్తముఁడవైనయోరాముఁడా! అట్లుశాపమునిచ్చుటవలన నధికమైనభయముగలయావాలి మిగులగొప్పదగు ఋశ్యమూకపర్వతమునందుఁ బ్రవేశించుటయేగాక చూచుటకుఁగూడభయమునుబొందె. ఆసంగతినితెలిసికొని వాలియిక్కడకు రాఁడనితలఁచి నేనుమంత్రులతోఁగూడ దుఃఖరహితుఁడనై యీవనమునందు సంచరించుచున్నాను. పూజ్యుఁడవైనయోరాముఁడా! వాలితనయొక్క పరాక్రమాతిశయమువలనవిసరివేయఁబడినదియును, పర్వతముతోసమానమైనదియును, నగునాదుందుభియొక్క శరీరమిక్కడఁబడియున్నది. చూడుము. పూజ్యుఁడవైనయోరాముఁడా! వేలాడుచున్నకొమ్మలుగల యీమేడివృక్షముల నేడింటినిఁజూడుము. ఈమేడువృక్షములను వాలిధనుస్సునువదలి యొకబాణముచేతనే విరుగఁగొట్టుటయందుఁ దగినసామర్థ్యముగలవాఁడు రాజవైనయోరాముఁడా! వాలియొక్కనిరుపమానమైన పరాక్రమమునునీకుఁజెప్పితిని. ఇటువంటిపరాక్రమముగలవాలిని నీవేవిధముగ జయింపఁగలవోయని సుగ్రీవుఁడురామునితోఁజెప్పె. ఇవ్విధముగాఁజెప్పుచున్నసుగ్రీవునిఁజూచినవ్వుచు లక్ష్మణుఁడిట్లనియె

మిత్రుఁడా! సుగ్రీవా! రాముఁడు ఏమికార్యమును జేసినయెడల వాలినిజంపఁగలఁడనితలఁచెదవో, యావిషయమును దెలుపుమనినవిని సుగ్రీవుఁడు లక్ష్మణునితో ట్లనియె

లక్ష్మణుఁడా! పూర్వమనేకపర్యాయములు వాలయీమేడిచెట్లను గ్రమక్రమముగ భేదించె ఒకతూరిఒక్కొక్కటుగానే యీచెట్లనేడింటిని భేదించెను. కావునరాముఁడుగూడనొకబాణముచేత నొక్కపర్యాయమే యీమేడిచెట్లనేడింటిని భేదించినయెడల రామునకువాలినిజంపఁదగినపరాక్రమముగలదనితలఁచెదను. మఱియునోలక్ష్మణా! మనరాముఁడు, చచ్చిపడియున్న మహిషముయొక్క కళేబరమునునొక్కపాదముచేత నెత్తియతివేగముగానూరుబారలదూరముచిమ్మెనేని వాలినిఁజంపఁగలఁడనియె. సుగ్రీవుఁడీప్రకారముగాఁజెప్పి కొనలయందెఱుపుగల నేత్రములుగలవాఁడును, కకుత్స్థకులమునందుఁబుట్టినవాఁడును, నగురాముని నొక్కక్షణమాత్రము ధ్యానమునుచేసి మరలనిట్లనియె.

పూజ్యుఁడవైనయోరాముఁడా! శూరుఁడును, శూరులనుజంపువాఁడును, ప్రసిద్ధములగు బలపౌరుషములుగలవాఁడును, అధికమగుబలముగలవాఁడును, యుద్ధములయందుఁ బరాభవమునుబొందనివాఁడును, వానరుఁడును, నగువాలినిజయించుట దుర్లభమనితలఁచెదను. మఱియునోరాముఁడా! ఈవాలిదేవతలచేతఁగూడఁ జేయనలవికానికార్యములనుజేసినవాఁడు. అటువంటికార్యములనుజూచి నేనుమిగులభయముగలవాఁడనై యీఋశ్యమూకపర్వతమునందుఁ బ్రవేశించితిని మఱియునోరాముఁడా! ఆవాలిజయింపనలవిగానివాఁడనియును, బెదరింపశక్యముగానివాఁడనియును, చెప్పనలవిగానివాఁడనియునుదలఁచి నేనీచోటునువదలిపోయినయెడల నన్నుచంపుననితలఁచి గొప్పదగునీఋశ్యమూకపర్వతమునందుఁబ్రవేశించితిని. మఱియునోరాముఁడా! నేనువాలివలనిభయముగలవాఁడను, సందేహముగలవాఁడను,నై హనుమంతుఁడు మొదలుగాఁగల ప్రియమంత్రులతోఁగూడ నీమహావనమునందు సంచరించుచున్నాను. మిత్రులయందు వాత్సల్యముగలయోరాముఁడా! నాకుసర్వలోకములయందును గొనియాడఁదగిననీవు మిత్రుఁడవైతివి.

పురుషోత్తముఁడవైన యోరాముఁడా! హిమవంతునినాశ్ర
యించినవిధముగ నిన్నునాశ్రయించితిని. పూజ్యుఁడవైన
యోరామా! నాకుదుష్టభ్రాతయును, బలవంతుఁడును,
నగునావాలియొక్కబలమును నేనుగుర్తెఱుఁగుదును. రఘు
కులమునందుఁబుట్టిన యోరాముఁడా! యుద్ధమునందునీకె
ట్టిసామర్థ్యముగలదో దానినినేనుప్రత్యక్షముగాఁ జూచి
యుండలేదు. కావుననోరాముఁడా! నేనుపరాక్రమకా
ర్యములచే నీవువాలితోసమానుఁడవనిగాని తక్కువవాఁడ
వనిగానిచెప్పఁజాలను. మఱియు నేను సంతోషమునుగాని
భయమునుగానిపొందను. అయినప్పటికిని నాకుభయమేక
లిగియున్నది. రఘుకులోద్భవుఁడవైనయోరామా! నీమా
టలును, నీస్థిరబుద్ధియును, నీధైర్యమును, నీయాకారము
ను,కప్పఁబడినయగ్నితోసమానమైన తేజస్సునునీయందుఁగ
ప్పఁబడియున్నదని తలఁచుచున్నాను. మఱియునివియన్ని
యును నాకుమిగులధైర్యమును గలుగఁజేయుచున్నవని సు
గ్రీవుఁడు చెప్పె. ఇవ్విధముగా సుగ్రీవుడుచెప్పినమాటలను
వినిరాముఁడునవ్వుచు మహానుభావుఁడును, వానరప్రభుఁ
డునునగు నాసుగ్రీవునితో నిట్లనియె.

వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! నీకుమాపరా
క్రమునందు నమ్మకములేనియెడల యుద్ధములయందుఁగా
నియాడఁదగిన పరాక్రమమునుజూపి నమ్మకమునుబుట్టించె
దననియె. ఇవ్విధముగాసుగ్రీవునితో మంచిమాటలనుజెప్పిల
క్ష్మణునకన్నయును, రఘుకులమునందుఁ బుట్టినవాఁడును,
గొప్పదగు భుజబలముగలవాఁడునునగు నారాముఁడుదుం
దుభియొక్కశరీరమును తనకాలిబొటనవ్రేలిచేతఁ గదలిం
చిపదియామడదూరమునఁ బడునట్లుచిమ్మె. రాక్షసునియొ
క్కయెండినశరీరమును రాముఁడు తనకాలిబొటనవ్రేలితో
బదియామడదూరమునఁబడునట్లు చిమ్ముటనుజూచిపరాక్ర
మవంతుఁడగుసుగ్రీవుఁడు లక్ష్మణునకుముం దనున్న రా
మునితో నిట్లనియె.

స్నేహితుఁడవైన యోరాముఁడా! పూర్వమీదుందుభి
యొక్కశరీరము నెత్తురుచేతఁదడపఁబడినదియును, మాం
సముతోఁగూడుకొనినదియును, క్రొత్తదియును నైయుండె.
ఇటువంటిగుణములుగల శరీరమిప్పుడు చిమ్మఁబడెను. ఇ
ప్పుడీశరీరమునందలినెత్తురు మాంసము నశించిపోవుటచేత
శుష్కించితృణమువలెనున్నది. మఱియునప్పుడువాలియు
ద్ధమునుజేసి యలసినవాఁడును, మద్యపానముచేతమదించి
మైమఱచియున్నవాఁడునునై, నెత్తురుమాంసము మొదల
గువానితోఁగూడుకొనిన నీశరీరమునుచిమ్మె. అటువంటిశ
రీర మిప్పుడెండియున్నదికావున రఘుకులమునందుఁబుట్టిన
యోరామా! నీవుమిగులసంతోషముగలవాఁడవై పదియా
మడదూరమునఁ బడునట్లుచిమ్మితివి. ఇంతమాత్రముచేతనీ
బలమే యెక్కువో, యతనిబలమే యెక్కువో తెలిసికొను
టకుశక్యముగనుండలేదు. రఘుకులోద్భవుఁడవైన యోరా
ముఁడా! ఎండినశరీరమునకును, పచ్చిశరీరమునకునుమహా
భేదముకలదుగదా? కావుననేనీబలమే యెక్కువో యతని
బలమే యెక్కువో నిర్ణయించుటకువీలులేకయున్నది. మఱి
యునోరాముఁడా! నీబలముయొక్కయు, అతనిబలము
యొక్కయు తారతమ్యమును దెలిసికొనుటయందు మిగుల
సంశయముగలిగియున్నది. ఈయేపిచెట్లనేడింటిని నొక్క
బాణముచేత భేదించితివేని యప్పుడుబలాబలములను నిర్ణ
యింపఁగలను. కావునమిత్రుఁడా! రామా! ఏనుఁగుతొం
డమంతపొడవుగల యీధనుస్సునెత్తి నారినిగట్టి చెవివఱ
కునుదృఢముగాలాగి గొప్పదగుబాణమును బ్రయోగింపు
ము. అట్లుప్రయోగించి యొకబాణముచేతనే యీయేపి
చెట్లనేడింటినిఁ బడఁగొట్టినయెడల నీవుఅవశ్యముగా వాలి
నిఁజంపఁగలవనితలఁచెదను. పూజ్యుఁడవైన యోరాముఁ
డా! విశేషముగా నాలోచించుటవలనఁ బ్రయోజనమేమి?
నాయభిప్రాయమును శీఘ్రముగనెరవేర్పుము. రాజనంద
నుఁడవైన యోరాముఁడా! నాయభీష్టమును శీఘ్రముగఁదీ
ర్పనియెడల నన్నుఁజంపికొనినట్లగును. రఘుకులోత్తముఁడ
వైనయోరామచంద్రా! తేజోవంతులలోపల సూర్యుఁడు
తేజోవంతుఁడని చెప్పఁబడువిధముగాను, పర్వతములలో
పలహిమవత్పర్వత ముత్తమమైనదని చెప్పఁబడినవిధముగా
ను, మృగములలోపలసింహము సర్వోత్తమమైనదనిచెప్పఁ
బడినరీతిగాను, నీవునరులలోపల నుత్తముఁడవనియును, ప
రాక్రమవంతుఁడవనియును, తేజోవంతుఁడవనియును నేను
దెలిసికొంటినని సుగ్రీవుఁడుచెప్పె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదునొకండ
వసర్గముగిసెను.

సుగ్రీవుడువాలితో మొదటితూరియుద్ధము జేయుట.

ఇవ్విధముగా సుగ్రీవుఁడుచెప్పినమంచిమాటనువిని య
ధికమగు తేజస్సుగలరాముఁడు సుగ్రీవునకు నమ్మకముగ
లుగుటకొఱకుఁ గార్ముకమునుచేఁబట్టుకొనియె. మాన
మునిచ్చునట్టిరాముఁడు అప్రకారము ధనుస్సునుగ్రహించి
దానియందొక్కబాణమును బెట్టి దిక్కులుబద్దలగునట్లు ధ
నుష్టంకారమునుజేయుచు నేపిచెట్టునొక్కదానిను ద్దేశించి
బాణముగు బ్రయోగించె. బలవంతుఁడగురాముని చేత వి

డిచిపెట్టఁబడినదియును, బంగారముచేత నలంకరింపఁబడినదియును, నగునాబాణమొక్కటియే యేపిచెట్లనేడింటిని భేదించి భూమియందుఁబ్రవేశించె. అట్లుప్రవేశించినదై క్షణమాత్రములోపల భూమిని భేదించి యధికమైనవేగముగల యాబాణమమిగులశీఘ్రముగవచ్చి రామునియంబులపొదియందుఁబ్రవేశించె. అట్లొకబాణముచేతనే, అనాయాసముగ నేపిచెట్లనుఏడింటినిభేదించడమునుజూచి వానరోత్తముఁడగు సుగ్రీవుఁడుఆబాణవేగమునకుఁ బరమాశ్చర్యమునుబొందె. పిమ్మట నాసుగ్రీవుఁడువ్రేలాడుచున్న భూషణములుగలవాఁడగుచు శిరస్సువంచుకొని చేతులనుముకుళించుకొని పరమానందముతో రామునకునమస్కారమును జేయుటకొఱకు భూమియందుఁబడియె. మఱియు రాముఁడుచేసినయాపనిచేతఁ బరమానందమును బొందినసుగ్రీవుఁడు, ధర్మములను దెలిసినవాఁడును, అస్త్రశస్త్రవిద్యలను దెలిసినవారలలోనుత్తముఁడును, శూరుఁడును, నగు రామునితోనిట్లనియె.

పురుషోత్తముఁడవును, ప్రభుఁడవునునైనయోరామా! నీవుయుద్ధమునందునీబాణములచేత దేవేంద్రుఁడుమొదలుగాఁగలదేవతలనందఱను జయింపఁగలవు. ఇట్టిసామర్థ్యముగలనీవువాలినిజంపుదువని చెప్పవలయునా? కకుత్థ్సునివంశమునందుఁ బుట్టినయోరాముఁడా! నీవుఒకబాణముచేతనే యేపిచెట్లనేడింటిని ఛేదించిభూమినిగూడ బ్రద్దలుసేసితివి. ఇట్టిమహిమగలనీయెదుటనిల్చియెవ్వఁడు యుద్ధమునుజేయఁగలఁడు? పూజ్యుఁడవగునోరాముఁడా! దేవేన్ద్రునితోడను వరుణదేవునితోడనుసమానుఁడవగు నీయట్టిస్నేహితుని సంపాదించుకొనుటచేత నాదుఃఖమంతయునుబోయినదనితలఁచెదను. మఱియు నాకధికమైనప్రీతిగలిగియున్నది. కకుత్థ్సునివంశమునందుఁబుట్టిన యోరాముఁడా! నీకుఁజేతులనుముకుళించుకొని నమస్కారమునుజేసి ప్రార్థించుచున్నాను కావుననాకుఁ బ్రియమునుజేయుటకునాకన్నయును, పరమశత్రుత్వముగలవాఁడునునగువాలినిఇప్పుడేచంపుము ఇట్లుసేసితివేని నాయభీష్టమునెరవేరునని సుగ్రీవుఁడురామునితోఁజెప్పె అంతట బుద్ధిమంతులలోనుత్తముఁడగు రాముఁడుచూచుటకు మిగులనిష్టుఁడగు సుగ్రీవుని నాలింగనమును జేసికొని లక్ష్మణునియనుమతమునుబొందియిట్లనియె

మిత్రుఁడా! సుగ్రీవుఁడా! మనమిక్కడనుండి కిష్కింధాపట్టణమునకుఁబోవుదము. కావునముందుగ నీవునడువుము. మేము వెనుకవచ్చెదము. వచ్చియాగొప్పదగు వనమునందలిచెట్లచాటున మేము నివసించియుండెదము. నీవుముందుగాఁబోయి తమ్మునకునాశమునుగల్పింపఁదలఁచిన దుర్మార్గుఁడును, వానరుఁడును, నీకన్నయునునగు వాలిని యుద్ధమునకుఁబిలువుమనియె. అంతట నారామసుగ్రీవుడు మొదలగువారందఱును వాలియొక్కపట్టణమగు కిష్కింధానగరమునకుఁబోయిరి. అప్పుడురాముఁడు ఆగొప్పవనమునందుదాగియుండె. అంతటసుగ్రీవుఁడు వాలినిఁ బిలువఁదలఁచి మిగులభయంకరముగఁగూతలుపెట్టె. మఱియునాసుగ్రీవుఁడువస్త్రముచేత నడుమునుబంధించి యాకాశముబ్రద్దలగునట్లరచె అట్లరచుచున్నవాఁడును, తనకుఁదమ్ముఁడునునగు సుగ్రీవునియొక్కధ్వనినివిని యధికముగుకోపముగలవాఁడును, మహాబలుఁడునునగు వాలిచక్కగాయుద్ధసన్నద్ధుఁడై "ఉదయపర్వతమునుండి సూర్యుఁడుబయలుదేరినవిధముగ,, బయలువెడలె. అంతటనావాలిసుగ్రీవులకు మిగులసంకులమగుయుద్ధమయ్యె ఆయుద్ధముఆకాశమునందలి బుధాంగారకులయుద్ధమువలెనుండె మఱియునన్నదమ్ములగు వాలిసుగ్రీవులిద్దఱును, నధికమగుకోపముగలవారై వజ్రాయుధముతోసమానములగు హస్తములయొక్కయు, పాదములయొక్కయు, ప్రదేశములచేతను, పిడుగులవంటిపిడికిటిపోటులచేతను, ఒకరినొకరుమిగులభయంకరముగాఁగొట్టుకొనిరి. అంతటధనుస్సునుజేతియందుఁబెట్టుకొనినరాముడు రూపలావణ్యాదులచేతఁబరస్పరమునుసమానులును, అశ్వినీదేవతలతోసమానులును, నగునావాలిసుగ్రీవులనుజూచె. అప్పుడురఘుకులోద్భవుఁడగు రాముఁడయ్యిరువురిలోవాలియెవ్వఁడో, సుగ్రీవుఁడెవ్వఁడో, నిర్ణయింపశక్తిలేనివాఁడయ్యె. అందువలననాశమునుజేయునట్టిబాణమును బ్రయోగించుటకు భయపడియూరకుండె. మఱియునువాలియెవ్వఁడో, సుగ్రీవుఁడెవ్వఁడో, యనియాలోచించుచుండె ఇంతలోపల వాలిచేత సుగ్రీవుఁడుభంగపరుపఁబడినవాఁడై తనకురక్షకుఁడై వచ్చినరామునిఎందునుజూడనివాఁడగుచు మరలబుశ్యమూకపర్వతమునకుఁబరుగెత్తె. మఱియు నాసుగ్రీవుఁడుయుద్ధమునుజేసి యలసినవాఁడును, నెత్తురుచేతఁదడపఁబడినశరీరముగలవాఁడును, దెబ్బలచేత గాయములుపడినశరీరముగలవాఁడును, అధికకోపముగలవాలిచేతఁదరుమఁబడినవాఁడును, నైమిగులగొప్పదగు వనమునందుఁబ్రవేశించె. అట్లుసుగ్రీవుఁడు ప్రవేశించినవనమునుదాఁచి గొప్పదగుతేజస్సుగలవాలి, శాపభయముచేతఁ బీడింపఁబడినవాఁడై, యోరీసుగ్రీవుఁడా! నిన్నువిడిచిపెట్టితినిపోరా, యనిచెప్పి తిరిగిపోయె. అంతఁగొంతసేపటికిరాముఁడుతమ్ముఁడగులక్ష్మణుఁడును, హనుమంతుఁడును వెంటరా

గా సుగ్రీవుఁడున్నచోటునకువచ్చె. అట్లులక్ష్మణునితోఁ గూడఁదనయొద్దకువచ్చిన రామునిఁజూచి సుగ్రీవుఁడుసిగ్గు చేతఁదలనువంచుకొనియతిదీనముగానిట్లనియె.

పూజ్యుఁడవైనశ్రీరాముఁడా! వాలినియుద్ధమునకుఁ బిలువుమనినాతోఁజెప్పితివి. ముందుగా నీపరాక్రమమును జూపించితివి నమ్మకమునుబుట్టించితివి. పిమ్మటవైరియగు వాలిచేతఁగొట్టించితివి. తుదకేమియుజేయకయూరకుంటివి. రఘుకులోద్భవుఁడవైనయోరామచంద్రా! వాలినిజంపుమని నేనుజేతులనుముకుళించుకొని ప్రార్థించినసమయమునందే, నేనువాలినిజంపనని చెప్పినయెడల నేనిక్కడనుండియుద్ధమునకుబోనుగదా?యనియె అస్వేధముగా దీనస్వరముతో మాటలాడుచున్నవాఁడును, మహానుభావుఁడునునగు సుగ్రీవునియొక్కమాటలనువినిరఘుకులోద్భవుఁడగురాముఁడిట్లనియె.

నాయనా! సుగ్రీవుఁడా! నామాటనువినుము కోపమునువదలిపెట్టుము. నేనుఏమికారణముచేత వాలియందుబాణమును బ్రయోగించలేదో యావిషయమును జెప్పెదను వినుము మిత్రుఁడా! సుగ్రీవుఁడా! అలంకారముచేతను, వేగముచేతను, ప్రమాణముచేతను, నడకచేతను, నీవునువాలియునుసమముగనున్నారు. కాఁబట్టిమీయిరువురిలోనీవెవరో, వాలియెవరో, తెలిసికొనలేకపోతిని. మఱియునువానరుఁడవైనయోసుగ్రీవుఁడా! స్వరము, వర్చస్సు, చూపు, పరాక్రమము, మొదలగునవియన్నియును, నీకునువాలికిని సమముగానుండుటచేత నిన్నునేనుగుర్తింపలేకపోతిని కాబట్టివానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! నాకుభ్రాంతి గలిగెను. కావున నేఁబ్రయోగించుటచేతనే నాశమునుజేయునట్టిదియును, అధికమైనవేగముగలదియునునగు బాణమునుబ్రయోగింపక యూరకుంటిని. మఱియునుబ్రాణాపహారమునుజేయునట్టిదియును, భయంకరమైనదియును, నగుబాణమును బ్రయోగించుటకుసందేహించితిని. నేనుబాణమునుబ్రయోగించితినేని మనమిరువురికార్యములును సమూలముగ నాశమునుబొందును. నేనుదెలియకబాణమునుబ్రయోగించితినేని వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! నాయవివేకమును, మౌర్ఖ్యమును, పసితనమును, బయలుపడును, అదియునుఁగాక నీకభయమునిచ్చితిని. ఇట్టినిన్నుఁజంపుటచేత మహాపాపముగలుగునుగదా? మిత్రుఁడా! సుగ్రీవుఁడా! నేనును, లక్ష్మణుఁడును, సీతయును, నీయధీనమైయున్నాము మాకీవనమునందు నీవేరక్షకుఁడవు. కావున,వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! నీవుమరలఁబోయి యుద్ధమునుజేయుము. సందేహమును బొందకుము. ఈముహూర్తమునందే వాలినియుద్ధమునందుఁజంపెదను ఒక్కబాణమును బ్రయోగించితినేనివాలి మరణమునుబొందునని యెన్నుము. వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! నాకానవాలునివ్వుము. నీవునాకుగుర్తును జెప్పినయెడలనేనునిన్నుద్వంద్వయుద్ధమునందు గుర్తించివాలినిజంపెదనని చెప్పిలక్ష్మణునితోనిట్లనియె

తమ్ముఁడా! లక్ష్మణా! శుభలక్షణములుగలదియును, వికసించినదియును, నగునీగజపుష్పములను మాలికనుగాఁజేసిమహానుభావుఁడగు సుగ్రీవునియొక్కకంఠమునందు వేయుమనిచెప్పె. అంతటలక్ష్మణుఁడు ఆపర్వతమునందుమొలిచినదియును, పుష్పములచేతవ్యాప్తమైనదియును, నగు గజపుష్పమాలికను సుగ్రీవునియొక్క కంఠమునందుంచె. అట్లులక్ష్మణునిచేతఁ గంఠమునందుంచఁబడినదియగు నా పూలమాలికలచేత సుగ్రీవుఁడుఆకాశమునందు నక్షత్రమాలికచేత సూర్యుఁడుప్రకాశించినవిధముగాఁ బ్రకాశించె. మఱియునాసుగ్రీవుఁడు రామవాక్యముచేత నధికముగాసంతోషించినవాఁడై బెగ్గురుపక్షులయొక్క మాలికచేత మేఘుఁడుప్రకాశించినవిధముగా నాపూలమాలికచేతఁబ్రకాశించె. అంతటనాసుగ్రీవుఁడు రామునితోఁగూడ వాలిచేతఁబాలింపఁబడుచున్న కిష్కింధాపట్టణమునకుఁబోయెను.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదిరెండవసర్గముగిసెను.

సుగ్రీవుడు రెండవతూరి వాలితోయుద్ధమునుజేయుటకు పోవుట.

అంతట లక్ష్మణునకన్నయును, ధర్మాత్ముఁడును, నగు రాముఁడు ఋశ్యమూకపర్వతమునుండిబయలువెడలి వాలియొక్కపరాక్రమముచేతఁబరిపాలింపఁబడిన కిష్కింధాపట్టణమునకు సుగ్రీవునితోఁగూడ బయలువెడలిపోయె. మఱియునారాముఁడు బంగారముచేత నలంకరింపఁబడినదియును, గొప్పదియునునగు ధనుస్సును గ్రహించియుండె. మఱియును సూర్యునితో సమానములైనవియును, యుద్ధమునకు సాధనములైనవియునునగు బాణములనుగూడగ్రహించె. మహానుభావుఁడును, రఘుకులోద్భవుఁడును, నగురామునియొక్కముందర నిబిడీకృతమైన కంఠముగలసుగ్రీవుఁడును, మహాబలుఁడగులక్ష్మణుఁడు నడుచుచుండిరి. వారియొక్క పృష్ఠభాగమునందు వీరుఁడగుహనుమంతుఁడును, నలుఁడును, నీలుఁడును, వానరులయొక్కగుంపునకధిపతియును, మిగులగొప్పదగు తేజస్సుగలవాఁడును,

కారుఁడును ననువాఁడునునడిచిరి. అంతటవారందఱును పుష్పభారముచేత వంగినవృక్షములను, నిర్మలములగునుదకములుగలవియును, సముద్రమునుగుఱించి పోవుచున్నవియును, నగునదులను, పర్వతములయందలిగుహలను, పర్వతములను, బ్రద్దలయినపర్వతప్రదేశములను, పర్వతపుచరియలను, ముఖ్యములగుశిఖరములను, మిగులమనోహరములగుదరీప్రదేశములను, వైడూర్యములవలె నిర్మలములగుపర్ణములచేతను, వికసించినపద్మకోశములచేతను, పద్మములచేతను, మార్గమునందుఁబ్రకాశించుచున్నవియును, సంపూర్ణముగానిండిన యుదకముగలవియునునగు తటాకములనుజూచుచుఁబోయిరి. మఱియును మార్గమధ్యయందు, కన్నెలేడి పిట్టలయొక్కయు, బెగ్గురుపక్షుల యొక్కయు, హంసలయొక్కయు, నీరుకోళ్ళయొక్కయు, చక్రవాకపుపక్షులయొక్కయు, ఇతరములగుపక్షులయొక్కయు, కూతలచేతఁబ్రతిధ్వనులుగలవై చేయఁబడిన మఱికొన్నితటాకములు మొదలగువాటినిఁజూచిరి. మఱియును లేతగడ్డియే యాహారముగాఁగలవియును, నిర్భయముగావనమునందు సంచరించుచున్నవియును, సర్వస్థలములయందును దిరుగుచున్నవియును నగులేళ్ళనుగూడఁజూచిరి. మఱియును, చెరువులయందు విరోధముగలవియును, తెల్లనిదంతములచేతఁబ్రకాశించుచున్నవియును, చెరువులయొక్కయొడ్డులను బొడుచుచున్నవియును, మిగులభయంకరములయినవియును, వనములయందుఁబుట్టినవియును, నగునేనుగులనుగూడఁజూచిరి. మఱియునయ్యేనుఁగులుమదించినవై జంగమములగు పర్వతములవలెఁ బ్రకాశించుచుండె ఇంతియగాక భూమియందలిపరాగమును మీఁదికిఁజిమ్ముచు మేఘములను బోలియుండె. మఱియునారామలక్ష్మణాదులందఱును సుగ్రీవునియొక్కవశమునందుఁ బ్రవర్తించుచున్నవారై యావనమునందు సంచరించుచున్నవియును, పూర్వోక్తములగు జంతువులకంటె నితరములైనవియునునగు సింహముమొదలగుమృగములను, గండభేరుండముమొదలగు పక్షులనుజూచుచునతిశీఘ్రముగనడచిరి. అవ్విధముగానందఱును నొక్కటిగాఁజేరి యావనమునందు నడుచుచున్నసమయమునందు రఘుకులమునకు సంతోషమును గలుగఁజేయునట్టి రాముఁడు వృక్షములయొక్కగుంపుగల వనమునుజూచిసుగ్రీవునితో నిట్లనియె.

మిత్రుఁడా! సుగ్రీవా! ఈవృక్షములు మిక్కిలినల్లగానున్నదై యాకాశమునందుమేఘము ప్రకాశించినవిధముగాఁ బ్రకాశించుచున్నది. మఱియును మేఘసముదాయమువలె విపులముగానున్నది. ఇంతియగాక యీవృక్షములయొక్క గుంపునకుఁజుట్టును నరటిచెట్లువ్యాపించియున్నవి. మిత్రుఁ సుగ్రీవా! ఈవృక్షములగుంపుయొక్క వృత్తాంతమునుదెలిసికొనవలయునని యభిలాషగలిగియున్నది. ఈయభిలాషను నీవలనఁదెలిసికొనవలయునని తలఁచుచున్నాను కావుననాకోరికను దీర్పుమనియె. మహానుభావుఁడును, రఘుకులమునందుఁ బుట్టినవాఁడునునగు, రామునియొక్క వచనమునువిని సుగ్రీవుఁడునడచుచునే, యాగొప్ప వనముయొక్కసంగతిని జెప్పఁదలఁచియిట్లనియె.

రఘుకులోద్భవుఁడవైన యోరాముఁడా! మిగులవిశాలమైనదియును, మార్గస్థులుమొదలగువారలయొక్క శ్రమనుబోఁగొట్టునదియును, ఉద్యానవనముయొక్క సంపదవంటిసంపదగలదియును, తియ్యనిఫలములును, వేళ్లును, మంచిజలమునుగలదియునునగు నీయాశ్రమముయొక్క వృత్తాంతమునుజెప్పెదను. వినుము. రఘుకులోద్భవుఁడవైన యోరాముఁడా! ఇక్కడసప్తజనులనియెడు పేరుగలమునీశ్వరులేడ్వురు తపోవ్రతము నవలంబించినవారును, కాళ్లు మీదికిని, తలనుక్రిందికినిబెట్టుకొని తపస్సునుజేయుచున్నవారును, నుదకమునందు శయనించినవారును, నైనియమముగఁదపస్సునుజేయుచుండిరి మఱియునామునీశ్వరులు సర్వకాలములయందును వనమునందేనివసించువారును, ఏడేసిదినముల కొక్కొక్కపర్యాయముగాలిని భక్షణనుజేయుచున్నవారును, యేడునూరులసంవత్సరములు ఘోరమగు తపస్సునుజేసి కళేబరములతోఁగూడ స్వర్గలోకమునకుఁ బోయిరి వృక్షములనియెడు ప్రాకారముచేతఁ జుట్టఁబడెనయీయాశ్రమము ఆమునివరులునివసించినది. దీనియందుఁ దేవేన్ద్రుఁడు మొదలుగాఁగల దేవతలును, రాక్షసులును, బ్రవేశించుటకు భయపడుదురు. మఱియునీవనమునందుఁ పక్షులు, మృగములు మొదలగునవికూడఁ బ్రవేశించుటకు భయపడును అవివేకముచేత ఏజంతువైనను దీనియందుఁ బ్రవేశించినయెడల మరణమునుబొందును. రఘుకులోద్భవుఁడవైనయోరాముఁడా! ఈయాశ్రమమునందాభరణములయొక్కధ్వనులును, నానావిధములగు విషయములను బోధించునట్టి యక్షరములును వినఁబడుచున్నవి. చక్కగా వినుము. మఱియును మంగళవాద్యములయొక్క ధ్వనులువినఁబడుచున్నవి. దివ్యమైనపరిమళమువచ్చుచున్నది మఱియునీయాశ్రమమునందు గార్హపత్యము, ఆహవనీయము, దక్షిణాగ్ని, అనుమూఁడునుప్రకాశించుచున్నవి ఆయగ్నులవలనఁబుట్టి పొగచక్కగాఁగనఁబడున్నది ఆహా, చెట్లకొమ్మలయందుఁ పావురపుపిట్టలయొక్క కంఠములందలికాంతివంటికాంతిగల మేఘమువలె ప్రకాశించుచున్నది. మఱి

యానీవృక్షములయొక్క చివరలయందుఁ బాగయధికముగావ్యాపించుచుండుటచేత నీవృక్షములన్నియును, మేఘములచేతవ్యాప్తమైన వైడూర్యపుకొండలవలెఁ బ్రకాశించుచున్నవి చూడుము. రఘుకులోత్తముఁడవును, ధర్మాత్ముఁడవును, నీవునీతమ్ముఁడగు లక్ష్మణునితోఁగూడ చేతులనుముకుళించుకొని యీవనమునుద్దేశించి నమస్కారమును జేయుము. రఘుకులోద్భవుఁడవైనయోరాముఁడా! మహానుభావులగు నామునివరులనుద్దేశించి యీవృక్షములకెవ్వరునమస్కారమును జేయుదురో యట్టివారలకుఁగొంచెమైననమంగళముగలుగదు. సకలశుభములునుగలుగును. అని చెప్పె. అంతటనారాముఁడు లక్ష్మణునితోఁగూడఁ జేతులనుముకుళించుకొని యామహర్షులనందఱను ఉద్దేశించినమస్కారమునుజేసె. మఱియును ధర్మాత్ముఁడగురాముఁడును, రామునితమ్ముఁడగులక్ష్మణుఁడును, సుగ్రీవుఁడును, హనుమంతుఁడు మొదలగువానరులును, నామునులనుద్దేశించి నమస్కారమునుజేసి పరమానందభరితులై పోవుచుండిరి. అంతటవారందఱును, నాసప్తజనాశ్రమమునుండిమిగులదూరముపోయి శత్రువులచేతఁ బ్రవేశింపనలవిగానిదియును, వాలిచేతఁబాలింపఁబడినదియును, నగుకిష్కింధాపట్టణమునుజూచిరి. పిమ్మటరామలక్ష్మణసుగ్రీవహనుమంతుఁడు మొదలగువారు మిగులనధికమగు తేజస్సుగలవారై భయంకరములగు శస్త్రములనుగ్రహించి దేవేంద్రునికుమారుఁడగు వాలిచేతఁబాలింపఁబడుచున్న కిష్కింధాపట్టణమునకు వాలివధకొఱకుఁ బోయిరి.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదమూడవ సర్గముగిసెను.

వాలిభార్యయగు తారవాలిని యుద్ధమునకుబోవలదని చెప్పుట.

అంతటవారందఱును, మిగులశీఘ్రముగా వాలిచేతఁబరిపాలింపఁబడిన కిష్కింధాపట్టణమునకుఁ బోయిరి అట్లుపోయినపిమ్మట నొక్కవనమునందలి వృక్షములచాటుననందఱునుగూర్చుండిరి. అంతటవిపులమైన కంఠముగలవాఁడును, వనమునందిష్టముగలవాఁడును, నగుసుగ్రీవుఁడువనమునందంతటను జక్కఁగఁ బరిశీలించిచూచి యధికమగుకోపముతోనరచె. అవ్విధముగాఁ బెద్దకూతనువేసి యుద్ధమునకురమ్మనివాలినిఁ బిలిచె. మఱియు నాసుగ్రీవుఁడుతనపరివారముతోఁ గూడుకొనినవాఁడై యాకాశము బ్రద్దలగునట్లు కూయుచుండె. మఱియునువాయువేగముచేత నటునిటు పరుగెత్తుచున్న మేఘమువలెనధికముగఁ గూతలనుబెట్టుచుండె. అటుపిమ్మట బాలసూర్యునియొక్క దేహకాంతితోసమానమైన దేహకాంతిగలవాఁడును, మదించినసింహమువలె నడచువాఁడునునగు నాసుగ్రీవుఁడు సకలకార్యములయందునుసమర్థుఁడగు రామునిఁజూచియిట్లనియె.

పరాక్రమవంతుఁడవైన యోరాముఁడా! వానరులనియెడుపాశములచేత వ్యాప్తమైనదియును, పుటముపెట్టఁబడినబంగారముచేత నిర్మింపఁబడిన తోరణములుగలదియును, ధ్వజములతోడను, యంత్రములతోడను గూడుకొన్నదియును, వాలిచేతఁ బాలింపఁబడుచున్నదియును నగుకిష్కింధాపట్టణముదగ్గరకు మనమువచ్చితిమి. పరాక్రమవంతుఁడవైనయోరాముఁడా! పూర్వమునందే నీవువాలిని జంపెదనని ప్రతిజ్ఞనుజేసితివిగదా? అట్టిప్రతిజ్ఞను, "సరియగుకాలములతీగెలను సఫలములనుగాఁ జేయువిధముగ" సఫలములనుగాఁజేయుము. ఇవ్విధముగా సుగ్రీవుఁడుచెప్పినమాటలనువిని రఘుకులోద్భవుఁడును, ధర్మాత్ముఁడును, శత్రువులను నశింపఁజేయుటయందుఁ దగినసామర్థ్యముగలవాఁడును, నగురాముఁడు సుగ్రీవునిజూచి యిట్లనియె.

వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! లక్ష్మణునిచేత నీకంఠమునందు గజపుష్పమాలికనువేసి నలంకరింపఁజేసితిని. దానిచేతనిన్నుఁ దెలిసికొనుటకుఁ దగినగుర్తులభించె. కంఠమునందున్న యీపుష్పమాలికచేతనీవు, "రాత్రియందునక్షత్రమాలచేతఁ జంద్రుఁడు ప్రకాశించుచున్నవిధముగ" బ్రకాశించుచున్నావు. పరాక్రమవంతుఁడవైనయోసుగ్రీవుఁడా! మీరిరువురును ద్వంద్వయుద్ధమును జేయుచున్న సమయమునందు నేనొక్కబాణమునుబ్రయోగించి నీకువాలివలనఁబుట్టినభయమును, వాలియందలివైరమును నిప్పుడేపోఁగొట్టెదను. వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! నీకన్నయును, శత్రువుఁడునునగువాలినిఁజూపుము. చూపినతోడనే నాబాణముచేతఁజంపి యీవనమునందలి దుమ్మునందుఁబడిపొరలునట్లుచేసెదను. మిత్రుఁడా!సుగ్రీవా! వాలినాకంటికిఁగనఁబడినపిమ్మట బ్రదుకఁజాలఁడు. అటుపిమ్మట నాయందుదోషముఁగలుగనేరదు. నీవుపిమ్మట నన్నునిందించుటకవకాశముండదు. సుగ్రీవుఁడా! నేనొక్కబాణముచేతనే యేడుచెట్లనేడింటినిగొట్టితినిగదా? దానిచేత నేవాలిని నేనుముఖ్యముగాఁజంపఁగలనని తెలిసికొనుము. మిత్రుఁడా! సుగ్రీవా! నేనువీరకార్యమునందుండియుదివఱకెన్నఁడునునబద్ధమునాడియుండలేదు. నేనుధర్మలోభముగలవాఁడనై యేమాటనుజెప్పువాఁడనుగాను. నేనుప్రతిజ్ఞనుసఫలమైనదానినిగాఁజేయుదును. ఏమియునుభయము

నుఁబొందకుము. "దేవేంద్రుఁడు వర్షముచేత భూమినిండునట్లు చేయువిధముగ,, నేను నాబాణముచేత నీకోరికను ఫలింపఁజేసెదను. కావున నోసుగ్రీవుఁడా! బంగారపుఁబూలమాలికను ధరించినవాలినిఁ బిలుచుటకుఁ గారణమైన కూతను వేయుము. ఆకూతను వినినతోడనే వాలి బెదరి క్రిందఁబడవలయును. సుగ్రీవుఁడా! యుద్ధమునందుఁ బ్రియముగలయావాలి యుద్ధములయందు శత్రువులను జయించి యధికముగఁ బ్రకాశించుచున్నవాఁడును, బలముచేతఁ గొనియాడఁబడినవాఁడును నగుటచేతఁ బూర్వమునందు నిచేత జయింపనలవిగానివాఁడయ్యె. వానరోత్తముఁడవైనయోసుగ్రీవుఁడా! శూరులగువారు యుద్ధమునందు శత్రువులయొక్క పరాక్రమమును సహింపరు. అట్టివీరులు స్త్రీలసన్నిధియందు మందమపరాక్రమమును బొగడుకొనుచున్న సమయమునందు శత్రువులపరాక్రమమును గొంచెమైనను సహింపరు కావున నీవిప్పుడు యుద్ధమునకు వాలిని బిలువుమనియె. ఇవ్విధముగా రాముఁడు చెప్పినమాటను విని బంగారమువలెఁ బచ్చనివర్ణముగల సుగ్రీవుఁడు మిగులఁగ్రూరమగుధ్వనిచేత నాకాశము బ్రద్దలగునట్లు కూత వేసె. ఆధ్వనిని వినిగోవులన్నియును భయమును బొందినవగుటచేత వెలవెలబోవుచున్నముఖకాంతిగలవై "రాజులు లేకపోవుటచేతఁ జారులబాధను బడలేక మిగుల దిగులుగలకులస్త్రీలవలెఁ,, బరుగెత్తినవయ్యె మఱియు నాసమయమునందు ఆవనమునందలి మృగములన్నియును "యుద్ధమునందుఁ గాళ్లు విరిగినగుఱ్ఱములు పరుగెత్తఁజాలనివిధముగఁ" బరుగెత్తఁజాలనివయ్యె. మఱియు నందలిపక్షులన్నియును "పుణ్యము నశించినపిమ్మట నాకాశమునుండి గ్రహములు జారిపడినవిధముగఁ,, జెట్లమీదనుండి క్రిందఁబడె. అంతట నూరకుండక పిమ్మట కూడ మిగులఁ బ్రసిద్ధుఁడును, పరాక్రమముచేత వృద్ధినిబొందిన తేజస్సు గలవాఁడును మేఘధ్వనివంటిధ్వనిగలవాఁడును, సూర్యునికుమారుఁడును, నగుసుగ్రీవుఁడు "వాయువుచేత నధికముగాఁ గదల్పఁబడిన సముద్రమునివలె" భయంకరముగా ధ్వని చేసె

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదునాల్గవసర్గము ముగిసెను.

వాలిభార్యయగు తార వాలిని యుద్ధమునకుబోవలదని ప్రార్థించుట

పిమ్మట వాలి, మహానుభావుఁడును, దనకుఁ దమ్ముఁడును, నగుసుగ్రీవునియొక్క కూతను నంతఃపురమునందుండి విని యధికమైన కోపముగలవాఁడయ్యె. సకలభూతములకు భయముఁ బుట్టించునట్టి యామహాధ్వనిని వినినతోడనే వాలియొక్క మదము నశించె. మఱియు నధికమైనకోపముగల వాఁడయ్యె అంతనవ్వాలి కోపముచేత వ్యాప్తమైనశరీరముగలవాఁడును, సంధ్యాకాలమునందలి యెండవంటిదేహకాంతిగలవాఁడునునై రాహుగ్రస్తుఁడైనసూర్యునివలెఁ దేజోరహితుఁడయ్యె. మఱియును, కోరపన్నులచేత భయంకరుఁడును, కోపముగలవాఁడగుటచేత మండుచున్న "యగ్నివలె" నున్నవాఁడును, నగునవ్వాలి యేనుఁగులచేతఁ బెరికివేయఁబడినపద్మములయొక్క కాంతిగలదియును, తామరతూడులతోఁ గూడుకొనినదియును, నగుమడుగువలెఁ గొంచెమైనను బ్రకాశింపకుండె. మఱియు నాధ్వనిని వినినతోడనే యావాలి తనయడుగులచేత భూమిబ్రద్దలగునట్లు నడుచుచు నెగిరిపడెను. అట్లు మహాకోపముతో యుద్ధమునకు బయలువెడలినవాలిని కౌఁగలించుకొని స్నేహముచేతఁ జూపఁబడిన స్నేహధర్మములుగల తారయనుపేరుగలవాలియొక్క భార్య భయముచేతఁ దొట్రుపాటుగలదగుచు వాలికిహితవచనములను జెప్పఁదలఁచి యిట్లనియె.

వానరోత్తముఁడవైనయోవాలీ! "నదీవేగమువలె" మిగులశీఘ్రముగవచ్చిన యీకోపమును, "రాత్రికాలము నిద్రనువదలినతోడనే యదివఱకనుభవింపఁబడిన పూలమాలిక విడిచిపెట్టినవిధముగ" పెట్టుము. వానరోత్తముఁడవైనయోవాలీ! తెల్లవారినపిమ్మట నీవుపోయి యుద్ధమును జేయుము. వీరుఁడవైనయోవాలీ! నీకు గొంచెమైనను శత్రువులబలాబలములను గురించి భయము లేదు. నీవు మహాబలముగలవాఁడవు. కావున నేకాలాకాలములను విచారింపనివాఁడవైతివి. అయినప్పటికిని నీవు మిగులశీఘ్రముగా యుద్ధమునకుఁబోవుట యుచితమని నాకుఁదోచలేదు. నేనెందుకొఱకు నిన్నుఁబోవద్దని చెప్పుచున్నానో యావిషయమును దెలిపెదను. వినుము ఇంతకుముందు యీసుగ్రీవుఁడు యుద్ధమునకుఁగా నక్కడకు వచ్చి నిన్ను యుద్ధమునకుఁ బిలిచి నీచేతఁ గొట్టఁబడినవాఁడై భయముచేతఁ బరుగెత్తుకొనిపోయెను. అట్లు నీచేత నధికముగా బాధింపఁబడిన సుగ్రీవుఁడు మరల శీఘ్రముగా నేయిక్కడకు వచ్చి యుద్ధమునకుఁ బిలుచుటచేత నా మనస్సునందధికముగా సందేహముగలుగుచున్నది. ఈసమయమునందుఁ గూతను వేయుచున్నసుగ్రీవునకు యీకూతకుఁదగినగర్వము, ప్రయత్నమును గలిగియున్నదని తోచుచున్నది. మఱియు నీవిధముగాఁ గూయుటచేత నీతమ్ముఁడగుసుగ్రీవుఁడు స్వల్పకారణముచేత నిక్కడకు రాలేదనియును, నధికమైనహేతువుచేత నిక్కడకు వచ్చెననియును దోచుచున్నది. మఱియు నోప్రాణనాథా! సుగ్రీవుఁడు తగినస

హాయము లేక యిక్కడకు వచ్చినవాఁడు గాఁడు. అధికమైన సహాయము గలవాఁడై వచ్చి మహాభయము గలుగునట్లు కూయుచున్నాఁడు గాని మఱియొకటి గాదు. అదియును గాక సుగ్రీవుఁడు సహజముగా బహుబుద్ధిమంతుఁడు అంతయే గాక సకలకార్యములయందును నధికమైన నేర్పుగలవాఁడు కావున స్నేహితుని యొక్క పరాక్రమాదిగుణమును బరీక్షించక యిక్కడకు వచ్చియుండఁడు ఈవిషయము నిదివఱకే నేను వినియున్నాను. ఆవిషయమును సర్వమును సంపూర్ణముగఁ జెప్పెదను. సావధానుఁడవై వినుము. పూర్వమునం దొకపర్యాయము అంగదుఁడీవిషయమును సంపూర్ణముగఁ దెలిపెను. ఆమాటలు వినుము. అవి నీకు హితమును గోరి చెప్పుచున్నాను. పూర్వ మొకతూరి మనకుమారుఁడగు నంగదుఁడు వేటకొఱకు నడవికిఁ బోయెను. అట్లు పోయి యచ్చట నాప్తులగు దూతలచేత వినినదానిని నాకుఁ జెప్పెను. ఆ వృత్తాంతమును సావధానుఁడవై వినుము. ఇక్ష్వాకువంశమునందుఁ బుట్టినవారలును, అయోధ్యాధిపతియగు దశరథమహారాజునకుఁ బుత్రులును, వీరులును, యుద్ధములయందు శత్రువులచేత జయింపనలవిగానివారును, మిగులఁ బ్రసిద్ధులును, నగు రామలక్ష్మణులను వారిరువు రన్నదమ్ములు గలరు. శత్రువులచేత జయింపనలవిగాని యాయిద్దఱును సుగ్రీవునకుఁ బ్రియమును జేయఁదలఁచి స్నేహితులైరి. మఱియు నయ్యిరువురిలో యుద్ధములయందు మిక్కిలి కీర్తి నొందగు రాముఁడు నీతమ్ముఁడగు సుగ్రీవునకు సహాయుఁడై యున్నాఁడు. ఆరామునితమ్ముఁడగు లక్ష్మణుఁడును నట్టివాఁడే యనుటకు సందేహము లేదు. శత్రువుల బలమును సర్వమును నశింపఁజేయునట్టి యారాముఁడు "ప్రళయకాలాగ్నితో సమానుఁడై" యుదయించినవాఁడు మఱియు నతఁడు వృక్షములయందు నివసించుచున్నాఁడు. అతఁడు సాధువులును దీనులును నగు వారలకు పరమగతియై యున్నాఁడు. వ్యసనమును బొందుచున్న వారల కాధారుఁడై యట్టివారల వ్యసనమును బోఁగొట్టుచుండును అధికములగు జ్ఞానవిజ్ఞానములు గలవాఁడు ఇంతియ గాక తండ్రియొక్క యాజ్ఞను పరిపాలించుటకు అరణ్యమునకు వచ్చినవాఁడు. "సకలధాతువులకును గొండ, పుట్టినయిల్లైన విధముగ" నా రాముఁడు సకలగుణములకును బుట్టినయిల్లువలె నున్నవాఁడు. కావున మహానుభావుఁడగు రామునితో విరోధమును బెట్టికొనకుము. నీవు విరోధమును వదలిపెట్టుము. మఱియును రాముఁడు యుద్ధకర్మలయందుఁ బరులచేత జయింపనలవిగానివాఁడనియును, అపరిమితమగు పరాక్రమము గలవాఁడనియును దెలిసికొనుము. శూరుఁడవైనయో వానరనాయకుఁడా! నీహితమును గోరి నేను జెప్పుచున్నాను. కాఁబట్టి నీవు నాయందుఁ గోపమును బెట్టికొనకుము. నావచనమును వినినపిమ్మట నీ కిది యిష్టమో దానిని జేయుము. సుగ్రీవుని బిలిచికొనివచ్చి యతిశీఘ్రముగ యావరాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిగాఁ జేయుము. వానరరాజవైనయో వాలీ! బలవంతుఁడును, తమ్ముఁడును నగు సుగ్రీవునితో యుద్ధమును జేయకుము. నీవు పోయి యారామునితో స్నేహమును జేయుట నాకు యుచితమని తోచుచున్నది. సుగ్రీవునితోఁ బ్రియముగా నుండుము. విరోధమును దూరముగాఁ బెట్టివేయుము. (అనఁగా విరోధమును విడిచిపెట్టుము) నీకుఁ దమ్ముఁడును, వానరుఁడును నైన సుగ్రీవుని నీవు లాలనను జేయుము. సుగ్రీవుఁడు అరణ్యమునం దుండినను, ఇక్కడ నున్నను, సర్వాత్మనా నీకుఁ బంధువే గాని పగవాఁడు గాఁడు. నీకు సుగ్రీవునితో సమానుఁడగు బంధువీ భూమియందెవ్వఁడును లేఁడు. కావున నతనికిఁ గావలసిన వస్తువుల నిచ్చియును, తగిన సత్కారములను జేసియును, నీకు సమానునిగాఁ జేయుము. వైరమును వదలిపెట్టి సుగ్రీవుని నీ ప్రక్కనుండుకొనుము. విశాలమయిన కంఠము గల సుగ్రీవుఁడు నీకు సర్వకాలములయందును బ్రియమయిన బంధువే గాని పగవాఁడు గాఁడు. నీవు నాకుఁ బ్రియమును జేయువాఁడవును, నేను హితురాలనని తలఁచినవాఁడవును నైన యెడల నాచేత నధికముగా యాచింపఁబడుచున్న నీవు నామాటలచొప్పునఁ జేయుము. నాయందనుగ్రహము గలవాఁడవగుము. నామాటలను వినుము. నామీఁదఁ గోపమును బొందుటకు నీవు తగినవాఁడవు గావు. దేవేంద్రుని తేజస్సుతో సమానమయిన తేజస్సు గలవాఁడును, ఉత్తరకోసలరాజగు దశరథమహారాజునకుఁ బుత్రుఁడును నగు రామునితో నీవు యుద్ధమును జేయుట యుచితముగా నుండ లేదనియె. మఱియు నివ్విధముగా హితములును, పథ్యములును నగు వచనములను నాతార యనేకవిధములఁ బలికె. అప్పుడు "మృత్యుదేవత సమీపించియుండుటచేత" నావాలికి ఆమాటలు యిష్టముగా నుండకపోయె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదునైదవసర్గము ముగిసెను.

శ్రీరామునియొక్క బాణముచే వాలి క్రిందబడుట.

అంతట నావాలి, యివ్విధముగా మాటలాడుచున్నదియును, పూర్ణచంద్రునితో సమానమయిన మోముగలదియును నగు తారను బెదరించి యిట్లనియె.

మిగుల సొగసైన మోముగలయో తారా! అవ్విధముగా

మహాటోపముతోఁ గూతలనబెట్టుచున్నవాఁడును, తమ్ముఁడును, శత్రువుఁడును, నగుసుగ్రీవునియొక్క సంరంభమును నేనువినియెట్లూరకుందును మఱియు నోప్రియురాలా! "శ్లో॥ అధర్షితానాంశూరాణాం సమరేష్వనివర్తినామ్। ధర్షణామర్షణంభీరు మరణాదతిరిచ్యతే,, శత్రువుచేతనెన్నడను నవమానమునుబొందనివాఁడును, యుద్ధములయందువెనుకకుఁదిరుగనివాఁడును, వీరుఁడునునగువానికిశత్రువులవలన బుద్ధిపూర్వకముగ నవమానమునుబొందుటకంటె మరణమునుబొందుటయుచితముగదా? యుద్ధమును జేయఁదలచినవాఁడును, స్వల్పమైన కంఠధ్వనిగలవాఁడును, మిక్కిలియాటోపముతోఁ గూయుచున్నవాఁడునునగుసుగ్రీవుఁడువచ్చి యుద్ధమునకురమ్మని గర్వముతోఁబిలుచుచుండఁగానేనుబలహీనునివలె నెవ్విధముగానూరకుందును. మఱియు నేనువానినెట్లుసహింపఁగలను. ఓసీప్రియురాలా! నాకుసుగ్రీవునివలననపకారముగలుగునని నీవువిచారమునుబొందకుము. దశరథమహారాజునకుఁ బుత్రుఁడగు రాముఁడుసకలధర్మములనుదెలిసినవాఁడు. ఇంతియగాక యుక్తాయుక్తములనుదెలిసినవాఁడు. మఱియును జేయఁదగినపనియేదియోచేయఁదగనిపని యెదియో తెలిసినవాఁడు. అట్టిమహానుభావుఁడు పాపమునెట్లుచేయఁగలఁడు. చేయఁడు. కావుననీవుస్త్రీలతోఁగూడ నంతఃపురములోనికిఁబొమ్ము. నాతోఁగూడనిఁకమీదటరావద్దు ఓ ప్రియురాలా! నీకునాయందుఁగలస్నేహమునుదాఁపితివి నీకునాయందు భక్తియుండుటనుగార్యముచేతఁ దెలిపితివి. కాఁబట్టి నీకునాయందుస్నేహమును భక్తియునుగలదని యెఱుఁగుదును. నీవుపొమ్ము. నేనుబోయి సుగ్రీవునితో యుద్ధమును జేయఁగలను. కావుననీవు తొందరపడకుము. నేనుసుగ్రీవునిగర్వమునుమాత్రముపోఁగొట్టెదనుగాని వానినిజంపను. నేనుయుద్ధమునకుఁబోయి సుగ్రీవునికోరికతీరునట్లుయుద్ధమును జేయుదును అతఁడునావిడికిటిపోటులచేతను, నేనుగొట్టెడుచెట్లదెబ్బలచేతను, పీడింపఁబడినిలువలేకపరుగెత్తును. దురాత్ముఁడైన యాసుగ్రీవుఁడునాగర్వమును, నాప్రయత్నమును సహించుకొనఁజాలఁడు. ప్రియురాలవైనయో తారా! నీవునాకుసహాయమును జేసితివి. మఱియునునీకునాయందుఁగలప్రేమనుఁజూపితివి కావుననంతఃపురములోనికిఁబొమ్ము. అట్లునీవుశోకపోతివేని "నన్నుఁజంపినట్లగునని" ఒట్టునుబెట్టెదను. కావుననాకుజయముగలుగునట్టుల నాశీర్వచనమును జేసి లోనికిఁబొమ్ము. నేనునాకుఁదోఁడఁబుట్టువును, శత్రువుఁడును, నగుసుగ్రీవునియుద్ధమునందు జయించివచ్చెదను. కావుననీవుభయమునుబొందకపొమ్మనియె. అంతట నాతారయేమియును జెప్పఁజాలక ప్రియముగమాటలాడుచున్నదై యావాలినినాలింగనమును జేసికొనియె. అట్లుకౌఁగలించుకొనియును నేడ్చుచున్నదియును, దాక్షిణ్యముగలదియునునగుచు వాలికిఁబ్రదక్షిణనమస్కారమును జేసె. పిమ్మటఁ బెనిమిటికిజయమునుగోరుచున్నదై పెనిమిటికిమంగళమును గలిగించు నట్టిమంత్రములను జెప్పుచు నాశీర్వచనమును జేసె. అంతట శోకమోహముగల యాతారస్త్రీలతోఁగూడ నంతఃపురములోనికిఁబోయె. అట్లుతారస్త్రీలతోఁ గూడ నంతఃపురములోనికిఁబోఁగానే "అధికమైనకోపముగల పామువలె" బుసకొట్టుచు నావాలిపట్టణములోనుండి బయలువెడలిపోయె. పిమ్మటమహాతేజస్సుగలవాఁడును, అధికమైనకోపముగలవాఁడునునగు వాలినిట్టూర్పులనువిడిచి శత్రువుఁడగుసుగ్రీవుఁడెక్కడనున్నదియును జూడవలయునని యెడుకోరికగలవాఁడై నలుదిక్కులనుబరికించిచూచె. అంతఁ గొంతసేపటికిఁ గాశకోకనుగట్టుకొన్నవాఁడును, బంగారముతో సమానమైనదేహకాంతిగలవాఁడును, యుద్ధమునకుసన్నద్ధుఁడైయున్నవాఁడును, అధికముగాఁ బ్రకాశించుచున్నవాఁడును, నగుసుగ్రీవునిశ్రీమంతుఁడగువాలిచూచె. మఱియునావాలిమిగులదృఢముగా యుద్ధసన్నద్ధుఁడైయున్నవాఁడును, గొప్పదగు పరాక్రమముగలవాఁడును, నగుసుగ్రీవునిజూచియధికమైనకోపముగలవాఁడై తానుగూడ, కాశకోకనుదృఢముగానడుమునకుఁగట్టె. అట్లుదృఢముగాఁ గాశకోకనుగట్టుకొనినవాఁడును, యుద్ధమును జేయుటయందు మిగులసంతోషముగలవాఁడును, మిగులగొప్పదగు పరాక్రమముగలవాఁడునునగు వాలిపిడికిలినిబట్టియుద్ధమును జేయుటకొఱకు సుగ్రీవున కభిముఖముగాఁబోయె. అట్లువచ్చినవాఁడును, బంగారుపుపూలమాలికనువేసికొనివాఁడును, నగువాలినిజూచిసుగ్రీవుఁడుగూడ దృఢముగాబిడికిలినిబట్టి యావాలికెదురుగానడిచె. అట్లు యుద్ధసన్నద్ధుఁడైవచ్చుచున్నవాఁడును, యుద్ధమునందుఁ బండితుఁడును, మహావేగముతో వచ్చుచున్నవాఁడునునగు సుగ్రీవునిఁజూచి యావాలికోపముచేత నెఱ్ఱఁగాఁ జేయఁబడిననేత్రములుగలవాఁడైయిట్లనియె.

ఓరీసుగ్రీవుఁడా! నేనుదృఢముగా గుప్పిలినిబట్టియున్నాను. కావుననిదిమిగులదృఢముగానున్నది. కాఁబట్టియీపిడికిలి నీప్రాణములనపహరించిపోఁగలదనియె. ఈప్రకారముగావాలిచెప్పినమాటనువిని సుగ్రీవుఁడుమిగులఁగోపముగలవాఁడైయిట్లనియె.

ఓరీవాలీ! యీగుప్పిలినీప్రాణములనేయపహరించుచుం

న్నదగుదునీనెత్తియందుఁబడుగాక" యనియె. అంతటవాలిమహాకోపముగలవాఁడై మహావేగముతోవచ్చి తనపిడికిలితోనొకపోటుపొడిచె. అప్పుడాసుగ్రీవుఁడు కారుచున్ననెత్తురుతోఁగూడుకొన్నవాఁడై కొండకాలువలతోఁగూడుకొనినపర్వతము క్రిందఁబడినవిధముగాఁ గ్రిందఁబడియె. అంతటఁగొంతసేపటికిలేచి యాసుగ్రీవుఁడొక్కమేపిచెట్టును పెరికి దేవేన్ద్రుఁడు వజ్రాయుధముతోఁ బర్వతమునుగొట్టినవిధముగ నామేపిచేతవాలినిఁగొట్టె. ఆమేపిచెట్టుయొక్కదెబ్బవలన భయముచేత మిగులఁగాలుష్యమునుబొందినవాఁడై "అధికమైన భారముతోఁగూడినయోడ సముద్రమునందుఁగాలిచేత నిటునటు చలించినవిధముగఁ" జలించె. మఱియునంతటభయంకరమైనబలమును, పరాక్రమమును, గలవారును, గరుత్మంతునియొక్కవేగమువంటివేగముగలవారును, భయంకరమైన శరీరముగలవారును, నగునావాలిసుగ్రీవులిద్దఱునునంతరిక్షమునందు సూర్యచంద్రులుప్రకాశించినవిధముగాఁ బ్రకాశించిరి. మఱియు నయ్యిరువురును ఒకనినొకఁడు జయింపవలయుననియెడు కోరికగలవారును, పరస్పరఛిద్రములను వెదకుచున్నవారునునై మిగులభయంకరమగు యుద్ధమునుజేసిరి. పిమ్మట నధికమగు బలముతోడనుపరాక్రమముతోడను గూర్చున్నవాలియధికమగు పరాక్రమముగలవాఁడయ్యె. సూర్యునికుమారుఁడును, మిగులగొప్పదగు పరాక్రమముగలవాఁడునునగు సుగ్రీవునిపరాక్రమమంతకంతకుఁ దగ్గిపోవుచుండె. మఱియునునాసుగ్రీవుఁడువాలిచేత భంగపఱుపఁబడినపరాక్రమాహంకారములుగలవాఁడును, మిగులస్వల్పమైనవీర్యముగలవాఁడునునయ్యె. అంతఁగొంతసేపటికి మరలఁబూనికఁదెచ్చుకొని యాసుగ్రీవుఁడు మిగులఁగోపముగలవాఁడైతనయుద్ధకౌశలమునుజూపె. అంతటనయ్యిరువురును, చెట్లచేతను, చెట్లకొమ్మలచేతను, వజ్రాయుధముయొక్కమొనలవలె మిగులఁదీక్ష్ణములగు మొనలుగలగోళ్ళచేతను, పిడికిళ్ళచేతను, మోకాళ్ళచేతను, పాదములచేతను, బాహువులచేతను, గొట్టికొనుచుమిగులభయంకరమగుయుద్ధమునుజేసిరి. ఆసమయమునందాయుద్ధమయుద్ధము "వృత్రాసురునియొక్కయు, దేవేన్ద్రునియొక్కయు యుద్ధమునుబోలియుండె", మఱియునువనములయందుసంచరించునట్టియావాలిసుగ్రీవులిద్దఱును నెత్తురుచేతఁదడపఁబడినశరీరములుగలవారైగొప్పవగుమేఘములవలెధ్వనిజేయుచుఒకరినొకరు జయింపవలయుననియెడు కోరికతోనధికమగుయుద్ధమునుజేసిరి. అంతఁగొంతసేపటికి క్షీణించిస్వపరాక్రమముగలవాఁడు. యుద్ధమును సేయఁజాలకదిక్కులనుజూచుచున్నవాఁడును, నగుసుగ్రీవుని రాముఁడుమాటిమాటికినిజూచుచుండె. పిమ్మటగొప్పదగు తేజస్సుగలయారాముఁడు మిగులవ్యసనమునుబొందినసుగ్రీవునిఁజూచివాలినిజంపఁదలఁచివాలినిజంపుటయందుఁ దగినసామర్థ్యముగలబాణమునులక్షించిచూచె. పిమ్మట "నాగుపాములతోసమానమైన" బాణమునుధనుస్సునందుఁబెట్టి యాధనుస్సును, యముఁడుకాలచక్రమును బూరించువిధముగఁ బూరించె. ఆసమయమునందాధనుస్సుయొక్క నారియొక్కదెబ్బవలనఁ గలిగినధ్వనిచేత నుత్తమములగుపక్షులును, మృగములును, భయపడినవై ప్రళయకాలమునందు మోహమునుబొందినవిధముగామోహమునుజెంది యేమియునుదోచకపరుగెత్తె. మఱియునురామునిచేత విడిచిపెట్టఁబడినదియును, పిడుగుయొక్కధ్వనివంటిధ్వనిగలదియును, మిగులధగద్ధగాయమానముగఁ బ్రకాశించెడుపిడుగుతోసమానమైనదియును, నగుబాణము వాలియొక్కరొమ్మునందుఁబడియె. అటుపిమ్మటగొప్పదగుతేజస్సుగలవాఁడును, పరాక్రమముచేతగొప్పవాఁడును, వానరులకధిపతియును, నగువాలియాబాణముయొక్కవేగముచేతఁ గొట్టఁబడినవాఁడైభూమియందుఁబడియె. మఱియునావాలి "ఆశ్వయుజమాసమునందలి పున్నమయందు దేవేన్ద్రునిధ్వజమువలె" శోభారహితుఁడును, నిశ్చేష్టితుఁడునునైక్రిందఁబడియె. (గౌడదేశమునందాశ్వయుజమాసమునందు దేవేన్ద్రధ్వజమునుబూజించి పున్నమనాడు క్రిందఁబడవేయుటవాడుకనైయున్నది. కాఁబట్టియిట్టి యుపమానము చెప్పఁబడినదనితెలియఁగవలయును) మఱియును మానవోత్తముఁడగు రాముఁడు, ప్రళయకాలమునందలి యముని తోసమానమైనదియును, బంగారముచేత నలంకరింపఁబడినదియును, శత్రువులనువశింపఁజేయునట్టిసామర్థ్యముగలదియును, సర్వోత్తమమయినదియును, నగుబాణమును, ప్రళయకాలమునందుఁబరమేశ్వరుఁడు తననోటనుండిపొగతోఁగూడుకొనినయగ్నిజ్వాలమునువిడిచిపెట్టినవిధముగవిడిచిపెట్టె. అంతటనెత్తురుచేతఁదడపఁబడినశరీరముగలవాఁడును, గాలిచేతఁగదల్పఁబడినదియును, జక్కగాఁ బుష్పించినదియునునగు నశోకవృక్షమును బోలినవాఁడును, నగునావాలినిశ్చేష్టితుఁడై యుద్ధమునందు దేవేన్ద్రునియొక్క ధ్వజము క్రిందఁబడినవిధముగఁ గ్రిందఁబడియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదునారవసర్గము ముగిసెను.

వాలిరామునినిందించుట.

అట్లురామునియొక్క, బాణముచేతఁ గొట్టఁబడినవాఁడును, యుద్ధమునందు మిక్కిలినేర్పరితనముగలవాఁడునైన యావాలినరకఁబడినవృక్షము క్రిందఁబడినవిధముగఁ గ్రిందబడియె. మఱియునావాలిభూమియందుఁ బడవేయఁబడిన శరీరముగలవాఁడును, పుటమువేయఁబడిన బంగారముచేతఁ జేయఁబడిన యాభరణములచేత నలంకరింపబడినవాఁడును, నైత్రాడుతెగిక్రిందఁబడిన యింద్రధ్వజమువలెఁ గ్రిందఁబడియె ఆసమయమునందు వానరులగుంపునకధిపతియగు వాలిక్రిందఁబడఁగానే చంద్రుఁడులేని యాకాశమువలె భూమియంతయును తేజోరహితమైనదయ్యె. మహానుభావుఁడగు నావాలిక్రిందఁబడినప్పటికిని నతనిశరీరమునందలి కాంతితగ్గకయుండె. మఱియు శరీరములోనుండి ప్రాణములును వెడలిపోయె. అతనితేజస్సును, పరాక్రమమునుగూడఁ బోకనిలిచియుండె. ఆసమయమునందావాలియొక్క ప్రాణములను,దేహకాంతిని దేవేన్ద్రునిచేతనివ్వఁబడినదియును, సువర్ణమయమైనదియును, వజ్రములచేతనలంకరింపబడినదియును, సర్వోత్తమమైనదియును,నగుమాలికనుధరించియుండుటచే ఆబంగారపుమాలికచేత వానరాధిపతియగు వాలిసంధ్యారాగముచేత నెఱ్ఱనైనపర్వతమువలె ప్రకాశించుచుండె. మఱియు నాసమయమునందుఁ గ్రిందఁబడియున్న వాలియొక్కదేహమును, బంగారపుపూలమాలికను, మర్మస్థానములను భేదించునట్టిబాణమును బరిశీలించి చూచువారలకు తేజోరూపమైనలక్ష్మి మూఁడువిధములగు నాకారములను ధరించివచ్చినది కాఁబోలుననియెడు తలంపుగలుగుచుండె. ఆసమయమునందు రామునిధనుస్సునుండి విడిచిపెట్టఁబడినదియును, వీరుండగువాలికి స్వర్గమార్గమును జూపించునట్టిదియును, నగునాబాణమువాలికి నుత్తమలోకగతిని గలుగఁజేసెను మఱియునాసమయమునందు, తన్నుఒక్కబాణముచేతఁ గొట్టినరామునిబహుసమర్థుఁడని శ్లాఘించివీరుఁడగు రామునిమెల్లగాఁజూచుచున్నవాఁడును, యుద్ధమునందుఁ బడియున్నవాఁడును, మంటలేనినిప్పువలె నున్నవాడును, పుణ్యమంతయును నశించిపోయినపిమ్మట దేవలోకమునుండి క్రిందఁబడిన యయాతివలె నున్నవాఁడును, దేవేన్ద్రునివలె ధర్షించుటకును, సహించుటకును నలవిగానివాఁడును, దేవేన్ద్రునకుఁబుత్రుఁడును, క్రిందఁబడియున్నవాఁడును, బంగారపుపూల మాలికనుధరించి యున్నవాఁడును, సింహముయొక్క రొమ్మువలెవిశాలమైన రొమ్ముగలవాఁడును, గొప్పవగుభుజములుగలవాఁడును, మిగులనధికముగాఁ బ్రకాశించుచున్నమోముగలవాఁడును, పచ్చనినేత్రములుగలవాఁడును, నగువాలినిరాముఁడు లక్ష్మణునితోఁగూడఁజూచె. చూచినపిమ్మట నావాలియొక్క సమీపమునకువచ్చె. అట్లుసమీపమునకు వచ్చినవారును, మహాబలవంతులును నగురామలక్ష్మణులనుజూచి యావాలిమిగుల వినయముగలవాఁడై ధర్మయుక్తమైనదియును, మిగులఁగఠినమైనదియును నగుమాటను జెప్పఁదలఁచి యిట్లనియె.

పురుషోత్తముఁడా! రాజగుదశరథమహారాజునకుఁ బుత్రుఁడవును, మిగులఁబ్రసిద్ధుఁడవును, చూచుటకుమిగులసుందరముగ నున్నవాఁడును, మంచికులమునందుఁ బుట్టినవాఁడవును, మిగులగొప్పదగు బలముతోఁగూడుకొనినవాఁడవును, తేజోవంతుడవును, శ్రేష్ఠములగువ్రతములుగలవాఁడవును, నగునీవు, మఱియొకనితోయుద్ధమును జేయుచున్ననన్నుఁజంపి, ఏమిగొప్పదనమునుబొందితివి. రాముఁడా! నేనుమఱియొకనితో యుద్ధమును జేయుచున్న సమయమునందు నీవుబాణమును బ్రయోగించినాఱొమ్మను బ్రద్దలు సేసితివి. పురుషోత్తమా! రాముఁడవగు నీవుసకలభూతములయందు దయగలవాఁడవనియును, ప్రజలకుమేలును జేయుట యందిష్టముగలవాఁడవనియును, పశ్చాత్తాపముగలవాఁడవనియును, నిర్నిమిత్తముగ నుత్సాహముగలవాఁడవుగాని వాఁడవనియును, సకలాచారములను దెలిసినవాఁడవనియును, దృఢముగావ్రతముల నాచరించువాఁడవనియును, సకలభూతములును నిన్నుఁబొగడుచుండును అంతయగాక నీవుసర్వోత్తమమగు కీర్తిగలవాఁడవనియును నెల్లభూతములును జెప్పుచుండును. రాజవైనయోరాముఁడా! ఇంద్రియనిగ్రహము, శాంతి,ఓర్పు, ధర్మము,ధైర్యము, సత్యము, పరాక్రమము, తప్పునుజేసినవారలను దండించుటయునునవి రాజులయొక్కగుణములని పెద్దలుచెప్పుదురు అట్టిగుణములన్నింటిని నేనువినియుండుటచేత నీవుసత్కులమునందుఁ బుట్టినవాఁడవగుటచేత నిరపరాధులను దండింపవనితెలిసికొని నాభార్యయగు తారయెంతగాఁజెప్పినను వినకసుగ్రీవునితో యుద్ధమునుజేయుటకు వచ్చితిని అదియంతయు నటుండనిమ్ము. ఇతరునితోయుద్ధమును జేయుచున్నవాఁడను, యుద్ధమునందు శరీరమునుమఱచి యున్నవాఁడనునగు నన్నుఁజంపుటయును, నాతోయుద్ధమును జేయుటయును, నీకుఁదగదనినిన్నుఁ జూడకమునుపు నామనస్సునందుఁ దోఁచుచుండె. మఱియునిప్పుడునిన్నుఁజూడఁగా నామనస్సునకువిపరీతముగాఁ దోఁచుచున్నది. సకలగుణములును గలవాఁడురాముఁడని యిదివఱకు

వినియుంటినిగాని యిట్టివాఁడనివిని యుండలేదు. పురుషోత్తముఁడా! నీయట్టిమహానుభావుఁడు రహస్యముగా దాగియుండుననియును, డంబమునకుధర్మచిహ్నములను ధరించుననియును, (అనఁగాఁజూచుటకు మాత్రముధర్మాత్మునివలె సంచరించుననియును) పాపకృత్యములను జేయుననియును, "గడ్డికప్పినబావివలె" జనులకుఁగపటవ్యాపారములతో నిండియుండుననియును నాకుఁదోఁచియుండలేదు. నీవు చూచుటకుమాత్రము సత్పురుషులయొక్క వేషమును మాత్రముధరించి పాపకృత్యములను జేయుచు "పొట్టుచేతఁ గప్పఁబడినయగ్నివలె" సంచరించుచు నీవుధర్మమునఁగసంచరించెదనని చెప్పుచుఁ గపటముగా సంచరించుదువని నేనుదలఁపలేదు. అదియునుఁగాక పురుషోత్తముఁడవైన యోరాముఁడా! నేను నీదేశమునకుఁగాని నీపట్టణమునకుఁగాని యేవిధమైన యపకారమును జేసియుండలేదు. నీవు ఏమినిమిత్తముగఁ బాపమును జేయని నన్నుఁజంపితివో తెలియలేదు. నేను సర్వకాలములయందును ఫలమూలాదులను భుజించుచు వనములయందు సంచరించుచున్నవానరుఁడ మఱియునో రాముఁడా! మఱియొకనితోయుద్ధమును జేయుచున్నవాఁడను, నీతోయుద్ధమునకురానివాఁడను, నన్నెందుకుఁగాఁ జంపితివో తెలిసినదిగాదు. రాజోత్తముఁడవైన యోరాముఁడా! నీయందుధర్మాత్ముల యందుండఁదగినగుర్తులుమాత్రము కనఁబడుచున్నవి. పురుషోత్తముఁడా! రామా! క్షత్రియకులమునందుఁ బుట్టినవాఁడును, సకలవిద్యలను జదివినవాఁడును, ధర్మసందేహములు లేనివాఁడును, ధర్మాత్ములగుర్తులను ధరించినవాఁడును, నగు నే రాజోత్తముఁడిటువంటి పాపమును జేయునో నే నెఱుఁగను. ఓరాముఁడా! రాజకులమునందుఁబుట్టినవాఁడవును, ధర్మవంతుఁడవని సకలలోకములయందును బ్రసిద్ధినొందినవాఁడవును, మంగళకరమగు నాకారముచేతఁ గ్రూరుఁడవని యెంచుటకుఁగూడ వీలుగానివాఁడవును, నగునీవు ఏమినిమిత్తముగ నీతిదప్పినకార్యమును జేసితివో, తెలిసినదిగాదు. అదియునుఁగాక నీవీవిధముగ నెందుకుసంచరించుచున్నావో, యదియును తెలిసినదిగాదు. మఱియునో రాముఁడా "శ్లో॥ సామదానం క్షమాధర్మః సత్యం ధృతిపరాక్రమౌ। పార్థివానాంగుణా రాజన్ దండశ్చాప్యపరాధిషు" సామము, దానము, ఓర్పు, ధర్మము, సత్యము, ధైర్యము, పరాక్రమము, తప్పును జేసినవారలనుదండించుట, యనునవి రాజులయొక్క గుణములుగదా? ఇట్టిగుణములు, నీయందుగలిగియుండవలయునుగదా? పూజ్యుఁడవైనయో రాముఁడా! మేముకందమూలఫలములనుదినుచు నరణ్యమునందుసంచరించునట్టి మృగములము. ఇది మాస్వభావము. నీవన్ననో రాజేంద్రుఁడవు. ఇట్టినీవు నన్ను నిష్కారణముగఁజంపుటకుఁ గారణమేమో, తెలిసినదిగాదు. మఱియునో రాముఁడా! "శ్లో॥ భూమిర్హిరణ్యం రూప్యంచ విగ్రహే కారణానిచ" భూమియు, బంగారము, వెండి, అనునవిగదా యుద్ధమును జేయుటకుఁ గారణములు. అటువంటివిమాయందేమియును లేవే? ఇఁక నుఏమినిమిత్తముగ నన్నుఁజంపితివి. మేముసంచరించుచున్న వనమునందలి ఫలములయందుఁగాని లేక మాయందుఁగాని, నీకెందుకాశగలిగెను, ఇదియేమిలోభము. మఱియునో రాముఁడా! "శ్లో॥ నయశ్చవినయశ్చోభౌ నిగ్రహానుగ్రహావపి। రాజవృత్తిరసంకీర్ణా న నృపాః కామవృత్తయః" నీతి, వినయము, నిగ్రహము, అనుగ్రహము, అనునవిమంచివాఁడగు రాజుయొక్కధర్మములు, నీతిలేనికార్యములను జేయుట, వినయములేకయుండుట, శత్రువులనునిగ్రహింపలేకపోవుట, సాధుజనులను, గాపాడలేకపోవుట, అనుగ్రహముగలిగినపుడు తగినమేలును జేయలేకపోవుట, యనునవిదుష్టరాజుయొక్కధర్మములు. కావునరాజధర్మము దుర్గుణములతోఁ గలిసియుండఁగూడదు. మఱియును రాజులున్యాయమునువదలి యిష్టానుసారముగ సంచరించుటయును నుచితముగాదుగదా? ఈధర్మములన్నియును దెలిసిననీవుగూడనిట్టి యకార్యమును జేయవచ్చునా? రాముఁడా! నీవుసర్వలోకములయందును దూష్యమైనస్వేచ్ఛా వ్యాపారము గలవాఁడవును, మిగులఁగోపముగలవాఁడవును, తగినమర్యాదలనువదలి సంచరించువాఁడవును, శ్రేష్ఠులగురాజులయొక్క నడవడికలనువదలినవాఁడవును, ధనుస్సునుబట్టుటయందాశ గలవాఁడవునునైతివి. రాముఁడా! నీకుధర్మయుతముగ సంచరించుటయందుశ్రద్ధలేదు. న్యాయముగ ద్రవ్యమును సంపాదించుటయందు బుద్ధియును లేదు. మానవపతివైన యోరాముఁడా! నీవుమూఢునివలెనింద్రియములకుఁదృప్తినిగలిగించుటయందాశ గలవాఁడవై నీయిష్టానుసారముగఁబ్రవర్తించుచున్నావు. కకుత్స్థకులమునందుఁ బుట్టినయోరాముఁడా! నిరపరాధినగునన్నుఁ జంపితివిగదా? ఇటువంటినీవుసత్పురుషులయొక్క మధ్యయందుదూష్యమైనకార్యమును జేసితినని యెట్లుచెప్పఁగలవు.

మఱియు నోరాముఁడా! "శ్లో॥ రాజహా బ్రహ్మహా గోఘ్నశ్చోరః ప్రాణివధేరతః। నాస్తికః పరివేత్తాచ సర్వే నిరయగామినః॥ సూచకశ్చ కదర్యశ్చ మిత్రఘ్నో గురుతల్పగః। లోకం పాపాత్మనామేతే గచ్ఛంతే నాత్రసంశయః,, రాజునుజంపువాఁడును, బ్రహ్మనుజంపువాఁడును, గోవునుజంపువాఁడును, దొంగతనమును జేయువాఁడును,

బ్రాహ్మణులను జంపుట యందాశగలవాఁడును, నాస్తికుఁడును, అన్నకుఁ బెండ్లిని జేయక తానువివాహమును జేసికొనినవాఁడును నరకలోకమునుబొందుదురు. మఱియు నోరాముఁడా! తప్పుపనిని జేయుమని చెప్పినవాఁడును, లుబ్ధుఁడును, మిత్రులను జంపువాఁడును, గురుభార్యనుబొందువాఁడును, పాపాత్ములు పొందునట్టిలోకములను బొందుదురు. ఇందు కేమియును సందేహములేదు. రాముఁడా! సత్పురుషులును, ధర్మముగ సంచరించువారును, నగనీయట్టిమహానుభావులు వానరులమగు మాయొక్క చర్మమును దాకరు. మఱియుమా యెముకలను వస్త్రములు మొదలగు వానికుపయోగించుకొనరు. మాయెముకలను "ఏనుగు దంతములు మొదలగు వానినుపయోగించుకొను విధముగ" ఉపయోగించుకొనరు. మామాంసములను భక్షింపరు. మఱియు నోరాముఁడా! అయిదుగోళ్ళుగల జంతువులలో బ్రాహ్మణులచేతను, క్షత్రియులచేతను, దినఁదగినజంతువులు, ముండ్లపంది, ఉడుము, కుందేలు, తాబేలు, అను నైదేయని పెద్దలుచెప్పుదురు. రాజవైన యోరాముఁడా! విద్వాంసులు మాచర్మమును దాకరు. మామాంసమును భుజింపరు. కావున నెందుకును బనికిరాని మమ్ముల నెందుకుఁ జంపితివో, తెలిసినదిగాదు. రాముఁడా! నేను వచ్చునపుడు నాభార్యయగు తార పోవద్దనియనేకవిధముల నాతోఁ జెప్పె. ఆమాటలన్నియును సత్యములుగానే కనఁబడుచుండెను, అయినప్పటికిని నేను గాలముసరిపోవుటచేత తారయొక్క మాటలను వినకవచ్చితిని. కకుత్స్థునికులమునందుఁ బుట్టినయోరాముఁడా! "సద్గుణములుగల యాఁడుది దుర్మార్గుఁడగు భర్తచేత దిక్కులేక సంచరింపవలసివచ్చిన విధముగాఁ" బ్రభుఁడవైననీచేత నీభూమియంతయును దిక్కులేనిదయ్యె. రాముఁడా! గూఢముగా నపకారమును జేయువాఁడవును, పరులకపకారమును జేసి జీవించువాఁడవును, నీచకార్యములను జేయువాఁడవును, లోకులుచూచుటకుమాత్రము శాంతునివలె సంచరించుచు మనస్సులోఁ గ్రూరతలంపుగలవాఁడవును, పాపాత్ముఁడవును, నగునీవు మహానుభావుఁడగు దశరథమహారాజునకుఁ బుత్రుఁడవై యెట్లుబుట్టితివి. రాముఁడా! లోకవిరుద్ధమైన నడవడిక యనియెడునడుమునకుగట్టెడు త్రాడుగలదియును, సత్పురుషులాచరింపఁదగిన ధర్మములనియెడు మర్యాద నతిక్రమించినదియును, ధర్మమనియెడునంకుశముచేత హీనమైనదియునునగు నీవనేయేనుఁగుచేత నిర్నిమిత్తముగాఁ జంపఁబడితిని. మఱియునో రాముఁడా! అమంగళకరమైనదియును, అనుచితమైనదియును, సత్పురుషులచేతనిందింపఁదగినదియును, నగునిట్టుపంటి అకార్యమును జేసిన నీవు సత్పురుషులతోఁ జేరి మాట్లాడునపు డేమని చెప్పఁగలవు? పురుషోత్తముఁడవైన యోరాముఁడా! ఏమియు నపకారమును జేయక యూరకయున్నమాయందు నీపరాక్రమమును జూపితివి. ఇట్లుచూపుటను జూడఁగా నీకపకారమును జేసినవారిలయందు నీపరాక్రమమును జూపఁజాలవనితోఁచుచున్నది కాఁబట్టియే నీకపకారమును జేసిన రావణాసురునియందు నీపరాక్రమమును జూపలేదు. రాజపుత్రుఁడవైన యోరాముఁడా! నీవు నాకుఁ గనఁబడుచు యుద్ధమును జేసియుంటివేని నాచేతఁ జంపఁబడి యిప్పుడే నీవు యమలోకమును జూచునట్లు చేసియుందును. మఱియు నోరాముఁడా! యుద్ధములయందు శత్రువులచేత జయింపనలవిగాని నన్నుఁ జాటున దాగియుండి "నిద్రను బొందుచున్న పామును జంపువిధముగ" నన్నుఁ జంపితివి ఇట్లు సేయుటయుచితమా? పురుషోత్తముఁడవైనయోరాముఁడా! నాతో నిదివరకుముందుగా సీతను దెమ్మనియును, రావణాసురుని కపకారమును జేయుమనియును జెప్పియుండిన యెడల నేనొకదినములో సీతనుదీసికొనివచ్చి నీకిచ్చియుందును. మఱియునో రాముఁడా! నీవు సుగ్రీవునకుఁ బ్రియమును జేయఁదలఁచియే రావణాసురునిఁ జంపుటకొఱకు నన్నుఁ జంపితివా? యా రావణాసురుని బట్టికొనిరమ్మని నాతోఁ జెప్పియుండిన యెడల నా రావణాసురుని కంఠమునందుఁ గట్టి నీయొద్దకిది వఱకెన్నఁడో తెచ్చియుందును. మఱియు నోరాముఁడా! రావణాసురుఁడు సీతాదేవిని, సముద్రమునందలి నీళ్ళలో దాచినను, పాతాళలోకమునందు బెట్టియుంచినను, నివు చెప్పియుండినయెడలఁ బూర్వమునందు మధుకైటభాసురులు శ్వేతాశ్వతరిరూపమును (అనఁగాఁ దెల్లనిగుఱ్ఱపుపిల్లయొక్క రూపమును) ధరించి పాతాళలోకమునందుఁ గట్టివేయఁబడిన వేదమును హయగ్రీవుఁడు తీసికొనివచ్చిన విధముగఁ దెచ్చి నీకుసమర్పించియుందును. నేను స్వర్గలోకమును బొందినపిమ్మట (అనఁగాఁ జచ్చినపిమ్మట) సుగ్రీవుఁడు రాజ్యమును బొందుట యుచితముగ నుండును గనుక సుగ్రీవుఁడు నన్నుఁ జంపఁదగును. నేను జచ్చుటవలన నీకేమియును లాభము లేకయుండఁగా యుద్ధమునందు నన్ను అన్యాయముగాఁ జంపుట నీకు యుచితముగనున్నదా? అనుచితమైన పనిని నీ వెందుకుఁ జేసితివి? మఱియు నోరాముఁడా! లోకములో నిజనమంతయును మరణమును బొందుట సహజమేగదా? కావున నేను గూడ మరణమును బొందితిని కాఁబట్టి నేను నామరణమునకు విచారమును బొందను నీవిట్టి యకార్యము నెందుకుఁ జేసితివో, దానికిఁదగిన సమాధా

నమును జెప్పఁదలఁచిన యెడలఁ జక్కఁగా యోచించి చెప్పుమని పలికి యావాలి యంతట నూరకుండెను. మఱియును మహాత్ముఁడగు నావాలి యివ్విధముగాఁ జెప్పి యెండిననోరుగలవాఁడును, బాణముయొక్క దెబ్బచేత మనోవ్యథను బొందుచున్నవాఁడును, నై సూర్యునితో సమానుఁడగు రాముని జూచి యేమియును జెప్పకయూరకుండెను.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదునేడవసర్గము ముగిసెను.

రాముఁడు వాలితో నిన్ను ధర్మముగనే జంపితి నని చెప్పుట.

అవ్విధముగాఁ జెప్పినపిమ్మటఁ గాంతిరహితమైన సూర్యునివలెను, పోయిన నీళ్లుగల మేఘమువలెను, చల్లారిన యగ్నివలెను, బడియున్నవాఁడును, ధర్మార్థ గుణములతోఁ గూడుకొనినవాఁడును, మిగులనుత్తముఁడును, వానరాధిపతియును, నగు వాలిని జూచి యుదివఱకు నతనిచేత నిందింపఁబడిన రాముఁడిట్లనియె.

ఓయీ వానరుఁడా! వాలీ! ధర్మార్థకామములను, లోకాచారమును, దెలియక యిప్పుడవివేకముచేత నన్ను నిందించుచున్నావుగాని నీవు బుద్ధిమంతుడవై నన్ను నిందించుచున్నవాఁడవుగావు మఱియు సౌమ్యుఁడవైన యో వానరుఁడా! మిగుల బుద్ధిమంతులును, గురువులుగా నుండఁదగినవారును, వృద్ధులును నగువారలతో నాలోచింపక నీకు సహజమగు వానరచాపల్యమువలన నన్ను నిందించుచున్నావు. నీవివ్విధముగా నన్ను నిందించుట యుచితమని నీకుఁదోఁచుచున్నదా? పర్వతములతోడను, వనములతోడను, మఱియు నితరములగు నదులు మొదలగువానితోడను గూడుకొనిన యీభూమి యంతయును నిక్ష్వాకు వంశమునందుఁ బుట్టిన రాజులదై యున్నది. మఱియును మృగములను, పక్షులను, మఱియు నితరములగువానిని, రక్షించుట, శిక్షించుట మొదలగునవి గూడ నిక్ష్వాకురాజుల యధీనములై యున్నవి. ఇటువంటి భూమిని సర్వమును, ధర్మాత్ముఁడును, సత్యముగ మాటలాడువాఁడును, సరళమైన బుద్ధిగలవాఁడును, ధర్మార్థకామములయొక్క వాస్తవమును గుర్తెఱిఁగినవాఁడును, నిగ్రహానుగ్రహముల యందాశగలవాఁడును, నగు భరతుఁడు పరిపాలనను జేయుచున్నాఁడు. మఱియు నో వాలీ! నీతివినయము, సత్యము మొదలగు సుగుణములును, దేశకాలవిభాగజ్ఞానముగలవాఁడును పరాక్రమవంతుఁడును, నగు భరతుఁ డిప్పుడు ప్రజాపరిపాలనను జేయుచున్నాఁడు. మేమును, మాకంటె నితరులగు రాజులును, ఆభరతునియొక్క యాజ్ఞను బొంది ధర్మయుతముగ సంచరించువారమును, ధర్మాభివృద్ధిని గోరుచున్నవారమునై భూమియందంతటను దిరుగుచున్నాము. ధర్మమునందుఁ బ్రేమగలవాఁడును, రాజోత్తముఁడును, నగు నా భరతుఁడు భూమండలమును సర్వమును బరిపాలించుచుండఁగా నెవ్వఁడు ధర్మమును వదలి సంచరించును. మఱియు నో వాలీ! మేమందఱమును భరతుని యాజ్ఞను బొంది మా ధర్మమునందు మేము స్థిరముగనున్నవారమై ధర్మమును వదలి సంచరించుచున్నవారలను శాస్త్రోక్త ప్రకారముగ నిగ్రహించుచున్నాము. వాలీ! నీవు ధర్మమును వదలినవాఁడవును, నింద్యములగు కర్మలను జేయుచున్నవాఁడవును, కామతంత్రములే ముఖ్యముగాఁ గలవాఁడవును, నై రాజమార్గమును వదలి సంచరించుచున్నావు. మఱియు నో వాలీ! "శ్లో॥ జ్యేష్ఠో భ్రాతా పితా చైవ యశ్చ విద్యాం ప్రయచ్ఛతి । త్రయస్తే పితరో జ్ఞేయా ధర్మే చ పథి హి వర్తినః॥ యవీయానాత్మనః పుత్రః శిష్యశ్చాపి గుణోదితః। పుత్రవత్తే త్రయశ్చింత్యా ధర్మశ్చైవాత్ర కారణమ్,," ధర్మమార్గమునందు సంచరించువానికి జ్యేష్ఠభ్రాతయును, జనకుఁడును, విద్యను జెప్పినవాఁడును, తండ్రులని యార్యులు చెప్పుదురు. తనకు వెనుకపుట్టినవాఁడును, గుణవంతుఁడును నగు తమ్ముఁడును, గుణవంతుఁడగు పుత్రుఁడును, గుణవంతుఁడగు శిష్యుఁడును, ధర్మమునందు బుద్ధిగలవానికిఁ బుత్రులే యని పెద్దలు చెప్పుదురు. ఈధర్మమును వదలి నీవు సంచరించుచుండుట నీకుఁ దెలియదా? ఓయీ వానరుఁడా! ధర్మము నవయింద్రియములకు గోచరమగునది గాదు. కావున నేసత్పురుషులకుఁ గూడఁ దెలియశక్యముగానిదై యున్నది. అట్టిధర్మమును, అధర్మమును, శుభాశుభకర్మలను, సకలభూతములయొక్కయు, హృదయములయందంతర్యామిరూపమున నున్న భగవంతుఁడు తెలిసికొనుచున్నాఁడు. ఓ వాలీ! చపలస్వభావము గలవారును, బుద్ధిహీనులును నగు వానరులతోఁ గూడఁ జపలుఁడవగు నీవు గ్రుడ్డివారలతో గ్రుడ్డివాఁ డాలోచించు విధముగ నాలోచించుచున్నావు గాని నీవు మిగుల బుద్ధిమంతుఁడవై బుద్ధిమంతులగువారితోఁ గూడ నాలోచించుచున్నవాఁడవు గావు. కావున నీకు సరియగు హేతువు తెలిసికొనినవాఁడవు కాకయుంటివి. నేనిప్పుడు నీమాటలకుఁ దగిన కారణమును జెప్పెదను. సావధానుఁడవై వినుము నీవు కోపముచేత నన్ను నిందించుటకుఁదగినవాఁడవుగావు. నిన్ను ఏమి కారణముచేతఁ జంపితినో, యాకారణమును జెప్పెదను. వినుము నీవు చిరకాలముగ జరిగివచ్చుచున్న ధర్మమును వదలి యధర్మమునందభిలాషగలవాఁడవై నీతమ్ముఁడగు సుగ్రీవుఁడు జీ

వించియుండఁగానే యతనిభార్యయందు రమించుచున్నావు. వానరుఁడవైన యోవాలీ! ధర్మమునువదలి సంచరించుచున్నవాఁడవును, ఇచ్ఛానుసారముగ సంచరించుచున్నవాఁడవును, నీవుసుగ్రీవునిభార్యనపహరించిన తప్పునకుఁగాను వధించితిని ఇట్టితప్పునకిదిసరియగుశిక్షయైయున్నది. వానరాధిపతివైనయోవాలీ! ధర్మమునకువిరుద్ధముగా సంచరించువాఁడవును, లోకవృత్తమునువదలినవాఁడవును, నగునిన్నుఁజంపుటకంటె నీకన్యమగు శిక్షయేదియును లేదు. క్షత్రియకులమునందుఁ బుట్టిననేనిట్టి పాపకృత్యమును జేయువానినిసహించుట యుచితముగనుండలేదు. కావున నిన్నువధించితిని. మఱియునోవానరుఁడా! "శ్లో॥ ఔరసీంభగినీంవాపి భార్యాంవాప్యనుజస్య యః । ప్రచరేత్సనరఃకామాత్తస్య దండోవధస్స్మృతః" పుత్రికను, తోఁబుట్టువగుచెలియలిని, తమ్మునిభార్యను, బొందిరమించువానిని జంపుటయే శిక్షయనిధర్మశాస్త్రములు బోధించుచున్నవి. కావున నేనీవిధముగ నిన్నువధించితిని. ఈసమయమునందు భరతుఁడు రాజైయున్నాడు. మేమందఱమును భరతుని యాజ్ఞనుబొంది ధర్మయుతముగ లోకులనుశిక్షించుటకొఱకుఁ దిరుగుచున్నాము. నీవుఅధర్మముగ సంచరించుచున్నావు. కావుననిన్నువధించితిని. సకలధర్మములనుదెలిసినవాఁడును, గురువునునగుభరతుఁడు ధర్మముగసంచరింపని వానినిధర్మయుతముగ శిక్షించుచున్నాఁడు. మఱియునాభరతుఁడు యథేచ్ఛముగసంచరించు వారలనిగ్రహించుటయందుఁ గోరికగలవాఁడైయున్నాఁడు. వానరోత్తముఁడవైన యోవాలీ! మేమందఱమునుభరతునియొక్క యాజ్ఞనుబొంది నీవలెమర్యాదనువదలి సంచరించువారలను, శిక్షించునట్టివ్యాపారమునందుఁ బ్రవర్తించుచున్నాము.

మఱియునోవాలీ! నేనులక్ష్మణునియందెట్లు ప్రియముగలవాఁడనైయుందునో, యావిధముగా సుగ్రీవునియందుఁగూడఁ బ్రియమునవలంబించియున్నాను ఆసుగ్రీవునిభార్యను సుగ్రీవునకిప్పించుటయందును. మఱియునతనికి రాజ్యమునుసంపాదించి యిచ్చుటయందును నేనుబూనుకొనియున్నాను. ఆసుగ్రీవుఁడుగూడ నాకుమేలును జేయుటయందు సిద్ధముగనున్నాఁడు మఱియునోవాలీ! నేనాసమయమునందు వానరులసభలోనిన్నుఁజంపి సుగ్రీవునకుభార్యనిప్పించెదనని యును నేనప్రతిజ్ఞను జేసితిని నాయట్టిక్షత్రియుఁడు ప్రతిజ్ఞాభంగమును జేసికొనుటయెట్లుతగును? తగదు, కావుననోవాలీ! అనేకములును, గొప్పవియును, నగునిటువంటికారణము లనేకములుండుటచేత నిన్నువధించితిని. కాఁబట్టినిన్ను వధించుటన్యాయమని నీవుసమ్మతమునుబొందుము. విశేషముగఁజెప్పనేల? ఎన్నివిధములచేతవిచారించినను నిన్నువధించుట యన్యాయముగాదు. కావుననీవుగూడ నాచేతన్యాయముగానే చంపఁబడితినని యెంచికొనుము. అదియంతయునటుండనిమ్ము. ధర్మముగసంచరించువాఁడు తనస్నేహితునియొక్క శత్రువులనుజంపుట న్యాయమేగదా? కాఁబట్టినీవుగూడ ధర్మమునుయోచించి నేను న్యాయముగానే చంపఁబడితినని తలఁచుకొనుము. మఱియు నోవాలీ! పూర్వము మనువు, మంచినడవడికను ప్రియముగా బోధించునవియును, ధర్మాత్ములగువారిచేత గ్రహింపఁబడఁదగినవియునునగు రెండుశ్లోకములనుచెప్పె ఆశ్లోకములయర్థమునను సరించి యిదివఱకున్న పెద్దలందఱును సంచరించిరి. ఆశ్లోకములను జెప్పెదను. వినుము. "శ్లో॥ రాజభిర్ధృతదండాస్తు కృత్వా పాపానిమానవాః । నిర్మలాస్స్వర్గమాయాంతి సంతస్సుకృతినోయథా ॥ శాసనాద్వావిమోక్షాద్వా స్తేనస్తేయాద్విముచ్యతే। రాజాత్వశాసన్పాపస్యత దవాప్నోతికిల్బిషమ్," పాపమునుజేసినమానవులు రాజశిక్షనుబొందినయెడల పాపరహితులైపుణ్యమునుజేసిన వారివలెనిరాతంకముగ స్వర్గలోకమును బొందుదురు దొంగతనమునుజేసినవానిని రాజువదలిపెట్టినను, శిక్షించినను పాపరహితుఁడగును దొంగతనమునుజేసిన వానిని రాజుశిక్షింపకపోయినయెడల నాపాపమునురాజు పొందును, అనునర్థముగల యీరెండుశ్లోకములను మనువుచెప్పె. ఈశ్లోకములయర్థమును జక్కగాదెలిసికొనిన వాఁడును, మావృద్ధప్రపితామహుఁడును, పూజ్యుఁడును నగుమాంధాతనీవలెనే శ్రమణుఁడనువాఁడు పాపమును జేసినపుడు నేనునిన్నుశిక్షించినవిధముగానే మిగులభయంకరమగు శిక్షనువిధించె.

మఱియునోవాలీ! ఇతరులగురాజులనేకులుమదించి ప్రజాపరిపాలనయందు లక్ష్యములేకతిరుగునపుడు లోకులందఱును నానావిధములగు పాపములను జేయుచువచ్చిరి. అంతటఁ గొన్నిదినములకారాజులు పెద్దలవాక్యములనువిని తమమదమునువదలి ప్రజలనుపరిపాలించునపుడు మొదటఁబాపముచేసిన వారలనందఱునుశిక్షించిరి. అట్లుశిక్షించితమకును, తప్పుజేసినవారలకును పాపమురాకుండునట్లుచేసిరి. కావునవానరోత్తముఁడవైనయోవాలీ! నీవిఁకఁపరితాపమును బొందకుము. నిన్నున్యాయముగానే వధించితిని నేనుశాస్త్రమర్యాదను వదలిసంచరించువాఁడనుగాను. వానరోత్తముఁడవైనయోవాలీ! ఇంకొకకారణమును జెప్పెదను. సావధానుఁడవైవినుము ఆకారణమును వింటివేని నీకుగొంచెమైననుగోపముండదు. మఱియునువ

నస్తాపముగూడనుండదు. కావుననోవాలీ! లోకములోని మానవులు వేటాడునప్పుడు, వలలను, పాశములను, మఱియు నితరము లగువానిని సాధనములను గ్రహించి యొకానొకప్పుడు కనఁబడుచున్నవారలగుచు, మఱియొకప్పుడు గనఁబడనివారలగుచు, మృగములు మొదలగునవి భయముచేతఁ బరుగిడుచున్నను, భయమునుబొందుచున్నను, మనుజంపరని తలఁచిభయమును వదలినిలుచున్నను, మదించినవైయున్నను, అధికముగుమదము గలవైయున్నను, మాంసమునందలి కోరికచేతజంపుదురు. అట్లుచంపుటవలనఁబాపములేదు. సకలధర్మములయందును బండితులగురాజర్షులుగూడ ననేకమందియీవిధముగా వేటాడిరి. కావున నేనుగూడ నొకబాణమునుబ్రయోగించి దాగియుండి నిన్నుఁజంపితిని. నీవునాతో యుద్ధమునకువచ్చినను, రాకపోయినను, నీవుగూడఁ గొమ్మలయందు సంచరించునట్టి మృగమేగదా? కావుననిన్ను వేటాడితిని. నిన్ను వేటాడుటవలనఁ దప్పేమియును లేదు, శాఖామృగమైన నీవు కనఁబడవుగనుక నీకు నేనుగనఁబడలేదు. కావున నేనుదాగియుండి కొట్టుటయొకదోషమనినీవుతలఁపకుము. మఱియునోవానరశ్రేష్ఠుఁడవైనయోవాలీ! దుర్లభమగుధర్మమునకును, మంగళకరమగుజీవనమునకును, రాజులుదాతలనుటకు సందేహమేమియునులేదు కావునరాజులనుమాటలచేత హింసింపఁగూడదు. మఱియునుదిట్టఁగూడదు. రాజులమాటలనుయుక్తులచేత ఖండింపఁగూడదు. రాజులకప్రియమగుమాటను జెప్పఁగూడదు. ఈభూలోకమునందు దేవతలురాజరూపముగ సంచరించుదురు. కావునరాజునందు గౌరవమునుంచవలయును. రాజుదిక్పాలురయొక్క యంశవలనఁబుట్టినవారనియును, రాజునారాయణస్వరూపుఁడనియును నెఱుంగవలయును, మఱియునోవాలీ! నీవుధర్మమును దెలియకకోపముచేత నిట్లుమాటలాడుచున్నావు. ముఖ్యముగాఁగోపముకలవాఁడవైయుండుటచేత యుక్తాయుక్తముల నాలోచింపక మాటలాడుచున్నావు. నేను తాతముత్తాతలనాటనుండి వచ్చుచున్నధర్మమునందుఁ బ్రవర్తించుచున్నాను ఇటువంటినన్నునిందించుట నీకుఁదగదనిరాముఁడుచెప్పె. ఇవ్విధముగారాముఁడు చెప్పినమాటలనువినివాలి తాను దెలియకరాముని నిందించినందుకు మిగులఁ బరితాపమును బొందినవాఁడును, రామునివచనములచేత ధర్మమిట్టిదని తెలిసికొనినవాఁడునునగుచు రామునియందేమియును దోషములేదనితలఁచె, మఱియును వానరేశ్వరుఁడగు వాలి, చేతులనుముకుళించుకొని రామునితోనిట్లనియె

మానవోత్తముఁడవైన యోరాముఁడా! నీవుచెప్పినదంతయును వాస్తవమే ఇందుకేమియును సందేహములేదు. సర్వజ్ఞుఁడవైననీతో నల్పజ్ఞుఁడవైననేనేమిచెప్పఁగలను. లోకములోసర్వమును దెలిసిన మహానుభావునితో నల్పవిషయములను దెలిసినవాఁడు మాటలాడఁజాలఁడుగదా? పూజ్యుఁడవైనయోరాముఁడా! నేనిదివఱకుఁ దెలివిలేనితనముచేత నయుక్తములును, అప్రియములును నగు మాటలను జెప్పితిని కావునరఘుకులోద్భవుఁడవైన యోరాముఁడా! నాయందుదోషమును బెట్టుటనీకుఁదగదు. మఱియునోరాముఁడా! సకలవిషయములను దెలిసిన పండితుఁడవును ప్రజలకుహితమును జేయుటయందాశగలవాఁడవును, నగునీయొక్కబుద్ధి కార్యకారణములను దెలిసికొనుటయందుమిగుల నేర్పరితనముగలది. అదియునుగాక రాముఁడా! నీబుద్ధిమిగులనిర్మలమైనది. పురుషోత్తముఁడవైన యోరాముఁడా! సకలధర్మములనువదలినవాఁడను, అధర్మములగుకార్యములను జేయుచున్నవాఁడను, నగునన్నుమన్నించి నేను జెప్పఁబోవువిషయమున నంగీకారమునుబొంది నావచనానుసారముగ జంపెదనని చెప్పి నామనస్సునకు సంతోషమునుగలుగఁజేయుము. మఱియునీవు సర్వకాలములయందును ధర్మమునుదప్పక మాటలాడుచు ధర్మయుతముగఁబ్రవర్తించుదువు కావున నేనుబ్రార్థించుచున్నాను. పురుషోత్తముఁడవైన యోరాముఁడా! నేనుజచ్చిపోవుచున్నానే, యని విచారమునుబొందడములేదు. నేనునాభార్యయగు తారయేమగునోయని విచారమునుబొందను. నాబంధువులందఱును నేనుబోయినపిమ్మట నెట్లుజీవింపఁగలరా, యనివిచారమునుబొందను. బంగారుభుజబందులనియెడు నాభరణములుగలవాఁడును, మిగులమనోహరుఁడును, నాకు సర్వకాలములయందును శుశ్రూషను జేయువాఁడును, సకలగుణములును గలవాఁడును, నాకుఁబుత్రుఁడును, నగు నంగదుఁడేమగునో, యనివిచారమునుబొందెదను. పుట్టినదినము మొదలుకొని నాచేతలాలనచేయఁబడుచున్న యంగదుఁడు నేనుగనఁబడకపోవుటచే మిగులవ్యసనముగలవాఁడై "యెండిపోయిన యుదకముగలచెరువువలె" శుష్కించిపోవును. అయ్యో, అంగదునకికదిక్కెవ్వరా? యనివిచారమును బొందుచున్నాను. పురుషోత్తముఁడవైన యోరాముఁడా! పసివాఁడును, విద్యాభ్యాసము మొదలగువానిని జేసి బుద్ధికుశలతను సంపాదించుకొనినవాఁడును, మిగుల నిష్టుఁడును, మహాబలుఁడును, నగునంగదుఁడొక్కఁడే నాకుఁబుత్రుఁడు. నాభార్యయగుతారకును నొక్కఁడేపుత్రుఁడు. కావునమాకిరువురికిని నంగదునియందధికమైనప్రేమగలదు. కాఁబట్టినాపుత్రుఁడగు నంగదుఁడునీచేతఁజక్క

గాఁ గాపాడఁదగినవాఁడు. మఱియు నో రాముఁడా! అంగదునియందును, సుగ్రీవునియందును సమానమగుబుద్ధినుంచుము. మహానుభావుఁడవగు నీవు యుక్తాయుక్తములగు వానిని దెలిసి శిక్షించుటకును, గాపాడుటకును దగినవాఁడవు. కావున నేను నిన్నుఁ బ్రార్థించుచున్నాను.

రాజవైన యో రాముఁడా! నీకు భరతునియందును, లక్ష్మణునియందును, నెటువంటి ప్రియముగలదో యటువంటి ప్రేమను సుగ్రీవాంగదులయందుఁ బెట్టుము. పురుషోత్తముఁడవైన యో రాముఁడా! నేను సుగ్రీవున కపకారముఁ జేయునపుడు నాయొద్దనుండుటచేత నాకుఁ బ్రియమును జేయుటకుఁ దార కూడ సుగ్రీవున కపకారమును జేసినది. కాఁబట్టి సుగ్రీవుఁ డిప్పుడు అవిరోధమును మనస్సులోఁ బెట్టుకొని తారకపకారమును, జేయునేమో, యని తోఁచుచున్నది. కాఁబట్టి సుగ్రీవుఁ డట్లు సేయకుండునట్లు చేయుటకుఁ గా నిన్నుఁ బ్రార్థించుచున్నాను. పురుషోత్తముఁడవైన యో రాముఁడా! నీయధీనమునందుండి నీ చిత్తానుసారముగ సంచరించి నీయనుగ్రహమును బొందుచు నేను రాజ్యమును బరిపాలింపఁగలనని యిదివఱకు నేనెఱుఁగుదును. మఱియు నీవలన మరణమును బొందితినేని స్వర్గలోకమునకుఁ బోఁగలనని యును, నెఱుఁగుదును. కాఁబట్టి తార యెంతగాఁ జెప్పినను నేను మరణమును బొంది స్వర్గలోకమునకుఁ బోఁదలఁచి యుద్ధమునకు వచ్చితిని. వచ్చి సుగ్రీవునితోఁ గూడ ద్వంద్వయుద్ధమును జేసితినని చెప్పి యంతట నేమియును జెప్పక వానరేశ్వరుఁడైన వాలి నమస్కారమును జేయుచున్నవాఁడగుచు నూరకుండె. అంతట నా రాముఁడు, విస్పష్టముగాఁ గనఁబడుచున్న యా వాలిని మిగుల మనోహరములైనవియును, ధర్మయుతముగనున్నవియును, వ్యమువైనవియును నగు మాటలచేత నోదార్పఁదలఁచి యిట్లనియె.

వానరుఁడవైన యో వాలీ! నీవు మిగుల సంతాపమును బొందకుము. మఱియు నయ్యో రాముఁడు పాపకృత్యమును జేసెనే యిట్టి పాపఫలమనుభవించుటకు నరకమునఁ బడునే, యని నావిషయముగను, విచారమును బొందకుము. ఇంతయగాక నాభార్యాపుత్రాదులను వదలి నేను జచ్చిపోవుచుంటినే, యేమగుదునో, యని నీ విషయమునందుఁ గూడ నీవు విచారమును బొందకుము. నేను దండింపఁదగిన నిన్ను దండించుటచేత నాకుఁ బాపములేదు తప్పును జేసిన నీవు రాజదండనను బొందితివి. కావున నీపాపమంతయును నశించిపోయినది. కాఁబట్టి యిఁకమీఁదట స్వర్గలోకమునకుఁ బోవుదువు. మఱియు నో వాలీ! మేము నీకంటె ధర్మాచరణమునం దధికమైన ప్రియముగలవారము. దండింపఁదగిన వారలదండించినవాఁడును, పొందఁదగిన శిక్షను బొందినవాఁడును, పాపరహితులై స్వర్గలోకమును బొందుదురని ధర్మశాస్త్రవచనమును నీకిదివఱకే చెప్పియుంటిని గదా? కావున నీవు విచారమును బొందకుము. మఱియు నో వాలీ! నీవు రాజశిక్షను బొందుటచేతఁ బాపరహితుఁడవైతివి. కావున నిఁకమీఁద శుద్ధస్వరూపమును బొంది ధర్మశాస్త్రములయందుఁ జెప్పఁబడిన పుణ్యలోకములకుఁ బోదువు. కాఁబట్టి యో వాలీ! ఇఁకమీఁద నీ హృదయమందలి భయమును, వ్యసనమును, మోహమును, వదలిపెట్టుము. వానరోత్తముఁడవైన యో వాలీ! దైవయోగమును దప్పించుకొనుట నీకు శక్యము గాదు. కావున దైవయోగానుసారముగ నీకు మరణము గలిగినది. కాఁబట్టి యిఁక విచారమును బొందకుము. వానరోత్తముఁడవైన యో వాలీ! నీపుత్రుఁడగు నంగదుఁ డిదివఱకు నీయందెట్లు ప్రవర్తించుచున్నాఁడో యావిధముగానే నాయందును సుగ్రీవునియందును బ్రవర్తింపఁగలఁడు. ఇందు కేమియును సందేహము లేదు. (అనఁగా నీ వేవిధముగా నంగదుని గాపాడితివో, మేముకూడ నావిధముగానే కాపాడుదుమనుట) ఇవ్విధముగా, మహానుభావుఁడును, ధర్మమార్గము ననుసరించి ప్రవర్తించుచున్నవాఁడును, యుద్ధములయందు శత్రువుల సంహరించునట్టి సామర్థ్యముగలవాఁడును, నగు రామునిచేతఁ జెప్పఁబడినవియును, ధర్మయుతమైనవియును, నగుమాటను విని యా వాలి సంతోషమును బొందె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి పదునెనిమిదవసర్గముగిసెను.

వాలిమరణమును విని తార వ్యసనపడుచు వాలిపడియుండుచోటునకు వచ్చుట

అంతట వానరులకండఱకును బ్రభుఁడును, రామబాణముచేతఁ గొట్టఁబడినవాఁడును, నగు నా వాలి, మిగుల యుక్తియుక్తములగు రాముని మాటలను విని పరమానందముచేత నేమియునుఁ జెప్పవలసినది లేదని తలఁచి యూరకుండె. మఱియు నా వాలి తాళ్ళదెబ్బలచేత శిథిలమైన యవయవములుగలవాఁడును, చెట్లచేత నధికముగాఁ గొట్టఁబడినవాఁడును నగుటయేగాక రాముని బాణముచేతఁ గూడఁ గొట్టఁబడుటవలనఁ బ్రాణావసానసమయమగుటచేత నేమియును దెలియక మూర్ఛను బొందె. అంతట నక్కడ వాలిభార్యయగు తార, వానరరాజగు వాలి యుద్ధమునందు రాముని బాణముచేతఁ గ్రిందఁబడెనను సంగతిని దెలిసికొనియె. మఱియు నా తార పుత్రుఁడగు నంగదునితోఁ గూడ మిగులఁ గఠినమగు మరణవార్తను విని యధికమగు దుఃఖముగలదై మిగు

లమనోహరమగు నంతఃపురములోనుండియే భయముగలదైక్రిందఁబడిమూర్ఛనుబొందెను. ఆసమయమునందు మిగులభయంకరమగు పరాక్రమముగలవారును, అంగదునిరక్షకభటులును, నగువానరులు ధనుస్సును ధరించియున్న రామునిఁజూచిభయపడిపరుగెత్తిరి. అట్లుపరుగెత్తుచుఁదారనివసించియున్న యంతఃపురములోనికివచ్చిరి. అట్లుభయముచేతఁబరుగిడివచ్చిన వానరులాసమయమునందుఁ దమగుంపునకధిపతియగు మృగనాథుఁడు చచ్చి పిమ్మటభయముచేత నలుదిక్కులకునుబరుగెత్తుచుండెడు మృగములనుబోలియుండెను. అవ్విధముగా రామునిచేతఁ దఱుమఁబడినవారును, భయముచేతఁబరుగిడివచ్చినవారును, బాణములచేత గ్రుచ్చఁబడినశరీరములుగలవారివలె నున్నవారును, దుఃఖమునుబొందుచున్నవారును, నగువానరులనుఁజూచియదివఱకేదుఃఖమునుబొందుచున్నతార యప్పుడుమఱింతదుఃఖముగలదగుచునావానరులతోనిట్లనియె

ఓవానరోత్తములారా! వానరరాజోత్తముఁడగువాలికేముందుగామీరందఱునునడుచుచుందురుగదా? అటువంటిమీరువాలినివదలిపెట్టి యిక్కడకెట్లువచ్చితిరి? మీరెందుకుభయమునుబొందుచున్నారు? మీరెక్కడకుఁ బరుగెత్తుచున్నారు? మీరీవిధముగాదిక్కులేనివారలై పరుగెత్తుటకుఁ గారణమేమి? ఒకవేళమిగులభయంకరుఁడగు సుగ్రీవునకు రాజ్యమునిప్పింపవలయుననియెడు తలంపుతో రాముఁడు మిగులదూరమునందున్న లక్ష్యమునుగూడ భేదించునట్టివియును, మిగులభయంకరములైనవియునునగు బాణములచేతవాలినిచంపెనాయేమి? అట్లయ్యెనేని నేనుగూడమరణమునుబొందినదాననేగదా? ఇక్కడదిక్కెవ్వరుగలరని మీరువచ్చితిరని తారచెప్పె. అంతఆమాటనువిని తమయిష్టమువచ్చినయాకారములను ధరించుటకుఁ దగినసామర్థ్యముగలయావానరులందఱునునాసమయమునకుఁదగినట్లు దుఃఖమునుబోఁగొట్టునట్టిమాటను జెప్పఁదలఁచియిట్లనిరి.

అమ్మా! తారా! నీవుభర్తతోఁగూడమరణమునుబొందకుము. పుత్రుఁడగునంగదునిఁజూచివెనుకకుఁ దిరుగుము. నీకుమారుఁడగు నంగదునిఁగాపాడుము. యముఁడురామరూపముచేతవచ్చి వాలినిఁజంపితీసికొని పోవుచున్నాఁడు. మఱియునోయమ్మా! తారా! పెరకఁబడినవృక్షములచేతను, తాళ్ళచేతను, వజ్రాయుధముతోసమానములగుబాణములచేతను, వాలికొట్టఁబడి క్రిందఁబడవేయఁబడెను. అమ్మా! తారా! దేవేంద్రునిపరాక్రమముతో సమానమైన పరాక్రమముగలవాఁడును, వానరులకందఱకును బ్రభుఁడును, నగువాలిమరణమునుబొందఁగానే యుద్ధమునకుసన్నద్ధమైపోయిన యీవానరమూకయంతయును భయముచేతనిక్కడకుఁబరుగిడివచ్చినదమ్మా. ఈవానరమూకనుదఱుముకొనియితరులగువానరులువచ్చుచున్నట్లు తోచుచున్నది. కాఁబట్టియోయమ్మా! తారా! నగరద్వారమును గాపాడుటకాజ్ఞనిమ్ము. అంగదుని గిష్కింధాపట్టణమునకు రాజునుగాఁజేయుము. వానరులందఱును వాలియొక్కసింహాసనమునుబొందినయంగదునినెల్లవారును వాలినిసేవించినవిధముగాసేవింతురు. సుందరమైనముఖముగల యోతారా! నీకీచోటనుండుటిష్టములేకపోయినను, భయముగలిగియున్నను, నీవానరులందఱునునతిశీఘ్రముగ నితరములగు గుహలకురాఁగలరు. వచ్చియక్కడఁబ్రవేశింపఁగలరు. మఱియునోతారా! ఇక్కడభార్యలుగలవారును, భార్యలులేనివారలునునగువానరులనేకులుగలరు. ఇట్టివారికి, వారివారిస్వభార్యలనువదలివచ్చిన సుగ్రీవుఁడుమొదలగువానరులతోనెప్పుడును మిగులభయంకరమగు యుద్ధముజరుగుచుండును. కాఁబట్టిమనమిక్కడనుండుటమంచిదిగాదనితోఁచుచున్నదనిచెప్పిరి. ఆసమయమునందా తారతనకుఁగొంచెముదూరమునందున్న వానరులమాటలనువిని మనోహరముగ నవ్వుచున్నమోముగలదై తనయోగ్యతకుఁదగినమాటను జెప్పఁదలఁచియిట్లనియె.

ఓవానరోత్తములారా! మహానుభావుఁడును, వానరులకందఱకునుబ్రభుఁడును, నగువాలిమరణమునుబొందెను గదా? నాకింకమీఁదఁ బుత్రునితోనేమిప్రయోజనము. నాకురాజ్యముతోఁబనియేమి? నాప్రాణముతోనేమిపని? నాకేమియునుసక్కరలేదు. ఓవానరోత్తములారా! రామునిచేతఁబ్రయోగింపఁబడిన బాణములవలనఁజంపఁబడినవాఁడును, మహానుభావుఁడును, నగువాలియొక్కపాదమూలమునందుఁబ్రవేశించెదనని చెప్పె. పిమ్మటనధికమగు దుఃఖముచేతఁబీడింపఁబడినదై యధికమగువ్యసనముచేతఁదనచేతులతోఁదలనుఱొమ్ములనుబగులఁగొట్టికొనుచు నేడ్చుచు వాలియున్నచోటునకుఁ బరుగెత్తికొనుచుఁబోయె. అట్లుపోయినదై భూమియందుఁబడియున్నవాఁడును, యుద్ధములయందు వెనుకకుఁదిరగనిరాక్షసుల నవలీలగఁజంపినవాఁడును, పర్వతములనువిసరివేయునట్టిసామర్థ్యముగలవాఁడును, వజ్రాయుధమునుధరించిన యింద్రునివంటివాఁడును, యుద్ధములయందువాయువేగమువంటివేగముగలవాఁడును, గొప్పదగుమేఘముయొక్కధ్వనివంటి ధ్వనిగలవాఁడును, దేవేంద్రునిపరాక్రమమువంటి పరాక్రమముగలవాఁడును, వర్షించినపిమ్మటనుండునట్టిమేఘమువలెనిశ్శబ్దముగనున్నవాఁడును, యుద్ధములలో ధ్వనిఁజేయుచున్నవారలన

డుమిగుల భయంకరముగా ధ్వనిజేయువాఁడును, యుద్ధరంగమునందు శూరుఁడగు రామునిచేతఁ బడఁవేయఁబడినవాఁడును, మాంసముకొఱకు సింహముచేతఁజంపఁబడినసింహమువలెనున్నవాఁడును, తొల్లిసర్పమును జంపుటకు గరుత్మంతునిచేతఁ బాధుసేయఁబడిన సర్వలోకములవారిచేతను బూజింపఁబడినదియును, చక్కగానలంకరింపఁబడినదియును, వేదికతోఁగూడు కొనినదియును, నగుచైత్యమను పేరుగలస్థానవిశేషమువలెనున్నవాఁడును, నైనవాలినిఁజూచె. పిమ్మటనచ్చోటునకు సమీపమునందు మిగులశ్రేష్ఠమగుధనుస్సును ధరించియున్నరాముని, రామునకుఁదమ్ముఁడగు లక్ష్మణుని, తనభర్తయగువాలికిఁదమ్ముఁడగు సుగ్రీవునిమంగళకరురాలగు నాతార చూచె. పిమ్మటవారలనందఱవదలి యుద్ధమునందుఁ గొట్టఁబడిక్రిందఁబడియున్న వాలినిఁజూచిమిగుల వ్యసనముగలదియును, భ్రాంతమైనచిత్తముగలదియునునగుచుఁ గ్రిందఁబడిమూర్ఛనొందె. అంతఁగొంతసేపటికి "నిద్రబోయిలేచిన దానివలెలేచి" అయ్యో పూజ్యులగువారికిఁబుత్రుఁడా? యనిరోదనమును జేసె. మఱియును మృత్యుదేవతలయొక్క పాశములచేతఁగట్టఁబడియున్న భర్తనుజూచి వ్యసనమునుబొందె. ఆసమయమునందాడలేడివలె రోదనమును జేయుచున్నతారను. పితృమరణమునకు దుఃఖమునుబొందుచువచ్చిన యంగదునిఁజూచి సుగ్రీవుఁడుగూడనధికమగు దుఃఖమునుబొందె.

ఇట్లుశ్రీమత్కిష్కింధాకాండమునందలిపందొమ్మిదవసర్గముగిసెను.

తారవాలినిగూర్చి విలపించుట.

ఆసమయమునందుఁ బూర్ణచన్ద్రబింబమువంటి ముఖముగలతార, రామునిధనుస్సునుండి విడువఁబడినదియును, మరణమునుగలుగఁ జేయునదియును, నగుబాణముచేతఁ గొట్టఁబడి భూమియందుఁ బడియున్నవానినిజూచె. అంతటననేకములగు విలాసములనునేర్చిన యాతారభర్తయగు వాలియొద్దకుఁబోయి యతనికౌఁగలించుకొనియె. మఱియు నాతార యధికమగు దుఃఖముచేతఁ దపించుచున్నమనస్సుగలదై బాణముచేతఁ గొట్టఁబడినవాఁడును, పెద్దయేనుఁగువలెఁ గ్రిందఁబడియున్నవాఁడును, వానరులకందఱకును బ్రభుఁడును. దేవేన్ద్రునితోసమానుఁడును, పెల్లగించివ్రేయఁబడినచెట్టువలెఁ గ్రిందఁబడియున్నవాఁడును, నగువాలినిగూర్చి యధికముగాఁగొంతెత్తి యేడ్చుచునిట్లనియె.

యుద్ధమునందుమిగుల భయంకరమైన పరాక్రమముగలవాఁడవును, మిక్కిలిగొనియాడఁదగినవీరుఁడవును, వానరాధిపతివియును, నగునోవాలీ! నిరపరాధురాలనగు నాతోనెందుకుమాట్లాడవు? ఓప్రాణనాయకుఁడా! నీకునేనేమి యపకారమునుజేసితిని? వానరోత్తముఁడవైన యోవాలీ! లెమ్ము. మంచిశయ్యమీఁదఁబరుండుము. మెత్తనిపరుపులమీఁదఁ బరుండఁదగిన ప్రభువులీప్రకారముగ వట్టినేలయందుఁ బరుండఁదగునా? నామనోనాయకుఁడవును, భూపతివియునునైనయోవాలీ! ప్రాణనాథా! నీకుఁబ్రాణములుపోయినపిమ్మటగూడ నీభూమిమిగులమనోహరమైన ప్రియురాలైనదా? కానియెడలనన్నువదలి యీవట్టినేలయందెందుకుఁబరున్నావు? వానరాధిపతివైనయోవాలీ! ధర్మమార్గమునుదప్పకయుద్ధమును జేసిన, నీచేతస్వర్గమార్గమునందు కిష్కింధాపట్టణమునకు సమానమగు మఱియొకపట్టణమేదియైన నిర్మింపఁబడినదా? అట్లుగానియెడల నీవీపట్టణమునెందుకు వదలిపెట్టితివి. ప్రాణనాయకుఁడవైన యోవాలీ! దివ్యనిగంధములుగల యరణ్యములయందు నీతోఁగూడననేకవిధములగు విహారములనుజేసితిని. ఆవిహారములన్నియును నేటితోనశించిపోయినవిగదా? అయ్యోవాలీ! ప్రాణనాథా! నామనోహరా! నేనుసంతోషరహితురాలను, సకలకోరికలును దీరినదాననునై దుఃఖసముద్రమునందు మునిఁగిపోతినిగదా? అయ్యోనాదేవుఁడా! వానరాధిపతివగు నీవుమరణమును బొందితివా? ఇఁకనేనెట్లుజీవింపఁగలను మఱియునోప్రాణనాయకుఁడా! ఈవిధముగాఁ జచ్చిక్రిందఁబడియున్న నిన్నుఁజూచినపిమ్మటగూడ నాహృదయము వేయివక్కలుగాక పోవుటనుజూడఁగా నాహృదయము తాయివలెమిగులదృఢమైనదనితోచుచున్నది. అయ్యోనాదేవుఁడా! మామాటలనువినక సుగ్రీవునిభార్య నపహరించివానినివనములకుఁ దఱిమి నెడలఁగొట్టితివే? కాఁబట్టియోవానరోత్తమా! వాలీ! ప్రాణనాయకా! నీవాదుర్మార్గమునకుఁదగిన ఫలమునుబొందితివా? అయ్యో వానరోత్తముఁడవైన వాలీ! నీకుహితమును, శుభమునుగోరుచున్నదాన నగుచునీవీసమయమునందు యుద్ధమునకుఁబోవుట యుచితముగాదని యనేకవిధములఁజెప్పితిని నామాటనువినక నన్నుధిక్కరించివచ్చి యీవిధముగామరణమునుబొందితివి. ఇకఁనేనేమిచేయుదును. పూజ్యుఁడవైనయోవాలీ! నీవిక్కడనుండిబయలు వెడలిపోయినతోడనే రూపయౌవనములచేత గర్వించిమదించినవారును, సంభోగక్రియలయందును, మిగులసామర్థ్యముగల యప్సరస్త్రీలమనస్సులను స్వాధీనముగాఁ జేసికొనఁగలవు. ప్రాణనాయకుఁడవైన యోవాలీ! నామనోహరా! నీవుశత్రువులకు స్వాధీనుఁడ

వృగాని వాఁడవయ్యెను, సుగ్రీవునిచేతమరణమును బొందుటనుజూడఁగా నీకుఁబ్రాణావసానకాలమనితోఁచుచున్నది. ఇందుకేమియును సందేహమునులేదు. మఱియునో ప్రాణనాయకుఁడా! నేనిదివఱకెన్నఁడును దుఃఖమునుబొందని దానననయ్యును నిప్పుడుదిక్కులేనిదానను, విధవనునైన దాననైనైదైన్యముచేతనైన దుఃఖమునుబొందుచున్నాను. మఱియును కృపణురాలనై యధికమగునీచత్వమును బొందవలసివచ్చినదే? నేనేమిచేయుదును. ప్రాణనాయకుఁడవైనయోవాలీ! ఇదివఱకునీచేతను, నాచేతను లాలన చేయఁబడుచున్నవాఁడును, మిక్కిలిమృదువైనవాఁడును, సుఖమునే పొందుటకుఁదగినవాఁడును, నగునంగదుఁడేకమీఁదఁబినతండ్రియగు సుగ్రీవుఁడుగోపమును బొందెనేనియేమియవస్థనుబొందునోగదా? అయ్యో! నీపుత్రుఁడు తల్లిదండ్రులులేనివాఁడై పోవుచున్నాఁడుగదాయనిచెప్పి సమీపముననున్న యంగదునితోనిట్లనియె.

బిడ్డా! అంగదా! పుత్రుఁడా! నేటితోనీతండ్రి పోవుచున్నాఁడు ఇఁకమీఁదనీకుఁగనఁబడఁడు. కాఁబట్టియిప్పుడే మీనాయనను జక్కఁగాఁజూడుము. నాయనా! అంగదా! తండ్రినివదలియెట్లుండఁగలవు అనిఘూడుఘూడుమని దుఃఖించి మరలవాలినుద్దేశించి యిట్లనియె.

ఓమనోహరా! ప్రాణనాథా! నీవిఁకనెన్నటికినిమరలివచ్చుటకుశక్యముగానిదూరదేశమునకుఁబోవుచున్నావు గనుకనీపుత్రుఁడగు నంగదునిముద్దుబెట్టుకొని, యిఁకమీఁదనీకొడుకు నడుచుకొనఁదగిన విధులనుపదేశింపుము. ప్రాణనాథా! నిన్నుఁజంపుచున్నరామునిచేత మిగులగొప్పదగు పనిచేయఁబడినది. మహానుభావుఁడగు రాముఁడునిన్నుజంపి సుగ్రీవునితోఁజేసిన ప్రతిజ్ఞనునెరవేర్చుకొని యబద్ధమునుమాట్లాడని వాఁడయ్యెననిచెప్పి సుగ్రీవునుద్దేశించియిట్లనియె.

సుగ్రీవుఁడా! ఇఁకనీకోరికలనుదీర్చికొనుము నీభార్యయగురుమతో నీయిష్టానుసారముగఁగ్రీడింపుము ఇఁకనేమియును భయములేనివాఁడవై రాజ్యమునననుభవింపుము.నీకన్నయును, శత్రుఁడునునగు వాలిచచ్చెనుగనుకనీభయమంతయునుదీరిపోయినదనిచెప్పి మరలవాలినుద్దేశించియిట్లనియె.

వానరాధిపతివైనయోవాలీ! ప్రాణనాథా! ఇవ్విధముగా దుఃఖమునుబొందుచున్న నాతోఁబ్రియముగా నెందుకుమాట్లాడవు? నాతోమాట్లాడకపోయినను, నీకుఁబ్రియమైన వానరస్త్రీలనేకులు వచ్చియున్నారే? వీరితోనైనను మాట్లాడఁగూడదా? యనిఘూడుఘూడున దుఃఖించె. ఇవ్విధముగా నేడ్చుచున్నతారయొక్క యేడ్పునువినియా వానరస్త్రీలందఱును నంగదునిఁగౌఁగలించుకొని యత్యంతము దుఃఖముచేతఁ బీడింపఁబడినవారై రోదనమును జేసిరి. ఆసమయమునందుఁ దారమరలనిట్లనియె.

భుజబందులనియెడు నాభరణములతోఁ గూడుకొనినవియును, మిగులఁబరాక్రమముగలవియునునగు బాహువులుగలయోవాలీ! ప్రాణనాథా! ఇప్పుడీయంగదునివిడిచిపెట్టి యెన్నటికినిమరలిరానివ్వని దేశమునకుబ్రయాణమై పోవుచున్నావా? పుత్రునియందుఁబ్రియముగలయోవాలీ! నాప్రాణనాథా! నీవతైశ్వర్యగుణములచేతను బ్రసిద్ధుఁడును, మంచివాఁడును, నగునంగదునివదలిపోవుట నీకుయుక్తమనితోఁచుచున్నదా? ప్రియమైనదియును, సుందరమైనదియును, నగువేషముగలయోవాలీ! నేనుగాని, నీపుత్రుఁడగు నంగదుఁడుగానియేమైన అపకారమును జేసితిమా? చేయనప్పుడు వీరుఁడవైనయోవాలీ! నన్నును, నంగదునివదలి దూరదేశమున కేట్లుపోవుచున్నావు? మిగులఁబొడవులగు భుజములుగలయోవాలీ! నామనోనాయకా! నేనుఒకవేళఁదెలియక యపకారమునేమైన జేసియున్నయెడలనాతప్పును మన్నింపుము. వానరకులమును నుద్ధరించునట్టి యోవాలీ! వీరుఁడా! నాదైవరాయా! నీపాదములయందు నాశిరస్సునుబెట్టి నమస్కరించుచున్నాను. కాఁబట్టినాయందలి దోషములను మన్నింపుమనియె ఇట్లుతారమిగుల దైన్యముగా వానరస్త్రీలతోఁగూడ భర్తయగువాలియొక్క సమీపమునందు రోదనమును జేయుచుండె. అంతఁగొంతసేపటికిఁ బతివ్రతయగు నాతారవాలియెక్కడఁబడిమృతినొందెనో, యక్కడనేతానుగూడ మరణమునుబొందఁదలఁచినదై ప్రాయోపవేశమును జేయుటకునిశ్చయించె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యిరువదవసర్గముగిసెను.

—* హనుమంతుఁడు తారకు దుఃఖోపశమనము జేయుట. *—

అటుపిమ్మట వానరులకుముఖ్యాధిపతియగు హనుమంతుఁడు "ఆకాశమునుండిక్రిందఁజారిపడిన నక్షత్రమువలెఁ" గ్రిందఁబడి ప్రకాశించుచున్నతారను మెల్లగానూరడించె. అమ్మా! తారా! "శ్లో॥ గుణదోషకృతం జంతుస్స్వకర్మఫలహేతుకం। అవ్యగ్రస్తదవాప్నోతి సర్వం ప్రేత్య శుభాశుభమ్,, లోకములోనిజంతువులన్నియునుదమతమపూర్వజన్మకృతకర్మఫలమే హేతువుగాఁగలదియును. (అనఁగాఁ బూర్వజన్మమునందలి కర్మవశముచేతఁ జేయఁబడినదియును) తెలిసియునుదెలియకయును బ్రవర్తించుటయనియెడు

గుణదోషములచేతఁ జేయఁబడినదియును, నగుశుభాశుభకర్మఫలమును సర్వమును పరలోకమునందు ఒంటరిగానే యనుభవించును. కావున నీభర్తయగు వాలికూడఁ దాను జేసిన పుణ్యపాపములయొక్క ఫలము ననుభవించుటకుఁ బరలోకమునకుఁ దనంతటఁదానే పోయినాఁడు. తనంతటఁదానుబోవునపుడు సుగ్రీవుఁడు నిమిత్తమాత్రముగా నున్నాఁడే గాని మఱియొకటి గాదని యెఱుంగుము. మఱియు నీభర్తయగు వాలిని దైవమే చంపినాఁడు గాని సుగ్రీవుఁడు చంపలేదు. దైవయోగమును మనము తప్పింపఁగలమా? తప్పింపఁజాలము. కాఁబట్టి నీవు వ్యసనమును బొందకుము. మఱియు నో తారా! నీవే, లోకులచేత శోకింపఁదగిన దానవు గదా? ఇటువంటి నీకు దుఃఖింపఁదగినవాఁడు గలఁడు. మఱియు నీవే దీనురాలవైయున్నావే, యిట్టి నీవే, దీనుని గుఱించి దయఁదలఁచుచున్నావు. మఱియు నో తారా! ఈశరీరము నీటిబుగ్గవంటిదయియుండఁగా నీలోకములో నెవ్వని కెవ్వఁడు దుఃఖింపఁదగియున్నాఁడు మనశరీరము స్థిరమైతేగదా? ఇతరులశరీరము స్థిరముగా నుండలేదే యని దుఃఖమును బొందవచ్చును. మనముగూడ మరికొంతసేపటికిఁ జచ్చుటకు సిద్ధముగ నున్నాము. ఇటువంటి మనమిప్పుడు చచ్చినవారలను గుఱించి వ్యసనమును బొందుట యుచితముగ నుండలేదు. కావున నిఁకమీఁద నీవీశోకమును విడిచిపెట్టుము జీవించియున్న పుత్రుఁడు గలదో తారా! నీపుత్రుఁడగు నంగదునిఁ జూడుము. ఇతనిని జూచి యిఁకమీఁద నితనికిఁ జేయఁదగిన శుభకార్యములను గుఱించి యోచింపుము. మఱియు నో తారా! ఈభూలోకములోని సకలజంతువులు నియమములేక (అనఁగా స్థిరముగా నుండక) వచ్చుచుఁ బోవుచునుండును గదా? ఈవిషయమును నీవు తెలిసికొనుచునే యున్నావు గదా? కావునఁ బండితురాలవైన యో తారా! ఇఁకను నీభర్తయగు వాలికిఁ బరలోకమునందు శుభమును గలుగఁజేయునట్టి కర్మలు జేయఁదగియున్నవి గాని యీలోకమునందుఁ జేయఁదగిన యేడ్పు మొదలగువానిని జేయఁదగదు. కాఁబట్టి నీవు చక్కగా యోచించి పరలోకక్రియలను జేయింపుము. ఏవాలిమూలకముగా వేలు, లక్షలు, అర్బుదములునని యెడు సంఖ్యగలవానరులు సుఖముగా జీవించుచున్నారో, యట్టివాలి యిప్పుడు దైవయోగముచేత మరణమును బొందెను. మఱియు నో తారా! న్యాయమార్గమునుదప్పక పరిపాలనాదికృత్యములను జేయువాఁడును, దుఃఖమును బొందియున్న బంధువులను, పరులను మంచిమాటలచేత నోదార్చుచున్నవాఁడును, యాచకుల కోరికలను దీర్చువాఁడును, బంధువులును, బరులును నగువారిచేతఁ జేయఁబడిన యపరాధములను క్షమించువాఁడును, నగు నీవాలి ధర్మముచేత జయింపఁబడిన భూమికిఁ అనఁగా స్వర్గలోకమునకుఁ బోవుచున్నాఁడు. కాఁబట్టి నీవీవాలిని గుఱించి దుఃఖమును బొందఁగూడదు. మఱియును పతివ్రతవైన యో తారా! ఈవానరోత్తములందఱును, నీపుత్రుఁడగు నంగదుఁడును, ఈవానర రాజ్యమును, నిన్ను రాజును గాఁబొంది సుఖమును బొందుట యుచితమగనున్నది. కాఁబట్టి యో తారా! నీవీశోకసంతాపములను మెల్లగా విడిచిపెట్టుము. నిన్ను నాధారముగాఁ జేసికొని యంగదుఁడీలోకమును బరిపాలించునట్లు చేయుము. మఱియు నో తారా! లోకములో సంతానమును, ఏపనికిఁ గాఁ గోరుదురో, పుట్టిన సంతానమే కార్యము చేయఁదగియున్నదో, యట్టి కార్యమును జేయుటకిది తగిన కాలమైయున్నది. కాఁబట్టి యిప్పుడు వానరరాజగు నీవాలికిఁ బరలోకక్రియలను అంగదుఁడు చేయునట్లు చేయుము. ఇప్పుడు ముఖ్యముగా వాలికిఁ బరలోకక్రియలను జేయించి అంగదునకుఁ బట్టాభిషేకమును జేయింపుము. అమ్మా! తారా! సింహాసనముమీఁద నెక్కి రాజ్యమును బరిపాలించునట్టి పుత్రునిఁ జూచుచుంటవేని నీవ్యసనము ముఖ్యముగా శాంతినిబొందఁ గలదు. ఇవ్విధముగా హనుమంతుఁడు చెప్పినమాటను విని యా తారభర్తృ మరణమువలనఁ గలిగిన దుఃఖముచేతఁ బీడింపఁబడినదై తనకు ఎదుటనున్న హనుమంతుని జూచి యిట్లనియె.

పూజ్యుఁడవైన యో హనుమంతుఁడా! అంగదునివంటి పుత్రులొక్క నూరుమంది యున్నను నా కేమియును బ్రయోజనము లేదు. నూరుమంది పుత్రులను జూచుటవలనఁ గలిగెడు సంతోషముకంటెఁ జచ్చి క్రిందఁబడియున్న యీవాలియొక్క యవయవములయొక్క యాలింగనము మిగుల సంతోషకరమైనది. నాకీవాలియొక్క యాలింగనమువలన సుఖము లేకపోయినపిమ్మట నూరుమంది పుత్రులున్నప్పటికిని నాకేమియును బ్రయోజనము లేదు. మఱియు నో హనుమంతుఁడా! నేనీవాలియొక్క ప్రేతకృత్యములను జేయించుటకును, నంగదుని బాలించుటకును సమర్థురాలను గాను కావున నేనుగూడ భర్తతో మరణమును బొందెదను. పిమ్మటఁ జేయఁదగిన పనులను జేయుటకును, నంగదునిఁ గాపాడుటకును సుగ్రీవుఁడు సమర్థుఁడైయున్నాఁడు. కావున నేను జేయఁదగినదియేదియును లేదు. కావున నో హనుమంతుఁడా! అంగదుని నేను గాపాడుదునని యెడు తలంపును బెట్టఁగూడదు. మఱియు నో హనుమంతుఁడా! "శ్లో॥ పితాహి బంధుః పుత్రస్య న మాతా హరిసత్తమ,, పుత్రునకుఁ దండ్రియగు వాఁడు తగిన బంధువుగాని తల్లియగునది బంధువు గాదు. మఱియు నో హనుమంతుఁడా! వానరరాజగు నీవాలి నాశ్రయించుటకుం

యైనాకు మఱియొక కార్యము తగినది కాదు. కావున యుద్ధమున శత్రువున కభిముఖుఁడై వీరులు పరుండఁ దగిన శయ్యయం దుఁబరున్న వాలియొక్క శయ్యయందు నేనుగూడఁ బరుండెదననియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యిరువదొకటవ సర్గము ముగిసెను.

వాలిసుగ్రీవునితో అంగదుని గాపాడుమని చెప్పుట.

అంతఁ గొంతసేపటికి మెల్లగాఁ జేరుకున్న ప్రాణములు గలవాఁడై యావాలి మెల్లమెల్లగా నిట్టూర్పులను విడుచుచు గన్నుఁదెరచి నలుదిక్కులను జూచుచుఁ బుత్రుఁడగు నంగదుని కంటె ముందుగా సుగ్రీవునిఁ జూచె. పిమ్మట నావాలి జయమును బొందియున్న సుగ్రీవునితో మాట్లాడఁ దలఁచి తమ్మునియందుంచఁ దగిన ప్రేమను దెలుపుటయందుఁ దగినవియును, స్పష్టములైనవియు నగు మాటలతో నిట్లనియె.

తమ్ముఁడా! సుగ్రీవా! నేను నీభార్య నపహరించితిననియును, నిన్ను నడవులకు వెడలఁ గొట్టితిననియును నాయందు దప్పును బెట్టకుము. ముందు రాఁబోవు ఫలమునకుఁ గారణమైన బుద్ధిలోపముచేతను, మోహముచేతను నేనట్టి కార్యములను జేసితినని యెంచుకొనుము. మఱియు నాయనా! సుగ్రీవా! మనయిద్దఱమును నొక్కపర్యాయము సుఖమును బొందునట్లు దైవము సృజింపలేదు. మఱియును దైవము భ్రాతృత్వముచేతఁ బ్రయోగింపఁబడిన సుఖమును, రాజ్యమునుగూడ నొక్కపర్యాయముగ ననుభవించునట్లు నిర్మింపలేదు. కావున దైవయోగమునకు మనము విచారమును బొందఁగూడదు. నాయనా! సుగ్రీవుఁడా! నేనొక్క విషయమును జెప్పెదను. వినుము. నాయనా! సుగ్రీవా! నీవీవానర రాజ్యమును బొంది రాజ్యమున న్యాయమును దప్పక పాలింపుము. నేనిప్పుడే యమపురమునకుఁ బోవుచున్నానని దృఢముగాఁ దెలిసికొనుము. నాయనా! సుగ్రీవుఁడా! నేను ప్రాణమును, రాజ్యమును, గొప్పదగు సంపదను, వాలి యెవ్వనిచేతను నోడింపఁబడలేదని యెడు కీర్తిని విడిచిపెట్టి యతిశీఘ్రముగ యమలోకమునకుఁ బోవుచున్నాను. వీరుఁడవైన యోసుగ్రీవుఁడా! నేనీమరణావస్థయం దేమి చెప్పుదునో, యామాటలిష్టముగా నుండకపోయినను నీవు చేయవలయునని కోరుచున్నాను. కావున నో వానరరాజోత్తమా! సుగ్రీవుఁడా! అన్నయగు వాలి మరణకాలమునందుఁ జెప్పె నేయని కరుణించి నేను జెప్పినచొప్పునఁ జేయుము. నాయనా! సుగ్రీవుఁడా! సుఖమును బొందుటకుఁ దగినవాఁడును, సుఖముగా వృద్ధిని బొందినవాఁడును, పసివాఁడును, పసివాఁడయ్యును, మిగుల బుద్ధిమంతుఁడును, కన్నీరుచేత వ్యాప్తమైన ముఖముగలవాఁడును, నగు నీయంగదునిఁ జూడుము. నాయనా! సుగ్రీవుఁడా! నా ప్రాణములకంటెఁ బ్రియుఁడగు నీయంగదుని నీపుత్రునిఁ గాపాడినవిధముగఁ గాపాడుము. మఱియు నో తండ్రీ! సుగ్రీవుఁడా! తండ్రినగు నాచేత విడువఁబడిన యీపుత్రునకే పదార్థమునందును గొరత లేకుండునట్లు పరిపాలనచేయుము. నాయనా! సుగ్రీవుఁడా! నీవేయీయంగదునకుఁ దాతవును, రక్షకుఁడవును నై యుండవలయును మఱియును, వానరాధిపతివైన యోసుగ్రీవుఁడా! ఈయంగదునకు భయములు గలిగిన సమయములయందు నేనెవ్విధముగ నభయము నిచ్చితినో, యవ్విధముగా నీవును నభయము నిచ్చి కాపాడుము. వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! తారాపుత్రుఁడును, శ్రీమంతుఁడును నగు నీయంగదుఁడు నీకు సమానమైన పరాక్రమము గలవాఁడు. కావున రాక్షసులను వధించునపుడు నీకు సహాయముగ నీకంటె ముందుగ నడిచి రాక్షసులను వధించును. మఱియు నో సుగ్రీవుఁడా! మిగుల వేగము గలవాఁడును, వయోవంతుఁడును, తారాపుత్రుఁడును, నగు నీయంగదుఁడు యుద్ధకాలమునందుఁ బరాక్రమించి బలవంతుఁడై తన పరాక్రమమునకుఁ దగిన పనులను జేయఁగలఁడు నాయనా! సుగ్రీవుడాఁ! సుషేణునకుఁ బుత్రికయగు నీతార నానావిధములగు సూక్ష్మార్థములను దెలిసికొనుటయందును, ఉత్పాతవిషయజ్ఞానమునందును మిగుల సమర్థురాలు. కావున నీతార యెట్లు చెప్పునో, యాప్రకారముగాఁ జరుగును. మఱియు నీతారయొక్క మతమెప్పటికిని భిన్నముగా నేరదు. కావున దీనియందును గౌరవముంచుము మఱియు నో సుగ్రీవుఁడా! నీవు రామునికార్యములయందు నీతినిదప్పక ప్రవర్తింపుము నీవన్యాయముగఁ బ్రవర్తించినను, చెప్పినపనిని జేయకపోయినను మహానుభావుఁడగు నీరాముఁడు నిన్నుఁ జంపివేయఁగలఁడు. కావున మిగుల భయభక్తులు గలిగి ప్రవర్తింపుము నాయనా! సుగ్రీవుఁడా! దేవలోకమునుండి వచ్చినదియును, బంగారముచేత నిర్మింపఁబడినదియును, నగు పూలమాలికను నీవు ధరింపుము. నేను మరణమును బొందినపిమ్మట నీపూలమాలికయందలి లక్ష్మి లేచిపోవును. కావున నుదారగుణము గల శోభయీమాలికను వదలిపోకమునుపే నీవు ధరింపుమనియె ఇవ్విధముగా వాలిచేతఁ దమ్మునియందలి స్నేహవశమువలన జెప్పఁబడిన మాటలను విని సుగ్రీవుఁడు అధిక దుఃఖ గలిగియున్న జయమువలనఁ గలిగిన సంతోషమును వదలి రాహువుచేత నాక్రమింపఁబడిన చంద్రునివలె మరల దీనత్వమును బొం

చె. అంతటనా వాలి మరలఁ గొన్నిమాటలను జెప్పఁగా విని యాసుగ్రీవుఁడును, దుఃఖమును వదలినవాఁడును, తొందరపాటు లేనివాఁడును నై యావాలియొక్క యనుమతిని బొందియా బంగారపుమాలిక నుగ్రహించె. ఆవాలి తన బంగారపుమాలిక నిచ్చినపిమ్మట సమీపమునందున్న యంగదునిఁ జూచె. చూచి మరణము నొందుటకు సిద్ధముగా నున్న యావాలి స్నేహముచేత నంగదున కిట్లనియె.

నాయనా! అంగదుఁడా! ప్రియాప్రియములను సహించి యేయే దేశమునం దేయేవిధముగాఁ బ్రవర్తింపవలయునో, యావిధముగాఁ బ్రవర్తింపుము. ఏకాలమునం దెట్లు సంచరింపవలయునో, యావిధము నెఱిగి సంచరింపుము. మఱియు నో యంగదుఁడా! దుఃఖకాలమునందు దుఃఖమును, సుఖకాలమునందు సుఖమును సహింపుము. మఱియు దుఃఖకాలమునందు వచ్చెడు సుఖమును, సుఖకాలమునందు వచ్చెడు దుఃఖమును సహించి సుగ్రీవునకు స్వాధీనుఁడవై సంచరించుచుండుము. గొప్పవగు భుజములుగల యో యంగదుఁడా! నాయనా! నాచేత నేవిధముగా సర్వకాలములయందును లాలింపఁబడుచుంటివో యటులనే చక్కగాఁ బ్రవర్తించుచుంటివేని సుగ్రీవుఁడుగూడ నిన్ను లాలింపఁగలఁడు. కావునఁ గాలమును గనిపెట్టి సంచరింపుము. మఱియు నో యంగదుఁడా! నాయనా! సుగ్రీవునకు శత్రువులగు వారితోఁ గలసిమెలసి యుండు పురుషునితోఁగూడ నీవు సహవాసమును జేయకుము. నీకు శత్రువులగు వారితోఁగూడ నీవు సంచరింపకుము. శత్రువుల నశింపఁజేయుటయందుఁ దగిన సామర్థ్యముగల యో యంగదుఁడా! నీకుం దఱకును రాజగు సుగ్రీవునకు లాభము గలిగెడు కార్యములయందుఁ బ్రవర్తించుచు సుగ్రీవునకు స్వాధీనుఁడవై సంచరింపుము. మఱియు నో తండ్రీ! అంగదుఁడా! "శ్లో॥ నచాతిప్రణయః కార్యః కర్తవ్యోఽప్రణయశ్చ తే। ఉభయం హి మహాన్దోష స్తస్మా దంతరదృగ్భవ॥" నీ వెవ్వరితోడను నధికమగు స్నేహమును జేయకుము. ఎవ్వరితోడను స్నేహమును జేయక నుండకుము. అధికముగ స్నేహము చేసినయెడల స్నేహితులవియోగమువలన మిగుల దుఃఖము గలుగును. స్నేహితులే లేనివాఁడు దిక్కులేనివాఁడగును. కావున నవి రెండును దోషములే యని తెలిసికొనుము. ఈవిషయమును దెలిసి మధ్యస్థుఁడవై సంచరించుచుండుమనియె. ఇవ్విధముగాఁ జెప్పినపిమ్మట రామబాణముయొక్క బాధకుఁ దాళఁజాలక కన్నులను గిరగిరఁ ద్రిప్పి గ్రుడ్లు వెల్లకిల వేసి భయంకరముగ దంతములు గనఁబడునట్లు నోరును దెఱచి ప్రాణములను విడిచె. అటుపిమ్మట నక్కడనున్నవారును, వానరులకుంప్రును భరింపఁదగినవారును, నగు నావానరోత్తములందఱును వ్యసనమును బొందుచున్నవారలగుచు నపరిమితముగా రోదనమును జేసిరి. అట్లు రోదనమును జేయుచు నిట్లనిరి.

అయ్యో! వానరాధిపతి యగు వాలి మరణమును బొందఁగానే యీకిష్కింధాపట్టణమంతయును శూన్యమైపోయె. మఱియు నుద్యానవనములును, పర్వతములును నరణ్యములును, శూన్యములై పోయె. అయ్యో! వానరాధిపతి యగు వాలి మరణమును బొందఁగానే వానరులందఱును గాంతిరహితులై వెలవెలఁబోయిరి. అధికమగు వేగముతో వాలిపోవునపుడు పర్వతములును, పుష్పసముదాయములతోఁ గూడిన వనములును నతనిగమనవేగముచేత నతనితోఁగూడఁ బోవుచుండును. అట్టివాలి యిప్పు డెక్కడకుఁ బోయెను? అయ్యో! మన ప్రభువగు వాలి చచ్చిపోయెనే! యిఁక మన మెట్లు జీవింతుమని ఘొల్లుఘొల్లున దుఃఖించి మఱియు నిట్లనిరి.

పూర్వ మీ వాలి పదునైదుసంవత్సరములు మహాబలుఁడును, గంధర్వులకధిపతియును, నగు గోలభునితో యుద్ధమును జేసె. ఆ పదునైదుసంవత్సరములును రాత్రియని యైన, పగలనియైనను, భేదము లేనియొక యుద్ధమును జేసె. అట్లు పదునైదు సంవత్సరములు యుద్ధమును జేసి పదునాఱవ సంవత్సరమునందా గోలభునిఁ జంపె. అట్టివాలి చచ్చిపోయెను గదా? ఆప్రకారము యుద్ధమును జేసి దుష్టుఁడగు గోలభునిఁ జంపి కోరపన్నులచేత మిగుల భయంకరుఁడై కనఁబడియె. అయ్యో! సకలవిధములచేతను భయమును బోఁగొట్టి కాపాడునట్టి వాలి యెట్లు చచ్చెను. ఆబోతెద్దును జంపిన పిమ్మట సింహములుగల యరణ్యమునందు గోవులెట్లు సుఖమును బొందఁజాలవో యటులనే వానరాధిపతియగు నీవాలి మరణమును బొందినపిమ్మట మనముగూడ నీపట్టణమునందు సుఖముగ నుండఁజాలమని యధికముగా నేడ్చిరి. అంతటఁ దార దుఃఖసముద్రమునందు మునిఁగినదై భర్తయగు వాలియొక్క ముఖమును జూచి గొప్పదగు వృక్షము నాశ్రయించిన తీఁగ చెట్టును గొట్టినపిమ్మట భూమియందు బడినవిధముగ వాలిని గౌఁగలించుకొని క్రందఁబడె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యిరువది రెండవ సర్గము గిసెను.

వాలిభార్యయగు తార మఱల వాలిని గూర్చి విలపించుట.

అటుపిమ్మట నా తార వానరాధిపతియగు సుగ్రీవుని యొక్క ముఖమును నాఘ్రాణించుచు నీలోకమును వదలి పరలోకమునకుఁ బోయినవాఁడును, చచ్చిపడియున్న వాఁడు

నునగువాలితో నిట్లనియె.

అయ్యో! నా శౌర్యుడా! వాలీ! వీరుఁడా! నా మాటను వినక వాళ్ళచేత నిర్మింపఁబడినదియును, మిగులదుఃఖకరమైనదియును, ఎత్తుపల్లములుగలదియును నగు నీవట్టినేలయందు మిగులదుఃఖముగా నెందుకఁబరున్నావు? వానరేన్ద్రుఁడవైన ఓ వాలీ! నీకీభూమి నాకంటెఁ బ్రియమైన భార్యయాయెను? అట్లుగాదేని యీభూమిని గౌఁగలించుకొని యెందుకుఁ బరున్నావు నాతో నెందుకు సంభాషింపవు ఆహా కాలమెంత విపరీతముగనున్నదనవచ్చును. ఈసమయమునందు దైవము సుగ్రీవునకు స్వాధీనుఁడైయుండెను వీరుఁడవును, సాహసముగలవాఁడవును, సాహసముగల వారికిష్టుఁడవును, నాకుఁ బ్రియుఁడవును నైన నా దేవుఁడా! వాలీ! నామనోహరా! ఇప్పుడు సుగ్రీవుఁడే పరాక్రమవంతుఁడని యెడు కీర్తిని సుగ్రీవునకుఁ గలుగఁజేసి నీవు నీలోకమునకుఁ బోతివా? శ్రేష్ఠులగు ఋక్షులును, వానరులును, బలవంతుఁడవగు నిన్నాశ్రయించుచున్నారు. మఱియు వీరందఱును నీచుట్టును గూర్చుండి యేడ్చుచున్నారు. నీపుత్రుఁడగు నంగదుఁడు దుఃఖమును బొందుచున్నాఁడు. నేనును దుఃఖమును బొందుచున్నాను. మాయందఱితోడను నెందుకు మాట్లాడవు. మేమందఱము ఏమి తప్పు జేసితిమి. వానరోత్తముఁడవైన యో వాలీ! నీవనేకుల శత్రువులను జంపి యే వీరశయ్యయందుఁ బరుండఁబెట్టితివో యా వీరశయ్యయందే నీవుగూడ యుద్ధమునందుఁ బరుంటివి. సర్వకాలములయందును యుద్ధమును జేయువానికి యుద్ధమునందే మరణము గలుగునని యెడు మాట నిజమయ్యెనుగదా? అయ్యో నా దేవుఁడా! ప్రాణనాథా! నేనిక నేమి చేయుదును. కపటయుద్ధమును జేయకపోవుటచేత మంచికులమునందుఁ బుట్టితివని ప్రసిద్ధిఁ బొందినవాఁడవును, యుద్ధమునందుఁ బ్రియముగలవాఁడవును, నాకు మనోహరుఁడవును మానమునిచ్చువాఁడవును నైన యో వాలీ! నన్ను దిక్కులేని దానిఁగాఁ జేసి యొక్కఁడవొంటరిగా వదలిపెట్టి నీవు పోతివా? మఱియు నో వాలీ! "శ్లో॥ శూరాయన ప్రదాతవ్యా కన్యా ఖలు విపశ్చితా,, బుద్ధిమంతుఁడగు తండ్రి తనపుత్రికను శూరునకివ్వఁగూడదని యెడు నీతిశాస్త్రము నిజమేగదా? కావున నేశూరునకు భార్యనైన నేనిప్పుడు విధవనై చేయఁబడితినిగదా? అయ్యో నా దేవుఁడా! నేనేమి చేయుదును. మనోహరుఁడవైన యో వాలీ! నామానసంతయును భగ్నమైపోయినదిగదా? నేను శాశ్వతముగా భర్తశుశ్రూషను జేసియుత్తమలోకమును బొందుదునని తలఁచితిని. అట్టి నా తలంపు నిష్ఫలమైపోయెనుగదా? అయ్యో నా దేవుఁడా! వాలిమిగులలోతైనదియును, విస్తారమైనదియును, నగు దుఃఖసాగరమునందు మునిఁగిపోతినిగదా? అయ్యో! చచ్చి క్రిందఁబడియున్న నా భర్తను జూచి పిమ్మటఁగూడ నా హృదయము నూరు వ్రక్కలు గాకపోవుటను జూడఁగా నిశ్చయముగా నా హృదయము ఱాయివలె మిగుల దృఢమైనదని తోచుచున్నది అయ్యో నా భర్తయును, స్వభావముగా నాయందుఁ బ్రేమగలవాఁడును, యుద్ధమునందు మిగులశూరుఁడనియును, పరాక్రమవంతుఁడనియును, పేరునబొందినవాఁడును, నగు నీ వాలి మరణమును బొందెనుగదా? మఱియును "శ్లో॥ పతిహీనాతు యానారీ కామం భవతు పుత్రిణీ। ధనధాన్యైస్సుపూర్ణాపి విధవేత్యుచ్యతే జనైః,, పెనిమిటిలేని యాడుది పుత్రవంతురాలైయున్నను, ధనధాన్యములు మెండుగాఁ గలదియును, నైనప్పటికిని, లోకములోని వారందఱును విధవయని పిలుతురుగదా? కావున నాకుఁ బుత్రునివలనఁ బ్రయోజనమేమి? ఈ సంపదతో నేమి ప్రయోజనము? పరాక్రమవంతుఁడవైన యో వాలీ! నీవు నీశరీరమువలనఁ బుట్టిన నెత్తురునందు "లత్తుకచేత నెఱ్ఱనైన పరుపునందుఁ బరున్న విధముగ" బరుండియున్నావు ఇట్లు నెత్తురునందుఁ బరుండుటకుఁ గారణమేమి? వానరోత్తముఁడవైన యో వాలీ! నీశరీరమునందంతటను దుమ్ము, నెత్తురును వ్యాపించియున్నది. కావున భుజములచేత నిన్నాలింగనమును జేసికొనుట యుచితముగ నుండలేదు. వానరోత్తముఁడవైన యో వాలీ! రాముఁ డొక్క బాణమును బ్రయోగించి సుగ్రీవుని భయమును బోఁగొట్టె. కాఁబట్టి మిగులభయంకరమగు యుద్ధమునందు సుగ్రీవుఁడు ధన్యుఁడయ్యె మఱియు నో మనోనాయకుఁడా! మరణమును బొందిన నిన్నాలింగనమును జేసికొనఁదలఁచిన నన్ను నీహృదయమునందుఁ దగులుకొన్నదియగు బాణము నీశరీరమును దాకకుండునట్లు చేయుచున్నది. నేనేమి చేయుదునని ఘోరాడు ఘోరాడున దుఃఖించుచుండె. ఆసమయమునందు నీలుఁడని యెడు వానరుఁడు వాలియొక్క శరీరమునందుఁ దగులుకొన్నబాణమును, "పర్వతపు చరియయందుఁ బ్రవేశించియున్న పామును బెరికినట్లు" పెరికివైచె అట్లు పెరకఁబడినయా బాణముయొక్క కాంతి యస్తాద్రియందుఁ బ్రవేశించిన సూర్యకిరణమువలెఁ బ్రకాశించుచుండె. ఆసమయమునందా వాలిశరీరమునసుండి, "పర్వతమునుండి గైరికాదిధాతువులు బయలు వెడలినట్లు" నెత్తురపరిమితముగాఁ బయలువెడలె. అందుచేత వాలియొక్క ప్రాణమప్పటికిఁ బొత్తిగాఁ బోలేదని యక్కడనున్నవారందఱును నిర్ణయించిరి. ఆసమయమునందుఁ దార, భర్తయగు వాలియొక్క శరీరమునందు వ్యాపించిన యుద్ధమునందలి దుమ్మును దుడుచుచున్నదై రామ

బాణముచేతఁ జంపఁబడినవాఁడును, శూరుఁడునునగు వాలినిఁ దనకన్నీళ్ళచేతఁ దడిపెను. మఱియు నాతార నెత్తురుచేతఁ దడపఁబడిన సర్వాంగములునుగలవాఁడును, రామబాణముచేతఁ గొట్టఁబడినవాఁడును, నగు భర్తనుజూచి పచ్చని నేత్రములుగలవాఁడును, పుత్రుఁడును, నగునంగదునితో నిట్లనియె.

నాయనా! పుత్రుఁడా! అంగదుఁడా! మీతండ్రియగు వాలియొక్క కడపటియవస్థనుజూడుము ఈయవస్థమిగుల భయంకరముగనున్నది. మీతండ్రియగువాలి పాపరూపమగుకర్మచేత సంభవించినవిరోధముయొక్క యంతమును బొందెను. నాయనా! అంగదుఁడా! బాలసూర్యునివలె నెఱ్ఱనైన శరీరముగలవాఁడును, యమునిపట్టణమునకుఁబోవుచున్నవాఁడును, వానరులకధిపతియును, గౌరవమునిచ్చువాఁడును, నగునీతండ్రికినమస్కారమునుజేయుము ఇఁక మీఁదనీకుఁ దండ్రిదొరకఁడుగదా? అయ్యో నాయనా! అంగదుఁడా! మనమిఁకనెట్లుజీవింపఁగలము. అవశ్యముగమీతండ్రికినమస్కారమును జేయుమనిచెప్పె. ఇవ్విధముగాఁ దార చెప్పినమాటలనువిని యంగదుఁడులేచి తండ్రియొక్క పాదములనుబట్టుకొని నమస్కారమునుజేసె. పిమ్మట మిగుల బలిసియున్నవియును, వట్రువలైనవియును నగుభుజములచేతఁ దండ్రినిఁబట్టుకొని నాయనా! నేనంగదుఁడననియె. ఆసమయమునందుఁ దారయిట్లనియె.

అయ్యో! మనోనాయకుఁడా! వాలీ! నాప్రాణనాథా! నీకునమస్కరించుచున్నవాఁడును, పుత్రుఁడును, నగునంగదునకు మునుపటివలెనే దీర్ఘాయుష్మంతుఁడవుగమ్మని యేందుకు నాశీర్వచనమును జేయవు నీవుమాట్లాడకపోవుటకుఁ గారణమేమి? మఱియునో మనోనాయకుఁడా! నేను బుత్రుడగునంగదునితోఁ గూడఁ దెలివిఁదప్పినచిత్తముగల నిన్ను యాచించుచున్నాను. నేనీసమయమునందు "ఆబోతెద్దును సింహముచంపినపిమ్మట దూడతోఁ గూడియున్నయావు దుఃఖించువిధముగా" దుఃఖించుచున్నాను. మఱియునో మనోహరుఁడా! యుద్ధమనియెడు యజ్ఞమును జేసి రామునియొక్క బాణప్రహారమనియెడునుదకమునందు అవభృథస్నానమును జేసితివిగదా? ధర్మపత్నినగునన్నువిడిచిపెట్టి నీవొక్కఁడవే యవభృథస్నానమును జేయవచ్చునా? దేవతలకందఱకును బ్రభువగునింద్రుఁడు సంతోషించి యుద్ధములయందుధరింపుమని యిచ్చిన బంగారపుమాలిక యిప్పుడేమయ్యె. ఆయ్యో మానమును గాపాడునట్టి యోమనోనాయకుఁడా! వాలీ! మేరుపర్వతమును జుట్టుకొనితిరుగుచున్న సూర్యునియొక్క కాంతి యస్తమయకాలమునందుఁగూడ మేరుపర్వతమును విడిచిపెట్టనివిధముగ" బ్రాణశూన్యుఁడవై క్రిందఁబడియున్ననిన్ను రాజ్యలక్ష్మి విడిచిపెట్టకయున్నది. ఓప్రాణనాథా! వాలీ! నేను నీకుఁ బ్రియమైనమాటలను జెప్పితిని. నామాటలనువినకపోతివి. నిన్ను యుద్ధమునకుఁబోవద్దని యనేకవిధముల జెప్పితినేగాని నిన్నుఁబోకుండునట్లు చేయలేకపోతిని. నీవుయుద్ధమునందుఁ జచ్చిపోవుటచేత నేను బుత్రుఁడగునంగదునితోఁ గూడఁ జచ్చిపోతిని. నీవుపోవుటతోడ నేనీతోఁ గూడ నాశోభయంతయునునశించిపోయె నని యధికముగా రోదనమును జేసె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యిరువదిమూఁడవసర్గముగిసెను.

సుగ్రీవుఁడు రామునిసమీపమునకువచ్చి తానువాలినిఁ జంపించినందుకుతన్నుతానునిందించుకొనుట.

ఆప్రకారముగా దుఃఖమునుబొందుచుఁ గన్నీళ్ళయొక్క వేగముచేతను, దాటశక్యముగాని దుఃఖసముద్రముచేతను, వ్యాప్తమైయున్న తారనుజూచి వాలికిఁదమ్ముఁడును మిగులబలవంతుఁడును, నగుసుగ్రీవుఁడు వాలియన్నయొక్క మరణముచేతను, తారదుఃఖమునుబొందుచుండుటచేతను, నపరిమితముగాదుఃఖమునుబొందెను. మఱియును మిగులబుద్ధిమంతుఁడగు నాసుగ్రీవుఁడు మనస్సునందేమియునుదోచనివాఁడై కన్నీళ్ళచేత వ్యాప్తమయిన ముఖముతో వాలినిజూచియుపరిమితముగా దుఃఖమునుబొందెను. అంతట మిగులనధికముగాఁ బరితాపమునుబొందుచున్నవాఁడై యాసుగ్రీవుఁడు మెల్లమెల్లగాభృత్యులతోఁ గూడ రామునిసమీపమునకుఁ బోయె. పోయి ధనుస్సును ధరించియున్నవాఁడును, మిగులభయంకరమైనదియును, గొప్పదియును, నగుసర్పముతోసమానమగుబాణముగలవాఁడును, సర్వోత్తమమగుకీర్తిగలవాఁడును, శుభలక్షణములతోఁ గూడుకొనిన శరీరముగలవాఁడును, చక్కఁగాఁగూర్చున్నవాఁడును, నగురామునితో నిట్లనియె.

మానవోత్తముఁడవైన యోరాముఁడా! నీవురాజ్యము నిచ్చెదనని చేసినప్రతిజ్ఞను నెరవేర్చితివి. నీవుచేసినపనిమిగులనద్భుతమైయున్నది. నాకిప్పుడు భోగములయందు మనస్సునివర్తించిపోయినది. మఱియును నాకు జీవింపవలయునని యెడునాశగూడలేదు. పురుషోత్తముఁడవైన యోరాముఁడా! పట్టపుదేవియగునీతార మిగులదుఃఖమును బొందుచున్నది. పట్టణములోనిజనమంతయును దుఃఖముచేతఁ దపించుచున్నదై యేడ్చుచున్నది. నాకన్నయగువాలిచంపఁబడియెను. అంగదుఁడుతండ్రిమరణమువలనఁ గలిగినదుఃఖముచే

తబ్రదుకునో, చచ్చునో, యనిసందేహముగలిగియున్నది. కాఁబట్టినామనస్సు రాజ్యముగావలయునని యపేక్షించద ములేదు. పురుషోత్తముఁడవైనయోరాముఁడా! నిర్నిమిత్తముగాఁబట్టణములోనుండి వెడలఁగొట్టుటవలనఁగలిగిన కోపమువలనను, మిగులఁగఠినముగా మాటలాడుటవలనఁ గలిగినక్రోధమువలనను, మిగులనధికముగా బెదరించుటవలనను, నాయన్నయగువాలినిజంపవలయునని పూర్వమునందునాకభిలాష గలిగియుండెను. ఇక్ష్వాకువంశమునందుఁ బుట్టినయోరాముఁడా! వానరాధిపతియగు వాలిచచ్చినపిమ్మట నామనస్సు మిగులఁబరితాపమునుబొందుచున్నది. పురుషోత్తముఁడవైన యోరాముఁడా! ఇప్పుడుపర్వతోత్తమమగు ఋశ్యమూకపర్వతమునందుఁ జిరకాలమునివసించియుండుటే మంచిదనితోఁచుచున్నది. నేనువానరులకుఁదగినజీవనవ్యాపారములతో వనములయందుఁదిరుగుచునుండుటయే, యన్ననుజంపి యతనిరాజ్యము ననుభవించుటకంటెయుచితమనితోఁచుచున్నది. ఇప్పుడునాకుస్వర్గలోకరాజ్యములభించినను నక్కఱలేదు. మఱియునోరాముఁడా! మహానుభావుఁడును, మిగులబుద్ధిమంతుఁడును, నగునీవాలి నాతోఁబూర్వము యుద్ధముజేసినసమయమునందు నిన్నుఁజంపనుబోరా? యనినన్నుఁజంపకవదలెను. ఈవాలి, కర్ముఁడనైన నన్నుఁజంపలేకవిడిచిపెట్టెను. ఆమాటమహానుభావుఁడైనయావాలికేతగును. పాపకర్ముఁడనైయన్నను జంపించిన నాకట్టిమాటతగినదిగాదు. రఘుకులోత్తముఁడవైనయోరాముఁడా! వీరుఁడా! రాజ్యముయొక్కయు, దుఃఖముయొక్కయు, సారమునుదెలియలేక కేవలరాజ్యమునందే యభిలాషగలవాఁడనై మహానుభావుఁడును, అన్నయును, నగువాలినిఁజంపించితిని. అయ్యో నేనెట్టిపాపాత్ముఁడనవచ్చును మఱియునోరాముఁడా! మహాత్ముఁడగువాలి తనమాహాత్మ్యమునకులోపమువచ్చునని తలఁచి నన్నుఁజంపకవిడిచిపెట్టెను. దుష్టబుద్ధిగలనేనుమాత్రము నాదుర్మార్గమువలన నన్నయగువాలికిఁ బ్రాణాపహారమునుజేయించితిని. పూర్వమునందు నేనువృక్షముయొక్క కొమ్మచేతఁ గఠినముగాఁగొట్టఁబడితిని. అట్లుకొట్టఁబడినవాఁడనై మిగులవిచారమునుబొందితిని. అప్పుడీవాలిమంచిమాటలచేతనన్నూరార్చి యోరీసుగ్రీవుఁడా! నీవిఁకమీఁదనిక్కడకు యుద్ధమునకురావద్దనిచెప్పె. మహానుభావుఁడగునీవాలి, భ్రాతృత్వమును, పూజ్యుఁడగువానికుండఁదగినగుణమును, ధర్మమును, దప్పకసంచరించెను. నేనుగోపమునకును, లోభితనమునకును, దగినపాపమును, జేసితిని. మఱియునోరాముఁడా! పాపచిత్తముగలవారిచేతఁగూడ నాలోచింపఁదగనిదియును, పాపమును జేయువారిచేతఁ గూడవిడిచిపెట్టఁదగినదియును, పాపమునందుఁగోరికగల వారిచేతఁగూడఁగోరఁదగనిదియును, సర్వకాలములయందును, పాపకృత్యములనే చేయువారిచేతఁ గూడఁ జూడఁదగనిదియును, నగుపాపమును, "మూఁడుతలలుగలవాఁడును, త్వష్టృప్రజాపతికిఁబుత్రుఁడును, నగువిశ్వరూపునిజంపినయింద్రుఁడు పొందినవిధముగా' బొందితిని. పురుషోత్తముఁడవైనయోరాముఁడా! ఇంద్రుఁడుమహోపకారిగనుకయతనిపాపమును, భూమి, జలము, వృక్షములు, స్త్రీలునుధరించిరి. కొమ్మలయందు సంచరించునట్టిమృగమును, లోకములోనెవ్వరికిని నుపకారమును జేయుటకు శక్తిలేనివాఁడనునైన నాపాపమునెవ్వఁడుభరింపఁగలఁడు. పురుషోత్తముఁడవైనయోరాముఁడా! అన్యాయముతోఁ గూడుకొనినవాఁడును, కులనాశమును గలుగఁజేయునట్టిదియును, నగునిటువంటిపాపమును జేసిననేను ప్రజలయొక్క సన్మానమునకుఁదగను. కావుననేయౌవరాజ్యమునకుఁగూడఁదగను. ఇటువంటినేనిక మహారాజ్యమునుబొందుట కెట్లుతగుదును. మఱియునోరాముఁడా! మిగులనీచమైనదియును, శిష్టజనులచేతనిందింపఁదగినదియును, పట్టణములోనున్నవారలకందఱకును అపకారరూపమైనదియును, నగు పాపమును జేసినవాఁడనైతిని. రాముఁడా! ఇప్పుడీదుఃఖము, వర్షమువలనఁగలిగినప్రవాహము పల్లపునేలయందుఁ బ్రవేశించినవిధముగా నాయందుఁబ్రవేశించుచున్నది. అన్ననుజంపుటయనియెడు నపరగాత్రవాలములు గలదియును, సంతాపములనియెడు హస్తములు మొదలుగాఁగల యవయవములుగలదియును, నగుపాపమనియెడు నేనుఁగ మదించినదియును, వృద్ధినిబొందినదియును నగుచు నదులయొక్కయొడ్డునుబాడిచినవిధముగా నన్నుబాధించుచున్నది. మఱియునోరాముఁడా! పాపమను గజరూపమునవచ్చి నన్నుబాధించుచున్నది. పురుషోత్తముఁడవైన యోరాముఁడా! ఇదివఱకు నేనేమైనపుణ్యమునుజేసియుంటినేని యాపుణ్యమంతయును నిప్పుడు నేనుజేసినపాపముతోఁ గూడనుండ జాలక బంగారమునునగ్నియందుఁ గాచినప్పుడు దానియందలిమలినమంతయును దానియందుండఁజాలక బయలువెడలిపోవునట్లు బయలువెడలిపోవుచున్నది ఆహా నేనేమనిచెప్పవచ్చును. రఘుకులోద్భవుఁడవైనయోరాముఁడా! నామూలకముగాను, అంగదుఁడు దుఃఖమునుబొందుచుండుటవలనను, మిగులబలముగలవారును, వానరులగుంపునకధిపతులును, నగువానరులయొక్క కులమంతయును సగముప్రాణములేనిదైనట్లు తోఁచుచున్నది. పురుషోత్తముఁడ

వైనయోరామఁడా! పుత్రుఁడు దొరుకును, మంచివారలు సులభముగా దొరుకుదురు. అయినప్పటికిని అంగదునితోసమానమైనపుత్రుఁడు దొరకఁడు. మఱియునోరామఁడా! వీరుఁడా! అన్నదమ్ములయొక్క సంబంధము ఏదేశమునందుండునో యాదేశమునందుండవలయును. అన్నదమ్ములులేని దేశమునందుండఁగూడదు వీరవరులలో నుత్తముఁడవైన యోరాముఁడా! అంగదుఁడు జీవించెనేని యతనినిబరిపాలించుటకొఱకు తల్లియగుతారజీవించును పుత్రుఁడగునంగదుఁడు పితృదుఃఖమునుభరింపలేక మరణమును బొందెనేని తారగూడ మరణమునుబొందునని తోచుచున్నది. రాముఁడా! అంగదుఁడును దారయును జీవించెనేని నేనుజీవింతును. లేనియెడల నేనుగూడమరణమును బొందుదును. పురుషోత్తముఁడవైనయోరాముఁడా! నేను, అన్నయగువాలితోడను, పుత్రుఁడగునంగదునితోడను, స్నేహమును జేయుటకొఱకు మిగులనధికముగాఁ బ్రజ్వలించుచున్న యగ్నిహోత్రమునందుఁ బ్రవేశించెదను. నీభార్యయగు సీతను వెదకుటకొఱకు నీయాజ్ఞానుసారముగ నీవానరులందఱును బ్రవర్తింపఁగలరు. మఱియునీవానరులందఱును నీయాజ్ఞనుబొంది సకలదేశములకునుబోయి సీతను వెదకఁగలరు. మానవేన్ద్రుఁడగు దశరథమహారాజునకుఁ బుత్రుఁడవైనయోరాముఁడా! నేనుమరణమునుబొందినపిమ్మట నీవానరులందఱును నీకార్యమును నిరాటంకముగఁ జేయఁగలరు. కావుననోరాముఁడా! కులనాశకుఁడను, మిగులనధికమగుపాపమును జేసినవాఁడను, బ్రతికియుండుటకుఁ దగనివాఁడను నగు నేనుమరణమును బొందుటకధికారము నిమ్మని యెను. ఈప్రకారముగా మిగులవ్యసనముతో మాటలాడుచున్నవాఁడును, వాలికిఁదమ్ముఁడును నగు సుగ్రీవునియొక్క మాటను విని శత్రువీరులను సంహరించునట్టి రాముఁడు కన్నీళ్లతోఁగూడినవాఁడై క్షణమాత్రమేమియును దోచనివాఁడయ్యె అంతనాసమయమునందు మాటిమాటికిని దారిచే తఁజూడఁబడుచున్నవాఁడును, భూమిదేవియొక్క యోర్పువంటియోర్పు గలవాఁడును, లోకములను గాపాడువాఁడును, నగు రాముఁడు, వ్యసనమును బొందుచున్నదియును, దుఃఖసముద్రమునందు మునిగియున్నదియును, నగు తారయొక్క దుఃఖమును బోఁగొట్టవలయునని యెడు తలంపుగలవాఁడైయాతారనుజూచె. ఆసమయమునందు వాలియొక్కయు, సుగ్రీవునియొక్కయు, మంత్రులందఱును, సుందరములగునేత్రములుగలదియును, వానరాధిపతియును, తనకుభర్తయునునగు వాలినిగౌఁగలించుకొనినదియును, భర్తనుగాగలించుకొని భర్తయొద్దమరణమును బొందఁదలఁచియున్నదియును, మిగులబుద్ధికుశలతగలదియును, వానరాధిపతియగువాలికిభార్యయును, నగుతారను లేవఁదీసిరి. అట్లుమంత్రులచేతభర్తయొక్క సమీపమునుండి తొలిగింపఁబడినదియును, ప్రకాశించుచున్నదియునునగు నాతార, బాణమును, విల్లును, జేతియందుఁధరించుకొనియున్నవాఁడును, తనయొక్క తేజస్సుచేతసూర్యునివలెఁ బ్రకాశించుచున్నవాఁడును, నగు రామునిఁజూచె. మఱియును లేడిపిల్లయొక్క నేత్రములవంటి నేత్రములుగలదియగు నాతార రాజలక్షణములతోఁ గూడుకొనినవాఁడును, నదివఱకెన్నఁడును జూడఁబడనివాఁడును, పురుషోత్తముఁడునునగు వానిని జూచియితఁడే సుగ్రీవునకు రాజ్యమునిచ్చెదనని చెప్పినవాఁడనియును, కకుత్స్థునికులమునందుఁ బుట్టినవాఁడనియును, నంగదునిచేతఁ జెప్పఁబడినవాఁడనియును నిశ్చయించె. అంతటఁ బూజ్యురాలగు నాతారదేవేంద్రునితో సమానుఁడును, శత్రువులచేతఁ బొందశక్యముగానివాఁడును, మహానుభావుఁడును, నగునారామునియొక్క సమీపమునకు మిగులవ్యసనమును బొందుచున్నదియును, మిగులనధికమగు దుఃఖముతోఁగూడుకొనినదియును, నగుచును తిశీఘ్రముగఁబోయె. అప్పుడు యుద్ధములయందు స్థిరమైన లక్ష్యముగలవాఁడగునారాముని సమీపమునకుఁబోయి పరిశుద్ధమైన స్వభావముగలదియును, దుఃఖముచేతఁదిరుగుడుపడుచున్నశరీరమును, మనస్సునుగలదియును, మిగుల దృఢముగాను, యుక్తియుక్తముగాను మాట్లాడనేర్చినదియును, నగునాతారయిట్లనియె.

రఘుకులోత్తముఁడా! నీవింతటివాఁడవని గణనచేయుటకుశక్యముగానివాఁడవును, శత్రువులచేతఁ బొందశక్యముగానివాఁడవును, ఇంద్రియములను జయించినవాఁడవును, ధర్మవంతులలోనత్యుత్తముఁడవును, నశింపనికీర్తిగలవాఁడవును, మిగులనేర్పుగలవాఁడవును, భూమిదేవియొక్కయోర్పువంటియోర్పుగలవాఁడవును, ఎఱ్ఱనినేత్రములుగలవాఁడవును, విల్లును, బాణమును, జేతియందుఁబెట్టుకొన్నవాఁడవును, మిగులబలముగలవాఁడవును, సుందరములగునవయవములతోఁగూడుకొన్నవాఁడవును, నగునీవు మానవశరీరమునువదలి దివ్యశరీరమునుబొంది యుంటివి. మఱియును మహానుభావుఁడవైనయోరాముఁడా! నీవుఏబాణముచేతవాలిని జంపితివో, యాబాణముచేత నన్నుఁగూడఁజంపుము. నేనుమరణమునుబొందినపిమ్మట నీవాలియొక్క సమీపమునకుఁబోయెదను. నన్నువదలివాలియేలోకమునందునుగ్రీడింపఁజాలఁడు. కాఁబట్టినన్నుఁ జంపివాలియొద్దకుఁబంపుము. పద్మములవలెనిర్మలమైన నేత్రములుగ

లవాఁడగు వాలినన్నుఁజూడకపోయెనేని స్వర్గమునందుఁ
గూడసంతోషమునుబొందజాలఁడు. మఱియు నోరాముఁ
డా! యీవాలిస్వర్గమునందుఁగూడ నానావిధములగునె
జ్జివుష్పములచేత శిరస్సునందలంకరించుకొనిన వారును,
నానావిధములైన యలంకారములుగలవారును, నగనప్స
రస్త్రీలతోఁగూడఁ గ్రీడించుటకు సమాధానమునుబొందఁ
డు. వీరుఁడవైనయోరాముఁడా! యీవాలి, స్వర్గమునం
దుఁగూడ, "మిగులమనోహరమైనఋశ్యమూకపర్వతము
నందలి తటాకమునందుసీతలేకపోవుటవలన నెటువంటి
దుఃఖమునుబొందితివోయటులనే,, నేనులేకపోవుటవలనదుః
ఖమును, వైవర్ణ్యమునుబొందఁగలఁడు. (అనఁగానేనుస
మీపమునందులేకపోవుటవలన స్వర్గలోకముగూడ వాలికి
మనోహరమైయుండదు) పురుషోత్తముఁడవైన యోరా
ముఁడా! "పడుచుఁదనముగలపురుషుఁడు భార్యలేకపోవు
టవలననెట్టిదుఃఖమునుబొందునో" యావిషయమును నీవె
ఱుంగుదువుగదా? కావుననీవాదుఃఖమును దెలిసినవాఁడవుగ
నుకనన్నువధింపుము. నేనుమరణమునుబొంది వాలియొద్ద
కుఁబోతినేనినన్నుఁజూచి యానందమునుబొందును. రా
ముఁడా! మహానుభావుఁడవైననీవునన్నుఁజంపుటవలన స్త్రీ
వధదోషమువచ్చునని భయమునుబొందకుము నన్నుజం
పుటవలన నీకుస్త్రీహత్యరాదు. మానవోత్తముఁడైనదశ
రథునకుఁబుత్రుఁడవైనయోరాముఁడా! నేనువాలియొక్క
యాత్మలోసగమాత్మనుగదా? నన్నుఁజంపనియెడల వాలిని
బూర్ణముగాఁజంపినవాఁడవుగావు. నన్నుగూడఁ జంపిన
యెడలవాలినిబూర్ణముగాఁ జంపినవాఁడవగుదువు. కా
వుననన్నుఁజంపుటవలన నీకుఁబాపముగలుగనేరదు. మఱి
యునోరాముఁడా! "శ్లో॥ శాస్త్రప్రయోగాద్వివిధా
చ్చ వేదాదాత్మాహ్యనన్యః పురుషస్యదారాః। దారప్రదా
నాన్నహిదానమన్యత్ప్రదృశ్యతే జ్ఞానవతాంహిలోకే॥ శా
స్త్రములవలనను, వేదములవలనను, భార్యపురుషునియా
త్మకంటెవేరుగాదనిస్పష్టముగఁ దెలియుచున్నది. ఈలోక
మునందు భార్యనుదానముచేయుటకంటె. (అనఁగాఁబు
రుషునకునుభార్యకును వియోగముగలిగినపుడైనను, వివా
హమేగానివానికైనను, భార్యగలుగునట్లుసేయుటకంటె)
శ్రేష్ఠమగుపుణ్యములేదని జ్ఞానవంతులగు వారుచెప్పుదురు.
కావుననన్నుపురుషునితోఁజేర్చి మాయిద్దఱకును సుఖమును
గలుగఁజేయుము. వీరుఁడవైనయోరాముఁడా! నాకుఁబ్రి
యుఁడగు వాలికినన్నుదానముసేసియుత్తమమగు ధర్మము
నుసంపాదించుకొనుము. వీరుఁడవైనయోరాముఁడా! న
న్నుఁజంపినాభర్తకుదానమునుసేసితివేని యీదానముచేత
నీవుపాపమునుబొందనేరవు. పురుషోత్తముఁడవైన యో
రాముఁడా! మదపుటేనుఁగువలెనడచువాఁడును, వానరు
లకధిపతియునునగు వాలివలనఁదోలింపఁబడిన దానను,
భర్తృవియోగముచేత దుఃఖమును బొందుచున్నదానను,
దిక్కులేనిదానన, నైననన్నుఁజంపుటకునీవుతగుదువు. ఉ
త్తములలోనుత్తముఁడవైనయోరాముఁడా! మానవోత్త
ముఁడా! బంగారపుమాలికనుధరించినవాలినివదలిజీవింపఁ
జాలనని చెప్పె. ఈవిధముగాఁదార చెప్పినమాటలనువినిప్ర
భుఁడును, మహానుభావుఁడును,నగురాముఁడు తారనుమం
చిమాటలచేత నోదార్చి హితవచనములను జెప్పఁదలఁచి
యిట్లనియె వీరునకుభార్యవైనయోతారా! నీవువేరువిధము
గఁదలఁచిబుద్ధినిబాధసేసికొనవద్దు. ఈలోకమంతయును
బ్రహ్మదేవునిచేతఁజేయఁబడినది. మఱియునీలోకమంతయు
నుబ్రహ్మదేవునిచేత సుఖదుఃఖములతోఁ గూడియుండున
ట్లుచేయఁబడినదని మనువుమొదలుగాఁగల వారుచెప్పిరి.
మూఁడులోకములును బ్రహ్మదేవునిచేతఁ జేయఁబడినవి.
కావుననీమూఁడులోకములును నాబ్రహ్మదేవుని యధీన
ములైయున్నవి. కావుననీవువిచారమునుబొందకుము ఇఁ
కమీఁదనీవుగొప్పదగుప్రియమునుబొందఁగలవు. నీపుత్రుఁడ
గునంగదుఁడుయౌవరాజ్యమునుబొందఁగలఁడు. కావున
నీవువ్యసనమునుబొందకుము. సర్వమునుదైవమునిర్మించిన
విధముగానగును. కావునశూరులగు వారిభార్యలువ్యసన
మునుబొందరనియె ఇవ్విధముగా రఘుకులమునందుఁబు
ట్టినవాఁడును, మిగులనధికమగుసామర్థ్యముతోఁ గూడు
కొనినవాఁడును, శత్రువులను దపింపఁజేయువాఁడునునగు
రామునిచేత, తారయోదార్చఁబడినదయ్యె. అంతటవీరభా
ర్యయును, చక్కనియలంకారముగలదియును, నగునాతా
రయపరిమితముగారోదనమునుజేయుచుఁ కంటినుండినీరు
ధారధారగా బ్రవహింపవెక్కివెక్కియేడ్చుచు గొంతసే
పటికూరకుండె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యిరువదినా
ల్గవసర్గముగిసెను.

సుగ్రీవుఁడువాలికిప్రేతకృత్యములను జేయుట.

సుగ్రీవుఁడుమొదలగువారిదుఃఖముతోసమానమయినదుః
ఖముగలవాఁడును, కకుత్స్థునివంశమునందుఁబుట్టినవాఁడు
ను, లక్ష్మణునితోఁగూడుకొనినవాఁడునునగు రాముఁడు
సుగ్రీవాంగదతారలనూరార్చుచునిట్లనియె.

వాలిబంధువులారా! మీరిఁకమీఁద మిగులవ్యసనమును

పొందకుఁడు మీరుమిగులవ్యసనమును బొందుచుండినమెదలవాలియుత్తమలోకమునకుఁబోఁజాలఁడు. కావునసిప్పుడువ్యసనమునుజాలించి యిప్పుడుచేయఁదగిన పరలోకక్రియలను జేయుఁడు. మరణకాలమునందీలోకమునందుఁ జేయఁదగినరోదనమును జేసితిరి. కావుననిఁకమీఁద రోదనము జేయక యిప్పుడుపరలోకమునకు ఉపయోగించెడు క్రియలను జేయుఁడు. మఱియునోవానరోత్తములారా! "శ్లో॥ నియతిః కారణంలోకేనియతిఃకర్మసాధనం। నియతిస్సర్వభూతానాంనియోగేష్విహ కారణమ్॥ నకాలఃకాలమత్యేతినకాలఃపరిహీయతే। స్వభావంచసమాసాద్యనకశ్చిదతివర్తతే॥ నకాలస్యాస్తిబంధుత్వంనహేతుర్న పరాక్రమః నమిత్రజ్ఞాతిసంబంధఃకారణంనాత్మనోవశః॥ కింతుకాలపరీణామోద్రష్టవ్యస్సాధుపశ్యతా। ధర్మశ్చార్థశ్చకామశ్చ కాలక్రమసమాహితాః॥ ఈలోకమునందు దైవముకారణము. సకలకర్మలకును దైవమేసాధనమైయున్నది. సకలభూతములకును దైవమేనియామకుఁడు. సకలకార్యములయందును దైవమేకారణమైయున్నాఁడు. మఱియునీలోకమునందు దేనికినినెవ్వఁడునుకర్తగాదు. ఈలోకమునందు ఏకార్యమును జేయుటకు నెవ్వఁడునుగర్తకాదు. లోకమంతయును దైవాధీనమైయున్నది. కావునసర్వమునకును దైవమేయాధారమైయున్నాఁడు. కాలస్వరూపుఁడగు దైవమెప్పుడును నాశమును బొందువాఁడుగాఁడు కాలస్వరూపుఁడగు దైవము జేనిచేతను దక్కువై చేయఁబడదు సర్వప్రపంచమును దైవాధీనత్వమును బొంది సంచరించునుగాని స్వతంత్రముగ సంచరింపఁజాలదు. కాలమునకీలోకమునందెక్కడను బంధుత్వములేదు. దైవమును స్వాధీనమును జేసికొనుటకుఁదగినసాధనమేమియును లేదు. దైవమును వశపరచుకొనుటకుఁ దగినపరాక్రమమనునదియును లేదు. కావునసకలలోకములకును, సకలవిషయములకును గాలముగారణమయియున్నది. సర్వమును జక్కఁగా యోచించుచున్న బుద్ధిమంతునిచేత సర్వమును గాలవశముచేత జరుగుచున్నదని యోచింపవలయును. ధర్మార్థకామములను మూఁడును కాలవశముచేతవచ్చుచుండును

మఱియు నోవానరోత్తములారా! వానరాధిపతియగునీవాలి తానుజేసినదుష్కృత్యమునకుఁ బ్రాయశ్చిత్తముగానాబాణముచేత మరణమును బొందెను. కావునఁబాపమంతయును నశించినది. ఇంతటనీవాలి ధర్మార్థకామములతోఁగూడుకొనినవాఁడై పరిశుద్ధుఁడగుచుఁ బావనమగుస్వర్గలోకమును బొందెను. మఱియును మహానుభావుఁడగు నీవాలి తనయొక్కధర్మవశమువలన స్వర్గలోకమును స్వాధీనముగాఁజేసికొనెను. ప్రాణములను మాత్రము రక్షించుకొనలేకపోయెను మఱియునీవాలి దైవవశముచేత ఏలోకమును బొందెనో, యాలోకము మిగులశ్రేష్ఠమైనది. మీరుపరితాపమును బొందుటవలన నేమిప్రయోజనముగలదు. ఏమియును బ్రయోజనములేదు. కావునమీరు విచారమును బొందకుఁడనియె. ఇవ్విధముగా రాముఁడు చెప్పి చాలించినపిమ్మట శత్రువులను నశింపఁజేయునట్టి లక్ష్మణుఁడు చిత్తస్వాస్థ్యములేక వ్యసనమును బొందుచున్న సుగ్రీవునితో వినయయుక్తమగుమాటను జెప్పఁదలఁచియిట్లనియె.

వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! నీవుతారాంగదులతోఁగూడ వాలికిదహనసంస్కారము మొదలుకొని ప్రేతకృత్యములనన్నింటిని జేయుము. మఱియునోసుగ్రీవుఁడా! ఎండిపోయినవియును, మిగులదృఢమయినవియును, చందనవృక్షము మొదలుగాఁగలవృక్షములసంబంధమైనవియును, అనేకవిధములైనవియును నగుకట్టెలను దెప్పింపుము. ఆకట్టెలన్నియును వాలినిదహనముచేయుట కుపయోగించును. మఱియునోసుగ్రీవుఁడా! వ్యసనాక్రాంతుఁడగు నీయంగదుని నోదార్పుము. నీవు పసితనపుబుద్ధి నవలంబింపకుము. ఈపట్టణమంతయును నీయధీనమైయున్నది. అంగదునిచేత మిగులఁ బరిమళముగలపూలమాలికలను, నానావిధములగు వస్త్రములను దీసికొనివచ్చునట్లుచేయుము. మఱియునీయంగదునిచేత నేతిని, తైలమును, గంధములను, మఱియును జేఁదగిన పదార్థములను దెప్పింపుము. తారానాథుఁడవైనయోసుగ్రీవుఁడా! నీవుమిగులశీఘ్రముగఁబోయి శిబికనుదీసికొనిరమ్ము. ఈసమయమునందు శీఘ్రతమిగులగుణములు గలదియని తెలిసికొనుము. అదియునుగాక యీసమయమునందు వేగిరపాటుమిగులనుచితమైయున్నది. శిబికనుమోయుటకుఁదగినసామర్థ్యముగలవారును, బలవంతులును, నగువారలనువాలినిమోసికొనిపోవుట కాయత్తముగఁ జేయుము. బలవంతులేగాని బలహీనులగువారీ వాలినిమోయఁజాలరనిసుమిత్రాదేవికిఁ బుత్రుఁడును, శత్రువీరులనువధించువాఁడునునగులక్ష్మణుఁడీవిధముగాఁజెప్పి యన్నయగురాముని సమీపమునందు మఱియేమియును జెప్పకయూరకుండె. ఇవ్విధముగాలక్ష్మణుఁడు చెప్పినమాటనువిని యాసుగ్రీవుఁడు త్వరతోఁగూడిన మనస్సుగలవాఁడును, శిబికను దెచ్చుటకుద్యుక్తమైనమనస్సుగలవాఁడునునై యతిశీఘ్రముగ గుహవలెనున్న కిష్కింధాపట్టణములోనికిఁబోయెను. పోయి యాసుగ్రీవుఁడు వీరులును, మిగులబలముగలవారును, శవమును మోయుటకుఁదగినవారునునగువానరులచేత శిబికను మోయించుకొనుచు నతిశీఘ్రముగమరలవచ్చె. ఆశిబిక, దివ్యమైనదియు

ను, మంగళకరమగు సింహాసనముతోఁ గూడుకొనినదియును, రథముతో సమానమైనదియును, పక్షులయొక్క యాకారములవంటి యాకారముగల బొమ్మలతోఁగూడుకొనినదియును, అనేకవిధములగు కొయ్యబొమ్మలుగలదియును, చిత్రములగు రేఖలుగలదియును, మనోహరమగు కాంతిగలదియును, సూక్ష్మములగు రంధ్రములతోడను, గోవుయొక్క నేత్రమంత పరిమాణముగల రంధ్రములతోడను, గూడుకొనినదియును, సిద్ధులయొక్క విమానములను బోలియున్నదియును, సంధులయందుఁ జక్కగాఁ గదిసినదియును, మిగుల వెడల్పుగలదియును, విశ్వకర్మచేతఁ జక్కగా రచింపఁబడినదియును, కొయ్యలచేత నిర్మింపఁబడిన క్రీడాపర్వతములుగలదియును సుందరములగు పనులచేత నలంకరింపఁబడినదియును, శ్రేష్ఠములగు నాభరణములచేతను, పూలమాలికలచేతను, విచిత్రములగు మాల్యములచేతఁ బ్రకాశించుచున్నదియును, గుహలచేతను, వనములచేతను, వ్యాప్తమైనదియును, ఎఱ్ఱనిచందనముచేత వ్యాప్తమైనదియును, పుష్పసముదాయములచేతను, బాలసూర్యునియొక్క వర్ణమువంటి వర్ణముగలదియును, ప్రకాశించుచున్నదియును, నగు పద్మమాలికలచేత వ్యాప్తమైనదియును, నై మిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండె. ఇటువంటి శిబికనుజూచి రాముఁడు లక్ష్మణునితో నిట్లనియె.

తమ్ముఁడా! వాలిని శీఘ్రముగ శిబికయందుఁ బెట్టి ప్రేతకార్యమును జేయింపుము. అంతట నంగదునితోఁ గూడ సుగ్రీవుఁడు వ్యసనమును బొందుచు నా వాలిని మోసి శిబికయందుఁ బెట్టె. నానావిధములగు నాభరణములచేతను, మాల్యములచేతను, వస్త్రములచేతను, నలంకరింపఁబడినవాఁడును, ప్రాణము పోవుటచేతఁ గ్రిందఁబడియున్నవాఁడును, నగు వాలిని శిబికయందుఁ బెట్టినపిమ్మట వానరులకధిపతియును, రాజునునగు సుగ్రీవుఁడప్పుడు పూజ్యుఁడగు వాలికిఁ బరలోకక్రియలను శాస్త్రోక్తప్రకారముగఁ జేయుటకాజ్ఞనిచ్చె. మఱియు నా సుగ్రీవుఁడు నానావిధములును, అనేకములును, నగు రత్నములనిచ్చుచు వానరులందఱును ముందరఁ బోవునట్లును, శిబికవారి వెంబడి బోవునట్లును నాజ్ఞాపించె. మఱియును రాజులకభివృద్ధిగలుగుటకు భూలోకమునం దెటువంటి కార్యములను జేయుదురో యట్టి క్రియలనన్నింటిని జేయించె. ఇంతియగాక పరలోకమునందుపయోగించునట్టి క్రియలను గూడ నతిశీఘ్రముగఁ జేయించె. ఆసమయమునందు వచ్చిన బంధువుగల తార మొదలుగాఁగల వానరులందఱును నధికముగా రోదనమును జేయుచు నంగదుని గౌఁగలించుకొని యధికముగా రోదనమును జేసిరి. పిమ్మట ఆప్తులగు వానరులును, వానరస్త్రీలును, వాలియొక్క వశమును బొందినవారై వీరుఁడా! వీరుఁడా! వాలీ! యని యధికముగా రోదనమును జేసిరి. మఱియు నాసమయమునందు తారమొదలగు వానరస్త్రీలును, వానరుల గుంపులకు నధిపతులగువారును, దీనమగు స్వభావముగలవారై భర్తతోఁగూడఁ బోవుచు నతిదీనముగా నేడ్చిరి. అట్లు రోదనమును జేయుచున్న వానరస్త్రీలయొక్క రోదనధ్వనిచేత సర్వస్థలములయందును, వనములును, పర్వతపుగుహలును, ప్రతిధ్వనులుగలవయ్యె. అంతట వానరులందఱును నధికమగు దుఃఖముచేతఁ బీడింపఁబడినవారై నిర్జనమైనదియును, నుదకముగలదియును, నగు నొక్కనదీప్రదేశమునందలి యిసుకదిబ్బయందుఁ జితిని నిర్మించిరి అంతట నా వాలియొక్క శవమును మోసికొనివచ్చిన వానరులందఱును, తమభుజములమీఁదనుండి శిబికను గ్రిందఁ దింపిరి. అప్పుడు వానరులందఱును నా యేకాంతస్థలమునందు దుఃఖమును బొందుచుఁ గూర్చుండిరి. ఆసమయమునందుఁ దార, తనకు భర్తయును శిబికయొక్క ప్రదేశమునందున్నవాఁడును, నగు వాలిని జూచి యతనియొక్క శరీరమును దనతొడయందుఁ బెట్టుకొని యధికమగు దుఃఖమును బొందినదగుచు నధికముగా విలపించె. మఱియు నాసమయమునందు ఆ తార, యో వానరుఁడా! యో వానరమహారాజా! యో మనోనాథుఁడా! నాయందు వాత్సల్యముగలవాఁడా! యో పూజ్యుఁడా! గొప్పవగు భుజములుగలవాఁడా! నా ప్రియుఁడా! నా మనోహరా! నా ప్రాణనాథా! నన్నుఁ జూడుము. మఱియు నిందలి జనమంతయును శోకముచేత మిగులఁ బీడితమైయున్నది చూడుము. మానమునిచ్చునట్టి యో వాలీ! ప్రాణము పోయినపిమ్మటఁగూడ నీముఖము నవ్వుచున్నట్లు కనఁబడుచున్నది. నీముఖమునఁ గొంచెమైనను, పీనుఁగుకళ కనఁబడలేదు. నీవు బ్రతికియున్నసమయమునందు నీముఖము అస్తమయమును బొందుచున్నసమయమునందు సూర్యునియొక్క ముఖకాంతి యెట్లుండునో యట్లుండును. ఇప్పుడును నవ్విధముగా నేయున్నది. మఱియు నో వాలీ! ఈ రాముని రూపమును ధరించి యముఁడిక్కడకు వచ్చి నిన్నుఁ జంపెను. అట్లుగాదేని యీ రాముఁడొక్క బాణముచేత మమ్ములనందఱ నొక్క నిమిషములో విధవలనుగాఁ జేసెను. రాజోత్తముఁడవైన యో వాలీ! ఈ వానరస్త్రీలందఱును సర్వకాలములయందును నీకుఁ బ్రియముగ సంచరించుచుందురుగదా? ఇట్టి వానరస్త్రీలందఱును పాదములతో నడిచి నీతోఁగూడ మిగుల దూరము వచ్చినారు. నీకొఱకు మిగుల శ్రమపడి వచ్చిన యీ వానరస్త్రీల నెందుకుఁ జూడవు. మనోహరుఁడవైన యో వాలీ! చంద్రబింబమువంటి మోముగల యీ వాన

రస్త్రీలందఱును నీకిష్టమైనవారేగదా? ఇట్టివారల నేలదుఃఖ జూడవు. మఱియు నోమనోనాయకుఁడా! ప్రాణనాథా! వాలీ! వానరాధిపతియును, నీతమ్ముఁడును నగుసుగ్రీవు నినేలచూడవు? ఈసుగ్రీవుఁడు మొదలగువానరులంద ఱునునీకుమంత్రులుగదా? పాపరహితుఁడవైన యోవాలీ! పట్టణమునందుండునట్టి యాజనమంతయును నిన్నుఁజుట్టు కొనితిరుగుచున్నది. శత్రువులను నశింపఁజేయువాఁడవైన యోవాలీ! యీవానరులకందఱకును దగినమర్యాదలను జేసి యుండ్లకుఁబంపుము. వీరందఱును బోయినపిమ్మట నిక్కడ వనమునమిగుల నధికమగుమదముగలవారమై క్రీడింతమనియ ధికముగా రోదనమును జేయుచుండె. ఇట్లురోదనమును జే యుచున్నతారను, వానరస్త్రీలందఱును దుఃఖముతోఁగూ డిన వారలయ్యును, నప్పుడు లేవఁదీసిరి. అంతటనంగదుఁ డు సుగ్రీవునితోఁగూడ రోదనమును జేయుచు దుఃఖముచేత వికలములైన యింద్రియములుగలవాఁడై తండ్రియగువాలి యొక్క కళేబరమును చితియందుఁబెట్టె. అంతటనాయంగ దుఁడు శాస్త్రోక్తప్రకారముగఁ దండ్రికినగ్నిదానమును జేసి యాచితికపసవ్యముగాఁదిరిగె. అవ్విధముగనాయంగ దుఁడు వ్యాకులములైన యింద్రియములుగలవాఁడై మిగు లదూరమువచ్చిన తండ్రికిఅగ్నిదానమును జేసినతోడనే యావాలికిమిగిలిన వానరులందఱును చేయఁదగిన వి ధముగసంస్కారమును జేసిరి. అంతటనావానరులందఱును వాలికినుదక దానమును జేయుటకొఱకు నంగదునిముందు నిడుకొని చల్లనిజలములుగలదియును, పావనమైనదియును నగు నొకనదికిఁబోయిరి. అప్పుడువానరులందఱును, సుగ్రీ వునితోడను, తారతోడనుగూడుకొనినవారై వాలికినుదక దానమును జేసిరి. ఆసమయమునందు దీనుఁడగుసుగ్రీవుని తోసమానముగ రాముఁడు, దుఃఖముగలవాఁడును, దీన మైన మోముగలవాఁడును, నయ్యె. అంతట మహాబలుఁడు ను, కకుత్స్థునికులమునందుఁబుట్టినవాఁడును, నగురాముఁ డు మిగిలినప్రేతకార్యము లన్నింటిని జేయించె. అంతట సుగ్రీవుఁడు సర్వోత్తమమగు పరాక్రమముగలవాఁడును, మిగులనధికమగు తేజస్సుచేతఁ బ్రకాశించుచున్నవాఁడు ను, రామునియొక్క శ్రేష్ఠమగునొక్కబాణముచేతఁ గొ ట్టఁబడినవాఁడును, ప్రజ్వలించుచున్న యగ్నితోసమానమై న తేజస్సుగలవాఁడును, నగువాలినిశాస్త్రోక్త ప్రకారము గదహనమును జేసి యప్పుడులక్ష్మణునితోఁ గూడినరాముని సమీపమునకుఁ బోయె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమున నిరువదియైదవ విసర్గముగిసెను

వానరులుసుగ్రీవునికిబట్టాభిషేకము సేయుట.

అటుపిమ్మట అన్నయగు వాలిచచ్చిపోవుటవలనఁ గలిగి నదుఃఖముచేత వ్యసనమును బొందుచున్నవాఁడును, తడి సినవస్త్రము గలవాఁడును, నగుసుగ్రీవునిఁ జుట్టుకొని ప్ర ధానులగు వానరులందఱును నిలిచియుండిరి. పిమ్మటసుగ్రీ వుఁడు మొదలగువానరులందఱును మిగులగొప్పవగు భుజ ములుగలవాఁడును, సకలకార్యములను శ్రమలేకయే చే యువాఁడును, నగురామునిఁజుట్టును జేతులనుముకుళించు కొని బ్రహ్మదేవునిచుట్టును ఋషులునిలుచున్న విధముగని లుచుండిరి. ఆసమయమునందు బంగారపు పర్వతమునొ క్క కాంతివంటి కాంతిగలవాఁడును, బాలసూర్యునితో సమానమగు మోముగలవాఁడును, వాయుదేవునకుఁ బు త్రుఁడును, నగుహనుమంతుఁడు చేతులను ముకుళించుకొ ని రామునితో నిట్లనియె.

రఘుకులోత్తముఁడవైన యోరాముఁడా! నీయనుగ్ర హముచేత నీసుగ్రీవుఁడు దండ్రితాతలనాటనుండి వచ్చుచు న్నదియును, మిగులగొప్పదియును, వానరులచేతఁబొంద శక్యముగానిదియును, నగునీరాజ్యమును బొందెను. ప్రభు వుఁడవైన యోరాముఁడా! ఈసుగ్రీవుఁడు స్నేహితులతోఁ గూడఁ గూడుకొనినవాఁడును, నీయాజ్ఞనుబొందినఁ వాఁడు నునై మిగులమంగళకరమగు పట్టణమునందుఁ బ్రవేశించి సకలకార్యములను జేయఁగలఁడు. మఱియునో రాముఁ డా! ఈసుగ్రీవుఁడు నానావిధములగు గంధములచేతను, ఓషధులచేతను, శాస్త్రోక్తప్రకారముగ స్నానమును జేసి పట్టాభిషిక్తుఁడై నానావిధములగు రత్నములచేతను, పూ లమాలికలచేతను విశేషముగాఁ బూజింపఁగలఁడు. పూ జ్యుఁడవైన యోరాముఁడా! నీవిక్కడనుండి మిగులమనోహ రమైనదియును, గుహాస్వరూపముగలదియునునగు కిష్కిం ధాపట్టణమునకురమ్ము. వచ్చి సకలవానరులకును సంతోష మును గలుగజేసి సుగ్రీవునకుఁ బట్టాభిషేకమును జేయిం చి రాజాధికారమునొయిమ్ము. అనిచెప్పిరి. ఇవ్విధముగా హనుమంతునిచేతఁ జెప్పఁబడినమాటనువిని శత్రువీరులను నశింపఁజేయునట్టివాఁడును, రఘుకులమునందుఁ బుట్టిన వాఁడును, బుద్ధిమంతులలో నుత్తముఁడును, మాటలాడు టయందు మిగులనేర్పరియును, నగురాముఁడు హనుమం తునితో మరలనిట్లనియె.

హనుమంతుఁడా! నేనుమాతండ్రి యాజ్ఞనుబరిపాలిం చుచున్నాను. కావునఁబదునాలుగు సంవత్సరములు గ్రా మములో పల్లెఁగాని, పట్టణములోనిఁకఁగాని రాను. సకల

సంపదలచేతను నిండియున్నదియును, గుహాస్వరూపమున నున్నదియు నగు కిష్కింధాపట్టణము లోనికిఁబోయి వానరులకధిపతియును, వీరుఁడును, నగు సుగ్రీవునకు శాస్త్రోక్తప్రకారముగఁ బట్టాభిషేకమును జేయుడని సకలవిషయములను దెలిసిన రాముఁడు మిగుల గొప్పవగు బలవిక్రమములు గలవాఁడును, సకలవిషయములను దెలిసినవాఁడును, నగు హనుమంతునితో నీవిధముగాఁ జెప్పి గొప్పవగు బలపరాక్రమములు గలవాఁడును, సకలవిషయములను దెలిసినవాఁడును, నగు సుగ్రీవునితో నిట్లనియె.

వీరుఁడవైన యో సుగ్రీవుఁడా! ఈ యంగదుని యౌవరాజ్యమునం దభిషిక్తునిఁగాఁ జేయుము ఈ యంగదుఁడు యన్నయగు వాలికిఁ బెద్దకుమారుఁడు. నీతో సమానమైన పరాక్రమము గలవాఁడు మఱియు నీయంగదుఁడు మిగుల ధీరమైన యాత్మతత్వము గలవాఁడు. కావున నితఁడు యౌవరాజ్యమును బొందుటకుఁ దగినవాఁడు. వానరోత్తముఁడవైనయో సుగ్రీవుఁడా! ఇది వర్షాకాలమునకు మొదటి మాసము ఈ శ్రావణమాసమునందు వర్షములధికముగాఁ గురియును ఇది మొదలు నాలుగుమాసములు వర్షాకాల సంజ్ఞ గలవి. కావున నిది యుద్ధమును జేయుటకుఁదగిన సమయముగాదు. కాబట్టి నీవు కిష్కింధాపట్టమునందుఁ బ్రవేశింపుము. సౌమ్యుఁడవైన యో సుగ్రీవుఁడా! నేనీ వర్షాకాలమంతయును గడచిపోవువఱకును, నీ పర్వతమునందు లక్ష్మణునితోఁగూడ నివసించియుండెదను. ఈ పర్వతము మిగుల మనోహరముగాను, విశాలముగానునున్నది. మఱియు నిక్కడ మంచిగాలియును గలదు. సౌమ్యుఁడవైన యో సుగ్రీవుఁడా! మిగుల మనోహరములైనవియును, జక్కగా వికసించినవియును నగు నల్లగలువలతోఁ గూడుకొనిన యుదకములు మెండుగాఁ గలవు కావున నేను వర్షాకాలమును యిక్కడనుండి గడపెదను. కార్తికమాసము వచ్చినపిమ్మట నీవు రావణాసురుని వధించుటకుఁదగిన యత్నము జేయుము మనమిరువురకును నిదియే సమయము- నీవు నీ పట్టణమునందుఁ బ్రవేశింపుము పోయి పట్టాభిషేకమును బొంది నీ స్నేహితులను సంతోషపెట్టుమనియె ఇవ్విధముగా రామునియొక్క యాజ్ఞను బొంది వానరాధిపతియగు సుగ్రీవుఁడు మిగుల మనోహరమైనదియును, వాలిచేతఁ బరిపాలింపఁబడినదియును నగు కిష్కింధాపట్టణమునందుఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించిన సుగ్రీవునితోఁగూడ అనేకవేల వానరులుగూడఁ బ్రవేశించి యా సుగ్రీవునకు నమస్కారమును జేసి సుగ్రీవునకుఁ జుట్టును జుట్టియుండిరి. అంతట నా పట్టణములో నున్న జనులందఱును వచ్చి వానరాధిపతియగు సుగ్రీవునకు భూమియందు శిరస్సును మోపి మిగుల భక్తియుక్తముతో నమస్కారములను జేసిరి. అంతట వీర్యవంతుఁడగు సుగ్రీవుఁడా జనులతో నందఱితోడను సంభాషించి వారి నందఱ లేవదీసె. పిమ్మట మహాబలుఁడగు సుగ్రీవుఁడు మిగుల మనోహరమైన వాలియొక్క యంతఃపురమునందుఁ బ్రవేశించె. ప్రవేశించి తారను స్వాధీనమును జేసికొనెఁ దలఁచె అవ్విధముగ నంతఃపురమునందుఁ బ్రవేశించినవాఁడును వానరాధిపతియును, నగు సుగ్రీవునకు దేవతలందఱును ఇంద్రునకభిషేకమును జేసినవిధముగ నా వానరులందఱును నభిషేకమును జేసిరి ఆ సమయమునందు వానరులందఱును నా సుగ్రీవునకు బంగారముచే నలంకరింప బడినదియును, తెల్లనిదియును నగు గొడుగును బంగారపు కఱ్ఱలు గలవియును, కీర్తిగలవియును, తెల్లనవియును నగు వింజామరములను ధరించిరి. మఱియు నావిధముగానే, నానావిధములగు రత్నములను, నానావిధములగు ధాన్యములను, నానావిధములగు నోషధులను, క్షీరములుగల చెట్లయొక్క మొలకలను పుష్పములను, తెల్లని వస్త్రములను, తెల్లనిదగు మైపూత ద్రవ్యమును, మిగుల మనోహరమగు పరిమళముగల పూలమాలికలను, మెట్టతామర పువ్వులను, మిగుల మనోహరములగు చందనములను, నానావిధములును, అధికములును, నగు గంధములను. పచ్చని యక్షతలను, సూక్ష్మములగు ధాన్యములను, నేతిని, పెరుగును. పెద్దపులియొక్క తోలును, పందిచర్మముతోఁ జేయఁబడిన పాదరక్షలను, గోరోజనము, మణిశిల మొదలగువాని యొక్క తిలకమును, మిగుల సంతోషముగల పదునార్గురు కన్నియలు దీసికొనివచ్చిరి అంతట నా కన్నియలును, వానరులును, తగిన కాలమునందు శాస్త్రోక్తప్రకారముగ రత్నములచేతను, వస్త్రములచేతను, భక్ష్యములచేతను ననేకులగు బ్రాహ్మణులను సంతోషపెట్టిరి. పిమ్మట మంత్రవేత్తలగు జనులు చుట్టును దర్భలచేత వ్యాప్తమైనదియును, చక్కగాఁ బ్రజ్వలింపఁజేయఁబడినదియును, నగు నగ్నిహోత్రమునందు మంత్రపూతమగు హవిస్సుతో హోమమును జేసిరి. పిమ్మట బంగారముచేత నిర్మింపఁబడిన పీఠము గలదియును, మిగుల శ్రేష్ఠమగు నాస్తరణము గలదియును, మెడలయొక్క శిఖరములవంటి శిఖరములు గలదియును, మిగుల రమ్యమైనదియును, చిత్రములగు పూల మాలికలచేతఁ బ్రకాశించుచున్నదియును, సర్వోత్తమమై నదియును నగు సింహాసనమునందు నానావిధములగు మంత్రములచేత పూర్వముఖము సుగ్రీవునిఁ గూర్చుండఁబెట్టిరి. పిమ్మట ననేకములగు నద

ములనుండియు, నదులనుండియును, తీసికొనిరాఁబడినతీర్థములవలనను, నాలుగుసముద్రములనుండి తీసికొనిరాఁబడిన యుదకములవలనను, బంగారపుకలశములను నిండించిరి. పిమ్మటమంగళకరములైనవియును, వృషభముయొక్క కొమ్ములవలె నున్నవియును, బంగారముచేతఁజేయబడినవియును, నగుకలశములచేత శాస్త్రోక్తమగు విధితోడను, ఋషిప్రోక్తమగు ప్రకారముచేతను, గజుఁడు, గవాక్షుఁడు, గవయుఁడు, శరభుఁడు, గంధమాదనుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, హనుమంతుఁడు జాంబవంతుఁడు, నలుఁడు, మొదలుగాఁగల యనేకవానరవీరులు నిర్మలమైనదియును, పరిమళించుచున్నదియును, నగునుదకముచేతను, నభిషేకమును జేసిరి ఆయభిషేకము దేవేన్ద్రుని యభిషేకమువలె మిగులమనోహరముగఁ బ్రకాశించె. అట్లుసుగ్రీవుఁడు పట్టాభిషిక్తుఁడు కాఁగానే, మహాత్ములగువానరోత్తములనేకులు పరమసంతోషముగలవారై సర్వస్థలములయందును సంతోషసూచకములగు కార్యములను జేసిరి. అంతటవానరోత్తముఁడగు సుగ్రీవుఁడు రాముఁడు చెప్పినచొప్పునఁజేయఁ దలఁచినవాఁడై యంగదునిఁ గౌగిలించుకొని యతనినియావరాజ్యాభిషిక్తునిగాఁజేసె అవ్విధముగనంగదునకు యావరాజ్యాభిషేకమును జేయఁగానేమహాత్ములగు వానరులందఱును నంగదునియందు దయగలవారై మంచిదిమంచిదని సుగ్రీవునిఁ బ్రశంసించుచుఁ బూజించిరి అటువంటిపట్టాభిషేక మహోత్సవము జరుగుచుండఁగా నావానరులందఱును సంతోషముగలవారై రామలక్ష్మణులను మాటిమాటికిని ననేకవిధములఁబొగడిరి ఆసమయమునందుఁ బర్వతపుచరియ యందున్నదియును, సంతోషముగలవారును, పుష్టిగలవారును, నగుజనులచేత వ్యాప్తమైనదియును, టెక్కెములచేత మిగులమనోహరముగాఁ బ్రకాశింపజేయఁ బడినదియును, నగుకిష్కింధాపట్టణము మిగులమనోహరమైన ప్రకాశముగలదయ్యె. అంతటవానర సేనకధిపతియగు సుగ్రీవుఁడు మహాత్ముఁడగురాముని సమీపమునకువచ్చి పట్టాభిషేక మహోత్సవముయొక్క సంగతినిసర్వమును దెలిపె. పిమ్మటవీర్యవంతుఁడగు సుగ్రీవుఁడు తనభార్యయగు రుమతోఁగలిసికొనినవాఁడై దేవేన్ద్రుఁడు స్వర్గరాజ్యమును బొందినవిధముగా వానర రాజ్యమును బొందె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యిరువదారవసర్గముగిసెను.

*)◀

రాముఁడులక్ష్మణునితోఁగూడ ప్రస్రవణాచలము బో యునివసించుట.

అవ్విధముగ సుగ్రీవుఁడుపట్టాభిషిక్తుఁడై గుహావంతమగు కిష్కింధాపట్టణమునందుఁ బ్రవేశింపఁగానే రాముఁడు తమ్ముఁడగులక్ష్మణునితోఁగూడ ప్రస్రవణాచలమునకుఁ బోయె. ఆపర్వతము, పెద్దపులులచేతను, మృగములచేతను వ్యాప్తమైనదియును, భయంకరములగు ధ్వనులుగలసింహములచేత నిండియున్నదియును, అనేకవిధములగు పొదలచేతను, తీఁగలచేతను గప్పుకొనఁబడి యున్నదియును, నానావిధములగు వృక్షములచేత వ్యాప్తమైనదియు ఎలుఁగు బంట్లచేతను, వానరులచేతను. కొండముచ్చులచేతను, పిల్లులచేతను, సేవింపఁ బడుచున్నదియును మేఘబృందమువలె నల్లనికాంతి గలదియును, సర్వకాలముల యందును నిర్మలమగు నుదకము గలదియును నైయుండె. అట్టిపర్వతముయొక్క గొప్పదగు శిఖరమునం దున్నదియును, మిగుల గొప్పదియును, నగువాకిటిగుహయందు లక్ష్మణునితోఁ గూడనుండుటకు నిశ్చయించె. అట్లుసుగ్రీవునితోఁజెప్పి యాపర్వతమునకు వచ్చినపిమ్మట, మంచిస్వభావము గలవాఁడును, పాపరహితుఁడును, రఘుకులమును సంతోషపెట్టువాఁడును, నగు రాముఁడు, తనయందుమిగుల భక్తిగలవాఁడై వినయముతో సంచరించుచున్నవాఁడును, తమ్ముఁడును, శుభలక్షణములుగలవాఁడును, లక్ష్మివృద్ధిని బొందించువాఁడును, నగులక్ష్మణునితో నాకాలమునకుఁ దగినమాటను జెప్పఁదలఁచియిట్లనియె.

సుమిత్రాదేవికిఁ బుత్రుఁడవును, శత్రువులనునశింపఁజేయువాఁడవునునైన యోలక్ష్మణా! తమ్ముఁడా! ఈపర్వతపుచరియమిగుల మనోహరమైనదియును, అధికమగు వెడల్పుగలదియును, పరిశుద్ధమగు వాయువుగలదియునునై యున్నది కావుననునమిద్దఱమునుదీనియందునివసింతము రాజనందనుఁడవైన యోలక్ష్మణా! ఈపర్వతశిఖరము మిగులరమ్యమైనదియును, పొడవుగలదియును, నైయున్నది మఱియునీపర్వతశిఖరము, తెల్లనివియును, నల్లనివియును, ఎఱ్ఱనివియును, నగుఱాళ్లచేతఁ బ్రకాశించు చున్నదియును, నానావిధములగు గైరికాదిధాతువులచేత వ్యాప్తమైనదియును, కొండచరియలయందలి కాలువలచేత మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నదియును, నానావిధములగు వృక్షములయొక్క గుంపులచేతను, సుందరములైనవియును, చిత్రవర్ణములు గలవియును నగుతీఁగలచేతను వ్యాప్తమైనదియును, నానావిధములగు పక్షులయొక్క సం

దడిగలదియును, నెమళులయొక్క ధ్వనులచేతనిండియున్నదియును, బండిగురిగింజ తీగలయొక్కయు, మల్లెతీగలయొక్కయు, పొదలచేతను వానిపువ్వులచేతను, గోరంటపూలచేతను, కడిమిచెట్లపూలచేతను, తెల్లమద్దిచెట్లపువ్వులచేతను, మిగులమనోహరముగా నంతటను బ్రకాశించుచున్నదియునై యున్నది రాజనందనుఁడవైన యోలక్ష్మణా! మనమునివసింపఁ బోవుగుహకుసమీపముగాఁ బ్రవహించుచున్న యీసరోవరము చక్కగావికసించిన పద్మములచేత మిగుల రమ్యముగానుండగలదు. మఱియునో లక్ష్మణా! ఈగుహకుఁ దూర్పుభాగమునందును, ఉత్తరపుభాగమునందును, మిగులమనోహరముగా శిలలచేతఁగప్పఁబడియున్నది. కావునదీనియందు శీతబాధయును, వర్షపుబాధయునుగలుగదు. మంచిస్వభావముగల యోలక్ష్మణా! ఈగుహయొక్క పడమటిభాగమునం దున్నతముగానున్నది కావునగాలియును విశేషముగానుండదు. సుమిత్రానందనుఁడవైన యోలక్ష్మణా! తమ్ముఁడా! గుహయొక్కద్వారమునందు శుభమైనదియును, సమప్రదేశముగలదియును, మృదువైనదియును, కాటుకవలెనల్లగానున్నదియును, నగుబాయియొక్కటిగలదు. నాయనా! లక్ష్మణా! ఈపర్వతమున నుత్తరముగానుండు శిఖరమునుజూడుము. అదిమిగులమంగళకరమైనదియును, కాటుకకొండతోడను, నల్లనిమేఘముతోడను సమానముగనుండుటచేతఁ జూచుటకింపుగానున్నది. మఱియునో తమ్ముఁడా! లక్ష్మణా! ఈగుహకు దక్షిణపుదిక్కునందు రెండవవెండికొండవలె నున్నదియును, కైలాసశిఖరమనియెడు పేరుగలదియును, అనేకవిధములగు ధాతువులచేతఁ బ్రకాశించుచున్నదియును, నగుశిఖరమునుజూడుము. అదిమిగులమనోహరముగనున్నది. మఱియునో తండ్రీ! లక్ష్మణుఁడా! తమ్ముఁడా! ఈగుహకుఁ బూర్వభాగమునందు బురదలేనిదై తూర్పుదిక్కునకభిముఖముగాఁ బ్రవహించుచున్ననదినిజూడుము. అనది త్రికూటాచలమునందుఁ బ్రవహించుచున్న భాగీరథీనదినిఁ బోలియున్నది. తండ్రీ! లక్ష్మణా! ఈనది, తనతీరములయందు మొలిచినవియును, నానావిధములునవియును, నగుసంపెంగచెట్లచేతను, కానుగచెట్లచేతను, ఏటిచెట్లచేతను, బండిగురిగింజ చెట్లచేతను, ఏనుఁగుసిబ్బెపుచెట్లచేతను, సర్జవృక్షములచేతను, అశోకవృక్షములచేతను, నీరుబ్రబ్బలిచెట్లచేతను, నెమ్మిచెట్లచేతను, పవడపుచెట్లచేతను, మొగలిచెట్లచేతను, చంద్రచెట్లచేతను, గిరుకతాడిచెట్లచేతను, లొద్దుగచెట్లచేతను, కడిమిచెట్లచేతను, వేముచెట్లచేతను, రేలచెట్లచేతను బ్రకాశించుచున్నదై మిగులమనోహరముగనున్నది. నాయనా! లక్ష్మణా! ఇట్టివృక్షములచేతను, వీనిపువ్వులచేతను, వస్త్రములచేతను, ఆభరణములచేతను బ్రకాశించుచున్న స్త్రీరత్నమువలె అలంకరింపఁబడినదై యీనదిమిగుల మనోహరముగనున్నది, మఱియునో లక్ష్మణా! నానావిధములగు ధ్వనులుగలవియును, అనేకవిధములైనదియును, పక్షులయొక్క ధ్వనులచేత ధ్వనులుగలదైచేయఁబడినదియును, పరస్పరానురాగముగల చక్రవాకపక్షులచేత నలంకరింపఁ బడినదియును, మిగులమనోహరములైన యిసుకదిబ్బలచేతను, హంసలచేతను, బెగ్గురుపక్షులచేతను రమ్యమైనదియును, నగునీనది సర్వాభరణములచేత నలంకరింపఁ బడినదియును, పకపకనవ్వుచున్నదియును, నగుస్త్రీరత్నమువలెఁ బ్రకాశించుచున్నది. మఱియునీనది యొకవైపున నల్లగలువలచేత రమ్యమైయున్నది మఱియొకవైపున నెఱ్ఱకలువలచేతఁ బ్రకాశించుచున్నది మఱియొకవైపునఁ దెల్లనిదియును, శ్రేష్ఠములైనవియును నగుకలువలయొక్కమొగ్గలచేత మనోహరమైయున్నది ఇంకొకవైపున ఉదకముమీఁద సంచరించుచున్న పక్షులతోఁగూడుకొనియున్నది. మఱియొకవైపున నెమళ్లయొక్కయు, క్రౌంచపక్షులయొక్కయు ధ్వనులచేతఁ బ్రతిధ్వనులుగలదై చేయఁబడుచున్నది. మఱియొకవైపున మునుల సమూహముచేత సేవింపఁబడుచున్నదై చూచుటకుమిగుల మనోహరముగానున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! చందనవృక్షముల పఙ్క్తులుతీర్చి నట్లేర్పడియున్నవి. చూడుము ఈచందనవృక్షములపఙ్క్తితో సమముగనుండవలయునని యెడు తలంపుచేత నొకమాటుగా మనస్సుచేత నిర్మింపఁబడినవానివలె నున్న మద్దిచెట్లయొక్క పఙ్క్తులనుజూడుము శత్రువుల నునశింపఁజేయునట్టి యోలక్ష్మణుఁడా! అహో, యీదేశము మిగుల రమ్యమైయున్నది. కావునసుమిత్రానందనుఁడవైన యోలక్ష్మణా! మనమునిశ్చయముగ నిక్కడవిహరించుచుందము మఱియునో లక్ష్మణా! వానరోత్తముఁడు తన భార్యను, గొప్పదగువానరరాజ్యసంపదనుబొంది స్నేహితులతోఁ గూడుకొనినవాఁడై నిశ్చయముగాసంతోషమునుబొందఁగలఁడు. జయముగలవారిలలో నుత్తముఁడవైన యోలక్ష్మణుఁడా! మద్దెలయొక్క యాడంబరముతోఁగూడధ్వని చేయుచున్నవానరులయొక్క గీతవాద్యములయొక్క ధ్వనివినఁబడుచున్నదని రాముఁడుచెప్పి విశేషసంతోషముగాఁ జూడఁదగినపర్వతపు చరియలును, పొదరిండ్లను గల యాప్రస్రవణాచలమునందు లక్ష్మణునితోఁగూడ నివసించె మఱియును మిగుల సుఖకరమైనదియును, నానావిధములును, అపేక్షింపఁదగినవియును, నగుపదార్థములు

గలదియును, నగునాపర్వతమునందు నివసించుచున్న రామునకు సీతావియోగము గలిగియుండుటచేత గొంచెమైనను సంతోషము గలిగియుండలేదు. ఉదయాద్రిమీదికివచ్చి మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్న చంద్రునిజూచుటతోడనే, శత్రువులచేత నపహరింపఁబడినదియును, ప్రాణములకంటెఁ బ్రియమైనదియును, నగుసీతాదేవి నిస్మరించుటవలన నధికమగువ్యసనము గలవాఁడైయుండె. ఇవ్విధముగా వ్యసనమును బొందుచున్న రామునకు రాత్రులయందుఁ గొంచెమైనను నిద్రరాకయుండె. ఇవ్విధముగాఁ బుట్టినదుఃఖముచేతఁ గలిగినకన్నీళ్లచేత వ్యాప్తమైన చిత్తముగలవాఁడును, నధికముగా దుఃఖమునుబొందు చున్నవాఁడును, కకుత్స్థుని వంశమునందుఁ బుట్టినవాఁడును, సర్వకాలములయందును దుఃఖమునుబొందు చున్నవాఁడును, నగురామునిఁజూచి రామునితోసమానముగ దుఃఖమునుబొందుచున్నవాఁడును, రామునకుఁదమ్ముఁడును, నగులక్ష్మణుఁడు రాముని నోదార్పఁదలఁచినవాఁడై మృదుమధుర వచనములచేత నిట్లనియె.

పరాక్రమవంతుఁడవైనయో రాముఁడా! అన్నా! ఇంతవఱకు వ్యసనమును బొందినదిచాలును. నీవువ్యసనమును బొందుటకుఁ దగినవాఁడవుగావు. కావునవ్యసనమును బొందకుము. దుఃఖమునుబొందుచుండు వానికార్యములన్నియును నశించిపోవునని నీవెఱిఁగినవిషయమేగదా? రఘుకులోత్తముఁడవైన యోరాముఁడా! నీవుసర్వకాలములయందును జేయఁదగినకార్యమును గుఱించియే, యోచించువాఁడవుగదా? అంతియేగాక దైవమునందే భారమునుబెట్టి కార్యములను జేయువాఁడవు దైవముగలఁడనియెడు తలంపుగలవాఁడవు. ధర్మస్వభావము గలవాఁడవు. సర్వకాలములయందును జేయఁదగినకార్యములయందు వ్యవసాయముగలవాఁడవు. మఱియునో అన్నా! రాముఁడా! నీవువిశేషముగా ధైర్యరహితుఁడవై యుంటివేని నీకుశత్రుఁడును, కుటిలమును జేయువాఁడును, రాక్షసుఁడును, నగురావణాసురుని యుద్ధమునందుఁ బరాక్రమముచేతఁ జంపఁజాలవు. కావున దుఃఖమును బొత్తిగాఁ బోఁగొట్టికొనుము. స్థిరమైనప్రయత్నమును జేయుము. ఇట్లుసేసితివేని నీకుశత్రువగు రావణాసురుని సమూలముగనాశమును బొందింపఁగలవు. కకుత్స్థునివంశమునందుఁ బుట్టినయోరాముఁడా! సముద్రములతోడను, పర్వతములతోడను గూడుకొనిన యీభూమిని సర్వమును నీవుచలింపఁజేయుటకుఁదగినసామర్థ్యముగలవాఁడవు. ఇట్టిమహానుభావుఁడవైన నీవురావణాసురుని సంహరించుటయనఁగా నెంతటిపని? ఇప్పుడువర్షాకాలము వచ్చినది. శరత్కాలమువచ్చువఱకును ఓర్చుకొనియుండుము. పిమ్మటనీకు శత్రువగురావణాసురుని బుత్రమిత్రాదులతోఁగూడవధించి వానిరాజ్యమును సర్వమునురాదు చేయఁగలవు. రాముఁడా! నేనునిద్రనుబొందుచున్ననీపరాక్రమమును, బూడిదెచేతఁగప్పబడిననిప్పును, గట్టెలచేత లేవదీసిన విధముగ లేవదీసెదననియె ఇవ్విధముగలక్ష్మణునిచేత జెప్పబడినదియును, మంగళకరమైనదియును, నగువాక్యమునకు, సంతోషమునుబొంది రఘుకులమునందు బుట్టినరాముడు మిగులప్రియమైన స్నేహితుడును, దమ్ముడును, నగులక్ష్మణునితో నిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! అనురాగము గలవాడును, హితుడును, మనోహరుడును, సత్యముతోడను. పరాక్రమముతోడను గూడుకొన్నవాడును, నగుమానవోత్తమునిచేత ప మాటచెప్పదగునో యటువంటిమాట నీచేత జెప్పబడినది సకలకార్యములను నశింపజేయునట్టియీదుఃఖమును బొత్తిగావిడిచిపెట్టితిని. ఇకమీదటబరాక్రమములయందు నిరాతంకమగు పరాక్రమమును, తేజస్సునుఅవలంబించి నీవచనానుసారముగ శత్రువధయం దుత్సాహము గలవాడనయ్యెదను. మఱియునోతమ్ముడా! నీమాటను స్థిరముగానమ్మి శరత్కాలమెప్పుడు వచ్చునోయని నిరీక్షించుచుండెదను. మఱియుసుగ్రీవునియొక్కయు, నదులయొక్కయు ప్రసాదమెప్పుడువచ్చునోయనికోరుచుండెదను. (అనగా శరత్కాలమునందునదులన్నియును నిర్మలోదకములుగలవగుననియును, నట్టిసమయమునందు సుగ్రీవుడు రామునకు బ్రత్యుపకారమునుజేయుననియును నభిప్రాయము) తమ్ముడా! లక్ష్మణా! శ్లో॥ ఉపకారేణవీరస్తు ప్రతికారేణయుజ్యతే। అకృతజ్ఞోప్రతకృతో హంతి సత్త్వవతాంమనః॥ చేసినమేలును దలపనివాడున, మేలుచేసినవానికిఁ బ్రత్యుపకారమును జేయనివాడును సత్పురుషులయొక్క మనస్సునుబాధించును. (అనగాసత్పురుషులట్టి వానిని నిందింతురనుట) కావునవీరుడగు సుగ్రీవుడు తనకుజేసిన యుపకారమునకుఁ బ్రత్యుపకారమును శరత్కాలమువచ్చుటతోడనే చేయగలడనియె ఈప్రకారముగా రాముడు చెప్పినమాటనువిని లక్ష్మణుడు చేతులను ముకుళించుకొని రామునిమాటలను బహువిధములచేత శ్లాఘించిమిగుల నింపుగాజూడదగిన రామునియొక్కమంగళకరమగు దర్శనమును జేయుచు నారామునితో నిట్లనియె.

రాజేంద్రుడవైన యోరాముడా! నీయభీష్టానుసారముగ సర్వమును శీఘ్రముగానెరవేరగలదు. ఇందుకేమియుసందేహములేదు. శరత్కాలమెప్పుడు వచ్చునోయని తలచుచున్న సుగ్రీవుడు నీకార్యమును జేయుటకు సిద్ధముగనున్నాడు. కా

వునసీవీవర్షాకాలమును సహించిశత్రువగు రావణాసురుని వధించుటయందు ధైర్యమునవలంబించియుందుము. ఇప్పుడు కోపమునణచుకొని యీనాలుగు మాసములును సహింపుము. ఇంతలో మనమునిర్ణయించుకొనిన కాలమువచ్చును. శత్రునాశమును జేయుటయందు గుతూహలముగలవాడవై సంహాములచేత సేవింపఁబడుచున్న యీపర్వతమునందు నివసింపుమనియె

ఇట్లు శ్రీమదారణ్యకాండమునందల యిరువదేడవసర్గ ముగిసెను.

రాముడులక్ష్మణునికివర్ష లక్షణముల నుజూపించిచెప్పుట.

ఆ రాముడవ్విధముగా వాలినిజంపి సుగ్రీవునకుఁబట్టాభిషేకమును జేసినపిమ్మట మాల్యవత్పర్వతముయొక్క ఉపరభాగమునందు నివసించుచున్నవాడై లక్ష్మణునితోనిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! మనముసుగ్రీవునితో జెప్పిన వర్షాకాలమిప్పుడువచ్చినది ఆకాశమంతయును పర్వతములతో సమానములగు మేఘములచేత వ్యాప్తమైయున్నది. అంతరిక్షమనియెడు స్త్రీరత్నము సూర్యునికిరణములచేత సముద్రోదకమును పానముజేసితొమ్మిదిమాసములు గర్భమునందుధరించి శిశువునుగనినవిధముగ నుదకములను బ్రసవించుచున్నది. (అనగా కార్తికమాసము మొదలుకొని యాషాఢమాసమువఱకును సూర్యకిరణములద్వారా సముద్రోదకమును పానముసేసియంతరిక్ష మాషాఢమాసము మొదలుకొని వర్షమునుగలుగజేయుననుట.) మఱియునో తమ్ముడా! లక్ష్మణా! మేఘములను సోపానములనెక్కి గిరిమల్లికాపుష్పములచేతను, మద్దిపూలచేతను, మనకులగురువగు సూర్యుని బూజించుటకిది తగినకాలమైయున్నది. కావునమనమీపుష్పములచేత కులగురువగుసూర్యుని బూజింతము. తమ్ముడా! లక్ష్మణా! సంధ్యాకాలమునందలి రాగముచేత నెఱ్ఱనైనవియును, కొనలయందుమిగుల తెల్లనివియును, మిగులమృదువైనవియును, నగుమేఘములనియెడు వస్త్రములయొక్కతునుకలచేత గట్టబడినవ్రణమువలెనాకాశము ప్రకాశించుచున్నది. చూడుము మఱియునో తమ్ముడా! ఉబ్బుగలదియును, నూతనమగు వర్షోదకముచేత దడపబడినదియును, నగనీభూమిదుఃఖముచేత బరితాపమునుబొందుచున్న సీతాదేవి వలెనే బాష్పమునువిడచిపెట్టుచున్నది. తమ్ముడా! లక్ష్మణా! మేఘముయొక్క గర్భమునుండిబయలు వెడలినవియును, మిగులబరిమళముగలవియును నెఱ్ఱనివియునునగు కలువలెసుఖకరములను, జల్లనివియును, మొగలిపూలయొక్క గంధములుగలవియును, నగునీవాయువులు దోసిళ్ల చేతబానము సేయుటకుదగిన వానివలెనున్నవి. మొగలిపువ్వులచేత బరిమళింపజేయబడినదియును, వికసించినమద్దిపూలుగలవియును నగునీప్రస్రవణాచలను వర్షోదకధారలచేత, శత్రువగు వాలినశించినపిమ్మట సుగ్రీవుడభిషిక్తుడైన విధముగనభిషేకము చేయబడుచున్నది. మఱియునో తమ్ముడా! లక్ష్మణా! ఈపర్వతములన్నియును, మేఘమనియెడు నల్లజింకచర్మమునుధరించినవియును, వర్షోదకధారలనియెడు యజ్ఞోపవీతములను ధరించినవియును, వాయువుచేత బూరింపబడినవి గనుకనేధ్వనిజేయుచున్న గుహలుగలవేయగుటనై యధ్యయనమును జేయుచున్న బ్రహ్మచారులవలె బ్రకాశించుచున్నవి తమ్ముడా! లక్ష్మణా! బంగారపుకొరడాలవంటి మెఱుపుతీగలచేత గొట్టబడినదానివలె నున్నదియును, కావుననే లోపలనేధ్వనిచేయుచున్న యురుములుగలదియును, నగునీయాకాశము మిగులవేదనతో గూడుకొని లోపలనేధ్వనిచేయుచున్న గుఱ్ఱమువలెనున్నది చూడుము. తమ్ముడా! నల్లని మేఘముమీద బ్రకాశించుచున్న యీమెఱుపుతీగ, పీనుగాలగుసీతాదేవి రావణాసురునియొక్క తొడయందు ప్రకాశించువిధముగ బ్రకాశించుచున్నది చూడుము. తమ్ముడా! లక్ష్మ

గనుకనేకనబడకుండునట్లు చంద్రనక్షత్రాదులుగలవియగు నీదిక్కులు భేదజ్ఞానమును గలుగజేయనివై కామాతురులగు వారికిమిగుల ప్రియములైయున్నవి. తమ్ముడా! లక్ష్మణా! కొంచెముగా బాష్పముచేతనావరింప బడినవియును, వర్షాకాలమురావడముచేత మిగులనుత్సాహముగలదియును, కొండచరియలయందున్నవియును, బుష్పించియున్నవియును, నగుగిరిమల్లికా వృక్షములనుజూడుము. ఈవృక్షములీవర్షాకాలమునందు నిజభార్యలతోరమించుటకు దూరదేశమునుండి వచ్చినపురుషులవలెమిగులవికాసముగలవై యున్నవి. మఱియును భార్యావియోగమువలన గలిగినదుఃఖముచేత దిరస్కరింపబడియున్న నాకీవృక్షములు మన్మథోద్రేకమును అధికముగా గలిగించుచున్నవి. తమ్ముడా! లక్ష్మణా! ఇప్పుడుభూమియందలి దుమ్మంతయును నశించిపోయినది. గాలి చల్లగావీచుచున్నది. ఉష్ణకాలమునందలి దోషములన్నియును నశించిపోయినవి. రాజులయుద్ధయాత్రలునిలిచినవి. దూరదేశములకుబోయిన మానవులందఱును దమతమస్వదేశములకు బోవుచున్నారు. చక్రవాకపక్షులు తమభార్యలతో గూడుకొని మానససరస్సునందు నివసింపవలయుననియెడు కోరికగలవై యిప్పుడుబయలు వెడలిపోవుచున్నవి అధికమగువర్షము యొక్కయుదకముచేత నాటంకముగలవై చే

యఁబడిన మార్గములయందు రథములు, బండ్లు మొదలగునవి యేవియును బోవడములేదు. తమ్ముఁడా! లక్ష్మణా! ఇప్పుడా కాశమున నొకచోట ప్రకాశముగలదియును, నొకచోట ప్రకాశములేనిదియును, నొకచోట మేఘములచేత వ్యాప్తమైనదియును, మఱియొకచోట మేఘముల ప్రకాశము లేనిదియునునై, యొకానొకచోట పర్వతములచేత వ్యాప్తమైనదియును, అలలులేనిదియును, నగు శాంతమహాసముద్రమువలె ప్రకాశించుచున్నది. వర్షపుష్పములతోడను, కడిమిపుష్పములతోడను, గూడుకొనినదియును, పర్వతములయందలి గైరికాది ధాతువులచేత నెఱ్ఱవర్ణముగలదియును, నెమళ్లయొక్క కూతలతోగూడ వచ్చుచున్నదియును, నగు నూతనవర్షోదకమును భరించి, చిన్నచిన్న నదులన్నియును మిగుల మనోహరముగా ప్రవహించుచున్నవి. మధురమగు రసముచేత నిండినవియును, తుమ్మెదలవలె నల్లగానున్నవియును, నగు నేరేడుఫలములను ఎల్లవారును భుజించుచున్నారు. నానావిధములగు వర్ణములుగలవియును, గాలిచేత విదల్చబడినవియును, విశేషముగా బక్కవైనవియునునై మామిడిపండ్లు క్రింద రాలిపోవుచున్నవి. మెఱుపులనియెడు ధ్వజములుగలవియును, బెగ్గురుపక్షులనియెడు మాలికలుగలవియును, గొప్పదగు పర్వతముయొక్క శిఖరములతో సమానములైనవియును, నురుములతో గూడినవియును నగు మేఘములు, యుద్ధములయందు ధ్వనిచేయుచున్న మదపుటేనుగులను బోలియున్నవి చూడుము తమ్ముఁడా! లక్ష్మణా! అపరాహ్ణకాలములయందు వర్షోదకములచేత తృప్తిబొందునట్లు తడపబడిన పచ్చిక పట్లుగలవియును, నాట్యమును జేయుచున్న నెమళ్లుగలవియును, విశేషముగా వర్షించుటచేత తెల్లపడియున్న మేఘములుగలవియును, నగు నీవనములు ఎంతమనోహరముగా ప్రకాశించుచున్నవో చూడుము. బెగ్గురుపక్షులయొక్క మాలికలుగల మేఘములు ఉదకభారము నధికముగా మోయుచున్నవై గర్భభారముచేత నడవలేక యొక్కొక్కెడ గూర్చునికూర్చుని పోవుచున్న గర్భిణీస్త్రీలవలె బర్వతములయొక్క శిరములయందు నిలిచినిలిచి పోవుచున్నవి చూడుము. గర్భధారణకాలమునకు మేఘమున కభిముఖముగా బోవుచున్నదియును, సంతోషముతో గూడియున్నదియును, నగు నీ బెగ్గురుపక్షులయొక్క పఙ్క్తి గాలిచేత నెగురగొట్టబడినదై వ్రేలాడుచున్నదియును, శ్రేష్ఠములగు పద్మములచేత రచింపబడినదియునగు మాలికచేతవలెనే యీయాకాశము ప్రకాశించుచున్నది. మఱియు నో లక్ష్మణా! ఈ వనభూమి చిన్నవగు నింద్రగోపపురుగులచేత చిత్రవర్ణముగలదై చేయబడినదియును, నూతనమైనదియును నగు పచ్చికగడ్డిచేత వ్యాప్తమైన దేశరీరమునందు ధరింపబడినదియును, ఆకుపచ్చవర్ణముగలవియును, పాదములయందు ధరించిన లత్తుకయొక్క చుక్కలుగలవియునునగు చీరను ధరించిన స్త్రీరత్నమువలె ప్రకాశించుచున్నది చూడుము. మఱియు నో తమ్ముఁడా! ఇప్పుడు మెల్లమెల్లగా నాగరాయణుఁడు నిద్రను పొందుచున్నాఁడు. నదులు శీఘ్రముగా సముద్రమునందు ప్రవేశించుచున్నవి బెగ్గురుపక్షులన్నియును మిగుల సంతోషముగలవై మేఘమున కభిముఖముగా బోవుచున్నవి స్త్రీలు మన్మథపరవశులై తమప్రియులను బొందుచున్నారు మఱియు నీ వనభూప్రదేశములన్నియును నెమళ్లయొక్క నాట్యములుగలవైనవి కడిమివృక్షములన్నియును పుష్పించిన కొమ్మలుగలవైనవి. వృషభములు గోవులతోగూడ సమానముగ విహరించువలయునని యెడ [illegible] కలుగలవన్నె భూమియు తేయును సస్యములచేత మిగుల మనోహరమైనదయ్యె. మఱియు నో తమ్ముఁడా! ఈ సమయమునందు నదులన్నియును ప్రవహించుచున్నవి మేఘములధికముగా వర్షించుచున్నవి మదపుటేనుగులు ఘీంకారములను జేయుచున్నవి వనమధ్యప్రదేశములు మిగుల మనోహరములై ప్రకాశించుచున్నవి. భార్యలను వదలి పరదేశములయందున్న పురుషులు తమ భార్యలను ధ్యానము చేయుచున్నారు నెమళ్లు నృత్యమును జేయుచున్నవి వానరులందఱును సమృద్ధిగ ఫలములను భుజించి సంతుష్టచిత్తులగుచున్నారు. తమ్ముఁడా! లక్ష్మణుఁడా! మదపుటేనుగులు మొగలిపూలయొక్క గంధము నాఘ్రాణించి మిగుల సంతోషముగలవియును, వనములయందు ప్రవహించుచున్న కొండకాలువలయందు సంతోషముతో గూడుకొనినవై యొడ్డులను దంతములతో బొడిచి ధ్వనిజేయుచున్నవియును, నై నెమళ్లతోగూడ సమముగ ధ్వని చేయుచున్నవి వర్షధారలయొక్క దెబ్బలచేత గొట్టబడినవియును, కడిమిచెట్లయొక్క కొమ్మలయందు వ్రేలాడుచున్నవియును, నగు తుమ్మెదలు క్షణమాత్రములోనే సంపాదింపబడినవియును, పుష్పరసముచేత మిగుల గాఢమైనదియును నగు మదమును మెల్లమెల్లగా విడిచిపెట్టుచున్నవి బొగ్గులపొడితో సమానమగు కాంతిగలవియును, పూర్ణముగా నిండిన రసముగలవియును, అధికమయిన సమృద్ధిగలవియును, నగు ఫలములచేత వ్యాప్తమైన నేరేడుచెట్లయొక్క కొమ్మలు తుమ్మెదచేత వ్యాప్తమైన వానివలె ప్రకాశించుచున్నవి. మెఱుపులనియెడు పతాకములచేత నలంకరింపబడినవియును, మిగుల గంభీరముగా ధ్వనించుచున్న యుఱుములుగలవియును, నగు మేఘములయొక్క యాకారములు యుద్ధమునందు సన్నద్ధములైన యేనుగులయొక్క రూపములవలె ప్రకాశించుచున్నవి. మఱియు నో త

మ్ముడా! ఈపర్వతమునందలి వనమునందు సంచరించుచున్న మదపుటేనుగు మార్గమునందు సంచరించుచున్నదై మేఘముయొక్క ధ్వనినివిని వేఱొకయేనుగు వచ్చినదని తలచినదై యుద్ధసన్నద్ధమై వెనుకకుదిరిగెను. చూడుము, తమ్ముడా! లక్ష్మణా! ఈవనమునందలి మధ్యప్రదేశములు ఒకప్రదేశము నందు తుమ్మెదలయొక్క సముదాయముయొక్క సంగీతములు గలవై యున్నవి ఒకానొకప్రదేశమునందు నెమళ్లయొక్క నాట్యములు గలిగియున్నవి. మఱికొన్ని ప్రదేశములయందు మదపుటేనుగులు నానావిధములుగా సంచరించుచున్నవి. తమ్ముడా! లక్ష్మణా! ఈవనమధ్యప్రదేశము కడిమిచెట్లయొక్క మొలకలతోడను, మద్దిచెట్లయొక్క మొలకలతోడను గూడుకొన్నదియును, నూతనమగునుదక ప్రవాహముచేత వ్యాప్తమైనదియును, నెమళ్లయొక్క కేకారవములతో గూడుకొన్నదియునునై మద్యపానశాలవలె ప్రకాశించుచున్నది. నానావిధములగు దేహకాంతులుగల చాతకపక్షులు మొదలగునవి, ముత్యములతో సమానముగ బడుచున్నదియును, పత్రపుటములయందు వ్యాప్తమయినదియును, వర్షాధిదేవతయగు దేవేన్ద్రునిచేత నివ్వబడినదియును, నగునుదకమును, పానముచేసిమిగుల సంతోషముగలవై యున్నవి. తమ్ముడా! లక్ష్మణా! ఈసమయమునందు తుమ్మెదలయొక్క ధ్వనులనియెడు తంత్రీస్వరముచేతను, కప్పలయొక్క కంఠధ్వనులనియెడు తాళధ్వనులచేతను, మేఘధ్వనులనియెడు మద్దెళ్లయొక్క ధ్వనులచేతను, సంగీతము ప్రవర్తించినట్లు తోచుచున్నది. ఈవనమునందు గొన్నిచోట్ల కొన్నినెమళ్లు నృత్యమును జేయువారివలె నాట్యమును జేయుచున్నవి కొన్నినెమళ్లు నాట్యమును జూచువారివలె చెట్లకొమ్మలయందు గూర్చుండి నెమళ్లనాట్యమును జూచుచున్నవి. మఱికొన్నినెమళ్లు పింఛములను వికసింపజేసిమిగుల మనోహరముగా గానమును జేయుచున్నవి. కావుననీసమయమునం దీవనమంతయును మిగుల సంతోషకరమైయున్నది. మఱియునో తమ్ముడా! లక్ష్మణా! చిరకాలమునాడు నిద్రనుబొంది సకలవ్యాపారములను విడిచిపెట్టినకప్పలు మేఘములవలన గలిగినయురుములచేత నిద్రనువిడిచిపెట్టిలేచినవై నానావిధములగు రూపములను నాకారములనుధరించి నూతనవర్ష ధారలచేత గొట్టబడినవై కూతలువేయుచున్నవి. నదులన్నియును జక్రవాకపక్షులయొక్క సంచారములుగలవై శిథిలములైన యొడ్డులు గనబడకుండునట్లుసేసి నిండుగాబ్రవహించుచున్నవియును, పరమసంతోషము గలవియునునై యతిశీఘ్రముగ దమభర్తయగు సముద్రునియొద్దకు బోవుచున్నవి నూతనమగునుదకమును బూర్ణముగా భరించినవియును, నల్లనివియును, నగుమేఘములయందు బ్రవేశించినవై దవాగ్నిచేత దగ్ధములైనవియును, పర్వతప్రాంతములయం దున్నవియును, నగుశిలలుదవాగ్ని దగ్ధములగు పర్వతములయందుజేరి ప్రకాశించువిధముగ బ్రకాశించుచున్నవి. తమ్ముడా! లక్ష్మణా! మిగులసంతోషముచేత ధ్వనిచేయుచున్న నెమళ్లుగలవియును, నింద్రగోపపుకీటకములచేత వ్యాప్తమైన పచ్చికవేలలుగలవియును, కడిమిపూలచేతను మద్దిపూలచేతను, బరిమళింపజేయ బడినవియును. నగునీవనమధ్య ప్రదేశములయందు ఎక్కడజూచినను ఏనుగులుసంచరించుచున్నవి. చూడుము. తుమ్మెదలు, నూతనమగువర్షధారలచేత గొట్టబడినకింజల్కములుగల పద్మములనువదలిపెట్టి నూతనములగు కింజల్కములుగల కడిమిపూలమీదికి మిగులసంతోషముతో బోవుచున్నవి ఈసమయమునందు మదపుటేనుగులన్నియును మదించి ఘీంకారములను జేయుచున్నవి. వృషభములుసంపూర్ణముగా మేతనుదినిబలిసి రంకెలువేయుచున్నవి. సింహము మొదలగు మృగములన్నియును మిగులవిశ్రాంతిగలవై సంచరించుచున్నవి. పర్వతములన్నియును మిగులరమ్యములైయున్నవి. రాజులందఱును యుద్ధయాత్రములను వదలి స్వస్థచిత్తులైయున్నారు. మేఘములచేత భూమియందంతటను వర్షింపజేయుచుమిగుల సంతోషముతో క్రీడించుచున్నాడు. మేఘములధికముగా సముద్రమువలె రోదనుజేయుచున్నవియును, విశేషముగా నుదకము గలవియును, ఆకాశమునందు వ్రేలాడుచున్నవియునునై నదులను, తటాకములను, మడుగులను, బావులను, భూమిని, సర్వమును, జలప్రవాహములచేత నిండించుచున్నవి. అధికవేగము గలవర్షములు తెంపులేకకురియుచున్నవి పెద్దరొదగలుగునట్లుగా గాలివీచుచున్నది. నదులునిండు ప్రవాహముగలవై యొడ్డులనువిచిరివేయుచు బ్రవహించి మార్గములయందు గూడ వ్యాపించి మార్గములు గనబడకుండునట్లు చేయుచున్నవి. మానవులచేత రాజులభిషిక్తులగువిధముగా దేవేన్ద్రునిచేత నివ్వబడినవియును, వాయువుచేత దీసికొనిరా బడినవియును, నగుమేఘోదకములనియెడు కుంభోదకములచేత బర్వతములన్నియును నభిషేకముసేయబడినవై తమసంపదను సర్వమునుస్పష్టముగా జూపించుచున్నవి ఆకాశమంతయును మేఘములచేతదట్టముగా వ్యాపించియున్నది. నక్షత్రములలోనొకటియును రాత్రులయందు గనబడడము లేదు. సూర్యునిదర్శనము కావడములేదు. భూమియంతయును నూతనమగువర్షోదకముచేత వ్యాప్తమైనది దిక్కులన్నియును జీకటిచేత వ్యాప్తములైయున్నవి. కావునదిగ్విభాగము తెలియుటములేదు. పర్వతములయొక్క గొప్పవ

గు శిఖరములన్నియును వర్షోదకధారలచేతఁ జక్కఁగా గడుగఁబడినవై స్పష్టముగాఁ బ్రకాశించుచున్నవి. మిగుల గొప్పవగు ప్రమాణములుగలవియును, వ్రేలాడుచున్నవియును, (అనఁగా మీఁదినుండి క్రిందఁబడుచున్నవియును) నగుకొండకాలువలు ముత్యాలసలాపములవలెఁ బ్రకాశించుచున్నవి. పర్వతోత్తమములయొక్క విపులములగు ప్రవాహములు (అనఁగా కొండకాలువలు) పర్వతములయొక్క యుపరిభాగమునందలి శిలలమీఁదుగాఁ బ్రవహించుటవలన స్ఖలనమునుబొందుచున్న వేగమునుగలవగుచుఁ జక్కఁగా ధ్వనిచేయుచున్న నెమళ్లతోఁగూడియున్న గుహలయందు ముత్యాలహారములవలెఁ బ్రకాశించుచున్నవి, అధికమైనవేగముగలవియును, విపులములైనవియునునగు కొండకాలువలు పర్వతములయొక్క యుపరిభాగమునందలి శిఖరములను గడిగినవగుటయేగాక కొండచరియలయొక్క సమీపభూములయందు ముత్యాలహారములనుబోలి ప్రవహించుచున్నవి. మఱియునో తమ్ముఁడా! లక్ష్మణా! సర్వస్థలములయందును వర్షోదకధారలు సంభోగకాలమునందలి సమ్మర్దముచేతఁ దెగి యంతరిక్షమునుండి భూమిమీఁదఁబడుచున్న దేవతాస్త్రీలయొక్క ముత్యాలహారములనియెడు తలంపును గలుగఁజేయుచున్నవి చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! పక్షులన్నియును దమగూండ్లలోనికిఁ బోవుటచేతను, పద్మములుముకుళించుకొని పోవడముచేతను, మాలతీపుష్పములు వికసించడముచేతను, సూర్యాస్తమయమైనట్లుతోఁచుచున్నదిగాని సూర్యాస్తమానము కనఁబడడములేదు. తమ్ముఁడా! లక్ష్మణా! ఇప్పుడురాజుల యుద్ధయాత్రనిలిచిపోయినది. రాజులసేనలు యుద్ధములులేక పోవడముచేత వెనకకుఁ దిరిగిపోవుచున్నవి. విరోధములును, మార్గములును నుదకముచేత సమానముగాఁ జేయఁబడినవి. (అనఁగా విరోధము లణఁగిపోయినవి. మార్గములు చెడిపోయినవి) సామవేదమును జదువునట్టి బ్రాహ్మణోత్తములు భాద్రపదమాసమువచ్చుటచేత నధ్యయనముచేయుటకుఁ దగిన కాలమగుటచేత నధ్యయనమును జేయుటకు యత్నించుచున్నారు. తమ్ముఁడా! లక్ష్మణా! కోసలాధిపతియగు భరతుఁడు గృహమునందుఁ జేయఁదగినకర్మలను జేసినవాఁడును, సకలపదార్థములను సంపాదించినవాఁడును, నై యాషాఢమాసమునందుఁ జేయఁదగినవ్రతమును నిశ్చయముగా నాచరించియుండును. ఇదివర్షాకాలమగుటచేతఁ బూర్ణముగానిండిన సరయూనదియొక్కవేగము నే నరణ్యమునకు వచ్చునపుడు నన్నుఁజూచుటకువచ్చిన జనులయొక్క రోదవతి రొదగలదైయుండును. అనేకగుణములుగల యావర్షాకాలమునందు సుగ్రీవుఁడుశత్రువులను జయించినవాఁడును, భార్యతోఁగూడు కొనినవాఁడును, గొప్పదగురాజ్యసంపదను బొందినవాఁడును నగుటచేత సుఖమునుబొందుచుండు ననితోఁచుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! నేనుభార్యలేనివాఁడను, గొప్పదగు రాజ్యమునుండి భ్రష్టుఁడనునగుటచేత వర్షాకాలమునందు నదియొక్కయొడ్డువలెఁ గృశించుచున్నాఁడను. మఱియునోతమ్ముఁడా! లక్ష్మణా! ఇప్పుడు నాకు దుఃఖమధికమైయున్నది. ఈవర్షాకాలపు దినములుగూడ భరింపనలవి గానివైయున్నవి. నాకుశత్రువగు రావణాసురుఁడు మిగులగొప్పవాఁడు. కావున, నేనెట్లు జయమును బొందఁగలనో తెలియలేదు. మఱియునోలక్ష్మణా! ఇదియాత్రను జేయుటకుఁదగిన కాలముకాకపోవుటచేతను, మార్గములన్నియును, నడచుటకు వీలులేనివైయుండుటచేతను, సుగ్రీవుఁడు నమస్కరించి చేయఁదగిన కార్యమును జెప్పుమనిప్రార్థించినను నేనేమియును జెప్పకయూరకుంటిని. మిగులనాయాసమును బొందియున్నవాఁడును, చిరకాలమునకు భార్యాసంగమమును బొందినవాఁడును, నగుసుగ్రీవునితో నాకార్యమల్ప ప్రయత్నముతో శీఘ్రముగాఁ గాఁదగినది కానిదగుటచేత నిదిసమయముగాదనియును, శరత్కాలమువచ్చిన పిమ్మటఁ జేయుమనియును జెప్పితిని. కావునసుగ్రీవుఁడు కొంతకాలము విశ్రమించి తగినకాలమును దానే తెలిసికొని తగినయుపకారమును జేయఁగలఁడు, ఇందుకేమియును సందేహములేదు. కావున శుభలక్షణములుగల యోలక్ష్మణా! తమ్ముఁడా! నేనుశరత్కాలమెప్పుడు వచ్చునోయని నిరీక్షించెదను. మఱియును సుగ్రీవునకనుగ్రహమెప్పుడువచ్చునా యనియును, నదులెప్పుడు నిర్మలోదకములు గలవియగునా? యనియును నిరీక్షించుచుండెదను. తమ్ముఁడా! లక్ష్మణా! ఉపకారమునుబొందిన వీరుఁడవశ్యముగాఁ బ్రత్యుపకారమునుజేయును, చేసినమేలును, మరచిపోయినవాఁడును, తగినప్రత్యుపకారమును జేయనివాఁడును సజ్జనులచేత నిందింపఁబడునని సుగ్రీవుఁడు తెలిసినవాఁడగుటచేత నవశ్యముగా మనకు సహాయముచేయునని తలఁచెదననియె.

ఇవ్విధముగా రాముఁడు చెప్పినమాటలనువిని లక్ష్మణుఁడు చేతులను ముకుళించుకొని వినయవినమితాంగుఁడై యనేకవిధముల రాముని వచనములనుబొగడె. మఱియు నుజూచుటచేత సకలశుభములను గలుగఁజేయువాఁడును, మనోహరుఁడును, నగురామునిఁ జూచుచుండె. అట్లుచూచుచునిట్లనియె.

అన్నా! రామచంద్రా! సుగ్రీవుఁడు నీవుచెప్పినవిధము

గా శీఘ్రముగా సకలకార్యములను నెరవేర్పఁ గలఁడు. కావుననీవుశత్రుఁడగు రావణాసురునిఁ జంపుటకుఁ దగినకాలమును సరీక్షించుచుండుమని జెప్పె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యిరువదారవ సర్గముగిసెను.

౨(*)

సుగ్రీవుఁడు సీతాదేవిని వెదుకుటకొఱకు వానరులనందరిని రప్పింపుమని నీలున కాజ్ఞ సేయుట.

అంతటనక్కడ కిష్కింధాపట్టణమునందుఁ జేయఁదగిన కార్యమును నిశ్చయించినవాఁడును, సకలకార్యముల యొక్క తత్త్వమును దెలిసినవాఁడును, కాలమును, ధర్మములను, చేయఁదగిన కార్యములను, నెఱిఁగినవాఁడును నగుహనుమంతుఁడు మబ్బులును, మెఱుపులును లేనిదియును, బెగ్గురుపక్షులయొక్క ధ్వనిగలదియును, నిర్మలమైనదియును, స్వచ్ఛమగు వెన్నెలచేత వ్యాప్తమైనదియును, నగుఆకాశమునుజూచి విస్మృతసకలసంపదలును గలవాఁడును, ధర్మార్థములయందు స్వల్పమగునాశగలవాఁడును, సర్వకాలములయందును, దుర్మార్గులు సంచరించునట్టి కామమార్గమునందు సంచరించువాఁడును, సర్వకాలములయందును నంతఃపురమునందే విహరించుచున్నవాఁడును, సకలకార్యములను విడిచియున్నవాఁడును, నెల్లప్పుడును స్త్రీలయందే యభిలాషగలవాఁడును, కోరినకోరికలనన్నింటిని బొందియున్నవాఁడును, తనభార్యతోడను, తారతోడను, తృప్తితీరునట్లు రతికేళులను సలుపుచున్నవాఁడును, "నందనవనమునం దప్సరస్త్రీలతోఁగూడ విహరించుచున్న యింద్రునివలె" ఉద్యానవనములయందు దివ్యాంగనలతోఁగూడ విహరించుచున్నవాఁడును, రాత్రింబగళులయందు మిగులవినోదముగా విహరించుచున్నవాఁడును, ధన్యత్వమును బొందియున్నవాఁడును, మనస్తాపమేమియును లేనివాఁడును, మంత్రులయందు సకలకార్యములనుబెట్టి యేవిషయమును నాలోచింపక కామాసక్తుఁడై యున్నవాఁడును, రాజ్యమునకపాయము వచ్చునేమో, యనియెడుసందేహమేమియును లేనివాఁడును, ఇష్టానుసారముగ సంచరించుచున్నవాఁడును, వాక్యములయొక్క యర్థమునుబాగుగఁ దెలిసికొనువాఁడును, వానరాధిపతియును, నగుసుగ్రీవునితో హితమైనదియును, వాస్తవమైనదియును, సామగుణముగలదియును, ధర్మార్థనీతులుగలదియును, విశ్వాసప్రేమలను గనఁబరచునదియును, నమ్మకమునుబుట్టించునదియును, నగుమాటను జెప్పఁదలచి యిట్లనియె.

వానరాధిపతివైన యోసుగ్రీవుఁడా! నీవురాజ్యమును గీర్తిం బొందితివి. ఇంతయుగాక మీతాతతండ్రుల నాటనుండివచ్చుచున్న యైశ్వర్యమును బొందితివి. ఇఁకనీవిప్పుడు మిత్రులను సంపాదించుకొనుటకుఁ దగినయత్నమును జేయవలయును, కావుననీవిప్పుడు రామకార్యమును గుఱించియోచింపుము. మఱియునోసుగ్రీవుఁడా! "శ్లో॥ యోహిమిత్రేషుకాలజ్ఞస్సతతంసాధువర్తతే । తస్యరాజ్యంచకీర్తిశ్చ ప్రతాపశ్చాభివర్తతే॥ లోకములో, ఏరాజు, కాలమును గనిపెట్టిమిత్రులకార్యములను జక్కఁబఱచునో యట్టిరాజుయొక్కరాజ్యమును, కీర్తియును, ప్రతాపమును వృద్ధిఁబొందుచుండును. కావుననీవుమిత్రుఁడగు రామునికార్యమునుగుఱించి తగినవిధముగ నాలోచింపుము. స్వామి, మంత్రి, స్నేహితుఁడు, కోశము, రాష్ట్రము, దుర్గము, సైన్యము,లనునవి, యేరాజ్యమునందుఁ జక్కఁగానుండునో యారాజ్యము సకలసమృద్ధులును గలదైయుండును. కావుననీవును సప్తాంగములను బాగుసేసికొని యెన్నటికిని నపాయములేని రాజ్యమును బాలింపుము. నీవుమునుపుచెప్పిన విధముగఁ గొంచెమైనను గొరతలేకుండునట్లు రామునికార్యమును నెరవేర్పుము. మఱియునో సుగ్రీవుఁడా! "శ్లో॥ సంత్యజ్యసర్వకార్యాణిమిత్రార్థే యోనువర్తతే। సంభ్రమాద్ధికృతోత్సాహస్సోనర్థైర్నావరుధ్యతే,, లోకములోనెవ్వఁడు తనకార్యములనన్నింటిని వదిలిపెట్టియధికమైన ప్రియముతోస్నేహితుల కార్యమునందుఁ బ్రవర్తించునో యట్టివాఁడెన్నటికిని నపాయములేనిరాజ్యము ననుభవించును. కావుననీవుమిగుల నుత్సాహముగలవాఁడై మిత్రుఁడగురాముని కార్యమును జేయుటకుఁ బ్రయత్నింపుము. మఱియునోసుగ్రీవుఁడా! తగినకాల మతిక్రమించి పోయినపిమ్మట స్నేహితులకార్యములయందుఁ బ్రవర్తించి గొప్పవగు కార్యములను జేసినప్పటికిని మిత్రకార్యములయందుఁ బ్రవర్తించిన వాఁడుగానేరఁడు. వీరుఁడవును, శత్రువులనునశింపఁ జేయువాఁడవును నైన యోసుగ్రీవుఁడా! మిత్రుఁడగు రామునియొక్క కార్యమిప్పుడవశ్యముగాఁ జేయఁదగినది. వీరుఁడగురాముని కార్యమును జేయుటకుఁ దగినకాలమతిక్రమించి పోవుచున్నది. కాలవేత్తయగు రాముఁడుతగినకాల మతిక్రమించి పోవుచున్నదని నీకుఁ జెప్పఁడు వానరోత్తముఁడవైన యోసుగ్రీవుఁడా! రామునిభార్యయగు సీతాదేవిని వెదకుటకొఱకుఁ దగిన ప్రయత్నమును జేయుము. ప్రాజ్ఞుఁడగురాముఁడు తనకార్యమునందుఁ మిగులఁ ద్వరగలవాఁడైనను నీబుద్ధిననుసరించి ప్రవర్తింపవలయునని తలంచుచున్నాఁడు. మిగులఁజక్కఁగాఁ బ్రవర్తించుచున్న కులమునకుబంధువుఁడును, సర్వమునకును

గారణమైనవాఁడును, రఘుకులమునందుఁ బుట్టినవాఁడును, మితిలేనిమహిమగలవాఁడును, నపరిమితములగు గుణములుగలవాఁడును, నగు రాముఁడు నీయిష్టానుసారముగఁ బోవలయునని తలఁచుచున్నాఁడు. ఇదివఱకుఁ బూర్వమే రాముఁడు నీకు మేలును జేసియున్నాఁడు. కావుననీవుఆరామునకు శీఘ్రముగ మేలును జేయుము. వానరాధిపుఁడవైన యోసుగ్రీవుఁడా! వానరశ్రేష్ఠులకుఁ జేయఁదగినకార్యములనుగురించి యాజ్ఞాపింపుము. రాముఁడిక్కడకు సమాచారమును బంపకమునుపే మనమురాముని కార్యమునందుఁ బ్రవర్తించితిమేని కాలాతిక్రమణదోషము గలుగనేరదు. రాముఁడుసమాచారమును బంపినపిమ్మట మనము రామునికార్యమునందుఁ బ్రవర్తించితిమేని కాలాతిక్రమణదోషముగలుగును. వానరాధిపతివైన యోసుగ్రీవుఁడా! నీవుఉపకారమును జేయనివానికిఁగూడ నుపకారమును జేయఁదగినప్రభుఁడవు. ఇట్టిమహానుభావుఁడవైననీవు, నీకుఁ బ్రత్యుపకారమును జేసినరామునకు నీధనమును రాజ్యమును గూడ వ్యయపరచి చేయఁదగినకార్యమును జేయవలయును. వానరులకును, ఋక్షగణమునకును నధిపతివైన యోసుగ్రీవుఁడా! శక్తిమంతుఁడవును, పరాక్రమవంతుఁడవునునగు నీవుదశరథ మహారాజునకుఁ బుత్రుఁడగురాముని కార్యమును జేయుటకుఁదగిన యాజ్ఞనివ్వక యెందు కాలస్యమును జేసెదవు. దశరథ రాజనందనుఁడగు రాముఁడుతనబాణములచేత దేవదానవులనుగూడ స్వాధీనముగాఁజేసికొనుటకుఁ దగినవాఁడు. అట్టిసామర్థ్యముగల వాఁడయ్యును నీయాజ్ఞనుగోరుచున్నాఁడు మఱియు నామహానుభావుఁడు ప్రాణత్యాగమునకుఁగూడ భయపడకనీకుఁ బ్రియమును జేసెను. కావునమనము రామునిభార్యయగు సీతాదేవినిభూమ్యంతరిక్షములయందు వెదకుదము. రామునకు దేవతలవలనను, గంధర్వులవలనను, అసురులవలనను, మరుద్గణములవలనను, భయములేదు. అట్టిరాముని రాక్షసులేమి చేయఁగలరు. వానరాధిపతివైన యోసుగ్రీవుఁడా! అట్టిపరాక్రమము గలవాఁడును, ముందుగానీకుపకారమును జేసినవాఁడును, నగురామునకు నీవుసర్వవిధములచేతను బ్రియమును జేయఁ దగినవాఁడవు వానరాధిపతివైన యోసుగ్రీవుఁడా! నీయాజ్ఞచేత వానరులందఱును, పాతాళలోకమునందును, భూమియందును నుదకములయందును, మీఁదిభాగమునందును, నాకాశమునందును, మఱియెక్కడనైనను, బోయివెదకుటకుఁ దగినసామర్థ్యముగలవారు. నీకనేకకోట్లవానరులు భృత్యులైయున్నారు. నీయాజ్ఞయయ్యేనేని యెవ్వఁడెక్కడ నీకొఱకుఁ బ్రవర్తింపరు? కావునసీతను వెదకుటకొఱకు వానరులం బంపించి యాజ్ఞనివ్వుము. కొంచెమైనను నాలస్యమును జేయకుమని హనుమంతుఁడు చెప్పె.

అవ్విధముగ హనుమంతుఁడు చెప్పినమాటలనువిని తగినకాలమునందుఁ దగినమాటను జెప్పితివని శ్లాఘించిసత్వసంపన్నుఁడగు సుగ్రీవుఁడుశ్రేష్ఠమగు నాలోచనను జేసెపిమ్మట సర్వకాలములయందును జేయదగినకార్యములను జేయుటయం దభిలాషగలవాఁడును, తనకునిష్టుఁడును, నగు నీలునిఁబిలిచి సుగ్రీవుఁడిట్లనియె.

వానరోత్తముఁడా! నీలుఁడా! సకలదిక్కులయందును గలవానరులను నిక్కడకురప్పింపుము. మఱియునోనీలుఁడా! నాసైన్యమంతయును నొక్కచోట సంపూర్ణముగాఁ జేరునట్లు చేయుము. సకలదిక్కులయందలి యూథపాలురను రప్పింపుము. మఱియునతిశీఘ్రముగ సేనాపతులను గూడరప్పింపుము. మఱియునోనీలుఁడా! నాయాజ్ఞనబొంది సేనాపర్యంతమును బాలించువారును, శీఘ్రముగాసకలకార్యములను జేయువారును, వ్యవసాయము గలవారును, నగువానరోత్తములు వచ్చునట్లుచేయుము. నాయాజ్ఞనుజక్కగా నెరవేర్పుము ఇక్కడకువచ్చిన వానరసైన్యమునకు సర్వమునకును నీవేయధిపతివైయుండి చేయఁదగిన కార్యములను జేయుము. పదునైదు దినములలోపల నిక్కడకు రానివానరులకు మరణదండనవిధింపఁ బడుననియును నిందు కేమియును సందేహములేదనియును జెప్పుము. నీవునాయాజ్ఞనవలంబించి యంగదనితోఁగూడఁ గూడుకొని సకలకార్యములను నెరవేర్పుమనిచెప్పి వానరాధిపతియును, వీర్యవంతుఁడునునగు సుగ్రీవుఁడు గుహవంటిదగు కిష్కింధాపట్టణము లోనికిఁబోయె.

ఇట్లు శ్రీమత్కిష్కింధా కాండమునందలి యిరువదితొమ్మిదవ సర్గముగిసెను

రాముడు సీతాదేవిని దలచుకొని విలపించుట.

అట్లుసుగ్రీవుఁడు అంతఃపురములోనికిఁ బోయినపిమ్మటను నాకాశమునందలి మేఘములన్నియును బోయినపిదపను, వర్షాకాలపురాత్రులను గడపినరాముఁడు కామశోకముచేత నధికముగాఁ బీడింపఁబడియె. అట్టిరాముఁడు తెల్లనియాకాశమును, నిర్మలమగు చంద్రమండలమును, వెన్నెలచేతఁ బ్రకాశించుచున్నదియును, శరత్కాలము నందలిదియునునగు రాత్రినిఁజూచి సుగ్రీవుఁడుకామవృత్తను గలవాఁడనియును, సీతాదేవినష్టమై పోయినదనియును, తలఁ

చుకొని తగినకాలముగూడ నతిక్రమించెనే యనిచింతించి మూర్ఛనుబొందె. రఘుకులోత్తముఁడును, బుద్ధిమంతుఁడును, నగురాముఁడు మరలఁగొంతసేపటికిఁ దెలివినిబొంది మనస్సులోనున్న సీతాదేవినిగుఱించి విచారమునుబొందె. అంతటనారాముఁడు బంగారవుకాంతిగల గైరికాది ధాతువులచేత నలంకరింపఁబడిన పర్వతాగ్రమునందుఁ గూర్చున్నవాఁడై శరత్కాలమునందు నిర్మలమైయున్న యాకాశమునుజూచి మనస్సుచేతఁ బ్రియురాలినిస్మరించె. మఱియు నారాముఁడు, నిర్మలమైనదియును, మేఘములును, మబ్బులును, లేనిదియును, బెగ్గురుపక్షులయొక్క ధ్వనులతోఁగూడు కొనినదియును, నగునాకాశమునుజూచి దీనాలాపములతో రోదనమునుజేసె. అట్లువిలపించి యిట్లనియె.

బెగ్గురుపక్షులయొక్క కంఠధ్వనివంటి కంఠధ్వనిగలదియును, బాలికయును, నగుసీతపూర్వమునందు బెగ్గురుపక్షులయొక్క ధ్వనులనువినుచు, నట్టిధ్వనులను దానుగూడఁ జేయుచు నాశ్రమమునందుఁ దిరుగుచుండును. అట్టిసీతయిప్పుడెక్కడ, ఏవిధముగాసంచరించుచున్నదోగదా? పూర్వముబాలికయగు సీతాదేవిపుష్పించిన వేగిచెట్లను, నిర్మలములగు కాంచనపు వృక్షములను, నన్నును, జూచివిహరించుచుండును. అట్టిసీతయిప్పుడు నన్నుఁజూడక యెట్లుసంచరించునోగదా? పూర్వమునందుఁ గలహంసధ్వనివంటి ధ్వనిగలసీతాదేవి కలహంసలయొక్క ధ్వనులచేత మేలుకొనుచుండును. అట్టిసీతయిప్పుడెట్లు నిద్రనుండి మేలుకొనుచుండునోగదా? పూర్వమునందుఁ దామరరేకులవలె విశాలములగు నేత్రములుగల సీతాదేవితనతోఁగూడ సంచరించుచున్న చక్రవాకపు పక్షులయొక్క ధ్వనులనువిని మేలుకొనుచుండును, అవ్విధముగా మేలుకొనుచున్నదియును, సుందరములగు సర్వావయవములు గలదియునునగు సీతాదేవియిప్పు డెవ్విధముగా మేలుకొనుచున్నదోగదా? తమ్ముఁడా!లక్ష్మణా! సరస్సులయందును, నదులయందును, బావులయందును, వనములయందును, సీతనువదలి సంచరించుచున్ననాకుఁ గొంచెమైనను సుఖముగలిగియుండలేదు. మఱియునోతమ్ముఁడా!లక్ష్మణా!నాయొక్క వియోగమువలనను, మిగులసౌకుమార్యముగలదియును, నగుసీతాదేవిని శరత్కాలగుణములచేత నధికుఁడగు మన్మథుఁడధికముగా బాధించుననితోఁచుచున్నదనియె.

ఇట్లురాజనందనుఁడును, మానవోత్తముఁడును, నగురాముఁడు చాతకపుపక్షి దేవేన్ద్రునివలన గలుగునుదకమునుద్దేశించి విలపించువిధముగా ననేకవిధములవిలపించె. అటువిమ్మటఁ గొండచరియలయందు ఫలాపేక్షచేతసంచరించుచున్నవాఁడును, తిరిగితిరిగిస్వస్థానమునకు వచ్చినవాఁడును, ననేకములగు శుభలక్షణములు గలవాఁడునునగు లక్ష్మణుఁడు అన్నయగు రామునిఁజూచె. చూచినవిమ్మట సీతావియోగముచేత మిగులవిచారమును బొందుచున్నవాఁడును, విపరీతముగనున్నవాఁడును, తెలివిఁదప్పి మాటిమాటికిని మూర్ఛనుబొందు చున్నవాఁడును, నగురామునిఁజూచి యన్నయగురామునియొక్క దుఃఖముచేత దుఃఖమును బొందుచున్నవాఁడును, మిగులధైర్యము గలవాఁడును, నగు లక్ష్మణుఁడిట్లనియె,

పూజ్యుఁడవైన యోరాముఁడా! అన్నా! చిత్తమును స్థిరముగా నుంచుకొనఁదగిన కాలమునందుఁ జిత్తచాంచల్యమునుగలుగఁ జేసికొనుచున్నావు. ఇదిమిగుల అనుచితమైన కార్యమనితోఁచడములేదు. చిత్తమును మన్మథాయత్తముగఁ జేయుటవలననే మిప్రయోజనముగలదు? పౌరుషమును బాధసేయునట్టి విచారము నవలంబించుటవలన ఫలమేమి? చిత్తస్థైర్యమును వదలుటవలన నేమిలాభము గలుగును? మఱియునోఅన్నా!రాముఁడా! చేయఁదగినకార్యమునందు దగినంత ప్రయత్నమును జేయుటయును, మనస్సునునిర్మలముగాఁ జేసికొనుటయును, చిత్తమునుస్థిరముగానుండునట్లు చేసికొనుటయును, కాలమునుగనిపెట్టి సంచరించుటయును, సహాయసంపదగలిగి యుండుటయును, పూర్వజన్మమునందలి సుకృతపరిపాకమును, గొప్పదగుపరాక్రమమును, గలిగియుండుటయును, ననునవి చేయఁదలఁచిన కార్యముసిద్ధించుటకుఁ దగినకారణములని యోచింపుము. మనుకులమునకుసాధుఁడవైన యోరాముఁడా! నీకుభార్యయగు సీతాదేవియితరులకు సులభురాలగునని తలపకుము. లోకములోనేజంతువైనను మండుచున్నయగ్నిహోత్రమును ముట్టుకొనినఁపుడు కాలిపోకయుండునా? కావునసీతను దాఁకఁదలఁచినవాఁ డవశ్యముగ నశించును. కాఁబట్టినీవు సీతపరులపాలగునేమోయని విచారమును బొందకుమనియె. ఇవ్విధముగాలక్ష్మణునిచేత యుక్తియుక్తముగాఁ బలుకఁబడినదియును, యుక్తులచేతహతము సేయుటకు వీలుగానిదియును, సహజముగానుచితమైనదియును, హితమైనదియును, పథ్యమైనదియును, నీతియుక్తమైనదియును, సామవాదమును జూపుచున్నదియును, ధర్మార్థయుక్తమైనదియును నగుమాటనువిని రాముఁడు శుభలక్షణములుగల లక్ష్మణునితో శుభలక్షణములుగలదియును, యుక్తులచేత ఖండింపనలవిగానిదియును, హితమైనదియును, పథ్యమైనదియునునగు మాటను జెప్పఁద

లంచియుట్లనియె.

నాయనా! లక్ష్మణా! నిస్సందేహముగాఁ జేయఁదగిన కార్యమునుగుఱించి యోచింపవలయును, ఇంతయగాక క్రియావిశేషములను గుఱించి ప్రవర్తింపవలయును. పొందశక్యముగాని కార్యముయొక్క ఫలమునుగుఱించి ముందుగా యోచింపదగదు కావున ముందుగాఁ బ్రయత్నమును జేయవలయునని చెప్పి పిమ్మటఁ బద్మపత్రములవంటి నేత్రములుగల సీతాదేవిని మాటిమాటికిని మనస్సునందు స్మరించుచు ఎండుచున్న నోరుగలవాఁడై యా రాముఁడు లక్ష్మణునితో నిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! వేయినేత్రములుగల దేవేన్ద్రుఁడు ఉదకముచేత భూమినిసర్వమును తృప్తినొందించి సస్యములకు వృద్ధినిగల్పించి మఱియును దాను జేయవలసిన కర్మలనన్నింటిని జేసి విశ్రాంతినిబొందియున్నవాఁడు. రాజనందనుఁడవైన యోతమ్ముఁడా! మేఘములుమిగుల మనోహరములైనవియును, గంభీరములైనవియును నగు నురుములుగలవియును, పర్వతములయొక్కయు, వృక్షములయొక్కయు నగ్రభాగములయందును సంచరించినవియును నై యుదకమును సంపూర్ణముగా వర్షించి విశ్రమించియున్నవి. మఱియునో తమ్ముఁడా! లక్ష్మణా! నల్లగలువలయొక్క రేకులవలె నల్లనివగు మేఘములు పదిదిక్కులనునల్లగాఁ జేసి పిమ్మట మదరహితమైన యేనుగులవలె వేగశూన్యములైయున్నవి. చూడుము తమ్ముఁడా! లక్ష్మణా! ఉదకముగర్భమునందుఁ గలవియును, గొప్పవగు వేగము గలవియును, గిరిమల్లి కాపుష్పములయొక్కయు, మద్దిపూలయొక్కయు గంధముగలవియును, మిగులనధికముగా వీఁచుచున్నవియును నగువాయువులు సర్వస్థలములయందును విహరించియిప్పుడు విశ్రమించినవి. పాపరహితుఁడవైన యోలక్ష్మణా! ఉదకమును వర్షించుచున్న మేఘములయొక్కయు, మదోదకమును స్రవింపఁజేయుచున్న యేనుఁగుయొక్కయు, ఆనందబాష్పములను విడుచుచున్న నెమళ్లయొక్కయు ధ్వనులుమిగుల శీఘ్రముగా నశించిపోయినవి. గొప్పవగు మేఘములచేత నధికముగా వర్షోదకముచేతఁ దడపఁబడినవియును, కావుననే, నిర్మలములైనవియును నగుకొండచరియలు నానావిధవర్ణములుగల గైరికాది ధాతువులచేతఁ బూయఁబడినవానివలెఁ బ్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు నదులన్నియును దమయందలి యిసుకతిన్నెలను, "నూతనసంభోగమునందు సిగ్గుతోఁగూడుకొనియున్న స్త్రీరత్నము తనతొడలనుపిరుదులను, మెల్లమెల్లగాఁ జూపువిధముగ" గొంచెముకొంచెముగాఁ జూపుచున్నవి. చూడుము. మఱియునో తమ్ముఁడా! లక్ష్మణా! ఈసమయమునందు శరత్కాలము, ఏడాకులయరటిచెట్లయొక్క కొమ్మలయందును, నక్షత్రములయొక్కయు, సూర్యునియొక్కయు, చంద్రునియొక్కయు, కాంతులయందును, శ్రేష్ఠములగు నేనుఁగులయొక్క లీలయందును, లక్ష్మినివిభజించియుంచి ప్రకాశించుచున్నది. ఈసమయమునందుఁ జక్కగా శరత్కాలము ప్రవర్తించుచున్నది. శరత్కాలగుణములచేతవృద్ధినిబొందింపఁ బడినదియును, నానావిధములగు వస్తువులనాశ్రయించుటచేతఁ జిత్రమైనశోభ గలదియును, నగుశరత్కాలలక్ష్మి సూర్యునియొక్క శ్రేష్ఠములగు కిరణములచేతఁ జక్కగాఁ బ్రకాశింపఁ జేయఁబడినవియును, పద్మములుగలవియును, నగుమడుగులయందధికముగాఁ బ్రకాశించుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! ఏడాకులయరటిచెట్లయొక్క పుష్పములయందలి గంధముగలదియును, తుమ్మెదగుంపుచేతననుసరించి గానముచేయఁ బడుచున్నదియును, నగువాయువు చక్కగావీచుచున్నదై వనములయందు మదపుటేనుఁగుల యొక్క గర్వమునధికముగాఁ జేయుచున్నవి. తమతమభార్యలతోడను, భర్తలతోడను జేరుకొని వచ్చినవియును, మిగులసుందరములును, విశాలములునునగు రెక్కలుగలవియును, సరస్సులయందుఁ బ్రియముగలవియును, పద్మములయందలి పరాగములచేత వ్యాప్తములైనవియును, గొప్పవగు నదులయొక్క యిసుకదిబ్బలయందు సంచరించుటకొఱకు వచ్చినవియును, నగుచక్రవాకపక్షులును, హంసలును, నదులయందు మిగులమనోహరముగా విహరించుచున్నవి. మదముచేతమిగుల నధికమగు ప్రగల్భములుగలవి యగు నేనుఁగులయందును, చక్కగా మేతనుమేసిబలిసిన గోసమూహములయందును, నిర్మలములగు నుదకములుగలనదులయందును, శరత్కాలసంపద నానావిధములుగా విభాగమునుబొంది ప్రకాశించుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు నెమళ్లు మేఘశూన్యమగు నాకాశమునుజూచి తమపింఛములనియెడు నాభరణములను విడిచిపెట్టినవియును, తమకుఁ బ్రియమైన భార్యలయందలి ప్రేమనువదలినవియును, తమశరీరశోభను వదలినవియును, సంతోషరహితమైనవియును నై వనములయందు ధ్యానమును జేయుచున్నవిధముగనూరకున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు వనమధ్యప్రదేశము లన్నియును, మనోహరమగుపరిమళముగలవియును, మిగులగొప్పవియును, పుష్పభారముచేత వంగినకొమ్మలు గలవియును, బంగారముయొక్క వర్ణమువంటి వర్ణముగలవియును, నేత్రములకుమిగుల నింపుగానున్నవియును, నగు వేగిచెట్లచేతమిగుల మనోహరము

గాఁ బ్రకాశింపఁజేయఁబడుచున్నవి. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు, భార్యలయందుఁ బ్రియముగలవియును, తామరపువ్వులయందు, బ్రియముగలవియును, వనములయం దాసక్తిగలవియును, ఏడాకులయరటిచెట్లయొక్క పూలనునాఘ్రాణించుటచేత మదించినవియును, మదముచేతనత్యుద్ధతములైనవియును, మిగులఁ శ్రేష్ఠములైనవియును, నగునేనుఁగులయొక్క నడకలుమందపడియున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునం దాకాశముచక్కఁగాఁదోమిన యాయుధములయొక్క కాంతి వంటి కాంతిగలదియైయున్నది. నదులయందలి యుదకములన్నియునుగృశించిన ప్రవాహముగలవై యున్నవి. వాయువులెఱ్ఱకలువలయొక్క గంధములుగలవై వీచుచున్నవి. దిక్కులన్నియును జీకటిలేనివియును, నిర్మలములైనవియునునై ప్రకాశించుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు భూమియందలి బురదయంతయును, సూర్యునియొక్క యెండచేత నెండిపోవుచున్నది. కొంచెకొంచెముగా భూమియందుఁ బరాగముపుట్టుచున్నది. మఱియు నీసమయమునందు అన్యోన్యవైరముగల రాజులుయుద్ధములను జేయుటకుఁదగినప్రయత్నములను జేయుచున్నారు. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు జక్కఁగా మేతను మేయుటచేత మిగుల మనోహరమైన దేహకాంతిగలవియును, మిగులసంతోషముగలవియును, దుమ్మునుశరీరమునం దధికముగాజల్లుకొనుచున్నవియును, మదించినవియును, యుద్ధమును జేయవలయుననియెడు కుతూహలముగలవియును, నగునెద్దులుగోవుల మధ్యయందధికముగా రంకెలువేయుచున్నవి. అతిశీఘ్రముగాఁబోయిన యనురాగముగలవియును, సత్కులమునందు బుట్టినవియుననగు, ఆడయేనుగులగుంపులతో జేరిపోవుచున్నవియును, తమకునాథులయినవియును, నగుమగయేనుగులతో గూడ మన్మథావేశముచేత మెల్లమెల్లగానడిచిపోవుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు నెమళ్లన్నియు మదరహితమైనవై శ్రేష్ఠములైనవియును, తమకాభరణములై యున్నవియుననగు పింఛములను బొత్తిగావిడిచిపెట్టెను. ఇంతయగాకమిగుల మదించికలకలధ్వనులను జేయుచున్న బెగ్గురుపక్షులచేత నధికముగా బెదిరింపఁబడుచున్నవై యతిదీనముగ నడుచుచున్నవి. తమ్ముఁడా! లక్ష్మణా! ఈసమయమునందు ఏనుగులుమదోదకములతో గూడుకొనినవై గొప్పవగుఘీంకారములచేత గన్నెలేడిపిట్టలను, చక్రవాకపుపక్షులను, బెదరించితామర పువ్వులచేతజక్కఁగా నలంకరింపబడియున్న మడుగులయందలి పద్మములనుభేదించి పీడించియుదకమును ద్రాగుచున్నవి. పోయినబురదగలవియును, ఇసుకతోఁ గూడుకొనినవియును, నిర్మలములగు నుదకములు గలవియును, గోసమూహములతోఁ గూడినవియును, ధ్వనులచేతవ్యాప్తములైనవియును, నగునదులయందు హంసలును, బెగ్గురుపక్షులునుగల కలధ్వనులను జేయుచున్నవగుచు విహరించుచున్నవి. నదులయొక్కయు, మేఘములయొక్కయు నుదకములును, మిగులవృద్ధినిబొందిన వాయువులయొక్కయు, నెమళ్లయొక్కయు, సంతోషరహితములగు కప్పలయొక్కయు, కూతలిప్పుడు సర్వశూన్యముగా నశించిపోయినవి. క్రొత్తవగుమేఘములు గలుగుచున్న వర్షాకాలమునందుఁ గృశించినవియును, నానావిధములగు నాకారములు గలవియును, చిక్కినశరీరములు గలవియును, ఆకలిచేతనధికముగాఁ బీడింపఁబడినవియును, చిరకాలముబిలములయం దున్నవియును, నగుసర్పములిప్పుడు బిలములలోనుండి బయలువెడలివచ్చుచున్నవి. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! ఇదియెంతవిచిత్రముగ నున్నదో చూడుము మిగులనెఱ్ఱగానుండు సంధ్యాకాలమనియెడు ననురాగముగలస్త్రీ చంద్రకిరణములనియెడు ప్రియునిహస్తములయొక్క స్పర్శచేతనైన సంతోషముచేతఁ జక్కఁగాఁ బ్రకాశించుచున్న నక్షత్రములనియెడు నల్లగ్రుడ్లుగలదైన యాకాశమనియెడు వస్త్రమునువిడిచి పెట్టుచున్నది. (అనగా నెఱ్ఱగానుండు సంధ్యాకాలము చంద్రకిరణము తగిలినతోడనే ప్రకాశించుచున్న నక్షత్రములుగలదైన పనిమిటియొక్క చేయితగిలినతోడనే యనురాగముగలస్త్రీసంతోషముచేత నల్లగ్రుడ్లనుద్రిప్పుచు దనవస్త్రమును దానేవిడిచివేసినట్లు, ఆకాశమును విడిచిపెట్టెననుట.) మఱియునో తమ్ముఁడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందలి రాత్రియుదయించిన చంద్రుడనియెడు నిర్మలమైన ముఖముగలదియును, నక్షత్రసము దాయమనియెడు ప్రకాశించుచున్నవియును, సుందరములుననగు నేత్రములుగలదియును, వెన్నెలయనియెడు తెల్లనివస్త్రము గలదియునునై తెల్లనివస్త్రమును ధరించినస్త్రీవలె మిగులమనోహరముగా బ్రకాశించుచున్నది. తమ్ముఁడా! లక్ష్మణుఁడా! మిగులసంతోషముతో గూడుకొనినదియును, మిగులమనోహరమైనదియుననగు బెగ్గురుపక్షులయొక్క పక్తిచక్కఁగా బరిపాకమునుబొందియున్న వరివెన్నులనుభుజించి శీఘ్రమైన వేగముగలదై యంతరిక్షమున బోవుచున్నది. ఇవ్విధముగ నాకాశమున బోవుచున్న యీబెగ్గురు పక్షులయొక్కపక్తి గాలిచేత నెగురగొట్టబడిన మాలికవలె అంతరిక్షమునందు బ్రకాశించుచున్నది. చూడుము. తమ్ముఁడా! లక్ష్మణా! నిద్రనుబొందుచున్న హంసలుగలదియును, కలువలతో గూడుకొనినదియు

ను, మడుగులోనున్నదియు నగునీయుదకము, మేఘములచేత విడువబడినదియును, పూర్ణచంద్రునితో గూడినదియును, నక్షత్రములతో గూడుకొనినదియును, నాకాశము రాత్రియందేవిధముగా బ్రకాశించుచున్నదో యావిధముగా బ్రకాశించుచున్నది. సర్వస్థలములయందును దిరుగుచున్న హంసలనియెడు వ్యాకులములైన మొలనూళ్లుగలవియును, వికసించిన పద్మములయొక్కయు కలువలయొక్కయు మాలికలుగలవియును, మిగుల శ్రేష్ఠములైనవియును, నగునదదావులయొక్క సంపద, శ్రేష్ఠములగు నాభరణములచేత నలంకరింపబడిన స్త్రీలయొక్క దేహకాంతిని బోలియున్నది. వేణువాదములనియెడు మంగళవాద్యములతో గూడుకొనినదియును, ప్రాతఃకాలమునందలి వాయువుచేత వృద్ధినిబొందింపబడినదియును, సర్వస్థలములయందును వ్యాపించినదియునునగుధ్వని పెరుగుకుండలను మధించుటవలన గలిగెడు ధ్వనులతోడను, గోవులయొక్కయు, ఎద్దులయొక్కయు ధ్వనులతోడను, గూడుకొనినదై సకలదిక్కులయందును వ్యాపించుచున్నది. నూతనములైనవియును, పుష్పములచేత బ్రకాశించుచున్నవియును, మందమారుతముచేత మెల్లగా గదల్పబడినవియును, చక్కగానుతికి యెండవేయబడిన తెల్లనివస్త్రములతో సమమగుప్రకాశము గలవియును, నగు రెల్లుగడ్డిచేత నదులయొడ్డులు మిగుల మనోహరముగా బ్రకాశించుచున్నవి. వనములయందు నిరాటంకముగ దిరుగుచున్నవియును, తేనెనుద్రాగుటచేత నధికముగా మదించినవియును, తమభార్యలతో గూడుకొనినవియును, కావున నేమిగుల సంతోషముతో గూడుకొనినవియును, పద్మములలోనిదియును, వేగిచెట్లపువ్వుముల లోనిదియునునగు పరాగముచేత గౌరవర్ణముగలదియును, నగుతుమ్మెదలు వనములయందుమదించినవై వాయువుతో సమముగ దిరుగుచున్నవి. చూడుము. తమ్ముడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందుదకము నిర్మలమైయున్నది. కలువలుచక్కగా వికసించియున్నవి క్రౌంచపక్షులుమిగుల మనోహరముగా గూయుచున్నవి వరిపైర్లుచక్కగా ఫలించియున్నవి. వాయువుమందగతి కలదైయున్నది. చంద్రుడునిర్మలుడై యున్నాడు. ఇవియన్నియును వర్షాకాలముపోయినదని దృఢముగా దెలుపుచున్నవి చేపలచేతజూపబడిన మొలనూళ్లుగల నదులనియెడు స్త్రీలయొక్క గతులిప్పుడుమందపడియున్నవి. మఱియునీనదులయొక్కగతులు, ప్రియులచేత బూర్ణముగా ననుభవింపబడివిడిచి పెట్టబడినస్త్రీలయొక్క గతులుప్రాతఃకాలమునందెట్లు మందపడియుండునో యాప్రకారము మందపడియున్నవి. చక్రవాకపక్షులతోడను, నాచుతీగలతోడను, ప్రకాశించుచున్న రెల్లుపూలతోడను, గూడుకొనియున్న నదీముఖములు మకరికాపత్రములయొక్క రేఖలతోగూడుకొనినవియును, గోరోచనరచనలతో గూడుకొనినవియును, నగుస్త్రీలముఖములవలె మిగులమనోహరముగా బ్రకాశించుచున్నవి.

మఱియునో తమ్ముడా! లక్ష్మణా! మిగులజక్కగా వికసించిన నీలిఝుంటీపువ్వులచేతను, వేగిపూలచేతను, జిత్రములగు వర్ణములు గలవియును, మిగులమదించియున్న తుమ్మెదలయొక్క ధ్వనులుగలవియును నగు నరణ్యములయందిప్పుడు మన్మథుడుధనుస్సునెత్తికొనినిరాటంకముగ సంచరించుచున్నాడు తమ్ముడా! లక్ష్మణా! మేఘములువర్షములచేత లోకమునుసర్వమును జక్కగాదృప్తినొందించి నదులను జెరువులను నిండింపజేసి భూమియందంతటను బైరులనుబండింపజేసి యంతటతో నాకాశమును విడిచిపెట్టియెక్కడకోపోయినవి తమ్ముడా! లక్ష్మణా! ఈశరత్కాలమునందు నదులన్నియును, నిర్మలోదకములు గలవియును, క్రౌంచపక్షులయొక్క ధ్వనులతోగూడినవియును, చక్రవాకపక్షులయొక్క సముదాయముగల వియునునై మిగులమనోహరముగ బ్రకాశించుచున్నవి తమ్ముడా! లక్ష్మణా! మనమునివసించియున్న కొండచరియలయందు వేగిచెట్లును, ఏడాకులయరటిచెట్లును, ఎఱ్ఱకాంచనపుచెట్లును, మంకెనచెట్లును, ప్రేంకణపుచెట్లును, పుష్పించినవై మిగుల మనోహరముగ బ్రకాశించుచున్నవి. తమ్ముడా! లక్ష్మణా! నదులయందలి యిసుకతిన్నెలన్నియును, హంసలచేతను, బెగ్గురుపక్షులచేతను, చక్రవాకపు పక్షులచేతను, క్రౌంచపక్షులచేతను, వ్యాప్తములైనవై మిగుల మనోహరముగా బ్రకాశించుచున్నవి. రాజనందనుడవైన యోలక్ష్మణా! పరస్పర వైరములుగలవారును, యుద్ధమును జేయవలయుననియెడు కుతూహలము గలవారును, నగు రాజులయొక్క యుద్ధయాత్రోద్యోగమున కిదిసమయమైయున్నది. రాజనందనుడవైన యోలక్ష్మణా! ఈశరత్కాలము రాజులు మొదటియుద్ధయాత్రను జేయుటకుదగియున్నది. ఈకాలమునందు సుగ్రీవుడేవిధముగా బ్రయత్నమును జేయుటకు యత్నించినట్లు దోచుచుండలేదు. ఆడుచక్రవాకపక్షి భర్తయగు చక్రపక్షితోగూడవచ్చునట్లు మిగులభయంకరమగు వనమునకువచ్చుచున్న నావెంటనంటి "యుద్యానవనమునకు వచ్చినట్లు" నిర్భయముగవచ్చిన సీతాదేవినిజూడక పోవుటచేత దుఃఖమును బొందుచున్న నాకీవర్షాకాలరూపములగు నాలుగుమాసములును నూరుసంవత్సరములు గతించినట్లుగతించినవి. తమ్ముడా! లక్ష్మణా! భార్యావిహీనుడను, దుఃఖముచేతబీడిం

పబడినవాడను, రాజ్యభ్రష్టుడను, దండకారణ్యమునకు దరుమగొట్టబడిన వాడనునైన నాయందు వానరరాజగు సుగ్రీవుడుగొంచెమైనను దయనుబెట్టినవాడుగాడు. తమ్ముడా! లక్ష్మణా ! నేనుదిక్కులేనివాడను, రాజ్యభ్రష్టుడను, రావణాసురునిచేత నవమానింపబడినవాడను, దీనుడను, గృహమునువదలి దూరముగానున్నవాడను, కామకుడనునైన సుగ్రీవుని శరణుబొందితిని. మంచిస్వభావము గలవాడవైన యోలక్ష్మణుడా ! ఇప్పుడు నేను జెప్పిన కారణములచేత దుర్మార్గమునందు సంచరించుచున్నవాడును, వానరరాజును, నగుసుగ్రీవుడునన్ను విశేషముగా నవమానించె.

మఱియును నేనుదగినస్థితియందుంటినేని సుగ్రీవుడునాయందు మిగులగౌరవము నవలంబించియుండును. నేనుహీనస్థితియందుంపుటచేత నన్నుసుగ్రీవుడు లక్ష్యముసేయకున్నాడు. ఇదివఱకునావలన నుపకారమునుబొందిన సుగ్రీవుడుసీతాదేవిని వర్షాకాలముగడచిన పిమ్మటవెదకెదనని చెప్పె. అట్లుచెప్పియును, దురాత్ముడగు సుగ్రీవుడుచేసిన మేలును మఱచినాకార్యమును గుఱించియేమియును ఆలోచించుచున్నవాడుగాడు. కావుననోతమ్ముడా ! లక్ష్మణా! నీవుమిగుల శీఘ్రముగా కిష్కింధా పట్టణమునకుబొమ్ము పోయివానరాధి పతియగు సుగ్రీవునిజూడుము. చూచిమూర్ఖుడును, గ్రామ్యసుఖములయం దాసక్తిగలవాడును, నగుసుగ్రీవునితో నావచనముగా నిట్లనిచెప్పుము.

సుగ్రీవుడా! ముందుగానుపకారమును జేసినవారును, ప్రత్యుపకారమును గోరుచున్నవారును, నగుమానవులకోరికలకు విఘాతమునుజేయునట్టివాడు మనుష్యులలోనధముడు తానుపకారమును బొందునపుడు ప్రత్యుపకారమును జేసెదనని యాశనుబూపించి యట్టికార్యమును జేయనివాడు పరమదుర్మార్గుడు మఱియును "శ్లో॥ కృతార్థాహ్యకృతార్థానాం మిత్రాణాంనభవంతియే। తాన్మృతానపిక్రవ్యాదాః కృతఘ్నాన్నోపభుంజతే॥ తొలుతమేలును బొందినవారు తమకుమొదటమేలును జేసినవారును, స్నేహితులునునగు వారికార్యములనెవ్వరు నెరవేర్పరోయట్టి వారిశవమును కాకులుగ్రద్దలుమొదలగు జంతువులుగూడ భుజింపవు బంగారముచేత నిర్మింపబడిన పృష్ఠభాగముగలదియును, యుద్ధమునందు నాచేతనాకర్షింప బడినదియును, నాధనుస్సుయొక్క మెఱుపుతీగలతో సమానమైనరూపమును జూచుటకొఱకపేక్షించుటయుచితముగాదు. (అనగానాకార్యమును నెరవేర్పకపోతివేని నేనునీతోయుద్ధమును జేయుదును) యుద్ధమునందు గోపముగలవాడనై ధనుస్సునాకర్షించునపుడు పిడుగుయొక్కధ్వనివలె భయంకరమైన ధ్వనిగల నాధనుష్టంకారమును బూర్వము వాలివధకాలమునందువలెనే వినగలవు. కావుననీవునాకార్యమునందు ఉపేక్షనుజేయుట మంచిదిగాదని నావచనములుగా బలుకుమని చెప్పి మఱియునిట్లనియె.

రాజనందనుడవును, మంచిస్వభావముగల వాడవునువైన యోతమ్ముడా! లక్ష్మణా! నీసహాయముతో నేనుజేసిన పరాక్రమకార్యములను జక్కగానెఱిగి యుండియును సుగ్రీవుడునాకార్యమునందు ఉపేక్షించుటనుజూడగా నాకుమిగుల నాశ్చర్యముగనున్నది. శత్రుపురములను జయించునట్టి యోలక్ష్మణుడా! నేనేమినిమిత్తముగ వాలివధమొదలుగాగల కార్యములనుజేసితినో యాసంగతిని దెలిసియుండియును, వర్షాకాలము పోయినతోడనే సీతనువెదకించెదనని చెప్పియును, వానరాధిపతియగు సుగ్రీవుడుతగినకాలమును దెలియనేరకయున్నాడు వర్షాకాలముపోయినతోడనే నాకార్యమునుజేసెదనని చెప్పినసుగ్రీవుడు నాలుగుమాసములును గతించిపోయెనని తెలియజాలకయున్నాడు తమ్ముడా! లక్ష్మణా! సుగ్రీవుడిప్పుడు మంత్రులుమొదలగు వారితోగూడ జేరుకొనిమద్యపానమునుజేసి యిష్టానుసారముగ గ్రీడించుచున్నాడుగాని దుఃఖముచేత దీనులమైయున్న మనకార్యమును గుఱించికొంచెమైనను యోచింపకున్నాడు. కావునమహాబలుడవును, బిడ్డడవునునైన యోలక్ష్మణా! నాకోపమునకు ఏయేమాటలుతగియుండునో యటువంటి మాటలను నీవుపోయిసుగ్రీవునితో జెప్పుము.

మఱియునో సుగ్రీవుడా ! వాలియేమార్గమును బొందెనో యామార్గమిప్పుడు చెడిపోయియుండలేదనియును, నీవుచేయదగిన కార్యమును జేయుమనియును, కానిచోనీవుగూడవాలిపోయిన మార్గమును బట్టిపోదువనియును సుగ్రీవునితో జెప్పుము. వాలిని నేనొక్క బాణముచేతనే యుద్ధమునందు జంపితిననియును, సత్యమును దప్పినచో నిన్ను బంధుమిత్రాదులతోగూడ జంపుదుననియును జెప్పుము మఱియును బురుషోత్తముడవైన యోలక్ష్మణా! ఇప్పటికార్యమునకేయేమాటలు తగియున్నవో ఆయామాటలను జెప్పుము. మఱియును మానవోత్తముడవైన యోలక్ష్మణా! కాలమతిక్రమించి నందుకుగానెట్టిమాటలు జెప్పదగునో యట్టిమాటలను జెప్పుము మఱియునుసుగ్రీవునితో నిట్లనినామాటలుగా జెప్పుము. సుగ్రీవుడా! సత్యమునుదప్పకుము. ప్రతిజ్ఞచేసిన ధర్మమునుజక్కగా నాలోచింపుము. నాబాణములచేత మరణమునుబొంది వాలిపోయినయమలోకమునకే బోకుము. జేయదగినకార్యమును జేయుమనిచెప్పుమనియె.

ఇవ్విధముగా రాముడు చెప్పినమాటలనువిని మానవనా

ధుఁడగు లక్ష్మణుఁడు, తనకన్నయును, అధికమగు కోపమును బొంది యున్నవాఁడును, మిగులవ్యసనముతో మాటలాడుచున్నవాఁడును, దీనుఁడును, నగు రాముని జూచి వానరాధిపతియగు సుగ్రీవునొద్దకు బోవుటయందును, పోయితగిన మాటలను జెప్పుటయందును, మిగులత్వరగల వాఁడయ్యె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ముప్పదవసర్గ ముగిసెను.

లక్ష్మణుఁడు కిష్కింధాపట్టణములో పతికిబోవుట.

రాజపుత్త్రుఁడగు నాలక్ష్మణుఁడు, కామపీడితుఁడును, దీనుఁడును, కావున నేబలహీనుఁడై యున్నవాఁడును, శోకముచేత నధికముగాఁ బీడింపఁబడినవాఁడును, మిగులనధికముగా వృద్ధిబొందుచున్న కోపముగలవాఁడును, దశరథమహారాజునకుఁ బుత్త్రుఁడను, తనకన్నయునునగు రామునితో నిట్లనియె.

అన్నా! రామచంద్రా! నీవువాలినివధించి రాజ్యమునిచ్చిన విషయమును జక్కఁగా యోచింపని సుగ్రీవుఁడు మంచికార్యములయందుండుటకు దగినకార్యము నందుంచుటకుఁ దగినవాఁడుగాఁడు. వానరరాజ్యసంపద ననుభవించుటకును సుగ్రీవుఁడుతగిన వాఁడుగాఁడు. సుగ్రీవునకు మనకార్యమును జేయుటయందు బుద్ధిలేనియెడల వాస్తవముగా సుగ్రీవుని మనము చెరపవలయును. బుద్ధిహీనుఁడగుటవలన గ్రామ్యసుఖములయందాసక్తిగలవాఁడును, నీయనుగ్రహమునకుఁ దగిన విధముగాబుద్ధియందు యోచింపనివాఁడును నగుసుగ్రీవుని నిప్పుడే చంపి వాలియొద్దకుఁ బంపెదను వీరుఁడవైన ఓరాముఁడా! సుగ్రీవునకు రాజ్యమునిచ్చుట యుచితముగనుండలేదు. కావుననాకాజ్ఞనిమ్ము సుగ్రీవునివధించెదను అధికమైనవేగముగలదై పుట్టుచున్నకోపమును నేను భరింపజాలను. ఇప్పుడు నీయాజ్ఞయయ్యెనేని సుగ్రీవునిఁజంపెదను సుగ్రీవునిఁ జంపినపిమ్మట వాలిపుత్త్రుఁడగు నంగదుఁడు వానరులతోఁ గూడినవాఁడై సీతాదేవిని వెదకునుగాకయని యధికకోపముతో మాటలాడుచున్నవాఁడును, ధనుర్బాణములను ధరించినవాఁడును, చేయఁదలచినకార్యమును దెలుపుచున్నవాఁడును, యుద్ధమునందువచ్చునట్టి కోపమువంటి కోపముగలవాఁడును, నగులక్ష్మణునిఁ జూచి శత్రువీరులను సంహరించునట్టి రాముఁడుచక్కఁగా నాలోచింపఁ బడినదియును, కోపమును బోఁగొట్టునట్టిదియును, నగుమాటను జెప్పఁదలంచి యిట్లనియె.

తమ్ముఁడా! లక్ష్మణా! నీయట్టిమహానుభావుఁ డివ్విధమగు పాపమును జేయుటకుఁ దగినవాఁడుగాఁడు. లోకములో జక్కని వివేకముచేత మిత్త్రఘాతరూపమైన పాపమును జేయఁడో యట్టిపురుషుఁ డుత్తముఁడని యెన్నఁబడును తమ్ముఁడా! లక్ష్మణా! సజ్జనవ్యాపారముగల నీచేత నిటువంటి పాపము చేయ దగినదిగాదు. మఱియు నో తమ్ముఁడా! లక్ష్మణా! పూర్వము మనము సుగ్రీవునితో నగ్నిసాక్షికముగ స్నేహమును జేసితిమి కావున నట్టి స్నేహితునియందు బ్రీతినుంచి మాట్లాడుము. తమ్ముఁడా! లక్ష్మణా! సామసహితములగు మాటలచేత బరుషవచనములను విడిచిపెట్టుచు సుగ్రీవునితో మృదుమధుర వచనముల బలుకుము. కాలాతిక్రమణమయ్యెనని పరుషవచనములను మాటలాడకుము. కాలమును గనిపెట్టి సంచరింపుమనియె.

అవ్విధముగా అన్నయగు రామునిచేత జక్కఁగా శిక్షింపబడినవాఁడును, పురుషోత్తముఁడును, వీరుఁడును, శత్రువీరులను సంహరించుటయందు దగినసామర్థ్యముగలవాఁడును, నగు లక్ష్మణుఁడు వానరాధిపతియగు సుగ్రీవునియొక్క పట్టణమగు కిష్కింధాపట్టణమునకుఁబోయెను. పోయినపిమ్మట మంగళకరమగు బుద్ధిగలవాఁడును, సకలవిషయములను దెలిసినవాఁడును, అన్నయగు రాముని కార్యమునందధికమగు ప్రేమగలవాఁడును, సుగ్రీవునిజంప వలయుననియెడు నభిలాషను వదలినవాఁడును, నగు లక్ష్మణుఁడు ఆసుగ్రీవునియొక్క గృహమునందు బ్రవేశించెను. ప్రళయకాలము నందలియమునితో సమానుఁడగు నాలక్ష్మణుఁడు దేవేంద్రునిధనుస్సుతో సమానమైనదియును, పర్వతశిఖరముతో సమానమైనదియును, నగుధనుస్సును ధరించి చరియలుగలమందర పర్వతము నబోలియుండెను. బృహస్పతియొక్క బుద్ధితో సమానమైన బుద్ధిగలవాఁడును, రాముఁడు చెప్పినచొప్పున బ్రవర్తించువాఁడును, రామునకుదమ్ముఁడును, నగులక్ష్మణుఁడు రాముని వచనములను, వానికిదగు సమాధానమును, దాను జెప్పదగిన మాటలను, దనమాటలకు దగినప్రత్యుత్తరమును దనబుద్ధిబలముచేత జక్కఁగా నాలోచించె. మఱియు నాలక్ష్మణుఁడు, తనయన్నయొక్క కామక్రోధములవలన బుట్టిన కోపాగ్నిచేత వ్యాప్తమైనవాఁడై వాయువువలె భీతిలేనివాఁడగుచు మహావేగముతో నాసుగ్రీవునిపట్టణమునకు బోయె మఱియు నాలక్ష్మణుఁ డధికవేగముతో బోవునపుడేపిచెట్లను, తాటిచెట్లను, మద్దిచెట్లను, పర్వతశిఖరములను, మఱియు నితరములగు వృక్షములను గమనవేగముచేత గ్రిందబడవేయుచునుండె. మఱియు నుమిగుల వేగముగా బోవునట్టి యేనుఁగువలెనే పాదములచేత ఱాళ్లను దునుకలు తునుకలుగా జేసెను. రామునికార్యమునం దధికమగు తొందరపాటుగల వాఁడగుటచేత నొక్కొక్కయడు

గును దూరదూరముగా జూచివేయుచుండె.

ఇవ్విధముగ నడచిపోవుచు నిక్ష్వాకువంశపుంగవుడగు లక్ష్మణుడు, వానరసైన్యముచేత వ్యాప్తమైనదియును, వానరాధిపతియగు సుగ్రీవుడునివసించుచున్నదియును, దుర్గప్రాయమైనదియును, నగుకిష్కింధా పట్టణమునుజూచె. పిమ్మటనాలక్ష్మణుడు గోపమువలన నదరుచున్న పెదవులుగలవాడగుచు మిగులభయంకరులును, కిష్కింధాపట్టణమునకు బాహ్యమునందు సంచరించుచున్నవారును, నగువానరులనుజూచె. అప్పుడావానరులందఱును, పురుషోత్తముడగు లక్ష్మణునిజూచిరి. పిమ్మటబర్వతశృంగములను, మిగులగొప్పగా వృద్ధిబొందినవృక్షములను బెల్లగించిహస్తములయందు ధరించిరి. మఱియునావానరులందఱును పర్వతములయొక్క మధ్యప్రదేశమునం దేనుగులవలె నావానరులందఱును నిరాతంకముగ సంచరించుచుండిరి ఆసమయమునందు లక్ష్మణుడు ఆయుధరూపములగు వృక్షాదులనుధరించిన యావానరులనందఱనుజూచె. చూచియనేకములగు కట్టెలనువేయుటచేత నగ్నిహోత్రము వృద్ధినిబొందు విధముగానాలక్ష్మణుడు మునుపటికంటె నధికముగాగోపముగల వాడయ్యె అప్పుడావానరులందఱును భయముచేత వ్యాప్తమైన శరీరములుగల వారగుచుగాల మృత్యువులతోడను, ప్రళయకాలమునందలి యమునితోడను సమానమైయున్నవాడును, కోపముగలవాడును నగునాలక్ష్మణునిజూచి నలుదిక్కులకు నుబఱుగిడిరి. పిమ్మటవానరోత్తములందఱును బరువెత్తుకొనిపోయి సుగ్రీవునియింటియందు బ్రవేశించిసుగ్రీవునిజూచి మహారాజా! సుగ్రీవుడా! లక్ష్మణుడుగోపముతో వచ్చియున్నాడని తెలిపిరి. ఆసమయమునందు దారతోగూడ విహరించుచున్నవాడును, కామాకులచిత్తుడును, సర్వకాలములయందును నేకాంతస్థలమునందు నివసింపవలయుననియెడు కోరికగలవాడును, నగుసుగ్రీవుడు ఆవానరులయొక్క మాటనుగొంచెమైననువినకయుండె. అంతనావృత్తాంతమునుసర్వమును దెలిసికొని సుగ్రీవునిమంత్రులు వానరులతో మీరుసర్వస్థలములనుదగు జాగ్రతతోగాచియుండుడనిరి అంతటబర్వతములతోడను, గజములతోడను, మేఘములతోడను సమానమైన యాకారములుగల వానరులుబయలు వెడలిపోయి కిష్కింధాపట్టణమును గాపాడుటయందు దగినంతజాగ్రతగలవారైయుండిరి. మఱికొందఱు వానరులుగోళ్లు, పల్లులును నాయుధములుగా గలవారును, భయంకరములగు నాకారములుగలవారును, భయంకరములగు చూపులుగలవారునునై యుండిరి. అందుగొందఱువానరులు పదియేనుగులకు సమానమైనబలముగల వారైయుండిరి. కొందఱంతకంటె నెక్కుడుబలము గలవారైయుండిరి. కొందఱువేయియేనుగులకెంత బలముండునో యంతటిబలము గలవారైయుండిరి ఇట్లుమిగుల బలముగలవారును, వృక్షములనే ఆయుధములనుగా ధరించినవారుననగు వానరులచేత వ్యాప్తమైనను, శత్రువులకు బ్రవేశింపసలవిగాక యున్నదియును, నగుకిష్కింధా పట్టణమునుజూచి యాలక్ష్మణుడు మునుపటికంటె నధికమైనకోపము గలవాడయ్యె. పిమ్మట నావానరులందఱును నధికమగుబల పరాక్రమములు గలవారగుచు ప్రాకారములయొక్కయు, నగడ్తలయొక్కయు మధ్యప్రదేశములయందు విస్పష్టముగాగనబడుచు మిగులజాగరూకతతో నాకిష్కింధాపట్టణమును గాపాడుచుండిరి. ఆసమయమునందు మిగులబుద్ధిమంతుడగు నాలక్ష్మణుడు సుగ్రీవునియొక్క పొరబాటును, అన్నయగు రామునియొక్క దుఃఖమును దెలిసికొనిమరల గోపోద్రిక్తుడయ్యె మఱియు నాలక్ష్మణుడు మిగులదీర్ఘములయినవియును, వేడిగలవియును, పెద్దపెద్దవియును నగునిట్టూర్పువాయువు గలవాడును, గోపముచేత నెఱ్ఱనైననేత్రములు గలవాడును, నైపొగతోగూడిన యగ్నిహోత్రమును బోలియుండె. మఱియును మానవోత్తముడగు నాలక్ష్మణుడు బాణాగ్రమనియెడు ప్రకాశించుచున్న జిహ్వగలవాడును, ధనుస్సనేపడిగగలవాడును, తనయొక్కతేజస్సనియెడు విషసమూహముగలవాడును, నైదుతలలుగల సర్పమువలె జూచువారలకు మిగులభయమును గలుగజేయుచుండె. మఱియును ప్రళయకాలమునందలి యగ్నివలె బ్రజ్వలించుచున్నవాడును, కోపముగల గజేన్ద్రమువలె నున్నవాడును, నగులక్ష్మణునియొక్క సమీపమునకువచ్చి యంగదుడు భయమువలన నధికముగా దుఃఖమునుబొందె. ఆసమయమునందు గోపముచేత నెఱ్ఱనైనకన్నులు గలవాడును, గొప్పదగు కీర్తిగలవాడును, నగులక్ష్మణుడను అంగదునితోనిట్లనియె.

నాయనా! బిడ్డా! అంగదుడా! శత్రునాశకుండను, రామునకుదమ్ముడను లక్ష్మణుడు నగునేనువచ్చి యున్నానని సుగ్రీవునితో జెప్పుము మఱియునోయంగదుడా! లక్ష్మణుని అన్నయగు రామునకుగలిగియున్న దుఃఖముచేతవ్యసనమును బొందుచుద్వారదేశమునం దున్నాడనుము. వానరుడవైనయోయంగదుడా! నీకురామునిమాటయం దిష్టముగలదేని నామాటను బోయిచెప్పుము. శత్రునాశకుడవైన యోయంగదుడా! ఇవ్విధముగా సుగ్రీవునితోజెప్పి శీఘ్రముగామరలనిక్కడకు రమ్మనియె. ఇవ్విధముగా లక్ష్మణుడు చెప్పిన పిమ్మటనయ్యంగదుడు తత్తరపాటుతో గూడుకొనిన చిత్తముగలవాడును, మిగులదీనమైన మోముగలవాడును, నగు

చుమిగుల శీఘ్రముగబోయి వానరాధిపతియగు సుగ్రీవుని యొక్క పాదములయందుబడి నమస్కారమునుజేసె. అవ్విధముగ దండ్రియగు సుగ్రీవునకు నమస్కారమునుజేసి పిమ్మటనధికమగు తేజస్సుగల యాయంగదుడు తల్లియగు తారయొక్క పాదములనుబట్టుకొని నమస్కారమునుజేసె పిమ్మటబినతల్లియగు రుమయొక్క పాదములనుబట్టుకొని నమస్కారమునుజేసె. పిమ్మటదానువచ్చిన కార్యమునుదెలిపె ఆసమయమునందు సుగ్రీవుడు నిద్రామదమత్తుడును, సహజమగుమదముచేత శరీరమునుమరచి యున్నవాడును, కామమదముచేత మోహమును జెంది యున్నవాడును, నగుటచేతనంగదుడు చెప్పినమాటను దెలిసికొనజాలనివాడయ్యె. ఆసమయమునందకూడ గోపయుక్తుడగు లక్ష్మణునిప్రసాదము గలవానినిగా చేయదలచిన వానరులందఱును భయమోహితులై కిలకిలియనిశబ్దమునుజేసిరి. మఱియు నావానరులందఱును, గొప్పదగుప్రవాహముతో సమానుడును, పిడుగుయొక్కధ్వనివంటి ధ్వనిగలవాడునునగు లక్ష్మణుని జూచి యాలక్ష్మణుని సమీపమునందతనితో సమముగ సింహనాదమును జేసిరి. అటువంటి మహాశబ్దమునువిని సుగ్రీవుడుమదముచేత దిరుగుడువడుచున్న గ్రుడ్లుగలవాడును, వ్యాకులములగు పుష్పమాలికలును, నాభరణములు గలవాడును, నగుచుమేలుకొనియె. ఆసమయమునందంగదునివచనమునువిని యాయంగదునితో గూడవచ్చినవారును, సుగ్రీవునకు మంత్రులును, ఇష్టులును, అంతఃపురమునందు గూడ ప్రవేశింప దగినవారును, ప్లక్షుడు, ప్రభావుడును, నగునిమ్మరుమంత్రులు ధర్మార్థములను బోధించుటయందు నేర్పుగలవారలగుచు లక్ష్మణుడు మనపట్టణమునకు వచ్చియున్నాడని సుగ్రీవునితో జెప్పిరి. మఱియునామంత్రులు సామవాక్యములచేత సుగ్రీవుని ప్రసన్నునిగా జేసికొని సింహాసనముమీద దేవేంద్రునివలెగూర్చున్న సుగ్రీవునిననుసరించి తగిన ఆసనములయందు గూర్చుండి సుగ్రీవునిజూచి యిట్లనిరి.

వానరరాజోత్తమా! సుగ్రీవుడా! సత్యమునుదప్పనివారును, మహానుభావులును, నన్నదమ్ములును, నగురామలక్ష్మణులు నీతోనగ్నిసాక్షికముగ స్నేహమునుజేసిరి. మఱియు నయ్యిరువురును రాజ్యమునుజేయుటకు దగినవారలు ఇంతయగాక నీకురాజ్యము నిచ్చినవారలు. అయిద్దఱిలోనొక్కడగు లక్ష్మణుడుధనుస్సును ధరించినవాడైవచ్చి ద్వారమునందున్నాడు మనవానరులందఱును నాలక్ష్మణునిజూచి భయమునుబొందినవారై కిలకిలశబ్దములను జేయుచున్నారు రామునకుదమ్ముడగు లక్ష్మణుడు వాక్యసారధియును, వ్యవసాయరధుడునునై రామాజ్ఞనుశిరస్సునందు బెట్టుకొనిప్రవేశింపనలవిగాని యీకిష్కింధాపట్టణమునకువచ్చెను. వానరాధిపతివైన యోసుగ్రీవుడా! నీకిష్టుడును, తారకుగుమారుడునునగు నంగదుడుమిగుల శీఘ్రముగాలక్ష్మణునిచేత నీయొద్దకుబంపబడెను పరాక్రమవంతుడును, కోపముచేత నెఱ్ఱనైననేత్రములు గలవాడునునగు లక్ష్మణుడువచ్చి ద్వారమునందున్నాడు. వానరాధిపతివైన యోసుగ్రీవుడా! లక్ష్మణుడుతనచూపుచేతనే వానరులనందఱును గాల్చువాడివలె గనబడుచున్నాడు. కావుననోసుగ్రీవుడా! నీవుబంధువులతో గూడబోయి యాలక్ష్మణునకుశిరస్సుతో నమస్కారమునుజేయుము. వానరరాజవైన యోసుగ్రీవుడా! మిగుల శీఘ్రముగాబోయి లక్ష్మణునియొక్క కోపమునుబోగొట్టుము. సుగ్రీవుడా! ధర్మాత్ముడగు రాముడేమిచెప్పెనో యావిషయమును నిశ్చలచిత్తుడవై చేయుము. మఱియునోవానరరాజోత్తమా! నీవుచేసినప్రతిజ్ఞను మిగులవినయముతో జరిపిరామలక్ష్మణులకుసంతోషమును గలుగజేయుము.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలిముప్పదొకటవ సర్గ ముగిసెను

సుగ్రీవుడుమంత్రులతోలక్ష్మణుడువచ్చుటకుగారణమేమనిఆలోచించుట.

అంతటనంగదునివలన లక్ష్మణుడుగోపోద్దీపితుడైయున్నాడనివిని మిగులబుద్ధిమంతుడగు సుగ్రీవుడు తనమంత్రులతోగూడ సింహాసనమునువిడిచిపెట్టె. పిమ్మటనాలోచనయందు మిగులనేర్పరియగు సుగ్రీవుడు గురులాఘవములను నిశ్చయించితగిన ఆలోచనయందు బద్ధినుంచి ఆలోచించుచున్నవారును, ఆలోచనసుజక్కగా దెలిసినవారును, నగుమంత్రులతో నిట్లనియె.

ఓమంత్రిశ్రేష్ఠులారా! నేనేమియును దుర్భాషలనాడియుండలేదు. నేనుగొంచెమైనను దుష్కార్యమును జేసియుండలేదు నేనేమియును దుష్కార్యమునుజేయకయుండగా రామునితమ్ముడగు లక్ష్మణుడేమి నిమిత్తముగ గోపమునుబొందె ననియాలోచించుచున్నాను. మంత్రిశ్రేష్ఠులారా! ఒకవేళనమంగళాభిప్రాయములతో గూడినమనస్సుగలవారును, నాకుశత్రువులును, సర్వకాలములయందును నాతప్పులనే వెదకుచున్నవారును, నగునాపగవారు నాయందులేని దోషములను లక్ష్మణునితోజెప్పి లక్ష్మణునకు గోపమువచ్చునట్లుచేసిరా? యనియాలోచించు చున్నాను. కావుననోమంత్రిశ్రేష్ఠులారా! మీరందఱును, మీమీబుద్ధులయందు శాస్త్రోక్తప్రకారముగా నీవిషయమునందు జక్కగానాలోచించి మీయభిప్రాయమును నిశ్చయించిచెప్పుడు. వేగిర

పడకనిమ్మళముగా యోచింపుడు. మంత్రిశ్రేష్ఠులారా! నేను రామలక్ష్మణులకు భయపడి యివ్విధముగా బలుకుచున్నవాడను గాను. నా స్నేహితుడగు రాముడును, లక్ష్మణుడును నిర్నిమిత్తముగా గోపమును బొందుచున్నారేయని యధకముగా జింతించుచున్నాను గాని రామలక్ష్మణులేమైన జేయుదురేమోయని భయమును బొంది యిట్లు చెప్పుచున్నవాడను గాను. మంత్రిపుంగవులారా! స్నేహితులను సులభముగ సంపాదింపవచ్చును. ఆ స్నేహితులతో విరోధము రాకుండునట్లు గాపాడుకొనుట మిగుల దుర్లభము. చిత్తములు ఒకవిధముగా నుండవు. కావున స్వల్పాపరాధము గలిగినను ప్రేమ చెడిపోవును. కావున మహానుభావుడగు రామునకు నాయందలి మిత్రభావము చెడిపోవునోయని భయమును బొందుచున్నాను. మఱియును ముందుగా నాకుపకారమును జేసిన రామునకు నేను ప్రత్యుపకారము నింతవఱకును జేయకపోతినే యనియును, ప్రత్యుపకారము చేయకమునుపే విరోధము గలుగునేమోయనియును, విచారమును బొందుచున్నాననియె ఈ ప్రకారముగా సుగ్రీవుడు చెప్పిన మాటను విని వానరోత్తముడగు హనుమంతుడు చక్కగా దనమనస్సున నాలోచించి మంత్రులగు వానరులందఱును వినుచుండగ నిట్లనియె.

వానరాధిపతివైన యో సుగ్రీవుడా! ముందుగా రామునిచేత జేయబడినదియును, మంగళకరమైనదియును, మిగుల మనోహరమైనదియునునగు నుపకారము నేను మరచిపోలేదని చెప్పుచున్నావు. ఇట్లు చెప్పుట యేవిధముచేత నాలోచించినను నాశ్చర్యము గాదు. వీరుడగు రాముడు గొంచెమైనను భయము లేనివాడగుచు నీకు ప్రియమును జేయదలచి దేవేంద్రునితో సమానమగు పరాక్రమము గల వాలిని సంహరించె. రాముడేవిధముచేత నాలోచించినను ప్రణయముచేత గోపమును బొందుచున్నట్లు తోచుచున్నది. ఇందుకేమియును సందేహము లేదు. సంపదచేత వృద్ధిని బొందుచున్న తమ్ముని రాముడు ప్రణయకోపముచేత నీ యొద్దకు బంపినట్లు తోచుచున్నది. కాలమును గుర్తెఱిగిన వారిలో నుత్తముడవగు నో సుగ్రీవుడా! నీవు మిగుల మదించి యున్నవాడవగుట వలన దగిన కాలము వచ్చినదని తెలియజాలకున్నావు. వికసించిన యేడాకులయరటి చెట్లయొక్క యాకులచేత నల్లనిదియును, మంగళకరమయి నదియునునగు శరత్కాలము వచ్చియున్నది. ఆకాశము నిర్మలములగు గ్రహనక్షత్రములు గలదైయున్నది. మఱియు నాకాశమునందలి మేఘములన్నియును నశించిపోయినవి. పదిదిక్కులును, సకలములగు నదులును, మడుగులును, నిర్మలములై యున్నవి. వానరోత్తముడవైన యో సుగ్రీవుడా! ఉద్యోగకాలము వచ్చినదని నీవు తెలియజాలకున్నావు. కామినిచేత నీవు మదించి శరీరము తెలియక యున్నావని లక్ష్మణుడిక్కడకు వచ్చినట్లు తోచుచున్నది. వానరోత్తముడవైన యో సుగ్రీవుడా! మిగుల దుఃఖమును బొందుచున్నవాడును, భార్యావియోగమును బొందియున్నవాడును, మహానుభావుడును, రఘుకులమునందు బుట్టినవాడును, నగు రాముడు పంపిన లక్ష్మణుని యొక్క పరుషవాక్యములన్నియును నీవు సహింపవలయును. వానరోత్తముడవైన యో సుగ్రీవుడా! రాముని యెడల నపకారమును జేసిన నీకు, లక్ష్మణునకు నమస్కారమును జేసి యతని యనుగ్రహమును సంపాదించుకొనుటకంటె నితరమగు ప్రాయశ్చిత్తము గలదని నేను దలవలేదు. కావున నీవు లక్ష్మణునకు నమస్కారమును జేసి యతని యనుగ్రహమును సంపాదించుకొనుము. వానరోత్తముడవైన యో సుగ్రీవుడా! నియుక్తులగు మంత్రులు రాజుతో ఖండితముగా జెప్పవలయును గాని యూరకుండుట యుచితము గాదు. కావున నేను నిర్భయముగా నిట్లు చెప్పుచున్నాను, రఘుకులోత్తముడగు రాముడు కోపయుక్తుడై ధనుస్సున నెక్కుబెట్టునేని దేవాసురగంధర్వాదులతో గూడిన ముల్లోకములను దనవశముగా జేసికొనుటకు సమర్థుడైయుండును. ముందుగా జేసిన యుపకారమును విశేషముగా దలచుచున్న నీయట్టి మహానుభావునిచేత రాముని ప్రసన్ననిగా జేసికొనుట యుచితమై యున్నది గాని రామునకు గోపము వచ్చునట్లు చేయుట యుచితముగ నుండలేదు. వానరరాజోత్తముడవైన యో సుగ్రీవుడా! నీవు పుత్రమిత్రబంధుజనులతో గూడ నా రామునకు శిరస్సుతో నమస్కారము సంజేయుము. మరియు నో వానరరాజోత్తమా! "భర్తయొక్క యధీనమునందు భార్యయగునది ప్రవర్తించువిధము" నీవు జేసిన ప్రతిజ్ఞయొక్క యధీనుడవై యుండుము.

నరోత్తముడవైన యో సుగ్రీవుడా! నీవు రామలక్ష్మణుల యాజ్ఞను మనస్సుచేతగూడ నతిక్రమింపకుము. దేవేంద్రుని యొక్క వర్చస్సువంటి వర్చస్సుగల రాముని యొక్క బలాతిశయము నీమనస్సునకు జక్కగా దెలిసియే యున్నదిగదా? మరియు లోకములోని మానవులయొక్క పరాక్రమమును గుర్తెఱుగుదువుగదా? కావున నీవు రామలక్ష్మణులను వినయముతో ప్రసన్నులనుగా జేసికొనుమనియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ముప్పదిరెండవ సర్గము ముగిసెను.

-(*)-

కోపముతో వచ్చిన లక్ష్మణుని సమాధానము జేయుటకు సుగ్రీవుడు తారను బంపుట.

పిమ్మట శత్రువీరులను నశింపజేయునట్టి సామర్థ్యముగల లక్ష్మణుడు పూర్వము తానుబంపిన అంగదునిచేతఁ బిలువబడినవాఁడై రాముని యాజ్ఞను శిరస్సునందు బెట్టుకొని మిగుల భయంకరమైనదియును, గుహారూపముననున్నదియునునగు కిష్కింధాపట్టణమునందు బ్రవేశించెను. ఆసమయమునందు ద్వారమున గావలి యున్నవారును, గొప్పదగుశరీరము గలవారును, నగువానరులందఱును లక్ష్మణునిఁ జూచి చేతులను ముకుళించుకొని నమస్కారమును జేయుచుండిరి. మఱియు నావానరులందఱును నిట్టూర్పును విడుచుచున్నవాడును, కోపమునుబొంది యున్నవాడును, దశరథమహారాజునకు బుత్రుడును, నగునాలక్ష్మణుని ఆటంకమును జేయజాలక యూరకుండిరి. అప్పుడు శ్రీమంతుడగు లక్ష్మణుడు, రత్నవికారమైనదియును, దివ్యమైనదియును, పుష్పించినదియును, వనములుగలదియును, మిగులరమ్యమైనదియును, నవరత్నములచేతను వ్యాప్తమైనదియును, మిగులగొప్పదియును, గుహారూపమున నున్నదియును, బంగారపుమేడలచేత గ్రిక్కిరిసి యున్నదియును, నానావిధములగు నమ్యకద్రవ్యములచేత బ్రకాశించుచున్నదియును, సకలజంతువులచేతను గోరదగినఫలము గలవియును, పుష్పించినవియును, నగువృక్షములచేత బ్రకాశించుచున్నదియును, దేవతలయొక్కయు, గంధర్వులయొక్కయు, పుత్రులచేతను, కామరూపులగు వానరులచేతను, దివ్యములగు మాల్యములను, వస్త్రములను, ధరించినవారును, నగువానరులచేతను బ్రకాశించుచున్నదియును, పరిమళించుచున్న గంధములుగల చందనములయొక్కయు, అగురుయొక్కయు, పద్మములయొక్కయు, గంధములచేతను, మైరేయములనియెడు పేరుగలమద్యములయొక్క గంధములచేతను, బరిమళింపజేయబడిన రాజవీధులు గలదియును, నగుకిష్కింధాపట్టణమును జూచెను. రఘుకులసంభవులగు లక్ష్మణుడాపట్టణమునందు నిర్మలములగు కొండకాలువలను జూచె. పిమ్మట అంగదునియొక్క రమ్యమగుగృహమును జూచెను. మఱియును, మైందునియొక్కయు, ద్వివిదునియొక్కయు, గవయునియొక్కయు, గవాక్షునియొక్కయు, గజునియొక్కయు, శరభునియొక్కయు, విద్యున్మాలియొక్కయు, సంపాతియొక్కయు, సూర్యాక్షునియొక్కయు, హనుమంతునియొక్కయు, వీరబాహువుయొక్కయు, సుబాహువుయొక్కయు, మహానుభావుడగు నలునియొక్కయు, కుముదునియొక్కయు, సుషేణునియొక్కయు, తారునియొక్కయు, జాంబవంతునియొక్కయు, దధివక్త్రునియొక్కయు, నీలునియొక్కయు, సుపాటలునియొక్కయు, సునేత్రునియొక్కయు, మఱియును మహాత్ములగువానర ముఖ్యులయొక్కయు, మిగులబలముగల గృహములనుజూచె

ఆగృహములన్నియును, తెల్లనిమేఘములయొక్క ప్రకాశమువంటి ప్రకాశముగలవియును, దివ్యములగు మాల్యములతో గూడుకొనినవియును, మిగులనధికములగు ధనధాన్యసమృద్ధులు గలవియును, స్త్రీరత్నములచేత బ్రకాశించుచున్నవి యునునై యుండె. తెల్లనిప్రాకారములచేత జుట్టబడినదియును, పరులచేత బ్రవేశింప నలవిగానిదియును, నగుసుగ్రీవునిగృహము దేవేంద్రుని గృహమువలె మిగులరమ్యమై యుండె. మఱియు నాసుగ్రీవునిగృహము, కైలాసపర్వతశిఖరములతో సమానములైనవియును, తెల్లనివియును నగు మేడలయొక్క శిఖరములచేతను, సకలప్రాణులచేతను గోరదగిన ఫలములుగలవియును, పుష్పించినవియును, నగువృక్షములచేతను బ్రకాశించుచున్నదియును, దేవేంద్రునిచేత నివ్వబడినవియును, మిగులశోభగలవియును, నల్లనిమేఘములతో సమానములైనవియును, శ్రేష్ఠములగు ఫలములను, పుష్పములను, గలవియును, చల్లనినీడలు గలవియును, మనోహరములైనవియును, నగువృక్షములచేతను, బలవంతులును, నాయుధపాణులునునగు వానరులచేతను, వ్యాప్తమైన ద్వారప్రదేశములు గలదియును, శ్రేష్ఠములగు మాల్యములచేత నావృతమైనదియును, మిగులతెల్లనిదియును, పుటమువేయబడిన బంగారపుతోరణములు గలదియును, మిగుల మనోహరమైనదియును, నగుసుగ్రీవునియొక్క గృహమునందు మహాబలుడగు లక్ష్మణుడు ప్రవేశించె.

ఆసమయమునందు లక్ష్మణుడు మేఘమునందు బ్రవేశించునట్టి సూర్యునివలె నడ్డములేనివాడై ప్రవేశించె. మఱియు సుధర్మాత్ముడగు నాలక్ష్మణుడు నానావిధజనులచేత నిండియున్న యేడు తొట్టికట్లను దాటె. అట్లుదాటి పిమ్మట మిగులబలముగలవానరులచేత గాపాడబడుచున్నదియును, మిగులగొప్పదియును, నగునాసుగ్రీవుని యంతఃపురమునందు బ్రవేశించె. ఆయంతఃపురము, మిగులవెలగల యాస్తరణములతోగూడిన బంగారముచేతను, వెండిచేతను, చేయబడినమంచములచేతను, నానావిధములైనవియును, శ్రేష్ఠములైనవియును, నగుసింహాసనములచేతను, మిగులమనోహరముగా బ్రకాశించుచుండె. అట్టి యంతఃపురమునందు బ్రవేశించినపుడు ఆలక్ష్మణుడు, తంత్రీనాదములతోడను, గానములతోడను, గూడుకొనినదియును, గీతములకు సమమైన యక్షరములుగలదియును, నగుమధుర స్వనమును వినియె. మఱి

యనుమిగులగొప్పదగు బలముగలయాలక్ష్మణుడు, సుగ్రీవు నియంతకిపురమునందు నానావిధములగు నాకారములుగల వారును, రూపయౌవనములచేత గర్వించినవారును, నగున నేకస్త్రీలనుజూచె మఱియును, సత్కులమునందు బుట్టిన వారును, చిత్రములగు పూలమాలికలను ధరించినవారును, ఫలమాల్యాకృతవ్యగ్రులును, మిగులశ్రేష్ఠములగు నాభరణ ములచేత నలంకరింప బడినవారును, నగుస్త్రీలన బూచి య ధికముగదృప్తిబొందుచున్నవారును,మిగులను త్తమములగు వస్త్రాద్యాభరణములను ధరించినవారును, సుగ్రీవునకను చ రులును, నగువానరులను నాలక్ష్మణుడుసూచె. మఱియును శ్రీమంతుడును, సుమిత్రానందనుడును, నగులక్ష్మణుడు గజ్జె లందెలయొక్కధ్వనిని, మొలనూళ్ల ధ్వనిని, వినియధికముగ సి గ్గునుబొందె. ఆసమయమునందు రోషముయొక్క యధిక మగువేగముచేత మిగులగోపముగల యాలక్ష్మణుడు స్త్రీల యొక్క యాభరణధ్వనులనువిని పదిదిక్కులను నిండునట్లు ధనుష్టంకారమును జేసె. మఱియును, గొప్పవగుభుజములు గలవాడును, సచ్చరిత్రలుగలవాడగుటచేత స్త్రీలనుజూడక యుపేక్షగా నున్నవాడును, నగునాలక్ష్మణుడు రాముని యొక్క కోపమునుజూచి యుండుటచేత దానుగూడ గోప ముగలవాడగుచు నేకాంతముగనుండె. అప్పుడువానరాధి పతియగు సుగ్రీవుడాధనుస్సు యొక్కధ్వనిచేత లక్ష్మణుడు వచ్చియున్నాడని తెలిసికొనినవాడై తానుగూర్చున్న సిం హాసనమునువదలి దిగ్గునలేచె. పిమ్మటనిట్లనితలచె.

సుమిత్రాదేవికి బుత్రుడును, అన్నయగురాముని యంద ధికమగు ప్రేమగలవాడునునగు లక్ష్మణుడేవిధముగా వ చ్చుచున్నాడని యంగదుడునాకుదెలిపెనో యదేవిధముగా నిదిగోవచ్చి యున్నాడనితలచె. మఱియునా సుగ్రీవుడంగ దుడు చెప్పుటచేతను, ధనుష్టంకారముచేతను, లక్ష్మణుడు వచ్చినాడని తెలిసికొని భయముచేతనెండుచున్న నోరుగల వాడయ్యె పిమ్మటవానరశ్రేష్ఠుడగు సుగ్రీవుడు కార్యాంశ యందు దొందరలేనివాడును, భయముచేత భ్రాంతినొందు చున్న మనస్సుగలవాడునునగుచు, చూచుటకింపైన తారతో హితవచనమును జెప్పదలచినవాడై యిట్లనియె.

చక్కనికను బొమలుగలయోతారా! స్వభావముచేత నే మృదువైనమనస్సు గలవాడును, రామునకుదమ్ముడును, నగు లక్ష్మణుడు కోపముతోగూడినవాడైవచ్చె. ఇవ్విధము గ గోపమునుబొందుటకు గారణమేమి? నిందితువాలవుగా ని యోతారా! లక్ష్మణుడు గోపమును బొందుటకుగారణ ము నీకేమైనగనబడుచున్నదా? మానవోత్తముడగు లక్ష్మణు డు నిష్కారణముగ గోపమునుబొందుచున్న నాడుగాడు మేమీలక్ష్మణునకేమైన నపకారమునుజేసితిమా? మేమేమైన నుజేసిన యపకారమును నీవుకనిపెట్టితివా? ఆవిషయమును నీమనస్సుచేత జక్కగాదెలిసకొని లక్ష్మణునితో సంభాషిం చుటకుదగిన విధమునునాలోచింపుము. అదియునుగాక యోతారా! నీవుస్వయముగా నీలక్ష్మణునిబూడుము. చూ చితగినట్లు సంభాషింపుము. ఇంతయిగాక నీవాలక్ష్మణునొ ద్దకుబోయి సామవచనములచేత బ్రసన్నునిగాజేయుము. ఇట్లుసేయుటకు నీవుతగినదానవు. ఆలక్ష్మణుడు నిన్నుజూచి నతోడనే నిర్మలమైనమనస్సుగలవాడై కోపమునువిడిచిపెట్టు ను. ఏమందుచేతనంటే "శ్లో॥ నహిస్త్రీషుమహాత్మానః క్వ చిత్కుర్వంతిదారుణమ్,, మహానుభావులగువారు స్త్రీలు యందు దారుణకృత్యములనుజేయరు నీవుముందుగబోయి మంచిమాటలచేత నాలక్ష్మణుని నిర్మలములగు నిన్ద్రియము లును, మనస్సునుగల వానినిగాజేయుము. విమ్మటబద్మపత్ర ములవంటి నేత్రములుగలవాడును, శత్రువులనునశింపజే యువాడునునగు లక్ష్మణునిజూడగలనని చెప్పె. అంతటనా తా రనుదముతోగూడిన దగుటచేత దొట్రువడుచున్న పాదము లుగలదియును, మదముచేత విహ్వలములగు నేత్రములుగల దియును, బంగారముచేత జేయబడుచున్నవియును, వ్రేలా డుచున్నవియునునగు మొలనూళ్లుగలదియును, మంగళకర ములగు లక్షణములుగలదియును, నగునాతారవినయముచే త వంచబడిన శరీరముగలదగుచు లక్ష్మణునియొక్క సమీప మునకుబోయె.

ఆసమయమునందు మహానుభావుడగు లక్ష్మణుడు వాన రాధిపతియగు సుగ్రీవునకుభార్యయైన నాతారనుజూచి యే మియును మాటలాడకయూరకుండె. మఱియును దశరథ మహారాజునకు బుత్రుడగువాలక్ష్మణుడు స్త్రీసమీపమునం దు గోపమునుబొంద గూడదనితలచి కోపమునుతొలగొట్టు కొని పరస్త్రీనిజూచుట యుక్తముగాదని యెఱిగినవాడగు టచేత దలనువంచుకొని యూరకుండె. అప్పుడాతార మద్య పానమునుజేసి యున్నదగుటచేత సిగ్గులేనిదియును లక్ష్మణు డు ప్రసన్నుడగుటచేత భయములేనిదియును, నగుచుబ్రణయ ముచేత మిగులప్రౌఢమైనదియును, మిక్కిలిగొప్పదగు నర్థ ముగలదియును, సామవాదముతో గూడుకొనినదియును, నగుమాటనుజెప్పదలచి యిట్లనియె.

దశరథమహారాజునకు బుత్రుడవైనయోలక్ష్మణుడా! మ హానుభావా! నీవుకోపమును బొందుటకుగారణమేమి? నీవచ నానుసారముగ నెవ్వడు ప్రవర్తింపక యున్నాడు? ఎండినవృ క్షములుగలవనమునందు బ్రవేశించుచున్నయగ్నిహోత్రము నకు యీలోకమున నెవ్వడైన నభిముఖముగ బోవునా? పో

డు. అటులనే మీయిష్టానుసారముగ సంచరింపనివాడెవ్వ
డునులేడు. కావుననోలక్ష్మణా! నీవుకోపమును బొందకు
మనియె. ఇవ్విధముగాదారచేత సామవాదపూర్వకముగ జె
ప్పబడినమాటనువిని లక్ష్మణుడుప్రణయకోపమును జూపద
దగినమాటను జెప్పదలచియిట్లనియె.

భర్తయగుసుగ్రీవునకు హితమునుజేయవలయునని తల
చుచున్నయోతారా! నీభర్తయగు సుగ్రీవుడు మన్మథవ్యా
పారమునం దాశగలవాడుగనుకనే ధర్మార్థములయొక్క
సంపాదననువదలి రామునిసంగతిని గొంచెమైనను దెలిసి
కొనుటలేదు. ఇదియేమి? ఇట్లుచేయవచ్చునా? ఎఱియునో
తారా! సుగ్రీవుడురాజ్యరూపమగు ప్రయోజనమును గొం
చెమైనను యోచింపడములేదు. దుఃఖమునందు మునిగియు
న్న మమ్ములనుగుఱించికొంచెమైన నాలోచించడములేదు.
మఱియుసుగ్రీవుడు, మంత్రులతోడను, సభికులతోడను గూ
డుకొని మద్యపానమునుజేసి మైమరచియున్నాడు. వానరా
ధిపతియగు సుగ్రీవుడునాలుగు మాసములయిన పిమ్మటమా
కార్యమునుగుఱించి యత్నించెదనని మాతోబ్రతిజ్ఞనుజేసె
అట్లుప్రతిజ్ఞనుజేసియును నిప్పుడుసుగ్రీవుడు మద్యపానము
నుజేసి మదించినవాడైతిరుగుచు నాలుగుమాసములును గడ
చిపోయినవని దెలిసికొనినవాడు గాడు. ఇట్లుండనగునా? మ
ఱియునోతారా! "శ్లో॥ నహిధర్మార్థసిద్ధ్యర్థం పానమేవంప్ర
శస్యతే। పానాదర్థశ్చధర్మశ్చ కామశ్చపరిహీయతే,, ధర్మా
ర్థములుసిద్ధింప వలయుననితలచు వాడివ్విధముగ మద్యపా
నమునుజేసి మద్యపానమే యుత్తమమైనదనితలవడు. మద్య
పానమువలన ధర్మార్థకామములు మూడునునశించిపోవును.
మఱియునోతారా! "శ్లో॥ ధర్మలోపోమహాం స్తావత్కృ
తేహ్యప్రతికుర్వతః। అర్థలోపశ్చమిత్రస్య నాశేగుణవతో
మహాన్,, ముందుగా నుపకారమునుజేసినవానికి బ్రత్యుప
కారమును జేయనివానికి విశేషముగాధర్మము లోపించిపో
వును గుణవంతుడగు మిత్రుడులోపించి పోయెనేనియధిక
ముగా నర్థలోపముగలుగును కావునసుగ్రీవుడు దెలివిలే
మిచేత ధర్మార్థములను రెంటినిచెడకొట్టు కొనుచున్నాడు
మఱియునోతారా! "శ్లో॥ మిత్రంహ్యర్థగుణశ్రేష్ఠం సత్య
ధర్మపరాయణం। తద్ద్వయంతుపరిత్యక్తం నతుధర్మేవ్యవస్థి
తం,, అర్థకామములచేత నుత్తముడును, సత్యమునందును,
ధర్మమునందును బ్రియముగలవాడును, నగుస్నేహితునివిడి
చిపెట్టువానికి ధర్మార్థకామములును, నశించిపోవును. కా
వునను త్తముడగు స్నేహితునివిడిచి పెట్టవచ్చునా? కార్య
ములయొక్క వాస్తవగతిని దెలిసికొనిన యోతారా! ధర్మా
ర్థకామములను నాశముచేయునట్టిదియును, మిత్రత్యాగ
రూపమైనదియునునగు కార్యమునుసుగ్రీవుడు చేయుచు
చున్నాడు గావుననిప్పుడు మేముచేయదగిన కార్యమేదియో
నీవేచక్కగా యోచించిచెప్పదగిన దానవుగనుక చెప్పు
మనిచెప్పె

ఇవ్విధముగా లక్ష్మణునిచేత జెప్పబడినదియును, మధు
రమైన స్వభావముగలదియును, ధర్మార్థములనుబోధించు
చున్నదియును, నగుమాటనువిని యాతార రామునికార్య
మును, ముఖ్యముగాజేయవలసినదే యనునభిప్రాయముగల
దై యాలక్ష్మణునితో విశ్వాసయుక్తముగ జెప్పదలచియి
ట్లనియె.

రాజపుత్రుడవైన యోలక్ష్మణా! ఇదికోపమును జేయు
టకుదగిన కాలముగాదు. నీవాడగుసుగ్రీవునియందును, మా
యందును, నీవుకోపమును బెట్టగూడదు. మీకార్యమునుజే
యవలయునని ప్రవర్తించుచున్నవాడును, మీకిష్టుడును, నగు
సుగ్రీవునిప్రమాదమును మీరుసహింపదగినవారు. బాలుడవై
న యోలక్ష్మణా! తక్కువబలము గలవానియందు గోపము
నుబెట్టుట యుత్తమగుణమగునా? సత్వగుణముతో గూడు
కొనినవాడవును, పూర్వజన్మమునందలి తపస్సుయొక్క పు
ణ్యస్వరూపుడవై పుట్టినవాడవును, నగునీవుమిగులగోపమును
బొందవచ్చునా? నీయట్టిమహానుభావుడు గోపమునుబొం
దదగునా? దశరథరాజనందనా! లక్ష్మణా! వానరాధిపతి
యగు సుగ్రీవునకుబంధుడగు రామునకుగల కోపమునునే
నెఱుంగుదును. చేయదగినకార్యమున కాలస్యమైనదనియు
ను నెఱుగుదును మీరుముందుగా సుగ్రీవునకు జేసిన యుప
కారమును నెఱుగుదును, మఱియునిప్పుడుచేయదగిన కార్య
మేదియో దానినిగూడ నెఱుగుదును. మానవోత్తముడవైన
యోలక్ష్మణా! కామముయొక్కబలము సహింపశక్యము
గాని దనియును నే నెఱుగుదును. ఇప్పుడుసుగ్రీవు డెవరియం
దు బ్రియముచేత గామపరతంత్రుడై దేహము తెలియక సం
చరించుచున్నాడో యట్టియాడువారలనుగూడ నెఱుగుదు
ను. మఱియునోలక్ష్మణుడా! నీవేవిధముగా నిప్పుడుగోప
ము గలవాడవైయున్నావో యటులనేనిప్పుడు మావలెగా
మపరతంత్రుడవై జలక్రీడాదులయందు బుద్ధిగలవాడవుగా
వు. నీవుకామపరతంత్రుడవై యుంటివేని స్త్రీలోలుడవై యు
న్నవానిమీద నీకుగోపమురాదు మఱియువోలక్ష్మణుడా!
మన్మథక్రీడలయం దాసక్తిగలమనుష్యుడు దేశకాలములను,
ధర్మార్థములను దెలియజాలడు. ఈసంగతినీకు దెలియదు.
కావుననీవివిధముగా గోపమును బొందుచున్నావు. శత్రువీ
రులను నశింపజేయునట్టి యోలక్ష్మణుడా! నాసమీపమునం
దుండుటచేత నధికముగామన్మథ క్రీడలయందాసక్తినిబొం

దియున్నవాడును, మన్మనవశమును బొందియుండుటచేత సగ్గునువిడిచిపెట్టి యున్నవాడును, నీకుదమ్ముడును, వానరకులమున కధిపతియునగు సుగ్రీవునిమీద గోపమును జెందకయిప్పుడు మన్నింపుము. లక్ష్మణా' ధర్మమునందును, తపస్సునందును, గోరికగలమహర్షులుగూడ గామపరతంత్రులైరేని స్త్రీలచేత మోహింపబడిన చిత్తములుగలవారగుదురు అట్లుండగా వానరరాజును, వానరుడునునగు నీసుగ్రీవుడు స్త్రీసుఖములయందేల నాసక్తిగలవాడుగాడు? సహజముగానే వానరులుచపలస్వభావము గలవారుగావున స్త్రీసాంగత్యము గలిగినపుడు మఱియునధికముగా జపలస్వభావముగలవారగుదు. కావునసుగ్రీవునియందు గోపమును బెట్టక మన్నింపుమనిచెప్పె.

ఇవ్విధముగా నాతారమిగులగొప్ప యభిప్రాయముగలమాటను నపరిమితములగు గుణములుగల లక్ష్మణునితోజెప్పి మఱియునుభర్తయగు సుగ్రీవునకుహితమును జేయగోరినదై విలాసమునుబూపించు నట్టిదియును, మదముచేత విహ్వలమయినదియును, నగుమాటను జెప్పదలచినదై యిట్లనియె.

మానవోత్తముడవైన యోలక్ష్మణుడా' సుగ్రీవుడుమన్మధ పరవశుడయ్యును, మీకార్యమునుమరవక చేయదగినకార్యమునందిది వలుకుముందేతగిన యత్నమును జేసి యున్నాడు. ఇకను రెండుమూడుదినములలోపల నధికమగుపరాక్రమములు గలవారును, కామరూపులును, నానావిధములగు పర్వతములయందు నివసించుచున్నవారును, నగువానరులనేకకోటి సహస్రసంఖ్యలుగా జేరుకొనిరాగలరు. వారలనందఱ వెంటబెట్టుకొని రామునిసమీపమునకు రాదలచియున్నాడు. కాబట్టినీవుగోపమును బొందుటయు చితముగాదు. మహాబాహుడవైన యోలక్ష్మణుడా ! నీవంతఃపురములోనికిరమ్ము. నీవుసత్పురుషుడవు గనుకస్త్రీలుసంచరించునట్టి యంతఃపురములోనికి రాగూడదనితలచి యిక్కడనుంటివి. మిత్రుడవగునీవుయంతః పురములోనికివచ్చి స్త్రీలను జూచుటవలన దోషమేమియునులేదు. కాబట్టినీవంతఃపురములోనికిరమ్ము. అనిచెప్పె.

ఇవ్విధముగా దారచేజెప్పబడితారయొక్క యాజ్ఞను బొందినవాడును, వేగిరపాటుతోగూడుకొనినవాడును, గొప్పవగుభుజములు గలవాడును, శత్రువులనునశింప జేయునట్టివాడునునగు లక్ష్మణుడుసుగ్రీవుడు నివసించియున్న యంతఃపురములోపల బ్రవేశించె. పిమ్మటమిగుల వెలగలపరుపుతో గూడుకొనినదియును, మిగులశ్రేష్ఠమైనది యునునగు సింహాసనమునందు గూర్చున్నవాడును, సూర్యునితోసమానముగ బ్రకాశించుచున్నవాడును, శ్రేష్ఠములగునాభరణములచేత జిత్రములైన యవయవములు గలవాడును, దివ్యమైనయాకారము గలవాడును, మిగులకీర్తిగలవాడును, శ్రేష్ఠములగు మాలికలను, వస్త్రములను ధరించినవాడును, దేవేంద్రునివలె జయింపనలవిగానివాడును, నగుసుగ్రీవునిజూచె. మఱియునాసుగ్రీవుడు, శ్రేష్ఠములగు నాభరణములతోడను, పూలమాలికలతోడను, స్త్రీలతోడను, గూడికొనియున్నవాడును. మద్యపానమును జేసి యుండుటచేత నధికముగా నెఱ్ఱనైన నేత్రములుగలవాడును, యమునితోసమానుడును, శ్రేష్ఠమగుసింహాసనము నందున్నవాడును, మిగులశ్రేష్ఠమగు దేహకాంతిగలవాడును, నైభార్యయైనరుమను గాఢముగానాలింగనమును జేసికొనియుండె.

ఇవ్విధముగనున్నవాడును, సర్వోత్తమమగు పరాక్రమముగలవాడును, విశాలములగు నేత్రములు గలవాడును, నగుసుగ్రీవుని, సర్వోత్తమమగు పరాక్రమము గలవాడును, విశాలములగు నేత్రములు గలవాడును, నగులక్ష్మణుడు జూచె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ముప్పదిమూడవసర్గము ముగిసెను.

లక్ష్మణుడు సుగ్రీవుని యంతఃపురమునందు బ్రవేశించుట.

అవ్విధముగా నడ్డులేనివానివలె గోపమునుబొందుచున్నవాడును, పురుషోత్తముడును, తనయంతఃపురమునందు బ్రవేశించినవాడును, నగులక్ష్మణునిజూచి సుగ్రీవుడువ్యాకులములైన యిన్ద్రియములు గలవాడయ్యె. మఱియునాసుగ్రీవుడు గోపయుక్తుడును, గోపాతిశయముచేత నిట్టూర్పును విడుచుచున్నవాడును, తేజస్సుచేత బ్రజ్వలించుచున్న యగ్నిహోత్రునివలె నున్నవాడును, అన్నయగు రామునకు గలిగియున్న దుఃఖముచేతబరితాపమును బొందుచున్నవాడును, దశరథమహారాజునకు బుత్రుడును, నగులక్ష్మణుని జూచిచక్కగా నలంకరింపబడిన దేవేంద్రునిధ్వజమువలె నాసుగ్రీవుడు బంగారపు సింహాసనమునుండి దిగ్గనదుమికె.

అవ్విధముగా నెగిరిదుముకుచున్న సుగ్రీవునితోగూడనతని భార్యలందఱును నెగిరిదుమికిరి ఆసమయమునందు సుగ్రీవునిజుట్టుకొనియున్న స్త్రీలందఱును నాకాశమునందుబూర్ణచంద్రునితో గూడుకొనిననక్షత్రములను బోలియుండిరి. అప్పుడుశ్రీమంతుడగునా సుగ్రీవుడుచేతులను ముకుళించుకొని సంచరించుచుండె మఱియునక్కడ సుగ్రీవుడు గొప్పదగు కల్పవృక్షమువలెనుండె. అప్పుడురుమతోగూడుకొనిన

వాడును, నక్షత్రములమధ్యయందు జంద్రుడున్నవిధము స్త్రీలమధ్యయందున్నవాడును, నగుసుగ్రీవునిజూచి గోపోద్దీపితుడై యిట్లనియె.

సుగ్రీవుడా! సత్త్వగుణముతో గూడుకొనినవాడును, పశ్చాత్తాపము గలవాడును, జితేన్ద్రియుడును, చేసినమేలును మరవనివాడును, సత్యముగమాట లాడువాడును, నగురాజులోకమునందు బూజింపబడును. మఱియునో సుగ్రీవుడా! ముందుగానుపకారమును జేసినస్నేహితులతో మీకుబ్రత్యుపకారమును జేసెదనని చెప్పి చేయనిరాజుకంటె నీలోకమునందు బాపాత్ముడెవ్వడుగలడు. మఱియునోసుగ్రీవుడా! "శ్లో॥ శతమశ్వానృతే హన్తి సహస్రం తు గవానృతే। ఆత్మానం స్వజనం హన్తి పురుషః పురుషానృతే॥" అశ్వవిషయముగా నసత్యమునుబలికినవాడు నూరుగుఱ్ఱములను జంపినపాపమును బొందును. గోవిషయముగా నబద్ధమునుజెప్పినవాడు వేయిగోవులను జంపినపాపమునుబొందును. పురుషవిషయముగా నబద్ధమును జెప్పినవాడుతనను, తనబంధుజనమును జంపుటవలనగలిగెడుపాపము గలవాడగును. మహాపురుషుడగు రామునితో నసత్యమును జెప్పినవాడు సర్వనాశము జేయుటవలనగలిగెడు పాపముగలవాడగును. వానరాధిపతివైనయోసుగ్రీవుడా! ముందుగామిత్రులవలన నుపకారమును బొంది కృతార్థుడగువాడు మరలబ్రత్యుపకారమును జేసెదనని చెప్పి చేయకపోయెనేని యట్టివాడు సకలభూతములచేతను జంపదగినవాడని యెఱుంగుము. పూర్వమునందు స్వాయంభువ మనువుచేసిన మేలునుమరచిన వానిజూచి కోపోద్దీపితుడై సకలలోకములవారిచేతను గొనియాడదగిన శ్లోకమును జెప్పె

దానింజెప్పెదను. సావధానుడవై వినుము "శ్లో॥ గోఘ్నే చైవ సురాపే చ చోరే భగ్నవ్రతే తథా। నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః॥" గోవునుజంపినవానికిని, మద్యపానము జేసినవానికిని, భగ్నమైన వ్రతములు గలవానికిని, పాపనాశకమగు ప్రాయశ్చిత్తము సత్పురుషులచేత జెప్పబడినదిగాని చేసినమేలును మరచినవానికి బాపనివారకమగు ప్రాయశ్చిత్తమేదియును జెప్పబడలేదు. వానరుడా! సుగ్రీవుడా! నీవుదుర్మార్గుడవు. ఇంతయగాక చేసినమేలును మరచినవాడవు అసత్యమును బలుకువాడవు ఈదుర్గుణములన్నియును ముందుగ గృతార్థుడవైన నీమిత్రుడగు రామునకు బ్రత్యుపకారమును జేయకపోవుటవలన నీయందు గలిగియున్నవి కావున వానరుడవైన యో సుగ్రీవుడా! ముందుగానుపకారమును బొందిన నీవు సీతాదేవిని వెదకుటయందు నీవు మిగుల బ్రయత్నమును జేయవలయును.

ఇవ్విధముగా బ్రయత్నమును జేయదగిన నీవు గ్రామ్యసుఖములయందాసక్తిగలవాడవును, అసత్యమైన ప్రతిజ్ఞను జేసినవాడవును నైతివి నీవు కప్పవలె గూయుచున్న సర్పముతో సమానుడవని తెలియక రాముడు ఉపకారమును జేసె. మహానుభావుడును, కారుణ్యముగలవాడును మహాత్ముడును, నగురాముడు పాపమును జేయువాడవును, దురాత్ముడవును, నగునీకు వానరరాజ్యమునిచ్చె. మఱియునోసుగ్రీవుడా! అనాయాసముగ సకలకార్యములను జేయునట్టి రామునకిప్పుడైనను నీవుసహాయమును జేయకపోతివేని నీవు రామునియొక్క తీక్ష్ణములగు బాణములచేత గొట్టబడినవాడవై నీయన్నయగువాలిని జూడగలవు వాలిచచ్చియేమార్గముచేత బోయెనో యామార్గమిప్పటికిని సంకోచమునుబొంది యుండలేదు. కావున నీవుచేసిన ప్రతిజ్ఞను నెరవేర్పుము. వాలియొక్కమార్గమును బొందకుము మఱియునోసుగ్రీవుడా! నీవుచెప్పిన కార్యమునందు దప్పి ప్రవర్తించితివేని యిక్ష్వాకుకులనాథుడగు రామునియొక్క ధనుస్సునుండి బయలువెడలినవియును, దీక్ష్ణములైనవియును, నగుబాణములనుజూడవు. ఇంతయగాక సుఖముగానుండగలవు. కావుననీవురాముని కార్యమునందు బ్రవర్తింపుము మనస్సుచేతగూడ రామునికార్యమునందేల బ్రవర్తింపకుండెదవు

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ముప్పదినాల్గవసర్గ ముగిసెను.

సుగ్రీవునిమీదట లక్ష్మణుని తారసమాధానము సేయుట.

ఇవ్విధముగా మాటలాడుచున్నవాడును, తేజస్సుచేత నగ్నివలె బ్రజ్వలించుచున్నవాడును, నగులక్ష్మణునితో బూర్ణచంద్రునివంటి మోముగలతార యిట్లనియె.

మహారాజా! లక్ష్మణా! ఇవ్విధముగా నీవుచెప్పగూడదు నీనోటబయలు వెడలుచున్న యీకఠిన వాక్యములను వానరాధిపతియగు నీసుగ్రీవుడు వినదగినవాడుగాడు. అదియునుగాక యోలక్ష్మణుడా! ఈసుగ్రీవుడు చేసిన మేలును మరచినవాడుగాడు దుర్మార్గుడనుగాడు. దారుణకృత్యములను గూడజేయడు అబద్ధమునమాటలాడడు కపటవ్యాపారములు గలవాడనుగాడు. కావున వివేకుడవైన యోలక్ష్మణుడా! నీవియ్విధముగా మాటలాడగూడదు యుద్ధమునందెవ్వరిచేతను జేయశక్య

ముగాని కార్యమును జేసి రాముఁడీసుగ్రీవునకుఁ గొప్ప మేలును జేసె. అట్టి మేలును పీరుఁడగు నీసుగ్రీవుఁడు గొంచెపైనను మరచినవాఁడుగాఁడు. మఱియు శత్రునాశకుఁడవైన యోరాముఁడా! యీసుగ్రీవుఁడు రామానుగ్రహమువలన శాశ్వతమగు రాజ్యమును, కీర్తిని, రుమను, నన్నును బొంది యధికముగా సుఖము ననుభవించుచున్నాఁడు, పూర్వమునందు మిగుల దుఃఖముతోఁ గాలముగడపిన యీసుగ్రీవుఁడు సర్వోత్తమమగు రాజ్యమును, సుఖమును బొందినవాఁడగుటచేత విశ్వామిత్ర మహామునివలెనే తగిన కాలమును దెలియఁజాలకున్నాఁడు. లక్ష్మణుఁడా! పూర్వము ధర్మాత్ముఁడగు విశ్వామిత్రమహాముని మేనకయందా సక్తిగలవాఁడై పదిసంవత్సరములను ఒక్కదినమునుగాఁ దలఁచె. కాలమును దెలిసిన వారలలోనుత్తముఁడును, మహాతేజస్సు గలవాఁడును, నగు విశ్వామిత్ర మహామునికూడఁ గామాతురుఁడైన కాలమునందుఁ గాలమును దెలియలేక పోయినాఁడు. అటువంటి మునివరుఁడే తెలియలేకపోగాఁ బ్రాకృతుఁడగు నీసుగ్రీవుఁడననేల? లక్ష్మణుఁడా! దేహధర్మమగు కామకవ్యాపారమును బొందినవాఁడును, ఇదివఱకు మిగుల నలసియున్నవాఁడును, కోరికలయందుఁ దృప్తిలేక యున్నవాఁడును, నగు నీసుగ్రీవుని యపరాధమును నీవు మన్నించుటకుఁ దగినవాఁడవు. కావున సుగ్రీవునియందుఁ గోపమును బొందక మన్నింపుము. నాయనా! లక్ష్మణుఁడా! నీవు రోషవశమును బొందుటకు, దగినవాఁడవు. నీయట్టి మహానుభావుఁడు నిశ్చయార్థమును దెలియలేక యతిశీఘ్రముగఁ గోపమును బొందుట యుచితమా? పురుషోత్తముఁడవైన యోలక్ష్మణుఁడా! సత్వగుణసంపన్నులును, పురుషోత్తములును, నగు నీయట్టి మహానుభావులు యుక్తాయుక్తములను విచారింపక కోపమును బొందరు. ధర్మములను గుర్తెఱిఁగిన యోలక్ష్మణుఁడా! నిన్ను సుగ్రీవుని కొఱకుఁగా నేను బహువిధములచేతఁ బ్రసన్నుఁడవు కాఁగలందులకుఁ బ్రార్థించుచున్నాను. పూజ్యుఁడవైన యోలక్ష్మణుఁడా! మిగుల గొప్పదియును, రోషమువలనఁ బుట్టినదియునునగు వేగమును విడిచిపెట్టుము. మఱియు నోలక్ష్మణుఁడా! సుగ్రీవుఁడు రామునకుఁ బ్రియమును జేయుట కొఱకు రుమను, నన్ను, వానరరాజ్యమును, ధనధాన్యములను, మఱియు నితరములగు సకలపదార్థములను విడిచిపెట్టునని నామనస్సునందుఁ దోచుచున్నది. పురుషోత్తముఁడవైన యోలక్ష్మణుఁడా! సుగ్రీవుఁడు రావణాసురుని యుద్ధమునందు జంపి రోహిణీదేవి చంద్రునితోఁ గలిసికొనినవిధముగా సీతాదేవిని రామునితోఁ గూడఁ జేర్పఁగలఁడు. లంకాపట్టణమునందు, శతకోటిసంఖ్యలుగల రాక్షసులుగలరు. మఱియు ననేకాయుత సంఖ్యలును, ననేకనూరుల ముప్పదారువేల సంఖ్యలుగల రాక్షసులుగలరు. అనఁగా లెక్కకు మిగిలిన రాక్షసులుగలరనుట.) ఆరాక్షసులందఱును శత్రువులచేత జయింప నలవిగానివారు. ఇంతియగాక కామరూపులు. ఇట్లు బలవంతులగు రాక్షసులతోఁగూడు కొనినవాఁడును, సీతాదేవి నపహరించినవాఁడును, నగు రావణాసునివధింపుట మిగుల గష్టమైనకార్యము కావున నోలక్ష్మణుఁడా! ముందుగా నారాక్షసుల నందఱ వధింపక రావణాసురుని వధింప శక్యముగాదు. కాబట్టి సుగ్రీవుఁడు ముందుగాఁ గ్రూరకర్ముఁడగు రావణాసురునియొక్క పరివారజనమును జంపవలయును. ఈవిషయమంతయును అంగదుఁడు రాముఁడు సుగ్రీవునితో స్నేహమును జేసినాఁడని చెప్పినసమయమునందు వాలినాతోఁ జెప్పెను.

కావున నాకు రావణాసురుని వృత్తాంతమంతయును దెలిసియున్నది. కాఁబట్టి నేను రావణాసురుని సంగతిని జెప్పితిని. పురుషోత్తముఁడవైన యోలక్ష్మణా! మీకు సహాయమును జేయుటకొఱకు యుద్ధమును జేయుటయందు మిగుల సమర్థులును, వానరసమూహముల కధిపతులును, నగు వానరులను దోడ్కొనివచ్చుట కనేకులగు వానరోత్తములను బంపియున్నాఁడు. ఈసుగ్రీవుఁడు మిగుల బలవంతులును, మహాబలముగలవారును, నగు వానరుల రాకను నిరీక్షించుచున్నవాఁడై రాముని కార్యమును నెరవేర్చుటకు బయలు వెడలకున్నవాఁడు. సుమిత్రాదేవికి బుత్రుఁడవైన యోలక్ష్మణా! ఇదివఱకుముందే వానరులు వచ్చునట్టి యేర్పాటును జేసియున్నాఁడు. ఇప్పుడా వానరులందఱును రావలసియున్నది. నేడో రేపో వానరులందఱును వత్తురు. వారందఱును వచ్చినతోడనే సుగ్రీవుఁడు చేయఁదగినకార్యమును జేయుటకు సిద్ధముగనున్నాఁడు. శత్రునాశకుఁడవగు నోలక్ష్మణుఁడా! అనేకకోటిసహస్ర సంఖ్యలుగల ఋషులును, అనేకనూరుల కొండముచ్చులును, మఱియు నితరులగు వానరులును, అతిశీఘ్రముగ విచ్చేయుదురు. కకుత్స్థనికులమునందుఁ బుట్టిన యోలక్ష్మణుఁడా! ప్రకాశించుచున్న తేజస్సుగల వానరులనేక కోటులు రాఁగలరు. మఱియు నోలక్ష్మణుఁడా! ఈవానరస్త్రీలందఱును, కోపయుక్తమగు నీముఖమును, కోపముచేత నెఱ్ఱనగు నీనేత్రములను జూచి వాలిని జంపినట్లు సుగ్రీవునిగూడఁ జంపుదు రేమోయని భయమును బొందుచున్నారు.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ముప్పదైదవ సర్గ ముగిసెను.

— * లక్ష్మణసుగ్రీవులు స్నేహముతో మాటలాడుట * —

ఇవ్విధముగాఁ దారచేతఁ జెప్పఁబడినదియును, వినయముతోఁ గూడుకొనినదియును, ధర్మయుక్తమైనదియును నగు వాక్యమునకు మృదువైనస్వభావముగల లక్ష్మణుఁడంగీకారమును బొందెను. అవ్విధముగాఁ దారచెప్పినవాక్యములను విని లక్ష్మణుఁడు కోపమును విడిచిపెట్టగానే సుగ్రీవుఁడిదివఱకు లక్ష్మణునివలనఁ గలిగియున్న కోపమును దడివస్త్రమును విడిచిపెట్టినవిధముగా విడిచిపెట్టెను. పిమ్మట వానరాధిపతియగు సుగ్రీవుఁడు తనకంఠమునందున్నదియును, నానావిధములగు వర్ణములు గలదియును, అనేకగుణములుగలదియును నగు పూలమాలికను దీసివేసె మఱియును మద్యపానమువలనఁ గలిగిన మదమును గూడ విడిచిపెట్టె అప్పుడా సుగ్రీవుఁడు పరమానందము గలవాఁడగుచు భయంకరమయినబలముగల లక్ష్మణునితో మిగుల వినయముగా మాటాడఁదలఁచి యిట్లనియె.

సుమిత్రాదేవికిఁ బుత్రుఁడవైన యోలక్ష్మణుఁడా! ఇదివఱకు నాదుకీర్తియును, వానరరాజ్యమును నశించిపోయినది. అట్టిరాజ్యమును, కీర్తిని, శాశ్వతముగనుండునట్లు రామానుగ్రహమువలనఁ బొందితిని. శత్రునాశకుఁడవైనయో లక్ష్మణుఁడా! తనకర్మచేత నేమిగుల బ్రసిద్ధిని బొందినవాఁడును, దేవుఁడును, నగు రామునియొక్క యటువంటిపరాక్రమమును నెవ్వఁడు సహింపఁగలఁడు. ధర్మాత్ముఁడును, రఘుకులోద్భవుఁడును, నగు రాముఁడు తన తేజస్సు చేతనే సకలకార్యములను జేయఁగలవాఁడు. నిమిత్తమాత్రముగ నాసహాయమునవలంబించి రావణాసురునివధించి సీతను బొందగలఁడు. మఱియును లక్ష్మణుఁడు మిగులగొప్పవగు సాలవృక్షము లేడును, పర్వతమును, భూమియును నొకబాణముచే రామునిచేత బ్రద్దలుసేయఁబడెను. అట్టి మహానుభావున కితరుల సహాయమువలన నేమిప్రయోజనముగలదు. లేదు. అయినను నిమిత్తమాత్రముగఁ గోరుచున్నాఁడే గాని మఱేమియును గాదు. మఱియు నో లక్ష్మణుఁడా! రాముఁడు ధనుష్టంకారమును జేయునపుడా టంకారధ్వనిచేత భూమి యంతయును, పర్వతములతోడను, వనములతోడనుగూడఁ గంపమును బొందెను. అట్టి రామునకు నాసహాయమువలన నేమిప్రయోజనముగలదు. మానవోత్తముఁడవైన యోలక్ష్మణుఁడా! ముందఱనున్న శత్రువుని జంపుటకు బోవుచున్న రామునితోఁగూడ నిమిత్తమాత్రముగ నేనుగూడవచ్చెదను. పురుషోత్తముఁడవైన యోలక్ష్మణుఁడా! ఒకవేళ నేను, విశ్వాసముచేతగాని, లేక స్నేహముచేతఁగాని చేయఁదగినకార్యమును మఱచి యాలస్యముజేసి యుంటినేని పరిచారకుఁడనగు నాయందుఁ దప్పును బెట్టకమన్నింపవలయునే గాని నాయందుఁదప్పును బెట్టఁగూడదు అని సుగ్రీవుఁడు చెప్పె. ఇవ్విధముగా మిగులవినయముతో మాట్లాడుచున్నవాఁడును, మహాత్ముఁడును, నగు సుగ్రీవునివాక్యమును విని లక్ష్మణుఁడు పరమానందమును బొందినవాఁడై యధికప్రేమతో నా సుగ్రీవున కిట్లనియె.

వానరోత్తముఁడవైన యో సుగ్రీవుఁడా! విశేషముగా వినయముగలవాఁడవై నీవు రక్షకుఁడవుగానుండుటచేత నాయన్నయగు రాముఁడు సర్వప్రకారములచేతను దిక్కుగలవాఁడయ్యెనని తలఁచుచున్నాను. వానరాధిపతివైన యో సుగ్రీవుఁడా! మిగులనధికమగు ప్రభావముగలవాఁడవును, మిగులగొప్పదగు నాచారసంపదగలవాఁడవును నగు నీవీవానరరాజ్యసంపదను సర్వమును ననుభవించుటకుఁ దగినవాఁడవు. వానరాధిపతివైన యో సుగ్రీవుఁడా! నీసహాయముచేతఁ బ్రతాపవంతుఁడగు రాముఁడు శీఘ్రముగానే యుద్ధమునందు శత్రువులనందఱవధింపఁగలఁడు ఇందు కేమియును సందేహము లేదు. ధర్మమునుగుర్తెఱిఁగినవాఁడవును, చేసినమేలునుమరచినవాఁడవును, యుద్ధములయందు వెనుకకుఁ దిరుగనివాఁడవును, నగునీవచనముయుక్తియుక్తమును, యుక్తమును నైయున్నది. వానరాధిపతివైన యో సుగ్రీవుఁడా! తనదోషములను దెలిసినవాఁడు లోకములో నెవ్వఁడును తనదోషమును బ్రకటనచేసికొనఁడు, నేను నాయన్నయగు రాముని వ్యసనమును జూచి సహింపఁజాలక నిన్ను మిగుల నిందించితినిగాని నీయందు వాస్తవముగ దోషముండుటచేత నిందించినవాఁడనుగాను, వానరోత్తముఁడవైన యో సుగ్రీవుఁడా! నీవు పరాక్రమముచేతను, బలముచేతను రామునకు సమానుఁడవు. ఇటువంటిగుణములుగల నీవు రామునకు సహాయముగా దేవతలచేత నివ్వఁబడితివి. వానరరాజోత్తమా! నీవు నాతోఁగూడ బయలువెడలి శీఘ్రముగరమ్ము. వచ్చి భార్యావియోగముచేతనధికముగా దుఃఖమును బొందుచున్నవాఁడును, నీకు స్నేహితుఁడును, నగు రాముని తిన్ననిమాటలచేత నోదార్పుము. వానరోత్తముఁడవైనయో సుగ్రీవుఁడా! దుఃఖముచేతఁ బీడింపఁబడుచున్న రాముని వచనానుసారముగ నిన్నుఁ గఠినోక్తులచేత నిందించితిని. అట్టివచనములను మనస్సునందుబెట్టకమన్నింపుము. నేను వ్యసనముచేతఁ జెప్పితిని.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండము నందలి ముప్పదాఱవ సర్గముగిసెను.

లోకములోనుండు వానరులందరు సుగ్రీవునియొద్దకు వచ్చుట.

ఈవిధముగా మహానుభావుఁడగు లక్ష్మణుఁడు చెప్పిన మాటను విని సుగ్రీవుఁడు తన పార్శ్వమునందున్న వాఁడును, తనకు మంత్రియును, నగు హనుమంతునితో నిట్లనియె.

వాయుపుత్రుఁడా! మంత్రిపుంగవా! ఆంజనేయా! మహేంద్రపర్వతమునందును, హిమవత్పర్వతము నందును, వింధ్యపర్వతమునందును, కైలాసపర్వతమునందును, మందరపర్వతమునందును, మఱియును బాలసూర్యునియొక్క కాంతివంటి కాంతిగలవై ప్రకాశించుచున్న పర్వతములయందును, సముద్రముయొక్క కొనయందుండెడి పర్వతములయందును, పశ్చిమదిక్కునందలి పర్వతముల యందును, ఉదయాద్రియందును, అస్తాద్రియందును, మిగుల భయంకరమగు పద్మతాళవనమునందును నున్న వానరోత్తములనందఱను రప్పింపుము. మఱియు నంజనపర్వతమునందు నివసించియున్నవారును, నల్లని మేఘముయొక్క కాంతివంటి దేహచ్ఛాయగలవారును, ఏనుగులను బోలియున్నవారును, నగు వానరోత్తములనందఱ రప్పింపుము. మనశ్శిలలగుహలయందు నివసించియున్న వారును, బంగారమును బోలిన దేహచ్ఛాయగలవారును, మేరుపార్శ్వమునందున్నవారును, ధూమ్రపర్వతమునందున్న వారును, బాలసూర్యునివంటి దేహచ్ఛాయగలవారును, మిగుల నెఱ్ఱనగు పర్వతమునందు నివసించియున్నవారును, మిగుల దివ్యమైనదగు మైరేయమనియెడు మద్యమును, పానముచేసినవారును, మిగుల భయంకరమగు వేగముగలవారును మిగులఁ బరిమళించుచున్నవియును, రమ్యములైనవియును నగు పర్వతములయందు నివసించియున్నవారును, తపోవంతులు నివసించియున్నవియును, మనోహరములైనవియును, నగు వనముఖ్యప్రదేశముల యందంతటను నివసించియున్న వారును, మఱియు నితరస్థలములయందు నివసించినవారును, నగు వానరులనందఱను మిగుల శీఘ్రముగా వచ్చునట్లు చేయుము ఆవానరులందఱును వచ్చుటకు సామదానభేదదండములనియెడు చతుర్విధోపాయములను బ్రయోగింపుము. మఱియు నో హనుమంతుఁడా! ఇదివఱకు ముందుగానే, నేను మిగుల వేగముగల దూతలననేకులఁ బంపియుంటిని. ఇప్పుడు మరల నా వానరులందఱును శీఘ్రముగ వచ్చుటకు దూతలను బంపుము మఱియు నో హనుమంతుఁడా! కామాసక్తులై యున్నవారును, దీర్ఘాలోచనను జేయువారును, నగు వానరులనందఱను నా యాజ్ఞానుసారముగ నతిశీఘ్రముగ వచ్చునట్లు చేయుము నా యాజ్ఞానుసారముగ [illegible]

లయందును నివసించునట్టి వానరులనేక నూరులును, వేలును, కోట్లును నతిశీఘ్రముగ వచ్చునట్లు చేయుము. మేఘములతోడను, పర్వతములతోడను, సమానమైన యాకారములుగలవారును, భయంకరములగు నాకారములుగలవారును, నగు వానరోత్తములనేక వేలమంది యాకాశమును సర్వమును మేఘము కప్పినట్లు కప్పుచువచ్చునట్లు సేయుము. అట్లనేక కోట్ల వానరులు వచ్చునపుడు వారి రాకను జూచి యన్యులగు వానరులును నతిశీఘ్రముగ వచ్చునట్లు సేయుము

అవ్విధముగాఁ జెప్పుచున్నవాఁడును, వానరాధిపతియును నగు సుగ్రీవుని మాటను విని హనుమంతుఁడు బలవంతులగు వానరులను సకలదిక్కులకును బంపె. ఆసమయమునందే, వానరులందఱును పక్షులవలె నాకాశమార్గము నవలంబించి వానరులను దోడ్కొనివచ్చుటకుఁ బోయిరి. పోయి సముద్రముల యందును, పర్వతముల యందును, వనముల యందును, సరస్సులయందును, నివసించియున్న వానరుల నందఱను బ్రేరణచేసిరి. అంతట సకలదిక్కులయందును నివసించునట్టి వానరులందఱును, మృత్యుదేవత యొక్కయు, యమునియొక్కయు, నాజ్ఞవంటి సుగ్రీవాజ్ఞను విని మిగుల భయము గలవారగుచు మారాడక భార్యాపుత్రమిత్రాదులతోఁ గూడ బయలువెడలివచ్చిరి అంతట నంజనపర్వతమునుండి కాటుకకొండయొక్క వర్ణమువంటి వర్ణముగలవారును, మిగుల వేగముగలవారును, మూఁడుకోట్ల వానరులు రామకార్యార్థముగ బయలువెడలివచ్చిరి. సూర్యుఁడే పర్వతమునందుఁ గ్రుంకునో యట్టివంటి పర్వతమునుండి మిగుల వేగముగల వానరులు పదికోట్లమంది బయలువెడలిరి. సింహముయొక్క నెత్తిమీఁది రోమమువంటి వర్ణముగల వానరులు నూఱుకోట్లు కైలాస శిఖరములనుండి బయలువెడలిరి. ఫలములచేతను, కందమూలములచేతను, జీవించుచు హిమవత్పర్వతమునందు నివసించుచున్న వానరులు వేయికోట్లు హిమాలయమునుండి బయలువెడలిరి. అగ్నిహోత్రముయొక్క వర్ణమువంటి వర్ణముగలవారును, భయంకరులును, భయంకరములగు కార్యములను జేయువారును, నగు వానరులు వేయికోట్లు వింధ్యపర్వతమునుండి బయలువెడలిరి. క్షీరసముద్రపుగట్టున నివసించుచున్నవారును, తమాలవనములయందు నివసించుచున్నవారును, నారికేళఫలములను భుజించిజీవించువారును, నగు వానరులు లెక్కలేక బయలువెడలిరి. మఱియు వనమునుండియు, పర్వతములనుండియు, సరస్సులనుండియు, నదులనుండియు, మఱియు నితరములగు ప్రదేశములనుండియు, మహావేగముగల వానరులు లెక్కకు మిగిలి బయలువెడలిరి. ఇట్లు బయలువెడలిన వా

నరసైన్యమంతయును, సూర్యుని గనఁబడకుండునట్లు సే యుచు నంతరిక్షమార్గమున వచ్చుచుండెను. లోకములోని వానరులనందఱను బిలుచుకొనివచ్చుటకుఁబోయినవీరులగు వానరులందఱును, గొప్పవగువృక్షములుగల హిమవత్ప ర్వతమునుజూచిరి. మిగులమనోహరమగు నాహిమవత్ప ర్వతమునందు దివ్యమైనదియును, మనోహరమైనదియును. మహేశ్వరుని సంబంధమైనదియును, నగుయజ్ఞము సకల దేవతలయొక్కయు మనస్సునకు సంతోషమును గలుగఁజే యునదియై ప్రకాశించెను. మఱియునక్కడ వానరులందఱు ను, అన్ననిష్యందజాతమును, అమృతముతో సమానము లునునగు కందమూల ఫలములనుజూచిరి. ఆయన్నమువల నఁ బుట్టినవియును, మనోహరములును, దివ్యములును, నగుఫలమూలములను భుజించినవానికొక్క మాసముదిన ము లాకలిలేకతృప్తి గలిగియుండును. అటువంటిమూల ములను దివ్యములగు ఫలములను, దివ్యములగునౌషధము లను, ఫలమూలములనుభుజించి జీవించునట్టి యావానరు లందఱును గ్రహించిరి. మఱియునావానరులందఱును సు గ్రీవునకుఁబ్రియమును జేయఁదలఁచినవారై యజ్ఞమునకు నివాసస్థానమైన హిమవత్పర్వతమునుండి మనోహరములు ను, పరిమళించుచున్నవియును, నగుపుష్పములను దీసికొని వచ్చిరి. పిమ్మటనావానర వీరులందఱును సకలవానరుల నుబంపిరి. పిమ్మటఁదాముగూడ మిగులఁద్వరగల వారైవ చ్చిరి మఱియు నతిశీఘ్రముగనడచునట్టి యావానరసేనా పతులందఱును నాక్షణమునందే సుగ్రీవుడున్నచోటునకు వచ్చిరి. మఱియునా వానరులందఱును, నానావిధములగు నోషధులను, కందమూల ఫలాదులను, సుగ్రీవునకిచ్చి పి మ్మటవినయ పూర్వకముగా నిట్లనిపలికిరి.

సుగ్రీవుఁడా! సకలపర్వతములయందును, సముద్రము లయందును, వనములయందును, దిరిగియొక్కడ కడనుం డునట్టి వానరులందఱును నీయాజ్ఞచేత వచ్చునట్లు చేసితిమి. అందఱును వచ్చిరనిచెప్పిరి.

ఇవ్విధముగా వానరయూథ పతులచేతఁ జెప్పఁబడిన వాక్యములనువిని వానరాధిపతియగు సుగ్రీవుఁడు పరమా నందభరితుఁడై యావానరులందఱును దెచ్చినకానుకను గ్రహించె

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ముప్పదేడవ సర్గముగిసెను.

సుగ్రీవుడునులక్ష్మణుడునురామునివద్దకుబోయిచేరుట.

అంతటనాసుగ్రీవుఁడు వానరులచేత సమర్పింపఁబడిన కానుకల నన్నింటినిగ్రహించి యావానరుల నందఱనుదగు మాటలచేత సంతోషింపఁజేసె పిమ్మటఁదగిన విడదలల కుఁ బొమ్మనిపంపె. అట్లుకానికలను దెచ్చి యిచ్చినవానర వీరులనందఱ విడిదలకుఁబంపి తానుమహాబలుఁడగు రా ముఁడును కృతార్థుఁడయ్యెనని తలఁచె. అంతటనాలక్ష్మణు డు భయంకరమైన బలముగలవాడును, సర్వవానరాధిపతి యును, నగుసుగ్రీవునకు సంతోషమును గల్పించుచు విన యసూచకములగు వాక్యములతో నిట్లనియె.

మంచిస్వభావముగల యోసుగ్రీవుడా! నీకుసమ్మతమ య్యెనేని యీకిష్కింధాపట్టణమునుండి బయలువెడలుమ నియె. అంతటనవ్విధముగా లక్ష్మణునిచేత బలుకబడినమృ దు మధురోక్తులనువిని సుగ్రీవుడు పరమానందము గలవా డై లక్ష్మణునిజూచి యిట్లనియె.

రఘుకులతిలకమా! లక్ష్మణా! అటులనేగానిమ్ము, పో దము. నీవుమిగులమంగళకరమగు నీసింహాసనమునందు గూర్చుండుమనియె ఆవిధముగా శుభలక్షణములుగల ల క్ష్మణునితో జెప్పినపిమ్మట నాసుగ్రీవుడు తారమొదలుగా గల స్త్రీలనువిడిచిపెట్టె. పిమ్మటసకల వానరవీరులను రం డనియధికముగా గొంతెత్తిపిలిచె.

అవ్విధముగా సుగ్రీవుడుపిలువగానే యాపిలుపునువిని వానరవీరులందఱును నతిశీఘ్రముగా బరుగిడివచ్చిరి. వచ్చి యాసుగ్రీవునిదగ్గిర జేతులనుముకుళించుకొని నిలుచుండిరి. అప్పుడుసుగ్రీవుడా వానరులతో నిట్లనియె,

వానరోత్తములారా! మీలోనెవ్వరెవ్వరు మీమీపుత్రమి త్ర కళత్రాదులనుజూచి రావలయునని యపేక్షించుచుచు న్నారో వారందఱునుపోయిజూచి వారితో జెప్పియతిశీఘ్ర ముగరండనియె అంతటనావానరు లందఱునుబోయి త మతమపుత్రమిత్ర కళత్రాదులనుజూచి యతివేగముగమర ల సుగ్రీవునొద్దకువచ్చిరి. అంతటనట్లు తమభార్యను పు త్రాదులనుజూచి వచ్చినవానరులనుజూచి తనయొద్దకువ చ్చియున్న వానరవీరులతో సూర్యునియొక్క కాంతివంటి కాంతిగల సుగ్రీవుడావానరులతో నిట్లనియె.

ఓవానరోత్తములారా! మీరందఱును యతిశీఘ్ర ముగబోయి పల్లకినిదీసికొని రండనియె. ఆవచనమునువిని యధికమగు పరాక్రమముగల వానరులందఱునుబోయి మి గులమనోహరమగుపల్లకినిఅతివేగముగ దీసికొనివచ్చి సుగ్రీ వునిసమీపమునబెట్టిరి అట్లుతెచ్చినశిబికనుజూచి వానరా

ధిపతియగు సుగ్రీవుడు లక్ష్మణునితో నిట్లనియె.

లక్ష్మణుడా! ఈశిబికను శీఘ్రముగా నెక్కుమని చెప్పి మిగుల బలవంతులగు వానరులచేత మోయబడుచున్నదియును, సూర్యునివలె దగద్ధగాయమానముగ బ్రకాశించుచున్నదియును బంగారముచేత జేయబడినదియును నగు నా శిబికమీద లక్ష్మణునితోగూడ నెక్కెను. అంతనచ్చటి వానరులు లక్ష్మణసుగ్రీవులకు శ్వేతచ్ఛత్రములను బట్టిరి మిగుల మనోహరములైనవియును, తెల్లనివియును, నగు వింజామరలను వైచిరి. మరికొందఱగు వానరులు శంఖభేరీనినాదములను బ్రయోగించిరి ఇవియన్నియును జూచి సుగ్రీవుడు లక్ష్మణునితోగూడ బరమానందమును బొందె. అంతట నా సుగ్రీవుడు సర్వోత్తమమగు రాజ్యలక్ష్మిని బొంది బయలువెడలె. మరియు ననేకులగు వానరవీరులు నానావిధములగు శస్త్రములను ధరించి సుగ్రీవునితోగూడ బయలువెడలిరి అంతట నా వానరులందఱును సుగ్రీవునితోగూడ రాముడున్న చోటునకు బోయిరి.

అవ్విధముగ నా వానరులందరును, రామునిచేత సేవింపబడుచున్నదియును మిగుల శ్రేష్ఠమైనదియును, నగు ప్రదేశమునకు బోయిరి. అంతట మహాతేజోవంతుడగు లక్ష్మణుడు ముందుగా శిబికమీదనుండి దిగెను సుగ్రీవుడును దిగెను. పిమ్మట నా లక్ష్మణసుగ్రీవు లిరువురును రామునకు జేతులను ముకుళించుకొని నమస్కారమును జేయుచు నిలిచియుండిరి. అవ్విధముగా సుగ్రీవుడు దోసిలియొగ్గి నమస్కారమును జేయగానే యతనితోగూడ వచ్చిన వానరులందఱును నమస్కారమును జేసి లేచి నిలిచియుండిరి. అంతట నా రాముడు వికసించిన పద్మములు గలదియగు తటాకమువలె బ్రకాశించుచున్నదియును, మిగుల గొప్పదియును నగు వానరసైన్యమును జూచి యధికమగు సంతోషము గలవాడయ్యె. పిమ్మట పాదములయందు బడి నమస్కారమును జేయుచున్నవాడును, వానరోత్తముడును, నగు సుగ్రీవుని లేవదీసి రఘుకులోత్తముడగు రాముడు బహుమానపురస్సరముగాను, ప్రేమపురస్సరముగాను, కౌగలించుకొనియె.

అవ్విధముగా కౌగలించుకొని ధర్మాత్ముడగు రాముడు సుగ్రీవుని జూచి సుగ్రీవుడా! కూర్చుండుమనియె. అంతట ధరణియందు గూర్చున్న సుగ్రీవునితో రాముడు మృదుమధురవచనములతో నిట్లనియె.

వానరోత్తముడవైన యో సుగ్రీవుడా! లోకములోనే రాజు తగిన కాలమునందు ధర్మార్థకామములను సర్వకాలములయందును జక్కగా విభజించి యనుభవించునో యట్టివాడు త్తముడగు రాజనబడును. లోకములోనే రాజు ధర్మార్థకామములను విభజింపక యొచ్చుతగ్గుగా ననుభవించువాడు చెట్టుకొమ్మకొనయందు బరుండి నిద్రను బోవుచున్నవానివలె నపాయమునందు శయనించినవాడగును అట్టివాడు క్రిందబడిన పిమ్మట మేలుకువను దెచ్చుకొనినట్లు బాధలను బొందిన పిమ్మట దెలివిని గలిగి ప్రవర్తించును. కావున ధర్మార్థకామముల నెచ్చుతగ్గుగా ననుభవింపక సమముగా భుజించుచుండవలయును. ఇట్లు చేయువాడు సకలసుఖములను బొందును. మరియు నో మిత్రుడా! సుగ్రీవుడా! శత్రువులను వధించుట యందాశగలవాడును. మిత్రులను సంపాదించుట యందభిలాషగలవాడును, ధర్మార్థకామములను సమముగ భుజించువాడును, నగు రాజు ధర్మముతో గూడినవాడగును. శత్రువులను నశింపజేసినవాడవగునో సుగ్రీవుడా! ఈ కాలము ప్రయత్నమును జేయుటకు దగిన కాలమైయున్నది. కావున వానరాధిపతివైన యో సుగ్రీవుడా! నీ మంత్రులగు వానరులతోగూడ జేయదగిన కార్యమును గురించి చక్కగా యోచింపుమనియె

ఇవ్విధముగా చెప్పిన మాటను విని సుగ్రీవుడు యా రామునితో నిట్లనియె.

గొప్పవగు భుజములుగల యో రాముడా! ఇదివఱకు ముందు నా సంపదయును, కీర్తియును, వానరరాజ్యమును నశించిపోయె. అటువంటి రాజ్యసంపత్కీర్తులను నీయనుగ్రహముచేత బొందితిని. మరియును జయించువారలలో నుత్తముడవైన యో రాముడా! మరల నీయనుగ్రహముచేతను, నీతమ్ముడగు లక్ష్మణునిచేతను, రాజ్యసంపత్కీర్తులను స్థిరములుగా నుండునట్లు బొందితిని గదా! పూజ్యుడవైన యో రాముడా! ముందుగా నుపకారమును జేసినవారలకు బ్రత్యుపకారమును జేయనివాడు దూషకుడుగదా? శత్రునాశకుడవైన యో రాముడా! అనేక నూరుల సంఖ్యగల యీ వానరోత్తములందఱును భూమియందున్న బలవంతులగు వానరులనందఱును దీసికొనివచ్చిరి. రఘుకులమునందు బుట్టిన యో రాముడా! శారదవులయందును, సాధారణములగు వనములయందును, దుర్గమములయందును సంచరించుటయందు నేర్పుగలవారును, మిగుల శూరులును, నగు ఋక్షసంజ్ఞ గలవానరులును, కొండముచ్చులని యెడు సంజ్ఞగవానరులును మిగుల భయంకరులగుచువచ్చిరి.

రఘుకులోద్భవుడవైన యో రాముడా! దేవతలకును, గంధర్వులకును, పుత్రులగువారును, కామరూపులును, నగు వానరులందఱును, దమతమ సైన్యములతోఁ గూడుకొని నవార్తె మార్గమునందున్నారు. అందుఁ గొందఱు యూథపతుల నేక నూరుల వానరులతోఁ గూడుకొని వచ్చుచున్నా

రు కొందఱుఅర్బుదశతములను వెంటఁబెట్టుకొని వచ్చుచున్నారు. కొందఱుమధ్యసంఖ్యగలవానరవీరులతోఁగూడ వచ్చుచున్నారు. కొందఱుకోట్లసంఖ్యలుగల వానరులతో వచ్చుచున్నారు. కొందఱువేలసంఖ్యలుగలవానరులతోఁ జేరి వచ్చుచున్నారు. కొందఱుపదివేలవానరులతో వచ్చుచున్నారు కొందఱువానరవీరులు శంకుసంఖ్యగలవానరులతోఁజేరివచ్చుచున్నారు. కొందఱువానరోత్తములనేకార్బుద సంఖ్యలుగలవానరవీరులతో వచ్చుచున్నారు కొందఱుఅంతసంఖ్యగలవానరులతో వచ్చుచున్నారు కొందఱుసముద్రసంఖ్యగల వానరులతోఁజేరుకొని వచ్చుచున్నారు రాజోత్తముఁడవైనయోరాముఁడా! దేవేంద్రునియొక్క పరాక్రమమువంటిపరాక్రమముగల వానరులు నీయొద్దకునిప్పుడేరాఁగలరు ఆవానరులలోఁగొందఱు మేరుపర్వతసమానులు, మఱికొందఱు మందరపర్వతసమానులు, కొందఱు వింధ్యపర్వతము సందును, మేరు పర్వతమునందును నివసించుచున్నవారు వారందఱును నిప్పుడేరాఁగలరు. వచ్చినపిమ్మట లంకాపట్టణమునకుఁబోయి యుద్ధమునందు పుత్రమిత్రకళత్రాదులతోఁగూడ రావణాసురుని వధించి సీతాదేవిని దీసికొనిరాఁగలరనియె, అప్పుడు చక్కఁగావికసించినకలువలవంటి నేత్రములు గలవాఁడును, దశరథమహారాజునకుఁబుత్రుఁడును బుద్ధిమంతుఁడును, నగురాముఁడు తనయాజ్ఞయందుఁ బ్రవర్తించుచున్నవాఁడును, వానరాధిపతియును నగు సుగ్రీవునియుద్యోగమునుజూచి మిగుల సంతోషమును బొందె

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండము నందలి ముప్పదెనిమిదవసర్గ ముగిసెను.

(*)

లోకములోనుండు వానరులందరును సుగ్రీవుని ఆజ్ఞచే వచ్చిచేరుట.

ఇవ్విధముగాఁ బలుకుచున్నవాఁడును, దోసిలియొగ్గి వినయపూర్వకముగ నమస్కరించుచున్నవాఁడును, నగుసుగ్రీవు ధర్మవేత్తలలో నుత్తముఁడగు రాముఁడు బాహువులచేత నాలింగనమును జేసికొని యిట్లనియె.

సుగ్రీవుఁడా! ఇంద్రుఁడువర్షమును వర్షించుట విచారింపఁగాఁజిత్రమైయున్నది. వేయి కిరణములుగల సూర్యుఁడు ఆకాశమునందలి చీకటిని బోఁగొట్టుటయును చిత్రముగానున్నది. సౌమ్యుఁడవైనయోసుగ్రీవుఁడా! చంద్రుఁడు భూమిని సర్వమును నిర్మలముగాఁజేయుటయును విచిత్రముగానున్నది. శత్రువులను దీపింపజేయునట్టి సుగ్రీవుఁడా! నీయట్టిమహానుభావుఁడు ప్రత్యుపకారమును జేయుట విచారింపఁగాఁజిత్రమైనదిగాదు. సత్పురుషులగలవారలకిది సహజధర్మము గనుక సత్పురుషుఁడవైన నీకును నిదిసహజధర్మమైయున్నది. వానరాధిపతివైనయోసుగ్రీవుఁడా! సర్వకాలములయందును నీవుప్రియవాదివని తలఁచుచున్నాను. స్నేహితుఁడవైనయోసుగ్రీవుఁడా! నిన్నుసహాయముగాఁజేసికొనుటచేత నేను శత్రువులనందఱను జయించువాఁడనైతిని. నీవేనాకుఁబరమమిత్రుఁడవు గాఁబట్టినీవునాకు సాహాయ్యమును జేసికొనుటకుఁ దగినవాఁడవు. వానరోత్తముఁడవైనయోసుగ్రీవుఁడా! పూర్వముఅనుహ్లాదుఁడనియెడువాఁడు మోసకృత్యములచేత బులోమునకుఁబుత్రికయగు శచీదేవి నపహరించినవిధముగా రాక్షసాధిపతియగు రావణాసురుఁడు తననాశముకొఱకు సీతాదేవినపహరించె కాఁబట్టినేను దీక్ష్ణములగు నాబాణములచేత యుద్ధమునందు రావణాసురుని, బూర్వముదేవేంద్రుఁడు శచీదేవికిఁదండ్రియగునను హ్లాదునివధించిన విధముగా వధించెదననియె. ఇవ్విధముగా రాముఁడు చెప్పుచుండఁగానే, మిగుల పెద్దదియును, మిగులఁదీక్ష్ణమైనదియును, నగు సూర్యునియొక్క కాంతిని (అనఁగా నెండను) గనుబడకుండ జేయుచునపరిమితమగు దుమ్ముబయలు వెడలె అట్లువ్యాపించినపరాగముచేత దిక్కులన్నియును వ్యాకులములయ్యె భూమియంతయును, పర్వతములతోడను, వనములతోడనుగూడ గడగడవణఁకె. పిమ్మటఁ గొంతసేపటికి శ్రేష్ఠములగు పర్వతములతోసమానులును, మిగులఁదీక్ష్ణములగు కోరపన్నులుగల వారును, మిగులబలముగలవారును, నపరిమితసంఖ్యగలవారును, నగువానరులచేత భూమియంతయును నావరింపఁబడియె. అట్లునిమేషమాత్రములోఁ గామరూపులును, మిగుల బలవంతులునునగు వానరకోట్లనేకములు యతివిచిత్రముగావచ్చి భూమినంతయు దట్టముగా వ్యాపించె. పిమ్మట శతవలియను పేరుగల వానరోత్తముఁడు, నదులయందుఁబుట్టినవారును, మహాబలులును, మేఘధ్వనివంటి ధ్వనిగలవారును, నానావిధములగు వనములయందు సంచరించువారును బాలసూర్యునియొక్క కాంతివంటి దేహచ్ఛాయగలవారును, మేరుపర్వతముమొదలుగాఁగలపర్వతములయందు నివాసమును గేయువారును, నగు ననేకవానరవీరులచేతఁజుట్టఁబడివచ్చె. అవ్విధముగానే తారయొక్క తండ్రియును, మేరుపర్వతముయొక్క కాంతివంటికాంతిగలవాఁడును, నగువానరోత్తముఁడనేక దశసహస్రకోట్లవానరులచేతఁజుట్టఁబడినవాఁడైవచ్చె. పిమ్మటసుగ్రీవునకుమామయును, రుమకుఁ దండ్రియుననగు వానరోత్తముఁడు వేయికోట్లకంటె నెక్కుడగు వానరవీరులచేతఁ జుట్టబడిన

వాఁడైవచ్చె. పద్మములయందలి కింజల్కములతో సమమైన దేహచ్ఛాయగలవాఁడును, బాలసూర్యునితో సమానమైన ముఖకాంతిగలవాఁడును, మిగులబుద్ధిమంతుఁడును, వానరోత్తముఁడును, హనుమంతునకుఁదండ్రియునగు కేసరియనువానరుఁ డనేకవేల వానరవీరులతోఁ గూడుకొనినవాఁడైవచ్చె. కొండముచ్చులకధిపతియును, భయంకరమైన పరాక్రమముగలవాఁడును, నగు గవాక్షుఁడనెడు వాఁడు వేయికోట్లవానరులతోఁ గూడుకొనినవాఁడై వచ్చెకనఁబడియె శత్రువులనునాశనము చేయునట్టి సామర్థ్యముగల ధూమ్రుఁడనియెడు వానరుఁడు భయంకరమైనవానరులయొక్క రెండువేలకోట్లసంఖ్యతోఁ గూడుకొనిన వాఁడై వచ్చె పనసుఁడనియెడు పేరుగల వానరాధిపతిమిగులగొప్పవగు పర్వతములతోసమానులును, భయంకరులును, నగు మూఁడుకోట్లవానరులతోఁ గూడుకొనినవాఁడై వచ్చె. పిమ్మటఁ గాటుకకొండతో సమానమైన కాంతిగలవాఁడును, గవయుఁడనియెడు నామధేయముగల వాఁడును, సర్వోత్తమమగు పరాక్రమముగలవాఁడును, నగువాఁడు పదికోట్లవానరులతోఁ గూడుకొనిన వాఁడైవచ్చె బలవంతుఁడగు దరీముఖుఁడనియెడు పేరుగలవానరాధిపతి వేయికోట్ల వానరులతోఁ గూడుకొనిన వాఁడై సుగ్రీవునొద్దకు వచ్చె. అశ్వియనువానికిఁ బుత్రులును, మిగుల బలముగలవారును, నగుమైందుఁడు, ద్వివిదుఁడునని యెడువానరులు వేయికోట్ల వానరులతోఁ గూడుకొనినవారైవచ్చిరి. మఱియునుమిగులబలవంతుఁడును, అధికమగుబలముగలవాఁడును, గొప్పదగు తేజస్సుగలవాఁడును, నగుగజుఁడనియెడువాఁడు మూఁడుకోట్లవానరవీరులతోఁగూడుకొనిసుగ్రీవుని సమీపమునకువచ్చె ఋక్షులనియెడు వానరుల కధిపతియును, గొప్పదగు తేజస్సుగలవాఁడునునగు జాంబవంతుఁడు పదికోట్లవానరులతోఁగూడ సుగ్రీవుని సమీపమునకువచ్చె. పిమ్మట మిగులబలవంతుఁడగు రుమణ్వంతుఁడను వానరుఁడు నూఱుకోట్లవానరులతోఁ గూడుకొనినవాఁడైవానరాధిపతియగుసుగ్రీవునొద్దకువచ్చె. పిమ్మటవేయినూరులకోట్లవానరవీరులతోఁ గూడుకొని గంధమాదనుడనియెడు నామధేయముగల వానరాధిపతివచ్చె. తండ్రియొక్క పరాక్రమమునకుసమమైన పరాక్రమముగలవాఁడును, యువరాజునునగు నంగదుఁడు పద్మసహస్రసంఖ్యలుగల వానరులతోడను, నూరుశంఖుల సంఖ్యలుగల వానరవీరులతోడను గూడుకొనిన వాఁడైవచ్చె. పిమ్మటనక్షత్రముయొక్క కాంతివంటికాంతిగలవాఁడును, భయంకరమైన పరాక్రమముగలవాఁడును, నగు తారుఁడనియెడు వానరోత్తముఁడు అయిదుకోట్లవానరవీరులతోఁ గూడుకొనినవాఁడైవచ్చె. మిగులపరాక్రమముగలవాఁడును, యూథనాథుఁడునునగు నింద్రజానుఁడనియెడువాఁడు పదునొకండుకోట్ల వానరులతోఁగూడుకొనినవాఁడైవచ్చె. పిమ్మటబాలసూర్యునియొక్క కాంతివంటికాంతిగలవాఁడును, నింద్రజానువనియెడు పేరుగల వాఁడునునగువానరాధిపతి యొకకోటియుబదివేలవానరులతోఁ గూడుకొనినవాఁడై వచ్చె. పిమ్మటదుర్ముఖుఁడనియెడు పేరుగల వాఁడును, బలవంతుఁడును, నగు వానరవీరుఁడు రెండుకోట్లవానరవీరులతోఁ గూడుకొనినవాఁడైవచ్చె పిమ్మటఁగైలాసశిఖరముయొక్కయాకారమువంటి యాకారముగలవారును. భయంకరమైన పరాక్రమముగలవారును, నగు వేయికోట్లవానరవీరులతో, గూడ హనుమంతుఁడువచ్చె పిమ్మటగొప్పదగు పరాక్రమముగలనళుడనియెడువానరవీరుఁడు నూటయొక్కకోటిసంఖ్యలు గల వానరవీరులతోఁగూడవచ్చె. పిమ్మట దధిముఖుఁడనియెడునామధేయముగల వానరవీరుఁడు పదికోట్లవానరవీరులతోఁగూడుకొనినవాఁడై మహాత్ముఁడగుసుగ్రీవునిసమీపమునకువచ్చె. మఱియును, శరభుఁడును, కుముదుఁడును, వహ్నియును, రంహుఁడును, మఱియు నితరులగువారనేకులు కామరూపులగువానరులుగూడననేకులగు వానరవీరులతోఁగూడవచ్చె. ఆవానరులందఱును భూమిని సర్వమును సకలములగువనములను నావరించుకొనివచ్చిరి. అట్లువచ్చిన వానరులయొక్క సంఖ్య యింతయనిలెక్కపెట్టుట బ్రహ్మకుఁగూడ శక్తిలేకయుండె. అట్లువచ్చిన వానరులందఱును భూమినిసర్వమును నాక్రమించుకొనిరి. అందుఁగొందఱు గంతులు వేయుచుండిరి. కొందఱు దుముకుచుండిరి కొందఱు కూతలు వేయుచుండిరి మఱియును మేఘసమూహములు సూర్యునినావరించుకొనినవిధముగా నావానరులందఱును సుగ్రీవునినావరించుకొనిరి మఱియు నావానరులందఱును అనేకవిధములుగా ధ్వనిచేయువారును, పరమసంతోషము గలవారునునై వానరాధిపతియగు సుగ్రీవునకు శిరస్సునువంచి నమస్కారము చేసిరి మఱికొందఱగువానరులు తమతమకుదగినమర్యాదలతో సుగ్రీవునొద్దకువచ్చి తగినవిధముగాఁ గూర్చుండిరి. అంతటసకలధర్మములను నెఱిఁగినసుగ్రీవుడు మిగులత్వరగలవాఁడై యావానరోత్తములనందఱను తగినస్థలములయందుండునట్లు నియమించె అవ్విధముగనావానరవీరులనందఱను కొండచరియలయందును, కొండకాలువల యోరలయందును బ్రవేశపెట్టి యారామునకుసంతోషముగలుగునట్లు అసైన్యమును సర్వమును రామునకు సమర్పించి చేతులను ముకుళించుకొని

యారామునిజూచి యిట్లనియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ముప్పదితొమ్మిదవసర్గము ముగిసెను.

▸❋◂

సీతాదేవిని వెదకుటకు సుగ్రీవుడు వినతుడు మొదలగువారిని తూర్పుదిక్కునకు బంపుట.

పిమ్మట వానరాధిపతియును, సకలసంపదలయొక్కయు సమృద్ధిగలవాడును, నగు సుగ్రీవుడు మానవోత్తముడును, శత్రుబలమును బీడించువాడును, నగు రామునితో నిట్లనియె.

మానవోత్తముడవైన యోవానరోత్తముడా! ఇచ్చటకు వచ్చి యున్నవారలును, బలవంతులును, కామరూపులును, ఏనుగుయొక్క కాంతివంటి కాంతిగలవారును, నారాజ్యమునందున్నవారును, నగు వానరభటులు వచ్చియున్నారు. ఈ వానరయూథపతులందఱును, మిగులపరాక్రమములు గలవారును, భయంకరములగు పరాక్రమము గలవారును, నగు వానరవీరులతో గూడి వచ్చియున్నారు. మఱియు నీవానరులందఱును, మిగులభయంకరులగు దైత్యులతోడను, దానవులతోడను సమానులగు వానరులనేకులు వచ్చియున్నారు మఱియు నో రామచన్ద్రా! బలవంతులగు నీవానరులందఱును ప్రసిద్ధమైనకర్మగలవారు. అనాయాసముగ యుద్ధమును జేయువారు పరాక్రమములయందు మిగులప్రసిద్ధులు. వ్యవసాయములయందుత్తములు. నీకుగింకరులగు నీవానరులలో గొందఱు భూమియందును, గొందఱు ఉదకములయందును, కొందఱు నానావిధములగు పర్వతములయందును నివసించుచుందురు ఈవానరులందఱును రాజకార్యములయందాసక్తిగలవారు ఇంతయగాక రాజాజ్ఞను జక్కగ నెరవేర్చువారు. శత్రునాశకుడవైన యోరాముడా! వీరందఱును ప్రభుడవగు నీవుకోరిన కార్యమును జేయుటకు సిద్ధముగనున్నారు. మానవోత్తముడవైన యోరాముడా! భయంకరములగు పరాక్రమములుగల వారగు ననేకవేల వానరులవలన నీకేమిప్రయోజనముగలదో యాపనిని నెరవేర్చికొనుము. ఈసైన్యమంతయును నీసైన్యము. ఇంతయగాక యెల్లవారును నీవశమునందు నివసింపగలరు. కావున జేయదగిన పనినిగురించి వీరికాజ్ఞనిమ్మనియె.

ఇవ్విధముగా బలుకుచున్న సుగ్రీవుని దశరథరాజనందనుడగు రాముడు బాహువులచేత నాలింగనముచేసికొని యిట్లనియె.

మిత్రుడా! సుగ్రీవుడా! నాకుబ్రియురాలగు సీత బ్రతికియున్నదా? లేదా? యనిముందుగా దెలిసికొనవలయును. రావణాసురుడు ఏదేశమునందు నివసించుచున్నాడో యాదేశమునుగూడ దెలిసికొనవలయును. మనవానరభటులందఱును సీతయున్నచోటును, రావణాసురునియొక్క వాసస్థానమును దెలిసికొనివచ్చిన పిమ్మట ఏమిచేయవలయునో యాకార్యమును గురించి యోచింతము. వానరాధిపతివైన యోసుగ్రీవుడా! ఇప్పటికార్యమునందు నాకుశక్తిలేదు. లక్ష్మణునకును శక్తిలేదు. వానరాధిపతివైన యోసుగ్రీవుడా! ఈకార్యమునకు సర్వమునకును నీవుప్రభుడవు. కావున ప్రభుడవైన యోసుగ్రీవుడా! నాయొక్క కార్యనిశ్చయమును యోచించి నీవేయీవానరభటుల కాజ్ఞనివ్వుము. వీరుడవైన యోసుగ్రీవుడా! ఇప్పుడు చేయదగిన కార్యమేదియో దానిని నీవెఱుగుదువు. ఇందుకేమియును సందేహములేదు.

ఇవ్విధముగా రాముడు చెప్పిన మాటలను విని పరమమిత్రుడును, పరాక్రమముగలవాడును, విశేషసంగతులను దెలిసినవాడును, కాలవిశేషమును దెలిసినవాడును, సకలకార్యములను నెఱిగినవాడును, కృతార్థుడును, నగు సుగ్రీవుడు వినతుడనే పేరుగలవాడును, పర్వతమువంటివాడును, మేఘధ్వనివంటి ధ్వనిగలవాడును, నగు వానరోత్తముని జూచి రామలక్ష్మణు లిరువురును వినుచుండగ నిట్లనియె.

వానరోత్తముడవైన యోవినతుడా! దేశకాలములను జక్కగా దెలిసినవారును, చంద్రసూర్యుల యంశమునందు బుట్టినవారును, నగు వానరోత్తములను వెంటబెట్టుకొని కార్యాకార్యములను వారలతో నాలోచించుచు ననేకవేల వానరవీరులతో గూడ తూర్పుదిక్కునకు బొమ్ము. ఆదిక్కునందనేకములగు పర్వతములును, అరణ్యములునుగలవు. ఆస్థలములలో సీతయెచ్చటనున్నదియును, రావణాసురుని వాసస్థానమేదియై నదియును దెలిసికొనిరమ్ము. మఱియు బర్వతశిఖరములయందును, వనములయందును, నదులయందును జక్కగా వెదకుము మఱియు మిగుల రమ్యమగు భాగీరథిని, సరయూనదిని, కౌశికనదిని, కాళిందీనదిని, రమ్యమగు యమునానదిని, యామునమనియెడు మహాపర్వతమును, సరస్వతీనదిని, సింధునదిని, మణులయొక్క కాంతివంటికాంతిగల యుదకముతో గూడిన శోణనదిని, సామాన్యమగు భూమిని, పర్వతములచేతను, అరణ్యములచేతను, ప్రకాశించుచుండుటచేత నల్లనగు భూమిని, బ్రహ్మమాలాదేశములను, విదేహదేశములను, మాళవదేశములను, కాశీదేశములను, కోసలదేశములను, పెద్దపెద్దగ్రామములుగల మగధదేశములను, పుండ్రదేశములను, అటులనే వంగదేశములను, కోశకారులనియెడు రాజులయొక్క పట్టణమును, వెండిగనులుగల దేశములను, జక్కగ వెదకవలయును, మఱియు నోవినతుడా! ఇప్పుడు నేను జెప్పిన దేశములయందంతటను వెదకి రామున

కు భ్రియురాలును, దశరథమహారాజు నకుగోడలును, నగు సీతాదేవిని దెలిసికొనిరమ్ము. మఱియునో వినతుడా! సముద్రమునందు మునిగియున్న పర్వతములను, సముద్రము లోని దీవులయందలి పట్టణములను, మందరపర్వతము నాశ్రయించుకొని యున్నవియును, విశాలములును నగుపట్టణములను, వెదకవలయును. మఱియునో వినతుడా! మందర కోటిని నాశ్రయించినవారును, వ్రేలాడుచున్న చెవులుగలవారును, పెదవులవఱకును వ్యాపించిన చెవులు గలవారును, లోహముఖులును, ఒక్కపాదము గలవారును, బలముగలవారును, నాశములేనివారును, కర్ణచూడులును, పురుషులను దినువారును, బంగారపు దేహకాంతులు గలవారును, భయంకరమైన కిరాతులునివసించు ప్రదేశములను జక్కగ వెదకుము. ఆప్రదేశములకవ్వల నుదకములయందు సంచరించువారును, ద్వీపములయందుండువారును, పచ్చిచేపలను దినువారును, భయంకరమైన యాకారములు గలవారును మానవరూపములను, పెద్దపులియొక్క రూపములవంటి రూపముగలవారును, మఱికొందఱు కిరాతులుగలరు వారువసించెడు పట్టణములయందుగూడ సీతనువెదకుము. మఱియునో వినతుడా! ఆదేశములకవతల గుప్పిగంతులచేత దాటదగినవియును, తెప్పలచేతదాట దగినవియును నగు ద్వీపములలో వెదకవలయును దానికవతలనుండు యవద్వీపమున కొక్కయుపద్వీపముగలదు. ఆద్వీపమునందు రత్నము లపరిమితముగాగలవు. మరియునాద్వీపమునందు ఏడురాజ్యములుగలవు మరియు నారాజ్యములేడును, సువర్ణరూప్యకములును, సువర్ణాకరమండితములును నై యుండును. ఆదేశములనన్నింటిని జక్కగ వెదకిరమ్ము. ఆ యవద్వీపమున కవ్వలశిశిరమనియెడు పర్వతముగలదు దానిశిఖరము లంతరిక్షమునొరయుచుండును. మరియునాపర్వతమునందు దేవదానవులు తిరుగుచుందురు. అట్టిపర్వతముయొక్క దుర్గములయందును, చరియలయందును, వనములయందును మిగులజాగ్రతతో సీతనువెదుకవలయును. పిమ్మటనో వినతుడా! ఎఱ్ఱనియుదకము గలదియును, వేగముగా బ్రవహించునట్టిదియును, నగుశోణనది సమునకవ్వలి ప్రదేశమునందున్నది. ఆమహానదినిసిద్ధచారణాదులుసర్వకాలములయందును సేవించుచుదురు. మఱియునానదియందలి తీర్థములుమిగుల రమ్యములును, విచిత్రములగు వనములు గలవియునునైయున్నవి అట్టిప్రదేశము లన్నిటియందును సీతనురావణాసురుని జక్కగావెదకుము మఱియునక్కడనుండునట్టి పర్వతములవలన బుట్టిననదులు మిగులరమ్యములును, అనేకములగు నుద్యానవనములుగలవి యునునైయున్నవి. అట్లురమ్యములైనవియును, చరియలుగలవియును, నగుపర్వతములందును, వనములయందును సీతనుజక్కగావెదకుము. పిమ్మటనో వినతుడా! మిగులభయంకరములగు సముద్రములను, ద్వీపములనుజూడుము. దానికవ్వలదరంగములు గలవియును, గాలిచేతవ్యాకులమైనదియును, నగుసముద్రముగలదు. దానియందుమిగుల గొప్పవగుశరీరములుగల రాక్షసులు సర్వకాలములయందును ఛాయాగ్రహములై యుందురు. ఆరాక్షసులుచిరకాలము ఆకలిచేత బీడింపబడినవారై బ్రహ్మదేవునియాజ్ఞనుబొంది యావిధముగా ఛాయాగ్రహములై యుందురు. దానికవ్వల మేఘములయొక్క కాంతివంటికాంతిగలదియును, గొప్పవగుసర్పములచే సేవింపబడుచున్నదియును, మహానాదము గలదియును, నగుసముద్రముగలదు. దానికవ్వల నెఱ్ఱని జలముగలదియును, భయంకరమైనదియును, నగులోహిత సముద్రముగలదు. దానియందంతటను జక్కగావెదకుము పిమ్మటమిగుల బెద్దదియగు కూటశాల్మలికిబొమ్ము. అక్కడనానావిధములగు రత్నములచేత నలంకరింపబడిన గరుత్మంతునిగృహము గలదు. అదికైలాసపర్వతమువలె మిగుల దెల్లగానుండును. మరియునదివిశ్వకర్మచేత నిర్మింపబడినది కావుననదిమిగుల విచిత్రముగాను, ప్రవేశింపనలవిగానిదియునునై యుండును. అక్కడననేకములగు పర్వతములుగలవు. వానియందు బర్వతములవలె మిగులబెద్దవగు నాకారములుగలవారును, మిగులభయంకరులును, నానావిధములగు నాకారములుగలవారును, నగుమందేహులనియెడు రాక్షసులుగలరు. వారుపర్వతములయందువ్రేలాడుచుందురు. వారుదినదినమందును, సూర్యోదయకాలమున ఉదకములయందు బడుచుందురు. ఆరాక్షసులు ప్రతిదినమునందును బ్రాహ్మణులమంత్రములచేత గొట్టబడుచుందురు. మరియునామందేహులనియెడు రాక్షసులుసూర్యునిచేత దపింపజేయబడినవారై వ్రేలాడుచుందురు. ఆప్రదేశమునకవ్వలదెల్లని మేఘములయొక్క కాంతివంటికాంతిగల క్షీరసముద్రము గలదు ఆసముద్రమునందు బ్రవేశించుటకునలవిగాని యలలుఅపరిమితముగా బుట్టుచున్నది. ఆతరంగములన్నియు ముత్యాలహారములవలె బ్రకాశించుచుండును. ఆసముద్రమునందంతటను నీపరివారజనముతోగూడ జక్కగావెదకుము. ఆసముద్రమధ్యయందు గొప్పదియును, మిగులదెల్లనిదియును, నగుఋషభపర్వతముగలదు. ఆపర్వతముమిగుల బరిమళించుచున్న పుష్పములతోగూడిన వృక్షములచేత వ్యాప్తమైయుండును. మరియు నాపర్వతమునందు బ్రజ్వలించు చున్నవియును, బంగారపు కింజల్కములుగలవియును, నగుపద్మములచేతను, రాజ

హంసలచేతను, వ్యాప్తమైనదియును, సుదర్శనమనుపేరుగలదియుచునగు నొక్కసరోవరముగలదు. ఆమడుగునందు దేవతలును, చారణులును, యక్షులును, కిన్నరులును, అప్సరస్త్రీలును, మరియునితరులగు దేవతలును, మిగులసంతోషములతో గ్రీడించుదురు. ఆప్రదేశముల నన్నింటిని వెదకుము వానరోత్తముడవైన యోవినతుడా ! పిమ్మటనాక్షీరసముద్రమును దాటిసకల భూతములకును భయమునుగలుగఁజేయునదియును, సప్తసముద్రములలో నుత్తమమైనదియును నగుజలోదమనియెడు సముద్రమునుఁజూడుము ఆసముద్రమునందు పూర్వముఔర్వమునియొక్క కోపాగ్నిగుఱ్ఱపుముఖగలదై చేయబడియుంచబడినది. ఆబడబాగ్నిక్షిప్రళయకాలమునందు జరాచరాత్మకమైన ప్రపంచంబంతయును భక్షింపదగిన పదార్థమైయుండును. మరియుమిగుల వేగముగల యాసముద్రోదకము ఆబడబాగ్నికిక్కట్టైలై యుండును. ఆబడబాగ్నియొక్క ముఖమునుఁజూచి మిగులభయముచేత వ్యసనమును బొందుచున్నవారును, ఆసముద్రమునందే నివసించుచున్నవారును. మిగులసమర్థులును, నగువారియొక్క భయంకరమైన ధ్వనివినబడును. తియ్యనియుదకముగల యాసముద్రమునకు ఉత్తరభాగమునందు బదమూడుయోజనముల వెడల్పుగలదియును, బంగారపుశిలలుగలదియును నగుబంగారపుకొండగలదు. ఆపర్వతముసకల పర్వతములకంటె నుత్తమంబైనదని యెన్నబడును, ఆపర్వతమునందు జంద్రునివలెప్రకాశించు చున్నవియును, సకలభూమండలమును ధరించినదియును, పద్మపత్రములవలె విశాలములగు నేత్రములుగలదియును, నగునొక్కమహాసర్పము గలదు. అదియేయాదిశేష నామకసర్పమనబడును. ఆమహాసర్పమును నీవానరసముదాయముతో గూడజూడుము పిమ్మటనాపర్వతముయొక్క యగ్రభాగమునందు గూర్చున్నవాడును, సకలభూతములచేతను నమస్కరింపబడినవాడును, వేయిశిరస్సులు గలవాడును, నల్లనివస్త్రమును ధరించినవాడును, నగుఅనంతుడుగలడు. ఆమహానుభావునకు మూడుతలలుగలదియును, బంగారముచేత నిర్మింపబడినదియునునగు తాలధ్వజముగలదు ఆధ్వజముఆపర్వతముయొక్కయగ్రభాగమునందొక తిన్నెమీదస్థాపింప బడియున్నది. లదియాతూర్పు దిక్కునందుండునట్లు దేవతోత్తములచేత నిర్మింపబడినది. ఆప్రదేశముల యందంతటను సీతనువెదకుము. దానికవతలసువర్ణమయమగు నుదయపర్వతముగలదు దానియొక్కయంచు నూరామడవెడల్పు గలదైయుండును. మరియునాపర్వతశిఖరములు దేవలోకమువఱకును వ్యాపించియుండును. ఆయంచుబంగారముచేత నిర్మింపబడినదియును, మిగులమనోహరమైనదియును, నగువేదికతో గూడుకొనినదై యుండును మరియునాపర్వతము పేపిచెట్లచేతను, తాటిచెట్లచేతను, పుష్పించినకొండ గోగుచెట్లచేతను, సూర్యునియొక్క కాంతివంటికాంతి గలవియును, సువర్ణమయములును, శ్రేష్ఠములును, నగుపుష్పములుగల వృక్షములచేత, మిగులమనోహరముగా ప్రకాశింపజేయబడుచుండును. మరియునాపర్వతమునందు ఆమడవెడల్పుగలదియును, పదియామడలయెత్తుగలదియును, సువర్ణవికారమైనదియునునగు సౌమనసమనియెడు శిఖరముగలదు. ఆయంచునందు, పూర్వమువిష్ణుదేవుడు త్రివిక్రమావతారమునందు ఆసౌమనసశృంగమునందు ఒకపాదమునుబెట్టి రెండవపాదమును, పశ్చిమదిక్కునకుఅవధిభూతమైనదియగు సౌవర్ణినివాసమేరు శిఖరమునందుబెట్టె సూర్యుడుమిగుల ఉన్నతమైనదగు నాపర్వతశిఖరమునుఅవలంబించి యుత్తరపుదిక్కునందు బగలునుగలుగజేయును. మరియునాపర్వతమునందు సూర్యునియొక్క యాకారమువంటి యాకారములుగలవారును, తపోవంతులలో నుత్తములును, నగువాలఖిల్యాదులనియెడు మహర్షులుగలరు మరియునాయుదయపర్వతమునకు బూర్వభాగమునందు సుదర్శనమనియెడు ద్వీపముగలదు. దానియందుసకల జంతువులయొక్క నేత్రములను ప్రకాశింపజేయునట్టి సూర్యునితేజస్సు మిగులమనోహరముగా ప్రకాశించుచుండును, వానరోత్తముడవైన యోవినతుడా ! నీవక్కడకుబోయి యాపర్వతశిఖర ములయందును, ఆపర్వతపుచరియలయందును, ఆపర్వతమునుఁజుట్టుకొనియున్న వనములయందును, ఒకవేళరావణాసురుడును, సీతయును, నుండవచ్చును. కావుననక్కడజక్కగా నీపరివారజనముతో గూడవెదకుము. మఱియునోవినతుడా ! ఆబంగారపుకొండయొక్క తేజస్సుతోడను, సూర్యతేజస్సుతోడనుగూడుకొనినదైపూర్వసంధ్య, రక్తచ్ఛాయచేత దేజరిల్లును, మఱియునిదిపూర్వము బ్రహ్మదేవునిచేత భూమికిని భువనమునకును బ్రథమద్వారముగా సృష్ట్యాదియందు గల్పింపబడినది. మఱియునుసూర్యపరిభ్రమణముకొఱకు మొదటనిది యుదయస్థానముగా గల్పింపబడినది. ఆకారణముచేత నిదిపూర్వదిక్కనబడును. ఆపర్వతప్రాంతముల యందును, అందలికొండకాలువలయందును, గుహాలయందును, సీతను, రావణాసురుని జక్కగావెదుక వలయును. దానికిదూర్పునసుండు ప్రదేశమంతయును, సూర్య ప్రకాశము మొదలగు నవిలేకను, దేవతలుగలదిగను, చీకటిచేత నావృతమును, ఇతరులకుబొంద శక్యముగానిదియునై, యుండును, కావునమీరక్కడ నుండిపోజాలరు.

కాబట్టియంతవఱకును వెదకిపిమ్మటదిరిగి రావలయును మఱియునోవినతుడా! నాచేత జెప్పబడని పర్వతములను, కొండచరియలను, వనములను, మఱియునితరములగు ప్రదేశములనుజూచి యాస్థలములయందు సీతతోగూడ రావణాసురుని వెదుకవలయును, వానరులమగు మనమంతవఱకు నిస్సంశయముగా బోవచ్చును. సూర్యుడులేనిదియును, దిగ్విభాగాదులులేనిదియును, నగుప్రదేశములు మనకుదెలియవు కావునమనముపోదగిన ప్రదేశములకన్నిటికినిబోయి నెలదినములు అతిక్రమింపకముఖువు రావలయును. ముప్పదిదినములు గడచినపిమ్మట నొక్కదినమైన నుండగూడదు. వినతుడా! నీపరివారజనములోనెవ్వడుముప్పదొక్కదినమునందు వచ్చునోవాడునాచేత నురిదీయబడునని చెప్పును మీరుపోయిసీతనుజూచి కృతార్థులై రావలయును. మఱియునోవినతుడా! మీరందఱును దేవేన్ద్రునకు బ్రియమైనదియును, వనసముదాయముచేత నలంకరింపబడినదియును, నగుతూర్పుదిక్కునందంతటను సంచరించిరఘు వంశమునందు బుట్టినరామునకు బ్రియమైనసీతయున్న చోటునుదెలిసికొని సుఖముగాదిరిగిరందు చేయదగినకార్యములయం దశ్రద్ధను చేయకుడని సుగ్రీవుడుచెప్పె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదవసర్గ ముగిసెను

హనుమంతుడు మొదలగువారిని దక్షిణదిక్కునకుబంపుట

అవ్విధముగజెప్పి యాసుగ్రీవుడు గొప్పదగు వానరబలమును దూర్పుదిక్కునకుబంపి మిగులప్రసిద్ధములగు చరిత్రలుగలవారును, మిగులవేగమును, పరాక్రమము గలవారును, నగునీలుడు, అగ్నిసుతుడు, హనుమంతుడు, బ్రహ్మదేవునకుబుత్రుడును, మహాబలుడును, నగుజాంబవంతుడును, సుహోత్రుడును, శరారియును, శరగుల్ముడును, గజుడును గవాక్షుడును,గవయుడును, సుషేణుడును, ఋషభుడును, మైందుడును,ద్వివిదుడును,విజయుడును,గంధమాదనుడును, ఉల్కాముఖుడను,అసంగుడును, అగ్నిపుత్రులగు నిరువురును మొదలగునానరులను కాలవేత్తయగు సుగ్రీవుడుపిలిచి యావానరులకందఱకును, మహాబలుడగు నసంగుడనునానినధిపతిగా నియమించియిట్లనియె.

వానరోత్తములారా! మీరందఱును దక్షిణదిక్కునకు బోవలయునని చెప్పి వానరాధిపతియగు సుగ్రీవుడువారలతో దుర్గమములను, చూడదగినవియును, నగుప్రదేశములనన్నింటిని వేర్వేరవివరించి చెప్పదలచియిట్లనియె.

వానరోత్తములారా! ఆర్యావర్తమునకు దక్షిణభాగమునందున్నదియును, నానావిధములగు వృక్షములతోగూడినదియును, వేయిశిఖరములు గలదియును, అనేకవిధములగు తీగలతోగూడు కొన్నదియును, నగువింధ్యపర్వతమునకు ముందుగాబొండు. పోయియందలి ప్రదేశములనన్నింటిని జక్కగావెదకుడు. పిమ్మటదానికవ్వలనుండు గోదావరినదిని, రమ్యమగుకృష్ణవేణిని, వరదానదిని, గొప్పవగుసర్పములుగల మహాభాగను, మేఖలను, ఉత్కలన, దశార్ణపట్టణములను, ఆశ్వవంతిని, అవంతిని, మఱియనితరములగు వానినిసర్వమును వెదకుడు. వెదకివెదకి చక్కగాజూడుడు. మఱియునటులనే విదర్భదేశములను, ఋషికదేశములను, రమ్యములగు మాహిషకములను, పర్వతములతోడను, నదులతోడను, గుహలతోడను, గూడుకొన్న దండకారణ్యమును, గోదావరీనదీఖండములను,మఱియునందలి యితరప్రదేశములను, జక్కగబరిశీలించి వెదకుడు. మఱియునోవానరోత్తములారా! ఆప్రకారముగనే యాంధ్రదేశములయందును, పుండ్రదేశములయందును, చోళదేశములయందును, పాండ్యదేశములయందును, కేరళదేశములయందును, జక్కగబరిశీలించి వెదకుడు. పిమ్మటధాతువులచేతనలంకరింపబడినదియును, ప్రసిద్ధములగు శిఖరములుగలదియును, సంపత్కరమైనదియును, పుష్పించినయరణ్యము గలదియును, చందనవనములతో గూడుకొనినదియును, నగుసహ్యపర్వ మహాపర్వతమునకుబోయి యచ్చోటజక్కగావెదకుడు. పిమ్మటనక్కడమిగుల శ్రేష్ఠమైనదియును, నిర్మలమైనయుదకముగలదియును, మంగళకరమైనదియును, అప్సరోగణములచేత సేవింపబడినదియును, నగుకావేరీనదినిజూడుడు మఱియునాకావేరీనది యంతటను వెదకుడు. మఱియునోవానరోత్తములారా! అమలయపర్వతముయొక్క యగ్రభాగమునందు గూర్చున్నవాడును, గొప్పదగు తేజస్సు గలవాడును, సూర్యునితోసమానుడును, నగుఅగస్త్యమహామునిని జూడుడు. పిమ్మటనిర్మలుడును, మహానుభావుడును, నగునయ్యగస్త్య మహామునియొక్క యాజ్ఞనుబొందిపిమ్మట మొసళ్లచేతవ్యాప్తమైన తామ్రపర్ణి మహానదినిదాటుడు చందనవనములచేత వ్యాప్తమైనదియును, ద్వీపములచేత నొప్పుచున్నదియునునగు నాతామ్రపర్ణినది, "మనోహరురాలును, వయోవంతురాలును, నగుస్త్రీరత్నము భర్తనుబొందు విధముగ" సముద్రమును బొందుచున్నది.

ఓవానరోత్తములారా! పిమ్మట హేమమయమైనదియును, మిగులశ్రేష్ఠమైనదియును, ముత్యములచేతను, మణులచేతను నలంకరింపబడినదియును, నగుపాండ్యులయొక్క

కవాటమునుజూడుఁడు. పిమ్మటసముద్రతీరమునకుఁబోయి కార్యములను జక్కగా యోచింపుఁడు. ఆసముద్రమధ్యయందగస్త్యమునివరునిచేతఁ బ్రవేశపెట్టఁబడినదియును, చిత్రములును, నానావిధములును నగు వృక్షములుగలదియును, సంపత్కరమైనదియును, సువర్ణ మయమైనదియును, నగుమహేంద్రపర్వతము ఆసముద్రమునందు మునిఁగియున్నది మఱియు నోవానరోత్తములారా! నానావిధములగు వృక్షములచేతను, నానావిధములగు తీగలచేతను నలంకరింపఁబడినదియును, దేవర్షులచేతను, శ్రేష్ఠులగుయక్షులచేతను, అప్సరోగణములచేతను సేవింపఁబడుచున్నదియును, సిద్ధులయొక్కయు, చారణులయొక్కయుసమూహములచేత వ్యాప్తమైనదియును, మిగులమనోహరమైనదియును, నగునామహేంద్రపర్వతము దగ్గరకు దేవేంద్రుడు ప్రతిపర్వమునందునువచ్చుచుండును. ఆసముద్రముయొక్క యవ్వలిగట్టునందు నూరామడవెడల్పుగల ద్వీపమొక్కటిగలదు. ఆద్వీపముమనుష్యులచేతఁ బొందశక్యముగానిదై యుండును కావుననట్టిద్వీపమునందంతటను జక్కగా వెదకుఁడు. మఱియు నోవానరోత్తములారా! ఆద్వీపమునందు మీరు సీతాదేవిని సర్వవిధములచేతను వెదకవలయును. దుర్మార్గుఁడును, చంపఁదగినవాఁడును, నగునారావణాసురుడు ఆద్వీపమునందు నివసించుచుండును. దేవేంద్రునితోసమానుఁడగు నారావణాసురుఁడు ఆదేశమును సర్వకాలములయందును పాలించుచుండును. ఆదక్షిణసముద్రముయొక్క మధ్యప్రదేశమునందు ఛాయ నాకర్షించునట్టిదియును, మిగులఁ బ్రసిద్ధమైనదియునునగు నంగారక యనుపేరుగల రాక్షసిగలదు కావునమీరు మిగులజాగ్రతతో సంచరింపవలయును. మఱియు నోవానరోత్తములారా! మీరందఱును నిర్విఘ్నముగా సంశయములనుబోఁగొట్టుకొని యపరిమితమగు తేజస్సుగల రామునిభార్యను వెదకుఁడు మఱియు నోవానరోత్తములారా! దానికవతలనూరుయోజనములుగల సముద్రమునందు మిగులసంపదగలదియును, సిద్ధులచేతను, చారణులచేతను సేవింపఁబడుచున్నదియును, నగుపుష్పితకమనియెడు పర్వతముగలదు అదిచంద్రునియొక్కయు, సూర్యునియొక్కయు, కాంతితోసమానమైనదియును, సాగరోదకముచేత వ్యాప్తమైనదియును, నైవిపులములగుశిఖరములచేత నాకాశమును నొరయుచున్నదానివలెనున్నది. మఱియునాపర్వతశిఖరములలో నొకటిబంగారుశిఖరము. దానిని సూర్యుఁడు ఆశ్రయించుచుండును. మఱియొకశృంగము వెండిశిఖరము. దానియందుఁ జంద్రుఁడు తిరుగుచుండును. ఆపర్వతమును, చేసిన మేలునుమఱచినదుర్మార్గులును, ఘాతనుజేయువారును, నాస్తికులును, నగువారలు చూడఁజాలరు. మఱియు నోవానరులారా! ఆపర్వతమునకు శిరస్సునువంచి నమస్కారమునుజేసి, పిమ్మట సీతాదేవినివెదకుఁడు. మఱియునితరులచేతనెదిరింపనలవిగాని యోవానరులారా! ఆపుష్పితక పర్వతమునకవతల సూర్యవన్నామకపర్వతముగలదు. ఆపర్వతముపదునాలుగామడ వెడల్పుగలది. కావున నామార్గము యితరులచేతఁ బ్రవేశింపనలవిగానిది. ఆపర్వతమునకవతల వైద్యుతమనియెడు పేరుగల పర్వతముగలదు. మఱియు నాపర్వతముసర్వజనులచేతను గోరఁదగినఫలములు గలవియును, సర్వకాలములయందును మనోహరములైనవియును, నగువృక్షములతోఁగూడియుండును. మఱియు నక్కడ మిగులశ్రేష్ఠములగుమూలములును, ఫలములునుగలవు వానినన్నింటిని మీరుయథేచ్ఛముగా ననుభవింపుఁడు మఱియు నోవానరోత్తములారా! అక్కడ మిగులముఖ్యములగు మకరందములుగలవు కావున నామద్యములను దృప్తిగాఁ బానమునఁజేయుఁడు మఱియు నోవానరోత్తములారా! అక్కడనేత్రములకును, మనస్సునకును, ప్రియముగు కుంజరమనియెడు పర్వతముగలదు. ఆపర్వతమునందు అగస్త్యమునీశ్వరునకు విశ్వకర్మచేతనిర్మింపఁబడిన గృహముగలదు. ఆగృహముఆమడవెడల్పును, పదియామడపొడవునుగలదైయుండును మఱియు నాగృహముబంగారముచేత నిర్మింపఁబడిరత్నములచేతఁ జెక్కఁబడిమిగులమనోహరముగనున్నది దానికిసమీపమునందు సర్పములకునివాసస్థానమైన భోగవతియనియెడు పర్వతము గలదు మఱియునోవానరోత్తములారా! విశాలములగుతొట్టికట్లుగల యాభోగవతీ పట్టణముమిగుల భయంకరములయినవియును, మిగులఁదీక్ష్ణములయిన కోఱలుగలవియును, మిగుల నధికమగు విషముగలవియును, నగుసర్పములచేతఁగాపాడఁబడుచున్నదగుటచేత నితరులకుఁబ్రవేశింపనలవిగానిదైయున్నది. ఆపట్టణమునందు వాసుకియనియెడు ప్రాజ్ఞుఁడగుసర్పరాజు నివసించుచున్నాఁడు. ఆభోగవతీపట్టణమునందు అందంతటను జక్కగాఁబరిశీలించి వెదుకవలయును. మఱియునోవానరోత్తములారా! ఆభోగవతీ పట్టణమునకు సమీపమునందుఁ గొన్నిదేశములు గలవు ఆదేశములయందంతటను జక్కగావెదకవలయును పిమ్మట నాదేశమునతిక్రమించి గొప్పఋషభపర్వతముగలదు. మఱియు నోవానరోత్తములారా! సంపత్కరమైనదియును, నానావిధరత్నమయమైనదియును, నగునాఋషభ పర్వతమునందుఁజక్కగాఁబరిశీలించి వెదకవలయును. మఱియునా

ఋషభపర్వతమునందు గోరోచనముతో సమమైన వర్ణముగలదియును, పద్మదళములతో సమానమైన కాంతిగలదియును, తమాలదళములతో సమమైనవర్ణముగలదియును, అగ్నితో సమానమైనవర్ణముగలదియును, దివ్యమైనదియును, నగు చందనవృక్షములసమూహముగలదు. వానరోత్తములారా! ఆచందనవృక్షసముదాయము మీచేతఁ జూడఁదగినదేగాని స్పృశింపఁదగినది గాదు. ఆచందనవనమును రోహితులనియెడు గంధర్వులు పరిపాలించుచుందురు. మఱియు నావనమునందు సూర్యునితో సమానమైనకాంతిగలవారును, శైలూషుఁడు, గ్రామణి, శిగ్రుఁడు, శుభ్రుఁడు, బభ్రువు, అనియెడు నైదుగురు గంధర్వపతులు నివసించుచుందురు, ఆయైదుగురును సూర్యచంద్రులయొక్క కాంతివంటి కాంతిగలవారు. మఱియునోవానరోత్తములారా! ఆచందన వనమునందు పుణ్యాత్ములగువారు నివసించుచుందురు. మఱియు నాభూమికవతల స్వర్గమునుజయించినవారును, ఇతరులచేత నెదిరింపనలవిగాని వారును నుందురు. దానికవతలిప్రదేశమునకు మీరుపోఁగూడదు. అది మిగులదారుణమగుపితృలోకము. అక్కడఁజీకటిచేతవ్యాప్తమైనయమునియొక్క రాజధానిగలదు వానరోత్తములారా! మీరు ఆయమునిరాజధానికిఁ బోఁదగిన వారుగారు. మఱియు నాప్రదేశము మనవంటివారిచేతఁ బ్రవేశింపనలవిగాదు. కావునమీరక్కడకుఁ బోఁగూడదు. ఓవానరోత్తములారా! ఇప్పుడు నాచేతఁజెప్పబడిన ప్రదేశములనేగాకమఱియు నితరములగుప్రదేశములను గూడవెదుకవలయును. వెదకివెదకిసీతయొక్క నివాసమును దెలిసికొనిరావలయును. మీలోనెవ్వఁడుమాసముదినములలోపలసీతావృత్తాంతమును దెలిసికొనివచ్చిముందుఁగాఁజెప్పునో వాఁడు నాభోగములతోసమానములగు భోగములుగలవాఁడై ప్రవర్తించును. మఱియు నానావిధములగు సుఖములుగలవాఁడగును. అట్టివాఁడు నాప్రాణములకంటె నాకిష్టుఁడు. మఱియునువాఁడు తప్పునుజేసినను నాకుబంధువుఁడైయుండఁగలఁడు. అపరిమితములగు బలపరాక్రమములు గలవారును, విపులములగు గుణములును, కులములుగలవారును, నగునోవానరోత్తములారా! మీరందఱునుబురుషార్థమునకు యత్నించినవారై సీతాదేవియున్నచోటును దెలిసికొనివచ్చుటకుఁదగిన యత్నమును దృఢముగాఁ జేయవలయుననిచెప్పె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదొకటవసర్గ ముగిసెను.

సుషేణుడు మొదలగువారిని పశ్చిమదిక్కునకు బంపుట.

అవ్విధముగా సుగ్రీవుఁడు ఆవానర శ్రేష్ఠులను దక్షిణదిక్కునకు బంపినపిమ్మట మేఘకాంతివంటి కాంతిగలవాఁడును, వానరయూథనాథుఁడును, తారకుఁదండ్రియును, మిగులభయంకరమైన పరాక్రమము గలవాఁడును, నగుసుషేణునకుఁ జేతులనుముకుళించుకొని నమస్కారమునుజేసి సవినయముగనతనితో నిట్లనియె. మామా! మహర్షిపుత్రుఁడును, అర్చిష్మంతుఁడును, వానర వీరులచేతఁ జుట్టబడినఁవాఁడును, దేవేంద్రునియొక్క కాంతితో సమమైన కాంతిగలవాఁడును, బుద్ధివిక్రమములుగలవాఁడును, గరుత్మంతుని కాంతితోసమానమగుకాంతిగలవాఁడును, నగుమరీచిని, మఱియుఁ దేజోమాలికలుగలవారును, మహాబలులును, నగుమారీచులను, మఱియునితరులగు ఋషిపుత్రులను వెంటఁబెట్టుకొనిపోయి పశ్చిమదిక్కునుసర్వమును వెదకి సీతాదేవియున్నచోటును దెలిసికొని రావలయునని ప్రార్థించుచున్నానని చెప్పి మఱియు నిట్లనియె.

సుషేణుఁడు మొదలుగాఁగల యోవానరోత్తములారా! మీరందఱును రెండుకోట్లవానరులను వెంటఁబెట్టుకొనిపోయి సీతాదేవిని వెదకియెక్కడనున్నదియును దెలిసికొనవలయును. వానరోత్తములారా! మీరు సురాష్ట్రదేశములను, శూరులును, భయంకరులును, నగువీరవరులు గల బాహ్లీకదేశములను, మఱియుఁ జక్కగాఁబ్రకాశించుచున్నవియును, రమ్యములైనవియును, నగుదేశములను, నగరములను, జక్కగావెదకవలయును. ఇంతయగాకవకుళవృక్షములచేతను, విరిగిచెట్లచేతను, మఱియు నితరములగువృక్షములచేతను, వ్యాప్తమైనకేతుమాలపర్వతమునందునుదానియొక్కపార్శ్వప్రదేశములయందునుజక్కగా వెదకవలయును. వానరాధిపతులైనయోవానరవీరులారా! ఆప్రకారముగానే కేతకషండములను వెదకుఁడు మఱియునుఁ బశ్చిమాభిముఖముగాఁ బ్రవహించు చున్నవియును, పవిత్రములైన యుదకములుగలవియును, నగునదులయందుఁ జక్కగావెదకుఁడు మఱియునోవానరోత్తములారా! తపోవంతులయొక్క యరణ్యములను, మఱియునితరములగువనములను, పర్వతములను వెదకుఁడు. పిమ్మట మరుభూమినిబొంది మిక్కిలి ఉన్నతములగు శిరస్సుగలశిలలుగలపర్వతములను వెదకుఁడు. మఱియు నోవానరోత్తములారా! పర్వతసముదాయములచేత నావరింపఁబడిన దుర్గములను వెదకుఁడు. ఇంతయగాక పశ్చిమదిక్కును సర్వమును వెదకుఁడు. అట్లుపశ్చిమదిక్కును సర్వమును వెదకి

పిమ్మట సముద్రమును జూడుఁడు. ఓవానరోత్తములారా! పిమ్మట తిములని యెడు చేపలచేతను, నక్రములచేతను, భయంకరమైనదియును, మిగుల దుర్గమమగు నుదకముగలదియునునగు పశ్చిమసముద్రమును జూడుఁడు. పిమ్మటఁ గేతకవనములయందును, తమాల వనములయందును, నారికేళ వనములయందును, వానరులగు మీరందఱును విహరించుచుఁ జూడుఁడు. మఱియు నక్కడక్కడ రావణాసురుని యొక్క నివాసస్థానములుగలవు. వానియం దొకవేళ సీతామహాదేవి యుండినను నుండవచ్చును. మఱియు నోవానరోత్తములారా! ఆపశ్చిమసముద్రము యొక్క తీరములయందున్న పర్వతముల యందును, వనములయందును, జక్కగా వెదకుఁడు. మఱియు నాపశ్చిమదిక్కునందున్న రమ్యమగు మురచీపట్టణమును, రమ్యమగు జటీపురమును, అవంతీపురమును, అంగలోపనామక నగరమును, అటులనే చూచుటకుఁ గూడశక్యముగాని వనమును, విశాలములగు దేశములను, పట్టణములను, వెదకిచూడుఁడు. ఓవానరోత్తములారా! సింధుసాగరముల యొక్క సంగమమునందు నూరుశిఖరములుగలదియును, గొప్పవగు వృక్షములుగలదియును, మిగుల గొప్పదియును, నగు హేమగిరిగలదు. ఆపర్వతము యొక్క రమ్యములగు చరియలయందు సింహములుగలవు. మఱియు నాపర్వతము యొక్క చరియలయందు తిములు, మత్స్యములు, ఏనుగులును, నివసించుచుండును. అట్టిజంతువుల యొక్క నివాసస్థానములను జక్కగా వెదకుఁడు. మఱియు నోవానరోత్తములారా! ఆపర్వతమునందు మిగుల మదించినవియును, ఉన్నతములైనవియును, మేఘగర్జనమువంటి గర్జనముగలవియును, నగు నేనుఁగులుగలవు. ఉదకముచేత నిండినదియును, విశాలమయినదియును, నగు నాపర్వతమునందుఁ బ్రవేశించి వెదకుఁడు. ఆపర్వతము యొక్క శిఖరము ఆకాశము వఱకును, వ్యాపించి యుండును. ఇంతయగాక చిత్రములైన వృక్షములగలదియును, బంగారముచేత వ్యాప్తమైనదై మిగుల మనోహరముగాఁ బ్రవహించుచున్నది అట్టిపర్వతమును సర్వమును గామరూపులగు మీరందఱును జక్కగా వెదకుఁడు. సముద్రమునందలి యాపారియాత్రపర్వతము యొక్క స్వర్ణమయమగు శిఖరము నూరామడపొడవుగలదై యుండును. ఓవానరోత్తములారా! ఆపర్వత శిఖరము చూచుటకుఁ గూడ నలవిగానిదై యుండును మఱియు నాపర్వతశిఖరమునందు మిగులఁ దేజోవంతులగు నిరువదినాలుగుకోట్ల గంధర్వులుగలరు. ఆగంధర్వులందఱును మిగుల భయంకరమైన యాకారములు గలవారు. కామరూపులు. అగ్నిసమానవర్ణులు. మఱియు వారందఱును అపరిమితములగు బలపరాక్రమములు గలవారు. కాఁబట్టి మీరు వారు నివసించుచున్న దేశములయందలి ఫలములు మొదలగువానిని తాకకూడదు. అధికమగు పరాక్రమముగలవారును, వీరులును, సత్వవంతులును, భయంకరులును, నగు వారలు ఆపర్వతమునందలి ఫలమూలాదులను సర్వకాలములయందును గాపాడుచుందురు. కావున మీరక్కడ మిగులఁ బ్రయత్నమును జేసి సీతను వెదుకవలయును. వానరులగు మీకు వారివలనఁ గొంచెమైనను భయములేదు. కావున మీరాస్థలములయందును జక్కగా వెదకుఁడు. మఱియు నో వానరోత్తములారా! అక్కడ వైడూర్యవర్ణమువంటి వర్ణముగలదియును, వజ్రసంస్థానముగలదియును, నానావిధములగు వృక్షములతోడను, లతలతోడను గూడుకొన్నదియును, నగు వజ్రమని యెడు పేరుగల మహాపర్వత మొక్కటిగలదు. మఱియు శ్రీమంతమగు నాపర్వతము నూరామడ వెడల్పుగలది. మఱియు నక్కడనున్న గుహలను వానరులగు మీరు మిగుల బ్రయత్నపూర్వకముగ వెదుకవలయును. మఱియు నోవానరోత్తములారా! ఆదక్షిణదిక్కునందలి సముద్రము యొక్క నాల్గవభాగమునందు చక్రవత్పర్వతముగలదు. అక్కడ విశ్వకర్మ యొక్క వేయియంచుగల చక్రముగలదు. అక్కడఁ బురుషోత్తముఁడగు నారాయణుఁడు పంచజనుఁడను రాక్షసునిఁ జంపి పాంచజన్యమును, హయగ్రీవుఁడను రాక్షసుని జంపి శంఖమును నపహరించె. ఆపర్వతము యొక్క చిత్రములగు చరియల యందును, విశాలములగు గుహలయందును, రావణాసురుఁడు సీతతోఁ గూడ నుండవచ్చును. కావున నాస్థలమునందు సీతను జక్కగా వెదుకవలయును. దానికవతల నరువదియోజనముల పరిమితిగల వరాహమని యెడు పర్వతముగలదు. ఆపర్వతము బంగారపు శిఖరములుగలదియును, శ్రీమంతమును నై మిగుల లోతగు సముద్రమునందుఁ బ్రకాశించుచున్నది. అక్కడ బంగారముచేత నిర్మింపఁబడిన ప్రాగ్జ్యోతిష మని యెడు పట్టణముగలదు. ఆపట్టణమునందు దుష్టాత్ముఁడగు నరకుఁడని యెడు రాక్షసుఁడు గలఁడు. ఆపర్వతమునందుఁ జిత్రములగు చరియలును, విశాలములగు గుహలును గలవు. వానియం దొకవేళ రావణాసురుఁడు సీతతోఁ గూడ సంచరించినను సంచరింపవచ్చును. కావున నక్కడఁ జక్కగా వెదకుఁడు. ఆపర్వతమున కవతల బంగారముచేత వ్యాప్తమైన గుహలుగలదియును, సువర్ణమయమైనదియును, ధారాప్రస్రవణాయుతమును నగు పర్వతముగలదు. ఆపర్వతమునందు మదపుటేనుఁగులును, మదించిన సింహములును, మదించిన పెద్దపులులును, మిగుల దర్పముతో భయంకరముగా గర్జించుచుం

డును. పూర్వమామేఘవత్పర్వతమునందు పచ్చనిగుఱ్ఱములుగలవాఁడును, శ్రీమంతుఁడును, పాకుఁడనియెడు రాక్షసునిజంపినవాఁడును, నగుదేవేంద్రుడు దేవతులచేత స్వర్గరాజ్యమునకభిషిక్తుఁడుగాఁ జేయఁబడియె. ఇంద్రునిచేతఁ బరిపాలింపఁబడుచున్న యాపర్వతమును అతిక్రమించి పిమ్మట నరువదివేల పర్వతముల యొద్దకుఁ బొండు. పోయి యాపర్వతములయందంతటను జక్కఁగా వెదకుఁడు. మఱియు నోవానరోత్తములారా! ఆపర్వతము లన్నియును, సూర్యునియొక్కవర్ణమువంటి వర్ణముగలవియై మిగులమనోహరముగాఁ బ్రకాశించుచున్నవి మిగులఁజక్కఁగాఁబుష్పించినవియును, సువర్ణమయమైనవియును నగువృక్షములచేత నాపర్వతములు మిగులరమ్యములై యున్నవి. ఆపర్వతములమధ్యయందు పర్వతరాజమగు మేరుపర్వతము గలదు పూర్వము నిర్మలుఁడగు సూర్యునిచేత నాపర్వతము వరమునుబొందియున్నది. మఱియు నాసూర్యుఁడే యాపర్వతమునందు వానరులుగూడ సంచరింపఁదగునని వరమునిచ్చె మఱియు నాసూర్యుఁడు ఆపర్వతమునందలి వానరులందఱును దనయనుగ్రహముచేత బంగారువర్ణము గలవారై యుందురనియనుగ్రహించె. మఱియునోవానరోత్తములారా! ఆసూర్యదేవుఁడే యాపర్వతమునందు బంగారువర్ణములుగల దేవదానవ గంధర్వులు నివసించుదురనియనుగ్రహించె. దినదినమందును, విశ్వేదేవులును, మరుద్గణములును, వసువులును, దేవతలును, సంధ్యాకాలమునందాపర్వతమునందు సూర్యోపాసనఁజేయుటకు యత్నించుదురు. పిమ్మటనప్పర్వతముమీఁదికివచ్చి వారందఱును సూర్యునిఁ బూజించుదురు. అట్లెల్లవారిచేతఁను బూజింపఁబడిన పిమ్మట సూర్యుఁడు సకలభూతములకును గనఁబడనివాఁడై యస్తమయమునుబొందును. ఆయస్తగిరిసమీపమునందుండునట్టి ప్రదేశములన్నియును జక్కఁగావెదుకవలయును. అవ్విధముగనస్తమయమును బొందినసూర్యుఁడు అర్ధముహూర్తకాలములో ననేకవేల యోజనములు దిరిగి మరలఁదననివాసస్థానమునకువచ్చును. ఆపర్వతశిఖరమునందు, సూర్యునికాంతితోసమానమైన కాంతిగలదియును, మిగులశ్రేష్ఠమైనదియును, మేడలయొక్క సముదాయముచేతఁ గ్రిక్కిరిసియున్నదియును, విశ్వకర్మచేత నిర్మింపఁబడినదియును, నగుగృహముగలదు. ఆగృహము, మిగులఁజిత్రములైనవియును, నానావిధములగు పక్షులచేతవ్యాకులములైన వృక్షములచేతఁ బ్రకాశింపఁజేయఁబడుచున్నది ఆగృహము, పాశముహస్తమునందుఁగలవాఁడును, మహాత్ముఁడును, నగువరుణునకు నివాసస్థానమై యున్నది. ఆయస్తాద్రి పర్వతముయొక్క మధ్యప్రదేశమునందుఁజిత్రములగు తిన్నెలుగలదియును, సువర్ణమయమైనదియును, పదిశిరస్సులుగలదియును, నగునొక్కతాలవృక్షముప్రకాశించును. అచ్చోటనుండు సకలదుర్గములయందును, నదులయందును, మడుగులయందును, వైదేహీ సహితముగా రావణాసురుని వెదుకవలయును. మఱియు నాయస్తాద్రియొక్క సమీపమునందు సావర్ణి మేరువను నొక్కపర్వతముగలదు. ఆకొండమీఁదవిశ్వకర్మచేత నిర్మింపఁబడినదియును, సువర్ణమయమైనదియును నగువొక్కగృహముగలదు. ఆగృహమునందు, సకల ధర్మములను దెలిసినవాఁడును, తపస్సుచేతగొప్పవాఁడును, మూఁడులోకములయందును బ్రసిద్ధుఁడును, బ్రహ్మదేవునితోసమానుఁడును, సూర్యునియొక్కకాంతివంటి కాంతిగలవాఁడును, ఋషులలోనుత్తముఁడును, నగుమేరుసావర్ణి ప్రకాశించుచుండును. ఆమహాత్మునిఁజూచియతనిపాదములకు నమస్కరించి సీతావృత్తాంతమును సర్వమును నడుగుఁడు. పిమ్మట నప్పురవరమునఁగల సర్వస్థలములయందును, సీతను వెదకుఁడు. మఱియు నోవానరోత్తములారా! సూర్యుఁడు రాత్రిగడచిన పిమ్మట నుదయాద్రియొక్కయు, అస్తాద్రియొక్కయు మధ్యప్రదేశమునందుండు జీవలోకమును సర్వమును జీకటిలేనిదానిని గాఁజేసి యాపర్వతమునందస్తమయమునుబొందును. ఆపర్వతంబు వఱకును బోవుటకు మీకుశక్యమైయుండును. దానికవతల సూర్యుఁడుండఁడు. కావుననాదేశము దిక్కులయొక్కవిభాగములేనిదై యుండును. కావున మీకుబోవుటకుశక్యముగాదు. కావుననో వానరోత్తములారా! ఆయస్తాద్రివఱకునుబోయి నేను జెప్పినసకలప్రదేశములయందును, సీతాదేవినివెదుకవలయును. ఇవ్విధముగా సకలదేశముల యందును వెదకి యొకమాసములోపల మరల నాసమీపమునకు రండనిపలికి సుగ్రీవుఁడు మరలవానరులనుజూచి యిట్లనియె.

ఓవానరోత్తములారా! మీతోఁగూడమహాబాహుఁడును, మహాబలుఁడును, గురుఁడును, నాకుమామయును, నగునీమహానుభావునితోఁగూడ సంచరింపుఁడు. మీరును మిగులఁ బరాక్రమముగలవారు. సర్వకర్మలయందును మీరు ప్రసిద్ధముగా సంచరించువారు. కాఁబట్టి యోవానరోత్తములారా! మీరందఱును నొక్కటిగాఁజేరుకొని పశ్చిమదిక్కునకుఁబొండు. పోయిచక్కఁగా వెదకి యొకమాసములోపలరండు. మాసములోపలరానివాఁడు నాచేతవధ్యుఁడగును. అధికమైన తేజస్సులుగల యోవానరోత్తములారా! రాజేంద్రుఁడగు నీరామునియొక్క భార్య మనచేతఁ

బాఁడఁబడెనేని మనమురామునకుఁ బ్రత్యుపకారమును జేసిన వారమగుటచేతఁ గృతార్థులగుదుము. కాఁబట్టిమనకీకార్యముకంటె జేయఁదగినకార్యము మఱియొక్కటియేదియును లేదు. కాఁబట్టిమీరుదేశకాలములను గనిపెట్టికార్యమును జేయవలయుననియె. అప్పుడుసుషేణుఁడు మొదలుగాఁగల యావానరవీరులందఱును నిపుణమగువాక్యమునువిని తమవారలనందఱును బిలుచుకొని వరుణదేవునిచేతఁ బరిపాలింపఁబడుచున్నపశ్చిమ దిక్కునకభిముఖముగాఁ బోయిరి.

ఇట్లుశ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదిరెండవ సర్గముగిసెను.

—(*)—

సుగ్రీవుడు ఉత్తరదిక్కునకు శతవలినిబంపుట.

అటుపిమ్మట వానరోత్తముడగు సుగ్రీవుడుతనమామను పశ్చిమదిక్కునకుబంపె పిమ్మటసకలధర్మములను దెలిసినవాడును, వానరరాజును, అగుసుగ్రీవుడుసకల వానరవీరులలోనుత్తముడును, వీరుడును, నగుశతవలియనువానినిబిలిచితనకును రామునకునుబ్రియమైనమాటలను జెప్పదలచి యిట్లనియె

వానరోత్తముఁడా! నీవంటివానరవీరులను గోటిమందిని వెంటబెట్టుకొని వైవస్వతునకుఁ బుత్రులగు మంత్రులతోఁగూడ నాలోచించియుత్తరపు దిక్కునకుఁబొమ్ము పోయి హిమవత్పర్వతము శిరోభూషణముగా గలదియును, మిగులవిక్రమను గలవియును, నగునాయుత్తరపుదిక్కు నందంతటను, పతివ్రతయును, రామునకుభార్యయును, నగుసీతను వెదకుఁడు. దశరథమహారాజునకుఁ బుత్రుఁడగురామునకు బ్రియమైనయీకార్యము నేరవేర్పబడినయెడల మనమందఱమును ఋణవిముక్తులమగుదుము. అట్లుఋణవిముక్తులమగుటచేతఁ గృతార్థులమగుదుము. మహానుభావుడగు రాముఁడుముందుగా మనకుపకారమునుజేసె అట్టిరామునకు మనము ప్రియమునుజేసినయెడల మనజన్మముసఫలమగును తనకుపకారమును జేయనివాడువచ్చి యాచించినపుడెవ్వడు వానికార్యమును నేరవేర్చునో యట్టివానిజన్మము సఫలమగును. ఇకనుముందుగా నుపకారమునుజేసినవానికి మేలునుజేయుటచేత జన్మముసఫలమగునని చెప్పవలయునా? చెప్పనక్కరలేదు. కాఁబట్టినాకుఁ బ్రియమునుజేయుట యందిష్టముగల మీరందరును నీవిషయమును మనస్సునందుఁ బెట్టుకొని సీతాదేవినివెదకి యున్నచోటును, తెలిసికొనవలయును. శత్రుపట్టణములను జయించువాడును, మానవోత్తముఁడునునగు నీరాముఁడు సకలభూతములకును బూజింపఁదగినవాఁడు. మఱియునీరాముఁడు మనయందధికమగు ప్రియమునుముందుగాఁ గనఁబరచె. మఱియునీవనదుర్గములయందును, నదులయందును, శైలాంతరములయందును, బుద్ధియొక్కయు, పరాక్రమముయొక్కయు సంపదతో మీరందఱును జక్కగావెదకవలయును. మఱియునోవానరోత్తములారా! ఆయుత్తరపుదిక్కునందలి మ్లేచ్ఛదేశములను, పుళిందదేశములను, శూరసేనదేశములను, ప్రస్థలదేశములను, భరతదేశములను, కురుదేశనులను, మద్రదేశములను, కాంభోజదేశములను, యవనదేశములను, శకదేశములను, ఆరట్టదేశములను, బాహ్లీకదేశములను, ఋషికదేశములను, పౌరవదేశములను, టంకణదేశములను, చీనదేశములను, పరమచీనములన, నీహారదేశములను, దరదదేశములను, హిమవత్పర్వతమును జక్కగావెదుకవలయును. ఈదేశములయందలిలొద్దుగచెట్లయొక్క వనములయందును, చందనవనములయందును, రావణాసురునితోఁగూడ సీతనువెదుకవలయును అంతటదేవతలచేతను, గంధర్వులచేతను, సేవింపఁబడుచున్న సోమాశ్రమమునకుఁ బొందు పిమ్మటగొప్పవగు చరియలుగలకాళమనియెడు పర్వతమునకుఁబొండు. పోయియాపర్వతమునందలి గొప్పవగుదరులయందును, గుహలయందును, మహానుభావురాలును, రామునకుభార్యయును, నగుసీతాదేవినిమిగులఁ బ్రయత్నముతో వెదకుడు. బంగారముగర్భమునందుగలదియును, పర్వతములలో నుత్తమమైనదియును, నగునామహాగిరికవతలనున్న, సుదర్శనమనియెడు మహాపర్వతమునుజూడుఁడు. పోయియాపర్వతము నందంతటను జక్కగావెదకుఁడు. దానికవతల బక్షులకునివాసస్థానమైన దేవసఖమనియెడు పర్వతముగలదు. ఆపర్వతమునానావిధములగు పక్షిగణములచేత వ్యాప్తమైయున్నది ఇంతయగాక నానావిధములగు వృక్షములచేత నలంకరింపఁబడియున్నది. ఆపర్వతమునందలి వనములయందును, కొండకాలువలయందును, రావణాసురుడు సీతతోఁగూడఁనుండును. ఆపర్వతమును దాటినపిమ్మట నూరామడదూరమాకాశమార్గమున నెగిరిపోందు పోయినపిమ్మట మిగులఁదెల్లనిదియును, కైలాసమనియెడు పేరుగలదియును, నగుపర్వతమునుజూచి యధికమగు సంతోషమునుబొందుడు. మఱియునాపర్వతమునందుఁ దెల్లనిమేఘములయొక్క కాంతివంటి కాంతిగలదియును, బంగారముచేత నలంకరింపఁబడినదియును, దివ్యమైనదియును, విశ్వకర్మచేత నిర్మింపఁబడినదియును, నగుకుబేరుని గృహమునుజూడుఁడు. ఆపట్టణమునందు మిగులవికసించిన కమలములును, నల్లగలువలును, గలదియును, హంసలచేతను, బెగ్గురుపక్షులచేతను వ్యాప్తమైనదియును, అప్సరోగ

ణముచేత సేవింపఁబడుచున్నదియును, మిగులమనోహరమైనదియును, నగునొక్కసరోవరముగలదు. ఆకొలనునందు సర్వభూతములచేతను నమస్కరింపఁ బడుచున్నవాఁడును, శ్రీమంతుఁడును, నగుకుబేరుఁడనియెడు రాజోత్తముఁడు గుహ్యకగణములతోఁగూడఁ గ్రీడించుచుండును. మఱియునాకైలాస పర్వతముయొక్క ప్రత్యంతపర్వతములు చంద్రునితోసమానమైన కాంతిగలవై యున్నవి. అట్టిపర్వతములయందును, గుహలయందును, సీతాసమేతముగ రావణాసురుఁడు విహరించుచుండును. కావుననాస్థలములయందు మీరుచక్కగావెదకి సీతామహాదేవినిజూచి రావలయును. మఱియునోవానరోత్తములారా! ఆకైలాసపర్వతమున కవతలఁగ్రౌంచమనియెడు పర్వతముగలదు. ఆపర్వతమున కొక్కబిలముగలదు. అదియితరులచేతఁ బ్రవేశింపనలవిగానిదైయున్నది. కాఁబట్టిమీరాబిలమునందుఁ గొంచెమైనను బ్రమాదములేక సంచరింపవలయును. ఆబిలమునందు సూర్యునియొక్క కాంతివంటి కాంతిగలవారును, దేవతలచేతఁగూడఁ బూజింపఁబడినవారును, దేవరూపులును మహాత్ములునునగు మహర్షులునివసించుచుందురు. మఱియునాక్రౌంచపర్వతమునందలి యితరములగుహలును, చరియలును, శిఖరములును, దరులును,నితంబప్రదేశములును, మీచేతఁజక్కగా వెదుకఁదగినవైయున్నవి ఆక్రౌంచపర్వతమునందలి సకలప్రదేశములను వెదకి దానికవ్వతల వృక్షరహితమైనదియగు కామశైలమునకుఁబొండు. పోయిహంసలు నివసించుటకుఁదగినచోటగు, మానససరోవరమునుబొందుఁడు. అదిదేవదానవాది సకలభూతములకును బొందశక్యముగానిదైయున్నది. కాఁబట్టియాస్థలమునందు మీరుమిగులజాగరూకతతో సంచరించుచు సీతను వెదుకవలయును.మఱియునా పర్వతమునందలి చరియలుమొదలగు వానినిగూడఁ జక్కగవెదుకవలయును, అట్లువెదకియాక్రౌంచ పర్వతమును అతిక్రమించినపిమ్మటఁ గొంతదూరముపోయిన యెడలమైనాకమనియెడు పర్వతముగలదు. దానియందుమయుఁడను రాక్షసునియొక్క గృహమొకటిగలదు ఆమైనాకపర్వతము నందలిచరియలను, నితంబప్రదేశములను, మఱియునితరములగు ప్రదేశములను, మిగులజాగ్రతతో వెదుకవలయును. అక్కడననేకులగు కిన్నరస్త్రీలు విహరించుచుందురు. ఆస్థలములయందు మిగులఁజక్కగా వెదకిపిమ్మటన చ్చోటునువదలి మరికొంతదూరముపొండు. పోయినయెడల నక్కడనసిద్ధులచేత సేవింపఁబడుచున్న యాశ్రమమొకటిగలదు. ఆయాశ్రమమునందు సిద్ధులును, వైఘానసులును, వాలఖిల్యులును, మరియునితరులగు తపోవంతులునుగలరు. తపస్సిద్ధులగువారందఱును నెల్లవారలకును నమస్కరింపఁదగినవారు. ఇంతయగాకపాపరహితులు. కావునమీరుమిగుల వినయముతోవారి యొద్దకుఁబోయి సీతావృత్తాంతమును వినయోక్తులచేత నడుగవలయును. దానికవతల బంగారపుఆకులచేత గప్పబడినదియును, బాలసూర్యునియొక్క కాంతివంటికాంతిగల హంసలయొక్కయు, నీరుకోళ్లయొక్కయు; బెగ్గురుపక్షులయొక్కయు; సంచారముగలదియును, వైఖానసమను పేరుగలదియును; నగుమడుగొకటిగలగు. ఆమడుగునందుఁ గుబేరునకువాహనమగు సార్వభౌమమనియెడు దిగ్గజముఆడయేనుఁగులతోఁ గూడుకొనినదై సర్వకాలములయందును విహరించుచుండును. ఆస్థలమునందుఁజక్కగావెదకి యచ్చోటునువదలి మరికొంతదూరముపొండు. అట్లుపోయినయెడల నక్కడసూర్యచంద్రులు లేనిదియును; నక్షత్రములును; గ్రహములును లేనిదియును; మేఘశూన్యమైనది యునునగునాకాశముఅనాదికాలమునందువలె సర్వశూన్యమైనదై తనయొక్కతేజస్సముదాయముచేత సూర్యునియొక్క కాంతులచేతవలెనే ప్రకాశింపఁజేయుచు, మిగులశాంతులును, దేవతుల్యులును, స్వయముగాఁ బ్రకాశించువారును, తపస్సిద్ధులును, నగుమహర్షులచేత సేవింపఁబడినదై ప్రకాశించుచుండును. అంతనాదేశము నతిక్రమించి యవతలశిలావతియను నదినిజూడవలయును. దానితీరమునందుఁ గీచకములను వేణువులుగలవు. ఆవెదుళ్లుఒకదానితో నొకటొపెనచు కొనియుండును. ఆవెదుళ్లను నాధారముగాఁజేసికొని యామహానదినిదాటుఁడు. అట్లుదాటిదాని యుత్తరతీరమునందుఁ బ్రవేశింపుఁడు. పిమ్మటమిగులఁ బుణ్యకరంబులగు నుత్తరకురు దేశములయందు బ్రవేశింపుఁడు. దానియందుబంగారము పద్మములుగలపద్మినీకృతఉదకములును, నీలవైడూర్య పత్రాఢ్యములగునదులుగలవు. మఱియునో వానరోత్తములారా! సువర్ణమయమైనవియును, ఎఱ్ఱనివియునునగు, కలువలయొక్క వనములచేత నలంకరింపఁబడినవియును, బాలసూర్యునియొక్క కాంతివంటికాంతిగల యెఱ్ఱతామరలచేతఁ బ్రకాశించుచున్నవియును, సువర్ణమయములగు కింజల్కములయొక్క సముదాయముచేతఁ బ్రకాశింపఁజేయఁ బడుచున్నదియును, గుండ్రములైనవియును, నగుముత్యపుచిప్పలయొక్క సంపుటములచేతఁ జక్కగానలంకరింపఁ బడినవియును, మిగులరమణీయములును, నగుమడుగులు గలిగియుండును. మఱియునానావిధములచేత మిగులఁజిత్రముగాఁ జేయఁబడినవియును, సువర్ణమయములైనవియును, అగ్నితోసమానములగు కాంతులంగలవియును, నగుపర్వతములు ప్రకాశించు

చుండును. ఆపర్వతములయందు సర్వకాలములయందును, పుష్పములతోడను, ఫలములతోడను గూడుకొన్నవియును, బంగారపు రెక్కలుగల పక్షులచేతఁ బ్రకాశింపఁ జేయఁబడుచున్నవియును, శ్రేష్ఠములగు గంధ రసములయొక్క స్పర్శలుగలవియును, సర్వజనులచేతను గోరదగినఫలముల నిచ్చునవియును, నగువృక్షములు ప్రకాశించుచుండును. అక్కడనుండునట్టి భూమియందుఁ దృణములును, ముండ్లును లేవు. మఱియు నాభూమి తెల్లనివర్ణము గలదైయున్నది. మఱియు నోవానరోత్తములారా! ఆభూమి, మిగులనిర్మలమైనదియును, పోయినబాధగలదియును, మిగులఆరోగ్యము గలదియును, పచ్చికపట్లుగలదియును, సర్వజంతువులచేతను గోరఁదగిన ఫలములచేతను, వృక్షములచేతను, బ్రకాశించుచున్నదియును, మిగులసుందరమగు బంగారముచేతను, మణులచేతను, నలంకరింపఁ బడుచున్నదియును, సువర్ణముచేతను, మణిసముదాయముచేతను, ప్రకాశింపఁజేయఁబడినదియును, నై మిగులమనోహరముగాఁ బ్రకాశించుచుండును. మఱియు నక్కడ బ్రహ్మదేవునిచేతఁ బుట్టింపఁబడిన కల్పవృక్షములనేకములు ప్రకాశించుచుండును. ఆవృక్షములలో గొన్ని శాశ్వతములగు పుష్పములును, ఫలములును గలవి. మరికొన్నివృక్షములు నానావిధములగు పక్షులచేత వ్యాకులములై యున్నవి. మరియు నావృక్షములఁ గొన్ని సర్వజనులచేతను గోరఁదగియున్న శబ్దస్పర్శరూపరస గంధములను గలుగఁజేయుచున్నవి. మరికొన్నివృక్షములు నానావిధములగు వస్త్రములను బుట్టించుచున్నవి మరికొన్నివృక్షములు ముత్యములచేతను, వైడూర్యములచేతను, రచింపఁబడినవియును, చిత్రములయినవియును, నగు నాభరణములనిచ్చుచున్నవి. అట్టిభూషణములలోఁ గొన్ని స్త్రీలకుఁ దగియున్నవి మరికొన్ని పురుషులకుఁ దగియున్నవి మరికొన్నివృక్షములు సర్వకాలములయందును సుఖముగా సేవింపఁదగిన పుష్పములను ఫలములను గలుగఁ జేయుచున్నవి. మరియు ఏకకాలమునం దన్నిఋతువులయందును గలిగెడుఫలము మిగులవెలగలపానములను, నానావిధములగు భక్ష్యములను నిచ్చుచున్నవి మరియు నోవానరోత్తములారా! ఆస్థలమునందు, సకలగుణసంపన్నులును, మంచిరూపముతోడను, మంచియావనముతోడను గూడుకొన్నవారలును, సూర్యునియొక్క కాంతివంటి కాంతిగలవారును, నగు గంధర్వులును, కిన్నరులును, సిద్ధులును, నాగులును, విద్యాధరులును, మిగులసుందరులగు స్త్రీలతోఁగూడ విహరించుచున్నారు. మరియు నోవానరోత్తములారా! అక్కడనున్న వారందఱును బుణ్యకర్మలను జేయువారు. అందఱును క్రీడలయందా సక్తిగలవారు. సకలజనులును కామార్థసహితులు మరియు నక్కడ స్త్రీపురుషులందఱును సర్వకాలములయందును, వినోదముగ విహరించుచుందురు. మరియు నోవానరోత్తములారా! అస్థలమునందు సర్వకాలములయందును గీతవాదిత్రముల యొక్క ధ్వనియును, మిగులనధికమగు నవ్వులయొక్క ధ్వనులును, సకలభూతములకును మనోహరములై వినఁబడుచున్నవి. మరియు నక్కడ నొకడును సంతోషింపనివాడు లేడు. అక్కడనుండు వారలలో నెవ్వఁడును అసత్కార్యములయందుఁ బ్రియముగ సంచరించువాఁడు లేడు. అక్కడ నానాటసకలజనులకును మిగులమనోహరములగు గుణములు గలుగుచుండును. ఇట్టిదేశము నతిక్రమించిపోయి యుత్తరసముద్రము నొద్దకుఁ బొండు. ఆసముద్రసమీపమునందు సువర్ణమయమైనదియును, మిగులగొప్పదియును నగు సోమగిరియొక్కటిగలదు. ఇంద్రుని లోకమునందుండువారును, బ్రహ్మలోకమునం దుండువారును, మరియు నితరములగు నంతరిక్షలోకములయం దుండువారును, నాపర్వతరాజమును సేవించుచుందురు ఆదేశమునందు సూర్యుఁడు సంచరింపఁడు. ఇంతయుగాక యాపర్వతముయొక్క కాంతిచేత నాదేశమంతయును బ్రకాశించుచుండును ఆదేశము సూర్యునియొక్క కాంతిచేతఁ జేయఁ దగియున్నది ప్రకాశించుచున్న సూర్యునిచేత సకలదేశములును బ్రకాశింపచేయబడుచున్నది. ఆదేశమునందు సకలలోకాత్మకుఁడగు నారాయణుఁడును, ఏకాదశాత్మకుఁడగు శివుఁడును, బ్రహ్మదేవుఁడును, దేవేశుఁడును, బ్రహ్మర్షిసముదాయముతోఁ గూడుకొన్నవారలై సంచరించుచున్నారు. దానికవతల నుత్తరకురు భూములుగలవు. ఆయుత్తరకురు భూములుమీచేతఁ బోఁదగినవికావు. మరియు నాదేశము మీకంటె నిరతములగు భూతములచేత గూడఁబోఁదగినదికాదు. ఆసోమగిరి దేవతలకుగూడదుర్గమమైనది. కావున నాసోమగిరిని బూచిన పిమ్మట నతిశీఘ్రముగ మీరు వెనుకకుఁ దిరుగుటయుచితమైనది. కావున నక్కడనుండి వెనుకకురండు. వానరోత్తములారా! వానరులగుమీచేత నంతవఱకే పోఁదగినది. ఆసోమగిరికవతలి ప్రదేశమునందు సూర్యుఁడుండఁడు. సూర్యునివెలుతురు గూడనుండదు. వానరోత్తములారా! నాచేత నేయేదేశములు చెప్పఁబడినవో యాదేశములన్నియును వెదుకవలయును. మరియు నోవానరోత్తములారా! నేను చెప్పనిదేశములను గూడజక్కగ వెదకుడు. మరియు నోవానరోత్తములారా! మీరివ్విధముగఁ బోయి సకలదేశములను వెదకి దశరథమహారాజునకు బుత్రుడగు రామునకు బ్రియము జేయుడు. రామునకుబ్రియము చేయుటచేత నాకధి

కముగ బ్రియమును జేసినవారగుదురు వాయువుతోడను, అగ్నితోడను సమానులగునో వానవారోత్తములారా! సీతాదేవియున్న చోటును దెలిసి కొనివచ్చితిరేని నాకుమిగుల బ్రియమును జేసినవారగుదురు. పిమ్మటమీరందఱును గృతార్థులును, నాచేతబూజింపఁ బడినవారును, మనోహరములగు సకలగుణములతోడను గూడుకొన్నవారలును, బంధువులతోగూడుకొనినవారలునునై భూమి యందంతటను మహానందముతో సంచరింపుడు. మఱియునో వానరోత్తములారా! మీరుసకలశత్రువులను నశింపజేసి సకలపర్వతములను మీస్వాధీనముగజేసికొని యథేచ్ఛముగ ననుభవింపుడు

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదిమూడవసర్గ ముగిసెను.

రాముడు హనుమంతునిచేతికి తనయుంగరము ను యిచ్చిపంపుట.

అంతటహనుమంతుని యందుసకలకార్య భారమును బెట్టదలచివానరోత్తముడును, కార్యనిర్వాహకుడును, పరాక్రమవంతుడును, వాయుపుత్రుడును, నగుహనుమంతునితో వానరులకందఱకును, మిగులబ్రియమును బొందియున్నవాడును, నగుసుగ్రీవుడిట్లనియె.

వానరోత్తముడవైన యోహనుమంతుడా! నీకుభూమియందుగాని, అంతరిక్షమునందుగాని, ఆకాశమునందుగాని, దేవలోకమునందుగాని, ఉదకములయందుగాని, నీకుబ్రవేశించుటకు దగినసామర్థ్యముగలదు. మఱియునోహనుమంతుడా! నీకుదేవతలయొక్కయు, గంధర్వులయొక్కయు, మానవులయొక్కయు, మరియుసకల లోకములయొక్కయు, విద్యాధరులయొక్కయు, సముద్రములయొక్కయు, సంగతులన్నియును దెలిసినవేగదా? వానరోత్తముడవైన యోహానుమంతుడా! మిగులదేజోవంతుడును, నీకుదండ్రియును, నగువాయుదేవునకువలె నీకునుమిగులనధికమగు గమనమును, వేగమును, తేజస్సును, లాఘవమును, గలవు. మరియునో హనుమంతుడా! ఈభూలోకమునందు నీకుసమాను డెవ్వడునులేడు. కావునసీవిధముగా సీతాదేవిగనబడునో యావిధముగా బ్రయత్నమును జేయుము. వానరోత్తముడవైన యోహనుమంతుడా! నీతిశాస్త్రమునందు బండితుడా! నీయందేబలమును, బుద్ధియును, పరాక్రమమును, దేశకాలముల ననుసరించుటయును, నీతియును, గలవు. కావుననీవుసీతాదేవిని వెదకుటయందుదగిన యత్నమునుజేయుమనియె. ఇవ్విధముగా సుగ్రీవుడు హనుమంతునియందు సకలకార్యమును గలదనిపలుకుటనువిని రఘుకులమునందు బుట్టినరాముడుగూడ హనుమంతునియందు గార్యమంతయును గలదనితలచి యిట్లనియె.

ఆహావానరాధిపతియగు హనుమంతుడు సర్వవిధముల చేతను గార్యమునుజేయగలడని తలచిసుగ్రీవుడు పలుకుచున్నాడు. కాబట్టియీహనుమంతుడు సకలకార్యములను నెరవేర్పగలడని నాకుగూడదోచుచున్నది. ఇవ్విధముగా సకసంగతులను దెలిసిన సుగ్రీవునిచేత బంపబడుచున్నవాడును, వానరాధిపతియగు నీసుగ్రీవునిచేత నిట్లుదృఢముగా బరిగ్రహింపబడుచున్నవాడును, నగుహనుమంతుడు ఈకార్యమును జేయుటకుగొంచెమైనను సందేహములేదని రాముడునిశ్చయించె. పిమ్మటమిగుల దేజోవంతుడగు రాముడుసకలవ్యాపారములయందును నుత్తముడును, మిగులబుద్ధిమంతుడును, నగుహనుమంతునిజూచి తనకార్యము నెరవేరుననితలచి కృతార్థునివలె సంతుష్టమైన సకలేంద్రియములును గలవాడయ్యె. శత్రువులనుదపింప జేయునట్టిరాము డవ్విధముగా సంతోషించినవాడై రాజపుత్రికయగు సీతకుఆనవాలు నివ్వదలచి తన పేరుచేత చిహ్నితమైనదియును, మిగులమనోహరమైనదియును నగుచిటికెన వ్రేలియందలి యుంగరమును నాహనుమంతునిచేతికిచ్చి యిట్లనియె.

వీరుఁడవైన యోహనుమంతుఁడా! నీయుద్యోగమును, సత్వముతోఁగూడిన పరాక్రమమును, సుగ్రీవుఁడు నీతోఁజెప్పినమాటలును, నీవలననేకార్యముసిద్ధించునని నాకుఁదోచుచున్నది. కావుననీవీయుంగరమును దీసికొనుము. వానరోత్తముఁడవైన యోహనుమంతుఁడా! ఈయానవాలుచేత సీతాదేవి నిన్నునాదగ్గరనుండి వచ్చినవానిని గాఁదలఁచి విశ్వాసముతో మాటలాడును కాఁబట్టి నీ వీయుంగరమును దీసికొనిపొమ్మనియె అంతట వాయుదేవునకుఁబుత్రుఁడును, వీరుఁడును, నగు నాహనుమంతుఁడు సకల వానరవీరులతోఁ గూడుకొనినవాఁడై యాయుంగరమును దీసికొని నెత్తియందుఁ బెట్టుకొని రాముని పాదములకు నమస్కరించి యుండె. అంతట నాహనుమంతుఁడు సకల వానరవీరులతోడను గూడుకొనిన వాఁడును, వానరవీరులకుఁ బ్రోత్సాహమును గల్పించుచున్నవాఁడునునై మేఘ రహితమయిన యాకాశమునందు నక్షత్ర సముదాయముతోఁగూడఁ జంద్రుఁడు ప్రకాశించువిధముగఁ బ్రకాశించుచుండె. అవ్విధముగఁ బ్రకాశించుచున్న హనుమంతునితోఁ రాముఁడిట్లనియె

వానరోత్తముఁడవును, పరాక్రమ వంతుఁడవును నైన యోహనుమంతుఁడా! నీవు మిగుల ధికమగు బలముగల వానరసైన్యముతోఁ గూడుకొని యున్నవాఁడవు మఱియునో

హనుమంతుఁడా! నీవు మిగులగొప్పదగు పరాక్రమముగల వాఁడవు. వాయుపుత్రుఁడవైన యోహనుమంతుఁడా! నీవు ఏవిధముగాఁ బ్రయత్నమును జేసినయెడల సీతగనఁబడునో యావిధముగా నీవు యత్నింపుమని రాముఁడనియె

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదారవసర్గ ముగిసెను.

▶ ❀ ◀

వానరులందరును నాలుగుదిక్కులకును బయనమైపోవుట.

అంతట వానరాధిపతియగు నాసుగ్రీవుఁడు మరల నావానరులనందఱఁబిలిచి రామునికార్యము నెరవేరుట కొఱకు మరల నిట్లనియె.

ఓవానరవీరులారా! ఈవిధముగా మీరు సకలస్థలములయందును జక్కగా వెదుక వలయును నావచనమునందు లక్ష్యమును పెట్టవలయుననియె అంతట నావానర వీరులందఱును తమకధిపతియగు సుగ్రీవునియొక్క కఠినమైన యాజ్ఞను దెలిసికొనిన వారై మిడతలు భూమిని నావరించిన విధముగ భూమి యందంతటను దట్టముగా వ్యాపించిరి అట్లు వ్యాపించి ప్రయాణమైరి అంతట రాముఁడు లక్ష్మణునితోఁగూడఁ బ్రస్రవణాచలమునందు మరల మునుపటివలెనే నివసించె. మఱియు నారామలక్ష్మణులు నెలదినములలోపల సీతావృత్తాంతము తెలియఁ గలదని సంతోషముగలవారై యూరకుండిరి అప్పుడు శతవలియను పేరుగల వానరవీరుఁడు మిగుల శీఘ్రముగా హిమవత్పర్వతము మొదలు గాఁగల పర్వతోత్తములచేత నావరింపఁ బడి మిగుల రమ్యమైన యుత్తరపు దిక్కును గుఱించి బయలు వెడలె పిమ్మట వినతుఁడనియెడు వానరనాయకుఁడు తూర్పు దిక్కునకుఁ బోయె. వానరాధిపతియును, వాయుదేవునకుఁ బుత్రుఁడునునగు హనుమంతుఁడు తారాంగదాదులతోఁ గూడినవాఁడై యగస్త్యునిచేత సంచరింపబడుచున్న దక్షిణపు దిక్కునకుఁబోయె నానరోత్తముఁడగు సుషేణుఁడనియెడు వాఁడుమిగుల భయంకరమైనదియును, వరుణదేవునిచేతఁ బాలింపఁబడినదియును, నగుపడమటిదిక్కునకుఁబయనమయ్యె అంతట వానరాధి పతియగు సుగ్రీవుఁడు వానరులనందఱను సకలదిక్కులకునుబంపి పరమానందము గలవాఁడైయుండె ఈవిధముగా రాజగు సుగ్రీవునిచేతఁ బంపఁబడిన వానరవీరులందఱును తమతమ భాగమునందువచ్చినదిక్కులకు మిగుల శీఘ్రముగాఁ బయనమైరి. అట్లుబయలు వెడలునపుడు ఆవానర వీరులందఱును దమలోఁ దామిట్లనిరి. నేనుసీతను దీసికొనిరాఁగలను. రావణాసురుని నేనొక్కడనే చంపెదను. నేనొక్కడనేలోకములనన్నింటిని ముంచివేయఁగలనని యీవిధముగా నావానరవీరులందఱును నధికముగాఁ గూతలువేసిరి గంతులును వేసిరి. అట్టహాసములనుజేసిరి కొందఱుసకిలించిరి. మఱికొందఱటునిటుపరుగెత్తిరి. మహాబలులగు మరికొందఱు విపరీతముగ ధ్వనిజేసిరి ఇట్లుచేయుచుండఁగ నందులోఁగొందఱుమరల నిట్లనిరి ఓహోవానరవీరులారా! రావణాసురుఁడు యుద్ధమునకు వచ్చినయెడల నేనొక్కడనే యుద్ధమునందు రావణాసురునిఁ జంపఁగలను మఱియొకడు నేను రావణాసురుని బహువిధములబాధించి సీతను దీసకొనిరాఁగలను. ఓవానరవీరులారా! మీరందఱును సుఖముగానుండుఁడు సీత కేమియును భయమురాకుండునట్లు నేను గాపాడితీసికొని రాఁగలననియె మఱియొకఁడు నేనొక్కడనే పాతాళలోకమునందున్నప్పటికిని సీతనుదీసికొనిరాఁగలను. మరియు సకలవృక్షములనువిరిచివేయఁగలను. సకలపర్వతములనుపిండిపిండిగాఁ జేయుదుననియె మరియొక్కడు, నేనుభూమిని బ్రద్దలుసేయఁగలననియును, సముద్రములకు క్షోభనుగలుగఁజేయుదుననియును, నూరామడ దూరమైననెగురఁగలననియును జెప్పె మరియు నిందుకేమియును సందేహము గూడలేదనియె మరియొకడు నేనునూరామడకధికదూరము గూడఁ బోదుననియును, సీతాదేవి, భూలోకమునఁదున్నను, సముద్రమునందున్నను, పర్వతముల యందున్నను, వనములయందున్నను దీసికొనిరాఁగలను. నేనుసకలలోకములకునుబోగలననియె ఇవ్విధముగ బలదర్పితులగు వానరవీరులందఱు వానరాధిపతియగు సుగ్రీవునియొక్క సన్నిధియందుఁ బ్రగల్భముగ మాటలాడిరి

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదైదవసర్గ ముగిసెను.

—(❀)—

సుగ్రీవుఁడుభూమండలమునంతయుదానుజూచినందుకు గారణమును జెప్పుట.

అవ్విధముగ వానరులందఱును బోయినపిమ్మట రాముఁడు సుగ్రీవునితో నిట్లనియె

వానరాధిపా! సుగ్రీవుఁడా! నీవుభూమండలమును సర్వమునుఎట్లుచూచితివి ఈవిషయమునునాకుఁదెలుపుమనినసుగ్రీవుఁడు వినయముతోఁగూడుకొనినవాఁడై యిట్లనియె.

రామభూపాలవర్యా! మానవోత్తముఁడా! వినుము. సర్వమును సవిస్తారముగ జెప్పెదను వినుము. రామచంద్రా! వాలియెప్పుడుమహిషాకారమునుధరించిన దుందుభియనియెడు దానవుని వలయ పర్వతము వఱకును దరిమెనో

యిప్పుడాదానవుఁడు భయముచేత మలయ పర్వతముయొక్క గుహాయందుఁ బ్రవేశించె. పిమ్మట నావాలి యారాక్షసునిఁ జంపవలయుననియెడు కోరిక చేత నామలయ పర్వతపు గుహాయందుఁ బ్రవేశించె. పిమ్మట నేనాగుహాయొక్క ద్వారదేశమునందు వినయము గలవాఁడనై యుంటిని. అట్లొక సంవత్సరకాలమున్నప్పటికిని వాలియును బయలునకు రాకయుండె. అంతటఁ గొన్నిదినములకు ఆగుహాలోనుండి యధికముగ రక్తప్రవాహము బయలువెడలె. అప్పుడు నేను అన్నయగు వాలియొక్క దుఃఖముచేతఁ బీడింపబడిన వాఁడను, విస్మయముగలవాఁడను, నైయారక్తప్రవాహమునుజూచితిని. మరియు నప్పుడు నేనుబుద్ధిహీనుఁడనై నాయన్నయగువాలి చంపఁబడెనని తలఁచితిని. అంతట నేనాబిలముయొక్క ద్వారమునందుఁ బర్వతముతో సమానమైన శిలనుబడవైచితిని. అట్లువైచి యొకవేళ వాలి మరణమునుబొందినను దుందుభియనియెడు రాక్షసుఁడీశిలను దీసికొనిరాఁజాలఁడని నిశ్చయించుకొంటిని. పిమ్మట వాలిచచ్చిపోయినాఁడని తలఁచి కిష్కింధాపట్టణమునకు వచ్చితిని. వచ్చి తారను, రుమను బొంది గొప్పదగువానరరాజ్యమును బొందితిని. అంతట మిత్రులతో నందఱితోడను గూడుకొనినవాఁడనై కిష్కింధాపట్టణమునందు భయమేమియును లేక పరిపాలనను జేయుచుంటిని అంతఁగొన్నిదినములకు నాయన్నయగువాలి యారాక్షసునిజంపి కిష్కింధాపట్టణమునకువచ్చె. అప్పుడు నేనుమిగులభయముతోఁ గూడుకొనినవాఁడనై మిగుల వినయముతోఁ రాజ్యమును సర్వమును సమర్పించితిని. అట్లుసమర్పించి జరిగినవృత్తాంతమును సర్వమును జెప్పితిని. మరియుననేకవిధముల బ్రార్థించితిని. అట్లెన్నివిధములచేతఁ బ్రార్థించినను వినక రాక్షసోత్తముఁడగు దుందుభినిఁజంపఁదలఁచినవిధముగ నన్ను గూడ జంపఁదలఁచి దుష్టాత్ముఁడగువాలి మిక్కిలి కలుషమైన యింద్రియములు గలవాఁడై నన్నుఁదరిమె అట్లు వాలిచేతదరుమబడిన వాఁడనై నేను మంత్రులు మొదలుగాగలవారలతో గూడ బరుగెత్తితిని. అట్లుపరుగెత్తుచు నానావిధములగునదులను, అనేకములగు వనములను, పట్టణములనుజూచితిని. అంతట సకలభూమండలమును, అద్దమును జూచెడువిధముగా జూచితిని. మఱియు నప్పుడుసర్వమును గోష్పదమునుగాఁజేసి చూచితిని. మఱియు నేనుజూచినవిధమును జెప్పెదను. వినుము. ముందుగా దూర్పుదిక్కునకు బరుగెత్తి నానావిధములగు వృక్షములను, పర్వతములను, రమ్యములగునదులను, నానావిధములగు మడుగులను జూచితిని. అంతగొంతదూరము పోయి గైరికాది ధాతువులచేత నలంకరింపబడినదియగు నుదయపర్వతమును జూచితిని. పిమ్మట సర్వకాలములయందును, అప్సరస్త్రీలకు నివాసస్థానమగు క్షీరసముద్రమును జూచితిని. అప్పుడును వాలి నావెంటనంటివచ్చుచుండె. అంతట నేను మునుపటికంటె నధికమగు భయముగలవాడనగుచు నంతటితో నాదిక్కును విడిచిపెట్టితి. మఱియు నావాలి నన్నుదరుముకొని వచ్చుటచేత నామంత్రులతో గూడ దక్షిణదిక్కున కభిముఖముగా బయలువెడలితిని. అట్లుబయలువెడలి వింధ్యపర్వతము చేతను, వృక్షములచేతను వ్యాప్తమైనదియును, చందనవృక్షములచేత నలంకరింపబడినదియును, మరియు నితరములగు వృక్షములును, పర్వతములునుగలదియును, నగుదక్షిణదిక్కును సర్వమును జక్కఁగ జూచితిని. పిమ్మట వాలిచేత దరుమబడినవాడనై పడమటి దిక్కునకుబోయి యాదిక్కునందు నానావిధములగు వృక్షములనుజూచితిని. మరియు నస్తాద్రికిబోతిని. అంతటనాదిక్కునువదలి యుత్తరపుదిక్కునకు బరుగెత్తితిని. అట్లుపరుగెత్తిహిమవత్పర్వతము, మేరుపర్వతము, మరియునితెరములగు పర్వతములను, అటులనేయుత్తరపుసముద్రమును జూచితిని. ఇట్లు సకల దిక్కులును దిరిగియును వాలియొక్క బాధను దప్పించుకొనజాలక యెందునుదిక్కులేక మిగుల వ్యసనమును బొందుచుంటిని. అప్పుడు బుద్ధిమంతులలో నుత్తముడగు హనుమంతుడు నాతో నిట్లనియె.

సుగ్రీవుడా! నేనింతవఱకొక్క విషయమును మరచిపోతిని. కాబట్టిమనమివ్విధముగా గష్టమునుబొందుచున్నాము. ఇప్పుడావిషయము జ్ఞాపకమువచ్చినది. కావున జెప్పెదను. వినుము. మతంగమహాముని తనయాశ్రమమునకు వాలివచ్చెనేని మరణమునుబొందు ననిశపించె. మరియునావాలి యాపర్వతమునందడుగును బెట్టెనేనివానిశిరస్సు నూరువ్రక్కలగుననియె. కాబట్టియోసుగ్రీవుడా! మనముపోయియామతంగాశ్రమమునందు భయములేకయుందమనియె రాజనందనుడవైన యోరాముడా! అంతటమేమందఱము నీఋశ్యమూక పర్వతమునందు బ్రవేశించి సుఖముగానుంటిమి అంతటవాలి, భయముచేత నీపర్వతముమీదికి రాకనన్నువిడిచిపెట్టె. ఈవిధములగు కష్టములువచ్చినపుడునే నీభూమండలమును సర్వమును గరతలామలకమును గాజూచితిని. అవ్విధముగాదిరిగితిరిగి తుదకుయీపర్వతపు గుహయందు బ్రవేశించినిర్భయుడనై యిందునివసించితినని సుగ్రీవుడుచెప్పె.

ఇట్లుశ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదారవసర్గముగిసెను.

సీతాదేవిని వెదకబోయినతూర్పుఉత్తరపశ్చిమదిక్కులనుండివానరులు సుగ్రీవునివద్దకువచ్చి చేరుట.

వానరరాజగు సుగ్రీవునిచేత బంపబడిన వానరులందఱును సీతాన్వేషణముకొఱకు సకలదిక్కులకును, అతిశీఘ్రముగబోయిరి. పోయినపిమ్మట నావానరాధిపతులందఱును నదములను, నదులను, మడుగులను, ఆకాశములను, నగరములను, దుర్గములను, మఱియు నితరములగు పర్వతములను, ఇంకనుజూడదగిన వానినిజూచిరి. ఇవ్విధముగసుగ్రీవునిచేత బంపబడినవానరాధిపతులందఱును నానావిధములగు నరణ్యములను, పర్వతములను, ఇంకను జూడదగిన ప్రదేశములను జూచిరి అవ్విధముగ నావానరులందఱును సీతను దెలిసికొనుటకు బగలంతయును స్థిరచిత్తులై వెదకి రాత్రికాలమునందొక చోటునకు జేరుచువచ్చిరి. ఇవ్విధముగ వెదకి నేకకాలమునందు సకలఋతువులుగల దేశములను, సఫలములగు వృక్షములను, జేరియథేచ్ఛముగ నాకలి తీరునట్లు రాత్రులయందు ఫలములు మొదలగువానిని భుజించుచుండిరి ప్రతిపగటియుదును సీతనువెదకుచుండిరి అవ్విధముగ నొక్కమాసము నొక్కదినము గాగడపి సకలవానరవీరులును నాశారహితులై మరల ప్రస్రవణాచలమునకు వచ్చి వానరాధిపతియగు సుగ్రీవుని జూచిరి అట్లు సకల దిక్కులకును బోయినవారలలో ముందుగమహాబలుడగు వినతుడనియెడు వానరుడు తనమంత్రులతోగూడ దూర్పుదిక్కును సర్వమునువెదకివచ్చె. ఉత్తరపుదిక్కునకుబోయినవాఁడును, వీరుడును, నగుశతవలియనువాడు తనమంత్రి పుంగవులతో గూడనుత్తరపుదిక్కును సర్వమునువెదకివచ్చె. సుషేణుడుపడమటిదిక్కును సర్వమును మంత్రులు మొదలగు వారితో వెదకియతివేగముగవచ్చె ఇట్లుసకలవానరవీరులును నెలదినములలోపల వచ్చిరి వచ్చిప్రస్రవణాచలమునందు గూర్చున్న రామునితోగూడ గూర్చున్నవాడును, తమకుప్రభువునునగు సుగ్రీవునకు నమస్కారమునుజేసి యిట్లనిరి. వానరాధిపతివైన యోసుగ్రీవుడా! నీయాజ్ఞనుబొందిపోయినపిమ్మట మేమందఱమును, సకలపర్వతములను, పరులచేత బ్రవేశింపనలవిగాని యరణ్యములను, నదులను, సముద్రమువఱకును గలదేశములను, గుహలను, ఇంకనునీచేత జెప్పబడినప్రదేశములను, గొప్పవగుపొదలను, తీగెలయందును, వెదకితిమి మఱియునోసుగ్రీవుడా! అరణ్యములయందును, విషమప్రదేశములయందును, సమస్తప్రదేశములయందును, నధికమగు బలముగల జంతువులనుజంపితిమి. మఱికొన్ని జంతువులను దరిమితిమి. మఱియు ననేకవిధములగు ప్రయత్నములను జేసితిమనిచెప్పి మఱియు నిట్లనిరి.

వానరాధిపతీ! సుగ్రీవుడా! గొప్పదగుబలముగలవాడును, మహానుభావుడును, వానరాధిపతియును, దక్షిణదిక్కునకు బోయినవాడును, వాయుదేవునకు గుమారుడును, నగు హనుమంతుడు సీతాదేవియున్న చోటును నిశ్చయముగా దెలిసికొనరాగలడు.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదేడవసర్గ ముగిసెను.

(*)

సీతను వెదకబోయినచోట అంగదుడు ఒకరాక్షసుని జంపుట

అంతట తారాంగదులతోగూడ సుగ్రీవుని యాజ్ఞానుసారముగబోయినవాడగు హనుమంతుడు దక్షిణదిక్కునుసర్వమును వెదకుటకు యత్నించె. అట్లుబయలువెడలి వానర వీరులగు వారలనందఱవెంటబెట్టుకొని పోయిన హనుమంతుడు మిగుల దూరముగ బోయి వింధ్యపర్వతము నందలి గుహలను, అరణ్యప్రదేశములనువెదకె. మఱియు నావానరులందఱును, పర్వతాగ్రములను, నదులను, దుర్గములను, సరస్సులను, విపులములగు వృక్షములను, మఱియు నితరములగు వృక్షసముదాయములను, నానావిధములగు వృక్షసముదాయములను, పర్వతములను, గొప్పవగువృక్షములను, వెదకిరి. వెదకివెదకి యెందునుసీతనుగానక యధికముగ భయమునుబొందిరి మరియు నావానరులందఱును నానావిధములగుఫలములను, మూలములనుభక్షించిరి. మరియు నావానరవీరులు మిగులదుర్గమములగు ప్రదేశములయందు వెదకి యెందును గానక యక్కడక్కడ నివాసమును జేయుచు వచ్చిరి. ఇట్లు సీతాదేవినివెదుకుచు నింకొకదేశమునకు బోయిరి. ఆదేశమువెదకుటకు శక్యము గానిదియును, గుహలచేత మిగుల భయంకరమైనదియును, జనరహిత మయినదియును, నిర్జలమును, శూన్యమును, రోమాంచమును గలుగజేయునదియును, మిగుల దుష్కరమైనదియునునై యుండె. అట్టిదేశమునుసర్వమును జక్కగావెదకి పిమ్మట నాదేశమునుసర్వమును వదలి యావానర వీరులందఱును మిగుల భయంకరములగు నరణ్యములను వెదకి యధికమగు దుఃఖముచేత బీడింపబడిరి. మరియు నావానరవీరులు ఏవిషయమునందును భయము లేనివారై యితరులచేత బ్రవేశింపనలవిగాని యరణ్యమునందు బ్రవేశించిరి. ఆయరణ్యము నందలి వృక్షములన్నియును, కాయలు, ఆకులు, పూవులు మొదలగు నవిలేక మోకులవలె నుండె. మరియు నదులన్నియును నుదకములులేనివై యెండిపోయియుండె. ఆయరణ్యమునందు లేళ్లుగూడ దుర్లభమైయుండె. మరియు నయ్యెడ

వియందు మహిషములు, మృగములు, ఏనుగులు మొదలగు జంతువులేమియును లేకయుండె. ఇంతయగాక పెద్దపులులు, పక్షులు, మరియు నితరములగు ఘాతుకమృగము లన్నియును లేకయుండె. మరికొన్నిచోట్లవృక్షములు, తీగెలు, వీరుధులు, మొదలగునవియేవియును లేవు. మరియు నాయడవియందు మృదువగుపత్రములుగలవియును, వికసించిన పద్మములుగలవియును, నగుతామరలు మొదలగునవి యేవియును లేవు. ఇంతయగాక చూడదగినవియును, ఆఘ్రాణింపదగినవియును నగుపుష్పములు మొదలగునవి యేవియును లేవు. ఆదేశమునందు తుమ్మెదలు మొదలగునవి యేవియును లేవు. ఆయరణ్యమునందు బూర్వము మహానుభావుడును, సత్యముగమాటలాడువాడును, తపోధనుడును, అధికమగుకోపముగలవాడును, అధికములగు నియమములుగలవాడును, నగు కండువనియెడు మునీశ్వరుడుండె. అతని కావనమునందు బదునారుసంవత్సరములుగల పుత్రుడుండె. అతడు దైవయోగముచేత నాయరణ్యమునందు మరణమును బొందె అంతట నమ్మునివరుడు గోపోద్దీపితుడై యావనము దిక్కులేనిదియును, మృగములు పక్షులు మొదలగునవి లేనిదియును, పరులచేత బ్రవేశింప నలవిగానిదియును, నగుగాకయని శపించె. కాబట్టి యాయరణ్యము నిర్జనమైపోయె. అటువంటియడవిని, మరియునక్కడనుండుపర్వతములను, కొండచరియలను, మరియు నిర్జలములగు నదులనువెదకి యావానరవీరులు సీతను ఎందునుగానరైరి. మరియు నావానరవీరులు ఆయరణ్యమునందు జనకచక్రవర్తికి బుత్రికయగు సీతనొక్కదానినేగాక సీతాపహారమునుజేసిన రావణాసురునిగూడ జూడరైరి. అట్లు వెదకియును సీతారావణులను జూడకపోవుటచేత సుగ్రీవునకు బ్రియమును జేయువారలగు నావానరులు మిగుల వ్యసనమునుబొందిరి అంతగొంతసేపటికావానరవీరులందఱును ధైర్యమునవలంబించి తీగెలచేతను, పొదలచేతను, వ్యాప్తమైనదియును, మిగులభయంకరమైనదియును, నగునొక్కయరణ్యము నందు బ్రవేశించిరి. అట్లుప్రవేశించినతోడనే యావానరవీరులందఱును దేవతలకుగూడ భయమునుగలుగజేయువాడును, క్రూరములగుకర్మలనుజేయువాడునునగు నొక్కరాక్షసుని జూచిరి. అంతటబలవంతుడగు రాక్షసుడు యిట్లనియె.

వానరవీరులారా! మీరందఱును మరణమునుబొందితిరి. ఇకనెక్కడకు బోగలరనిచెప్పి మిగుల గోపోద్దీపితుడై పిడికిలినిగట్టిగాబట్టుకొని యావానరవీరులమీదికి బరుగెత్తివచ్చె. అట్లువచ్చిన రాక్షసునిజూచి యంగదుడు రావణాసురుడే వచ్చెననితలచి యారాక్షసుని దనహస్తతలముచేత గొట్టె అట్లు వాలిపుత్రుడగు నంగదుడు గొట్టగానే యారాక్షసుడు నెత్తురును గ్రక్కుచు భూమియందు బర్వతమువలె బడె. అవ్విధముగ నారాక్షసుడు మరణమును బొందగానే జయశీలురగు వానరవీరులందఱును మహానందమును బొందినవారై సకల దేశములయందును జక్కగావెదకిరి. పిమ్మట నావానరవీరులందఱును పర్వతముల చరియలచేత భయంకరమైనవియును, మానవులకు బ్రవేశింప నలవిగానివియును, నగుననేకవిధములగు నరణ్యములయందు సీతనువెదకిరి. ఇట్లు సకల దేశములయందును సీతనువెదకి యెందును గానక యావానరవీరు లందఱును నొకచోటునకు జేరి యొకచెట్టుక్రింద దీనమనస్కులై కూర్చుండిరి.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండము నందలి నలుబదెనిమిదవ సర్గ ముగిసెను.

*

అంగదుడు మొదలగువారు వింధ్యారణ్య ప్రాంతమును సర్వమును వెదకుట.

పిమ్మట మిగుల బుద్ధిమంతుడును, వెదకివెదకి మిగులనాయాసమును బొందినవాడును, నగునంగదుడు సకల వానరవీరులను మృదువచనములచేత నూరార్చి యిట్లనియె.

వానరోత్తములారా! మనము వనములను, పర్వతములను, నదులను, దుర్గములను, అరణ్యములను, కొండచరియలను, గుహలను, మఱియు నితరములగు ప్రదేశములను వెదకితిమి. అయ్యైస్థలములయందు సీతను గానమైతిమి. దేవతాస్త్రీలతో సమానురాలగు సీతను రావణాసురుడెక్కడనుంచెనోగదా? మనమేమిచేయుదము. మనముబయలుదేరి మాసముకావచ్చినది. సుగ్రీవుడు భయంకరమైనయాజ్ఞగలవాడు కాబట్టి యోవానరవీరులారా! మీరందఱును మిగుల బ్రయత్నము నవలంబించి సీతను వెదకుడు. మఱియు నోవానరవీరులారా! తొందఱను, దుఃఖమును, నిద్రను, విడిచిపెట్టి జనకచక్రవర్తికి బుత్రికయగు సీతనుదృఢమైన ప్రయత్నముతో వెదకుడు. మరియు నోవానరవీరులారా! "శ్లో ॥ అనిర్వేదంచదాక్ష్యంచ మనసశ్చాపరాజయః । కార్యసిద్ధికరాణ్యాహు స్తస్మాదేతద్బ్రవీమ్యహమ్" వ్యసనములేకయుండుటయును, సామర్థ్యముగలిగియుండుటయును, మనస్సునకు దుఃఖములేకయుండుటయును, కార్యసిద్ధినిగలుగజేయునని పెద్దలు సెప్పుదురు. కావునమనమందరమును, శోకమునువదలి మిగులసమర్థతనవలంబించి మనస్సునందు ధైర్యమును దెచ్చుకొని సీతనువెదుకవలయును. కాబట్టి యిప్పుడునుమనము విడువనియత్నముతో వ్యసనమును వదలి సమస్తదేశములను వెదకుటయుచితమని తోచుచున్న

ది. ప్రయత్నమును విడువక చేయువానికవశ్యముగా గార్యము సిద్ధించునని తోచుచున్నది. మఱియు నో వానరవీరులారా! మన సుగ్రీవుఁడు మిగుల కోపముగలవాఁడు. అంతియ గాక మిగులదీక్ష్ణముగ దండించువాఁడు. కావున మనమందఱమును నతని కి భయపడవలయును, మహానుభావుఁడగు రామునకుఁ గూడ వెరవవలయును. నేనీ విషయమును సర్వమును మీ హితము కొఱకుఁ జెప్పితిని. మీకిష్టమైనయెడల నిర్వ్యథముగా సంచరింపవలయును ఇట్లు గాదేని యో వానరవీరులారా! మీకందఱకును నెట్లు చేయుట యుచితమని తోఁచుచున్నదో యావిధముగాఁ జెప్పుఁడు. మీయిష్టానుసారముగ నేను బ్రవర్తించెదనని యె. ఇవ్విధముగాఁ జెప్పిన యంగదుని మాటను విని గంధమాదనుఁడనువాఁడు నీరువట్టుచేత మిగుల శ్రమనొందుచు నిట్లనియె.

ఓ వానరవీరులారా! అంగదుఁడిప్పుడేమి చెప్పెనో యా మాట మీకందఱకును నుచితమైయున్నది. మఱియు నీ యంగదుని మాట యనుకూలముగాఁ గూడనున్నది కాఁబట్టి మనమందఱమును నీయంగదుని వచనానుసారముగఁ జేయుదము వానరోత్తములారా! మనమందఱమును మరలఁ బర్వతములను, గుహలను, చరియలను, నిర్జనములగు నరణ్యములను, పర్వతప్రస్రవణములను, మఱియును మహానుభావుఁడగు సుగ్రీవునిచేతఁ జెప్పఁబడిన ప్రదేశములను, నానావిధములగు గిరిదుర్గములను, వెదకుదమనియె. అంతట మహాబలులగు వానరవీరులందఱును లేచి వింధ్యారణ్యములచేత వ్యాప్తమైన దక్షిణదిక్కును సర్వమును జూచిరి. మఱియు నావానర వీరులందఱును, శరత్కాలమునందలి మేఘములతో సమానమైనదియును, శ్రీమంతమైనదియును, నగురొక్కర జతపర్వతము నెక్కిరి. మఱియును సీతాదేవిని జూడవలయునని యెడు కోరికగల వానరవీరులందఱును, లొద్దుగవనములను, ఏడాకుల యరటి చెట్లవనములను, వెదకిరి. అట్లు సకల ప్రదేశములను వెదకి యా పర్వతము యొక్క శిఖరముమీద నెక్కి విపులమగు పరాక్రమముగల వానరవీరులందఱును శ్రమను దీర్చుకొనిరి పిమ్మట మరికొన్ని ప్రదేశములయందు వెదికియును, రామునకుఁ బ్రియురాలును, జనకచక్రవర్తికిఁ గుమార్తెయును, నగు సీతను నెందును గానరైరి. మఱియు నావానర వీరులందఱును, ఆపర్వతమునందలి నానావిధములగు గుహలను, చరియులను, మఱియు నితరములగు ప్రదేశములను వెదకి యెందును సీతాదేవిని జూడ జాలక యాపర్వతమునుండి క్రిందికిఁ డిగిరి అట్లు పర్వతమునుండి క్రిందికి దిగి బహుదూరము వెదుకుటచేత నలసిన చిత్తముగల యావానరవీరులందఱును నొక్కచెట్టు క్రిందఁ గూర్చుండి క్షణమాత్ర మాయాసమును దీర్చుకొనిరి. అట్లు క్షణము సేపు, ఆయాసమును దీర్చుకొనినవారై మరల దక్షిణదిక్కును సర్వమును వెదకుటకుఁ బ్రవర్తించిరి. అట్లు ప్రవర్తించి హనుమంతుఁడు మొదలుగాఁగల వానరవీరులందఱును వింధ్యపర్వతమునందలి సకలప్రదేశములను వెదకిరి.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి నలుబదితొమ్మిదవ సర్గ ముగిసెను.

హనుమంతుడు మొదలగువారు అగాధమగు నొకబిలమునందు బ్రవేశించుట.

అంతట హనుమంతుఁడు తారాంగదులనియెడు వానరవీరులతోఁ గూడ చేరుకొనినవాఁడై వింధ్యపర్వతము నందలి గుహలను, మఱియు నితరములగు నరణ్యములను, వెదకిరి. మఱియు శిలలతోఁ గూడుకొనిన నదులయందును, సింహములతోడను, పెద్దపులులతోడను, గూడుకొనినవియును, ఎచ్చుతగ్గులుగలవియును, నగు నా పర్వతము యొక్క ప్రస్రవణములయందును, మిగుల శ్రద్ధతో వెదకిరి. అట్లు వెదకి వెదకి యా పర్వతము యొక్క దక్షిణపశ్చిమ కోటులను జూచిరి. ఇవ్విధముగ వెదకుచుండగానే యా వానరవీరులకు నియమితమగు కాలమతిక్రమించిపోయె. ఆ వింధ్యపర్వతప్రదేశము గొప్పవగు గుహలతోడను, అడవులతోడను, గూడుకొనియుండుటచేత మానవులచేతఁ బ్రవేశింపనలవిగానిదై యుండెను అట్టి ప్రదేశమును సర్వమును వాయుపుత్రుఁడగు హనుమంతుఁడు మిగుల శ్రద్ధతో వెదకె మఱియు నా హనుమంతుఁడు తనతోఁ గూడ వెదకుచున్న వానరవీరులతోఁ జేరుకొని వెదుక నారంభించె. మఱియును, గజుఁడు, గవాక్షుఁడు, గవయుఁడు, శరభుఁడు, గంధమాదనుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, సుషేణుఁడు, జాంబవంతుఁడు, నళుఁడు, యువరాజగు నంగదుఁడు, సకలవనముల వృత్తాంతమును తెలిసిన తారుఁడును, పర్వతపఙ్క్తులచేత నావృతమగు దేశమును సర్వమును వెదకిరి.

ఇవ్విధముగ హనుమంతుఁడు మొదలగు వానర వీరులందఱును వెదకి యొకచోట మిగులఁ బెద్దదగు నొకబిలమును జూచిరి ఆబిలము ఋక్షబిలమనియెడు పేరుగలదై యుండె. మఱియు నది యెవ్వరికిని బ్రవేశింపనలవి గానిదియును, మిగుల భయంకరమై నదిమును నైయుండె. మఱియు నానావిధముల గు లతలచేతను వృక్షములచేతను వ్యాప్తమైయుండె. అట్టి బిలమును వానరవీరులందఱు నుత్క్షుత్పిపాసాక్రాంతుల చిత్తులగుచుఁ జూచిరి పిమ్మట నా దక్కమును ద్రాగవల

యునని కోరుచుండిరి. ఆసమయమునందా బిలములోనుండి క్రౌంచపుపక్షులును, హంసలును, బెగ్గురుపక్షులును బయలునకువచ్చె ఆచక్రవాకపుపక్షులు పద్మరేణువులచేత నెఱ్ఱనైనయవయవములు గలవియును, ఉదకముచేత దడిసినశరీరము గలవియును, నైయుండె మిగులఁబరిమళము గలదియును, ప్రవేశింపనలవిగానిదియును, నగుబిలమును జూచి యావానరోత్తములందఱును మిగులనాశ్చర్యమును బొందిన మనస్సుగలవారైరి. మఱియునా వానరోత్తములందఱును నాబిలమునుజూచి మిగులసందేహము గలవారైరి. మఱియును జేజోవంతులును, మహాబలులును, నగువానరవీరులందఱును నానావిధములగు ఘాతుకమృగములచేత వ్యాప్తమైనదియును, రాక్షసోత్తముఁడగు రావణాసురుని గృహముతో సమానమైనదియును, చూచుటకు గూడ శక్యముగానదియును, మిగులభయంకరమై నదియును, ప్రవేశింపనలవిగానిదియును, నగునాబిలముయొక్క సమీపమునకుఁబోయిరి. ఆసమయమునందు సకలారణ్యముల వృత్తాంతమును దెలిసినవాఁడును, వాయుదేవునకు బుత్రుఁడును, పర్వతకూటముయొక్క కాంతివంటి కాంతి గలవాఁడునునగు హనుమంతుఁడు సకలవానరవీరులను జూచి యిట్లనియె.

వానరోత్తములారా! పర్వత సముదాయములచేత వ్యాప్తములగు దేశములనన్నింటిని వెదకితిమి దక్షిణదిక్కును సర్వమును గలయ వెదకితిమి. తిరిగితిరిగియధికమగు నాయాసమును బొందితిమి. ఎంత శ్రమను బొంది నప్పటికిని సీతాదేవి కనఁబడదయ్యె. ఈబిలములోనుండి హంసలును, క్రౌంచపుపక్షులును, బెగ్గురుపక్షులును, చక్రవాకపుపక్షులును, ఉదకముచేతఁ దడిసిన వై బయలునకు వచ్చుచున్నవి కాఁబట్టివాస్తవము విచారించిచూడఁగా నిక్కడను దకముగల బావియో, లేక మడుగో, యొకటిగలదని తోఁచుచున్నది. మఱియునో వానరోత్తములారా! ఈబిలద్వారమునందు మృదువులగు వృక్షములుగలవు. కావున మనమీబిలమునందుఁ బ్రవేశింతమనియె. ఆమాటనువిని వానరవీరులందఱును సమాధానమును బొందినవారై రోమాంచమును గలుగఁ జేయుచున్నదియును, చీకటిచేతవ్యాప్తమైనదియును, సూర్యచంద్రులయొక్క కిరణప్రసారముగూడ లేనిదియును, నగునాబిలమునందుఁ బ్రవేశింపఁదలఁచిరి. అట్లుతలఁచి యాబిలములోనుండి బయలునకువచ్చుచున్న సింహములను, మృగములను, పక్షులను, పెద్దపులులనుజూచి చీకటిచేత వ్యాప్తమగునాబిలము నందుఁబ్రవేశించిరి. అట్లు ప్రవేశించునపుడు ఆవానరవీరులందఱును, దృష్టికిజోరవయొక్క, తేజంబునకుగమ్యంబుగాక, విక్రమమునకు ఉపక్రమింపరాక, నానావిధములగు వృక్షములచేతను, తీఁగలచేతను, పొదలచేతను వ్యాప్తమైనదియును, గగుర్పాటును గలుగఁ జేయుచున్నదియును, సూర్యచంద్రులయొక్క కిరణప్రసారము లేనిదియును, ప్రవేశింప నలవిగానిదియును, నైయున్న యాబిలముయొక్క మార్గమునందొకరినొకరు గాఁగలించుకొని యత్యంతసాహసముచేత నొకయామడ దూరముపోయిరి అట్లుకొంతదూరము పోయినపిమ్మట చీకటియధికంబగుటచేత మార్గభ్రష్టులైరి. అవ్విధముగ మార్గాయాసమును బొంది యావానరవీరులందఱును దప్పిచేత బాధింపఁబడు చుండుటవలనఁ బ్రతుకు మీఁదియాశనువిడిచిరి. అంతటవారిముఖములు వెలవెలనయ్యె. ధైర్యహీనులైరి మిగులవ్యసనముచేత నాక్రమింపఁబడిన చిత్తములుగలవారైరి. ఇవ్విధముగ నాబిలమధ్యమునందుఁ బరితపించుచుఁ గొంతసేపటికి ధైర్యమును దెచ్చుకొని యావానరవీరులందఱును నొకరినొకరుపట్టుకొని మఱికొంతదూరముపోయిరి. పోయినపిమ్మట నక్కడనొకచోట సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, గ్రహములు మొదలగునవి యన్నియును గుప్పగూర్చినట్లుగఁ బ్రకాశించుచున్న యొకతేజోరాశినిజూచిరి ఆతేజోరాశిచేత నాదేశమంతయును జీకటిలేనిదై యతిమనోహరముగఁ బ్రకాశించుచుండె అట్టిదేశమును జూచినపిమ్మట నావానరవీరులందఱును, ప్రకాశించుచున్న యగ్నిజ్వాలలతో సమానములగు కాంతులుగలిగి నటువంటియును, సువర్ణమయములైనవియునునగువీపిచెట్లను, తాటిచెట్లను, పున్నాగవృక్షములను, మద్దిచెట్లను, వంజుళవృక్షములను, అగిశెచెట్లను, సంపెగచెట్లను, నాగకేసరవృక్షములను, పుష్పించియున్న కొండగోగుచెట్లనుజూచిరి సువర్ణమయములగుపుష్పములచేతను, ఎఱ్ఱనివియును, చిత్రవర్ణములు గలవియునునగు పుష్పములతోఁగూడిన లతలచేతను నాదేశముమిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండె. అట్టిదేశమునుజూచి యావానరవీరులందఱును మిగుల నాశ్చర్యమును బొందిరి. మఱియు నావానరోత్తములందఱును బంగారపుసొమ్ములచేత నలంకరింపఁబడినవియును, బాలసూర్యునితో సమానములై నవియును, వైడూర్యములచేత నిర్మింపఁబడినతిన్నెలు గలవియును, మిగులమనోహరముగఁ బ్రకాశించుచున్నవియును, సువర్ణమయము లైనవియును, నగువృక్షములనుజూచి మిగుల నాశ్చర్యమును బొందిరి. మఱియు నుబత్తులచేత వ్యాప్తములైనవియును, ఇంద్రనీలమణులయొక్కయు, వైడూర్యములయొక్కయు వర్ణములవంటి

వర్ణములుగలవియును, నగుతామరలనుజూచిరి. మిగులగొప్పవియును, సువర్ణమయములైనవియును, బాలసూర్యునితో సమానములైనవియును, నగుపద్మములచేతను, సువర్ణమయములగు మత్స్యములచేతను, మిగులగొప్పవగు తాబేళ్లచేతను, వ్యాప్తములైనవియును, నిర్మలోదకములు గలవియునునగు తామరకొలకులనుజూచిరి మఱియునుసువర్ణమయములును, రజతమయమైనవియును, నగువిమానములను, ముత్యాలసరములచేత వ్యాప్తములయినవియును, బంగారముచేత రచింపఁబడినవియును, నగుకిటకీలను, బంగారముచేతను, వెండిచేతను నిర్మింపఁబడినవియును, వైడూర్యములచేతను, మణులచేతను జెక్కఁబడినవియునునగు ఉత్తమగృహములనుజూచి యానందమును బొందరి. మఱియునా వానరవీరులు సకలదేశములయందును, పుష్పించినవియును, ఫలములుగలవియును, పవడములతోడను, మణులతోడను, సమానములైనవియును, నగువృక్షములను, సువర్ణమయములగు తుమ్మెదలను, మిగులమనోహరములగు మద్యములను, మణులచేతను, బంగారముచేతను, జిత్రితములగుశయ్యలను, ఆసనములను, మిగులవెలగలవి యగుపరువులను, జూచియత్యాశ్చర్యమును బొందిరి. మఱియును బంగారముచేతను, వెండిచేతను, కంచుచేతను, చేయఁబడినపాత్రలను, దివ్యములైన యగరులయొక్కయు, చంధనములయొక్కయు సముదాయములను, పరిశుద్ధములైనవియును, భుజింపఁదగినవియును, నగుపదార్థములను, కందమూలఫలములను, మహార్ఘ్యములగు పానములను, రసవంతములగు మద్యములను, మిగులవెలగలవియును, దివ్యములైనవియును, నగువస్త్రములయొక్క సముదాయములను, చిత్రకంబళుల యొక్కయు, కృష్ణాజినములయొక్కయు సమూహములను, మఱియునక్కడక్కడ నుంచఁబడినవియును, అగ్నిజ్వాలలతో సమానములైనవియును, ప్రజ్వలించుచున్నవియును, నగువస్తుసముదాయములను, జూచియావాన వీరులందఱును మిగులనాశ్చర్యమునుబొందిరి మఱియునిర్మలములగు ననేకవిధధన రాసులనుజూచిరి. ఇట్టిచిత్రపదార్థముల ననేకములను జూచుచు నాబిలమునందంతటను, మహాబలులగువానరులు సీతాదేవిని మిగులజాగ్రతతో వెదకిరి. అట్లువెదకుచు నొకచోట నారచీరలను, కృష్ణాజినములను ధరించినదియును, తపోవంతురాలును, నియతమైన యాహారముగలదియును, అధికమగుతేజస్సుచేతఁ బ్రకాశించుచున్నదియును, నగునొకస్త్రీనిజూచిరి. ఆతపోవంతురాలినిజూచి యావానరులందఱును మిగులనాశ్చర్యమునుబొందిరి. అవ్విధముగ నాశ్చర్యము గలవారైచూచుచు నొకచోటఁగూర్చుండిరి. ఆసమయమునందు పర్వతముతో సమానుఁడగుఆంజనేయుడు చేతులను ముకుళించుకొని యాస్త్రీయొద్దకుబోయి నమస్కరించి మిగులవినయముతో నిట్లనియె.

అమ్మా! నీవెవ్వరు? ఈబిలమెవ్వనిది. ఇందలిరత్నములు మొదలుగాఁగల సకలపదార్థములును నెవ్వరివి? ఈ విషయమును సర్వమును మిగులదయతోఁ జెప్పుమనియడిగె

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యేబదవసర్గ ముగిసెను.

— ఆబిలమునందు స్వయంప్రభయను దానిని వానరులుజూచుట. —

ఇవ్విధముగా నడిగినపిమ్మట హనుమంతుఁడు, కృష్ణాజినములను, నారచీరలను ధరించినదియును, మహానుభావురాలును, తపోవంతురాలును, ధర్మయుతముగ సంచరించుచున్నదియును, నగునామహాదేవితో నిట్లనియె.

అమ్మా! క్షుత్పిపాసలచేత నలసటనుజెందిన వారమును, మిగులఖిన్నులమును, నగుమేమందఱమును చీకటిచేతవ్యాప్తమైన యీబిలమునందుఁ బ్రవేశించితిమి. మిగులగొప్పయడవుల ననేకములనుబూచితిమి. ఇప్పుడివ్విధముగా మిగులఁజిత్రములైనవియును, నానావిధములైనవియును, ఆశ్చర్యకరములును, నగునీవస్తువులనుజూచి మేమందఱమును మిగులమనోవ్యధగల వారమైతిమి. ఇంతయగాక మిగులమూఢమగు చిత్తముగలవారమైతిమి. బాలసూర్యునితో సమానమగు కాంతిగలవియును, సువర్ణమయములునునగు నీవృక్షములెవ్వనివి? మఱియునోతల్లీ! పరిశుద్ధములును, భుజింపదగినవియును, కందమూలఫలములును, బంగారపు విమానములును, బంగారముచేతఁ గట్టఁబడినవియును, ముత్యాలసరములచేత వ్యాప్తములైనవియునునగు కిటికీలును, పుష్పించినవియును, ఫలవంతములైనవియును, మనోహరమగు పరిమళముగలవియును, సువర్ణమయములైనవియును, నగునీవృక్షములెవ్వనివి? మఱియునోతల్లీ! ఈనిర్మలోదకమునందు బంగారపుపద్మములును, సువర్ణమయములగు చేపలును, తాబేళ్లును, ఎవ్వనియొక్కమహిమచేతఁ గలిగియున్నవి? ఇవియన్నియును నీమహిమవలననే గలిగినవా? లేక వేరొకని మాహాత్మ్యమువలనఁ గలిగినవా? ఈవిషయమునుగుఱించి మాకేమియును దెలియకున్నది. కాఁబట్టి మాకీవిషయమును సర్వమునుజెప్పుమని హనుమంతుఁడు మిగులవినయముతోనడిగె. ఇవ్విధముగా

హనుమంతుఁడు చెప్పినమాటనువిని తపోవంతురాలును, ధర్మముగ సంచరించునదియును, సకలభూతములకును హితమునుజేయుటయం దాశగలదియును, నగునాస్త్రీయాహనుమంతునితో నిట్లనియె.

వానరోత్తమా! పూర్వము మాయావియును, మిగుల తేజోవంతుఁడును, నగుమయుఁడనియెడు దానవోత్తముఁ డుగలఁడు. అతనిమాయచేత నిదియంతయును సువర్ణమయముగా నిర్మింపఁబడినది పూర్వమునందు ఆమయుఁడు రాక్షసోత్తములకందఱకును విశ్వకర్మయైయుండె అతనిచేతనే సువర్ణమయములగు నీగృహశ్రేష్ఠములన్నియును నిర్మింపఁబడియె. మఱియునామయుఁడు యీమహావనమునందు వేయిసంవత్సరములు ఘోరమగు తపస్సునుజేసె అట్లుతపస్సు జేయుటచేతఁ బ్రహ్మదేవుఁడు ప్రసన్నుఁడయ్యె అంతటనతఁడు బ్రహ్మదేవునివలన శిల్పిశాస్త్రజ్ఞానమును సర్వమును సంపాదించుకొనియె. అంతటనామయుఁడు సకలములగు కోరికలునుగలవాఁడై దివ్యమగునీవనమును గల్పించుకొని కొంచెముకాలము సుఖవంతుఁడైనివసించె మఱియునామయుఁడు హేమయనుపేరుగల దేవవేశ్యయం దభిలాషగలవాఁడై దానితోఁగూడ నీవనమునందు విహరించుచుండె. అట్లుండగనొకనాడు దేవేన్ద్రుఁడు గోపోద్దీపితుఁడై వజ్రాయుధముచేత నామయునిసంహరించె అప్పుడుబ్రహ్మదేవుఁడువచ్చి యావనమునుసర్వమును, దేవవేశ్యయగు నాహేమయను దానికిచ్చె. మఱియుదానికి శాశ్వతములగు కామోపభోగములును, సువర్ణమయములగు నీగృహములనునిచ్చె. అదిమొదలుకొని యాహేమయనునది యీసర్వమునకును నధిపతియైయున్నది ఓవానరోత్తములారా! నేనుమేరుసావర్ణి యను వానికిఁబుత్రికను నేనుస్వయంప్రభయను పేరుగలదానను. మఱియునో వానరోత్తమా! నేనుసర్వకాలములయందును నీగృహములను సర్వమును గాపాడుచుందును నృత్తగీతవిద్యయందు నేర్పుగలదియగు హేమయనునది నాకుబ్రాణసఖురాలు. నేను దానికి నీగృహమును సర్వమును గాపాడెదనని చెప్పితిని వానరోత్తములారా! మీరేమినిమిత్తముగ నిక్కడకువచ్చితిరి. ఏమినిమిత్తముగ మీరీయరణ్యముల నన్నింటినిజూచితిరి. మఱియునో వానరోత్తములారా! మీరుదుర్గమమగు నీబిలమునందు బ్రవేశించితిరి. మీరు తృప్తి పాసలచేతఁ బీడింపబడినవారై యుండుటవలన యిందలి కందమూలఫలములన్నిటిని జక్కగాభుజించి యీయుదకమునుగూడ బానముసేయుఁడు.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ఏబదొకటవసర్గముగిసెను.

—(*)—

వానరులు దమ వృత్తాంతమును స్వయంప్రభతోఁ జెప్పట.

పిమ్మట దపోవంతురాలును, ధర్మయుతముగ సంచరించుచున్నదియునునేకచిత్తురాలును, నగుస్వయంప్రభ విశ్రాంతులును, వానరోత్తములును, నగునావానరవీరులతోనిట్లనియె

ఓవానరోత్తములారా! మీరీఫలములను భక్షించినపిమ్మటమీకుఁగల మార్గాయాసముపోవును. పోయినపిమ్మట మీవృత్తాంతమును వినఁదలఁచియున్నాను. మీవృత్తాంతమును జెప్పుదురుగాతయనియె అంతటవానరు లందఱును యథేచ్ఛముగ నందలిఫలములను భుజించితృప్తిఁదీరునట్లు ఉదకపానమునుజేసిరి. అంతట వాయునందనుఁడగు హనుమంతుఁడు ఆతపోవంతురాలియొక్క మాటలనువిని తమ వృత్తాంతమును సర్వమును యథార్థముగఁ జెప్పుటకారంభించె తల్లీ! మావృత్తాంతమును సర్వమును జెప్పెదను. వినుము సర్వలోకములకును బ్రభుఁడును, దేవేన్ద్రునితోడను, వరుణదేవునితోడను సమానుఁడును, దశరథరాజనందనుఁడును, శ్రీమంతుఁడును నగురాముఁడు దండకావనమునందుఁ బ్రవేశించె. అరణ్యమునకు వచ్చునప్పుడు తమ్ముఁడగులక్ష్మణుని, భార్యయగుసీతను, వెంటబెట్టుకొనివచ్చె అంతటఁ గొన్నిదినములకు మహానుభావుఁడగు రామునియొక్కభార్యను దుర్మార్గుఁడగు రావణాసురుఁ డపహరించె. అంతటనామహానుభావుఁడుతమ్మునితోఁగూడ సీతనువెదకుచు నరణ్యమునందు దిరుగుచుండె. అట్లుతిరుగుచుండగ మహానుభావుఁడగు నారామునకు సుగ్రీవుఁడనియెడు పేరుగల వానరుఁడుమిత్రుఁడయ్యె. అంతట నాసుగ్రీవుడు మమ్ములనందఱిని సీతనువెదకుట కొఱకుఁబంపె. అంతట నేనుమిగుల భయంకరులగు నంగదుఁడు మొదలుగాఁగల వానరవీరులతోఁగూడ నీదక్షిణదిక్కునందు సీతనువెదకుట కొఱకువచ్చితిని మేమువచ్చునప్పుడు ఆసుగ్రీవుడు ఓవానరవీరులారా! విదేహరాజైనజనకునకుఁ బుత్రికయగుసీతాదేవిని, భయంకరుడును, కామరూపుఁడును, నగురావణాసురుని వెదకుఁడు. ఈవిషయమునందుఁ గొంచెమైననలసతను జెంద దగదనియె.

అంతటమేమందఱమును బయలుదేరి సంపూర్ణముగదక్షిణదిక్కున సర్వమును వెదకి వెదకియాకలిచేతను, దప్పిచేతను, బీడింపబడినవారమైయొకచెట్టుక్రింద గూర్చుంటిమి. అప్పుడు మేమందఱమునునేకవిధముల నాలోచించి యేమియు

ను జేయజాలక దీనవదనులమై, ధ్యానమును జేయుచుంటిమి. మఱియునయ్యెడ యధికముగ శ్రమను జెందియును సీతను జూడజాలకపోతిమిగదాయని విచారసముద్రమునందు మునిగితిమి. అట్లువిచారమును బొందుచునటునిటుచూచుచు దీగలచేతను, వృక్షములచేతను, చీకటిచేతను వ్యాప్తమైన యీబిలమునుజూచితిమి. అప్పుడుదకముచేతదడిసిన హంసలుతెక్కలయందలి యుదకమునువిదల్చుచు నీబిలమునుండి బయలునకువచ్చె. మఱియునల్లనిముక్కులును, ఎఱ్ఱనికాళ్లునుగల హంసలును, బెగ్గురుపక్షులును నీబిలములోనుండి బయలునకువచ్చె. అట్లువచ్చుటనుజూచి నేనీవానరులతో మనమీబిలమునందు బ్రవేశింతమనిచెప్పితిని. అంతట నీవానరులందఱును నాలోసమముగయోచించి దీనియందుబ్రవేశించిపోదమని నిశ్చయించిరి. అంతట మేమందఱమును, ఒకరిచేతినొకరుపట్టుకొని యీబిలమునందు బ్రవేశించితిమి. చీకటిచేత వ్యాప్తమైనయీబిలమునందు బ్రవేశించునపుడు భయభ్రాంతచిత్తములు గలవారమైతిమి. అయినను ధైర్యము నవలంబించి యీబిలమునందుబ్రవేశించి యాకలిచేతను, దప్పిచేతను బీడింపబడుచున్న మేమందఱమును నిన్నుజూచితిమి. అంతట మహానుభావురాలగునీవు మాయందుగరుణించి మాకు గందమూలఫలములను నాహారార్థముగ నిచ్చితివి. ఇప్పుడాకలిచేత బీడితులమగు మేమందఱమును గందమూలఫలముల భుజించితిమి. ఆకలిబాధచేత జచ్చుటకుసిద్ధముగానున్న మమ్ముల బ్రదికించితివి. వానరులమగు మాచేత జేయదగిన ప్రత్యుపకారమేదియో తెలుపుము. చేయుటకు సిద్ధముగనున్నామనినవిని స్వయంప్రభయనుపేరుగల యాతపోవంతురాలు వానరవీరులతో నిట్లనియె.

వానరోత్తములారా! బలవంతులగు మీయోగ్యతకు నేను సంతోషమును బొందితిని. ధర్మయుతముగ సంచరించుచున్న నాకితరులుచేయదగినది యేదియునులేదు. ధర్మముగ సంచరించువారలకు ధర్మదేవతయే సకలకార్యములను నెరవేర్చునుగదా! యనియె.

ఇట్లుశ్రీమత్కిష్కింధాకాండమునందలి యేబదిరెండవ సర్గ ముగిసెను.

స్వయంప్రభయొక్క తపఃప్రభావమువలన బిలములోనుండి అంగదాదులు బైలునకువచ్చుట.

ఇవ్విధముగా దపోవంతురాలగు స్వయంప్రభచేత ధర్మయుతముగ జెప్పబడిన వాక్యమునువిని హనుమంతుడుపరమానందమునుబొంది యనిందితురాలగు నాస్వయంప్రభతో నిట్లనియె.

ధర్మముగసంచరించునట్టి యోస్వయంప్రభా! తల్లీ! మేమందఱమును దిక్కులేనివారమై నిన్నురక్షకమునుగాగోరితిమి. మహానుభావుడగు సుగ్రీవుడు నెలదినములలోపల సీతను వెదకిరమ్మని యాజ్ఞనిచ్చిపంపె. అంతటమేమందఱమును బయలుదేరివచ్చితిమి. మేము బయలువెడలివచ్చి నెలదినములును నతిక్రమించిపోయినవి. కావునమమ్ముల నీబిలమునుండి బయలునకుబంపుము. సుగ్రీవునివచనము నతిక్రమించితిమేని మేముమరణమునుబొందుదుమనుటకు సందేహము లేదు. సుగ్రీవునివలని భయముచేత బీడితులమగు మమ్ము గాపాడుటకు మహానుభావురాలవగు నీవు తగుదువు ధర్మముగసంచరించునట్టి యోస్వయంప్రభా! మేము చేయదగినకార్యము మిగులగొప్పదైయున్నది అట్టిమహాకార్యమును మేమింతవఱకును జేయలేదనియె. ఇవ్విధముగ హనుమంతుడు చెప్పినమాటనువిని తపోవంతురాలగు స్వయంప్రభయిట్లనియె.

ఓవానరోత్తములారా! ఈబిలమునందు బ్రవేశించినవారు బ్రతికియుండగా మరలబయలునకు బోజాలరు. అయినప్పటికిని నేనునియమములచేత సంపాదించిన తపఃప్రభావముచేత వానరులగు మిమ్ములనందఱ నీబిలమునుండి బయలునకుబోవునట్లు చేయుదును. కావున నోవానరోత్తములారా! మీరందఱును నేత్రములను మూసికొనుడు. నేత్రములనుదెరచికొనియున్న వారీబిలమునుండి బయలునకుబోజాలరనియె. అంతటనావానరులందఱును సుకుమారములగు వ్రేళ్లుగలహస్తములచేత గన్నులనుమూసికొనిరి. మఱియునావానరవీరులందఱును నాబిలములోనుండి బయలునకుబోవలయుననియెడు కోరికచేత నతిశీఘ్రముగ గన్నులను మూసికొని చూపుబయలునకు రాకుండునట్లు చేసికొనిరి. అట్లు మహానుభావులగు నావానరవీరులందఱును చేతులచేత నేత్రములనుమూసికొనినవారైరి. అంతట నాతపోవంతురాలి మహిమచే నావానరులందఱును క్షణము సేపులో నాబిలమునుండి బయలునకువచ్చిరి అట్లుబయలునకు వచ్చినపిమ్మట దపోవంతురాలును, ధర్మయుతముగ సంచరించునదియునునగు నాస్వయంప్రభ, బిలములోనుండి బయలునకువచ్చినవారును, బలవంతులును, విషమమగు ప్రదేశమునుండి బయలునకు వచ్చిన వారును, నగువానరుల నూరార్చి యిట్లనియె.

ఓవానరోత్తములారా! ఇదిశ్రీమంతమగు వింధ్యపర్వతము. ఈపర్వతము నానావిధములగు వృక్షములతోడను, తీగలతోడను గూడుకొనియున్నది. ఇది ప్రస్రవణాచలము, ఇదిమహోదధి. మీరుబిలములోనుండి బయలునకువచ్చితిరి,

మఱియునోవానరోత్తములారా! మీకందఱకునునికమీఁద శుభములు గలుగఁగలదనిచెప్పి యాస్వయంప్రభ శ్రీమంతమగు నాబిలములోనికి బోయెను. అంతట నావానరవీరులందఱును మిగులభయంకరమైనదియును, వరుణదేవునకు నివాసస్థానమైనదియును, భయంకరములగు తరంగములతోఁ గూడుకొనినదియును, మిగులనధికముగ ధ్వనిజేయుచున్నదియును, మితిలేనిదియునునగు సముద్రమునుజూచిరి. పిమ్మట నావానరులందఱును మయునియొక్క మాయచేత జేయబడినదియగు పర్వతపుగుహాలయందు వెదకుచున్న యావానరులకు వానరాధిపతియగు సుగ్రీవునిచేత జేయబడిన యాజ్ఞాకాలమగునొక్కమాసము గడచిపోయెను. అట్లుమాసము దినములును నతిక్రమించినపిమ్మట బుష్పించిన వృక్షములుగల వింధ్యపర్వతముయొక్క ప్రాంతపర్వతమునందు గూర్చుండి యావానరవీరులందఱును విచారమునుబొందిరి. పిమ్మట నావానరులందఱును పుష్పములయొక్క యతిభారముచేత వంగిన శిరస్సులుగలవియును, అనేకనూరులతీగలతోఁగూడుకొన్నవియును, వసంతకాలమునందు బుష్పింపదగినవియునునగు వృక్షములనుజూచి భయముచేత సందేహములుగల చిత్తములుగలవారైరి. అంతటనావానరులందఱును వసంతకాలము వచ్చినదనియును, తమకునియమితమైన కాలమతిక్రమించి పోయినదనియును, దలచిభూమియందుబడిరి. అంతటసింహముయొక్కయు,వృషభముయొక్కయు,మూపురమువంటి మూపురముగలవాడును,బలిసినవియును, పొడవులును, నగుభుజములు గలవాడును, యువరాజును, మిగుల ప్రాజ్ఞుడును, నగునంగదుడు, వృద్ధులును, సదాచారములుగలవారును, వనమునందుసంచరించువారును, నగువానరవీరులను మృదుమధురవచనములచేత నూరార్చి యిట్లనియె.

వానరోత్తములారా! మనమందఱమును వానరాధిపతియగు సుగ్రీవునియాజ్ఞచేత బయలువెడలివచ్చితిమి. మనము బిలమునందుప్రవేశించి నెలదినములుంటిమి. అప్పుడు మనకు గాలనియమము తెలియలేదు. మనమాశ్వయుజమాసమునందు బయలువెడలివచ్చితిమి. ఆమాసమిప్పుడతిక్రమించిపోయినది. ఇకనిప్పుడుమనమేమిచేయుదము. మఱియునోవానరోత్తములారా! నీతిమార్గవిశారదులగు మీరందఱును విశ్వాసమునుబొందినవారలైతిరి. అంతయగాక హితములగుకార్యములయందిష్టముగలవారలైతిరి మఱియును సర్వకార్యములయందును దగినసామర్థ్యముగలవారు. కావుననే, మిమ్ములనందఱ సుగ్రీవుడుపంపె. మీరందఱును సకల కర్మలయందును సామ్యములేకప్రవర్తించువారలు. సకలదిక్కులయందునుప్రసిద్ధమైన పౌరుషముగలవారలు. మఱియు నోవానరోత్తములారా! మీరందఱును సుగ్రీవునియాజ్ఞనుబొందినవారలై నన్నునాయకునిగాజేసికొని బయలువెడలితిరి వచ్చినపిమ్మట మనమందఱమును బహువిధముల ప్రయత్నమును జేసితిమి. మనయత్నమేదియును గొనసాగకపోయెను. ఏకార్యమును జేయక పోవుటచేత నిప్పుడుమనము నిస్సంశయముగా మరణమును బొందదగి యున్నది. వానరాధిపతియగు సుగ్రీవునియాజ్ఞను నేరవేర్చనివాడు లోకములో నెవ్వడు సుఖవంతుడైయుండును. సుగ్రీవునిచేత నియమింపబడిన కాలమతిక్రమించిపోవుటచేత వనమునందు సంచరించు వానరులమగు మనమందఱమును ప్రాయోపవేశమును బొందుట యుచితమైయున్నది. సుగ్రీవుని స్వభావము మిగులదీక్ష్ణమైనది. అట్టిసుగ్రీవుడు స్వామియగు రామునికార్యమునందు ప్రవేశించియున్నాడు. కాబట్టిచెప్పినకార్యమును జేయక నియమితకాలమతిక్రమించి పోతిమేని మనల నాసుగ్రీవుడుసహింపడు. సీతాదేవియొక్క వృత్తాంతమును మనము తెలిసికొనలేకపోవుటచేత సుగ్రీవుడుమనయందు దాపకృత్యమునే చేయును కాబట్టియోవానరోత్తములారా! మనమిక్కడప్రాయోపవేశమును బొందుటయే యుచితమని తోచుచున్నది. మఱియు నోవానరోత్తములారా! పుత్రులను, భార్యలను, ధనములను, గృహములను, వదలిపెట్టి యిట్లువచ్చిన మనలనందఱను సుగ్రీవుడు నిశ్చయముగా హింసించును. మనము సుగ్రీవుడుచేయునట్టివధకు పాత్రులమగుటకంటె నిక్కడమరణమును బొందుటయే యుచితమని తోచుచున్నది. నన్ను సుగ్రీవుడు యావరాజ్యమునందభిషిక్తునిగా జేయలేదు అనాయాసముగ సకలకార్యములను జేయునట్టిరాముడు కరుణించినన్ను యావరాజ్యాభిషిక్తునిగాజేసె. సుగ్రీవునకు నామీద నింతకుముందె కోపముగలదు. అట్టి సుగ్రీవుడిప్పుడునాయందుదప్పునుగనిపట్టి తీక్ష్ణమగుదండనను విధింపవలయునని నిశ్చయించినవాడై నన్నువధింపగలడు. అట్లునన్నువధించునపుడు నాస్నేహితులందఱును మిగులవ్యసనమునుబొందుదురు. నేనక్కడకుబోయి స్నేహితులకందఱకును వ్యసనమునుగల్పించుటవలన నేమిప్రయోజనముగలదు. కావున పావనమగుసముద్రపుగట్టున ప్రాయోపవిష్టుడనయ్యెదనని యంగదుడుపలికె. యువరాజగు నంగదునిచేత నివ్విధముగాజెప్పబడిన మాటనువిని యావానరవీరులందఱును దయాపూర్వకములగు మాటలతోనిట్లనిరి. వానరోత్తమా! అంగదుడా! సుగ్రీవుడు సహజముగానే కఠినముగా దండించునట్టివాడు. రఘుకులోద్భవుడగు రాముడు సీతాదేవియందు ప్రియముగలవాడైయున్నాడు మనము సీతావృత్తాంతమును దెలిసికొనకపోతిమేని సుగ్రీవుడు రామునకు ప్రియముగలుగుటకు

మనల సంహరించును. ఇందు కేమియును సందేహములేదు. కాబట్టి తప్పును జేసినమనము ప్రభువగు సుగ్రీవునొద్దకు బోవుట యుచితముగనుండలేదు. కావున మనమిక్కడనే సీత నుగుఱించి యనేకవిధములగు ప్రయత్నములను జేయుదము. సీతావృత్తాంతమును దెలిసికొందము సీతావృత్తాంతము దెలిసినయెడల సుగ్రీవునొద్దకు బోదము. లేనియెడల నిక్కడనేమరణమునుబొంది యమలోకమునకుబోదమని యావానరవీరులందఱును నంగదునితో జెప్పిరి. ఇవ్విధముగా భయముచేత జెప్పుచున్నవానరుల వచనములను విని తారుడనియెడు వానరవీరుడు ఆవానరవీరులతో నిట్లనియె.

ఓవానరోత్తములారా! మనమువ్యసనమును బొందుటవలన బ్రయోజనమేమియునులేదు. కావునవ్యసనమునువదలిపెట్టి మీకందఱకును నిష్టమైనయెడల నామాటను వినుడు మీకుసమ్మతమైనయెడల మనమీబిలమునందు బ్రవేశించియుందము. ఈబిలము మాయచేత నిర్మింపబడినది కావున దీనియందెవ్వరును బ్రవేశింపజాలరు. ఈబిలమునందనుభవింపదగిన వృక్షములు ఫలములుమొదలుగాగల పదార్థములు అనేకములుగలవు కావున మనమీబిలమునందు బ్రవేశింతము ఈబిలమునందు బ్రవేశించితిమేని మనలనింద్రుడుగాని, సుగ్రీవుడుగాని, రాముడుగాని యేమియును జేయజాలరని తారుడను వానరోత్తముడు సెప్పె ఈవిధముగా నంగదునియభిప్రాయమున ననుసరించి తారుడుచెప్పినమాటలనువిని యావానరవీరులందఱును నిట్లనిరి వానరోత్తమా! ఏవిధముగా బ్రవర్తించిన యెడల మనకందఱకును మరణము గలుగకుండునో యావిధముగా నాలోచించిచెప్పుము. మేమందఱమును మీరుచెప్పినట్లుసేయుటకు సిద్ధముగ నున్నామనిరి.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యేబదిమూడవసర్గ ముగిసెను.

—(*)—

సీతాదేవినిగానకమరణమునుబొంద నిశ్చయించినఅంగదునకు ఆంజనేయుడునీతినిబోధించుట

అవ్విధముగ జంద్రునితో సమానుడగు తారుడనువాడు చెప్పుచుండగా హనుమంతుడు, వానరరాజ్యమునుసర్వమును నంగదునకు బాలించునట్టిశక్తి యున్నదనితలచె అట్లుతలచినపిమ్మట నాహనుమంతుడు, శుశ్రూష,వినికి,గ్రహణశక్తి, ధారణశక్తి, ఊహాపోహలు, అర్థవిజ్ఞానము,తత్త్వజ్ఞానములనియెడు నెనిమిదగు బుద్ధిగుణములుగలవాడును, బాహుబల, ఉపాయబల, బంధుబల, మనోబలము లనియెడు నాలుగుబలములతో గూడుకొన్నవాడును, మఱియును సామ, దాన, భేద, దండము, లనియెడు నాలుగువిధములగు బలములుగలవాడును, దేశకాలజ్ఞానము, దృఢత్వము, సర్వదుఃఖములనుసహించుట, సర్వవస్తువివేకము, సమర్థత, ఊర్జితత్వము, ఆలోచన, బయలుపడకుండునట్లుచేయుట, పదిమందితో నేకరూపముగా నాలోచించుట, శౌర్యము, శక్తిజ్ఞానము, చేసినమేలును మరవకుండుట, శరణాగతులయందువాత్సల్యము, కోపములేకయుండుట, చాపల్యములేకయుండుట యనియెడు పదునాలుగు గుణములుగలవాడును, వాలికిబుత్రుడును, తేజోబలపరాక్రమములచేత నిండియున్నవాడును, శుక్లపక్షచంద్రునివలె వృద్ధినొందుచున్నవాడును, బుద్ధిచేత బృహస్పతికి సమానుడును, పరాక్రమమునందు దండ్రికిసమానుడును, బృహస్పతికి దేవేంద్రుడు శుశ్రూషను జేసినవిధముగ దారుడను వానరోత్తమునకు శుశ్రూషను జేయుచున్నవాడును, ప్రభువగు సుగ్రీవునికొఱకు మిగులశ్రమను జెందినవాడును, సర్వశాస్త్రములను దెలిసినవారలలో నుత్తముడును, నగునంగదుని ననుకూలునిగా జేసికొనుటకుయత్నించె. ఆహనుమంతుడు సామ, దాన, భేద, దండము, లనియెడు నాలుగువిధములగు నుపాయములలో మూడవదగుభేదోపాయము నవలంబించి మృదుమధురములగువాక్యముల సంపదచేత నావానరులకందఱకును భేదబుద్ధినిగల్పించె అవ్విధముగ నావానరులందఱును భేదబుద్ధిగలవారగుచునుండగా భయంకరములయినవియును, నానావిధములైనవియును, కోపమును గలుగజేయునవియును నగు మాటలచేత నంగదునకు భయమును గలిగించె. పిమ్మట నిట్లనియె.

తారాపుత్రుడవైన యోయంగదుడా! నీవుయుద్ధమునందు నీతండ్రియగువాలికి సమానుడవు కావున నీతండ్రివలె నీవును వానరరాజ్యమును బాలింపగలవాడవు. వానరోత్తముడవైన యోయంగదుడా! వానరులు సర్వకాలములయందును అస్థిరమగు చిత్తముగలవారు. కావున నీవానరులందఱునుదమతమ దారాపుత్రాదులనువదలి నీయాజ్ఞయందేనిలిచియుండరు. మఱియు నీవానరులందఱును నిన్నాశ్రయించుకొనియుండరు. నేనివిషయమునుమరుగుగా జెప్పక ప్రత్యక్షముగా జెప్పుచున్నాను. జాంబవంతుడు, నీలుడు, సుహోత్రుడు, నేను, మఱియు నితరులును, సామదానభేదదండోపాయములలో దేనిచేతను నీకువశ్యులై యుండరు మేమెవ్వరమును సుగ్రీవునివిడువము. బలవంతుడుబలహీనునితో బిలిచియైననుయుద్ధమునకు బోవచ్చును. బలహీనుడు బలవంతునితో యుద్ధమునకు బోవుటతగునా? తనకు క్షేమమురాపలయునని తలచునట్టి బలహీను డీలోకమునందెక్కడను బలవంతునితో గలహించుటకుయత్నింపడు. మఱియు

నోయంగదుడా! ఈలోకమునందెవ్వరైనను, ఓర్పుతో దేశకాలములను దెలిసికొని ప్రబలుడగువానితో యుద్ధమును జేయుదురుగాని దుర్బలునిస్నేహమునుగోరుదురా? వివేకవంతులు దుర్బలునిబొందు గోరరు. మఱియు నోయంగదుడా' మనముబిలమునడాగినయెడల నెవ్వరును భేదింపజాలరని తలచుచున్నావు. ఈబిలమును లక్ష్మణుడుబాణములచేత క్షణములో బ్రద్దలుచేయగలడు. పూర్వమునందు దేవేంద్రుడు తనవజ్రాయుధముచేత నీబిలమును స్వల్పముగాజేసె. ఇప్పుడు లక్ష్మణుడుతనబాణములచేత బత్రపుటమునకుదూట్లుపొడిచిన విధముగ గూట్లనుబొడువగలడు. మఱియునోయంగదుడా! వజ్రాయుధముతో సమానమైన సర్శగలవియును, పర్వతములకంటె దారుణమైనవియును, నగుబాణములనేకములు లక్ష్మణునకు గలవు. మఱియును శత్రువులను దపింప జేయునట్టి యోయంగదుడా! నీవిప్పుడుబిలమునందుప్రవేశించితివేని యీవానరులందఱును నిశ్చయముగా విడిచిపెట్టగలరు. మఱియునీవానరు లందఱును భార్యాపుత్రులనుస్మరించువారును, సర్వకాలములయందును ఉద్వేగము గలవారును, ఆకలిచేతబీడింపబడినవారును, దుఃఖశయ్యలచేత ఖేదమునుబొందినవారును, నగుదునిన్నువదలిపెట్టి పోగలరు అంతటనీవు స్నేహితులచేతను, హితమును గోరుచున్నవారును, బంధువులును, నగువారలతో హీనుడవై కదలుచున్న తృణముకంటె నధికముగా నుద్వేగముగలవాడవగుదువు. కాబట్టి యిప్పుడు నీవాలోచించిన విధముగ జేయుట యుచితముగ నుండలేదు. హీనబలుడవగు నిన్ను మిగుల వేగముగలవియును, భయంకరములైనవియును, పరులచేత నాక్రమింప శక్యముగానివియును, నగు లక్ష్మణుని బాణములు బాధింపజాలవు. మాతోగూడ వచ్చిన వాడవును, మిగులవినయముతో నిలుచున్నవాడవును, నగునిన్నుసుగ్రీవుడు క్రమముగారాజ్యమునందు బట్టాభిషిక్తునిగా జేయగలడు. మఱియునోయంగదుడా! నీపినతండ్రియగు సుగ్రీవుడు ధర్మమునుగోరువాడనియును, నీయందు ప్రేమగలవాడనియును, దృఢవ్రతుడనియును, శుచిగలవాడనియును, సత్యమునుదప్పనివాడనియును, తెలిసికొనుము. ఇట్టిగుణములుగల సుగ్రీవుడు నిన్నెప్పటికిని హింసించు వాడుగాడు. మఱియు నోయంగదుడా! నీపినతండ్రియగు సుగ్రీవుడు నీతల్లియగుతారయందు మిగులప్రేమగలవాడు. కాబట్టి నిన్నుజంపడు. కావుననీవీభయమునువదలి సుగ్రీవునొద్దకురమ్మనియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యేబదినాల్గవసర్గముగిసెను

(*) —

— హనుమంతునిమాటనులక్ష్యపెట్టక అంగదుండు మొదలగువారుప్రాయోపవేశమును జేయుట. —

ఇవ్విధముగ హనుమంతుడుచెప్పిన మాటనువిని యంగదుడుమిగులవినయమును జూపించుచున్నదియును, ధర్మయుక్తమైనదియును, స్వామి సత్కారముతో గూడుకొన్నదియును, నగుమాటను జెప్పదలచి యిట్లనియె.

హనుమంతుడా! సుగ్రీవునియందు స్థిరబుద్ధియును, మనఃపరిశుద్ధియును, ఊర్జితత్వమును, పరాక్రమమును, ధైర్యమునుననునట్టి గుణములులేవు. సుగ్రీవు డన్నయగు వాలి జీవించియుండగా నతనికిబట్టపుదేవియగు తారను బరిగ్రహించె అన్నబ్రదికియుండగా అన్నభార్యతల్లి యనబడును. అటువంటితల్లిని భార్యనుగాబరిగ్రహించిన సుగ్రీవుడెట్టిదుష్కార్యమును జేయడు. మఱియునోహనుమంతుడా! అన్నయును, మహానుభావుడును యుద్ధమునకుద్యుక్తుడును నగు వాలిచేత బిలద్వారమునందుండుమని చెప్పబడిన సుగ్రీవుడు వాలి బిలములోనికిబోగానే బిలద్వారమును శిలచేతగప్పె. ఇంతయగాక మనసుగ్రీవుడు, సత్యముగా జేతిని బట్టుకొని స్నేహమును జేసినవాడును, ముందుగానుపకారమును జేసినవాడును, గొప్పదగుకీర్తిగలవాడును, నగురామునివృత్తాంతమునుమరచిపోయె. అట్టిసుగ్రీవుడెట్టికార్యమును జేయడు. సుగ్రీవుడులక్ష్మణుని బాణములచేత జచ్చిపోదుమనియెడుభయముచేత సీతను వెదకుటకు మనలనునియమించెనుగానియు ధర్మ భయముచేత సీతనువెదకుటకు మనలను నియమించినవాడుగాడు. అటువంటిసుగ్రీవునియందు ధర్మమెట్లుండును. అటువంటిపాపాత్ముడును, కృతఘ్నుడును, స్మృతిహీనుడును, చపలస్వభావముగలవాడును, నగుసుగ్రీవునియందుబూజ్యుడును, సత్కులమునందుబుట్టినవాడును, బ్రదుకవలయుననియెడు కోరికగలవాడును, నగునెవ్వడునమ్మకమును బెట్టును. మఱియు నోహనుమంతుడా! గుణవంతుడైనను, గుణహీనుడైనను, మఱియునెట్టివాడైనను, పుత్రుడురాజ్యమునందు స్థాపింపదగినవాడుగదా? శాస్త్రమిట్లుండగా శత్రుకులమునందుబుట్టిన నన్నుసుగ్రీవుడెట్లు బ్రదుకనిచ్చును. భిన్నమైనరహస్యవృత్తాంతముగలవాడను, అపరాధమును జేసినవాడను, హీనమైన శక్తిగలవాడను, దుర్బలుడను నగు నేను గిష్కింధాపట్టణమునకుబోయి యెట్లుజీవింపగలను. శఠుడును, క్రూరుడును, ఘాతకుడును, నగుసుగ్రీవుడు రాజ్యాభిలాషచేత రహస్యదండము చేతను, బంధనముచేతను, నన్నుసంహరించును. నేనుబంధనమునుబొంది మరణమునుబొందుటకంటె ప్రాయోపవేశమును బొందుట యుచితమని తోచుచున్నది. కావున నోవానరోత్తములారా!

నేనుమరణమునుబొందుట కొఱ్ఱనిందు. మీరందఱునుగృహమునకుబొండు. నేను మీకందఱకును నాజ్ఞనిచ్చుచున్నాను. నేనుగృహమునకు రాను. నేనిక్కడనే ప్రాయోపవేశమునుబొందెదను. నాకుమరణమును బొందుటయే యుత్తమమనితోచుచున్నది. మీరుపోయిబలశాలులగు రామలక్ష్మణులకును, వానరాధిపతియగు సుగ్రీవునకును ముందుగానానమస్కారమునుజెప్పి వారికుశలమునడిగితినని చెప్పుడు. మఱియువానరాధిపతియును, పినతండ్రియును, నగు సుగ్రీవునితో నేనువిశేషముగా కుశలప్రశ్నను జేసితినని చెప్పుడు. మఱియు నోవానరోత్తములారా! మాతల్లి యగు తారతోడను, పినతల్లి యగురుమతోడను, ఆరోగ్యపూర్వకముగకుశలమును నేనడిగితినని చెప్పుడు. మఱియు నోవానరోత్తములారా! మాతల్లియగుతార ననేకవిధముల నూరార్పవలయును. దీనురాలును, పశ్చాత్తాపము గలదియును, మాకుదల్లియును, నగు తారస్వభావముగాఁ బుత్రునియందు ప్రియముగలది. నేనుచచ్చిన వృత్తాంతమును వినినతోడనే మాతల్లియగు తార ప్రాణమునువిడిచిపెట్టుననియె ఇవ్విధముగాజెప్పి యాయంగదుడు వృద్ధులగు వానరులకందఱకును నమస్కారమునుజేసి మిగుల వ్యసనముతో భూమియందు దర్భలనుబరచుకొని యందు బ్రవేశించె. అవ్విధముగ నంగదుడుప్రవేశించగానే యావానరులందఱును నధికమగుదుఃఖముతో వ్యసనమునుబొందుచు నేత్రములనుండి వెచ్చనినీళ్లను విడిచిరి. మఱియునావానరులందఱునుఅనేక విధముల వాలిని బ్రశంసించుచు సుగ్రీవుని నిందించిరి. అంతట నావానరులందఱునునంగదునిజుట్టుకొని ప్రాయోపవేశమును జేయుటకు యత్నించిరి మఱియు నావానరులందఱును వాలియొక్కపుత్రుడగు నంగదుని మతము నవలంబించిరి. పిమ్మటవారందఱును, జలస్పర్శను జేసి తూర్పుదిక్కునకభిముఖులై దర్భలయందు బరుండిరి. ఆదర్భలను దక్షిణాగ్రములుగా బరచిరి. మఱియు నావానరులందఱును మరణమును బొందవలయు ననియెడు కోరికగలవారై ప్రాయోపవేశము చేత మరణమునుబొందుటయే యుచితమనితలచిరి. అవ్విధముగ నావానరులందఱును ప్రాయోపవేశమును జేసి రామునివనవాసవృత్తాంతమును, దశరథమహారాజుయొక్క మరణవృత్తాంతమును, జనస్థానవధను జటాయువుయొక్క నాశమును, సీతాపహరణవృత్తాంతమును, యుద్ధమునందువాలిచచ్చిపోవుటను, రామునకుగోపమువచ్చుటను, తమకు భయముగలుగుటకు గారణమును జెప్పుకొనుచుండిరి. అట్లు చెప్పుకొనుచుండగా పెద్దరొదగలిగె ప్రాయోపవేశమును బొందినవారును, అనేకులును గొప్పవగుపర్వతశిఖరములతో సమానులును, మేఘములవలె నధికముగా ధ్వనిజేయుచున్నవారును, నగువానరులయొక్కయామహాధ్వని పర్వతపుచరియలయందు బ్రవేశించుటయేగాక భూమ్యాకాశములయందుగూడ వ్యాపించె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండము నందలి యేబదైదవ సర్గముగిసెను

(※)

{ప్రాయోపవేశము జేయుచున్న వానరులభక్షించుటకొఱకు సంపాతియనుపక్షి వచ్చుట.}

ఆవానరులందఱును ఏపర్వతమునందు ప్రాయోపవేశమును జేసియుండిరో యాప్రదేశమునకువచ్చుటకు గృధ్రరాజగు సంపాతియనువాడు ఉపక్రమించె. అంతట సంపాతియను నామధేయముగలవాడును, చిరంజీవియును, జటాయువునకన్నయును, శ్రీమంతుడును, ప్రసిద్ధములగుబలపౌరుషములుగలవాడును,నగు పక్షిశ్రేష్ఠుడు వింధ్యపర్వతముయొక్కగుహాలోనుండి బయలువెడలివచ్చి ప్రాయోపవేశమును బొందియున్న వానరులనుజూచి యిట్లనియె.

దైవమే లోకములో బ్రతిమనుష్యునిదగిన కర్మలయందు బ్రవేశపెట్టును. కావుననే దైవముచిరకాలమునకు నాకు భక్ష్యమునుసంపాదించియిచ్చె. కావున నేనిప్పుడీవానరులలో నుత్తములగు వారలను జంపిచంపి భక్షించెదనని యావానరులనుజూచి చెప్పె అవ్విధముగ దమను భక్షింపవలయునని యెడు నాశతో బలుకుచున్న సంపాతియొక్క మాటనువిని యంగదుడు మిగుల నుద్వేగముగలవాడైహనుమంతునితో నిట్లనియె.

హనుమంతుడా! చూడుము. వైవస్వతుడగుయముడు గృధ్రమనియెడు నెపముచేత వానరులమగు మనలనశింపజేయుటకిక్కడకు వచ్చియున్నాడు. మనము బహువిధములగు ప్రయత్నములను జేసియును రామునికార్యమును నెరవేర్చినవారము గాము. మఱియును వానరరాజగు సుగ్రీవునివాక్యమును నెరవేర్చినవారమును గాము. వానరులమగు మనకు దెలియకనే యీయాపద వచ్చినది. మఱియు నోహనుమంతుడా! సీతాదేవికి బ్రియమును జేయవలయు ననియెడు కోరికగల జటాయువుచేత ఏకార్యము చేయబడినదో యదియంతయును నీకువినబడినదిగదా? అటులనే పశుపక్షిమృగాదులన్నియును బ్రాణములనుగూడవదలి మనవలెనే రామునకు బ్రియమునుజేయుచున్నవి. మఱియు సకలజంతువులును పరస్పరస్నేహబద్ధులై రామున కుపకారమును జేయుదురు. కావునరామునకు ఉపకారమును జేయుటకొఱకు మనముమనప్రాణములను విడిచిపెట్టుదము. సకల

ధర్మములను దెలిసిన జటాయువుచేత రామునకు ప్రియము చేయబడినది. మనమందఱమును జీవితాశను విడిచిపెట్టినవారమై రామునికొఱకు మిగుల నాయాసమును బొందినవారలమైతిమి. మఱియు నో హనుమంతుడా! మనమనేకములగు నరణ్యములయందు వెదకితిమి. వెదకియును సీతను దెలిసికొనలేకపోతిమి. గృధ్రరాజగు జటాయువు రావణాసురునితో యుద్ధమును జేసి మరణమును బొంది సుఖవంతుడయ్యె. సుగ్రీవునిభయమునువదలి జటాయువు ఉత్తమలోకమును బొందె. జటాయువుయొక్కయు, దశరథమహారాజుయొక్కయు నాశముచేతను, రావణాసురుడు సీతనెత్తికొనిపోవుటచేతను యోచించిచూడగా మనముగూడ జీవితాశనువదలినవారమైతిమి. దశరథమహారాజు కైకేయికి వరమునిచ్చుటచేత సీతతోగూడ రామలక్ష్మణులరణ్యమున నుండవలసివచ్చె. రామునిబాణముచేత వాలి మరణమును బొందె. మఱియు రామునికోపముచేత రాక్షసకులమంతయును నశింపవలసి యున్నది. కావున యోచించిచూడగా కైకేయికివరమునిచ్చుటచేత ఇన్నికార్యములు జరిగినవియనియె. ఇవ్విధముగ భూమియందు బరుండి చెప్పుచున్నమాటలనువిని సంపాతి యధికముగా జలించుచున్నబుద్ధిగలవాడగుచు మిగుల దీనస్వరముతో నిట్లనియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యేబదిఆరవసర్గ ముగిసెను.

———*———

సంపాతికిఅంగదుడు మొదలగు వానరులుజటాయువుయొక్కమరణవృత్తాంతమును జెప్పుట.

అంతట దీక్ష్ణమైన తొండము గలవాడును, గొప్పదగు కంఠధ్వనిగలవాడును, నగుసంపాతి యంగదుని నోటనుండిచెప్పబడిన మాటలనువిని యిట్లనితలచె. ఓహో! వీడెవడు? నాప్రాణములకంటె నాకు ప్రియుడును, నాకుదమ్ముడును, నగుజటాయువుయొక్క చావునుగుఱించి చెప్పుచున్నాడు. ఈమాటలు నాహృదయమునకు గంపమునుగలుగజేయుచున్నవి. జనస్థానమునందు రావణాసురునకును జటాయువునకును యుద్ధమెట్లయ్యె. చిరకాలమునకు నాతమ్ముడగు జటాయువుయొక్క పేరునువింటిని అనిచెప్పి వానరులతో నిట్లనియె.

వానరోత్తములారా! నన్నీపర్వత దుర్గమునుండి క్రిందికిదింపుడు. నాకుదమ్ముడును, గుణములను దెలిసిన వాడును, నగుజటాయువుయొక్క వృత్తాంతమును జిరకాలమునకు మీవలనవిని సంతోషించినవాడనైతిని. కాబట్టి యో వానరోత్తములారా! నాతమ్ముడగు జటాయువుయొక్క మరణవృత్తాంతమును జక్కగదెలిసికొనవలయునని కోరిక గలిగియున్నది. మఱియు నో వానరోత్తములారా! జనస్థానమునందు నివసించుచున్నవాడును, నాకుదమ్ముడును, నగు జటాయువునకు గురుజనమునందు ప్రియముగలరామునకు దండ్రియైన దశరథమహారాజెట్లుమిత్రుడయ్యె? నేను సూర్యునికిరణములచేత గాల్పబడిన రెక్కలుగలవాడగుటచేత మీసమీపమునకు రాజాలనైతిని. శత్రునాశకులైన యో వానరోత్తములారా! నేనీపర్వతమునుండి దిగవలయునని కోరుచున్నాడననియె. అంతట నావానరాధిపతులందఱును నాసంపాతిదుఃఖముచేత హీనమైన స్వరముగలిగియుండుటను దెలిసికొనియును నాసంపాతియొక్క కర్మచేత గొంచెమైనను నమ్మకము లేనివారలైరి. మఱియు నవ్విధముగా ప్రాయోపవేశమును బొందియున్నవానరులందఱును నా సంపాతినిజూచి మిగులభయమునుజెంది నిశ్చయముగా నీ పక్షిమనలను భక్షించుననిరి. మనమందఱమును నిప్పుడు ప్రాయోపవేశమును బొందియుంటిమి. ఇట్టి మనలనీపక్షి భుజించుట యుత్తమమేగదా? ఈపక్షి మనలనుభుజించిన యెడల మనముధన్యులమగుదుము. ఇంతయగాక యుత్తమలోకమును బొందుదుమని యావానరులందఱును దలచుకొనిరి. అంతట నంగదుడాసంపాతిని గ్రిందికిదింపునట్లుచేసె. అట్లుతనయొద్దకు దెప్పించియిట్లనియె.

పక్షీంద్రుడా! పూర్వము ఋక్షరజుడనియెడు పేరుగలవాడును, ప్రతాపవంతుడును, నగువానరేంద్రుడు గలడు. అతడునాకుతాతగారు. అతడుపరమధార్మికుడు. మఱియునతనికి వాలిసుగ్రీవులనియెడు నిరువురుపుత్రులు పుట్టిరి ఆపుత్రులిద్దఱును నధికబలవంతులు. అయిరువురిలో మిగుల ప్రసిద్ధమైన కర్మగలవాలి నాకుదండ్రి. సకలలోకములకును ప్రభుడును, ఇక్ష్వాకువంశపువాడును, నగు రాముడు దండకావనమునందు ప్రవేశించె. ఆమహానుభావుడు, తమ్ముడగులక్ష్మణుని, భార్యయగుసీతను, వెంటబెట్టుకొనివచ్చె. ఆరాముడు తండ్రియగు దశరథమహారాజుయొక్క యాజ్ఞానుసారముగ సంచరించువాడు. ఇంతయగాక రాముడుధర్మయుతమగు మార్గమును దప్పకసంచరించువాడు. ఆరామునియొక్క భార్యయగుసీతను రావణాసురుడు జనస్థానమునం దపహరించె. అపహరించి తనరథముమీద నెక్కించుకొనిపోవుచుండె. అప్పుడు రామునితండ్రియైన దశరథమహారాజునకు మిత్రుడును, జటాయువనియెడు పేరుగలవాడును, నగుగృధ్రరాజు రావణాసురునిచేత నెత్తికొనిపోబడుచున్న సీతను జూచె. చూచిరావణాసురుని విరథునిగాజేసి సీతనుఅక్కడనుండి

పోకుండునట్లు సేసె. అంతట బలవంతుఁడగు రావణాసురుడు మహాకోపముగలవాఁడై పక్షీంద్రుఁడగు నాజటాయువును జంపె. అట్లు యుద్ధమును జేసి యాజటాయువు మిగుల నలసినవాడును, ముసలివాడునునగుటచేత రావణాసురునిచేతఁ జంపబడియె. అంతట రావణాసురుడు సీతనెత్తుకొని యథేచ్ఛముగఁ బోయెను. అంతఁ గొన్నిదినముల కక్కడకు రాముఁడువచ్చి జటాయువుయొక్క వృత్తాంతమును సర్వమును దెలిసికొని యాజటాయువునకు అగ్నిసంస్కారమును జేసె. అందువలన జటాయువు ఉత్తమలోకమును బొందె. అంతట రాముఁడచ్చటనుండి బయలువెడలి మతంగాశ్రమమునందు నివసించియున్నవాడును, నాకుఁబినతండ్రియునునగు సుగ్రీవునితో స్నేహమును జేసె

అవ్విధముగ రాముఁడు సుగ్రీవునితో స్నేహమును జేసి నాతండ్రియగు వాలిని సంహరించె. నాతండ్రియగువాలికిని, పినతండ్రియగు సుగ్రీవునకును మహావైరము గలిగియుండె. కాఁబట్టి రాముఁడు వాలిని జంపి సుగ్రీవుని వానర రాజ్యమునందు స్థాపించె. అంతట వానరోత్తములకు రాజగు సుగ్రీవుఁడు సీతను వెదకుటకొఱకు మమ్ములఁ బంపె ఇట్లు రామసుగ్రీవులచేతఁ బంపఁబడినవారమై సకలదేశములయందును సీతను వెదకివెదకి "రాత్రియందు సూర్యకాంతి నిజూడలేనివిధముగ" సీతను జూడలేకపోతిమి. అంతట నూరకుండక దండకారణ్యమును సర్వమును వెదకి యజ్ఞానమువలన ధర్మాత్మురాలగు స్వయంప్రభ నివసించియున్న బిలమునందుఁ బ్రవేశించితిమి. ఆబిలము మయునియొక్క మాయచేత రచింపఁబడినది. అట్టిబిలమును సర్వమును వెదకుచున్న మాకు సీతాదేవి యెందును గనఁబడదయ్యె. ఆబిలమునందు బ్రవేశించియుండుటచే సుగ్రీవునిచేత నియమింపఁబడిన నెలదినములును గడచిపోయె. మేమందఱము వానరాధిపతియగు సుగ్రీవునియొక్క వచనానుసారముగ బ్రవర్తించువారమైతిమి. మాకు నియమితమైన కాలమతిక్రమించి పోవుటచేత భయముగలవారమై ప్రాయోపవేశమును బొందితిమి. కకుత్స్థునికులమునందుఁ బుట్టిన రాముఁడును, సుగ్రీవుఁడును, లక్ష్మణుఁడును, కాలమతిక్రమించి పోవుటవలన మమ్ములఁ జంపుదురు,

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యేబదియేడవసర్గముగిసెను.

సంపాతి సీతాదేవియుండుస్థానమును అంగదాదులకు జెప్పుట.

జీవితాశను వదలియున్న వానరులచేతఁ జెప్పఁబడినదీనమైన వాక్యమును విని యాసంపాతి కన్నీళ్లను బెట్టుచు మిగులనధికమగు కంఠధ్వనిగలవాఁడై రోదనమును జేయుచు యావానరులతో నిట్లనియె.

ఓవానరోత్తములారా! జటాయువు నాకుఁదమ్ముఁడు అతనేగదా రావణాసురునిచేత యుద్ధమునందుఁ జంపఁబడియె నేను నాతమ్ముఁడగు జటాయువును జంపిన రావణాసురునివైరమును దీర్చుకొనుటకు శక్తిగలవాఁడనైనప్పటికినిప్పుడు వృద్ధుఁడనగుటచేతను, ఱెక్కలులేని వాఁడనగుటచేతను, ఏమియును జేయఁజాలక యున్నాను. మఱియు నో వానరోత్తములారా! పూర్వము వృత్రాసురవధకాలమునందు అన్నదమ్ములమగు మేమిద్దఱమును, ఒకరినొకరు జయింపవలయునని యెడు కోరికగలవారమైతిమి అంతటఁ బ్రజ్వలించుచున్న సూర్యునకభిముఖముగాఁ బోతిమి అవ్విధముగ నాకాశమునందు మిగుల వేగముతోఁ దిరిగితిమి. అట్లు దిరుగుచుండఁగా సూర్యుడు ఆకాశమధ్యమును బొందినపుడు జటాయువు సూర్యుని కిరణముల వేడిమిచేత మిగుల బాధనొందె. అప్పుడు నేను మిగుల వ్యసనముగలవాఁడనై సూర్యకిరణములచేతఁ బీడింపఁబడిన తమ్మునిఁ జూచి స్నేహవశమువలన ఱెక్కలచేత నాతమ్మునిఁ గప్పితిని అంతట నో వానరోత్తములారా! నేను సూర్యకిరణములచేతఁ దగులఁబెట్టఁబడిన ఱెక్కలుగలవాఁడనై యీవింధ్యపర్వతమునందుఁ బడితిని. అదిమొదలుకొని నేను దమ్మునియొక్క వృత్తాంతమును దెలియకుంటిననియె ఇవ్విధముగా సంపాతిచేతఁ జెప్పఁబడిన జటాయువుయొక్క వృత్తాంతమును విని యువరాజును, మిగులఁ బ్రాజ్ఞుఁడును, నగు నంగదుఁడప్పు డిట్లనియె.

పక్షీంద్రుఁడా! సంపాతీ! నీవు జటాయువు కన్నయని మేము వింటిమి కావున నీవు మాయందుఁ బ్రియముగలవాఁడవు. కాఁబట్టి సీతాపహరణమును జేసిన రావణాసురుడు ఉన్నచోటును జెప్పుము. మఱియు నో పక్షీంద్రుఁడా! సంపాతీ! దీర్ఘాలోచనలేనివాఁడును, రాక్షసాధిపతియును, నగు రావణాసురుడు సమీపమునందున్నదియును, దూరమునందున్నదియును, దెలుపుమని చెప్పె. అంతట జటాయువున కన్నయును, మిగులఁ దేజస్సు గలవాఁడును, నగు సంపాతి వానరులకు సంతోషమును గలుగ జేయవలయునని యెడు తలంపుగలవాఁడై తనకుఁదగిన మాటను జెప్పఁదలచి యిట్లనియె.

ఓవానరోత్తములారా! నేను కాలిన ఱెక్కలుగల వాఁడనగుటచేత బలహీనుఁడనైతిని. అయినను వాఙ్మాత్రముచేత రామునకు సహాయమును జేయుదును. నామాటలను

వినుఁడు. నేనువరుణసంబంధములగు లోకములనెఱుఁగుదును విష్ణుదేవుఁడు త్రివిక్రమావతారమునెత్తినది యెఱుఁగుదును. దేవాసురులయుద్ధమును దెలిసినవాఁడను సముద్రమథనకాలమునుగూడ నెఱుఁగుదును. కావున నేనుమిగుల ముసలివాఁడను. నేను రామునికార్యమును అవశ్యముగాఁ జేయవలసియున్నది. అయినప్పటికిని ముసలివాఁడనగుటచేత తేజస్సు అపహరింపబడినది. కావునప్రాణములన్నియును శిథిలములైనవి. రూపసంపన్నురాలును, సర్వాభరణభూషితురాలును, నగునొకస్త్రీని దురాత్ముఁడగు రావణాసురుఁడెత్తికొనిపోవునప్పుడు నేనుజూచితిని ఆసమయమునందు ఆస్త్రీ రాముఁడా! రాముఁడా! యనికట్టిగా రోదనమును జేయుచుండెను. మఱియు నాస్త్రీ భూషణములను విసరి వేయుచుండెను. అవయవములను అతలకుతలముగా జేసికొనుచుండెను. ఆసమయమునందు సువర్ణచ్ఛాయవంటి దేహచ్ఛాయగల యాసీతయొక్క పచ్చసిపట్టు వస్త్రము నల్లనికాంతిగల రావణాసురునియందున్నదై పర్వతమునందలి సూర్యప్రభవలెను, మేఘమునందలి మెఱుపువలెను, ప్రకాశించుచుండెను. మాటిమాటికిని, రాముఁడా! రాముఁడా! యనిదుఃఖమునుబొందుచుండుటవలన నాస్త్రీయే సీతాదేవినిగాఁ దలఁచుచున్నాను. ఆరాక్షసునియొక్క నివాసస్థానమును జెప్పెదను. వినుఁడు. ఆరాక్షసుఁడు విశ్రవోబ్రహ్మకుఁబుత్రుఁడు. కుబేరునకుబుత్రుఁడు అతఁడు రావణాసురుఁడనియెడు పేరుగలవాఁడు. అతఁడులంకాపట్టణమునందు నివసించుచున్నాఁడు ఆపట్టణముగల ద్వీపము ఈదక్షిణసముద్రమునకునూరామడకవ్వలనున్నది. ఆద్వీపమునందు దివ్యమగునాలంకాపట్టణము విశ్వకర్మచేతరచింపఁబడినది. ఆలంకాపట్టణమునందలి ద్వారములుబంగారముచేత మిగులఁజిత్రములుగా నిర్మింపఁబడియున్నవి. వేదికలుగూడ మిగులఁజిత్రములుగా బంగారముచేతనే నిర్మింపఁబడినవి ఆపట్టణముసూర్యునియొక్క వర్గమువంటివర్గముగల ప్రాకారముచేతఁ జుట్టఁబడియె ఆపట్టణమునందలి రావణాంతఃపురమునందుఁ బట్టువస్త్రమును ధరించిన సీతాదేవి రాక్షసులస్త్రీలచేత గాపాడఁబడుచున్నది మీరక్కడకుఁబోతిరేని జనకమహారాజునకుఁ బుత్రికయగుసీతను జూడవచ్చును. ఆలంకాపట్టణము నాలుగువైపులయందును సముద్రముచేత జుట్టబడినది సముద్రమునందు నూరామడగడచినపిమ్మట దక్షిణతీరమునందు నివసించునట్టి రావణాసురునిఁ జూడఁగలరు. కావుననోవానరోత్తములారా! మీరందఱును శీఘ్రముగఁబరాక్రమింపుఁడు. నేను జ్ఞానముచేత సర్వమునుఁజూచుచున్నాను. కాఁబట్టిమీరు శీఘ్రముగఁబోయి సీతనుజూచిరండు. వానరోత్తములారా! నీకిట్టిదివ్యజ్ఞానం బెట్లుగలిగెనంటిరేని చెప్పెదను. వినుఁడు. భూమికిసమీపమునందలి యాకాశమునందు సంచరించునట్టివియును, ధాన్యములనుదిని జీవించునట్టివియును, నగుకుళింగాది పక్షివిశేషములకుఁ బ్రథమగతియును, వృక్షఫలములనుదినునట్టి కాకులుమొదలగువానికి ద్వితీయగతియును, భాసక్రౌంచకురరములకుఁ దృతీయగతియును శ్యేనములకుఁ జతుర్థగతియు, గృధ్రములకుఁ బంచమగతియు, బలవీర్యరూపయౌవనవంతములైన హంసలకునాఱవగతియు, వైనతేయునకు సప్తమగతియును, గలిగియుండును మేముఆవైనతేయుని కులమునందుఁబుట్టినవారమగుటచేత మాకుఆసప్తమగతి గలిగియుండును. అందువలనమాకు దివ్యజ్ఞానముగలిగియుండును. దానిచేతనే నేనుయిచటనుండియును, లంకాపురముననున్న రావణాసురుని, సీతాదేవినిజూచుచున్నాను. అదియునుగాక మాకు దివ్యజ్ఞానమాత్రంబెకాదు. బహుదూరదర్శియైన దివ్యచక్షుర్బలమును గలిగియుండును. కావుననాహారవీర్యముచేతను, సౌపర్ణత్వనిబంధన స్వభావముచేతను, సర్వకాలములయందును నూరామడపరిమిత దూరమునందుగల సమస్తవస్తువులను జూచుచుందుము. మాకుదూరదేశమునందున్న భక్ష్యమునుగ్రహించడము స్వభావముచేత నేవిహితమైయుండును. కోడిమొదలగువాటికి పాదములచే నేర్పఱచుకొనదగిన ప్రదేశమునందు జీవనమువిహితమై యుండును మఱియునో వానరోత్తములారా! మాంసభక్షకుఁడగు రావణాసురునిచేత నిందితమైనకర్మ చేయఁబడినది. కావున నాతమ్మునకపకారమునుజేసిన రావణునకు మీరపకారమునుజేయుఁడు. సముద్రమునుదాటుటకుఁ దగినయత్నమునుజేయుఁడు. సముద్రమునుదాటి లంకాపట్టణమునకుఁబోయి మీకార్యమును నెరవేర్చికొనిరండు. ఓవానరోత్తములారా! వరుణదేవునకు నివాస్థానమయినసముద్రముదగ్గరకుఁబొండు. నేనుస్వర్గలోకమును బొందినవాఁడును, మహానుభావుఁడును, నగుజటాయువునకుఉదకదానమును జేసెదనియె. అంతటమిగులగొప్పదగు తేజస్సుగల వానరులందఱును, కాలినరెక్కలుగల సంపాతినినదములకును, నదులకును నధిపతియును, నగుసముద్రముదగ్గరకుఁ దీసికొనిపోయిరి. అంతటసంపాతి, తమ్ముఁడగుజటాయువునకు ఉదకదానమునుజేసె. పిమ్మటనా వానరులందఱును సంపాతియొక్కమాటలచేతఁ బరమానందముగలవారై యాసంపాతిని మరలమొదటిచోటునకుఁ దీసికొనిపోయిరి. పిమ్మటనాసంపాతివాక్యములచేత మిగులసంతో

షముగలవారై యుండిరి.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ఏబదిఎనిమిదవ సర్గ ముగిసెను.

సంపాతి సీతావృత్తాంతమును అంగదుడు మొదలగువారికి విశదముగ దెలుపుట.

అంతట గృధ్రరాజగు సంపాతిచేతఁ జెప్పబడినదియును, అమృతమును బోలి యున్నదియును, నగుమాటను విని యా వానరోత్తములందఱును సంతోషించినవారైరి. ఆసమయమునందు జాంబవంతుఁడు ఆవానరులతో గూడ భూమినుండి లేచి యాసంపాతితో నిట్లనియె.

సంపాతీ! సీత యెక్కడనున్నది? సీత నెవఁడు చూచెను? ఎవ్వరు సీతను జూచిరి? వనమునందు సంచరించునట్టి వానరులకందఱకు బోధగినగతిని జెప్పుటకు నీవు తగినవాడవు. మఱియును ఓ సంపాతీ! వజ్రాయుధముయొక్క వేగమువంటి వేగముగల రాముని బాణములకును, మిగులదీక్ష్ణములగు లక్ష్మణుని బాణములకును భయమును జెందక నెవ్వఁడు సీతనపహరించెను? ఆవృత్తాంతమును సర్వమును మాకుఁ జెప్పి మమ్ముల కృతార్థులఁ జేయవే యని జెప్పె. అంత ఆసంపాతి ప్రీతినిఁ గూర్పించునట్టివియును, సీతావృత్తాంతమును బోధించునట్టివియును, నగుమాటలచేత వానరులను నోదార్చుచు నిట్లనియె.

వానరోత్తములారా! సీతాదేవియొక్క వృత్తాంతమును నాకెవ్వరు చెప్పినదియును, విశాలములైన నేత్రములుగల సీత యెక్కడనున్నదియును జెప్పెదను వినుడు. అనేకయోజనముల వెడల్పుగల యీపర్వతదుర్గమునందు నేను జిరకాలము నాడు క్షీణమైన ప్రాణమును పరాక్రమమునుగల వాడనై పడితిని ఇట్లు పడి చిరకాలమునుండి యిక్కడనుంటిని ఇట్లుండగా నాపుత్రుడు సుపార్శ్వుడనువాడు దినదినమును నాకాహారమును దెచ్చియిచ్చుచుండె. అవ్విధముగ దెచ్చి పెట్టుచుండియతడు ఒకనాడు రాక మరునాడు నిరామిషుడై నాయొద్దకు వచ్చె. అప్పుడు, గంధర్వులకు గామమును, సర్పములకు గోపమును, మృగములకు భయమును, మాకాకలియును, సహజధర్మములు గావున ఆకలిచేతను దప్పిచేతను బిడగలిగియుండుటచేత నేను నాపుత్రునిమీద గోపముగలవాడనై మిగుల గఠినములగు మాటలను బలికితిని అంతట నాపుత్రుడు భయముచేత గడగడవణకుచు జేతులను ముకుళించుకొని వినయముగా నావద్దకు వచ్చి యిట్లనియె

నాయనా! నేను మాంసము కొఱకు ఆకాశమున కెగిరితిని. పిమ్మట మహేంద్రపర్వతముయొక్క ద్వారమును జుట్టుకొనియుంటిని పిమ్మట సముద్రమునందు సంచరించునట్టి యనేకవేల జంతువులయొక్క మార్గమును నడ్డుపరచుటకు దలవంచుకొని చూచుచుంటిని. ఆసమయమునందు సూర్యోదయకాలమునందలి సూర్యునియొక్క కాంతివంటి కాంతిగలయొక స్త్రీని యెత్తికొని పోవుచున్నవాడును, కాటుకకొండవలెనల్లగనున్నవాడును, నగునొక రాక్షసుడు గనబడియె అప్పుడు భోజనపదార్థము కావలయునని కోరుచున్న నేను ఆయిరువురిని జూచి నాకాహారము దొరికెగదా యని నిశ్చయమును జేసికొంటిని పిమ్మట వారలమార్గమునకడ్డముగఁ బోతిని. అప్పుడు ఆరాక్షసుడు మిగుల వినయముగలవాడై సామవాక్యములతో మార్గమును వదలుమని నన్ను యాచించె అట్లు యాచించి యథేచ్ఛముగ బోయె. మఱియు నో తండ్రీ! "శ్లో॥ న హి సామోపపన్నానాం ప్రహర్తా విద్యతే క్వచిత్। నీచేష్వపి జనః కశ్చిత్ కిమంగ బత మద్విధః॥, సామవాదమును జేయువారలఁ జంపువాడు యీలోకమునందెవ్వడును లేడు. నీచులుగూడ యాచించువారల వధింపరు. ఇక నాయట్టివాడు యాచించువానిని జంపలేదని చెప్పవలయునా? కావున నేనతనికి మార్గమునిచ్చితిని. అంతట నారాక్షసుడు తన తేజస్సును నాకాశమును సర్వమునందు వ్యాపింపజేయుచు నంతరిక్షమార్గమున బోయె. అంతట నేనక్కడ సంచరించుచు నాకాశమునందు సంచరించునట్టి భూతములతో గూడ గలిసికొని సత్కరింపబడితిని. అంతగొంత సేపటికి సిద్ధులగు మహర్షులు వచ్చి నన్ను జూచి నాయనా! నీవదృష్టవశముచేత జీవించితివి ఇప్పుడు నీకడ్డముగ వచ్చినవాడును, రక్ష్యవర్గముతో గూడుకొనినవాడును, నగు రాక్షసుడు పోయె. కాబట్టి యికనీకు మేలుగలుగుననిరి ఆవచనమును విని నేను మిగుల నాశ్చర్యముగలవాడనై యిదియేమి? ఈవృత్తాంతమును సర్వమును నాకు సంపూర్ణముగ దెలుపుడని యడిగితిని. అంతట నామహర్షులిప్పుడు పోయినవాఁడు రావణాసురుడని చెప్పి యిట్లనిరి.

పక్షిశ్రేష్ఠుడా! సుపార్శ్వుడా! ఈపోవుచున్నవాడు రావణాసురుడు. వాడు, దశరథమహారాజునకు బుత్రుడైన రామునకు భార్యయును, జనకమహారాజునకు బుత్రికయును, భ్రష్టమైన యాభరణములును, పట్టువస్త్రములు గలదియును, శోకవేగముచేత నవమానపరుప బడినదియును, రామలక్ష్మణుల పేరు పెట్టి పిలుచుచు నేడ్చుచున్నదియును, విడివడిపోయిన తలవెండ్రుకలు గలదియును, నగు సీతాదేవిని అపహరించుకొని పోవుచున్నాడని చెప్పిరి. అప్పుడు తగిన సమయమునందీ విషయము తెలియకపోయెనే యని నేను జింతించితినని నాపుత్రుడగు సుపార్శ్వుడు చెప్పెనని సంపాతియా

వానతులతో జెప్పి మఱియునిట్లనియె.

వానరోత్తములారా! ఈవృత్తాంతమును వినినపిమ్మట నాకు రావణాసురునితో యుద్ధమును జేయవలయునని కుతూహలము గలిగియును నిష్ప్రయోజనమయ్యె. ఱెక్కలులేక క్రిందబడియున్న నే నెవ్విధముగ బరాక్రమింతును. పరాక్రమింపజాలను. అయినను నోటిచేతను బుద్ధిచేతను మీకుడుపకారమును జేసెదను. వినుడు. మీపౌరుషమునకు దగినయుపాయమును జెప్పెదను. దశరథమహారాజుయొక్క పుత్రుడగు రామునకు నేను మేలుచేయదగినవాడను గనుక చెప్పెదను ఓవానరోత్తములారా! మీరందఱును బుద్ధిచేతమిగులగొప్పవారు. ఇంతయ గాక బలవంతులు. మఱియును మిగుల బుద్ధిమంతులు. వానరాధిపతియగు సుగ్రీవుని చేత బంపబడితిరి దేవతలుగూడ మిమ్ముల జయింపజాలరు. కంకపత్రములుగల వియును, మిగుల తీక్ష్ణములై నవియును, నగు రామలక్ష్మణుల బాణములు ముల్లోకములను గాపాడగలవు. రావణాసురుడు తేజోబలములధికముగా గలవాడనుటకు సందేహము లేదు. అయినను మిగుల సమర్థులగు మీకు దుష్కరమైన కార్యము లేదు. కాబట్టి మీరు అవశ్యముగ రావణాసురుని జయింపగలరు. విశేషముగ నాలస్యమును జేయగూడదు. మీయట్టి బుద్ధిమంతులు చేయదగిన కార్యములయందు మిగుల శీఘ్రముగ బ్రయత్నింతురు. కాబట్టి శీఘ్రముగ యత్నింపుడనియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి ఏబదితొమ్మిద వసర్గ ముగిసెను.

—(*)—

జటాయువుయొక్క అన్నయగు సంపాతి తన ఱెక్కలు గాలిన కారణమును దెలుపుట.

అంతట స్నానమును జేసి తమ్ముడగు జటాయువున కుదకదానమును జేసియున్న సంపాతి చుట్టును నాపర్వతదుర్గమునందు నంగదుడు మొదలగు వానరులందఱును గూర్చుండిరి. అవ్విధముగ సకలవానరవీరులతోడను జేరుకొనికూర్చున్నవాడును, నమ్మకమును బొంది యున్నవాడునునగు నంగదునకు విశేషముగ నమ్మకమును బుట్టించుచు నాసంపాతి మరలనిట్లనియె.

ఓవానరోత్తములారా! మీరందఱును ఏకాగ్రచిత్తులై నిశ్శబ్దముగ నావాక్యమును వినుడు. మీకు సీతాదేవిని జూచుటకుదగిన ఉపాయమును వాస్తవముగ జెప్పుదును. నాకు సీతావృత్తాంతమును దెలిసికొనునట్టి శక్తిగలుగుటకుగూడ గారణమును జెప్పెదను. వినుడు. నేను బూర్వము సూర్యుని యొక్క వేడిమి చేత వ్యాప్తమైన శరీరముగలవాడను, సూర్యకిరణముల చేత గాల్పబడిన ఱెక్కలు గలవాడనునై వింధ్యపర్వతముయొక్క శిఖరమునందలి యీవనమునందు బడితిని. పడినపిమ్మట ఆరురాత్రులవఱకును నేనేమియును దెలియక విహ్వలుడనై యుంటిని. అంతట నేడవదినమునందు దెలివిగలవాడనై నలుదిక్కులను జక్కగా జూచియునునిది యీదేశమని దెలియజాలకపోతిని. అంతట నేను సముద్రములను, పర్వతములను, నదులను, సకలవిధములగునదులను, మడుగులను, వనములను, సముద్రపుగట్టును, జూచియీదేశమునందే పూర్వముంటినని తలచినిశ్చయించితిని. మఱియును సంతోషముగల పక్షులసముదాయముచేత వ్యాప్తమైనదియును, కందరములతోడను, శిఖరములతోడను, గూడుకొన్నదియును, సముద్రముయొక్క దక్షిణతీరమునందున్నదియుసునగు నీపర్వతమును వింధ్యపర్వతమని నిశ్చయించితి. పూర్వము దేవతలకుగూడ బూజ్యమైనదియును, నిశాకరుడనునట్టి మునివరునియొక్క ఘోరమైనతపస్సునకు వాసస్థానమైనదియును, పవిత్రమైనదియునునగు నాశ్రమమొకటిగలదు ఆనిశాకరుడు యీయాశ్రమమునందు ఘోరమగుతపస్సును జేసి తపస్సిద్ధిసంపన్నుడై యథేచ్ఛముగ స్వర్గలోకమునకుబోయి యిప్పటి కెనిమిది వేల సంవత్సరములయ్యె. ఈ యెనిమిది వేల సంవత్సరములనుండి యీమునివరునివదలియున్నాను. అట్లు నేను సూర్యకిరణముల చేత గాల్పబడిన ఱెక్కలు గలవాడనై క్రిందబడినప్పుడు విధ్యపర్వతమునుండి మిగుల గష్టముతో గ్రిందికిదిగియధికకష్టముతో దీక్ష్ణమైనదర్భలుగల యీమునియొక్క యాశ్రమములోనికి వచ్చితిని. అంతట నా మునివరుని జూడవలయునని యెడు కోరికగలవాడనైతిని. ఆమునివరుని నేనును, నాతమ్ముడగు జటాయువును, అనేకమార్లు చూచియుంటిమి. మఱియు ననేకవిధములగు శుశ్రూషలను జేసియుంటిమి. ఆనిశాకరమునివరుడు స్వర్గలోకమునకు బోవుటచేత నాకుగనబడకపోయె. అంతట నేను మిగులవిచారమును బొంది యక్కడ నే నివసించి పరిమళించుచున్న వాయువును, వాయువశమువలనను, పక్వమగుటవలనను, చెట్లనుండి క్రింద రాలినఫలములు మొదలగువానినిడిని జీవించుచుంటిని

అవ్విధముగ జీవించుచు నాపుణ్యాశ్రమమునందలి వృక్షమూలమునందు నివసించియుంటిని. అట్లుండి భగవంతుడయిన యానిశాకరమునివరుని ఎప్పుడు చూతునోయని ప్రార్థించుచుంటిని అంతటగొన్నిదినములకు బ్రజ్వలించుచున్న దేహచ్ఛాయగలవాడును, స్నానమును జేసినవాడును, తూర్పుదిక్కునకు అభిముఖముగా గూర్చున్నవాడును, దుర్ధర్షుడును, నాకుసమీపమునందు వచ్చియున్నవాడునునగు మునివరుని జూచితిని. ఆమునివరుడువచ్చినతోడనే ఋషిగణములును,

స్సృమరములును, పెద్దపులులును, సింహములును, ఏనుగులును, ప్రాకెడుజంతువులును, చుట్టుకొని ప్రాణులన్నియును, బ్రహ్మదేవుని సేవించినవిధముగ సేవించిరి. అవ్విధముగ జుట్టుకొని సకలజంతువులును, ఆఋషితోగూడ బోయి యామునివరుడు తననివాసమునందు బ్రవేశింపగానే తమనివాసస్థానమునకు బోయిరి."రాజునుతనగృహమునందుబ్రవేశింప గానే మంత్రులుమొదలగు వారందఱును దమతమనివాసములకుబోయినవిధముగ" సకలజంతువులును, దమతమ నివాసస్థానములకుబోయిరి. అంతట నమ్మునివరుడు నన్నుజూచి సంతోషముగలవాడై యాశ్రమములోనికిబోయెను. అంతట నొకక్షణమాత్రమక్కడనుండి బయలునకువచ్చి నన్నుజూచి యిట్లనియె.

సౌమ్యుడా! పక్షిశ్రేష్ఠుడా! నీశరీరవైకల్యము చేతను. నీరోమములు గమలిపోవుటచేతను నీవెవ్వరో గుర్తింపజాలకయున్నాను. నీతెక్కలగ్నిచేత దగ్ధములై యున్నవి. నీశరీరమంతయును వ్రణముగలదైనది పూర్వమునందు వాయువుయొక్క వేగమువంటి వేగముగలవారును, గద్దలకు బ్రభువులును, అన్నదమ్ములును, గామరూపులును, నగునిరువురు పక్షీంద్రులు నాకు సర్వకాలములయందును గనబడుచుందురు. ఇంతయగాక నాకుపచారమును జేయుచుందురు. ఆయిరువురిలో నీవు జ్యేష్ఠుడవైన సంపాతివని తలచుచున్నాను. నీతమ్ముడు జటాయువని యెంచుచున్నాను. పూర్వమునందు మీరిరువురును మానవరూపమునుధరించి నాకుబరిచర్యలను జేయుచుందురు. ఇప్పుడు నీతమ్ముడగు జటాయు వెచటనున్నాడు. నీకువ్యాధిగలుగుటకుగారణమేమి? నిన్నెవ్వరైనదండించిరా? ఈవిషయమును సర్వమును నాకుజెప్పుమని యామునివరుడునన్నడిగె

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యరువదవ సర్గ ముగిసెను.

(*)

సంపాతి ఆకాశమునందుస్త్రీలుమొదలగువారిని జూచినవిధమును జెప్పుట.

అంతట సంపాతియనునేను, మిగుల దారుణమైనదియును, సాహసముచేతజేయబడినదియును, నగు సూర్యునిగుఱించిపోవుటను, ఆనిశాకరమునివరునకు దెలుపదలచి మఱియునిట్లనిజెప్పితిని. షడ్గుణైశ్వర్యసంపన్నుడవైన యోమునివర్యా! నేనువ్రణముగలవాడనగుటచేతనైన సిగ్గుచేత వ్యాకులమైన యిన్ద్రియములుగలవాడను, మిగుల నాయాసమును బొందినవాడనునై యున్నాను. కాబట్టిస్ఫుటముగామాటలాడుటకు శక్తిలేకయున్నాను. మునికులోత్తమా! వీరులమగు నేనును, నాతమ్ముడగు జటాయువు బలదర్పమోహితులమై మాయిరువురిలో నెవ్వడెక్కుడు పరాక్రమముగలవాడో తెలియగోరినవారమై యాకాశమునకెగిరితిమి. అప్పుడు మేమిరువురమును గైలాసపర్వతము నొద్దకుబోయి మునులసమీపమునందు సూర్యాస్తమయమునకులోపలసూర్యునొద్దకు బోయినవాడు రాజ్యాధికారియును, పోజాలనివాడర్ధరాజ్యాధిపతియును, నగునట్లుపందెము వేసికొంటిమి. అంతట మేమిరువురమును, ఆకైలాసపర్వతమునుండి మీదికెగిరిపోతిమి. అట్లుకొంతదూరముపోయి పిమ్మట వెనుకకుదిరిగి భూమినిజూచితిమి. అప్పుడుభూమియందలిపట్టణములన్నియును, వేరువేరుగ రథచక్రప్రమాణములుగలవైకనబడియె. మఱియునయ్యాకాశమునందు నాలుగు విధములగువాద్యములయొక్క ధ్వనులును, సామగానధ్వనులును, వినబడియె. మఱియునుమనోహరముగ గానమునుజేయుచున్నవారును, ఎఱ్ఱనివస్త్రములను ధరించినవారును, నగుస్త్రీలనేకులుగనబడిరి. వారులనందఱజూచుచు నతిశీఘ్రముగ నెగిరిపోయి యధికమగు నాకాశమార్గమునకు బోతిమి. అప్పుడు భూలోకమునుజూచితిమి ఆసమయమునందు భూలోకమునందలివనములన్నియును పచ్చికగల నేలవలె గనబడియె. పెద్దపెద్దపర్వతములచేత వ్యాప్తమైన భూములుగులకరాళ్లచేత వ్యాప్తమైన చేనులవలెగనబడియె. మఱియు బ్రసిద్ధములగు గంగమొదలుగాగల నదులన్నియును, భూమియందుబొడుగుగా బరుపబడిన నూలుధారములవలెగనబడియె. వింధ్యపర్వతము, హిమవత్పర్వతము, మిగుల బెద్దదగుమేరుపర్వతము, మొదలుగాగల కులపర్వతములు మడుగులయందు సంచరించుచున్న యేనుగులవలె గనబడియె. ఆసమయమునందు మాకిరువురకును, అధికమగుచెమటయును, దుఃఖమును, భయమును, గలిగె అంతట మాకిరువురకును నేమియును దోచకపోయె. మఱియు నధికమగు మూర్ఛవచ్చె. అందువలన నిదితూర్పనియును, ఇదిపశ్చిమమనియును, ఇదియుత్తరమనియును, ఇదిదక్షిణమనియును, ఇవిమూలలనియును దెలిసికొనలేకపోతిమి. మఱియుబ్రళయకాలమునందు భూమియంతయును దగ్ధమైనవిధముగ దగ్ధమైనట్లు కనబడియె. అప్పుడు నామనస్సంతయును నశించె. ఆసమయమునందు నాకన్నులకు గనబడదగిన పదార్థమేదియునులేకపోయె. అందువలన గన్నులు మూతపడిపోయె. అప్పుడు నేను మిగులబ్రయత్నముచేత గన్నులను దెరచిసూర్యునిజూచితిని. నాతమ్ముడగు జటాయువును నావలె నేసూర్యునిజూచె. అప్పుడు సూర్యమండలము మాయిరువురకును, భూపరిమాణమంత పరిమాణముగలదై కనబడియె. అప్ప

డు జటాయువునాతో జెప్పకయే క్రిందబడియె. అట్లునాతమ్ముడు క్రిందబడుటనుజూచి నేను మిగులశీఘ్రముగ నాకాశమార్గమును విడిచిపెట్టితిని. పిమ్మట నాతమ్మునకు సూర్యునివేడిమి సోకకుండునట్లు నారెక్కలచేత గప్పితిని. అప్పుడు సూర్యునివేడిమిచేత నారెక్కలుదగ్ధమయ్యె. నామరుగుననుండుటచేత నాతమ్మునిరెక్కలుమాత్రము దగ్ధముగాకయుండె. అప్పుడు నేనుగాల్పబడినరెక్కలు గలవాడనై వాయువశముచేత నీవింధ్యపర్వతమునందు బడియేమియును దెలియనివాడనై పడితిని. నాతమ్ముడగు జటాయువు జనస్థానమునందు బడెననితలచితిని. అట్లునేనుగ్రిందబడి రాజ్యహీనుడను భ్రాతృహీనుడను గూడనైతిని. అదిమొదలుకొని చావవలయుననియెడు కోరికగలవాడనై యీపర్వతశిఖరమునందు బడుచుంటినని నేనామునివరునితో జెప్పితినని సంపాతిచెప్పె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండము నందలి యరువదొక్కటవ సర్గ ముగిసెను.

సంపాతికినిశాకరమునీశ్వరుడుసీతావృత్తాంతమునువానరులకుజెప్పినపిమ్మటరెక్కలుమొలుచుననిచెప్పుట.

అంతట నాసంపాతి యావానరులతో మరల నిట్లనియె. వానరోత్తములారా! అవ్విధముగ నాచేతజెప్పబడిన విషయమును సర్వమునుదెలిసికొని భగవంతుడగు నామునివరుడు గొంచెముసేపు ధ్యానమునుజేసి యిట్లనియె.

పక్షిశ్రేష్ఠుడా! నీవువ్యసనమునుబొందకుము. దగ్ధములగు నీరెక్కలు మరలనీకురాగలవు మఱియు నీనేత్రములును, నీప్రాణములును, బలతేజోవీర్యములును మరల నీకువచ్చును మఱియు నీకిట్టి యాపదగలుగుటచేత లోకమునకు మహోపకారము గలుగునని నేను పురాణము నందు వినియుంటిని. ఆవినినవిషయమును నేనుదపోమహిమచేత జూచితిని ఆవిషయమునుజెప్పెదను వినుము. ఇక్ష్వాకువంశమునందుబుట్టిన దశరథమహారాజు ఒకడుగలడు. అతనికి అధికతేజోవంతుడును, రాముడనియెడు పేరుగలవాడును నగు పుత్రుడుపుట్టగలడు. అతడుతమ్మునితోడను, భార్యతోడనుగూడ నరణ్యమునకుబోగలడు ఈవిషయమునందు దండ్రిచేతనియుక్తుడును, సత్యమైనపరాక్రమము గలవాడునుగాగలడు. ఆరామునియొక్కభార్యను, రావణాసురు డనియెడు నామధేయముగలవాడును, దేవతులచేతను, రాక్షసులచేతను, గూడజయింపనలవిగానివాడును, నగు రాక్షసేశ్వరుడు జనస్థానమునందుండి యపహరింపగలడు. ఆరామునకుభార్యయును, జనకచక్రవర్తికిబుత్రికయును, కీర్తిగలదియును, మహానుభావురాలును, నగుసీతాదేవి నానావిధములగు భక్ష్యములచేతను, మఱియునితరములగు పదార్థములచేతను, రాక్షసులచేతలోభపెట్టబడియును, భోజనముసుగూడ జేయకయుండును. సీతయొక్కయవస్థనుదెలిసికొని దేవేంద్రుడు తగినయన్నము నివ్వగలడు. అమృతమనియెడు పేరుగలదియును, దేవతలకుగూడ దుర్లభమైనదియును, నగునన్నమునుదిని యాసీతాదేవి భుజించుచుండును. అట్టియన్నమునుదిని జీవించుచు రాముని ధ్యానించుచు భూమియందు బవ్వళించుచుండును. మఱియు నాసీతాదేవితనభర్తయగు రాముడును, అతనితమ్ముడగు లక్ష్మణుడును, సౌఖ్యముగానుండుటనుగురించి యనేకవిధముల దైవమునుబ్రార్థించుచుండును. మఱియు ననేకవిధముల వ్యసనమును బొందుచుండును. అట్టిసీతాదేవిని వెదకుట కొఱకు రామునిదూతలగు వానరులనేకులు నీవద్దకువత్తురు. ఆవానరులకు సీతాదేవియొక్క వృత్తాంతమును సర్వమును దెలియజెప్పుమనియె. మఱియు నమ్మునివరుడు నాతోనిట్లనియె.

పక్షిశ్రేష్ఠుడా! నీవు సర్వవిధములచేతను నిక్కడనుండి పోదగదు. ఇవ్విధముగ వికలములైన యవయవములుగలనీవెక్కడకు బోగలవు నీవుదేశకాలముల నిరీక్షింపుచుండుము. కొంతకాలమునకు నీకు రెక్కలుమొలచును. నీకిప్పుడేరెక్కలువచ్చునట్లు నేనుజేయగలను. అయినను నేనట్లుచేయుటకు యిష్టపడడము లేదు. నీవివ్విధముగ నిక్కడనేయుంటివేని లోకములకు హితమునుజేయగలవు. రాజపుత్రులగు నారామలక్ష్మణులకు హితమగు కార్యమును జేయుము. అట్లుసేయుటచేత బ్రాహ్మణులకును, దేవతలకును, మునులకును, దేవేంద్రునకును హితమును జేసినవాడవగుదువు మఱియునోసంపాతీ! నాకుగూడరామలక్ష్మణులను జూడవలయుననియెడు కోరికగలదు అయినను నేను మిగులముసలివాడనగుటచేత శరీరమునుభరింపజాలకున్నాను కాబట్టి ప్రాణములనువిడిచెదనని సకలవిషయములను దెలిసిన యామునివరుడుసెప్పె.

ఇట్లుశ్రీమతి ష్కింధాకాండమునందలి యరువదిరెండవ సర్గ ముగిసెను.

సంపాతిసీతావృత్తాంతమును వానరులకుజెప్పినపిమ్మటరెక్కలువచ్చియథేచ్ఛగా నెగిరిపోవుట.

ఇవ్విధముగ వాక్యవేత్తలలో నుత్తముడగు నానిశాకరమునీశ్వరుడు నానావిధములగు వాక్యములచేత నన్నునూరార్చి పిమ్మట దనయాశ్రమమునకు బోయె. అంతట నేను మెల్లమెల్లగా నాపర్వతపుకందరమున నుండి బయలు వెడలి

వింధ్యపర్వతముమీదనెక్కి మిమ్ముల నిరీక్షించుచుంటిని. అట్టికాలమతిక్రమించిపోయి యిప్పటికినూరుసంవత్సరముల కంటె నధిక కాలమయ్యె. నేనదిమొదలుకొని యామునివరునియొక్క వచనములను నమ్ముకొని దేశకాలములను నిరీక్షించుచుంటిని. అంతట నానిశాకరమునివరుడు మహాప్రస్థానమునవలంబించి స్వర్గలోకమునకు బోయినదిమొదలుకొని నానావిధములగు వికల్పములచేత నన్నుసంతాపము బాధించుచున్నది. అనేకమార్లు నాకుమరణమునుబొందవలయుననిమెదు బుద్ధియుదయించె. అట్టి బుద్ధినినేను మునివాక్యముల చేత మరలించి కొంటిని. ఆమునివరుడుగల్పించిన వివేకముచేత ప్రాణములను గాపాడు కొనుచుంటిని. మఱియు నాబుద్ధిదీప్తమగుదీపము చీకటిని బోగొట్టువిధముగ నాయవివేకమును బోగొట్టుచుండె నాకుదురాత్ముడగు రావణాసురునియొక్క పరాక్రమమింతయని తెలిసియేయున్నది. నాపుత్రుడు సీతను విడిచిపెట్టి వచ్చినందుకు దగినవిధముగ సంచరింపకపోతివనియనేకవిధములబలికితిని. నాకుదశరథమహారాజునందుగల ప్రియమునాపుత్రునియందుగూడ గోపము వచ్చునట్లుసేసెనని వానరులతోజెప్పుచుండగానే యాసంపాతికి మునుపటివలెఱెక్కలుమొలిచె. అట్లుతనకు మరలఱెక్కలు వచ్చుటనుజూచి యాసంపాతి మహానందమునుబొందె. అదిచూచి వానరులును అధికానందమునుబొందిరి. అంతట నాసంపాతి యిట్లనియె.

వానరోత్తములారా! నాకామునివరుని యనుగ్రహముచే సూర్యకిరణములచేత దగ్ధములైన ఱెక్కలు మొలిచినవి. ఇప్పుడు నాకుయౌవనకాలమునం దెట్టిబలముగలిగియుండెనో యట్టిబలపరాక్రమములుగలిగియున్నవి తొల్లిటిబలపరాక్రమములు గలవాడనగుటచేతనే యిప్పుడుమహానందముగలవాడనైతిని. ఓవానరవీరులారా! మీరందఱును దగినవిధముగ బ్రయత్నమును జేయుడు. నాకీఱెక్కలు రావడము మీకార్యముసిద్ధించునని చెప్పుచున్నట్లు తలవవలయునని యాసంపాతి వానరులతో జెప్పి మహానందము గలవాడై యాపర్వతశిఖరమునుండి యాకాశమునకెగిరె. అంతట నావానరులందఱును సంపాతి వచనములచేత మహానందముగలవారైరి పిమ్మట నావానరవీరులందఱును బరాక్రమించుటకుద్యుక్తులైరి. అంతట వాయువేగమువంటివేగముగల వారును, అధికములగు బలపరాక్రమములు గలవారును, నగునావానరవీరులందఱును సీతాదేవిని వెదుకవలయుననిమెదు కోరికగలవారై దక్షిణాభిముఖముగ బయలువెడలుటకు బ్రయత్నించిరి.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలియఱువదియాఱవసర్గముగిసెను.

అంగదుడు మొదలగువారు సముద్రమును దాటు వానిని నిర్ణయింపలేక వ్యసనపడుట

అట్లుసంపాతిచెప్పిన వాక్యములనువినినపిదప సింహపరాక్రమమువంటి పరాక్రమముగల యావానరులందఱును బ్రీతిసంయుక్తులై సింహనాదములను జేసిరి. మఱియు నావానరవీరులందఱును సంపాతి వచనములనువిని రావణాసురుని నాశమునుగుఱించి రావణుడుండునట్టి లంకాద్వీపమునుద్దేశించి యాలంకాపురమార్గమునందున్న దక్షిణ సముద్రమును దాటి సీతను జూడవలయుననిమెదు కోరికగలవారై బయలువెడలిపోయిరి. అట్లుబయలువెడలిపోయి మిగులగొప్పదగు లోకమంతయును బ్రతిబింబించుటకు దగిన యద్దమువలె నున్నదియును, మిగులగొప్పదియునునగు సముద్రమునుజూచిరి. అట్లుచూచి దక్షిణసముద్రముయొక్క యుత్తరతీరమునందు బ్రవేశించి మహాబలులగు నావానరవీరులందఱును విడివినిజేసిరి. పిమ్మట మిగుల గొప్పవియును, వికారములయినయాకారములుగలవియును, స్వేచ్ఛానుసారముగ సముద్రోదకమునందు విహరించుచున్నవియును, నానావిధములైనవియును, తెరవబడిననోరుగలవియును, మిగులగొప్పవగుదేహములుగలవియును నగు జలజంతువులచేతను తరంగములచేతను, వ్యాప్తమైనదియును, ఒకస్థలమునందు నిశ్చలముగానున్నదియును, మఱియొకప్రదేశమునందు జలజంతువులచేత వ్యాప్తమైనదియును, వేరొకదేశమునందు పర్వతములచేత వ్యాప్తమైనదియును, జలరాసులచేత నిండినదియును, పాతాళలోకమునందు నివసించునట్టి రాక్షసులచేత వ్యాప్తమైనదియును, రోమాంచమును గలుగజేయుచున్నదియును, నగుసముద్రమునుజూచి యావానరవీరులందఱును మిగుల వ్యసనమునుబొందిరి. మఱియు నాసమయమునందాకాశమువలె నంతము లేనిదియగునాసముద్రమునుజూచి వానరవీరులందఱును మనమేమిచేయుదుమని యనేకవిధముల బలుకుచుండిరి. మఱియు నధికమగువ్యసనమునుబొందిరి. అట్లుసముద్రమునుజూచియధికమగువ్యసనమును బొందుచున్నవారును, భయముచేతపీడింపబడుచున్నవారును, నగు వానరవీరులనుజూచి యంగదుడనేకవిధముల నూరార్చె. మఱియును, మహాబలుడును, వాలిపుత్రుడును, బుద్ధిమంతుడును, నగునంగదుడుగొప్పదగు దుఃఖముచేత బీడింపబడుచున్న వానరులతో నిట్లనియె.

వానరోత్తములారా! "శ్లో॥ నవిషాదేమనఃకార్యం విషాదోదోషవత్తమః। విషాదోహంతిపురుషంబాలంక్రుద్ధఇవోరగః॥ విషాదోయంప్రసహతేవిక్రమేపర్యుపస్థితే। తేజసాతస్యహీనస్యపురుషార్థోనసిధ్యతి" ॥ దుఃఖమునందు మనస్సును బెట్టగూడదు. దుఃఖముమిగులదోషగుణమని తెలియవలయును. దుఃఖము పురుషుని "క్రోధయుక్తమైన సర్పము బాలునిజంపువిధముగ"జంపును. పరాక్రమమువచ్చినపుడు దుఃఖమువచ్చెనేని పరాభవమును గల్పించును. తేజోహీనుడగు పురుషునియొక్క పురుషార్థము సిద్ధింపదనిచెప్పె. అంతట నారాత్రియంతయును గడచిపోయిన పిమ్మట మంత్రవేత్తయగు నంగదుడు మిగుల శ్రేష్ఠులును, ముసలివారలునునగు వానరులతో గలసికొని యిట్లని యాలోచించుచుండె ఆసమయమునందు వానరసైన్యమంతయును దేవేంద్రునిజుట్టుకొని దేవతల సముదాయమంతయును గూర్చున్నవిధముగ నంగదుని జుట్టును గూర్చుండిరి. హనుమంతుడును, అంగదుడునుదప్ప దక్షిణవాగలలో నెవ్వడు ఆవానర సైన్యమును నిలుపగలడు ఎవ్వడును వానర సైన్యమును నిలువరింపజాలడు. అంతట శ్రీమంతుడును, శత్రువులను నశింపజేయునట్టి సామర్థ్యము గలవాడును, నగునంగదుడు, శ్రేష్ఠులును, ముసలివారును, నగువానరులు నందఱను నూరార్చి మిగుల గంభీరములగు మాటలను జెప్పదలచి యిట్లనియె.

వానరోత్తములారా! మనలో మహాతేజోవంతుడగు నెవ్వండు సముద్రమును దాటును. మనలో నెవ్వడుసుగ్రీవుని సత్యసంధునిగా జేయును. ఓవానరోత్తములారా! మనలోనెవ్వడు నూరామడగల యీసముద్రమును దాటును, మిగుల భయమును బొందుచున్న యీవానరుల నందఱను నెవ్వడు రక్షింపగలడు. మనలో నెవ్వనియొక్క యనుగ్రహమువలన మహాబలులగు రామలక్ష్మణులను, మహాబలుడగు సుగ్రీవుని, సంతోషవంతులమై చూడగలము. మఱియు నోవానరోత్తములారా! మీలోనెవ్వడీసముద్రమును దాటగలడో యట్టివాడు మిగుల శీఘ్రముగా బావనమగు అభయదక్షిణ నిచ్చుగావుతమనియె. ఇవ్విధముగ నంగదుడు చెప్పిన మాటనువిని యెవ్వడును నేమియును బలుకక యూరకుండె. మఱియు నావానర సైన్యమంతయు నిశ్చలమైనదైకనబడియె. అట్లునిశ్చలులై యున్న వానరులను జూచి వానరోత్తముడగు నంగదుడిట్లనియె.

వానరోత్తములారా! మీరందఱును బలవంతులలో మిగుల నుత్తములు. ఇంతియగాక దృఢవ్రతులు. అదియునుగాక మీరందఱును పరాక్రమవంతులకులమునందు బుట్టినవారు. కావున మీకు ఏలోకమునకు బోవునప్పుడును మీకాటంకమును జేయువాడెవ్వడును లేడు. కాబట్టి యోవానరవీరులారా! మీలోనెవ్వరెవ్వరి కెంతంతశక్తిగలదో చెప్పుడు. ఆవిషయమును వినియెదననియె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యఱువదినాల్గవసర్గముగిసెను.

అంగదుడు మొదలగువారుతమతమబలములను నెఱింగించుట.

అంతట నావానరవీరులందఱును అంగదునివాక్యమును విని తమతమ సామర్థ్యమును జెప్పదలచినవారై క్రమముగా గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, జాంబవంతుడునునను వారలిట్లనిరి అందుముందుగ గజుడనియెడువాడు పదియామడదూరమెగిరి పోగలననియె. గవాక్షుడిరువదియామడదూరమెగిరిపోగలననియె. పిమ్మట గవయుడనియెడు వానరుడు వానరవీరులతో నిట్లనియె.

వానరోత్తములారా! నేను ముప్పదామడదూరమెగిరి పోగలననియె. వానరోత్తముడగు శరభుడు నలుబదామడదూరమెగిరిపోగలననియె. మహాతేజోవంతుడగు గంధమాదనుడనియెడు వానరుడేబదియామడదూరము నిస్సంశయముగ నెగిరిపోగలననియె. మైందుడనియెడు వానరోత్తముడరువదియామడ దూరమెగిరి పోగలననియె. పిమ్మట మహాతేజోవంతుడగు ద్వివిదుడనియెడువాడిట్లనియె.

వానరోత్తములారా! నేను డెబ్బదామడదూరమెగిరిపోగలననియె. అంతట వానరోత్తముడగు సుషేణుడావానరవీరులతో నిట్లనియె. ఓవానరోత్తములారా! నేను ఎనుబదామడదూరమెగిరిపోగలననియె. ఇవ్విధముగ నావానరవీరులందఱును జెప్పినమాటలనువిని మిక్కిలి ముసలివాడగు జాంబవంతుడిట్లనెను.

వానరోత్తములారా! పూర్వము నాకెంత దూరమైన నెగిరిపోవుటకు శక్తిగలిగియుండెను ఇప్పుడు మిక్కిలి ముసలివాడనగుటచేత మునుపటివలె నెగిరిపోజాలను అయినప్పటికిని నేనిప్పుడు రామలక్ష్మణ సుగ్రీవులయొక్క కార్యమును ఉపేక్షించుటకుం దగినవాడను గాను. కావునం బ్రయత్నించెదను. కాలభేదముచేత నిప్పుడునాగతి మందపడియున్నది. దానిం జెప్పెదను. వినుడు. నేనిప్పుడు నిస్సంశయముగం దొంబదామడదూరముపోగలనని యావానరవీరులందఱును వినుచుండగ మఱియునిట్లనియె.

వానరోత్తములారా! నేనుపూర్వమింత దూరమేపోవ

డమైయుండలేదు. ఇకననేకయోజనముల దూరముపోవు చుంటిని. పూర్వము బలిచక్రవర్తియొక్క యజ్ఞమునందు త్రివిక్రమావతారము నవలంబించినవిష్ణుదేవునకు మూడు ప్రదక్షిణములను జేసితిని. అట్టినేనిప్పుడు ముసలివాఁడనగుట చేత సద్రముమీఁదనెగురుటకుఁ దగినశక్తిలేని వాఁడనైయుంటిని. యౌవనకాలమునందు నాపరాక్రమ మితరులచేతన డ్డు పరుపశక్యము గానిదైయుండె. ఇప్పుడు నేనుదొంబదా మడ దూరమే యెగురఁగలనని తలఁచుచున్నాను. ఇంతమాత్రముచేతఁ గార్యమునుసాధింపఁ గలనని యెన్నడము లేదని జాంబవంతుఁడనియె.

ఇవ్విధముగ హనుమంతునకు బ్రోత్సాహమును గల్పింపఁదలఁచుకొని పలికినవానరవీరుల వాక్యములనువిని యంగదుఁడు మిగులగంభీరమైన యుత్తరమును జెప్పఁ దలఁచి మిగులబుద్ధిమంతుఁడగు జాంబవంతునితో నిట్లనియె. నేను నూరామడదూరమును సముద్రముమీఁద నెగిరిపోఁగలను. అయినను మరలివచ్చుటయందు సామర్థ్యములేకుండునే మోయని తలఁచుచున్నాను. అవ్విధముగాఁ జెప్పినయంగదుని వచనమునువిని వాక్యవిశారదుఁడగు జాంబవంతుఁ డిట్లనియె.

వానరోత్తముఁడవైన యోయంగదుఁడా! నీకుసముద్రమును దాటుటయందుఁ దగినసామర్థ్యముగలదని నేనెఱుఁగుదును. నూరామడయే గాక వేయియామడ దూరముగూడఁ బోఁగలవు. మరలివచ్చుటయందును నీకుసామర్థ్యముగలదు. అయిననిట్లు సేయుటయుచితము గాదు. మఱియు నాయనా! అంగదుఁడా! ప్రేరణచేయువాఁడు ఏకార్యమును జేయుటకుఁబోవుట యుచితము గాదు. వానరోత్తముఁడా! అంగదుఁడా! నీవుమాకందఱకును యజమానుఁడవై యుండి మమ్ములఁ గార్యములయందుఁ బ్రేరేపింపఁదగినవాఁడవు. ప్రభుత్వపదమునందున్న నీవుమాచేత సంరక్షింపఁదగినవాఁడవు. మఱియునోయంగదుఁడా! "శ్లో॥ స్వామీకళత్రం సైన్యస్య గతిరేషా పరంతప,, ప్రభువగువాఁడు సైన్యముచేతఁ గాపాడఁదగినవాఁడని నీవెఱిఁగినవిషయమే గదా! కావుననీవు కళత్రమువలె సర్వకాలములయందును సంరక్షింపఁదగినవాఁడవు. మఱియును శత్రునాశకుఁడవైన యోయంగదుఁడా! ఈకార్యమునకు సర్వమునకును నీవు మూలభూతుఁడవు. మఱియునోయంగదుఁడా! "శ్లో॥ మూలమర్థస్య సంరక్ష్యమేష కార్యవిదాంనయః। మూలే హి సతి సిద్ధ్యంతి గుణాఃపుష్పఫలోదయాః,, సర్వకాలములయందును మొదలుచెడకుండునట్లు కాపాడుచుండవలయును. నీతివేత్తలగువారలకిది మొదటిపనియని నీవెఱిఁగిన విషయమేగదా! మూలముండినయెడలఁ బుష్పములును, ఫలములును, మఱియునితరములగు గుణములునుగలుగును. శత్రువులను దమింపఁజేయునట్టి సామర్థ్యముగలయో యంగదుఁడా! సత్యమగుపరాక్రమము గలవాఁడవును, బుద్ధివిక్రమసంపన్నుఁడవును నైన నీవుకార్యమును సాధించుటయందు మూలకారణమైనవాఁడవు. వానరోత్తముఁడవైన యోయంగదుఁడా! నీవుమాకుగురుఁడవనియును, గురుపుత్రుఁడవనియును నెంచుచున్నాము. కావుననిన్నాశ్రయించుకొని మేముకార్యమును సాధించుటయందు సమర్థులమైయున్నామనియె. ఇవ్విధముగా మహాప్రాజ్ఞుఁడగు జాంబవంతుఁడు చెప్పినమాటనువిని వాలిపుత్రుఁడైన యంగదుఁడు ప్రత్యుత్తరమును జెప్పఁదలఁచియిట్లనియె.

జాంబవంతుఁడా! నేనుబోనియెడల మనలోనికనెవ్వఁడును బోవువాఁడు లేడయ్యె. కావుననికమనమేమి చేయవచ్చును. కాఁబట్టిమనమిప్పుడు మునుపటివలెఁ బ్రాయోపవేశమును బొందుటయుచితమని తోఁచుచున్నది. బుద్ధిమంతుఁడగు సుగ్రీవునియొక్క సందేశమును నెరవేర్పకపోతిమేని అక్కడమనప్రాణములను మనముగాపాడుకొనుట శక్యముగాదు. వానరాధిపతియగు సుగ్రీవుఁడు ప్రసాదము వచ్చినప్పుడు మిగులగొప్పదగు మేలును జేయును. కోపము వచ్చినపుడు మిగులగొప్పదగు నపకారమును జేయును. కాబట్టిసుగ్రీవుని యాజ్ఞను నెరవేర్పక మనముపోతిమేని మనకు నాశముగలుగుననుటకు సందియము లేదు. కాఁబట్టియిప్పుడు మనమేమిచేయుదము. ఈకార్యమును మనమెట్లుసాధింపఁగలము. మనకు వేరొకగతి యేదియును లేదు. కాఁబట్టినిదేదినిక దగినవిధముగ నాలోచింపఁదగిన వాఁడవనియె. ఇవ్విధముగానంగదునిచేతఁ జెప్పఁబడినవాక్యములను విని వానరోత్తముఁడగు జాంబవంతుఁ డంగదునితో నిట్లనియె.

వానరోత్తముఁడవైన యోయంగదుఁడా! నీకార్యమేదియును జెడిపోదు. నీకార్యమునుసాధించువాని నియోగించి ప్రేరణను జేయుదమనిచెప్పె. పిమ్మటవాజాంబవంతుఁడు మిగులఁబ్రసిద్ధుఁడును, వానరులలోపల నుత్తముఁడును, ఏకాంతస్థలమునందు సుఖముగాఁ గూర్చున్నవాఁడును, నగుహనుమంతునిఁ బ్రోత్సాహపరిచె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యరువదైదవ సర్గముగిసెను.

—(*)—

అంగదుడు మొదలగువారు సముద్రమును దాటుటకొఱకు హనుమంతుని బ్రేరేపించుట.

అంతట నాజాంబవంతుఁడనేక వేల వానరవీరులుగలదియును. మిగులవ్యసనముతోఁ గూడుకొన్నదియును నగు వానరసేననుజూచి హనుమంతునితో నిట్లనియె.

వానరవీరులలో నుత్తముఁడవును, సర్వశాస్త్రములయందును నధికమగు పాండిత్యముగల వాఁడవునునైన యోహనుమంతుఁడా! నీవుఱకయేకాంతముగనుండి యేమియును బలుకకున్నాఁవేమి? హనుమంతుఁడా! నీవు తేజోబలములచేత వానరాధిపతియగు సుగ్రీవునకును, రామలక్ష్మణులకును సమానుఁడవు. అరిష్టనేమికిఁ బుత్రుఁడును, మహాబలుఁడును, సర్వపక్షులయందును నుత్తముఁడును, నగుగరుత్మంతుఁడుగలఁడు. మహాకీర్తిగలవాఁడును, మహాబలుఁడును నగు నాగరుత్మంతుఁడనేకపర్యాయములు సర్పములనెత్తికొని సముద్రముమీఁద మహావేగముగ వచ్చుచుఁ బోవుచు నుండుటనుజూచితిని. అట్టిగరుత్మంతుని ఱెక్కలకెట్టిబలముగలదో యట్టిభుజబలము నీకుఁగలదు. ఆగరుత్మంతుని విక్రమమువంటి విక్రమమును, వేగమువంటివేగమును నీకుఁగలదు. వానరోత్తముఁడవైన యోహనుమంతుఁడా! లోకములోనిసకల భూతములయందునెట్టి బలబుద్ధితేజస్సత్త్వములు గలవో యట్టిగుణములు నీకుఁగలవు. ఆవిషయమును నీవేమినిమిత్తముగఁ దెలిసికొనుటలేదు? హనుమంతుఁడా! తొల్లి దేవవేశ్యలలోనుత్తమురాలగు పుంజికస్థలయనునది యొక్కతెగలదు. అదిశాపవశమువలనఁ గామరూపము గలదియును, ప్రసిద్ధమైనకీర్తిగలదియును, ముల్లోకములయందుఁడు వారికంటెనధికమైన సౌందర్యముగలదియును, నగుఅంజనయను వానరస్త్రీజన్మమును ధరించినదై కుంజరునకుఁ బుత్రికయయ్యె. అంజనవానరస్త్రీయైనను గామరూపిణియును, సుందరములైనయవయవములుగలది యునునైయుండె. అట్లుండియొకనాఁడు మానుషరూపమునుధరించి రూపయావనములచేత అతిమనోహరమైన యాకారముగలదియును, మిగులవిచిత్రములగు పూలమాలికలు మొదలగునానినిధరించి నదియునునై వర్షాకాలమునందలి మేఘమువంటి యొకపర్వతాగ్రమునందు విహరించుచుండె. అట్లుండఁగ నాఅంజనాదేవియొక్క మంగళకరమై నదియును పసుపుఛాయగలదియును, రక్తచ్ఛాయ గలదియునునగు వస్త్రమును వాయుదేవుఁడు మెల్లమెల్లగానపహరించె. అట్లఅంజనాదేవియొక్క వస్త్రమునుదొలఁగింపఁజేసి పిమ్మటమిగుల మనోహరములగు తొడలనుజూచె. పిదపమిగుల వటువలును. ఏనుగుయొక్క కుంభస్థలములను బోలియున్నవియును, మిగులబలిసినవియునునగు స్తనములనుజూచె. అంతట మనోహరమగు ముఖమునుజూచె.

ఇవ్విధముగ మిగులఁబెద్దవియగు పిరుదులుగలదియును, విశాలములును, వెడల్పుగలవియునునగు నేత్రములుగలదియును, స్వల్పమైననడుము గలదియును, కీర్తివంతురాలును, మంగళకరములైన యవయవములు గలదియునునగు నయ్యంజనాదేవినిజూచి వాయుదేవుఁడు గామమోహితుఁడయ్యె. పిమ్మటనావాయుదేవుఁడు మన్మథపరవశుడగుటచేత బుద్ధిహీనుఁడై పతివ్రతయగు నాయంజనాదేవిని దీర్ఘములగు తనభుజములచేత నాలింగనమును జేసికొనియె అంతటఅంజనాదేవి మిగులఁదొందర గలదియును, గోపోద్దీపితురాలునునై యిట్లనియె.

ఆహా! వీఁడెవ్వఁడు; పతివ్రతనగు నాపాతివ్రత్యవ్రతమునకు భంగమునుగల్పించు చున్నాఁడనియె? అవ్విధముగాఁ బలికిన యంజనాదేవియొక్క మాటలనువిని యావాయుదేవుఁడిట్లనియె. చక్కనిపిరుదులుగల యోఅంజనాదేవీనిన్నుహింసింపను. సుందరురాలవైన యోసుందరాంగీ! నీవు పాతివ్రత్య వ్రతలోపముగలుగునని భయమును బొందకుము. ఓస్త్రీరత్నమా! కీర్తివంతురాలవగునిన్నుగాఁగలించుకొని మనస్సుచేత నీతోరమించితిని. ఓశృంగారవతీ! నీకు వీర్యవంతుఁడును, బుద్ధిసంపన్నుఁడును, మిగుల నధికమైన సత్త్వముగలవాఁడును, అధికమైన తేజస్సుగలవాఁడును, మహాబలపరాక్రమముగలవాఁడును, నగుపుత్రుఁడు గలుగును. ఆపుత్రుఁడు నాతోసమానముగ నెగరడమునందును, దాటుటయందును దగినసామర్థ్యము గలవాఁడగుననియె. అంతట వానరాధిపతివైన యోహనుమంతుఁడా! ఇవ్విధముగా వాయుదేవుఁడు చెప్పినమాటలనువిని నీతల్లియగునంజనాదేవి పరమసంతోషముగలదై యొకగుహయందు వానరోత్తముఁడగునిన్నుఁ బుత్రునిగానియె. అప్పుడుపుట్టిన నీవు ఉదయించిన సూర్యునిజూచి బాలుఁడవగు నీవుఫలమనితలచి యాఫలమునుభక్షింప వలయుననియెడు కోరికగలవాఁడవై సూర్యాభిముఖము నాకాశమునకుఁబోతివి. అవ్విధముగ నాకాశమునందు మూఁడునూరుల యోజనములవఱకును నెగిరిపోతివి. అట్లుమిగులశీఘ్రముగఁబోవునప్పుడుసూర్యునియొక్క వేడిమిచేతఁబాధింపఁబడిన వాఁడవయ్యును వ్యసనములేనివాఁడవై యతివేగముగఁబోవుచుంటివి. అప్పుడు దేవేంద్రుఁడు మిగులనధికమైన కోపముగల వాఁడై వజ్రాయుధమును నీమీఁదఁబ్రయోగించె. అంతట నీయొడమదవుడ తెగిపోయె. అప్పుడు నీవధికముగ వ్యసనమును

జెందుచు నొకపర్వతముమీఁదఁబడితివి. అవ్విధముగ దవుడ బ్రద్దలగుటవలన నీకుహనుమంతుఁడని యెడు నామధేయ ముగలిగె. అట్లుగ్రిందఁబడిననిన్నుజూచి మీతండ్రియగువాయుదేవుడు అధికమైనవ్యసనము గలవాఁడును, కోపము గలవాఁడునునై మూఁడులోకములయందును వ్యాపించియున్న తనయాకారమును సంకోచింపఁజేసి యొక్కగుహలోనికి నిన్నుఁదీసికొనిపోయి యక్కడఁగూర్చుండె. అవ్విధముగ వాయువెక్కడను బ్రసరింపకపోవుటచేత మూఁడులోకములవారును బ్రాణాపాయము గలుగున మిగుల భయమునుబొందిరి. అప్పుడు దేవతలు మిగులనుద్వేగముగల వారైరి. అంతటలోకాధిపతులగు దేవతలందఱును గోపోద్దీపితుఁడైయున్న వాయుదేవుని బహువిధముల బ్రార్థించి యనుగ్రహముగలవానినిగా జేసిరి.

అవ్విధముగ వాయుదేవుడు ప్రసన్నుడుకాఁగానే సత్యవిక్రముడవైన యోహనుమంతుఁడా! లోకములోపశస్త్రములవలనను జావులేకుండునట్లు నీకువరమునిచ్చె. ఆసమయమునందు వేయినేత్రములుగల దేవేన్ద్రుడుపరమ సంతోషముగలవాఁడై వజ్రాయుధముచేత నీకుమరణముగలుగ నేరదనియును, స్వచ్ఛందమరణముగలుగు ననియునువరమునిచ్చె. భయంకరమైన పరాక్రమముగల యోహనుమంతుఁడా! నీవు కేసరియను వానికిక్షేత్రజుడవైన పుత్రుడవు వాయుదేవునకౌరసపుత్రుడవు, కాబట్టినీవువాయుదేవునితో సమానుడవు. మఱియునోనాయనా! ఆంజనేయా! వాయుసుతుడవగు నీవుఎగురుటయందు వాయుదేవునకు సమానుడవు. మేమందఱమును నిప్పుడుప్రాణములు పోవునని యెడు భయముచేత వ్యసనమును బొందుచున్నాము. కాబట్టినీవిప్పుడు మమ్ములగాపాడవలయును. మఱియునో హనుమంతుఁడా! నీవుదాక్షిణ్యమును, పరాక్రమమునుగల రెండవగరుత్మంతుడన దగియున్నావు విష్ణుదేవుడు త్రివిక్రమావతారమునవలంబించినప్పుడు నేనుసముద్రములతోడను, పర్వతారణ్యములతోడను గూడుకొన్నభూమి కిరువదొక్కపర్యాయములు ప్రదక్షిణమును జేసితిని. అటులనే దేవాజ్ఞవలన నేననేకౌషధమునను సంపాదించితిని. ఆయౌషధములవలన నాకమృతముగలిగె దానిచేత నేను మహాబలుడనైతిని. అయినను నేనిప్పుడు వృద్ధుడనగుటచేత క్షీణమైనపరాక్రమము గలవాడనైతిని కావున నేనిప్పుడు పరాక్రమింపజాలనైతిని. నీవుసర్వగుణములునుగల వాడవగుటచేత నిప్పుడుసర్వకార్యములను నెరవేర్పదగియున్నావు. కాబట్టియెగురునట్టి వానరులలో నుత్తముడవైన యోహనుమంతుఁడా! నీవువిజృంభింపుము. హనుమంతుఁడా! ఈవానరసైన్యమంతయును నీపరాక్రమమును జూడవలయునని యెడు కోరికగలిగియున్నది కావునవానరోత్తముడవైన యోహనుమంతుఁడా! నీవుశీఘ్రముగ లెమ్ము. లేచియతిశీఘ్రముగ నీదక్షిణమహాసముద్రమును దాటుము. మఱియునోహనుమంతుఁడా! నీగతివంటిగతి ముల్లోకములో నెవ్వరికిని లేదు. హనుమంతుఁడా! ఈవానరులందఱును నధికముగవ్యసనమును బొందుచున్నారు. నీవెందుకు ఉపేక్షను జేసెదవు. మహావేగముగల విష్ణుదేవుడు ముల్లోకములయందును విక్రమించినవిధముగ విక్రమింపుమనియె. అవ్విధముగా జాంబవంతుడు ప్రేరణను జేసినపిమ్మట ప్రసిద్ధమగు వేగముగలవాడును, వాయుదేవునకు బుత్రుడును, నగుహనుమంతుడు మిగుల సంతోషముగలవాఁడై యావానరసైన్యమునకును సంతోషమును గల్పించుచు నత్యద్భుతమగు రూపమును నవలంబించె.

ఇ॥ కిష్కింధాకాండమునందలి యరువదాఱవసర్గ ముగిసెను.

⁍(❋)⁌

ఆంజనేయుడు లంకాపట్టణమునకు బోవుటకు బ్రయత్నించుట

అవ్విధముగ నూరామడపరిమితిగల సముద్రమును దాటుటకు యత్నించినవాడును, పరాక్రముచేత బరిపూర్ణుడై యున్నవాడును, మహాబలుడును, నగుహనుమంతుని జూచి యావానరులందఱును వ్యసనమునువదలిపెట్టి సంతోషముతో గూడుకొనినవారలై యధికముగా సంతోష సూచకములగు ధ్వనులను జేసిరి మఱియునావానర వీరులందఱును, సంతోషాశ్చర్యములుగలవారై సముద్రమును దాటుటకొఱకువిజృంభించుచున్న యాహనుమంతునిత్రివిక్రమావతారమును నెత్తుచున్న నారాయణునిజూచి లోకులందఱును నాశ్చర్యమును బొందినవిధముగ నాశ్చర్యమునుబొందిరి మఱియునా హనుమంతుని ననేకవిధములబొగడిరి అట్లు వానరవీరులచేత బొగడబడుచున్నవాడును, మహాబలుడును, నగుహనుమంతుడు తనతోకనుఝాడించి యధికమైన బలముగలవాడయ్యె. మఱియువాయుదేవున కౌరసపుత్రుడగు హనుమంతుడు పర్వతగుహాయందలి సింహమేవిధముగా విజృభించునో యావిధముగా విజృంభించె. అవ్విధముగ విజృంభించుచున్నవాడును, బుద్ధిమంతుడును, ప్రకాశించుచున్నయం బరిషునివలెనున్నవాడునునగు హనుమంతునియొక్క ముఖముఆసమయమునందు బొగలేనినిప్పువలె బ్రకాశించుచుండె. అంతటనాహనుమంతుడు సంతోషముచేత రోమాంచముగలవాఁడై యావానరసైన్య మధ్యమునను౦డిలేచి వృద్ధులగు వానరులకందఱకును నమస్కారమును జే

సి యిట్లనియె.

వానరోత్తములారా! నేను, పర్వతాగ్రములను ఛేదించువాఁడును, అగ్నిదేవునకు స్నేహితుఁడును, బలవంతుఁడును, అపరిమితమగు పరాక్రమము గలవాఁడును, ఆకాశమునందు సంచరించువాఁడును, అతివేగము గలవాఁడును, మహానుభావుఁడును, నగువాయుదేవున కౌరసపుత్రుడను. కాఁబట్టి నాతోసమానుఁ డెవ్వఁడునులేడు. ఓవానరోత్తములారా! మిగులవెడల్పు గలదియును, ఆకాశమును ఒరయుచున్నదియును, నగుమేరుపర్వతమును నతిక్రమించుటకుఁ బ్రయత్నించెదను. మఱియునో వానరోత్తములారా! నాబాహువేగముచేత నీదక్షిణసముద్రమును దాటుటకు యత్నించెదను. మఱియును బర్వతములతోడను, నదులతోడను, మడుగులతోడను, గూడుకొన్నభూలోకమును సర్వమును నతిక్రమింపఁగలను. మఱియునో వానరోత్తములారా! నేనునాపిక్క బలిమిచేత మిగులభయంకరమైన మొసళ్లుగలదియును, వరుణదేవునకు నివాసస్థానమైనదియును, నగుసముద్రమును అవలీలగదాటగలను ఆకాశమునందంతటను మిగులవేగముగ సంచరించునట్టివాఁడును, సర్పములను భక్షించువాఁడును నగుగరుత్మంతుని గమనవేగమును నతిశీఘ్రముగ నతిక్రమింపఁగలను

వానరోత్తములారా! సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయమునకు లోపల సూర్యునొద్దకు వేయి పర్యాయములు పోయి రాగలను. నావేగము వంటి వేగము మూడులోకములయందును నెవ్వరికిని లేదు. మఱియు నో వానరోత్తములారా! ఆకాశగోచరములగు సకల భూతములను, ఆక్రమించుటకు శక్తిగలవాడనై యున్నాను. మఱియు నోవానరోత్తములారా! నేనేసముద్రమును శోషింపజేయగలను. భూమిని బ్రద్దలు సేయగలను. పర్వతములను జూర్ణము చేయగలను. తొడలయొక్క వేగముచేత మిగుల గొప్పదగు సముద్రమును హరింపగలను. మఱియునో వానరోత్తములారా! నేనంతరిక్షమునం దెగురు నప్పుడు తీగెలును, వానిపుష్పములును, వృక్షములును, వానిపుష్పములును, నావెంటనంటి రాగలవు. అంతరిక్షమునందు నక్షత్రములు నిరాటంకముగ దిరుగునట్లు నేనుగూడ నంతరిక్షమునందు నిరాటంకముగఁ దిరుగగలను. మఱియు నోవానరోత్తములారా! భయంకరమైన యాకాశమునం దెగురుచున్నవాడను, పోవుచున్నవాడను, క్రిందికివచ్చుచున్నవాడను, నగు నన్ను సర్వభూతములును నన్ను బూచి యాశ్చర్యమును బొందగలదు ఆకాశమునందు మేఘమువలె మహావేగముతో బోవుచున్న నన్ను జూతురు. ఆకాశమును నపహరించుటకుగా నంతరిక్షమునం దెగురుచున్న వానివలెనున్న నన్ను జూడ గలరు. మఱియు నోవానరోత్తములారా! నేను మేఘములను వధింపగలను. పర్వతములను వణికింపగలను. మఱియు నోవానరోత్తములారా! సముద్రముమీద నెగురుచున్న నేను సముద్రమును క్షోభ పెట్టగలను. నాకుగరుత్మంతునకును, వాయుదేవునకును నెట్టిసామర్థ్యము గలదో యట్టిసామర్థ్యము గలదు. మఱియునోవానరోత్తములారా! నాతోసమానముగ గరుత్మంతుడును, మహావేగముగల వాయుదేవుడునుదప్ప దక్కినవారెవ్వరును నెగురజాలరు. మఱియు నోవానరోత్తములారా! క్షణమాత్రములో నాకాశమునందు, మేఘములయందు మెఱుపుతీగ సంచరించిన విధముగ సంచరింప గలను. మఱియు నోవానరోత్తములారా! సముద్రమునం దెగురుచున్న నన్ను జూచి మీరందఱును ముల్లోకములను త్రివిక్రమావతారముచేతనాక్రమించుచున్న విష్ణుదేవుడు గాబోలునని తలతురు. మఱియు నోవానరోత్తములారా! నేను నాచేష్టలచేతను, బుద్ధిచేతను త్రివిక్రమావతారము నవలంబించిన విష్ణుదేవునకు సమానుడనని తలవగలను. మఱియు నోవానరోత్తములారా! నేను వేగమునందు వాయుదేవునకు సమానుడను. జవమునందు గరుత్మంతునకు సమానుడను. మఱియు నేనిప్పుడు నూరుయోజనముల దూరమును దాటగలనని నిశ్చయించుకొని యున్నాను. వజ్రాయుధమును ధరించిన దేవేంద్రునినైనను, స్వయంభువుడైన బ్రహ్మదేవునినైనను నెదిరించి యమృతమునునైన నిక్కడకు తేగలను. లంకాపట్టణమును సర్వమును బెల్లగించి యిక్కడకు దీసికొని రాగలనని నిశ్చయించుకొనియున్నాననియె. ఇవ్విధముగ మహోత్సాహముతో బలుకుచున్నవాడును, వానరోత్తముడును, మిగుల నధికముగ గూయుచున్నవాడును, అమితమగు పరాక్రమము గలవాడును, నగు హనుమంతుని జూచి పరమాశ్చర్యమును బొందినవారైరి. హనుమంతునిచేత జెప్పబడినదియును, వానరులదుఃఖమును నశింపజేయు నట్టిదియును, నగు మాటనువిని జాంబవంతుడు పరమానందమును బొందినవాడై వానరోత్తముడగు హనుమంతునితో నిట్లనియె.

వీరుడగు కేసరియనువానికి బుత్రుడవును, వాయుదేవునకౌరసపుత్రుడవునునైన యోహనుమంతుడా! నాయనా! నీమూలకముగ వానరులయొక్క దుఃఖమంతయును నశింపజేయబడినది. మఱియు నోహనుమంతుడా! మంగళకరులును, వానరోత్తములును నగు వారు నీమోలకు వచ్చియున్నారు. వీరందఱును గార్యసిద్ధికొఱకు మంగళ కార్యముల

ను నెరవేర్పగలరు. మఱియు నోహనుమంతుఁడా! ఋషులయొక్క యనుగ్రహముచేతను, వృద్ధులగు వానరుల ప్రసాదముచేతను, గురువుల యనుగ్రహముచేతను, ఈదక్షిణ మహాసముద్రమును దాటుము. నీవు వచ్చువఱకును మేమందఱమును నొక్కపాదముతో నుండెదము. మఱియు నోహనుమంతుఁడా! ఈవానరవీరులయొక్క ప్రాణములన్నియును నీయధీనములై యున్నవియనిరి. అంతట నాహనుమంతుడు వానరవీరులనందఱునుజూచి యిట్లనియె.

వానరోత్తములారా! నేనిక్కడనుండి మిగులవేగముతో నెగిరితినేని యీభూమియాక్రాంతమై యఱిగిపోవును. తాళ్లతోమిగులనున్నతమైన యీమహేంద్రపర్వతముయొక్క శిఖరములు మిగులగొప్పవియును, స్థిరములైనవియునునై యున్నవి. కాబట్టి ఈమహేంద్రపర్వతముయొక్క శిఖరములయందుండి వేగమునవలంబించెదను. మఱియు నోవానరోత్తములారా! ఈపర్వతశిఖరములు నానావిధములగు వృక్షములతోగూడినవియును, గైరికాదిధాతునిష్యందముచేత బ్రకాశించుచున్నవియును, నై మిగుల మనోహరముగ నున్నవి. వానరోత్తములారా! ఈశిఖరములు నాపాదముల తాకుడును భరింపగలవు. నూరుయోజనముల దూరమెగురుటకొఱకు జేసిన యూతము నీశిఖరములు భరింపగలవనియె. ఇవ్విధముగ జెప్పి వాయువేగమువంటి వేగముగల హనుమంతుడు ఆమహేంద్రపర్వతము నధిష్ఠించెను. ఆపర్వతము, నానావిధములగు వృక్షములతోగూడుకొన్నదియును, వేళ్లచేత సేవింపబడుచున్న పచ్చికపట్లుగలదియును, మదించినయేనుగుసముదాయముచేత బీడింపబడుచున్నదియును, నానావిధములగుతీగెలును,పుష్పములును గలదియును, నానావిధములగు జలప్రవాహముతో గూడుకొనినదియును, మిగులనున్నతములగు శిఖరములతో గూడినదియునునై యతిమనోహరముగ బ్రకాశించుచుండెను. అట్టిపర్వతము మీద మహాబలుడును, దేవేంద్రుని పరాక్రమమువంటి పరాక్రమముగలవాడును, వానరోత్తముడును, నగు హనుమంతుడు మిగుల కుతూహలముతో విహరించెను. మఱియు నాపర్వతము మహాత్ముడగు హనుమంతునియొక్క పాదములచేత నధికముగా బీడింపబడియె. అట్లు పీడింపబడిన యాపర్వతము సింహముచేత బీడింపబడిన మదపుటేనుగును బోలియుండెను. మఱియు నాపర్వతమాపీడకు సహింపజాలనిదానివిధముగ గన్నీరునకు దుల్యమగు జలమును స్రవింపజేసెను. మఱియు నాపర్వతమునందలి మృగములును, ఏనుగులును మిగుల భయముచేత బరుగిడిపోయె. మద్యపానాదిసంబంధములచేత గఠినమైన ప్రవర్తనలుగల నాగులయొక్కయు, గంధర్వులయొక్కయు మిథునములు ఆపర్వతమును వదలిపోయిరి. గొప్పగొప్ప సర్పములన్నియును, పెద్దపెద్దగుహలలోనికిబోయి యణగియుండెను మఱియు నాపర్వతము భయముచేత నిట్టూర్పులను వదలుచున్న సర్పములయొక్క నిట్టూర్పులచేత శిఖరములతోగూడ గడగడవణకె. మఱియు నాపర్వతము పతాకములుగలదానివలె బ్రకాశించెను. మఱియు నాసమయమునం దక్కడనున్న మునులందఱును భయభ్రాంతచిత్తులై యాపర్వతమును విడిచి పోయిరి. మఱియు నాపర్వతము గొప్పదగు నరణ్యమునందు "భోజనద్రవ్యహీనుడగు మార్గస్థునివలె" గడగడవణకె. అట్టి పర్వతమునుండి మిగుల వేగముగలవాడును, వేగము నవలంబించినవాడును, మహానుభావుడును, వానరోత్తముడును, శత్రువీరులను నశింపజేయువాడును, మిగుల బుద్ధిమంతుడును నగు నాహనుమంతుడు మనస్సును దృఢముగా జేసికొని మనస్సుచేతనే లంకాపట్టణమునకు బోయె.

ఇట్లు శ్రీమత్కిష్కింధాకాండమునందలి యరువదేడవ సర్గ ముగిసెను.

ఇట్లు సకలకళాకలాప దురంధరుఁడును-బరూరు - సీతారామార్యతనూభవుఁడునునగు

బరూరు - త్యాగరాయశాస్త్రిచే రచియింపబడిన యాంధ్రవచనకావ్య

శ్రీమద్వాల్మీకిరామాయణమునందు కిష్కింధాకాండము- ముగిసెను.

శ్రీ రా మ చం ద్రా ర్ప ణ మ స్తు.

శ్రీరస్తు

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః.

శ్రీమద్వాల్మీకిరామాయణము

సుందరకాండము.

పిదప శత్రుమర్దనుఁడగుఆంజనేయుఁడు రావణాసురుని చేదీసికొని పోబడినసీతాదేవియుండెడు స్థలమును వెదుకుట కొఱకు దేవతలుసంచరించెడిమార్గమగు ఆకాశమార్గము నఁబోవుటకుఁబ్రయత్నించె. ఇట్లు ఆహనుమంతుఁడు లోకమున నెవరిచేతను జేయశక్యముగాని సముద్రముదాటుటమొదలగుకార్యములఁజేయఁబ్రయత్నించి "వృషభరాజమువలె" తనతలయును మెడయునుబైకెత్తినలుదిక్కులనుజూచె. మఱియుమహాబలుఁడుసుధీరుఁడునునగు నాహనుమంతుఁడుమరకతమణులవలె ఆకుపచ్చవన్నెగలవియును, నీళ్ళవలెచల్లగానుండునవియును,నగులేతపచ్చికగలయాప్రదేశములందు సుఖముగాసంచరింపఁదొడఁగె.

ధీమంతుఁడగునాహనుమంతుఁడు పక్షులనుభయపఱచుచు, ఱొమ్ముచేవృక్షములబడద్రోయుచు, అనేకములగుమృగములను మరణమునొందింపుచు "వృద్ధినొందినసింహంబువలె,,సంచరించె. ఆహనుమంతుఁడధిష్ఠించియుండు నమ్మహేంద్రపర్వతముయొక్క క్రిందిభాగము నలుపు మెఱుపుపసుపువన్నెయును, తెలుపునలుపునుగలవన్నెయును గలిగిన నానావిధరంగులుగలదిగను, స్వభావముగబుట్టినగైరికాదిధాతువులచే నలంకరింపఁబడినదిగనునుండె మఱియునందు కోరినరూపములనుధరించువారును,మిగులనలంకృతులును,నగుయక్షకిన్నరగంధర్వులును, దేవతలతోసమానులగుపన్నగులును,వాసముసేయుచుండిరి. వానరోత్తముఁడగునాహనుమంతుఁడుపర్వతోత్తమమగునమ్మహేంద్రపర్వతముయొక్క యేనుగులతోడంగూడిన క్రిందిభాగముననుండి "కొలనునందలియేనుగువలె,, ప్రకాశించె.

ఇట్లు గజరాజమువలె ప్రకాశింపుచునాహనుమంతుఁడుసూర్యునికొఱకును, ఇంద్రునికొఱకును, వాయుదేవునికొఱకును, బ్రహ్మదేవునికొఱకును, భూతములకొఱకును, చేతులనుముకుళించుకొని నమస్కరించి లంకాపట్టణమునకు బోవుటకుఎత్నించె కార్యనిర్వాహకుఁడగునాహనుమంతుఁడుతూర్పుముఖముగానిలిచితనతండ్రియగు వాయుదేవునికొఱకుప్రత్యేకముగచేతులజోడించుకొని నమస్కరించిదక్షిణపుదిక్కునుగూర్చిపోవుటకు తనదేహమునుబెంచె. ఇట్లుశరీరమునుబెంచివానరోత్తములగు జాంబవంతుఁడు మొదలగువారు చూచుచుండగ రామునకు హితవుగలుగుటకొఱకు "పర్వకాలములందుసముద్రుఁడువృద్ధిబొందినటుల,, విశేషముగవృద్ధినొందె

ఇట్లు అంజనేయుఁడుమితిలేనిశరీరమునుధరించిసముద్రమునుదాటగోరిచేతులతోడను, కాళ్ళతోడనుఅమ్మహేంద్రపర్వతమునుమర్దించె. అంతచలింపనిదగునమ్మహేంద్రపర్వతముఆంజనేయునిచేఁబీడింపఁబడిముహూర్తకాలము చలనమునొందె. అట్లుకదలుటచేబుష్పించియుండువృక్షములయొక్కపుష్పములన్నియుజలజలరాలె. అట్లురాలినసువాసనగలపుష్పంబులచే నమ్మహేంద్రపర్వతముఅంతటనుగప్పఁబడ 'పువ్వులకొండయో,, యనందగియుండె. మఱియునుత్తమమగుపరాక్రమముగల నాహనుమంతునిచే నమ్మహేంద్రపర్వతముపీడింపఁబడి "మావటివానిచేమర్దింపఁబడినమదపుటేనుగురెండింతలుగ మదజలమునువిడుచునట్లు,, యందలి సెలయేఱులుసాధారణంబుగవిడుచుచుండు జలంబునకంటెరెండింతలుగవదిలె మఱియునమ్మహేంద్ర పర్వతమునందుండనబంగారుఱాళ్ళును, వెండిఱాళ్ళును, నీలంపుఱాళ్ళను, బగులుటచేనచ్చటచ్చటరేఖలురేఖలుగగనుపించుచుండె. మఱియు, కాళీ,కరాళీ, విస్ఫులింగిని,ధూమ్రవర్ణ, విశ్వరుచి, లోహిత, మనోజవయనునగ్నిహోత్రమునందలి సప్తజ్వాలలోధూమ్రవర్ణయను జ్వాలతోడంగూడిన అగ్నినుండి పొగసమూహమువెడలివచ్చునట్లుఅప్పర్వతమునుండి మణిలలనుగొప్పఱాళ్ళుబయలువెడలె. మఱియు నప్పర్వతమునందలిగుహలయందునివసింపుచున్న భూతములకభిఘాతకలుగుటచేనవిదైన్యంబునొందివికారస్వరంబుతో హూరుమని ఏడ్వదొడంగె. ఇట్లాభూతములురోదనముజేయుటచే నా

రోదనధ్వని నప్పర్వతప్రాంతమునందలి తోటలును, దిక్కులును, నిండివినఁబడుచుండె. అప్పర్వతమునందునివసింపుచుండిన గొప్పసర్పంబులుఅర్ధచంద్రాకారమువలె నల్లనిరేఖలుగలపడిగెలతోడంగూడినతమతలలను పైకెత్తుకొని ఘోరంబగునిప్పులుగ్రక్కుచుపండ్లచేఱాకొండఱాళ్లనుగటకటమనిఁగొఱుకఁదొడంగె. అట్టియెడగొప్పవియైననాకొండఱాళ్లు మహాకోపంబునొందినయవ్విషసర్పంబులచేఁగఱవఁబడివిషాగ్నితోడంగూడిభగభగమండుచు ననేకవేలతునకలుగఁబగిలె. అప్పర్వతమునఁబుట్టిన ఓషధులసమూహములు విషములఁబోఁగొట్టునవియైనను ఆసమయమునమహాకోపంబుతో సర్పములచేఁగ్రక్కఁబడిన విషములనుమాత్రము నుపశమింపఁజేయఁజాలనివయ్యె. అందునివసింపుచుండినతపోధనులగుఋషులు,ఆపర్వతముతనసంబంధమగు పంచభూతములతోఁడఁపగిలిపోవునేమోయనిభయాక్రాంతులై యాపర్వతమునువదలి యాకాశంబునకెగిరిరి. మఱియునప్పర్వతమునందు నివసింపుచుండినవిద్యాధరులును, మిగులభయమునొందితమస్త్రీతోఁగూడపానముజేసెడిబంగారుపానపాత్రములను, ములైనపాత్రములను, స్వర్ణమయమగుగిండీలను పాత్రలను, తేనెమొదలగువస్తువులను, అనేకవిధములగుపిండివంటలను, నానావిధములగుమాంసములను,ఎద్దుచర్మములతోఁజేయఁబడినడాలులను,బంగారుపిడులుగలఖడ్గములను,వదలియాకాశమునకెగిరిరి ఇట్లెగిరిపుష్పహారములుధరించినవారును,మదించినవారును, ఎఱ్ఱనిపూఁదండలుగలవారును, ఎఱ్ఱనిగంధమునుబూసికొనియుండువారును, ఎఱ్ఱనికండ్లుగలవారును, కమలనేత్రులును, నగునవ్విద్యాధరులును, స్వర్ణహారంబులును, అందెలును, భుజబందులును, గలనవ్విద్యాధరస్త్రీలును, ఆకాశముననొక్కటిగఁజేరి తమతమప్రాణనాథులతోడంగూడినవ్వుచు నప్పర్వతముబగులుటకాశ్చర్యము నొందుచుండిరి. మఱియునవ్విద్యాధరులలోశ్రేష్ఠులగువారుమహావిద్యయగు అణిమాదిసిద్ధిమొదలైన తమవిద్యలంబూపుచు ఆకాశంబుననెయుండిపర్వతమునుజూచుచుండిరి. అవ్విద్యాధరులు,స్వచ్ఛమగునయ్యాకాశమునందుండుపరమాత్మధ్యానతత్పరులగుఋషులును, చారణులును, సిద్ధులును, నొండొరులిట్లు మాటలాడుకొనుచుండుటనువినిరి. ఓహోపర్వతముతోసరియైనవాఁడును, మిగులవేగముగలవాఁడును, వాయుదేవునిపుత్రుఁడునునైననియాంజనేయుఁడు మొసళ్లతో నిండియుండు సముద్రమును దాటవలయునని నిశ్చయించుచున్నాఁడు ఈయాంజనేయుఁడు రామునికొఱకును వానరులకొఱకును నితరులచే జేయశక్యముగాని పనినిజేయఁగోరుచు సముద్రముయొక్క నవ్వలిదరిని జేరఁబత్నించియున్నాఁడు- అనియిట్లుమహాత్ములగునాఋషులుమొదలగువారు సంభాషించుచుండుటనువవ్విద్యాధరులువినుచు, మితిలేనిశరీరంబునుధరించియుండువానరోత్తముఁడగునాంజనేయునిజూచుచుండిరి. అట్టియెడపర్వతముతోసమానమైనశరీరముగలయాంజనేయుఁడుమహోత్సాహంబునవెంట్రుకలనువిదిర్చె.ఇట్టటుకదిలె. "మిగులగొప్పమేఘమువలె,,గొప్పధ్వనిగల్గునట్లుగశబ్దించె. మఱియునయ్యాంజనేయుఁడుచుట్టగాజుట్టుకొనివెంట్రుకలచేనిండియుండు తనతోకను,,గరుత్మంతుడుసర్పమునువిదళించివేయునట్లువిదిలించె.మహావేగముగలనాహనుమంతునియొక్క వెనుకపార్శ్వమునందు వంకరగావ్రేలాడుచున్నతోక ,,గరుత్మంతునిచేఁదీసికొనిపోఁబడుచున్న మహాసర్పమువలె,,చూపట్టె. అయ్యాంజనేయుడుసముద్రముదాటనుద్యుక్తుఁడై గొప్పయినుపకంభంబులతోసరియైనతనచేతులనుస్తంభించుకొనినూపిరిబిగబట్టినడుమునుసన్నగిలంజేసి పాదములనుముడుచుకొనిభుజములను, మెడనుసంకోచింపజేసితేజంబును, బలంబును, మహత్కార్యమును జేయఁదగినవీర్యమునునవలంబించె. ఇట్లవలంబించి దూరమునుండిమార్గమునుజూచుచునూర్ధ్వదృష్టిగలిగి యాకాశమునుజూచుచు శ్వాసములనుబిగియంబట్టె. ఇట్లమ్మహాబలుండునువానరోత్తముడునునగునయ్యాంజనేయుఁడు యుచ్ఛ్వాసనిశ్వాసంబులబిగియబట్టితనబలముచే గాళ్లనుదృఢముగా నూనిచెవులనుముడుచుకొని ఎగరబోవుచు అంగదుఁడుమొదలగువారినిజూచియిట్లనియె.

ఓవానరశ్రేష్ఠులారా! "రామబాణంబెట్లు వాయువేగమువలెమహావేగముతోఁబోవునో,, అట్లునేనువేచ్చోటనునిలవక రావణునిచేఁబరిపాలింపఁబడు లంకాపట్టణమునకుఁబోయెదను. అట్లుపోయిలంకాపురంబుజేరి యందుజనకమహారాజపుత్రికయగుసీతనుజూడకపోతినేనియీవేగముతోడనే స్వర్గంబునకుఁబోయెదను. ఆస్వర్గమునందునుసీతనుజూడకపోతినేని అలసటదీర్చుకొనకయే మఱలలంకాపట్టణమునకుబోయిరాక్షసరాజగురావణాసురునిగట్టితెచ్చెదను. ఓవానరోత్తములారా! ఎన్నివిధములచేతనైనను నేనుకృతకార్యధురంధరుడనై సీతనువెదకితెచ్చెదను. అట్లుదీసికొనిరాకపోతినేనిరావణాసురునితోడఁగూడలంకాపట్టణమునబెల్లగించినిచటికిదెచ్చెదను. అనియిట్లాంజనేయుఁడుఅంగదాదులతోడంజెప్పికొంచెమైననుసంశయింపకఆకాశమార్గంబునకెగిరె. ఇట్లెగిరితన్ను "గరుత్మంతునివలె,, తలంచుకొనెను. అంతనయ్యాంజనేయుఁడుమహావేగముతో నెగురుటచే నావేగమువలననప్పర్వతమునందలివృక్షములు, కొమ్మలుమొదలైనవానితోఁగూడినవై వ్రేళ్ళంబెకలించుకొనిపైకెగి

రెను. మఱియునయ్యాంజనేయుఁడు తనతొడలవేగముచే, మడించిన చీకుగొక్కెరలను బత్తులతోగూడినవియును, పుష్పములతోగూడినవియును నగువృక్షములనుసీడ్చుకొనివిమలమగు నాకాశమార్గమునబోయె. ఇట్లుఆంజనేయునితొడలవేగముచే బైకెగిరినవృక్షములు "దూరప్రయాణముజేయబోయెడు చుట్టమునుబంధువులుకొంతదూరము దోవసాగనంపుటకైకూడబోయినట్లు,, కొంచెముసేపు యాంజనేయునివెంబడించిపోయినవి మఱియునుతొడలవేగముచేబైకెగిరినమద్దిచెట్లును, ఇతరములగువృక్షశ్రేష్ఠములును" రాజునువెంబడించిపోయెడు సైన్యమువలె,, ఆంజనేయునివెంబడించిపోయె. అట్లుపర్వతముతోసమానమైన శరీరముగలయయ్యాంజనేయుఁడు మిక్కిలిచక్కగాజూచియుండు వృక్షములమధ్య యాకాశమార్గంబుననుండుటచే జూచువారలకు మహాశ్చర్యముగనుండె. పిదపముగులబరువుగల వృక్షములు 'దేవేంద్రుని భయమువలన సముద్రమునంబడు పర్వతములవలె,, సముద్రమునగూలి మునిగిపోయినవి.

మేఘముతోసమానుడగు నయ్యాంజనేయుఁడు మొలకకలతోను మొగ్గలతోను పుష్పములతోనుగప్పఁబడి మిణుగురుబూచులతోడగూడిన గొప్పపర్వతమువలె ప్రకాశించుచుండె మఱియునయ్యాంజనేయుని వేగముననుసరించి పోవుచుండినయితరవృక్షములు కొంతదూరమతనితోగూడఁ బోయి యతనివేగము ననుసరింపలేక "స్నేహితుఁడుపైన మైపోవుచుండగ నతనిస్నేహితులునీరడ్డము వచ్చువరకునుదోవనంపివెనుకకు దిరుగునట్లు,, మఱలిసముద్రమునందుబడినవి ఆ వృక్షములయందుండిన నానావిధములైన పుష్పములు తేలికకావున ఆయాంజనేయుని వేగమువలనగలిగిన గాలిచేచెట్లనుండి విడదీసుకొని యాహనుమంతునితోగూడ చాలాదూరమువెంబడించి పోయిపిమ్మట యాపుష్పములందుకొన్ని, చూచువారికి మిగులనాశ్చర్యకరముగా సముద్రములోరాలినవి. అట్లురాలిన పూలతోగూడిన సముద్రము "నక్షత్రములతోగూడిన యాకాశమువలె,, బ్రకాశించుచుండె మఱియునాకాశమార్గమున బోవుచుండెడు యాంజనేయుడు తన్నువెంబడించి వచ్చుచుండెడు నానావిధములయిన పువ్వులతోగూడుకొనియుండుటచే మెఱుములతోగూడియున్న మేఘమువలెనే ప్రకాశించుచుండె. అంతట నాపువ్వులన్నియు గొంతదూరముపోయి యావలనాయాంజనేయుని వేగముననంటిబోజాలక సముద్రజలములంబడుటచే నాసముద్రోదకము" నక్షత్రములతోగూడిన యాకాశమువలె,, గనుపట్టుచుండె. అట్లుగగనమార్గమున బోవుచుండిన యాంజనేయునియొక్క చాచఁబడినచేతులు పర్వతశిఖరముననుండి బైలువెడలివచ్చిన "ఐదుతలలపాములో,, యనునట్లుగనిపించుచుండె. ఇట్లుబోవుచుండినయాంజనేయుడుసముద్రజలమునకు సమీపముగాబోవునపుడుఆ సముద్రజలము త్రాగువానివలెను, ఆకాశమునకుదగ్గరగాబోవునపుడు అయ్యాకాశముమ్రింగువానివలెనునుండె మఱియుగగనమార్గమునబోవుచుండిన అయ్యాంజనేయునియొక్క మెరుములంబోలు నేత్రములుపర్వతాగ్రముననున్న రెండగ్నిజ్వాలాత్రములవలెనుండె. మఱియునయ్యాంజనేయునినేత్రములుగుండ్రములుగను, పింగళవర్ణముగలవిగను పెద్దవిగనునుండుటచే ఏకకాలమునందుఉదయించినచంద్రసూర్యులవలెనుండె ఆసమయమునయ్యాంజనేయునియొక్క యెఱ్ఱనిముక్కుతోగూడిన ముఖము సంధ్యారాగముతోగూడిన సూర్యమండలమువలెనే" యుండె అట్టియెడవాయుపుత్రుడైన ఆంజనేయుఁడుగగనమార్గంబున నెగిరిపోవుచు తనతోకనుమీదికెత్తికొనిపోవుటచే నాకాశమునకు తాకుచున్నయాతోక "పూజార్థముగానెత్తబడిన యింద్రధ్వజమువలె,, యగుపడుచుండె మఱియుగొప్ప దేహముగలవాఁడును, తెల్లనికోరలుగలవాఁడును, మిగులప్రజ్ఞావంతుడును, వాయుపుత్రుడునునగునాంజనేయుఁడు తనతోకనుగుండ్రముగ చక్రాకారముగచుట్టుకొనియుండినపుఁడు "పరివేషము (గాలిగూడు) నొందినసూర్యమండలమువలె,, కనుపడుచుండె అయ్యాంజనేయునిపిరుదులంతటను తామ్రవర్ణముగలిగి యెఱ్ఱగనుండుటచే రెండుబ్రద్దలగునట్లుగ పగలగొట్టబడి గైరికాది ధాతువులతోగూడుకొనిన గొప్పపర్వతమువలెనే,, ప్రకాశించుచుండె ఇట్లుమహావేగమునబోవుచున్న నయ్యాంజనేయునిచంకలనడుమప్రవేశించి వెలికిబోవుచుండిన గాలి" మేఘగర్జనమో,, యనునట్లుధ్వనిజేయుచుండె అయ్యాంజనేయుఁడు, ఆకాశమునను త్తరపుదిశనుండి బైలువెడలినదియును, దక్షిణపుదిశనుగూర్చిపడుచున్నదియును తనసంబంధమైన తోకతోగూడినదియునునగు తోకచుక్కవలె,, లంకానగరమునకు నుత్పాతమును సూచింపుచుబోవుచుండె. ఇట్లుఆకాశమునందుపోవుచున్న సూర్యునితోసమానుఁడగు నయ్యాంజనేయుఁడు 'నడుము మోకుచేగట్టబడిన గొప్పదేహముగల యేనుఁగువలె,,నుండె అట్టియెడగగనమున బోవుచుండిన నయ్యాంజనేయుని శరీరముయొక్కనీడయును, సముద్రమునవ్యాపించికూడబోవుచుండుటవలన "నాహనుమంతుడుగాలిచే సముద్రమునందు నడుపబడుయోడవలెనుండె,, అయ్యాంజనేయుడు సముద్రమునందు యేయేప్రదేశముల మీదుగబోయెనో ఆయాప్రదేశము లతనితొడలవేగముచే గలతనొందె ఇట్లుమహావేగవంతుడగు హనుమంతుం డెగిరిపోవుచు

"పర్వతములవలెనుండుగొప్పఅలలను, కొండవంటి తనరొ
మ్ముచే,, నెగరగొట్టుచుంబోయె. ఇటుబోవుచుండునయ్యాం
జనేయుని వేగముచేగలిగినగాలియు, మేఘములచేగలిగిన
గాలియును, యీరెండునుగూడి, మిగులభయంకరముగధ్వ
నిగలుగునట్లుసముద్రమునువిశేషముగ,గదిలించె. అంతవాన
రో త్తముఁడగు నయ్యాంజనేయుఁడు తనవేగమువలన గలి
గిన గాలిచే పైకెగిరినగొప్పయలల సమూహములను తనతో
గూడనీడ్చుకొనిపోవుచు భూమ్యాకాశములను వేరుపరచు
నట్లుగనుపట్టె. మఱియుమహావేగవంతుఁడగు నయ్యాంజనే
యుఁడు సముద్రముననుండి మీదికెగరగొట్టఁబడినవియును
మేరుమందర పర్వతములతో సమానములైనవియునునగు
గొప్పయలలను లెక్కబెట్టువానివలెబోవుచుండె. అప్పుడత
నివేగముచే నెగరగొట్టబడె యాకసంబుననుండు మేఘముల
తోడంగూడి యందంతటనుగ్రమ్ముకొని సముద్రజలము"శ
రదృతువునందలి మేఘములవలె,, యొప్పుచుండె. అట్టియెడ
సముద్రముననుండిన తిమితిమింగిలములు, మొసళ్లు, చేపలు,
తాబేళ్లు, మొదలగుజంతుజాలములు నీటిచేవిడుబడుటచే
"వస్త్రవిహీనులైన మనుష్యులయొక్కఅవయవములవలె,,న
గుపడుచుండె. అప్పుడుసముద్రమునందు నివసించుచున్న స
ర్పములు, ఆకాశముననెగిరిపోవుచున్న వానరోత్తముఁడైన
నయ్యాంజనేయునిఁజూచి" గరుత్మంతుండని,, భయంబు
నొందె. అట్లెగిరిపోవుచుండిన నవ్వానరోత్తముని నీడయైన
దిపదియోజనములు వెడల్పుగలదిగను ముప్పదియోజనములు
నిడివిగలదిగను సముద్రమందుమిగుల సుందరముగ, నగుప
డుచుండె. అప్పుడయ్యాంజనేయుని వెంబడించిపోవుచుసము
ద్రమందు వ్యాపించియుండిన యతనినీడ" నిర్మలమగుమేఘ
పఙ్క్తివలె,, ప్రకాశించుచుండె. అట్లునిరాధారంబగు
నాకాశమార్గంబునం బోవుచున్నవాడును, మిగులపరాక్ర
మశాలియును, గొప్పదేహముగలవాఁడుననగు నయ్యాంజ
నేయుఁడు ఱెక్కలుగలగొప్ప పర్వతమువలె"గనుపట్టుచుం
డె. మహాబలవంతుఁడగు వానరశ్రేష్ఠుండతివేగముతోసము
ద్రముమిదుగా, నేమార్గమునబోయెనో, నామార్గముపడ
వవలెనుండెను. అట్టియెడనయ్యాంజనేయుఁడు" వాయు
వువలె,, మేఘసమూహములను తనవెనువెంటనీడ్చుకొనిపో
వుచు, పక్షులుసంచరించెడు మార్గమగునాకాశమార్గము
న" గరుత్మంతునివలె,, బోవుచుండె. అట్లయ్యాంజనేయుఁ
డీడ్చుకొని పోవుచుండినమేఘసమూహములు తెలుపుయెఱు
పువన్నెగలవిగను, నలుపుపసుపురంగుగలవిగను ప్రకాశిం
చుచుండె. ఇట్లుగగనమార్గమునబోవుచుండిన నయ్యాంజనే
యుఁడప్పుడప్పుడు మేఘసమూహములచే గప్పంబడుచుమ
అలవెలికివచ్చుచుండుటవలన" మేఘములచేమరుగుపడి మఱ
లవెలివడు చంద్రబింబమువలె,,నుండె. అట్టియెడనతివేగము
గ సముద్రమును దాటుచున్ననయ్యాంజనేయుని దేవదాన
వగంధర్వులుజూచి యానందంబునపుష్పవృష్టిగురిసిరి అట్లు
సీతాదేవిని వెదకుటయను శ్రీరామునికార్యముకొఱకు స
ముద్రముదాటుచున్న నయ్యాంజనేయునిజూచి సూర్యుండ
మితతీక్ష్ణంబుగ ప్రకాశింపడయ్యె. అంతవాయుదేవుఁడును,
రామకార్యార్థముగ లంకకేగెడు తనకుమారుడైన ఆంజనే
యుని కిష్టానుసారముగ సేవించుచుండె. ఈప్రకారముగగ
గనమార్గమునబోవుచున్న నయ్యాంజనేయునిజూచి ఋషు
లుపొగడిరి. దేవతలును, గంధర్వులను నతనిపరాక్రమం
బునకుఁ బ్రశంసించిపాడిరి. మఱియుదేవతలు పన్నగులు
యక్షులుపక్షులు రాక్షసులుమొదలగు వారందరును కొం
చెమైనను యలసటనొందక యాకాశమార్గమునఁ బోవుచు
న్న నయ్యాంజనేయునిఁజూచి పరమసంతోషముతో బొగ
డిరి. సముద్రుండును వానరోత్తముఁడగు నయ్యాంజనేయుఁ
డు రామకార్యార్థముగ సముద్రముదాటుటనుజూచి, ఇ
క్ష్వాకువంశము సన్మానమునొందగోరి ఇటులియాలోచించె.
ఇప్పుడు నేనీవానరోత్తముఁడగు నాంజనేయునికిసహాయముఁ
జేయకుందు నేని నోరుగలవారందరునిందింతురు. ముందు నేని
యిక్ష్వాకువంశోద్భవుఁడైన సగరునిచేవృద్ధినొందింపబడితిని,
ఇప్పుడీయాంజనేయుఁడు అయిక్ష్వాకువంశమునందు జన్మిం
చినవానికే, సహాయముఁజేయుచున్నాడు. ఇతఁడుమిక్కిలి
యలసటనొందగలడు. కావుననియ్యాంజనేయుం డెవ్విధ
ముచేతనైనను యలసటదీర్చుకొని పోవునట్లుజేయవలయు
ను అట్లు నేనితనియూరడించితినేని తక్కినమార్గమును సు
నాయాసనుగదాటిపోవును. అనియిట్లుసముద్రుండుమిగుల
గొప్పయోచనజేసి, సాగరమునందు మునిగియున్నవాఁడు
ను, బగారుశిఖరములుగలవాఁడును, మైనాకుండను పేరుగ
లవాడుననగుపర్వతోత్తమునిజూచియిట్లనియె. ఓపర్వతశ్రే
ష్ఠమైన మైనాకుడా! పాతాళలోకమునందు నివసించుచుం
డెడు నసురసమూహములు పైకిరాకుండునట్లు దేవేంద్రుఁ
డునిన్నువానిద్వారమున *కడ్డముగనుంచె. మున్నొకప్పుడు
యీయసురులు మిగులపరాక్రమించి పైకివచ్చుటకుఎత్నింప
గా నీవుఅప్రమేయమైన పాతాళద్వారమును మూసివారిని
రాకుండజేసితివి. అదిమొదలుకొనివారుపైకి రాకుండనీవు
ఆద్వారమునకడ్డముగానున్నావు. ఓమైనాకుడా! నీకుదశది
శలయందును వ్యాపించెడిశక్తిగలదుకావున, నిన్నొకకా
ర్యార్థముప్రేరేపించుచున్నాను-లెమ్ము. పైకిరమ్ము. వానరో
త్తముఁడును, మిగులపరాక్రమవంతుఁడును, మహాభయంక

రమైనకార్యము జేయువాడునునగు నాంజనేయుడు, రామకార్యార్థముగ నాకాశమార్గంబున నీమీదుగ నెగిరిపోవుచున్నాడు. ఈతండిక్ష్వాకువంశమునకు సేవకుఁడుగనున్నాడు. ఆయిక్ష్వాకువంశమునందు జన్మించినవారిచే నేను వృద్ధి నొందింపబడితినిగాన వారునాకుపూజనీయులు. నీవునాయందుండుటచే నీకునుమిక్కిలిపూజ్యులుగావున సమయము గడవకమున్నె మాకొకసహాయంబు జేయవలయును నీవట్లుసహాయము జేయకుందువేని పెద్దలకుకోపముగలుగును. నిన్నునిందింతురు. ఓమైనాకుడా! నీవునీటినుండి పైకిలేచిరమ్ము. మనకతిథియును, పూజ్యుండును, మెగురువారిలోనుత్తముడునునగు నాంజనేయుడునీశిఖరములయందు నిలిచి యలసటదీర్చుకొనును. ఓపర్వతరాజమా! నీవు దేవతలచేతను గంధర్వులచేతను సేవింపబడినవాడవు. బంగారుమయమగు గొప్పశిఖరములుగలవాడవు. ఇప్పుడీయాంజనేయుడు నీయందు నిలిచియలసటదీర్చుకొనునేని తక్కినమార్గమును మిగులసుఖముగబోవును ఓమైనాకమా! కకుత్స్థవంశోద్భవుడగు శ్రీరాముడుసత్యసంధుడనియును, సీతాదేవితన భర్తను బంధువులనుమొదలగు వారినివిడిచి అన్యదేశమునందు దుఃఖించుచున్నదనియును, వానరోత్తముడగు నాంజనేయుడాసీతకొఱకయ్యెయిట్లుశ్రమపడుచున్నాడనియును తలతువేని, తత్క్షణమే లేచిపైకిరమ్ము అనియిట్లుసముద్రుడు జెప్పినతోడనే, గొప్పవృక్షములచేతను తీగెలచేతను నొప్పుచుబంగారు శిఖరములుగలిగియుండు నామైనాకుడుసముద్రజములనుండి యతిత్వరితముగ బైలువెడలివచ్చె. ఇట్లుబైలుదేరి, 'మేఘముచేగప్పబడిన సూర్యుఁడామేఘములను భేదించుకొని వెలికివచ్చి ప్రకాశించునట్లు'' ఆమైనాకుడునీటపైకివచ్చె. ఇట్లునీటిపైకివచ్చినవాడును, గొప్పయాకారముగలవాడును, బహుకాలముగ సముద్రోదకమునందు మునిగియున్నవాడును, ఇపుడుసముద్రుని యాజ్ఞచేమీదికి వచ్చినవాడును, బంగారువికారములగునవియును, కిన్నరోరగగరుడ గంధర్వులచే సేవింప బడుచున్నవియును, అనేకసూర్యులేక కాలంబున నుదయించినట్లగుపడుచున్నవియును, ఆకాశమునొరయుచున్నట్లున్నవియును నగుశిఖరములుగలవాడును, తేజోవంతుడును, నగువామైనాకుడు తనశిఖరములను ఆకాశమార్గంబున గాన్పించె. అట్లాకాశమార్గంబున నున్నవియును, అప్పుడేకరగింపబడిన బంగారముతో సమానములైనవియునునగు నాశిఖరములకాంతిచే" ఇసుమునకుబోలెనల్లనికాంతిగల యాకాశముస్వర్ణచ్ఛాయగలదిగనయ్యె. (అనగాఆకాశముబంగారు కాంతిగలదయ్యె) అట్టియెడబంగారు వికారములైనవియును, తమకాంతులచేనితరకాంతుల నన్నింటిని పరిహసించునట్లున్నవియును నగు నామైనాకునిశిఖరములు" అనేకసూర్యులేక కాలముననుదయించినట్లు'' ప్రకాశించుచుండె అట్టియెడమహోన్నతాకారంబున తనముందటనగుపడుచున్న నప్పర్వతోత్తమును జూచి యాంజనేయుఁడు తనలోతానిట్లని యాలోచించె. ఈమహాసముద్రమధ్యమున నిట్టిపర్వతముగాన్పించుట కెంతమాత్రముకారణముగానరాదు. ఇదినిశ్చయముగరాక్షసకల్పితమగు విఘ్నంబుగానివేరుగాదు. అనియిట్లునిశ్చయించి, మహావేగవంతుడగు నయ్యాంజనేయుడు మహోన్నతాకారముతో తనముందటనిలచియున్న నప్పర్వతోత్తమమును తనఱొమ్ముచే "వాయుదేవుడు మేఘముల నెగరగొట్టునట్లు,, పడద్రోసెను అట్లాపర్వతోత్తముఁడగు మైనాకుఁడు ఆంజనేయునిచే బడద్రోయబడుటవలన అతనివేగమును దెలిసికొని పులకాంకితదేహుడై మిగులసంతసించె. అంతమైనాకుడు మఱలలేచి మహాసంతోషముగలవాడయ్యె. అట్లుసంతసించిన మైనాకుడుమనుష్యరూపంబు దాల్చి తనశిఖరములమీదనిలుచుకొని గగనమార్గమునందు మహోన్నతాకారముధరించియుండెడు పరాక్రమవంతుడగు నాంజనేయునిదగ్గిరకువచ్చి, మనుష్యవాక్యములతోనిట్లనియె.

వానరోత్తముడవగునో యాంజనేయుడా! నీవెవ్వరికిని జేయనలవిగాని కార్యమును జేయనున్నావు. నాశిఖరములయందు కొంతసేపువిశ్రమించి యలసటదీర్చుకొనుము. ఓ కపికులసార్వభౌమా! ఆంజనేయా! నేనుసముద్రునిచే ప్రేరేపింపబడి నీకతిథిసత్కారము జేయవచ్చితిని సముద్రుడుపూర్వము రఘువంశోద్భవులగు సగరునిచేతనుసగరకుమారులచేతను వృద్ధినొందింపబడెను. కావుననేసాగరుడను పేరు వడసె నీవునుఆరఘువంశమునందు జన్మించినరామునియొక్క కార్యమును గుఱించిపోవుటవలన నీకుసత్కారముగావింపదలచె. అనిచెప్పిమఱియు నిట్లనియె

"శ్లో॥ కృతేచప్రతికర్తవ్య మేషధర్మస్సనాతనః। సోయంతత్ప్రతి కారార్థీత్వత్తస్సన్మానమర్హతి॥ ఓయాంజనేయుడా! ఒకడుఒకనికొక యుపకారమును జేసె నేని అయ్యుపకృతినిబొందినవాడు తనకుపకారము జేసినవానికిప్రత్యుపకారముచేయుట శాశ్వతమగుధర్మంబని పెద్దలు జెప్పుదురు. కావుననీసముద్రుడు సగరకులోద్భవుడగు శ్రీరామునికార్యార్థముగబోయెడు నీకుపకారమునుజేసె, యాసగరుడు మొదలగువారికి ప్రత్యుపకారముజేసినవాడు కాగోరుచున్నాడు. కావుననీవుదీనినంగీకరించి సముద్రునిసన్మానింపవలయు ఓవానరశ్రేష్ఠుడా! ఆంజనేయా! సముద్రుడునన్నిట్లనిప్రేరేపించె ఎట్లనిన. నన్నుసగరులు వృద్ధినొందించిరి.నే

నట్లువృద్ధినొందియుండుటచే నీవుబహుకాలముగ నాగర్భమున దాగియున్నావు ఇపుడునీవుమీదికివచ్చిసగర కులోద్భవుడగు రాముని కార్యమునకై బోయెడివానరోత్తముడగు నియ్యాంజనేయునకుడుపకారంబుజేయవలయు. ఇతడునూరామడమార్గమునుఒక్కపెట్టున దాటగోరి యెగిరిపోవుచున్నాడు నీశిఖరములయందు కొంతసేపుకూర్చుండి యలసటదీర్చుకొనునేని తక్కినమార్గమును సులభముగ దాటగలడని చెప్పె. వానరశ్రేష్ఠుడా! ఆంజనేయా! నీవునాయందువిశ్రమించి యలసటదీర్చుకొనుము. మంచివాసనగలమధురములైన ఫలములను భక్షించియూరటనొందుము పిమ్మటనీయిష్టప్రకారముసుఖముగబొమ్ము. మరియునీకాతిథ్య మియ్యవలయునను కోరికనాకునుగలదు. గొప్పగుణములుగల మీవంటిమహనీయులనుబూజించుట మూడులోకలంబుల యందును వినుతికెక్కినకార్యముగదా! వాయుపుత్రుడా! ఆంజనేయా! అతివేగమున నెగిరిపోవునట్టి వానరోత్తములలో నెల్లనీవుశ్రేష్ఠుడవనియెంచెదను. ఇదిగాకమఱియునొక్క విశేషముగలదు.

"శ్లో॥ అతిథిఃకిలపూజార్హః ప్రాకృతోఽపివిజానతా। ధర్మం జిజ్ఞాసమానేన కింపునస్త్వాదృశో మహాన్॥ గృహస్థుడుపండితుడుగానున్నను ధర్మమార్గప్రవర్తనను యిచ్ఛయించునేని యతిథి మూఢుడుగానున్నను అట్టిగృహస్థుడు ఆయతిథిని పూజింపవలయు. కావుననీవంటిమహాను భావులుమాకుపూజనీయులని చెప్పనేల? నీవుఅవశ్యముగ పూజింపదగినవాడవు. ఓవానరోత్తముడా! నీవు దేవతలలోశ్రేష్ఠుడును, మహాత్ముడునునగు వాయుదేవునికుమారుడవు. వేగమునతనికిసమానుడవు. సకలధర్మములనెఱిగిన ఓయాంజనేయుడా! నిన్ను నేనుపూజింతునేని మీతండ్రియగువాయు దేవుడు పూజింపబడినవాడగును. కావుననిన్నవశ్యముగ పూజింపవలయును. నేనుమీతండ్రినిపూజింపవలయుననుట కొకపూర్వకథగలదు. దానిం జెప్పెదవినుము. నాయనా! ఆంజనేయుడా! పూర్వముకృతయుగమునందు పర్వతములన్నియు ఱెక్కలుగలవిగానుండె అప్పుడప్పర్వతములు, గరుత్మంతుని వేగమువంటివేగముతోను, వాయువేగమనోవేగములతోను సమస్తదిక్కులయందును సంచరించుచుండె. అంతనప్పర్వతములట్లు సంచరించుటనుజూచి "ఇదిఏస్థలములకైనను బోయిపడునేమోయను సంశయముచే" సమస్తభూతములును, దేవతాసమూహములును ఋషులునుభయమునుబొందిరి. అట్లు దేవతలుమొదలగువారు భయభ్రాంతులైయుండుటను, నూరుయజ్ఞములు జేసినవాడును, సహస్రాక్షుడునునగు దేవేంద్రుండు తెలిసికొనిమిగులకోపోద్దీపితుడయ్యె. అట్లుమహాకోపముగలవాడైవజ్రాయుధముచే ననేకపర్వతములయొక్క ఱెక్కలను తెగనఱికె అట్టియెడ దేవేంద్రుడు నాయందును కోపమునొందివజ్రాయుధమునుదీసికొని యతివేగమునవాయొద్దకువచ్చె ఓవానరోత్తమా! ఇంద్రుడట్లువేగమునవాపద్దికివచ్చుటనుజూచిమహాత్ముడగువాయుదేవుడు నాయందలిప్రేమతో నన్నతి వేగముగలప్రచండగాలిచే దూరముగ నెట్టికొనిపోయె. అట్లుమీతండ్రియగు వాయుదేవుడునన్నతి వేగముగనెగురగొట్టుకొనిపోయి యీయుప్పునీటిసముద్రమున బడవైచినన్నురక్షించె. అందుచేనాఱెక్కలు ఖండింపబడకుండగ పాడుకొంటిని. నాటనుండియునిచ్చట సుఖముగనున్నాను. ఓవానరోత్తమా! యీకారణముచే మీతండ్రియగువాయుదేవుడు నాకుపూజనీయుడు. నిన్నుపూజించిన మీతండ్రినిపూజించినవాడనగుదును. ఇదియేనీకు నాకుంగలగొప్ప సంబంధము. కావుననిన్నుపూజించెదను. ఓకపికులసార్వభౌమా! ఆంజనేయా! నీవిప్పుడుసముద్రుని వృత్తాంతమును సవిస్తరముగనెఱిగితివి కావునసముద్రుడును నేనును జేయనెంచిన సత్కారమును నీవుఅంగీకరింపవలయు. వానరోత్తముడవగునాంజనేయా! నాయందువిశ్రమించియలసటదీర్చుకొనుము. మేనుజేయుపూజకొంచెమైనదైనను అధికముగనెంచి మమ్మనుగ్రహింపుము. నిన్నుజూచుటచే నాకమిగులసంతోషముగలిగినది. అనియిట్లుమైనాకుండు జెప్పినవిని యాంజనేయుడిట్లనియె.

ఓపర్వతోత్తమా! నేనుమిగులసంతసించితిని నీమాటలచేతనే నాకుయాతిథ్యంబిచ్చినంతతృప్తియైనది. నేనమిగులతృప్తినిబొందితిని. నేనుమీరుజేయుపూజలు పరిగ్రహింపలేదనికోపముజేయవలదు. నాకిదిమిగులపనివేళగనున్నది. సూర్యుడుఅస్తమానపర్వతముజేరబోవుచున్నాడు. నేనవసరపడి సూర్యుడస్తమింపకముందె లంకానగరమునకు బోయిజేరవలయును. ఓమైనాకమా! నేనుమహావేగముతో నెచ్చటనునిలువక "రామబాణమువలె" నతివేగముగబోయి లంకజేరెద, ననిఅంగదుడుమొదలగువారితో ప్రతిజ్ఞజేసివచ్చితిని. కావున నీసముద్రమధ్యముననే నెచ్చటనునిలువగూడదు. పరాక్రమవంతుడును, వానరోత్తముడునునగు నాంజనేయుడిట్లుమైనాకునితో జెప్పి స్నేహసూచకముగ నప్పర్వతమును తనచేతిచేదాకి, యంతనతివేగమున ఆకాశమార్గమునకెగిరెను. అట్లాకాశమున కెగిరితనప్రతిజ్ఞచొప్పునకార్యమునెరవేరుచున్నదిగదాయనిప్రసన్నవదనుడగుచు లంకాపట్టణమార్గమునబోవమెత్తించె. అప్పుడుమైనాక సముద్రులువాయుపుత్రుడగునాంజనేయునిమిగులగౌరవముగాపూజించియిట్లనిరి.

ఓవానరోత్తమా! నీకుగార్యసిద్ధియగుగాక. సుఖముగ

బోయిరమ్ము. అనియిట్లుసముద్రమైనాకులు జెప్పుచుండగవాయుదేవుని కుమారుడగు నాయాంజనేయుడు వాయుమార్గమునుజేరి గగనమార్గమునబోవుచుండె. అట్లాకాశమార్గమునబోవుచు నంతకంతకుమీదికెగిరి యాసముద్రమైనాకులఁజూచుచు స్వచ్ఛమైనదియును, నిరాధారమయినదియునగు నాకాశమునబోవుచుండె. ఇట్లాకాశమార్గమున బోవుచున్న యాంజనేయుడు మైనాకసముద్రులుజేయ నెత్నించిన సహాయమునుసత్కారమును గైకొనకపోవుటయనుమిగుల నసాధ్యమగు రెండవ కార్యమునుజూచి, దేవతులుసిద్ధులు, పరమర్షులునుపొగడిరి. మఱియునచ్చటనున్న దేవతలు, కనకమయమగువాడును, శ్రేష్ఠములయిన శిఖరములుగలవాడునునగు నమ్మైనాకుండుజేసినకార్యమునకు మిగులసంతసించిరి. సహస్రాక్షుడగు దేవేంద్రుడును మిక్కిలిసంతసించె. మహాధీమంతుడును, శచీదేవిపెనిమిటియునునగు దేవేంద్రుడు, పర్వతోత్తముడును, శ్రేష్ఠములగు శిఖరములుగలవాడునునగు నమ్మైనాకునిజూచి యధికసంతోషమువలనడగ్గుత్తికతోనిట్లనియె.

ఓపర్వతోత్తముడా! సువర్ణశిఖరములుగల మైనాకుడా! నీవుజేసిన కార్యమునకుమిగుల సంతసించితిని. నీకభయమిచ్చెదను సౌమ్యుండవగునో మైనాకమా! నీవుయథాసుఖముగనుండుము. మఱియునునీకునావలని భయమున్నను, నిర్భయుండవై పరాక్రమించినూరామడలవెడల్పుగలసముద్రమునొక్కపెట్టున దాటిపోవుచున్న యాంజనేయునకుమిగులగొప్ప సహాయముసేసితివి. ఇదిగాకదశరథునికొడుకగు శ్రీరామునకు గూతైపోవుచున్న యాంజనేయునికి సత్కారముజేయుటచేత నేనుమిగులసంతసించితిని. అనిచెప్పియధికసంతోషముతో తనముందటనున్న యింద్రునిజూచి మైనాకుండును నత్యంతానందభరితుడయ్యె. అట్లమ్మైనాకుడింద్రునిచే వరముగొనిస్వస్థుండైయుండె. ఆంజనేయుడును నొకముహూర్తకాలములోన సముద్రమైనాకులున్న స్థలమునునతిక్రమించిపోయె. ఆసమయమున దేవతలునుగంధర్వులును, సిద్ధులును, పరమఋషులును, సూర్యునివంటికాంతిగల నాగమాతయైన సురసనుజూచి యిట్లనిరి.

ఓసురసా! శ్రీమంతుడును, హనుమంతుడను పేరుచేప్రసిద్ధినొందిన వాడునునగు వాయుపుత్రుడు సముద్రముమీదుగా నెగిరి పోవుచున్నాడు. నీవుమిగులభయంకర మగునదియును, పర్వతముతోసమాన మైనదియునునగు రాక్షసరూపమును దాల్పుము. మఱియుమిగుల భయంకరమైనకోరలుగలదియును, పింగళవర్ణమైన నేత్రములుగలదియును,గగనమునకు సరిపోలునదియునునగు ముఖముగలదానవగుచు నయ్యాంజనేయునికి ముహూర్తకాలము విఘ్నమునుజేయుము. ఓసురసా! ఈయాంజనేయుని బలపరాక్రమంబులింకను దెలిసికొనవలయునని కోరుచున్నాము. నిన్నేయుపాయముచేతనైన జయించునో; జయింపలేక వ్యసనమునొందునో, కనుగొనవలయునని కోరుచున్నామనిరి. ఇట్లాసురస, దేవతలుమొదలగువారిచే ప్రేరేపింపబడి సత్కరింపబడినదయ్యె. అట్లువారిచే సత్కరింపబడినదై, వికృతంబునువికారంబును నందఱకునుభయముగలుగజేయునదియునునగు రాక్షసరూపమునుదాల్చి సముద్రమధ్యమునసనిలిచి వెగిరిపోవుచున్న యాంజనేయుని యడ్డగించి యిట్లనియె.

వానరోత్తముడవగునో యాంజనేయుడా! నీవునాకాహారంబుగ దేవతలచేనిర్దేశింపబడితివి. నేనునిన్నుభక్షించెదను. ఇదిగో, యీనానోటియందు బ్రవేశింపుమనివికారంబుగ నోరుదెరచియాంజనేయునియెదుటనిలిచె. అంతసురసయిట్లుజెప్పినిలువగానే, శ్రీమంతుడును వానరోత్తముడునునగు నయ్యాంజనేయుడు కృతాంజలియైమిగుల సంతసించిన మోముగలవాడగుచు నాసురసతో నిట్లనిచెప్పె.

ఓసురసా! రాముడను పేరుచేప్రసిద్ధినొందినవాడగు దశరథమహారాజపుత్రుడు, తనసోదరుడగు లక్ష్మణునితోడను,తనభార్యయగు సీతతోడనుదండకారణ్యమున బ్రవేశించె. అచ్చటరాక్షసులతో బద్ధవైరముగలవాడైయుండె. ఇట్లుండియొకనాడా రాముడు వేఱుకార్యమునం దాసక్తుడై యుండగ, మిగులపతివ్రతయును, భార్యయునునగు సీతాదేవినిరావణుడు గపటవేషంబునగొనిపోయె. నేనా రాముని యాజ్ఞచే సీతాదేవియుండు స్థలమునకుబోవుచున్నాను. నీవు రాముని రాజ్యమునందుండు దానవు. కావుననీవా రామునకు సహాయముజేయవలయును అట్లుగాదేని, నేనుబోయి సీతనుజూచి, శ్రమలేకనెంతటికార్యమునైన జేయునట్టిరామునకావృత్తాంతమును నెఱిగించిమఱలివచ్చి నీనోటంజొచ్చెదను. ఓసురసా! నావాక్యమంగీకరింపుము. ఇదినిశ్చయము నేనయథార్థముగజెప్పుచున్నాను. అనియిట్లాంజనేయుడు జెప్పగవిని, కామరూపిణియగు నాసురసాదేవి మఱలనతనికిట్లనియె.

ఓయాంజనేయుడా! ఎవడుగాని నన్నతిక్రమించిపోజాలడు. ఇట్లునాకు వరముగలదనిచెప్పి ఆయ్యాంజనేయునిబలమునుగొనవలయుననితలచి, గగనమార్గమునబోవుచున్న యాంజనేయునితో మఱలసురసయిట్లనియె.

వానరోత్తముడవగునో యాంజనేయుడా! నీవిప్పుడు నానోటియందు ప్రవేశించిపోవలయును. నాయెదుటబడినవాడెవ్వడుగాని నానోటియందుబ్రవేశించి వెలువెడలిపోవలయును. ఈవరమునాకుపూర్వము బ్రహ్మదేవునిచే నివ్వబడె

నని చెప్పి యతివేగముగ దననోరును విశాలముగ దెరిచి యాంజనేయుని యెదుట నిలిచె. అంత వానరోత్తముడగు నాంజనేయుడు సురస, చెప్పిన మాటలు విని మిగుల గోపోద్దీపితుడై యా సురసతో నిట్లనియె.

ఓసురసా! నీవు నన్ను మ్రింగుటకు దగిన నోరు దెరువుము. అని యిట్లాంజనేయుడు సురసతో జెప్పి పదియామడల నిడుపు గల దేహమును ధరించె. అట్లు పదియామడల నిడుపైన దేహమును ధరించి. మేఘముతో సమానుడైయున్న యాంజనేయుని జూచి యా సురస యిరువదియామడల విశాలమైన నోటిని దాల్చె. అది జూచి యాంజనేయుడు మిగుల క్రుద్ధుడై, ముప్పది యోజనముల నిడుపుగల దేహమును ధరించె. అంత సురసాదేవి నలుబది యోజనముల వెడల్పుగల నోటిని ధరించె. హనుమంతుడంత యేబది యోజనముల నిడివిగల దేహమును ధరించె. అది జూచి సురస యరువది యామడల విరివిగల నోటిని దాల్చె. అంత పరాక్రమశాలియగు నయ్యాంజనేయుడు డెబ్బది యామడల దేహము గలవాడయ్యె. ఆ సమయమున సురసయును నెనుబది యామడల విరివిగల నోటిని ధరించె. అట్టియెడ వానరోత్తముడగు నయ్యాంజనేయుడు తొంబది యోజనముల నిడివిగల దేహమును ధరించె. అంత నాగమాతయగు సురస నూరామడల విస్తీర్ణము గల నోటిని దాల్చె. అయ్యవసరమున, మిగుల బుద్ధిమంతుడును, వాయుపుత్రుడును నగు నయ్యాంజనేయుడు ఆ సురస, మిగుల భయంకరమైనదియును, నరకముతో సరిపోలియున్నదియును మిగుల పొడవగు నాలుక గలదియును నగు నోరును దెరుచుకొని యుండుటను జూచి తన దేహమును మిక్కిలి చిన్నదిగ జేసికొని యంగుష్ఠప్రమాణము గలవాడయ్యె. అట్లు మిగుల సూక్ష్మదేహమును దాల్చినవాడును, మహావేగము గలవాడును, శ్రీమంతుడును నగు నయ్యాంజనేయుడతి వేగముగ నా సురస నోటియందు బ్రవేశించి, తత్క్షణము బైలువెడలి యాకాశమున కెగసి, యా సురసను జూచి యిట్లనియె

ఓసురసా! నీనోట బ్రవేశించితిని గదా! దక్షప్రజాపతి కూతురవగు నోసురసా! నీకు నమస్కరించెద. నీవరము సఫలం బయ్యె. నేను సీతాదేవియున్నచోటికి వెళ్లెదనని చెప్పెను. అంత తన నోటియందుండి వెలువడి "రాహువుయొక్క నోటినుండి వెలువడిన చంద్రునివలె" నున్న నయ్యాంజనేయుని జూచి, సురసాదేవి తన నిజరూపమును దాల్చి యిట్లనియె.

సౌమ్యుడవగు నో యాంజనేయా! యథాసుఖముగ బోయిరమ్ము నీకు కార్యసిద్ధియగుగాక. మహాత్ముడగు శ్రీరాముని తోనతని భార్యయగు సీతాదేవిని జేర్చుమని చెప్పె. ఇట్లు హనుమంతుడు సురసనోటినుండి వెలువడుటయును నీదుష్కరమగు కార్యమును జేయుటను జూచి, సమస్తభూతములును ఆంజనేయుని సాధు సాధని పొగడిరి. అప్పుడు గరుత్మంతునితో సమానుడగు హనుమంతుడు, ఎదిరింపగూడనదియును, వరుణదేవునకు నికిపట్టైనదియునునగు సముద్రమునకు మీదుగ నాకాశమార్గమున బోవుచుండె. అట్లాంజనేయుడు పోవుచున్న యాకాశమార్గము మేఘములవలన నిండబడు వారిధారలచే నొప్పుచున్నదియును, నిరంతరము పక్షులు సంచరించెడు మార్గమైయున్నదియును, నృత్యము మొదలగు గాన విద్యావిశారదులు సంచరించెడు స్థానముగనున్నదియును దీర్ఘమైయనేకరంగులుగల యింద్రధనస్సునకు నికిపట్టైనదియును, సింహము, యేనుగులు, పెద్దపులులు, పక్షులు, సర్పంబులు మొదలగువానిచే మోయంబడి, నిరంతరము తిరుగుచుండెడు స్వచ్ఛములగు విమానములచే నలంకరింపబడినదియును, వజ్రము పిడుగు మొదలగువాటియొక్క వ్రేల్లవలన గలిగెడు యగ్నులచే బ్రకాశమానంబైనదియును, మిగుల పుణ్యకార్యములను జేసినవారును, పూజ్యమైన స్వభావము గలవారును స్వర్గసుఖములను అనుభవించుచున్నవారును నగు పుణ్యపురుషులచే శోభిల్లుచున్నదియును, భూలోకమున జేయబడు యజ్ఞము మొదలగు క్రతువులయందు హవిర్భాగములు గొనిపోయి దేవతలకిచ్చెడు యగ్నిహోత్రునకు మార్గమైనదియును, అంగారకుడు మొదలగు గ్రహముల చేతను, అశ్విని మొదలగు నక్షత్రముల చేతను చంద్రసూర్యుల చేతను మఱియు నితర నక్షత్రములయొక్క సమూహముల చేతను, యలంకరింపబడినదియును, పూజ్యులగు మహర్షుల సమూహముల చేతను గంధర్వుల చేతను యక్షరక్షోగణముల చేతను ప్రకాశించుచున్నదియును, పరిశుద్ధమై నిర్మలమై యన్నిటిచే వ్యాపింపబడినదియును, విశ్వావసువను గంధర్వరాజుచే సేవింపబడినదియును, దేవేంద్రుని వాహనమగు నైరావతము సంచరించెడు మార్గమైనదియును, చంద్రసూర్యులు సంచరించెడు మార్గమైనదియును, మిగుల మంగళకరమైనదియును, సమస్తజీవరాసులకొఱకు బ్రహ్మదేవునిచే నిర్మింపబడిన, విస్తీర్ణమగు మేలుబంతియనదగినదియును, మిగుల పరాక్రమవంతులును, శ్రేష్ఠులును, నగు విద్యాధరులయొక్క సమూహములచే నెల్లప్పుడు సేవింప బడినదియును, వాయువు సంచరించెడు మార్గంబైనదియును నై వెలుగుచుండె. అప్పుడయ్యాంజనేయుడు కాళ్లుం జేతులును ముడుచకొని 'నయ్యాకాశ మార్గంబున బోవుచు వ్రేలాడుచుండు ఱెక్కలు గల పర్వతశ్రేష్ఠమువలె" యెచ్చటను గాన్పించె. అట్లుపోవుచున్న యాంజనేయుని, కామరూపిణియగు సింహికయను రాక్షసి చూచి, దేహమును మిగుల గొప్పదిగ బెంచుకొని

తినలో తానిట్లని యాలోచించె. నేనుబహుకాలముగ నాహారములేకయున్నదానను. ఇంతకాలమున కీగొప్పజంతువు నాపాలంబడినది. నేనిప్పుడీజంతువును భక్షించితృప్తినొందెదనని మనస్సునందాలోచించి యయ్యాంజనేయునియొక్క నీడ చేపట్టి నీడ్చుకొనెను. అట్లు మైనీడ చేపట్టబడినవాడగుచు, నాంజనేయుడిట్లు యోచించె. నేను "సముద్రమునందు బోవుచున్నయెడ యెదురుగాలిచే వెనుకకు నీడ్వంబడినట్లు" నే నిప్పుడు విగతపరాక్రముడనగుచు నతివేగముగ క్రిందికిలాగబడుచున్నాను ఇదియేమియాశ్చర్యము. అని యెంచి దశదిశలనుజూచె. అట్లుజూచి సముద్రమధ్యంబున మహోన్నతాకారముతోనున్న యొకగొప్పజంతువునుజూచి వాయుపుత్రుడగు నాంజనేయుడిట్లని చింతించెను.

"దక్షిణసముద్రమధ్యమున వికృతాకారముతోనుండెడు యొక గొప్పజంతువుగలదు. అదిమిగుల పరాక్రమముగలది. చూచువారలకుమిగుల నాశ్చర్యమునుబుట్టించునట్టి వికారమైన యాకారముగలది. మీదుగాబోవునట్టి యేజంతువునైననునీడనుబట్టుకొని యీడ్చుకొనును" అనియిట్లుమున్ను సుగ్రీవుడుచెప్పగా వినియున్నాను. కావుననదియే యీజంతువు. అందుకెంతమాత్రము సంశయములేదు. అనియిట్లాంజనేయు డాజంతువును సింహికయని దానికార్యములవలన దెలిసికొని "వర్షాకాలమునందు మేఘమువృద్ధినొందునట్లు" తనదేహమును బెంచె. అట్లాంజనేయుడు దేహమును బెంచుటనుజూచి, సింహిక తననోటిని పాతాళద్వారముతో సమానముగ దెఱచి మేఘమువలెగర్జించుచు హనుమంతునిదఱిసె. అంతబుద్ధిమంతుడును, వానరోత్తముడునునగు నయ్యాంజనేయుడు ఆసింహిక తననోటిని తనశరీరముపట్టునంతటిబిలముగలదిగా దెఱచికొనియుండుటనుజూచె. అట్లుజూచి తనమనస్సులోయోచించి యాసింహికయొక్క జీవస్థానములను గనుగొనె. మిగుల బలపరాక్రమశాలియును, వజ్రమువంటి దేహముగలవాడునునగు నయ్యాంజనేయుడు ఆసింహికయొక్క జీవస్థానములను దెలిసికొని, తన దేహమును మిగులచిన్నదిగజేసికొని తటాలునదానినోటం జొచ్చె. అట్లాసింహికనోటియందు బ్రవేశించిలోపలికిబోవుచు "రాహుగ్రహముచే మ్రింగబడుపూర్ణచంద్రునివలె"నున్నయాంజనేయుని సిద్ధచారణులుజూచుచుండిరి. అట్టియెడ నయ్యాంజనేయుడు, మనోవేగముగలవాడగుచు, తనకఱకుగోళ్లచేయాసింహిక మర్మస్థానములను జీల్చియతివేగమున బైలువెడలిమీదికెగిరె. అట్టియెడనాసింహికయు హనుమంతునిచే నపహరింపబడిన హృదయముగలదియై స్మృతిదప్పి నీటియందుబడియె. అట్లాంజనేయుచే నిమిషమాత్రములోనం హరింపబడి నీటియందుబడియున్న యాసింహికనుజూచి, యాకాశమునందు దిరుగుచున్నసమస్తభూతములును ఆంజనేయునితో నిట్లనియె.

వానరశ్రేష్ఠుడవగునో యాంజనేయుడా! నీకుబోలెమొక్క పోవనిధైర్యము, సూక్ష్మదృష్టియు, తత్వనిశ్చయశక్తియు, సామర్థ్యమును నీనాలుగుశక్తులుగల యీ జంతువును నిమిషమాత్రములోన జంపితివి. వినువారికిగూడ మహాభయంకరమైన కార్యమును జేసితివి. వానరోత్తముడవగునో యాంజనేయా! ఇంకనీవుగోరినకార్యమును సుఖముగా సాధించుకొనవచ్చును. నీకుశుభమగుగాక; అనియిట్లు సమస్తభూతంబులచే గౌరవింపబడి, "గరుత్మంతుడుంబోలె" నాకాశమార్గమునబోయె. ఇట్లుబోవుచు నయ్యాంజనేయుడు సముద్రముయొక్కఅవ్వలిదరిసమీపించి, నలుదిక్కులనుగలయజూచి నూరామడలకుఆవలయొక గొప్పవనసమూహమునుజూచె. మఱియునట్లుపోవపోవ యనేక విధములగువృక్షములచేత నలంకృతమైయుండెడు లంకాద్వీపమును, మలయపర్వతమునందుండెడు సమస్తములైన యుపవనములనుజూచె. అంత, ధైర్యవంతుడును, బుద్ధిమంతుడునునగు నాహనుమంతుడవ్వలిదరి, జేరబోయి యాతీరమునబుట్టిన సమస్తవృక్షములను, సముద్రునిభార్యలనదగి యొప్పుచుండెడుయేళ్లయొక్క ముఖద్వారములనుజూచె, ఇట్లవ్వలిదరిజేరి సమస్తమునుజూచినపిమ్మట, మహామేఘమువలె నున్నదియును, యాకాశమునడ్డగించు చున్నట్లున్నదియునునగు తనదేహమునుజూచుకొని యిట్లనియాలోచించె.

మహోన్నతాకారముతోనుండెడు నాదేహమును, నావేగమును, రాక్షసులుచూచినంతనే మిగుల నుత్సాహముగలవారగుచు ఆహాకారములుసేయుదురు. అంతటకార్యముచెడును. అనియిట్లాలోచించి తనశరీరమును మిగులచిన్నదిగాజేసికొని "శరీరియగుజీవుడు అజ్ఞానమునువిడిచి పరబ్రహ్మస్వరూపమును బొందునట్లువలె" తనయొక్క పూర్వస్వరూపమునుదాల్చె. మఱియునాంజనేయుడు పర్వతమువలెనున్న తనయాకారమును మిగులచిన్నదిగజేసికొని "మూడడుగులభూమిని దానమడిగిత్రివిక్రమావతారమున బలిచక్రవర్తియొక్క పరాక్రమమునుహరించిన వామనావతారుడగు విష్ణుదేవునివలె" తనయొక్కస్వభావమైన రూపమునుదాల్చె. అట్లు, అన్నికాలములకుదగినట్లుగ మనోహరములగు నానావిధములైన రూపములనుధరించువాడును, శత్రువులకు జయించుటకసాధ్యమైనవాడునునగు నయ్యాంజనేయుడవ్వలి సముద్రతీరమునుజేరి కార్యభాగంబునుఁ జక్కగనాలోచించి తన యెప్పటి యాకారమునుదాల్చి యనంత

రము మహాధీరుడగు నయ్యాంజనేయుడు, సకలసంపదలచే సమృద్ధినొందినదియును, విచిత్రములైనశిఖరములు గలదియును, మొగలిపొదలతోను విరుగుడుచెట్లతోను ఓంకాయచెట్లతోను గూడినదియునునగు లంబపర్వతశిఖరమునందువ్రాలె అట్లువ్రాలబోవునపు డాయాంజనేయుడవ్వలి సముద్రతీరమునందలి యాకాశమార్గమున నున్నవాడగుచు, త్రికూటపర్వత శిఖరమునందున్న లంకానగరమునుజూచి తనదేహమును విదిల్చుకొని, యాలంబపర్వతమునందున్నసమస్తమృగములను, పక్షులను, భయపఱచుచునాపర్వతముపైవ్రాలె. మఱియుదానవులతోను సర్పములతోనుగూడినదియును, గొప్పయలల సమూహములుగలదియునునగుసముద్రమును మహాపరాక్రమముచేదాటి, యవ్వలిగట్టునవ్రాలి, దేవేంద్రునిరాజధానియగునమరావతిపురంబుతో సరిబోలియున్న యాలంకానగరమును ఆంజనేయుడుజూచె

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలిఒకటవసర్గముగిసెను

ఆంజనేయుడు లంకానగరములో ప్రవేశించుట.

అట్లు మహాబలపరాక్రమశాలియగు నయ్యాంజనేయుడు ఎదిరింపగూడని సముద్రమునుదాటి యవ్వలిదరినిజేరి స్వస్థముగగూర్చున్నవాడగుచు త్రికూటపర్వత శిఖరమునందుండెడు లంకానగరమునుజూచె. అట్టియెడఅయ్యాంజనేయుడు లంబపర్వతమునందుండి, యందలివృక్షములనుండి రాలినపువ్వులచే గప్పబడినవాడగుచు "పుష్పమయుండగు వానరునివలె" ప్రకాశించుచుండె. శ్రేష్ఠమైనపరాక్రమము గలవాడును, శ్రీమంతుడునునగు హనుమంతుడు నూఱామడలవిస్తీర్ణముగల సముద్రమునుదాటియు గొంచమైనను యలసటనొంది నిట్టూర్పువిడువడయ్యె. అయ్యవసరమున నాంజనేయుడు తనలోతానిట్లనియోచించె.

నేను, లెక్కపెట్టుటకు శక్యముగాని యనేకనూఱామడలను గూడదాటగలను. కావుననూఱామడల గుఱంచునిలెక్కపెట్టదగిన యీసముద్రమునుదాటితినని యేలతలంపవలయును. ఇదియొకయాశ్చర్యముగాదని తలంచుచుండె. అనేకమంది వానరవీరులున్నను, మహావీర్యవంతుడును. శ్రేష్ఠుడును, యెగిరిపోవువారిలోనుత్తముడును, మహావేగవంతుడునునగు నాంజనేయుడుమాత్రమేగొప్పసముద్రమునుదాటిలంకాద్వీపమునుజేరె. మఱియునాంజనేయుడవ్వలి దరినుండి లంబపర్వతమునకు బోవుమార్గమునందు, నల్లనిలేతపచ్చికభూములను, గొప్పగొప్పఱాళ్లను, చినచిన్నతిప్పలునుంగలిగిమంచిసువాసనతోగూడుకొనియున్న యరణ్యములనుజూచె. అదియునుగాక, మిగులపరాక్రమవంతుడును వానరోత్తముడునునగు నయ్యాంజనేయుడట్లుబోవుచు, వృక్షములచేమిగుల దట్టముగగప్పబడియుండు పర్వతశిఖరములను, లెస్సగాబూచియుండు యరణ్యములనుగడచిపోయె. మఱియులంబపర్వతము నందలియడవులను ఉపవనములనుజూచి, త్రికూటపర్వతశిఖరమునందున్న లంకానగరమునుజూచి యాపట్టణమునకు నలుదిక్కులయందును, సరళవృక్షములను, కొండగోగులను, చక్కగాబూచియుండు ఖర్జూరపువృక్షములను, మొరటచెట్లను, నిమ్మచెట్లను, కొండమల్లెలను, మొగలిచెట్లను, సువాసనతోగూడకొనియుండెడు పిప్పలిచెట్లను, మంకెనలను, ఏడాకులయరటులను, వేగిసవృక్షములను, కాంచనచెట్లను, చక్కగాబూచినగన్నేరుచెట్లను లెస్సగాబూచియున్నవియును, పూలుమొగ్గలుమొదలగు వానిభారముచేవంగిన కొమ్మలుగలవియును నానావిధములైన పక్షులచేవ్యాపింపబడినవియును, గాలిచేగదలింపబడినకొనలు గలవియునునగు ననేకవృక్షములను, హంసలచేతను కన్నెలేడిపిట్టలచేతను వ్యాపింపబడినతామరపూలతోను నల్లగలువలతోను నిండియుండెడు నడబావులను, నానావిధములై మనోహరములైన ఉద్యానవనములను, సమస్తఋతువులయందును కాచెడుపూచెడు నానావిధములగు వృక్షములచేనావరింపబడిన పలువిధములగు కోనేళ్ళను, మిగులరమణీయములగు రాజోద్యానములనుజూచె. మఱియునాంజనేయుడు రావణాసురునిచే పాలింపబడుఆలంకానగరమునజూచి యాపట్టణముచుట్టును తామరపూలతోను నల్లగలువలతోనునిండి యుండెడునగడ్తలను, సీతాదేవినపహరించియుండుటచే యుద్ధభయంబునంజేసి రావణాసురునిచే నియమింపబడినవారును, భయంకరమగువిల్లులనుధరించి పట్టణమునందంతటను దిరుగుచున్నవారును, పట్టణమునులెస్సగా గాపాడుచున్నవారును, మిగులభయంకరులునగు రాక్షసులను, బంగారుమయములగు ప్రాకారమును, శరద్రుతువునందలి మేఘములతోసమానములై తెల్లగనున్నవియును, చంద్రుడుమొదలగు గ్రహములతోసమానములై యత్యున్నతములైన మిద్దెలచేనలంకృతంబైయున్నవీధులను, యెచ్చటనువ్యాపించియుండెడుఅనేకములగుకోటబురుజులను, చిత్తరువులువ్రాయబడియుండు టెక్కెములయొక్కయు, సాధారణములైన టెక్కెములయొక్కయు, వరుసలను, బంగారుమయములై తీగెలవంటిరేఖలచే చిత్రింపబడిన బహిర్ద్వారములనుజూచి యిదిస్వర్గలోక దేవతలకునివాసస్థానమైన అమరావతీపురంబో, లేకున్నట్టిసౌందర్యముగలదా, యనితలంచె అదియునుగాకయీలంకానగరము

మిగుల తెల్లనివై శుభకరంబులగు గృహములుగలిగి త్రికూట పర్వతశిఖరమునందుండుటచే నాకాశమార్గమున బోవుచున్నదానివలె నున్నదనితలంచె. రాక్షసరాజైనరావణాసురునిచే బాలింపబడినదియును, విశ్వకర్మచేనిర్మింప బడినదియునై యాకాశమార్గమున బోవుచున్నదానివలెనున్న యాలంకానగరమును వానరోత్తముడగునాంజనేయుడుచూచె. అట్లుచూచి యీలంకానగరముయొక్క కోటకొఅడులును ప్రాకారములును జఘనములుగాను, విశాలమై చుట్టునువ్యాపించియుండెడుసముద్రజలంబే నూతనవస్త్రముగాను, ప్రాకారములమీదనుండెడు నాలుగుమూరల యినుపముండ్ల కఱ్ఱలు శూలాయుధములు తలవెండ్రుకలుగాను, కోటబురుజులేచెవిమీది యలంకార పుష్పములనుగాను, గలదియైవిశ్వకర్మచే నిర్మితమైనదియగుచు, ఏమహాత్ముడో మనస్సుచేనిర్మించిన స్త్రీవలెనున్నదాని నాంజనేయుడుచూచె అంతనయ్యాంజనేయుడా లంబపర్వతశిఖరమునందుండియే, లంకానగరముయొక్క యుత్తరద్వారమునుబొంది (అనగామనస్సుచేబొంది) యిట్లనియాలోచించె. కైలాసపర్వతముయొక్క శిఖరముతో సమానమైనదియును, మిగులనున్నతములగు ఉత్తమగృహములచే నాకాశము నొరయుచున్నట్లున్నదియును, ఆకాశమున కెగురుచున్నదానివలె నున్నదియును, మిగులభయంకరులగు రాక్షసులచేనిండినదై సర్పములచేనిండిన భోగవతీపురమువలె నున్నదియును, మనంబునకైన నెన్నుటకలవిగానియట్లు విశ్వకర్మచే నిర్మింపఁబడినదియును,సకలసంపదలచే చెన్నొందుచుపూర్వముకుబేరునకునివాసస్థానమైనదియును, కోరలుగలిగిభయంకరులునుయుద్ధవీరులును శూలముద్గరాద్యనేకాయుధములను ధరించినవారునునగు ననేకరాక్షసులచే గాపాడఁబడినదియగుచు సర్పంబులచే రక్షింపఁబడు గుహావలెనున్నదియునునగు నాయుత్తరద్వారముచేతనే లంకానగరము నంతయుజూచి, దానినిరాక్షసులు గాపాడునట్టివిధమును, దానిచుట్టునుండు సముద్రమును, జూచి యంతరావణునిభయంకరుఁడైన శత్రువుగాఁదలంచి యిట్లనియాలోచించె. వానరులుసముద్రమునుదాటి యిచ్చటికివచ్చుట మిగులదుర్లభము. అట్లొకవేళ అతిప్రయాసముచే నిచ్చటికివచ్చినను ప్రయోజనములేదు. దేవతలకైన నీలంకానగరమును యుద్ధమునందు జయించుటశక్యముగాదు. మఱియు మహాబాహువౌ రాముఁడుసప్తసాలములను, పర్వతమును భూమిని నొక్కబాణమువలననే భేదించిన పరాక్రమశాలియైయుండినను, మిగులనసాధ్యమై దుర్ఘటమైనదియును, రావణాసురునిచేఁ బాలింపఁబడునదియును నగునీలంకానగరముఁ బ్రవేశించినను ఏమిసేయఁగలఁడు? మఱియుసామోపాయముచే సాధింపనెత్నించినను, రాక్షసులతిక్రూరులుకావున సామోపాయమువారియందుజెల్లదు. దానోపాయముచేఁ గార్యసాధనము చేయుదమనినను, వారలుగర్వితులై కుబేరునిఁగూడ నపహసించుచున్నవారుగావున దానోపాయముగూడజెల్లదు మిగులబలగర్వితులును, రావణునియాజ్ఞచే నెల్లవారునునేకీభవించియుండుటవలన భేదోపాయముగూడ జెల్లదు. అతిబలముగలవారును, సకలవిధములచే నెన్నఁగఁగాపాడఁబడినవారునుగావున దండోపాయమునకుగూడ నెంతమాత్రమవకాశములేదు. కావున నాలుగువిధములగు నుపాయములయందును నేయుపాయమునకును నుపాయముగనబడలేదు మహాపరాక్రమశాలులగు వానరులలోపల వాలిపుత్రుఁడగునంగదుఁడును, నీలుఁడును, నేనును, వానరరాజైన మిగులబుద్ధిమంతుఁడగు సుగ్రీవుఁడును యీనలువురకుమాత్రము సముద్రమునుదాటి యీలంకకువచ్చెడి శక్తిగలదు. తక్కిన వానరులకెవ్వరికిని శక్తిలేదు. ఇప్పుడీవిచారము నాకేల? సీతాదేవి బ్రతికియున్నదా? లేదా? అనువిషయమును దెలిసికొనబోవుచున్నాను? జనకమహారాజుకుమార్తెయగుసీతాదేవిబ్రతికియుండెనేని యామెనజూచి యనంతరము యీయాలోచనజేయవచ్చును అనియిట్లుయోచించి వానరోత్తముఁడగునాంజనేయుఁడు ఆలంబపర్వత శిఖరమునందుండియే రామునియొక్క యభ్యుదయమునుగోరి ముహూర్తకాలములెస్సగాయోచించె. ఈలంకానగరమును క్రూరులును, బలముతో గూడినవారునునగు రాక్షసులు గాపాడుచున్నారు. ఈరూపముతోనే యీపట్టణముఁబ్రవేశింప నాకలవిగాదు. మఱియునేను సీతాదేవినివెదకునపుడు, మిగులభయంకరులును, బలపరాక్రమశాలులునునగు రాక్షసులకెవ్వరికగుపడకుండఁ గపటముచే వారినివంచింపవలయు. కావుననీమహాకార్యమునుసాధించుటకై, మిగులగొప్పదియునుమిగులచిన్నదియునుగాని రూపమునుదాల్చి రాత్రియందులంకానగరముఁ బ్రవేశింపవలయు. అనియిట్లు సురాసురులకైనను బ్రవేశింపనలవిగాని, లంకానగరమును బ్రవేశించుమార్గమునునిశ్చయించియు యింకనుపలుమారు యిట్లనియాలోచించె. రాక్షసులకుఁబ్రభుఁడగు రావణాసురుడు మిగులదురాత్ముఁడు. వాఁడునన్నుఁజూచిన నీకార్యమునకు భంగముగలుగును. కావునవానికగుపడకుండ నీలంకయందు సీతాదేవినివెదుకుటకేదియుపాయము? ఈలంకయందుఁబ్రవేశించి సీతనుజూచి యాసీతాదేవితోసంభాషించునపుడు ఎవ్వరైనను జూచిరేని పరమాత్మజ్ఞానియగు శ్రీరామునికార్యము చెడును. కావున నెవ్వరునుజూడకుండ ఏకాంతమున సీతనెట్లు జూ

డఁగలను? దీనికేమియుపాయము? శ్లో॥ ఘాతాశ్చాద్ధావిపద్యంతే దేశకాలవిరోధితాః । విక్లబందూతమాసాద్య తమస్సూర్యోదయేయథా॥ సర్వసిద్ధములైన కార్యములయందైననను మిగుల అవివేకియగు దూతనియోగింపఁబడునేని, యాకార్యములు దేశకాలవిరోధములను బొందినవై "సూర్యోదయమగుగానే చీకట్లుపటాపంచలైపోవునట్లు" బొత్తిగనాకార్యములన్నియును జెడిపోవును. మఱియు నింకొకవిశేషము గలదు శ్లో॥ అర్థానర్థాంతరే బుద్ధిర్నిశ్చితాపి నశోభతే। ఘాతయంతిహికార్యాణి దూతాః పండితమానినః॥ కార్యాకార్యములు లెస్సగాయోచించి నిశ్చయింపఁబడిన కార్యములయందైనను అవివేకియగు దూతనియోగింపఁబడునేని ఆకార్యముగూడ చెడిపోవును. ఏలననగా నవివేకలగు దూతలు తాము పండితులుగాకపోయినను పండితులమని యెంచి గర్వముచేఁజక్కఁగనాలోచింపక కార్యములుపాడుసేయుదురు కావున నిప్పుడు విపరీతిని అవలంబించిన రామునికార్యము చెడకుండును? నాకు అవివేకియను పేరురాకుండును? అతిప్రయత్నముచేసిదుస్తరమగు సముద్రమును దాటిన ప్రయాస వృథగాకుండును? ఈలంకలో ప్రవేశించునపుడు నన్ను రాక్షసులు జూచురేని, విదితాత్ముడును, రావణాసురుని యొక్క కీడుఁగోరుచున్నవాఁడుననగు శ్రీరామునికార్యము వ్యర్థముగఁ జెడిపోవును. నేను రాక్షసరూపమునుధరించి, ఈలంకానగరంబునందొకానొకచోటనైన నుండుటకలవిగాదు. అట్లుండగా వేఱొకరూపమునుదాల్చి యీలంకయందుండుట కెంతమాత్రమునుశక్యము గాదు. మిగులబలపరాక్రమశాలులగు నీరాక్షసులకుఁ దెలియనిదిఏదియును లేదు. కావున నే, వాయువు రూపములేనివాఁడయ్యును రాక్షసులకుఁదెలియకయే, యీలంకానగరమునందు స్వేచ్ఛగా సంచరింపఁజాలఁడు. రాక్షసులయిష్టానుసారముగనే సంచరించుచున్నాడు ఇట్లగుటచే నేనిప్పుడు నాయథారూపముతో నీలంకయందు సంచరింతునేని తప్పక చేటు సంభవించును అందువలన శ్రీరామునికార్యము జెడిపోవును కావున నిప్పుడు శ్రీరామునికార్యము చెడకుండ నరవేరుటకొఱకు చిన్నశరీరమునుధరించి నానానరరూపము తో నేరాత్రియందులంకలో ప్రవేశించెద మఱియు మిగులదుర్గమమగు రావణాసురుని యొక్క పట్టణమైన లంకానగరమునందు రాత్రియందెవ్వరికిని దెలియకుండ ప్రవేశించి సీతాదేవిని సకలప్రదేశములందును వెదకెదను. అనియిట్లు మహాపరాక్రమశాలియగు నాంజనేయుండనేకవిధముల నాలోచించి నిశ్చితాత్ముఁడై, సీతను జూచుటయందు అధికాపేక్షగలవాఁడగుచు సూర్యాస్తమయకాలమును నెదురుజూచుచుండె. అంతవాయుపుత్రుఁడగు నాంజనేయుఁడు సూర్యాస్తమయము కాగానే తనశరీరమును మిగులఁ జిన్నదిగఁ జేసికొని పిల్లియంతటి యాకారముగలవాఁడగుచు మిగుల నాశ్చర్యకరమగు చూపుగలవాఁడై యుండె. మిగులపరాక్రమవంతుఁడగు నాంజనేయుఁడు, సూర్యాస్తమయంబై చీకటిపడగానే యాలంబపర్వతశిఖరమునందుండి శీఘ్రముగమీది కెగిరి లెస్సగానిర్మింపఁబడియుండు రాజమార్గములుగల లంకానగరములో ప్రవేశించుటకారంభించె. ఇట్లు ప్రవేశించిపోవుచు, వరుసలుదీరియుండు మేడలుగలదియును, బంగారుతోను వెండితోనుఁ జేయఁబడిన స్తంభములును, బంగారుతోఁ జేయఁబడినకిటికీలును గలిగి గంధర్వపురమువలె నున్నదియును, ఏడెనిమిదంతస్థుల మేడలు గలిగినదియును స్ఫటికపురాళ్లతోఁ గట్టఁబడి బంగారపు గచ్చు జేయఁబడిన తలప్రదేశములు గలదియును నగు నామహాపట్టణమును నాంజనేయుడు జూచె. మఱియు నాలంకానగరమునను డెడు రాక్షసుల యొక్క మఱికొన్ని గృహములు వైడూర్యపు మణులచేఁగట్టఁబడి ముత్తియములచే నలంకరింపఁబడిన భూప్రదేశములు గలవియై ప్రకాశించుచుండె అందలి బహిర్ద్వారములు, కాంచనమయములై నానావిధములగు చిత్తరువులు వ్రాయఁబడి మెచ్చఁజూచినను లెస్సగానలంకరింపఁబడియుండుట చే నాలంకానగరమునకు మఱింత కాంతినిగలుగఁజేయుచుండె. మఱియు దలఁచుటకలవిగానిదియును, అత్యాశ్చర్యకరమగు రూపముగలదియును, మిగుల తెల్లనైయున్నవియగు మేడలయొక్క వరుసలు గలదియును, మిగుల శ్రేష్ఠమగు బంగారముతోఁ జేయఁబడిన కిటికీలును బహిర్ద్వారములును గలదియును, మిగుల కీర్తినొందినదియును, రావణాసురుని చే పాలింపఁబడినదియును, మిగుల భయంకరులును క్రూరులునునగు రాక్షసులచే నంతటను లెస్సగాఁ గాపాడఁబడినదియునునగు నాలంకానగరమును జూచి, యాంజనేయుడు యీలాటిపట్టణమును వానరులెవ్విధమున స్వాధీనము జేసికొనగలరని మిగులవ్యసనమునొందినవాఁడును, సీతాదేవిని జూడగలనుగదాయని మిగుల సంతోషముగలవాఁడునునయ్యె. అట్టియెడ చంద్రుఁడు మిగులఁ బ్రకాశమానములగు తనకిరణసమూహములచే లోకమునంతయుఁ బ్రకాశింపఁజేయుచు, తానును నీయాంజనేయునకు సహాయముఁజేయుటకు వచ్చినవానివలె, చూపట్టుచు నక్షత్రసమూహము నడుమఁ బ్రకాశించుచు అట్టెయుదయించె. ఇట్లుదయించినవాఁడును, శంఖమువలె మిగుల తెల్లనైన కాంతి గలవాఁడును, పాలయొక్కయు తామరతూండ్లయొక్కయు ఛాయగలవాఁడును, క్రమక్రమముగ వృద్ధినొంది మిన్నందబోవుచున్నవాఁడును, కొలనులోనుండి మీదికెగురుచున్న హంసవలెనున్నవాఁడునునగు చంద్రుని

వానరోత్తముఁడగు నాంజనేయుఁడు జూచె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి రెండవసర్గ ముగిసెను.

▸(✱)◂

శ్రీరూపియగులంకను ఆంజనేయుఁడు జయించుట.

ఇట్లు మహాబలముగలవాఁడును, మిగులబుద్ధిమంతుఁడును, వానరోత్తముఁడును, వాయుపుత్రుఁడునునగు నాంజనేయుఁడు ప్రేలాడుచుండు మేఘములతోసమానమగు లంబపర్వతశిఖరమునుండి మహాధైర్యమునవలంబించి యారాత్రియందు బైలుదేరినవాఁడై సుందరములగు నరణ్యములతోను, జలావాసములతోనుఁ గూడుకొన్నదియును, రావణాసురునిచే బరిపాలింపఁబడినదియునునగు లంకానగరమునందు బ్రవేశింపనారంభించె. మఱియు శరత్కాలమునందలి మేఘములతోసమానములైన తెల్లనిపొడవైనగృహములతోఁ బ్రకాశించుచున్నదియును, జనులకలకలధ్వనులచే సముద్రధ్వనితోసమానమైనధ్వనిగలదియును, చల్లనిసముద్రపుగాలిచే సేవింపఁబడినదియును, లెస్సగఁబోషింపఁబడిమహాబలవంతులగు సైనికులచే చక్కఁగాఁగాపాడఁబడినదియునునై ఇంద్రునియమరావతీ పురమువలెనున్నదియును, మిగులసుందరములగు బహిర్ద్వారములయందు గట్టఁబడిన మదపుటేనుఁగులుగలదియును, తెల్లనిద్వారములును బహిర్ద్వారములునుగలదియును, లెస్సగాసంరక్షింపఁబడినదియును, శుభకరమైనదియునునై సర్పములకునివాసమగు భోగవతీపురమువలెనున్నదియును, మెఱుములతోగూడిన మేఘములచే వ్యాపింపఁబడినదియును, నక్షత్రమార్గమగు నాకాశమార్గముచే సేవింపఁబడినదియును, (అనగామిగుల నున్నతములగుగృహములుగలదియనుట) రావణునిభయమువలన నిరంతరము మెల్లగవీచుచుండెడు వాయువుగలదియునునై యింద్రపట్టణమగు నమరావతివలె ప్రకాశించుచున్నదియును, మిగుల యున్నతమైనదియును కనకమయమైనదియునునగు ప్రాకారముచేత చక్కఁగనావరింపఁబడినదియును, వాయువశముననఁగదలెడు చిఱుగంటలధ్వనులుగల టెక్కెములచే నలంకరింపఁబడినదియునునగు నాలంకానగరమును బొందె. అట్లుబొందియతివేగముగ ప్రాకారమునుజేరి యాంజనేయుఁడు మిగులసంతసించె. మఱియు నాయాంజనేయుఁడాప్రాకారముపైగూర్చుండి లంకాపట్టణమునంతయుకలయంజూచి మనస్సునవత్యాశ్చర్యమునొందె. మఱియు స్వర్ణమయంబై వైడూర్యమణులతో గట్టఁబడినతిన్నెలుగలవియును, కొన్నిచోట్లవజ్రవైడూర్యములతోను స్ఫటికములతోను ముత్తెములతోను శృంగారింపఁబడినవియును, నవరత్నములతోఁ గట్టంబడినవియునునగు ప్రదేశములచే నలంకరింపఁబడినవియును, పుటముదీరిన బంగారముతో జేయఁబడిన మేలైనమదపుటేనుఁగుప్రతిమలచేఁ దేజరిల్లుచున్నవియును, మఱికొన్నిచోట్లవెండితోఁజేయఁబడి నిర్మలములై తెల్లనైనప్రదేశములుగలవియును, వైడూర్యపుమణులతోజేయఁబడిన మెట్లుగలవియును, స్ఫటికపుత్రాళ్ళతోఁ జేయఁబడిన యిసుకతోఁబ్రకాశించెడుముంగిళ్లుగలవియును, నగుసుందరములగు చతురశ్రమ శాలాగృహములతో గూడినవియును, అత్యున్నతములుగనుండుటచే నాకాశమార్గమున నెగిరిపోవుచున్నట్లున్నవియును, శుభకరములైనవియును, క్రౌంచపక్షులయొక్కయు నెమళ్ళయొక్కయు, రాయంచలయొక్కయు, ధ్వనులచే బ్రతిధ్వనులుగలవియునునగు ద్వారములతోగూడినదియును, వాద్యములయొక్కయు ఘోషణములయొక్కయు ధ్వనులచేనంతటఁ బ్రతిధ్వనులిచ్చుచున్నదియును, ఇంద్రునకు తూర్పుదిక్కుననుండు రాజధానియైన వస్వౌకసారయను నగరముతో సరిపోలియున్నదియును, ఆకాశమార్గమున నెగిరిపోవుచున్నట్లున్నదియునునగు నాలంకాపురమునుజూచి యాంజనేయుఁడు మిగులసంతసించె. ఇట్లుసంతసించి మిగులసుందరమైనదియును, మంగళకరమైనదియును, అన్నిటికన్న శ్రేష్ఠమైనదియును, దినదినప్రవర్ధమానమగుచున్నదియును రావణాసురునిచేఁ బరిపాలింపఁబడినదియునునగు నాలంకానగరమునుజూచి హనుమంతుఁడిట్లనియాలోచించె. ఈపట్టణము, నిరంతరముఆయుధములను చేతబూని పైకెత్తిపట్టుకొని నలుదిక్కులయందు నుదిరుగుచుండెడివారును, రావణాసురునిచే నియమింపఁబడినవారును, మిగులబలవంతులునునగు రాక్షససైన్యములచేఁగాపాడఁబడుటవలనఁ నెట్టివానికైనను ఎంతబలముతోనైనను నెదిరింపనలవిగాదు. ఇట్టియీలంకానగరము, కుముదునకును, అంగదునకును, మైందునకును, ద్వివిదునకును, సుషేణునకును, సూర్యపుత్రుఁడగు సుగ్రీవునకును, కుశపర్వునకును, ఋక్షునకును, కేతుమాలునకును, నాకునుసాధింపనలవియైనదియేసనిదలంచె. మఱియు నాయాంజనేయుఁడు రామలక్ష్మణుల పరాక్రమమును దలచుకొని వారీలంకను జయింపగలరని మిగుల సంతసమునొందె. ఇట్లు సంతసించియాంజనేయుఁడు, సమస్తమణులయొక్క కాంతులేవస్త్రములుగాగలదియును, సమస్తసామగ్రులుంచెడు నున్నతములైనకోటలే చెవిపూవులనలంకారవుప్పములుగాగలదియును, యంత్రగృహములు స్తన

ములుగాఁగలదియును, నైలెస్సగానలంకరింపఁబడిన యా వనస్త్రీవలెనున్న యాలంకానగరమును మఱలమఱలనత్యాశ్చర్యముగాఁజూచెఁ. మఱియు సమస్తమణులయొక్క కాంతులు, సున్నపుగార, పూలమొదలగు వానికాంతులును నొకటిగాఁజేరి, చీకటియనునదియెట్టిదోయనునట్లు నిరంతరమును బ్రకాశమానమై యొప్పుచుండెడు గొప్పగృహములుగల యాలంకానగరమును హనుమంతుఁడుజూచెఁ. ఇట్లుజూచియచ్చటనుండికైలు వెడలిలంకానగరమునందుఁబ్రవేశించె అట్లులంకాపట్టణమునఁ బ్రవేశించుచున్నవాఁడును, మహాబలుఁడును, వానరోత్తముఁడును, వాయుపుత్రుఁడునునగు నాంజనేయునిజూచియాలంకతన నిజరూపమగు స్త్రీరూపమునుదాల్చి, వికారములైన కండ్లునుపండ్లునుగలిగివికృతాకారముతో వానరశ్రేష్ఠుఁడగు నాయాంజనేయునియెడుటనిలిచె. ఇట్లు ఆలంకరూపముతోఁ నాంజనేయునియెదుటనిలిచి దిక్కులు భేదిల్లునట్లు సింహనాదంబుఁ జేయుచు వాయుపుత్రుఁడగు నాంజనేయునిఁజూచి యిట్లనియె.

ఓఅడవియందుజీవించు వానరుఁడా! నీవెవ్వఁడవు? ఏమికార్యమునకైయిచ్చటికివచ్చితివి? నిన్నునేనుసంహరించుటకుమునుపే నీవృత్తాంతమునంతయును యథార్థముగఁ దెలుపుము. ఓవానరాధమా! నాలుగుప్రక్కలను కోటగోడలచే నావరింపఁబడి రావణాసురునిసైన్యములచే లెస్సగాఁ గాపాడఁబడుచుండెడు నీలంకానగరములోపలికిఁబ్రవేశింపనీకుశక్యముగాదు. అనిలంకజెప్పఁగావిని మిగులపరాక్రమశాలియగు నాంజనేయుఁడు, తనముందటనిలిచియున్న యాలంకనుజూచియిట్లనియె.

ఓరాక్షసీ! నీవు దేనినిగుఱించి నన్నడుగుచున్నావో యట్టిసంగతియొక్క యథార్థమును నీకెఱింగించెదను. వికారములైననేత్రములుగలదానా! నీవుఎవ్వతెవు? నీవుఏకారణవలన నీపురద్వారమునందున్నావు? ఎందుకొఱకు మిగులభయంకరాకారమునుదాల్చి నన్నడ్డగించి బెదరించుచున్నావు? ఈవృత్తాంతమును ముందునీవెఱిఁగించితివేని యనంతరమునావృత్తాంతమంతయును సవిస్తరముగా దెలిపెదను. అనియిట్లాంజనేయుఁడుచెప్పగవిని, కామరూపిణియగు నాలంక మిగులకోపోద్దీపితురాలై, యాంజనేయునిజూచి మిగులగరినవాక్యములతోనిట్లనియె.

ఓవానరాధమా! నేను, రాక్షసులకుఁబ్రభుఁడును, మిగులపరాక్రమశాలియును నగు రావణాసురునియొక్క కింకరిని ఇతరులునన్నెదిరింపనలవిగాదు. రావణునియాజ్ఞచే నీలంకాపురమును గాపాడుచున్నదానను. నీవిప్పుడునన్నుజయించి యీలంకానగరమునందుఁ బ్రవేశించుటకునీకలవిగాదు ఓవనచరుడా! నీవిప్పుడు నాచేఁగొట్టఁబడినవాఁడవై ప్రాణంబులువిడిచి పెద్దనిద్దురఁబోఁగలవు. ఓవానరాధమా! పట్టణస్వరూపముగ గనపడుచుండెడు లంకానగరమునేనేను నాకునేనే యీపట్టణముయొక్క నాలుగుదిక్కులను కాపాడుకొనుచున్నాను. ఇదినావృత్తాంతము. నీకువిశదముగఁ దెలిపితిని ఇంక నీసమాచారమును దెల్పుము. అనినవానరోత్తముఁడును వాయుపుత్రుఁడునునగు నాంజనేయుఁడువిని యుద్ధసన్నద్ధుడై "పర్వతమువలె" స్థిరుఁడైనిలిచె ఇట్లునిలిచి, వానరోత్తముఁడును బలపరాక్రమశాలియునునగు నాంజనేయుఁడు వికారమగు స్త్రీరూపమును ధరించియుండెడు నాలంకనుజూచి యిట్లనియె

ఓరాక్షసీ! కోటబురుజులుప్రాకారములు, బహిర్ద్వారములు, మొదలగువాటితోఁగూడుకొనియుండు నీలంకానగరమునుజూచుటయందధికాపేక్షగలవాఁడనై యిచ్చటికివచ్చితిని. ఇదినాకోరిక. ఓలంకా! ఈపట్టణంబునఁగలవిహారవనములను, ఉద్యానములను నరణ్యములనుగొప్పమేడలుమొదలుగాఁగల వానినన్నింటినిజూచుటకువచ్చితి, ననియె. అంత కామరూపిణియగు నాలంక మిగులగఠినములగుమాటలతోనిట్లనియె.

ఓరీదుష్టబుద్ధిగలవాఁడా! వానరాధమా! యిప్పుడునన్నుజయింపకయే రాక్షసేశ్వరునివలనఁ బాలింపఁబడు నీలంకానగరమునుజూడఁజాలవని లంకజెప్పె. అంతవానరోత్తముఁడగు నాంజనేయుఁడిట్లనియె

మంగళస్వరూపురాలవగునోలంకా! ఈపట్టణమునుజూచుటయందధికకోరికగలదు. దీనినిజూచి మఱలనేవచ్చియీమార్గముననేవెళ్లెదను అనియాంజనేయుఁడు, చెప్పగనేయాలంక మిగులఁగోపమునుబొంది మిగులభయంకరమగు సింహనాదమునుజేసి, వానరోత్తముఁడగు నాంజనేయుని తనయఱచేతితోమోదెను. అట్లులంకచేఁగొట్టఁబడినవాఁడును, వానరోత్తముఁడును, మిగులబలపరాక్రమశాలియునునగు నాంజనేయుఁడు దిక్కులు భేదిల్లునట్లు గొప్పసింహనాదమునుజేసె. ఇట్లు సింహనాదమునుఁజేసి మిగులకోపోద్దీపితుఁడై యాలంకను తనముష్టిచేమోదెను గాని, "స్త్రీ" యనుపశ్చాత్తాపముచేఁజంపడయ్యె ఇట్లాంజనేయునిచే గొట్టఁబడిన యాలంకసడివదలిన యవయవములుగలదియగుచు మూర్ఛనొంది వికారమగు భయంకరాకృతితో నేలయందుబడియె. అంతనాంజనేయుఁడు నేలంబడియున్నలంకనుజూచి పండితుఁడుగావు

నస్త్రీనిఁజంపఁగూడదనియును, స్త్రీనిఁజంపుటనూరులమొకఁ ధర్మము గాదనియును దలచి దయతోఁ గూడుకున్నవాఁడై వంపక విడిచె. పిదప యాలంక కొంతసేపటికి తెలివినొంది మిగులభయముకలదై గర్వముడిగి, వానరోత్తముఁడగు నాంజనేయునిఁజూచి మిగుల డగ్గుత్తికతోఁ గూడిన మాటలతో నిట్లనియె.

మహాబాహుఁడవగు నో యాంజనేయుఁడా! కోపము నువిడిచి ప్రసన్నుఁడవుగమ్ము. వానరోత్తముఁడా! నన్నుఁ జంపక జీవముతోఁగా పాడుము! మిగులసౌమ్యుండవగు నో వానరశ్రేష్ఠుఁడా! మిగులబలపరాక్రమశాలులగు పురుషులు స్త్రీనిఁజంపఁగూడదను వ్రతముగలవారుగదా? కావున నన్నుఁగాపాడుము ఓ ఆంజనేయా! పట్టణరూపమునఁగాన్పించుచుండెడు లంక నేనేను. శూరుఁడవగు నో వానరోత్తమా! నీవు మిగులపరాక్రమముచేనన్నుజయించితివి. పూర్వము బ్రహ్మదేవుడు నాకొకవరమునిచ్చె. దానియథార్థముగ నీకుఁదెలిపెద సావధానుఁడవైవినుమని చెప్పి బ్రహ్మదేవుఁడు తనకిచ్చినవరమును జెప్పఁబోడఁగె. ఎప్పుడు, ఒకానొకవానరుఁడీలంకకువచ్చి పరాక్రమించి నిన్నుజయించునో, అప్పుడీలంకయందుండు రాక్షసులకందరికిని కీడు సంభవించునని నిశ్చయముగా దెలిసికొనుమని బ్రహ్మదేవుఁడు చెప్పె. కావున నో యాంజనేయా! ఇప్పుడు నిన్నుఁజూచుటవలన నా సంకేతకాలము సమీపించినదని తోఁచుచున్నది ఇది బ్రహ్మదేవునిచేఁ జెప్పఁబడెను. కావున నిదియథార్థము. దీనికెంతమాత్రమును సందేహములేదు. ఓ వానరోత్తమా! సీతాదేవినిదొంగతనముగ తెచ్చుటచేత, దురాత్ముఁడును రాక్షసరాజునునగు రావణాసురునకును, సమస్తరాక్షసులకును కీడు రాబోచున్నది ఓ వానరశ్రేష్ఠుఁడా! నీవింక నీలంకానగరమునందుఁ బ్రవేశించి యేయే కార్యములు దీర్చుకొనఁగోరుచున్నావో ఆయా కార్యములను నీయిష్టప్రకారము నెరవేర్చుకొనుము ఓ వానరోత్తమా! నందికేశ్వరుని శాపముచేతఁ గొట్టఁబడినదియును, మిగులమంగళమైనదియును, రాక్షసేశ్వరుఁడగు రావణాసురునిచే బాలింపఁబడినదియునునగు నీలంకానగరమునందుఁ బ్రవేశించి, నీయిష్టప్రకారముయథాసుఖముగ పట్టణమునంతటను తిరిగి, మహాపతివ్రతయగు సీతాదేవిని వెదుకుమని లంకయాంజనేయునితోఁ జెప్పె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి మూడవసర్గము గిసెను.

— {ఆంజనేయుడు లంకలోఁ బ్రవేశించి రత్నగృహములు మొదలగువానినిఁ జూచుట.} —

అంత మిగుల బలపరాక్రమము గలవాఁడును, మహాబాహుండును, వానరోత్తముఁడును నగు నాంజనేయుఁడు, పట్టణస్వరూపు రాలును, కామరూపురాలును నగు నాలంకను పరాక్రమము చేజయించి, "శత్రుపురమును బ్రవేశించునపుడు ద్వారమార్గమునఁ బ్రవేశింపఁగూడదను రాజనీతి" నెఱింగినవాఁడు గావున ద్వారమునఁ బ్రవేశింపక ప్రాకారమును దాటి లంకలోఁ బ్రవేశించె.

ఇట్లు వానరరాజగు సుగ్రీవునకు మేలుజేయువాఁడగు నాంజనేయుఁడు ప్రాకారమును దాటి లంకలోఁ బ్రవేశించునపుడు "శత్రుపట్టణమునందు బ్రవేశించునపుడు ముందుగ నెడమకాలుంచవలయునని యును, అట్లుంచుటచే శత్రువునకు కీడుసూచించునట్లు వానిశిరముపై నుంచునట్లగునని యును రాజనీతిశాస్త్రమునందు జెప్పియుండుటచే" శత్రుశిరమునందన గావిరోధిపురమునందు ముందుగ నెడమకాలుంచె. ఇట్లెడమకాలు ముందుగ ప్రాకారము లోపలిపెట్టుంచి పట్టణము బ్రవేశించి, మహాబలుండును వాయుపుత్రుఁడునునగు నాంజనేయుఁడు, ముత్తెములచేతను పుష్పములచేతను బ్రకాశించుచుండెడు రాజమార్గమును రాత్రియందు బ్రవేశించె. అట్లు రాజమార్గమున బ్రవేశించి రమణీయమగు లంకానగరమునందు బోవుచుండె. మిగుల రమణీయమగు నాలంకానగరము, ఎడతెగక మ్రోయుచుండెడు వాద్యధ్వనులతోను నవ్వులవలనగలిగెడు ధ్వనులతోను గూడుకొన్నవియును, వజ్రాయుధమును అంకుశమునువలె నతికఠినములైనవియును, నవరత్నములయొక్క సమూహములచే లెస్సగ నలంకరింపఁబడినవియునునగు శ్రేష్ఠములగు గృహములుగలిగి మేఘములచేగప్పఁబడిన యాకాశమువలె బ్రకాశించుచుండె మఱియు నాలంకానగరము శుభకరములగు రాక్షసులగృహములతోను, శరత్కాలమునందలి మేఘములతో సమానములైనవియును, చూచువారల కాశ్చర్యమును బుట్టించునవియును, పద్మము, స్వస్తికము, వర్ధమానము, అనుసీసంస్థానభేదములచే గట్టఁబడిన రాజగృహములతోనుఁ గూడినదియై, అంతటను లెస్సగనలంకరింపఁబడి మిక్కిలి ప్రకాశించుచుండె

అప్పుడు సుగ్రీవుని యిష్టముచొప్పున నటించువాఁడును, శ్రీమంతుండును నగు నాంజనేయుఁడు, రామునికార్యమునకుగాను లంకయందంతటను సంచరించుచు, మెచ్చఁదగినను చిత్రములగు పూలదండలతోను నాభరణములతోను బ్రకాశించెడు నాలంకానగరమును జూచి మిగుల

సంతోషించె. మఱియు నాంజనేయుండొక యింటినుండి మఱియొక యింటికిఁబోవుచు నచ్చటచ్చట పలువిధములైన యాకారములును రంగులునుగల యిండ్లనుజూచె ఆగృహములయందు స్త్రీలు, మద్యపానముచేమత్తులై, హృదయము, కంఠము, శిరములను నీమూడు స్థానములయందు నుబుట్టిన, మంద్రము మధ్యమము తారములనెడు స్వరములచేనలంకరింపఁబడి స్వర్గలోకమునందలి యప్సరస్త్రీలగానమువలె మిగులమనోజ్ఞముగఁ బాడుచుండుటను ఆంజనేయుండువినెను. మఱియును మహాత్ములగు రాక్షసోత్తములగృహములయందు, స్త్రీలునడుచునపుడు, వారుధరించియుండెడు గజ్జలవడ్డాణములు అందెలు మొదలగువాటి ధ్వనులను, మిద్దెమెట్లెక్కునపుడును దిగునపుడును గలిగెడుధ్వనులను చప్పట్లుగొట్టుటచేఁ గలిగెడుధ్వనులను, నవ్వుటచే గలిగెడుధ్వనులను, సింహనాదములుజేయుటచేఁ గలిగెడుధ్వనులను మఱియు నానావిధములగు కలకలధ్వనులనువినెను ఇదియునుగాక రాక్షసులు యుద్ధమందెచ్చటఁ జూచినను మహామంత్రములు మొదలగు మంత్ర పునశ్చరణ జేయువారిని వేదాధ్యయనమును జేయువారిని రావణాసురుని స్తుతించుచున్నవారిని, గట్టిగనరచుచు రావణాసురునికి పరాకుజెప్పువారిని యాంజనేయుఁడుజూచె. ఇట్లుబోవుచున్న యాంజనేయుఁడు. రాజమార్గమునందు నిలిచియున్నగొప్ప రాక్షససైన్యమును, ఆసేనయొక్క మధ్యభాగమునందున్న రావణాసురునిదూతల ననేకులనుజూచె. అచ్చోటనుండి యింకంబోవుచు, యజ్ఞదీక్షయందుండువారిని, జడలుదాల్చియుండువారిని, బోడితలలతోనుండువారిని, ఎద్దుతోలును వస్త్రముగా ధరించియుండువారిని, దిగంబరులను, దర్భలుపిడికిటియందు బట్టుకొని యనిష్టములనుబోగొట్టువారిని, అగ్నిగుండములయందు హోమములు జేయుచు అనిష్టములను బోగొట్టువారిని, కూటాయుధములను యినుపగుదియలను చేతులయందు ధరించియుండువారిని, దండాయుధములను ధరించియుండువారిని, మఱియు ననేక వికారస్వరూపులగు నొంటికంటి వారిని, యొంటిచెవిగలవారిని, వ్రేలాడుచుండు కడుపుగలవారిని, వికారస్వరూపముగలవారిని, వంకరమూతివారిని, అసమశరీరులను, పొట్టివాండ్రను, విలుకాండ్రను, కత్తులుధరించియుండువారిని, ఇనుపముండ్లకఱ్ఱలను రోకళ్ళనునాయుధములుగ గలవారలను. శ్రేష్ఠములగు పరిఘాయుధములను ధరించి యుండువారలను, విచిత్రములగు కవచములను ధరించియుండువారలను, మిగులలావుగానివారలను, మిగుల సన్నముగానివారలను, మిగులపొడుగుగానివారలను, మిగులకురుచగా నుండనివారలను, మిక్కిలిఁ దెల్లనివర్ణముగలవారిని, మిక్కిలినలుపువర్ణము, గలవారిని మిగులగూనివారిని, గూనులేనివారిని, మిగులపొట్టివారిని, మిక్కిలిపొట్టిగాఁకయుండువారిని, వికారమైనరూపములు గలవారిని, అనేకరూపములు గలవారిని, మంచిరూపము గలవారిని, మంచితేజస్సుగలవారిని, రాజచిహ్నములు వ్రాయఁబడియుండు టెక్కెములను బూనియుండువారిని. టెక్కెములను బట్టుకొనియుండువారిని, కొళ్ళకు గుడ్డలనుగట్టఁబడియుండు గడలనుధరించియుండువారిని, నానావిధములగు నాయుధములను ధరించియుండువారిని యాంజనేయుఁడు జూచె. మఱియునట్లనేపోయిపోయి, చిల్లకోలలువృక్షములు యాయుధములుగా గలవారిని, ఆడ్డకత్తిని యాయుధములుగధరించినవారిని, పిడుగును యాయుధముగ ధరించినవారిని, ఓడనడుపుగడలను పాశములను నాయుధములుగ ధరించియుండువారిని, పూలదండలను ధరించియుండువారిని, చందనము మొదలగులేపనములను బూసికొనియుండువారిని, శ్రేష్ఠములగు యాభరణములను ధరించియుండువారిని, పలువిధములగు వేషములను ధరించియుండువారిని, స్వేచ్ఛగా సంచరించుచుండువారిని, కఱకుశూలములనుధరించినవారిని, వజ్రాయుధములను ధరించినవారిని, మహాబలముగలవారిని, యిట్లనేకులనుజూచె అంతవాంజనేయుఁడు పురమధ్యమును బొందినవాఁడగుచు, నచ్చటరాక్షసాధిపుడగు రావణాసురునిచే నియోగింపఁబడినదియును, మేమఱుపాటులేక నతిజాగ్రతతోఁ గావలియున్నదియును, నూరువేల లక్షసంఖ్యగలదియును నగు మధ్యమ గుల్మమను పేరుగల సేనాభాగమునుజూచె

అట్లా సేనాభాగమునుజూచి పిదపఆంజనేయుఁడు, కనకమయంబైన గొప్పప్రాకారముచేఁ నావరింపఁబడినదియును, తెల్లతామరపుష్పములే చెవిమీఁదియలంకారపుష్పములుగగల యగడ్తలచే నలంకృతంబైనదియును సువర్ణముతోఁ జేయఁబడిన బహిర్ద్వారముగలదియును మిగులఁ బ్రసిద్ధిబొందిన పర్వతాగ్రమునందు బ్రతిష్ఠింపఁబడినదియును నగు రాక్షసరాజైన రావణాసురుని గృహమును జూచె అట్లాగృహమునుజూచి, స్వర్గముతో సమానమైనదియును. ఉత్తమములగు గానధ్వనులచేఁ బ్రతిధ్వనింపఁజేయఁబడినదియును, గుఱ్ఱములు సకిలించుటచేఁ గలిగెడుధ్వలతోఁ బ్రకాశించుచున్నదియును, మఱియు నాభరణములధ్వనులచేఁ బ్రతిధ్వనించు చున్నదియును, రథములతోను, యానములతోను, విమానములతోనుఁ గూడుకొన్నదియును, మంగళకరములగు గుఱ్ఱములతోను యేనుఁ

గుల తోడను, నాలుగుదంతములుగలిగి తెల్లనిమేఘములతో సమానములైన యేనుఁగుల తోఁ బ్రకాశించుచున్నదియును, మదించియుండు సకలమృగముల తోడను పక్షుల తోడను నలంకరింపఁబడి మనోజ్ఞమగు వాకిలిగలదియును, మహాపరాక్రమశాలులగు ననేకవేలరాక్షసులచేఁ గావాడఁబడినదియును నగునా రావణాసురునిగృహమునందు, ఆంజనేయుఁ డతిగోప్యముగఁ బ్రవేశించె. అట్లుప్రవేశించి, సువర్ణముచే నిర్మింపఁబడినదియును, బంగారుప్రహరీగోడలచే వెలుంగుచున్నదియును, అంతములయందు ముత్తియముల తోడను సమస్తమణుల తోడను నలంకరింపఁబడినదియును, ఎచ్చజూచినను కృష్ణాగరుతోడను శ్రీగంధము తోడను బూయఁబడినదియును నగునాయంతఃపురమును యాంజనేయుఁడు జూచె.

ఇట్లు శ్రీమత్సుందర కాండమునందలి నాలుగవసర్గముగిసెను.

▸✱◂

ఆంజనేయుడు చంద్రోదయకాలమునసీతాదేవిని వెదకుట

అట్టియెడ, ఆకాశమునం దుచ్చయందువచ్చినవాఁడును, సకలప్రదేశములను తనవెన్నెలలయొక్క కాంతిచేత ప్రకాశింప జేయుచున్నవాఁడును, నక్షసమూహముయొక్కయు, కిరణసమూహముయొక్కయు నడుమనున్నవాఁడై గోవులమందనడుమఁ దిరుగులాడుచున్న తెల్లనియాబోతెద్దువలెనున్నచంద్రుని మిగులబుద్ధిమంతుఁడగు నాంజనేయుఁడుజూచె. మఱియు సకలలోకములయందుండువారిలయొక్క వ్యసనములను నివారించువాఁడును, సముద్రమును నుప్పొంగునట్లు జేయువాఁడును, సమస్తపంచమహాభూతములనుఁ బ్రకాశింపఁజేయువాఁడును, ఆకాశమునందు దిరుగుచున్నవాఁడునునగు చంద్రునియాంజనేయుండుజూచె. ఆసమయమున, భూమిలోని మందరపర్వతమునందుఏకాంతిసంపదగలదో యాకాంతిసంపదయు, ప్రదోషకాలములయందు సముద్రమునందేకాంతియుండునో ఆకాంతియు, ఉదకములందును కమలములయందును యేసంపదగలదో యాసంపదయును చంద్రునియందేకమై ప్రకాశించుచుండె. మఱియు వెండిపంజరమునందున్న హంసయుంబోలె మందరపర్వతపుగుహలయందున్న సింగమువలె, మదపుటేనుమీదనున్నశూరునిభాతి, ఆసమయమున నానాకాశమధ్యమునసున్న చంద్రుఁడు మిక్కిలికాంతితో బ్రకాశించుచుండె. కఱకుకొమ్ములుగల యనగాఁగూచిగానుండెడు కొమ్ములుగలతెల్లయెద్దువలె, ఉన్నతములగుశిఖరములుగలతెల్లనిపర్వతమువలె, కనకపుకట్టుచేఁ (తొడుపులచే) బ్రకాశించెడుదంతములుగల తెల్లనియేనుఁగువలె సంపూర్ణకళలతో గూడుకొని నాచంద్రుఁడు ప్రకాశించుచుండె. ఇంకను, మంచుచేవిడువఁబడి నిర్మలముగనున్నవాఁడును, గొప్పగ్రహముగుసూర్యకిరణముల మూలమునవెల్తురుగ్రహించుటచే లెస్సగఁ బ్రకాశించువాఁడును, సూర్యునియందుండి విశేషముగ వెల్తురునుగ్రహించుటచే గలిగిన ప్రకాశమువలన తానుధరించియుండెడు శశిరూపమగు భూచ్ఛాయాచిహ్నమువలన లెస్సగచూడఁబడుచున్నవాఁడునునగు చంద్రుఁడులెస్సగఁ బ్రకాశించుచుండె. మఱియు పర్వతప్రదేశమునుబొంది, మృగరాజగు సింహముయెట్లుప్రకాశించునోయట్లును, మత్తగజము రణరంగమును బొంది యెట్లుప్రకాశించునోయట్లును, ప్రభుత్వసంపదను బొందినరాజు యెట్లు శోభిల్లునోయట్లును ఆకాశమధ్యయందున్నచంద్రుఁడు ప్రకాశించుచుండె. ఇట్లు మిగులప్రకాశమానమగు చంద్రోదయముకాగానే, పోయినచీకట్లుగలదియును, రాక్షసులకు మాంసభక్షణముఁ జేయుట కుచితమగు కాలమైనదియును, కామినీ కాముకులచేవిడువఁబడినమనస్సునందలి కోపరూపమగు దోషము గలదియునై స్వర్గముతోసమానమైనసుఖమునిచ్చెడు ప్రదోషకాలముగడచిపోయె. అయ్యవసరమున, చెవులకింపైన వీణాగానములువినఁబడియె మహాపతివ్రతలు తమతమభర్తలతోఁగూడ నిదురించిరి. అప్పుడు రాక్షసులు, మిగుల నాశ్చర్యమును భయమునుబుట్టించుచర్యలతో సంచరింప నారంభించిరి. అట్టియెడనయ్యాంజనేయుడు, మదించిమైమఱచియుండు జనులుగలవియును, జనులునిండియుండుటచేమిగులయిఱకటమైనవియును, రథములచేతను గుఱ్ఱములచేతను, భద్రగజములచేతను, సింహాసనములచేతనునిండి మిగులయిరకటమైనవియును సంపద్యుక్తములయినవియునునగు ననేకగృహములనుజూచె మఱియు నాంజనేయుడు ఒకరినొకరు పరిహసించుకొనుచున్నవారును, మిగులబలిసియుండు బాహువులనొకరిపైనొకరు వైచుకొనుచుండువారును, పానమత్తతచేవర్ధములేకుండునట్లు మాట్లాడుకొనుచుండువారును, మదముచేనొడలెరుగక యెండొరులను దిట్టుకొనుచుండువారును, ఱొమ్మునిరుచుచున్నవారును, తమభార్యలపై గాళ్లువైచుచున్నవారును, నానావిధములగు రూపములనుధరించుచున్నవారును, మిగుల దృఢములగు వింట్లెక్కుబెట్టుచున్నవారునునగు రాక్షసులనుజూచె. ఇంకనునయ్యాంజనేయుడచటఁ జెందనము మొదలగువానినిఁ బూసికొనుచున్నవారును, వినోదముగ మాట

లాడుచున్నవారును, నిదురించుచున్నవారును, నవ్వుచున్నవారును, మిగులరూపసంపన్నులైనవారును, కోపించియున్నవారును, నిట్టూర్పులు విడుచుచున్నవారుననగు ననేకస్త్రీలనుజూచె. ఆలంకాపట్టణము, గర్జించుచున్నగొప్పయేనుఁగులును, పూజనీయులగు పెద్దలును, యుద్ధసన్నద్ధులై నిట్టూర్పులువిడుచుచుండెడు శూరులునుగలదియై నిట్టూర్పులువిడుచుచున్న సర్పములతో నిండియుండుకోనేరువలె ప్రకాశించుచుండె. ఆలంకానగరమునందు, మిగుల బుద్ధిమంతులును, మిగులమనోహరముగ మాటలాడువారును, తమ మతమునందు మిగులశ్రద్ధతో గూడుకున్నవారును, లోకవిషయములయందు ముఖ్యులైనవారును, పలువిధములగు యాచారములుగలవారును, మనోజ్ఞములైన పేళ్ళుగలవారుననగు ననేకరాక్షసులను యాంజనేయుఁడుజూచె మఱియుమంచిరూపముగలవారును, పలువిధములైన గుణములుగలవారును, తమగుణములకుఁదగిన వ్యవహారములుగలవారుననగు నారాక్షసులనుజూచి యాంజనేయుఁడుమిగులసంతసించె. ఇట్లుసంతసమువొంది యావలకొంతదూరముపోయి వికృతరూపములుగలవారును, రూపములకుఁదగినగుణములుగలవారును నగు మఱికొందఱు రాక్షసులనుజూచె. మఱియునాలంకాపురమునందు మిగుల శ్రేష్ఠములగు యాభరణములనుధరించియుండువారును, తమభర్తలయెడల పరిశుద్ధములైనహృదయములుగలిగి, కటాక్షవీక్షణములు మొదలుగాగల శృంగారచేష్టలుగలవారును, మిగుల పతిభక్తిగలవారును, మద్యము మొదలగు పానద్రవ్యములయందు మిగుల నాసక్తిగలవారును, పాతివ్రత్యప్రభావాతిశయముచే నక్షత్రములవలె ప్రకాశించుచున్నవారునునైనరాక్షసస్త్రీలను ఆంజనేయుఁడుజూచె. ఇంకను మిగులసౌందర్యముచేతఁ బ్రకాశించుచున్నవారును, అర్ధరాత్రమునఁబ్రియులచేఁ గౌగలింపఁబడి సిగ్గుఁజెందినవారును, పరమసంతోషము నొందినవారును పుష్పమాలికలచేఁగప్పఁబడినవారై పువ్వులచేఁగప్పఁబడిన యాడుపక్షులవలెనున్నవారుననగు స్త్రీలనుహనుమంతుఁడుజూచె. మఱియును మిద్దెలయందు గూర్చున్నవారును, తమభర్తలయొక్కతొడలపై సుఖముగాగూర్చున్నవారును, తమభర్తలకత్యంతసంతోషమును గలుఁగఁజేయుచున్నవారును, శాస్త్రోక్తముగ వివాహమైనవారును, ధర్మమునందాశచే న్యాయముదప్పక నటించువారును, మన్మథోద్రేకముతోఁగూడుకున్నవారుననగు మఱికొందఱుస్త్రీలను యాంజనేయుఁడుజూచె. మఱియు భర్తృసంయోగముచేదిగంబరులై బంగారురేఖయొక్క కాంతివంటికాంతిగలవారును, పుటముదీరినపదియారువన్నె బంగారవుకాంతివంటికాంతిగలవారును, భర్తృవిరహముచే మిగులవ్యసనమునొందినవారై చంద్రరేఖవలె తెల్లపారినశరీరముగలవారును, మనోహరమైన దేహకాంతిగలవారుననగు కొందఱుస్త్రీలనుజూచె మఱియు తమకుప్రియులగు పురుషులనువెదకుకొనిపోయి వారితోగలిసి రతులంఁదేలిపరమసంతుష్టులైయుండు నభిసారికస్త్రీలను, తమతమయిండ్లయందుతమభర్తలతోగూడి సుఖమనుభవించుచుండు సౌందర్యవతులగు పతివ్రతలనుజూచె. అప్పుడాంజనేయుఁడు, రామునియొద్దనుండి బైలుదేరునప్పుడు, ఆరాముడు తనలోజెప్పిన గురుతులుగలస్త్రీ యాస్త్రీలమధ్యయందున్న దేమోయనికనుగొనుటకొఱకు, చంద్రబింబములవలెఁ బ్రకాశించుచున్నవారిముఖములను, వంకరలైసుందరములగు కనుఱెప్ప వెండ్రుకలుగలనేత్రములను, మెఱుపుతీగెలవలె సుందరములై మనోజ్ఞములగు యాభరణములయొక్క సమూహములను యాంజనేయుఁడు లెస్సఁగఁబరీక్షించిచూచె. ఈప్రకారముగ నాస్థలమునందంతటను వెదకి, మిగులసౌందర్యవతియును, సత్కులమునందు బుట్టినదియును, భర్తృవియోగమువలన మిగులఁ గృశించినదియును, (అయోనిజయును) తనయిష్టముచొప్పునజన్మించినదియును, వికాసముతోఁ గూడుకొనియుండుతీగెవలె నున్నదియుననగు సీతాదేవిని నాంజనేయుఁడు చూడడాయె. శ్రేష్ఠమగుపాతివ్రత్యవ్రతమునందున్నదియును, రామునిఁజూచుటయందధికప్రేమగలదియును, మన్మథవికారము నొందినదియును, శ్రీమంతుఁడగుశ్రీరాముని నిరంతరముమనసునధ్యానించుచున్నదియును, ఉత్తమస్త్రీలలోనుత్తమురాలును, రామునివియోగముచే మిగులవ్యసనపీడితయై నిరంతరముకన్నీరువిడుచుచున్నదియును, పూర్వముశ్రీరామునితోఁగూడియుండునప్పుడు శ్రేష్ఠములగు కంఠాభరణములతో నలంకరింపబడి యిప్పుడుకన్నీటిధారలే యాభరణములుగాగలదియును, సుందరములగు కనుఱెప్ప వెండ్రుకలుగలదియును, మిగులతిన్ననిమాటలుగలదియును, అరణ్యమునందుదిరుగులాడుచుండెడు నెమలియుంబోలె నున్నదియును, వ్యసనముతో గూడుకున్నదియగుచు మేఘములచేఁగప్పఁబడిన చంద్రరేఖవలెనున్నదియును, స్నానము మొదలగు సంస్కారములు లేకపోవుటవలన దుమ్ముచేగప్పఁబడిన బంగారుతీగెయుంబోలె నున్నదియును; మంచిగాయముదగిలి పైదూపునకుమాత్రము మానినట్లగుపడుచుండు బాణమువలన గలిగిన రేఖవలెనున్నదియును; గాలిచేచెదరగొట్టఁబడిన మేఘపంక్తివలెనున్నదియును; సంభాషించుట

యందు మిగులచాతుర్యముగలవారిలో నుత్తముఁడగు శ్రీరామునిభార్యయునునగు సీతాదేవిని బహుచక్కగా వెదకిమెచ్చటనుగానని వాఁడగుచు నాంజనేయుం డొకముహూర్తకాలముమూర్ఛునివలెనే వ్యసనమునుబొందె

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ఐదవసర్గము గిసెను.

రాక్షసులగృహములయందు సీతాదేవిని వెదకుట

తనయిష్టముచొప్పున రూపమునుదాల్చునట్టి యాంజనేయుఁడు, సమస్తమేడలయందును సీతాదేవిని వెదకి యెచ్చటనుగానక మిగులవ్యసనమునుబొంది యంతమఱల ధైర్యమునవలంబించి యతివేగముగ లంకానగరమంతయు సంచరించుట కారంభించె. అట్లుసంచరించుచు సూర్యుని కాంతివంటి కాంతితోఁబ్రకాశించెడు. ప్రాకారముచేనావరింపఁబడి యుండునదియగు రావణాసురుని గృహమును బ్రవేశించె.

అట్లుబ్రవేశించి మిగులభయంకరమగు రాక్షసులచేఁగాపాడఁబడినదియై "సింహముచేఁ గాపాడఁబడుచుండెడు గొప్పయరణ్యమువలెనున్న" యారావణాసురుని గృహమును నలుదిక్కులంజూచుచు నాంజనేయుఁడు మిగులనాశ్చర్యమునుబొందె అట్లాసీతనువెదకుచున్న యాంజనేయుఁడు, వెండితోఁగట్టఁబడినవియును, సువర్ణములచేపలువిధములుగ నలంకరింపఁబడినవియును నగుబహిర్ద్వారములుగలదియును, నానావిధములగు తొట్టికట్లుగలదియును, మనోజ్ఞములగు ద్వారములుగలదియును, "అతిశూరులును, శ్రమలేక ఏనుగులపైకూర్చుండి యలసటలేకతిరుగువారును నగుమంత్రులచే నలంకృతమైనదియును, ఉత్తమములగు గుఱ్ఱములచే గట్టఁబడినవియును, సింహములయొక్కయు పెద్దపులులయొక్కయు చర్మములతోఁ గప్పఁబడినవియును, దంతములతోను కనకముతోను వెండితోనున లంకరింప బడినవియును, దిక్కులు భేదిల్లునట్లు ధ్వనిజేయునవియును నిరంతరము సంచరించుచున్నవియును నగుపలువిధములగు రథములతో బ్రకాశించుచున్నదియును, అనేకవిధములగు రత్నములతోఁ బొదగఁబడిన శ్రేష్ఠములగుసింహాసనములతోను పాత్రములతోనుఁ బ్రకాశించుచున్నదియును, మహారథికులకు నివాసస్థానమైనదియును, (మహారథికులనగా పదునొకండువేలమంది విలుకాండ్రతోఁబోరుచు తన్నును సారథిని రథమును గుఱ్ఱములను గాపాడుకొనువారు) నవరత్నస్థగితమైన గొప్పరథములతోను, పీరములతోనుఁ గ్రిక్కిరిసినట్లున్నదియును, మిగులసుందరములైనవియును, గొప్పవియును, నానావిధములైనవియును నగు పెక్కువేల మృగములతోను పక్షులతోను నెచ్చటఁజూచినను నిండినట్లున్నదియును, శస్త్రాస్త్రవిద్యలయందు మిగులసమర్థులగు రాక్షసులచే నావరింపఁబడి చక్కగారక్షింపఁబడినదియును, మిగులసౌందర్యముగల స్త్రీరత్నములతో నొప్పుచున్నదియును, మిగులసంతోషభరితులగు స్త్రీలతోనిండినదియును, రాక్షసరాజైన రావణాసురునకు నివాసస్థానమైనదియును, మిగులశ్రేష్ఠములగు యాభరణములయొక్క ధ్వనులచేనిండినదియై సముద్రముయొక్కధ్వనితో పోలికగలదియును, రాజచిహ్నములగు ఛత్రచామరములతో గూడియున్నదియును, అగరు, శ్రీగంధము, మొదలగు శ్రేష్ఠములైన వాసనద్రవ్యములయొక్క వాసనచే చెలంగుచున్నదియును, పురుషసింహములకు నివాసస్థానమై సింహసమూహములతో నొప్పుచుండెడు నరణ్యమువలెనున్నదియును, భేరీమృదంగము మొదలగువానియొక్క ధ్వనులచేనొప్పుచున్నదియును, శంఖముయొక్క ధ్వనిచేఁ బ్రతిధ్వనింపఁజేయఁబడినదియును, నిరంతరమును పూజింప బడినదియును, పర్వదినములయందు హోమాదులచేఁ జెన్నొందుచున్నదియును, రాక్షసులచేనిరంతరము పూజింపఁబడినదియును, అచ్చటనివసించువారికెల్లరకును సుఖముగలుగ జేయునదియును, రాక్షసులకునిరంతరమభివృద్ధిని గలుగజేయుచు గంభీరమగు సముద్రమువలెనున్నదియును, శ్రేష్ఠములైన రత్నములతోఁ గప్పఁబడిన మీదికప్పుగలదియును, మిగులశ్రేష్ఠములగు రత్నములచేఁ జెక్కఁబడినదియును, మిగులపరాక్రమశాలియగు రావణాసురునికి వాసస్థానమైనదియును నగునామహాగృహమును వానరోత్తముఁడుజూచె. అట్లుజూచి, ఆహా, రూపముచే బ్రకాశించుచున్నదియును, ఏనుఁగులు గుఱ్ఱములు మొదలగువానితో నిండినదియును నగు నీరావణునియొక్క గృహము, లంకానగరమునకు శిరోభూషణముగ నున్నదిగదాయనియెంచె అట్లు మిగుల నాశ్చర్యమునొందుచు ఆరావణునిసమీపమున సంచరించుచుండి యావలనొకగృహమునుండి మఱియొక గృహమునకుదుముకుచు, నుద్యానవనములందును మేడలయందును మిగులనిర్ణయముగ సంచరించుచు సీతాదేవిని వెదకుచుండె

అట్లు సీతాదేవిని వెదకుచు నొకయింటినుండి మఱియొకయింటికిదుముకుచు మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుఁడు ప్రహస్తుని గృహమునకుఁబోయి యందంతటనుసీతనువెదకి యెందుగానక నచ్చటనుండి మహాపా

ర్శ్వునియింటికిఁబోయె. అచ్చటనుసీతనుగానక మేఘముతోసమానముగానుండెడు కుంభకర్ణునియింటికిబోయె. అచ్చటను గానక విభీషణునియింటికిఁబోయె. అందుసీతనుగానక మహోదరుని గృహమునకుఁబోయి, యచ్చట సీతాదేవిని గానక విరూపాక్షుని గృహమునకును, విద్యుజ్జిహ్వునిగృహమునకును, విద్యున్మాలియను వానియింటికిని, వజ్రదంష్ట్రుని గృహమునకును, శుకుండనువానియింటికిని, మిగులబుద్ధిమంతుఁడగు సారణుఁడనువాని గృహమునకును, మహాపరాక్రమశాలియగు నింద్రజిత్తుయొక్క గృహమునకును; జంబుమాలియొక్క గృహమునకును, సుమాలియనువాని యింటికినిబోయె. అదుండిరశ్మికేతునిగృహమునకును, సూర్యకేతునిగృహమునకును, వజ్రకాయుఁడనువానియొక్క గృహమునకును, ధూమ్రాక్షునియింటికిని, సంపాతియొక్క గృహమునకును, మిగులభయంకరాకారుఁడైనవిద్యుద్రూపునియొక్కగృహమునకును, ఘనుండనువానియింటికిని, విఘనుండనువాని గృహమునకును, శుకనాసునియింటికిని వక్రుండనువానిగృహమునకును, శఠుండనువానిగేహమునకును, వికటుండనువానియింటికిని, బ్రహ్మకర్ణుని గృహమునకును, దంష్ట్రునిగృహమునకును, రోమశుండను రాక్షసునిగృహమునకును, యుద్ధోన్మత్తునిగృహమునకును, మత్తుఁడనువాని గృహమునకునును, ధ్వజగ్రీవునిగృహమునకును, ఆదియనువానిగృహమునకును, విద్యుజ్జిహ్వునియింటికిని, ఇంద్రజిహ్వుని గృహమునకును, హస్తిముఖుని గృహమునకును, కరాళునియింటికిని, భయంకరుఁడగు పిశాచునిగృహమునకును, శోణితాక్షుఁడను వానియింటికిని, యిట్లుక్రమక్రమముగ సకలరాక్షసులయిండ్లకునుబోయి, ఆయాగృహములందు మహాభాగ్యసంపన్నులైన యారాక్షసులయొక్క అయిశ్వర్యమును, మిగుల కీర్తిమంతుఁడును వానరోత్తముఁడును వాయుపుత్రుఁడును నగు నాంజనేయుఁడుజూచె.

ఇట్లు మిగుల సంపద్యుక్తుఁడగు నయ్యాంజనేయుఁడు లంకానగరమునందు రాక్షసుల గృహముల నన్నిటిని వెదకి యందెచ్చటను సీతాదేవిని గానక రాక్షసేశ్వరుఁడగు రావణాసురుని యింటికిఁబోయె. ఇట్లు వానరోత్తముఁడగు నాంజనేయుఁడు సీతను వెదకుటకొఱకు సంచరించుచు, శూలము యినుపగుదియ మొదలుగాగల నాయుధముల నుధరించియుండువారును, శక్తియను నాయుధమును, తోమరమను నాయుధమును ధరించియుండువారును నై రావణునిసమీపమునందు నిద్రించుచున్న వికారస్వరూపులగు రాక్షసస్త్రీల ననేకులనుజూచె. అట్లా రాక్షసేశ్వరుఁడైన రావణాసురుని యింటియందు నానావిధములగు సైన్యములను, పలుదెరఁగులగు నాయుధములను మీదికెత్తిపట్టుకొనియుండెడు గొప్పదేహముగల రాక్షసులనుయాంజనేయుఁడుజూచె. మఱియు నారావణాసురునిగృహమునందు, కట్టివేయఁబడి యుండునవియును; అతివేగముగలవియును నగు నెఱ్ఱగుఱ్ఱములను; తెల్లగుఱ్ఱములను; మంచి కులమునందు బుట్టినవియును, మంగళకరమగు రూపములతోగూడినవియును; శత్రువులయొక్క యేనుఁగులను సంహరించునవియును; గజశిక్షయందు తేరినవియును; యుద్ధమునందు యింద్రుని యేనుఁగైన నైరావతమునకుసరివచ్చునవియును; శత్రుసైన్యములను సంహరించునవియును, గొప్పదేహముగలవియై మదజలమునువిడుచుచు "వర్షించుచున్న మేఘమువలె" నున్నవియును; అత్యున్నతములైన శరీరములుగలవియై మదజలములతోగూడి "సెలయేళ్ళతోగూడుకొనియున్న గొప్పపర్వతములవలె" నున్నవియును; మేఘములతో సరివచ్చునట్లు గర్జించుచున్నవియును; యుద్ధమునందెదిరించుటకు శత్రువుల కలవిగానివియును; నగు నేనుఁగులను ఆంజనేయుఁడుజూచె. ఇంకనుననేకాభరణములను పదియారువన్నె బంగారముతోఁజేయబడినవియును, నవరత్నములతోఁ బొదఁగఁబడినవియును; బాలసూర్యునివలెఁ బ్రకాశించుచున్నవియును నగు నాభరణములు ధరించుకొనియుండు కాల్బలముల ననేకములనుజూచె. మఱియు వానరోత్తముఁడగు నయ్యాంజనేయుఁడు; రాక్షసేశ్వరుఁడగు రావణుని గృహమునందు సంచరించుచు; నానావిధములగు రూపములుగలపాలకీలను; పలుదెఱఁగులును విచిత్రములునైన తీఁగెటిండ్లను, చిత్రశాలలను; మఱియు నితరములగు క్రీడాగృహములను వేడుకార్థముగ మానితో నిర్మింపఁబడిన పర్వతములను; సుందరములగు సంభోగగృహములను; పగటివేళలయందు వినోదముగనుండుటకుఁ దగినయిండ్లను; చూచె. ఆ రావణునియింటియందుత్తమమైనదియును; మందరపర్వతముతో సమానమైనదియును; నెమళ్ళు నివసించుటకేర్పఱుపఁబడిన స్థానములతో క్రిక్కిరిసినట్లున్నదియును; ఎచ్చటఁజూచినను టెక్కెములతో నిండియున్నదియును; నానావిధములగు రత్నములతో నలంకరింపఁబడినదియును, ఎచ్చటజూచినను నవనిధులతోనిండియున్నదియును; మిగుల ధైర్యమునవలంబించి మహానిష్ఠతో నాచరించిన తపస్సుయొక్క ఫలమనియెన్నదగినదియును; భూతనాథుండగు పరమశివుని గృహమునకు సరివచ్చునదియునునగు గృహమునుజూచె. అట్టియొకనాయుత్తమగృహము; తలుపులు

మొదలగు వాటియందు చెక్కఁబడియుండు రత్నములయొక్క కాంతులతోను, రావణుని తేజంబను కాంతితోనుఁ గూడినదియై "కిరణములచే బ్రకాశించెడు సూర్యునివలె" జూపట్టుచుండె. ఆయుత్తమగృహమునందున్న పాన్పులును, పీఠములును, శ్రేష్ఠములగు పాత్రలు మొదలగు సమస్తవస్తువులును శ్రేష్ఠమైనబంగారముతోఁ జేయఁబడియుండుటను వానరోత్తముఁడగు నాంజనేయుఁడుజూచె. మఱియు తేనెతోఁ చేయఁబడిన సారాయముతోఁ దడుపఁబడినదియును, రత్నములచే బొదగంబడిన పాత్రములతోఁ గ్రిక్కిరిసినట్లున్నదియును, మనోహరమైనదియును, మిగులవిశాలమైయిరకటములేకఁ "గుబేరభవనమువలె"నున్నదియును, అందెలధ్వనులచేతను మొలనూళ్ళధ్వనులచేతను, ప్రతిధ్వనించుచు గొప్పరొదగలిగి యున్నదియును, మద్దెలమొదలుగాగల వాద్యధ్వనులచేఁ బ్రతిధ్వనింపఁ జేయఁబడినదియును, అనేకమేడలతోఁగూడినదియును, లెక్కపెట్టరానిమహాసౌందర్యముగల స్త్రీలతోనిండి యుండునదియును, మిగులవిశాలములైన తొట్టికట్టుఁగలదియునునైన నా రావణునిగృహమును నాంజనేయుఁడుజూచె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ఆరవసర్గ ముగిసెను.

—(*)—

ఆంజనేయుండులంకాపట్టణముయొక్కశృంగారమునుజూచిఆశ్చర్యమునొందుట

మిగులబలపరాక్రమశాలియగు నయ్యాంజనేయుఁడు, ఆలంకానగరమునందు స్వర్ణమయంబై వైడూర్యపుమణులచేఁబొదగఁబడిన కిటికీలుగలదియును, సమస్తములగు పక్షులచే చిత్రింపఁబడిన కిటికీలుగలదియునునై, వర్షాకాలమునందు మెరుపుతీగెలచేవ్యాపింపఁబడి నానావిధములగు పక్షులసమూహములచే సేవింపఁబడిన మేఘములయొక్క వరుసలవలెనున్న గృహసమూహములనుజూచె. ఆగృహసమూహములయందు, పలువిధములగు గొప్పశాలాప్రదేశములను (అనగాకూటపుటిండ్లను) పలువిధములగు తొట్టికట్లను, శ్రేష్ఠములగుశంఖాయుధములను, ధనుస్సులనుమఱియు ననేకములగు నితరాయుధములనుంచెడు శాలాగృహములను, పర్వతములవలెనత్యున్నతములగు గృహములయందుండు చంద్రశాలలనుజూచె మఱియు, రావణాసురుడుతనబలముచే సంపాదించినవియును, సమస్తములగు మణులచేఁ బ్రకాశించుచున్నవియును, దేవదానవులచేతనుగూడఁ బూజింపఁబడినవియును, సమస్తదోషములకును దూరమైనవియుననగు నాగృహముల నాంజనేయుఁడుజూచె. ఆగృహములుమహాప్రయత్నమువలనవిశ్వకర్మచే నిర్మింపఁబడినవయ్యును, దేవశిల్పియగు మయుఁడుతానునే భూలోకమునకువచ్చి నిర్మించెనేమోయనునట్లు గాన్పించుచుండె. మఱియుసమస్తములగు సుగుణసంపత్తిచే నొప్పుచుండె. అట్టిగృహములనన్నిఁటినిజూచి యనంతరము, మిగులనున్నతమై మేఘమువలె ప్రకాశించుచున్నదియును, బంగారముచేఁ జేయఁబడి మిగులసుందరమైనదియును, సరిలేనిసౌందర్యముగలదియును, ఆరావణుని బలమునకనుగుణమైనదియుననగు రావణాసురుని యుత్తమగృహరూపమగు పుష్పకవిమానమునున్నుజూచె. అదియును, దైవయోగమునఁజారిభూతలమునఁబడి కాంత్యతిశయముచేఁ బ్రకాశించుచున్నదియును, సమస్తములగు దివ్యమణులచేఁ బొదగఁబడినదియును, చక్కఁగాఁబూచియుండెడు నానావిధములగువృక్షములచే నలంకృతమైపుష్పములచేత గప్పఁబడినపర్వతశిఖరమువలెనున్నదియును, మిగులసౌందర్యవతులగునుత్తమస్త్రీలచే వ్యాపింపఁబడినదియై మెఱుపుతీగెలచేఁ బ్రకాశించెడు మేఘమువలెనున్నదియును, ఎల్లరులచేఁ బూజింపఁబడినదియును, హంసలచే మోయఁబడుచున్నదానివలెనున్నదియును, మిగుల సంపద్యుక్తమై పుణ్యవశముచేనాకాశమార్గమునందు సంచరించెడు దేవతలుమొదలగువారలయొక్కవిమానమువలెనున్నదియును, పలువిధములైనమణులచేఁబొదగఁబడి నానావిధములగు వర్ణములుగలదియగుచు గైరికాదిధాతువులచే నలంకృతంబైన పర్వతశిఖరమువలెనున్నదియును, శుక్రుడుమొదలగు గ్రహములచేతనుచంద్రునిచేతను చిత్రితంబైయాకాశమువలెనున్నదియును, ఇంద్రధనస్సుతోగూడుకొని నానావర్ణములుగల మేఘమువలెనున్నదియుననగు విమానోత్తమునుఆంజనేయుఁడుజూచె. అట్లుజూచి యావిమానమునందు, భూమిసమస్తపర్వతములతో గూడుకొనియుండునట్లుగా నిర్మింపఁబడియుండె. ఆపర్వతములు సమస్తములగు వృక్షములతో గూడుకొని యుండునట్లుగాఁ జిత్రింపఁబడి యుండె. ఆవృక్షములు నానావిధములగు పుష్పములతో నిండియుండునట్లుఁ జేయఁబడియుండె. ఆపుష్పము కింజల్కములతోను ఱేకులతోను నిండియుండునట్లుగా రచియింపఁబడియుండె. ఆవిమానమునందు తెల్లనిగృహములు చిత్తరువుననిర్మింపఁబడియుండె. ప్రాచినతామరలచే నిండియుండెడునోనేరులు అందుచిత్రింపఁబడియుండినవి. కింజల్కములతోగూడిన తామరపుష్పములచ్చటచ్చటను వేర్వేఱుగ నిర్మింపఁబడినవి. ఇంకనునానావిధములైన శ్రేష్ఠములగు వనంబులుచిత్రింపఁబడియుండె ఆవిమానము, సమస్తములైన

మణులకాంతులచే బ్రకాశించుచున్నదియును, ఎందఱు గూర్చుండినను నింకొకనికిస్థలముండునట్లు వృద్ధిబొందునదియును, మిగుల మెత్తైనగృహములకంటె నున్నతమైనదియును, పుష్పకమనుపేరుగలదియునునగు గొప్పవిమానమును నాంజనేయుఁడుజూచె. ఇదియునుఁగాక నాపుష్పకవిమానమునందు, వైడూర్యపుమణులచేఁ బక్షులునిర్మింపబడియుండె. వెండితోను పవడములతోనుజేయఁబడినపక్షులువిశేషముగనుండె. నానావిధములగుమణులతోనిర్మింపఁబడిపలువిధములగు రంగులుగలసర్పములుండె. జాత్యానుగుణమైన శుభలక్షణములతోగూడిన యవయవములుగల గుఱ్ఱములునిర్మింపఁబడియుండె. మఱియు నావిమానమునందు మంచిముఖములతోను ఱెక్కలతోను గూడుకొనియుండునట్లు కనకనిర్మితఁబులైనవియును, ఆఱెక్కలయందచ్చటచ్చటను పవడముతోఁజేయఁబడిన పుష్పములు గలవియును, ఆఱెక్కలను మిగులవిలాసముగనుంచునట్లు కొంతవంచుకొని యప్పుడెమెగుఁబోవు వానివలెనున్నవియును, నవరత్నములచేఁ జెక్కఁబడినవియునునైనపక్షులందునిర్మింపఁబడినవై, మన్మథునికిప్రత్యక్షమగు సహాయముజేయుచున్నవోయనునట్లు బ్రకాశించుచుండె. ఆవిమానమునందు నిర్మింపఁబడిన సరస్సునందు స్వేచ్ఛావిహారముజేయుచున్నవియును, మంచితొండములు గలవియును, నాతొండములయందు కలువఱేకులునుకింజల్కములును జిక్కికొనియుండుటచే మిగులఁబ్రకాశించుచున్నవియునునగు నేనుఁగులునిర్మింపఁబడియుండె. ఆదేరీతిగ మంచిహస్తములుగలదియును, తామరపుష్పములు చేతులయందుగలదియునునగు లక్ష్మీదేవినిర్మింపఁబడియుండె. ఇట్లుమిగులమంగళకరంబైనదియును, మనోజ్ఞమైనదియునునైమంగళకరంబగు పర్వతోత్తమువలెనున్న నయ్యుత్తమగృహమునందంతటనుసంచరించి, మిగులనాశ్చర్యమునొందినవాడగుచు, మఱల, మిగులమంచివాసనతో గూడుకొన్నదియై, వసంతఋతువునందు లెస్సగబూచియుండువృక్షములుగలిగి మనోజ్ఞములగు గుహలతో నిండియుండెడు పర్వతమువలెనున్న యాయుత్తమ గృహమునందంతటను తిరిగితుదమొదులుగనలేక ఆంజనేయుఁడు మిగులనాశ్చర్యమును బొందె. ఇట్లాంజనేయుఁడత్యాశ్చర్యమునొంది,మిగులపూజనీయమైనదియును, రావణాసురునియొక్క భుజబలముచేఁ గాపాడఁబడినదియును, నగులంకానగరమును బ్రవేశించి యందంతటనుసంచరించుచు, మిగులపూజ్యురాలును, పెనిమిటియొక్క గుణాతిశయములనే స్మరింపుచునతనియందు లీనమైనమనస్సుగలదియును, రాజపుత్రియునునగు నాసీతాదేవిగనఁబడనందున మిగులవ్యసనమునొందె. మఱియుననేకవిధములుగనాలోచించి గొప్ప యత్నముఁజేసినవాఁడును, మంచినీతిమార్గముగలవాఁడును, దూరమునయున్నసూక్ష్మపదార్థములనైనను జూచుటకు శక్తిగలవాఁడునునగు నయ్యాంజనేయుఁడతిధైర్యము నవలంబించి లంకానగరమంతయనుదిరిగి సీతాదేవినిగానక మిగులచింతాక్రాంతుఁడయ్యె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేడవసర్గము ముగిసెను.

ఆంజనేయుడు రావణాసురునిగృహమునందు విమానమునుజూచుట.

మహాపరాక్రమశాలియును వాయుపుత్రుఁడును నరోత్తముఁడునునగునయ్యాంజనేయుఁడట్లుచింతాక్రాంతుడైయాలోచించుచు, నాయుత్తమగృహముయొక్క మధ్యమందున్నదియును, వజ్రములుమొదలగునమస్తమణులతోచిత్రవర్ణములుగలదిగజేయఁబడినదియును, పుటముదీరినబంగారముతోజేయఁబడిన చిత్రపుపనులుగలదియునుమిగులయున్నతమైనదియును, నగు నావిమానోత్తమును జూచె ఆవిమానముమిగులఅప్రమేయమైనదియును, సాటిలేనిరూపముగలదియును, విశ్వకర్మచే నిర్మింపఁబడినదియును, ఆవిశ్వకర్మచేతినే మిగులఁ గొనియాడఁబడినదియును, ఆకాశమార్గమునందు సంచరించునదియును, స్వర్గమునందున్నదియునునై "సూర్యునిమార్గమున కిడిచిహ్నమోయనునట్లు" ప్రకాశించుచుండె. ఆవిమానమునందు నిర్మింపఁబడిన విశేషములన్నియు మహాప్రయత్నముచేత నేయఁబడినవి. దానియందుమిగులశ్రేష్ఠములగు మణులతోఁజెక్కఁబడని ప్రదేశముకొంచమైనను లేదు. అందుగలవిశేషములు దేవతలయిండ్లయందునుగూడలేవు. ఆవిమానమునందలి విశేషములలో నొక్కటైననుజూచువారికాశ్చర్యమునుఆనందమునుబుట్టింపకపోదు. అదిమిగులగొప్పతపస్సుచేతను పరాక్రమముచేతను సంపాదింపఁబడినదియును, ఆవిమానముపై గూర్చుండువారెచటికిఁబోవలయునని మనస్సునందు దలంతురోతత్క్షణమేయాస్థలమునకు బోవునదియును, విమానగోపురములుమొదలగు ననేకసంస్థానభేదములచే నిర్మింపఁబడినదియును, దానినిజూచువారలకుఆవిమానమునందు ఏభాగమునుజూచినను సమానముగనాశ్చర్యమును, నుత్సాహమునుబుట్టించునట్లన్నిస్థలములయందును సమముగానిర్మింపఁబడినదియునునై యుండె. మఱియుం తనయజమానునివ్యాదయమునందలి యభి

పాత్రియమును కనుగొనినంతనే యతివేగముగఁ బోవునదియును, ఎట్టివారికిని నడ్డగింపఁగూడనిదైవాయు వేగమువంటి వేగముతో సంచరించునదియును, మిగుల మాహాత్మ్యము గలవారును, పుణ్యముఁ జేయువారును, మిగుల సంపదగలవారును, మహాకీర్తిమంతులును, అత్యానందము గలవారు నగు నింద్రుడు మొదలగువారలకు నివాసస్థానమగు స్వర్గమువలెనున్నదియు నగు పుష్పకవిమానమును యాంజనేయుఁడు జూచె. మఱియు శ్రేష్ఠములగు రత్నములు మొదలగు వస్తుసమూహములచే చక్కఁగ నిర్మింపఁబడినదియును, నానావిధములగు ననేకశిఖరములచే నలంకరింపఁబడినదియును, మనస్సు నురంజింపఁ జేయునదియును, శరత్కాలమునందలి చంద్రబింబమువలె స్వచ్ఛమై తెల్లనైనదియును నైన నానావిధములగు నవాంతరములు గలిగి అతిచిత్రములుగ నుండెడు శిఖరములతో నొప్పుచుండెడు గొప్ప పర్వతమువలెనున్నదియునై యా పుష్పకవిమానము ప్రకాశించుచుండె.

ఆ విమానము, కుండలములచే నలంకరింపఁబడి గొప్ప ముఖములును, మిగుల గొప్ప దేహములును గలిగి, ఆకాశమునందు సంచరించెడి రాక్షసులయొక్క స్వరూపమువంటి యనేక వేల ప్రతిమలును, గుండ్రములును వంకరలును విశాలములును నగు నేత్రములు గలిగి, మిగుల వేగముగల భూతగణములయొక్క యనేక వేల ప్రతిమలును యా విమానమును మోసికొనియున్నట్లు గాన్పించుచుండె. మఱియు, వసంతఋతువునందు పూచెడి సమస్తపుష్పములచే నొప్పు మనోహరమగు చూపుగలదియును, వసంతఋతువుకన్నను మనోహరముగనున్నదియును, విమానములలో నెల్ల నుత్తమమైనదియును నై యొప్పుచున్న యా పుష్పకవిమానమును యాంజనేయుడు జూచె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యెనిమిదవసర్గ ముగసెను

(*)

ఆంజనేయుడు పుష్పకవిమానముమీద నెక్కి సీతాదేవిని వెదకుట.

ఇట్లు వాయుపుత్రుఁడగు నాంజనేయుఁడు, రావణాసురునియొక్క యుత్తమగృహమధ్యమున నొప్పుచున్న యత్యున్నతమగు గృహమువలెనున్న యా యుత్తమవిమానమును జూచె. ఆవిమానమునందు రాక్షసేశ్వరుఁడైన రావణాసురునియొక్క గృహము అనేక మేడల సమూహములతోఁ గిక్కిరిసినట్లున్నదియై అరామడ నిడివియును, అమడ వెడల్పును, గలదియైయుండ. అంత శత్రుమర్దనుఁడగు హనుమంతుఁడు విశాలములగు నేత్రములు గలదియును విదేహదేశపు రాజకుమార్తెయునగు సీతాదేవిని వెదకుచు నా గృహమునందంతటను సంచరింప నారంభించె. ఇట్లు సీతను వెదకుచు, రాక్షసుల గృహములలో నుత్తమమైనదియును, రాక్షసులకు నివాసస్థానమైనదియును, నాలుగుదంతములుగల యేనుఁగులచేతను మూడుదంతములుగల యేనుఁగులచేతను, రెండుదంతములుగల యేనుఁగులచేతను బరివేష్టింపఁబడినదియును, ఇలకటము లేనిదియును, ఎల్లప్పుడును ఆయుధములను పైకెత్తికొని సిద్ధముగనుండెడు నాయుధధారులచే లెస్సగ రక్షింపఁబడుచున్నదియును, నగు రాక్షసేశ్వరుని గృహమునందు బ్రవేశించె.

అట్లు ప్రవేశించి, రావణాసురుని భార్యలచేతను, రావణుఁడు పరాక్రమముచేతఁ గొనివచ్చిన రాజకన్యకలచేతను నిండింపఁబడినదియై "మొసళ్ళచేతను తిమింగలములను చేపలచేతను నితరములగు చేపలచేతను నొప్పుచును గాలివేగముచే నెగరగొట్టఁబడిన సర్పములచే నిండియున్న సముద్రమువలె" ప్రకాశించుచున్న యా రావణాసురునియొక్క యంతఃపురమునందు అంజనేయుఁడు సంచరింపదొడంగె. ఆ యంతఃపురమునందు, కుబేరుని గృహమునందే సంపదగలదో యా సంపదయును, ఇంద్రుని యింటియందే సంపదగలదో యా సంపదయును, యేకముగఁ గూడినదై తరుగక శాశ్వతమై రావణాసురునిఁ బొందియుండె. మఱియు, కుబేరునకును యింద్రునకును వరుణునకును యమునికిని యే సంపదగలదో యట్టిదానికంటె నధికమైన సంపద యా లంకానగరవాసులగు రాక్షసుల యిండ్లయందు గలిగియుండె. ఇదియునుగాక నా రావణాసురుని యుత్తమగృహమధ్యమునందు, పూర్వము బ్రహ్మదేవునకొఱకు విశ్వకర్మచే స్వర్గమునందు నిర్మింపఁబడినదియును, మిగుల శ్రేష్ఠములగు సమస్తరత్నములచే చెక్కఁబడి లెస్సగ బ్రకాశించుచున్నదియును, కుబేరుఁడు మిగుల గొప్పతపస్సు జేసి బ్రహ్మదేవునివలన బొందినదియును, మిక్కిలి చక్కఁగా నిర్మింపఁబడినదియును, అనేకములగు మదపుటేనుఁగులతోఁ గూడుకున్నదియును, పుష్పకమను పేరుగలదియును, ఆయింటినడుమ, మఱియొక గృహశ్రేష్ఠమువలె నున్నదియును నగు విమానమును యాంజనేయుఁడు జూచె. మఱియు నా విమానము, తోడేళ్ళ ప్రతిమలతో నలంకరింపఁబడి వెండితోను బంగారుముతోను లెస్సగా జేయఁబడిన స్తంభములతోఁ బ్రకాశించుచున్నదియును, కాంతిచేఁ బ్రకాశించుచు మేరుమందరపర్వతములవలె నత్యున్నతంబై యాకాశము నొరయుచున్న దానివలె నున్నదియును, మంగళకరములగు నాకార

ములుగల కూటపుటిండ్లచేనంతటను లెస్సగానిర్మింపఁబడి
నదియునునై యొప్పుచుండె. అపుష్పకవిమానమును రావ
ణాసురుఁడు మిగులపరాక్రమముచే కుబేరునిజయించి వా
నివద్దనుండితీసికొనియె. మఱియుసూర్యాగ్నులతో సమా
నమైనదియును, విశ్వకర్మచేత మిక్కిలిచక్కగానిర్మింపఁ
బడినదియును, బంగారుపడికట్లచేఁ బ్రకాశించుచున్నది
యును, మనోహరములగు శ్రేష్ఠములైన తిన్నెలుగలదియు
ను, బంగారముతోను స్ఫటికములతోను జేయ బడినకిటి
కిలతోనొప్పుచున్నదియును, ఇంద్రనీలపురాళ్ళతోను మహా
నీలపురాళ్ళతోను గట్టఁబడినతిన్నెలుగలదియును, పగడము
లచేతను వెలలేనిముత్యములచేతను నలంకరింపఁబడిన తల
ప్రదేశములచేత బ్రకాశింపఁజేయఁబడినదియును, మిగుల
శ్రేష్ఠములగు వాసనలతోఁగూడిన రక్తగంధపుపూతగలది
యును, మిగులమెట్టనైన బాలసూర్యునితో సమానమైన
దియును, మహోన్నతాకారములుగలవై నానావిధముల
గుకూటపుటిండ్లతో నొప్పుచు మిగుల నలంకృతమైనదియు
ను, స్వర్గమునందుబుట్టినదియును నగునాపుష్పకవిమాన
మునుఆంజనేయుఁడు యెక్కి.ఆవిమానముమీద నెక్కియుం
డుగూర్చున్నవాఁడై, అంతటనువ్యాపించి రూపముతోగూ
డుకొనిన వాయుదేవునివలెనుండి, మద్యము పిండివం
టలుఅన్నము మొదలగువానియొక్క సువాసనను ఆంజనే
యుం డాఘ్రాణించుచుండె. (అనగామద్యము పిండివంట
లవాసనవిశేషముగనుండె) ఆవాసన, "బంధువుఁడుబంధు
వునుంబోలె" ఆంజనేయుని రావణాసురుఁడున్న స్థలము
నకు రమ్మనిపిలుచుచున్నట్లు గాన్పించుచుండె (అనగా
నాంజనేయుఁడు యిట్టిసువాసనగలచోటనే రావణాసు
రుడుండుననినిశ్చయించె) అంతటనాంజనేయుం డచ్చటి
నుండిబైలుదేరి, మిగులగొప్పదియును, మంగళకరమైనది
యును, రావణాసురునకత్యంత ప్రియభార్యవలెనున్నది
యును, నవరత్నములచేనిర్మింపఁబడిన పడికట్లుగలదియు
ను, బంగారుచే జేయఁబడిన కిటికీలచేనలంకరింపఁబడినది
యును, స్ఫటికములచేఁ జేయఁబడిన భూప్రదేశములుగ
లిగి నడుమనడుమదంతములచేఁ బొదగఁబడి నలంకృతమై
నదియును, ముత్యములతోను పవడములతోను వెండితోను
బంగారముతోనుజేయంబడిన స్తంభములతోను, మణులతో
జేయంబడిన స్తంభములతోను నలంకృతంబైనదియును,
కొంచెమువంగినవియై మిగులవంకరలుగాక యత్యున్నత
ములగుచు నంతటనులెస్సగా నలంకరింపఁబడినవై అత్యు
న్నములగు ఱెక్కలవలెనున్న స్తంభములతోగూడుకొన్న
దై స్వర్గమున కెగిరిపోవుచున్న దానివలెనున్నదియును,
అరణ్యములు పర్వతములు నదులు సముద్రములు మొదల
గునవిగల భూలక్షణముచే నలంకృతంబైయున్న రత్నకం
బళముతోగప్పఁబడినభూప్రదేశముగలదియై దేశములతో
ను పట్టణములతోను గృహములతోనుఁ గూడియుండు
విశాలమగు భూమివలెనుండు తలప్రదేశము గలదియును,
మదించియుండు పక్షులయొక్క ధ్వనులచేత బ్రతిధ్వనింపఁ
జేయఁబడినదియును, శ్రేష్ఠములగు సువాసనలచేనొప్పు
చున్నదియును, శ్రేష్ఠములగురత్నకంబళములతోఁ బరు
పఁబడినదియును, అగరుగంధముయొక్క ధూపముచేత
ధూమ్రవర్ణముగలదియును, హంసపక్షివలె తెల్లనైనది
యును, ఫూలుజల్లుటచే నానావర్ణములుగలదియై కామ
ధేనువువలెనున్నదియును, శ్రేష్ఠమైనకాంతిగలదియును మ
నస్సునకు సంతసముగలుగఁజేయునదియును, చూచువార
లదేహకాంతులను హెచ్చించి వ్యసనమును బోగొట్టునది
యును, లక్ష్మికిఁబుట్టిన నిల్లువలెనున్నదియును నగురావ
ణుండున్న శాలాగృహమును బ్రవేశించె. అట్టియెడనారా
వణుఁడున్న యాయుత్తమగృహము "తల్లివలె" నాంజ
నేయునియొక్క త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములనెడి
పంచేంద్రియములను, శబ్దస్పర్శరూప రసగంధములనునీ
దైదువిషయములచేతదృప్తినొందించె. రావణాసురుండుం
డుస్థానమునుజూచి యాంజనేయుఁడుతనమనస్సులోనిట్లని
చింతించె.

ఇదిస్వర్గమా? లేకనాస్వర్గమునందు దేవతలునివసించె
డుస్థానమో? అదిగాదేని స్వర్గలోకరాజగు నింద్రుండుం
డెడిరాజధానియగు నమరావతీపట్టణమో? అదిగాకున్న
నిదిబ్రహ్మలోకమో, యనితలచె మఱియునాగృహము
నందు, స్వర్ణవికారములైనవియును, కదులుచున్నవియు
నునై ధ్యానముఁజేయువాటవలె నున్నవియును, మిగుల
చాతుర్యముగల గొప్పజూదరులచే జూదమునపరాజయ
మునొందనజూదరులవలెనున్నవియునునగుదీపములనాంజ
నేయుండుజూచె.అప్పుడాదీపములయొక్కప్రకాశముచేతను,
రావణునియొక్క తేజస్సుచేతను, నారావణుడుధరించి
యుండెడు నాభరణములయొక్క కాంతులచేతనునాశా
లాగృహము మండుచున్నదేమోయని యాంజనేయుఁడు
తలంచె. అట్లుతలంచుచునచ్చట, నానావిధములగురంగు
లుగలవస్త్రములను పుష్పమాలికలనుధరించి యనేకవిధ
ములుగనలంకరించుకొని రత్నకంబళిపై పరుండియుండిన
యుత్తమస్త్రీలననేకమందిని యాంజనేయుఁడుజూచె. ఆ
స్త్రీలందరు రాత్రియందు నానావిధములుగ క్రీడించి యల
సటనొంది, యర్ధరాత్రమతిక్రమింపగానే మద్యపానము

త్తత చేతను నిద్రమత్తత చేతను మైమరచినవారై బలవంతముగ నిదురఁజెందిరి. అట్లు నిశ్శబ్దముగా నిదురించుట చేత నిశ్శబ్దములగు మొలనూళ్లు మొదలగు భూషణముల తోనొప్పుచుండెడు నాస్త్రీసమూహము "నిశ్శబ్దముగానుండి నిదురించుచుండెడు హంసముల తోను భ్రమరముల తోను గూడియుండు పద్మవనమువలె" యొప్పుచుండె అట్టియెడ నాస్త్రీలు, తమయొక్క నేత్రములను మూసికొని పండ్లుగానరాకుండ పెదవులను మూసికొని కమలములవలె సువాసనగల ముఖపద్మముల తోఁ బ్రకాశించుచుండుటను ఆంజనేయుఁడు జూచె. అట్లుజూచి మఱల నిట్లని తలచె.

ఈస్త్రీలయొక్క ముఖములు, సూర్యోదయను మొదలు వికసించియుండి సూర్యాస్తమయము కాగానే మఱల ముకుళించిన తామరకమలములవలె నున్నవని దలచె ఈస్త్రీలయొక్క ముఖ పద్మములను, పూచియుండెడు తామరలని యెంచి మదించినతుమ్మెదలు మాటిమాటికి నిశ్చయముగా వీరిముఖముల నాస్వాదించుచుండుననుటకు సందేహము లేదని నాంజనేయుడు దలంచె అట్లెంచుటకు వారిముఖములయందు కమలములకువలె సుగంధాది గుణములు గలిగి యుండుటచే కమలములతో సమానములని యెంచె అట్టి యుత్తమస్త్రీలచే బ్రకాశించెడు నారావణునియొక్క శాలాగృహము నక్షత్రములతో గూడుకొని ప్రకాశించెడు శరత్కాలమునందలి యాకాశమువలె బ్రకాశించుచుండె. అట్టియెడ రావణాసురుడు, నక్షత్రములతో సరిబోలుచున్న యాయుత్తమస్త్రీల నడుమనున్నవాడై నక్షత్రములచే నావరింపబడిన చంద్రునివలె బ్రకాశించుచుండె అట్లు నక్షత్రములవలె బ్రకాశించుచుండెడు నాస్త్రీలనుజూచి యాంజనేయుడు, అనుభవింపగా మిగిలినపుణ్యముతోగూడి యాకాశమునుండి నేలబడిన నక్షత్రములన్నియును జేరి యిట్లీస్త్రీరూపములను దాల్చినవేమో? లేకున్న నిట్టిసౌందర్యం బెచ్చటనైన గలదా' యనియాంజనేయుడు దలంచె. అట్టియెడ నాస్త్రీలయొక్క కాంతియును, రంగును, నిర్మలత్వమును, "మిగుల పెద్దవియును మంగళకరములైనవియును కాంతియుతములైనవియును నగునక్షత్రములయొక్క కాంతియును రంగును నిర్మలత్వమునువలె" ప్రకాశించుచుండె. ఆస్త్రీలు, చక్కగ మద్యపానముజేసి రతిజేయుకాలమునందు నిద్రమత్తతచే స్థలము దప్పియుండెడు గొప్పపూదండలును, యాభరణములును గలవారైయొప్పుచుండిరి. మఱియు, కొందఱుస్త్రీలకు నొసటిబొట్టు కలిసిపోయె, కొందఱుస్త్రీలు స్థానముదప్పిన యందెలుగలవారై యుండిరి. కొందఱుస్త్రీలకు కంఠమునందుండిన హారములుస్థానముదప్పజారిపోయె. కొందఱుస్త్రీలు తెగిపోయినముత్యాలహారములచే జట్టబడినవారైయుండిరి. కొందఱుస్త్రీలుజారిపోయిన వస్త్రములు గలవారై యుండిరి. కొందఱుస్త్రీలు తెగినమొలనూళ్లు గలవారై "శ్రమదీర్చుకొనుటకు నేలంబడిపొరలుచున్న యాడుగుఱ్ఱములవలె" గాన్పించుచుండిరి మంచికుండలములను ధరించియున్న కొందరుస్త్రీలు, భిన్నాభిన్నములుగ తెగిపడియుండెడు పూదండలుగలవారై, "మహారణ్యమునందు మదించినగజముచే నలగద్రొక్కబడి లెస్సగా బూచియుండెడు తీగలవలె" గాన్పించిరి. కొందఱుస్త్రీలు ధరించియుండెడు ముత్యాలహారములు, చంద్రకిరణముల కాంతివంటి కాంతిగలవియును, మిగుల పెద్దవియునునై, "స్త్రీలయొక్క స్తనమధ్యమున నిద్రించెడు హంసములవలె" మిగుల తెల్లగ బ్రకాశించుచుండె కొందఱుస్త్రీలు ధరించియుండిన వైడూర్యపు మణులయొక్క హారములు కాదంబములను హంసముల (ధూమ్రవర్ణములగు ముక్కులు కాళ్లును ఱెక్కలును గలవియనుట) వలెబ్రకాశించుచుండె. కొందఱుధరించియుండిన సువర్ణసూత్రములు, "స్తనమధ్యమునందు పండుకొనియున్న చక్రవాకమువలె" నుండె. ఆస్త్రీలు, విశాలములగు జఘనములతో నొప్పుచు "చక్రవాకముల చేతను హంసల చేతను కన్నెలేడిపిట్టల చేతను నావరింపబడిన యిసుకదిన్నెలుగల నదులవలె" బ్రకాశించుచుండిరి. మఱియు నిద్రించుచుండెడు నాస్త్రీలు, వారుధరించియుండెడు నాభరణములయందలి గజ్జలే తామరమొగ్గలుగను, కనకాభరణములే పూచిన తామరలుగను, శృంగారచేష్టలే మొసళ్లుగను, దేహకాంతులే తీరములుగనునొప్పుచు గొప్పనదులవలెనే బ్రకాశించుచుండిరి. కొందఱుస్త్రీలు, తమయొక్క సుకుమారములగు శరీరములయందును, స్తనాగ్రములయందును ధరించియున్న యాభరణములను నిద్రించబోవునపుడు తీసియుంచిరి. అట్లాస్త్రీలు ధరించియుండిన యాభరణములయొక్క శరీరమునందలి గీరలుస్వచ్ఛమైనయాభరణములవలెనే బ్రకాశించుచుండె. మఱికొందఱుస్త్రీలు నిద్రించునపుడు విడుచుచుండిన నిట్టూర్పుల యొక్క గాలిచే గదిలింపబడిన పైట చెరుగులకొనలు, వారలముఖములపై పలుమారుకొట్టుచుండినవి. అట్లు నానావిధములగు దేహకాంతులతో నొప్పుచుండెడు ముఖములుగల యాస్త్రీలయొక్క నిట్టూర్పు గాలిచే గదిలింపబడిన యావస్త్రములయొక్క కొనలు, గాలిచే నెగురగొట్టబడిన టెక్కెములవలె బ్రకాశించుచుండె. మఱియు నాస్త్రీలుధరించియుండెడు కాంతిసంపన్నములగు కుండలములు, వారియొక్క నిట్టూర్పు గాలిచేత మెల్లమెల్లగా కదలుచుండినవి. అప్పుడు, స్వభావముచే మంచివాసన గలట

యును, చక్కెరతో జేయబడిన మద్యమువల్లనైనసువాసన గలదియును, సుఖమునిచ్చునదియును, ఆస్త్రీలయొక్క నిట్టూర్పులవలన గలిగినదియునునగు నాతిన్ననిగాలి రావణుని సేవించుచున్నట్లుండె. ఆసమయమున రావణాసురునిభార్యలలో గొందఱు, మద్యముయొక్క మదమువలనశరీరము దెలియనివారై, తమసవతులముఖములను "రావణాసురునిముఖములను భ్రమచే" బలుమారుమూర్కొనుచుండిరి. అట్లు తమసవతులచే నాఘ్రాణింపబడిన ముఖములుగల యాయుత్తమస్త్రీలు, రావణుడే తమముఖములను నాఘ్రాణించుచున్నాడనిదలంచి తమసవతుల మోములను వారుమఱల నాఘ్రాణించిరి. అచ్చట మఱికొందఱుస్త్రీలు, కడియములచే నలంకరింపబడిన భుజములను, మిగుల రమ్యములగు వస్త్రములను తలగడలుగానుంచుకొని నిదురించుచుండిరి. మఱియు నొకస్త్రీ మఱియొక స్త్రీయొక్క రొమ్ముమీద తలయుంచుకొని పరుండియుండె. ఆస్త్రీయొక్క భుజములనుతలగడలుగా జేసికొని మఱికొందఱుస్త్రీలు నిద్రించుచుండిరి. వేఱొకతె మఱియొకతెతొడను దిండుగ జేసికొని పరుండియుండె. మఱికొందఱాస్త్రీయొక్క భుజములను దలగడలుగ జేసికొని నిద్రించుచుండిరి. కొందఱు స్త్రీలు ఒకరితొడలనొకరును ప్రక్కలను మొలను వీపులను దిండ్లుగా జేసికొనియును, ఒండొరులపై నవయవములు వైచికొనియును, పానమదము చేగలిగిన స్నేహమువలన మైమఱచి నిద్రించుచుండిరి. అట్టియెడ, దారములవలెనున్న భుజములపై తుమ్మెదలవలెనున్న వెంట్రుకలుగల తలలుంచుకొని పరుండియుండిన యాస్త్రీసమూహము "మదించిన తుమ్మెదలచే నాక్రమింపబడిన పుష్పమాలికవలెనే" ప్రకాశించుచుండిరి మఱియు నాస్త్రీలందఱు నొకరిభుజములపై నొకరుపండుకొని మాలికారూపముగనున్నవారును, ఛిన్నాభిన్నములైన పూదండలును పుష్పములను ధరించియుండువారును, ఒకరిపైనొకరునల్లిబిల్లిగ బరుండియుండుటచే జుట్టుకొనబడిన శరీరములుగలవారును, వ్యాకులమైన ముంగురులు గలవారును, నిట్టూర్పు గాలిచేగదిలింపబడిన చీరకొనచెంగులుగలవారునునగు నారావణునిభార్యలనెడిస్త్రీ (వనము) సమూహము, వైశాఖమాసమున లెస్సగాబూచియుండు తీగెలుగలదియై మాలికారూపముగ నేర్పడినదియును, చెట్లమొదళ్లమీద నల్లుకొని యుండునదియును, పరస్పరము తుమ్మెదలచే వ్యాకులమైనదియును, గాలిచేగదిలింప బడినదియునునగు తీగెలయొక్క వనమువలెనే ప్రకాశించుచుండె. అట్టియెడ నాస్త్రీలు ధరించియుండిన యాభరణములును వస్త్రములును నుండవలసిన స్థానములయందు లేకుండుటం జేసి, ఈసొమ్ములు యీవస్త్రములు యీయవయవములు వీరివనియును, ఈయాభరణములు, యీవస్త్రములు యీయవయవములు మఱియొకరివనియును దెలిసికొనుటకు సాధ్యముగాకయుండె. అప్పుడు కాంచనపు దీపస్తంభములయందుకదలక నిలకడగనుండుచున్న దీపములు, రావణాసురుడు సుఖముగ నిద్రించుటను జూచి "యిదియుచితసమయమని, మిగుల సౌందర్యవతులును నానావిధములగు దేహకాంతులుగలవారునునగు నారావణుని భార్యలను" తెప్పలార్పక జూచుచున్నట్లుండె. దేవదానవదైత్యగంధర్వయక్షరాక్షసకన్యలు ఆరావణాసురునియందు మోహము జెందినవారై యుండిరి. వారియందనేకులను రావణుడు యుద్ధాపేక్షచేగొనివచ్చె మఱికొందఱు తాముగా నేయారావణుని మోహించివచ్చి యతనిజేరిరి. అచ్చటనుండు స్త్రీలలో నొక్కతెయైనను, రావణునివలన బలాత్కారముగ దేబడలేదు. అందఱును నాతని మోహించియే వచ్చిరి. అందొక్కతెయైననపరకు అన్యునికిభార్యగనుండినదిగాదు. అన్యుండగు రామునిభార్యయు మిగుల పతివ్రతయునగు సీతాదేవి మాత్రము వానియందు కొంచెముగూడ మోహమును జెందినదిగాదు. అప్పుడచ్చట నుండిన రావణునిభార్యలందఱును సత్కులమునందు బుట్టినవారును, మంచిసౌందర్యముగలవారును, మిగుల నిపుణతగలవారును, బలముగలవారును, సకల ఉపచారములతో గూడినవారునైయుండిరి. అట్టియెడ ఆంజనేయుడు ఈరావణునిభార్యలు వీనితోగూడి సుఖించియుండునట్లు, సీతాదేవియు నాబిడభర్తయగు శ్రీరామునితో గూడి సుఖించునట్లు, రావణాసురుడు సీతను రామునకర్పించునేని యీరావణునకు మేలుగలుగునని దలంచె. మఱియు సీతపాతివ్రత్యాదిగుణములచే మిగుల యధికురాలు; మహాబలపరాక్రమశాలియగు నీరావణుడట్టి సీతాదేవియెడల మిగుల అక్రమముగ నడుచుకొనుచున్నాడు; ఇదివీనికి మహాకష్టకాలమని యాంజనేయుడు మిగుల పశ్చాత్తాపమునుబొంది చింతించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి తొమ్మిదవ సర్గ ముగిసెను.

ఆంజనేయుడు నిదురించుచుండెడు రావణాసురుని స్త్రీలలో సీతాదేవిని వెదకుట.

అట్లాంజనేయుడాగృహమునందు సీతాదేవిని వెదుకుచు, స్వర్గముతోసమానమైనదియును, మిగుల శ్రేష్ఠములగు స్ఫటికమణులతో జేయబడినదియును, రత్నములచే నలంకరింపబడినదియును, దంతములతోను బంగారముతోను జే

యంబడి నానావర్ణములతో నొప్పుచుండెడి యవయవములుగలవియును, వైడూర్యపుమణులతో నలంకరింపబడినవియును, మిగుల శ్రేష్ఠములగు రత్నకంబళములతో గప్పబడినవియును, మిగుల వెలగలవియునునగు మేలైనపీఠములతో గూడుకొనియున్నదియునునగు నారావణుని శయనగృహమునుజూచె.

ఆశయనగృహమునం దగ్రభాగమున శ్రేష్ఠములగు పూదండలచేతను ముత్యములసరములచేతను నలంకరింపఁబడినదియును, చంద్రునివలె తెల్లగ నున్నదియునునగు నొక శ్వేతచ్ఛత్రమును (అనగా తెల్లటిగొడుగును) జూచె. ఆగృహమునందు, బంగారముతోఁ జేయఁబడినదియును, సూర్యునితో సమానమైన కాంతిగలదియును, అశోకపూదండలతో నలంకరింపఁ బడినదియును, చామరంబులు చేతులంబూని యున్న స్త్రీలచేత వీవంబడుచున్నదియును, నానావిధములగు వాసనలతో గూడుకున్నదియును, శ్రేష్ఠమైనధూపములతో ధూపింపబడినదియును, మిగుల శ్రేష్ఠములగురత్నకంబళములచే గప్పబడినదియును, పొట్టేలుయొక్క తోళ్లతో గప్పబడినదియును, ఎచ్చటఁజూచినను పూదండలతోనలంకరింప బడినదియునునగు, మిగులఉత్తమమైన శయనమును నాంజనేయుఁడుజూచె. ఆశయనమునందు, మేఘముతోసమానుడైనవాఁడును, మిగులప్రకాశించుచున్న శ్రేష్ఠములగుకుండలములు ధరించియున్నవాఁడును, రక్తవర్ణములగు నేత్రములుగలవాడును, పొడవులగుచేతులు గలవాడును, బంగారువస్త్రముగలవాడును, మంచివాసనగల రక్తగంధపుపూతగలవాడును, సంధ్యాకాలమునందుమిగులయెఱ్ఱనైమెఱుపుతీగెతోగూడిగగన వీధియందుండెడుమేఘమువలె నున్నవాడును, దివ్యాభరణభూషితుండును, మంచిరూపము గలవాఁడును, యిచ్ఛారూపమును ధరించువాఁడును, వృక్షములతోను అరణ్యములతోను బొదలతోనుంగూడి నిద్రించుచుండు మందరపర్వతమువలె నున్నవాఁడును, రాత్రియందిచ్ఛానుసారముగగామ భోగములను భవించి యుపరమించినవాడును, శ్రేష్ఠములగు నాభరణములనుధరించినవాడును, రాక్షసులకు సుఖముగలుగ జేయువాడును, పానమత్తుడైయున్నవాడును, రాక్షసస్త్రీలకు ప్రియుడునునగు రావణునిబూచె. మఱియునాంజనేయుడు మిగులప్రకాశించుచుండెడుపాన్పుపై నిదురించుచున్నవాడును, నిట్టూర్పులువిడుచుచు సర్పమువలెనున్నవాడును, మహాపరాక్రమశాలియును, రాక్షసరాజునునగు రావణునిసమీపమునకుబోయి, ఆసామనమేల యిట్లుసమీపమునకు వచ్చితిమని మిగులగలతనొంది భయపడినవానివలె దొలగిపోయె.

అటులభీతినొందిన యాంజనేయుడు వెనుకకుజరిగి మిద్దెమెట్లమీదికిపోయి యొకటిరెండు పడికట్లుదిగియచ్చటగూర్చుండి నిదురించుచున్న యారావణునిజూచె. అట్టియెడనా పాన్పు, ఎట్టియేనుగుయొక్క గంధమునాఘ్రాణించి యితరయేనుగులు భయపడునో, అట్టిమదించిన యేనుగుండెడి సెలయేఱు యెట్లుప్రకాశించునో యట్లారావణుండుఁడుంటచే బ్రకాశించుచుండె. కాంచనబాహుపురులచే నలంకరింపబడినవియును, చాచబడినవియును, దేవేంద్రుని టెక్కెములతో బోల్కిగలవియును, ఇంద్రునిపట్టపేనుగగన యైరావతముయొక్క కొమ్ములచేజీరబడుటవలన గలిగినగాయముగలవియును, దేవేంద్రుని వజ్రాయుధముచే గీఱబడిబలిసిన భుజములుగలవియును, విష్ణుదేవుని చక్రముచేగాయబడిన భుజములుగలవియును, బలిసినవియును, హెచ్చుతక్కువలులేక మిగులసుందరములగు భుజశిఖరములు గలవియును, దేహమునకు సరియైనవియును, బలముతోగూడినవియును, మంచిలక్షణములు గలగోళ్లును బొటనవ్రేళ్లునుగలవియును, సులక్షణలక్షితములగు వ్రేళ్లతోను అఱచేతులతోను గూడుకున్నవియును, దృఢములగు సంధిబంధములు గలవియును, ఇనుపగుదియలవంటి యాకారముగలవియును, మిగులగుండ్రములైనవియును, ఏనుగుతొండముతో సమానములైనవియును, మిగులనిర్మలమైనవియును, పాన్పుపైనున్నవియును, "అయిదుతలలుగల పాములవలె" నున్నవియునునగు రావణాసురుని భుజములను యాంజనేయుడుజూచె. మఱియునారావణునియొక్క భుజములు, కుందేటినెత్తురతోసమానమైనదియును, మిక్కిలిచల్లనైనదియును, మంచివాసనగలదియును, మిగులశ్రేష్ఠమైనదియునునగు శ్రీగంధముచేత లెస్సగానలంకరింపబడినవియును, ఉత్తమస్త్రీలచేత విసుకబడినవియును, శ్రేష్ఠములగువాసనలచే నలంకృతంబైనవియును, యక్షపన్నగ గంధర్వదేవదానవులను యరచునట్లు జేయునవియును, పాన్పుమీదనున్నవియును, మందరపర్వతపు గుహలయందుండి మిగులకోపమునొందిన గొప్పసర్పములవలె నున్నవియునునై యొప్పుచుండె. అట్టియెడపర్వతాకారుండగు నారావణాసురుడు, నిండుభుజములతో గూడినవాడై శిఖరములతోగూడిన పర్వతమువలె బ్రకాశించుచుండె. అట్లుపర్వతాకారమువలె బ్రకాశించుచునిదురించుచుండిన రావణాసురుని పెద్దనోటినుండి, మామిడిపువ్వులయొక్కయు పొన్నపువ్వులయొక్కయు వాసనవంటివాసనగలదియును, ఉత్తమమైన పొగడపువ్వుల వాసనతోగూడుకున్నదియును, మద్యపానముయొక్క వాసనతోగూడుకున్నదియునునగు నిట్టూర్పుగాలి బైలువెడలుచు యాగృహ

మునంతయు నింపించుచుండె. మఱియు నాశయగృహము నందు. నవరత్నములు ముత్తెములు జెక్కఁబడియుండుటచే నానావర్ణములు గలవియును, బంగారముతో జేయబడినదియును, స్థానముతోలగినదియునునగు గిరీటముచే బ్రకాశించుచున్నవాడును, కుండలములచే వెలుగుచుండెడు ముఖముగలవాడును, పరిమళములచేతను రక్తగంధపుపూతచేతను శోభిల్లుచున్నదియును మిగులబలిసినిదువును విశాలమును గలదియునునగు ఱొమ్ముచే బ్రకాశించుచున్నవాడును, తెల్లపట్టువస్త్రమును ధరించినవాడును, రక్తవర్ణములగు నేత్రములుగలవాడును, మిగులశ్రేష్ఠమగు పీతాంబరమును గప్పుకొనియుండువాడును. మినుముల రాశివలె నొప్పుచుమహాసర్పమువలె నిట్టూర్పులువిడుచున్నవాడును, గంగాజలప్రవాహమునందు నిదురించుచున్న గజమువలె నున్నవాడును, నాల్గుప్రక్కలను నాలుగుబంగారు దీప స్తంభములయందు వెలుంగుచుండెడు దీపకాంతులచే బ్రకాశింపజేయబడిన సర్వావయవములుగలవాడై మెఱుపుతీగలచే బ్రకాశించెడు మేఘమువలె నున్నవాడును, రాక్షసేశ్వరుడునునగు రావణాసురుని, ప్రియభార్యలందరును, వానిపాదములయొద్దనిదురించుచుండుటను, యాంజనేయుడుజూచె.

అట్టియెడనాస్త్రీలు, చంద్రబింబమువలె బ్రకాశించుచున్న ముఖములుగలవారును, మిగులసుందరములగు కుండలములు ధరించియుండువారును, వాడనిపువ్వులదండలను ధరించియుండువారునై యొప్పుచుండిరి మఱియునృత్యమునందును వాద్యమునందును నేర్పుగలవారును, రాక్షసేశ్వరుడగు రావణునిచే నాలింగనముజేయ బడినవారును, శ్రేష్ఠములైన యాభరణములను ధరించినవారును, రావణునిపాదాంతమునందు బరుండినిదురించుచున్న వారునునగు నాస్త్రీలను యాంజనేయుడుజూచె. అట్లుపండుకొనియున్న యాస్త్రీలుధరించి యుండినవియును, బంగారముతోజేయబడి వజ్రవైడూర్యములచే జెక్కఁబడినవియునునగు కుండలములను బాహుపురుషులను యాంజనేయుడుజూచె. అట్టియెడనావిమానము, చంద్రునితోబోలికగల యాస్త్రీలముఖములచేతను, వారుధరించియుండెడు కుండలములచేతను, నక్షత్రములతోగూడి ప్రకాశించెడు నాకాశమువలె బ్రకాశించుచుండె. అప్పుడుమిగుల సూక్ష్మములగు నడుములుగల యారావణాసురునిభార్యలు మద్యపానమత్తులైయొడలెరుగకయిచ్చటనచ్చటను నల్లిబిల్లిగబరుండి నిదురించుచుండిరి. వారిలోనాట్యమునందు నేర్పుగలయొక యుత్తమస్త్రీ, నాట్యముజేయు కాలమునందవయవములెట్లుండునో అట్లేసమస్తావయవముల నుంచుకొనినిదురించె. వీణాగానమునందు నేర్పుగలయొకస్త్రీ, యావీణనుగౌగలించుకొని "మహానదియందు తెప్పనంటుకొనియుండు తామరతీగవలె" ప్రకాశించుచు నిదురించుచుండె. గుమ్మెటవాయించుటయందు నేర్పుగలమఱియొకస్త్రీ యావడ్డుకమును వాద్యమును చంకనుంచుకొని నిదురించుచు "తనచిన్నిబాలునియందు ప్రేమగలస్త్రీవలె" గాన్పించుచుండె. తప్పెటవాయించుటయందు నేర్పుగలదియును, సమస్తావయవములను మిగులసుందరములైనవియును, చక్రవాకంబులంబోలు సౌందర్యములగు స్తనములుగలదియునునగు నొకస్త్రీయాతప్పెటను గౌగలించుకొని "బహుకాలమునకు వెనుకతనప్రియుని బొందినస్త్రీవలె" నిదురించుచుండె. పిల్లనగ్రోవినూదుటయందు నేర్పుగల యింకొకయువతి యాపిల్లనగ్రోవిని కౌగలించుకొని "కాముకురాలు ఏకాంతమునతన ప్రియునిగాఢాలింగనముజేసికొనినట్లు" నిదురించుచుండె. నృత్యముజేయుటయందు నేర్పుగలమఱియొకస్త్రీ యేడుతంతువులుగల వీణెను కౌగలించుకొని "ప్రియునితోగూడినస్త్రీవలె" నిద్రబోవుచుండె. మద్దెళవాయించుటయందు నేర్పుగలదియును, మదసహితములగు నేత్రములుగలదియును నగునొకస్త్రీ సువర్ణచ్ఛాయగలవియును, మిగులమెత్తనివై బలిసినవియును, మిగులసుందరములైనవియునునగు నవయవములతో నామద్దెళను గట్టిగబట్టుకొని నిదురించుచుండె, మహాసౌందర్యవతియగు నొకసన్నని స్త్రీమద్యపానమదముచే శరీరముమీదజ్ఞప్తిలేనిదైయుడుకయను వాద్యమును చంకనుంచుకొని నిద్రించె. మఱియొకస్త్రీయొకచేత డిండిమమను వాద్యమును మఱియొకచేత నింకొకడిండిమమును కౌగలించుకొని "యౌవనవంతుడగు ప్రియునినొకచేతను, బాలుండగు బిడ్డనుఒకచేతను కౌగలించుకొనియున్నస్త్రీవలె" నిద్రించుచుండె. తామరరేకులవంటి నేత్రములుగల మఱియొకస్త్రీ యాడంబరమను వాద్యమును లెస్సగ గౌగలించుకొని, మధుపానమత్తుచే నొడలెఱుగనిదియై నిద్రించుచుండె. వేరొకస్త్రీపానమత్తతచే శరీరమునందు జ్ఞప్తిలేనిదై నీళ్ళచేనిండియుండు బంగారుకడవనుమీద దొర్లించుకొని నిద్రించుచు "వసంతఋతువునందు తడుపబడి కొంతకాంతితగ్గియుండెడు పుష్పమాలికవలె" ప్రకాశించుచుండె. మఱియునొకస్త్రీ మద్యపానమదమువలనను, నిద్రాతిశయమువలనను శరీరమునందుస్మృతిలేనిదైతన గుండ్రని చేతులచే తనరెండు స్తనములను ఒట్టుకొనినిద్రించుచుండె.

ఇట్లునానావిధములుగ దురించుచుండిన యాస్త్రీలనడుమనేకాంతముగ నుంచబడినపాన్పుమీద పరుండియున్నదియును మిగులసౌందర్యవతియునునగు నొకస్త్రీని యాంజ

నేయుడుజూచె. ఈరీతిగానుండు పాన్పుపైపరుండి యున్నదియును, రత్నములతోను ముత్తెములతోనుఁ బొదఁగబడిన సమస్తాభరణములను ధరించియున్నదియును తనదేహకాంతిచే నాగృహమునంతయుఁ బ్రకాశింపఁజేయుచున్నదియును, పదియారువన్నెబంగారపు దేహకాంతిగలదియును, రావణాసురునకుఁ బ్రియురాలును, అంతఃపురరాణియును, మనోజ్ఞమైనరూపముగలదియును, నగుమండోదరి యనుదానిని యాంజనేయుఁడుజూచె. అట్లులెస్సగనలంకరించుకొని పరుండియున్న యా స్త్రీయొక్క రూపయౌవనసౌందర్యములనుజూచి యాంజనేయుడు ఆ స్త్రీయేసీతాదేవియనితలచి పరమానందభరితుఁడయ్యె. అట్లుమహాసంతోషమునొంది చేతులుతట్టి తోకనుదువ్వి ముద్దుబెట్టుకొనెను ఆటలాడెను. పాడెను. స్తంభములపైనెక్కె. కుప్పిగంతులనువేసెను. నేలంగూలి పొర్లాడెను. ఇట్లుతనస్వభావజన్యమైన చేష్టలనుచేసెను.

ఇట్లు శ్రీమత్సుందర కాండమునందలి పదియవసర్గము గిసెను.

ఆంజనేయుడు రావణాసురుని పానప్రదేశమునందు సీతాదేవిని వెదకుట.

అప్పుడాంజనేయుఁడు ఆ స్త్రీసీతయను తలంపునువిడచి మిగుల హెచ్చరికగలవాఁడై యంతసీతాదేవినిగూర్చి వేరు విధముగనిట్లని యాలోచించె.

సీతాదేవి రామవియోగదుఃఖముచే నిదురింపదే, భోజనముఁజేయదే, నలంకరించుకొనదే; మద్యపానముఁజేయ నొల్లదే; రాముఁడుదప్పఅన్యుఁడు దేవేంద్రునివంటివాఁడైననుకన్నెత్తి చూడనొల్లదే; ఇదియునుంగాక దేవతలయందును రామునకుసమానుఁ డెవ్వడునులేడు కావుననిదిసీత గాదు. ఈ స్త్రీయెవతెయోయని నిశ్చయించి యాస్థలమునువిడిచి పానభూమియందు సంచరించుటకు నారంభించె. అట్లుహనుమంతుఁడు పానభూమియందు దిరుగుచు, రతిక్రీడచేమిగుల నలసశ్రమజెందినవారును, పాడిపాడిమిగులయలసట నొందినవారును, నృత్యముఁజేసి శ్రమజెందిన వారును, పానమత్తులైయలసినవారును, మురజములమీదను మృదంగములమీదను, పీఠములమీదను పరుండినిదురించుచున్నవారును, రత్నకంబళములపై బరుండియున్నవారును నగు కొందఱినియాంజనేయుఁడుచూచి సీతలేనందున మఱి ల రావణుడున్న స్థలమునకువచ్చి యచ్చటఅనేక భూషణములనుఅలంకఱించు కొనియున్నవారును,రావణుని సౌందర్యమునుగొనియాడుట యేస్వభావముగాగలవారును, భరతశాస్త్రమును లెస్సగనెఱిగినవారును, దేశకాలములనెఱింగి నటియించువారునునగు ననేక స్త్రీలతో సంభోగమునుజేసి యలసినిద్రించియున్న రావణాసురుని యాంజనేయుడుజూచె అట్లా స్త్రీలనడుమ మహాబాహుండగు రావణాసురుఁడు "గోవృలనడుమనుండు నాబోతెద్దువలె" ఒప్పుచుండె మఱియునాగావణాసురుడు ఆ స్త్రీలచేఁబరివేష్టితుఁడై, "మహారణ్యమునందుఆడ యేనుగులచే నావరింపఁబడిన పురుషఏనుగువలె" బ్రకాశించుచుండె. ఆరావణాసురునియొక్క గృహమునందుపానముకొఱకుసర్వసిద్ధముగనుంచియుంచు నానావిధములగుమద్యములు సమృద్ధిగనుండుటనుఆంజనేయుడుమరలజూచె. అట్టిపానప్రదేశమునందు నేర్పేరుగనుంచఁ బడియుండుజింకమాంసమును యెనుబోతుమాంసమును పందిమాంసములనుజూచె అదియునుగాక బంగారు పాత్రములయందుంచఁబడి సగముభక్షింప బడిన నెమలిమాంసమును, కోడిమాంసమును యాంజనేయుఁడు చూచె. ఇంకను, పెరుగునుసౌవర్చలవణమునుజేర్చి వండబడినపందిమాంసమును, వ్రార్ధ్రాణసమనెడి పక్షిమాంసమును, ఏదుపందిమాంసమును, జింకమాంసమును, నెమలిమాంసమునుజూచె. మఱియుఁపలువిధములుగఁ బచనముఁ జేయఁబడిన కొక్కెరమాంసమును, సగముభక్షింపఁబడిన చకోరపక్షిమాంసమును, ఎనుబోతులమాంసమును, ఏకశల్యములను చేపలమాంసమును, లెస్సగఁబచనముచేసిన మేకమాంసమును, నానావిధములగు పచ్చళ్లును, పాయసము మొదలగు ద్రవపదార్థములను త్రాగదగినపాలు మొదలగు పదార్థములను, తినందగినపిండివంటలు మొదలగు పదార్థములను నాంజనేయుఁడుజూచె.

మఱియుపులుసు పదార్థములను యుప్పుపదార్థములను, శర్కరద్రాక్షమొదలగు మధురద్రవ్యములచేఁ జేయఁబడినపదార్థములను, నేలఁబడవైచియున్న వియునుమిగుల విలువగలవియును సగుయుండెలు, హారములు, బాహుపురులు, మొదలగుయాభరణములను, పానపాత్రములయందుంచబడిన ఫలములునుగలదియై యెచ్చటజూచినను పుష్పులుజల్లబడి మిగులబ్రకాశించుచుండెడు పానప్రదేశమును నాంజనేయుఁడుజూచె. అట్టియెడనాపానప్రదేశము, నిప్పుతోసమానమైన కాంతిగలవియును బంగారుమయములైనవియును రత్నములచే జెక్కబడినవియును, ఒకటితోనొకటిజేరి క్రిక్కిరిసినట్లున్నవియును, నగుపాన్పులచేతను యనేకవిధములగు మాంసపిండములచేతను యొప్పుచుండుటచే అగ్నిలేకయే మండుచున్నదానివలె జూపట్టుచుండె. అపానభూమియందు, స్వర్గసంబంధమైనవియును మిగులపాకశు

ద్ధిగ నుండునవియును, పలు దెరంగులై నవియునునగు సారాయములును, చక్కెర, తేనె ద్రాక్ష మొదలగు వానితో జేయబడిన కృత్రిమమద్యములును, పూతేనెతో జేయంబడిన మద్యములును, ఫలరసములతో జేయబడినమద్యములును, నానావిధములైనవియును, పలువిధములుగ జేయబడినవియును, శ్రేష్ఠములగు పాకములచేబక్వము జేయబడినవియును, మిగులబుద్ధిమంతులగు వంటవాండ్రచే పచనము జేయబడినవియును, వెవ్వేఱుపాత్రములయందుంచబడినవియును నగు మాంసములను, నానావిధములగు సువాసనయుక్తములగు గంధవర్గను నాంజనేయుడుజూచె.

అప్పుడు, నానావిధములగు వెండిపాత్రములచేతను, స్ఫటికపు పాత్రలచేతను, బంగారముతో జేయబడిన గిండి వంటిపాత్రములచేతను, నానావిధములుగ గట్టబడినపుష్పమాలికలచేత నొప్పుచున్నదియై యాప్రదేశము మిక్కిలి బ్రకాశించుచుండె. మఱియునయ్యాంజనేయుడు, వెండిపాత్రములయందును, బంగారుపాత్రములయందును, పూరింపబడియుండు శ్రేష్ఠమగుమద్యమునుజూచె. అచ్చటసారాయిచే నిండియుండెడురత్నఖచితములైన వెండిబంగారుపాత్రలను, యాంజనేయుడుచూచెను. మఱియునొకచోట సగముత్రాగగా మిగిలినపాత్రములను వేఱొకచోటనంతయు ద్రాగంబడినపాత్రములను, మఱియొకస్థలమునందు మద్యముతో పూర్ణముగ నిండింపబడియుండు పాత్రములనుజూచె. ఇదియును గాక నాపానప్రదేశమునందొకచోట నానావిధములగు పిండివంటలను, ఇంకొకచోటద్రాగదగిననానావిధములగుమద్యము మొదలగువాటిని, వేరొకచోట భుజింపగా మిగిలినయన్నమును, ఒకచోటవిరిగిన పాత్రములను, మఱియొకచోట విఱిసిపోయినఘటములను, ఒకచోటనీళ్లతోగలసియుండు పుష్పమాలికలను, ఫలములను ఇంకొకచోటనానావిధములగు స్త్రీలపాన్పులను, ఆపాన్పులమీద నొండొరులను కౌగలించుకొని నిదిరించుచున్న యుత్తమస్త్రీలను, నిద్రమత్తుచేత మైమరిచినిద్రించుచున్న వారినికొందఱిని, ఒడలెరుగక వస్త్రహీనులై నిదురించుచున్నవారిని కొందఱిని, వస్త్రములుధరించుకొని నిదురించుకొనియున్నవారిని కొందఱిని ఒకరిచీరెనొకరు యీడ్చిపట్టుకొనినిద్రించుచున్నవారిని కొందఱినిజూచె.

అట్లునిదురించుచున్న యా స్త్రీలువిడుచుచున్న నిట్టూర్పుగాలిచే వారుధరించియున్న వస్త్రములయొక్క కొనచెఱగులును, పూలదండలును "మందమారుతముచేతవలె" మెల్ల మెల్లగా గదులుచుండె. ఆపానప్రదేశమునందు చల్లని శ్రీగంధమును, మిగులరుచిగల మద్యములును, నానావిధములగు పుష్పమాలికలును పలువిధములగు ధూపములును గలిగియుండుటవలన వానిపైనుండివచ్చుచుండెడిగాలివాసనలతో గూడుకున్నదియై మిగులమనోహరముగ వీచుచుండె. మఱియునాపుష్పకవిమానమునుండి బైలువెడలినగాలి, అందలి చందనములయొక్కయు ధూపములయొక్కయు మనోహరములగు వాసనలతో గూడి, సకలప్రదేశములయందును వ్యాపించివీచుచుండె. ఆరావణునిగృహమునందు నలుపు తెలుపు వన్నెగల స్త్రీలును, నల్లనివర్ణముగల స్త్రీలును, మిగుల శ్రేష్ఠమైనబంగారవు వర్ణముగలస్త్రీలును, నిద్రించుచుండిరి. అట్లునిద్రించు చున్నయాస్త్రీలు, గాఢరతిచేతనలసి వాడినమోములుగలవారై యుండుటచే "రాత్రియందు ముకుళించుకొనియుండు కమలములుగల తామరతీగవలె" రమ్యముగనుండిరి. ఇట్లుమిగుల పరాక్రమశాలియగు హనుమంతుడు రావణాసురుని యంతఃపురమునం దన్నిచోట్లను గల యదిరిగిసీతనువెదకెను. అట్లువెదకియు నచటసీతాదేవి యగపడదాయె. అంతనాంజనేయుడా రావణునిభార్యలనుజూచి ధర్మలోపమువలన భయముగలవాడగుచు తనలో తానిట్లని యాలోచించె.

ఒడలెరుగకనిదురించుచుండెడు నంతఃపురస్త్రీలగు నితరునిభార్యలనుజూచుటచే నాకుమిగుల ధర్మలోపముగలుగుచున్నది. ఇది నాకు మహాపాపకారణమైనది. నేను ఒకడు పరస్త్రీలను స్వీకరించుచుండగా జూచినవాడనుగాను. అయినను నేనుపరస్త్రీలను జూడవలయునను నభిప్రాయముతో నిపుడు జూడలేదు. సీతను వెదకుచుండగా నీస్త్రీలగుపడిరి. ఇంతయేగానివేరుకాదు, నాదృష్టియును వారియందు లేదు. అనియిట్లు మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుడు కొంతదడవునకు ధైర్యమునుబొంది మఱలనిట్లనియోచించె. ఇచ్చటికెవ్వరునురాలేరని నమ్మకముతో స్వేచ్ఛగనిదురించుచున్న యీరావణునిభార్యల నందఱిని తెస్సగ జూచితిని అట్లుజూచినను నామనస్సునకు కొంచమైనను వికారముగలిగినదిగాదు. సుకర్మములయందుగాని దుష్కర్మములయందుగాని యింద్రియంబులు ప్రవర్తించుటకు మనసుకారణముగాని వేరుగాదు. నామనస్సు యిప్పుడు మిగుల స్థిరముగనున్నది, ఇదిగాక స్త్రీలను వెదుకువారు స్త్రీలుండుచోటనే వెదకవలయును. ఎప్పుడుగాని స్త్రీలుయితరస్థలంబులగు మృగములుమొదలగునవియుండుచోట నుండరుగద, కావున నేను సీతాదేవిని స్త్రీలుండెడి యీప్రదేశమును విడిచి వేరుస్థలములయందు వెదుకుటకు సాధ్యముగాదు. ఇదిగాక యేజంతువుయేజాతియందుజన్మించినదో ఆజంతువునా జాతియందే వెదుకవలయును. కావున స్త్రీయగపడనిచో

నాస్త్రీని స్త్రీలయందే వెదకవలయునుగాని వేల్లయందు వెదకిన ప్రయోజనములేదు మఱియు నేను నిర్దోషంబగుమనస్సుతో రావణాసురునియంతఃపురమంతయు గలయందిరిగి వెదకితిని సీతాదేవి యగపడినదిగాదు. అని యిట్లాలోచించె ఆరావణాసురుని గృహమునందు నాగకన్యకలును దేవకన్యకలును గంధర్వకన్యకలును, గనబడిరికానిసీతాదేవిగనబడదయ్యె. అట్లాంజనేయుడు సీతాదేవినిగానక యచ్చటనుండి వెనుకకుదిరిగి యాపానప్రదేశమును విడిచి మహాప్రయత్నముతో ధైర్యలక్ష్మి నవలంబించి ఆరావణుని గృహమునంతయు వెదుకుటకారంభించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి పదకొండవ సర్గ ముగిసెను

▸(✱)◂

ఆంజనేయుడుసీతాదేవినిగానకవిసుకుజెందుట.

అంతవాయుపుత్రుడగు నాంజనేయుడు సీతాదేవిని జూచుటయందు మిగులనాశచే యారావణుని గృహమధ్యముననుండు తీగెటిండ్లయందును, చిత్రగృహములయందును, రాత్రులయందుండుటకు తగినయిండ్లయందును, గలయజూచెనుగాని సీతాదేవిని జూడడయ్యె. ఇట్లు రావణునిగృహమునందంతట వెదకివెదకి వేసారి సీతనుగానక నాంజనేయుడిట్లని యాలోచించె. మహాప్రయత్నముతో వెదకుచుండెడు నాకు సీతయగుపడకుండుటచే నిశ్చయముగ సీతాదేవి మృతినొందినది. ఏలననగా నాసీతాదేవి గొప్పవ్రతము నవలంబించి తనపాతివ్రత్యమును గాపాడుకొనుచు దురాత్ముడగు నీరావణాసురుని యిష్టముచొప్పున నడుచుకొన కుండుటచే నీదుష్టాత్ముడు నిశ్చయముగ చంపివేయుండును. అట్లుగాదేని యీవికృతాకారులును, విరూపులును, కాంతిహీనులును, గొప్పపెదవులును నోళ్లును గలవారును వికారములగు నేత్రములు గలవారును, నగునీరావణాసురునియొక్క యాజ్ఞచే గావలియుండెడి రాక్షసస్త్రీలను జూచి భీతిచే మృతినొందినదేమో? లేకున్ననాకేల యగుపడదు. ఇక నేను సీతాదేవిని గనుగొనక బహుకాలము వానరులతో నాటలచే గాలముగడపి సుగ్రీవునియొద్ద కెట్లుబోవచ్చును. గడువున్నుతప్పెను. మఱియు నాసుగ్రీవుడు మిగులబలము గలవాడును నతిక్రూరముగదండించువాడునుగానున్నాడు. రావణాసురుని యంతఃపురమంతయు కలయదిరిగి యాతనిభార్యలనందఱిని జూచితినిగాని, సీతాదేవిని మాత్రముగానైతి. నేనుపడినశ్రమమంతయు వ్యర్థమయ్యె. సీతాదేవిని జూడక నేనచ్చటికి బోదునేని వానరులందఱు నన్నేమియనుదురు? "పరాక్రమశాలివగునోయాంజనేయుడా! నీవులంకానగరమునకుబోయి యేమిజేసితివో దానినిమాకు తెలియజేయుమని యడుగుదురు. నేనిప్పుడుసీతాదేవిని జూడకయే యచటికిబోతినేని వారడిగిన నేనేమిచెప్పగలను? నేనచ్చటికి పోకుందునేని నారునేనచటికిపోవలసిన గడువుకాలమువఱకు గాచియుండి యాపైని వారు ప్రాణములు విడుతురు. ఇదినిశ్చయము. మఱియు నేనచటికిబోకున్నను వృద్ధుడగు జాంబవంతుడునునంగదుడును, సీతాదేవినివెదకుటకై యచటికి వచ్చియుండెడు నితరవానరులును, సముద్రముయొక్కయివతలిగట్టును బొందియుందురన్నుగూర్చి యేమిచెప్పుదురో గాన నేనధైర్యమునొందరాదు. శ్లో॥ అనిర్వేదశ్శ్రియోమూలమనిర్వేదఃపరంసుఖమ్ । అనిర్వేదోహిసతతం సర్వార్థేషుప్రవర్తకః॥ విసుకుజెందక నుత్సాహముతోనుండుట సకలసంపదలకు మూలము విసుకు నొందనివానికి సమస్తసుఖములుగలుగును, విసుకునొందకుండినచో సమస్తకార్యములయందును ప్రయోజనముగలుగును (అనగానుత్సాహము సకల కార్యములయందును ప్రవర్తింపజేయునట్టిది) శ్లో॥ కరోతిసఫలంజంతోఃకర్మయత్తత్కరోతిసః,, మఱియు జనము, విసుకులేక నుత్సాహముతో ఏఏకార్యమును జేయునో నాయాకార్యమును నాయుత్సాహమే సఫలముగ జేయును. కావున నేనిప్పుడధికయుత్సాహమునవలంబించి సీతాదేవిని వెదకుటకై మఱల నొకగొప్పప్రయత్నమును జేసెదను. అట్లుగొప్పప్రయత్నముతో రావణాసురునిచే బాలింపబడు నీలంకానగరములోని సమస్తప్రదేశములను మఱల వెదకెదను పానభూములును, పువ్వులచేగప్పబడియుండు గృహములును, చిత్తరువువ్రాయబడిన యిండ్లును, క్రీడాగృహములును, యుద్యానవనములును, గృహారామములును, అవాంతరవీధులును, పుష్పకవిమానాది విమానములును మొదలగువాటినన్నిటిని యిదివరకే వెదకితిని. అయినను మఱలవెదకెదను. అని యిట్లు నిశ్చయించి యాంజనేయుడు మఱల భూమిలోపల గట్టబడిన గృహములయందును, నాల్గువీధులును గలయుప్రదేశమునందు గట్టబడిన యిండ్లయందును, విహారార్థము దూరముగ నిర్మింపబడిన గృహములయందును, వెదకుటకారంభించె, వానరోత్తముడగు నాంజనేయుడిట్లుసీతను వెదకుచు, పలుమారుపైకెగరుచు క్రిందికి దుముకుచు అచ్చటచ్చట నిలుచుచు, పోవుచు, ద్వారములను దెఱచుచు, తలుపులనుబడద్రోయుచు, లోపలికి బ్రవేశించుచు, వెలుపలకివచ్చుచు, ఉన్నతప్రదేశములమీది కెగురుచు, క్రిందదుముకుచు నీరీతిగా సమస్తప్రదేశములయందును వెదకుచుదిరిగె ఇట్లు సీతను వెదకుచు రావణునియంతః

పురమునందు ఆంజనేయుడు సంచరింపని ప్రదేశముగొంచమైనను లేదయ్యె. ఇట్లు ప్రాకారములనడుమనుండెడు వీథులయందును, రచ్చమ్రాకులయందు గట్టబడియుండు తిన్నెలను, నడబావులను, కోనేళ్లను మొదలగు సకల స్థలములయందును వెదకెను అట్లు వెదకుచు నాంజనేయుడు, నానావిధములగు ఆకారములుగలవారును, వికారములగు దేహములుగలవారును, వికృతరూపములుగలవారును నగు రాక్షస స్త్రీలనేకులను జూచెనుగాని జనకమహారాజ పుత్రికయగు జానకినిమాత్రము జూడదయ్యె మఱియు నారావణుని గృహమునందు, మిగుల రూపసౌందర్యములుగల విద్యాధర స్త్రీలను జూచెనుగాని, రఘువంశోద్భవుడైన రాముని సంతసింపజేయునట్టి సీతాదేవిని మాత్రము జూడదయ్యె ఇంకను నారావణాసురుని గృహమునందు, గొప్ప పిరుదులు గలిగి పున్నమచంద్రునితో సరిబోలు ముఖములుగల నాగకన్యలనుజూచెగాని, మిగుల సుందరమగు సన్నని నడుముగల సీతాదేవిని మాత్రము జూడదాయె ఇదియునుగాక బలవంతముచే దొంగిలించి తేబడిన నాగకన్యకల నారావణుని గృహమునందాంజనేయుడుజూచెనుగాని దశరథమహారాజు కోడలగు సీతాదేవినిమాత్రము జూడదాయె. మిగుల బుద్ధిమంతుడును వాయుపుత్రుడును మహాబాహుండునునగు నాంజనేయుడారావణుని గృహమునందు వెదకివెదకి సీతాదేవిని గానక నితర స్త్రీలనేకులను జూచి పలుమారు మిగుల దుఃఖమునొందె. ఇట్లు చింతాక్రాంతుడగుచు, అంగదుడు మొదలగు వానరశ్రేష్ఠులయొక్క ప్రయత్నమును, తాను సముద్రమును దాటినదియును మిగుల వ్యర్థమని దలచి మహావ్యసనము నొందె. అట్లు వ్యసనము నొంది యయ్యాంజనేయుడు పుష్పకవిమానము మీదనుండి క్రిందికిదిగి వ్యసన సముద్రమున మునిగిన వాడగుచు నిట్లని యాలోచించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి పండ్రెండవసర్గ ముగిసెను.

ఆంజనేయుడు సీతాదేవిని గానక పరితపించుట.

అంత ఆంజనేయుడట్లాలోచించి పుష్పకవిమానము మీదనుండి ప్రాకారము మీదికి దుమికి మేఘమునందలి మెఱుపుతీగవలె ప్రకాశించుచుండె. వానరోత్తముడును మిగుల బలపరాక్రమశాలియును నగు నాంజనేయుడట్లు రావణాసురుని యంతఃపురమునుండి యతివేగముగ ప్రాకారము మీకిది దుమికి, ఎచ్చటను సీతాదేవిని గానక తనలో తానిట్లని యాలోచించె. నేను శ్రీరామునకు ప్రియం బాచరింపవలయునని లంకాపురము నంతయు పలుమారు వెదకితిని. సర్వాంగసుందరియగు సీతాదేవిగనబడదయ్యె మఱియు నీళ్లుండు చిన్నపల్లములయందును, తటాకములయందును, కొలకులయందును, ఉపనదులయందును, నదులయందును, నీళ్లసమీపములయందుండెడి యరణ్యప్రదేశములయందును, చొరనశక్యమగు పర్వతములయందును, అరణ్యప్రదేశములయందును, లెస్సగ వెదకితిని. సీతాదేవి కనుబడదయ్యె.

మఱియు సీతాదేవి రావణాసురుని గృహమునందున్నదని గద్దలకుప్రభువగు సంపాతిచెప్పె నేనెంత వెదకినను నిచటసీతాదేవియగుపడలేదు. కావున విదేహదేశమునందలి మిథిలానగరమునందు జనకమహారాజు యింటబుట్టిన సీతాదేవి సదాచార ప్రవర్తనమును మాని కామపరవశయై దుష్టుడగు రావణాసురునితో స్నేహము జేయునా? చేయనేచేయదు. ఆరావణాసురుడు సీతాదేవినియెత్తికొనియతివేగమున నెగిరిపోవునపుడు ఆరావణుడు రామబాణములనుదలచుకొని భీతినొందిక్రిందవిడువగానపుడు సీతాదేవి భూమియందుపడినదేమో, లేక రావణుడు సీతనుయాకాశమార్గమున గొనిపోవుచుండగా నామెసముద్రమును జూచిభయపడియందుబడినదేమో, లేక, రావణాసురుడామె నెత్తుకొనిపోవునపుడు, అతనితొడల వేగముచేతను, బాహువులతో నదుముటచేతను, విశాలాక్షియును పూజ్యురాలునునగు సీతాదేవినగిలిబచ్చెనేమో! లేకా రావణాసురుడెత్తికొని సముద్రమునకు సమీపముగ నాకాశమార్గమున నెగిరిపోవుచుండగ జనకమహారాజపుత్రికయగు జానకి, తలతిరిగిదుట్టుకొనిసముద్రమునందుపడినదేమో! లేక అయ్యో! మిగులదురాత్ముడగు నీరావణాసురుడు, యతనికోరికచొప్పన నడువనందునకోపించి తనసదాచారమును గాపాడుకొనుచున్నదియును, బంధువులెవ్వరుసమీపమునలేనిదియును, తపస్వినియునునగు సీతాదేవినిభక్షించెనేమో! లేకమిగులదుష్టులగు రావణునిభార్యలు, సవతిపోరుగలుగునని దుష్టరాలుగాని సీతాదేవినిభక్షించిరేమో! లేక కనికరింపదగినదియును, నిండుచంద్రునితో సమానమగు మోముగలదియును, తాము తేకులవంటి నేత్రములుగలదియునునగు సీతాదేవినిరంతరము రామునే ధ్యానించుచు దీనత్వమునుబొంది ప్రాణములు విడిచినదేమో! సీతాదేవిప్రాణములువిడుచునపుడు, హారామా! హాలక్ష్మణా! హాఅయోధ్యానగరమా! యనియును పెక్కుమారులువిలపించి ప్రాణములువిడిచినదేమో! లేక, రావణునిగృహమునందే యొకరహస్యప్రదేశమునం దుంచబడి

"పంజరంబుననుండఁబడిన చిలుకవలె" నేడ్చుచున్నదేమో, లేక రావణునకులోఁబడియుండునేమో, అయ్యయ్యో, అట్లుతలంపఁగూడదు. జనకమహారాజుకుమార్తెయును, శ్రీరామునిభార్యయును, మిగులసన్నమై సుందరమగు నడుముగలదియును, కలువలవంటి నేత్రములుగలదియునగు సీతాదేవి రావణునకులోఁబడునా! ఎంతమాత్రమును లోఁబడదు. ఇవన్నియునిట్లుండినప్పటికిని జనకమహారాజుకుమార్తెయగుజానకి, యెచ్చటనోయన్యులకగపడనిస్థలంబునదాచఁబడినదేమోయనిగాని లేక సముద్రమునఁ బడుటమొదలగువాటివలనచచ్చినదేమోయనిగాని, లేక పెనిమిటిని నెడబాసియుండుటచే మృతిబొందినదేమోయనిగాని నిట్టినిష్ప్రయోజనములగు సమాచారములనుభార్యయందత్యంతప్రీతిగల శ్రీరామున కెఱింగించుటసరిగాదు ఏమిచేయవచ్చును. సీతయగుపడలేదనిచెప్పితినేని రాముఁడు ప్రాణములువిడుచునేమో అప్పుడునుదోషముసంభవించును. చెప్పకుందునేని అనగానచ్చటికిఁబోకయేయుందునేనియప్పుడునుదోషముసంభవించును. నేనిప్పుడేమిసేయుదును. ఎట్లుజేసినను విరుద్ధముగనే తోఁచుచున్నదే. ఇప్పుడేమిచేయనగును ఏమిజేసితే కార్యనిర్వాహకమగును. అనియిట్లాంజనేయుఁడుతనలో తాననేకవిధములచింతించి మఱియునిట్లనియాలోచించె. నేనిపుడుసీతనుజూడక కిష్కింధకుబోతినేని నాకేమిపురుషార్థములభించును? ఇదిగాక నేనీసముద్రమునుదాటినదియును వ్యర్థమగును. ఈలంకాపురమునందుఁబ్రవేశించినదియును వ్యర్థమేను. ఈరాక్షసులనందరినిఁ జూచినదియుగూడవ్యర్థమేను. నేనిప్పుడుసీతనుజూడక కిష్కింధకుబోతినేని సుగ్రీవుఁడేమిజెప్పునో? వానరులందఱునుగూడియేమిజెప్పుదురో? ఆ రామలక్ష్మణులేమి జెప్పుదురో? అనగావీరందరునువన్నుమిక్కిలి నిందింతురేమో, అట్లుగాదేని నేనచ్చటికిఁబోయి శ్రీరామునితోసీతాదేవినిజూడలేదనిజెప్పుదునేని యీకర్ణకఠోరమగు మాటనువినినతోడనే రాముఁడుప్రాణములువిడుచును. ఇంతకర్ణకఠోరమైనదియును, మిగులభయంకరమైనదియును, ఓర్వఁగూడనిదియును, ఇంద్రియములనుతపింపఁజేయునదియునగు నీకఠినపుమాటనుదెలుపుదునేని రాముఁడుతత్క్షణమే ప్రాణములువిడువనే విడుచునుగాని భూమియందుండజాలఁడు సంశయములేదు శ్రీరాముఁడు యిట్టిమహాకష్టమునుబొందిచావుటకు నిశ్చయించుటను జూడగానే, మిగులబుద్ధిమంతుఁడును, అన్నయందతిప్రీతిగలవాఁడును నగు లక్ష్మణుఁడునుబ్రాణములనువిడుచును. అన్నదమ్ములగు రామలక్ష్మణులిరువురును మరణమొందుటనువినగానే భాతృవత్సలుఁడగుభరతుఁడును ప్రాణములువిడుచును. భరతుఁడుమృతినొందుటనువిని శత్రుఘ్నుఁడునుప్రాణములువిడుచును ఆట్లుపుత్రులందఱును మృతులౌటనువిన్నతోడనే తల్లులగు కౌసల్యాసుమిత్రకైకేయీలు ప్రాణములనువిడుతురు. మఱియు రామలక్ష్మణులుమృతులౌటవినికృతజ్ఞుఁడును (అనగానొకరుజేసినమేలుమఱువనివాడనుట) సత్యసంధుఁడును వానరేశ్వరుఁడునునగు సుగ్రీవుఁడు ప్రాణములువిడుచును. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. పెనిమిటిజచ్చుటనువినినంతనే, పెనిమిటిజచ్చుటచే గలిగినవ్యసనమువలనబీడింపఁబడినదియును, దుఃఖసాగరమునందు మునిగినదియును, మిగులదైన్యమునొందినదియును సంతోషముడిగినదియును, పతివ్రతయును సుగ్రీవునిభార్యయును నగు రుమయును ప్రాణములువిడుచును. మఱియు వాలిభార్యయగు తారయును, భర్తృశోకముచేఁబీడింపఁబడి మిగులగృశించియుండుటవలన సుగ్రీవుఁడునుమరణమొందుటను విన్నంతనే, ప్రాణములువిడుచును అంతబాలుఁడగు నంగదుఁడునుతలిదండ్రులదుఃఖముచేతను పినతండ్రియగు సుగ్రీవునిమరణముచేతను మిగులపీడింపఁబడినిశ్చయముగ ప్రాణములువిడుచును. అంతవానరులుతమరాజగు సుగ్రీవుఁడుచచ్చెననువ్యసనముచే నఱచేతులతో తలలుగొట్టుకొందురు. పిడికిళ్ళచేనెత్తిమోదుకొందురు. ఇదియునుగాక వానరులందఱును వానరరాజగుసుగ్రీవునిచే, తిన్నవిమాటలచేతను, కోరినవాటినియిచ్చుటచేతను, సన్మానించుటచేతను, బుజ్జగించుటచేతను మఱియునేకప్రకారములచేతను గౌరవింపఁబడుచుండి యిప్పుడుసుగ్రీవుఁడుచావగానే తామునుబ్రాణములనువిడుతురనుటకు నెంతమాత్రమును సంశయములేదు. పిమ్మటవానరులందఱునొకటిగాఁజేరియరణ్యములయందును, పర్వతప్రదేశములయందును, ఇండ్లుమొదలగు నావరణములయందునుక్రీడింపరు మఱియు పుత్రులునుభార్యలును మంత్రులును తక్కినసమస్తవానరులును, రాజుగతించిన వ్యసనమునోర్వజాలక మిట్టపల్లములయందును పర్వతశిఖరములపైనుండి క్రిందపడియును యెచ్చటనున్నవారచటనే ప్రాణములువిడుతురు. ఇదియునుగాక వానరులు సుగ్రీవునియొక్కవ్యసనముచే పీడింపబడివిషమునుభక్షించిగాని, ఉరిదీసికొనిగాని, అగ్నియందుపడిగాని, అహారమునువర్జించిగాని, ఆయుధములచేగాని, ప్రాణములనువిడుతురు. ఇట్లగుటవలన ఇక్ష్వాకువంశవినాశమును, భయంకరమగురోదనంబును, వానరకులక్షయమునగలుగును. ఇందుకేమియుసంశయములేదు కావుననేనిచటనుండి కిష్కింధానగరమునకుఁబోవుటయేలేదు. సీతా

దేవినిజూడకసుగ్రీవునిజూడనేచూడను. ఇదియునుగాక నేను కిష్కింధాపట్టణమునకుఁబోక యిచటనేయుందునేని, ధర్మాత్ములునుమహాధీరులునునగు రామలక్ష్మణులు, నేనింకనుసీతనుజూచివత్తునను భ్రమచేజీవితులై యుందురు అందువలన మంచిహృదయములుగలవానరులును జీవించియుందురు. ఇచటనాకుసీతాదేవి యగపడకపోయెనేని, దైవవశముననోటను జేతులోనుబడిన దానినిభక్షించుచు, చెట్టుక్రిందవాసముజేయుచు నియమముతోగూడుకొని వానప్రస్థుండనైయుండెదను. అట్లుగానియెడల, విశేషముగఁ గందమూలఫలములను నీళ్లనుగల సముద్రసమీపముననుండుజలప్రాయవు భూప్రదేశమునచితిఁబేర్చుకొని భగభగనుండుచుండు యగ్నిలోదుమికిచచ్చెదను. అదియునుగాదేని, ఏమియునుదినకుండునట్టి వ్రతమునునవలంబించిప్రాణములుదేహమునందుండివెడలునట్లు జేసెదను. అంతనాదేహమునుకాకులును క్రూరజంతువులును భక్షింపఁగలవు. ఇట్లుప్రాణములువిడుచుటశ్రేష్ఠమని మహర్షులచేజెప్పబడియున్నది. అట్లుగాకసీతాదేవియగుపడకుండెనేని నీటియందుబడి ప్రాణములువిడిచెదను. మఱియును నేను మొట్టమొదటలంకంజంపుటచే మంగళకరమైన యారంభముగలదియును, సీతనువెదకుటకనుకూలమగు వెన్నెలలుగలిగియుండుటచే మనోహరమైనదియును, ఆంజనేయుఁడులంకానగరమునఁబ్రవేశించినరాత్రియని నాకధికకీర్తి గలిగించునదియును, సీతాదేవినివెదకుచు నిద్రమేల్కొనియుండుటచే మిగులదీర్ఘముగానుండు నట్లగుపడునదియునునగునీరాత్రి, నేనుసీతనుజూడకుండునేని నాకుమిగులవ్యర్థమైదగును. అటుగాదేని, నియమముదాల్చి చెట్టుక్రిందగూర్చుండితపస్సుజేసికొనుచుండెదనుగాని, సుందరములగునేత్రములుగల సీతాదేవినిజూడకయే నేనిచటనుండిమఱలిపోవుటలేదు. అంతియకానిసీతాదేవినిజూడకయే యంగదాదులయొద్దకైననుబోదునేని యచటనే యావానరులందరును ప్రాణములనువిడుతురు. శ్లో॥ వినాశేబహవో దోషాజీవన్ప్రాణిపశ్యతి । తస్మాత్ప్రాణాన్ధరిష్యామిధ్రువో జీవితసంగమః॥ పురుషుఁడుచచ్చినట్టైన యనేకదోషములుసంభవించును, బ్రతికియున్నచో ననేకశుభములనుబొందవచ్చును. కావుననేనుప్రాణములనువిడువక బ్రతికియుందును. అట్లుబ్రతికియుందునేని యెప్పుడైననుయథార్థముగశుభములనుబొందగలను. అనియిట్లనేకప్రకారములుగవానరోత్తముఁడగు నాంజనేయుఁడుపలుమారువ్యసనము నొందుచు దుఃఖసాగర మగ్నుఁడయ్యెగాని నెమ్మదిగా నుండఁడయ్యె. ఇట్లుదుఃఖించుచు నాంజనేయుఁడుమఱలనిట్లనియాలోచించె.

ఈసమాచారమంతయు నెట్లుండిననుండనిమ్ము. మిగులబలపరాక్రమశాలియును పదికంఠములుగలవాడును నగురావణుని చంపనైననుచంపెదను వాడపహరించిన సీతాదేవి యగపడినను యగపడకున్నను వాడుచేసినదుష్కార్యమునకు బదులుగ పగదీర్చికొనినట్లగును. అటుగాదేని యీరావణాసురునిఁ గట్టియెత్తికొని సముద్రమునకుసమీపముగమీదుగా భయపడునట్లుతీసికొనిపోయి "అగ్నిహోత్రునికి యజ్ఞీయపశువును బలిగాసమర్పించినట్లు" రామునకుకానుకగానిచ్చెదను. అనియిట్లు వానరోత్తముఁడగునాంజనేయుడు సీతాదేవినిగానక యనేకవిధములచింతించుచు నేమియుందోచక మఱలనిట్లని యాలోచించె.

మిగుల కీర్తిమంతురాలును శ్రీరామునిభార్యయును నగుసీతాదేవి యగుపడువరకు యీలంకానగరమంతయు పలుమారువెదకుచుండెదను అదియట్లుండనిమ్ము. నేనుసంపాతిమాటనునమ్మి రామునిఁగూడ పిలుచుకొనివచ్చియుందునేని, రాముఁడు తనభార్య యగుపడనందుకలన సమస్తవానరులను నాశనముజేసియుండునుగదా. అట్లారామునిబిలుచుకొనిరాకుండుట కొంతమేలయ్యె. ఇప్పుడు నేనుఆహారాదులనువర్జించి యింద్రియనిగ్రహముజేసి యిచటనేయుండెద. రాముఁడుమొదలగుమానవులును సుగ్రీవుఁడుమొదలగువానరులును, నాకారణమున నాశనమొందకుందురు. ఇదిగోనాయెదుట అశోకవనమగుపడుచున్నది. ఇదిమిగులరమణీయములగు గొప్పచెట్లచే నలంకృతమైయున్నది దీనియందిదివఱకు నేనుసీతాదేవిని వెదుకనేలేదు. దీనియందుఁబ్రవేశించి సీతాదేవినివెదకెదను. అనియష్టవసువులకును యేకాదశరుద్రులకును, ద్వాదశాదిత్యులకును అశ్వినీదేవతలకును, వాయుదేవునకునునమస్కరించి, రాక్షసులకువ్యసనంబభివృద్ధియగుటకై యీయశోకవనమునందుబ్రవేశించెదను. మఱియు నేనీరాక్షసులనందఱినిజయించి, సీతనుదీసికొనిపోయి "గొప్పతపముజేసినవానికి దానిఫలమునొసగునట్లు" ఇక్ష్వాకువంశమును సంతసింపజేయునట్టి శ్రీరామునకిచ్చెదను. అనియిట్లు మహాపరాక్రమశాలియును వాయుపుత్త్రుఁడును నగునాంజనేయుఁడాలోచించి వ్యసనముచేవ్యాకులమునొందిన యింద్రియములుగలవాఁడగుచు కొంతదడవాలోచించి ధైర్యమునవలంబించి పైకిలేచి, యిట్లనిరామలక్ష్మణాదులనుగూర్చి నమస్కరించె.

"శ్లో॥ నమోస్తురామాయసలక్ష్మణాయ దేవ్యైచతస్యైజనకాత్మజాయై। నమోస్తురుద్రేంద్రయమానిలేభ్యో నమోస్తుచంద్రార్కమరుద్గణేభ్యః॥ రామునకునులక్ష్మణు

నకును జనకమహారాజపుత్రికయగు శ్రీరామునిభార్యయైన సీతాదేవికిని నమస్కారమును జేయుచున్నాను. మఱియు యీశ్వరునకును, దేవేంద్రునకును, యమునకును, వాయుదేవునకును, చంద్రునకును, సూర్యునకును, మరుద్గణములకును సమస్తదేవతులకును నమస్కారమును జేయుచున్నాను. అనియిట్లువాయుపుత్రుఁడగు నాంజనేయుఁడుసమస్తదేవతలకును, సుగ్రీవునకును సమస్తదిక్కులకును(అనగాదిక్కధిపతులకును) నమస్కరించి అశోకవనమునకు బోవుటకెత్నించె. అట్లాంజనేయుఁడశోకవనమునకుఁ బోవుటకు మనస్సులోనాలోచించి యనంతరము చేయఁదగిన కార్యములనుగురించి యిట్లనిఆలోచించె.

ఇప్పుడు నేనుబోవుటకు యత్నించియుండు యశోకవనమునిశ్చయముగ ననేకరాక్షసులచే గాపాడఁబడినదిగను, పెక్కువృక్షములచే నిరకటమైనదిగను, సమస్తఅలంకారములచే సంస్కరింపఁబడినదిగను, యుండును. ఈయశోకవనమునురక్షించుటకై రావణునిచేనియోగింపఁబడిన రాక్షసులుదీనిని చక్కగగాపాడుచుందురు. సర్వవ్యాపకుఁడును, మిగులమహాత్ముఁడును నగువాయుదేవుఁడుకూడ రావణునివలనిభయముచే నీచెట్లకుమిగుల బాధకలుగునట్లువీచుటలేదు. ఈవనమునందునిశ్చయముగ సీతయుండుననినిశ్చయించి నేనురామునికార్యార్థముగ వచ్చితినిగాన రావణునకగపడకుండుటకై నాదేహమును మిగులచిన్నదిగజేసికొంటిని. కావునసమస్తఋషిసమూహములును సమస్తదేవతులును యీవిషయమునందు నాకుకార్యసిద్ధియగునట్లుచేయుదురుగాక! మఱియుతనకుతానేబుట్టినవాఁడును, భగవంతుఁడును నగుబ్రహ్మదేవుఁడును, సమస్తదేవతులును, అగ్నిహోత్రుఁడును, వాయుదేవుఁడును, వజ్రాయుధధారియగు దేవేంద్రుఁడును, పాశహస్తుఁడగు వరుణుఁడును, చంద్రసూర్యులును, మహాత్ములగు నశ్వినీదేవతులును వాయుదేవుఁడును, ఈశ్వరుఁడును, నాకుఁగార్యసిద్ధినియిత్తురుగాక. ఇంకనుసమస్తభూతములును, భూతనాయకుఁడును, మఱియుమార్గమునందగుపడువారును, అగుపడకసంచరించువారును, యెల్లవారును నాకుకార్యసిద్ధికలుగజేయుదురుగాక. ఉన్నతమైన ముక్కుగలదియును, తెల్లనిదంతములుగలదియును, దోషములేనిదియును, తెల్లనిచిరునవ్వుగలదియును, తామరఱేకులవంటి నేత్రములుగలదియును, స్వచ్ఛమైన పున్నమచంద్రునితో సరిబోలు మోముగలదియును నగునాపూజ్యురాలగు సీతాదేవిముఖమునెప్పుడుచూడగలను? మఱియుదుష్టుఁడును, పాపముజేయువాఁడును, క్రూరకర్ముఁడును, భయంకరుఁడైనను ప్రసన్నమైన వేషమునుధరించియుండువాడును నగురావణాసురునిచే, బలవంతముగ దీసికొనిరాఁబడినదియును, పాతివ్రత్యమను తపముగలదియును, మిగులనబలయైనను నగునాసీతాదేవిని నేనెట్లుజూడగలను. (అనగాఛూడగలనోలేనో)

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి పదమూడవసర్గముగిసెను.

—{ ఆంజనేయుడు అశోకవనమునందుప్రవేశించి సీతాదేవిని వెదకుట. }—

ఇట్లు మిగులబలపరాక్రమశాలియగు నాంజనేయుఁడు కొంతదడవాలోచించి, చిట్టచివరకా యశోకవనమునకు బోవుటకు మనస్సులోనిశ్చయించి రావణాసురినియింటి ప్రాకారముననుండి యాయశోకవనముయొక్క ప్రహరీమీదికిదుమికె. అట్లాంజనేయుండా యశోకవనముయొక్క ప్రహరీమీదగూర్చుండి యావనముతట్టు పారంజూచె. ఇట్లుజూచి వసంతఋతుప్రారంభమున లెస్సగాబూచియుండుమద్దిచెట్లను, మనోజ్ఞములగుయశోకవృక్షములను, చక్కగాబూచియుండుసంపెంగచెట్లను, విరిగిచెట్లను, పొన్నవృక్షములను, మామిడిచెట్లను, తీగెకానుగుచెట్లను, మఱియు నానావిధములగు వృక్షములనుజూచి మిగులసంతసించిన హృదయముగలవాడయ్యె. అంతనయ్యాంజనేయుఁ డచ్చటనుండి యుల్లెత్రాటివలనవిడువంబడిన బాణమువలెనతివేగముగనెగిరి, మామిడిచెట్లచే మిగులదట్టమైనదియును, అనేక తీగెలసమూహములచేఁ గప్పఁబడినదియును నగునావృక్షవాటికనుబొందె. ఇట్లశోకవనముఁజొచ్చి, చూచువారికి సంతోషమును గలుగఁజేయునదియును, మృగములతోను, సమస్తపక్షిసమూహములతోను నిండినదియును, వసంతఋతువుప్రవేశించుటచే నానావిధములుగ చిగిరించియున్నదియును, పక్షులరుతములచే ధ్వనింపఁజేయఁబడినదియును, వెండివికారములైనవియును బంగారువికారములైనవియును నగువృక్షములచే నంతటనునిండియుండునదియును, సమస్తమృగసమూహములచే నానావిధములగు వర్ణములుగలదియును, నానావిధములగు నవాంతరములుగలదియును, అప్పుడుదయించిన సూర్యునితోసమముగనరుణకాంతిగలదియును, పూలతోనుకాయలతోను ఫలములతోనునిండియుండెడు నానావిధములగు వృక్షములతోగూడినదియును, మదించినకోకిలలచేతను తుమ్మెదలచేతను నిరంతరముసేవింపఁబడినదియును, మదించినానెమళ్ళధ్వనులచేఁ బ్రతిధ్వనింపఁజేయఁబడినదియును, నానావిధము

లగు పక్షిజాతులతో గూడుకున్నదియును నగునశోకవనమును నాంజనేయుఁడువీక్షించె. అట్లుప్రకాశించుచుండెడుఅశోకవనమునుజూచి, యందు, అనింద్యమైనవడవడికగలదియును, శ్రేష్ఠములగు పిరుదులుగలదియును, నగుసీతాదేవిని వెదకుచు, సుఖముగనిదురించుచున్న పక్షులను మేలుకొలిపె. అట్లుమేలొ్కన్న పక్షిసమూహము లెగిరిపోవుచుండగ వానిఱెక్కల దెబ్బలవలనగొట్టబడి యనేకవర్ణములుగల నానావిధములగు పుష్పములురాలుటచే పుష్పవృష్టిగురిసినట్లుండె. ఆఅశోకవనమధ్యమునందు అట్లురాలినపువ్వులచే గప్పఁబడియుండు నయ్యాంజనేయుఁడు "పువ్వులకొండవలె" ప్రకాశించుచుండె. అప్పుడుసీతాదేవినివెదకుటకు సమస్తదిక్కులకును పరువులిడుచున్నవాడును, వృక్షసమూహముయొక్క నడుమనున్నవాఁడునునగు నాంజనేయునిజూచి సమస్తభూతములును వసంతుఁడే మోయనితలచె. అట్టియెడవృక్షములనుండిరాలిన నానావిధములగు పుష్పములచేగప్పఁబడిన యాయశోకవనప్రదేశముసమస్తాభరణములచే నలంకరింపఁబడిన స్త్రీవలెనుండె. మఱియు మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుడధికబలముచే నావృక్షంబులను నలుదిక్కులనుగదలింపగ నందుండి పలువిధములగుపుష్పములురాలె. అప్పుడాచెట్లన్నియును ఆంజనేయునిచేఁగదలింపఁబడి, ఎగరగొట్టఁబడినయాకులును చిగుళ్లునుగలవియును, రాలినపువ్వులునుబండ్లునుగలవియునై "జూదంబుననోడిపోయి వస్త్రాభరణములనుఁబోగొట్టుకొని యపజయమునొందిన జూదరులవలె" గాన్పించుచుండె మిగులవేగవంతుఁడగు నాంజనేయుడు, ఫూలతోనిండియున్న యావృక్షశ్రేష్ఠములనుగదిలింపగా నావృక్షములయందున్న పుష్పములన్నియురాలె. అప్పుడావృక్షములు మహావాయువుచే గదిలింపఁబడినవాటివలె ఆకులు పువ్వులు కాయలు మొదలైనవిరాలి బోదెలుమాత్రమునిలిచె. అందువలన నందున్నపక్షులన్నియు యాచెట్లనువిడిచి పాఱిపోయె. ఆచెట్లన్నియుపక్షులకువాసయోగ్యములుగాకయుండె అట్టియెడ నాయశోకవనము, ఆంజనేయునితోఁకతోను చేతులతోను పాదములతోనుమర్దింపఁబడి విఱిగినవృక్షములుగలదియై "సంభోగోద్రేకమునఁ జెదరినవెంట్రుకలును, ఆలింగనాదులచేరాలిపోయినచందనమును, మధుపానమత్తతచే తెల్లబారి దంతమువలెనుండుయధరమును, గోళ్ళచేతనుపండ్లచేతనుజేయఁబడిన నఖదంతములునుగల యావనస్త్రీవలెప్రకాశించుచుండె అశోకవనము స్త్రీకి హనుమంతుఁడుతనతోకతోదుట్టడమే ఆలింగనముగను, చెట్లనుండిపువ్వులతోగూడినకొమ్మలువిరిగి నేలబడుటయే పుష్పములుముడువబడినతలవెంట్రుకలుజారుటగను, తెల్లనిపుష్పముల మొగ్గలేదంతములుగను, ఆంజనేయుడుతనకాళ్ళచేతను చేతులచేతనుమర్దించుటయే నఖదంతక్షతములుగను, పువ్వులయొక్క తేనెలను ఆంజనేయుడుద్రాగుటయే, అధరపానముగనునూహించునది. మఱియు నాయశోకవనమునందున్న గొప్పతీగలగుంపులు "వర్షాకాలమునందు వింధ్యపర్వతసమీపముననుండు మేఘసమూహములు మహావాయువుచేఁజిందరవందరగజెదరగొట్టబడినట్లు" ఆంజనేయునిచే దెంపివేయఁబడెను. ఆయశోకవనమునందు దిరుగుచుయాంజనేయుఁడు, వినోదార్థము మనోహరముగ రత్నములతో జెక్కఁబడిన మణిమయభూములను వెండివికారములగు భూములను, "స్వర్ణమయంబగు భూములనుజూచె. మఱియు, నానావిధములగు యాకారములు గలవియును. శ్రేష్ఠములగు జలముచేనిండినవియును, అచ్చటచ్చటమిగుల యుత్తమములైన మణులచేజేయఁబడినపడికట్లుగలవియును, ముత్తెపుఛాయయునుపవడపుఛాయయును గలయిసుకతో బ్రకాశించునవియును, స్ఫటికపుమణులతో గట్టబడిన నీటిలోపలిప్రదేశము గలవియును, బంగారువికారములైనవియును నానావర్ణములు గలవియును, గట్టునబుట్టినవియును నగువృక్షములచే బ్రకాశింపజేయబడినవియును, వికసించిన తామరలయొక్కయు నల్లగలువలయొక్కయు సమూహములు గలవియును, చక్రవాకపక్షులయొక్క రుతములచే ధ్వనింపఁజేయఁబడినవియును, నీరుకోళ్ళధ్వనులతోగూడుకున్నవియును, హంసలచేతను బెగ్గురుపక్షులచేతను ధ్వనింపఁజేయఁబడినవియును, మిగులపొడవులగువృక్షములిరువంకలనుగలవియును, అమృతముతో సరిబోలు నుదకముతోనొప్పుచున్నవియును, మంగళకరములైనవియును, నగుకాలువలచే నన్నిప్రక్కలఁజుట్టుకొనఁబడియుండునవియును, పలుదెరంగులైన తీగెలసమూహములచేత వ్యాపింపఁబడినవియును, కల్పవృక్షములయొక్కపుష్పములచేగప్పఁబడినవియును, నానావిధములగు పొదలచే దట్టముగనావరింపఁబడినవియును, మధ్యమధ్యగన్నేరు వృక్షములుగలవియునునగు ననేక నడబావులనుజూచెఁ ఇదియునుగాకక్రీడార్థము మేఘముతోసరిబోలునదియును, మిగుల గొప్పశిఖరములు గలదియును, నానావిధములగు దివ్యకూటములు గలదియును, ఎచ్చటజూచినను శిఖరములచే నలంకరింపఁబడినదియును, ఎచటజూచినను రాతియిండ్లచే నలంకృతమైనదియును, నానావిధములగు వృక్షములచే గప్పబడినదియును, మిగులర

మణీయమైనదియునునగు మంటితోనిర్మింపఁబడిన యొకగొప్పపర్వతమును ఆంజనేయుడుజూచె. ఆక్రీడాపర్వతమున నుండి యతివేగముతో బ్రవహించుచున్నదియై ప్రియునియొక్కతొడనుండి కోపముచేమొగిరిదుమికిపోవుచున్న స్త్రీవలెనున్నదియును, తీరమందుండు చెట్లయొక్కకొనలు నీటియందు వ్రాలియుండుటచే కోపగించుకొనిపోవుచు నిష్టబంధువులచే కోపగించుకొనిపోవలదని నడ్డగింపఁబడిన స్త్రీవలెనున్నదియును, మఱియునుకొంతదూరము ప్రవహించుచు మెట్టనేలలపై ప్రవహింపలేక మరలివెనుకకు వచ్చుచుండుటచే గోపముదీరినదియై మఱలిప్రియునియొద్దకువచ్చుచున్న అనుకూలురాలగు స్త్రీవలెనున్నదియును, నగునొకగొప్పనదిని ఆంజనేయుఁడుజూచె అచ్చటనొకనది ప్రవహించుచుండెను. ఆనదినిచూడగా తనప్రియునిమీద కోపగించుకొనిలేచిపోవుచు బంధువులచే అట్లులేచిపోవుట ధర్మముగాదని బోధింపఁబడి కోపమునువదలి మఱలప్రియునివద్దకువచ్చిన అనుకూలురాలగు స్త్రీవలెనుండెను. అనగాఆవినోదార్థముగ నిర్మింపఁబడిన పర్వతముప్రియునిగను, అచ్చటనుండే మహావేగముగ బ్రవహించుచున్ననది ప్రియునిమీద కోపముచేసికొనిపోవుచున్నస్త్రీగను, నీటియందు వ్రాలియున్న చెట్లకొమ్మలయొక్కకొనలు ప్రాణనాయకుని వదలిపెట్టిపోవుట నీకుధర్మముగాదని చెప్పుటకువచ్చిన యిష్టబంధువులుగను, మెట్టనేలలపై బ్రవహింపనేరక వెనుకకుమరలివచ్చుటవలన కోపమునువదలి అనుకూలురాలై ప్రియునియొద్దకు వచ్చిన స్త్రీగను నెఱుంగునది) ఆనదికిసమీపమున బలువిధములగు పక్షులసమూహములచే సేవింప బడియొప్పుచుండెడు నొకతామరకొలనును యాంజనేయుడుజూచె

దానికిసమీపముననె, చల్లనినీళ్లతో నిండినదియును, శ్రేష్ఠములగు రత్నములతోగట్టఁబడిన పడికట్లుగలదియును, ముత్తెములతోఁజేయఁబడిన యిసుకతోఁ బ్రకాశించునదియును, నానావిధములగు మృగసమూహములతో గూడినదియును, మిగులచిత్రమైనదియును, నానావిధములగు నరణ్యములుగలది యును, మిగులగొప్పదియును, విశ్వకర్మచేనిర్మింపఁ బడినదియును, నానావిధములగు మేడలతోగూడు కున్నదియును, చిత్రవనములచే నంతటనుచక్కగా నలంకరింపఁబడినదియునునగు నొకనడబావిని యాంజనేయుఁడుజూచె. ఆనదబావికి సమీపమునందు పువ్వులతోను పండ్లతోను నిండియుండెడు వృక్షములక్రిందఁ గూర్చుండువారికి ఎండవానలతొందరలేకుండునట్లు నిర్మింపఁబడిన శాలలతోగూడియుండెడు గొప్పతిన్నెలను, వానిపైఆరుకొనుటకు ఉపయోగించుచిన్న తిన్నెలనుయాంజ నేయుఁడుజూచె. అచ్చట, అనేకములగు తీగెలసమూహములతోను, ఆకులతోనుగూడుకున్నదియు, నలుప్రక్కలను బంగారపుతిన్నెలచే నావరింపఁబడినదియును, స్వర్ణచ్ఛాయగలదియునునగు నొకశింశుపా వృక్షమునుజూచె ఆయశోకవనమునందు నానావిధములగు భూములనుపల్లపు ప్రదేశములను నీటిబుగ్గలనుజూచె. మఱియునగ్నితో సమానముగఁ దేజరిల్లుచుండెడు మఱికొన్ని సువర్ణఛాయవృక్షములను ఆంజనేయుఁడుజూచె అప్పుడాకాంచన వృక్షములకాంతిచే నాంజనేయుఁడు, "మేరుపర్వతపుకాంతిచే సూర్యుఁడుకాంచనచ్ఛాయగలవానివలెదోచినట్లు" బంగారుదేహముగల వానివలెగాన్పించు చున్నానని యెంచె. ఆకాంచనవృక్షంబులకు అనేకచిరుగంటలు గట్టఁబడియుండె. అప్పుడుగాలి వీచుటవలన నాచిరుగంటలు మోగుటచే ననేకవిధములైన శబ్దములుగలిగె అట్లాశబ్దములచే మిగులరమణీయమై యొప్పుచున్న యశోకవనమునుజూచి యాంజనేయుఁడు ఆశ్చర్యమునుబొందె మఱియు నయ్యాంజనేయుఁడు, లెస్సగా బూచియుండిన కొనలుగలదియును, క్రొత్తగచిగిరించిన యిగుళ్లచే నొప్పుచున్నదియును, ఆకులచేఁగప్పఁ బడినదియునునగు శింశుపావృక్షముమీద నెక్కి యిట్లనియాలోచించె. శ్రీరామునిజూచుటయందు మిగులఁగోరిక గలదియును, వ్యసనముచేమిగులఁబీడింపఁ బడినదియును దైవవశమున నిచటికివచ్చి ఏమియుందోచక నిట్టట్టుదిరుగుచున్నదియునగు సీతాదేవినియిచ్చట నీవృక్షముమీదనుండియేశీఘ్రముగజూచెదను మిగుల దురాత్ముఁడగు రావణాసురునియొక్క యీయశోకవనము మహారమణీయముగనున్నది. దీనియందు సంపెంగవృక్షములు పొగడవృక్షములు, శ్రీగంధపువృక్షములును విశేషముగ బ్రకాశించుచున్నవి ఇదొనటనుండు యీతామరకొలను పక్షిసమూహములచే సేవింపఁబడినదియగుచు మిగులరమణీయముగ నున్నది.

జనకమహారాజ పుత్రికయును శ్రీరామునిభార్యయునునగు సీతాదేవినిశ్చయముగ సీతామరకొలనుకువచ్చును. శ్రీరామునిభార్యయును మిగులయిష్టురాలును, మహాపతివ్రతయును, వనములలోదిరుగుటయందు మిగులఆశగలదియునునగు సీతాదేవినిస్సంశయముగ నీస్థలమునకువచ్చును అటుగానిచో, లేడికండ్లవంటి కండ్లుగలదియును, విచక్షణురాలును, పూజ్యురాలునునగు సీతాదేవి, రాముని నెడబాయుటవలన గలిగినవ్యసనముచే మిగులగృశించుచున్నదియై తాపోపశమనార్థము యీతామరకొలను యొద్దనుండువనమున అవశ్యముగవచ్చును లేక, సుందరములైననేత్రములుగలదియు, వనవాసనమునందు మిగులనాసక్తిగలదియును,

అరణ్యమునందు దిరుగుచున్నదియునునగు సీతాదేవిశ్రీరాముని వియోగమువలన గలిగినవ్యసనముచే బీడనొందినదియగుచు నిచటికివచ్చును. లేక శ్రీరామునిభార్యయును, జనకమహారాజపుత్రికయును, మిగులపతివ్రతయునునగు సీతాదేవిమునుపునిరంతరమువనమునందుండు వారిపైనతిప్రేమగలిగివారితోటి వనములలో సంచరించుటయందు మిగులనాశగలదియైయుండె కావుననిప్పటి కవశ్యముగవచ్చును లేక సంధ్యాకాలమునందు సంధ్యాధిదేవతకు నమస్కరించుటకొఱకు ఆచమనముజేయుటకై యౌవనమధ్యస్థురాలును, శ్రేష్ఠమైనవర్ణముగలదియును, జనకమహారాజ పుత్రికయునునగుసీతాదేవిసంధ్యావందనముజేయుటకుమంగళకరమగు నీనదికివచ్చును. లేక ఈసుందరంబగు నశోకవనమురాజోత్తముడగుశ్రీరామునికిప్రియభార్యయునుత్రిలోకసుందరియునునగుసీతాదేవికిదగియున్నది. కావునపున్నమచంద్రుని బోలు ముఖముగల సీతాదేవిబ్రతికియుండునేని అవశ్యముగనీమంగళకరమగు నదికివచ్చును. అనియిట్లు మహాత్ముడగు నాంజనేయుఁడు ననేకవిధములుగ నాలోచించుచు, తెన్నగఁ బూచియున్న యాశింశుపావృక్షముయొక్క ఆకులసందు నదాగి, మనుజేశ్వరుఁడైన శ్రీరామునిభార్యయగు సీతాదేవియచటికివచ్చునని యెంచినలుగడలఁ గలయంజూచుచు, ఆయశోకవనమునందు గలవిశేషములన్నిటిని చక్కగాఁజూచుచుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి పదునాలగవసర్గముగిసెను.

-(*)

{ఆంజనేయుడు అశోకవనమునందు సీతాదేవినిగుర్తించి సీతాదేవి యేయని నిశ్చయించుట.}

అంతనాంజనేయుడు ఆశింశుపావృక్షము మీదగూర్చుండి, సీతాదేవినివెదకుటకై నలుగడలనుజూచుచు క్రిందభూమినిజూచుచు మఱలనాయశోకవనము నంతయునుజూచె. అట్లాంజనేయుఁడా శింశుపావృక్షముమీదనుండి నలుదిక్కులనుజూచి. కల్పవృక్షపుతీగెలతోను, వృక్షములతోను బ్రకాశించుచున్నదియును, శ్రేష్ఠమగువాసనలతోను రసముతోను గూడినదగుచు సర్వత్రతెన్నగా నలంకరింపఁబడినదియును. నందనవనముతో సరిబోలియున్నదియును, మృగములచేతను పక్షులచేతను నావరింపఁబడినదియును, మిద్దెలచేతను ప్రాసాదములచేను మిగులయిఱుకటమైనదియును, కోకిలలయొక్క వ్యాకులధ్వనులచే ధ్వనించుచున్నదియును. బంగారుఛాయగల నల్లగలువలతోను కమలములతోను నొప్పుచుండెడు నడబావులచే బ్రకాశించుచున్నదియును, అనేకములగు పీఠములతోను రత్నకంబళులతోనుఁ గూడుకొనియున్నదియును, అనేకములగు భూమిలోపలిగృహములతో గూడుకొనియున్నదియును, సమస్తఋతువులయందును కాచెరిపూచెడిచెట్లచే రమణీయమైనదియును, ఎఱ్ఱగపూచియుండెడు అశోకవృక్షములకాంతిచే సూర్యోదయమునందలి కాంతివంటికాంతిగలిగి అగ్నిలేకయెమండుచున్నట్లున్నదియును, అనేకములుగ బయలువెడలుచున్నవియును, నానావర్ణములు గలవియును, పూగుత్తులెశిరోభూషణములుగ గలవియునునగు పక్షులచేనాకులు కొమ్మలుమొదలగునవిలేనట్లుగ జేయబడినదియును, చెట్లమొదటనుండి కొనవరకును పూలచేవ్యాపించియున్నదియును, చూచువారలవ్యసనమునుపోగొట్టి సంతసమును గలుగజేయునట్టి యనేకయశోకవృక్షములు గలదియును, తెన్నగబూచి యుండుటవలన పుష్పభారముచే భూమినితాకు చున్నట్లున్న కొండగోగులతోను, తెన్నగబూచియుండు నోదుగుచెట్లతోను, కూడియున్నదియును, నగునశోకవనమును తెన్నగజూచె. అట్టియెడనాయశోకవనము తెన్నగబూచియుండు వృక్షములకాంతిచే నంతటనుజ్వలింపు చున్నట్లుగాన్పించె. ఆయశోకవనమునందు సురపొన్నలును, ఏడాకులయరటిచెట్లును, సంపెగలును, విరిగివృక్షములును, వేళ్లువిశేషముగపైకి పెరిగితెన్నగబూచి ప్రకాశించుచుండె. మఱియునందు గొన్ని బంగారు వర్ణముగలవిగను మఱికొన్నియగ్ని శిఖలవలెనున్నవియును, కొన్నియింద్రనీలపు కాంతిగలవిగనునుండె. మఱియునకయశోకవృక్షములుండెను. మఱియునుపలువిధములగు యుద్యానవనములతోగూడి నందనవనమను పేరుగలయింద్రుని యుద్యానవనమునకంటె మిక్కిలిశ్రేష్ఠముగ నున్నదియును, చూచువారలకు అత్యాశ్చర్యమును గలుగజేయునట్టి చైత్రరథమను పేరుచే నొప్పుచుండెడు కుబేరుని యుద్యానవనముతో సరిబోలియున్నదియును

ఇట్టిదనిచెప్పుట కలవిగానిదియును, మిగులశ్రేష్ఠమైనదియును, అతిరమణీయమైనదియును, కాంతిచేదేజరిల్లు చున్నదియును పుష్పములనెడి నక్షత్రములతో గూడినదియై రెండవయాకాశమువలె బ్రకాశించుచున్నదియును, నానావిధములగు పుష్పములనెడి పలుదెరంగులైన రత్నములతో గూడి నానావర్ణములుగలదియై యైదవసముద్రమువలెనున్నదియును, సమస్తఋతువులయందును పూచెడుకాచెడు నవియును, మధుగంధముతో గూడినవియునునగు వృక్షములచేవ్యాపించి యున్నదియును, నానావిధములగు ధ్వనులుజేయుచున్న మృగసమూహములచేతను, పక్షులసమూహములచేతను మిగులరమణీయమైనదియును, నానావిధము

లగు వాసనలుగలవాయువుచే నొప్పుచున్నదియును, "మిగుల శ్రేష్ఠమగు వాసనగలదియును, మనస్సునురంజింపఁజేయునదియు నునై మిగుల పరిమళముతో గూడుకొనియుండెడు రెండవగంధమాదనపర్వతమువలె" నున్నదియును, నగు నాయుద్యానవనమును యాంజనేయుడుజూచె. ఆయశోకవనమునందు ఆంజనేయుడున్న స్థలమునకు సమీపమున మిగుల ఉన్నతమైనదియును, వేయి స్తంభములతో గూడినదియును, కైలాసపర్వతమువలె మిగుల తెల్లనైయున్నదియును, పగడములచే జేయబడిన మెట్లుగలదియును, శ్రేష్ఠమగు బంగారపు తిన్నెలు గలదియును, మహాప్రకాశముతో గూడినదియగు నేత్రములను భ్రమింపజేయుచున్నదియును, మిగుల నిర్మలమై నదియును, మహోన్నతాకారము గలదియగుటవలన ఆకాశమును నొరయుచున్నదానివలెనున్నదియునునగు నొక మేడను జూచె.

పిమ్మట ఆంజనేయుడు ఆవృక్షముపైనుండియే, ఆమేడకుసమీపమున మిగుల మాసిముఱికితోగూడికొనియుండు వస్త్రమును ధరించియున్నదియును, రాక్షసస్త్రీలచే బరివేష్టింపబడినదియును, ఉపవాసములచే మిగుల కృశించుచున్నదియును, మిగులదైన్యమునొందినదై శుక్లపక్షప్రారంభమునందలి నిర్మలమగు చంద్రరేఖవలెనున్నదియును, పలుమారునిట్టూర్పులు విడుచుచున్నదియును, వేషభాషలచే మిగుల మారియున్నను కొంతవరకు గుర్తింపదగిన యాకారముతో గూడుకొనియున్నదియును, మిగులమనోహరమైన కాంతిగలదియయ్యును, పొగచేగప్పబడిన యగ్నిశిఖవలెనున్నదియును, పచ్చనివర్ణముగలదియై మిగులజీర్ణించిన వస్త్రమునువిడువక ధరించియున్నదియును, స్నానముమొదలగు దేహసంస్కారములు లేమింజేసి మిగుల మలినముతో గూడుకొనియున్నదియును, అలంకారహీనమై కమలములులేని కొలనువలె నున్నదియును, సిగ్గుచేదలవంచుకొని యున్నదియును, దుఃఖించుచున్నదియును, మిగుల వాడుబారిచూచువారికి వ్యసనమును గలుగజేయుచున్నదియును, అంగారకగ్రహముచే బీడింపబడిన రోహిణీ నక్షత్రమువలెనున్నదియును, కండ్లనిండగనీళ్లుగ్రక్కుకొని భయముచేవడవడవడకుచున్నదియును, భుజింపకుండుటచే మిగులకృశించియున్నదియును, నిరంతరము వ్యసనమును యోచనయున్నే మనసునందు గలదియును, నిరంతరమును దుఃఖించుచుండుటచే వెలవెలబోవుచున్న ముఖముగలదియును, తనయిష్టజనములనెవ్వరినిజూడక రాక్షసస్త్రీసమూహములచే బరివేష్టింపబడియుండుటచే, తనజాతిమృగములచే విడువబడి కుక్కలచేనావరింపబడియున్న ఆడులేడిపిల్లవలెనున్నదియును, సంస్కారాదులులేమింజేసి తలవెండ్రుకలన్నియు పెనుచుకొని యేకజడగానేర్పడి నల్లనికృష్ణసర్పమువలెపిఱుదులవఱకు వ్రేలుకాడుచున్నజడతో గూడుకొనియున్నదియును. శరత్కాలమునందు నల్లని వృక్షసమూహములు గల యరణ్యములతోగూడియుండు భూమివలెనున్నదియును, సుఖమనుభవింపదగినదియును, వ్యసనముచే గ్రాగుచున్నదియును, ఇదివరకు దుఃఖములనెఱుగనదియును, ఇప్పుడమితవ్యసనము ననుభవించుచున్నదియును నగు సీతాదేవిని సమీపమునంగాంచె. అట్లు మిగులమలినముతో గూడినదియును, కృశించిన దేహముగలదియును, వెడల్పైన కన్నులు గలదియును నగు నాసీతాదేవిని ఆంజనేయుడుజూచి, ఉచితములగు కారణములచే నాబిడయే సీతాదేవియని యూహించె. మఱియు నాకామరూపియగు రాక్షసుండపహరించి యెత్తికొనిపోవుచుండగ మేముచూచిన స్త్రీకి యేరూపసౌందర్యములున్నవో యారూపసౌందర్యములే యీ స్త్రీకినినున్నవి. ఈ స్త్రీయే సీతాదేవికాబోలు. పున్నమనాటిచంద్రునితో సరిబోలు మోముగలదియును, మిగుల సుందరములగు కనబొమలుగలదియును, మనోహరములై వట్రువలగు స్తనములుగలదియును, పూజ్యురాలును, తనకాంతిచే పదిదిక్కులను వెలిగింపజేయుచున్నదియును, మిగులప్రసిద్ధమగు నల్లనివెండ్రుకలుగలదియును, దొండపండువంటి పెదవిగలదియును, సుందరమగు సన్నని నడుముగలదియును, స్థిరతనొందినదియును, తామరఱేకులవంటి నేత్రములుగలదియును, మన్మథుని భార్యయగు రతీదేవివలెనున్నదియును, సమస్తప్రపంచమునకును పున్నమచంద్రునికాంతివలె మిగుల యిష్టురాలును, భూమిపైగూర్చున్నదియును, మిగులకృశించినదియును, నియమముతో గూడుకొనియున్న తాపసస్త్రీవలెనున్నదియును, భయమునొందెడు స్వభావముగలదియును, నిట్టూర్పులువిడుచుచు శ్రేష్ఠమగు నాగకన్యకవలెనున్నదియును, మహావ్యసనముచేత పొగతోగూడిన నగ్నిశిఖవలెనున్నదియును, సందేహముతోగూడిన ధర్మశాస్త్రమువలెనున్నదియును, క్షీణించిన సంపదవలెనున్నదియును, నశించిన శ్రద్ధవలెనున్నదియును, సఫలముకాని ఆశవలెనున్నదియును, విఘ్నమునొందిన కార్యసిద్ధివలెనున్నదియును, కపటముతో గూడిన బుద్ధివలెనున్నదియును, అపనిందచేజెడిన కీర్తివలె నున్నదియును, రామునితోగలయకుండు నట్లడ్డగింపబడి మిగులదుఃఖించుచున్నదియును, రాక్షసునిచే నపహరింప బడుటచే మిగులకృశించుచున్నదియును, బలహీనురాలును, జింకపిల్ల నేత్రములవంటి నేత్రములుగలదియును, నలుప్రక్కలను జూచుచున్నదియును, కన్నీళ్లచేనిండిన మోముగలదియును, నల్లని

వియువంకరలునునైన కనుఱెప్పలుగలదియును, మహావ్యసనములోగూడియుండుటచే నిర్మలముగాని ముఖముతోగూడినదియును, పలుమారునిట్టూర్పులు విడుచుచున్నదియును, మిగులమురికితో గూడియున్నదియును, వ్యసనమునొందినదియును, అలంకరించు కొనదగినదియును, అలంకార హీనయైయున్నదియును, వర్షాకాలమునందలి మేఘముచే గప్పబడిననక్షత్రములకు అధిపతియగు చంద్రునికాంతివలె నున్నదియునునగు సీతాదేవిని యాంజనేయుడుజూచె. అట్లుచూచి యాసీతాదేవిని పలుమారు జూచుచు "అభ్యాసములేక మఱచినవిద్యయుంబోలె" (అనగాచక్కగావల్లింపని విద్యవలె) ఈ స్త్రీ సీతయానోకాదోయని మిగుల సందేహమును బొందె. (తర్కము, వ్యాకరణము, మొదలగు శాస్త్రములయందువ్యుత్పత్తిలేనివాడు ఒకవాక్యమునకు అర్థమును ఆలోచించి సరియైన అర్థమును దెలిసికొననేరక, వ్యుత్పత్తిచక్కగా గలిగిన పిమ్మట ఆవాక్యముయొక్క అర్థమును పూర్ణముగ దెలిసికొనినట్లు) అలంకారహీనయై యుపవాసాదులచే గృశించి దేహసంస్కారాదులులేక మాఱురూపమునొంది గుఱుతు పట్టరాకయున్న సీతాదేవిని యాంజనేయు డతిప్రయాసముచే నీస్త్రీయెసీతాదేవిగా నుండునని గుఱుతుపట్టితెలిసికొనెను. మఱియును నిందింపబడనిదియును రాజకుమార్తెయును విశాలములగు నేత్రములు గలదియునునగు నా స్త్రీని కొన్నిగుర్తులచే సీతాదేవియే యని యూహించె. ఇదియునుగాక యాంజనేయుడు బయలువెడలు నప్పుడు శ్రీరాముడు యేయే యాభరణములను సీతాదేవి యేయే యవయవములయందు ధరించి యున్నదని గుఱుతుజెప్పెనో ఆసొగసైన ఆభరణములగు కమ్మలును, పుష్పములవలెనుండెడి భూషణవిశేషములు అనగా జంవులును, రత్నఖచితములైనహస్తాభరణములు మొదలగు సొమ్ములు, భర్తయొక్క విరహతాపమువలన గలిగిన ఉష్ణముచే మలినము గలవైయుండె. మఱియు నాభూషణములు పెనిమిటి సమీపమునలేనపుడు ధరించుకొనుట యుచితముగాదు కావున నాభూషణములన్నియుదీసి చెట్టుకొమ్మకు దగిలించియుండె. అట్లుచెట్టుకొమ్మకు దగిలించియుండు ఆ యాభరణములను సీతాదేవి బహుకాలముధరించి యుండుటచే దేహమున నాయాస్థలములయందుయేర్పడిన ముద్రలను కపిశ్రేష్ఠుడగు నాంజనేయుడు చూచె. అట్లుజూచి తనలో తానిట్లని యాలోచించె. రాముడు యేయేయాభరణములనుగుఱుతుగాజెప్పెనో ఆయాభరణములన్నియు నివియేయని తలచెదను. ఇదియునుగాక రాముడుచెప్పినయాభరణములలో సీతాదేవి రావణునిచే ఎత్తికొనిపోబడుచు ఏయేయాభరణములను ఋశ్యమూకమున జారవైచిపోయెనో యవితప్ప తక్కిన యాభరణములన్నియు నివియేను అందుకెంతమాత్రమును సంశయములేదు. మఱియు సీతాదేవి ఋశ్యమూకపర్వతమును సమీపించినపుడు ఆభరణములనుముడిచి యాపర్వతముపై జారవైచినదియును బంగారురేకులవంటి కాంతిగలదియును పైటగధరించియున్నదియును నగుపీతాంబరమును వానరు లందఱును జూచిరి అప్పుడు సీతాదేవి వస్త్రమునందుగట్టి క్రిందపారవైచినవియును మిగులశ్రేష్ఠములైనవియును గొప్పవియును నగునాయాభరణములను గూడ జూచిరి. ఆఋశ్యమూకమున జారవైచినవస్త్రమును యిప్పుడు యీస్త్రీ ధరించియుండెడు వస్త్రమును ఱెండును యేకవర్ణమును కాంతియును గలవిగనేయున్నవి. అయిన నీవస్త్రమును యీస్త్రీ బహుకాలముగ విడువక యొకటినేధరించి యుండుటవలన మిగులనలిగిమాసియున్నది. కావున శ్రీరామునికి ప్రియభార్యయును, మిగుల బతివ్రతయునునగు ఏస్త్రీ యారాముని నేత్రములకగపడకుండినను నిరంతరము రామునిచే ధ్యానింపబడుచు నారామునియొక్క హృదయమునకు నెప్పుడును నగపడుచునుండెడు బంగారుకాంతివంటిదేహకాంతితో ప్రకాశించెడు సీతాదేవియీస్త్రీయేను. మఱియు రాముడు ఏస్త్రీని గుఱించి "స్త్రీ" యైనఆడుది అగుపడకపోయెనదే ఎంత కష్టపడుచున్నదో అనుదయవలనను, ఆశ్రితురాలు కావునతనచేరక్షింపబడుచుండి యిప్పుడు రక్షింపబడుటకు లేకపోయెనే అను, అనుతాపమువలనను, ధర్మపత్నియగుటవలన సకల ధర్మములకు సహాయురాలుగనుండిన ప్రియభార్యయగుపడలేదను వ్యసనమువలనను, తనకు "ప్రియురాలగుటవలన" విరహతాపమునకోర్వలేక మన్మథవికారమువలనను, ఇట్లుదయచేతను, అనుతాపము, వ్యసనము, మన్మథవికారము, ఈనాల్గింటిచేతను పరితపించుచున్నాడో, ఆ సీతాదేవి యీస్త్రీయే. ఇదియునుగాక యీ సీతాదేవికెయేరీతిగ సౌందర్యమును అవయవ సౌష్టవమును నున్నదో అదేరీతిగ యారామునకును నున్నవి ఆరామున కేరీతిగ సౌందర్యాది గుణములున్నవో అదేరీతిగ నీసీతకును గలిగియున్నవి. కావున నల్లగలువలవంటి నేత్రములుగల యీసీత రామునకు భార్యయే. ఇంకను, ఈసీతాదేవియొక్క మనస్సు రామునియందును, ఆరామునియొక్కమనస్సు యీసీతయందును లీనమైయుండుటచే మహాపతివ్రతయగు సీతయును ధర్మస్వభావుడగు నారాముడును యింతవఱకును బ్రతికియున్నారుగాని వేరుగాదు. మఱియును శ్రీరాముడు యిట్టిసకలసద్గుణసంపన్నురాలునుభార్యయునునగు

సీతాదేవిని యెడబాసియుంకను శరీరమును ధరించియున్నాఁడు. వ్యసనముచే దేహమును విడువకున్నాఁడనునది మిగుల నాశ్చర్యము గనున్నది. ఇట్టి దుష్కరమగు కార్యమును నితరులెవ్వరు చేయఁజాలరు. మిగుల శ్రేష్ఠురాలగు సీతాదేవిని విడిచి, మహాబాహుఁడగు రాముండొకనిమిష మాత్రమైనను బ్రతికియున్నాఁడు. ఇది అన్యులకు సాధ్యమైదిగాదు. అని యిట్లాంజనేయుఁడు అనేకప్రకారములుగ యోచించి, సీతాదేవిని జూచుటచే మహాసంతోషమును బొంది శ్రీరాముని తనమనస్సునందనేకప్రకారముల స్తుతించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి పదునైదవసర్గముగిసెను.

ఆంజనేయుడు సీతాదేవియొక్క కష్టమును జూచి చింతించుట

ఇట్లు వానరోత్తముఁడగు నాంజనేయుఁడు, పొగడఁదగిన సీతాదేవిని, సుగుణసంపత్తిచే నొప్పుచున్న శ్రీరాముని, మిగుల లెస్సఁగఁ బ్రస్తుతించి చింతాసముద్రమునందు మునిగె. అట్లు చింతాపరవశుఁడై కొంతదడ నాలోచించి పిమ్మట బొటబొట కన్నీరు గార్చుచు సీతాదేవి నుద్దేశించి యిట్లని దుఃఖించె. శ్లో॥ మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా। యది సీతాపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః॥ గురువులచే లెస్సగ శిక్షింపఁబడినవాఁడును, ధర్మాత్ముఁడును నగు లక్ష్మణునిచేఁ బూజింపఁదగినదియును, గురువగు శ్రీరామునకు ప్రియభార్యయునునగు సీతాదేవిగూడ నిట్లు దుఃఖమనుభవింపవలసివచ్చెగదా; ఏమి కాలముయొక్క వ్యత్యాసము ఆహా కాలము నతిక్రమింప నెవ్వరికిని సాధ్యము గాదు. ఈసీతాదేవి, రాముని పరాక్రమమును, బుద్ధిమంతుఁడగు లక్ష్మణుని శౌర్యమును లెస్సగ నెఱిఁగినది కావున "వర్షాకాలమునందు గంగానది తగ్గియుండునట్లు" మిగుల దుఃఖింపకున్నది. శ్రీరాముఁడు శీలమునందును, వయసునందును, సదాచారప్రవర్తనమునందును సత్కులప్రసూతియందును, శుభలక్షణములయందును నీసీతకుఁ దగియున్నాఁడు. నల్లని నేత్రములుగల యీసీతాదేవియును నారామునికిఁ దగియున్నది. అని యిట్లాంజనేయుఁడు, నూతనబంగారముయొక్క కాంతివంటి కాంతిగలదియును, లోకమునకంతకును ప్రియురాలు లక్ష్మీదేవివలెనున్నదియును నగు సీతాదేవిని జూచి యిట్లు చింతించి మనస్సున శ్రీరాముని దలంచి తనలో తానిట్లని యాలోచించె

మిగుల విశాలములగు నేత్రములుగల యీసీతాదేవికొఱకై యే శ్రీరాముఁడు మహాబలశాలియగు వాలిని సంహరించె. మఱియు శౌర్యమునందు రావణాసురునితో సమానుండగు కబంధుఁడను రాక్షసుఁడు గూడ యీమెకొఱకే చంపఁబడె. ఈసీతాదేవికొఱకే శ్రీరాముఁడరణ్యమున విక్రమించి, "దేవేంద్రుఁడు శంబరాసురుని సంహరించినట్లు" మహాపరాక్రమశాలియగు విరాధుని సంహరించె. ఈసీతకొఱకే రాముఁడు జనస్థానమునందు క్రూరకర్ములగు పదునాలుగువేల రాక్షసులను, అగ్నిజ్వాలలతో సమానమగు బాణములచే సంహరించె. ఈసీతాదేవినిమిత్తమునను, పరమాత్మజ్ఞానియగు రాముఁడు ఖరుని, మహాపరాక్రమశాలియగు దూషణుని, త్రిశిరుని వీరలమువ్వురు నిఁ జంపె. ఈసీతాదేవినిమిత్తమునను, వాలిచే పాలింపఁబడుచున్నదియును, పొందుటకశక్యమైనదియును, లోకమునందు మిగుల గౌరవమును బొందినదియును వానరైశ్వర్యమును నగు, రాజ్యమును సుగ్రీవుండు బొందె. మఱియు నీసీతాదేవికొఱకే గదా శ్రీమంతమును, నదనదీపతియును నగు నీమహాసముద్రమును దాటి యీలంకానగరమునకు నేను వచ్చితిని. కావున నిట్టి సీతాదేవి నిమిత్తముగ శ్రీరాముఁడు చతుస్సముద్రముద్రితమగు భూమినంతయును, లేక సమస్తలోకములను గూడ తలక్రిందుగ జేసినను యుక్తమేనని నాకుఁ దోచుచున్నది. ఇదియును గాక త్రైలోక్య రాజ్యసంపద యెక్కువా? లేక జనకమహారాజుకూతురగు జానకి యెక్కువా? యని యోచించి చూడగా ముల్లోకములయొక్క రాజ్యసంపదంతయును సీతాదేవియొక్క పదియాఱవపాలునకు సరిరాదు. మఱియు ధర్మస్వభావుఁడును మిథిలాధిపుఁడును మిగుల పూజ్యమైన స్వభావముగలవాఁడును నగు జనకమహారాజుయొక్క పుత్రికయును, పెనిమిటియే దృఢమగు వ్రతముగాఁ గలదియును, కమలపరాగముతో సమానమై మంగళకరమైన యాగక్షేత్రమునందలి పరాగముచేత వ్యాపింపఁబడినదియును, నాగటిమొనచే దున్నఁబడినదియునునగు భూమిని పెకలించుకొని మీదికే తెంచినదియునునగు సీతాదేవి యీస్త్రీయే. ఈసీతాదేవి మిగుల పరాక్రమముగలవాఁడును శ్లాఘ్యమైన స్వభావముగలవాఁడును యుద్ధములయందు వెనుకదీయనివాఁడునునగు దశరథమహారాజుయొక్క పెద్దకోడలు. మఱియు నీసీతాదేవి సకలధర్మముల నెఱిఁగినవాఁడును, కృతజ్ఞుఁడును (ఒకరుచేసిన మేలు మఱువనివాఁడు) పరమాత్మజ్ఞానముగలవాఁడునునగు శ్రీరామునియొక్క భార్య, అట్టి యీస్త్రీ యిప్పుడు యీరాక్షసులచేఁ జిక్కి సంకటపడుచున్నది. ఈసీతాదేవి పెనిమిటియందలి స్నేహమునకు బద్ధురాలై సమస్తసుఖములను విడిచి వ్యసనములను దలఁపక నిర్జనంబగు నరణ్యప్రదేశమును బొందె అట్లు బొంది యడవుల

యందు కందమూలఫలాదులనుభక్షించి తృప్తినొంది పెనిమిటిని సేవించుటయందు మిగులనాసక్తురాలగుచు నడవియందును నంతఃపురమునందువలె పరమసంతోషమును బొందుచుండె. మఱియును, బంగారమువంటి దేహకాంతిగలదియును, నిరంతరము మిగులనెమ్మదిగమాటలాడునదియును, మిగులనిడుమలఁబడుచున్నదియునునై నీసీతాదేవి మహావ్యసనములనుగూడ నోర్చుచున్నది. అయ్యయో ఇది మిగులసంతాపకరము. కావున సదాచార సంపన్నురాలును, రావణాసురునిచే మిగులబాధింపఁబడుచున్నదియును నగు నీసీతాదేవిని రాముఁడు "మిగులదప్పినొందినవాఁడు చలివేంద్రమునుబోలె" అత్యుత్సాహముతోఁ జూడఁగలఁడు. మఱియు "రాజ్యభ్రష్టుఁడైనరాజు మఱలతనరాజ్యమునుబొంది మిగులసంతోషించునట్లు" రాముఁడునునిశ్చయముగ మఱలసీతనుబొంది సంతసింపగలఁడు. ఈసీతాదేవియునుసమస్తభోగములను బంధుజనులను విడిచియును, ఆరామునియందేమనస్సునునిలిపి యారామసమాగమమునుగోరుచు ప్రాణములునువిడువక దేహమునుధరించియున్నది. మఱియునీసీతాదేవి యీరాక్షసస్త్రీలనెంతమాత్రముజూచుటలేదు. పుష్పములతోను ఫలములతోను నిండియుండెడు నీవృక్షములనుగూడజూచుటలేదు. ఏకాగ్రచిత్తమైమనస్సునందు నెల్లప్పుడును శ్రీరామునేధ్యానించుచున్నది. శ్లో॥ భర్తానామపరంనార్యా భూషణం భూషణాదపి। ఏషాతురహితాతేన భూషణార్హానశోభతే॥ స్త్రీలకుసమస్తాభరణములకన్న నెక్కుడైన యాభరణము పెనిమిటి. అట్టిపెనిమిటిని యెడబాసియుండినపుడు యనేకాభరణములను ధరించుకొన్నను శోభింపరు కావునసమస్తాభరణములనుధరింపఁదగిన యీసీతాదేవి పెనిమిటిని యెడబాసియుండుటచే ప్రకాశింపకున్నది. లోకనాథుఁడగు శ్రీరాముఁడిటువంటి సీతాదేవినివిడిచి యింకనుదేహమునుదాల్చియున్నాఁడు. ఇదిమిగులదుష్కరమగు కార్యము. దీనినితరులెంతమాత్రమునుజేయఁజాలరు. నల్లనితలవెండ్రుకలకొనలుగలదియును, తామరరేకులతోసమానములైన నేత్రములుగలదియును, సమస్తసుఖములను ననుభవింపఁదగినదియును, మహావ్యసనమును బొందుచున్నదియునునగు నీసీతనుజూచినంతనే నాకునుగూడ మహావ్యసనముగలుగుచున్నది.

ఇట్లుండగ శ్రీరామునికిదుఃఖముగలుగుననుట కేమిసంశయము. భూదేవివలె నోర్పుగలదియును, తామరరేకలతోసమానమగు నేత్రములుగలదియును నగుసీతాదేవిపూర్వమురణ్యమునందు రామలక్ష్మణులచేఁ గాపాడఁబడుచుండి యిపుడుమిగులభయంకరములగు నేత్రములుగలరాక్షసస్త్రీలచేఁగాపాడఁబడి చెట్టుక్రిందఁ గూర్చుండియున్నది. మఱియు జనకమహారాజపుత్రికయగు సీతాదేవి యిప్పుడుమంచుచే క్షీణించినతామరతీగవలె కాంతిహీనయై సమస్తవ్యసనములచేత పీడింపఁబడుచు "ప్రియునియెడబాసిన యాడుజక్కవవలె" చూచువారలకు జాలిఁబుట్టించునట్లు మహాదుఃఖమునుబొందియున్నది. ఇదియునుగాక, పుష్పభారముచేవంగినకొమ్మలుగల యశోకవృక్షములును, వసంతఋతువునందు మందమైనకిరణములుగల చంద్రుఁడునుగూడ యీసీతాదేవికి మహావ్యసనమును గలుఁగఁజేయుచున్నవనుట కెంతమాత్రమును సంశయములేదు. అనియిట్లు మిగులబలవంతుఁడును వేగవంతుఁడును వానరోత్తముఁడునునగు నాంజనేయుఁడు తనమనసునందు యోచించి, "ఈస్త్రీసీతాదేవిగాని వేరుగాదని" నిశ్చయముగఁదెలిసికొని యాశింశుపావృక్షముమీదనె గూర్చుండియుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి పదియారవసర్గ ముగిసెను.

(*)

{ఆంజనేయుడువృక్షముమీద దాగికొని సీతాదేవినిజక్కగజూచుట.}

అంత తెల్లగలువల సమూహముయొక్క కాంతివంటి కాంతిగలవాఁడును, స్వచ్ఛమైనిర్మలముగఁబ్రకాశించువాఁడునునగుచంద్రుఁడు, "తెల్లనిహంసపక్షి నల్లనినీటియందుఁబ్రవేశించునట్లు" నల్లనియాకాశమధ్యమునుబొందె. అట్టియెడ నిర్మలమగుకాంతితోఁ బ్రకాశించెడు నాచంద్రుఁడు తననిర్మలమగుకాంతిచే నాంజనేయునకు కొంతసహాయము జేయువానివలె చల్లనికిరణములతోఁ బ్రకాశించుచుండె. అప్పుడు ఆంజనేయుఁడు, పున్నమచంద్రునితో సరిబోలుమోముగలదియును దుఃఖసముద్రమునమునిగియున్నదియునునగుచు "మహాభారముచేతసముద్రమునమునింగినయోడవలె" చూపట్టుచున్నసీతాదేవిని ఆంజనేయుఁడుజూచె.

ఇట్లు వాయుపుత్రుఁడగు ఆంజనేయుఁడు సీతాదేవిని జూచిసమీపించి మాటలాడగోరి, ఆమెదగ్గరనున్న భయంకరాకారులగు రాక్షసస్త్రీలను, ఒంటికంటిదానిని, ఒంటిచెవిదానిని, చెవ్వులే మేలుముసుకుగా గలదానిని, చెవులులేనిదానిని, నీటిపందిచెవులవంటి చెవులుగలదానిని, తలప్రక్క శ్వాసమువిడుచుముఖమును, ముక్కునుగలదానిని, మిగులపెద్దతలగలదానిని, కృశించిమిగులనిడుపగు కంఠముగలదానిని, నశించినవెంట్రుకలుగలదానిని, బట్టతలదాని

ని, కంబళివంటి వెంట్రుకలుగలదానిని, వ్రేలుకాడుచుండె
డుచెవులును నెత్తియునుగలదానిని, వ్రేలాడుచుండెడుపె
దవిగలదానిని, గడ్డముక్రింద పెదవిగలదానిని, వ్రేలాడుచు
న్నముఖముగలదానిని, పొడవైన మోకాళ్లుగలదానిని, మి
గులపొట్టిదానిని, మిగులపొడవగుదానిని, కొన్నియవయవ
ములుపొడవుగను కొన్నిపొట్టిగనుగలదానిని, గూనిదానిని,
మిగులవంకరగనుండు దేహముగలదానిని, మిట్టపండ్లదా
నిని, వంకరనోటిదానిని, గోరోజనపుఛాయగల నేత్రము
లుగలదానిని, వికారమైన ముఖముగలదానినిజూచె. మఱి
యువికారరూపులను గోరోచనపుదేహకాంతిగలవారల
ను,నల్లనివారలను, కోపించుచున్నవారలను,జగడమునందా
శగలవారలను, ఇనుముతో జేయఁబడిన గొప్పకూటాయు
ధములను యినుపగుదియలను ధరించియున్నవారలను, పం
దిముఖమువంటి ముఖముగలవారలను, పెద్దపులిముఖము
వంటిముఖముగలవారలను, యెనుబోతుముఖమువంటి ము
ఖముగలవారలను, గొఱ్ఱెముఖమువంటి ముఖముగలవార
లను, నక్కముఖమువంటి ముఖముగలవారలను, ఏనుగు
పాదములవంటి పాదములుగలవారలను, ఒంటెపాదము
లవంటి పాదములుగలవారలను, గుఱ్ఱపుపాదములవంటి
పాదములుగలవారలను, దేహములోపల నిమిడియుండు
తలలుగలవారలను, ఒంటిచెయ్యి, ఒంటిపాదముగలవార
లను, గాడిదెచెవులవంటి చెవులుగలవారలను, గుఱ్ఱపుచె
వులవంటి చెవులుగలవారలను, ఆవుచెవులవంటి చెవులు
గలవారలను, యేనుగచెవులవంటి చెవులుగలవారలను,
కోతిచెవులవంటి చెవులుగలవారలను, ముక్కులేనివారల
ను, పెద్దముక్కుగలవారలను, అడ్డముక్కుగలవారలను,
ఏనుగుముక్కుతో సమానమైనముక్కుగలవారలను, నెత్తి
తోనిట్టూర్పులనువిడిచెడి ముక్కుగలవారలను, ఏనుగుపా
దములవంటి పాదములుగలవారలను, పెద్దపాదములుగల
వారలను, ఆవుపాదములవంటి పాదములుగలవారలను,
పాదములందు జుట్టుగలవారలను, మిగులగొప్పవైన తల
యును మెడయునుగలవారలను, మిగులగొప్పవైన స్తనము
లును కడుపునుగలవారలను, మిగులగొప్పవైననోరునుకం
డ్లునుగలవారలను, పొడవైననాలుకయును గోళ్లునుగలవా
రలను, మేకముఖమువంటి ముఖముగలవారలను, ఏనుగు
ముఖమువంటి ముఖముగలవారలను, ఆవుముఖమువంటి
ముఖముగలవారలను, పందిముఖమువంటి ముఖముగలవా
రలను, గుఱ్ఱపుముఖమువంటి ముఖముగలవారలను, ఒం
టెముఖమువంటి ముఖముగలవారలను, గాడిదెముఖము
వంటి ముఖముగలవారలను, భయంకరమైన చూపులుగల
వారలను, శూలములనుయినుపగుదియలను హస్తములం
దుగలవారలను, కోపముతోగూడుకొనియుండువారలను,
కలహమే భోజనముగాగలవారలను, మిట్టపండ్లుగలవార
లను, ధూమ్రవర్ణమైనవెంట్రుకలుగలవారలను, వికృతమగు
నోరుగలవారలను, నిరంతరమును మద్యపానము జేయు
వారలను, నిరంతరమును మాంసమునందును మద్యపానము
నందునునాశగలవారలను మాంసముచేతను నెత్తురుచేత
నుబూయఁబడిన దేహములుగలవారలను, మాంసము నె
త్తురునే భోజనముగాగలవారలను, చూచినతోడనేపుల
కాంకురమును గలుగజేయునట్టి యాకారములును చూపు
లునుగలవారలను, నగునారాక్షసస్త్రీలను గొప్పబోదెగ
లశింశుపావృక్షమును చుట్టునుచుట్టుకొని కూర్చుండియుం
డుటను ఆంజనేయుడుజూచె అట్లుఆంజనేయుడు ఆరా
క్షసస్త్రీలనుజూచి కాంతిహీనమైనదియును, వ్యసనముచేఁ
బీడింపఁబడినదియును, సంస్కారములులేమింజేసి మట్టి
తోనిండిన తలవెంట్రుకలుగలదియును, నశించినపుణ్యముగ
లదియై ఆకాశముననుండి జారిభూమిపైఁబడిననక్షత్రము
వలెనున్నదియును, పతివ్రతాధర్మమును సదుపటయు నేడు
యశస్సుతోగూడినదియును, పెనిమిటిదర్శనములేక మిగుల
తపించుచున్నదియును, శ్రేష్ఠములగు ఆభరణములనుధరిం
పకున్నదియును, పెనిమిటియందలిస్నేహమనెడి గొప్ప
భూషణముచే నలంకరింపఁబడినదియును, రాక్షసేశ్వరుఁ
డగు రావణాసురునిచే నడ్డగింపఁబడి నిర్బంధింపబడియుం
డుటచేతను బంధువులనెడబాసియుండుటచేతను తనజాతి
సమూహములనువిడిచి సింహములచేనాక్రమింపఁబడిన ఆ
డయేనుఁగువలెనున్నదియును, స్నానము మొదలగునవి లే
కుండుటవలన కాంతిహీనమైశరదృతువునందలి మేఘము
చేనడ్డగింపఁబడిన చంద్రరేఖవలెనున్నదియును,సంస్కార
ములులేకుండుటవలన చెడినసౌందర్యముగలదియై, తంతు
వులు తెగిపోయినవీణవలెనున్నదియును, రాజపుత్రియును,
నిందింపఁబడని నడవడికగలదియును, జనకమహారాజుకు
మారైయునగు సీతాదేవి యావృక్షముక్రింద గూర్చుండి
యుండుటను ఆంజనేయుఁడుజూచె. మఱియు నిరంతరము
పెనిమిటియగుశ్రీరాముని సేవజేయుచుండుటకు తగినది
యును, రాక్షసస్త్రీల యధీనమునందుండుటకు తగనిది
యును, వ్యసనసముద్రమునందు మునిగియున్నదియును,
రాక్షసస్త్రీలచే నావరింపఁబడి క్రూరగ్రహములచే నావ
రింపఁబడిన రోహిణీనక్షత్రమువలెనున్నదియును, ఆభరణ
హీనమై పుష్పములులేనితీగెవలెనున్నదియును నగుసీతాదే
విని ఆయశోకవనమునందు ఆంజనేయుఁడుజూచె. అట్లు

అయ్యశోకవృక్షముక్రింద సీతాదేవినిజూచి ఆంజనేయుడుతనలో తానిట్లనిచింతించె

“స్వభావముచే తెల్లనగు తామరతూడు బురదచేఁబూయఁబడ ప్రకాశించి ప్రకాశింపకున్నట్లు” ఈసీతాదేవిస్వభావముచే సౌందర్యముగలదియయ్యును, సంస్కారము లేక మఱికిపట్టిన దేహముగలదియును, అలంకారము లేనిదియునునై ప్రకాశించియు ప్రకాశింపకయున్నది. మఱియుమిగులనలిగిపోయిన మఱికితోఁగూడుకొనియున్న వస్త్రమును ధరించినదియును, జింకపిల్లనేత్రములవంటి నేత్రములు గలదియును, వ్యసనముతోఁగూడిన ముఖము గలదియునునై యున్నను పెనిమిటిపరాక్రమమును దలచుకొన్నప్పుడు దీనభావమునొందక ధైర్యముగా నున్నదియును, తనసదాచార సంపత్తిని గాపాడుకొనుచున్నదియును, నగుసీతాదేవిని ఆంజనేయుఁడు చూచె. మఱియు లేడిపిల్ల కండ్లవంటి కండ్లుగలదియును, భయమునొందిన లేడిపిల్లవలె నన్నిదిక్కులను జూచుచున్నదియును, వేడినిట్టూర్పులచే నచ్చటవృక్షముల చిగురుటాకులను గాల్చుచున్నట్లున్నదియును, దుఃఖసముద్రమునమునిగినదియై దుఃఖపరంపరలవలె నున్నదియునునగు సీతాదేవినిజూచి యాంజనేయుఁడు మిగులసంతసించె. మఱియుమిగులనోర్పుగలదియై భూమివలె నున్నదియును, చక్కఁగవిభజింపఁబడిన సుందరములగు నవయవములుగలదియును, ఆభరణములులేకయే మిగులప్రకాశించుచున్నదియునునగు నాసీతాదేవినిజూచి యాంజనేయుఁడధికమగుసంతసమునుబొందె. అంతమదముగల నేత్రములతోనొప్పుచుండెడు సీతాదేవినిఆంజనేయుడు ఆయశోకవనమునందుఁజూచి మహాసంతసముచే నానందబాష్పములనువిడిచి, శ్రీరామునకునమస్కరించె. మఱియుమిగులబలపరాక్రమశాలియగు నాంజనేయుఁడు సీతాదేవినిజూచుటచే పరమసంతోషమునొంది రామునకునులక్ష్మణునకు నునమస్కరించి; ఇతరులుతన్నుఁజూడకుండుటకు నాశింశుపావృక్షముయొక్క ఆకులమధ్య దాగుకొనియె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి పదునేడవసర్గము గిసెను.

(✻)

అశోకవనమునందుండుసీతాదేవిదగ్గరకురావణాసురుడువచ్చుట

చక్కఁగఁ జూచియుండు సమస్తవృక్షములుగల యశోకవనమునందు ఆంజనేయుఁడుసీతనువెదకుచు వృక్షములయొక్క రమణీయమునుజూచుచు సంచరించుచుండి సీతాదేవినిజక్కఁగా గనుంగొనుటకు వేకువఝామాయెను. అయ్యవసరమున, శిక్షాదిషడంగములతోఁగూడిన వేదములనుబెస్సగఁ దెలిసినవారును, శ్రేష్ఠములగు సకలయాగములను జేయువారునునగు బ్రాహ్మణోత్తములగు రాక్షసులు, అపరరాత్రమునందు వేదములనుపఠించెడు ధ్వనులనుఆంజనేయుఁడువినెను. మఱియు మంగళతూర్యములయొక్క ధ్వనులు చెవులకు మహాయింపుగ మ్రోగనారంభించె ఆ వాద్యములయొక్క ధ్వనులచే మహాబలుఁడగు రావణాసురుఁడునిదురమేల్కాంచె. ఇట్లుమహాపరాక్రమశాలియును, రాక్షసేశ్వరుఁడును నగు రావణాసురుఁడు శాస్త్రోక్తకాలమునకు నిదురమేల్కొని, నిద్రమత్తుచేజారినపుష్పమాలికలను వస్త్రములనుగలవాఁడగుచు సీతనుదలచుకొనియె. మదోన్మత్తుఁడగు రావణాసురుఁడట్లు సీతాదేవినిదలంచుకొనిమన్మథునిచేఁ బ్రేరేపింపఁబడి మన్మథతాపము నడఁచుకొనఁజాలడయ్యె. అట్లుకామబాధకోర్వఁజాలక రావణాసురుఁడు, సమస్తాభరణములనుధరించి సరిలేనికాంతితోఁ గూడుకొన్నవాఁడగుచు, నానావిధములగుపుష్పములును గలవృక్షములచే నలంకృతమైనదియును, పలువిధములగుకోనేరులతోను నడబావులుమొదలగువాటితోను నలంకృతమైనదియును, సమస్తసుగంధములతోఁగూడిన పుష్పములతో నొప్పుచున్నదియును, నిరంతరము మదముతోఁగూడుకొనియుండెడు నానావర్ణములుగలపక్షులచే సేవింపఁబడినదియును, చూచువారికిమిగులనాశ్చర్యకరమైనదియును, చూడచూడవింతనుగలిగించుచున్నదియును నానావిధములగు తోడేళ్ళచే సేవింపఁబడినదియును, సమస్తజాతి మృగసమూహములచే వ్యాపింపఁబడినదియును, నేలరాలినపుష్పములతోను ఫలములతోను నిండినదియును, సందులేక వృక్షములచేఁ గిక్కిరిసినట్లున్నదియును నగునాయశోకవనమును బ్రవేశింపగోరి వీధులయందు బంగారువికారమును, నవరత్నఖచితములునునగు బహిర్ద్వారములనుజూచుచుఆయశోకవనమునందువీధులయందు బ్రవేశించిపోవుచుండెను. అట్లుబోవుచుండినపులస్త్యవంశజుఁడగురావణాసురునివెనువెంట “దేవతాస్త్రీలును గంధర్వస్త్రీలును దేవేంద్రునివెంబడించిపోవునట్లు” అనేకమంది స్త్రీలువెంటనంటి పోవుచుండిరి. అట్లు రావణాసురునివెనువెంటనంటి పోవుచున్న స్త్రీలలోకొందఱుసువర్ణదీపస్తంభములయందు దీపములనువెలిగించుకొని చేతులంబట్టుకొని పోవుచుండిరి మఱికొందఱు చామరములువీచుచుఁబోవుచుండిరి. ఇంకకొందఱువిసనకఱ్ఱలనుచేతులంబట్టుకొని పోవుచుండిరి. కొందఱు బంగారుపాత్రములతోఁ జలములనుదీసికొని రావణాసు

రుడుముందునడిచిరి. మఱికొందఱుస్త్రీలు కత్తులుమొదలగు నాయుధములను చేతంబూని రావణుని వెనువెంటబోవు చుండిరి. చతురురాలగు నొకస్త్రీమద్యముతోనిండిన స్వర్ణమయపాత్రమునుచేతబట్టుకొని పోవుచుండె. ఇంకొకస్త్రీ, రాజహంసముతో సరిబోలునదియును చంద్రకాంతివంటి కాంతిగలదియును, సువర్ణముతో జేయబడిన దండముగలదియునునగు నొకతెల్లని గొడుగునుబట్టుకొని రావణునివెను వెంటబోవుచుండె మిగులనుత్తమస్త్రీలగు రావణాసురుని భార్యలు నిద్రమత్తునంజేసి కూరుకొని పోవుచున్నదియును నెఱ్ఱబారినవియునునగు నేత్రములుగలవారలగుచు “మేఘునిమెఱుపుదీగెలవలె” పరాక్రమశాలియగు రావణాసురుని వెంబడించిపోవుచుండిరి. మఱియునారావణాసురుని ప్రియభార్యలు, వ్యత్యాసముగనుండినదండలును బాహువులుగలవారును,మిగులమాసిన మైపూతగలవారును, నుదిటిపైజారిన వెండ్రుకలుగలవారును, చెమటతోగూడియున్న మోములుగలవారును, ఇంకనుకొంతకైపుతోగూడియుండుటచేతను నిదురచేతను మత్తులైసోలుచున్నవారును, సుందరములై విలాసముతోగూడిన మోములుగలవారును, చెమటచేవాడిన పూలదండలను ధరించియున్నవారును, తలనిండపూదండలను ధరించినవారును, మదించిన నేత్రములుగలవారును, రావణునియందలి గౌరవముతో గూడుకొనినవారును మన్మథోద్రేకముతో గూడుకొనినవారునునై పోవుచున్న రాక్షసేశ్వరుడగు రావణాసురుని వెంబడించిరి. అట్లు వెంబడించి పోవుచున్న స్త్రీలకు పెనిమిటియును, మహాబలముగలవాడునునగు నారావణాసురుడు మన్మథప్రేరేపణచే సీతయందు తగిలినమనస్సుగలవాడగుచు ఒడలెఱుగకజడుని వలె మహాహాయలుతో మెల్లమెల్లగ నడుచుచుబోవుచుండె. అట్టియెడ నాయుత్తమస్త్రీల గజ్జలపట్టాణములయొక్కయు అందెలయొక్కయు ధ్వనులను ఆంజనేయుడువినెను. అట్లాధ్వనులనువిని యాదిక్కుతట్టు తిరిగిచూచె. అంత ఎన్నగూడని బలపరాక్రమములుగలవాడును, ఇతరులకు శక్యముగానికార్యములను జేయువాడును సువాసనలతోగూడిన తైలములుగల బంగారుదీపస్తంభములు దీసికొనియుత్తమస్త్రీలు ముందుగొనిపోవుచుండగా మహాప్రకాశమానములగు నాదీపములయొక్క కాంతిచే బ్రకాశింపజేయబడినవాడును, మదనతాపముతోను, మహాగర్వముతోను సారాయి మొదలగు వానికైపుతోను గూడినవాడును, వంకరలునుమిగుల నెఱ్ఱనయును నిడుపునునగు నేత్రములుగలవాడగుచు చెఱకువిల్లునువదలి నిజరూపముతో ఏతెంచినమన్మథునివలె నున్నవాడును, భుజమునుండిజారి భుజకీర్తియందు దగులుకొన్నదియును, నీళ్లువిడువకచిలికిన మజ్జిగయొక్కయు పాలయొక్కయు నురుగుకాంతివంటి తెల్లనికాంతిగలదియును, దుమ్ములేకమిగుల స్వచ్ఛమైనదియునునగు ఉత్తమమైన వస్త్రమును మిగులవొయ్యారముగాచేతతో తాబైకీడ్చుకొనుచున్నవాడును, అశోకవనద్వారప్రదేశమునకు వచ్చినిలిచియున్నవాడునునగు రావణాసురుని ఆంజనేయుడుజూచె.

అట్లుజూచి, ఆంజనేయుడుఆకులతో దట్టముగనిండియుండు కొమ్మపైగూర్చుండి, యితరులకు గానరాకుండునట్లు పువ్వులతోను ఆకులతోను గప్పుకొని, దానిమధ్యనున్నవాడై ద్వారసమీపమునకు వచ్చియున్న రావణునిజక్కగా జూడనారంభించె. అట్లాంజనేయుడు రావణాసురునిజూచుచు మహారూప సౌందర్యసంపన్నలును యుత్తమస్త్రీలునునగు నారావణాసురునియొక్క స్త్రీలనుజూచె.అప్పుడుమహాకీర్తిమంతుడగు రావణాసురుడు, మిగులసౌందర్యవతులగు నాస్త్రీలచే బరివేష్టింపబడినవాడగుచు, మృగములయొక్కయు పక్షులయొక్కయు ధ్వనులతోగూడియుండెడు నాయశోకవనమును బ్రవేశించె. ఇట్లాయశోకవనమునందు బ్రవేశించి వచ్చుచున్నవాడును, మధుపానమత్తుడై యున్నవాడును, నానావిధములగు నాభరణములను ధరించినవాడును, మదోన్మత్తుడైయుండుటచే స్తంభించినచెవులు గలవాడను, మహాబలుడును, నక్షత్రములచే బరివేష్టింపబడిన చంద్రునివలె నుత్తమస్త్రీలచే బరివేష్టింపబడినవాడును, విశ్రవసు బ్రహ్మపుత్రుడును, రాక్షసేశ్వరుడునునగు రావణాసురుని నాంజనేయుడు జక్కగాజూచె.

మఱియు మహాతేజోవంతుడగు నయ్యాంజనేయుడు తన తేజస్సుకంటె మిగులతేజోవంతుడుగ నుండునట్లుదోచుచున్న ఆరావణాసురునిజూచె. మహాతేజుడును వాయుపుత్రుడునునగు నాంజనేయుడు యిట్లుపలుమారులెస్సగ నారావణాసురునిజూచి “యీమహాబాహుడగు పురుషుడు రావణాసురుడుగాని వేరుగాడని నిశ్చయించి వానికార్యములను చక్కదనమును మాటలను లెస్సగ జూచుటకును వినుటకునునై తానున్నకొమ్మకు పైనున్నకొనకొమ్మనెక్కె. అట్లుయెక్కి ఆంజనేయుడు మిగులభయంకరమగు తేజస్సుగలవాడయ్యును, ఆరావణాసురునియొక్క తేజస్సుచేనవమానింపబడి ఆకులచేనిండియుండు ప్రదేశమునందెవ్వరికిని గానరాకుండునట్లు అణగియుండె అట్టియెడ నారావణాసురుడును, నల్లనితలవెండ్రుకల కొనలుగలదియును, మిగులరమణీయములగు పిఱుదులుగలదియును, ఒకటితోనొకటి చేరిసందులేక యిరుకుగానుండెడు స్తనములుగలదియును, నల్లనికడకన్నులు గలదియునునగు సీతనుజూచుట యందధికమైన

యిష్టముగలవాడగుచు సీతాదేవిదగ్గిఱకువచ్చె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి పదునెనిమిదవసర్గ ముగిసెను.

▶(*)◀

రావణాసురుడు దీనురాలగు సీతాదేవిని జూచుట

అట్టియెడ అనింద్యమైనవడవడికగలదియును, జనకమహారాజకుమార్తెయును, శ్రేష్ఠములగు పిఱుదులుగలదియుననగు సీతాదేవి, రూపయౌవన సంపన్నుడును శ్రేష్ఠములగు యాభరణములను ధరించినవాడును, రాక్షసేశ్వరుడుననగు రావణాసురుని దూరముననుండియేజూచి పెనుగాలిచే గదిలింపబడిన యరటిచెట్టువలె వడవడవడకదొడగె. అట్లురావణాసురుడు వచ్చుటనుజూచి, శ్రేష్ఠమైనవర్ణముగలదియును, విశాలములగు నేత్రములు గలదియుననగు సీతాదేవిభయమువలన గడగడణకుచు తొడలతోకడుపును, బాహువులచే స్తనములనుగప్పుకొని దుఃఖించుచు గూర్చుండియుండె.

అట్టియెడ దశగ్రీవుడగు రావణాసురుడును, రాక్షసస్త్రీసమూహములచే గాపాడబడు చున్నదియును, వ్యసనసాగరమున మునిగినదియై మహాసముద్రమునందు మునిగిన యోడవలె నున్నదియును, మిగులతీక్ష్ణముగ పాతివ్రత్యవ్రతము నవలంబించి యాస్తరణములేకయే వట్టినేలపై గూర్చున్నదియును, నరికిత్రోయుటచే నేలంబడిన చెట్టుకొమ్మవలె జూపట్టుచున్నదియును, మురికివిశేషముగ దేహమునంటియుండుటచే చిత్రవర్ణములుగలశరీరముగలదియును, అలంకారముచేసికొనుటకుదగినదయ్యునునలంకరించుకొనక బురదబూసికొని యుండెడుతామరతూడువలె నున్నదియై ప్రకాశించియు ప్రకాశింప కున్నదియుననగు సీతాదేవిని జూచె. మఱియు రాజోత్తముడును, పరమాత్మవేత్తయుననగు శ్రీరామునియొద్దకు సంకల్పమను గుఱ్ఱములతోగూడిన మనస్సనురథము నెక్కి పోవుచున్నట్లున్నదియును, ఆహారానులు వర్జించియుండుటచే మిగులశుష్కించి యున్నదియును, తనవారినందరినివిడిచి యొంటరిగనుండుటచే నిరంతరము దుఃఖించుచున్నదియును, నిరంతరమును ఆలోచనయును వ్యసనమునేముఖ్యమైన విషయములుగా గలదియును, దుఃఖసాగరమగ్నమై దరిగానకున్నదియును, రామునియనుసరించెడు వ్రతము గలదియును, మణిమంత్రములచే కట్టుబడినగొప్పఆడు నాగుపామువలె నున్నదియును, ధూమకేతువనెడు గ్రహముచేపీడింప బడుచుండు రోహిణీనక్షత్రమువలె నున్నదియును, శ్రేష్ఠమగునాచారముతో గూడుకున్నదియును, ధర్మగుణముతోగూడినదియును నగుసద్వంశమునబుట్టి దుష్కులమునందు బెండ్లియైనదానివలె నున్నదియును, అసత్యమగునపవాదముచే జెడినకీర్తివలెనున్నదియును, ప్రతిదినమును వల్లింపకమఱచిపోయిన విద్యవలెనున్నదియును, నశించినగొప్పకీర్తివలె నున్నదియును, అవమానింపబడినవానికి అవమానించిన వానియెడలగల శ్రద్ధవలెనున్నదియును, పూజాద్రవ్యములులేని పూజవలెనున్నదియును, చెడిపోయిన యాశవలెనున్నదియును, నశించినధనసంపదవలె నున్నదియును, తిరస్కరింపబడిన యాజ్ఞాశాసనమువలెనున్నదియును, ప్రళయకాలమునందు మండుచున్నదిక్కువలెనున్నదియును, తస్కరులచే నపహరింపబడిన పూజాద్రవ్యమువలె నున్నదియును, చీకటిచేనశించిన వెలుగువలె నున్నదియును, నీళ్లులేనినదివలె నున్నదియును, శూద్రునిచేముట్టబడినయగ్నివేదికవలె నున్నదియును, ఆరిననిప్పుమంటవలె నున్నదియును, రాహుగ్రహముచే మ్రింగబడిన పున్నమచంద్రునిగల రాత్రివలెనున్నదియును, ఏనుగతొండముచే బెరికికలతపఱుపబడి పెరికివేయబడిన యాకులు తీగెలును, భయపఱుపబడి దిక్కులకుబరువిడిన పక్షులుగలిగి ధ్వంసముజేయబడి నదియునైన తామరకొలనువలె నున్నదియును, పతివియోగవ్యసనముచే పీడింపబడినదియై గట్టుతెగిపాఱి యెండిపోయిననదివలె నున్నదియును, భర్తృవియోగమువలన దేహసంస్కారాదులు లేమింజేసి కృష్ణపక్షమునందలి రాత్రివలెన్నదియును, మిగులసుకుమారియును మహాసుందరమగు అవయవములుగలదియును, మణులు మొదలగు వాటితోగట్టిన గృహమునందుండదగిన దయ్యును వనప్రదేశమున నున్నదియును, పెరికివేయబడియెండిపోయిన తామరతూడువలె నున్నదియును, గోతిలోబడి పట్టుకొనబడినదియును, స్తంభమునగట్టబడినదియును గజరాజుచే విడువబడినదియును, నిట్టూర్పులువిడుచు చున్నదియును, మహావ్యసనముచే పీడింపబడినదియును నగుశ్రేష్ఠమగు ఆడయేనుగువలెనున్నదియును, ప్రయత్నములేకయే యొకటిగా పెనుచుకొనిపోయిన జడచేప్రకాశించు చున్నదియును శరదృతువునందలి నల్లనివనపఙ్క్తులతో గూడియుండెడు భూమివలెనున్నదియును, ఉపవాసములచేతను వ్యసనముచేతను, ఎడతెగక పెనిమిటిని ధ్యానించుటచేతను, రాక్షసులవలని భయముచేతను మిగులకృశించియున్నదియును, దైన్యమునొందియున్నదియును, మితభోజనముగలయుత్తమస్త్రీయైనదియును, తపస్సేధనముగా గలదియును, వ్యసనముచే పీడింపబడినదియును, చక్కనిచే మోడ్పుగలిగి రామునిచేరావణుడు పరాభవమునుబొంద

వలయుననితనమనంబున ఇష్టదేవతాప్రార్థనము జేయుచున్నట్లున్నదియునునగు సీతాదేవిని రావణాసురుడు చూచె. అట్లు రావణుడుసీతాదేవినిజూచిసమీపమునకువచ్చి,తనకెవ్వరైన రక్షకులుగలుగుదురాయని నలుదిక్కులనుజూచుచున్నదియును, బొటబొటకన్నీరుగార్చుచుదుఃఖించుచున్నదియును, మిగుల శ్రేష్ఠమగు నడవడికగలదియును, సుందరములగు కనుఱెప్పలుగలదియును, ఎఱ్ఱచారలుగలిగి నిడుదలై తామరలతో సమానములగు నేత్రములుగలదియును, రాముని ననుసరించినవ్రతముగలదియునునగు సీతాదేవిని, రావణాసురుడుతనయొక్కమరణనిమిత్తమగువాక్యములచేతవలపించునట్లు భయపఱచె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి పందొమ్మిదవ సర్గము ముగిసెను.

(✱)◂

రావణాసురుడు సీతాదేవినిజూచి నీవు నాతో క్రీడింపుమని చెప్పుట.

ఆరావణాసురుడు, మహాపతివ్రతయును, మిగుల దైన్యమునొందినదియును, సంతోషము లేనిదియును, తాపసవృత్తియందున్నదియును, కనికరింపతగినదియునునగు నాసీతకు, తనమనోభావమును దెల్పునట్టి యింపైనమాటలతో నిట్లనియె

ఏనుగతొండములవంటి తొడలుగల యోసీతా! నీవు నన్నుజూచి యేలభయపడియెదవు? నీదేహము నాకగపడకుండునట్లు కడుపును స్తనములును యేల మూసికొనియెదవు? నిన్నుజూచిన నీదేహము నాకగుపడకుండునట్లు జేయగోరుచున్నదానివలె గాన్పించుచున్నావు. విశాలములగు నేత్రములుగలయోసీతా! నిన్ను సేవలచితిని. నాయిష్టమును నెరవేర్పుము. నిన్నుచూడచూడ నాకు మిగుల సంతసము గలుగుచున్నది. సమస్తావయవములును మిగుల సౌందర్యముతో గూడినదానవగు నోసీతా! సమస్త లోకములకును మనోజ్ఞమగుదానా! నన్నుగౌరవింపుము. ఏలభయపడెదవు? ఇచ్చటమానవులుగాని కామరూపులగు రాక్షసులుగాని లేరు. ఓసీతా! నేను నిన్నుగోరియున్నవాడను. నావలననీకెంతమాత్రమును భయములేదు. ఏలవడవడవడకెదవు? భయపడుస్వభావముగల యోసీతా! పరస్త్రీగమనము మాకెంతమాత్రమును దోషకరమైనదికాదు. పరస్త్రీలను బొందుటగాని వారిని బలాత్కారముగ దెచ్చుటగాని రాక్షసులగు మాకు ధర్మముగాని వేరుగాదు. ఇదినిశ్చయము. దీనికెంతమాత్రమును సంశయింపబనిలేదు. ఓసీతా! ఐనను నాయందు కోరికలేని నిన్నెంతమాత్రమును తాకను. నీవునన్నుకోరి నాయందిష్టముగలదానవైతివేని నిన్ను తాకుదును. కాబట్టి యథేచ్ఛగా ప్రవర్తించి నాప్రాణములను రక్షింపుము. ఓసీతా! ఓప్రియురాలా! ఇప్పుడు భయపడవలదు. నన్నువిశ్వసింపుము. నాయందునిశ్చయముగ స్నేహముంచుము ఇట్లువ్యసనముచే జపలురాలవైయుండకుము. ఓసీతా! తలదువ్వుకొనక వెండ్రుకలన్నియును జడగాబెనిచికొని పోసినట్లు విడిచియుండుటయు, ఆస్తరణములేక వట్టిభూమిమీద పరుండుటయు, నిరంతరమును దుఃఖించుచుండుటయు, మురికివస్త్రమును ధరించియుండుటయు, నిరంతరముపవాసముండుటయు, ఇవన్నియునీకుసరిగావు. ఓజనకరాజపుత్రీ! సీతా! నీవు నన్నుగలసి నానావిధములగు పూలదండలను శ్రీగంధమును, అగరుగంధమును, పలువిధములగు వస్త్రములను, శ్రేష్ఠములగు సొమ్ములను, మహాశ్రేష్ఠములగు మద్యములను, మెత్తనిపాన్పులను, శ్రేష్ఠములగు పీఠములను, సుఖముగ ననుభవింపుము. మఱియు నృత్తగీతవాద్యములను నిరంతరమును వినుచుండుము మంచి సౌందర్యముగలదానా! సీతా! నీవుసమస్తస్త్రీలలో పల మిగుల శ్రేష్ఠురాలవు. నీవిట్లు అలంకారహీనురాలై యుండుట తగదు. సమస్తాభరణములను నలంకరించుకొనుము. నీవు నాయొద్దచేరియు నిట్లుఅలంకారములేక యుండుట యెంతమాత్రమును తగదు. ఓసీతా! మిగుల మనోజ్ఞముగనుండు నీయావనము వృథగాగడచి పోవుచున్నది వ్యర్థముగజరిగిపోయినదేదిగాని "పారిపోయిననీటివెల్లువవలె" మఱలరానేరదు సుందరములగు నేత్రములుగల యోసీతా! లోకమున నీకుసమానమగు సౌందర్యముగలస్త్రీ యింకొకతెలేదు. కావున సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు నిన్ను సృష్టించి యంతట తనశ్రమదీర్చుకొనుటకై యూరకున్నాడని యెంచెదను. ఓసీతా! రూపయావనసంపన్నురాలవగు నిన్నుజూచినంతనే సాక్షాద్బ్రహ్మదేవుడుగూడ మోహపరవశుడగును. కావుననితరమానవుడననెంత. గొప్పపిరుదులుగలదానా! చంద్రబింబముతో సమానమగు మోము గలదానా! సీతా! నీశరీరమునందుఏయేయవయవములను నేజూచుచున్నానో ఆయాయవయవములను విడిచి నామనస్సు, అటునిటు కదలకున్నది. ఓసీతా! నీవు నాకు భార్యవగుము. ఈయజ్ఞానమును విడువుము. (అనగారామునేధ్యానించుచుండుటవిడువుము) నీకుశుభంబగుగాక. ఓసీతా! నేనునానాస్థలములనుండి తెచ్చిన మిగుల శ్రేష్ఠులగు స్త్రీలకందఱికినీవు పెద్దదానవుగానుండుము. భీతినొందెడు స్వభావముగల యోసీతా! నేను సమస్తలోకములనుండి బలముచేగొనివచ్చిన సకలరత్నములను నీకిచ్చెదను. మఱియు నారాజ్యమును సర్వమునునీకిచ్చె

దను నేనును నీకు స్వాధీనుడనై యిష్టముచొప్పున నడుచుకొనియెదను. ఓవిలాసినీ! సీతా! నానావిధములగు పట్టణ సమూహములతో గూడిన భూమినంతయు జయించి నీకు సంతోషముగలుగుటకొఱకు నీతండ్రియగు జనకమహారాజునకిచ్చెదను. మఱియు నీలోకమునందు నన్నెదిరించువీరుడొకడైనను నాకగుపడలేదు. ఓసీతా! యుద్ధమునందెదురులేని నాపరాక్రమమును జూడవలయునని కోరితివేని యెవరితోనైన యుద్ధము జేసి జూపించెదను. మఱియు సురాసురులుమొదలగుసమస్తశత్రువులును నాతోయుద్ధము జేసి పలుమారు అపజయమునొంది యున్నారు. నేనువారి టెక్కెములను విరిచి నాశనము జేసితిని. వారునాయెదుట నిలువజాలక పరుగెత్తిపోయిరి. ఓభూపుత్రీ! సీతా! నన్నువరింపుము. మిగుల శ్రేష్ఠముగ నలంకరించుకొనుము. ఓజానకీ! సీతా! నీదేహమునందంతటనునవరత్నఖచితమైమహాకాంతితోగూడినయాభరణములను ధరింపుము. నీవు లెస్సగనలంకరించుకొనియుండగ నీసౌందర్యమును జూడవలయునని నాకాశగనున్నది. మిగులసుందరమగు ముఖముగల యోసీతా! నీవు నాయందు దాక్షిణ్యముగలదానవై లెస్సగ నలంకరించుకొని యథేచ్ఛముగ సుఖముల ననుభవింపుము. మద్యము మొదలగు వాటిని లెస్సగ త్రాగుము. యథేచ్ఛగా సంచరింపుము. ఓజనకరాజనందినీ! సీతా! భూమినిగాని, ధనమునుగాని నీయిష్టముచొప్పునదానముజేసికొనుము. నన్నంగీకరించి యథేష్టముగ నాతోక్రీడింపుము. నీకు గావలసిన పదార్థములయందు నన్ను నిర్భయముగ నాజ్ఞాపింపుము. ఓసీతా! నీవునాదయచేత సమస్తసుఖములననుభవించుచుండుటను జూచి నీబంధువులందరు మిగులసంతోషమును బొందగలరు. మంగళస్వరూపురాలవగు నోజానకీ! సీతా! నీవు నాసమృద్ధిని సంపదను కీర్తిని జూడుము. మిగులసౌందర్యముగలదానా! సీతా! నారచీరెలు ధరించి యరణ్యమునందునివసించుచుండు రామునివలన నీకుకొంచమైనను ప్రయోజనములేదు. మఱియు నారాముడు, విడువబడిన జయముగలవాడును, తొలగిపోయిన సంపద గలవాడును, అరణ్యమునందు సంచరించువాడును, వానప్రస్థ వ్రతమునందున్నవాడును, వట్టినేలపైశయనించువాడునునై యింకను బ్రతికియున్నాడోలేడోయని తోచుచున్నది. విదేహదేశమునందు జన్మించిన జానకీ! సీతా! వర్షాకాలమునందు నీలమేఘముచే నావరింపబడిన ఆకాశమునందు మఱుగైయుండెడుచంద్రబింబమును మానవులు చూడజాలనియట్లు నాస్వాధీనములోనుండు నిన్నెంతమాత్రము రాముడు కనుగొనజాలడు. మఱియు నింద్రుడుగొనిపోయినతనభార్యను హిరణ్యకశిపుడు కొంతప్రయత్నముచే మఱలబొందినట్లుగూడ, నాస్వాధీనములోనుండు నిన్నెంతమాత్రము శ్రీరాముడు మఱల బొందజాలడు. మిగుల మనోహరమగు చిరునగవు గలదానా! సీతా! నీవు మిగుల సుందరములగు దంతములు గలదానవు. మిగులసుందరములగు నేత్రములుగలదానవు. మహాసౌందర్యముగలదానవు. కావున "గరుత్మంతుడు పాములందన్నుకొనిపోవునట్లు" నీవునామనస్సును నపహరించుచున్నావు. ఓభూపుత్రీ! సీతా! నీవునలిగి మురికితోనిండియుండెడు పట్టువస్త్రమును గట్టుకొని యలంకారహీనురాలవై మిగుల గృశించియున్నావు. ఈరీతిగానుండునపుడునిన్నుజూచినంతనే నాభార్యలపైబుద్ధిపోకున్నది. ఇకనీవుచక్కగానలంకరించుకొని యున్నప్పుడు యెట్లుందువో! ఓజనకరాజపుత్రీ! సీతా! నాయంతఃపురమున సమస్తశుభలక్షణములతో గూడుకొనియుండెడు స్త్రీలనేకులున్నారు. వారలకందఱికిని నీవు ఈశ్వరిగానుండుము. నల్లనితలవెండ్రుకలుగల యోజానకీ! సీతా! "లక్ష్మీదేవిక నప్సరోగణములెల్ల పరిచర్య గావించునట్లు" ముల్లోకములయందుండి తేబడిన యుత్తమస్త్రీలగు నాభార్యలందరును నీకుపరిచర్యలు జేయుచుందురు. సుందరములగు కనుబొమలుగలదానా! సుందరములగు పిఱుదులు గలదానా! సీతా! కుబేరునియొద్ద యెన్నిరత్నము లున్నవో యారత్నములును వానియొద్దనుండెడి ధనమును, సమస్తలోకములయందుండెడు సంపత్తును నీకు తెచ్చి సమర్పించెదను.

టినన్నిటిననుభవింపుము. నన్నువరించి యథాసుఖముగనుండుము. ఓసీతా! తపస్సునందుగాని, బలమునందుగాని, పరాక్రమమునందుగాని, ధనమునందుగాని రాముడు నాకు తుల్యుడుగాడు. మఱియు కాంతిచేతగాని కీర్తిచేతగాని నాతో సమానుడుగాడు. ఓలలనా! సీతా! నీవుమద్యముమొదలగువాటిని త్రాగుము. యథేష్టముగ సంచరింపుము. నీయిష్టముచొప్పునక్రీడింపుము. సమస్తభోగముల ననుభవింపుము. ధనసమూహములను భూమినంతయును నీకిచ్చెదను. నాతో గూడినీయిష్టముచొప్పున సుఖమనుభవింపుము. నీవిట్లు మిగుల సంతసమునుబొందుచుండగానీబంధువులుగూడనిన్ను జేరిసమస్తసుఖముల ననుభవింతురు. భయమునొందెడు స్వభావముగల దానా! స్వర్ణమయశ్రేష్ఠములగు హారములనుధరించిన శరీరముగలదానా! సీతా! పుష్పించియుండెడు వృక్షసమూహములతో గూడినవియును, నిరంతరము తుమ్మెదలు పువ్వులను కమ్ముకొని ఝుంమని రొదజేయబడుచుండెడు నవియును, సముద్ర తీరమున బుట్టినవియునునగు నరణ్య ప్రదేశములయందు నాతోగూడ విహరింపుచు క్రీడింపుము.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి యిరువదియవ సర్గ ముగిసెను.

సీతాదేవి రావణాసురునికఠినముగ నిందించుట

అంతమిగులభయంకరుడగు రావణుడుచెప్పిన మాటలనువిని సీతాదేవి మిగుల వ్యసనమునొంది దైన్యమునొందినదియగుచు దీనముగదిన్ననిమాటలతో బదులుజెప్పుటకు ఎత్నించె ఇట్లుప్రయత్నించి, శ్రేష్ఠములగుపిఱుదులుగలదియును, నిరంతరము చిరునగవుతోగూడిన ముఖముగలదియును, మహాపతివ్రతయునునగు సీతాదేవి, మిగులవ్యసనముతోగూడినదియును, హోరుమని వెక్కి వెక్కి యేడ్చుచున్నదియును, గడగడవడకుచున్నదియును, కనికరింపదగినదియును, నిరంతరము పెనిమిటినే ధ్యానించుచున్నదియునునై, పరపురుషునితో సంభాషింప గూడదను న్యాయముచే, తనకును రావణునికిని, మధ్యనొకతృణమును అడ్డముగనునిచికొని నాతృణమునుజూచి యిట్లనియె.

నాపైమనసుంచకుము. నీమనస్సుత్రిప్పుకొని నీభార్యలపైనుంచుకొనుము. పాపాత్ముఁడు మోక్షముకుగోరుట ఎట్లుయుక్తముగాదో, అట్లునీవునన్నపేక్షించుట యుక్తముగాదు. నేనుమిగుల శ్రేష్ఠమగు వంశమునందుబుట్టితిని మహాపరిశుద్ధమగువంశమున వివాహమైతని ఏకపత్నీవతమునవలంబించిన శ్రీరామునకు భార్యనైయున్నదానను. నీవుచెప్పునట్టి నిద్యంబగుపాపకార్యమునకు పతివ్రతలుబప్పుదురా? ఒప్పరు అనియిట్లు మహాప్రశస్తమగుకీర్తిగల సీతాదేవితృణమునుజూచిపలికి యారావణుని ముఖముజూడకుండుటకై వెనుకకుదిరిగికూర్చుండి మఱలనిట్లనియె.

నేనుపరపురుషునిభార్యను (అనగా రామునియొక్క భార్యను) నీకు నేభార్యనగుటకుఁ దగినదానునుగాను నీవుధర్మమును లెస్సగరక్షించుకొనుము సత్పురుషులమార్గము ననుసరించి వారుసంచరించినప్రకారముగ సంచరింపుము నీభార్యలవలెనే యితరులభార్యలుగూడ కాపాడఁదగినవారని తెలిసికొనుము. నిన్నుదృష్టాంతముగనునిచికొని నీభార్యలతోనే క్రీడించి తృప్తిబొందియుండుము (అనగాని తరులు నీభార్యలతోఁక్రీడించినట్లులయిన నీకెట్లుండునో అట్లె పెపితరులభార్యలతో రమించినట్లులయిన వారికిని యిట్లుండునని యెంచి నీభార్యలతోనే తృప్తిబొందియుండుము) మఱియు. శ్లో॥ అతుష్టంస్వేషుదారేషు చపలంచవితేంద్రియం। నయంతినికృతిప్రజ్ఞం పరదారాఃపరాభవమ్ । ప్రపంచమునందుఎవ్వడైనను తనభార్యలతోతృప్తిబొందియుండక చపలుఁడై యింద్రియచాపల్యముచేఁ గుచ్ఛితముగ నితరులభార్యలనుచెరుప గోరునో అట్టివాఁడు, ఆయురారోగ్యైశ్వర్యములను బోగొట్టుకొనిసకలజనులచేతనుదిరస్కరింపఁబడినవాఁడగును. ఓరీ! ఇచ్చట పెద్దలెవ్వరునులేరా? వారలనునీవనుసరించి సంచరింపవా? నీవు బుద్ధిహీనుఁడవై ధర్మమునుతొలగద్రోసి సదాచారసంపత్తినివిడిచియున్నావు. కావుననిచ్చట పెద్దలుండినను వారు నీకుబుద్ధిజెప్పరేమో? కాకున్న, నీవువినయవిధేయతతో పెద్దలుచెప్పెడు హితవాక్యములనువినవేమో? అయ్యయో నీకు ఏలయిట్టివిపరీతబుద్ధిపుట్టెను. రాక్షసవంశమునాశనమగుకాలము సమీపించియుండుటచే నీవుపెద్దలమాటలనంగీకరింపకున్నావు. శ్లో॥ అకృతాత్మానమాసాద్య రాజానమనయేరతమ్। సమృద్ధానివినశ్యంతి రాష్ట్రాణినగరాణిచ॥ అవివేకియును అధర్మమునందాసక్తిగలవాఁడును రాజగునేని, అట్టిరాజువలన సమస్తసంపదలతో నిండియుండెడుపట్టణములును రాజ్యములును నాశనమైపోవును. అప్రకారమే నానారత్నసమూహములతో నిండియుండెడు నీలంకానగరమునకు నీవురాజగుటచే, నీవొకడుచేసినయపరాధముచేత నీలంకశీఘ్రముగనాశనమగును శ్లో॥ స్వకృతైర్హన్యమానస్య రావణాదీర్ఘదర్శినః। అభినందంతిభూతానివినాశేపాపకర్మణః॥ ఓరీ! రావణా! ప్రపంచమునదీర్ఘాలోచనలేక పాపకార్యములను జేయునట్టిదురాత్ముఁడు, తానుజేసినపాపకర్మములచేతనే నాశమునొందుటనుజూచిరేని సమస్తప్రాణులును సంతసమొందుచుగు నీచేనవమానింపఁబడినవారందఱును మిగులసంతోషమునొంది, మనభాగ్యవశమున మిగుల క్రూరుఁడగు రావణాసురుఁడు తనతప్పితముచేతనే నాశనమయ్యె మనబాధలు తీరె. అనిచెప్పుకొనగలరు.

ఓరావణుఁడా! నేనునీయంతఃపురముయొక్క ఈశ్వరత్వమునకుగాని ధనమునకుగాని ఆశపడుదానను గాను. "సూర్యునికాంతి సూర్యునివిడిచి వేరుగానుండజాలనియట్లు" నేనారామునివిడిచి వేరుగానుండుదానను గాను. మఱియు నేనులోకేశ్వరుఁడగు రామునిమహాభుజమును గౌగలించుకొనినదాననైయుండి, వేఱొకఅనామధేయునియొక్క భుజమునెట్లాలింగనము జేసికొననేర్తును (జేసికొనను) ఓరావణా! వేదవ్రతస్నాతుఁడును ఆత్మవేత్తయునునగు బ్రాహ్మణునికి వేదవిద్యయుంబోలె నేనులోకనాథుఁడగు నారామునకే తగినభార్యనుగాని వేరుగాదు. ఓరావణుఁడా! అరణ్యమునందు పురుషఏనుగను నెడబాసి వ్యసనముతోనున్న యౌవనముగల ఆడేనుఁగును, మగయేనుఁగుతో జే

ర్చునట్లు మిగులదుఃఖితురాలనైయుండు నన్నుశ్రీరామునితోఁ జేర్పుము. మఱియునీవుపురుషశ్రేష్ఠుఁడగు రామునిచే యుద్ధమునందు జావక బ్రతికియుండఁగోరుదువేని యారామునివిహితుని గాఁ జేసికొనుము. ఓరావణాసురుఁడా! ఆ రాముఁడు సమస్తధర్మములను నెఱిఁగినవాఁడు. శరణుజొచ్చినవారిపై నతిప్రేమగలవాఁడని ప్రసిద్ధినొందినవాఁడు. నీవునిశ్చయముగఁ బ్రతుకఁగోరుదువేని యారామునితో మైత్రిగలిగియుండుము. శరణుజొచ్చినవారిని రక్షించెడు శ్రీరామునిసంతోషపరుదుము మఱియు నీవుశరణుజొచ్చుటమాత్రముగాక మిగులపరిశుద్ధాత్ముఁడవై నన్నారామునకుమఱలసమర్పింపుము. ఇట్లు నన్నారాఘవునకువప్పగింతువేని నీకుశుభములుగలుగును. ఓరావణా! అట్లుచేయక నీవు వేరువిధముగఁ జేయుదువేని శ్రీరాముఁడునిన్నునిశ్చయముగ సంహరించును. మఱియు నొక్కవిశేషముగలదు. ఇంద్రుడువజ్రాయుధమును నీపైఁబ్రయోగించెనేని నావజ్రాయుధము ఒకవేళనిన్నువిడిచినను విడుచును; యముఁడొకవేళ నిన్నుతీసికొనిపోవుటకువెరచి బహుకాలమువిడిచినను విడుచును గాని, లోకనాథుఁడగు శ్రీరాముఁడురోషముగలవాఁడయ్యెనేని నిన్నెంతమాత్రమును విడువఁడు. కావున దేవేంద్రునిచే విడువఁబడినపిడుగుయొక్క ధ్వనివలె మహానాదముజేయుచుండెడు శ్రీరామునిధనుష్టంకారమును శీఘ్రముగ నేనీవువిందువు. ఓరావణాసురుఁడా! మిగుల సుందరములగు గణుపులుగలవియును, విషాగ్నులచే మండుచుండెడినోళ్లుగల మహావిషసర్పంబులవలె నున్నవియును, రామలక్ష్మణులను పేరుచే నొప్పుచున్నవియునునగు బాణములు యీలంకానగరమునం దెల్లచోట్లను వ్యాపించియుండుటను శీఘ్రకాలమున నేనీవుచూచెదవు. మఱియు నాబాణము యీపట్టణమునందంతటనుసందులేక వ్యాపించిసకలరాక్షసులనుజంపును ఓరావణుఁడా! "గరుత్మంతుఁడు గొప్పసర్పములనుదన్నుకొనిపోవునట్లు" రాముఁడనుగరుత్మంతుఁడు, రాక్షసులను నీవిషసర్పములను తనబాణంబులనుగోళ్ళచేదన్నుకొనిపోవును (అనగా రాక్షసులను నాశనముజేయును) మఱియు "త్రివిక్రముఁడగు విష్ణుదేవుఁడు మూఁడడుగులచేత రాక్షసులయొక్క రాజ్యలక్ష్మినిగ్రహించినట్లు" శత్రువులమదమడఁచునట్టివాఁడును నాభర్తయునునగు శ్రీరాముఁడునన్నునీయొద్దనుండి కొద్దికాలములోనేతీసికొనిపోగలఁడు. ఓరావణాసురుడా! జనస్థానమునరాక్షససైన్యమంతయునుఁ జంపఁబడుటనువిని నీవుమిగులభయఁపడి యెదిరించుటకుశక్తిలేనివాఁడవై యీదొంగతనముజేసితివి ఓరీ! రాక్షసాధమా! ఓరీనీచుఁడా! రావణా! పురుషోత్తములును, అన్నదమ్ములును నగు రామలక్ష్మణులుయిరువురును వెలుపలఁబోయియుండు సమయమున నీవుఆశ్రమమునందుఁబ్రవేశించి నన్నుదొంగతనముగా దీసికొనివచ్చితివి ఓరీ! మూర్ఖుఁడా! నీవచ్చటికివచ్చినప్పుడు ఆరామలక్ష్మణులయొక్క వాసనయైనను మూర్కొనియుందువేని "పెద్దపులులవాసననుగన్నకుక్కవలె" ఎదుటనిలువలేక పారిపోయియుందువు. మఱియునీవు మిగులబలహీనుఁడవుగావుననే, నన్నుదొంగతనముగఁ దెచ్చితివి నీకు రామలక్ష్మణులతో యుద్ధముసంభవించెనేని నిశ్చయముగనోడిపోదువు. ఇదిగాక "రెండుభుజములుగల యింద్రునితోయుద్ధముజేసి ఒకభుజముగలవృత్రాసురుఁడు ఓడిపోయిసంహరింపఁబడినట్లు నీవురామలక్ష్మణుల యిరువురితోయుద్ధముజేసిఓడిపోయి చంపఁబడుదువు. ఓరీ! రావణుఁడా! నాభర్తయగురాముఁడునునతనితమ్ముఁడగు లక్ష్మణుఁడునునిరువురుగూడి "సూర్యుడల్పజలముల నెండజేయునట్లు" వేగముతోనీప్రాణములనుబుచ్చుకొందురు ఓరీ! రావణా! నీకిప్పుడుచెడు కాలముసంభవించినది. కావుననీవు కైలాసమునకుబోయినను, కుబేరునియొద్దకుఁ బోయినను, వరుణునిమరుగుజొచ్చినను లేకయేదేదు పదునాలుగులోకములలోనెచ్చటికిబోయినను, "పిడుగుబడుటచే గొప్పవృక్షమునాశనమగునట్లు" నీవురామలక్ష్మణుచే నాశనమొందెదవు. ఇందుకెంతమాత్రమునుసంశయములేదు.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యిరువదియొకటవసర్గముగిసెను.

రావణాసురుని ధాన్యమాలినిసమాధానము జేసితోడ్కొనిపోవుట.

అంత రాక్షసప్రభువగు రావణాసురుఁడు, సీతాదేవిపలికినకఠినవాక్యములనువిని, ప్రియదర్శనురాలగు సీతాదేవినిజూచి మహాకఠినవాక్యములతోనిట్లనియె.

శ్లో॥ యథాయథాసాంత్వయితా వశ్యస్త్రీణాం తథాతథా। యథాయథాప్రియంవక్తా పరిభూతస్తథాతథా॥ ప్రపంచమునపురుషుడు స్త్రీలనుఎంతఅధికముగ బుజ్జగించునో అంతవారలకుస్వాధీనుఁడగును. మఱియును స్త్రీలకుఎంతమంచివాక్యములనుజెప్పునో అంతవారిచే నవమానింపఁబడును. ఓసీతా! నీయందునాకుగలమోహమనునది "శక్తిమంతుఁడగుసారథితోప్పదప్పి పరుగెత్తెడిగుఱ్ఱమునుకళ్ళెముచేలాగిపట్టునట్టు" నీమీదనాకుగలకోపమును అణచుచున్నది. శ్లో॥ వామఃకామోమనుష్యాణాం యస్మిన్కిలనిబధ్యతే। జనేతస్మింస్త్వనుక్రోశ స్స్నేహశ్చకిల

జాయతే॥ మానవులకు మోహమనునది మహాచెడ్డది. ఆ మోహము యెవరియందధికముగ గలుగునో వారియెడల దయాదాక్షిణ్యములును ప్రీతియును విశేషముగ గలుగుచున్నవి. (అనగావారెంతతప్పుజేసినను శిక్షించుటకుమనస్సురాదు) సుందరమగుముఖముగలయోసీతా! ఈకారణముచేత నేను, కపటవేషధారినైయరణ్యవాసముఁజేయు వానియందాసక్తురాలవును, అవమానింపఁదగినదానవును, చంపఁదగినదానవునగు నిన్నేమియుఁజేయకున్నాను ఓవైదేహీ! సీతా!నీనిప్పుడునన్నుగుఱించి యెన్నికఠినములగుమాటలుపలికితివో వాటిలోప్రతిమాటకునునీవుమిగులభయంకరముగసంహరింపఁదగినదానవు. అనియిట్లు రాక్షసేశ్వరుఁడగురావణుఁడు సీతాదేవికిఁజెప్పి మహాకోపోద్రేకముతోఁగూడినవాఁడగుచు సీతనుజూచిమఱలనిట్లనియె.

ఓసీతా! నీకుయింకరెండుమాసములు గడువుఏర్పఱచియున్నాను. ఈగడువుకడవరకును నిన్నుగాపాఁడుదును. శ్రేష్ఠమగు దేహచ్ఛాయగలయోసీతా! యీరెండుమాసములకువెనుక నీవునాతోఁగూడనాపాన్పుపై బవళింపవలయును. మఱియునీగడువుగడచినపిమ్మటనన్నుభర్తగా గోరకుందువేని, నిన్నునావంటయింటియందుఁదరిగించి ప్రాతఃకాలభోజనమునకుబక్ష్యముచేయించెదను.అనియిట్లురాక్షసరాజగు రావణాసురుఁడు సీతాదేవిని బెదరించుటనువినయచ్చటనున్న దేవతాస్త్రీలునుగంధర్వస్త్రీలును దిగ్భ్రమనొందినవారగుచు మిగులవ్యసనపడిరి. ఇట్లుదుఃఖించుచుండఁ గొందఱు పెదవులు విఱుచుటచేతను మఱికొందఱు ముఖసంజ్ఞలచేతను గనుసంజ్ఞలచేతను రావణాసురునిచే బెదిరింపఁబడినసీతాదేవిని ఊరడించిరి. అంతసీతాదేవియు వారిచేనూరడింపఁబడి తనపాతివ్రత్యబలముతో గూడినదియగుచు రావణాసురునిజూచి, తనకుమేలుగలిగించునట్టి యొకమాటనుజెప్పె ఓరీ!రావణాసురుడా! ఇచటనీశ్రేయస్సునుగోరువాఁడు ఒకరుఁడుగూడలేదు. ఇదిమిగులనధర్మమైనకార్యమనినీకుజెప్పి నీబుద్ధినిమరల్చు వాఁడొకరుఁడైననుఅగుపడలేదు. ఇదిసత్యము. మఱియుదేవేంద్రునకు శచీదేవివలె మిగులధర్మాత్ముఁడైన శ్రీరామునియొక్క భార్యనగునన్నునీవుదప్ప ముల్లోకములయందు నన్యుండెవ్వఁడునుమనసులోనైనను భార్యగాగోరఁడు. ఓరీరాక్షసాధమా! రావణాసురుడా! మహాపరాక్రమశాలియగు శ్రీరామునిభార్యనైన నన్నునీవిట్టిపాపపుమాటలాడుచున్నావు.నీవెచ్చటికిబోయినను ఆపాపవాక్యములయొక్క ఫలమగుచావునుదప్పించుకొననేరవు? మఱియునరణ్యమునందు మదపుటేనుఁగను, కుందేలుయెదిరించినిలిచినట్లు రాముఁడేనుఁగువంటివాడు.నీవునీచమృగమగు కుందేలువంటివాడవు. సిగ్గులేనివాఁడా! నీవు, ఇక్ష్వాకువంశమునందు జన్మించినవారిలోనుత్తముఁడగు రాముఁడుదూరముగఁ బోఁజూచి నన్నుదొంగతనముగఁదెచ్చితివి. ఇప్పుడిచ్చట బింకములాడుచున్నావు. ఇంతవఱకును నీవురామచంద్రుని కగపడలేదుగదా, అతనికిఅగపడియుంటివేని అతనిపరాక్రమము నీకుఁదెలియును. ఓరిదుష్టుఁడా! రావణా! మిగులభయంకరములైనటువంటివియును, వికృతరూపములైనటువంటివియును, నల్లనివియును, పింగళవర్ణములైనటువంటివియునునై నన్నుజూచుచుండెడు నీనేత్రములురాలి యేలనేలఁబడవు? ఓరీ!దురాత్ముడా! రావణా! నేనుమిగులధర్మాత్ముఁడగు రామునిభార్యను. దశరథమహారాజుకోడలను. నీవునన్నుగూర్చిమిగులఅక్రమముగ మాటలాడుచున్నావే, నీనాలుకేలఊడినేలబడకున్నది. ఓరీరావణా! నినిప్పుడు నాచే భస్మముచేయఁదగిన వాఁడవయ్యును పతియాజ్ఞలేకుండుటచేతను నాపాతివ్రత్యవ్రతరూపమగుతపోఫలముతగ్గిపోవుననుభీతిచేతను, నాప్రభావముచేనిన్నుభస్మముజేయకున్నాను నేనురామునియొద్దనుండగ నన్నపహరించుటకునీకుసాధ్యముగాదు. నన్నపహరించుటచే నీకుమరణము సంభవించుటకుగాను దైవమిట్లువిధించినది. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. ఇదిగాకనీవు నేను శూరుఁడను. కుబేరునకుతమ్ముఁడను మహాబలపరాక్రమశాలిని యని చెప్పుకొనెదవే, నీవుఏకారణముచేతరాముని తొలిగి పోఁజూచి యతనిభార్యనగునన్నుదొంగతనముగఁ గొనివచ్చితివి. అనియిట్లుసీతాదేవియనేకవిధములనిందింపగరాక్షసేశ్వరుఁడగురావణాసురుఁడు మిగులభయంకరముగ తననేత్రములను పెద్దవిగజేసి గిరగిరఁద్రిప్పుచు ఆనేత్రములనుండినిప్పులఁగ్రక్కుచుసీతాదేవినిజూచె.

అట్టియెడ నీలమేఘముతో సరిబోలువాఁడును, గొప్పభుజములును మెడయునుగలవాఁడును, సింహముతోసరిబోలునడకయును బలమునుగలవాఁడును, మహాకాంతిగలవాఁడును, మిగులప్రకాశముగమండుచుండు నాలుకకొనయును నేత్రములునుగలవాఁడును, కోపమువలనచెలించుచున్నకొనగల కిరీటముచేపొడవగువాఁడును, నానావిధములగుపూలదండలును మైపూతలునుగలవాఁడును, ఎఱ్ఱనిపుష్పమాలికలను వస్త్రములనుధరించినవాఁడును, ఫుటముదీరినబంగారపు బాహుపురులచే నలంకృతమైనవాఁడును, మిగులగొప్పదియును నల్లనిదియునగు మొలత్రాడుధరించినవాఁడై యమృతమునుపుట్టించుటకై గొప్పసర్పముచేఁజుట్టబడిన మందరపర్వతమువలెనున్నవాఁడును, గొప్పపర్వ

తమువంటి యాకారముగలవాఁడును, రాక్షసేశ్వరుఁడునునగు రావణాసురుఁడు మిగులబలిసిన భుజములుగలవాఁడగుచు శిఖరములతోఁగూడియుండెడు మందరపర్వతమువలె నే ప్రకాశించుచుండె. మఱియుబాలసూర్యుని కాంతివంటి కాంతిగల సొగులచేనలంకృతంబైనవాఁడై, ఎఱ్ఱనిచిగుళ్లును పుష్పములునుగల యశోకవృక్షములచే నలంకృతంబైనగొప్పపర్వతమువలె నున్నవాఁడును, కల్పవృక్షముతో సమానమగు యాకారముగలవాఁడై యాకారమునుధరించివచ్చి నవసంతునివలెనున్నవాఁడును, అలంకారముతోఁగూడినవాఁడయ్యును, మిగులభయంకరాకారుఁడవుటవలన శ్మశానమునందునిర్మింపఁబడిన మంటపమువలెనున్నవాఁడును నగు నారావణాసురుఁడు కోపోద్రేకముచే నేత్రములనెఱ్ఱగ జేసి సీతాదేవినిజూచి తానుపాము వలెబుస్సుబుస్సుమని నిట్టూర్పులువిడుచుచు నిట్లనియె.

ఓసీతా! నీకునేనెంత జెప్పినను వినక, వివేకములేనివాఁడును, దరిద్రుఁడునునగు రామునేయనుసరించియున్నావు కావున "తనకాంతిచేసూర్యుఁడు సంధ్యను (అనగాప్రాతఃకాలమునందలిచీకటిని) నశింపఁజేయునట్లు" నిన్నిపుడు నాప్రతాపముచే నశింపఁజేసెదను అనియిట్లుశత్రువులనేడ్పించునట్టి శత్రురావణుఁడగు రావణాసురుఁడు సీతతోఁజెప్పి పిమ్మట, ఒంటికంటిదానిని, ఒంటిచెవిదానిని, చెవియే ముసుకుగాఁగలదానిని, ఆవుచెవులవంటి చెవులుగలదానిని, ఏనుగుచెవులవంటి చెవులుగలదానిని, వ్రేలుకాడుచుండు చెవులుగలదానిని, చెవులులేనిదానిని, ఏనుఁగుపాదములవంటి పాదములుగలదానిని, గుఱ్ఱపుకాళ్ళవంటికాళ్లుగలదానిని, ఆవుకాళ్ళవంటి కాళ్లుగలదానిని, పాదములయందుజుట్టుగలదానిని, ఒంటికన్నుగలదానిని, ఒంటికాలుగలదానిని, పెద్దకాలుగలదానిని, కాళ్ళులేనిదానిని, మిగులపెద్దదియగుమెడయును, తలయునుగలదానిని, మిగులపెద్దవియగు స్తనములును గడుపునుగలదానిని మిగులపెద్దదియగుముఖమును గొప్పనేత్రములునుగలదానిని, పొడవగునాలుకలుగలదానిని, నాలుకలేనిదానిని, సింహముయొక్క ముఖమువంటి ముఖముగలదానిని, గోముఖమువంటి ముఖముగలదానిని, ఆడుపందిముఖమువంటి ముఖముగలదానిని, యిట్లుమిగుల భయంకరాకారులగు రాక్షసస్త్రీలనందఱినిజూచి యిట్లనియాజ్ఞాపించె.

ఓ రాక్షసస్త్రీలారా! మీరందఱును యేకీభవించి జనకునికుమార్తెయగు నీసీత యెవ్విధముచే నతిత్వరితముగనాయధీనమగునో యట్టిప్రయత్నమును జేయవలయును. మఱియు అనుకూలమగు కార్యములచేత గాని ప్రతికూలమగుకార్యములచేత గాని, సామదానభేదములవలనగాని లేకదండోపాయమువలనగాని, మఱియేప్రయత్నముచేత గాని సీతను నాయధీనమగునట్లు జేయవలయును. అనియిట్లు రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు ఆరాక్షసస్త్రీలతో నాజ్ఞాపించి, కామక్రోధములచే నావరింపఁబడిన మనసుగలవాఁడగుచు పలుమారు సీతాదేవిని భయపఱచెను అప్పుడు రావణాసురునిభార్య ధాన్యమాలియనునది యతివేగముగ రావణునియొద్దకువచ్చి యాతనిగౌఁగలించుకొని యిట్లనియె.

రాజాధిరాజవగు నోరావణుఁడా! నాతోఁగలసిరమింపుము. ఓరాక్షసేశ్వరుఁడా! మిగులవికారమైన యాకృతియునువర్ణమునుగలదియును, మహాదైన్యమునొందినదియును, మనుష్యస్త్రీయునునగు నీసీతతో నీకేమి ప్రయోజనము గలదు. ఓమహారాజా! రావణాసురా! నీవునీభుజబలపరాక్రమముచే సంపాదించిన యుత్తములగు స్వర్గభోగములననుభవించునట్లు యీసీతాదేవినొసట బ్రహ్మదేవుఁడు వ్రాయఁడయ్యె. కావున ॥ శ్లో ॥ అకామాంకామయానస్యశరీరముపతప్యతే॥ లోకములోతనపైనిచ్ఛలేని స్త్రీనిగోరెనేని అట్టివానిదేహము సంతాపమునొందునుగాని ప్రయోజనములేదు మఱియు, శ్లో॥ ఇచ్ఛంతీంకామయానస్యప్రీతిర్భవతిశోభనా॥ తన్నుగోరుచున్నదానిని గోరువానికి సంతోషమును సుఖమునుగలుగును కావుననిన్నునేగోరియున్నాను నాతోఁగూడిసుఖింపుమని ధాన్యమాలిచెప్పె. అంత మిగులబలపరాక్రమశాలియును మేఘముతోసమానుఁడును రాక్షసేశ్వరుఁడును నగు రావణాసురుఁడు, ధాన్యమాలిజెప్పినమాటవిని యాధాన్యమాలినిచే యింటికిపోదమురమ్మని తోయఁబడినవాఁడై చిరునగవునవ్వుచు వెనుకకుఁదిరిగె ఇట్లువెనుకకుమఱలి యారావణాసురుఁడు భూమివడవడ వడకునట్లునడుచుచుబైలుదేరి సూర్యునిప్రకాశముతో సమానముగప్రకాశించుచుండెడు తనగృహమునకుఁబోయె అప్పుడు దేవకన్యకలును గంధర్వకన్యకలును నాగకన్యకలును మొదలగువారందఱును రావణాసురునిజుట్టుకొని యాయుత్తమగృహమునందుప్రవేశించిరి అంతరావణాసురుఁడు, ధర్మమునందు మిగులనాసక్తిగలదియును, దృఢమైనమనసుగలదియును, వడవడవడఁకుచున్నదియునునగు సీతాదేవినిమిగుల బెదరించి, యంతసీతనువిడిచి మన్మథావేశము నొందినవాఁడై మిగులఁబ్రకాశించెడు తనగృహోత్తమమును బ్రవేశించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యిరువది రెండవ సర్గముగిసెను.

రాక్షసస్త్రీలుసీతాదేవినిరావణాసురునకు భార్యగా నుండుమని బెదరించుట.

ఇట్లుశత్రువుల నేడ్పించునట్టివాడును రాక్షసరాజునునగు రావణాసురుడు సీతాదేవితో నీప్రకారముగజెప్పి పిమ్మట యచ్చటనుండెడు రాక్షసస్త్రీలనందరిని ఆజ్ఞాపించితనయింటికిఁబోయెను. అట్లు రాక్షసేశ్వరుడగు రావణాసురుడు అచ్చోటువిడిచి తనయంతఃపురమునకుబోగానే సీతాదేవి యొద్దనున్న భయంకరాకారులగు రాక్షసస్త్రీలు కఠినములగు మాటలచే తపుంపజేసిరి అనగానారాక్షసస్త్రీలు మహాకోపముచే శరీరము జలియనివారై సీతయొద్దకుఁబోయి మిగులపరుష వాక్యములతోనిట్లనిరి.

ఓసీతా! పులస్త్యబ్రహ్మవంశమునందు బుట్టినవాడును, మిగులశ్రేష్ఠుఁడును, మహాబలపరాక్రమములు గలవాడును, పదికంఠములు గలవాడునునగు రావణాసురునకు భార్యగానుండుట మిగులశ్రేష్ఠమనియెంచవా? అనిచెప్పిరి.అట్టియెడవారిలో ఏకజటయను రాక్షసిమహాకోపముచే మిగులనెఱ్ఱనైన నేత్రములుగలదియగుచు సన్ననినడుముగల సీతాదేవినిజూచి యిట్లనియె.

ఓసీతా! ఆరుగురుప్రజాపతులలో నాలవవాడును పులస్త్యుడను పేరుచే బ్రసిద్ధినొందిన వాడునునగు బ్రహ్మమానసపుత్రుఁడొకఁడుండెను ఆపులస్త్యునకు మిగులప్రభావము గలవాడును, పూజ్యుడగు ఋషియును బ్రహ్మదేవునితోసమానుండును విశ్రవసుఁడను పేరునే బ్రసిద్ధుడైనవాడునునగు నొకమానసపుత్రుఁడుండెను. విశాలములగు నేత్రములు గల యోసీతా! శత్రువులనేడ్పించునట్టి యీరావణాసురుడుఆవిశ్రవసునిపుత్రుడు. అట్టిసత్కులమునందు బుట్టినవాఁడును, రాక్షసేశ్వరుఁడునునగు రావణునకు నీవుభార్యవగుము. నీకుతగియుండును. సుందరములగు సర్వావయవములుగల యోసీతా! నీవునేనుజెప్పిన మాటనేలవినవు? అనిచెప్పెను అంతపిల్లికండ్లవంటి కండ్లుగలహరిజటయను రాక్షసిమహాకోపముతో కండ్లుగిరగిరంద్రిప్పుచు సీతనుజూచి యిట్లనియె

ముప్పదిమూడు కోట్లదేవతలను, దేవేంద్రుని, జయించినవాఁడును, రాక్షసేశ్వరుడునునగు రావణాసురుడు నిన్నుగోరుచున్నాడు. నీవుఅతనికిభార్యవగుము అనిచెప్పె అంతప్రఘసయను రాక్షసిమహాకోపముచే శరీరము వణకదియనిదియై సీతాదేవినిజూచిమిగులభయంకరముగ బెదరించుచు నిట్లనియె ఓసీతా! మిగులపరాక్రమమునచేత గర్వించినవాడును, శౌర్యవంతుడును, యుద్ధరంగమునందు వెనుకదీయనివాడును, మహాబలపరాక్రమశాలియునునగు రావణాసురునకు భార్యవగుటకు నీవేలయొప్పికొనవు ఆమహాబలుండును బ్రభుండునునగు రావణాసురుడు తనభార్యలనందఱిలో మిగులప్రియురాలును, మిగులగౌరవింప బడినదియును మహాభాగ్య వంతురాలునునగు మండోదరినిగూడ విడిచినిన్నేగూడియుండును, ఓసీతా! మఱియు నారావణాసురుడు, అనేకమంది స్త్రీలతోనిండి యుండున యును, నానావిధములగు మణులచేనలంకృతంబైనదియునునగు అంతఃపురమునసుండు సుందరులగుస్త్రీలనుగూడ విడిచి యెప్పుడును నిన్నేగూడియుండును. అనిచెప్పె.పిమ్మటవికటయను మఱియొకరాక్షసస్త్రీ సీతనుజూచి యిట్లనియె

ఓసీతా! దేవదానవగంధర్వులను పన్నగులనుపలుమారు జయించినరావణాసురుడు నిన్నేగోరుచున్నాడు ఓసీచురాలా! సర్వసంపత్సమృద్ధుడును, మహాత్ముడును, రాక్షసేశ్వరుడునునగు రావణాసురునకు భార్యవగుటకునీవేల యిష్టపడవు? అనిచెప్పె. అంతదుర్ముఖియను రాక్షసస్త్రీ సీతాదేవినిజూచి యిట్లనియె మిగులనిడుదలైన ఱెప్పలుగలదానా! సీతా! ఎవనిభయమువలన సూర్యుడుమిగుల తీక్ష్ణముగ బ్రకాశింపకున్నాడో అట్టియు, మఱియునెవనిభయమువలన వాయుదేవుడుగట్టిగా వీవకున్నాడో అటువంటియు, రావణునకు భార్యవగుటకు నీవేలయిచ్ఛగింపవు? (రావణునిభయమువలన సూర్యుడు తగుమాత్రముగ బ్రకాశించును వాయుదేవుడు తగుమాత్రముగ గాలికొట్టును) సుందరములగుకనుబొమలుగలయోసీతా! ఎవనిభయమువలన వృక్షములునిరంతరము పూలవానగురియుచున్నవో,ఎవ్వడుకోరినపుడుపర్వతములును మేఘములును జలములనిచ్చుచున్నవో, అటువంటి రాక్షసేశ్వరుడును రాజాధిరాజునునగు రావణాసురునకు భార్యగానుండుటకు నీవేలయిచ్ఛయింపవు? సుందరమైన చిరునవ్వుగలయోసీతా! నీమేలునకైయథార్థముగాను, జెప్పబడినమాటను ఏలఅంగీకరింపవు? నీవు మేముచెప్పెడి మాటలను వినకపోతివేని జీవించియుండనేరవు

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యిరువదిమూడవ సర్గముగిసెను.

కావలివారలగు రాక్షసస్త్రీలను సీతాదేవి నిందించుట.

పిమ్మటవికారములగు ముఖములుగలవారును, మిగులక్రూరులునునగు రాక్షసస్త్రీలు సీతాదేవినిజూచి మిగులకర్ణకఠోరములైన మాటలతోనిట్లనిరి.

ఓసీతా! సమస్తజంతువులకును మనోహరంబైనదియును మిగులశ్రేష్ఠములగు హాన్నులతోఁగూడినదియును నగు నీలంకాపురమునందుండుటకు నీవేలయిచ్చగింపవు? ఓజానకీ! నీవుమానవస్త్రీవిగావున మానవుడగు రామునికి భార్యవుగానుండుటయే యధికముగాదలచుచున్నావు ఇంకనైనను నీమనసును త్రిప్పుకొనుము ఇఁకనీవెంతమాత్రము ఆరామునికిభార్యగా నెప్పటికైననుండజాలవు. ఓసీతా! మూడులోకములయొక్క ధనసంచయముల ననుభవించునట్టి రాక్షసేశ్వరుడగు రావణాసురునికి భార్యవై సమస్తసుఖములననుభవింపుచుండుము నిందింపగూడని నడవడికగలయోసీతా! నీవుమిగుల మంగళస్వరూపురాలవయ్యునుమానవస్త్రీవిగావునరాజ్యభ్రష్టుడును, కడతేరని ప్రయోజనములుగలవాడును, మిగులదీనుడును, మనుష్యుడునునగు నారామునేగోరుచున్నావుఅనిచెప్పిరి ఇట్లురాక్షసస్త్రీలందఱును జెప్పగ విని తామరఱేకులతోఁ సమానమగు నేత్రములుగల సీతాదేవి మహావ్యసనముచే బొటబొటకన్నీరుగార్చుచు రాక్షసస్త్రీలనుజూచి యిట్లనియె.

ఓరాక్షసస్త్రీలారా! మీరందఱును యేకీభవించి లోకనింద్యమగు మాటజెప్పుచున్నారే ఇదిమీమనస్సునకు మిక్కిలి పాపమనితోఁచలేదా? ఓరాక్షసస్త్రీలారా! మనుష్యస్త్రీరాక్షసునకు భార్యయగుటకెంత మాత్రమునుతగదు? ఇపుడుమీరందురును నన్నుభక్షించినను భక్షింపుడు. మీరుచెప్పినట్లు నేనెంతమాత్రమునుజేయను ఓదుష్టస్త్రీలారా! నా పెనిమిటియగురాముడు మిగులదుఃఖితుడైనను, మహాదైన్యము నొందినవాడైనను రాజ్యభ్రష్టుడైనను నాకుమిక్కిలిశ్రేష్ఠుడు. సువర్చలాదేవి సూర్యునియందనురాగముగలదియైయున్నట్లు, నారామునియందు మిగులననురాగముగలదానినిగా నున్నాను. ఏప్రకారముగ మహాభాగ్యవంతురాలగు శచీదేవియింద్రుని ననుసరించుచున్నదో, ఎట్లుఅరుంధతీదేవి వసిష్ఠమహర్షిని అనుసరించుచున్నదో, ఏరీతిగరోహిణీదేవి చంద్రునిజేరియున్నదో, ఎట్లులోపాముద్రయగస్త్యమహర్షిని ననుసరించుచున్నదో, ఏరీతిగసుకన్యచ్యవనమహర్షిని గూడియున్నదో, ఏప్రకారముగ సావిత్రీదేవి సత్యవంతు ననుసరించుచుండినదో, ఎట్లుశ్రీమతికపిలమహామునితోఁ గూడియుండినదో, ఏరీతిగమదయంతి సౌదాసు ననుసరించుచుండినదో, ఎట్లుకేశిని సగరచక్రవర్తిని గూడియుండినదో, ఏప్రకారము భీమునికూతురగు దమయంతినలమహారాజు ననుసరించుచుండినదో, ఆప్రకారముగానే, నేనునునాపెనిమిటియైనఇక్ష్వాకువంశోద్భవుడగురామునను సరించుచున్నదానను అనిచెప్పె. అనిఇట్లుసీతాదేవి చెప్పగవిని, రావణాసురునిచే ప్రేరేపింపబడిన యారాక్షసస్త్రీలందఱు కోపముచే శరీరముదెలియనివారై మహాకఠినవాక్యములతోఁ సీతనుబెదరించిరి. అట్టియెడశింశుపావృక్షముమీదదాగియుండిన నాంజనేయుఁడేమియు బలుకకమౌనముగ గూర్చున్నవాడై యారాక్షసస్త్రీలు సీతాదేవిని బెదరించుచుండుటను జూచువారిమాటలను వినుచుండె అప్పుడుఆరాక్షసస్త్రీలు వడవడవడకుచున్న యాసీతాదేవిని పరివేష్టించి మహాకోపముతో ప్రేలాడుచుండు తమపెదవులను కొఱికికొనుచు నత్యుగ్రులై గండగొడ్డండ్రనెత్తికొని సీతాదేవినిజూచి యిట్లనిరి.

ఈసీతరాక్షసేశ్వరుడగు రావణాసురుని పెనిమిటిగా గ్రహింపదు రావణాసురునకు భార్యగానుండునట్టి భాగ్యము ఈసీతకు సంభవించునా? సంభవింపదు.అనియిట్లనేకవిధముల నారాక్షసస్త్రీలు బెదిరించిరి. అంతమిగులశ్రేష్ఠమగు ముఖముగల యాసీతాదేవివారికి భయపడి మహావ్యసనముతో కండ్లనిండనీళ్లుగ్రుక్కికొని మఱలనాకన్నీరుదుడిచికొని యాంజనేయుడు గూర్చుండిన యాశింశుపావృక్షమునొద్దకుబోయె. అట్లాశింశుపావృక్షము వద్దకుబోవుచున్న సీతాదేవిని, కావలియున్న రాక్షసస్త్రీలందఱును బరివేష్టించిరాగా నాసీతాదేవి శింశుపావృక్షమునుజేరి వ్యసనసముద్రమునందు మునిగినదియైయుండె అట్లుపరివేష్టించి వచ్చినయారాక్షసస్త్రీలు మిగులవ్యసనముతోఁగూడిన ముఖముగలదియును, విడువకధరించియుండుటచే మిగులమాసినవస్త్రమునే ధరించియున్నదియునునగు సీతాదేవినిమఱలబెదరించుట కారంభించిరి. ఆరాక్షసస్త్రీలలోఁ మిగులభయంకరములగు నేత్రములుగలదియును కోపోద్రేకముతోఁగూడిన యాకారముగలదియును, భయంకరమైన స్వరూపముగలదియును, మిగులగృశించిన కడుపుగలదియునునగు వినతయనురాక్షసి సీతాదేవినిజూచి యిట్లనియె

ఓసీతా! నీకునీపెనిమిటియందు గలస్నేహమును మాకందఱకును బహుతెస్సగా గాన్పించితివి.చాలుచాలును. ఇకచాలింపుము. శ్లో॥ సర్వత్రాతికృతం భద్రేవ్యసనా యోపకల్పతే॥ మంగళస్వరూపురాలవగునోసీతా! ఏకార్యమునైనను అధికముగా నాచరించుట వ్యసనమునకుగారణముగాని వేరుగాదు ఓసీతా! నీవుమనుష్యజాతికిదగిన యనుష్ఠానమునాచరించుచున్నావు. ఇంకచాలును. నేనుమిగులసంతోషపడితిని. నీకుశుభముగలుగుగాక; ఓసీతా! నీకునేనుమేలుగలిగించుమాట చెప్పుచున్నాను. అదివిని నీవునామాటప్రకారముచేయుము. మహాపరాక్రమశాలియును మిగులరూపవంతుడును, దేవతలకుప్రభుడును దేవేంద్రునితో సమా

నుడును, మిగుల చాతుర్యముగలవాడును, ఇచ్చుటయే స్వభావముగాగలవాడును, సమస్తజనమునకును, మిగుల సంతోషకరమగు దర్శనముగలవాడును, సకల రాక్షసులకును బ్రభువుననగు రావణాసురుని పెనిమిటిగా నంగీకరింపుము ఓసీతా! మనుష్యుడును, మిగులకుత్సితుడును, నగు రాముని పరిత్యజించి రావణునిఅంగీకరింపుము ఓసీతా! నీవు మిగుల సువాసనతోగూడియుండెడు మైపూతబూసికొని దివ్యాభరణములను ధరించుకొని అలంకారముతో గూడినదానవగుము. ఇదిమొదలుకొని నీవు సమస్తలోకములకును రాణివగుము. మంగళ స్వరూపురాలవగు నోసీతా! అగ్నిహోత్రునకు స్వాహాదేవియును, దేవేంద్రునకు శచీదేవియును, వలె, యీరావణునకునీవుభార్యవగుము. మహావ్యసనముచేగతాయువగు రామునితోనీకేమిప్రయోజనము.మఱియు నీవు నామాటవిని నేజెప్పినప్రకారము చేయవైతివేని యీనిమిషముననే మేమందఱమునుచేరి నిన్ను భక్షింతుము అనిచెప్పె. అంతవ్రేలాడుచున్న సమస్తావయవములుగల వికటయను మఱియొక రాక్షసస్త్రీ మహాకోపమునొందినదియై వ్రేళ్లనుముడుచుకొని పొడుచుటకు పిడికిలి పైకెత్తి సింహానాదమును సేయుచు సీతను జూచి యిట్లనియె.

ఓదుష్టాత్మురాలా! సీతా! ఇంతవరకును నీవెన్ని యప్రియవచనములుబలుకుచున్నను దయచేతను, ఓర్పుచేతను మన్నించియూరకుంటిమి. కాలోచితమైనవియును నీకుమేలుగలిగించునవియుననగు మామంచిమాటలను వినకున్నావు ఇదిగాక నీవుసముద్రముయొక్కయివతలిగట్టునకు తేబడియున్నావు. అన్యుడొక్కడైనను యీసముద్రమునుదాటి ఎంతమాత్రమునురాజాలడు. ఓసీతా! మఱియు నీవు ఎట్టివానికిని ప్రవేశింప నశక్యమగు రావణాంతఃపురమునం దున్నావు. ఇట్లు రావణాంతఃపురమునం దడ్డగింపబడిన దానవును మాచే రక్షింపబడుచున్నదానవును నగు నిన్నెవ్వరును గాపాడజాలరు; మఱియు సాక్షాదింద్రుండైనను రక్షింప జాలడు. ఓసీతా! నీకు నేను మేలుగలిగించు మాటను జెప్పుచున్నాను నామాటప్రకారము చేయుము నీవిట్లుకన్నీరువిడుచుటచే బ్రయోజనము లేదు. ఇక వ్యసనపడుట చాలింపుము. రావణాసురునియందు ప్రీతిగలదానవై నిరంతరము దుఃఖించుటనువిడిచి సంతోషముతో నుండుము. ఓసీతా! రాక్షసేశ్వరుడగు రావణాసురునితో గూడి క్రీడించుచు నీయిష్టప్రకారము సుఖమునను భవింపు చుండుము. మిగుల భయమునొందెడు స్వభావముగలయోసీతా! స్త్రీలకు యౌవనము శాశ్వతముగాదని నీకుదెలుసునుగదా? కావున ఈయౌవనకాలముగడచిపోకమున్నె సర్వసుఖములననుభవింపుము. ఎఱ్ఱబారిననేత్రములు గలదానా! సీతా! నీవురాక్షసేశ్వరుడైన రావణాసురునితోగూడి మనోజ్ఞములగు ఉద్యానవనములందును పర్వతప్రదేశములయందును అరణ్యములయందును సంచరింపుచుండుము ఓసౌందర్యముగలదానా! సీతా! సమస్తరాక్షసులకుప్రభువగు రావణాసురుని పెనిమిటిగాఅంగీకరింపుము అట్లంగీకరించితివేని యేడువేలమంది రాక్షసస్త్రీలు నీకు సేవజేయుచుందురు. ఓసీతా! నేనుచెప్పినమాటవిని ఆప్రకారముచేయవైతివేని నీగుండెకాయను పెరికి భక్షించెదననిచెప్పె అంతచండోదరియనునది మహాకోపముచే శరీరముదెలియనిదియై గొప్పశూలమును గిరగిరద్రిప్పుచు నారాక్షసస్త్రీలతో నిట్లనియె

ఓయక్కలారా! జింకనేత్రములవలె చలించునట్టి నేత్రములుగలదియును, భయముచే వడవడవడకుచున్న స్తనములుగలదియును నగు నీసీతను, రావణాసురుడిచ్చటికి దీసికొనిరాగానే, నేనీసీతను జూచినదిమొదలు దీనియందు నాకొకగొప్పకోరికగలదు అదియేమనిన. ఈసీతశరీరముయొక్క హృదయమునకు దక్షిణభాగముననుండు యకృత్తనుమాంసమును, హృదయమునకుదక్షిణభాగముననుండు ప్లీహయను మాంసమును, హృదయమునకు మీదుగనుండు నుత్పీడమను మాంసమును, క్రిందుప్రక్కనాధారమైయుండు స్యందనమనుమాంసమును, తామరమొగ్గవలె నుండెడు హృదయమును, మఱియుప్రేగులను మస్తిష్కమును వీటినన్నిటిని, భక్షింపవలయుననుటయేను, అనిచెప్పెను. అంతటప్రఘసయనురాక్షసస్త్రీయిట్లనియె.

ఓఅక్కలారా! నాకొకటితోచుచున్నది మనమిప్పుడు ఊరకుండనేల? మిగులక్రూరచిత్తురాలగు నీసీతను గొంతుపిసికిచంపి రాక్షసేశ్వరుడగు రావణాసురునియొద్దకు బోయి మనుష్యస్త్రీయగు సీతచచ్చిపోయినదని చెప్పుదము అంత రాక్షసేశ్వరుడగు రావణుడు అట్లుచచ్చిపోయెనేని తినుడని చెప్పును. ఈవిషయమును గుఱించి మీరెంతమాత్రము సంశయింపబనిలేదనిచెప్పె అంతఅజాముఖియను రాక్షసస్త్రీ యిట్లనియె.

ఓసఖులారా! మీరందరునుగూడి యీసీతను కోసి సమభాగములుగకుప్పలు వేయండి. అంతట మనమందఱము సముగా పంచుకొందము. కలహమాడుటకు నాకు యిష్టములేదు, మఱియు నానావిధములగు మద్యములను తేనె మొదలగు నాకదగిన లేహ్యపదార్థములను శీఘ్రముగ దీసికొనిరండు. వానితోగూడభక్షింపుదమనిచెప్పె. అంతశూర్పణఖయనురాక్షసస్త్రీయిట్లనియె. ఓసఖులారా! అజాముఖిచెప్పినమాటయే నాకునుసరియని తోచుచున్నది. కావున సమస్త

దుఃఖములను బోగొట్టునట్టిమద్యమును శీఘ్రముగ దీసికొనిరండు. అంతమనుష్యమాంసమును భక్షించి (లంకానగరపశ్చిమద్వారముననుండు గ్రామశక్తియైన) నికుంభిలనుగూర్చి పాడుదము నృత్యమాడుదమనిచెప్పె అనియిట్లనేకవిధములచే నాభయంకరులగు రాక్షస స్త్రీలు బెదిరింపగ, దేవకన్యకతో సమానురాలగు సీతాదేవి ధైర్యమును విడచి మహాభయముతో నేడ్పుటకారంభించెను.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి యిరువదినాల్గవ సర్గముగిసెను

*

సీతాదేవి తనవిధినిదూరుట.

ఇట్లు మిగులభయంకరాకారులగు నారాక్షస స్త్రీలు కఠినముగను మహాభయము గలుగునట్లుగను అనేక విధముల బ్రేలుచుండుటనువిని జనకమహారాజు కూతురగు సీతాదేవి మిగుల వ్యసనమునొందెను. మంచిహృదయముగల సీతాదేవి రాక్షస స్త్రీలచే నిట్లుబెదిరింపబడినదియై మహావ్యసనముచే డగ్గుత్తికనొంది భయముచే నాక్రమింపబడినదై యిట్లనిబదులుచెప్పె. ఓరాక్షస స్త్రీలారా! మనుష్య స్త్రీ రాక్షసునకు భార్యయగుట యుచితము గాదు. మీరుచెప్పిన ప్రకారము నేనెంతమాత్రమును చేయను. మీరందఱును నన్నుయథేచ్ఛముగాభక్షింపుడనిచెప్పె. అట్లురావణాసురునిచే బెదరింపబడినదియును, రాక్షస స్త్రీలచే బరివేష్టింపబడి బెదిరింపబడినదియును, దేవకన్యకతో సమానమైనదియునునగు సీతాదేవి మహావ్యసనముచేబీడింపబడినదై కొంచెమైనను సెమ్మదినిబొందదాయెను. (అనగాసుఖములేనిదయ్యె) అట్టియెడ సమస్తములైన యింద్రియములను ఉపరమింపజేసినదానివలెనున్న సీతాదేవి, "అరణ్యమునందు తనజాతి మృగములలోనుండిచెదరిపోయి తోడేళ్ళచే నావరింపబడిన లేడిపిల్లవలె" మహాభయముతో వడవడవడకుచుండె మఱియుసీతాదేవి మహావ్యసనముచే బీడింపబడిన మనస్సుగలదియై లెస్సగను దట్టముగను పూచియుండెడు ఆంజనేయు డెక్కియున్న అశోకవృక్షముయొక్క కొమ్మనుఆనుకొని తనభర్తయగు శ్రీరామునిధ్యానించుచునిలిచియుండె. అట్లునిలిచిదుఃఖించుటచే జారినకన్నీళ్లతో తనగొప్ప స్తనములను దడుపుచు రామునిధ్యానించుచు నే వ్యసనసముద్రమునకు తుదగానలేనిదయ్యె మఱియు అప్పుడాసీతాదేవి రాక్షస స్త్రీలవలని భయమువలన వడవడవడకుచు "సుడిగాలిచే నేలంబడిన యరటిచెట్టువలె" నేలయందుపడిలేచి మహాభయముచే తెల్లబారినముఖముగలదాయెను. అట్లుభీతిచే వణుకుచున్న సీతాదేవియొక్క, నిడువును వెడల్పునుగలజడగూడ కదులుచుండుటచే "ఆడుచున్నసర్పమువలె" గాన్పించె. అప్పుడు సీతాదేవి రామవిరహముచేబీడింపబడినదియై దుఃఖముచేత వ్యాకులమునొందినది యగుచు నిట్టూర్పులనువిడుచుచు హాహారమని యేడ్వసాగె. ఇట్లు మహావ్యసనముచే వెక్కి వెక్కి యేడ్చుచు, హారామా యనియును, హాలక్ష్మణా యనియును, అత్తగార్లగు హాకౌసల్యా! హాసుమిత్రా! యనియును, ఘొరపెట్టియేడ్వసాగ. ఇట్లుదుఃఖించుచు అయ్యోయో నేనిప్పడీప్రకారముగ నిర్దయులగు రాక్షసులచే జిక్కి మహావ్యసనమునొందినదాననై శ్రీరాముని నెడబాసియు నొకముహూర్తకాలమైనను బ్రతికియున్నాను కావున, శ్లో॥ లోకప్రవాదస్సత్యోయంపండితైస్సముదాహృతః। అకాలేదుర్లభో మృత్యుస్స్త్రియావాపురుషస్యవా॥ "పురుషులకుగాని స్త్రీలకుగాని కాలమురానిదే మరణములభింపదు" అనిపెద్దలు జెప్పెడి వాక్యము సత్యము అది యబద్ధముగాదు. మిగుల అల్పపుణ్యముగలదానను, పాపిష్ఠురాలనునగు నేను, "సరుకులచేనిండినదియును పెనుగాలితాకుడుచే సముద్రమధ్యమునమునిగి నదియునునగు గొప్పయోడవలె" యీవ్యసనసముద్రమునందు మునిగినదాననై దిక్కులేని యనాథవలె నశింపబోవుచున్నాను. అయ్యో నేనేమి సేయుదును. మఱియు నేనునాభర్తయగు శ్రీరామునిజూడలేక నిరంతరము రాక్షస స్త్రీలనుజూచుచు "మహాప్రవాహముచే గోయబడి నశించినదరివలె" యీవ్యసనమునందుమునిగి నానాటికి నశించుచున్నాను. ఇదియునుగాక వికసించిన తామరఱేకులవంటి నేత్రములుగలవాడును, సింహమువలె నడుచువాడును, కృతజ్ఞుడును, ఎప్పుడుప్రియములనేబలుకువాడును మహాసుగుణసంపత్తిగలవాడును, నా పెనిమిటియునునగు, రాముని ఏపుణ్యవంతులుచూచుచున్నారో! వారిభాగ్యము జెప్పనలవిగాదు. అట్టిపరమాత్మవేత్తయగు రామునివియోగముగలదాననైన నేను "మహావిషంబుభక్షించినవానివలె" ఎంతమాత్రమునుబ్రదుకజాలను నేనిప్పుడు మహాభయంకరముగు వ్యసనముననుభవింపుచున్నాను. కావున పూర్వజన్మమునందు నేనెట్టిపాపకృత్యమును జేసితినోగదా అయ్యో ఇట్టి పరమదుఃఖము ననుభవింపుచు నేనెంతమాత్రమును బ్రతికియుండజాలను. ప్రాణంబులువిడిచెదను. మఱియు మహాభయంకరులగు రాక్షస స్త్రీలచే గాపాడబడుచుండెడు నేనెంతమాత్రము శ్రీరామునిచూడనేలేను. అయినను ప్రాణములువిడుచుటకు నేను స్వతంత్రురాలనుగాను. ఒకరియధీనురాలగు ఆడుది తనయిష్టముచొప్పున ప్రాణములు విడువనేరదు. కావున ఒకరియధీనము నందుండుట యనునది

"దహింపబడుగాక" మానవుడును తనయిష్టముచొప్పున ప్రాణములువిడుచుటకు శక్తిమంతుఁడు గాఁడు. కావునమనుష్యత్వముగూడ దహింపఁబడుగాక అనిసీతాదేవిదుఃఖించుచుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యిరువదియైదవ సర్గ ముగిసెను.

--(*)

సీతాదేవితన్నునిందించుకొనుచు రామునిబొగడుట.

మిగులపసిదియును, జనకమహారాజు కుమార్తెయునగుసీతాదేవిమహావ్యసనముచే నధికముగఁగారుచున్న కన్నీళ్ళతోనిండినదియును భీతిచేతనులజ్జచేతను వంచఁబడినదియునునగుముఖముగలదియై యనేకప్రకారములుగ నేడ్చుటకారంభించె ఇట్లుసీతాదేవి హోరుమనియేడ్చుచు పిచ్చిపట్టినదానివలె నున్నదియును, మిగుల కైవునొందినదానివలెనున్నదియును, భ్రాంతిబొందినమనస్సుగలదానివలె నున్నదియునునై "అలసటదీర్చుకొనుటకై నేలంబడి పొరలుచున్నయాడుగుఱ్ఱమువలె" భూమిమీదబడి పొరలిపొరలియేడ్చుచుండె. ఇట్లుయేడ్చుచు, తనలోతానిట్లనియె.

రాముడెచటికోబోయియుండుకాలముననీ రావణాసురుఁడుకామరూపియై పర్ణశాలలోప్రవేశించి హోరుమనియేడ్చుచుండగ నన్నుబలాత్కారమునదీసికొనివచ్చె. నేనిప్పుడీరాక్షసస్త్రీల స్వాధీనములోనున్నదాననై వీరలచే మిగులభయంకరముగ బెదరింపఁబడినదాననగుచునిరంతరమునువ్యసనసముద్రమునమునింగి బ్రతికియుండ నేరను. మహారథుఁడగు రామునియెడబాసి రాక్షసస్త్రీలచేబరివేష్టింపఁబడినదాననైయుండు నేను బతికియుండుటచే నేమిప్రయోజనము, మఱియుధనముచేతగాని యాభరణములచేతగాని ఏమిప్రయోజనము. అయ్యో నేను మహావ్యసనమునొందియున్నానే నామనస్సుఏలవశింపదు కావుననామనస్సు ఱాతిచేతజేయఁబడినది. అటుగాదేని ముసలితనముగానిమరణముగాని లేకుండునట్లు జేయఁబడినదేమో? (అనగా నాయాయువుశాశ్వతమైనదేమోయనుట) అయ్యో! నేనట్టిశ్రీరాముని విడిచి మహాపాపమునను భవించుచు ముహూర్తకాలమైనను బ్రతికియున్నానే, అట్టిదుష్టురాలను, అసతినియగు నేనుదహింపఁబడుదునుగాక. మఱియునాలుగుసముద్రములచేజుట్టబడిన నీభూమినంతయుఁ బాలించువాఁడును, ఎప్పుడును ప్రియవచనములనే బలుకువాఁడును, నగునట్టినాపెనిమిటినివిడిచి బ్రతికియుండుటయందుగాని సుఖమునందుగాని నాకాశయేటికి? నేనింకనీశరీరమును విడిచెదను. ఓరాక్షసస్త్రీలారా! మీరందఱును నాదేహమును ఛేదించిభక్షింపుఁడు. నేనునాపెనిమిటినివిడిచి చిరకాలమీవ్యసనమనుభవింపఁజాలను. రాక్షసుఁడగు రావణాసురునినేనెడమకాలిచేనైననుముట్టను. కావునవానియందెట్లు మోహముందగలను? ఇట్టినిందితమగు కార్యమును జేయఁజాలను. ఈరావణాసురుఁడు మహాక్రూరబుద్ధిచే నన్నుగోరుచున్నాఁడు. అయ్యయ్యో! దీనివలన తానుతనవంశమును సర్వమును నాశనమగునని తెలిసికొనకున్నాఁడే? ఓ రాక్షసస్త్రీలారా! మీరునన్నునరికినను నరుకుదురుగాక; ముక్కలుముక్కలుగాఁగోసినను కోతురుగాక; లెస్సగామండుచుండెడు అగ్నియందుపేల్చినను పేల్చుదురుగాక, నేనెంతమాత్రమును రావణాసురునిభర్తగా నంగీకరింపను మీరుఊరక విశేషముగ నఱచుటచే నేమిప్రయోజనము? ఆహా, మిగులవిఖ్యాతినొందినవాఁడును, మహాప్రజ్ఞావంతుఁడును, కృతజ్ఞుఁడును (అనగానితరులు తనకు జేసినమేలుమఱువనివాఁడనుట) దయతోఁగూడిన మనస్సుగలవాఁడును, మంచినడవడికగలవాఁడునునగు శ్రీరాముఁడుగూడ నాదౌర్భాగ్యమువలన నావిషయమునందు నిర్దయుఁడయ్యె దీనికెంతమాత్రమును సంశయములేదు. జనస్థానమునందు ఒక్కఁడుపదునాలుగువేలమంది రాక్షసులను సంహరించిన రాముఁడిప్పుడేల నన్నుగాపాడకయున్నాఁడు మఱియు మిగులస్వల్పపరాక్రమములుగల రావణాసురుఁడు నన్నునిరోధించుచున్నాఁడు. మహాబలపరాక్రమశాలియగు నాపెనిమిటియీరావణాసురునియుద్ధమునందు సంహరించుటకు సమర్థుఁడేగదా? (అనగామహాసమర్థుఁడేయనుట) దండకారణ్యమునందు విరాధుఁడను రాక్షసోత్తమునియుద్ధమునందుసంహరించిన శ్రీరాముఁడు నన్నేలకాపాడకున్నాఁడు? సముద్రమధ్యముననుండెడు ఈలంకానగరము ఎవ్వరికినినలవిమైనదికాదు. అయినను రామబాణములు ప్రవేశింపగూడనిస్థలము యీలోకమునందెచటను లేదు. మిగుల దృఢమైనపరాక్రమశాలియగు శ్రీరాముఁడు, తనభార్యవగునన్ను రావణాసురుఁడు అపహరింపగా, రక్షింపక నూరకయున్నాఁడు. ఏమికారణమో తెలియదు. నేనిచట రావణాసురుని గృహమునందున్నానని శ్రీరాముఁడెఱుఁగియుండడనితలచెదను మహాపరాక్రమశాలియగు రాముఁడట్లెఱిఁగియుండునేని యీపరిభవము నెంతమాత్రమును ఓర్వఁజాలఁడు. నన్నురావణాసురుఁడు దీసికొనిపోగాచూచినవాఁడును, అవృత్తాంతమును రామునకుఁదెలుపఁదగినవాఁడునునగు గృధ్రరాజైనజటాయువుగూడ నాకొఱకు రావణాసురునిచేయుద్ధమునందు సంహరింపఁబడియె. ఆ

య్యో! జటాయువుమిగులవృద్ధుఁడయ్యును నన్నురక్షించుటకైరావణాసురునితో ద్వంద్వయుద్ధమునసలిపి మిగులగొప్ప కార్యమునుజేసెను. నేనిచట లంకానగరమునందు రాక్షసులచే జిక్కికొనియున్నానని శ్రీరాముండెఱింగునేని యాక్షణముననే మిగులకోపోద్దీపితుఁడై లోకములోనుండెడు సమస్తరాక్షసులనుతనబాణపరంపరలచే నాశనముజేసిలోకములో రాక్షసులే లేనట్లురూపుమాపునుగదా. నేనిచటనుండునది శ్రీరామునకుఁ దెలిసియుండునేని సముద్రమునునింకిపోవునట్లుజేసును. లంకానగరమును నిర్మూలముగజేయును. నీచుండగురావణాసురుని వానికీర్తినిగూడ నాశనముజేయును. అంతనేనుయిప్పుడు ఏప్రకారముగ దుఃఖించుచున్నానోయట్లురాక్షసస్త్రీలందఱును యింటింటనుతమపెనిమిట్లుచచ్చుటచే మహాదుఃఖమును బొందినవారగుచు నింతకంటె నెక్కుడుగా నేడ్చెదరు. ఇందుకొంతమాత్రమునుసంశయము లేదు. రామలక్ష్మణులిరువురునుయీలంకానగరమునందంతటను వెదకి మూలమూలలనున్న రాక్షసులనందఱినిబట్టిచంపుదురు మఱియు నా రామలక్ష్మణుల యెదుట బద్ధశత్రువెట్టివాఁడైనను ముహూర్తకాలమైన బ్రతికియుండజాలఁడు. ఇంకస్వల్పకాలములోనే యీలంకానగరద్వారములన్నియు పీనుఁగుపోగలచేఁగప్పఁబడి కలతహొందినవియగును. మఱియు నీలంక ఎచటఁజూచినను గ్రద్దలగుంపులచే చీకాకుఁబొందినదియై శ్మశానముతోసరిపోలియుండగలదు. మఱియునింకకొద్దికాలములోనే నాకోఱికెయీడేరును. ఓరాక్షసస్త్రీలారా! మీదౌష్ట్యమే శీఘ్రముగసమస్తరాక్షసులయొక్క వినాశమును జెప్పుచున్నది. ఈలంకానగరమునకు కీడుసంభవించుననుటకు నిమిత్తములగుననేకదుశ్శకునములు గాన్పించుచున్నవి. మఱియు స్వల్పకాలముననే కాంతిచెడినశించిపోవును. మిగులపాపాత్ముఁడును రాక్షసాధముఁడుననగు నీరావణాసురుఁడుచంపఁబడగానే, మిగులదురాసదంబగు నీలంక "మగఁడుచచ్చినవిధవస్త్రీవలె" కాంతిచెడినశించిపోవును ఇది నిశ్చయము. అట్లునశించిన ప్రభుత్వగలదియును, మగఁడుచచ్చినవిధవస్త్రీలతోఁ గూడినదియునునగు నీలంకానగరము "పెనిమిటిచచ్చినవిధవస్త్రీవలె" శుభోత్సవములేవియునులేకనాశనమొంది కళాహీనమైయుండఁగలదు. మఱియు బహుశీఘ్రకాలముననే, యీలంకానగరమునందింటింటను భర్తృవియోగవ్యసనముచే బొటబొటకన్నీరుగార్చి యేడ్చుచుండెడు రాక్షసస్త్రీలయొక్క కంఠస్వనినివినగలను ఇందుకొంతమాత్రమునుసంశయములేదు. మహాశౌర్యముగలవాఁడును, నేత్రములకొనలయందెఱ్ఱబారలుగలవాఁడుననగు శ్రీరామునకునే నీరావణాసురునిగృహమునందున్నట్లుతెలియునేని యీలంకానగరమును తనబాణపరంపరలచేదహించి భస్మముగజేయును. అంతనీలంకానగరము చంపఁబడిన రాక్షసశ్రేష్ఠులు గలదియును, పెనుచీకటిలోమునిగినదియునునై కాంతిహీనమై యుండగలదు మహాక్రూరాత్ముఁడును నీచుఁడుననగు నీరావణాసురుఁడు నాకేర్పరచినగడువుగూడసమీపించినది మిగులపాపకృత్యములను జేయువారును, అధర్ములును, కార్యాకార్యములనెఱుగనివారును నగు నీరాక్షసులవలన మహోత్పాతములు గలిగినను గలుగును (అనగా నీరాక్షసులనన్నుచంపినను చంపుదురు) మాంసమునుదిననట్టి యీరాక్షసులు ధర్మాధర్మమునుగూడ నెఱుఁగరు. రాక్షసేశ్వరుఁడగు నీరావణాసురుఁడు నన్ను ప్రాతఃకాల భోజనమునకు పక్వముచేయించుకొనును. ఇందుకుసంశయములేదని నాకుతోఁచుచున్నది. ఎఱ్ఱనికడగండ్లుగలవాడును, ప్రియదర్శనుండుననగు శ్రీరామునివియోగముచే మహాదుఃఖమునొందియుండెడు నేనారాముని నెడబాసినదాననై యేమిచేయగలను. ఇప్పుడిచటనెవ్వఁడైనను నాకువిషముతెచ్చియిచ్చునేని యావిషమునుభక్షించి యమపురమునకుబోయెద. మఱియు శ్రీరామునివిడిచియిట్లుదుఃఖించుచుండుటకన్నయదియుత్తమమని నాబుద్ధికితోఁచుచున్నది. అయ్యో! నేనిచటజీవముతోనున్నానని లక్ష్మణునికిఅన్నయగు రామునకుతెలియదు. అట్లా రామలక్ష్మణులు, నేనిచటఁ బ్రతికియున్నానని వినియుందురేని భూలోకమునందలి యెల్లస్థలములయందును నన్ను వెతకక యూరకుండరు, ఒకవేళ, మహాపరాక్రమశాలియగురాముఁడు నానిమిత్తమైన వ్యసనముచేతనే యీభూలోకమున తనదేహమునువిడిచి స్వర్గలోకమును బొందియుండునని నిశ్చయముగదలచెదను. అట్లుమృతినొందినవాడును, తామరతెకులవంటి నేత్రములుగలవాఁడును, నాభర్తయుననగు శ్రీరామునిజూచుచుండెడు దేవతలును గంధర్వులును సిద్ధులును మహర్షులును మిగులపుణ్యవంతులు. అటుగాక రాముఁడుజీవించియుండినను ధర్మమునందిచ్ఛగలవాఁడై మిగులగొప్పబుద్ధితో రాజఋషియై వైరాగ్యమును బొందియుండునేని యారామునకునాతో నేమిప్రయోజనము. అట్టిరామునకు నామీదిప్రేమయుడిగియుండును. శ్లో॥ దృశ్యమానే భవేత్ప్రీతి స్సౌహృదం నాస్త్యపశ్యతః॥ స్నేహితులు ఒకరినొకరు చూచుచుండురేని స్నేహమువృద్ధియగును. ఒకరినొకరు చూడకుండినచో స్నేహమునశించును. శ్లో॥ నాశయంతికృతఘ్నాస్తు నరామోనాశయిష్యతి॥ తనకుజేసినమేలు మఱచువారగు కృత

ఘ్నులయందుమాత్రము స్నేహమునశించును, కాని, రామునియందెంతమాత్రము స్నేహమునశింపదు. అటుదానినగు నేను మహాత్ముండగు నాపెనిమిటి నెడబాసి యిట్లుపరమదుఃఖితనై నశించుచున్నానే యిది నాపూర్వజన్మకృతమగు పాపమా యేమి? లేక నాసుకృతము నశించినదా యేమి? మహాత్ముండును దోషరహితమైన చారిత్రముగలవాండును, మహాశూరుండును, శత్రువులను సంహరించువాండునునగు శ్రీరాముని నే నెడబాసి బ్రతికియుండుటకన్న ప్రాణములనువిడుచుట శ్రేయము అట్లుగాదేని అన్నదమ్ములగు రామలక్ష్మణులిరువురును అరణ్యమునందు కందమూలఫలములనుదినుచు మహావ్యసనముచే నాయుధములను విడిచి మునివృత్తినవలంబించి యరణ్యమునదిరుగుచున్నారేమో? అదియును గాదేని, మిగులదురాత్ముండును రాక్షసేశ్వరుండును నగు రావణాసురుండు, వారియెదుటబడి యుద్ధము జేయుటకు భయపడి, అన్నదమ్ములగు రామలక్ష్మణులనిరువురిని కపటోపాయముచేం జంపించెనా యేమి? అయ్యయో నాకాల మిట్లుసంభవించినది కావున సర్వవిధములచే తప్రాణములు విడువంగోరెదను. నేనిట్లు మహావ్యసనములో మునిగియున్నను, మరణముగూడ కలుగకున్నది. ప్రియాప్రియములను భేదము లేనివారును, మహాధైర్యముగలవారును, పాపరహితులును, జితేంద్రియులును, పూజ్యమైన స్వభావముగలవారును నగు మహర్షులుధన్యులు. మఱియు ప్రియమువలన సుఖముగలుగును. అప్రియమువలన మహావ్యసనముసంభవించును. కావున ఆప్రియాప్రియములవలన విడువంబడినవారు మహాత్ములు. అట్టివారికి నేనమస్కరించెదను. ఐతే నేనో అట్టిదానను గాను. నేను కేవలము ప్రియపదార్థమునందే యిచ్ఛగలదానను. కావున నాకు ప్రియుండును పరమాత్మవేత్తయును నగు శ్రీరాముని నెడబాయునట్లు చేయంబడినదానను, మహాపాపిష్ఠుడగు రావణాసురుని స్వాధీనమునందున్నదానను నై యెంతమాత్రమును జీవింపనొల్లను. ప్రాణములు విడిచెదను. అనియిట్లనేకప్రకారముల సీతాదేవి ప్రలాపించుచుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యిరువదియాఱవ సర్గముగిసెను.

త్రిజటయను రాక్షసి తానుగన్న స్వప్నమును రాక్షసస్త్రీలతో జెప్పట.

అనియిట్లు సీతచెప్పగావిని, మహాభయంకరాకారులగు రాక్షసస్త్రీలు కోపముచే శరీరము దెలియనివారై కొందరు రాక్షసస్త్రీలు యీవృత్తాంతమును రావణాసురునకె ఱింగించుటకు వెళ్ళిరి భయంకరాకారులగు తక్కిన రాక్షసస్త్రీలందఱును సీతాదేవియొద్దకుం బోయి, ముందు జెప్పినట్లె మిగుల కఠినములును అనర్థములును నగుమాటలను చెప్పనారంభించిరి ఓదుష్టురాలా! పాపకార్యములందిష్టముగలదానా! సీతా! ఈదినముననే యీక్షణమున రాక్షసస్త్రీలవగు మేమందఱమును నీమాంసమును యథాసుఖముగభక్షించెదము. అనియిట్లు ఆదురాత్ములగు రాక్షసస్త్రీలందఱును సీతాదేవిని బెదరించుచుండగ త్రిజటయను నొకవృద్ధరాక్షసస్త్రీ వారలనుజూచి యిట్లనియె.

ఓదుష్టప్రవర్తకులగు రాక్షసస్త్రీలారా! మీరు నన్ను భక్షింపుండు. జనకమహారాజుకూతురును, దశరథమహారాజుకోడలును సమస్తలోకములకును ప్రియయునునగు సీతాదేవినిభక్షింపవలదు. ఇప్పుడు, నేను రాక్షసులకు వినాశమునుబుట్టించునదియును ఈసీతాదేవిభర్తయగు శ్రీరామునకు అభ్యుదయమును గలిగించునట్టి శుభమును సూచించునదియును, విన్నంతనె గగుర్పాటునొందించునదియును, మహాభయంకరమైనదియును నగునొక కలగంటిని. అనియిట్లు త్రిజటచెప్పగవిని, కోపముచే శరీరము దెలియకయున్న యీరాక్షసస్త్రీలందఱును మహాభయమును బొందినవారై యాత్రిజటనుజూచి యిట్లనిరి. ఓత్రిజటా! నీవీరాత్రి యెట్టి కలగంటివో యది మాకు చెప్పుమని యడిగిరి. అనియిట్లు రాక్షసస్త్రీలడుగగా వారిమాటలను విని ప్రాతఃకాలమున లేచి తానుగనినస్వప్నవృత్తాంతమును గుఱించి యిట్లనియె.

ఓ రాక్షసస్త్రీలారా! శ్రీరాముండు తెల్లనిపుష్పమాలికలను ధరించి, ఏనుగుదంతముతో చేయంబడినదియును, శ్రేష్ఠమైనదియును, గగనమార్గమున బోవునదియును, వేయి హంసలచే మోయంబడినదియును నగు విమానము నెక్కి లక్ష్మణసమేతుండై లంకకువచ్చె. సీతాదేవియును తెల్లని వస్త్రములను పూలదండలను ధరించి, సముద్రముచే నావరింపంబడియుండెడు నొక్క తెల్లని పర్వతముపై నెక్కియున్నట్లు నాకలలో నేనిప్పుడు చూచితిని. అంత సీతాదేవి "సూర్యునితో వెలుగుచేరియున్నట్లుగనె" శ్రీరామునితో చేరియుండుట జూచితిని. రాముండు లక్ష్మణసమేతుండై నాలుగుదంతములుగలదియును, పర్వతముతో సమానమైనదియును, నగు నొక మహాగజము నెక్కి తిరుగుచున్నట్లు చూచితిని. అంత పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణులు తమ దేహకాంతులచే ప్రకాశించుచు తెల్లనిపూలదండలను, వస్త్రములను ధరించి యామేనుంగునెక్కి యాకాశమందు సీతాదేవిసమీపమునకు వచ్చిరి. అంత సీతాదేవి తానెక్కి యుండిన శ్వేతపర్వతశిఖరమునుండి, ఆకాశమార్గముననున్నదియును,

తన పెనిమిటియగు శ్రీరాముఁడెక్కియున్నదియును నగు యేనుంగుయొక్క మూపుపైనారోహించి రామునితొడపైఁగూర్చుండెను. ఆవలతామరరేకులవంటి నేత్రములుగల సీతాదేవి తన పెనిమిటి తొడలపైనుండి మీదికిలేచి చంద్రసూర్యులను తనహస్తముతో పట్టుకొనునట్లు చూచితిని. అనంతరము ఆ రామలక్ష్మణులును విశాలములగు నేత్రములుగల సీతాదేవియును నెక్కియున్న యాయుత్తమయేనుఁగు లంకానగరమునకుమీఁదుగ, ఆకాశమార్గమున నుండుట చూచితిని. మఱియు కకుత్స్థవంశోద్భవుఁడగు శ్రీరాముఁడు తనభార్యయగుసీతాసమేతుఁడై యెనిమిది తెల్లయెద్దులచేఁబూన్పఁబడిన రథము నెక్కి యిచటికివచ్చె. అంత, మహాపరాక్రమశాలియును పురుషోత్తముఁడును నగు శ్రీరాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై సూర్యునితోసరిపోలు కాంతిగలదియును, స్వర్గసంబంధమైనదియును నగు పుష్పకవిమానము నెక్కి యుత్తరదిశకు పోవుచుండుటను జూచితిని.

ఇట్లుపోవుచున్న రఘువంశోద్భవుఁడును మహావిష్ణువుయొక్క పరాక్రమమువంటి పరాక్రమముగలవాఁడును నగు శ్రీరాముని నతనితమ్ముఁడగులక్ష్మణుని, శ్రీరామునిభార్యయగుసీతాదేవిని వీరుముగ్గురిని నాకలలోచూచితిని. ఓ యక్కలారా! "పాపాత్ముఁడు స్వర్గమును సాధింపలేనట్లు" మహాపరాక్రమశాలియగు శ్రీరాముని, దేవతలుగాని రాక్షసులుగాని మఱియెవరుగాని జయింపజాలరు. అదట్లుండనిండు. మనరావణాసురుఁడు దేహమంతయునూనె బూసికొని, ఎఱ్ఱనివస్త్రములను పూలదండలను ధరించి, నూనెద్రావినవాఁడై పెక్కుసారులు నేలంబడి పొరలుచుండుటను జూచితిని. మఱల రావణాసురుఁడు పుష్పకవిమానము నెక్కి యందుండి నేలంబడి, జుట్టులేకుండ బోడిగ గొరిగించుకొని నల్లనివస్త్రములనుగట్టుకొని యొక యాఁడుది ఆ రావణాసురుని యీడ్చుకొనిపోవుచుండుటను చూచితిని. అంతట మఱలనా రావణాసురుఁడు, యెఱ్ఱనిపుష్పమాలికలను ధరించి, యెఱ్ఱగంధము పూసికొని నూనెద్రావి, ఆడుచుపాడుచు నవ్వుచు మెగురుచు పిచ్చిపట్టినవానివలె పలువిధములగు చేష్టలు చేయుచు గాడిదెలను గట్టిన రథము నెక్కి యతిశీఘ్రముగ దక్షిణదిక్కునకై పోయెను. అట్లు గాడిదెలగట్టఁబడిన రథము నెక్కిపోవుచు భయభ్రాంతుఁడై తెలివిదప్పి తలక్రిందుగ నేలంబడి మరలనొకగాడిదపై నెక్కి యందుండి తలక్రిందుగ నేలంబడెను. ఇట్లు నాకలలో చూచితిని. ఇట్లు నేలంబడి తటాలున లేచి తొట్రుపాటుచే భయభ్రాంతుఁడై మైకముచేత దేహము తెలియక దిగంబరుఁడై పిచ్చివానివలె చెడ్డమాటలువదరుచు, ప్రేలుచు, దుర్గంధముతో గూడినదియును, సహింపగూడనదియును, మహాభయంకరమైనదియును, గాఢాంధకారమగు నరకముతో సమానమైనదియును, నగు మలపంకములోఁబడి మునిఁగిపోయెను. మఱియు రావణాసురుని కొడుకులందఱును శరీరమునకు నూనెను పూసికొనియుండగా చూచితిని. ఇదియునుగాక రావణాసురుఁడు పందిమీదను, ఇంద్రజిత్తు మొసలిమీదను, కుంభకర్ణుండు ఒంటెమీదను, ఎక్కినవారై దక్షిణపుదిక్కునకై పోయిరి. అప్పుడు విభీషణుఁ డొక్కఁడుమాత్రము, తెల్లనిగొడుగుగలవాఁడును, తెల్లనివస్త్రములను పూలదండలను ధరించినవాఁడును, తెల్లగంధమును పూసికొన్నవాఁడును, శంఖధ్వనులచేతను భేరీమృదంగధ్వనులచేతను, ఆటలచేతను పాటలచేతను ఒప్పుచున్నవాఁడును, చక్కఁగ నలంకరించుకొనినవాఁడునునై, పర్వతముతో సమానమైనదియును, మేఘధ్వనివంటి ధ్వనిగలదియును, నాలుగుదంతములుగలదియును, మిగుల శ్రేష్ఠమైనదియును, ఆకాశమార్గమునందు సంచరించునదియును నగు యేనుఁగుపై తననలువురు మంత్రులతోగూడ నెక్కియుండుటను నాకలలో చూచితిని. ఎక్కిన రాక్షసులందఱును నూనెద్రావి, యెఱ్ఱనివస్త్రములను పూదండలనుధరించి, ఆడుచుపాడుచు నానావాద్యధ్వనులు మ్రోగుచుండగ గుంపులుగూడియుండుటను చూచితిని. మఱియు రావణాసురునిచేఁ బాలింపఁబడు నీలంకానగరమంతయు శ్రీరామునిదూతయును మహాబలపరాక్రమశాలియునునగు నొకవానరునిచేత కాల్పబడినట్లు నాస్వప్నమునందు చూచితిని. లంకానగరమునందుండెడు రాక్షసస్త్రీలందఱును, నూనెను ద్రాగి విశేషముగ నాడుచు, అధికముగ నవ్వుచు, మహాకోలాహలముగ ధ్వనులను జేయుచు, భస్మమై ప్రవేశింపగూడని లంకానగరమున తిరుగుచుండుటను జూచితిని. మఱియును కుంభకర్ణుఁడు మొదలుగాగల రాక్షసోత్తములందఱును యెఱ్ఱనివస్త్రములను ధరించి యొక పేడగుంటలోఁబడి మునిగిపోయిరి. ఓ అక్కలారా! మీరు అవతలికి తొలఁగిపొండు. అట్లు జేయకపోతిరేని నాశనమగుదురు. రాముఁడు సీతతోఁ జేరినవాఁడనుటకు ఎంతమాత్రము సంశయము లేదు. ఆ రాముఁడు మిగులకోపోద్దీపితుఁడైన సమస్తరాక్షససమూహములతోఁగూడ మిమ్ము సంహరించును. ఓయసురస్త్రీలారా! రామునకు మిగుల ప్రియురాలును, ఆ రామునిచే మిగుల గౌరవింపఁబడినదియును, వనవాసమునందును గూడ నా రాముని వెంబడించియున్నదియును నగు సీతాదేవిని మీరు నిందించినను, బెదరించినను, ఆ రాముఁడు సహింపఁజాలఁడు. కావున మీరు యిప్పుడు క్రూరముగ మాటలాడుటను చాలించి నెమ్మదిగ శాంతవచనముల

ను బలుకుము. మఱియుమీరలు సీతాదేవితో మన్ననలడిగి కొని ప్రార్థింపుడు. ఇదిమిగుల శ్రేయస్కరకారణమని నా బుద్ధికితోచుచున్నది. ఇదిగాక, శ్లో॥ యస్యా హ్యేవంవిధస్స్వప్నో దుఃఖితాయాః ప్రదృశ్యతే। సాదుఃఖై ర్వివిధైర్ముక్తా ప్రియం ప్రాప్నోత్యనుత్తమమ్॥ ఏస్త్రీగాని మహావ్యసనములో మునిగియుండగ నిట్టిస్వప్నముగలుగునేని యాస్త్రీ సమస్తవ్యసనములనుండి విడువఁబడినదియై చెప్పనలవిగాని సంతసముపొంది మహాసౌఖ్యము ననుభవించును. కావున ఓయసురాంగనలారా! మీరీసీతాదేవిని ప్రార్థించుటకు సందేహింపవలదు. ఈసీతమీచే విశేషముగనిందింపబడినదియైయున్నను మీరుమన్ననలడిగి కొందురేనిమన్నించును. ఇదిగాక శ్రీరామునిచే రాక్షసులకంతకిని మహాభయము సంభవింపఁబోవుచున్నది. ఓరాక్షసస్త్రీలారా! జనకమహారాజు కుమార్తెయగు నీసీతాదేవి, ప్రణిపాతమాత్రముచేత ప్రసన్నురాలై మిమ్మును సమస్తభయములనుండియు యాపదలనుండియు, తొలగించుటకు సమర్థురాలగును. రామునివలన గలుగబోవు సంకటములనుండి రక్షించుటకు యీసీతాదేవిమాత్రమే సమర్థురాలగును. ఇదియునుగాక విశాలములగు నేత్రములుగల సీతాదేవియొక్క అవయవములయందు వ్యసనముగలిగించునట్టి మిగులసూక్ష్మమైన సాముద్రికలక్షణముగాని అంగవైకల్యముగాని కొంచమైనను లేదు. ఐనను కాంతిమాత్రము కొంతతగ్గియున్నది. కావుననేయీసీతాదేవి వ్యసనమనుభవింప దగనిదియును, విమానమునందుండ దగినదియును, దివ్యభోగములనుభవింపదగినదియును, నయ్యునిప్పుడీట్టివ్యసనముల ననుభవించుచున్నదని యెంచెదను. అయినను రాక్షసేశ్వరుఁడగు రావణాసురునకు వినాశమును శ్రీరామునకు విజయమును, యీసీతాదేవియొక్క యభీష్టసిద్ధియును, శీఘ్రకాలముననే గలుగునట్లు తోచుచున్నది నాయొక్క స్వప్నము ఈసీతాదేవికి మహాసంతసముగలుగుటను మనము వినుటకు కారణముగానున్నది ఇదియునుగాక తామరతేకువలె విశాలములగు నీసీతాదేవియొక్క యెడమకన్నుగూడ నదురుచున్నది. మఱియు నీసీతాదేవి యెడమభుజము మాత్రమునిష్కారణముగ వణకుచున్నది. ఆడయేనుగుతొండముతో సమానమైనదియును, మహాశ్రేష్ఠమైనదియునగు నెడమతొడగూడ నదురుచున్నది ఈశుభసూచకములచేత శ్రీరాముఁడు అతిస్వల్పకాలములోనే యిచ్చటికివచ్చునని తోచుచున్నది. ఇదియునుగాక పింగళపక్షియును ఒకచెట్టుకొమ్మపైకూర్చుండి మహామధురస్వనముతో బలుమాఱుకూయుచు మంగళకరమగు బంధువుయొక్క రాకను తెలుపుచున్నట్లు తియ్యనిపలుకులను జెప్పుచు మాటిమాటికి సంతసమును గొలుపుచున్నది

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి యిరువదియేడవ సర్గముగిసెను.

-:-

సీతాదేవి రామలక్ష్మణులను ఉద్దేశించి మొఱ పెట్టుట.

అట్టియెడ సీతాదేవి రాక్షసేశ్వరుఁడగు రావణాసురుడు పలికినయప్రియవచనములను దలచుకొనిమహావ్యసనముచేత భీతింపఁబడినదియై మహారణ్యమధ్యమున సింహముచే నడ్డగింపఁబడిన శ్రేష్ఠమగుఆఁడఏనుగువలె మహాభయము నొంది వడవడవణకుచుండె అట్లువణకుచున్నదియును మిగులభయమునొందెడు స్వభావముగలదియును, నగుసీతాదేవి రాక్షసస్త్రీలనడుమ జిక్కికొని రావణునిచే బెదరింపఁబడినదియై జనులులేని అరణ్యప్రదేశమున జిక్కుపడిన లేడిపిల్లవలెచూపట్టుచు మిగులవ్యసనపడుచునుండె అట్లుదుఃఖించుచు సీతాదేవితనలో తానిట్లనియె

నేనుమహాపాపిని ఇట్లురాక్షసులచేత నిందింపఁబడినదాననై నిమిషమైనను మహాకుత్సితముగ బ్రతికియున్నానుగావున "ఎవరికిగాని అకాలమృత్యువు సంభవింపదు"అనిపెద్దలుచెప్పెడిమాట యథార్థముగానున్నదే! అయ్యో! నేనేమిసేయుదును మఱియు మహాసుఖములనుండి యెడబాటును బొందినదియును, అమితవ్యసనముల ననుభవించుచున్నదియునునగు నాహృదయము వజ్రాయుధముచేత నఱకఁబడిన పర్వతశిఖరమువలె వేయితునకలుగ పగులకున్నది కావుననిదిమిగుల స్థిరమైనది. ఇందుకుసంశయములేదు ఇదియునుగాక చూచువారలకు మహావికారమగు రూపముగల రావణాసురుఁడున్ను ఏవిధముచేనైనను సంహరించును కావున నేనేహత్యజేసికొనుటచే నెంతమాత్రమును దోషముగలుగదు. ఇదినిశ్చయము. కాదేని రావణాసురునకు వశవర్తినినై ప్రాణములను గాపాడు కొనెదమనిన "బ్రాహ్మణుఁడు వేదమంత్రమును శూద్రునకివ్వజాలనియట్లు" నామనస్సును ఈరావణాసురునకిచ్చుటకు నేనెంతమాత్రమును యిచ్చగింపను లోకనాథుఁడగుశ్రీరాముడు రెండుమాసములలోపల యిచటికిరాకుండెనేని మహాదుష్టాత్ముడును రాక్షసేశ్వరుడునునగు రావణాసురుడు "శస్త్రవైద్యుఁడు గర్భమునొజచ్చిన శిశువును ఛేదించివెలుపలికిదీయునట్లు" కఱకుకత్తులచే నాయొక్కసమస్తఅవయవములను తునకలుతునకలుగ ఛేదించును.

ఈరెండుమాసములుగూడ మహాశీఘ్రముగగడచిపోవు

నేమో! అయ్యో! నేనేమిసేయుదును. ఈరెండు మాసములుగడవగానే "రాజద్రోహియగు దొంగను రాత్రిపట్టి బంధించి మఱుదినమునయందు నేచంపునపుడు వానికిగలుగు వ్యసనమువలె" బహుకాలముగ మహావ్యసనములో మునిగియుండు నాకునునట్టి దుఃఖము సంఘటిల్లును గద హారామా! హాలక్ష్మణా! హాసుమిత్రా! రామునికన్నతల్లివగు నోకౌసల్యా! ఓతల్లీ! మహాదురదృష్టురాలనగు నేను "గొప్పసముద్రమధ్యమునసుడిగాలిచే నాశమును బొందినయోడవలె' సముద్రమధ్యమునను౦డెడు నీలంకానగరమునందు వినాశమును బొందుచున్నాను. అయ్యో! మహాబలవంతులును రాజపుత్రులునగు రామలక్ష్మణు లిరువురును, నానిమిత్తమై జింకరూపమును దాల్చివచ్చిన మారీచునిచే "రెండుసింహములుగాని, రెండువృషభములుగాని, తటాలుననొక పిడుగుచేగూలినట్లు" చంపఁబడియుందురు ఇందుకుసంశయము లేదు. అయ్యో! అప్పుడు మాయఁజేయుట్టి జింకరూపమును దాల్చివచ్చి మిగుల దురదృష్టురాలును, పుణ్యహీనురాలును నగునన్ను లుబ్ధత్వముచే నాశపడునట్లుచేసెను. ఇందుకొంతమాత్రమును సంశయములేదు. కావుననే నేను మిగుల మూఢురాలనై నాభర్తయగు శ్రీరాముని, యతనితమ్ముడగు లక్ష్మణునిపొమ్మని ప్రేరేపించితిని. అయ్యో! రామా! పొడవైనచేతులు గలవాడా! హారామా! పున్నమచంద్రునితో సరిపోలుముఖమునుగలవాఁడా! హారామా! లోకమునందుండెడు సమస్తప్రాణి సమూహములకును మేలుచేయువాఁడవయ్యును, నేను రాక్షసులచేఁ జచ్చుటకుసిద్ధమై యున్నానని యెఱుఁగవుగదా; నీకంటెకన్న నితరదైవములేదను వ్రతమువలంబించి యుండుటయును, ఈరాక్షసస్త్రీలును రావణాసురుడును గలుగఁజేయు సంకటముల నోర్చియుండుటయును, ధర్మవ్రతమువలంబించి నేలపైబరుండుటయును, ధర్మమునందాసక్తి గలదాననై పాతివ్రత్యవ్రతము నవలంబించి యుండుటయును, ఇవిమొదలగు ధర్మములన్నియును "కృతఘ్నునకుఁజేసిన మేలువలె" నిరర్థకములై నశించుచున్నది. హారామా! నేనుబహుకాలముగ నిన్నెడబాసియుండుటచే గలిగినవ్యసనమువలన మిగులకృశించి వైవర్ణ్యమును బొందినదాననైయుండియు నిన్నుఁగలఁ బొందుననెడి యాశనిరాశఁజేసికొనవలసివచ్చెను. అట్లు నేననుష్ఠించిన ధర్మమంతయు నిరర్థకమైనది పాతివ్రత్యవ్రతమునవలంబించి యుండుటయుగూడ నిరర్థకమైపోయె. నేనిప్పుడుఁజచ్చుదాననే! ఇదినిశ్చయము. ఓరామా! నీవునీతండ్రియాజ్ఞ చేసి యతుఁడవై నీవుఅవలంబించిన వానప్రస్థాశ్రమమును ముగియగానే కృతార్థుడవై యరణ్యమును విడిచి మఱలి యయోధ్యానగరమునందు ప్రవేశించి సమస్తదుఃఖములను మఱచిపోయి విశాలములగు నేత్రములుగల స్త్రీలతోఁగూడి క్రీడించుచుండగలవు. ఓరాముఁడా! మిగులదౌర్భాగ్యురాలనగు నేనుమాత్రము నీయందువిశేషానురాగము గలదాననై నాశమును బొందుటకొఱకు చిరకాలముగ నీయందు కట్టఁబడిన హృదయముగలదాననగుచు వ్యర్థముగ నుపవాసములను తపములను జేయుచుండి తుదకుమహానింద్యమును బొంది యీప్రాణములను విడిచెదను. ఇట్టుపరమదుఃఖము నొందియున్న నేను, విషము భక్షించిగాని, లేక మిగులకరుకైన శస్త్రములచేతగాని, శీఘ్రముగ ప్రాణములు విడిచెదనని యోచించినను గూడ, యీరావణాసురుని గృహమునందు నాకు విషముగాని ఆయుధముగాని దెచ్చియిచ్చువారెవ్వరును లేరు అనియిట్లనేకవిధముల సీతాదేవి నోరెండునట్లు విలపించుచు తనమనస్సును శ్రీరామునియందు లీనముజేసి యనేకవిధముల నారాముని ధ్యానించుచు వడవడవడఁకుచు పూచియున్న శింశుపావృక్షముయొక్క సమీపమునకుబోయె.

అట్లాచెట్టుయొద్దకేతెంచి, సీతాదేవి మహావ్యసనముచేఁ దహింపఁబడినదై యనేకవిధముల చింతించుచు తనతలయందు బెనుచుకొనియున్న చంద్రుకలజడను దీసికొని గొంతుకుగట్టికొని "ఈజడతో నురివేసికొని ప్రాణములనువిడిచి" అతివేగముగ యమలోకమును జేరెదనని యోచించె. ఇట్లుయోచించి మిగులమెత్తని యవయవములుగల సీతాదేవి యాశింశుపావృక్షముయొక్క కొమ్మనుబట్టుకొనినిలిచి శ్రీరామునిలక్ష్మణుని మిగులపవిత్రమగు తనవంశమునుదలఁచుకొని యనేకవిధముల విలపించుచుండె. ఇట్లుదుఃఖించుచున్న యాసీతాదేవికి, వ్యసనములను బోగొట్టునవియును, మిగులధైర్యమును గలుగజేయునవియును, లోకప్రసిద్ధములైనవియును, ముందనేకమారులు సిద్ధించియుండునట్లు పరీక్షింపబడినవియునునగు శుభసూచకము లనేకములుగలిగె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యిరువైయెనిమిదవసర్గముగిసెను.

(*)

సీతాదేవి శుభసూచకములనుజూచి సంతోషించుట.

ఇట్లుశింశుపావృక్షము నాశ్రయించియున్నదియును, సంతోషంబనునది యెట్టిదోయనునట్లు మహావ్యసనముతోఁగూడి యున్నదియును, మిగులదైన్యమును బొందినదియును, మంగళస్వరూపిణియునునగు నాసీతాదేవిని "సంపద

గలమానవుని యతనివలన బ్రతుకువారెట్లు సేవింతురో యానందమునసే" అనేకమంగళ నిమిత్తములు సేవించినవి. (అనగా నాసీతాదేవికి ఆసమయమున అనేకశుభసూచకములు గాన్పించినవి) మిగులమంగళకరమైనదియును, విలువంకలైనకనరెప్పవెంట్రుకలచే నావరింపఁబడినదియును, నల్లగవిశాలములై తెల్లనిదియును, కొనలయందు దెల్లచారలు గలదియునునగు నాసీతాదేవియొక్క యెడమకన్ను మాత్రము చేపచేఁగదలింపఁబడిన తామరకమలమువలె చలించుచుండె మఱియుమహాసౌందర్యమైనదియును, శ్రేష్ఠమైనదియును, మిగులబలిసినదియును గుండ్రముగానున్నదియును, మిగులనుత్తమమైన నల్లనియగరుగంధపుఘ్రాతకు దగినదియును, పురుషశ్రేష్ఠుఁడును తనప్రియుఁడునునగు శ్రీరామునిచే బహుకాలముగ గౌగలింపఁబడినదియునునగు నాసీతాదేవియొక్క యెడమభుజము మిగులనదరెను

ఇదియునుగాక, ఒకటితోనొకటి కలిసియుండెడు రెండుతొడలలోపల మిగులబలిసినదియును, యేనుఁగుతొండముతో సమానమైనదియును, మిగులసౌందర్యమైనదియునగు నెడమతొడమిగుల నదురుచు రాముఁడీ సీతాదేవి యెదుటనున్నట్లు సూచించుచుండె ఇంకను, నిర్మలములైన నేత్రములుగలదియును, గుండ్రముగ శిఖరాకారములైయుండెడు కొనలుగలదంతములు గలదియును, నిలిచియున్నదియునునగు సీతాదేవియొక్క, మంగళకరమైనదియును, సువర్ణచ్ఛాయ గలదియును, దుమ్ముచేమలినమైయున్నదియునునగుచీరె, కొంచముజాఱినది కార్యసిద్ధినొందినవిగ నెన్నఁబడిన యీశుభసూచకములచేతను మఱియనేకములగు నితరనిమిత్తములచేతను, మిగులసుందరములగు కనుబొమలుగల యాసీతాదేవి రామునిరాక మిగుల సమీపమునున్నదని తెలిసికొనబడినదియై "గాలిచేతను యెండచేతను మిగులనాశినమొలకలు వానగురియుటచే మఱలప్రకాశమును బొందినట్లు" మహాసంతోషమును గొండె. మఱియు దొండపండువలె మిగులనెఱ్ఱనైన క్రిందిపెదవిగలదియును, మిగులసుందరములగు నేత్రములును కనుబొమలును గలదియును, మంచిముంగురులు గలదియును, వంకరలైనకనురెప్ప వెంట్రుకలుగలదియును, మిగులతెల్లనైనపండ్లు గలదియునునగు నాసీతాదేవిముఖము "రాహుగ్రహముచే విడువఁబడిన చంద్రబింబమువలె" ప్రకాశించుచుండె. అట్టియెడ మిగులపూజ్యురాలగు నాసీతాదేవి యతివేగముగ సమస్తవ్యసనములనుండివిడువబడినదియైనదియును, శాంతమునుబొందిన తాపముగలదియును, మిగులసంతోషముచే వికాసమునొందిన మనస్సుగలదియునునై శుక్లపక్షరాత్రియం దుదయించినచంద్రబింబమువలె ప్రకాశించుచుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యిరువైతొమ్మిదవసర్గ ముగిసెను.

— { ఆంజనేయుడు సీతాదేవితో మాటలాడుటకు ప్రయత్నించుట } —

శింశుపావృక్షముపై గూర్చుండియున్నవాడును, మహాపరాక్రమశాలియునునగు ఆంజనేయుఁడు, సీతాదేవియొక్క వృత్తాంతమును, త్రిజటయొక్క స్వప్నవృత్తాంతమును, రాక్షసస్త్రీలు బెదరించుచుండుటయును, రావణాసురుఁడు చేసిన చేష్టలను, ఇవిమొదలగు సమస్త విషయములను తెస్సగగ్రహించుచునేయుండె అంతవానరోత్తముఁడగు నాంజనేయుఁడు అశింశుపావృక్షముమీదనేగూర్చుండి, "నందనవనమునందుండెడి వనదేవతవలెనున్న" సీతాదేవినిజూచుచు ననేకవిధములనిట్లనిఆలోచించుచుండె.

పెక్కువేలవానరులు గుంపులుగుంపులుగ బైలుదేరి సమస్తదిక్కులకుపోయి యేస్త్రీనిగుఱించి వెదకుచున్నారో ఆసీతాదేవియిచ్చట నాచేచూడఁబడినదిగదా? నేను మిగులసామర్థ్యముచే చారుఁడనై యెవ్వరికిని దెలియకుండ నీలంకానగరము నందంతటను సంచరించుచు, శత్రువులగు నీరాక్షసుల సామర్థ్యమును గ్రహించి, సమస్తవిషయములను జూచితిని. ఇచ్చట రాక్షసులనుగుఱించి సకలవిశేషములను జూచితిని ఈలంకానగరముయొక్క నాలుగుప్రక్కలను తెస్సగజూచితిని. రాక్షసేశ్వరుఁడగు రావణాసురుని సామర్థ్యమునుగూడ చూచితిని ఇంకమితిలేని ప్రభావముగలవాఁడును, సమస్తజంతుజాలములయందును దయగలవాఁడునునగు తనపెనిమిటియగు శ్రీరాముని జూడ గోరుచుండెడు సీతాదేవినియూరడించుట న్యాయము. మఱియునిదివఱకు ఎన్నఁడును వ్యసనమును ఎఱుఁగనిదియును, మహావ్యసనముచే పీడింపఁబడుచు వ్యసనములయొక్క అంతమునుజూడకున్నదియును, పున్నమచంద్రునితో సరిపోలుముఖముగలదియునునగు సీతాదేవినికొంత యూరడించెదను. వ్యసనముచేత మిగుల పరితపించుచుండెడు నీసీతాదేవినియూరడించకయే, శ్రీరామునివద్దకు బోదునేని నాకుమహాదోషము సంభవించును నేనిప్పుడుఈసీతాదేవినియూరడించకయే మఱలిపోదునేని మిగులకీర్తిమంతురాలును రాచకొమార్తెయునునగు సీతాదేవితన్నుగాపాడువారెవ్వరును లేనివిధం

చి ప్రాణములను విడుచును. ఇదియునుగాక, మహాబాహువును, నిండుపున్నమచంద్రునితో సమానమగు మోముగలవాడును, సీతాదేవిని చూచుటయందు మహాసంతోషముగలవాడునునగు రామునకుగూడ సీతాదేవియొక్క కుశలవార్త జెప్పి యూరడించవలయును. కావున నీసీతను జూచి మాట్లాడి యూరడింపవలయు. ఈరాక్షసస్త్రీల యెదుట సీతాదేవితో సంభాషించుట యుచితముగాదు. ఈపనిని యెట్లు ప్రయత్నించిన సఫలమగును నాకేమియును దోచలేదే! నేనిప్పుడు మిగుల సంకటములో జిక్కుకొంటిని. ఇదియునుగాక యీరాత్రి తెల్లవారుటకుమునుపే నేను యీసీతాదేవిని యూరడింపకుందునేని ఈసీతాదేవి నిశ్చయముగ ప్రాణములను విడుచును.

ఇందుకు సంశయము లేదు. మఱియు నేనిప్పుడు సుందరమగు నడుముగల సీతాదేవితో మాటలాడకయే, శ్రీరాముని వద్దకుబోదునేని "సీత నన్నుగూర్చి యేమి చెప్పినది" అని యడిగనేని అరామునకు నేనేమి బదులుచెప్పుదును? నేనిచ్చట నుండి మహావేగముగ కకుత్స్థవంశజుడగు నారాముని యొద్దకుబోగానే, యతడడిగినప్పుడు సీతతో నేను మాటలాడలేదని చెప్పితినేని నామీదకోపించి నన్ను మిగుల చురుకుచూపులచే దహించును. నేనిచ్చట సీతతో సంభాషింపకనేపోయి శ్రీరామునినిమిత్తమై వానరరాజైన సుగ్రీవుని ప్రేరేపించితినేని నతండు వానరసేనను గూర్చుకొని యిచ్చటికి వచ్చునంతలో నీసీతాదేవి ప్రాణములను విడుచును. కావున నదియును వ్యర్థమేయగును. కాబట్టి నేనిచ్చటనే యుండి, ఈరాక్షసస్త్రీలుకొంత యేమరియుండునప్పుడు మిగుల వ్యసనమును బొందియుండెడు ఈసీతాదేవిని మెల్లగ తిన్నని మాటలతో నూరడించెదను. నేనిపుడు మిగుల నల్పరూపమును దాల్చియున్నాను. అదియునుగాక వానరరూపమును దాల్చియున్నాను. మనుష్యులు మాటలాడునట్లు సంస్కృతమున సంభాషించెదను. అట్లు మాటలాడితినేని రాక్షసస్త్రీలు నన్ను కనుగొనజాలరు. మఱియు నేను బ్రాహ్మణునివలె సంస్కృతమునందు మాటలాడుదునేని, "కోతి సంస్కృతమున నెట్లు మాటలాడనేర్చెను? రావణుడు నన్ను వంచించుటకిట్లు వానరరూపమును దాల్చి వచ్చెను" అని సీతాదేవి మిగుల భయమును బొందును. కావున నర్థయుక్తములగు మానవభాషతోనే మాటలాడెదను. వేఱురీతిగ నీసీతాదేవిని యూరడించుటకు నాకు సాధ్యముగాదు. నేను వానరరూపమున మానవభాషతో మాటలాడినను, ఇదివరలో ఈసీతాదేవి రాక్షసులచే కపటవేషమువలన భయపరుపబడియున్నది. కావున నన్ను జూచియింక విశేషముగ భయపడును. అట్లు భీతినొంది, విశాలములగు నేత్రములుగలదియును, మంచిహృదయముగలదియును, మిగుల పతివ్రతయునునగు సీతాదేవి, రాక్షసేశ్వరుడగు రావణాసురుడు కామరూపియని యెఱిగియున్నదికావున, మహాభయముచే గట్టిగా శబ్దముగలుగనట్లు అఱచినను అఱచును. అట్లు సీతాదేవి గట్టిగా నఱవగానే రాక్షసస్త్రీలందఱును నానావిధములగు నాయుధములను ధరించి మహాభయంకరముగ మృత్యువువలె నతివేగముతో నాపైకివత్తురు. అంత వికృతిస్వరూపులగు నీరాక్షసస్త్రీలందరును నన్నుచుట్టుకొని, చంపుటకుగాని లేకపట్టుకొనిపోవుటకుగాని వారివల్లనైనయట్టుల ప్రయత్నమును జేయుదురు. వారలట్లు ప్రయత్నము చేయగానే, నేను పెద్దకొమ్మలను చిన్నచిన్నకొమ్మలను వృక్షములను, చెట్లమొదళ్లను దీసికొని నలుదిక్కులకును పరువులిడుదును. అట్లు పరువులిడుచున్న నన్నుజూచి వారుమిగుల భయమును బొందుదురు. అట్లు రాక్షసస్త్రీలు మిగుల భయముబొంది రాక్షసేశ్వరుడగు రావణాసురుని గృహమునందు వానిచే నియోగింపబడియుండు రాక్షసులను బిలుచుటకతివేగముతో వెళ్లుదురు. అట్లు పిలువబోయి వారిని పిలువగానే యారాక్షసులు శూలాయుధములను శస్త్రాయుధములను కత్తులును మొదలగు నానావిధాయుధములను ధరించి మిగుల భయంకరాకారులై యతివేగముగ యుద్ధసన్నద్ధులై వత్తురు. అట్లు యుద్ధసన్నద్ధులై వచ్చిన రాక్షసులందఱును, నన్నాక్రమించి యుద్ధగింతురు. అప్పుడు నేను ఆరాక్షససైన్యముల నన్నిటిని సంహరించుదు. సముద్రముయొక్క యవ్వలిదరిజేరుట కెంతమాత్రమును శక్తిమంతుడనుగాను. అట్లు నేను సముద్రమును దాటుటకు యత్నింతునేని, మహాశీఘ్రముగ పఱచెయునట్టి రాక్షసులనేకమంది మీదికెగిరి నన్ను బట్టుకొందురు. అట్లు వారు నన్ను బట్టుకొనగానే యీసీతాదేవికి శ్రీరాముని వృత్తాంతము తెలియకనేపోవును. నేను వారిచేతిలో జిక్కగానే, చంపుటయందు మిగుల ఆశగల రాక్షసులు నన్నును సీతాదేవిని సంహరింతురు. అట్లు వారు సీతను జంపుదురేని రామసుగ్రీవులు యత్నించియుండెడు మహాగొప్పకార్యము నాశనమగును. అదియునుగాక జనకమహారాజకూతురగు నీసీతాదేవి, అన్యులకెవ్వరికిని దెలియని మార్గముగలదియును, రాక్షసులచే నాక్రమింపబడినదియును, సముద్రముచే నావరింపబడినదియును, మిగుల రహస్యస్థలమైనదియునునగు నీలంకానగరమునందున్నది. కావున నేనిప్పుడు యుద్ధమునందు రాక్షసులచే జంపబడినను, పట్టంబడినను మఱల శ్రీరాముని కార్యమును సాధించునట్టి సమర్థుడు ఒక్కడైనను లేడు. నేను రాక్షసులచే యుద్ధ

మనచంపఁబడుదునేని, నూరుయోజనముల వెడలుపుగల యీమహాసముద్రమును దాటునట్టి శూరుఁడు వానరులలో నొకఁడైన నెంతయాలోచించినను నాకగుపడలేదు. అయిననే నెన్నివేలమంది రాక్షసులైనను యుద్ధమున నొక్కపెట్టు నఱుకఁగలను. ఆవిషయమున నేను మహాశక్తిమంతుఁడను. సందేహములేదు. ఐనను యుద్ధమునందు అలసిన వెనుక నీమహాసముద్రమును దాటి యవ్వలిగట్టు చేరుట కెంతమాత్రమును శక్తిగలవాఁడను కాను. ఇవియును గాక. శ్లో॥ అసత్యానిచయుద్ధాని సంశయో మేనరోచతే। కశ్చనిస్సంశయం కార్యం కుర్యాత్ప్రాజ్ఞస్ససంశయమ్॥ యుద్ధములందు మనకే జయముగలుగునని నిశ్చయములేదు. సందేహముగనుండెడు కార్యమును జేయుటకు నాకెంతమాత్రమును యిష్టములేదు. లోకములో ప్రజ్ఞావంతుఁడగు వాఁడెవ్వఁడు గాని సంశయముగనుండెడు కార్యమును నిస్సంశయముగ జేయఁడు. కార్యముల యొక్క సందర్భములిట్లుండుటచే సీతాదేవిని జూడకవేఁపోదునేని సీతాదేవి నిశ్చయముగ ప్రాణములను విడుచును. అట్లుగాదేని, సీతాదేవితో సంభాషించినను, ఇప్పుడు చెప్పినట్లు నాకు మహాదోషము సంభవించును శ్లో॥ భూతాశ్చార్థావినశ్యంతి దేశకాల విరోధితాః। విక్లబంగూతమాసాద్య తమస్సూర్యోదయే యథా॥ సర్వసిద్ధములైన కార్యములయందునుగూడ, అవివేకియైన దూతని యోగింపఁబడునేని, ఆకార్యములు దేశకాలవిరోధములను బొందినవియై "సూర్యోదయముకాగానే గాఢాంధకారమగు చీకట్లు నశించునట్లు" నిరర్థకములై చెడిపోవును ఇదియును గాక, శ్లో॥ అర్థానర్థాంతరే బుద్ధిర్నిశ్చితాపి నశోభతే। ఘాతయంతిహి కార్యాణి దూతాః పండితమానినః॥ కార్యాకార్యములను లెస్సగా నాలోచించి "యిట్లు చేయవలయునని" తీర్మానింపబడి నిశ్చయింపఁబడిన కార్యమైనను అట్టికార్యములయందు సమస్తవిషయములు లెస్సగా దెలిసినవారమని గర్వించియుండెడు, అవివేకులగు దూతలు నియోగింపఁబడుదురేని యాకార్యములను నాశముచేయుదురు కావున నీగొప్పకార్యము చెడకుండునట్లును, నాకు వెను పేరు రాకుండునట్లును, నేను సముద్రమును దాటి యీలంకానగరమున బ్రవేశించిన మహాప్రయత్నము వ్యర్థముగాకుండునట్లును, లెస్సగయోచించి కార్యమును జేయవలయును. నేను జెప్పెడిమాటలను సీతాదేవి భయపడకవినునట్లు మాటలాడవలయును. అనియిట్లు ఆంజనేయుఁడు, అనేకప్రకారములుగ యోచించి చిట్టచివరకు చేయవలసినవిధమిట్టిదని నిశ్చయించెను. అన్యులకువ్యసనములుగలుగునట్టి కార్యములు జేయనివాఁడును, సీతాదేవికి ప్రియబంధువుఁడును నగు శ్రీరామునికీర్తించెదను. ఈసీతాదేవిమనస్సు ఆరామునియందు లీనమై యున్నది. కావున నేనిట్లు చేయుటచే నీసీతకెంతమాత్రమును భయముగలుగదు. మఱియు నేను, ఇక్ష్వాకువంశమున బుట్టినవారలలో నెల్ల మిగుల యధికుఁడును, పరమాత్మవేత్తయును నగు శ్రీరాముఁడు సీతాదేవికి జెప్పుమనిన మంగళకరములైన ధర్మయుక్తములగు మాటలనుమిగుల మనోహరముగ వినిపించెదను. అనియిట్లు చక్కగనాలోచించి యెట్లుమాట్లాడిన సీతాదేవి భీతినొందకవినునో యట్లు సంభాషించుటకాంజనేయుఁడు నిశ్చయించె. ఇట్లు నిశ్చయించి మహానుభావుఁడగు నయ్యాంజనేయుఁడు చెట్టుకొమ్మపై యాకులవలన తెలియకుండ గూర్చుండియుండి, జగత్కర్తయగు శ్రీరాముని భార్యయైన సీతాదేవినిజూచుచు మిగులనమోఘములై నమధురంబులగు మాటలతో ననేకవిధములగ నిట్లని జెప్పటకారంభించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదియవసర్గ ముగిసెను.

ఆంజనేయుఁడు శ్రీరామునివృత్తాంతమును జెప్పుట

వానరోత్తముఁడగు ఆంజనేయుఁడట్లనేకవిధముల ఆలోచించి సీతాదేవికివినుటకు మిగులమనోజ్ఞముగనుండునట్లు యిట్లని జెప్పె రథములు, ఏనుఁగులు, గుఱ్ఱములుగలవాఁడును, పుణ్యకార్యములను జేయుటయే స్వభావముగాగలవాఁడును, మహాకీర్తిమంతుఁడును, నిష్కపటుఁడును, పరాక్రమమున ప్రసిద్ధినొందినవాఁడును, నగు దశరథుఁడను ప్రసిద్ధుఁడైన నొకరాజుండెను. ఆదశరథమహారాజు రాజర్షులలో మిగులనధికుఁడు. తపస్సునమహర్షులతో సమానుఁడు. చక్రవర్తులగు రాజవంశమునఁదు జన్మించినవాఁడు. బలమునందు దేవేంద్రునితో సమానుఁడు. ప్రాణిసమూహములను హింసింపకుండుటయందిచ్ఛగలవాఁడు. మహాసాత్వికుఁడు. మహాపరాక్రమముగలవాఁడు ఇక్ష్వాకువంశోద్భవులలో నెల్లనధికుఁడు. మహాసంపదగలవాఁడు తన్నాశ్రయించినవారిసంపదలను వృద్ధినిబొందించువాఁడునుగానుండె మఱియునాదశరథమహారాజు, గాజకీయములగు సాముద్రికలక్షణములతో గూడినవాఁడు. మిగులకాంతిచేఁ బ్రకాశించువాఁడు. రాజశ్రేష్ఠుఁడు నాలుగుసముద్రములచేఁజుట్టబడిన భూమియందంతటను ప్రసిద్ధినొందినవాఁడు. సకలప్రజలకును సుఖమునుగలుగజేయువాఁడునుగానుండె అట్టిదశరథమహారాజునకు, చంద్రబింబముతో సరిబోలుముఖముగలవాఁడును, సమస్తవిషయము

లను దెలిసినవాఁడును, సమస్తవిలుకాండ్రలో మేటియైనవాఁడును, శ్యావర్ణపుత్రుఁడును, శ్రీరాముఁడనుపేరుచేఁ బ్రసిద్ధిఁ బొందినవాఁడునగు నొకపుత్రుఁడుగలఁడు. ఆరాముఁడు తనక్షత్రియధర్మములను లెస్సగాఁ గాపాడువాఁడును, తనబంధుజనములను జక్కఁగ రక్షించువాఁడునగను, సమస్తప్రాణిసమూహములను రక్షించువాఁడునగను, వర్ణాశ్రమధర్మములను జక్కఁగాఁ బాడువాఁడునగను, శత్రుజనములను తపింపఁజేయువాఁడునగనునుండె. అట్టిమహాపరాక్రమశాలియగు నారాముఁడు, సత్యసంధుఁడును, వృద్ధుఁడునతండ్రియును, నగు దశరథమహారాజుయొక్క వాక్యమును పరిపాలించుటకు భార్యతోడను తమ్మునితోడనుఁ గూడినవాఁడై దండకారణ్యమును బ్రవేశించె. ఆమహారణ్యమునందు ఆరాముఁడు మృగయావినోదంబునం దిరుగుచు, మహాశూరులును, కామరూపులునునగు ననేకరాక్షసులను సంహరించె. అట్లు చంపుచున్న యారామునిచే జనస్థానమునందుండిన అనేకరాక్షసులును, ఖరుఁడును దూషణుఁడును గూడఁ జంపఁబడిరనివిని, రావణాసురుఁడు మిగులకోపోద్దీపితుఁడై తనమాయచే మాయామృగమైన బంగారులేడినిగనుపరచి యారామునివంచించి యతనిభార్యయగు సీతాదేవినిఅపహరించె. అంతనారాముఁడు మహాపతివ్రతయగు తనభార్యనువెదకుచు సుగ్రీవుఁడను వానరునితో స్నేహముజేసెను. శత్రుపురములనుజయించువాఁడును, మిగులబలముగలవాఁడును, నగు నారాముఁడు అట్లు సుగ్రీవునితో స్నేహముజేసి యతనిఅన్నయగువాలిని సంహరించి వానరరాజ్యమును సుగ్రీవునకిచ్చె. అంత కామరూపులగు వానరులు ఆసుగ్రీవునిచే నాజ్ఞాపింపఁబడినవారై గుంపులుగుంపులుగ బైలువెడలి దశదిశలయందును సీతాదేవిని వెదకుచున్నారు. నేను సంపాతి జెప్పినమాటలచే నాసీతాదేవి నిమిత్తముగ నూరుయోజనముల వెడల్పుగల యీసముద్రమును దాటితిని. రాముఁడు నాతో, సీతనుగురించి యెట్టిరూపముగలదిగను, ఎటువంటి కాంతిగలదిగను, చెప్పెనో, అట్టిగురుతులుగలసీతాదేవిని యిచ్చటఁ జూచితిని. అనియిట్లు వానరోత్తముఁడగు ఆంజనేయుఁడంతవరకుజెప్పి యంతటయూరకుండె. అంత సీతాదేవియును ఆమాటలనువిని యత్యాశ్చర్యమునొందె. అట్లాశ్చర్యమును బొంది, వంకరలైనాల్యములైనముంగురులుగలదియును, సుందరములగు తలవెంట్రుకలుగలదియును, భయమును బొందెడు స్వభావముగలదియునునగు నాసీతాదేవి కొంతభయమును బొందినదై యురివేసికొనుటకొఱకు వెండ్రుకలజడచే చుట్టఁబడియుండు గొంతుతో ముఖమునుపైకెత్తి యశింశుపావృక్షమునుజూచె. అట్లుచూచి సీతాదేవి యావానరునిమాటలనువిని దశదిశలనుచక్కఁగాఁజూచి తనపూర్ణహృదయముతో శ్రీరామునిధ్యానించి మహాసంతోషమును బొంది దశదిశలనుజూచి యంతనాశింశుపావృక్షముయొక్క మీఁదుగను క్రిందుగను, లెస్సగ వెదకి, మహాబుద్ధిగలవాఁడును, వానరరాజైన సుగ్రీవునియొక్క మంత్రియును అప్పుడుదయించిన సూర్యునితో సమానమగు కాంతిగలవాఁడును వాయుపుత్రుఁడునునగుఆంజనేయుని సీతాదేవిజూచె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదియొకటవ సర్గముగిసెను.

(*)

సీతాదేవిఆంజనేయునిజూచి కోఁతినిజూచినందునతనకుఅశుభములుగలుగునేమోయని చింతించుట

అంత, కొమ్మలసందున దాగియున్నవాఁడును, తెల్లనివస్త్రమును ధరించియున్నవాఁడును, మెఱుపుతీగెలయొక్క సమూహమువంటి పింగళవర్ణముగలవాఁడును నగుయాంజనేయునిజూచి, సీతాదేవిభయమును బొందె. అట్లుసీత మిగులభీతినొంది యాచెట్టుప్రక్కఁ జూచుచునే చెట్టుకొమ్మమీఁద గూర్చున్నవాఁడును, మహావినయముతో నున్నవాఁడును, మిగుల సంతోషముగలిగించుమాటలను జెప్పుచున్నవాఁడును, పూచియుండెడు అశోకపుష్పముల సమూహపుకాంతివంటి కాంతిగలవాఁడును, పుటముదీరిన బంగారువర్ణమువంటి నేత్రములుగలవాఁడును, వానరుఁడునునగు నాయాంజనేయునిజూచె. అట్లుఆంజనేయునిఁ జూచి పరమాశ్చర్యమును బొందినదియై సీతాదేవి తనలో తానిట్లనియాలోచించె. అయ్యయో! నాకీవానరరూపము గుపడినది. ఇదిమిగులభయంకరమైనది. ఇదిమహావ్యసనము గలుగుటకు సూచకమైనది. కావునదీనిజూడఁగూడదు దీనినిజూచువారికి మహాదుఃఖము సంభవించును. అయ్యో! నేనేమిజేయుదును. అనియిట్లనేకవిధముల చింతించి సీతాదేవి మూర్ఛను బొందె. అట్లుమూర్ఛనొంది కొంతదడవునకు మఱలమూర్ఛదేరి మహాభయముగలదియై మిగులదుఃఖించుచు, హా! రామా! హా! లక్ష్మణా! అనియిట్లనేకవిధముల, చూచువారికి కనికరముగలుగునట్లు పలువిధములుగ చింతించె. ఇట్లురోదనముజేయుచున్న సీతాదేవి తనకంఠస్వనమును రాక్షసులువిందురని భీతినిబొంది, వ్యసనమును సహింపఁజాలక మెల్లగా ననేకవిధముల విలపించుచుండె. ఇట్లుచింతించుచున్నసీతాదేవి, మిగులవినయముతో తనముందర సమీపముననున్నవాఁడును వానరశ్రేష్ఠుఁడును నగుయాంజనేయుని జూచి, యిట్లనిచింతించె. ఇదికలయో? లేకున్న నీప్రదేశ

మునందు యిట్టివార్తలను జెప్పువారెవ్వరు. అనియిట్లుచింతించి మఱలనాచెట్టుప్రక్కనుజూచి, గొప్పదియును, మిగులవంకరైనదియును, నగుముఖముగలవాఁడును, వానరులకురాజగు సుగ్రీవుని యాజ్ఞాప్రకారము నడుచువాఁడును, వానరేశ్వరుఁడగు సుగ్రీవునియొక్కమంత్రియును, బుద్ధిమంతులలో నెల్ల శ్రేష్ఠుఁడును, వాయుపుత్రుఁడును నగు హాంజనేయునిఁజూచె అట్లుసీతాదేవి ఆంజనేయునిఁజూచి "ప్రాణములు వదిలిపెట్టినదానివలె" తెలివితప్పిమూర్ఛనుబొందె. విశాలములగునేత్రములుగల యాసీతాదేవి కొంతదడవునకుమూర్ఛదేరి తెలివిఁబొందినదై యిట్లుచింతించె. నేనిప్పుడుకలగంటిని వికృతాకారముగల వానరరూపమునుఁజూచితిని. స్వప్నమునందు కోతినిఁజూడఁగూడదని శాస్త్రములుబలుకుచున్నవి. కావునమనవారలకేమికీడుసంభవించునోగదా? రామునకును లక్ష్మణునకును నాతండ్రియగు జనకమహారాజునకును మంగళమగుఁగాక, అయ్యయో! ఇది కలయునుగూడగాదు. నిదురబోయినంగదా కలవచ్చును. రామునివియోగముచే మిగులదుఃఖించుచున్నదానను, భయంకరులగు రాక్షసస్త్రీలనడుమజిక్కికొని మిగులపరితపించుచున్నదానను, నగునాకునిద్దురయెక్కడిది? అదియునుగాక సుఖముగనున్నవారికిగద నిదురవచ్చును పున్నమచంద్రునితో సరిపోలుముఖముగల శ్రీరామునివిడబాసియుండెడు నాకు సుఖమెక్కడిది? సౌఖ్యముగూడ లేదుగదా? అట్లుగాదేని నేననవరతమును, రామా! రామా! యనిమనోవాక్కులయందుస్మరించుచు చెప్పుచునేయున్నాను. కావున దానికిదగినట్టుగ నీరామకథనమునువినుచున్నాను. మఱియు నేను రామునివిడబాసినదిమొదలు మన్మథవికారముచే మిగులబీడింపఁబడినదాననై నిరంతరము రామునేధ్యానించుచు, ఆ రామునియందు లీనమైనహృదయముగలదాననై యున్నాను. కావుననాకంటికి ఇట్లొకరువచ్చి నాయెదుటనిలిచి రామునిచరిత్రము జెప్పుచున్నట్లుతోచుచున్నది. అట్లెవినుచున్నాను. అదియునుగాక, నామనోరథము ఈరీతిగఁదోచుచున్నదిగాని వేరేయొకరుచెప్పుటకాదనితలతునేని, మనోరథమునకు రూపమెక్కడిది? నాయెదుట ఒకవానరాకారము స్పష్టముగ గనఁబడుచున్నది. ఈరామకథను ఆవానరుఁడే చెప్పుచున్నాఁడుగాని ఇదికలవరింతమాత్రమును గాదు అనియిట్లనేకప్రకారముల చింతించి యంతసీతాదేవి యిట్లనియె. దేవేంద్రునకును బృహస్పతికిని, బ్రహ్మదేవునకును, అగ్నిదేవునకును నమస్కారమును గావించెద నాయెదుటనుండెడు ఈవానరుఁడు చెప్పినవిషయమంతయును యథార్థమేయగుఁగాక. వేఱువిధముగ గాకుండుఁగాక యనిప్రార్థించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదిరెండవసర్గముగిసెను.

ఆంజనేయుఁడు సీతాదేవినిజూచి నీవెవరని యడుగుట

అంతపవడముతో సమానమైనకాంతిగల ముఖముగలవాఁడును, మిగులప్రకాశించెడు దేహచ్ఛాయగలవాఁడును, వాయుపుత్రుఁడును నగునాంజనేయుఁడు, శింశుపావృక్షముమీదనుండిక్రిందికిదిగి, మహాదైన్యమునుబొంది వినయముతోనమస్కరించి సమీపమునకువచ్చి యంజలిబద్ధుఁడైనిలిచె. అట్లుసీతాదేవియెదుట అంజలిబద్ధుఁడైనిలిచి సీతాదేవినిజూచి మిగులమనోహరములగు మాటలతోనిట్లనియె.

ఓతల్లీ! తామరరేకులవంటి నేత్రములుగలదానవును, మాసినపట్టువస్త్రమును ధరించియున్నదానవును, నిందింపఁబడని నడవడికగలదానవును, నగునీవీచెట్టుకొమ్మను బట్టుకొనినిలిచియున్నావు నీవెవ్వతెవు? మఱియు "గాలిచేమీదికెగరఁగొట్టఁబడిననీళ్లు తెల్లతామరపువ్వులపైబడి యందుండి క్రిందికిజారుచున్నట్లు" తామరరేకులవంటి నీనేత్రములనుండి యశ్రుజలంబులొలుకుచున్నవి అదియేల? మంగళస్వరూపురాలవగు నోతల్లీ! నీవుదేవకన్యకవా? అసురకన్యకవా? నాగకన్యకవా? గంధర్వకన్యకవా? యక్షకన్యకవా? లేకరాక్షసకన్యకవా? చెప్పుము అదియునుగాదేని కిన్నరకన్యకవా! వీరిలోనీవు ఎవ్వతెవో చెప్పుము. ఓసుందరమగు ముఖముగలదానా! నీవురుద్రగణములలో చేరినదానవా? వాయుగణములలో చేరినదానవా? లేకవసుగణముతో చేరినదానవా? నీవెవతెవో చెప్పుము. సుందరములగు పిరుదులుగలయోదేవీ! నీవుదేవతాకన్యవని నాబుద్ధికితోచుచున్నది ఓతల్లీ! నీవుచంద్రునివిడనాడి స్వర్గమునుండిజారి క్రిందబడినదియును, నక్షత్రములలోనెల్ల నుత్తమనక్షత్రమును మిగులశ్రేష్ఠములగు గుణములతోఁగూడినదియును నగురోహిణీదేవివా? ఏమి? మంగళస్వరూపురాలవగునోదేవీ! నీవెవరు? మంచిసాముద్రికశాస్త్రలక్షణయుక్తములగు నేత్రములుగలయోతల్లీ! నీవెవతెవు? నల్లనినేత్రములుగల యోమంగళస్వరూపురాలా! నీవుకోపముచేతగాని అజ్ఞానముచేతగాని పెనిమిటియగు వసిష్ఠమహర్షిపైకోపమునుజెంది భూమికేతెంచినయరుంధతివా? ఏమి? మహాసుందరమగునడుముగల యోతల్లీ! నీపుత్రుఁడెవఁడు? నీతండ్రియెవఁడు? నీసహోదరుఁడెవఁడు? నీపెనిమిటియెవఁడు? ఈలోకమునుండి పరలోకమునకుబోయినసీవా

రినియెవరినైన దలఁచుకొని చింతించెదవా యేమి? నీవు ఏడ్చుచుండు విధమును బట్టియు, విశేషముగ నిట్టూర్పులను విడుచుటను బట్టియు, భూమిని తడవుటను బట్టియు, నీకుఁగలిగియుండెడు రాజచిహ్నములను బట్టియు నీవు దేవతాస్త్రీవి గాదనియు, రాజస్త్రీవిగ నుండవలెనని యూహించెదను. మఱియు నీదేహమునందలి యవయవసౌష్ఠవమును, సాముద్రికలక్షణములను జూచి నీవొక రాజశ్రేష్ఠునియొక్క పట్టపుదేవివగు రాజకొమార్తెవని తలఁచుచున్నాను. ఓదేవీ! నీవు జనస్థానమునుండి బలాత్కారముగ రావణాసురునిచే దీసికొనిపోఁబడిన సీతాదేవివా? యేమి? అట్లు నీవు సీతాదేవి వగుదువేమో యని నిన్ను అడుగుచున్నాను. చెప్పుము. నీకు శుభమగుఁగాక! ఓతల్లీ! నీయొక్క వ్యసనమును, అనన్యసాధారణమగు నీమానవరూపును, నీతాపసవేషమును జూచి నీవు శ్రీరామునిభార్యవే యని తలఁచెదను అని యిట్లు ఆంజనేయుఁడు చెప్పఁగవిని, సీతాదేవి, శ్రీరామునిచరిత్రమును వినుటచే మిగులసంతోషమును బొందినదియై, ఆశింశుపావృక్షము క్రిందనున్న ఆంజనేయునిఁ జూచి యిట్లనియె.

ఓవానరుఁడా! నేను, భూమిలోనుండెడు సమస్తరాజశ్రేష్ఠులలో నుత్తముఁడును, పరమాత్మవేత్తయును, శత్రుసైన్యములను తపింపఁజేయువాఁడును నగు దశరథమహారాజుయొక్క కోడలను. మఱియు విదేహదేశాధీశుడును మహాపరాక్రమశాలియును, నగు జనకమహారాజుయొక్క కుమార్తెను. నాపేరు సీతయని చెప్పుదురు. నేను, మహాబుద్ధిమంతుఁడగు శ్రీరామునిభార్యను ఓవానరోత్తమా! నావివాహమైన తరువాత దశరథమహారాజుయొక్క యింటియందు నాభర్తయగు శ్రీరామునితోఁగూడ మనుష్యసంబంధమగు సమస్తభోగములను అనుభవించుచు సమస్తకోరికలను సమృద్ధిగ ననుభవించుచుంటిని. అంతపద మూఁడవ సంవత్సరము రాఁగానే దశరథమహారాజు తన యుపాధ్యాయుఁడగు వసిష్ఠుని ముందిడికొని, ఇక్ష్వాకువంశమున బుట్టినవారలను సంతసింపఁజేయునట్టి శ్రీరామునికి పట్టాభిషేకమును జేయుటకు ఉపక్రమించె. అంత శ్రీరామునియొక్క పట్టాభిషేకమహోత్సవమునకు తగుసంభారములను సేకరించుచుండగ దశరథమహారాజు భార్యలలో కైకేయియనునది తనపెనిమిటని జూచి యిట్లనియె.

ఓదశరథమహారాజా! నీవు రామునకు పట్టాభిషేకము సేయుదువేని నేను అన్నమును భుజింపను. నీరు త్రాగను. ఈపట్టాభిషేకమే నాజీవితకాలమునకంత్యము. నేను ప్రాణములను విడుతును. రాజశ్రేష్ఠుఁడవగు నోదశరథుఁడా! నీవు మున్ను మహాసంతోషముతోఁ జెప్పినమాట వ్యర్థముగాకుండుటకు ఇచ్చియుంపుదువేని, రాముని అరణ్యమునకు బంపుము. అని కైకేయి దశరథునితోఁ జెప్పె. సత్యవాదియగు నాదశరథమహారాజు, తనభార్యయగు కైకేయి చెప్పిన కఠినములును, అప్రియములును, నగు వచనములను విని, తానుమున్ను ఇచ్చియుండిన వరములను దలఁచుకొని మూర్ఛను బొందె. అట్లు మూర్ఛనుబొంది కొంతదడవునకు మూర్ఛదేరి మిగుల సత్యసంధుఁడును ధర్మమునందే బుద్ధిగలవాఁడునునగు నాదశరథమహారాజు మహావ్యసనముతో నేడ్చుచు, కీర్తిమంతుఁడును తనపెద్దపుత్రుఁడునునగు రాముని జూచి, తానివ్వఁదలచుకొనిన రాజ్యమును మఱల తనకిమ్మనియడిగె. అట్లడుగగానే శ్రీమంతుఁడగు రాముఁడు పట్టాభిషేకమునకన్న మిగులనధికమగు తండ్రిమాటను మనఃపూర్వకముగ నంగీకరించె.

శ్లో॥ దద్యాన్న ప్రతిగృహ్ణీయాన్న బ్రూయాత్కించిదప్రియమ్। అపిజీవితహేతోర్వా రామస్సత్యపరాక్రమః॥ రాముఁడు వ్యర్థముగాని పరాక్రమముగలవాఁడు. ఎవ్వరేదిగోరినను దానినిచ్చువాఁడు. ప్రాణసంకటమునందైనను ఒకరివద్దనొకవస్తువును దీసికొనఁడు. ఇతరులకప్రియములగు మాటల నెంతమాత్రమును జెప్పఁడు. అట్లు మహాకీర్తిమంతుడగు రాముఁడు, మిగులశ్రేష్ఠములైన వస్త్రములను విడిచి నారచీరెలను గట్టికొని, మనస్సులోఁగూడ రాజ్యముయొక్క తలంపులేనివాఁడై నన్ను తనతల్లియగు కౌసల్యకు ఒప్పగించె. అంత నేను వనములో సంచరించుటయందు మిగులనాశగలదాననై యతివేగముగ నారామునికన్న ముందు బైలువెడలితిని. ఏలననగా నారాముని విడిచి స్వర్గమునందైనను ఉండుటకు నాకిష్టపడదు. ఇదియిట్లుండగ నంతకుపూర్వమే, మిగుల పూజ్యమైన స్వభావము గలవాఁడును, స్నేహితులను సంతసింపజేయువాఁడును, సుమిత్రకుమారుఁడును నగు లక్ష్మణుఁడు, తనయన్నయగు శ్రీరామునివెంబడించి యరణ్యమునకు బోవుటకు, నారచీరెలను ధరించె. అట్లు మేము ముగ్గురమును నారచీరెలను ధరించి ప్రభువగు దశరథమహారాజుయొక్క ఆజ్ఞను గౌరవించుటకు దృఢవ్రతులమైమును పెన్నఁడును గుర్తెఱుఁగని మిగుల గంభీరమగు నరణ్యమును బ్రవేశించితిమి. అట్లువనమునందు బ్రవేశించినవాఁడును మిగుల పరాక్రమముగలవాఁడునునగు నారామునిభార్యనైన నన్ను దురాత్ముఁడును రాక్షసేశ్వరుఁడును నగు రావణాసురుఁడు కపటముచే నపహరించితెచ్చె. ఆరావణాసురుఁడు నాకుయింక రెండుమాసములు గడువుపెట్టియున్నాఁడు ఆరెండుమాసములు గడవగానే యంతమీఁదట నేనెంతమాత్రమును బ్రతికియుండను. ప్రాణములు విడిచెదను. అని

యిట్లు చెప్పి యూరకుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి ముప్పదిమూడవ సర్గ ముగిసెను.

— { ఆంజనేయుడు తనవృత్తాంతమును సీతాదేవితో జెప్పుట. } —

అంతవానరోత్తముడగు నాంజనేయుడు, వ్యసనసముద్రమునందు మునిగియున్న సీతాదేవియొక్క మాటలనువిని తానును మిగుల వ్యసనమును బొందినవాడగుచు సీతాదేవిని నూరడించుటకై మిగుల నెమ్మదిమాటలతో నిట్లనియె

ఓసీతాదేవీ! నేను శ్రీరామునియాజ్ఞ చొప్పున దూతనై యిచ్చటికి నిన్ను వెతుకుటకు వచ్చితిని విదేహదేశమునందు జన్మించిన యోసీతాదేవీ! రాముడు కుశలముగనున్నాడు. తనక్షేమమును నీతో జెప్పుమని చెప్పెను ఓతల్లీ! సీతాదేవీ! బ్రహ్మాస్త్రమును చక్కగ సంధింప దెలిసినవాడును, వేదములనెఱిగిన వారలలో నధికుడును, వేదాంతవేత్తయును, దశరథమహారాజ పుత్రుడును, నగు శ్రీరాముడు నీక్షేమము నడుగుచున్నాడు ఓసీతాదేవీ! నీపెనిమిటియగు శ్రీరామునకత్యంతప్రియుడును, ఆరాముని వెంబడించి వచ్చినవాడును, మిగులగొప్పపరాక్రమము గలవాడునునగు లక్ష్మణుడును, వ్యసనసముద్రమున మునిగి నీకొఱకు శిరస్సాష్టాంగనమస్కారమును జేసె ననియె. అనియిట్లు ఆంజనేయుడు చెప్పగనే సీతాదేవి పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణులయొక్క క్షేమవార్తనువిని మహాసంతసముచే గగుర్పాటు నొందిన సమస్తావయవములు గలదియగుచు నాంజనేయునితో నిట్లనియె.

శ్లో॥ కల్యాణీబత గాథేయం లౌకికీ ప్రతిభాతిమా । ఏ జీవంత మానందో నరం వర్షశతాదపి॥ మానవుడు బ్రతికియుండెనేని నూఱేండ్లకైనను సంతోషమును బొందగలడని చెప్పెడు లోకవార్తనావిషయమునందు యథార్థముగ జరుగునని తోచుచున్నది ఆహా! ఇది మహాసంతోషకరము. అని యిట్లు శ్రీరామునియొద్దనుండివచ్చిన ఆంజనేయుని లెస్సగ జూచి యతనుజెప్పిన వృత్తాంతమును విన్నంతనే సీతాదేవికి పరమసంతోషముగలిగె. అంతసీతాదేవియును ఆంజనేయుడును ఒకరికొకరు మిగులనమ్మకముగలవారలై ఒకరితోనొకరు మాటలాడుటకారంభించిరి. అట్టియెడ వానరోత్తముడగు నాంజనేయుడు వ్యసనముచే మిగుల దైన్యమునొందియుండెడు సీతాదేవి జెప్పినమాటలనువిని తిన్నతిన్నగ సమీపమునకు పోవుటకారంభించె. అట్లాంజనేయుడెంతదగ్గిరకు బోవుచుండెనో యంతకంతకు సీతాదేవి తన్నుమారువేషముతో మోస పుచ్చుటకు వచ్చిన రావణాసురుడని సందేహించి యిట్లనియె.

అయ్యయ్యో, మారువేషముతోవచ్చినరావణాసురునితో నావృత్తాంతమంతయు జెప్పితినే? ఇంకేమిసేయుదును చేయగూడనికార్యమును జేసితిని కావున "నేనుదహింపబడుదునుగాక" అనియిట్లుజెప్పుచు, వ్యసనసముద్రమున మునిగి కృశించియున్నదియును, సౌందర్యము గలదియును నగు నాసీతాదేవి యాచెట్టుకొమ్మనువిడిచి యచ్చటనే, నేలపై గూర్చుండె అంతమహాబాహుడగు ఆంజనేయుడు, వ్యసనముచే మిగులశ్రమజెందినదియును, భయభ్రాంతయైయున్నదియును, నగుసీతాదేవినిజూచి, తన్నురావణాసురుడను శంకచేభయము నొందినదని తెలిసికొని జనకమహారాజపుత్రికయగు సీతాదేవికి నమస్కారమును జేసె అట్లు ఆంజనేయుడు నమస్కరించినను సీతాదేవి మిగుల భయమును బొందినదియై మరల ఆంజనేయుని ముఖమెత్తి చూడదయ్యె మఱియు నిండుచంద్రునితో సరిపోలు ముఖము గల సీతాదేవి, తనకునమస్కరించుచున్న వానరుని జూచి నిట్టూర్పులువిడుచుచు, మిగుల మనోజ్ఞములగు తిన్ననిమాటలతో నిట్లనియె.

ఓరీ! నీవు మహామాయలుగల రావణాసురుడవైతివేని మాయారూపమగు వానరరూపమునుబొంది యింకను నన్నేలదుఃఖమును పెట్టెదవు ఇదనీకెంతమాత్రమును క్షేమముగాదు నీవు, నీనిజరూపమువిడిచిమాయవేషముతో సన్న్యాసిరూపమును ధరించి వచ్చి, జనస్థానముననాకగపడినరావణాసురుడవేగాని వేరుగాదు. కామరూపియగు నోనిశాచరుడా! రావణా! ఉపవాసములచే కృశించుచున్నదానను, మిగుల దైన్యమును బొందుచున్నదానను, వ్యసనముచే మిక్కిలి పరితపించుచున్నదానను, నగు నన్నింకేల మఱల పరితపింపజేయుచున్నావు? ఇదినీకు క్షేమముగాదు అట్లుగాదని నేనిప్పుడు తలచినది యుచితముగాదు. ఏలననగా, నిన్నుజూచినతోడనే నామనస్సునకు మహాసంతోషము గలుగుచున్నది ఓవానరుడా! నీవుయథార్థముగ శ్రీరాముని దూతవగుదువేని నీకు, శుభమగుగాక, ఓవానరశ్రేష్ఠుడా! రామునికథలు నాకు మిగుల సంతసమును గలుగజేయునవి. కావున నిన్నడుగుచున్నాను ఓఆంజనేయుడా! నామనోహరుడగు శ్రీరామునిగుణములను వర్ణించిచెప్పుము ఓవానరుడా! ఉదకము "నదీతీరమునుహరించునట్లు" నీవునామనస్సును హరించుచున్నావు. ఇదియునుగాక బహుకాలముగ రాముని నెడబాసి పరితపించుచుండెడి నేను ఇప్పుడు ఆ రామునిచే బంపబడిన వానరుని కలయందు జూచుచున ౨

ను ఆహా నా స్వప్నసుఖమేమని చెప్పవచ్చును. మఱియునే ను స్వప్నమందైనను రాముని, మహాపరాక్రమశాలియగు లక్ష్మణుని, జూచుచునేని నా వ్యసనము తీఱును నేను నాశన మొందకుందును. అయ్యయో స్వప్నమునకును గూడ నాయందు కోపముగలదని తోచుచున్నది. నాకెది స్వప్నముగదోచ లేదు. స్వప్నమున వానరుని జూచినవారికి సంతోషము గలుగదుగదా, నాకిప్పుడు మహాసంతోషము గలుగుచున్నది ఇది యొకవేళ చిత్తవిభ్రాంతిగనుండునా? ఏమి? లేక వాతాతిశయమువలన నిట్లుతోచుచున్నదా? ఏమి? లేక, నాకేమైనను ఉన్మాదము పట్టినదా? ఏమి? లేక, ఎండమావులవంటిదిగదోచుచున్నదా? వేమి? అట్లు యోచించితినేని ఇది చిత్తభ్రాంతియును ఉన్మాదలక్షణమునుగాదు. ఏలననగా, నేను, నన్నును, యీవానరుని, తెస్సగా గుర్తెఱుగుచున్నాను.

అనియిట్లు సీతాదేవి యనేక ప్రకారములుగ నాలోచించి, బలాబలములు నిశ్చయించి, రాక్షసులు కామరూపులౌటవలన నావానరుని రాక్షసేశ్వరుఁడగు రావణాసురునిగాదలఁచె, మిగుల సూక్ష్మమైన నడుముగలదియును, జనకమహారాజ పుత్రికయును, నగు సీతాదేవి యీ వానరుని రావణాసురునిగానే, నిశ్చయించిన మనస్సుగలదియై ఆంజనేయునితో నేమియును బలుకకను బదులుచెప్పకనూ, ఊరకుండె అంత వాయుపుత్రుఁడగు నాంజనేయుఁడు సీతాదేవియొక్క మనస్సులో నుండెడి తలంపును దెలిసికొని, మహా శుభకరములగు మాటలచే నా సీతాదేవికి సంతోషమును గలుగజేయుటకు ఎత్నించి యిట్లనియె. తల్లీ సీతాదేవి శ్రీరాముడు సూర్యునితో సమానమైన తేజస్సు గలవాఁడు. చంద్రునివలె ప్రపంచమునకు మిగుల మనోహరమైనవాఁడు. విశ్రవసు బ్రహ్మ కుమారుఁడగు కుబేరునివలె రాజాధిరాజు. విష్ణుదేవునితో సమానమైన పరాక్రమము గలవాఁడు. మహాకీర్తిమంతుఁడు. దేవగురువగు బృహస్పతితో సమానమైన సత్యవాది మనోజ్ఞముగ మాటలాడువాఁడు. ఆకారమును ధరించిన మన్మథునివంటి సౌందర్యముగలవాఁడు, మిగుల కాంతియుక్తుఁడు. యుక్తమైనకోపముగలవాఁడు. కోపము వచ్చినపుడు తనకోపమును సార్థకముగ జేయువాఁడు. లోకోత్తరుఁడు మహారథుఁడు. ఇట్టిప్రభావములు గలిగిన ఏ మహాత్మునియొక్క బాహుచ్ఛాయనాశ్రయించి ప్రపంచమంతయు జీవించుచున్నదో యట్టి శ్రీరామునకు అపకారము జేయదలచి మాయచే రాముని, ఆశ్రమమునుండి తొలగిపోజేసి నిన్నపహరించిన రావణాసురునికి గలుగబోయెడు ఫలమును నీవు నీ నేత్రములతో జూడగలవు. మిగుల పరాక్రమశాలియగు ఏ రాముఁడుమండుచున్న యగ్నిం బోలె నతి కోపమువలన తనచే విడువఁబడిన బాణపరంపరలతో నీ రావణాసురుని మహా సులభముగ నతి శీఘ్ర కాలములో సంహరించునో, అట్టి రామచంద్రునిచే ప్రేరేపింపబడి వచ్చిన దూతను నేను. నేనిచ్చటికి నీ నిమిత్తముగనే వచ్చినాను. నీయొక్క వియోగముచే మహావ్యసనముతో పరితపించుచుండెడు శ్రీరామచంద్రుఁడు నిన్ను క్షేమమడుగమన్నాడు. మిగుల పరాక్రమశాలియును మహాబాహుండును సుమిత్రానందవర్ధనుడును నగు లక్ష్మణుఁడు తన కుమారుగ నన్ను నీకు నమస్కరించి నీ క్షేమమును నడుగమన్నాఁడు. ఓ సీతాదేవీ! శ్రీరామునకు మిత్రుఁడను, వానరోత్తములకు రాజును నగు సుగ్రీవుఁడు నీ క్షేమము నడుగమన్నాఁడు. ఓ తల్లీ! రామ లక్ష్మణ సుగ్రీవులు నిన్ను నిరంతరమును స్మరించుచున్నారు. ఓ దేవీ! సీతా! నీవు రాక్షస స్త్రీల యాధీనములో నున్నదానవయ్యును భాగ్యవశమునచే బ్రతికి యున్నావు. ఓ తల్లీ! నీవు రాముని, లక్ష్మణుని, వానరసమూహముల మధ్యనుండెడు మహా పరాక్రమశాలియగు సుగ్రీవుని, కొద్దికాలములలోనే చూడగలవు. నేను సుగ్రీవుని మంత్రిని హనుమంతుఁడనుపేరుగుచే బ్రసిద్ధినొందినవాఁడను. నేను నీకొఱకయ్యే మహాసముద్రమును దాటి ఈ లంకా నగరములో బ్రవేశించితిని సీతాదేవీ! నేను మిగుల శౌర్యము నవలంబించి మహాదుర్మార్గుఁడగు రావణాసురుని తలపై పాదములుంచి నిన్ను జూచుటకిచటికి వచ్చితిని ఓ సీతాదేవీ! నీవు నన్ను గురించి యెట్లాలోచించుచున్నావో అట్లు నేను కామరూపియగు రావణాసురుఁడనుగాను. ఈ సంశయమును వదులుము నేను జెప్పెడు మాటలయందు శ్రద్ధయుంచుమని ఆంజనేయుఁడు చెప్పె

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదినాలవ సర్గ ముగిసెను.

(*)

ఆంజనేయుడు రామునియొక్క అవయవములు మొదలగువాటిని వర్ణించి చెప్పుట.

పిదప సీతాదేవి, వానరోత్తముఁడగు నాంజనేయుఁడు చెప్పిన రామ కథను విని మిగుల మనోహరములగు తిన్నని మాటలతో నిట్లని బదులుజెప్పె. నీకును రామునకును ఎట్లు సంబంధము గలిగె. లక్ష్మణుని నెట్లెఱుగుదువు. నరులకును వానరులకును ఎట్లు సమాగమము గలిగె. వానరోత్తముడవైన ఆంజనేయుఁడా! రామలక్ష్మణులకుగల గురుతులను నాకు మఱల జెప్పుము. వాటిని విందునేని కొంత వ్యసనముదీరును- ఓ వానరుఁడా! ఆ రామునకుగల యవయ

వసన్నివేశము లెట్టివి? రూప మెలాటిది? మఱియు లక్ష్మణునియొక్క యూరువు లెటువంటివి? అతని బాహువు లెట్టివి? వీని నన్నిటిని విశదముగ నాకు దెలియజెప్పుమనిన వాయుపుత్త్రుడగు నాంజనేయుడు సీతాదేవితో రాముని జక్కగ వర్ణించి యున్నదున్నట్లు చెప్పుటకారంభించెను. ఓ తల్లీ తామర రేకులవంటి నేత్రములుగల సీతాదేవీ! నీవు నన్ను రాముని దూతనుగా దెలిసికొని, నాభాగ్యవశముచేత, రామ లక్ష్మణులయొక్క అవయవ సన్నివేశములనుగుఱించి నన్నడుగుచున్నావు. కావున నాకు మహాసంతోషమైనది. విశాలములగు నేత్రములుగల యోసీతాదేవీ! రామలక్ష్మణులయందు నీవు యేయే అవయవములను యేయేగుఱుతులనుజూచియున్నావో ఆయా గుఱుతులను వర్ణించి జెప్పెదను వినుము. జనక మహారాజ పుత్త్రికవగునోసీతాదేవీ! శ్రీరాముడు సర్వాంగసుందరుడు. తామర రేకులవంటి నేత్రములు గలవాడు సమస్తజీవ జంతు జాలములయొక్క మనస్సులను ఆకర్షించువాడు సకలసౌందర్యమును దయాదాక్షిణ్యము మొదలగు గుణములుగలవాడు. ఓతల్లీ! రాముడు, తేజస్సునందు సూర్యునికి సమానుడు. ఓర్పునందు భూమికి సమానుడు. బుద్ధియందు దేవగురువగు బృహస్పతికి సమానుడు. కీర్తియందు దేవేంద్రునికి తుల్యుడు. ఓసీతాదేవీ! రాముడు సమస్తప్రాణులను గాపాడువాడు. తన బంధుజనములను జక్కగ రక్షించువాడు తన జాతికి దగిన యాచార ధర్మములను వర్ణాశ్రమ ధర్మములను మఱియు క్షత్త్రియ ధర్మములను చక్కగ రక్షించువాడు. ఓసీతాదేవీ! శ్రీరాముడు ప్రపంచమునందుండెడు బ్రహ్మక్షత్త్రియ వైశ్య శూద్రులనెడి నాలుగు వర్ణములనుచక్కగ రక్షించువాడు. మఱియు లోకమునందుగల సమస్తమర్యాదలను నడుపువాడును జనులచేత నడిపించువాడుగను నుండును ఓదేవీ! రాముడు మహా కీర్తిమంతుడు, మిగుల పూజనీయుడు, బ్రహ్మచర్య వ్రతమునందుండువాడు మఱియు బ్రహ్మచర్య వ్రతముచే బ్రసిద్ధినొందినవాడు. పెద్దలకు ఉపకారముజేయువాడు. సమస్తకర్మలను లెస్సగ నెఱిగినవాడు. ఓజనకరాజ నందినీ! సీతాదేవీ! శ్రీరాముడు రాజవిద్యావిశారదుడు. బ్రాహ్మణ భక్తిగలిగినవారిని సేవించువాడు. వేదములనన్నిటిని జక్కగ దెలిసికొనినవాడు. మహావినయముగలవాడు. శత్రువులను తపింపజేయువాడు. మఱియును యజుర్వేదమును లెస్సగ నభ్యసించినవాడు. వేదవేత్తలచే బూజింపబడినవాడు ధనుర్వేదమునందును ఇతరములగు సమస్త వేదములయందును, వేదాంగములయందును, పండితుడు. ఓసీతాదేవీ! శ్రీరాముడు విశాలమైన మూపుగలవాడు. గొప్ప హస్తములుగలవాడు. శంఖమువంటి కంఠముగలవాడు, సుందరమైన ముఖముగలవాడు, మూపునందు సంధియెముక లగపడకుండనట్లుబలిసిన చర్మముగలవాడు, మిగుల ఎఱ్ఱని నేత్రములు గలవాడు. సకలలోకములయందును నెల్లరకు దెలిసినవాడు. మఱియు శ్రీరాముడు భేరీధ్వనివంటి కంఠముగలవాడును, సుందరమగు దేహచ్ఛాయగలవాడును, మహా పరాక్రమశాలియును, మిగుల పొడుగును పొట్టియునుగాని దేహముగలవాడును, హెచ్చుతక్కువలేక సమముగనేర్పఱుపబడిన అవయవములుగలవాడును, నల్లని రంగుగల దేహముగలవాడునునై యున్నాడు. ఓసీతాదేవి! మఱికొన్ని విశేషములను జెప్పెదవినుము. శ్రీరాముడు, ఱొమ్ము, మణిబంధము, పిడికిలి ఈ మూడును గట్టివిగ గలవాడును; కనుబొమలును, బాహువులును, వృషణములును ఈ మూడవయవములును మిగులదీర్ఘములుగగలవాడును, తలవెండ్రుకలకొనలును, రెండువృషణములును, రెండు మోకాళ్లును, ఈమూడు అవయవములును హెచ్చుతక్కువలులేక సమముగ నున్నవాడును బొడ్డు, లోకడుపు, ఎదురుఱొమ్ము యీమూడును లోతుగా గలవాడును; కనుగొనలును, గోళ్లును, అఱచేతులును, అఱికాళ్లునుయీమూడును నెఱ్ఱనివిగా గలవాడును (అనగా నెఱ్ఱనిరేఖలుగలవాడును) పాదరేఖలును, తలవెండ్రుకలును, లింగమును యీమూడునుమిగులనున్ననివిగ గలవాడును; కంఠస్వరమును, నడకయును, నాభియును యీమూడునుగంభీరములుగగలవాడునుకడుపునందును కంఠమునందును మూడుముడతలుగలవాడును, స్తనాగ్రములయందును, స్తనములయందును, రేఖలయందునుయీమూడునుపల్లములుగగలవాడును, తలయందుమూడువిధములగుసుళ్లుగలవాడునునైయున్నాడు మఱియుకంఠము, లింగము, పిఱ్ఱ, పిక్కయీనాలుగును మిగులపొట్టివిగగలవాడు. నాలుగువేదములువచ్చినవాడు (అనగా నాలుగువేదములు వచ్చుటకు సూచకములగు నాల్గురేఖలు అంగుష్ఠమూలమునందు గలవాడు) వజ్ర, ధ్వజ, శంఖాంకుశ రేఖలు నాలుగును నఱకాలియందును నఱచేతియందును గలవాడు. లేక, లలాటమునందునాల్గురేఖలుగలవాడు నాలుగుమూరల పొడవైనదేహముగలవాడు. (అనగా తొంబదియాఱంగుళముల పొడవుదేహప్రమాణముగలవాడు) రెండుబాహువులును, రెండు తొడలును, రెండుమోకాళ్లును, రెండుపిక్కలును యీనాలుగు జతలును నొకటితోనొకటిసమానములైనవిగగలవాడు. పదునాలుగు సరియైన అవయవజంటలుగలవాడు.(అ

నగాకనుబొమలు, ముక్కురంధ్రములు, కండ్లు, చెవులు, పెదవులు, స్తనాగ్రములు, మోచేతులు, మణికట్లు, మోకాళ్లు, వృషణములు, కటిస్థలము, చేతులు, కాళ్లు, పిరుదులు, పిక్కలు, అనునీయవయవజంటలు సమములుగ గలవాడు. దుష్ట్రలనబడునాలుగుదంతములు గలవాడు. సింహము, ఏనుగు, పెద్దపులి, వృషభము, యీనాలుగుజంతువులనడకవంటి నడకగలవాడు. పెద్దపెదవులును, గొప్పగండభాగములును, గొప్పముక్కునుగలవాడు మహాకాంతితో గూడిన దంతములును, దేహచర్మమును, పాదములును, తలవెంట్రుకలునుగలవాడు వెన్నెముక, శరీరము, హస్తములు, పాదములు, వేళ్లు, కండ్లు, చెవులు, మేఢ్రము, అనునీయెనిమిదిఅవయవములును మిగులదీర్ఘములైనవిగ గలవాడు ముఖము, నేత్రములు, నాలుక, పెదవులు, దవడలు, స్తనములు, నఖములు, చేతులు, కాళ్లు, అనునీపదియవయవములునుపద్మాకారముగగలవాడు. తలయును, లలాటమును, చెవులును, కంఠమును, రొమ్మును, హృదయమును, నోరును, చేతులును, కాళ్లును, పిఱుదులును, అనునీపదియవయవములు పెద్దవిగగలవాడు. తేజస్సు, లేక, ప్రకాశము, కీర్తి, సంపద, యీమూటిచేతను లోకమునందంతటను బ్రసిద్ధినొందినవాడు. పరిశుద్ధములైనమాతాపితృవంశములు రెండును గలవాడు, లేకపంకములు నేత్రములు యీరెండును మిగులతెల్లనివిగగవాడు. పొట్ట, రొమ్ము, ముక్కు, భుజములు. లలాటము, మూపుయీయారును ఉన్నతములైనవిగలవాడు. తలవెంట్రుకలు, మీసములు, గోళ్ళు, రోమములు, దేహచర్మము, వేళ్ళగణుపులు, మేఢ్రము, బుద్ధి, చూపుయీతొమ్మిదియునుమిగులసూక్ష్మములుగగలవాడు మఱియుపూర్వాహ్ణ, మధ్యాహ్న, అపరాహ్ణములను మూడుకాలములచేతను ధర్మార్థకామములను బొందుచుండువాడు ఓసీతాదేవీ! శ్రీరాముడు సత్యమునందును ధర్మమునందును ఆసక్తిగలవాడు. మహాసంపద్యుక్తుడు ద్రవ్యసంపాదనయందును, ఆర్జించినద్రవ్యమును ఆశ్రితజనులకిచ్చుటయందును, మిగులఆసక్తిగలవాడు దేశకాలములను తెన్నగనెఱింగి యేయేదేశమున ఏయేకాలమున ఏయే కార్యములను జేయవలయునో వానినన్నిటిని తెలిసిచేయువాడు సకలజనులకునుప్రీతిగలిగించునట్టిమాటలనే జెప్పువాడు ఓతల్లీ! మఱియు రామునితమ్ముడును, ఇద్దఱుతల్లుల ముద్దుబిడ్డడను, (అనగా సుమిత్రాపుత్రుడయ్యును కౌసల్యచేత రామునితోసమానముగ బెంపబడుటచేనిద్దఱుతల్లులుగలవాడని చెప్పబడియెనని యెఱుగునది) యుద్ధరంగమున నితరులచే జయింపబడనివాడును, సుమిత్రపుత్రుడునునగు లక్ష్మణుడు ప్రేమచేతను, దయచేతను, సౌందర్యముచేతను, సమస్తములైనసుగుణగణవిశేషములచేతను నారామునకుసరివచ్చువాడు. ఓదేవీ! తల్లీ! ఆ పురుషోత్తములగు రామలక్ష్మణులిరువురును నిన్నుజూచుటయందు పరమోత్సాహముగలవారై భూమినంతయుసంచరించుచుండగవారికికినిమాకునుసమాగమముజైనది. అట్లురామలక్ష్మణులునిన్ను వెదకుచు భూమియందంతటను దిరుగుచుండిరి. అట్లుసంచరించుచు, అన్నయగు వాలిచే రాజ్యభ్రష్టుడై యతనిభయమువలనకిష్కింధానగరమునువదలి అనేకవృక్షములతో గూడియున్న ఋశ్యమూకపర్వతముమీదనుండు నొకరమ్యస్థలమందు నివసించియున్నవాడును ప్రియదర్శనుండును వానరరాజుననగు సుగ్రీవునిజూచిరి మఱియు అన్నచేరాజ్యభ్రష్టుడైనవాడును, సత్యప్రతిజ్ఞగలవాడునువానరరాజునునగు సుగ్రీవునిసేవించి మేము అతనియాజ్ఞచొప్పున నడుచుకొనుచుండువారము అట్లుండగనా రామలక్ష్మణులు నారచీరలు గట్టుకొనిధనుర్బాణములనుధరించి ఋష్యమూకపర్వతమునకువచ్చిరి. అట్లుధనుర్బాణములను ధరించివచ్చినయారామలక్ష్మణులనుజూచి తన్నుజంపుటకు వాలిచేనంపబడినవారేమోయని వానరోత్తముడగుసుగ్రీవుడు మిగులభయభ్రాంతుడైయాపర్వతశిఖరముమిదికి పరుగెత్తిపోయెను. అట్లుపోయియా వానరరాజగు సుగ్రీవుడు ఆపర్వతశిఖరమునందుండి యతివేగముగనా రామలక్ష్మణులసమీపమునకు నన్నుపంపెను. నేనుఆసుగ్రీవునియాజ్ఞను శిరసావహించి, పురుషశ్రేష్ఠులును, సర్వలక్షణసంపన్నులును, రూపవంతులును, రాజపుత్రులునునగు రామలక్ష్మణులయొద్దకుబోయి వారికి దండప్రణామములాచరించి కృతాంజలినై యెదుటనిలిచి సుగ్రీవునియొక్క వృత్తాంతమునంతయు నెఱింగించితిని మఱియు రామలక్ష్మణులకు నేను యథార్థస్థితిని దెలుపగా వారిరువురునుపరమసంతోషభరితులైరి పిదప వారినినావీపుమీదనెక్కించుకొని సుగ్రీవునున్నచోటునకు నెత్తుకొనిపోతిని. అట్లునెత్తికొనిపోయి వారలనచ్చటదిగవిడిచి, ఆరామలక్ష్మణులయొక్క నిజవృత్తాంతమును సుగ్రీవునకుజెప్పితిని అంతటనారామలక్ష్మణసుగ్రీవులొకరితోనొకరు సరససల్లాపములాడుటచేనొండొరులకు స్నేహముగలిగెను. పిమ్మట శ్రీరాముడునుసుగ్రీవుడును మిగులసంతోషించినవారైతమకుఅదివరకుప్రాప్తించిన సుఖదుఃఖములను ఒకరితోనొకరుచెప్పుకొని యూరటనొందుచుండిరి. అప్పుడుశ్రీరామచంద్రుడు, మహాబలపరాక్రమశాలియును అన్నయునునగు వాలిచే, స్త్రీనిమిత్తమై యవమానింపబడిన సుగ్రీవునిశాంతవచనములవలన నూరడించె ఓసీతాదేవీ! అంతలక్ష్మ

ణుడు, శ్రీరామునకునీయొక్క వియోగమువలన గలిగిన వ్యసనమును వానరాధీశుడగు సుగ్రీవునకుజెప్పె. అట్లు లక్ష్మణుడుఆవృత్తాంతమునంతయు సవిస్తరముగ దెలిపిన పిమ్మట వానరేశ్వరుడగు సుగ్రీవుడు తనకువలె తనహితునకు గూడ భార్యావియోగదుఃఖము గలిగియున్నదను చింతచే "రాహుగ్రహముచే మ్రింగబడిన సూర్యునివలె" ప్రకాశింపనివాడయ్యె. ఓతల్లీ! సీతాదేవీ! అట్టియెడ నచటనుండిన వానరోత్తములు, నిన్ను రావణాసురుడు గొనిపోవుచుండగ నీవు నేలంబడవైచినసీశరీరమునందలియాభరణములనన్నిటిని దీసికొనివచ్చిమహాసంతోషముతో శ్రీరామునిముందర నుంచిరిగాని, నీవుయుండుచోటు వారెఱుగరైరి. అంతనా యాభరణములనన్నిటిని శ్రీరాముడు చేతబుచ్చుకొని వ్యసనవేగముచే మూర్ఛనుబొందె. అట్లుమూర్ఛనొందునెడశరీరముమీద జ్ఞప్తిలేక నాయాభరణములను నేలపై వెదజల్లె. అప్పుడు ఆయాభరణములన్నియు ఘల్లనిమ్రోగినవి. అంత నేను వానినన్నిటినియెత్తితిని. దేవసమానుండును నీకుసిమిటియునునగు శ్రీరాముడు, మిగుల రమణీయములగు నాయాభరణములను తనతొడపైనునిచికొని యనేక విధముల విలపించె. అట్లురాముడు ఆభరణములను పలుమారుజూచి రోదనముజేయుచునుండె. ఆయాభరణములను జూడజూడనారామునకు శోకాగ్నివృద్ధినొంది మహాదుఃఖముచే దేహముదెలియనివాడై చాలాసేపు నేలబడి యుండె. అట్టియెడ నేనును, లక్ష్మణుడును, సుగ్రీవుడును నానావిధములగుశాంతవచనములనూరడించి,తుదకతిప్రయాసమునొంది లేపి కూర్చుండబెట్టితిమి. మహాబాహుడగురాముడులక్ష్మణసమేతుడై, ఆభూషణములను తనచేతంబట్టుకొని వానిపలుమారు చూచుచు నచ్చటనున్న సుగ్రీవాదులకు జూపుచుండి కొంతసేపటికి సుగ్రీవునకు నొప్పగించె. మిగుల పూజ్యురాలవగు నోసీతాదేవీ! ఆరాముడు నీవగుపడకపోయినదిమొదలు వ్యసనాగ్నిచేగుందుచు "అగ్నిచే గునుఖుచుండెడుపర్వతమువలె" మిగులపరితపించుచున్నాడు. ఓతల్లీ! సీతాదేవీ! మహాత్ముడగురాముడు నీయెడబాటువలన గలిగిన శోకముచేతను చింతచేతను నిదురలేనివాడై "అగ్నిహోత్రముచే నగ్నిగృహమువలె" మిగుల తపించుచున్నాడు. మఱియు నీవగుబడక బోయినదిమొదలు మహావ్యసనముచేగుందుచు "భూకంపముచేవడవడవడకుచుండెడు గొప్పపర్వతమువలె" నిలకడను బొందకయున్నాడు రాజకుమారుడగునోసీతాదేవీ! రామచంద్రుడు నిన్నెడబాసినది మొదలు, రమణీయములగు నరణ్యము యందును, నదులయందును, సెలయేళ్లయందును నిన్నువెదుకుచు సంతసము నుబొందకున్నాడు. జనకమహారాజనందినీ! సీతాదేవీ! పురుషోత్తముండగు రాముడుశీఘ్రకాలములోనే రావణాసురుని, బంధుమిత్రసమేతముగ సంహరించి నిన్ను బొందగలడు. అందుకుసంశయములేదు. మఱియునోతల్లీ! రామసుగ్రీవులిరువురును సఖ్యముజేయునప్పుడు రాముడు వాలినిజంపి సుగ్రీవునివానరరాజ్యమునకుఅధిపతిగజేయునట్లును, అందుకుబదులుగ సుగ్రీవుడు నిన్నువెదకునట్లును ప్రతిజ్ఞజేసికొనిరి. అంతమహాపరాక్రమశాలులగు నారామసుగ్రీవులిరువురును కిష్కింధానగరమునకు బోయిరి. అట్లుపోయిన పిమ్మట శ్రీరాముడు వానరేశ్వరుడగువాలిని యుద్ధమునందు సంహరించె. మహాబలశాలియగురాముడు విజృంభించియుద్ధమున వాలినిసంహరించి సమస్తములగు వానరసమూహములకును భల్లూకసమూహములకునుసుగ్రీవునిఅధిపతిగ జేసె. ఈరీతిగ రామసుగ్రీవులకిరువురకును సఖ్యముగలిగినది ఓసీతాదేవీ! నేనారామసుగ్రీవులకుదూతను. హనుమంతుడనుపేరుగలవాడను. నిన్నువెదకుటకైయిచటికి వచ్చితిని మఱియు సుగ్రీవుడు తనరాజ్యమును బొందినతోడనే మహాబలపరాక్రమశాలులగు వానరనాయకుల రప్పించి నిన్నువెదకుటకొఱకు దశదిశలకును బొమ్మనినియమించె అట్లువానరులు, మహాపరాక్రమశాలియును, వానరేశ్వరుడునునగు సుగ్రీవునిచే నాజ్ఞాపింపబడినవారై దశదిశలకును వెళ్లిరి. అంత నట్లువెళ్లిన మేమును, మఱియు నితరవానరులును, సుగ్రీవునియాజ్ఞచేభయపడి భూమినంతయును వెదకుచున్నాము అట్లుబైలుదేరినవారలలో, వాలిపుత్రుడును, మహాబలపరాక్రమశాలియును, సంపద్యుక్తుడును, వానరోత్తముడునునగు నంగదుడు మూడవపాలు సైన్యముతో బైలువెడలె. అట్లంగదునిసేనాధిపతిగజేసికొని బైలుదేరిన మేమందరమును, వింధ్యపర్వతమునందు ప్రవేశించి యందు మార్గముదెలియక మహాదుఃఖమునుబొందినవారమై యనేకదివసములందు గడపితిమి. అట్లనేకదినములందు గడచిపోవుటచే సుగ్రీవుడునిర్ణయించినగడువుఅతిక్రమించిపోవుటను జూచి వానరేశ్వరుడగు సుగ్రీవునిభయముచే ప్రాణములను విడుచుటకు నిశ్చయించుకొంటిమి. మఱియు చొరగూడని యరణ్యప్రదేశములయందును, పర్వతప్రాంతములయందును, నదులయందును, సెలయేళ్లయందును, నిన్నువెదకియెచ్చటను నీవుగానకబోవుటవలన ప్రాయోపవిష్టులమై ప్రాణములనువిడుచుటకు నిశ్చయించుకొంటిమి. ఓతల్లీ! సీతాదేవీ! అట్లుసర్వసంగపరిత్యాగముగావించి ప్రాణములుదేహమునుండి వెడలువరకు నాహారాదులను వర్జించియుండెడు వ్రతమగు ప్రాయోపవేశము జేసియుండెడు నేను

మొదలగువానరశ్రేష్ఠులను నంగదుడుజూచి వ్యసనసముద్రమునందు మునిగినవారై సీవగబడకపోవుటను గుఱించియు, మేముప్రాయోపవేశంబు జేయుటనుబట్టియు, వాలిచంపబడుటనుతలంచియు, రావణునిచే జటాయువు మరణమును బొందుటయు నివిమొదలగువాటినిదలంచుకొనివ్యసనముచే మిగులదుఃఖించుచుండె మఱియుఅట్లుసుగ్రీవుడు నిర్ణయించిన కాలముఅతిక్రమించునట్లుండుటచే ప్రాణములపై నాశయుడిగి ప్రాయోపవేశవ్రతముచే జావనిశ్చయింతిమి. ఇట్లునిశ్చయించి యుండెడు మాయొక్క కార్యసిద్ధికమ్యేనచ్చెనోయనునట్లు మహాపరాక్రమశాలియును, మిగులపూజ్యమైనదియును, నగుసంపాతియనునొకపక్షి మేముఉండెడుప్రదేశమునకువచ్చె. అట్లువచ్చిన పక్షిరాజగు సంపాతి తనసోదరుడైన జటాయువు సంహరింపబడెనని మాచేవిని మిగుల కోపమునుబొందినదగుచు యిట్లనియె.

ఓవానరోత్తములారా! నాతమ్ముడగు జటాయువును ఎవ్వడుజంపెః ఏస్థలమునందు జంపబడియెః ఈసంగతులను మీరు నాకుసవిస్తరముగజెప్పుడనియడిగె. అంతటనంగదుడు సంపాతినిజూచి యిట్లనియె. ఓసంపాతీ! నీతమ్ముడగుజటాయువు, జనస్థానమున సీతాదేవికొఱకు మహాభయంకరాకారుడగు రావణాసురునిచే నతిక్రూరముగ జంపబడియెనని చెప్పె ఓతల్లీ! శ్రేష్ఠమగుపిరుదులుగలసీతాదేవీ! అరుణునికుమారుడగు నాసంపాతి, తనతమ్ముడైన జటాయువు రావణాసురునిచే జంపబడుటనువిని పరమదుఃఖితుడై నీవు రావణాసురుని యింటియందున్నావనిచెప్పె. పిదపఅంగదుడుమొదలగు మేమందఱము సంపాతిచెప్పినవాక్యమునువిని పరమసంతోషము గలవారమై యతివేగముగ అక్కడినుండి బైలువెడలితిమి అట్లువెడలిన మేమందఱమును మహాసంతోషముగలవారమై వింధ్యపర్వతమున నుండి బైలుదేరి యొక్కటే గంతువేసి దక్షిణసముద్రముయొక్క యుత్తరదరిజేరితిమి ఓతల్లీ! సీతాదేవీ! నిన్నుజూచుటకు మహాసంతోషముతోవచ్చి సముద్రదరిజేరి యంగదుడుమొదలగు మేమందఱమును సముద్రమునుజూచి మఱలనధికముగ భయమునుబొంది మహావ్యసనముగలవారమైతిమి. ఇట్లు సముద్రమునుజూచి భయపడిదుఃఖించుచున్న వానరసైన్యములనుజూచి వారితీవ్రవేదననుబోగొట్టి నూరుయోజనములవిరివిగల సముద్రమునునొక్కపెట్టున దాటితిని. ఓతల్లీ! సీతాకేవీ! నేనట్లుసముద్రమునుదాటి రాత్రియందులంకానగరమునప్రవేశించి, దుష్టుడగు రావణాసురుని జూచితిని. మఱియు మహావ్యసనముచే బరితపించుచుండెడు నిన్నుగూడజూచితిని. పరమపతివ్రతవగునోతల్లీ! సీతాదేవీ! ఈసమాచారమునంతయు జరిగినది జరిగినట్లు నీకెఱింగించితిని. నేనుదశరథమహారాజ పుత్రుడగు శ్రీరామునిదూతను. నాతోసంభాషింపుము. ఓతల్లీ! సీతాదేవీ! నేనుశ్రీరామునికార్యమును జేయువాడను ఆయనబంపగా నీకొఱకిచటికి వచ్చితిని. నేను సుగ్రీవుని మంత్రిని. వాయుదేవుని పుత్రుడను. ఇదినమ్ముము. సమస్తశస్త్రాస్త్రములనెఱిగినవారలలో నుత్తముడును కకుత్థ్సవంశోద్భవుడునునగు రాముడుక్షేమముగనున్నాడు. సకలలక్షణసంపన్నుడగు లక్ష్మణుడును అన్నకు శుశ్రూషజేయుచు క్షేమముగ నున్నాడు. ఓసీతాదేవి! నేనొక్కడనుమాత్రముసుగ్రీవునియాజ్ఞచేమహాపరాక్రమశాలియగు నీభర్తయొక్క హితమును జేయువాడనై యిచటికివచ్చితిని. నేను ఒంటరివాడనై కామరూపమును ధరించి యీలంకానగరమునందంతటనుతిరిగి దక్షిణదిక్కునందు నాభాగ్యవశమున నిన్ను జూచితిని. ఇకసీవగబడక పోవుటవలన మహావ్యసనమునుబొంది యుండెడు వానరసైన్యములయొక్క దుఃఖమును బోగొట్టెదను. ఓసీతాదేవీ! నాభాగ్యవశముచే నేనీసముద్రమును దాటుట సఫలమయ్యె నాభాగ్యవశముచే నిన్నుగనుగొనుటవలన గలిగినకీర్తినిబొందగంటిని మహాపరాక్రమ శాలియగు రాముడతిశీఘ్రముగ రావణాసురుని బంధుమిత్రసమేతముగ సంహరించి నిన్నుదీసికొనిపోవును ఇదిగాక నాజన్మవృత్తాంతమునంతయు సవిస్తరముగ నెఱిగించెదవినుము. ఓసీతాదేవీ! పర్వతములలోనెల్లనుత్తమపర్వతమగు మాల్యవంతమను పర్వతమొకటిగలదు. అందుకేసరియను వానరుడొకడు నివసించుచుండె. ఆకేసరియేనాతండ్రి. అతండుకొన్నిదినములకువెనుక గోకర్ణమనుపర్వతమునకుబోయె. అట్లుబోయి యచట దేవతలచేతను మహర్షులచేతను ప్రేరేపింపబడి యాజ్ఞాపింపబడినవాడై సముద్రతీరమున నొకపుణ్యప్రదేశమునందు శంబసాదనుడను రాక్షసుని సంహరించె. ఓసీతాదేవీ! అట్లు నాతండ్రియగు కేసరియనువాడు గోకర్ణమునకుపోయియుండు కాలమున నేనతనిభార్యయందు వాయుదేవుని ప్రసాదమువలన జన్మించితిని నేను జేసినకార్యముచేతనే లోకమునందు హనుమంతుడను పేరుచే బ్రసిద్ధినొందితిని. ఓసీతాదేవీ! నీకునమ్మకముగలుగుటకొఱకు నీపెనిమిటియగు శ్రీరామునియొక్క వృత్తాంతమంతయు నీకుజెప్పితిని. పాపరహితురాలవగు నోసీతాదేవీ! శ్రీరాముడుశీఘ్రకాలములోనే, నిన్నిచ్చటనుండి తీసికొనిపోవునని చెప్పె.

అనియిట్లాంజనేయుడుజెప్పగా మహావ్యసనముచేగృశించుచున్నసీతాదేవి,అనేక కారణములచేత నమ్మకముగలద

య్యె. మఱియు యథార్థమగు గుఱుతులచేత నయ్యాంజనేయుఁడు రామునిచే నంపబడిన దూతయని నిశ్చయించె ఇట్లు సీతాదేవి ఆంజనేయుని రామునిదూతగ నిశ్చయించి మితిలేని సంతోషమును బొంది వంకరలగు కనుఱెప్పలుగల తననేత్రములనుండి ఆనందబాష్పములను విడచె మఱియు తామర ఱేకులవలె విశాలములై యెఱ్ఱని వారలతో నొప్పుచుండెడు నేత్రములుగల సీతాదేవియొక్క ముఖము, రాహుగ్రహముచే విడువబడిన చంద్రునిబోలె ప్రకాశించుచుండె అప్పుడు సీతాదేవి యాంజనేయుని వాస్తవముగ వానరుడని నమ్మెను అంతట నయ్యాంజనేయుడు యెల్లవారలకును ఆనందకరమగు దర్శనమిచ్చునట్టి సీతాదేవిని జూచి యిట్లనె ఓసీతాదేవీ! ఈవృత్తాంతమంతయు నవిస్తరముగ నెఱింగించితి ఇంక దుఃఖమును విడిచి యూరడిల్లుము. ఇప్పుడు జేయవలసిన కార్యమేద్ది? నీ యిష్టమును దెల్పుము? నేను మఱల శ్రీరాముడు నివసించుచుండు చోటునకు బోవలయును ఓసీతాదేవీ! నాతండ్రియగు కేసరి, మహర్షులచే ప్రేరేపింపబడి శంబసాదనుడను రాక్షసుని యుద్ధమునందు సంహరింపబోయినప్పుడు, నేను వాయుదేవుని వలన జన్మించితిని. కావున ప్రభావమునందే వాయుదేవునకు తుల్యుడను. అని యిట్లాంజనేయుడు సీతాదేవితో జెప్పె

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదియైదవ సర్గ ముగిసెను

(*)

ఆంజనేయుడు సీతాదేవితో రాముడు నిరంతరము నిన్నే స్మరించుచున్నాడని చెప్పుట.

మిగుల పరాక్రమముగల వానరుడును వాయుపుత్రుడునునగు నాంజనేయుడు సీతాదేవియొక్క నమ్మకము గలుగుటకొఱకు మఱల మహావినయముతో నిట్లనియె. మహాభాగ్యముగలదానా! సీతాదేవీ! నేను యథార్థముగ వానరుడను. మహాబుద్ధిమంతుడగు రామునియొక్క దూతను. ఓసీతాదేవీ! ఇదిగో చూడుము, రాముని పేరు వ్రాసియుండెడు ఉంగరమును దెచ్చితిని చూడుము. ఓదేవీ! నీకు నమ్మకము గలుగుటకొఱకు యుంగరమును గుఱుతుగా దెచ్చితిని. ఇది మహాత్ముండగు శ్రీరామునిచే నివ్వబడినది. ఓసీతాదేవీ! ఇక నీవు నెమ్మదిగనుండుము. నీకు భద్రమగుగాక, నీ వ్యసనములన్నియు నశించునవి. అని యాంజనేయుడు జెప్పగవిని సీతాదేవి తనపెనిమిటియొక్క హస్తాభరణమగు నుంగరమును తన చేతికి దీసుకొని దానిని చూచి తనభర్తయగు శ్రీరామునితో గూడుకొన్నదానివలె మహాసంతసమును బొందె. అట్టి యెడ మిగుల సుందరములైనవియును తామర ఱేకులవలె విశాలములైనవియును యెఱ్ఱని చారలుగలవియును నగు నేత్రములుగల యాసీతాదేవియొక్క ముఖము రాహుగ్రహముచే విడువబడిన చంద్రునివలెనే ప్రకాశించె. అంత సీతాదేవి తనపెనిమిటియగు శ్రీరాముడు చెప్పిపంపిన మాటలను విని పులకాంకిత శరీరముగలదియై లజ్జను బొంది మిగుల సంతసించి వానరోత్తముడగు నాంజనేయుని మిగుల సన్మానించి యిట్లని పొగడె. ఓవానరశ్రేష్ఠా! ఆంజనేయా! నీవు వాక్కరుడవే రాక్షసులు నివసించుచుండెడు ఈ లంకానగరమున నిర్భయముగ బ్రవేశించితివి. నీబలపరాక్రమము లేమని చెప్పవచ్చును. నీవు మహాశౌర్యవంతుడవు. నీవే మహాసమర్థుడవు. నీవే మిగుల బుద్ధిమంతుడవు మఱియు నూరుయోజనముల వెడల్పుగలదియును, మొసళ్ళు మొదలగు క్రూరజంతువులు గలదియునునగు సముద్రమును పరాక్రమించి "గోవుపాదమంతటి స్థలమును బోలె" మహాసులభముగ దాటితివి. వానరోత్తమా! ఆంజనేయా! నీవు రావణాసురునివలన భయమును తొట్రుపాటును బొందవైతివి. కావున నీవు సామాన్యుడవైన వానరుడవని నేను తలపను. వానరశ్రేష్ఠుడా! నీవు, ఆత్మవేత్తయగు రామునిచే బంపబడితివి గాన నేను నీతో మాటలాడుటకు తగుదును. విరోధులచే జయింపగూడని పరాక్రమముగల రాముడు నీబలపరాక్రమములను గుర్తెఱుగకను లెస్సగ పరీక్షింపకను నిన్ను ఎచటికి నిబంపడు అట్లుండగ నాయొద్దకు బంపు విషయములో చెప్పనక్కరలేదు. నీవు మిగుల బలపరాక్రమములు గలవాడవనుటకు సంశయము లేదు. ఆంజనేయుడా! నా యదృష్టముచే సత్యప్రతిజ్ఞగలవాడును ధర్మాత్ముడునునగు రాముడును, మహాబలపరాక్రమశాలియును, సుమిత్రాపుత్రుడును, నగు లక్ష్మణుడును క్షేమముగ నున్నారను శుభవార్త వింటిని. కకుత్థ్స వంశోద్భవుడగు రాముడు క్షేమముగ నుండెనేని తనప్రియభార్యనగు నేనగపడకుండుటచే మహాకోపమును బొంది ప్రళయకాలాగ్ని జ్వాలాస్త్రమువలె చెలరేగినవాడై నాలుగుసముద్రములచే జుట్టబడిన నీభూమినంతయు దహింపకుండునా? ఏమి? అట్లు దహించునేని, ఎందుచే దహింపకున్నాడు మఱియు నా రామలక్ష్మణు లిరువురును దేవతులనైనను జయింపసమర్థులగుదురు, అయినను నాయొక్క వ్యసనముల కింకను, అంతము రాలేదని తలచెదను. కావుననే వారట్లూరక యున్నారు. అదంతయు నట్లుండనిమ్ము కపికులసార్వభౌమా! ఆంజనేయా! రామచంద్రుడు నాకొఱకు వ్యసనముచే నిరంతరము పరితపింపకున్నాడుగదా. మఱియు నిరంతరమును నాకొరకు దుఃఖింపకున్నాడుగదా? పురుషోత్తముడగు రాముడు నిరంతరము చింతాక్రాంతుడై యుండక యుంకమీద జేయవలసిన కార్యములయందు జాగరూకుడై యున్నాడుగ? దామానవేశ్వరుడైన దశరథమహారాజపుత్రు

డగు రాముడు నిరంతరమును దైన్యమునుబొంది యుండడు గదా. మఱియుసంభ్రమముచే కార్యములు పాడుజేయకు న్నాడుగదా. మిగుల మోహము నొందనివాడై సమస్తపురు షప్రయత్నములను జేయుచున్నాడుగదా! ఓయాంజనేయా! విరోధులను తపింపజేయునట్టి రాముడు, జయేచ్ఛగలవా డై మిత్రులయందు సామదానోపాయములను రెంటిని, విరోధులయందు దానభేద దండోపాయములను మూటిని బ్రయోగించుచుసమ్యోకాలమునకు దగినట్లు ప్రవర్తింపుచు న్నాడుగదా? మఱియు రాముడు క్రొత్తక్రొత్తగ స్నేహితులనుబొందుచున్నాడుగదా? మఱియు నతనిని అన్యులు స్నేహితునిగా గోరుచున్నారుగదా? ఓయాంజనేయా! రామచంద్రుడు నన్నీదుఃఖ సాగరమునుండి కడతేర్చునుగదా? నిరంతరమును సుఖములనేయనుభవింపదగినవాడును, దుఃఖములననుభవింపదగనివాడును నగు రాముడు మహాదుఃఖముచే కృశించుచున్నాడుగదా? కౌసల్యయొక్కయు, సుమిత్రయొక్కయు, భరతుడు మొదలగువారియొక్కయు, క్షేమములు అప్పుడప్పుడు తెలియవచ్చుచున్నవిగదా? మిగుల గౌరవింపదగిన రాముడు నాకొఱకయ్యే మిగులపరితపించుచున్నాడుగదా? రాముడు వేరుమనస్సు గలవాడుకాడుగదా? నన్నీదుఃఖ సాగరమునుండి కడతేర్చునుగదా? అన్నయందు పరమస్నేహముగల భరతుడు నాకొఱకు మంత్రులచే రక్షింపబడి మిగుల భయంకరమగు నొకయక్షౌహిణీసైన్యమునుబంపునా? యేమి? వానర రాజును శ్రీమంతుడునునగు సుగ్రీవుడు, మిగులపరాక్రమశాలులును గోళ్లునుపండ్లునే యాయుధములుగాగలవారును నగువానరులచే బరివేష్టింపబడినవాడై నాకొఱకిచటికివచ్చునా? యేమి? యుద్ధవీరుడును అస్త్రవేత్తయును, సుమిత్రాపుత్రుడునునగు లక్ష్మణుడు బాణపరంపరలచే రాక్షసుల నందఱిని సంహరింప యత్నించియున్నాడుగదా? మిగుల భయంకరముగ మండుచున్న యస్త్రములచే యుద్ధమున బంధుమిత్రసమేతముగ సంహరింపబడిన రావణాసురుని స్వల్పకాలములోనే జూడగలనుగదా? బంగారముతో సమానమైన వర్ణముగలదియును, తామర పుష్పముంబోలె వాసనగలదియును, నగు రామచంద్రనిముఖపద్మము, నన్నెడబాయుటచే గలిగినదుఃఖమువలన దైన్యమునుబొందినదియై, యెండకాలమునందలి సూర్యుని వేడిమిచేనీళ్లెండిపోయిన కొలకునందలి తామరపద్మమువలె వాడకున్నదిగదా? ధర్మమును బరిపాలించుటకొఱకు రాజ్యమునువిడిచినన్నుగూడ పాదచారిణిగా నరణ్యమునకు దీసికొనిపోవునపుడు కొంచమైనను మనోవ్యథగాని, భీతిగాని, దుఃఖముగాని పొందకుండిన రామచంద్రుడు యిప్పుడు మనస్సునందు కొంచమైనను చింతను, భీతిని, జిగుప్సనుబొందకున్నాడుగదా? ఆ రామునకు తల్లిగాని తండ్రిగాని మఱియే యితరబంధువులుగాని స్నేహమునందు నాతోసమానులుగారు. మఱియునాకన్న నధికులును గారు. ఆ రాముని కు నాయందుగల ప్రేమ యతనితల్లి తండ్రులయందుగాని యితర స్నేహితులయందుగాని బంధువులయందుగాని లేదు. రాముడు నన్ను మఱలదీసికొనిపోవునో తీసికొనిపోడో యనువృత్తాంతము తెలియువరకు నేను బ్రతికియుందును. అని యిట్లనేకప్రకారములుగ సీతాదేవి వానరోత్తముడగు నాంజనేయునితో మిగులగూఢార్థములైనవియును మనోజ్ఞములైనవియునునగు మాటలను జెప్పి, అయ్యాంజనేయునివలన రామునిసంబంధములైన మనోజ్ఞములగు మాటలనువినుటయందుత్సాహముగలదియై యూరకుండె. మిగులభయంకరమైన పరాక్రమముగలవాడును వాయుపుత్రుడునునగు ఆంజనేయుడు సీతాదేవిచెప్పిన మాటలనువిని నమస్కరించి చేతులనుముకుళించుకొని యిట్లనియె. ఓతల్లీ! తామరకమలముల వంటి నేత్రములుగల సీతాదేవీ! ఈలంకాపట్టణమునందున్నావని రామచంద్రునకు దెలియదు. కావుననే అనుహ్లాదుడు తీసికొనిపోయిన శచీదేవియెచటనున్నదియు దెలియకపోవుటచే నింద్రుండు బహుకాలము ఆశచీదేవిని తీసికొనిపోక యున్నట్లు" నిన్నును అతిశీఘ్రముగ దోడ్కొని పోకయున్నాడు. ఇప్పుడు నేనిచటనుండియతివేగముగ బోయియీవృత్తాంతమును రామున కెఱింగించినంతనె రాముడుగొప్ప వానరభల్లూకసైన్యమును జేర్చికొని యతిశీఘ్రముగ నిచటికివచ్చును. కకుత్స్థవంశోద్భవుడగు రాముడు అప్రమేయమగు నీసముద్రమును తన బాణపరంపరలచే స్తంభింపజేసి, ఈ లంకానగరమున బ్రవేశించి రాక్షసుల నందఱిని సంహరించును. అప్పుడు ఆ రామునకు మృత్యువుగాని దేవాసురులుగాని యడ్డపడజాలరు. అట్లువారడ్డపడినను వారలనుగూడసంహరించును. పూజ్యురాలవగు నోసీతాదేవీ! రాముడునిన్నుజూడకుండుటచే గలిగినవ్యసనమను సముద్రమునందుమునిగినవాడగుచు "సింహముచే పీడింపబడిన, ఏనుగువలె" ఎంతమాత్రమును సుఖమును బొందకున్నాడు. ఓసీతాదేవీ! సుందరములైన నేత్రములు గలదియును, దొండపండువంటి పెదవిగలదియును, మనోజ్ఞములగు చెవులపోగులు గలదియును, రమణీయమైనదియును, అప్పుడుదయించిన పున్నమచంద్రునిబోలె నున్నదియును నగు రాముని ముఖమును, అతిశీఘ్రకాలములోనే చూడగలవు. ఇది యథార్థము. మఱియు వాసస్థానములగు, మలయపర్వతము, వింధ్యాచలము, మేరుపర్వతము, మందరపర్వతము, దుర్ద

రపర్వతముమీదను, నాకాహారములగు కందమూలఫలంబులమీదనుబట్టుబెట్టుకొనుచున్నాను. ఓసీతాదేవీ! ప్రస్రవణపర్వతముపైనగూర్చున్నవాఁడై "స్వర్గమున నైరావతముపైగూర్చున్న దేవేంద్రునివలె నున్నవాఁడగు" శ్రీరాము నిశీఘ్రకాలములో నేఁజూడగలవు. ఓదేవీ! నిన్నెడబాసినది మొదలు రాముఁడుమాంసముభక్షింపఁడు మధుపానము జేయఁడు. రాముడు వానప్రస్థాశ్రమమునందున్నవాఁడై, యిచ్ఛవచ్చినట్లుభుజింపక నియతాహారుఁడై, ప్రాతస్సంగవ మధ్యాహ్నాపరాహ్ణసాయంకాలములను నీయైదు కాలములలోనైదవదియగు సాయంకాలమున వన్యములగుకందమూలఫలములను ఆహారముగనంగీకరించుచున్నాఁడు. ఓసీతాదేవీ! రాముఁడునిరంతరమును తనహృదయమునందు నిన్నుధ్యానింపుచుమైమఱచినవాఁడైయుండి తన దేహమునందు ప్రాకెడిమిడతయీఁగలనుగాని, దోమలనుగాని పాములుమొదలగు మఱియేసరీసృపములనుగాని, తోలడములేదు. మఱియునిన్నెడబాసినదిమొదలు కామపరవశుఁడై నిరంతరమునిన్నేధ్యానించుచు, ఎల్లప్పుడునీకొఱకయ్యేదుఃఖించుచునితరమైన, దేనినిగానికోరంచమైననుతలఁపఁడు పురుషోత్తముఁడగురాముఁడెప్పుడును నిద్రించుటయేలేదు అట్లొకవేళ గొంచమునిద్రించినను సీతా! సీతా! సీతా! యనిమనోవాక్యముగబలుకుచులేచును. ఓతల్లీ! సీతాదేవీ! రామచంద్రుఁడేదైనమనోజ్ఞమగు పుష్పమునుగాని, ఫలమునుగాని, యింకయితరవస్తువులనుగాని జూచినప్పుడు "హా! నాప్రియురాలా! ఈవస్తువననుభవించుటకునీవులేకపోతివిగదా? యనినిట్టూర్పులువిడుచుచు ననేకవిధములవిలపించును ఓదేవీ! మహాపరాక్రమశాలియును రాచకొమారుఁడునునగు రాముఁడు వానప్రస్థాశ్రమమునందున్నవాఁడగుచు నిరంతరమునునిన్నుగుఱించియే పరితపించుచు "సీతా! సీతా! సీతా! యనినిన్నేబేరొనుచునిన్నుబొందుటకై నిరంతరమును తగుమైనప్రయత్నములను జేయుచున్నాఁడు. అనియిట్లనేకవిధముల ఆంజనేయుఁడుచెప్పగవిని జనకమహారాజుకూఁతురగు సీతాదేవిరామునిచరిత్రమునువినుటచే వ్యసనములేనిదయ్యెను, రాముఁడుతననిమిత్తమై నిరంతరమునుదుఃఖించుచున్నాఁడనివినుటచే నా రామునిదుఃఖమునకు సమానమైన వ్యసనముగలదియగుచు శరద్రుతువుయొక్క ప్రారంభమునందు అల్పమేఘముచే గప్పఁబడినచంద్రునితోగూడుకొనియుండురాత్రివలె ప్రకాశించియుప్రకాశింపకయుండెను.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదియాఱవసర్గము ముగిసెను.

ఆంజనేయుఁడు సీతాదేవితో నన్నువీపుమీద నెక్కించుకొనిపోయి రామునివద్దవిడిచిపెట్టెదనని చెప్పుట.

నిండుచంద్రునితో సరిపోలు మోముగలసీతాదేవి, ఆంజనేయుఁడు జెప్పినయామాటలనువిని మిగులధర్మార్థసహి

…నరుఁడవగు నోయాంజనేయా! రాముఁడితరవస్తువులయందు మనస్సులేనివాడగుచు నిరంతరమునన్నేధ్యానించుచున్నాఁడనియును, శోకమేముఖ్యమైనగతిగాఁగలిగియున్నాఁడనిజెప్పితివి కావుననమృతమునువిషమునుగలిపినట్లు, ఈరెండుమాటలు నాకుపరమసంతోషమును పరమదుఃఖమునుగలుగజేయుచున్నవి. శ్లో॥ ఐశ్వర్యేవాసు విస్తీర్ణే వ్యసనేవాతి దారుణే। రజ్జ్వేవపురుషంబద్ధ్వా కృతాంతః పరికర్షతి॥ మిగులనధికమగు నైశ్వర్యమునందుగాని, మహాభయంకరమగు వ్యసనమునందుగాని, దైవముకారణముగానివేరుగాదు పురుషప్రయత్నమేమియును లేదు. దైవముత్రాటిచేగట్టియీడ్చికొనిపోవునట్లు గాన్పించుచున్నది. శ్లో॥ విధిర్నూనమసంహార్యః ప్రాణినాంప్లవగోత్తమ॥ వానరోత్తముఁడవగునో యాంజనేయుఁడా! కావునసమస్తప్రాణులకును విధినిఅతిక్రమింపశక్యముగాదు. ఇదినిశ్చయము ఇప్పుడులక్ష్మణుఁడును, రాముఁడును, నేనును, మేముముగ్గురమును, ఎట్లుదుఃఖముననుభవించుచున్నామో చూడుము. "సముద్రమునందుపగిలిపోయిననోడగలవాఁడును, ఆధారమేమియునులేక యీదులాడుచున్నవాఁడును, మిగులఅలసిదరిగానకతపించుచున్నవాఁడునునగు మానవుఁడుగట్టునుజూచినట్లు" రాముఁడు ఎప్పుడీదుఃఖసముద్రమునకుదరిగాంచును ఓయాంజనేయా! నాపెనిమిటియగురాముఁడు ఎప్పుడీలంకానగరములోప్రవేశించి రావణసమేతముగ సమస్తరాక్షసులనుసంహరించి లంకానగరమునునాశమునుజేసి, నన్నెప్పుడుజూడగలఁడు? రావణాసురుఁడు నాకుసంవత్సరముగడువుపెట్టియున్నాఁడు ఈ సంవత్సరము గడువకమునుపేనీవుపోయి రామునకు ఈవృత్తాంతమునుదెలిపి యతనినిచటికిదోడ్కొనిరమ్ము. త్వరపడుము. నేనుబ్రతికియుండబోవునది సంవత్సరాంతమువరకేగదా, వానరోత్తముఁడవగునో యాంజనేయా! రావణాసురుడొకసంవత్సరకాలము నాకుగడువేర్పరచెను. అందుఇప్పుడు పదియవమాసముజరుగుచున్నది ఇంకరెండుమాసముల కాలముమాత్రమేయున్నది. ఆవెనుకనాదుష్టుడునన్నుసంహరిందును రావణాసురునితమ్ముఁడగు విభీషణుఁడనువాఁడునన్నుమరలరామునకుసమర్పింపుమని యనేకవిధములఁబ్రేరేపించె. అతనిమాటనెంతమాత్రమును వి

నకవశ్యే నన్నుమఱల శ్రీరామునకు నిచ్చుటకు రావణాసురునకు సమ్మతిలేదు. కాలపరిపక్వమైయుండెడు రావణాసురుని యుద్ధమునందు దీసికొనిపోవుటకు మృత్యువు వెదకుచున్నదేమో? కావుననే వాదుష్టుడు తమ్మునిమాటగూడవినడవ్యే ఓ ఆంజనేయా! విభీషణుని పెద్దకుమార్తెయగు నలయను వదియొకతెగలదు. అది తనతల్లి పంపగా నాదగ్గరకువచ్చి యీవృత్తాంతమంతయు నాతో జెప్పెను. వానరోత్తముఁడవగునో యాంజనేయుఁడా! నా పెనిమిటియగు రామచంద్రుఁడు అతిశీఘ్రకాలముననే నన్ను బొందగలడు. ఇందుదుసంశయములేదు. ఏలననగా నాయంతరాత్మ మిగులపరిశుద్ధముగనున్నది. ఇదియునుగాక రామునియందు అనేకసుగుణములుగలవు. ఓయాంజనేయుఁడా! కార్యములుశేయుటయందుత్సాహమును, పురుషప్రయత్నమును, బలమును, క్రూరములేకుండుటయును, చేసినమేలు మరవకుండుటయును, పరాక్రమమును, మహిమయును మొదలగు గుణసమూహములుపూర్ణములై యున్నవి. మఱియుజనస్థానమునతమ్మునిసహాయములేకుండ ఒక్కడే పదునాలుగువేల రాక్షసవీరులను సంహరించె. కావునట్టి రామునకు శత్రువగువాఁడెవ్వఁడుదుఃఖింపకుండును? ఓయాంజనేయుఁడా! పురుషోత్తముఁడగు రాముఁడు, ఎట్టిదుఃఖములయందైనను చలింపడు. "దేవేంద్రుని ప్రభావమును శచీదేవి యెఱిగినట్లు" శ్రీరాముని ప్రభావంబునేనెఱుంగుదును. ఓయాంజనేయుఁడా! యుద్ధవీరుఁడును, బాణసమూహములనెడి కిరణములుగలవాఁడును నగు రామచంద్రుఁడనుసూర్యుఁడు, శత్రువులగు రాక్షససమూహములనెడి నీటితోనిండియుండెడులంకయను నీసరోవరమునుయెండిపోవునట్లుశేయును. (అనగా శ్రీరాముఁడు తన బాణపరంపరలచే నీలంకానగరమునందు రాక్షసులనందఱిని సంహరించును) అనిసీతాదేవి యాంజనేయునితో జెప్పె. ఇట్లనేకప్రకారములుగ జెప్పుచున్నదియును, రాముని కొఱకై నవ్యసనముచే మిగులపీడనొంది కృశించినదియును, కన్నీళ్ళచేనిండినముఖముగలదియును, నగు నాసీతాదేవినిచూచియాంజనేయుండిట్లనియె

ఓసీతాదేవీ! నేనిచటనుండిపోయి యీవృత్తాంతమును దెలిపితినేని రాముడువిన్నంతనే, మిగులగొప్పదియగు వానరభల్లూకములయొక్క సేనను గూర్చుకొని యతిశీఘ్రముగనిచటికివచ్చును. సుందరమైనముఖముగల యోసీతాదేవీ! అంతవరకునీవుఓర్చి యుండజాలవేని, యిప్పుడె నిన్నీదుఃఖమునసుండితొలిగించెదను. అనింద్యమైన నడవడికగలయోసీతాదేవీ! నీవిప్పుడు నావీపుపైనెక్కుము. నిన్నునావీపుమీదనెక్కించుకొని సముద్రమును ఒక్కపెట్టున దాటెదను. నేను రావణాసురుఁడు మొదలగు వారితోటనీలంకానగరమునుగూడ మోసికొనిపోగలను. ఓతల్లీ! సీతాదేవీ! "అగ్నిపుత్రుఁడు హోమమునందు వేల్వఁబడినహవిస్సునుదీసికొనిపోయి యింద్రునకిచ్చునట్లు" నేనునిన్నుఎత్తికొనిపోయి ప్రస్రవణపర్వతమునందుండెడు శ్రీరామచంద్రునకు సమర్పించెదను. ఓసీతాదేవీ! నీవుయిందులకుఒప్పికొందువేని, లక్ష్మణసమేతుఁడైయున్నవాఁడును, రాక్షసులను సంహరించుటయందు ఉద్యోగించుచున్నవాఁడును, విష్ణుదేవునివలెనున్నవాఁడును, నగు రాముని యిప్పుడే చూచెదవు. మఱియు, నిన్నుచూచుటయందు మిగులనుత్సాహముగలవాఁడును, మహాబలపరాక్రమశాలియును, వానప్రస్థాశ్రమమునందున్నవాఁడును, ప్రస్రవణపర్వతముపై గూర్చుండియుండుటచే "గజోత్తమమగు నైరావతముపై గూర్చున్నదేవేంద్రునివలె" నన్నవాఁడునునగు రామునిశీఘ్రముగనిప్పుడే చూడగలవు. మంగళకరురాలవగునోతల్లీ! సీతాదేవీ! నావీపుమీదనెక్కుము. ఉపేక్షజేయవలదు. "రోహిణీదేవిచంద్రునితో గూడుకొనినట్లు" నీవు రామునితోఁ జేరుము నీవునావీపుమీదనెక్కుదువేని చంద్రునితోను మిగులకాంతిమంతుఁడగు సూర్యునితోను, మాటలాడుచున్నట్లువలె, ఆకాశమార్గమున సముద్రమును దాటుదము. ఓసీతాదేవీ! నిన్నుఎత్తికొనియతివేగముతో నేను ఆకాశమార్గమునబోవునపుడు యీలంకానగరమునందుండెడువారలలోనొక్కడుగూడ నన్ను వెంబడించిరాజాలడు. ఓతల్లీ! సీతాదేవీ! నేనుఎచ్చోటనునిలువక అతివేగముగనాకాశమార్గమున ఎట్లుయీలంకానగరమునకువచ్చితినో, అట్లే నిన్నుఎత్తికొనిపోయెదను. నీవుసంశయింపవలదు. నామాటవినుము అనియిట్లు వానరోత్తముఁడగునాంజనేయుఁడు జెప్పగవినిసీతాదేవి పరమాశ్చర్యమునుబొంది సంతోషాతిశయముచేగగుర్పాటునొందిన సర్వావయవములు గలదియైహనుమంతునిజూచియిట్లనియె

వానరోత్తముఁడవగు నోయాంజనేయుఁడా! నీవుచక్కగా యోచింపక అతిదూరమగుమార్గముగల యీసముద్రముమీద నన్నుమోసికొని పోయెదనని చెప్పెదవే, అందుచేత నేనీకువానరత్వముప్రాప్తించినదని దలంచెదను. వానరర్షభుఁడవగు నోయాంజనేయుఁడా! నీవుమిగులఅల్పశరీరముగలవాఁడవు. ఇచటనుండినాపెనిమిటియగు శ్రీరామునిసన్నిధానమునకు నీవునన్నెట్లు ఎత్తికొనిపోవుటకుగోరుచున్నావు? అనియిట్లుసీతాదేవి మిగులపరిహాసముగ జెప్పిన విని, వాయుపుత్రుఁడును మిగులకాంతిసమన్వితుఁడును న

గునాంజనేయుడు తనకుగ్రొత్తగ ప్రాప్తించిన అవమానమునుగుఱించి యిట్లనియాలోచించె.

నల్లని నేత్రములుగల యీసీతాదేవి నాబలమునుగాని, మహిమనుగాని చక్కగా నెఱుఁగదు. అందువలననిట్లు జెప్పినది. కావున నాయొక్క నిజరూపమును నీసీతాదేవికిజూపించెదననియాలోచించె. శత్రువులను సంహరించువాఁడును, వానరోత్తముఁడును నగునాంజనేయుఁడిట్లుచింతించి తన యథార్థరూపమును సీతాదేవికిజూపుటకు ఉద్యుక్తుఁడయ్యె. ధీమంతుఁడును, వానరశ్రేష్ఠుఁడును, నగునాంజనేయుఁడు తనస్వరూపమును సీతాదేవికిఁజూపింపదలచి యావృక్షముమీదనుండిమీఁదకెగిరి, సీతాదేవికి నమ్మకము గలుగుటకొఱకు తన దేహమును పెంచుటకారంభించె. అట్లువృద్ధినిబొందుచు మేరుమందరపర్వతములతో సమానమైన దేహముగలవాఁడును, మండుచున్న యగ్నిహోత్రముయొక్క కాంతివంటికాంతిగలవాఁడునునై, సీతాదేవిముందరనిలిచె మఱియుపర్వతముతో సమానమైనవాఁడును, ఎఱ్ఱనిముఖముగలవాఁడును, మహాబలముగలవాఁడును, వజ్రమువంటిపండ్లును గోళ్లునుగలవాఁడునునై, భయంకరాకారముతో సీతాదేవిముందరనిలిచె అట్లునిలిచియాంజనేయుఁడు సీతాదేవినిజూచియిట్లనియె

ఓతల్లీ! సీతాదేవీ! సమస్తములైన పర్వతములతోను వనములతోను, కోటబురుజులతోను ప్రాకారములతోనుఁ గూడిన యీలంకానగరమును, దీనికిప్రభువగురావణాసురునితోఁగూడ, ఎత్తికొనిపోవుటకు నాకుశక్తిగలదు. ఓసీతాదేవీ! నాయాకృతినిజూచి భీతినిబొందవలదు. ధైర్యము దెచ్చుకొనుము. ఉపేక్ష జేయకుము, రామలక్ష్మణులదుఃఖమునుబోగొట్టుము అనియాంజనేయుఁడుజెప్పగవిని, విశాలములగు నేత్రములుగలదియును, జనకమహారాజపుత్రికయును, నగుసీతాదేవి, మిగులభయంకరాకారముగనున్నవాఁడును, వాయుదేవునియొక్క ఔరసపుత్రుఁడును, నగుహనుమంతునిజూచి యిట్లనియె.

గొప్పవానరుఁడవగు నోయాంజనేయా! నీబలపరాక్రమములును, వాయువుతో సమానమగువేగమును, అగ్నిహోత్రునకుంబోలె మిగులనాశ్చర్యకరమగు తేజస్సును, తెస్సగనెఱిగితిని. వానరశ్రేష్ఠుఁడవగు నాంజనేయుఁడా సామాన్యుఁడగు అన్యమనుజుఁడు అపారమగు నీమహాసముద్రముయొక్క యివ్వలిగట్టగునీభూమికిరాజాలఁడు. నీవిచటనుండితప్పించుకొని నన్నుఎత్తికొనిపోవుటయందు శక్తిగలవాడవనితెలుగుదును. మహాత్ముఁడగు రామునికార్యముశీఘ్రముగనెరవేరునట్లు అవశ్యముగ విచారింపవలయును పాపరహితుఁడవును వానరోత్తముఁడవును, నగునాంజనేయుఁడా! నీతోఁగూడ నేనువచ్చుటయుక్తముగాదు. నీవువాయువేగమనోవేగములతో నాకాశమార్గమునసముద్రముమీదగబోవునపుడు ఆవేగముచేభ్రమనుబొంది యాకాశమార్గమునబోవుచున్న నీవీపుమీదనుండి భయమువలన సముద్రములోబడుదును. అంతనేను తిమింగలములతోను, మొసళ్లతోను, చేపలతోను, నిండియుండెడు సముద్రమునందుపడి వివశురాలనైనంతనే, యందుండుజలజంతువులునన్నుభక్షించును. శత్రువులనుసంహరించునట్టి యాంజనేయుఁడా! నీతోఁగూడవచ్చుటకునాకిష్టములేదు. ఏలననగా, నీవునన్నుఎత్తికొనిపోవునపుడు ఏదేనియాపదసంభవించెనేని, నన్నురక్షించుచు, నీవుతప్పించుకొనువిషయమై నాకుసందేహముగలుగుచున్నది ఇందుకుసంశయములేదు. మఱియునీవు నన్నుఎత్తికొనిపోవుచుండగజూచి భయంకరమైనపరాక్రమముగల యీరాక్షసులు దురాత్ముఁడగురావణాసురునిచే ప్రేరేపింపఁబడినవారై యతనియాజ్ఞచేనిన్నువెంబడించివత్తురు. శౌర్యవంతుఁడవగు నోయాంజనేయా! యుద్ధవీరులగు రాక్షసులు శూలములను, ముద్గరములను ధరించి నిన్నుపరివేష్టించినపుడు నీచేరక్షింపఁబడవలసినదాననగు, నన్నుగాపాడుకొనుచు వారితోయుద్ధముజేయుటకు సందేహమునుబొందుదువు. అనేకమందిరాక్షసులుఆయుధపాణులై ఆకాశమార్గమున నిన్నడ్డగించినచోనీవుఒక్కఁడవు నిరాయుధుఁడవైవారలతోపోరుచు, నన్నెట్లు రక్షింతువు? వానరోత్తముఁడవగు నోయాంజనేయుఁడా! మిగులక్రూరకార్యములను జేయువారగురాక్షసులతో నీవుపోరుచుండగ నేనుభయభ్రాంతురాలనై నీవీపుమీదనుండి క్రిందపడినను, పడుదును. కాదేని, మిగులక్రూరులునుభయంకరాకారులును, ఎక్కుడుబలముగలవారును, నగురాక్షసులునిన్నొకవేళ జయించినను జయింతురు. ఓకపిసత్తమా! ఆంజనేయా! అదియునుగాదేని, నీవువారలతోయుద్ధముజేయుచు వివశుఁడవైయుండునపుడైనను నేనుక్రిందపడుదును పడగానే యీక్రూరరాక్షసులు నన్నుఎత్తికొనిపోదురు. అదియునుగాదేని॥ శ్లో॥ అవ్యవస్థౌహిదృశ్యేతేయుద్ధేజయపరాజయౌ ॥ యుద్ధమునందు జయాపజయములు అవ్యవస్థములు కావుననీకు అపజయముగలిగెనేని నీచేతినుండియే, నన్నుదీసికొనినరికివేసినను నరికివేయుదురు. అదియునుగాదేని అప్పుడు రాక్షసులునన్నుబాధింతురు నేను మహాఆపదను బొందినను బొందుదును. వానరోత్తముఁడవగునోయాంజనేయుఁడా! అంతనీప్రయత్నములన్నియు నిష్ఫలములగును. మఱియునొకవిశేషమును జెప్పెదవినుము.

నీవుసమస్తరాక్షసులనుసంహరించి, నన్నుఎత్తికొనిపోవస
మర్థుఁడవేయగుదువు. అందుకుసంశయములేదు. నీవురా
క్షసులనుజంపుటచేతనే రామునకుకీర్తినశించును. అదియు
నుగాదేని రాక్షసులునన్నెత్తికొనిపోయి వానరులుగాని,
రామలక్ష్మణులుగాని. తెలిసికొనఁజాలని, యొకరహస్యస్థ
లమునందు దాచుదురుగదా, అంతనాకొఱకు నీవుజేసి
నయీప్రయత్నములన్నియు విఫలములైపోవును కావుననీ
విచటనుండిపోయి రామునివెంటఁబెట్టుకొనివత్తువేని మిగుల
మేలుగలుగునుగదా! మహాబాహుఁడవగు నోయాంజనేయు
డా! మహాబాహుఁడగురాముఁడును నతనితమ్ముఁడును. వా
నరరాజగుసుగ్రీవుడును తక్కినవనచరులును నాక్షేమము
ననుసరించియే ప్రాణములనునిలిపికొని యున్నారుగదా?
కావున నాకేదేనియపాయముసంభవించెనేని, నానిమిత్త
మై మిగులవ్యసనముతోఁగృశించుచుండెడు రామలక్ష్మణులు
ను, సమస్తములగు వానరభల్లూకసైన్యములును, ప్రాణ
ములువిడుతురు. ఇదియునుగాక నింకొకవిశేషము గల
దు. శ్లో॥ భర్తుర్భక్తింపురస్కృత్య రామాదన్యస్యవాన
ర । నస్పృశామికీరింతు పుంసోవానరపుంగవ॥ వాన
రోత్తముఁడవగు నోయాంజనేయుఁడా! నేనుపతిభక్తిగల
దాననై రామునిదప్ప యితరపురుషునియొక్క దేహమును
ముట్టను అయితేనిన్నురావణాసురుడు తాకలేదా? అని
యందువేమో? అప్పడునేనుతప్పించుకొనుటకు సమర్థురా
లనుగాకయుంటిని. మఱియురక్షించువాడగు నాభర్తదగ్గి
రలేకయుండెను. నేనుదేహముదెలియక వివశురాలనై
యుంటిని. కావుననేనేమిసేయగలను కాబట్టియిభ్రుడురా
ముఁడిచటికివచ్చి రావణాసురుని బంధుమిత్రసమేతముగ
సంహరించి నన్నుదీసికొనిపోవునేని, యదియేయీరావ
ణాసురుఁడు సేసినదుష్కర్మకు తగినప్రతీకారముగనుండు
ను ఓయాంజనేయుఁడా! మహాత్ముఁడును, యుద్ధమునం
దువిరోధులను సంహరించువాఁడును నగునారాముని యొ
క్క పరాక్రమమును వినియున్నాను. చూడనుగూడచూచి
యున్నాను. దేవదానవ గంధర్వపన్నగులెవరును యుద్ధ
మునందు ఆరామునితోసమానులుగారు. యుద్ధమునందు
నానావిధములగు గతులుగలధనుస్సుగలవాఁడును, మహా
బలముగలవాడును, ఇంద్రునిపరాక్రమముతో సమానమైన
పరాక్రమముగలవాఁడును, లక్ష్మణసమేతుఁడై వాయువు
చేప్రేరేపింపఁబడిన యగ్నిహోత్రునివలె నున్నవాఁడు
ను, నగురామునియుద్ధమునం దెవ్వడెదిరింపగలడు వాన
రోత్తముఁడవగు నోయాంజనేయుఁడా! లక్ష్మణసమేతుఁడై
యున్నవాఁడును, విరోధులనుయుద్ధమునందు సంహరించు
వాఁడును, మదించినదిగ్గజమువలె నున్నవాఁడును, సూర్య
కిరణములవంటి బాణసమూహములుగలవాఁడై ప్రళయ
కాలమునందలి సూర్యునివలెనున్నవాఁడును, నగురాముని
యుద్ధమునం దెవడుజయింపసమర్థుఁడగును? ఓవానరశ్రే
ష్ఠుడా! ఆంజనేయా! నీవుపోయి, లక్ష్మణసమేతుఁడైయు
న్నవాఁడును, వానరసమూహముల కధిపతులగువారలతో
గూడియున్నవాఁడును, నగునాపెనిమిటిని యతివేగముగని
చటికిదీసికొనిరమ్ము. ఓవానరముఖ్యుఁడా! ఆంజనేయా! బ
హుకాలముగ దుఃఖముచేఁ గృశించుచుండెడు నన్నురా
మునితోఁజేర్చి సంతసింపఁజేయుము. అనియిట్లు సీతాదే
విచెప్పె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదియేడవస
ర్గముగిసెను

ఆంజనేయుఁడు సీతాదేవినిరామునకొకగురుతుయిమ్మనిఅడుగుట.

అంత మాటలాడుటయందు మిగులపండితుఁడును, వా
నరోత్తముఁడును నగునాంజనేయుఁడు సీతాదేవిజెప్పిన
మాటవిని మిగులసంతసించి సీతాదేవినిజూచి యిట్లనియె.
మంగళస్వరూపురాలవగు నోసీతాదేవీ! నీవునీస్త్రీత్వ
మునకును, పాతివ్రత్యలక్షణమునకును, అణకువకును, స
దాచారసంపన్నతకును దగినట్లుబలికితివి నీవునావీపుపైనె
క్కి నూరుయోజనముల విస్తీర్ణముగలసముద్రమును దా
టుటకుస్త్రీయగు నీకెంతమాత్రమును సాధ్యముగాదుగదా
యనుటనిశ్చయమేను మిగులవినయముగలతల్లీ! సీతాదేవీ!
రామునిదప్ప యితరపురుషుని తాకనని చెప్పిన రెండవకార
ణము మిగులమహాత్ముఁడగు నారామునిభార్యవగు నీకుత
గియున్నది. సీతాదేవీ! నీవుదప్పఅన్యురాలగు, ఏస్త్రీయి
ట్టివాక్యమునుజెప్పును. ఓతల్లీ! సీతాదేవీ! నాముందఱనీవే
కార్యమునుజేసితివో (అనగా రామవియోగ దుఃఖాతుర
వై ప్రాణములనువిడుచుటకు తలవెంట్రుకలచేమఱిబోసి
కొనవెత్నించితివో) దానిని;నీవుజెప్పినమాటలను (అనగా
రావణాసురునిలక్ష్యపెట్టక వాడుచెప్పినదుష్టములగుమాట
లకన్నిటికినిబదులుగ వానినిదూషించుటయును, నావీపుమీ
దనెక్కి సముద్రమునుదాటి రానను ట మొదలగు మా
టలను) ఈమొదలగుసమస్తకార్యములును, రామునకునిర
వశేషముగనెఱిఁగించెద. ఓసీతాదేవీ! అనేకహేతువుల
చేతను, రామునియందలి స్నేహాతిశయముచేతను, నామ
నస్సునకుజాలిపుట్టి ఎవ్విధముచేనైనను రామునకుమేలు
జేయవలయునను గోరికతోనిట్టిమాటనుజెప్పితినిగాని వేరు

గాదు. లంకానగరమునందు ప్రవేశించుటకు ఎవ్వరికి గానిదుర్లభమనియును, సముద్రమునుదాటుట మహాదుర్లభంబనియును, ప్రసిద్ధముగావున నట్టికార్యమును జేసితని మఱియు నాసామర్థ్యమును దెలుపుటకై యిట్లు జెప్పతినిగాని వేఱుగాదు నిన్ను నేనిప్పుడే రఘువంశోద్భవుడగు ఆ మునితో డగూర్చెదనని, రామునియందలియధిక స్నేహముచేతను భక్తిచేతను, జెప్పితినిగాని వేరుగాదు అనిందితురాలవగు నో తల్లీ! సీతాదేవీ! నీవు నాతోగూడ రామునొద్దకు వచ్చుటకు సమ్మతింపవేని, నేనిచటికివచ్చి నిన్నుజూచితినని తెలియుటకొఱకు, ఏదేనినొక గుఱుతునిమ్ము అనియిట్లాంజనేయుడు జెప్పగవిని, దేవకన్యకతో సమానురాలగు సీతాదేవి వ్యసనముచే డగ్గుత్తికగల మాటలతో నాంజనేయుని జూచి మెల్లమెల్లగా నిట్లనియె.

ఓయాంజనేయుడా! నీకొకయుత్తమమగు గుఱుతునిచ్చెద. నీవుదానినాథర్తయగు రామునకు జెప్పుము. పూర్వము నేను, చిత్రకూట పర్వతమున కీశాన్య భాగమునందు కందమూలఫలములను, జలములను,సమృద్ధముగ గలిగియుండునట్టిదియును, తపస్సిద్ధినొందినవారికి నివాసస్థానమును మందాకినీనదికి సమీపముననున్నట్టి యునువగు నొకచిన్న పర్వతమున తాపసాశ్రమమునందుండగ రహస్యమైన నొక వృత్తాంతము జరిగినది. దానిని నేజెప్పినట్లు శ్రీరామునితో నిట్లని జెప్పుము. ఓరామా! ఆవింధ్యపర్వతముయొక్క ప్రత్యంతపర్వతమునందు పూచిన నానావిధములగు సుహాసనపుష్పములతో నిండియుండెడు ఉద్యానవనములయందు సంచరించుచుండి యలసితిని. అప్పుడు నీవటబోయగా, నా శ్రమదీర్చుకొనుటకు నీతొడపైగూర్చుంటిని ఆట్టియెడ ఒక కాకి మాంసార్థియై యచటికివచ్చి నాస్తనమధ్యమునబొడిచినది అప్పుడు నేనొకమంటిబెడ్డను ఎత్తికొని యదలించి యాకాకినిదోలితిని అంతట నాకాకి పరుగెత్తిపోక యచ్చటనేదాగియుండి పలుమారువచ్చి నన్ను గీరుచుండినది. ఆ కాకి మాంసముసుభక్షింపగోరి వచ్చినదగుటచే నేనెంత దోలినను పోక యచ్చటనేకాచుకొనియుండి నామాంసమును దినుచుండినది అట్లాకాకిపొడుచుటచే నావస్త్రముజాఱెను. అంత నేను మిగులకోపమునుబొంది వస్త్రము దృఢముగ జేసికొనుటకై మొలనూలునుబిగించుకొనుచుండగ నీవు నన్నుజూచితివి. ఓరామచంద్రా అట్లుకాకిమీద మిగుల కోపమునొందియున్న నన్నుజూచి నీవు పరిహసించితివి అంతనేనుమిగుల లజ్జపడితిని. ఆకాకి అంతటితోపోక మఱల నన్నుపొడవవచ్చిన నేను ఆకాకిని మఱిదోలి నీదగ్గిరకు వచ్చిమిగుల నలసటనొందివదాన నగుటచే నీతొడపై గూర్చుంటిని. అప్పుడు కాకిపై కోపించుకొనియున్న నన్ను, సంతోషముతో పరిహసించుచున్న నీవుమంచిమాటలచే నూరడించితివి. ఓప్రాణనాథా! కాకిచే నవమానింపబడినదానను, మిగులకోపమునొందినదానను, కన్నీళ్ళచే నిండిన మోముగలదానను, తిన్నతిన్నగ కన్నీళ్లు తుడుచుకొనుచున్న దానను, నగుచున్న నీవుజూచితివి. అట్లుజూచినన్ను నీతొడమీద బరుండబెట్టుకొంటివి. అంతనేనలసటచే చాలాసేపు నీతొడపైనిదురించితిని ఆవల కొంతసేపటికి నేను నిదురలేవగా నీవు నాతొడపై నిదురించితివి అంతట నాకాకి మఱలవచ్చినది. అట్లువచ్చినయాకాకి, రాముని తొడపైనుండి నిదురలేచిననన్నుజూచి మఱల నా స్తనమధ్యంబున ముక్కుతో గీరినది నేనుమఱలదరిమినని అంతపోక ఆకాకి పలుమారువచ్చి నా స్తనమధ్యంబునగీరి గాయపరిచినది. అట్లుగాయపరుపగా నాగాయమునుండి కారిన రక్తబిందువులచేతివా రాముడు తడుపబడెను. (అనగానా రక్తబిందువులు రాముని మీదబడెను) అట్లాకాకి నన్ను మిగుల దుఃఖింపజేయుటచే, శ్రీమంతుడును, సుఖముగ నిదురించుచున్నవాడును, విరోధులను తపింపజేయువాడును, నగు నారామచంద్రుని నిదురలేపితిని. మహాబాహుడగు రాముడప్పుడు స్తనమధ్యంబున బాధింపబడి నెత్తురు గారుచుండెడు స్తనములతోనున్న నన్నుజూచి, మహాకోపమునుబొంది త్రాచుపామువలె నిట్టూర్పులను విడుచుచు యిట్లనియె.

ఏనుగుతొండమువంటి తొడలుగల యోసీతా! నీ స్తనమధ్యమున నెవ్వడిట్లుగీరె? ఎవ్వడుకోపమునుబొందిన ఐదుతలలపాముతో చెల్లాటములాడుచున్నాడు? అనియిట్లడిగియా రాముడు నలుదిక్కులనుజూచి, నెత్తురుతోనిండి మిగుల కఱకైనగోళ్లుగలిగి నాయెదుట గూర్చుండియుండిన కాకమునుజూచె. అట్లుజూచి యావాయసమింద్రుని పుత్రుడనియు, పక్షులలో మిగులనుత్తముడనియు, పర్వతప్రదేశములయందు సంచరించువాడనియు, వేగమునవాయుదేవునకు సమానుడనియును రాముడు నాతో జెప్పె. అట్లుజెప్పి బుద్ధిమంతులలో నుత్తముడును, మహాబాహుడును, నగు రాముడు కోపముచే నేత్రములను గిరగిరద్రిప్పుచు నావాయసమునుజంప నుద్యమించె. అట్లు ఎత్నించి తనదర్భాసనమునుండి యొకదర్భనుదీసికొని దానిని బ్రహ్మాస్త్రముచే నభిమంత్రించి ప్రయోగించె. అంతనాదర్భ "ప్రళయకాలాగ్నిహోత్రంబువలె" ప్రజ్వలింపుచు నావాయసమున కెదురై నిలిచె అట్లెదుటనిలిచిన యాదర్భను రాముడాకాకిపైవైచె. అట్లు వేయగానావాయసము లేచి యాకాశమార్గమున నెగిరిపోవుచుండె. అంతఆదర్భయును కాకిని వెంబడించుచు

కాశమార్గమున చనుముకొని పోయెను. అట్లు దర్భచే దరుమబడినదియై యాకాకియనేకచోట్లకుబోయెను. మఱియు తనకెవ్వరైన రక్షకులు గలుగుదురేమోయని లోకములన్నియును దిరిగి సంచరించె. అట్లులోకములందంతటను తిరిగి యెచ్చటను రక్షకులుగానక తనతండ్రియగు నింద్రుని యొద్దకు బోయెను. అంత దేవేంద్రుడు నిన్నుగాపాడుటకు నాచేత గాదనియె. సమస్తదేవతలును పూజ్యులగు మహర్షులును గాపాడలేమనిరి. అంతనాకాకి ముల్లోకములను సంచరించి యెందును రక్షకునిగానక మఱల రామునొద్దకే వచ్చి ప్రదక్షిణపూర్వకముగ నమస్కారంబుగావించి నిన్ను శరణుజొచ్చితినని వేడుకొనియె. అంతశరణాగతవత్సలుడగు రాముడు శరణుజొచ్చి నేలపైబడియున్న యాకాక చంపదగినదైనను మిగులదయచేత రక్షించె. ఆకాకియును సమస్తలోకములను సంచరించి యెందునరక్షకునిగానకరాముని యొద్దకేవచ్చె మిగులపరితాపమునొంది దుఃఖితుండై తనదగ్గరకువచ్చిన యాకాకినిజూచి రాముడిట్లనియె

ఓకాకమా! బ్రహ్మాయేయధిదేవతగాగల యీయస్త్రము వ్యర్థముజేయదగినదికాదు కావునయిప్పుడేమిసేయవచ్చునని రాముడుచెప్పిన వాయస మిట్లనియె ఓరామచంద్రా! నీబ్రహ్మాస్త్రము నాకుడికంటిని బాధించుగాకనియె. అంతనాబ్రహ్మాస్త్రము ఆవాయసముయొక్క కుడికంటిని పోగొట్టె అట్లాకాకి తనకుడికంటిని పోగొట్టుకొని ప్రాణములనురక్షించుకొనియె. పిదప యాకాకి రామునకును దశరథమహారాజునకును నమస్కారమును చేసి రామునిచే సెలవుగైకొని తననివాసస్థానమునకుబోయెను. అట్టిరాముడిపుడు నాపైమేలదయలేకున్నవాడు. అనియిట్లనేక ప్రకారములచింతించి రాముని నుద్దేశించి సీతాదేవి యిట్లనియె. రాజశ్రేష్ఠుడవగునోరామా! పూర్వము నీవు నాకొఱకు నల్పజంతువగు కాకిమీదగూడ బ్రహ్మాస్త్రమును బ్రయోగించితివి, అట్టినీవు నీదగ్గిరనుండిన నన్నపహరించిన మహాపరాధియగు రావణాసురుని యేలక్షమించియున్నావు? పురుషశ్రేష్ఠుడవగురాముడా! నీకు అపకారమునుజేసిన కాకినిగూడ దయతోరక్షించి ఖ్యాతినొందిన నీవు పరమోత్సాహముగలవాడవై నాయందు దయజూపుము. ఓప్రాణనాథా! రామచంద్రా! నీవునాకునాథుడవయ్యును నేనిట్లనాథవలె దిక్కులేకయుండుట బాగుగానున్నదా? శ్లో॥ ఆనృశంస్యంపరోధర్మస్త్వత్తఏవమయాశ్రుతః,, క్రూరత్వములేక దయగలిగియుండుట ధర్మములోనెల్లనుత్తమధర్మమని నీవేజెప్పుచుండగను వినియున్నాను ఓరామా! నీవు మహాపరాక్రమశాలివిగను, మిగులనుత్సాహముగలవాడవుగను, మహాబలముగలవాడవుగను, అనంతుడవుగను, ఎట్టికష్టమునందైనను కలతనొందనివాడవుగను, గంభీరమున సముద్రునితోసమానుడవుగను, ప్రపంచమునకంతయు ప్రభుడవుగను, దేవేంద్రునితోసమానుడవుగను, ఉన్నావు. నేనుగూర్తెఱుగుదును. అనియిట్లనేకప్రకారముల రాముని నుద్దేశించి విలపించి, సీతాదేవి మఱలఆంజనేయునిజూచియిట్లనియె రాముడస్త్రవేత్తలలో నుత్తముడును, మిగుల సత్యవంతుడును, మహాబలముగలవాడును నయ్యును, రాక్షసులపైనస్త్రంబేల ప్రయోగింపడు? యుద్ధమునందు రామునికార్యమునకెదిరించినిలుచుటకు సురాసురులుగాని గంధర్వులుగాని ఉరగులుగాని శక్తులుగారు మహాపరాక్రమశాలియగు నారామునకు నావిషయమై కొంచమైనను ప్రీతిగలదేని మిగులకఱుకైనబాణములచే నీరాక్షసులనందఱినేల సంహరింపకున్నాడు? మహాబలపరాక్రమశాలియును,శత్రువులనుతపింపజేయువాడునునగు లక్ష్మణుడైనను, అన్నయగురాముని అనుజ్ఞనుబొంది యిచటికివచ్చి నన్నేలగాపాడకున్నాడు? పురుషశ్రేష్ఠులును, వాయువహ్నులను, అగ్నికినిబోలె తేజస్సుగలవారును, దేవతలకైన నెదిరింపనలవిగాని వారును, నగువారామలక్ష్మణులిరువురు నొకటిగాజేరి యెందుకేని నావిషయమునందేల దయదలపక నశ్రద్ధగలిగి యున్నారు? ఇదంతయు నేనుజేసిన పాపఫలముగాని వేఱుగాదు ఇందుకెంతమాత్రమును సంశయములేదు. ఏలననగా, శత్రువులను సంహరించునట్టి రామలక్ష్మణులు మిగుల శక్తిమంతులయ్యును,నన్నుఉపేక్షజేయుచున్నారు.గావుననేయిది నాపాపముయొక్క ఫలమేనని యెంచెద. అనియిట్లు సీతాదేవి యాంజనేయునితోజెప్పె. మిగుల పరాక్రమముగలవాడును, వాయుపుత్రుడును, నగు నాంజనేయుడు, సీతాదేవి బొటబొటకన్నీరుగార్చి దుఃఖించుచు మహాదీనురాలై చెప్పిన కనికరింపదగిన మాటలనువిని యిట్లనియె.

ఓతల్లీ! సీతాదేవీ! రామచంద్రుడు నీకొఱకైన వ్యసనముచేతనే యేవస్తువునందును యిష్టములేనివాడై యున్నాడు నేను సత్యముజేసి చెప్పుచున్నాను. ఓదేవీ! రాముడు దుఃఖమును బొందగ జూచి లక్ష్మణుడును మిగుల పరితపించుచున్నాడు. అనింద్యమైన నడవడికగల యోసీతాదేవీ! అతిప్రయాసముచేత నిన్ను నేనుజూచితినిగాన నిదిదుఃఖింపసమయముగాదు నీవిప్పుడు సంతసింపుము. ఓదేవీ! నీవు అతిస్వల్పకాలములోనే సమస్తదుఃఖములనుబాసి సుఖింపగలవు. పురుషోత్తములును, రాజపుత్రులును, మిగుల బలపరాక్రమశాలులును, నిన్నుజూచుటయందు పరమసంతోషముగలవారును, నగురామలక్ష్మణు లిరువురును లంకాన

గరమును భస్మముజేయుదురు, విశాలములగు నేత్రములు గలయోతల్లీసీతాదేవి! రాముడుయుద్ధమునందు రావణా సురువిబంధుమిత్ర సమేతముగ సంహరించి మహోత్సాహముతోనిన్ను అయోధ్యానగరమునకు దీసికొని పోవును

ఇంకనీవు రామునకును, లక్ష్మణునకును శౌర్యవంతుడగు సుగ్రీవునకును, సమస్తములగువానర సమూహమునకును, ఏమిచెప్పదలచెదవో దానిచెప్పుము. అయాంజనేయుడడగవిని, దేవకన్యకతో సమానురాలగు సీతాదేవి వ్యసనముచేబరితపించుచు వానరోత్తముడగు నాంజనేయునిజూచి యిట్లనియె. మనస్వినియైన కౌసల్యాదేవిపుత్రుడును, లోకనాధుడును, నగు రామునినేనడిగినట్లు సుఖంబడుగుము. నాకుగాశిరస్సాష్టాంగ నమస్కారముజేయుము. మిగులనుత్తముడును, సుమిత్రకు పుత్రుడును, నగులక్ష్మణుడు పుష్పమాలికలుమొదలగుభోగ వస్తువులను, సమస్తములను శ్రేష్ఠులైనభార్యలను దాసదాసీజనములను, విశాలమగుభూమియును, పొందగూడనిమైశ్వర్య సంపదయును, తల్లిదండ్రులను, విడిచి వారినిసంతోషింపజేయుటకై రామునివెంబడించియరణ్యమునకువచ్చె మిగులధర్మాత్ముడగు లక్ష్మణుడు, సర్వోత్తమమగు సమస్తసౌఖ్యములను విడిచి రామునితోగూడనరణ్యమునప్రవేశించి, అన్నమాటకు జవదాటక నడుచుకొనుచు వెంటనంటివచ్చె. లక్ష్మణుడు సింహము మూపువంటిమూపుగలవాడు. గొప్పచేతులుగలవాడు. మంచిహృదయముగలవాడు. చూచువారలకు సంతసమునుగలిగించునట్టిరూపుగలవాడు. నన్నుతల్లినిబోలె సేవించుచున్నవాడు. రామునియందు పితృభావముతో నటించుచుండువాడు. రావణాసురుడు నన్నపహరించినపుడు, మహాపరాక్రమశాలియగు లక్ష్మణునకు దెలియదు. లక్ష్మణుడెఱిగియుండెనేని యింత దురవస్థగలుగనేరదు. ఆలక్ష్మణుడు పెద్దలను సేవించువాడు. మహాకాంతిమంతుడు. మిగుల సమర్థుడు. మితభాషి. చూచువారలకు సంతసముబుట్టించువాడు. మిగులశ్రేష్ఠుడు. సమస్తసద్గుణసమూహములచే నామామయగు దశరథునికి సరివచ్చువాడు. రామునికి ప్రియసహోదరుడగు నాలక్ష్మణుడు, నన్నెప్పుడును దుఃఖమునుబొందకుండ సంతసింపజేయుచుండును. మిగులశౌర్యవంతుడగులక్ష్మణుడుఅన్నజెప్పిన కార్యమును తప్పకచేయును. అదియెంత దుర్ఘటంబైనకార్యమైనను చేసిమేతెరును. ఎవ్వనిజూచుటచే రాముండుతన తండ్రియగు దశరథునిగూడ స్మరింపడో, అట్టి లక్ష్మణునినామాటలతో క్షేమమడుగుము. ఆలక్ష్మణుడు మృదుస్వభావముగలవాడు. నిష్కాపట్యమైనవాడు. మిగులదక్షుడు. రామునకత్యంతప్రియుడు. వానరోత్తముడగు నాంజనేయుగా! ఎట్టిప్రయత్నముచేరాముడు నాదుఃఖమును బోగొట్టి నన్ను కాపాడునో యట్టి ప్రయత్నమునుజేసి యీకార్యంబొనగూర్చుటకు నీవుదక్షుడవు. ఓయాంజనేయుడా! నీవుజేయుప్రయత్నముచే రాముడునన్ను దీసికొనిపోవుటయందాసక్తిగలవాడగును. ఓఆంజనేయా! మహాపరాక్రమశాలియునునాభర్తయునునగు రామునితో పలుమారు ఈమాటనే నుజెప్పినట్లు చెప్పుము. ఓదశరథరాజనందనా! రామచంద్రా! నేనింకొక మాసముమాత్రము బ్రతికియుందును ఒకమాసమున కావల నేనెంతమాత్రము బ్రతుకను. ఇదినేను సత్యముజేసి చెప్పుచున్నాను. మహాపరాక్రమ శాలివగునో రామా! " పూర్వమింద్ర సంబంధియగు లక్ష్మి పాతాళమునుబొందగా విష్ణుదేవుడు దేవతలచే బ్రార్థితుండై దానిని దీసికొనివచ్చి యింద్రునకొసగినట్లు "మహాపాపకర్మియగు నీరావణాసురునిచేదీసికొనిపోబడి రాక్షసులరాజ్యలోనుంచబడిననన్ను కాపాడనర్హుండవు. అనిరామునితో నేజెప్పినట్లుచెప్పుము. అనియిట్లుఆంజనేయునితోజెప్పి సీతాదేవితన కొంగునముడుచుకొనియున్న దివ్యమగు చూడామణియను రత్నమునువిప్పి ఆంజనేయునిచేతికియిచ్చి "ఇదిరామునకిమ్ము" అనియిచ్చె అంతమిగుల పరాక్రమశాలియగు నాంజనేయుడు ఆయుత్తమ రత్నమును దీసికొని దానివెనకపార్శ్వమున వెంట్రుకలుదూర్చుట కొఱకు నిర్మింపడియుండు రంధ్రమునందు తనవ్రేలినిదూర్చె అట్టియెడ ఆంజనేయుడు సూక్ష్మరూపమునుధరించి యుండెను కావున, నాచూడామణియొక్క చిన్నరంధ్రము వ్రేలికి సరిపోయె. ఇట్లువానరశ్రేష్ఠుడగు నాంజనేయుడు శిరోరత్న శ్రేష్ఠమును దీసికొని, సీతాదేవికి ప్రదక్షిణపూర్వకముగ నమస్కరించి మిగులనమ్రుడైయొక ప్రక్కగ ఒదిగినిలిచె అట్టియెడ ఆంజనేయుడుసీతాదేవినిచూచుటవలన గలిగిన యధిక సంతోషముచే నిండిన హృదయముగలవాడగుచు శరీరముచేమాత్రమచ్చట నుండెనుగాని, మనస్సు రామునియందు లీనమైయుండె అప్పుడయ్యాంజనేయుడు తనసామర్థ్యముచే సీతాదేవినిజూచి, జనకమహారాజపుత్రికయగు సీతాదేవిచే ధరియింపబడుచుండిన మిగులశ్రేష్ఠమగు నాచూడామణియను రత్నమునుబుచ్చుకొని మహాసంతోషమును బొందినవాడై, గాలిచే గదలింపబడి యాగాలి నిలిచినతోడనే మరల స్థిరత్వమును బొందినగొప్ప పర్వతమువలె, దృఢముగ జేయబడిన మనస్సుగలవాడై మరల రాముని సమీపమునకుబోవుటకు ప్రయత్నించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండము నందలి ముప్పదియెనిమిదవసర్గముగిసెను.

వానరులును, రామలక్ష్మణులును సముద్రమును దాటి రాలేదని సీతాదేవి ఆంజనేయునితో జెప్పుట.

సీతాదేవి మణిశ్రేష్ఠమగు చూడామణిని యాంజనేయునిచేతికిచ్చి మఱల ఆంజనేయునిజూచి యిట్లనియె ఓఆంజనేయా! ఈగురుతు రామునకు లెస్సగ దెలిసినగురుతేయగును. దానినీవు రామచంద్రునకు యిమ్ము. మిగుల పరాక్రమశాలియగు నారామచంద్రుడు యీచూడామణిని నీచేతినుండితీసికొనినతోడనే నాతల్లిని, దశరథమహారాజును, నన్నును, దలచుకొనును ఓ వానరశ్రేష్ఠా! ఆంజనేయా! మహాబుద్ధిశాలివగునీవు ఎట్టులైనను రాముని ప్రోత్సాహపరుపవలయునని మఱల జెప్పుచున్నాను. ఇప్పుడు ఈ కార్యమును ఉపక్రమించుటకు ఏదప్రయత్నమో దానిని లెస్సగ నాలోచింపుము. వానరశ్రేష్ఠుడా! ఆంజనేయా! ఈకార్యమును సంఘటింపజేయుటకు నీవేకర్తవుగాని వేరుగాదు ఓయాంజనేయా! నీవు చేయందగిన ప్రయత్నమును లెస్సగజేసినా దుఃఖమును బోగొట్టుము. ఆలోచించుటయందు మహాబుద్ధిశాలివగు నీవు లెస్సగనాలోచించి చక్కగ బ్రయత్నము జేసినాదుఃఖమును బోగొట్టుము అనిసీతాదేవి జెప్పె. అంతభయంకరమైన పరాక్రమముగలవాడును, వాయుపుత్రుడును, నగు నాంజనేయుడు ఆప్రకారమే జేయుదునని ప్రతిజ్ఞాపూర్వకముగ సీతాదేవికి నమ్మకము జెప్పి శిరస్సుచే నమస్కరించి ప్రయాణమైపోవుటకు బ్రయత్నించె. అంతసీతాదేవి వానరోత్తముడగు నాంజనేయుడు పోవుటకుయత్నించుచున్నాడని తెలుసుకొని గద్గదస్వరముతో ఆంజనేయుని జూచి మఱలయిట్లనియె. ఓయాంజనేయుడా! రామలక్ష్మణులనిద్దఱిని క్షేమమడిగితినని చెప్పుము ఓవానరశ్రేష్ఠా! మంత్రిసమేతుండగు సుగ్రీవుని క్షేమమడిగితినని చెప్పుము. మఱియునచ్చటనుండెడు వానరవృద్ధులకును తక్కినవారలెల్లరకును ధర్మయుక్తముగ క్షేమంబడిగితినని చెప్పుము. ఓఆంజనేయా! రాముడు నన్ను ఇట్టిదుఃఖసముద్రమునుండి తరింపజేయుటకు తగుప్రయత్నము నీవే జేయవలయు. మిగులకీర్తిమంతుడగు రాముడు నేను బ్రతికియుండగనే, నన్ను సన్మానించునట్లు నీవు జేయవలయు శ్లో॥ వాచాధర్మమవాప్నుహి॥ ఓఆంజనేయా! నోటిమాటచే నీవు పుణ్యమును సంపాదించుకొనుము. ఓవానరశ్రేష్ఠా! నీవు నిరంతరము ప్రోత్సాహకరములగు మాటలను జెప్పుదువేని యామాటలచే బురికొల్పబడి రామునియొక్క పురుషప్రయత్నము వృద్ధియగును పిమ్మట నన్ను త్వరగా బొందగలడు. మఱియు నేను జెప్పిన మాటలను నీవు పలుమారు జెప్పుదువేని వాటిని విని శౌర్యవంతుడగు రాముడు నన్ను బొందుటకై యథావిధిగ ప్రయత్నమును జేయును. అనియిట్లు సీతాదేవిచెప్పిన వానరోత్తముడగు నాంజనేయుడువిని శిరస్సునందు చేమోడ్పుగలవాడై యిట్లనియె తల్లీ! సీతాదేవీ! కకుత్స్థ వంశోద్భవుడగు రాముడతిశీఘ్రకాలమునందే, వానరభల్లూక సైన్యములను గూర్చుకొనివచ్చి శత్రువులను జయించి నీదుఃఖమును బోగొట్టును యుద్ధమునందు రాముడు తీక్ష్ణమైన బాణములను ప్రయోగించుచుండగ నెదిరించినిలిచి యుద్ధముచేయువాడు మానవులయందుగాని దేవాసురులయందుగాని యెవ్వడును లేడు. రాముడు యుద్ధమునందు సూర్యునినైనను, ఇంద్రునైనను, యమధర్మరాజునైనను, జయింపసమర్థుడగును ఇకనీవిషయమునందు జెప్పనేల? రాముడు నాలుగుసముద్రములచే జుట్టబడిన నీభూమినంతయు నేలుటకు సమర్థుడగునున్నాడు. ఓసీతాదేవీ! అట్లుండగ నీనిమిత్తముగ రామునకు జయంబేలగలుగదు అని చెప్పి ప్రయాణంబాయె. అంతసీతాదేవి పైనపైనయాంజనేయుని పలుమారు జూచుచు, తనమగనికి తనయందతి స్నేహముగలదని ఆంజనేయుడు జెప్పిన స్నేహసమన్వితమైనవాక్యములను విని మహాసంతసమునొందుచుండె. మఱియు ఆంజనేయుడు బల్కినదియును మనస్సునకింపైనదియునునగు సత్యవాక్యమును విని యభిమానపురస్సరముగ గౌరవించి మరలయిట్లనియె

శత్రువుల నణగద్రొక్కునట్టి పరాక్రమముగల ఆంజనేయుడా! నీవు శ్రమనుకొంచెము దీర్చుకొనదలంచితివేని పుష్పవృక్షములును తీగెలునుగల ప్రదేశమునందు ఒకదినముండియలసటదీర్చుకొని రేపు పైనమైపొమ్ము. ఓయాంజనేయుడా! నీవట్లు జేయుదువేని మిగుల దౌర్భాగ్యురాలనగు నేను కొంతసేపైనను నీసమీపమున నీతోగూడ యుండుటచే నామహావ్యసనమునకు కొంత శాంతిగనుండును. వానరోత్తముడవగు నోయాంజనేయుడా! నీవు మఱలవచ్చుటకై యిచటనుండి బైలుదేరిపోగా నేనా ప్రాణములకు సంశయము గలుగును. (అనగా నాప్రాణములు నిలుచునో నిలవదోయనుట) ఈవిషయమునందు సంశయములేదు ఓయాంజనేయా! నీవిచ్చటనుండిపోయిన వెనుక నిన్ను జూడకుండుటచే గలిగెడుదుఃఖము పూర్వము నాకు గలిగియుండెడు వ్యసనమునకంటె నధికమై దహించుచున్నదానివలె నన్ను మిగుల తపింపజేయును. వానరోత్తముడవును, మిగుల శౌర్యవంతుడవును. నగు ఆంజనేయా నీకు సహాయులుగ నుండెడు వానరభల్లూకములవిషయమైనాకొక గొప్ప సంశయముగలదు. ఆసంశయము నాయెదుట ఆకారమును ధరించి నిలుచుకొని యున్నట్లున్నది.

ఏమనగా వానరభల్లూకసైన్యములుగాని, రాజపుత్రులగు రామలక్ష్మణులుగాని, మిగుల నసాధ్యమగు నీమహాస

ముద్రమునుఎట్లుదాటగలరు? ఈమహాసముద్రమును దాటుటయందు, గరుత్మంతునకును, వాయుదేవునకును, నీకును, ఈముగ్గురకుమాత్రమేగదా, శక్తిగలదు. మహాపరాక్రమశాలివగు ఆంజనేయా! మిగులనసాధ్యమగు నీకార్యమును నెరవేర్చుటయందు ఏమియుపాయమును చింతించుచున్నావు? నీవుసమస్తకార్యములయొక్క ఉపాయములను నెఱిఁగినవాఁడవుగదా? కావుననెట్లుసేయుదువో దానినెఱింగింపుము. వైరివీరులసంహరించునట్టి యాంజనేయా! ఈకార్యమునుసాధించుటకు నీవుఒకఁడవెసమర్థుడవు. అయినను ఈకార్యమునునీవేజేసితివేని రానిచేగలిగెడుకీర్తినీకేగలుగునుగాని, శ్రీరామునకురానేరదు. రామునకుగీర్తివచ్చునట్లు చేయవలయును. రాముఁడువానరసైన్యముతోనిచటికివచ్చిరావణునియుద్ధమునందుసంహరించిజయమునుబొందినవాఁడై నన్నుదీసికొని యయోధ్యానగరమునకుబోవునేని యదిరామునిభార్యనైన నాకుమిగులకీర్తికరముగనుండును. మఱియుశత్రువులను సంహరించునట్టివాఁడును, కకుత్స్థవంశోద్భవుఁడును నగు రాముఁడుతనబాణపరంపరలచే నీలంకానగరమునుపాడుజేసి నన్నుదీసికొనిపోవునేని యారాముడెరాక్షసులనుసంహరించి సీతనుదీసికొనిపోయెనను కీర్తియారామునకు వచ్చునట్లుచేయుము. కావునయుద్ధవీరుఁడును, మహాబలపరాక్రమశాలియునునగు నారాముఁడుఎట్లునీచే ప్రేరేపింపఁబడినవాఁడై తనసామర్థ్యమునకుఁదగినట్లుపరాక్రమించునో, అట్లు నీవుజేయవలయునని చెప్పె. అట్లుఅర్థయుక్తమును, తగునైనహేతువుతోగూడినదియునునగు నామాటనుఆంజనేయుఁడువినిసీతాదేవినిజూచియిట్లనియె.

ఓతల్లీ! సీతాదేవీ! వానరభల్లూకసైన్యముల కధిపతియును, వానరోత్తముఁడును, మహాబలపరాక్రమశాలియును, నగుసుగ్రీవుఁడునీకొఱకు ఈకార్యమునువెళ్లైనను సాధింపవలయునని నిశ్చయించియున్నాఁడు. ఓదేవీ! సుగ్రీవుండురాక్షసులను సంహరింపనిచ్ఛగించి, యనేకకోట్లవానరసైన్యమునుగూర్చుకొని శీఘ్రముగ నీలంకానగరమునకురాగలఁడు. దేవీ! మహాబలపరాక్రమశాలులును, మిగులశక్తిమంతులును, మనోవేగమువంటి వేగముగలవారును, మీఁదుగను, క్రిందుగను, అడ్డముగను, మఱియు దశదిశలయందును గమనముగలవారును, నగు వానరులుసుగ్రీవుని యాజ్ఞయందున్నవారు. వారుఅపరిమితమగుశక్తిగలవారుగావునఎంతగొప్పకార్యమునకైనను భీతిఁబొందరు మిగులనుత్సాహముగల యీవానరులువాయుమార్గంబగు నాకాశమార్గమున, సకలసముద్రములతోను పర్వతములతోను గూడిన యీభూమండలమునంతయు పలుమారుచుట్టివచ్చియున్నారు. సుగ్రీవునియొద్దనుండువారలలో నొకఁడైన నాకంటె తక్కువవాఁడులేడు. అచ్చటనుండువారలలో కొందఱునాకంటెనధికులు, తక్కినవారు నాతోసమానులుగనుందురు. శ్లో॥ అహంతావదిహప్రాప్తః కింపునస్తే మహాబలాః। నహిప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతేహీతరేజనాః॥ నేనేయీసముద్రమునుదాటి యిచ్చటికివచ్చితిని కావుననాకంటెనధికబలులగు వానరులుఇచటికిరాగలరనియడుగనేల? ఓతల్లీ! సీతాదేవీ! లోకమునందెచటగాని కార్యమునకు ముందుగనధికులనుబంపరు. ఎప్పుడుగాని సహజమైనవారలనుబంపుదురు. ఓసీతాదేవీ! నీవుపరితాపమునుబొందవలదు. దుఃఖమునువిడువుము వానరోత్తములందఱునొక్కగంతున నీలంకానగరమునజేరగలరు. పురుషశ్రేష్ఠులును, మహాబలముగలవారును, నగురామలక్ష్మణులిద్దఱును నావీపుమీదనెక్కియొక్కటిగ నుదయించిన సూర్యచంద్రులఁబోలె నీలంకానగరమునకురాగలరు మఱియుమిగులశౌర్యవంతులును, పురుషోత్తములును, నగు రామలక్ష్మణులిద్దఱును నీలంకాపట్టణమునకువచ్చి బాణపరంపరలచే, నీలంకానగరమును పాడుచేయుదురు. ఓ శ్రేష్ఠురాలా! తల్లీ! సీతాదేవీ! రఘువంశోద్భవుఁడగు రాముఁడుబంధుసమేతముగ రావణాసురునిసంహరించి నిన్ను అయోధ్యానగరమునకు దీసికొనిపోవును. కావుననెమ్మదిగానుండుము. వ్యసనమునువిడిచి కాలమునెదురుచూచుచుండుము. నీకుశుభంబగుగాక! "ప్రజ్వలించుచున్నయగ్నిహోత్రమువలె ప్రకాశించుచుండెడు రాముని నీవుశీఘ్రకాలములోనేజూడగలవు మఱియు రాముఁడురావణాసురునిపుత్రమిత్రమంత్రులతోగూడజంపును. అంత "రోహిణీదేవిచంద్రునితోగూడినట్లు" నీవురామునితోఁజేరగలవు. ఓసీతాదేవీ! శీఘ్రముగనీవిశోకమును విడువగలవు మఱియురామునిచేఁ జంపఁబడినరావణాసురునిశీఘ్రముగ జూడగలవు. అనియిట్లువాయుపుత్రుఁడైన యాంజనేయుఁడు సీతాదేవినియూరడించి పైనపైపోవుటకుయత్నించి మఱల సీతాదేవితోనిట్లనియె.

ఓతల్లీ! సీతాదేవీ! శత్రుసంహారకుఁడగు రాముఁడుధనుర్బాణములధరించి లక్ష్మణసమేతుఁడై యతిశీఘ్రముగలంకాద్వారమున జేరియుండుటను నీవుజూడగలవు మఱియుగోళ్లునుదంతములను ఆయుధములుగా గలవారును, శౌర్యవంతులును, సింహములకును పెద్దపులులకును బోలెశౌర్యముగలవారును, శ్రేష్ఠములగు యేనుఁగులంబోలెకాంతిగలవారునునగు వానరులందరును గుంపులుగూడ

యాలంకాపుర ద్వారమునందుటను శీఘ్రముగజూడగలవు. మిగులపూజ్యురాలవగునోతల్లీ! సీతాదేవీ! పర్వతములతోను మేఘములతోను సమానమైన శరీరములుగలవారును లంకాద్వీపపుమలయపర్వతపుచరియలయందు సింహనాదము జేయుచున్నవారును, నగుననేకవానరసమూహములనుజూడగలవు. ఓసీతాదేవి! రామచంద్రుఁడును, మిగులభయంకరమగు మన్మథబాణములచే బీడింపఁబడి "సింహముచేబీడింపఁబడిన యేనుఁగుబోలె" యెంతమాత్రమును సుఖమును బొందకున్నాఁడు. ఓదేవీ! నీవిట్లురోదనము జేయవలదు. నీమనస్సునందలివ్యసనము బోవుగాక నాధుడులేనిదానివలె నేలయేడ్చెదవు "శచీదేవికి యింద్రుఁడుబోలె" నీకు రాముఁడు నాధుఁడైయున్నాఁడు. రామునకన్న నధికుఁడితరుడెవ్వఁడును లేడు. లక్ష్మణునితో సమానమైనవాఁడునుగూడ నెవ్వడును లేడు; నీకాశ్రయభూతులగు నన్నదమ్ములిద్దఱును అగ్నిదేవునితోను వాయుదేవునితోను సమానులు. ఓసీతాదేవీ! రాక్షససమూహములకునివాసస్థానమైనదియును, మహాభయంకరమైనదియును నగునీ లంకానగరమునందు బహుకాలము నుండవలసినదిలేదు. నీ పెనిమిటియగు రాముఁడిచటికి అతిశీఘ్రముగ రాగలఁడు. నేనుపోయి యీవృత్తాంతమును రామునకెఱింగించి వానరులతోగూడ నారామునినిచటికిబిలుచుకొని వచ్చువరకును ఓర్చియుండుము. అనియాంజనేయుఁడు సీతాదేవితో జెప్పె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ముప్పదితొమ్మిదవసర్గముగిసెను.

▸(✱)◂

{ రామలక్ష్మణులవద్దకుబోవుటకు ప్రయాణమైన ఆంజనేయునిజూచి సీతాదేవిదుఃఖమునుబట్టజాలక చింతించుట. }

మహాబుద్ధిమంతుఁడును వాయుపుత్రుఁడునునగు నాంజనేయుఁడు జెప్పినవాక్యమువిని దేవకన్యకతో సమానురాలగు సీతాదేవియాంజనేయునిజూచియిట్లనియె.

ఆంజనేయా! మహాసంతోషకరమగు సంగతినిజెప్పునట్టినిన్నుజూచినంతనే, "నగము మొలిచి యెండిపోయిన పైరువానగుఱియుటచే మఱలచిగిర్చివృద్ధిబొందినభూమిసస్యములుగలదిగ నెట్లగునో" అట్లుజీవములేనిదానితో సమానురాలనైననేను అమృతసమానములగు నీవాక్యములచే శరీరమునందు ప్రాణములను ధరించియున్నాను. కావునమదనతాపముతో గూడిన నేనుమిగుల దుఃఖముచే గృశించియుండెడు యీనాయవయవములతో రామునియాలింగనము జేసికొనునట్లు అనుగ్రహింపుము. నాయందుదయయుంచుము. వానరశ్రేష్ఠుఁడవగు నోయాంజనేయా! రాముఁడు కాకిపైగోపించి, ధర్భను బ్రహ్మాస్త్రముగ బ్రయోగించి దానినేత్రమును బోగొట్టెనని నేనుచెప్పినసమాచారము గురుతుగ రామునకు జెప్పుము. మఱియునింకొక గురుతు జెప్పెదవినుము. ఒకనాడు నానొసటిబొట్టు జెడిపోగా మణిశిలయను గైరికధాతువును బొట్టుగా జేసి పెట్టితివిగదా! దానినాలోచించుకొనుము. అనినీగుర్తుగూడ జెప్పుము. మఱియుమిగులశౌర్యముగలవాఁడవును, దేవేంద్రునితోను వరుణదేవునితోను సమానమైనవాఁడవునునగునీవు, రాక్షసునిచేనపహరింపఁబడినదియును రాక్షసులచే బరివేష్టింపఁబడినదియునునగు నీభార్యనైనన్నురక్షింపక యేలయుపేక్షించియున్నావు. ఓప్రాణనాధా! రామా! మహాశ్రేష్ఠమైన యీచూడామణియను శిరోరత్నమును నేనుమహాజాగ్రతగగాపాడితిని. అనఘుఁడవగునోరామా! మిగులదుఃఖసమయమునందుగూడ యీచూడామణినిజూచి నిన్నుజూచినట్టువలె మిగులసంతసించుచుంటిని. మిగులశ్రీమంతంబగు నీచూడామణినిగూడ నీకానవాలుగనిచ్చి పంపుచున్నాను. ఇదివరకు దుఃఖకాలమునం దీచూడామణినిజూచి మిగుల సంతసించుచుంటిని ఇప్పుడు దీనినీకొఱకుబంపినవెనుక మిగులవ్యసనముచే బరితపించుచుండెడు నేనింకమీదనొక నెలకుపిమ్మట నధికముగ బ్రతుకజాలను. ఓరామా! సహింపగూడనియీవ్యసనమును, మిగులభయంకరులగు నీరాక్షసులుబలికెడు కఠినములగు వాక్యములను, నీకొఱకుగాసహించిబ్రతికియున్నాను శత్రుమర్దనుఁడవగునోరామా! ఇంకొకమాసముమాత్రము ప్రాణముతోబ్రతికియుందును. మాసమునకుమీదనొకక్షణమైనను నిన్నువిడిచి బ్రతికియుండజాలను. రాజపుత్రుడా! ప్రాణనాధా! రామా! రాక్షసేశ్వరుఁడగు నీరావణాసురుఁడుమిగులభయంకరుఁడు. ఈదురాత్ముడు నన్నుమిగులచురుకుచూపులజూచుచున్నాఁడు. నాకుసుఖములేదు, ఇకమీదటనీవురాకుండా ఆలస్యముజేసినయెడల ఒకమాసమునకుపైన నొకక్షణకాలమైనను బ్రతికియుండజాలను. అనియిట్లుసీతాదేవి మహాదుఃఖముతో గన్నీరుధారధారగ బ్రవహింపగా నేడ్చుచు జెప్పినమాటలను, వాయుపుత్రుఁడగు నాంజనేయుఁడువిని సీతాదేవినిజూచియిట్లనియె.

ఓతల్లీ! సీతాదేవీ! రాముఁడు నిన్నుదలచిదుఃఖించుచు నితరవిషయములయం దెంతమాత్రమును జ్ఞప్తియుంచకనున్నాఁడు మఱియురాముఁడు మిగులదుఃఖపడుచుండునపుడు అతనిదుఃఖమునులక్ష్మణుఁడుజూచి తానునుమహావ్య

సనమును బొందుచున్నాఁడు. ఇది యథార్థము. ఒట్టుబెట్టి చెప్పుచున్నాను. ఓసీతాదేవీ! నిన్ను అతిప్రయాసమున నిచటఁ గనుగొంటిని. కావున నిది దుఃఖించుటకు కాలముగాదు. సంతోషమును బొందుము మిగుల స్వల్పకాలముననే నీదుఃఖములన్నియును దీరి సుఖమును బొందుదువు పురుషశ్రేష్ఠులును, శత్రువులను సంహరించువారును, రాజపుత్రులును, నిన్ను జూచుటయందు పరమోత్సాహముగలవారును, నగు నా రామలక్ష్మణు లిరువురును ఇచటికి వచ్చి యీలంకానగరమును నాశనము జేయుదురు. విశాలములగు నేత్రములుగల యోతల్లీ! సీతాదేవీ! రామలక్ష్మణు లిరువురును మిగుల దుర్మార్గుఁడగు రావణాసురుని బంధుసమేతముగ యుద్ధమునందు సంహరించి నిన్ను అయోధ్యాపట్టణమునకు దీసికొనిపోదురు ఓసీతాదేవీ! ఏగుఱుతును రాముఁడు చక్కఁగ నెఱుఁగునో, ఏది రామునకు పరమసంతోషమును గలుగఁ జేయునో, అట్టిగుఱుతు నింకొకటి నాకిమ్ము. అని యాంజనేయుఁడు సీతాదేవిని యడిగె. అంత సీతాదేవి యాంజనేయునిఁ జూచి యిట్లనియె.

మహాశౌర్యవంతుఁడవగు నోయాంజనేయా! నేను మిగుల శ్రేష్ఠమును నా శిరోరత్నమును నగు గుఱుతు నిచ్చియున్నాను ఇది నాకు శిరోభూషణమగు చూడామణి దీనిఁ జూచి రాముఁడు పరమసంతోషమును బొంది నీమాటయందు మంచి గౌరవము నుంచును. కావున వేఱుగుఱుతు అక్కఱలేదని సీతాదేవి చెప్పిన, శ్రీమంతుఁడును, వానరోత్తముఁడును నగు వాంజనేయుఁడు విని మణిశ్రేష్ఠమును దీసికొని సీతాదేవికి సాష్టాంగనమస్కారమును జేసి ప్రయాణంబయ్యె. అంత సముద్రమును దాటి యవ్వలిదరికిపోవ నుద్యమించి యెగురుటయం దుత్సాహముగలవాఁడై దేహమును బెంచుచున్నవాఁడును, మహావేగవంతుఁడును వానరోత్తముఁడును నగు నాంజనేయునిఁ జూచి, జనకమహారాజపుత్రికయగు సీతాదేవి మిగుల దుఃఖమును బొంది కంటినుండి నీరు బొటబొటగార్చుచు గద్గదస్వరంబున మాటతడబడుచు మహాదీనముగా నిట్లనియె.

ఓయాంజనేయా! సింహసమానులగు రామలక్ష్మణుల కిరువురకును, మంత్రిసమేతుఁడగు సుగ్రీవునకును, సమస్త వానరులకును, నాక్షేమమును దెలుపుము ఓ వానరశ్రేష్ఠా! మహాబాహుఁడగు రాముఁడు నన్నీ దుఃఖసాగరమునుండి యెట్లు తరింపఁ జేయునో, అట్టియుపకారమును నీవే చేయవలయును. ఇట్లు జేయుభారము నీది. వానరోత్తముఁడవగు నోయాంజనేయా! నీవిచటనుండిపోయి రాముని యొద్దఁ జేరి నతోడనె నేనీ మహాదుఃఖము ననుభవించుచుండుటయును, ఈ రాక్షసస్త్రీలు నన్ను బెదిరించుటయును, రామునకు జక్కఁగా దెలియ జెప్పుము. నీకు త్రోవయందు శుభంబు గలుగుగాక. అని సీతాదేవి యాంజనేయుని దీవించె. అట్లు ఆంజనేయుఁడు రాచకుమార్తెయగు సీతాదేవిచేఁ గుఱుతులను బుచ్చుకొని నెరవేరిన కార్యముగలవాఁడును, మిగుల సంతసించిన మనస్సుగలవాఁడును, కార్యమునంతయు నెరవేర్చుకొనినవాఁడును, ఇకను జేయవలసిన కార్యము గొంచెమే గదా యున్నదని తెలిసికొనినవాఁడును (అనగా లంకానగరంబునకు వచ్చుటయు సీతను వెదకుటయు మొదలగు కార్యమునంతయు నెరవేర్చుకొని యావిషయమును రామునకు దెలిపించుటమాత్రము మిగిలియున్నదని తెలిసికొనినవాఁడును) నై యుత్తరపు దిక్కునకు బోవుటకు బ్రయత్నించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదియవసర్గ ముగిసెను.

ఆంజనేయుఁడు అశోకవనమును నాశనము జేయుట.

వానరోత్తముఁడగు నాంజనేయుఁడు శ్రీరాముని యొద్దకు బోఁగోరినవాఁడును, సీతాదేవివలన నుత్తమవాక్యములచే బొగడఁబడినవాఁడునునై యాప్రదేశము విడిచి కొంచెముగ నవతలికి బోయి తనలో తా నిట్లని యాలోచించె. ఇప్పుడు నేను వచ్చిన కార్యమునంతయు నెరవేర్చితిని. ఇంక కొంచెము కొదవయున్నది సీతాదేవిని జూచితిని. సామ దాన భేదములను మూడుపాయములచే నెత్నించి యావల నాలవదియగు దండోపాయము నవలంబింపవలయునని పెద్దలు చెప్పుదురు. ఈవిషయమునందు మొదటి మూడుపాయములను అక్కఱకురావు అదెట్లనిన; రాక్షసులయందు సామోపాయముచే బ్రయోజనము గలుగదు రావణాసురుఁడు మహాభాగ్యవంతుఁడు గావున వీనివిషయమునందు దానోపాయముచేఁ గార్యసిద్ధి గలుగదు విశేషమగబలము గలవాఁడగుటవలన భేదోపాయముచే గూడ బ్రయోజనము గలుగ నేరదు. కావున నాలవయుపాయమగు దండోపాయముచేతనే కార్యసాధనము గలుగునని నాకుతోఁచుచున్నది. ఈకార్యమును సాధించుటయందు పరాక్రమము దప్ప వేరుపాయంబెదియును సరిపడదు కావున నిప్పుడు నేను వీరితో యుద్ధమును జేసి కొందఱు వీరులను సంహరింతునేని పిదప వీరు మృదుస్వభావమును బొందుదురు. శ్లో॥ కార్యేకర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్ । పూర్వకార్యావిరోధేన స కార్యంకర్తుమర్హతి॥ ఎవఁడు గాని తనకు ఆజ్ఞాపించిన కా

ర్యమును నెరవేర్చుకొని, మొదటికార్యమునకు విరోధము లేకుండగ ననేకకార్యములు సాధించునో, యట్టివాడే సకలకార్యములను నెరవేర్చును. ఒక్కకారణముచే మిగులనల్పకార్యమునుగూడ సాధింపనలవిగాదు. ఎవఁడు తనకార్యమును సాధించుకొనుటకై నానావిధోపాయములను గుర్తెఱుఁగునో యతండొక్కఁడే కార్యమును సాధించుటకు సమర్థుండగును. నేనిప్పుడే యిచట రావణాసురుని బలాబలములను నిశ్చయించి, శత్రువులగు రాక్షసులయొక్కయు, మనవారలయొక్కయు, బలాబలములను, యుద్ధనైపుణ్యమును, దెలిసికొని, వానరేశ్వరుఁడగు సుగ్రీవునియొద్దకు బోదునేని, స్వామికార్యమును జక్కఁగ నెరవేర్చినవాఁడనగుదును. ఇప్పుడు నాకు రాక్షసులతోటి యుద్ధంబెట్లు అనాయాసముగ గలుగును? అట్లు యుద్ధము ప్రాప్తించితేఁగదా, రావణాసురుడు తనవారిబలమును నాయొక్కబలమును లెస్సగ విమర్శించి తెలిసికొనును. మఱియు నేను, మంత్రులతోను సేనాధిపతులతోను గూడిన రావణాసురుని యుద్ధమునందు ఎదిరించి వానిమనోభావమును, బలమును ననాయాసముచే బాగుగ దెలిసికొని, కిష్కింధాపట్టణమునకు బోవుదను. అందునిమిత్తమై యిప్పుడొకయుపాయమును జేసెదను. మిగులక్రూరుఁడగు నీరావణాసురునియొక్క యశోకవనము మిగులరమణీయమై నందనవనముతో సరిపోలియున్నది. ఇదిమహాశ్రేష్ఠమైనది. నేత్రములకును మనస్సునకును మిగులనింపైనది నానావిధములగువృక్షములచేతను, తీగెలచేతను నిండినదియైయున్నది. "అగ్నిహోత్రుఁడు ఎండిపోయినయరణ్యమునుగాల్చి భస్మము జేయునట్లు" నేనీయశోకవనమును విరిచిపాడుజేసెదను. అంతరావణాసురుఁడు నాపైమిగులకోపమును బొందినవాఁడగును అట్లుకోపమును బొంది రాక్షసేశ్వరుఁడగు నారావణాసురుఁడు, గుఱ్ఱములతోను ఏనుగులతోను గొప్పరథములతోనుఁ గూడినదియును, త్రిశూలములను, ఇనుపగుదియలను పట్టసములను, ధరించినదియునునగు గొప్పసైన్యమును నాపైఁయుద్ధమునకు బంపును. అంతనామనోభీష్టము నెరవేరును. అనఁగాగొప్పయుద్ధము సంభవించును. అంత అమితపరాక్రమముగల నేను మిగులభయంకరమగు రాక్షసులతో గలసి యుద్ధమును జేసి రావణాసురునిచే బంపఁబడిన గొప్పసైన్యమును జెండాడి సంహరించి వానరరాజైన సుగ్రీవునిపట్టణంబగు కిష్కింధానగరమునకు బోవుదను. అనియిట్లు ఆలోచించి మిగులపరాక్రమశాలియును వాయుపుత్రుఁడును నగు నాంజనేయుఁడు మహాకోపముగలవాఁడై వాయుదేవునిబోలె మహావేగము నవలంబించి తనతొడలవేగముచే వృక్షములను పడద్రోయ నారంభించె. అట్లువిరుచుటకారంభించి వానరోత్తముఁడగు నాంజనేయుఁడు, మదించినపక్షులయొక్క ధ్వనులతో గూడుకొనినదియును, నానావిధములగు తీగెలతోను వృక్షములతోనుఁ గూడుకొన్నదియును నగు నాయుద్యానవనమును విరిచి నాశనము జేసె. మఱియు నందలి వృక్షములనన్నిటిని విరిచి పొడిపొడియగునట్లు జేసె కొలనులు మొదలగు జలాశయములయొక్క కట్టలు త్రెంచివైచె. క్రీడార్థముగ నిర్మింపఁబడియుండిన పర్వతములనన్నిటిని నాశనము జేసె తీగెలనన్నిటిని త్రెంచివేసె. అట్లు ఉద్యానవనము నాంజనేయుఁడు పాడుజేయుటచేఁ జూచుటకు మిగులవికారముగ నుండె. అట్టి యెడవాడిపోయిన వృక్షములతోను, తీగెలతోనుఁ గూడినదియును, నానావిధములగు పక్షులయొక్క కలకలధ్వనులతో గూడినదియును, కట్టలు త్రెంచిపాడుజేయఁబడిన జలాశయములతో గూడినదియును, వాడిపోయిన ఎఱ్ఱనిచిగురుటాకులతో గూడినదియునునగు నాయశోకవనము "దావానలంబుచే దగులబెట్టబడినదానివలె" కొంచెమైనను ప్రకాశింపనిదయ్యె. ఆయుద్యానవనమునందలి తీగెలకు ఆధారములైన వృక్షములు విఱిగి భూమియందు బడియుండుటచేత ఆతీగెలు "పురుషులు లేని స్త్రీలు మహాభయముచే నిశ్చేష్టలై కొంచెమైనను" ఎట్లు ప్రకాశింపకుందురో యట్లు ప్రకాశింపనివయ్యె. అప్పుడాయశోకవనము పాడుజేయఁబడిన తీగెటెండ్లును, చిత్తరువుచవికెలును గలదియును, ఎగరగొట్టఁబడిన గొప్పసర్పములును కౄరమృగములును గలదియును, పగులగొట్టఁబడిన రాతియిండ్లును సామాన్యగృహములును గలదియునై సౌభాగ్యము చెడి కళాహీనమై ప్రకాశింపకుండె మఱియు రావణాసునిభార్యలకు సకలసుఖములను యిచ్చుచు రక్షకంబైయున్న యాయుద్యానవనము, వ్యసనమునునది యెట్టిదో యెఱుగకుండియును, మహావీరుడగు అంజనేయునిచే యందున్న వృక్షములు తీగెలు మొదలగుసమస్తమును నాశము జేయబడి వ్యాకులములతో గూడిన తీగెలయొక్క సమూహములుగలదియై యుండె. అప్పుడా గొప్పవానరుఁడగు నాంజనేయుఁడు, మహాశౌర్యవంతుఁడును, ధనాఢ్యుడును నగు రావణాసురుని మనస్సునకు గొప్పయప్రియమును జేసి, తానొక్కఁడే అనేకమంది రాక్షసులతో యుద్ధము జేయఁగోరి, మిగులనధికమైన కాంతిచే బ్రకాశించుచు నాయశోకవనముయొక్క బహిర్ద్వారమునందు గూర్చుండియుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదియొకటవ సర్గము ముగిసెను.

— { రావణాసురుడు కింకరులను రాక్షసులను ఆంజనేయుని సంహరించుటకు బంపుట } —

అట్టియెడ పక్షులయొక్క కలకలధ్వనులచేతను, చెట్లు విఱుచుటచే గలిగిన మహాధ్వనిచేతను, లంకానగరమునందున్న రాక్షసులందఱును మహాభయముచే మిగుల తొట్రుపాటును బొందిరి. అంత నాయశోకవనమునందున్న మృగములును బక్షులును మిగుల భీతినొందినవై నలుదిక్కులకుం బరుగులిడినవి. మఱియు రాక్షసులు అనేకములగు దుశ్శకునములను జూచిరి. ఆసమయమున నిదురబోవుచుండిన వికారస్వరూపులగు నా రాక్షసస్త్రీలు ఆయల్లకల్లోలధ్వనికి నిదుర మేల్కని, విరిచి నాశనము జేయబడిన యాయశోకవనమును, మఱియు మహోన్నతాకారుడై మహాశౌర్యముతోను గూడియున్న యాయాంజనేయుని జూచిరి. మఱియు మహాబలపరాక్రమశాలియును, మహాబాహుడునునగు నాయాంజనేయుడు తన్ను జూడవచ్చిన యారాక్షసస్త్రీలను జూచి వారికి మహాభయము దోచునట్లు తనదేహమును బెంచె. అప్పుడు ఆరాక్షసస్త్రీలు, మిగుల గొప్పదేహముగలిగి పర్వతముతో సమానమైన యాకారముగలవాడును, మహాబలవంతుడును, నగు నయ్యాంజనేయుని జూచి, సీతాదేవియొద్దకు బోయి యామెతో నిట్లనిరి. ఓసీతా! వీడెవ్వడు? ఎవరు బంపగా వచ్చినాడు? ఎచటనుండి వచ్చెను? ఏమిపనిగా నిచ్చటికి వచ్చెను? నీతో నేమి మాట్లాడుచుండెను? విశాలములగు నేత్రములుగలయో సీతా! ఈవిషయమును మాకు జెప్పుము. నీవు భయపడవలసిన పనిలేదు. నల్లని నేత్రములుగలయో సీతా! ఇతడు నీతో నేవిషయమును గుఱించి సంభాషించుచుండెను? అని రాక్షసస్త్రీలు సీతాదేవిని అడిగిరి. అంత మిగుల పతివ్రతయును సర్వాంగసుందరియును, నగు నాసీతాదేవి వారితో నిట్లనియె.

ఓ స్త్రీలారా! భయంకరములగు పలువిధములైన యాకారములను ధరించెడు రాక్షసులను ఎఱుంగుటకు నాకు శక్తి లేదు. ఈతండెవడో? యేమి సేయుచున్నాడో? ఆసమాచారము మీకే తెలియును. పాము పాదములను పామే గుర్తెఱుగురు. వేరొకరికి తెలియుట మహాకష్టము. కావున నీనిని జూచిన నాకును మహాభయముగనున్నది. ఇతండెవడో నాకు దెలియదు. మీరే చెప్పుడు. నాకు గూడ గానీవానరుడు కామరూపియగు రాక్షసుడని తోచుచున్నదని చెప్పె. అంత రాక్షసస్త్రీలు సీతాదేవిమాటలను విని భయపడి నలుదిక్కులకును బరుగెత్తిపోయిరి. కొందఱచట సీతాదేవికి కావలియుండిరి. మఱికొందఱీవృత్తాంతమును రావణాసురునకు తెలిగించుటకు పరుగిడిరి. అప్పుడా వికారములగు రూపములుగల రాక్షసస్త్రీలు రావణాసురుని దగ్గరకుబోయి మహోన్నతాకారుడును, మహాభయంకరుడును, నగు నావానరుని గుఱించి చెప్పుట కిట్లు మొదలిడిరి. ఓ మహారాజా! రావణాసురుడా! ఎవడో మిగుల భయంకరాకారముగలవాడును, మహాశౌర్యముగలవాడునునగు నొకవానరుడు సీతాదేవితో గొంతసేపు మాటలాడి యిప్పుడు అశోకవనమధ్యమునను న్నాడు. జింకకండ్లవంటి కండ్లుగల యా సీతాదేవిని ఆవానరుడెవడని మేము అనేకవిధములచే నడుగగా నాకు దెలియదని చెప్పె. మఱియు నావానరుడు దేవేంద్రుడు బంపగా వచ్చిన దూతయో, లేక కుబేరుడు బంపగా వచ్చినవాడేనో, లేక, సీతాదేవిని వెదకుటకై రామునిచే నంపబడినదూతేనో, తెలియలేదు. మిగుల భయంకరాకారుడగు నావానరుడు, మిగుల మనోజ్ఞమైనదియును, సమస్తవిధములగు మృగములచే నిండియుండునదియును, నగు నీయుద్యానవనమగు అశోకవనము పాడుచేసెను. ఆవానరునిచే నాశనము జేయబడని స్థలము గొంచెమైనను లేదు. ఐనను సీతాదేవి యేచెట్టుక్రింద నున్నదో యావృక్షమును మాత్రము ఆవానరుడు ముట్టలేదు. అయితే యావృక్షమును సీతకు రక్షణార్థముగ నుంచుటకొఱకు తాకలేదో, లేక సలసట నొందియుండుటచే విఱువక విడిచినాడో, తెలియదు. యోచించి చూడగా నది సీతాదేవిరక్షణార్థమయ్యే విఱువలేదని తోచుచున్నది. లేకపోయెనేని వానికి అలసట యెక్కడిది. మఱియు సీతాదేవి తానుగానే యేచెట్టుక్రింద గూర్చుండియున్నదో, అటువంటి, సుందరములగు పుష్పములతోను చిగుళ్ళతోను నిండియుండెడు శింశుపావృక్షమునుగూడ విరువడాయె. మహాభయంకరుడవగు నో రావణాసురుడా! సీతాదేవితో సంభాషించినవాడును, అశోకవనమును నాశనము జేసినవాడును, మిగుల భయంకరాకారుడును నగు నావానరుని నీవు కఠినముగ శిక్షింపవలయును. ఓ రాక్షసరాజా! జీవించియుండుటకు యెవనికిచ్ఛగలదో అట్టివాడు, నీవు మనస్సునందు కోరియుండెడు సీతాదేవితో మాటలాడడు. ఈవానరుడు సీతాదేవితో మాటలాడినాడు. కావున వీడింక బ్రతుకదగడు. అని రాక్షసస్త్రీలు జెప్పిరి. అంత రాక్షసేశ్వరుడగు రావణాసురుడు మిగుల కోపమును బొంది గుడ్లు గిరగిర ద్రిప్పుచు పండ్లు పటపటం గొరుకుచు ప్రళయకాలాగ్నిహోత్రునివలె భగ్గునమండిపడెను. అట్టియెడ "మండుచున్న దీపపుకొనినుండి చమురుబొట్లు రాలునట్లు" మిగుల కోపోద్దీపితుడైయున్న నా రావణాసురుని నేత్రములనుండి నిప్పులు రాలినవి. అంత మహాపరాక్రమశాలియగు రావణాసురుడు, బలమునందు

దనకుసమానులైనవారును, యుద్ధవీరులును, నగు కింకరులనురాక్షసులను నాంజనేయునిపైకిబంపె. అప్పుడుమహాబలశాలులగు నెనుబదివేలకింకరులుబైలువెడలిరి. మఱియు, భయంకరమైన యాకారములుగలవారును, పెద్దకడుపుగలవారును, పొడవైనకోరలుగలవారును, మిగులబలముగలవారును, నగునాకింకరులందఱును, యుద్ధమునందాశగలవారై, శూలముద్గరములుమొదలగు నాయుధములనుధరించి యాంజనేయునిబట్టుకొనుటకొఱకు మహాకోపముతో బైలువెడలిరి. అంతనాకింకరులుమహావేగముతో బైలుదేరి, "కార్చిచ్చుపైకిమిడుతలుబోవునట్లు" బహిర్ద్వారమునందున్నవాఁడును, యుద్ధసన్నద్ధుడైనవాఁడును, వానరోత్తముడునునగు నాంజనేయునిపైకిబోయిరి. అట్లుబోయినయాకింకరులు నానావిధములయిన యాయుధములతోను, బంగారుబాహుపురులతోను బ్రకాశించుచున్నవారును, ఇనుపగుదియలను అడ్డకత్తులను, శూలములను, ఈటెలను, బల్లెములను, చిల్లకోలలనుధరించినవారునునై, అతిశీఘ్రముగనాంజనేయునిచుట్టునుబరివేష్టించి, "సూర్యునివలె" అతితీక్ష్ణములైనబాణములచే వానరశ్రేష్ఠుని బ్రహరించిరి. అంతమిగులశౌర్యముగలవాఁడును, అందఱికన్నునధికుడును, పర్వతముతోసమానమైనవాఁడును, నగునాంజనేయుఁడు తనతోకతోభూమిమీదగొట్టి సింహనాదమునుజేసె. మఱియువాయుదేవునికుమారుఁడును, పర్వతముతోసమానమైనదేహముగలవాడును, నగు నాంజనేయుఁడుగట్టిగభుజముతట్టె. అంతనాభుజముతట్టుటచే గలిగిన శబ్దము లంకానగరమంతయునునిండె. మఱియు నాయాంజనేయుడుభుజముతట్టుటచే గలిగినప్రతిధ్వని దశదిశలును నిండినవి. ఆకాశమునసంచరించుచుండెడు పక్షులుఆధ్వనిచేగిరగిరందిరిగి నేలంగూలినవి. అప్పుడు ఆంజనేయుఁడుగట్టిగనిట్లనియరచె. మహాబలశాలియగు రాముఁడుసర్వోత్కృష్టుఁడుగనున్నాఁడు మిగులబలముగల లక్ష్మణుఁడును, అందరికన్ననధికుఁడుగనున్నాఁడు. రామునిచే బరిపాలింపఁబడెడు సుగ్రీవుఁడునుసర్వోత్కృష్టుఁడై యున్నాఁడు. నేను, కోసలదేశాధీశుఁడును, ఎట్టికార్యమునందుసక్లేశమునుబొందనివాఁడును, నగు రామునకుదాసుఁడను. వాయుదేవునకునౌరసపుత్త్రుఁడను హనుమంతుఁడను పేరుగలవాఁడను. శత్రుసైన్యములను సంహరించువాఁడను. మఱియునేనుఱాళ్ళతోను వృక్షములతోను అనేకవిధములుగఁ బ్రహరింపగలను. యుద్ధమునందు వేయిమందిరావణాసురులుగూడ నాతోసమానులుగారు. నేనీరాక్షసులందఱునుజూచుచుండగ లంకానగరమునంతయు నాశముజేసి సీతాదేవికినమస్కరించి కృతార్థుఁడనై కిష్కింధానగరమునకుఁబోయెదను. అనియిట్లుఆంజనేయుఁడుచెప్పి గట్టిగానఱచె. అంతనాకింకరులుఆంజనేయునియొక్క సింహనాదమునకుభయపడి, సంధ్యాకాలమునందలి గొప్పమేఘమువలెనున్న యాంజనేయునికండ్లెత్తిచూచిరి. అట్లుచూచిఆకింకరులు మిగులభయమునుబొందినవారయ్యును, ప్రభువుయొక్కఆజ్ఞకభీతులై లోబడినవారగుచు, నానావిధములగు భయంకరములైన యాయుధములచేనాఁజనేయునిబ్రహరించిరి. అంతమహాబలశాలియగు నాయాంజనేయుఁడు, యుద్ధవీరులగు నాకింకరులచే జక్కగనాక్రమింపఁబడినవాఁడయ్యును, బహిర్ద్వారమునందున్నదియును, ఇనుముతోజేయఁబడినదియును, మిగులభయంకరమైనదియునునగు నినపగుదియనెత్తుకొనెను. అట్లాగుదియదగ్గిరకుబోయి ఆగుదియనుదీసికొని కొందఱురాక్షసులనుసంహరించె మహాపరాక్రమశాలియును, వాయుపుత్త్రుఁడును, నగునాఁజనేయుఁడు మిగులప్రకాశించుచున్నఆయినుపగుదియనుదీసికొని "గరుత్మంతుఁడు పాములందన్నుకొనిపోవునట్లు" కింకరులనందఱినిసంహరించి గగనమార్గమునకెగిరి యచటసంచరించుచుండె. ఇట్లుమిగులపరాక్రమశాలియును, వాయుపుత్త్రుఁడును, నగు నాంజనేయుఁడు మిగులపరాక్రమశాలులగు నాకింకరులనందఱినిసంహరించి మఱలయుద్ధమునుగోరినవాఁడై ద్వారమునందుగూర్చుండియుండె. అట్టియెడయుద్ధమునందు భయపడిపరుగెత్తినరాక్షసులలో గొందఱుపోయి కింకరులందఱును నాంజనేయునిచే జంపఁబడిరని రావణాసురునకు దెలిపిరి. అంతకింకరులందఱునుజంపఁబడిరని రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడువిని మహాకోపమునుబొంది కండ్లుగిరగిరంద్రిప్పుచు, మహాపరాక్రమముగలవాఁడును, యుద్ధమునందితరులచే నెదిరింపనలవిగానివాఁడునునగు ప్రహస్తుఁడనుమంత్రిపుత్త్రుని నాంజనేయునిపైకి యుద్ధమునకు బొమ్మనిఆజ్ఞాపించె,

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదిరెండవసర్గముగిసెను.

ఆంజనేయుడుచైత్యప్రాసాదపాలకులనుసంహరించుట

అంత నాంజనేయుఁడు కింకరులనుజంపి బహిర్ద్వారమునయున్నవాఁడై తనలోతానిట్లనియాలోచించె. నేనశోకవనమునంతయువిఱిచి నాశముజేసితినిగాని, చైత్యప్రాసాదమును పాడుచేయనైతిని. కావుననిప్పుడు అభయంకరమ

గుమేడను నాశముజేసెదను. అనియిట్లు ఆంజనేయుండు తనలోతా నాలోచించి తనబలము జూపఁగోరినవాఁడై పైకెగిరి "మిగులపొడవగు మేరుపర్వతశిఖరమువలెనున్న" చైత్యప్రాసాదముమీఁదదుమికె అట్లు మిగుల శౌర్యవంతుఁడును వానరశ్రేష్ఠుఁడును, నగు నాంజనేయుఁడు పర్వతముతో సమానముగనుండెడు నాచైత్యప్రాసాదముమీద నెక్కినవాఁడై "అప్పుడుదయించిన రెండవసూర్యునివలె" ప్రకాశించుచుండె. అట్లు ఆంజనేయుఁడు, మిగుల నుత్తమమైనదియును, అన్యుల కెదిరింపఁగూడనిదియును, నగు నాచైత్యప్రాసాదము పైనెక్కి దానిని నాశముజేసి జయలక్ష్మీసమేతుఁడై "పారియాత్రపర్వతమువలె" ప్రకాశించుచుండె వాయుపుత్రుఁడైనయాంజనేయుఁ డట్లు చైత్యప్రాసాదము నువిఱిచి తనమహిమచే గొప్ప దేహమును దాల్చి, లంకానగరమంతయు నిండునట్లు భుజమును దట్టె అప్పుడు ఆంజనేయునివలన భుజముదట్టుటచే గలిగినధ్వనిచేత ఆకాశమునందున్న పక్షులన్నియు నేలంబడినవి. చైత్యప్రాసాదమును పాలించువారును మూర్ఛనుబొంది నేలంబడిరి. అప్పుడు ఆంజనేయుఁ డిట్లని యరచె అస్త్రవేత్తలలోనుత్తముఁడగు రాముఁ డందఱికన్ననధికుఁడు గానున్నాఁడు. మహాబలశాలియగు లక్ష్మణుఁడును సర్వోత్కృష్టుఁడు గానున్నాఁడు రామునిచేఁ జక్కఁగ బాలింపఁబడు సుగ్రీవుఁడును సర్వోత్కృష్టుఁడు గానున్నాఁడు. నేను, కోసలదేశాధీశుఁడను, గొప్పకార్యములయందు గాని సంకటమొందనివాఁడును, నగు రాముని దూతను. వాయుదేవునిపుత్రుఁడను. హనుమంతుఁడను పేరుగలవాఁడను. శత్రుసైన్యములను సంహరించువాఁడను. ఱాళ్ళతోను వృక్షములతోను అనేకవిధములుగ యుద్ధమును జేయుదును అనేకమంది రావణాసురులుగూడ యుద్ధమునందు నాకుసమానులుగారు. నేను సమస్తరాక్షసులును జూచుచుండఁగ నీలంకానగరమునంతయు పాడుజేసి సీతాదేవికి నమస్కారమును జేసి కార్యసిద్ధినిఁ బొందినవాఁడనై రామునివద్దకుబోయెదను. అనియిట్లు భయంకరమైన కంఠధ్వనితో వానరోత్తముఁడగు నాంజనేయుఁడు ఆచైత్యప్రాసాదమునందున్న రాక్షసులకు జక్కఁగ దెలియునట్లుగట్టిగా నఱచె. అంత నా గొప్పధ్వనివిని చైత్యప్రాసాదమును పాలించుచున్న నూర్గురు రాక్షసులును, ఈటెలను, బల్లెములను, గండ్రగొడ్డండ్రను, మఱియు నానావిధములగు నాయుధములను దీసికొని యాంజనేయునిపైకి యుద్ధమునకుఁ బోయిరి. అట్లుబోయి నమహాకాయులగు నారాక్షసులు నానావిధములగు బాణములను బ్రయోగించుచు వాయుపుత్రుఁడగు నాంజనేయుని చుట్టును గమ్ముకొనిరి. అట్లు కమ్ముకొనిన, యారాక్షససేననానావిధములగు గదలతోను, బంగారుచే నలంకరింపఁబడినయినుపగుదియలతోను, సూర్యునితో సమానములగు బాణములతోను, వానరోత్తముఁడగు నాంజనేయుని పరివేష్టించియుండుటచే "గంగానదియందలి గొప్పసుడివలె" ప్రకాశించుచుండె. అంతవాయుపుత్రుఁడగు నాంజనేయుఁడు మహాకోపమును బొంది భయంకరాకారమును ధరించె అట్లు భయంకరమగు రూపమును దాల్చి, మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుండు అత్యున్నతమైనశిఖరముగల యాచైత్యప్రాసాదమునందలి బంగారుస్తంభమును మహావేగముగ బెరికికొనె. అట్లు బెరికికొని యాస్తంభమును అనేకమారులు గిరగిరం ద్రిప్పె. అట్లు త్రిప్పుటచే నాస్తంభమునందు అగ్నిబుట్టి ఆయగ్ని చైత్యప్రాసాదమును దహించె అట్టిమిగుల శ్రీమంతుఁడును, వానరసమూహములను బాలించువాఁడును, నగు నాంజనేయుఁడు, మండుచున్న చైత్యప్రాసాదమును జూచి సంతసించి, తనచేతనున్న నాబంగారుస్తంభముచే "వజ్రాయుధముచేత దేవేంద్రుఁడు రాక్షససమూహములను జంపునట్లు" చైత్యప్రాసాదపాలకులను నూరుమందిని నొక్క పెట్టున జంపె. అట్లు వారినిజంపి ఆకాశమార్గమున కెగిరి గట్టిగా నిట్లని యరచె. మహాబలపరాక్రమశాలులును, సుగ్రీవునియధీనమునందున్నవారును నాతో సమానులును, నగు వానరోత్తములు అనేకులు సీతాదేవిని వెదుకుటకొఱకు నలుదిక్కులకును బంపఁబడియున్నారు. అట్టి మేమును మఱియు ననేకులగు యితర వానరులును, భూమినంతయు నలుదిక్కులను వెదకుచున్నారు. అందుకొందఱు పదియేనుఁగుల బలముగలవారు. కొందఱు నూరేనుఁగులబలముగలవారు. కొందఱు వెయ్యేనుఁగులబలముగలవారు పరాక్రమమునందు అందఱును సమానులు. మఱియునందుకొందఱు, ఓఘసంఖ్యగల యేనుఁగులబలముగలవారు. కొందఱు వాయుబలముతో సమానమైనబలముగలవారు. తక్కినవానరోత్తములందఱును మితిలేనిబలముగలవారు అరిమర్దనుడగు సుగ్రీవుఁడు పండ్లును గోళ్లునే యాయుధములుగాగల వానరసమూహముచే బరివేష్టింపఁబడినవాఁడగుచు లంకానగరమునందు బ్రవేశించి మిమ్ములనందరిని సంహరించును. మహాత్ముఁడును, మిగుల పరాక్రమశాలియును, ఇక్ష్వాకువంశోద్భవులలో నుత్తముఁడు నగు రామునితో బద్ధవైరమును బెట్టుకొంటిరిగాన నీలంకానగర మెంతమాత్రమును స్థిరముగనుండదు. త్వరలోనశించును. మీరందఱును క్షీణింతురు. రావణాసురుఁడును నశించును. అని చెప్పె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదిమూఁడవస

ర్గముగిసెను.

-(*)-

జంబుమాలియను రాక్షసుడు ఆంజనేయునిచే సంహరింపబడుట

అంత పెద్దకోఱలుగలవాఁడును, ఎఱ్ఱనిపూలదండలను వస్త్రములను ధరించినవాఁడును, సువాసనతోఁగూడిన పూదండలుగలవాఁడును, రమణీయములగు కుండలములుగలవాఁడును, పెద్దదేహముగలవాఁడును, గుండ్రములగు నేత్రములుగలవాఁడును, మిగులభయంకరుఁడును, యుద్ధమునందజేయుఁడును, మహాబలముగలవాఁడును, రాక్షసేశ్వరుఁడగు రావణాసురునిచే ప్రేరేపింపఁబడినవాఁడును, ప్రహస్తునికుమారుఁడును, నగు జంబుమాలియనువాఁడు, ఇంద్రధనుస్సుతో సమానమైనదియును, మిగులగొప్పదియును, సుందరములగు బాణములచే నలంకరింపఁబడినదియును, నగు ధనుస్సును ధరించి పిడుగుమ్రోతతో సమానమగు ధ్వనిగలుగునట్లు నారిసారించుచు నాంజనేయునిపైకి యుద్ధమునకుఁ బైలువెడలె. ఆజంబుమాలియొక్క వింటినారిసారించుటచేఁ గలిగినధ్వని సకలదిక్కులను భూమ్యాకాశములను నిండినది. అట్లు జ్యాఘోషంబుజేయుచు, గాడిదలచే బూన్పఁబడిన రథమునునెక్కి అతివేగముగ వచ్చుచున్న ఆజంబుమాలినిజూచి, మహావేగవంతుఁడగు నాంజనేయుఁడు అధికసంతసముచే సింహనాదమును జేసె. అంత మహాబాహుఁడగు నాజంబుమాలి బహిర్ద్వారమునఁ గూర్చుండియున్న గొప్పవానరుఁడగు నాంజనేయుని మిగులతీక్ష్ణములగు బాణములచే గొట్టె. మఱియు నాజంబుమాలి వానరోత్తముఁడగు నాంజనేయుని ముఖమునం దర్ధచంద్రమువంటి బాణముతోను, శిరమునందు ఒకకర్ణియను బాణముతోను, బాహువులయందు పదినారాచములతోను గొట్టె. అంత స్వభావముచేతనే మిగుల యెఱ్ఱనిదియును, బాణముచే గొట్టఁబడినదియును, నగు నాయాంజనేయుని ముఖము. "శరత్కాలమునందు పూచినదియును, సూర్యకిరణములచే వ్యాపింపఁబడినదియును, నగు యెఱ్ఱతామరపువ్వువలెనే" ప్రకాశించుచుండె. మఱియు సహజముగ నెఱ్ఱనిదియును, రక్తము గారుటవలన మిగుల నెఱ్ఱగ జేయఁబడినదియును నగు నాయాంజనేయుని ముఖము, "ఎఱ్ఱని శ్రీగంధపుబొట్లచే దముపబడి యాకాశమునం దుప్రకాశించెడు నెఱ్ఱగలువవలెనే" ప్రకాశించుచుండె. అట్టియెడ నాయాంజనేయుఁడు జంబుమాలియొక్క బాణాభిఘాతచే మిగులగోపోద్దీపితుఁడై నలుప్రక్కలను బాచి తనప్రక్కనున్న యొకగొప్పరాతిబండను జూచె. మహాబలవంతుఁడగు హనుమంతుడు ఆబండను అతివేగముతో బెఱికి తనబలముకొలదిని జంబుమాలిపైకి విసరివైచె. అంత నాఱాయి యతివేగముగ వచ్చుటను జూచి జంబుమాలి మిగులకుపితుఁడై పదిబాణములచే నాఱాతిని పిండిపిండిగ జేసె. అట్లు ఆఱాయి చూర్ణమగుటను జూచి మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుఁడు ఒకగొప్పసాలవృక్షమును బెకలించుకొని గిరగిరం ద్రిప్పుచుండె. అంత మహాబలవంతుఁడగు జంబుమాలి, ఆంజనేయుడు సాలవృక్షమును గిరగిరమని ద్రిప్పుచుండుటను జూచి, అనేకములగు బాణములను ప్రయోగించె. అట్లు ప్రయోగించి, నాలుగు బాణములచే నాసాలవృక్షమును తునకలుతునకలుగఁ జేసె. అట్లు సాలవృక్షమును ఖండించుచుంటటితో నిలువక నాంజనేయుని భుజముపై నైదుబాణములను, ఱొమ్మునందొకబాణమును, స్తనమధ్యమునందు పదిబాణములను ప్రయోగించె. అట్లు ఆంజనేయుఁడు బాణములచే నిండిన దేహముగలవాఁడై అతిరౌద్రమగు కోపమును బొంది శరీరము బెలియక పండ్లు పటపటఁ గొఱుకుచు నాబహిర్ద్వారమునందున్న యినుపగుదియను దీసికొని గిరగిరం ద్రిప్పుచుండె. మిగులబలముగలవాఁడగు నాయాంజనేయుఁడతివేగముతో నాయినుపగుదియను ద్రిప్పి జంబుమాలియొక్క విశాలమగు ఱొమ్మపై విసరివైచె. అంత నాగుదియయొక్క దెబ్బతాకినతోడనే యాజంబుమాలియొక్క తలగాని, కాళ్లుగాని చేతులుగాని, విల్లుగాని, రథముగాని గాడిదెలుగాని, అచటనగుబడదయ్యె. అట్లు ఆంజనేయునిచే గొట్టఁబడి మహాబలశాలియగు నాజంబుమాలి చంపఁబడుటయే గాక సర్వాంగములును భూషణములును చూర్ణములై రూపుచెడి నేలయందుబడినవి. అంత మహాబలశాలులగు కింకరులు జంపఁబడుటయే గాక జంబుమాలి గూడ చంపఁబడెనని రావణాసురుఁడు విని, మహాకోపమును బొంది నేత్రములనుండి నిప్పులం గ్రక్కుచు నాలోచించుచుండె. అట్లు ఆలోచించి మహాబలపరాక్రమశాలియును, ప్రహస్తునిపుత్రుఁడును, నగు జంబుమాలి జంపఁబడుటచే రాక్షసేశ్వరుఁడగు రావణాసురుడు నేత్రంబులెఱ్ఱవాఱ మహాకోపమును బొంది కండ్లుగిరగిరం ద్రిప్పుచు మంత్రిపుత్రులను బిలిచి, మీరుబోయి యావానరునిబట్టి సంహరింపుఁడని ఆజ్ఞాపించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదినాలుగవసర్గ ముగిసెను.

(*)

మంత్రిపుత్రులగు నేడ్గురు రాక్షసులను వారిసైన్యమును ఆంజనేయుడు సంహరించుట.

అంత అగ్నిహోత్రముయొక్క కాంతివంటి కాంతిగల

వారును, మహాబలముగలవారును, సమస్తశస్త్రాస్త్రముల నెఱిగినవారలలో నుత్తములును, మితిలేని శౌర్యముగలవారును, రాక్షసేశ్వరుడగు రావణాసురునిచే బ్రేరేపింపబడినవారును, నగుమంత్రిపుత్రులు ఏడ్గురును, మిగుల గొప్పసేనాసమేతులై పరస్పరముజయమును గోరుచున్నవారును, బంగారముచే జేయబడినవియును, రాజచిహ్నములు వ్రాయబడినవియునగు టెక్కెములతోను, సాధారణములగు టెక్కెములతోను నలంకరింపబడినవియును, మేఘధ్వనిపంటిధ్వనిగలవియును, గుఱ్ఱములచే బూన్పబడినవియును, నగు తేరులు గలవారును, యుద్ధాపేక్షచే మిగుల సంతసించినవారునునై, పుటముదీరిన బంగారముచే నలంకరింపబడి నానావర్ణములుగల విండ్లనుగరించి, జ్యాఘోషణము జేయుచు, మెఱుములతోగూడిన మేఘములవలె నున్నవారై బైలువెడలిరి. అట్లు బైలువెడలిన యామంత్రిపుత్రులయొక్క తల్లులును, బంధువులును, స్నేహితులును, "కింకరులును, జంబుమాలియు, సంహరింపబడరనివిని, అట్టి యాంజనేయునిపైకి యుద్ధమునకు బోయెడి వీరినిజూచి ' మిగుల దుఃఖితులైరి. అట్టియెడ నామంత్రిపుత్రులు, పుటముదీరిన బంగారునగలనుధరించినవారై, బహిర్ద్వారముననున్న యాంజనేయునిపైకి యుద్ధమునకు బోయెడి సంతోషముతో నొండొరులనొరయుచు నయ్యాంజనేయుని నెదుర్కొనిరి. అట్టియెడ నారాక్షసులను మేఘములు, తమయొక్క రథగర్జనమే, మేఘగర్జనమువలె ననుకరింపుచుండ, బాణవృష్టిగురియుచు, "వర్షించుచున్న మేఘములవలెనే" ప్రకాశించుచుండిరి. అట్టియెడ ఆంజనేయుడు బాణవర్షముచే గప్పబడినవాడగుచు "వర్షముచేగప్పబడిన పర్వతశ్రేష్ఠమగుహిమవత్పర్వతమువలెనే" యొప్పుచుండె. అట్లు బాణవర్షముచే గప్పబడి యాంజనేయుడతిశీఘ్రముగ సంచరించుచు వారి రథవేగమునకును, బాణవేగమునకును, జిక్కక అమోఘములగు నారిబాణములను వ్యర్థముజేసె. మఱియు బాణములను ధరించి గగనవీధియందు సంచరించుచుండెడుయా రాక్షసులకు జిక్కక సంచరించుచున్న పరాక్రమశాలియగు నాంజనేయుడు "ఇంద్రధనుస్సుతో గూడియుండెడు మేఘములతోడసంచరించెడు వాయుదేవునివలెనే" ప్రకాశించుచుండె. అట్లుప్రకాశించుచున్న ఆంజనేయుడు మహాభయంకరమగు సింహనాదమునుజేసి, ఆగొప్పరాక్షస సేనను భయపరచి, యీరాక్షసులపైనయత్యతివేగమునువహించె అట్లతివేగముతో శత్రుసంహారకుడగు నాంజనేయుడు కొందఱి నఱచేతితో మోదె. కొందఱిని పాదములచే దరిమె కొందఱినిముష్టిచేమొట్టె మఱికొందఱిని గోళ్ళతోచీల్చె. మఱియు నాంజనేయుడు కొందఱురాక్షసులను ఱొమ్ముతోబొడిచి చంపె కొందఱిని కాళ్లతోతన్నిచంపె, మఱియు కొందఱుఆంజనేయునియొక్క సింహనాదమువినుటచే నచటనున్నవారచటనే బడిచచ్చిరి. అట్లనేకవిధములచే నామంత్రిపుత్రుల నందఱిని నాంజనేయుడు సంహరించె అంతమిగిలిన రాక్షససైన్యమంతయు దశదిశలకును బరువులెత్తిరి ఆసైన్యములోనున్న యేనుగులు వికారధ్వనిగలుగగ నఱ్ఱెచ్చినవి గుఱ్ఱములుగుండెలు అవిసి నేలంబడినవి రథములు, విఱిగినపైకప్పును టెక్కెములును గలవియై నేలంబడె భూమినంతయు నాక్రమించినవి అప్పుడామహాయుద్ధమునందు ఒచ్చిన పీనుగులు రక్తమువెల్లనైన నెత్తుటేరులయందు గొట్టుకొని పోవుచుండనవి లంకానగరమునందింటింటను నానావిధములగు వికారములైన మేఘధ్వనులు వినబడినవి అట్టియెడ మహాబలపరాక్రమశాలియును భయంకరమగు యుద్ధవీరుడును, నగు నాంజనేయుడు, మహాబలవంతులగు నామంత్రిపుత్రులనందఱిని సంహరించి మఱల యుద్ధము జేయగోరినవాడై బహిర్ద్వారమునందు గూర్చుండియుండె

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదియైదవసర్గ ముగిసెను

సేనానాయకులగు నైదుగురు రాక్షసులను ఆంజనేయుడు చంపుట.

అంతరాక్షసేశ్వరుడగు రావణాసురుడు మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుడు మంత్రిపుత్రుల నందఱిని సంహరించెననివిని మిగుల జిగుప్సనుబొంది కనుబొమలు ముడిబడ అమితాలోచనపరుడై యోచించుచుండె. ఇట్లు ఆలోచించి దశగ్రీవుడు తనమనస్సున నిశ్చయించుకొని, విరూపాక్షుని, యూపాక్షుని, దుర్ధరుడనువానిని, ప్రఘసుడనువానిని, భాసకర్ణుడనువానిని, పిలిచె. మఱియు ఆంజనేయునిబట్టి సంహరించుటయందు అధికోత్సాహము గలవారును, యుద్ధమునందు వాయువేగముతో సమానమైన వేగముగలవారును, నీతిశాస్త్రవిశారదులును, శూరులును, నగు నాసేనానాయకుల నైదుగురునిపిలిచి ఆంజనేయునిపైకి యుద్ధమునకు బోవుటకై యిట్లని యాజ్ఞాపించె. మహాబలమునకు స్థానభూతులైన యోసేనానాయకులారా! మీరందఱును గుఱ్ఱములతోడను ఏనుగులతోడను రథములతోడను బోయి యెవ్విధముచేనైనను, నావానరుని సంహరించిరండు. మీరుబోయి యానొకనిని వెళ్వనమునేత్తనైననువంచించి మహాప్రయత్నముచే సంహరింపవలయును.

మఱియు దేశకాలవిరోధమైన కార్యమును నేమఱక ప్రయత్నించి సరిపరుచుకొనవలయును. ఆవానరుడు జేయు కార్యములచే నాలోచించిచూడగా సామాన్యమైన కోతి మాత్రుడని నాకుతోచలేదు. చక్కగా నాలోచించి చూడగా మహాబలముగల యొకగొప్పభూతముగాని వేరుగాదు. కాదేని ఒకవేళ యింద్రుడు మనకొఱకు తపస్సుజేసి మనలనందఱిని జంపుటకై యీగొప్పభూతమును సృష్టించెనేమో? మున్ను నేనుమిమ్ములనందఱిని గూర్చుకొనిపోయి దేవతలను, గంధర్వులను, యక్షులను, పన్నగులను, జయించితిని. వారలచే మనకేదైన అప్రియము గలుగుటసహజము అదియేయిదియని దలంచుచున్నాను. ఇందు కొంత మాత్రమును సంశయములేదు. కావున మీరెట్లయిన బలవంతముగ వానానరుని బట్టుకొనవలయు. మహాభయంకరమైన పరాక్రమముగల యీవానరుడు మీచేగూడ నవమానింపబడడని నాకుతోచుచున్నది. మున్ను, వాలని సుగ్రీవుని, మిగులబలముగలవాడగు జాంబవంతుని, సేనాధిపతియగు నీలుని, మఱియు ద్వివిదుడు మొదలగు ననేకవానరవీరులను నేజూచియున్నాను. వారలకిట్టి గమనవేగమును, బుద్ధియును, బలమును, ఉత్సాహమును, రూపమునులేదు. కావున నిది నాకు జూడగా వానరరూపమును ధరించి వచ్చిన యేదో యొకగొప్పభూతముగ దోచుచున్నది. మీరు మిగుల గొప్పప్రయత్నముజేసి యీవానరునిబట్టి మరణమునొందింపవలయు. మూడులోకములయందుండెడు దేవదానవులును, మానవులును, రణరంగమునందు మీయెదుట నిలుచుటకు సమర్థులుగారు. ఇదియథార్థము. అట్లితరులు మీయెదుట నిలువజాలనివారై యుండినను, యుద్ధమునందు జయాపజయములు నిశ్చయములుగావు. కావునయుద్ధమునందు జయముగోరునట్టి నీతిశాస్త్రవిదులు సర్వప్రయత్నములచే దమ్ముతామే గాపాడుకొనుచుండవలయు. కావున మీరు మిగులజాగరూకులై యుండవలయును. అని రావణాసురుడు సేనానాయకులకైదుగురికిని నీతిని బోధించిపంపె మిగుల బలపరాక్రమముగలవారును, మహావేగము గలవారును, అగ్నిహోత్రునకు సమానమైన పరాక్రమముగలవారును, నగు నాసేనానాయకులైదుగురును తమస్వామియాజ్ఞను దీసికొని శిరసావహించి, రథములతోను, మదించినయేనుగులతోను, మహావేగముగల గుఱ్ఱములతోను, నానావిధములగు కఱుకైన బాణములతోను గూడినవారై సమస్తములగు సైన్యమును వెంబడించి వచ్చుచుండగ నాంజనేయునిపైకి యుద్ధమునకు బోయిరి. అట్లు పోయి, మిగుల ప్రకాశించుచున్నవాడును, అప్పుడుదయించిన సూర్యునివలెనున్నవాడును, తనకాంతిచే సూర్యునియుపహసించుచున్నవాడును, మిగుల నుత్సాహము గలవాడును, గొప్పప్రయత్నము గలవాడును, అధికమగు బలముగలవాడును, బహిర్ద్వారమునందున్నవాడును, నగు నాంజనేయుని, మహాశౌర్యవంతులగు సేనానాయకులుజూచిరి అట్లు సేనానాయకులు, మిగుల బుద్ధిమంతుడును, మహావేగము గలవాడును, మహాబలము గలవాడును, గొప్పదేహముగలవాడును, నగునాయాంజనేయుని జూచినంతనే, చుట్టును గమ్ముకొని మిగులభయంకరములగు నానావిధాయుధములచే నెదిరించిరి. ఇట్లెదిరించి, వారిలో దుర్ధరుడనువాడు, మిగుల క్రూరములైనవియును, మహాకఱుకైనవియును పీతముఖములు గలవియును, కలువఱేకులవంటి కాంతిగలవియును, నగునైదుబాణములను ఆంజనేయుని శిరముపై నాటునట్లువైచె. అట్లువేసిననాబాణములు ఆంజనేయుని శిరమునందు నాటుటచే దశదిశలను నిండునట్లు ఆంజనేయుడు గొప్పసింహనాదమునుజేసి గగనమార్గమున కెగిరె అంత మహాబలపరాక్రమశాలియగు దుర్ధరుడనువాడు, తానును తనరథముతోగూడ నాంజనేయుని వెంబడించి యాకాశమునకెగిరి, జ్యాఘోషమును జేయుచునాంజనేయునిపైబాణవృష్టినిగురిపించె. అట్లుగగనమార్గమున శరవృష్టిగురియుచున్న దుర్ధరుని "శరదృతువునందువర్షించుచున్న మేఘమును వాయువు అడ్డగించునట్లు" ఆంజనేయుడడ్డగించె. అట్లడ్డగించిన యాంజనేయుని దుర్ధరుడు శరవృష్టిచేముంచె. అప్పుడాంజనేయుడు వాని శరవేగమునకు మిగులనొచ్చియు యుద్ధమునందు మిగుల వృద్ధినిబొందె. మఱియు ఆంజనేయుడు తనదేహమును మిగుల గొప్పదియగు పర్వతమువలెనే పెంచి సాహసముచే నతిదూరముగమీదికెగిరి మహావేగముతో 'పిడుగువలెనే'' దుర్ధరుని రథముపై దుమికె. అట్లుఆంజనేయుడుదుముకగానే యతనిరథమునకుగట్టియున్న యెనిమిది గుఱ్ఱములునుజచ్చె. రథమయొక్కకండ్లును నొగయునువిఱిగి చూర్ణమై నేలంబడినవి. అంతనాదుర్ధరుడును, తనరథముకుప్పగూలి భూమియందు బడినతోడనే తానునువిగతజీవుడై నేలంబడియె. అంతదుర్ధరుడుజచ్చి నేలంబడగానేజూచి, దుర్ధర్షులును, విరోధులనణగద్రొక్కువారును, నగువిరూపాక్ష యూపాక్షు లిరువురును మిగులకోపోద్దీపితులై నేత్రములనుండి నిప్పులురాల పండ్లుపటపటం గొరుకుచు నాకాశమున కెగిరిరి.

అట్లతివేగమున మీదికెగిరినవిరూపాక్షయూపాక్షులిరువురును, నిర్మలమగు నాకాశమార్గమున సంచరించుచున్న మహాబాహుడగు నాంజనేయుని యినుపగుదియలతో తా

మ్మున మోదిరి. అంతగరుత్మంతుని పరాక్రమముతో సమానమైనపరాక్రమముగలవాడును, మహాబలుడును, నగునాంజనేయుడు, మహావేగవంతులగు నావిరూపాక్షయూపాక్షులను నానావిధములచేబలుమారుప్రహరించి మరల నేలకువచ్చుచుండె. అట్లుప్రహరించుచు వాయుదేవుని కుమారుడగు నాయాంజనేయుడొక సాలవృక్షమును బెకలించుకొని గిరగిరంద్రిప్పి యతివేగముగ, మహాపరాక్రమశాలులగు నావిరూపాక్షయూపాక్షులపైవైచి నాయిద్దఱిని సంహరించె. అంతనామర్దనుడును, విరూపాక్షయూపాక్షులిరువురును మహాబలవంతులగు నాంజనేయునిచే సంహరింపబడిరనివిని, ప్రఘసుండనువాడతి రౌద్రముతో బండ్లుపటపటమనిగొరికి నేలంగుద్ది మీదికెగిరి అయ్యాంజనేయుని యెదిరించె. మఱియు మహాపరాక్రమశాలియగు భాసకర్ణుడును, మిగులక్రుద్ధుడై శూలమును దీసికొనిఆంజనేయునిపైకి పోయె. అట్లాంజనేయునియెదిరించిన ప్రఘసుడును భాసకర్ణుడును నొకటిగాజేరి వానరోత్తముడగు నాంజనేయునితోయుద్ధముజేయుటకారంభించిరి అట్లుయుద్ధముజేయుచు ప్రఘసుడనువాడు కఱుకైనవాదరలుగల యడ్డగత్తులతోను, భాసకర్ణుడను రాక్షసుడు శూలములతోను నాంజనేయునితో యుద్ధముచేసిరి. అట్టియెడ ఆంజనేయుని దేహమంతయు ప్రఘసభాసకర్ణులచేగాయపరుపబడి, రక్తముశరీరమునందుండి కారుటవలనతలవెంట్రుకలన్నియు నెత్తుటిచే దడుపబడి "కిరణములతోనొప్పుచున్న బాలసూర్యునివలె" ఆంజనేయుడు ప్రకాశించుచు మహాకోపమును బొందె. అట్లు కోపమునుబొంది మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుడు మృగములతోనుపాములతోను చెట్లతోను నిండియుండెడు నొకగొప్పపర్వతశిఖరమును బెకలించి హూహూయని గొప్పధ్వనిజేయుచు నాశిఖరమును వారిపైవైచి సంహరించె. అట్లాంజనేయుడా సేనానాయకుల నైదుగురుని సంహరించి యాపిమ్మట తక్కినసైన్యమునంతయు సంహరించె. అట్లుసంహరింపనుపక్రమించి వానరోత్తముడగు నాంజనేయుడు గుఱ్ఱములను గుఱ్ఱంబులపైవైచియు, యేనుగుల నేనుగులపైనెత్తివైచియు, భటులను భటులతో చరిమియు, రథములనెత్తిరథములపైగొట్టియు, దేవేంద్రుడసురసమూహములను చెండాడిచంపినట్లు, ఆసైన్యమునంతయును బాదుజేసె. అట్టియెడభూమియంతయుజూచినను పీనుగపెంటలై, చచ్చిపడినయేనుగులతోను గుఱ్ఱములతోను రథములతోను భటులతోను నిండినదియై యడుగుబెట్టుటకు సందులేనిదై యుండె. అంతమిగులశౌర్యవంతుడగు నాంజనేయుడు మహాపరాక్రమశాలులును, సేనాసమేతులును, వాహనములతో గూడినవారును, నగుసేనాపతులను సంహరించి బహిర్ద్వారమునందు గూర్చుండి యుద్ధమును గోరుచు నలసటదీర్చుకొనుచున్నవాడై ప్రళయకాలయముడువలె నతిరౌద్రుండై యుండె

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలినలుబదియాఱవ సర్గముగిసెను

(*)

—{ రావణాసురుడు ఆంజనేయునితో యుద్ధముసేయుటకు అక్షకుమారుని బంపుట. }—

అంత, సేనానాయకులైదుగురును సేనలతోను వాహనములు మొదలగువాటితోను నాంజనేయునిచే జంపబడిరని రాక్షసేశ్వరుడగు రావణాసురుడువిని, తనముందటనున్నవాడును, యుద్ధమునకు గర్వించియెదురుజూచుచున్నవాడును, తనపుత్రుడును నగు అక్షకుమారునిజూచె. అట్లు రాక్షసేశ్వరుడగు రావణాసురుడు అక్షకుమారునిజూచినీవుబోయియాంజనేయుని బట్టిచెండాడిరమ్మని యాజ్ఞాపించె. అంతమహాపరాక్రమశాలియగు నక్షకుమారుడు రావణాసురునిచే ప్రేరేపింపబడి బంగారముచే నలంకరింపబడినదియును నానావర్ణములుగలదియునునగువిల్లును ధరించి, "బ్రాహ్మణశ్రేష్ఠులవలన హోమద్రవ్యములచే వృద్ధిపొందింపబడిన అగ్నిహోత్రుండనుబోలె" ప్రకాశించుచు లేచె. అట్లు లేచిమహాపరాక్రమవంతుడును, రాక్షసశ్రేష్ఠుండును, నగునక్షకుమారుడు, మిగులగొప్పదియును, బాలసూర్యునికాంతివంటికాంతిచే ప్రకాశించుచున్నదియును, పుటముదీర్చిబంగారముచేజేయబడినదియును, నగురథమునెక్కి ఆంజనేయునిపైకి యుద్ధమునకు బైలువెడలె మఱియు దేవతలపరాక్రమమువంటి పరాక్రమముగల యాయక్షకుమారుడు, బహుకాలముతపస్సుచేసి సంపాదింపబడినదియును, పుటముదీరిన బంగారముచే జేయబడినదియును, టెక్కెములచే నలంకరింపబడినదియును, నవరత్నములచే నలంకరింపబడిన రాజచిహ్నములుగల టెక్కెములచేత నలంకరింపబడినదియును, మనోవేగమువంటి వేగముగల యెనిమిది గుఱ్ఱములలోగట్టబడినదియును, సురాసురులకునుగుడ నెదరింపనలవిగానిదియును, భూమికి సంబంధింపకనే సంచరించునదియును, సూర్యునికాంతివంటి కాంతిగలదియును, ఆకాశమార్గమునసంచరించునదియును, యుద్ధమునకుగా సిద్ధపరుపబడినదియును, అమ్ములపొదితో గూడినదియును, ఎనిమిది యడ్డగత్తులు గట్టబడినదియును, గణగణయను గంటలచేనలంకరింపబడినదియును, క్రమముగనుంచబడిన శక్తియను నాయుధముచేతను, చిల్లకోలలచేతను నలంకరింపబడినది

యును, చంద్రసూర్యులకాంతివంటి కాంతిగలదియును, బంగారుపుష్పమాలికలచే నలంకరింపబడినదియును, సమస్తవస్తువులచే బ్రకాశించుచున్నదియును, అప్పుడుదయించినబాలసూర్యునివలె వెలుగుచున్నదియును, నగు రథమును నెక్కి ఆంజనేయునిపైక యుద్ధంబునకు బైలుపెడలె. అట్లు బైలువెడలిన అక్షకుమారుడు, తనయొక్క గుఱ్ఱములయొక్కయు, ఏనుగలయొక్కయు, రథములయొక్కయు ధ్వనులు దశదిశలనునిండ, పర్వతములు ప్రతిధ్వనులచే మ్రోగుచుండగ సమస్తసేనాసమేతుడై ద్వారతోరణమునందున్నవాడును, మిగులసమర్థుడును, నగు నాంజనేయుని జేరబోయె. సింహముయొక్కనేత్రములవంటి నేత్రములుగల యాయక్షకుమారుడు అట్లు ఆంజనేయునిచేరబోయి, జనసంహారముకొఱకు మిగుల వృద్ధిబొందిన ప్రళయకాలాగ్నిహోత్రునివలె వెలుగుచున్న నాయాంజనేయుని జూచి పరమాశ్చర్యముచేతొట్రుపాటునుబొంది, అహా! ఈవానరుడు మిగులపరాక్రమశాలియేయని మిగుల బహుమానపూర్వకముగ జూచె. అట్లుజూచి మిగులపరాక్రమశాలియును, రాక్షసేశ్వరుడగు రావణాసురునిపుత్రుడును, నగు నా యక్షకుమారుడు, అమితపరాక్రమశాలియగు నాంజనేయునియొక్క వేగమును, శత్రువులను జయించుటయందతనికిగల పరాక్రమమును, తనబలపరాక్రమములను తెస్సగదెలిసికొని తనమనస్సునందు దృఢపరచుకొని, "వసంతఋతువునందు సూర్యుడువృద్ధిబొందునట్లు" మిగుల నభివృద్ధినొందెను. అట్లక్షకుమారుడు వృద్ధినొందుటను జూచి యాంజనేయుడును మిగులవృద్ధిబొందుచునేయుండె. ఆంజనేయుండట్లు వృద్ధినొందుటనుజూచి యక్షకుమారుడు, యుద్ధమునందు ఆంజనేయుడు దుర్నివారంబగు పరాక్రమము గలవాడనియును, నితనిజయించుట దుస్తరమనియును, దెలిసికొని, ప్రళయకాలరుద్రునివలె వృద్ధిబొంది ధైర్యమునుదెచ్చుకొని మిగుల జాగరూకుడై ఆంజనేయునితో యుద్ధంబుపక్రమించి మొట్టమొదట మిగులతీక్ష్ణములగు మూడుబాణములను ఆంజనేయునిపైవైచె. అందుకు ఆంజనేయుడు యెంతమాత్రమును లక్ష్యముచేయడయ్యె అదిజూచి యక్షుడు, మనస్సులో మిగుల గర్వమును బొంది, ధనుర్బాణములను దీసికొని, హనుమంతుడు మిగులబలగర్వితుడనియును, శ్రమయనునది యెట్టిదో తెలియనివాడనియును, శత్రువులను జయించుటయం దధికసామర్థ్యముగలవాడనియును దెలిసికొని తనలోతానాలోచించె అట్లుకొంతసేపు తనలోతానాలోచించి, బంగారుపతకమును బాహుపురులును కుండలములును ధరించియున్న నాయక్షకుమారుడు అతివేగముగల పరాక్రమము నవలంబించి యాంజనేయునిడీకొనియె. అంతనాయిరువురకును జరిగిన ద్వంద్వయుద్ధము యీడులేనిదిగనుండె. కావున సురాసురులుగూడమిగులభయభ్రాంతులైరి వారిమనస్సు కలంగినవి. మఱియు నక్షకుమారాంజనేయుల మల్లయుద్ధమును జూచి భూమివికారముగనఱచె. సూర్యుడు భయముచేనెండగాయడయ్యె. వాయుదేవుడు గాలిగొట్టుటకు భయమును బొంది వీవడయ్యె. పర్వతములు వడవడవడంకె. ఆకాశము నఱవదొడంగె. సముద్రములుకలతబారె. అట్లు ఘోరయుద్ధముసేయుచు, గురిబెట్టుటయందును, బాణము సంధించుటయందును, విడుచుటయందును మహానిపుణతగలవాడును, యుద్ధవీరుడును, నగు నక్షకుమారుడు, గ్రద్ధములగు ముఖములుగలవియును. రెక్కలుగలవియును, బంగారముతో జేయబడినబాణపింజెములు గలవియును, విషముచేబూయబడిసర్పములవలెనున్నవియును, నగుమూడుబాణములను ఆంజనేయుని శిరమునుజూచి ప్రయోగించె. ఆమూడుబాణములును ఆంజనేయుని శిరముపైజక్కగానాటె. అంత నెత్తురుగారుటచే దడిసిన గుండ్రని నేత్రములుగలవాడును, నెత్తుచేదడిసిన సమస్తదేహమునుగలవాడునై బాణములనెడికిరణములతోనొప్పుచు, కిరణములతోగూడిన బాలసూర్యునివలె బ్రకాశించుచుండె అట్లు బ్రకాశించుచున్నవాడును, సుగ్రీవునియొక్క ప్రధానులలో ముఖ్యుడును, నగు నాయాంజనేయుడు, యుద్ధమునందు మిగుల శ్రేష్ఠములగు నానావిధఆయుధములతోగూడినవాడును, చిత్రగతులుగల ధనుస్సుగలవాడును, రాక్షసేశ్వరుడైన రావణాసురునిపుత్రుడును, నగు నాయక్షకుమారునిజూచి, మిగులసంతోషమునుబొంది యుద్ధోన్ముఖుడైమిగులవృద్ధినొందె. అట్లువృద్ధిబొంది, మందరపర్వతముయొక్క శిఖరమునందున్న సూర్యునివలెనున్నవాడును, మిగులవృద్ధినొందిన కోపమునుగలవాడును, మహాబలపరాక్రమములతో గూడినవాడునునై నేత్రములనెడి యగ్నిశిఖలచేనాహాసములతోను సైన్యముతోను గూడిన యక్షకుమారుని దహించువానివలె మిగులచురుకు చూపులతో జూచె. అట్టియెడయుద్ధమునందు నానావిధములగు చిత్రవర్ణములుగలధనువేయింద్రధనుస్సుగాగలవాడును, బాణవృష్టియేవర్షముగ గలవాడును, నగునారాక్షసుండను మేఘుడు వానరోత్తముడగు నాంజనేయుడను పర్వతముపై "మేఘుడుపర్వతముపై వర్షించునట్లు" బాణవర్షమును గురిపించె. అట్లుబాణవృష్టిని గురియుచున్నవాడును, యుద్ధమునందుమహాభయంకరమైన పరాక్రమముగలవాడును, మిగులవృద్ధినొందినకాంతియును బలపరాక్రమములును గలవాడును, మేఘముతోసమానమైన వేగముగలవాడును, నగునక్షకుమా

రునిజూచి ఆంజనేయుడు మహాసంతోషమును బొందినవాడై యొక సింహనాదమును జేసె మఱియు నాయక్షకుమారుడు, పసితనమువలన శరీరము దెలియక మిగుల పరాక్రమించినవాడును, మహాకోపమును బొందినవాడును, కోపముచే నేత్రములనుండి నెత్తురు గ్రక్కుచున్నవాడును నై "పచ్చిగడ్డిచేగప్పబడియుండు పెద్దపాడుభావిపైకపోవుచున్న మదించినఏనుగవలె" యుద్ధమునందు అప్రతిముడగు నాంజనేయునిపైకిబోయె. అట్లుతెంగలించిదుమికి, అక్షకుమారుడు మహాపరాక్రమశాలియగు నాంజనేయునిపై యనేకబాణములను ప్రయోగింపగా నతడుగ్రుక్కి మేఘధ్వని వంటి ధ్వనిగలుగునట్లుగా గట్టిగనరచె. వాయుపుత్రుడగు నాంజనేయుండట్లుఝుంకారమును సేయుచు కాళ్లను చేతులను విసరుచు చూచువారలకు భయముదోచునట్లు గగనమార్గమునకెగిరె. అట్టియెడ, మిగులబలముగలవాడును, రాక్షసోత్తముడును, మహాపరాక్రమము గలవాడును, మహారథుడునునగు నాయక్షకుమారుడు, "మేఘుడు పర్వతముపై తొల్వనాసగురియునట్లు" మిగుల భయంకరముగ మీదికెగురుచున్న ఆంజనేయునిపై బాణవృష్టిగురిపించుచు నాంజనేయునితోగూడ మీదికెగిరె అంత మనోవేగమువంటి వేగముగలవాడును, యుద్ధమునందు మహాభయంకరమగు పరాక్రమము గలవాడునునగు నాయాంజనేయుడు గాలి సంచరించునట్లు, అక్షయకుమారుడు ప్రయోగించు బాణములమధ్య సంచరించుచు నతనిబాణముల నన్నింటిని వ్యర్థముజేయుచు వాయుమార్గమగు నాకాశమార్గమున దిరుగుచుండె అట్లాకాశమునందు సంచరించుచున్నవాడును, వాయుపుత్రుడునునగు నాంజనేయుడు, ధనుర్బాణములధరించి యుద్ధోన్ముఖుడై, నానావిధములుగ చిత్రవిచిత్రములైన బాణములచే నాకాశమునంతయును చీకట్లుగమ్మునట్లుజేయుచున్న నాయక్షకుమారుని మిగుల గౌరవదృష్టితోజూచి యితనినేవిధముచే సంహరింపవచ్చుననియాలోచించుచుండె ఇట్లు ఆలోచించుచుండునెడ మహాబలపరాక్రమశాలియగు నక్షకుమారుడు ఆంజనేయుని భుజమధ్యమున బాణములచేగొట్టగా నాదెబ్బలకోర్వజాలక గట్టిగానఱచి, కార్యములయొక్క గుణాగుణముల నెఱిగినవాడును, మహాబాహుడును, నగునాంజనేయుడు యుద్ధమునందు పరాక్రమించి విరోధిని జయించుటనుగురించి చక్కగ యోచించి యిట్లనిచింతించె ఇతడు మహాబలపరాక్రమములుగలవాడు. వీడుబాలుడయ్యును బాలసూర్యునివలె వెలుంగుచు మహాగొప్పకార్యములను జేయుచున్నాడు. వీడుసమస్తములగు యుద్ధకార్యములను లెస్సగ గుర్తెఱిగినవాడుగనున్నాడు. వీనినిజంపుటకు నాకేదియును సుహాయముదోచలేదు. మఱియు నితడు మహాబలముగలవాడు మిగుల పరాక్రమముగలవాడు యుద్ధమునందు మిగుల జాగరూకుడు. ఎట్టికష్టములైనను నోర్చువాడు ఇతడు యుద్ధసందర్భములను లెస్సగగుర్తెఱిగినవాడౌటచే, దేవతలును, యక్షులును, పన్నగులును, సమస్త ఋషులును నితనిమన్నించి గౌరవింతురు. యిందుకెంతమాత్రమును సంశయములేదు. ఇతడుపరాక్రమనుచేతను ఉత్సాహముచేతను మిగుల వృద్ధినిబొంది, నాకెదుటనిలిచి భయములేక నన్నుజూచుచున్నాడు. మిగుల శీఘ్రగామియగు నితని పరాక్రమమునుజూచి దేవదానవులైనను మనస్సుకలంగి దిగులునొందుదురు. ఇతని యిప్పుడుపేక్షజేయుదునేని యింకముందుమునులను లక్ష్యపెట్టడు బాలుడుగా నున్నప్పుడే యిట్లున్నది. ఈతడు పెరుగను పెరుగను యుద్ధమున నితనిపరాక్రమము మిగుల వృద్ధియగునుగదా? కావున నితనిని యిప్పుడు చంపుటయేయుక్తమని నాకుతోచుచున్నది ఏలననగా వృద్ధిబొందుచుండెడి యగ్నిహోత్రమెంతమాత్రమును ఉపేక్షింపదగినటిగాదుగదా? కాబట్టి యిప్పుడు ఉపేక్షింపరాదు అని, మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుండట్లనేక ప్రకారములుగ, శత్రువుయొక్క పరాక్రమమునుగుఱించి యాలోచించి, తాను జేయదగిన కార్యమును నిశ్చయించుకొని, అక్షకుమారుని నెవ్విధముచేతనైనను జంపవలయునని దలంచి మహావేగమును నవలంబించె ఇట్లుమహావేగమును నవలంబించిన నయ్యాంజనేయుడు, వాయుమార్గమగు నాకాశమార్గమునందు, మహావేగముతో పోచ్చరికగలిగి సంచరించుచున్నవియును, రథమును, దానికి సంబంధించిన సమస్తభారమును మోసికొని యతివేగముతో తిరుగుచున్నవియును, నగునాయక్షకుమారునియొక్క గుఱ్ఱములనెనిమిదింటిని నాకాశమునందే ఒకయఱచేతిదెబ్బచే జంపె అప్పుడు వానరరాజైన సుగ్రీవుని మంత్రియగు నాంజనేయుని యఱచేతిదెబ్బచే నాయక్షకుమారుని గుఱ్ఱములు యెనిమిదియును జావగానే వానిరథముగూడవిఱిగిపోయినసొగయును చక్రములును గలదియై యాకాశమందుండి నేలంగూలి చూర్ణమయ్యె. అట్లారథము నేలంగూలగానే, మహాభయంకరమైన పరాక్రమము గలవాడును, మహారథుడును, (అనగారథంబునుసారథినిగుఱ్ఱములను తన్నును గాపాడుకొనుచు పదునొకండువేలవిలుకాండ్రతో పోరునట్టివాడని యర్థము) నగునాయక్షకుమారుడు దానినివిడిచివిల్లును,ఖడ్గమును,గరించి "యోగియగువాడుతనయొక్క తపోమహిమవలన దేహమును భూమియందువిడిచి స్వర్గమున

కుబోవునట్లు" ఆకాశమార్గమున నెగిరె అట్టియెడ, వాయుదేవుని పరాక్రమమువంటి పరాక్రమము గలవాడగు నయ్యాంజనేయుడు, గరుత్మంతునకును, వాయువునకును, సిద్ధులకును, పరమఋషులకును, సంచారస్థానమగు నాకాశమార్గమున సంచరించుచున్న నాయక్షకుమారుని జూచి మహోపాయముచే నతని సమీపమునకు బోయి క్రమముగ నతని రెండుపాదములను గట్టిగబట్టుకొనెను. అట్లు అయ్యక్షకుమారుని పాదములను గట్టిగ బట్టుకొని వాయుదేవునకు సమానమైన పరాక్రమముగల నయ్యాంజనేయుడు "గరుత్మంతుడు పెనుపాములను దన్నుకొనిపోవునట్లు" అతనినిల నాకసమునకు దన్నుకొనిపోయి వేయిమారులు (అనేకమారులు) గిరగిర ద్రిప్పి నేలంగొట్టె. అట్లాంజనేయుడు నేలయందు గొట్టగానే నాయక్షుడు విఱిగినమెడయును మొలయును, తొడలును చేతులును గలవాడును, నెత్తురుగారుచున్న దేహము గలవాడునునయ్యె. మఱియు నలియగొట్టబడిన కండ్లును యెముకలును, విఱిగినసమస్తావయవములును, వీడినదట్టియును గలవాడునునై ఆంజనేయునిచే సంహరింపబడి నేలంగూలె. ఈరీతిగ వానరోత్తముడగు నాంజనేయుడు ఆయక్షకుమారుని నేలంగొట్టి సంహరించి రాక్షసేశ్వరుడగు రావణాసురునకు అమితమగు భయమును గలుగునట్లు జేసె. మరియు నాయక్షకుమారుడాంజనేయునిచే సంహరింపబడగానే జ్యోతిశ్చక్రమునందు సంచరించువారును, శ్రేష్ఠములగువ్రతములుగలవారును, నగుమహర్షులును, దేవేంద్రుడు మొదలగు సమస్తదేవతలును, యక్షులును, పన్నగులును, సమస్తభూతములును, పరమాశ్చర్యమును బొంది సొకటిగ జేరి యయ్యాంజనేయుని జూచి యనేకప్రకారములుగ స్తుతించిరి అట్టియెడ మహాపరాక్రమశాలియగు నయ్యాంజనేయుడు, దేవేంద్రుని పుత్రునితో సమానమైనవాడును, నెత్తురుంబోలె నెఱ్ఱని నేత్రములుగలవాడునునగు నాయక్షకుమారుని సంహరించి కొంతయూరట నొంది, అయ్యశోకవనముయొక్క బహిర్ద్వారమును బొంది "ప్రళయకాలయముండునుంబోలె" అతిరౌద్రాకారముతో గూర్చుండ యుండెను.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదియేడవ సర్గ ముగిసెను.

ఇంద్రజిత్తు అంజనేయుని బ్రహ్మాస్త్రముచే బంధించుట

అట్లుఆంజనేయునిచే నక్షకుమారుడు సంహరింపబడెననివిని, మహాబలపరాక్రమ శాలియగు రాక్షసేశ్వరుడైన రావణాసురుడు, వ్యసనమునువిడిచి మనస్సును నెమ్మదిగజేసికొని మిగుల కోపమునుబొంది, దేవేంద్రునితోసమానుడగు యింద్రజిత్తును నాంజనేయునిపైకి యుద్ధమునకుబొమ్మని ఆజ్ఞాపించి యిట్లనియె.

ఓయింద్రజిత్తా! నాయనా! నీవు అస్త్రవేత్తలలో నుత్తముడవు సకలశాస్త్రవేత్తలలో నధికుడవు. శస్త్రములనెఱింగినవారిలో శ్రేష్ఠుడవు. నిన్నుజూచి దేవాసురులు గూడ మహాభయమును బొందుదురు. నీవు దేవదానవులనుగూడ దుఃఖింపజేయుదువు. సమస్తదేవతలను దేవేంద్రునిం గూడ యుద్ధమున ననేకమారులు జయించియున్నావు నీవు నీతాతయగు బ్రహ్మదేవుని ఆరాధించి యనేక దివ్యాస్త్రములను సంపాదించియున్నావు. ఓకుమారుడా! యింద్రజిత్తా! నీకుయుద్ధమునందుగల యస్త్రకౌశల్యమును జూచి సురులుగాని అసురులుగాని వాయుగణములుగాని, నీయెదుటనిలుచుటకు సాధ్యముగాదు. మరియు మూడులోకములయందును, నీతోయుద్ధముజేసి పరాజయమునొందని వాడొక్కడైనను లేడు. ఓయింద్రజిత్తా! నాయనా! బాహుపరాక్రమముచే రక్షింపబడినవాడవు నీవు వొక్కరుడవే సమస్తతపంబులను నెరవేర్చినవాడవు నీవువొక్కడవేను. దేశకాలవిభాగములను లెస్సగనెరింగినవాడవు నీవువొక్కడవేను. నీవు మహాబుద్ధిమంతుడవు యుద్ధకార్యములయందు పురుషప్రయత్నములచే నీకసాధ్యంబైన దేదియును లేదు. మనస్సునసాలోచించుటయందు నీకసాధ్యమైన విషయమేదియును లేదు. మూడులోకములయందును నీయస్త్రబలమును దేహబలమును నెఱుగనివాడొక్కడును లేడు. మరియు తపోమహిమ చేతను, బలముచేతను, యుద్ధనైపుణ్యమునందును, అస్త్రప్రయోగమునందును, నీవు నాతో సమానుడవు. యుద్ధమునందు నాకేదేనిసంకటముగలిగినప్పుడు నిన్ను జ్ఞప్తికిదెచ్చుకొని యట్టిసంకటమును దీర్చికొని నెమ్మదినొందుచున్నాను ఓతండ్రీ! ఇంద్రజిత్తా! కింకరులందఱును వానరునిచే జంపబడిరి జంబుమాలియును జంపబడె. మిగులపరాక్రమశాలులగు మంత్రిపుత్రులును మడిసిరి. సేనానాయకులైదుగురును సంహరింపబడిరి. ఏనుగలతోను గుఱ్ఱములతోను, రథములతోను, కాల్బలములతోను గూడిన సంపూర్ణమైన సైన్యములును హతమయ్యె. నాయనా! అయ్యో! నీకుతమ్ముడును, మనకు మిగులప్రియుడును, బాలుడునునగు నక్షకుమారుడుగూడ సంహరింపబడె. శత్రుసంహారకుడవగు నోయింద్రజిత్తా! నాకు నీయందుగల గౌరవము వారలయం దెవరియందును లేదు. మహామతిమంతుడవగు నోపుత్రుడా! కింకరులుమొదలగు వారలనందరినిసం

హరించిన మహాబలపరాక్రమశాలియగు నావానరుని యొక్క బలపరాక్రమములును, నీబలపరాక్రమములును జక్కగ పోల్చిచూచుకొని, తగిన వేగమును నవలంబింపుము. అస్త్రవేత్తలలో నుత్తముడవగునోయింద్రజిత్తా! సమస్తశత్రువులను శాంతినొందించిన పవిచారుండిపోయి యాయాంజనేయునిచేరి తరువాతనైనను మనబలమునకు నాశనము లేకుండునట్లు మనబలమును వానిబలమును జూచియుద్ధమునకారంభింపుము. మహాపరాక్రమశాలివగు నోయింద్రజిత్తా! గుంపులుగుంపులుగ సైన్యములనుసంహరించిన వానరునివిషయములో సేనలక్కరకరావు వజ్రాయుధముగూడ నతని నేమియును జేయజాలదు. కావున దానింబుచ్చికొని వానిపైకిపోరాదు. ఈవానరునకుగల గమనవేగము వాయుదేవునకుగూడలేదు. మఱియుపరాక్రమమునందగ్నిహోత్రముతో సమానుడు కావుననతనిని సామాన్యములగునాయుధములతో జంపుటకుసాధ్యముగాదు నీవు నేనిప్పుడుజెప్పినప్రకారముగ లెస్సగనాలోచించి, నీకార్యము జెడకుండునట్లుమిగుల హెచ్చరికగలవాడవై శ్రేష్ఠములగు ధనుర్బాణములనుగ్రహించి, బ్రహ్మాస్త్రముమొదలగు శ్రేష్ఠములగునస్త్రములను దలంచుకొనుచుపొమ్ము. అపాయములేకుండునట్లు కార్యము నారంభింపుము

అదియునుగాక నొక్కవిశేషమును జెప్పెదవినుము ఇప్పుడునిన్ను నేను యుద్ధమునకుం బంపుట అంతయుచితమైనదిగాదు అయిననీయుపాయము రాజధర్మములకును, ఆధర్మములననుసరించుక్షత్రియునకును, దగినది. కావుననిన్నుబంపుచున్నాను. శత్రువులను సంహరించునట్టి యోయింద్రజిత్తా! సమస్తములగు యుద్ధనైపుణ్యములయందు నీవుపండితుడవు. నీకుసమానుడెవ్వడునులేడు. కావుననీవు అవశ్యముగయుద్ధముజేయవలయును ఆయుద్ధమునందెవ్విధముచేతనైనను జయింపగోరుము అని రావణాసురుడు కొడుకునకు నుపదేశమునుజేసె. అంత దేవతాప్రభావమువంటిప్రభావముగలవాడును, మిగుల బలపరాక్రమశాలియును, నగునింద్రజిత్తు తనతండ్రివాక్యములనువిని, యుద్ధమునకుబోవుటకుమెత్తించినవాడై ప్రభువైనరావణాసురునకు ప్రదక్షిణపూర్వకముగ నమస్కారమునుజేసె. ఇట్లునమస్కారమునుజేసి, అంతతనకిష్టులైనవారిచే సన్మానింపబడినవాడై యుద్ధగర్వితుడగుచు పరమోత్సాహముతో రణమునకుబైలుదేరె. మఱియుమిగుల శ్రీమంతుడును, తామరఱేకులవలెవిశాలములగు నేత్రములు గలవాడును, మహా పరాక్రమశాలియును, రాక్షసేశ్వరుడైన రావణాసురునకు పుత్రుడును, నగునింద్రజిత్తు "పర్వకాలములయందలి సముద్రునివలె" మిగులనుప్పొంగుచు యుద్ధమునకువెడలె. అట్లుబైలుదేరి, దేవేంద్రునితో సమానుడగు నాయింద్రజిత్తు, గరుత్మంతునివేగమువంటి వేగముగలవియును, తెల్లనై మిగులకఱుకైన కోఱలుగలవియును, నగువాలుగేనుగులచే బూన్పబడినదియును, భూమికెంతమాత్రమును సంబంధింపక యేయతివేగమున బోవునదియును, నగురథముపైనెక్కి అస్త్రధారూఢుడైనవాడును, విలుకాండ్రలో నుత్తముడును, శస్త్రవిద్యయందునేర్పరియును, అస్త్రవిద్యనెఱిగినవారిలోశ్రేష్ఠుడును, నగునాయింద్రజిత్తు ఆంజనేయునిపైకి యుద్ధమునకతివేగముగ బైలువెడలిపోయె. అట్టియెడ వానరోత్తముడగు నాంజనేయుడింద్రజిత్తుయొక్క రథధ్వనినిన్ని, అల్లెత్రాటిధ్వనినిన్నివిని మఱలయుద్ధముగలిగెగదాయని పరమసంతోషభరితుడయ్యె. రణపండితుడగు యింద్రజిత్తు మిగులగొప్పదియగు ధనుస్సును కఱుకైనబాణములనుదీసికొని, నారిసారించుచు ఆంజనేయునిపైకి యుద్ధమునకు బోయె, అట్లింద్రజిత్తుయుద్ధసన్నద్ధుడై మహాసంతోషముతో ధనుర్బాణములనుబూని యుద్ధమునకు బైలుదేరగానే దశదిశలును చీకట్లుగమ్మినవి మిగులభయంకరములగు క్రూరమృగముల నేకవిధములుగనఱచె అట్టియెడ జ్యోతిశ్చక్రమునందుదిరుగునట్టి పన్నగులు, యక్షులు, మహర్షులు, సిద్ధులు మొదలగువారందఱును వేడుకజూచుటకై యాసమీపప్రదేశమునకువచ్చియుండిరి, పక్షిసమూహములు మహాసంతోషమును బొంది యాకాశమున గుంపులుగూడి గట్టిగనఱచుచుండెను. అట్లురథమునెక్కి యతిశీఘ్రముగ వచ్చుచున్న యింద్రజిత్తునుజూచి మహావేగవంతుడగు నాంజనేయుడు ఒకగొప్పసింహనాదమును జేసి వృద్ధినిబొందుటకారంభించె అదిజూచి, నానావర్ణములుగల ధనుస్సుధరించియుండెడు యింద్రజిత్తు మిగులశ్రేష్ఠమగు రథమును ఎక్కినవాడై పిడుగుధ్వనివంటిమహాధ్వనిగలుగునట్లు వింటినారిసారించె. అంతమహావేగముగలవారును, అధికమైన బలముగలవారును, యుద్ధమునందెంతమాత్రమును భయములేనివారును, పరస్పర విరోధముగలవారును, నగునయ్యాంజనేయుడును, రాక్షసేశ్వరుడైన రావణాసురునిపుత్రుడగు నింద్రజిత్తును గలిసిరి అట్టియెడవారియుద్ధము దేవేంద్రాసురుల యుద్ధమువలెచూపట్టుచుండె. అట్టియెడ నాంజనేయుడు మిగులవృద్ధినిబొంది, మహారథుడును, విల్లునుదాల్చినవాడును, యుద్ధమునందుతనసామర్థ్యముచే గౌరవమునుబొందినవాడును, నగు నాయింద్రజిత్తుయొక్కబాణవేగమును తప్పించుకొని, అప్రమేయమగు వాయుమార్గమున సంచరించుచుండె. అట్లుఆంజనేయుడు సంచరించుటనుజూచి, వైరివీరులను సంహరిం

చువాడును, మిగుల పరాక్రమశాలియును, నగునింద్రజిత్తు,
మిగులవాఁడువులై తీక్ష్ణములగు యినుపనములనలుగలవియు
ను, రమణీయములగు ఱెక్కలుగలవియును, బంగారము
తోఁజేయబడిననానావర్ణములగు క్రిందిపిడులుగలవియును,
కొంతవంకరలైన కొనలుగలవియును, వజ్రాయుధముయొ
క్క వేగమువంటి వేగముగలవియును, నగుబాణములనుఆం
జనేయునిపై బ్రయోగించె. అంతనాంజనేయుడు ఆయిం
ద్రజిత్తుయొక్క రథధ్వని, మద్దెలలయొక్కయు భేరులయొ
క్కయు తప్పెట్లయొక్కయు ధ్వనిని, ధనుష్టంకారముయొ
క్క ధ్వనినివిని మఱలమీదికెగిరెను. మఱియు నావానరో
త్తముడగునాంజనేయుడు, గురిబెట్టుటయందు మిగులప్రసి
ద్ధుడగు నాయింద్రజిత్తుయొక్క గురినివ్యర్థముజేయుచు, ఆ
కాశమార్గమున నతిశీఘ్రముగ బాణములమధ్య సంచరించు
చుండె. ఇట్లుసంచరించుచు పలుమారు ఆంజనేయుడు ఆ
యింద్రజిత్తుయొక్క బాణములకెదుట నిలుచుచును మఱలన
తడు ప్రయోగించునంతలో చేతులుచాచి యాకాశమార్గ
మునకెగురుచు నిట్లనేకవిధముల సంచరించుచుండె. అట్టియె
డ, మహావేగముగలవారును, యుద్ధకార్యమున సమర్థులు
ను, నగునయ్యింద్రజిత్తాంజనేయులిరువురును జేయుచుండిన
యుత్తమయుద్ధమునుజూచి సమస్తభూతములును సంతసిం
చినవి. ఇంద్రజిత్తు, ఆంజనేయునిగుట్టు దెలిసికొనజాలడ
య్యె. వాయుపుత్రుడగు నాంజనేయుడుగూడ మహాపరా
క్రమశాలియగు నింద్రజిత్తుయొక్క మర్మమును దెలిసికొనలే
డయ్యె. దేవతలపరాక్రమముతో సరియైన పరాక్రమము
గలయా యింద్రజిత్తాంజనేయులిరువురును, ఒకరినొకరుజ
యించుటకు సాధ్యులుగాకయుండిరి. అట్లు, అమోఘముల
గు తనబాణములు వ్యర్థమైపోవుటయును, ఆంజనేయుడు
ఆబాణములను తప్పించుకొనుటయునుజూచి, గురిబెట్టుట
యందును, బాణములను సంధించుటయందును, మిగులసా
మర్థ్యముగలవాడును, మహాపరాక్రమశాలియును, నగునా
యింద్రజిత్తుమిగులచింతాక్రాంతుడయ్యె. అట్లుచింతాక్రాం
తుడై చాలాకాలము ఆలోచించి, రాక్షసరాజైన రావ
ణాసురుని పుత్రుడగు యింద్రజిత్తు, ఆంజనేయుని సంహ
రించుటయందుపాయమును గానక చంపలేనని నిశ్చయిం
చుకొని కడపట నాతనిబట్టుకొనుటకు తగునైన ఉపాయ
మును ఆలోచించియిట్లనిచింతించె. అట్లు ఆలోచించి, మి
గులపరాక్రమశాలియును, అస్త్రవేత్తలలో నుత్తముడును,
మహాకాంతిమంతుడును, నగునాయింద్రజిత్తు, వానరోత్త
ముడగునాంజనేయునిపైబ్రహ్మాస్త్రముసంధించె. అట్లుఅస్త్ర
మును సంధించి, అస్త్రములయొక్క తత్వమునెఱిగినవాడు
ను, గొప్పచేతులుగలవాడును, ఇంద్రునిజయించినవాడును
నగునయ్యింద్రజిత్తు, ఆంజనేయుని జంపుట కలవిగాదనియె
ఱిగి బ్రహ్మాస్త్రప్రయోగమునుజేసి దానిచేనాతనిబంధించె.
అంత, వానరోత్తముడగు నాంజనేయుడు, రాక్షసశ్రేష్ఠు
డగు నింద్రజిత్తుయొక్క బ్రహ్మాస్త్రప్రయోగమువలన కట్టు
వడిచేష్టలుడక్కి నేలంగూలె. అప్పుడు ఆంజనేయుడుతాను
బ్రహ్మాస్త్రమునకు గట్టుబడుటనెఱింగి, బ్రహ్మదేవునిప్రభా
వమువలన చేష్టలు ఉడిగి వేగముతగ్గిననాడై పూర్వము
బ్రహ్మదేవుడు తనకుయిచ్చినవరమును దలచుకొని యిట్లని
యాలోచించె. ఓహో, ఈయింద్రజిత్తు లోకగురుడగుబ్ర
హ్మదేవునియస్త్రమును నేనువిడిపించుకొనజాలనని తెలిసికొ
నియీయస్త్రమును బ్రయోగించె. నేను బ్రహ్మదేవునియ
స్త్రమునకుగట్టుపడియుండుట యుచితమేను. అనియిట్లు
బ్రహ్మాస్త్రముయొక్క మాహాత్మ్యమును చక్కగనాలో
చించియును తనకుపూర్వము బ్రహ్మదేవుడే బ్రహ్మాస్త్ర
మును విడిపించుకొను శక్తి దెలియచేసియుండుటయునుబ్ర
హ్మాస్త్రమునకుమాత్రము ముహూర్తకాలము బద్ధుడై
యుండుమనిచెప్పుటయును, లెస్సగనాలోచించి బ్రహ్మదే
వునియందలి గౌరవముచే గొంతసేపు ఆయస్త్రమునకు
నాంజనేయుడుబద్ధుడైయుండె అట్లు ఆంజనేయుడు బ్ర
హ్మాస్త్రమునకు ముహూర్తకాలము బద్ధుడైయుండి తన
లోతానిట్లనియాలోచించె. బ్రహ్మాస్త్రబద్ధుడనైయుండుని
న్ను బ్రహ్మదేవుడును, దేవేంద్రుడును, వాయుదేవుడునుర
క్షించుచున్నారు. నాకేభయమును గలుగదు. నన్నువారు
గాపాడుచున్నారు. ఒకవేళ రాక్షసులునన్ను బట్టుకొన్న
నువాకేలాటి భయమును గలుగనేరదు. గొప్పఫలముగలు
ను. రాక్షసేశ్వరుడగు రావణాసురునితో మాటలాడవచ్చు
ను. కావుననన్ను శత్రువులు పట్టుకొందురుగాక. అని, వై
రివీరులను సంహరించునట్టి వాడును, కార్యములనుజక్క
గనాలోచించిచేయువాడును, నగు నాంజనేయుడిట్లుకా
ర్యమును నిశ్చయించుకొని, నిశ్చేష్టితుడైయుండె. అంతరా
క్షసులుతన్నుబట్టుకొనుటకు సమీపమునకువచ్చి బెదరింపగ
" హుం " అని గొప్ప సింహనాదమునుజేసె. పిమ్మటఆం
జనేయుడు చేష్టలు దక్కియుండుటను జూచి, రాక్షసులం
దఱును, శత్రుసంహారకుడగు నాంజనేయుని, జనపనా
రతోను, పాతపేలికలతోను పేడంబడిన త్రాళ్లతోగట్టిరి
అంత ఆంజనేయుడు తన్నువారుకట్టి తీసికొనిపోయినయెడ
లరాక్షసేశ్వరుడగు రావణాసురుడు, వానరునిగట్టితెచ్చితిరి
గదా? యనిమహాసంతసముచే నన్ను జూచునని యెంచి,
శూరులగు రాక్షసులుతన్ను బలవంతముగపట్టి బంధించు

చుండగనేమియును బలుకకయూరకుండె. అట్లురాక్షసులు మహాశౌర్యవంతుడగు నాంజనేయుని త్రాళ్లతోగట్టగానే బ్రహ్మాస్త్రముచే విడువంబడినవాడాయె.

శ్లో॥ అస్త్రబంధస్సచాన్యంహినబంధమనువర్తతే॥ బ్రహ్మాస్త్రముచేగట్టఁబడినవానిని యితరబంధములచే గట్టిన నాబ్రహ్మాస్త్రబంధమువిడిచిపోవును కావునమహాశౌర్యవంతుఁడగునింద్రజిత్తు, నారతోను పాశ్రపేలికలతోను చేనంబడిన త్రాళ్ళతోగట్టఁబడిన యావానరోత్తముఁడగు నాంజనేయుఁడు బ్రహ్మాస్త్రముచే విడువంబడినవాఁడని తెలిసికొనియయ్యయో, "బ్రహ్మాస్త్రబద్ధుడగు వానినియితరబంధములచేగట్టిన నాబ్రహ్మాస్త్రమునిలువదుగదా" యనిమిగులచింతనొంది తనలోతానిట్లనియాలోచించె. ఇంక నేనేమిసేయుదును అతిప్రయాసముచేత శేసినగొప్పకార్యమునిరర్థకమైపోయినది. మూఢులగుసీరాక్షసులుబ్రహ్మాస్త్రముయొక్క స్వభావమునునెఱుఁగరైరి. బ్రహ్మాస్త్రముచేవిముక్తుఁడైన వానిపైని నింకయేయస్త్రమునుపారదు రావణాసురునకు అందరియందును సంశయముగలుగును. మఱియు నాంజనేయుఁడు బ్రహ్మాస్త్రముచే విడువబడినవాఁడయ్యును, తన్నురాక్షసులు త్రాళ్ళతోగట్టియీడ్చుకొనిపోవుచుండగ మిగులపీడనొందినవాఁడయ్యును, తన్ను బ్రహ్మాస్త్రమువిడిచినదని తెలిసికొనలేడయ్యె. అనియిట్లింద్రజిత్తుచింతించె

అంతక్రూరులగు నారాక్షసులు ఆంజనేయునికఱ్ఱలతో గొట్టుచును, పిడికిళ్ళతోఁబొడుచుచును, రాక్షసేశ్వరుఁడగురావణాసురునియొద్దకు నీడ్చుకొనిపోయిరి. అంత, బ్రహ్మాస్త్రముచే విడువఁబడినవాఁడును నారలచేఁజేయఁబడిన త్రాళ్ళతోగట్టఁబడినవాఁడును, నగునాయాంజనేయునిఁజూచి "ఇతఁడేయావానరుఁడని" రాక్షసేశ్వరుఁడగు రావణాసురునకును, నచ్చటనున్నజనములకును జూపిరి. అట్లారాక్షసులు సభలోనున్నవారందఱికినిజూపి యనంతరము, మదించిన యేనుఁగువలెనున్నవాఁడును, త్రాళ్ళచేగట్టఁబడినవాఁడును, నగునావానరోత్తముని రావణాసురునిముందటనిలిపిరి. అంతనచటనున్నరాక్షసులు తమలోతామిట్లనిజెప్పుకొనదొడగిరి. వీడెవ్వఁడు? ఎవరికిసంబంధించినవాఁడు? ఇచ్చటికేలవచ్చినాఁడు? ఏకార్యమునకై యెవఁడుబంపగావచ్చినాఁడు? ఈవానరునిచంపుఁడు. కాల్పుఁడు. కాల్చితినుఁడు. అనియిట్లు అచటనున్నరాక్షసులు మిగులకోపమునుబొందినవారై యొండొరులతోజెప్పుకొనుచుండిరి. అట్టియెడ మహాపరాక్రమశాలియగు నాయాంజనేయుఁడు అతిశీఘ్రముగరావణాసురుని సమీపమునకుబోయినంతనే, రాక్షసేశ్వరుఁడగు రావణాసురుని పాదములసమీపమున గూర్చుండియున్న మంత్రివృద్ధులను, సమస్తమణులచేనలంకృతమైయున్న యాసభాగృహమునుజూచె. అప్పుడు, వికారస్వరూపులగు రాక్షసులచేనిటునటు నీడ్వంబడుచున్నవాడును, వానరోత్తముఁడును, నగునాంజనేయుని మహాబలపరాక్రమశాలియైన రాక్షసేశ్వరుడగు రావణాసురుడుజూచె. మఱియువానరోత్తముఁడగు నాంజనేయుఁడు గూడ, మిగులకాంతిమంతుఁడును బలవంతుఁడునునై మిట్టమధ్యాహ్నసూర్యునివలె వెలుంగుచున్నవాఁడును, రాక్షసప్రభువును, నగు రావణాసురునిజూచె అంతనారావణాసురుఁడు మహాకోపమునుబొందుటచే కండ్లుమిగులనెఱ్ఱవుబారగా గ్రుడ్లుగిరగిరంద్రిప్పుచు, పండ్లుపటపటంగొఱుకుచు, ఆంజనేయునిజూచి, తనసమీపమునగూర్చున్నవారును, కులముచేతనుశీలముచేతను మిగులమున్నవారును, నగుమంత్రిశ్రేష్ఠులప్రక్క దిరిగిజూచి యీవానరుడెవ్వఁడో యితనివృత్తాంత మడుగండనివారలకాజ్ఞాపించె అప్పుడామంత్రివృద్ధులు వానరోత్తముఁడగు నాంజనేయునిజూచి, ఓరీవానరుఁడా! నీవేలయిచటికివచ్చినావు? నిన్నెవ్వరుబంపిరి? అనియడుగగానే, నేనువానరరాజగు సుగ్రీవునిదూతను నవ్వానతడు రాయభారినిగా నిచటికిబంపగావచ్చితినని వారలకు ఆంజనేయుఁడు జెప్పుటకారంభించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదియెనిమిదవసర్గముగిసెను.

—※ ఆంజనేయుఁడు రావణాసురునిజూచుట ※—

అంతమిగులభయంకరమగు పరాక్రమముగల వానరోత్తముఁడగు నాంజనేయుఁడు, రావణాసురునియొక్క తేజమునకు మిగులనాశ్చర్యమునుబొంది, కోపముచేనెఱ్ఱనైననేత్రములుగలవాఁడై రావణాసురునిజూచె. మిగులనుత్తమమైనదియును, జక్కగప్రకాశించుచున్నదియును. బంగారముతో జేయబడినదియును, ముత్తెములచేనలంకృతంబైనదియును, నగుకిరీటముచే బ్రకాశించుచున్నవాఁడును, సూర్యునివలెనధిక కాంతితో బ్రకాశించుచున్నవాఁడును, వజ్రములతోగూడినవియును, మిగులశ్రేష్ఠములగుమణులతో జేయఁబడిన యాకారముగలవియును, బంగారముచే నానావర్ణములుగ నలంకరింపఁబడినవియును, మైమనస్సంకల్పముచే నిర్మింపంబడిన వానివలెనున్నవియును. నగునాభరణములుధరించినవాఁడును, మిగులశ్రేష్ఠమగుపట్టువస్త్రమునుధరించినవాఁడును, ఎఱ్ఱగంధమును మైపూతబూసికొన్నవాఁడును, విచిత్రములైనవియును, నానావిధములైనవి

యును, నగుకస్తూరి మొదలగు వాసనద్రవ్యములయొక్క విశేషములతోఁగూడిన చందనపూఁతగలవాఁడును, విశాలము లైనవియును, మిగులరమణీయము లైనవియును, ఎఱ్ఱనినేత్రములచేనొప్పుచున్నవియును, భయంకరమగు చూపుగలవియును, మిగులప్రకాశించుచుండెడి కఱుకైనపెద్దకోఱలుగలవియును, వ్రేలుకాడుచుండెడి పొడవైనపెదవులచే నొప్పుచున్నవియును, నగుపదితలలతో ప్రకాశించుచున్నవాఁడును నై నానావిధములగుదుష్టజంతువులచే నావరింపఁబడినశిఖరములచేనొప్పుచున్న మందరపర్వతమువలెనున్నవాఁడును, మిగులపరాక్రమశాలియును, మహాకాంతిగలవాఁడును, నల్లనికాటుకకొండవలె నున్నవాఁడును, నిండుచంద్రునితోసమానమైన కాంతిగలహారములయొక్క పతకములచే బ్రకాశించుచున్న ఱొమ్ముగలవాఁడై కొంగలచేవ్యాపింపఁబడిన మేఘమువలెనున్నవాఁడును, బాహుపురులను ధరించినవియును, శ్రేష్ఠమగుశ్రీగంధముచేత బూయఁబడినవియును, ప్రకాశించుచున్నయంగదములను ఆభరణములచేనలంకరింపఁబడినవియును, మిగులబలిసినవియునునైయైదుతలలుగల పాములంబోలెనున్నవియును, నగుచేతులతోఁ గూడుకున్నవాఁడును, మిగులపెద్దదియును, స్ఫటికమణులతోఁజేయబడినదియును, నానావర్ణములుగలదియును, శ్రేష్ఠములగు మణులతోఁజెక్కఁబడినదియును, మిగులనుత్తమములగు కంబళములచేపరువఁబడినదియును, నగుసింహాసనమున సుఖముగగూర్చున్నవాఁడును, మిక్కిలిచక్కఁగానలంకరించుకొన్నవారును, చామరములను చేతులయందు బాల్చినవారును, నగుస్త్రీలచే జక్కఁగసేవింపఁబడినవాఁడును, దుర్ధరుఁడును, ప్రహస్తుఁడును, మహాపార్శ్వుండును, నికుంభుండును అనునీపేళ్లుగలవారును, మంత్రాలోచనమును జక్కఁగనెఱిఁగినవారును, బలముచేగర్వించినవారును, నగునీనలువురుమంత్రులతోఁగూడ కొలువుదీరిసుఖముగ గూర్చున్నవాఁడై నాలుగుసముద్రములచే బరివేష్టింపఁబడినసమస్తమైన భూమండలమువలెనున్నవాఁడును, మఱియు నాలోచనలయొక్క తత్వములనుజక్కఁగ నెఱింగినవారును మంగళకరమగుదృష్టియును నాలోచనయునుగలవారును, నగునితరమంత్రులగురాక్షసులచే సేవింపఁబడినవాఁడునునై దేవతులచేసేవింపఁబడుచుండు దేవేంద్రునివలెనున్నవాఁడును, అధికమైనకాంతిగలవాఁడును, మేరుపర్వతపుశిఖరమునందున్న మేఘమువలెనున్నవాఁడును, నైనరాక్షసేశ్వరుఁడగు రావణాసురునిజూచె. అప్పుడుఆంజనేయుఁడు, భయంకరమగుపరాక్రమముగల యారాక్షసులుతన్ను మిగులబాధించుచున్నను, రాక్షసేశ్వరుఁడగు రావణాసురునిజూచి పరమాశ్చర్యమునుబొందె. మఱియునాయాంజనేయుఁడు, ప్రకాశించుచున్నవాఁడును, రాక్షసేశ్వరుఁడును, నగురావణాసురునిజూచి మహాకాంతిగల రావణాసురునిట్టు కంన్నెత్తిచూడజాలక భ్రమనుబొందినవాఁడై తనలోఁ దానిట్లని యాలోచించె.

రాక్షసేశ్వరుఁడగు నీరావణాసురునియాకారము మిగులనాశ్చర్యకరముగనున్నది వీనిధైర్యమును మిగులనాశ్చర్యకరముగనున్నది. ఇతనిబలమును, కాంతియును, శౌర్యమును మిగులనాశ్చర్యకరముగనున్నది. అహా! ఇదిమిగులనాశ్చర్యము ఈరావణాసురుఁడు సమస్తములైనశుభలక్షణములతోఁగూడియున్నాఁడు. ఇదిఅత్యాశ్చర్యము. ఈరాక్షసరాజగు రావణాసురుఁడు యిట్టియధర్మమును జేయకుండువేని, దేవేంద్రునితోఁగూడిన సమస్తదేవలోకమునకునుగూడప్రభువుగానుండఁగలఁడు మఱియు నీరావణాసురునియొక్క భయంకరములగుపనియును, ఇతరులయెడలఅక్రమముసేయునవియును, జనులచేనిందింపఁబడినవియును, నగుకార్యములుజేసియున్నాఁడు. అందుచేతనే దేవదానవులునుసమస్తలోకములయందున్నవారునునితనింజూచిగుండెలవిసిభయమునొందుచున్నారు ఈరావణాసురుఁడుకోపమునొందెనేని, సమస్తప్రపంచమును నొకమహాసముద్రముగ జేయునంతటియుత్సాహముగలవాఁడు అనియిట్లు మిగులబుద్ధిమంతుఁడును, వానరోత్తముఁడును నగుఆంజనేయుఁడు, మితిలేనికాంతిగలవాఁడును, రాక్షసేశ్వరుఁడను నగు రావణాసురునిప్రభావమునుజూచి యిట్లనేకవిధములుగతనలోఁ దానాలోచించుకొని పరమాశ్చర్యమును బొందె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి నలుబదితొమ్మిదవసర్గముగిసెను.

▸(✻)◂

రావణాసురునిమంత్రులుఆంజనేయునినీవెవడవనిఅడుగుట.

మిగుల గొప్పచేతులుగలవాఁడును, సమస్తలోకములను నేడ్పించువాఁడును, నగునారావణాసురుఁడు మిగులకోపముచేశరీరము వెలియనివాఁడై, తనముందటనున్నవాఁడును, పింగళవర్ణములగునేత్రములుగలవాఁడును, మహాకాంతిచేనొప్పుచున్నవాఁడును, వానరశ్రేష్ఠుఁడును, నగుఆంజనేయునిచక్కఁగజూచి కొంతభయమునుబొంది తనలోఁ దానిట్లనియాలోచించె

మున్ను నేను కైలాసపర్వతమును కదలింపజేసినప్పుడు నన్నుశపించినవాఁడును, మిగులమాహాత్మ్యము గలవాఁ

డును, నగునందికేశ్వరుఁడు తానుగానే యిట్టివానరరూపము దాల్చివచ్చెనేమో; అదిగాదేని మిగులగొప్పయసురుఁడగుబాణుడే యిట్టివానరరూపము దాల్చివచ్చెనేమో; అని యిట్లనేకవిధములుగ నాలోచించి రాక్షసేశ్వరుఁడగురావణాసురుఁడు మహాకోపముచే నెఱ్ఱనైననేత్రములుగలవాఁడై పండ్లుపటపటంగొరుకుచు మంత్రిసత్తముఁడగుప్రహస్తునిఁజూచి, కాలోచితమైనదియును, మంచియర్థముగలదియునునగునీమాటఁజెప్పె ఓమంత్రిసత్తమా! ఈవానరుఁడెవఁడు? ఎచ్చటనుండివచ్చినవాఁడు. ఇచటకేమిపనిగ వచ్చినాఁడు? అశోకవనమును ఏలపాడుజేసినాడు: రాక్షసస్త్రీలనేల బెదిరించెను. ఇట్టికార్యములను జేయుటచే నితనికేమిప్రయోజనము? అనునీవిషయములను దురాత్ముఁడగునీవానరుని అడుగుము. మఱియునీదురాత్ముడగువానరుఁడు, ప్రవేశింపనలవిగాని నాలంకానగరమునకేలవచ్చె? ఇచటనున్నవారలతో యుద్ధముజేయుటచే నితనికేమిప్రయోజనము? ఈవిషయములన్నియు సవిస్తరముగనడిగి తెలిసికొనుము. అని చెప్పగావిని ప్రహస్తుడు రావణాసురునిమాటనువిని ఆంజనేయునిజూచి యిట్లనియె.

ఓవానరుడా! నీకుశుభమగుగాక, నీవుఊరటనుబొందుము నీవెంతమాత్రమునుభయపడవలదు. జంకువిడువుము ఓవానరుడా! నీవుదేవేంద్రుడుపంపగా నిచటికివచ్చితివా? లేకకుబేరుఁడుపంపగా వచ్చితివా? అదియునుగాదేని వరుణదేవుఁడుబంపగావచ్చితివా? అదియునుగాదేని విష్ణుదేవుడు లంకానగరమునుజయింపగోరి నిన్నుదూతగబంపగా నీవీసుందరాకారమును ధరించివచ్చితివా యేమి? నీవెంతమాత్రమునుభయపడక నిజస్థితినిజెప్పుదువేని నిన్నువిడిచిపెట్టెదము. నిన్నేమియును జేయుటలేదు. నీదేహముమాత్రము వానరదేహముగనున్నదిగాని నీప్రభావము అత్యాశ్చర్యకరముగనున్నది. ఇదియెంతమాత్రమును వానరప్రభావముగాదు. ఓవానరుఁడా! నీవిప్పుడునీకథను యథార్థముగ కలిగినదికలిగినట్లుజెప్పుదువేని నిన్నువిడిపించెదము. అట్లుగాక నీవబద్ధమాడుదువేని నీప్రాణములెంతమాత్రమునుదక్కవు. అదియునుగాక నిన్నెవరునుబంపక నీవేవచ్చియుందువేని రాక్షసేశ్వరుఁడగు రావణాసురునిపట్టణమునకేలవచ్చితివి? దానినైనను సవిస్తరముగ నెఱిఁగింపుము. అనియిట్లుప్రహస్తుడడిగె. అంతవానరోత్తముఁడగు నాంజనేయుఁడు, రాక్షసేశ్వరుఁడగు రావణాసురునిజూచి యిట్లనియె

ఓరాక్షసరాజా! రావణాసురుడా! నేను దేవేంద్రుడు పంపగావచ్చినవాఁడనుగాను. యమునియొక్క దూతనుగాను. వరుణుడుపంపగావచ్చినవాడనుగాను. నాకును కుబేరునకు నెంతమాత్రమునుసఖ్యములేదు. నేనువిష్ణుదేవుడుబంపగావచ్చినవాఁడనుగాను. నాకీవానరరూపముజాతిసామాన్యమైనదిగానివేరుగాదు. నేనిచటికివచ్చుటకొఱకుయీవానరరూపమును దాల్చినవాడనుగాను. రాక్షసేశ్వరుఁడవగు నీదర్శనము నాకసాధ్యంబగుటచే నేనీయశోకవనమును పాడుజేసితినేని నీదర్శనముగలుగునని చేసితినిగాని వేరుగాదు మఱియు నే నాయశోకవనమును విరువగానే రాక్షసులుయుద్ధముజేయగోరి నాపైకివచ్చిరి. అంతనేనన న్నుగాపాడుకొనుటకై వారలనువధించి యుద్ధమును జేసితినిగానివేఱుగాదు ఏయస్త్రముచేతగాని యమపాశముచేతగాని, దేవాసురులకైన నన్నుబంధింపనలవిగాదు ఇట్లు నాకుబ్రహ్మదేవుఁడువరమునిచ్చియున్నాఁడు. రాక్షసేశ్వరుఁడవగు నిన్నుజూడగోరి నేనీబ్రహ్మాస్త్రమునకు బద్ధుడనైతినిగానివేఱుగాదు. నన్నురాక్షసులు త్రాళ్లతోబంధింపగానే బ్రహ్మాస్త్రమునన్నువిడిచినది. అయిననునీతోనాకొకరాజకార్యముండుటచే నీయొద్దకువచ్చితిని. అదియడిగెదవేనిచెప్పెదనువినుము. నేను మహాపరాక్రమశాలియగు శ్రీరామునిదూతను. రాక్షసేశ్వరుఁడవగు నోరావణాసురుఁడా! నేనునీకొకహితమగు వాక్యమును జెప్పెదనువినుము. అనియాంజనేయుఁడు రావణాసురునితోజెప్పె

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ఏబదియవసర్గము గిసెను.

—{ ఆంజనేయుఁడు రావణాసురునకు తానువచ్చిన కార్యమును దెలుపుట. }—

అంతమహాబలపరాక్రమశాలియగు వానరోత్తముఁడైనయాంజనేయుఁడు మిగులబలవంతుఁడగు రావణాసురునిజూచి యెంతమాత్రమునుజంకులేనివాఁడగుచు రావణాసురునితో అర్థయుక్తములగు నీమాటలనుజెప్పె రావణాసురుడా! నన్నుసుగ్రీవుఁడు నీయొద్దకుబంపగావచ్చినాను. అతడుకొన్నిసంగతులు నీకుజెప్పుమని నాతోఁజెప్పిపంపె. రాక్షసరాజవగునో రావణాసురుఁడా! నీకుతోబుట్టువుతోసమానుడును, వానరులకుప్రభుడునునగు సుగ్రీవుఁడు నీతో తనక్షేమమునుజెప్పుమనిచెప్పె. మఱియునీక్షేమమునుగూడవిచారించుమనియె. మహాత్ముఁడును నీకుతోఁబుట్టువుతోసమానమైనవాఁడునునగు సుగ్రీవుఁడు, ధర్మార్థసహితములైనవియును, ఇహపరలోకములయందు మిగులక్షేమకరములైనవియును, నగుకొన్నిమాటలు నీకుజెప్పుమని నాతోజెప్పిపంపె. వాటినిజెప్పెదను పరాకులేకవినుము.

విశేషముగరథములును, ఏనుఁగులును, గుఱ్ఱములును, గలవాఁడును, సమస్తలోకములకును తండ్రివంటివాఁడును, దేవేంద్రునికాంతివంటికాంతిగలవాఁడును, నగు దశరథమహారాజను పేరుచేనొప్పుచున్నరాజొకఁడుండెను. ఆదశరథమహారాజునకు పెద్దకొమారుఁడును, మహాబాహుఁడును, సమస్తజనులకును సంతసమునుగలుగఁజేయువాఁడును, మిగులసమర్థుఁడును మహాపరాక్రమశాలియును, మిగులకాంతిగలవాఁడును రాముఁడను పేరుగలవాఁడును నగు ధీరుఁడు తనతండ్రియగు దశరథమహారాజుయొక్క యాజ్ఞచొప్పున తనతమ్ముఁడగు లక్ష్మణునితోను భార్యయగుసీతాదేవితోనుఁగూడి ధర్మమార్గమునను సరించి సమస్తభోగములను విడిచి నారచీరెలుధరించి తాపసవృత్తితో దండకావనమునందుప్రవేశించెను. అట్లువారువనమునందు సంచరించుచుండగా మిగులమహాత్ముఁడును, విదేహదేశపురాజునునగు జనకమహారాజుయొక్క కూతురును, మహాపతివ్రతయును, ఆరామునిభార్యయును, నగు సీతాదేవిఅగపడకపోయెను. అంతనారాజపుత్రుఁడగు రాముఁడుతనతమ్ముఁడగు లక్ష్మణునితోఁగూడినవాఁడై సీతాదేవినివెదకుచు ఋశ్యమూకపర్వతమునకువచ్చి యచటసుగ్రీవునితో స్నేహముఁజేసెను. అట్లువారిరువురు స్నేహముఁజేసినపిమ్మట రాముఁడుసుగ్రీవుని, వానరరాజ్యమునకు రాజుగఁజేసెదననియును, అందుకుబదులుగసుగ్రీవుఁడు సీతాదేవిని వెదకెదననియును, ఒకరితోనొకరుప్రతిజ్ఞజేసికొనిరి. అంతనారాజపుత్రుఁడగు రాముఁడుయుద్ధమునందు వాలినిసంహరించి, వానరభల్లూకసమూహములకు సుగ్రీవునిరాజుగాజేసెను. రాక్షసేశ్వరుఁడవగు నోరావణాసురుఁడా! వాలిని మున్నీవెఱిఁగియున్నావుగదా? అట్టివాలినిగూడయుద్ధమునందు రాముఁడుఒకబాణముచేతనేసంహరించెను. ఓరాక్షసరాజా! రావణాసురుఁడా! సత్యప్రతిజ్ఞగలవాఁడును, వానరేశ్వరుఁడును, నగుసుగ్రీవుఁడు సీతాదేవినివెదకుటయందుమిగులనాసక్తిగలవాఁడై వానరులనుదశదిశలకుఁబంపియున్నాఁడు. మఱియువానరులగుంపులు, వేలకొలదిగను, లక్షలకొలదిగను, సమస్తదిక్కులయందును, పాతాళమునందును, భూమియందును, ఆకాశమునందును, సీతాదేవినివెదకుచున్నారు. ఓరావణాసురుఁడా! వారునేలను తాకకుండ నతిశీఘ్రముగసంచరించువారు. వారుమిగులబలవంతులు. వారిలోకొందఱుగరుత్మంతునివేగమువంటివేగముగలవారు. మఱికొందఱువాయువేగమువంటి వేగముగలవారు. ఓరాక్షసేశ్వరా! రావణాసురుఁడా! నేనువాయుదేవునిఔరసపుత్రుఁడను. నేనుసీతాదేవికొఱకు, నూరుయోజనములవెడల్పుగల సముద్రమును దాటిసీతాదేవిని జూచుటకయ్యేయిచటికివచ్చితిని. అట్లిచటికివచ్చి యీలంకానగరమునందుతిరుగుచు సీతాదేవిని వెదకుచుండగ నీయింటియందుగనబడినది. కావుననేనిప్పుడు నీకుచెప్పునదేమనగా; నీవుసమస్తధర్మశాస్త్రములను జక్కగాగుర్తెఱిఁగినవాఁడవు. గొప్పతపస్సు జేసిదానివలనబొందఁబడిన మహిమగలవాఁడవు. మిగులగొప్పపండితుఁడవగు నోరావణాసురుఁడా! నీవుయీరీతిగాపరస్త్రీలను నీయింటియందడ్డగించియుంచుటన్యాయముగాదు నీవంటిబుద్ధిమంతులు, ధర్మవిరుద్ధములైనట్టివియును, అనేకములగు చెడువులనుగలిగించునట్టివియును, వేరుతోగూడ నాశమునుజేయునట్టివియును, నగుకార్యములనెంతమాత్రమును జేయరుగదా. అట్టికార్యములనుజేయుటకుయత్నింపనుగూడయత్నింపరుగదా. అదిగాక రాముఁడుకోపమునుబొందుటనుజూచి లక్ష్మణుఁడధికకోపమునుజెంది బాణప్రయోగమునుజేసెనేని దేవాసురులయందెవ్వఁడైనను ఎదుటనిలువఁజాలఁడు. ఆతనిబాణప్రయోగమునుఓర్చుటకుఎవఁడును శక్తిమంతుఁడుగాఁడు. రాక్షసరాజవగు నోరావణాసురుఁడా! రామునకపరాధమునుగావించి సుఖముగజీవించువాఁడు ఒక్కఁడైననుముల్లోకములయందునలేఁడు అనియిట్లుసుగ్రీవుఁడు నీతోఁజెప్పుమని జెప్పె. ఇదినీకు భూతభవిష్యద్వర్తమానములయందుమూటియందును మేలుగలిగించునదిగను, ధర్మార్థసహితమైనదిగను, తలంపుము. అట్లుదలచిసీతాదేవినిమానవేశ్వరుఁడగు రామునకుసమర్పింపుము. నేనిచట సీతాదేవినిజూచితిని. ఏదిమాకందరకును మిగులనసాధ్యముగనుండినదోయట్టికార్యమగు సీతాదేవిని గనుగొనుటయనునది నెరవేరినది. ఇకజేయవలసినకార్యము రామునిదైయున్నది. ఆకార్యమునగుఱించి నాకుఆజ్ఞయివ్వలేదు. మఱియునీవేయైదుతలలపామును దెచ్చి నీయింటియందుంచుకొని, అదియైదుతలలుగలవిషసర్పమని తెలిసికొనలేకున్నావో, అట్టిసీతాదేవి మిగులదుఃఖితురాలై నీయింటియందుండుటనుజూచితిని "సురాసురులగూడ, మిక్కుటముగ విషముగలసియుండెడు అన్నమునుభక్షించి జీర్ణించుకొనజాలనట్లు" ఎట్టిపరాక్రమశాలియైనను సీతాదేవినిదక్కించుకొనజాలఁడు. ఎవరికినిశక్యమైనదిగాదు. ఓరావణాసురుఁడా! నీవుబహుకాలముతపస్సుజేసి దానికిఫలముగదీర్ఘాయువును బొందియున్నావు అట్టియాయువునట్టిదుష్కార్యములచే క్షీణింపజేసికొనుట యుచితముగాదు. మఱియునీవుమహాగొప్పతపస్సుజేసి సురాసురులచేతనుగూడ చావులేకుండునట్లువరమును బొందియున్న

వాఁడనుగ నాయని, నిర్లక్ష్యముగనున్నావు. ఆవరమునకు గూడబాధకమగు గొప్పకారణమొకటియున్నది. ఓరావణాసురుఁడా! ఆసుగ్రీవుఁడు దేవతలలో జేరినవాఁడుగాఁడు. రాక్షసుఁడుగాఁడు దానవుఁడుగాఁడు. గంధర్వుఁడుగాఁడు. యక్షుఁడుగాఁడు. పన్నగుఁడుగాఁడు అనగానీ సుగ్రీవుఁడు దేవదానవపన్నగ యక్షరక్షోగణములలో నెవరిలోను జేరినవాఁడుగాఁడు కావున నోరాక్షసరాజా! రావణాసురుడా! అట్టిసుగ్రీవునినెదిరించి చావకుండ ప్రాణములనెట్లుగాపాడుకొనగలవు? తపస్సుమొదలగుసత్కర్మమువల్లతప్పించుకొనగలనని యెంచియున్నావేమో, శ్లో॥ న తుధర్మోపసంహార మధర్మఫలసంహితమ్। తదేవఫలమన్వేతిధర్మశ్చాధర్మ నాశనః॥ ప్రాప్తంధర్మఫలంతావ ద్భవతానాత్రసంశయః। ఫలమస్యాప్యధర్మస్య క్షిప్రమేవప్రపత్స్యసే॥ ఓరావణాసురుడా! ధర్మఫలము ధర్మఫలముతోనేచేరియుండును. అధర్మఫలము అధర్మపలముతోనే చేరియుండును మఱియుధర్మఫలముచేనైన సుఖమునుఅధర్మఫలముచేనైన దుఃఖమునునొండొంటితో జేరియుండవు. ఆరెంటికిని వెల్తురుచీకట్లకుంబోలె చేరికగలుగనేరదు. మఱియుధర్మము ధర్మమును నాశమును జేయదు. అట్లుధర్మము అధర్మమునునశింపజేయునేని అధర్మముధర్మమును గూడనశింపజేయును ధర్మమువలన అభివృద్ధియెట్లుగలుగుచున్నదో, అట్లేయధర్మమువలన నాశమునుగూడగలుగుచున్నది. కావుననీవుగావించిన తపఃఫలమునకు గాను, దిగ్విజయసకల సామ్రాజ్యైశ్వర్యములు మొదలగుసుఖము ననుభవించితివి. ఇంకనీవు నేటివఱకును జేయుచుండెడు పరభార్యాపహరణము మొదలగుదుష్కార్యములకు ఫలముగపుత్రమిత్రకళత్ర దాసదాసీజనములతోఁట సమస్తమునుశీఘ్రముగ నాశమునుబొందుటనుజూడగలవు. ఇందుకెంతమాత్రమునుసంశయములేదు నేనుజెప్పెడి హితవాక్యముల వినుము. ఓరావణాసురుఁడా! శ్రీరామచంద్రుఁడు, జనస్థానమునందు ఖరదూషణులుమొదలగు పరాక్రమశాలులగు రాక్షసులనందఱిని సంహరించుటయును, నిన్నుసప్తసాగరములయందుముంచిన వాలినిఒకబాణముచేజంపుటయును, వానరరాజగు సుగ్రీవునితో స్నేహము గావించుటయును, యీసమస్తవిషయములను చక్కగనాలోచించి విమ్మటనీమేలునకుఁ దగినమార్గమునువెదకికొనుము. ఓరావణాసురుడా! గుఱ్ఱములు రథములు యేనుగులు కాల్బలములు మొదలగు చతురంగబలసమేతమగు నీలంకానగరమును సమస్తసంపదతోగూడనాశమునుజేయుటకు నేనొక్కడనేసమర్థుడనగుదును. అయిననది శ్రీరామచంద్రునియిష్టముగాదు

ఇదిగాక యెవఁడుసీతాదేవినియవమానించెనో, అట్టిపగవానిని నేనేసంహరించెదనని రాముఁడువానరభల్లూక సైన్యములకెదుట ప్రతిజ్ఞ జేసియున్నాఁడు కావుననేనునాశమునజేయను. ఓరాత్రించరా! రావణాసురుడా! సాక్షాద్దేవేంద్రుడైనను రామునకు అపరాధమును గావించి సౌఖ్యముగనుండజాలఁడు అట్లుండగా నీవంటిసామాన్యుడుమేలునుబొందజాలఁడని చెప్పనేల? అవిస్పష్టమైనవిషయమే; ఓరావణాసురుడా! నీయధీనమునందుండెడు సీతాదేవిని సామాన్యపుసీతగానెంచకుము. ఇదయీలంకనంతయు నాశముచేయునట్టిమహాశక్తి ప్రళయకాలమునందు సమస్తమునునాశనముజేయునట్టి కాళరాత్రియే యీరూపముగనున్నదనియెఱుగుము. అదియునుగాక సీతారూపముగనుండెడుకాలపాశమును నీకునీవుగానే, మెడలపైనుంచుకొనవలదు. చక్కగానాలోచించి నీకేదిహితమో దానిని చేయుము. మఱియుసీతాదేవియొక్క పాతివ్రత్యమహిమచేత యీలంకానగరము బీడింపబడినదై యిదివఱకే కాల్పబడినట్లున్నది. ఇంకరామునికోపాగ్నిచే కోటబురుజులతోడను, రాజవీథులతోడను, సమస్తవస్తుసమేతముగను, కాల్పఁబడగలదని యెఱుగుము. ఓరాక్షసేశ్వరుఁడా! రావణాసురుడా! నీవుపుత్రమిత్రులతోడను, దాయాదులతోడను, మంత్రులతోడను, తోబుట్టువులతోడను, సమస్తభోగములతోడను యీలంకానగరమును నాశముపొందునట్లు జేయకుము. రాక్షసరాజులలోనుత్తముడవగు నోరావణాసురుఁడా! నేనురామునిదాసుండను గాన, రామునిప్రభావమునుజక్కగనెఱుఁగుదును రాయభారమును వహించి వచ్చినవాఁడనుగాన, నీకుమేలుదెల్పెదను. పక్షపాతముగబలుక్కటకు నేనుమానవుఁడనుగాను, రాక్షసుడనుగాను. మధ్యస్థుండనగు వానరుఁడనుగాన, నిష్పక్షపాతముగనిజస్థితిని దెల్పితిని. నేనుజెప్పెడి సత్యవాక్యములనువినుము. ఓరావణాసురుడా! మహాశక్తిమంతుఁడగు రాముడు చరాచరజగన్నాథుడుగావున, పంచమహాభూతములతోగూడిన సమస్తస్థావరజంగములకును ఉనికిపట్టగు నీపదునాల్గుభువనములను (సమస్తలోకములను) నశింపజేసిమఱల యథాస్థితిగసృష్టించుటకుశక్తిగలవాఁడు మఱియురాముడు విష్ణుదేవునిపరాక్రమముతో సమానమైన పరాక్రమముగలవాఁడు. రామునితోనిలిచియుద్ధముజేయువాఁడు దేవతులయందును, అసురులయందును, రాక్షసులయందును, యక్షులయందున, సమస్తములగు విద్యాధరులయందును, గంధర్వులయందును, ఉరగులయందున, సిద్ధులయందును, కిన్నరోత్తములయందును, పక్షులయందును, మఱియుసమ

స్తఘాతములయందును, సర్వకాలములయందును, నెచటను, లేదని తెలిసికొనుము. ఓ రావణాసురుఁడా! సమస్తలోకములకు ఈశ్వరుఁడును, రాజశ్రేష్ఠుఁడును, నగు రామునకిట్టి మహాపరాధమును గావించితివి గాన, నీవింక బ్రతుకఁజాలవు రాత్రించరుడా! రావణాసురుడా! దేవతులును, అసురులును, గంధర్వులును, విద్యాధరులును, పన్నగులును, యక్షులును, మొదలగువారందఱును, ముల్లోకములను రక్షకుడగు రామునితో యుద్ధమునందు నిలువజాలరు. మఱియు తనకు తానే పుట్టిన స్వతంత్రుఁడును నాల్గుముఖములుగలిగి నాలుగునోళ్ళచేతను నాలుగువేదముల జెప్పువాఁడును సర్వాతిశాయియును, నగు బ్రహ్మదేవుఁడు గాని, ప్రళయకాలమునందు ప్రజలను సంహరించువాఁడును మూడు నేత్రములుగలవాఁడును అనగా మూడవనేత్రముచే మన్మథుని గాల్చినవాఁడును, త్రిపురాసుర సంహారము గావించిన వాఁడును నగు పరమశివుఁడుగాని, పరమైశ్వర్యముగలవాఁడును వృత్రాసుర సంహారము గావించినవాఁడును సమస్త దేవతలకధిపుఁడును, నగు దేవేంద్రుఁడుగాని, రామునిచే జంపఁదగినవానిని (అనగా రామున కపరాధము గావించుటచే నా రాముఁడు చంపనెత్నించినవానిని) కాపాడుటకెంతమాత్రమును శక్తిమంతులుగారు. కావున విన్నవారెవ్వరైన రక్షింతురని నమ్మియున్నావేమో? ఎంతమాత్రమును రక్షింపఁజాలరు. అనియిట్లు ఆంజనేయుడు నిర్భయముగను, నిర్దోషముగను, మహానయతరముగను, ప్రియముగను పలికిన వాక్యములను, అసదృశపరాక్రముఁడగు రావణాసురుఁడు విని మిగుల కోపమును బొంది, మహారౌద్రాకారమునవలంబించి నేత్రంబులనుండి నిప్పులుగ్రక్కుచు, గ్రుడ్లు త్రిప్పుచు, పండ్లు పటపటంగొరుకుచు, పిడికిటితో నేలపైగుద్ది, ఈ వికృతాకారమును దాల్చియుండెడు కోతిని దీసికొనిపోయి చంపుండని యాజ్ఞాపించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేబదియొకటవ సర్గము ముగిసెను.

రావణాసురునితో విభీషణుడు దూతను జంపఁగూడదని నీతి జెప్పుట.

అంత రావణాసురుఁడు, మహాబుద్ధిమంతుఁడగు యాంజనేయుని వాక్యమును విని మహాకోపముచే శరీరము దెలియనివాడగుచు ఆంజనేయుని జంపుమని యాజ్ఞాపించె.

ఇట్లు దురాత్ముఁడగు రావణాసురుఁడు ఆంజనేయుని జంపుమని ఆజ్ఞాపింపగనే, తాను వచ్చిన దూతకార్యమును నిశ్చయముగా జెప్పిన వానిని చంపుటయందు విభీషణు డెంతమాత్రమును సమ్మతింపఁడయ్యె. కావున కార్యములను జక్కఁగ నెఱింగిన విభీషణుఁడు, రాక్షసరాజగు రావణాసురుఁడు మిగుల కోపమును బొంది, దూతయగు ఆంజనేయుని సంహరింపుమని ఆజ్ఞాపించుటను దెలిసికొని, అందులకుఁదగు పైనయాలోచనను జేసె. అట్లు యోచించి శత్రువులను జయించువాఁడును, వాక్యవిశారదుఁడును నగు విభీషణుఁడు, తాను జేయఁదగిన కార్యమును నిశ్చయించి, తనకు పూజనీయుఁడును, అన్నయును నగు రావణాసురుని జూచి మిగుల హితమగు మాటలతో నిట్లనియె.

రాక్షసేశ్వరుఁడవగు నో అన్నా! రావణాసురుఁడా! క్షమింపుము. కోపము నావిడువుము ప్రసన్నుఁడవగుము. నేను జెప్పెడి యీ వాక్యమును వినుము. కీడుమేలులను, మంచిచెడుగులను, దెలిసిన పెద్దలును, రాజశ్రేష్ఠులును, నగువారు, దూతను ఎంతమాత్రమును సంహరింపరు. మిగుల పరాక్రమశాలివగు నో రావణాసురుఁడా! ఈ వానరుని జంపుట రాజధర్మమునకు విరుద్ధమగు కార్యము, మఱియు లోకాచారమునకును విరుద్ధమైన కార్యము. నీవంటి మహాత్ములకు ఉచితమైనది కాదు. సమస్త ప్రాణులలోపల నీవే సమస్త ధర్మములను ఎఱిగినవాఁడవు, ఒకరు జేసిన మేలును మఱువనివాఁడవు (అనగా కృతజ్ఞుఁడవు) రాజధర్మములను జక్కఁగ దెలిసిన పండితుఁడవు. మంచిచెడుగులు దెలిసినవాఁడవు. పరమార్థముల యొక్క తత్వములను జక్కఁగ నెఱిగినవాఁడవు.

శ్లో॥ గృహ్యంతే యది రోషేణ త్వాదృశోపి విపశ్చితః। తతశ్శాస్త్రవిపశ్చిత్త్వం శ్రమ ఏవహి కేవలమ్॥ కావున నీవంటి పండితులును గూడ రోషమునకు లోఁబడుదురేని సమస్తశాస్త్రములయందలి పాండిత్యమునకు గాబడెడి శ్రమ వృథయే గదా! శాస్త్రపాండిత్యము వలన ప్రయోజనము లేదు. ఓ శత్రుసంహారకుఁడా! రాక్షసరాజా! రావణాసురుడా! అన్నా! ఎవరికిగాని అజేయుఁడవగు నో రావణాసురుడా! నీవు కోపమును విడిచి ప్రసన్నుఁడవగుము. మఱియు యుక్తాయుక్తములనాలోచించి దూతకుఁదగిన శిక్షను విధింపుము. అని విభీషణుఁడు జెప్పగా విని, రాక్షసులకు ప్రభుఁడగు రావణాసురుఁడు, మహాకోపమును బొంది దేహము దెలియని మహారౌద్రాకారముతో విభీషణునకిట్లనియె.

శత్రుసంహారకుఁడవగు నో విభీషణుఁడా! పాపకార్యములను జేయు వారిని చంపుటయందు పాపమెంతమాత్రమును గలుగదు. కావున పాపకార్యములను జేయునట్టి యీ కోతిని జంపెదను. అని రావణాసురుఁడు జెప్పె. అంత బుద్ధిమంతులలో మిగుల శ్రేష్ఠుడగు విభీషణుఁడు, చేటుకు కారణమైనదియును, మహాకోపముతో గూడినదియును,

దుర్మార్గులకు మాత్రము హితమైనదియును నగునారావణాసురునిమాటవిని, మహాశ్రేష్ఠమగు కార్యనిశ్చయముగలదియగు నొకమాటను జెప్పె. లంకాధిపుఁడా! రాక్షసులకుప్రభుఁడవగురావణాసురుఁడా! అన్నా! ప్రసన్నుఁడవగుము నేనొక ధర్మార్థసహితమగు మాటనుజెప్పెదను వినుము

శ్లో॥ దూతానవధ్యాన్సమయేషురాజన్ సర్వేషుసర్వత్రవదంతిసంతః॥ రాజవగునోరావణాసురుఁడా! ఏకాలమునందుగాని, ఏస్థలమునందుగాని, రాయభారమువహించివచ్చినవానినిచంపగూడదనిపెద్దలుజెప్పుదురు. మఱియునీవానరుఁడు అక్షకుమారునిజంపుటమొదలగు ననేకఅపకారములను జేసియున్నాడుగాన,నిస్సంశయముగ వీఁడు గొప్పశత్రువేయగును. అదియునుగాక నితఁడుఎన్నగూడని చెడుగులుజేసియున్నాఁడు.అదంతయునిశ్చయమేను. అయిననుపెద్దలుదూతకు అనేకవిధములగు దండనలువిధించియున్నారుగాని, దూతనుచంపుటనుగుఱించి రాజనీతియందెచటనుజెప్పఁబడియుండలేదు అన్నా! రావణాసురుఁడా! అంగవికారమును గావించుటయును, చబుకుతోగొట్టుటయును, తలబోడిగగొరిగించుటయును, ఏదేనిగురుతుండునట్లుముద్రవేయుటయును, నివిమొదలగు శిక్షలువిధింపఁబడియున్నవిగాని దూతనుజంపుటనుగుఱించి మనమెప్పుడును వినియుండలేదు మఱియునుచూచియుండలేదు. ధర్మార్థములనుజక్కఁగగుర్తెరిగినవారును, ధర్మములయందు శ్రేష్ఠమగుబుద్ధిగలవారును, మంచిచెడుగులుగుర్తెరిగికార్యములనుజేయువారును, నగు మీబోటివారుకోపమునకెట్లులోబడియుందురు. బుద్ధిబలనుగలవారు కోపమునుచంపుదురుగదా? మహాపరాక్రమశాలివగునోఅన్నా! రావణాసురుఁడా! ధర్మశాస్త్రపాండిత్యమునందుగాని, లౌకికాచారములయందుగాని, నీకుసమానుఁడు ఒకఁడునుగూడలేఁడు. మఱియునితరశాస్త్రములయందుగాని, బుద్ధియందుగాని, విషయములను దెలిసికొనుటయందుగాని నీకుతుల్యుఁడెవఁడునులేఁడు. దేవాసురలలోపల నీవేయధికుఁడవు. ఈవానరునిసంహరించుటచే శాస్త్రవిరుద్ధమమాత్రమేగాక, మనకేమి ప్రయోజనముకూడలేదు. ఎవరుయీవానరునిబంపిరోవారికియీశిక్షవిధించిన శ్రేయంబగును. శ్లో॥ సాధుర్వా యదివాసాధుఃపరైరేషసమర్పితః। బ్రువన్పరార్థం పరవాన్నదూతోవధమర్హతి॥ ఈవానరుఁడుమంచివాఁడైనను, చెడ్డవాఁడైనను, మనకక్కఱలేదు. ఇతరులుపంపగావచ్చి, వారుజెప్పమన్నమాటనుజెప్పుచున్నాఁడు కావున పరాధీనుఁడగు దూతనుసంహరింపరాదు. రాక్షసేశ్వరుఁడవగు రావణాసురుఁడా! యీదూతను నీవిప్పుడుచంపింతువేని మఱలనీమహాసముద్రమునుదాటి యిచటికిఆకాశమార్గముగరాజాలినంతటి ఖేచరుఁడు యింకొకఁడుండుననినాకుతోఁచలేదు. విరోధులపురములను జయించునట్టి రావణాసురుఁడా! కావుననీవువానరునిచంపుటకు ప్రయత్నముజేయందగినదికాదు. మఱియు దేవేంద్రుఁడుమొదలగు దేవతలుయుద్ధమునకువచ్చిరేని వారినినీవుసంహరింపఁదగినది. దూతనుజంపరాదు. యుద్ధమునందు మిగులప్రియముగలయోరావణాసురుఁడా! ఇంకొకవిశేషమును దెల్పెదవినుము. ఈవానరునినీవుసంహరింతువేని, మిగులగర్వించి నీతిలేనివారును, బహుదూరమునందు రానుమార్గములేక నడ్డగింపఁబడియున్నవారును, దశరథరాజనందనులును, నగు నారామలక్ష్మణులనిరువురను, నీతోయుద్ధముజేయుటకుయిచటికి వారినిబిలుచుకొనివచ్చునట్టి శక్తిమంతుండు వేఱొకఁడుండునని నాకుతోఁచదు రాక్షసులయొక్క మనస్సునుసంతసింపజేయునట్టి రావణాసురుఁడా! అన్నా! శౌర్యమును, ధైర్యమును, ఉత్సాహమునుగల దేవాసురులకైనజయింపనలవిగానివాఁడవగు నీవేరావడమునకుసిద్ధముగనున్న యుద్ధమునుపాడుజేయుట యుచితముగాదు మఱియునీకుమేలుజేయువారును, యుద్ధవీరులును, మహాభాగరూపులును, మంచిగుణములుగల శ్రేష్ఠములైనవంశములంబుట్టినవారును, నీయందుమంచిమనస్సుగలవారును, ఆయుధములు ధరించినవారిలోశ్రేష్ఠులును, నీవలనలెస్సగబోషింపఁబడువారునునగు భటులునీయొద్దకోట్లపరిమితిగనున్నారుగదా? కావున నీవిప్పుడింకొకయుపాయమునుజేయవచ్చును నీయాజ్ఞచొప్పున నడచువారిలలోగొందరు శూరులను నీసైన్యమున నొకభాగముతోగూడ బంపుము. నారుబోయి యీమూఢులైనరాజపుత్రులగు రామలక్ష్మణులనుయుద్ధమునందుసంహరించి, శత్రువులకుదమప్రభావమునుజక్కఁగదెలుపుదురు అనివిభీషణుఁడుజెప్పె అంతరాక్షసరాజును, దేవసమూహములకుశత్రువును, మిగులబలపరాక్రమశాలియును, రాక్షసశ్రేష్ఠుఁడును, నగురావణాసురుఁడు, తనతమ్మునియొక్కయుక్తములగు ప్రియవచనములనువిని, మనస్సున జక్కఁగనాలోచించి యంగీకరించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేఁబదిరెండవసర్గముగిసెను.

రావణాసురుఁడుఆంజనేయునితోకనుగాల్చివేయునట్లురాక్షసులకాజ్ఞజేయుట

అంతమహాబలపరాక్రమశాలియగు రావణాసురుఁడు

తమ్ముఁడగు విభీషణుడు బలికినవాక్యములనువిని దేశకాలములనాలోచించి తగునైనమాటనుబదులుజెప్పె. తమ్ముడా! విభీషణా! దూతనుజంపుటయుచితముగాదని నీవుజెప్పినమాటబహుచక్కఁగానున్నది. ఇతనిచంపుటకన్నను అవశ్యముగనేదేని యితరశిక్షవిధింపవలయును. కోతులకుతోకమిగులప్రియమగు నలంకారము. కావుననిప్పుడు అతోకనుమనముకాల్చివేయుదము. ఈవానరుడు కాల్పబడినతోకతోనేతనయజమానునియొద్దకుబోవుగాక, అంతనతనిబంధుమిత్రదాయాదులందఱును, అంగవికారముచే మిగులదుఃఖితులైకృశించియుండెడు యీవానరుని జూతురుగాక. మఱియునీవానరునితోకగాల్చి మండుచుండెడు తోకతోనుండెడునితని రాజమార్గములయందును, నాల్గుత్రోవలుగలియుచోట్లను, మఱియులంకానగరమునందంతటను త్రిప్పుఁడు అనిరాక్షసేశ్వరుడగు రావణాసురుడు రాక్షసులకాజ్ఞాపించె. అంతనారాక్షసులు, రావణాసురుఁడుజెప్పినమాటలనువిని మిగులకోపోద్దీపితులై ఆంజనేయునితోఁకనుపాతగుడ్డపీలికలతోఁజుట్టిరి. అట్లురాక్షసులు తనతోఁకకుగుడ్డపేలికలుజుట్టుటనుజూచి, "అగ్నిహోత్రుఁడుఅడవియందు, యెండిపోయినకట్టెలనుకాల్చునపుడువృద్ధిబొందినట్లు" ఆంజనేయుడుమిగులవృద్ధిబొందె అంతఆరాక్షసులుఆంజనేయునితోఁకనుచమురులోతడిపి, అగ్నినిముట్టించిరి. పిదపఆంజనేయుఁడు, అధికకోపమునొందుటచేసెఱ్ఱనైనముఖముగలిగి బాలసూర్యునితోసమానముగ ప్రకాశించుచున్నవాఁడయిమండుచున్నతోఁకతో నచటనున్నరాక్షసులనందరిని బడదోసె అట్టియెడ లంకానగరమునందున్నరాక్షసులు, ఆంజనేయునితోఁక గాల్పఁబడినదని విని, బాలురుస్త్రీలువృద్ధులుమొదలగువారందఱునుమహాసంతోషముతోఁజూడబోయిరి. మఱియునాక్రూరులగు రాక్షసులందఱునొకటిగఁజేరి, మిగులపరాక్రమశాలియును, వానరోత్తముఁడునునగు ఆంజనేయుని మఱలత్రాళ్లుమొదలగువాటితోఁగట్టిరి. అంతఆంజనేయుడు ఆకాలమునకుఁదగినఆలోచనజేసె. నేనుయీరాక్షసులచే బంధింపఁబడినవాఁడనైనను, ఈరాక్షసులునన్నుజంపుట కెంతమాత్రమునుశక్తులుగారు. నేనీత్రాళ్లుతెంచికొని మఱలమీదికెగిరివీరినందఱినివొక్కపెట్టునజంపగలను మిగులదుష్టబుద్ధులగునీరాక్షసులుతమకురాజగు రావణాసురుని యాజ్ఞచొప్పున స్వామికార్యార్థముగసంచరించుచుండెడి నన్నుబంధించిరి దీనిచేవీరునాకెంతమాత్రమును అపకారముజేసినవారుగారు అయినను నాకెంతమాత్రమును చెడుపుగలుగలేదు. యుద్ధమునసీరాక్షసులతోనందఱితోఁబోరి వీరిని చంపుటకు నేనొక్కఁడనెచాలుదును. అయిననది రాముని యిష్టముగాదు. నేను శ్రీరామునిమేలునకై మఱలనీలంకానగరమునంతయు మరలజూడవలయును. వీరునన్నీలంకయందంతటను త్రిప్పుదురేని అదినాకుమేలేయగును. ఇదినాకెంతమాత్రమును అవమానకరముగాదు. మునుపు నేనీలంకానగరమునరాత్రియందు సంచరించితినిగానకోటలు, అగడ్తసేనలుమొదలగు పురరక్షణసాధనవిశేషములను జక్కఁగాజూచినవాఁడనుగాను. కావుననిప్పుడుపగటికాలమునందుజూచుట అత్యావశ్యకమైనపనిగానున్నది మఱియునీరాక్షసులునన్ను త్రాళ్లుమొదలగు వానితోఁగట్టియున్నారు. ఇంకనువారియిష్టప్రకారము నాతోఁకనుజక్కఁగమండునట్లుజేయుదురుగాక; నన్నింకనుపీడింతురుగాక; ఇందువలననామనస్సున కెంతమాత్రమును శ్రమగలుగదు అనియిట్లుఆంజనేయుఁడు తనలోతానాలోచించె అట్టియెడనారాక్షసులు మహాసంతోషమునుబొందినవారై, మిగులగుప్తమైన యాకారముగలవాఁడును, మహాబలముగలవాఁడును, వానరోత్తముడును, నగు ఆంజనేయునిపట్టితీసికొనిపోయిరి. మఱియుమిగులక్రూరకార్యములను జేయునట్టియారాక్షసులుశంఖము, భేరిమొదలగు వాటియొక్కధ్వనులతోనుతమసింహనాదములయొక్కధ్వనులతోను, ఘజముదట్టుటమొదలగు కార్యములచేతనైన ధ్వనులతోను లంకానగరమునంతయు ప్రతిధ్వనింపజేయుచు ఆంజనేయునిలంకయందంతటను త్రిప్పనారంభించిరి అట్లురాక్షసులుతన్నువెంటబడించివచ్చుచుండగ, శత్రుసంహారకుఁడగు నాంజనేయుఁడు ఎంతమాత్రమును సంకటమునుబొందక నాలంకానగరమునందంతటనుసంచరించుచుండె అట్లులంకానగరమునదిరుగుచు నానావిధములగు విమానములను, ఆయుధములుమొదలగు వాటినినుంచెడు రహస్యస్థలములగుభూమిక్రిందిభాగములను, జక్కఁగానేర్పరుపఁబడియుండెడుచత్వరములను, వానరోత్తముఁడగు నాంజనేయుఁడుజూచె మఱియు, ఇండ్లచేగ్రిక్కిఱిసియుండెడు వీధులను, నాల్గువీధులునుగలయుస్థలములను, రాజవీధులను, తక్కినసమస్తవీధులను, చిన్నయిండ్లను, దిడ్డిత్రోవలను, మేఘములవలె నత్యున్నతములగుగృహములను, వాయుపుత్రుండగు నాంజనేయుడుజూచె.

అట్టియెడ ఆంజనేయునితోఁగూడ బోవుచున్నట్టి రాక్షసులందరును, నాల్గుత్రోవలు గలియు మార్గములయందును, నాలుగుస్తంభములపై గట్టఁబడినమంటపములందును, రాజమార్గములయందును, ఆంజనేయుడు చారుడని చాటించిరి. ఆచాటించుటనువిని లంకానగరమునందున్న బాలురను,

స్త్రీలును, వృద్ధులును, తోక గాల్పంబడిన ఆంజనేయుని జూచుటయందధిక సంతోషముగలవారై బైలు దేరివచ్చి అప్పటచ్చట గుంపులుగూడి చూచుచుండిరి. ఆసమయమున నాంజనేయునితోక నిప్పుతో గాల్పబడుటనుజూచి, వికృతరూపములుగల యారాక్షస స్త్రీలు ఆవ్యసనకరమగు వృత్తాంతమును సీతాదేవితోనిట్లనిచెప్పిరి. ఓసీలా! ఇంతకు ముందు నీతో మాటలాడుచుండినట్టి యెఱ్ఱనిముఖముగల వానరునితోకకు నిప్పుఅంటించి, భగభగమండుచుండెడి ఆతోకతోగూడ ఆవానరుని లంకానగరములో నలుదిక్కులయందును త్రిప్పుచున్నారు. అనిరాక్షసస్త్రీలు సీతాదేవితో జెప్పిరి. అంతసీతాదేవి యాక్రూరమగు మాటను విన్నంతనే, తనప్రాణములు అపహరింపబడుచున్నట్లుండ పరమదుఃఖితయై మిగుల వ్యసనముచే "అగ్నిచేత గాల్పబడినదానివలె" తపించుచుండె. అట్లుతపించుచు, వానరోత్తముడగు నాంజనేయునికి మంగళముగలుగ గోరినది అట్లు, విశాలములగు నేత్రములుగల సీతాదేవి ఆంజనేయునికి మంగళముగలుగజేయగోరి, మిగులపరిశుద్ధురాలై యగ్నిదేవుని నిట్లనిప్రార్థించె. శ్లో॥ యద్యస్తిపతిశుశ్రూషా యద్యస్తి చరితంతపః। యదివాస్త్యేకపత్నీత్వం శీతోభవహనూమతః ॥ ఓ అగ్నిహోత్రుడా! నేను పతికి శుశ్రూష జేయుదునేనియు, పాతివ్రత్యవ్రతము నవలంబించి తపస్సు జేయుదునేనియు, అనగా పతివ్రతనగుదునేనియు, రాముండొక్కండె నాకు పెనిమిటియని నమ్మియుందునేనియు, నీవుఆంజనేయునికి చల్లనివాడవుగ నుండుము. మఱియు, శ్లో॥ యదికించిదనుక్రోశస్తస్యమయ్యస్తిధీమతః। యదివాభాగ్యశేషోమే శీతోభవహనూమతః॥ ఓఅగ్నిహోత్రుడా! మిగుల ధీమంతుడగు రామునకు నాయందుకొంచెమైనను దయగలదేనియు, ఇంక మీద నేను కొంచెమైనను సుఖమనుభవింపవలసియుందునేనియు, నీవు ఆంజనేయునకు చల్లనివాడవుగ నుండుము. శ్లో॥ యదిమాంవృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్। సవిజానాతిధర్మాత్మా శీతోభవహనూమతః॥ ఓఅగ్నిహోత్రుడా! ధర్మాత్ముడగు రాముడు నన్ను సదాచారసంపత్తిగలదానినిగాను, ఆరామునితో జేరియుండుటయందు మిగుల ఆశగలదానినిగాను, మనస్సునదృఢముగ నమ్మియుందునేని, నీవుఆంజనేయునకుచల్లనివాడవుగనుండుము, శ్లో॥ యదిమాంతారయేదార్య స్సుగ్రీవస్సత్యసంగరః। అస్మాద్దుఃఖాంబుసంరోధాచ్ఛీతోభవహనూమతః ॥ ఓఅగ్నిహోత్రుడా! పూజ్యుడును, సత్యప్రతిజ్ఞగలవాడును, నగుసుగ్రీవుడు నన్నీదుఃఖసాగరముననుండి తరింపజేయునేని నీవు ఆంజనేయునికి చల్లనివాడవుగనుండుము. అనియిట్లు సీతాదేవి అగ్నిదేవుని అనేకవిధములుగ ప్రార్థించె. అంతఅగ్నిహోత్రుడు, జింకపిల్లకండ్లవంటి కండ్లుగల సీతాదేవికిని ఆంజనేయునకును శుభమును దెల్పుచున్నవానివలె విశేషముగమండుచు, మేమలుబాటులేక ప్రదక్షిణ జ్వాలలతో మండుచుండె. మఱియును ఆంజనేయుని తండ్రియగు వాయుదేవుడును, అతనితోక యందలి యగ్నిహోత్రముతో గూడినవాడయ్యును సీతాదేవిమనస్సునకు సెమ్మదిని గలుగజేయుటకై "మంచుగాలివలె" చల్లనివాడైవీచె అప్పుడు తనతోక కాలుచుండగ నాంజనేయుడు తనలోతానిట్లనియాలోచించె. నాతోకకొనయందు మండుచుండెడుఅగ్ని నా దేహమంతయును ఏలదహింపకున్నది ఈయగ్ని మిగుల పెద్దమంటతో భగభగ మండుచున్నదయ్యును, నాకెంతమాత్రమును బాధగలుగజేయకున్నది మఱియు నీయగ్ని చందనముమొదలగు చల్లనిపదార్థములవలె తోకకొనయందు మాత్రమున్నది దీనికేమికారణము. దీనికికారణము శ్రీరామునిప్రభావముగానే నుండును. ఏలననగా, మున్నునేను నదీశుడగు సముద్రునిదాటుచుండగ నాసముద్రమధ్యమున నత్యాశ్చర్యముగ పర్వతము గాన్పించుటకు గారణము రాముని మహిమయేగదా, కావున నిదియునుగూడ రామునిమహిమయేయని తలచెదను అట్లుగాదేని సముద్రుడును ధీమంతుడగు మైనాకుడును, రామునికొఱకై నాకు సహాయమును జేయుట కెంతోప్రయత్నించిరి. ఆలాగుననే అగ్నిదేవుడును రామునియందలి గౌరవముచే నన్నుగాల్పకున్నాడు. మఱియు సీతాదేవియొక్క దయచేతను, రాముని ప్రభావముచేతను, నాతండ్రియగు వాయుదేవునకును, అగ్నిదేవునకునుగల స్నేహముచేతను, నన్నెంతమాత్రమును గాల్పకున్నాడు. అనియిట్లు ఆంజనేయుడు తలచి పిమ్మటజేయవలసిన కార్యమునుగుఱించి కొంతసేపాలోచించె. అట్లుఆలోచించి వానరోత్తముడగు నాంజనేయుడు ఒకసింహనాదమునుజేసి అతివేగముగ మీదికెగిరె. అట్లుమీదికెగిరి, శ్రీమంతుడును, వాయుపుత్రుడునునగు నాంజనేయుడు, మిగులపొడవై పర్వతశిఖరమువలె నున్నదియును, రాక్షససంచారములేనిదియును, నగుద్వారప్రదేశమును జేరిగూర్చుండె. అట్లుబహిర్ద్వారమునందు గూర్చున్నవాడును, పర్వతముతోసమానమైన యాకారము గలవాడును, మహాధైర్యముగలవాడును, నగు ఆంజనేయుడు తన శరీరమును మిగులచిన్నదిగా జేసికొని కట్లనన్నిటిని వదిలించుకొనియె. అట్లు శ్రీమంతుడగు నాంజనేయుడు తన కట్లను విడిపించుకొని మఱల కొండవలె గొప్ప దేహమును దాల్చి, నలుదిక్కులనుజూచి, బహిర్ద్వారమునందున్న యి

నుపగుదియనుజూచె. అంతమహాబాహుడును, వాయుపుత్రుడునునగు నాంజనేయుడు ఆయినుపగుదియను దీసికొని మఱలతనవెనువెంటవచ్చిన రాక్షసులనందరిని ఆయినుపగుదియతో గొట్టిచంపె. అట్లు ఆరాక్షసులను సంహరించి యుద్ధమునందు భయంకరమైన పరాక్రమముగల యాంజనేయుడు మఱల లంకానగరమును నలుదిక్కులను జూచుచు, తోకయందు భగభగమండుచున్న అగ్నిహోత్ర జ్వాలలచే బ్రకాశించుచు కిరణపఙ్క్తులచే బ్రకాశించుచుండెడు సూర్యునివలెనే వెలుగుచుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేబదిమూడవ సర్గ ముగిసెను.

)(*)(

—ఆంజనేయుడు లంకానగరమును గాల్చుట.—

అంతవానరోత్తముడగు నాంజనేయుడు యీడేరినకోరికగలవాడగుచు లంకానగరమును నాలుగుదిక్కులను జూడచు మహాసంతోషము గలుగుటచే నింకతాను జేయవలసిన కార్యమును ఆలోచించె. ఇచటయిప్పుడు యీరాక్షసులకు యింకనధికముగ ఏదిసంతాపమును గలిగించునో అట్టి కార్యముయింకేమి మిగతయున్నది. మహాశ్రేష్ఠమగు ఉద్యానవనమును విఱిచి నాశనముజేసితిని. మిక్కిలి శ్రేష్ఠులగు రాక్షసులనందఱిని సంహరించితిని. సైన్యమునందు ఒకభాగమునుజంపి పాడుజేసితిని. ఇంక నేనీకోటను నశింపజేయవలసియున్నది. ఇప్పుడు నేనీకోటను నశింపజేయుదునేని సముద్రముదాటి లంకలోబ్రవేశించుట మొదలగు పనులకై నేనుబడినశ్రమకు దగినఫలముగ నుండును. ఇప్పుడు స్వల్పప్రయత్నముచే నేనీకార్యమును జేయవచ్చును. అట్లు జేయుదునేని నాప్రయాసమునంతయు సఫలమగును. కావున నిప్పుడీలంకానగరమునందుండెడి యుత్తమగృహములను నాతోకయందు మండుచుండెడి యీయగ్నిహోత్రముచేగాల్చి అగ్నిదేవునకు సంతర్పణమును జేయుట యుచితముగనున్నది. అనియిట్లు ఆంజనేయుడు యోచించి నిశ్చయించుకొని, భగభగమండుచున్న తోకతో బ్రకాశించుచున్నవాడయ్యె మఱియు మెఱుపుదీగెతోగూడిన మేఘమువలెనున్నవాడును, వానరోత్తముడును నగు నాంజనేయుడు లంకానగరమునందలి మేడలపై దిరుగుచుండె. అట్లాంజనేయుడు భీతిలేక రాక్షసులగృహములపై దిరుగుచు మేడలను ఉద్యానవనములను జూచె. అట్లు సంచరించుచు మహాబలపరాక్రమశాలియును, వాయుదేవునితో సమానుడును, వేగవంతుడును, నగునాంజనేయుడు ప్రహస్తునిగృహముపైదుమికి యందగ్నిముట్టించి, అందుండిమహాపార్శ్వునియింటిమీదికి దుమికె. అట్లాంజనేయుడు మహాపార్శ్వునియింటిపైదుమికి, యందు ప్రళయకాలాగ్ని హోత్రముతో సమానమగునగ్నిని దరికొల్పె. అంత మహాపరాక్రమశాలియును, వానరోత్తముడును, నగునాంజనేయుడు, వజ్రదంష్ట్రునిగృహమునకును, మహాశౌర్యవంతుడగు శుకునిగృహమునకును, బుద్ధిమంతుడగు సారణుని గృహమునకును, దుమికి ఆగృహములనన్నిటినిగాల్చె. అందుండి వానరశ్రేష్ఠుడగు నాంజనేయుడు యింద్రజిత్తు గృహముపై దుమికి దానినిగాల్చె. అంతనాఆంజనేయుడు జంబుమాలియొక్కయు, సుమాలియొక్కయు, యిండ్లపైదుమికి వాటినిగాల్చె. మహాపరాక్రమముగలవాడును, వానరోత్తముడును నగు నాంజనేయుడు అందుండి క్రమముగదిరుగుచు, విభీషణుని గృహమును మాత్రమువిడిచి, రశ్మికేతుడను రాక్షసునియింటిని, సూర్యశత్రుడను వానిగృహమును, హ్రస్వకర్ణుడనువానియొక్కగృహమును, దంష్ట్రుడను రాక్షసునియొక్కగృహమును, రోమశుండను రాక్షసునిగృహమును, యుద్ధోన్మత్తుండనువానిగృహమును, మత్తుండనువాని గేహమును, ధ్వజగ్రీవుడనురాక్షసునియింటిని, మిగుల భయంకరుడగు విద్యుజ్జిహ్వుని భవనమును, హస్తిముఖుడనురాక్షసునిగేహమును, కరాళుండనువానియింటిని, పిశాచుండనువానిగృహమును, శోణితాక్షుండనువానిభవనమును, కుంభకర్ణునియింటిని, మకరాక్షునిగృహమును, యజ్ఞశత్రువుయొక్కభవనమును, బ్రహ్మశత్రునిగృహమును, నరాంతకునియింటిని. కుంభునిగృహమును, దురాత్ముండగునికుంభునిగేహమును, క్రమముగనొకదాని పైనుండి మఱియొకదానిపైకిదుముకుచు నన్నిగృహములకును అగ్నిముట్టించె. ఇట్లు, మహాకీర్తిమంతుడును, వానరోత్తముడును, నగునాంజనేయుడు ఉత్తమములగు ఆగృహములను, వాటియందలి రాక్షసులు విశేషముగ సేకరించి కూర్చిపెట్టియున్న మణులు మొదలగు సంపదను, గాల్చి నాశనముజేసె. అట్లు, మిగులకాంతిమంతుడును మహాబలపరాక్రమశాలియును, నగునాంజనేయుడు, అందరియిండ్లను క్రమముగదాటి పిమ్మట రాక్షసేశ్వరుడగు రావణాసురుని గృహమునందు జేరె. మఱియును, నానావిధములగు మణులచే నలంకరింపబడినదియును, మేరుపర్వతముతోనుమందర పర్వతముతోను సరిపోలియున్నదియును, సకలవిధములగు వస్తుసామగ్రులతోనిండి ప్రకాశించుచున్నదియును, మహాశ్రేష్ఠమైనదియును, నగు నాయుత్తమగృహమును దనతోకకొనయందుమండుచున్న యగ్నిహోత్రముచేగాల్చి "ప్రళయకాల మేఘగర్జనమువ

లె" గొప్పధ్వనిజేసె.

అదివరకును రావణాసురునకు భయపడియున్నయగ్నియును, వాయువును, దేవతలుబలీయులగుట గుర్తెఱిగి భయమునువిడిచి, యిరువురును నొక్కటనై మహావేగమును అవలంబించి "మిగులగొప్పబలముగల ప్రళయకాలాగ్నిహోత్రమువలె" మిగులవృద్ధినిబొంది మండుచుండె అట్టియెడవాయువు భగభగ మండుచున్న అగ్నిని ఒకయింటియందుండి మఱియొకయింటికి వ్యాపించునట్లుజేసె మఱియునగ్నియును, వాయువుయొక్క సహాయముచే మహావేగముగలవాడయ్యె. అట్లగ్నివృద్ధికాగానే, బంగారుకిటికీలచేనొప్పుచు ముత్తెములతోను రత్నములతోను నలంకృతంబైనవియును, ఎచ్చటజూచినను నవరత్నములతో నిండియుండునవియును, నగునాయిండ్లుకాలినేలంగూలె. అట్లువిరిగినేలంగూలుచున్నయాయిండ్లు "పుణ్యముదీరిచెడి యాకాశమునుండి నేలంగూలుచున్న, సిద్ధులవిమానములవలెనే" ప్రకాశించుచుండె. ఆసమయమున రాక్షసులందఱు తమతమయిండ్లనుగాపాడుకొనజాలక, ఉత్సాహమును, ధైర్యమును, విడిచినలుదిక్కులకును బరువులిడుచు, అయ్యో,హా దైవమా! ఇంకేమిజేయుదుము. ఇతడువానరరూపముదాల్చివచ్చిన అగ్నిహోత్రుడుగాని వేఱుగాదు. ఆహా! మనమిప్పుడేమిసేయగలము అని యిట్లుఅనేకవిధములుగనేడ్చుచునలుదిక్కులకును బరువులిడుచుండిరి పాలుద్రాగెడిపసిబిడ్డలను ఎత్తికొనియున్నకొందఱుస్త్రీలు, అగ్నిహోత్రముచేదగులబెట్టబడినమేడలపైనుండి, యావేడిమికి ఓర్వంజాలక, తలవెండ్రుకలు విరియబోసుకొని అతిశీఘ్రముగ నేలంబడిరి. అట్లు ఆకాశమునంటియుండెడు మిద్దెలపైనుండిపడుచుండినయాస్త్రీలు "మేఘములయందుండిపడుచున్నమెఱపుదీగెలవలెనే" ప్రకాశించుచుండిరి. అప్పుడు, వజ్రములతోను, వైడూర్యములతోను, పగడములతోను, ముత్యములతోను, యితరరత్నములతోను,నలంకృతంబైనవియును, బంగారముచేగట్టబడినవియును, నగుగొప్పమేడలు. అగ్నివేడిమికికరిగినేలగూలుచు గైరికాదిధాతువులను గ్రక్కుచున్నవానివలెగాన్పించుచుండుటను ఆంజనేయుడుజూచె. అట్లుగాలుటను జూచి "కట్టెలతోనుతృణములతోను నగ్నిహోత్రుడుతృప్తిబొందనియట్లు" లంకానగరము ఎంతగాలుచున్నను ఆంజనేయుడుతృప్తినిబొందడయ్యె, మఱియు రాక్షసులపీనుగులచేతభూమియును తృప్తినిబొందదాయె. (దీనివలనలంకానగరమునకు రామునివలన రాబోవుకీడును సూచించుచున్నది) అప్పుడుఅగ్నిచేదహింపబడు పదార్థములయొక్కస్వభావముచేత అగ్నిజ్వాలలొకచోట మోదుగపువ్వుకాంతివంటికాంతిగలవిగను, మఱియొకచోట బూరుగపువ్వువన్నెగలవిగను, వేఱొకచోట కుంకుమపువ్వుకాంతివంటికాంతిగలవిగను, ప్రకాశించుచుగాన్పించె. మహాబలపరాక్రమశాలియును, వేగవంతుడును, నగునాంజనేయుడు, "పరమేశ్వరుడు త్రిపురపురములను నాశనముజేసినట్లు," లంకానగరమునుకాల్చి నాశనముజేసె. అట్టియెడమహావేగవంతుడగు నాంజనేయుడు లంకానగరమునందుబొనిపిన యగ్ని, యాలంకకాధారమగు త్రికూటపర్వతశిఖరములయందునుగూడ అగ్నిజ్వాలలచే వ్యాపించిమిగులభయంకరాకారముగ మండుచుండె. మఱియు నాయగ్నిహోత్రను వాయువుసహాయమువలన "ప్రళయ కాలాగ్నిహోత్రమువలె" అతివేగముగలదియై, పొగలేనినిర్మలమైన యగ్నిమంటలు ఆకాశమునంటి చూపట్టుచు, లంకయందలి గృహములందంతటనువ్యాపించి, రాక్షసుల దేహములనెడి నేతిచే మిగులవృద్ధిబొందె. అట్టియెడ నాయగ్నిహోత్రము కోటిసూర్యప్రకాశమానంబైనదియును, మహాప్రభావముగలదియును, లంకానగరమునందంతటను వ్యాపించినదియునై, "పిడుగులయొక్కశబ్దములవలె" ఢమీల్ఢమీల్ అనిమహాకఠినములగు ధ్వనులనేకములు జేయుచు, బ్రహ్మాండమునంతయు భేదించుదానివలె బ్రకాశించుచుండె. అట్టియెడనచటతీక్ష్ణమైనకాంతిగలవియును,, మోదుగుపువ్వు కాంతివంటికాంతిగలవియును, నగు అగ్నిజ్వాలలు భగభగమని మిగులవృద్ధిబొంది యాకాశమువరకు వ్యాపించినవి. మఱియు నాలంకానగరమునందు కాలిచల్లారునప్పుడు లేచిన పొగలచేగప్పబడిన మేఘపఙ్క్తులనల్లగలువలకాంతివంటి కాంతిగలవియైమిగుల బ్రకాశించుచుండె. ఆసమయమునందు సమస్తప్రాణిసమూహములతోను, గృహములతోను, వృక్షములతోను సమస్తవస్తుసమూహములతోనుగూడిన లంకానగరము క్షణమాత్రములో గాల్పబడుటనుజూచి, ఆప్రళయాగ్నికిదప్పించుకొని ప్రాణములతోనున్న రాక్షసులందఱును అచ్చటచ్చటగుంపులుగూడి తమలో తామిట్లనిజెప్పుకొనిరి ఈతడువజ్రాయుధమునుధరించినవాడును, వృత్రాసురునిసంహరించినవాడును, దేవతలకు బ్రభుడును, నగు నింద్రుడో, లేకయముడు ప్రత్యక్షముగనీరూపమును దాల్చివచ్చెనో, లేకవరుణదేవుడో, లేకవాయుదేవుడో, లేక రుద్రుడో లేక అగ్నిదేవుడో, లేకసూర్యుడో, లేకకుబేరుడో, లేకచంద్రుడో, గాని,వానరుడెంతమాత్రముగాడు ఇంతయోచింపనేల,యముడే ప్రత్యక్షముగనీరూపమునుదాల్చి వచ్చినాడు. లేక, సమస్తలోకములకును తాతయును, సమస్తమునుధరించియున్నవాడును, నాలుగుముఖములుగలవాడును, నగు

బ్రహ్మదేవుడు మిగులకోపించి రాక్షససమూహములన్నిటిని సంహరింపవలెనని దలంచి తనకోపముచేనిట్టి వానరరూపమును దాల్చివచ్చెను. లేక అనంతమైనదియును, ఇంద్రియములకు గోచరముగానిదియును, మనస్సుచేతనైనతలంపనలవిగానిదియును, అద్వితీయమైనదియును (అనగా తనకంటెనితరములేనిదనుట) సగుణబ్రహ్మసంబంధమగు తేజస్సు రాక్షసులను నాశమును జేయుటకై, తనమాయచే నిప్పుడీవానరరూపమును వాల్చి వచ్చి యుండవలెను. అనివారిలోవాండ్రుమాటలు జెప్పుకొనుచుండిరి. అప్పుడు ఆలంకానగరము, సమస్తరాక్షససమూహములతోను, గుఱ్ఱములతోను, ఏనుగులతోను, సమస్తపక్షిసమూహములతోను, సమస్తమృగములతోను, వృక్షసమూహములతోను గాల్పబడుచుండగా నాబాధకోర్వజాలక, ఆయాప్రాణిసమూహములు యేడ్చుట మొదలగువానిచేనొకదీనధ్వనిగలిగె. అందు భగభగమండుచుండెడు మంటలలో దగులుకొనిమృతినొందచుండిన రాక్షసులు తమతండ్రులుకొడుకులు, ప్రియులు, స్నేహితులు మొదలగువారలనుద్దేశించి హాతండ్రీ! హాపుత్రుడా! హాప్రాణనాయకుడా! అయ్యో స్నేహితుడా! అయ్యో! సమస్తభోగములతోగూడినదియును, మహాపుణ్యముగలదియును, నగు ప్రాణములుబోవుచున్నవే; అయ్యో! యేమిచేయనగును. అనియిట్లనేకప్రకారములుగ దుఃఖించుచుండిరి అప్పుడు ఆ లంకానగరము, ఆంజనేయునికోపాతిశయముచే గాల్పబడుటచేత పూర్ణముగ నగ్నిజ్వాలలచే గప్పబడినదియును, సంహరింపబడిన వీరులుగలదియును, యుద్ధమునందు వెన్నుజూపిపారిపోయిన మఱికొందఱువీరులు గలదియునునై, శాపముచేనశించినదానివలె చూపట్టినది. అట్టిసమయమున, సభ్రాంతితోగూడినవారును, భయపడినవారును, మిగులవ్యసనమునుబొందినవారునునగు రాక్షసులతో గూడినదియును, నిప్పుమంటలచే నొప్పుచున్నదియునునై, "ప్రళయకాలమునందుబ్రహ్మదేవునికోపముచే దహింపబడెడి సమస్తభూమండలమువలెనే" చూపట్టుచున్న లంకానగరమును మిగులపూజ్యమైన స్వభావముగల యాంజనేయుడుజూచె. మఱియు వాయుపుత్రుడగు నాంజనేయుడు, మిగులశ్రేష్ఠములగు గొప్పవృక్షములతోనిండియుండెడు అశోకవనమునువిఱిచి పాడుజేసి, యుద్ధమునందుమిగులశ్రేష్ఠులగు రాక్షసులనందఱిని సంహరించి, మహాయున్నతములై మిగులశ్రేష్ఠములగు గృహసమూహములతోగూడిన లంకానగరమునంతయుకాల్చిభస్మముజేసి, అంతటితోతృప్తిబొందియూరకుండె. అప్పుడు, త్రికూటపర్వతశిఖరముయొక్క మీదిభాగమునందున్నవాడును, తోకయందు భగభగమండుచున్న యగ్నిజ్వాలలచే జేయబడిన కిరణపఙ్క్తులుగలవాడును, వానరోత్తముడునునగు నాంజనేయుడు, "ఉదయాద్రియందు కిరణపఙ్క్తులతోగూడి ప్రకాశించుచున్న సూర్యునివలెనే" యొప్పుచుండె. అట్లుమహాబలపరాక్రమశాలియగు నాంజనేయుడు అశోకవనమును విఱిచిపాడుజేసి అనేకులగు రాక్షసవీరులనుసంహరించి, రాక్షసులగృహములనన్నిటిని అగ్నిహోత్రముచేగాల్చి, అంతటితోసమస్తకార్యములును నెరవేరినవాడై రామునొద్దకుబోవుటకుయత్నించె. అప్పుడువానరశ్రేష్ఠుడును, మహాబలముగలవాడును, వాయువేగమువంటివేగముగలవాడును, మంచిబుద్ధిగలవాడును, మిగులనుత్తముడును, వాయుపుత్రుడును, నగునాంజనేయునిసమస్తదేవతాసమూహములును యిట్లనిబొగడిరి. మిగులకాంతిమంతుడును, గొప్పవానరుడునునగు నాంజనేయుడు అశోకవనమునువిఱిచి నాశనముజేసి యుద్ధమునందు శ్రేష్ఠులగు రాక్షసులనుజంపి రమ్యమగు లంకానగరమునంతయును గాల్చి, ప్రకాశించుచున్నవాడు. అనిచెప్పుకొనిరి. మఱియు నచటికివచ్చియుండిన దేవతలును, గంధర్వులును, సిద్ధులును, పూజ్యులగుమహర్షులును నొకటిగగూడికాల్పబడినయాలంకానగరమునుజూచి పరమాశ్చర్యమును బొందుచుండిరి అట్టియెడసమస్తభూతములును వానరోత్తముడగు నాంజనేయునిజూచి ప్రళయకాలాగ్నిహోత్రుడనిదలచి మిగులభయమునొందినవి మఱియు దేవతలును, గంధర్వులును, విద్యాధరులును, పన్నగులును, యక్షులును, మునిశ్రేష్ఠులును, సమస్తభూతములును లంకానగరము కాల్పంబడుటనుజూచి పరమసంతోషమునుబొందిరి.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలియేబదినాలుగవ సర్గ ముగిసెను.

ఆంజనేయుడు సీతాదేవికూడ కాలిపోయెనేమోయని చింతించుట. —

ఇట్లు మహాబలపరాక్రమశాలియైన వానరోత్తముడగు నాంజనేయుడు లంకానగరమునంతయును తనతోకయందలియగ్నితోగాల్చి పిమ్మట తనతోకను సముద్రమునందు జల్లార్చె. అట్లుతనతోకను సముద్రమునందు జల్లార్చుకొనివానరోత్తముడగు నాంజనేయుడు, దేదీప్యమానముగ దగులుకొనుచుండినదియును, మిగులభీతులై దుఃఖించుచుండిన రాక్షససమూహములు గలదియునునగు లంకానగరమును జూచితనలోతాను చింతించి మనస్సునందు మహాభయమునుబొంది, తన్నుతానిట్లని నిందించుకొనదొడగె. అయ్యో! నేనేమి సేయుదును, లంకానగరమును గాల్చితిని కొంచ

మైననాలోచింపక యెంతచెడ్డకార్యమునుజేసితిని. శ్లో॥ ధన్యాస్తేపురుషశ్రేష్ఠాయే బుద్ధ్యాకోపముత్థితమ్। నిరుంధంతి మహాత్మానోదీప్తమగ్నిమివాంభసా ॥ ఏమహాత్ములు కోపమువచ్చునపుడు, "మండుచున్నయగ్నిహోత్రమును జలముచే జల్లార్చునట్లు" ఆకోపమును తెలివిచే తిరస్కరించుచున్నారో, అట్టి పురుషశ్రేష్ఠులు మహా పుణ్యవంతులు. శ్లో॥ క్రుద్ధః పాపంనకుర్యాత్కః క్రుద్ధోహన్యాద్గురూనపి। క్రుద్ధఃపరుషయావాచానరస్సాధూనధిక్షిపేత్ ॥ కోపమును బొందినవాడెవడు పాపమును జేయకుండును? కోపమును బొందినవాడు గురువునైనను జంపును. మఱియు కోపమునుబొందినమానవుడు సత్పురుషులనుగూడ కఠినవాక్యములచే తిరస్కారము జేయును. శ్లో॥ వాచ్యావాచ్యంప్రకుపితోనవిజానాతికర్హిచిత్। నాకార్యమస్తిక్రుద్ధస్య నావాచ్యంవిద్యతేక్వచిత్॥ కోపమును బొందినవాడు యిదిచెప్పదగినమాటయనియును, ఇది చెప్పదగనిమాట యనియును ఎంతమాత్రమును ఒకానొకప్పుడుగూడ గుర్తెరుగడు. కోపమునుబొందినవానికి ఎచటనైనను, ఏకాలమునందైనను, చేయదగనిపనియేదియునులేదు, చెప్పందగనిమాట ఏద్దియునులేదు. శ్లో॥ యస్సముత్పతితంక్రోధం క్షమయైవనిరస్యతి। యథోరగస్త్వచంజీర్ణాంసవైపురుషఉచ్యతే ॥ ఎవ్వడు కోపమునుబొందునపుడు, "కుబుసమును పాము యేరీతిగ విడిచి పెట్టునో" అట్లు ఆకోపము నడచినవాడే పురుషుడని చెప్పబడును. అట్లుండుటవలన సీతాదేవి యీలంకయందు నివసించియున్నదని తలపకనే నీలంకానగరమును గాల్చితిని కావున నేను మహాదుష్టుడను. సిగ్గంలేనివాడను స్వామిద్రోహిని మహాపాపిని పాపకార్యములను జేయువాడను. నేనుదహింపబడుదునుగాక; అయ్యో! ఈలంకానగరమంతయు కాలిపోయినదే, మిగులపూజ్యురాలగు సీతాదేవి గూడ దహింపబడియే యుండును. అట్లుసీతాదేవి దహింపంబడియుండు నేని, నేను మిగుల జ్ఞానహీనుడనై స్వామికార్యమును పాడుజేసినవాడ నగుచున్నాను. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. ఏకార్యముకొఱకు నేనింత గొప్పప్రయత్నమును జేసితినో! ఆకార్యమంతయును పాడుజేసితి ఏలననగా లంకానగరమును దహించునపుడు నేను, సీతాదేవినిగాపాడనైతి మహాప్రయాసముచేత సీతాదేవియున్న స్థలమును దెలిసికొని, సముద్రమును దాటి, లంకయందంతటనుదిరిగి, సీతాదేవిని మహాప్రయాసముచే గనుగొంటిని. ఇంకనీవృత్తాంతమును గొనిపోయిరాముని కెఱింగించుట మాత్రము మిగిలియుండినది. మిగుల కష్టమైన కార్యభాగమునంతయు నెరవేర్చి స్వల్పకార్యము మిగిలియుండగా అంతశ్శత్రువగు కోపముచే శరీరము దెలియక యీకార్యమునకు మూలమగు సీతాదేవినిగూడ నశింపజేసితిని కావున కార్యమంతయునశించినది ఈలంకానగరమునందు దహింపబడనిచోటు ఒక్కటైనను నాకగుపడలేదు లంకానగరమంతయును బూడిదెయైయుండగా, సీతాదేవిమాత్రము నశింపకుండునా? నిశ్చయముగనశించియేయుండును. కావున నిప్పుడు నాబుద్ధిలేమితనమువలనకార్యమునశించినది. ఇదివాస్తవమగునేని, నేనిచటనే ప్రాణములను విడుచుటయుక్తమని తోచుచున్నది చచ్చుటకు సాధనములు అనేకములున్నవిగదా? అందులో అగ్నియందు బడిచత్తునా? లేకబడబాగ్నిలోబడిచత్తునా? కాకేని సముద్రమునందుబడి యందుండు జలజంతువుల కాహారమగుదునా? నేనుకార్యము జక్కపరుచుకొనిపోయినగదా సుగ్రీవుని, రామలక్ష్మణులను జూడవలయును ఇప్పుడు కార్యమంతయు జెఱిచి పాడుచేసి, వంద్యములగు నీప్రాణములతో రామలక్ష్మణసుగ్రీవుల నెట్లుజూడనగును? అయ్యో! నేను రాక్షసులమీదికోపదోషముచేతగదా యీలంకయంతయుగాల్చి నాశనము జేసితిని. కోతులుబుద్ధి చాంచల్యము గలవియని ముల్లోకములయందును బ్రసిద్ధముగదా. అట్టి నాకోతిబుద్ధి నందఱికివెల్లడిపఱచితిని మఱియుకోపముచేతగదా నేను రక్షించుటకు శక్తిమంతుడనయ్యుండియును కోపమువలన సీతాదేవిని గాపాడనైతిని కావున, నియామకుడు లేనిదియును, మిగులచంచలమైనదియుననగు రజోగుణము "దహింపబడుగాక" అనగా నెవ్వడైనను రాజసతామసములను విడువవలయును. అదియునుగాక యిప్పుడు సీతాదేవి నశించినదని వినగానే రామలక్ష్మణు లిరువురును ప్రాణములను విడుతురు వారిద్దరును నశింపగానే సుగ్రీవుడు బంధుమిత్రసమేతముగ నాశనమొందును. ఈవృత్తాంతమును విన్నంతనే తోడబుట్టువులయందధికప్రేమగలవాడును ధర్మస్వభావుడుననగు భరతుడు ప్రాణములనువిడుచును. తోడనే శత్రుఘ్నుడును ప్రాణములను విడువగలడు మహాధర్మాత్ములగు నిక్ష్వాకువంశపురాజులందఱును నాశనమొందగానే, ప్రజలందఱు అమితవ్యసనముచే జావగలరు. కావుననేను మహాదౌర్భాగ్యుడను ధర్మార్థములచే హీనుడను కోపముచేనైన పాపముచే నాక్రమింపబడిన యాత్మగలవాడను. లోకనాశమునకు గారణభూతుడను. అనియిట్లు ఆంజనేయుడు తనలోతానాలోచించుచుండగ, పూర్వము తనకనుభవముగానుండెడు శుభసూచకములు విశేషముగ గాన్పించినవి. అంతమిగులసంతసించి మఱల తనలో నిట్లని తలచె. లంకానగరము దహింపబడగానే సీతాదేవికూడ

కాలిపోయినదని యెంచితిని. అదిన్యాయమైనతలంపుగాదు. అట్లుండెనేని యిప్పుడు యీశుభశకునములు గనుబడవు. సీతాదేవినశింపలేదు. ఏలననగా సీతాదేవి అగ్నివంటి పాతివ్రత్యమాహాత్మ్యముగలది. కావున నాశనమొందదు. గ్ని అగ్నిని ఎట్లుగాల్చును? ఎంతమాత్రమును దహింపజాలదు మహాధర్మాత్ముడును, అమితపరాక్రమము గలవాడును, నగుశ్రీరామునిభార్యయును, తనపాతివ్రత్య మహిమవలన గాపాడబడినదియును, నగు సీతాదేవిని, అగ్నిహోత్రుండెంతమాత్రము ను తాకడు. ఇదియునుగాక కాల్చుటయే స్వభావముగాగలయగ్నిహోత్రుడు, నన్నును గూడ కాల్పకుండుట, శ్రీరాముని ప్రభావముచేతను, సీతాదేవియొక్క పాతివ్రత్య మహిమచేతను నైనదిగాని యుగాదు. కావున లక్ష్మణభరతశత్రుఘ్నులకు ముగ్వురకు ను దేవతయును, శ్రీరామునకు ప్రియపత్నియును, నగు సీతాదేవిని ఎట్లుదహించును. మఱియు దహించుటయే కార్యముగాగలవాడును, అంతటనువ్యాపించువాడును, నాశరహితుండును, నగుఅగ్నిహోత్రుడు నాతోకనే దహింపలేదు. అట్లుండుటచే అగ్ని మిగులపూజ్యురాలగు సీతాదేవి నివ్విధదహించును. అనియిట్లుతలచుచు నాంజనేయుడు తాను సముద్రముపైగా వచ్చునపుడు సముద్రమధ్యమున తన శ్రమనివారణార్థము మైనాకుడుగనబడెను. అదియునుగూడ సీతాదేవి మహిమయేగాని వేఱుగాదు. మఱియు సీతాదేవి, తనయొక్క తపస్సుచేతను, సత్యముచేతను, పెనిమిటికన్న నితరదైవములేదనియెడి పాతివ్రత్యమహిమచేతను, అగ్నిహోత్రునైన దహించునుగాని, అగ్నిహోత్రుడు సీతాదేవిని ఎంతమాత్రమునుదహింపజాలడు. అనియిట్లు ఆంజనేయుడు సీతాదేవిప్రభావమును గురించి తలంచుచుండుసమయమున, ఆకాశమునందు చారణులు తమలోతామిట్లని జెప్పుకొనుచుండెడు వాక్యములను వినెను. ఆహా! ఆంజనేయుడు రాక్షసులయిండ్లయందు మిగుల భయంకరమగు నగ్నిహోత్రమునుజొనిపి, వారిగృహములనన్నిటిని భస్మముజేసె. ఈకార్యమెవ్వరికిని సాధ్యమైనదిగాదు. మిగులనసాధ్యమగు కార్యమును ఆంజనేయుడు జేసె అదిమిగుల నాశ్చర్యముగనున్నది ఆయగ్నిబాధకోర్వజాలక స్త్రీలు, బాలురు, వృద్ధులు, మొదలగువారు నాలుగు దిక్కులకును బరువులిడుచు, నేడ్చుచుండుటచే గలిగిన కోలాహలధ్వనులు పర్వతగుహాలయందంతటను నిండినది. అందుచేపర్వతములుగూడ నేడ్చుచున్నట్లున్నది. మఱియు నీలంకానగరము కోటబురుజులతోను ప్రాకారములతోను బహిర్ద్వారములతోనుగూడ దహింపబడినది. ఇట్టి సంక్షోభమునందు సీతాదేవి మాత్రముదహింపబడలేదు. ఇదిమిగుల నాశ్చర్యకరముగనున్నది. ఇంతకుపూర్వము మేమెన్నడును యిట్టియాశ్చర్యమును జూడలేదు. అనిచారణులు చెప్పుకొనుచుండిరి అట్టియెడ నాంజనేయుడు, తనకంతవరకు ననుభవములుగ నుండెడు శుభసూచకముల చేతను, రాముని ప్రభావముచేతను, సీతాదేవియొక్క పాతివ్రత్యమువల్లనైన కారణములచేతను, ఆకాశమునందు చారణులు జెప్పుకొనుచుండెడు మాటలువినుటచేతను, మిగుల సంతసించె, ఇట్లు సంతసించి యాంజనేయుడు, సఫలమనోరథుడై, రాజకుమార్తెయగు సీతాదేవి క్షేమముగ నున్నదని యెఱింగి, మఱల నాసీతాదేవిని ప్రత్యక్షముగ జూచి పిమ్మట బైలుదేరి రామలక్ష్మణ సుగ్రీవుల యొద్దకు బోగోరె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి ఏబదియైదవ సర్గ ముగిసెను.

ఆంజనేయుడుమరలసీతాదేవినిజూచుట.

అంతనాంజనేయుడు, శింశుపావృక్షముక్రింద గూర్చుండియున్న సీతాదేవి యొద్దకుబోయి ప్రదక్షిణ నమస్కారము జేసి యిట్లనియె. ఓదేవీ! నాభాగ్యవశముచే నపాయములేక క్షేమముగనున్ననిన్ను జూచితిని. అనిమిగులసంతోషముతో నామెకు జెప్పె. అంతనాసీతాదేవి ఆంజనేయుడు రామునొద్దకు పయనమై యుండుటను దెలిసి కటాక్షవీక్షణములచే పలుమారు జూచుచు, పెనిమిటియందలి స్నేహముతోగూడిన మాటలతో నాయాంజనేయునిజూచి మఱల యిట్లనియె.

వైరివీరులను సంహరించునట్టి యోయాంజనేయుడా! ఈకార్యమును నెరవేర్చుటకు (అనగా నీరాక్షసులనందఱి సంహరించినన్నుగొనిపోయి రామునకు నప్పగించుటకు) నీవుఒక్కడవే చాలుదువు. నీబలాభివృద్ధి మిగులగొప్పది. మహాకీర్తికరంబైనది. అయినను శత్రుసైన్యములను భేదించువాడును, కకుత్స్థవంశోద్భవుడును, నగురాముడు తానే యీలంకానగరమునకువచ్చి తనబాణపరంపరలచే నీలంకానగరమును నాశనమునుజేసి నన్నుగొనిపోవునేని యది రామునికి కీర్తినిగలిగించును. అదిరామునకు తగినది. కావున ఓయాంజనేయా! మహాత్ముడును, యుద్ధవీరుడును, నగు రాముడు తనబలపరాక్రమములకు తగినటుల పరాక్రమించునట్లు నీవు ఒనగూర్పవలయునని చెప్పె. అంత, విశేషార్థముగలదియును, మహావినయముతోగూడినదియును, కార

ణయుక్తమైనదియునునగు సీతాదేవిమాటనువిని, ఆంజనేయుం డిట్లనియె.

ఓతల్లీ! సీతాదేవీ! యుద్ధమునందు శత్రువులనందఱినిసంహరించి నీవ్యసనముచు బోగొట్టి నిన్ను గొనిపోవునట్టి రాముడు శీఘ్రకాలము గానే వానర భల్లూకములయొక్క సైన్యములనుగూర్చుకొని యీలంకకువచ్చును అనిచెప్పి వాయుపుత్రుడగు నాంజనేయుడు యిట్లుసీతాదేవిని యూరడించి, రామునొద్దకు బోవుట కిచ్ఛగలవాడై, సీతాదేవికిన మస్కారమును జేసె. అట్లునమస్కరించి పిమ్మట శత్రుసంహారకుడును వానరోత్తముడును, నగునాంజనేయుడు తన స్వామిఁజూచుటయందిచ్ఛగలవాడై, లంకానగరమునందుండెడు నరిష్టపర్వతముపై నారోహించె. మఱియును ఉన్నతములగు పద్మకములను వృక్షములచే నిండియుండెడు వనపఙ్క్తులతోగూడినదై కట్టుబట్టతోగూడినదానివలె నున్నదియును, శిఖరములనడుమ వ్రేలుచాడుచున్న మేఘములతోగూడినదై పైవస్త్రము అనగా పైటతోగూడినదానివలెనున్నదియును, బాలసూర్యుడు తనకిరణములనెడి చేతులతో, మిగులదయచేనాంజనేయుడువచ్చెనని తెలుపుటకై, మేల్కొలుపఁబడుచున్నదానివలెనున్నదియును, మనశ్శిలాధి ధాతువులు గారుచుండుటచే నేత్రములను తెఱిచిచూచున్నదానివలెనున్నదియును, అచ్చటచ్చట పారుచుండెడు జలప్రవాహములయొక్క ధ్వనులతోగూడినదియై, అధ్యయనము జేయుచున్నదానివలెనున్నదియును, పర్వతమునందుపుట్టిననానావిధములగు సెలయేళ్లయొక్క ధ్వనులచే జక్కగగీతము బాడుచున్నట్లున్నదియును, పొడవులగు దేవదారుచెట్లుండుటచే చేతులుమీదికెత్తి తపస్సునలుపుచున్న ఋషివలెనున్నదియును, పర్వతపుచెరియలయందు మీదినుండిపడెడిజలముచేనైనధ్వనులచేనఱచుచున్నదానివలెనున్నదియును, కదులుచున్నవియును మిగులనల్లనైనవియునునగు శరద్రుతువునందలి వృక్షసమూహములచే నొప్పుమ ఆంజనేయుడే తెంచెనను భయముచే వడవడవడకుచున్నదానివలెనున్నదియును, గాలివీచునప్పుడుగదలుచున్నకీచకములను వెదుళ్లయొక్కధ్వనులచేనొప్పుచు కూయుచున్నదానివలెనున్నదియును, మిగుల భయంకరములగు సర్పములుబుసగొట్టుటచేతగలిగినధ్వనులచేనిట్టూర్పులు విడుచుచున్నదానివలెనున్నదియును, మంచుచేగప్పబడిన మిగులగంభీరములగుగుహలచే నొప్పుచున్నదై మౌనముధరించి యోగనిష్ఠయందున్నదానివలెనున్నదియును, మేఘములయొక్క పాదములో అనునట్టిప్రత్యంతపర్వతములతోనొప్పుచు, కాళ్లతోగూడి సంచరించుచున్న మేఘసమూహమువలెనున్నదియును, మఱియు మేఘసమూహములతోగప్పబడిన యత్యున్నతములగు శిఖరములచే నొప్పుచుగగనమార్గమునందు ఆవులించుచున్నదానివలె దర్శనమిచ్చుచున్నదియును, అనేకములగు గుహలచే నొప్పుచున్నదియును, పలువిధములుగనంతటను వ్యాపించియుండెడు శిఖరములచేప్రకాశించుచున్నదియును, అనేకములగు సాలవృక్షములచేతను, తాటిచెట్లచేతను, ఇనుమద్దిచెట్లచేతను, వెదుళ్లచేతను నావరింపబడియొప్పుచున్నదియును, విశేషముగబూచియుండెడి తీగెలసమూహములచేత జక్కగనలంకరింపబడినదియును, పలువిధములగు మృగసమూహములచేనావరింపబడినదియును, మనశ్శిలాది ధాతువులుగారుటచేనలంకృతంబైనదియును, తాళ్లసమూహములచే గ్రిక్కిరిసియున్నదై చొరనశక్యంబైనదియును, మహర్షులచేతను, యక్షులచేతను, గంధర్వులచేతను, కిన్నరులచేతను, పన్నగులచేతను సేవింపబడినదియును,తీగెలయొక్కయువృక్షములయొక్కయు సమూహములచే నొప్పుచున్నదియును, గుహలయందంతటను సింహములచేనివసింపబడినదియును, పులులయొక్కసమూహములచే నంతటను సంచరింపబడినదియును, తియ్యనిగెడ్డలును పండ్లునుగల వృక్షములచేనొప్పుచున్నదియునునగునాపర్వతోత్తమమును వాయుపుత్రుండగు నాంజనేయుడు, రామునిజూచుటయందు పరమసంతోషముగలవాడై, ఆరోహించె అట్లు ఆంజనేయుడు ఆయరిష్టపర్వతమునారోహించునపుడు పాదములను ఊనగానే ఆకొండచరియలయందలి తాళ్లన్నియు పొడిపొడిగ చూర్ణమైనేలంబడినవి. అప్పుడు అవిచూర్ణమగుచుండగ గొప్పధ్వనిగలిగె. పిమ్మట ఆంజనేయుడు ఆపర్వతముమీదనుండి సముద్రముయొక్క దక్షిణపుతీరముననుండి యుత్తరపుదరికి బోగోరితనశరీరమును మిగులగొప్పదిగ బెంచె. మహాపరాక్రమశాలియును వాయుపుత్రుడునునగు నాంజనేయుడు అట్లుపర్వతముపైనుండి తనదేహమును బెంచి, మిగులగొప్పచేపలు,పాములు మొదలగువాటికి నివాసస్థానమైనదియును, మిగులభయంకరమైనదియును, నగుసముద్రమునుజూచె. అట్లుసముద్రమును జక్కగాజూచి, వానరోత్తముడును వాయుపుత్రుడునునగు నాంజనేయుడు సముద్రమునుదాటి యుత్తరపుదిశకుబోగోరి వాయుదేవునివలె నాకాశమార్గమున కెగిరె. అట్లు ఆంజనేయుడు ఆకాశమునకెగురగానే ఆయరిష్టపర్వతము ఆంజనేయునిచే పీడింపబడి, అందున్నసమస్తభూతములతోగూడ నాపర్వతము గడగడవణకుచుండగా, శిఖరములును, వృక్షములును, విరిగినేలంబడె. అంత నాపర్వతము భూమిలోభూమిగ చదురమాయె. అప్పుడు ఆంజనేయుండట్లెగురుటవలన నాతనితొడలవేగముచే గొట్టబ

డినవై నిండుగబూచియున్న సమస్తవృక్షములును "దేవేంద్రునివజ్రాయుధముయొక్క దెబ్బచేతవలె" విఱిగి నేలం గూలినవి. మఱియు నాపర్వతగుహాలయందున్న సింహములు, మహాపరాక్రమశాలియగు నయ్యాంజనేయుని పాదహతిచే బీడనొందినవియై "ఆకాశమువిఱిగి నేలంగూలుచున్నదో యనునట్లు" గొప్పసింహనాదము జేసినవి. అట్టియెడ నాపర్వతమునందున్న విద్యాధరస్త్రీలును, భయమునుబొందికంపముచే మొలబట్టలూడ, భూషణములు యథాస్థానములనుదప్పిచిక్కువడ, ఆపర్వతమునువిడిచి యతివేగముగ నాకాశమున కెగిరిరి. అదియును గాక నాపర్వతమునందున్నవియును, మిగులగొప్పవియును, నధికమైనబలముగలవియును, మహావిషముగలిగి మండుచున్న నాలుకలతో నొప్పుచున్నవియును, నగుమహాసర్పములు నలియగొట్టబడిన తలలుగలవియై పర్వతమునువిడిచి బయిలువెడలినవి. అప్పుడాయరిష్టపర్వతమునందున్న కిన్నరులును, గంధర్వులును, విద్యాధరులును, యక్షులును, ఉరగులును నాపర్వతమునువిడిచి గగనమున కెగిరిరి. మఱియు శ్రీమంతమును, వృక్షసమూహములతో నొప్పుచున్న శిఖరములుగలదియును నగు నాయరిష్టపర్వతము మిగులబలవంతుడగు నాంజనేయునిచే బీడింపబడినదై రసాతలమునుజొచ్చె. అట్లు ఆయరిష్టపర్వతము భూమియందు బ్రవేశించి, పదియోజనములు వెడలుపును ముప్పదియోజనముల నిడుపునుగలదియై, నేలతో నేలగ చదురముగనాయె అట్టియెడ ఆంజనేయుడు గొప్పయలలుదరి తాకుచుండగా మిగులభయంకరముగ నొప్పుచున్న సముద్రమునుదాటగోరి గగనమార్గమున కెగిరె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేబదియారవసర్గ ముగిసెను.

——(*)——

ఆంజనేయుడు లంకాపట్టణమునందుండి రామసుగ్రీవులవద్దకు వచ్చుట.

చంద్రుడే తెల్లగలువగా గలదియును మనోజ్ఞమైనదియును, సూర్యుడే నీరుకోడిగా గలదియును, శుభకరంబునదియును, పుష్యమీ నక్షత్రము శ్రవణనక్షత్రములు నే కలహంసలుగా గలదియును, మేఘములే పాచిగను, పచ్చికనేలగను గలదియును, పునర్వసు నక్షత్రమే తిమింగలముగ గలదియును, అంగారకనక్షత్రమే గొప్పమొసలిగా గలదియును, ఐరావతమే గొప్పదీవిగా గలదియును, స్వాతీనక్షత్రమే హంసపక్షిగా గలిగి దానిచే గలతనొందింపబడినదియును, గాలికొట్టుటచే గదులుచుండెడు నలలవంటి చంద్రకిరణములను, చల్లనినీళ్లుగలదియును, పన్నగయక్ష గంధర్వులు నే పూచిన తామర పూలుగను, కలువలుగను గలదియును, కానరానిగట్టుగలదియును, నగు ఆకాశమను సముద్రమునందు "పెద్దయోడ, గాలివేగముచేత మహాసముద్రమునందతివేగముగ బోవునట్లు" ఆంజనేయుడు వాయువేగమువంటి వేగముతో బోవుచుండె. మఱియు వాయుదేవునికుమారుడును, మిగులకాంతిమంతుడును, ఆకాశమునందుబోవువాడును, పెద్దవానరుడును, నగు నాంజనేయుడు, ఆకాశమును మ్రింగువానివలెను, చంద్రుని బరయుచున్నవానివలెను, నక్షత్రమండలము సూర్యమండలములతో గూడిన ఆకాశమును మ్రింగువానివలెను, మేఘసమూహములను తనతో గూడ నీడ్చుకొనిపోవుచున్నవానివలెను, నగుబడుచు నాకాశమార్గమునబోవుచుండె. అట్టియెడ మేఘముల సమూహములు ఆంజనేయుని దేహకాంతితో గూడినవై తెల్లనిరంగుగలవిగను, ఎఱ్ఱనిరంగుగలవిగను, నలుపు పసుపుగలిసినవన్నెగలవిగను, నల్లనిరంగుగలవిగను, అరుణచ్ఛాయగలవిగను, యిట్లు నానావిధములుగ బ్రకాశించుచుండె మఱియు ఆంజనేయుడు ఆకాశమునందుండు మేఘములలో, పలుమారు బ్రవేశించుచు మఱల వెలికివచ్చుచు "మేఘములచే గప్పబడినవాడును మఱల వెలుపలికి వచ్చుచున్నవాడును నగు, చంద్రునివలనే" ప్రకాశించుచుండె.

అప్పుడు మిగులశౌర్యవంతుడగు నాంజనేయుడు, తెల్లనివస్త్రములను గట్టుకొనియుండుటచేతను, ఆకాశమునందు నానావిధములగు మేఘసమూహములలో దూరిపోవుటచేతను, ఒకప్పుడు కనబడుచును, మఱియొకప్పుడు కనబడకను "చంద్రునివలెనే" వెలుగుచుండె. మఱియు వాయుదేవునిపుత్రుడగు నాంజనేయుడు పలుమారు మబ్బులలో చొరబడుచు బైటవచ్చుచు, మేఘధ్వనికంటె నధికముగ సింహనాదమును జేయుచు "గరుత్మంతుడు ఆకాశమార్గమున బోవునట్లు" గగనమార్గమునందు బోవుచు బ్రకాశించుచుండె అప్పుడు మహాబలపరాక్రమశాలియగు నాంజనేయుడు, రాక్షసులలో శ్రేష్ఠులగు రాక్షసులను జంపి, తనపేరు జక్కగ ప్రచురపరచి, గొప్ప సైన్యమును నాశనము జేసి లంకానగరమును గాల్చి యాపట్టణమును మిగుల కలతనొందించి, రావణాసురునకు మహావ్యసనమును గలుగజేసి, సీతాదేవికి నమస్కరించి సీతాదేవిచే నాజ్ఞ దీసికొని మరల సముద్రమును దాటుట కెత్తించిపోవుచుండె అట్లు బోవుచు మిగులపరాక్రమశాలియగు నాంజనేయుడు, శ్రేష్ఠమగు శిఖరములు గలదియును, పర్వతశ్రేష్ఠమును నగు నా మైనాకమును, సముద్రమధ్యమునందు జూచె. అట్లు జూచి యాపర్వతమును సన్మానించి పిమ్మట అల్లెత్రాటివలన విడువబడిన బాణమువ

లె" అనివేగముగవెళ్ళె.వానరోత్తముఁడగు నాంజనేయు
డుఅట్లతివేగముగదరిజేరబోయి మేఘముతో సమానమగు
నామహేంద్రపర్వతమునుజూచి సింహనాదమునుజేసె.
అప్పుడుమేఘధ్వనితోసమానమైనధ్వనిగల యాంజనేయుఁ
డుచేసిన యాగొప్పసింహనాదముయొక్కధ్వని దశదిశలు
నునిండె. మఱియు వానరోత్తముఁడగు నాంజనేయుడు
అంగదుడుమొదలగు వారున్నస్థలమునుజేరబోవు. అంత
స్నేహితులనుజూచుటయందు మిగుల సంతోషముగలవాఁడై
తోఁకనాడించుచు గొప్పసింహనాదముజేసె. అట్టియెడగ
రుత్మంతుఁడు తిరిగెడిమార్గమగు నాకాశమార్గమునందు
గొప్పసింహనాదమునుజేయుచున్న అయ్యాంజనేయునిధ్వ
నికిసూర్యమండలమును, ఆకాశమునుగూడబ్రద్దలుగపగులు
నట్లుండినది. అప్పుడు, పూర్వము ఆంజనేయుఁడుసముద్ర
మునుదాటబోవునపుడు, ఉత్తరపుదరియందు నివసించుచు
న్నవారును, మహాబలపరాక్రమశాలులును, ఆంజనేయుని
జూచుటయందు మిగులసంతోషముగలవారును, నగు నా
యంగదుడుమొదలగువానరులు, "వాయువుచే బ్రేరేపిం
పఁబడిన మహామేఘధ్వనివలెనున్న" అయ్యాంజనేయుని
యొక్కసింహనాదధ్వనిని, తొడలవేగమువలన గలిగినధ్వ
నినివినిరి. అట్లుమేఘధ్వనితోసమానమైనధ్వని జేయుచున్న
నయ్యాంజనేయునియొక్క సింహనాదమునువిని, గడువు
కాలమతిక్రమించుటచే మిగులదైన్యమునుబొందియున్న న
య్యంగదుడు మొదలగు వానరులుఆధ్వనిని మిగులగమనించి
వినిరి. మఱియునాయంగదుడుమొదలగు వానరులందఱు
ను, దశదిశలునునిండునట్లు సింహనాదముజేయుచున్న న
య్యాంజనేయుని, కంఠధ్వనినిబట్టితెలిసికొని స్నేహితుని
జూచుటయందు మిగులసంతోషముగలవారైయుండిరి. అ
ట్టియెడవానరోత్తముఁడగు జాంబవంతుఁడు మిగులసంతో
షమునుబొందినమనస్సుగలవాఁడగుచు నచటనున్నవానరుల
నందఱినితనయొద్దకుబిలిచియిట్లనియె.

ఓవానరులారా! ఈయాంజనేయుఁడు సమస్తవిధము
లచేకృతకార్యధురంధరుఁడై వచ్చుచున్నాడు ఈవిషయ
మునందెంతమాత్రమును సందేహములేదు ఇతఁడుపో
యినకార్యముగాకుండెనేని యితనికంఠధ్వనియింతగాంభీ
ర్యముగనుండదు అనిజాంబవంతుఁడువారలతో జెప్పె. అం
తనావానరులందఱును, మహాపరాక్రమశాలియగునయ్యాం
జనేయునిచేతులయొక్కయు, కాళ్ళయొక్కయు వేగము
వలనగలిగినధ్వనిని, సింహనాదమునువిని మిగులసంతోష
మునుబొంది యచ్చటచ్చటగంతులువేయుచుండిరి.మఱియు
నావానరులు ఆంజనేయునిజూడఁగోరి, మహాసంతోషము
నుబొంది యొకచెట్టుమీదినుండి మఱియొకచెట్టుమీదికిని ఒ
కపర్వతశిఖరముననుండి వేఱొకపర్వతశిఖరమునకును దు
ముకుచుండిరి. అంతనావానరులు మిగులసంతోషముతోచె
ట్లకొనకొమ్మలనుచేతబట్టుకొని "దూరంబున వచ్చుచుండె
డిస్నేహితునిత్వరగారమ్మని వస్త్రముయొక్క కొనచెరగు
నునాడించునట్లు" చిన్నకొమ్మలనాడించిరి. అట్టియెడ "వా
యువుపర్వతగుహలయందుజొచ్చి యెట్లుధ్వనించునోయ
ట్లు" మహాబలవంతుఁడును, వాయుపుత్రుఁడుననగునాం
జనేయుఁడుసింహనాదమునుజేయుచువచ్చుచుండె. అప్పు
డుఆవానరులందఱును గొప్పమేఘసమూహముతోసమా
నముగ వచ్చుచున్నవానరోత్తముడగు నయ్యాంజనేయుని
జూచి చేతులనుముకుళించుకొనినమస్కరించుచునిలిచియుం
డిరి ఆసమయమున, మహావేగముగలవాఁడును, పర్వత
ముతోసమానమైనదేహముగలవాఁడును, నగు నయ్యాంజ
నేయుడుఅనేకచెట్లతోనిండియుండెడు నామహేంద్రపర్వ
తముయొక్కశిఖరముమీదదిగెను. మఱియు నయ్యాంజనే
యుఁడుపరమసంతోషముగలవాఁడగుచు, ఆపర్వతమునం
దుమిగులమనోజ్ఞమగు నొకనేలయేటిగట్టున "ఱెక్కలుతె
గగొట్టఁబడిన పర్వతమువలె" ఆకాశమునుండివ్రాలె.
అంతనయ్యంగదుడుమొదలగు వానరోత్తములందఱును మ
హాసంతోషమునుబొందిన మనస్సుగలవారగుచు, మహాప
రాక్రమశాలియగు నయ్యాంజనేయునిచుట్టునుజుట్టకొనిమ
హాసంతోషమును బొందియుండిరి అప్పుడువానరోత్తముఁ
డగు నాంజనేయుఁడు జాంబవంతుఁడుమొదలగుగురువుల
కును, వృద్ధులకును, యువరాజగునంగదునికిని నమస్కరిం
చె. అంతవానరులందఱును మిగులసంతోషముతో వికసిం
చినముఖముగలవారగుచు, రోగములేనివాఁడును, తమద
గ్గిరకువచ్చినవాఁడును వానరోత్తముఁడును, వాయుపు
త్రుఁడును, నగు నాంజనేయునకు, గెడ్డలును, పండ్లును,
దెచ్చికానుకగానిచ్చిసన్మానించిరి అట్లుజాంబవదంగదుల
చేతసంతోషింపఁబడినవాఁడును, తక్కినవానరులచేతపూ
జింపఁబడినవాఁడును, మహాపరాక్రమవంతుఁడును, మిగు
లపూజనీయుడును, నగు నయ్యాంజనేయుఁడు మహాసంత
సముప్పొంగ, చూచితినిసీతాదేవిని, అనిఒకమాటతోసంగ్ర
హముగజెప్పె అట్లుజెప్పిఅయ్యాంజనేయుఁడు, వాలికు
మారుడగునంగదుని చెయ్యితనచేతిచేఁబట్టుకొని ఆమహేం
ద్రపర్వతమునందు మిగులరమణీయమగు నొకయరణ్యప్ర
దేశమునందుగూర్చుండియుండె అట్లుగూర్చుండిమహాసం
తోషమునుబొందిన మనస్సుగలవాఁడగుచు, వానరోత్త
ములగునయ్యంగదాదులనుజూచియిట్లనియె.

ఓవానరోత్తములారా! నేనుసీతాదేవిని రావణాసురుని యశోకవనమధ్యమునందు జూచితిని. మహాభయంకరాకారులగు రాక్షసస్త్రీలుఆసీతాదేవికి కావలియున్నారు. ఆసీతనిందింపఁబడని నడవడికగలదియైయున్నది. భర్తృవియోగదుఃఖముచే సంస్కారాదులేవియును జేసికొనకుండుటచేత తలవెంట్రుకలన్నియునువొకజడగాగట్టుకొనిపోయినవి భోజనమజ్జనాదులులేక యుపవాసములుండుటచే మిగులనుడిగియున్నది శరీరమంతయుమలినముతోఁగూడియున్నది. నిరంతరము పనిమిటియగు రామునేధ్యానించుచున్నది. ఈరీతిగనుండెడు జనకమహారాజుకూతురగుసీతాదేవినిలంకయందుజూచితిని.అనియిట్లువాయుపుత్రుడగునాంజనేయుఁడుజెప్పినదియును, గొప్పయర్థముగలదియును, అమృతముతో సమానమైనదియును, నగు "చూచితిననెడి" మాటవిన్నంతనేవానరులందఱునుమిగులసంతోషమునుబొందిరి అట్లుపరమసంతోషమునుబొంది, మహాబలులగు నావానరులుగొందఱుసింహనాదములను జేయుచుండిరి. మఱికొందఱరచుచుండిరి. ఇంకఁగొందఱుమెద్దులవలెరంకెలువేయుచుండిరి కొందఱు కిలకిలధ్వనులను జేయుచుండిరి. మఱియునుగొందఱు, అరచువానికిబదులరచుచుండిరి. అందుకొందఱువానరోత్తములు మహాసంతోషమునుబొంది, మిగులబలిసినవియును పొడుగుగానుండునవియును, మిగులరమణీయములయినవియును, నగు తోకలనుపైకెత్తి నేలంగొట్టుచుండిరి. మఱికొందఱు వానరులు మిగులసంతోషముచే కొండలయొక్క శిఖరములనుండి క్రిందదుమికి, ఆంజనేయునికౌగలించుకొనుచుండిరి అట్టియెడవానరవీరులలోనంగదుండుముందుకువచ్చి వారిమధ్యనుండిమిగులనుత్తమమగు మాటలతో నయ్యాంజనేయునిజూచియిట్లనియె.

ఓయాంజనేయుఁడా! నీవుమిగులవిశాలమగు సముద్రమునుదాటిపోయి మఱలదాటివచ్చితివిగాన బలపరాక్రమములయందునీకుసమానుడగు వాడొక్కడును లేడు. ఆహా! నీకుస్వామియందుగలభక్తి మిగులనాశ్చర్యకరముగ నున్నది నీకుగలశౌర్యమునుధైర్యమునుసామర్థ్యమును మిగులనాశ్చర్యకరములుగనున్నవి. మహాకీర్తిమంతురాలును, శ్రీరామునిభార్యయును, నగుసీతాదేవినిభాగ్యవశముచేజూచితివి. నీవుమహాకీర్తిమంతుఁడవు. ఓయాంజనేయా! నీవనుకారణముచేత శ్రీరాముఁడుసీతావియోగమువలన గలిగినవ్యసనమునువెడబాసి సుఖముగనుండగలడు. అనియంగదుడుఆంజనేయునితోజెప్పె. అంతవానరులందఱును పరమసంతోషమును బొందినవారగుచు, అంగదునిఆంజనేయునిజాంబవంతునిపరివేష్టించి, యొకవిశాలమగుబండపైగూర్చుండియుండిరి. అప్పుడువానరోత్తములందఱును, ఆంజనేయుఁడుసముద్రమును దాటుటయును, లంకాపట్టణమునుజూచుటయును, సీతాదేవినికనుగొనుటయును, రావణాసురునిజూచుటయును మొదలుగాగల వృత్తాంతమునంతయువినగోరిశిరంబున చేమోడ్పుగీలించి, ఆంజనేయునికెదురుముఖముగలవారైకూర్చుండియుండిరి ఆసమయమునమిగులకాంతిమంతుడగు నంగదుడుఅచ్చటనున్న అనేకవానరులచేత బరివేష్టింపఁబడినవాఁడగుచు, స్వర్గమునందు దేవతలచే బరివేష్టింపఁబడియుండు దేవేంద్రునివలెనే" ప్రకాశించుచుండె. అట్టియెడ, మిగులకీర్తిమంతుఁడును, బాహుపురులుధరించియుండువాడును, నగుఅంగదుడును, మిగులసంతోషముతోగూడికొని, గొప్పదియును మిగులయున్నతంబైనదియును, నగునామహేంద్రపర్వతశిఖరమునందుగూర్చుండియుండుటచే నాశిఖరము మిగులప్రకాశించుచుండె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేబదియేడవసర్గముగిసెను

(*)

ఆంజనేయుండుఅంగదుడుమొదలగు వారితోతానుసీతాదేవినిజూచివచ్చి నవృత్తాంతమునుజెప్పుట

అంతమహాబలపరాక్రమశాలులగు నాంజనేయుఁడు మొదలగు వానరులందఱును నామహేంద్రపర్వత శిఖరమునందుగూర్చుండి పరమసంతోషభరితులైయుండిరి. అట్టియెడజాంబవంతుఁడు మహాసంతోషభరితుఁడై, పరమసంతోషముతోనున్నవాఁడును, గొప్పవానరుఁడును, వాయుపుత్రుఁడును, నగు నాంజనేయుని జూచి, నీవుయిచటనుండిబైలుదేరిపోయి సీతాదేవినిజూచి మఱలవచ్చినసమాచారమునంతయునుసవిస్తరముగనెఱింగింపుము. మఱియు నోయాంజనేయుడా! నీవుయేవిధముగ సీతాదేవిని జూచితివి. ఆసీతాదేవియాలంకయందెట్లున్నది? మిగులక్రూరకార్యములను జేయునట్టి రావణాసురుడు ఆసీతాదేవియెడలనెట్లునటించుచున్నాడు. వానరోత్తముడవగు నోయాంజనేయా! నీవుయీవృత్తాంతమునంతయుజరిగినదిజరిగినట్లుయథార్థముగ మాకెఱింగింపుము. ఆసమాచారమునంతయువిని, ఇంకజేయవలసినకార్యమునుగుఱించి చక్కగయోచించెదము. ఓయాంజనేయుడా! ఇదియునుగాక మనము రామునిదగ్గరకుబోయినపిమ్మట యేవిషయమును రామునకెఱిగింపక దాచవలయునో, యేవిషయమును దాచక రామునకుచెప్పవలయునో, దానినంతయును, నీవుమిగుల బుద్ధి

మంతుడవుగావున, మాకుసవిస్తరముగ చెప్పుము అని జాంబవంతుడడిగె. అంత ఆంజనేయుడు, మిగుల సంతోషముచేత పులకరించిన రోమములుగలవాడగుచు పతివ్రతాశిరోమణియగు సీతాదేవికి శిరస్సాష్టాంగ నమస్కారమును గావించి యిట్లని చెప్పుటకారంభించె. ఓవానరశ్రేష్ఠులారా! నేనుయేకాగ్రచిత్తుడనై సముద్రముయొక్క దక్షిణపుగట్టునకు చేరగోరి, యీమహేంద్రపర్వత శిఖరముననుండియే యాకాశమార్గమున కెగిరితిని. ఇదిమీకందఱికిని తెలిసినవిషయమే కదా? అట్లునేనుఆకాశమార్గమునబోవుచుండగా, మిగులసుందరమైనదియును, శ్రేష్ఠమైనదియును, బంగారువికారమైనదియును, నగు నొకపర్వతశిఖరము, నాకువిఘ్నముగావించుటకై యున్నదానివలె సముద్రముమధ్యఅగుబడినది. నేనుసమీపమునకుపోనుపోనునొకపర్వతముదారినిఅడ్డగించుకొనియున్నట్లగుబడియె. ఆపర్వతమునుజూచి యది నాకువిఘ్నకారియనితలచితిని. అంత నేను, మిగుల శ్రేష్ఠమైనదియును, బంగారువికారమైనదియును, నగు నాపర్వతమునుసమీపించినపుడు "ఈపర్వతమునుపగలగొట్టవలసినది" అనినామనస్సులో నెంచితిని. అట్లుఆలోచించి సూర్యునితోసమానముగ ప్రకాశించుచుండెడు నాపర్వతశిఖరమును నాతోకతోనొకదెబ్బగొట్టితిని. అంతనాశిఖరము అనేకబ్రద్దలుగపగిలినది. అంతనామహాపర్వతము నాతలంపునుగుర్తెఱిగి, ఓకుమారుడా! నాయనా! యనిమిగులమనోజ్ఞమగుమాటలతో నాకుఅతిసంతోషమునుబుట్టించుచు యిట్లనిచెప్పె. ఓఆంజనేయుడా! నేనుమీతండ్రియగువాయుదేవునకు స్నేహితుడను కావుననీకుపినతండ్రినౌదును. నన్నందఱుమైనాకుడందురు. నేనీసముద్రములోనున్నవాడను. ఇంకనాపూర్వవృత్తాంతమునుమీతండ్రికితోబుట్టువునగుటకుకారణమును, అంతయుసవిస్తరముగ నెఱింగించెద వినుము ఓపుత్రకా! పూర్వముపర్వతములకన్నింటికిని ఱెక్కలుగలిగియుండెను. అప్పుడవియథేచ్ఛముగ భూమియందంతటనుదిరుగుచు సమస్తభూతములనుబాధించుచుండెనవి. అంతమిగులమహిమగలవాడును, పాకుడనురాక్షసునిజంపినవాడును, నగు దేవేంద్రుడు పర్వతములు జేయుచున్నచెడ్డకార్యములనువిని పర్వతములకుగలఱెక్కలనువజ్రాయుధముతో తెగనఱికె. ఓబిడ్డా! ఆంజనేయా! అప్పుడు, మిగులమహాత్ముడును, నీకుతండ్రియునునగు వాయుదేవుడు నన్నింద్రునియుపద్రవమువలననుండి తప్పించి యతివేగముగగొనివచ్చి యీసముద్రమునందుబడవైచె. విరోధులనుసంహరించునట్టిఓయాంజనేయుడా! నేనావాయువుచేగొప్పయుపకారమొందితి. ఈసంబంధముచేత నేనుమీతండ్రికితోబుట్టువును. కావుననతనిపుత్రుడవగు నీకవశ్యముగ సహాయముజేయవలసినవాడను. అదియునుగాక నీవురామునికార్యముకొఱకుబోవుచున్నావు. ఆరాముడు ధర్మమునాచరించువారిలోనుత్తముడు, దేవేంద్రునిపరాక్రమమువంటి పరాక్రమముగలవాడు కావుననట్టిరామునకు నేనవశ్యముగ సహాయముజేయవలయును. నీవారామునకుదూతగ బోవుచున్నావు. ఈరెండువిషయములచే నీకు నేనవశ్యముతోడ్పాటుగావలయును. అనిమైనాకుడు నాతో జెప్పె. అంత నేను మిగులపూజ్యమైనస్వభావముగల యామైనాకుండు జెప్పినమాటనువిని నేనవోయెడికార్యమునంతయుసవిస్తరముగ జెప్పి ఆవల నేనుఅతివేగముగబోవలయునని నాయభిప్రాయమునగూడ దెలిపితిని. అంతమిగులమహాత్ముడగు నామైనాకుడు నన్నుపోయిరమ్మనిచెప్పె. అట్లుజెప్పియామహాపర్వతమునాతోమాటలాడుటకు ధరించిన మానవశరీరమునువిడిచి గొప్పపర్వతాకారమునుదాల్చిసముద్రమునందుండినది. అప్పుడునేనుమిగిలినమార్గమునుగడచిబోవుటకతివేగమునునవలంబించి చాలాకాలముబోవుచుంటిని. నేనుఅట్లుఅతివేగముగబోవుచు మార్గమునందు నాగమాతయగు సురసాదేవినిజూచితిని. అంతనాసురసాదేవి సముద్రమధ్యముననుండి నన్నుజూచియిట్లనియె.

వానరోత్తముడవగు నోయాంజనేయుడా! దేవతలు నిన్నునాకాహారముగనిచ్చిరి. కావుననిన్ను నేను భక్షించెదను. నీకొఱకుబహుకాలముగ గాచియున్నాను. అనిసురసాదేవినాతోజెప్పెను. ఆమాటవిని నేనాసురసాదేవికి సాష్టాంగనమస్కారమునుజేసి చి తెల్లబారిన మోముగలవాడనగుచు నిట్లనిజెప్పితిని. ఓసురసాదేవీ! మిగులశ్రీమంతుడును, విరోధిజనములనుతపింపజేయువాడును దశరథరాజపుత్రుడును, నగు రాముడుతనతమ్ముడగు లక్ష్మణునితోను, భార్యయగుసీతాదేవితోనుగూడ దండకారణ్యమునందుప్రవేశించె. అచటనారామునిభార్యయగు సీతాదేవిని, దురాత్ముడగు రావణాసురుడు యెత్తికొనిపోయె.

వున నేనుఆరామునియాజ్ఞవలన రాయభారినై సీతాదేవిని వెదుకుచునాతడుయున్నస్థలమునకుబోయెదను. ఓసురసాదేవీ! నీవుశ్రీరామునిదేశమునందు నివసించుచున్నావు. కావుననీవుగూడ శ్రీరామునకుసహాయమును జేయవలసినదానవేను. అటుగాకనీవురామునకు సహాయముజేయుటకిష్టములేదేని, నేనిచటనుండిపోయి సీతాదేవినిజూచి యాసమాచారమునునక్లిష్టకార్యుడగు రామునకెఱింగించి, పిమ్మటవచ్చి నీనోటిలోప్రవేశించెదను. నామాటనమ్ముము

నీతో సత్యముగ జెప్పుచున్నానని చెప్పితిని. నేనీమాట చెప్పగా నే కామరూపిణియగు సురసాదేవి మిగుల కోపమును బొంది యిట్లనియె

ఓ వానరుడా! నా చేత జిక్కినవాడెవ్వఁడును నన్నతిక్రమించిపోజాలడు ఇట్లు నాకొక వరమున్నది అని నాతో జెప్పినది. అంత నేనా సురస మాటవిని పదియోజనముల నిడుపుతో నున్న నా శరీరమును పదునైదు యోజనముల నిడివిగల దానినిగా బెంచితిని. అదిచూచి యా సురసయు నా దేహమును మ్రింగుటకు దగిన నోరు తెరిచినది అట్లా సురస నోరును దెరచుటను జూచి నా దేహమును అంగుష్ఠప్రమాణము గలదిగా జేసికొని యతివేగముతో నా సురస నోటియందు బ్రవేశించి, మఱల తత్క్షణమే దాని నోటినుండి బైటవచ్చితిని. అంత నా సురసాదేవి తన మొదటిరూపమును ధరించి నన్ను జూచి యిట్లని జెప్పె సౌమ్యుడా! వానరోత్తముడవగు నో యాంజనేయుఁడా! నీకు కార్యసిద్ధియగుగాక యథాసుఖముగ బోయిరమ్ము మిగుల పూజ్యమైన స్వభావముగల శ్రీరామునితో సీతాదేవిని గేర్పుము మహాబాహుఁడవగు నో యాంజనేయుఁడా! నీవు మహాసౌఖ్యమును బొందుదువుగాక! నీ యొక్క ధైర్యస్థైర్యములకు నేను మిగుల సంతోషించితినని సురసాదేవి చెప్పె. అంత సమస్తభూతములును బలే, బలే, బహుబాగ నని నన్ను స్తుతించినవి. అట్లు సమస్తభూతములచే స్తుతింపఁబడినవాఁడవగుచు ఆకాశమున కెగిరి లంకానగర మార్గమున బోవుచుంటిని. అట్లు బోవుచుండగ యేదో యొక జంతువు తెలియకుండ నా నీడను బట్టి లాగినది అంతటితో నా వేగము నిలిచిపోయినది వేగము నిలవగా నే దశదిశలను వెదకి చూచితిని. అందెవటగాని నా నీడనపహరించిన జంతువు అగుబడినది గాదు. అంతట నే నెచట జూచినను యేమియును నగుబడనే లేదే? ఆకాశమునందిట్టి విఘ్నమునకు గారణమేమని మిగుల నాలోచించుచుంటిని. అట్లాలోచించుచు మిగుల చింతాక్రాంతుఁడనై తలవంచి క్రింద జలముతట్టు జూచితిని అంత నా సముద్రజలమునందు మిగుల భయంకరాకారముగు నొక రాక్షసస్త్రీ గనుబడినది. అప్పుడు మిగుల భయంకరాకారముగల నా రాక్షసస్త్రీ నన్ను జూచి మిగుల పెద్దధ్వని గలుగునట్లుగ నవ్వి, యెంతమాత్రమును తొట్రుపాటులేక, అమంగళమగు నీమాటను మిగుల గట్టిగా జెప్పె గొప్ప దేహముగలవాఁడా! నీ వెచటికి బోవుచున్నావు నేను మిగుల నాకలిగొని యున్నాను నాకు ఆహారము గావలయును. బహుకాలముగ నాహారము లేకయున్నాను నీవు నాకాహారమై నాకు సంతుష్టి గావింపుము. అనియా యసురస్త్రీ నాతో జెప్పె. అంత నేనా మాటను విని మంచిదని యొప్పుకొంటిని. అట్లొప్పుకొని యా రాక్షసస్త్రీ యొక్క నోటికన్న నా దేహము మిగుల నధికముగ బెంచితిని. అంత నా రాక్షసస్త్రీ నన్ను భక్షించుటకై మిగుల భయంకరమగు తన పెద్ద నోటిని వృద్ధి జేయుచువచ్చినది. అయిన నా రాక్షసి నేను కామరూపి యని గాని, నేనిట్టి వికృతాకారమును ధరించియున్నానని గాని తెలిసికొనలేదు. అంత నేనొక్క నిమిషమాత్రములో నా గొప్ప దేహమును మిగుల చిన్నదిగ జేసికొని, ఆ రాక్షసి కడుపులో జొరబడి దాని గుండెలు పెకలించుకొని యాకాశమార్గమున కెగిరితిని. అట్లు, పర్వతముతో సమానమైనదియును మిగుల భయంకరాకారము గలదియును, నగు నా రాక్షసస్త్రీ గుండెలను నేను పెరుకగానే తెలివిదప్పి చేతులు వేలాడవేసి సముద్రముపైబడె. అట్టియెడ సిద్ధచారణులులోనగు సమస్తభూతములును, "ఆహా! ఆంజనేయుఁడు మిగుల భయంకరాకారముగల రాక్షసిని నొక్క నిమిషమాత్రములో చంపె" నని చెప్పుకొనుచుండుటను నేను వింటిని. అట్లు నేను సింహికను జంపి యాకాశమార్గమున బోవుచు మిగుల నాపదను గలుగ జేయునట్టి సింహికను జంపుట యనెడు నసాధ్యమగు కార్యమును జేసితినిగదా యని నాలో నేదలంచుకొనుచుఁబోతిని. అట్లుపోయిపోయి, సమస్తములగు చెట్లచేత నొప్పుచున్నదియును, లంకానగరమునకు వాసస్థానమైనదియును, నగు సముద్రముయొక్క దక్షిణపు దరిని జూచితిని. అట్లు దక్షిణపు దరిని జేరి పొద్దుగ్రుంకుదాక యచటనుండి, పొద్దుగ్రుంకు సమయమున నేను మహాభయంకరులగు రాక్షసులకు దెలియకుండ నా రాక్షసులకు నివాసంబగు లంకాపురమునందు బ్రవేశింపబోతిని. అట్లు నేను ఆ లంకయందు బ్రవేశించుచుండగ, ప్రళయకాలమునందలి జీమూతమేఘమువంటి యాకారముగల యొక రాక్షసస్త్రీ నన్ను చంపదలచి వికవికనవ్వుచు నా యెదుట నిలిచినది. అట్లు నన్ను చంపగోరివచ్చి నా యెదుట నిలిచినదియును, జక్కగ మండుచుండెడు అగ్నిహోత్రమువంటి తలవెండ్రుకలు గలదియును, మహాభయంకరమైన యాకారముగలదియును, నగు నా రాక్షసస్త్రీని ఎడమచేతి పిడికిటితో నేనొక గుద్దుచే జయించి ప్రదోషకాలమునందు లంకానగరములో పలికిఁ బోవుచుంటిని అప్పుడా స్త్రీ నన్ను జూచి భయపడి నాతో నిట్లనియె.

మహాపరాక్రమశాలివగు నో వానరుడా! నేనే లంకానగము. నీవు పరాక్రమించి నన్నే జయించితివి గావున నింక నీ లంకాపట్టణములో నుండెడు సమస్తరాక్షసులను జయించుట కెంతమాత్రమును సందేహము లేదు. అని యా రాక్షసస్త్రీ నాకు జెప్పినది. అంత నేను లంకానగరమునందు బ్రవేశించి

యీరాత్రి యంతయు నచట సీతాదేవిని వెదకుచు ఎచ్చటనుగానక రావణాసురుని యంతఃపురమునందు బ్రవేశించితిని. అట్లు రావణాసురుని యింటియందుబ్రవేశించి యందంతటను జక్కగ వెదకి సీతాదేవినిగానక మహాదుఃఖసముద్రములోమునిగితిని అట్లువ్యసనపడుచు కొంతసేపుఆలోచించుచుంటిని. ఆసమయమున మిగులరమ్యంబై పొడవైన బంగారుప్రాకారముచేత చుట్టబడియుండెడు నొకదివ్యమైన ఉద్యానవనము గనబడినది. అంత నేను ఆప్రాకారమును దాటి యనేకములగు నానావిధములైన చెట్లచే నొప్పుచున్న నాయుద్యానవనమును జక్కగజూచితిని అట్లు పారజూడగ నాయశోకవనమధ్యమున నొకగొప్ప శింశుపావృక్షమగుబడెను. అంత నేనాశింశుపావృక్షముమీద నెక్కగూర్చుండి యిటునటుజూచి బంగారుమయమగు నొకయఱటి తోటను జూచితిని. అనంతరమున నాశింశుపావృక్షముమీదనుండియే యాచెట్టునకు సమీపముననే, మిగుల శ్రేష్ఠమైన వర్ణముగలదియును, మంచియౌవనవతియును, తామరఱేకులవంటి నేత్రములుగలదియును, ఉపవాసములుండుటచేత మిగుల వాడినముఖముగలదియును, నిరంతరము విడువక, ఒక్కటే మాసినవస్త్రమును ధరించియున్నదియును, సంస్కారాదులులేక దుమ్ముచేనిండి మాసిన తలవెంట్రుకలుగలదియును, వ్యసనముచేతను సంతాపముచేతను దీనత్వమునుబొందిన అవయవములు గలదియును, నిరంతరము యజమానునికి మేలుగోరుచున్నదియును, మిగుల వికారమైన రూపములు గలవారును భయంకరాకారులును, నిర్దయులును, మాంసమును నెత్తురు నే భోజనముగా గలవారునునగు రాక్షసస్త్రీలచేత బరివేష్టింపబడినదియై పెద్దపులులచేత నావరింపబడిన యాడులేడివలెనున్నదియును, నగుసీతాదేవిని జూచితిని మఱియు మహావ్యసనముతో గూడినదియును, రాక్షసస్త్రీలనడుమనున్నదియును, ఆరాక్షసస్త్రీలచే నిరంతరము బెదిరింపబడుచున్నదియును, తలవెంట్రుకలన్నియు నొక్కటేజడగా పెనుచుకొని పోయిన జడను ధరించియున్నదియును, మిగులదీనత్వమునొంది యున్నదియును, నిరంతరను మగనిని ధ్యానించుటయే వ్రతముగాగలదియును, ఏమియుపఱచుకొనక నేలపైపరుండుటచేత వర్ణముమారి తెల్లబారిన దేహముగలదియై మంచుకాలము (హేమంతఋతువు) నందలి తామరకొలనువలెనున్నదియును, రావణాసురునిపై నెంతమాత్రమును బుద్ధిలేనిదియును, ప్రాణములను విడుచుటకు నిశ్చయించుకొనియున్నదియును, లేడిపిల్ల నేత్రములవంటి నేత్రములు గలదియును, నగుసీతాదేవిని మహాప్రయాసముచేతజూచితిని. అట్లుదుఃఖించుచు నావిధముగ నున్నదియును, మిగుల కీర్తిగలదియును, శ్రీరామునిభార్యయును, నగు నాసీతాదేవిని జక్కగాజూచి నేనాశింశుపావృక్షముమీద నేయుంటిని. అట్టియెడ రావణాసురునియింటియందుండి మొలనూళ్ళయొక్కయు, అందెలయొక్కయుధ్వనితో గూడినదియును, మిగులగంభీరమైనదియును, నగునొకహాలహాలశబ్దము వినబడినది అంత నేనుఆనాదమునువిని మిగుల భయమునుబొంది నాశరీరమును మహాచిన్నదిగజేసికొని యాకాశము నంటియుండెడు నాశింశుపావృక్షముమీదనే పక్షివలె ఆకులసందున దాగియుంటిని అట్లుదాగియుండి చూచుచుండగ మహాబలశాలియగు రావణాసురుడును నతని భార్యలును యంతఃపురముననుండి బైలువెడలి సీతాదేవియున్న చోటికివచ్చిరి అట్లారాక్షసేశ్వరుడును మహాబలశాలియునునగు రావణాసురుడు తనయొద్దకువచ్చుటనుజూచి పరమపతివ్రతయగుసీతాదేవి తొడలునుముడుచుకొని, చేతులుగట్టుకొనుటచేత మిగులబలిసియుండెడు స్తనములను దాచుకొని కదలకగూర్చుండియుండె అప్పుడు మిగులభయమునుబొందియున్నదియును, మహాదిగులుతోనున్న యును, తన్నురక్షించువారెవరైన గనబడుదురా, యని నలుదిక్కులనుజూచుచున్నదియును, ఎంతమాత్రమును రక్షణసహాయము గానకున్నదియును, గడగడవణకుచున్నదియును, తపస్వినియును, మిగులవ్యసనముతో గూడుకొనియున్నదియును, నగునాసీతాదేవికి, రావణాసురుడు సాష్టాంగముగ నమస్కరించి నన్నుగౌరవింపుమని వేడుకొనియిట్లనియె

మదించినదానవగునోసీతా! నీవుమదముచేత, నన్నువరించి గౌరవింపకుందువేని నిన్నుచంపెదను ఇంక రెండునెలలు గడువుయున్నది. ఈరెండునెలలు గడచిన తరువాత గూడ యిట్లనేయుందువేని నిన్నుజంపి నీనెత్తురును ద్రావెదను అనిరావణాసురుడు సీతాదేవితో జెప్పె అంతసీతాదేవి మహాకోపముబొందినదియగుచు మిగులయుక్తంబగు నీమాటనుజెప్పె రాక్షసులలో మిగుల నీచుడవగు నోరావణాసురుడా! మితిలేనిశౌర్యవంతుడగు శ్రీరాముని భార్యయును, ఇక్ష్వాకువంశములో మిగులనధికుండగు దశరథమహారాజు కోడలునునగునన్ను, చెప్పగూడని మహానీచమగు మాటను జెప్పితివి. ఇంకను నీనాలుకేల బడకున్నది? పాపకార్యములనుజేయుటయే శీలముగగల యోరావణాసురుడా! నీవుపరమదుష్టుడవు నీపరాక్రమముగూడ మిగులనల్పము కావుననే మహాపరాక్రమశాలియగు నామగడు నాయొద్దలేకుండునట్లుజూచి దొంగతనముగ నన్నపహరించితివి. నన్నునీవుదెచ్చునపుడు రాముడుచూడడాయె. చూచి

యుండిన నింతదూరము రాబోవునది లేదు. ఓరావణాసురుడా! నీవు రామునకు సమానుడవు గావు సరేగదా? ఆరామునకు దాసుడుగా నుండుటకుగూడ తగవు. రాముడు యజ్ఞయాగములను జేయువాడు నిరంతరము సత్యమునే మాటలాడువాడు. యుద్ధమునందుమిగులప్రీతిగలవాడు అని సీతాదేవి రావణాసురునితో జెప్పె సీతాదేవి జెప్పిన మహాకఠినమగుమాటవిని రావణాసురుడు కోపమునుబొంది కార్చిచ్చునందలి యగ్నిహోత్రమువలె భగ్గున మండిపడె అట్లు రావణాసురుడు మండిపడు కోపమువలన కండ్లెఱ్ఱజేసి గ్రుడ్లురుముచు యెడమచేయిపిడికిలిముడుచుకొని సీతాదేవిని జంపుటకై యాపిడికిలినిపైకెత్తె. అప్పుడచటనుండిన స్త్రీలందఱును హాహాకారములను జేసిరి. అప్పుడు మిగుల దురాత్ముడైన నారావణాసురుని భార్యయగు మండోదరియను పేరుగలది యారాక్షసస్త్రీలనడుమనుండి ముందుకువచ్చి సీతాదేవిని జంపవలదని యారావణాసురుని యడ్డగించె. అట్లువలదనియడ్డగించి మిగులకామపీడితుడగు నారావణాసురునితో మిగులమధురమగు వాక్యములచేనిట్లనియె

దేవేంద్రునిశౌర్యమువంటి శౌర్యముగల యోప్రాణనాథా! రావణాసురుడా! ఈసీతవలన నీకేమి యుపయోగమున్నది? ఓప్రభువా! దేవకన్యకలు, యక్షకన్యకలు, గంధర్వకన్యకలు మొదలగు అనేకమందిస్త్రీలున్నారు వారితో నీయిష్టముచొప్పున క్రీడింపుము. మానవస్త్రీయగు సీతతో నీకేమిప్రయోజనమున్నది. అనిమండోదరి రావణాసురునికి చెప్పె. అంతమిగులబలముగల రాక్షసుడగు రావణాసురుడు మండోదరిమొదలగు రాక్షసస్త్రీలచేత ఊరడింపబడినవాడగుచు నతివేగముగ తనస్వంతయింటికిబోయె. అట్లు రావణాసురుడు తనయింటికిపోగానే వికారములైననానారూపములుగల రాక్షసస్త్రీలు, మహాకఠినములును మిగుల భయమును గలుగజేయునట్టివియును, నగుమాటలచే సీతాదేవిని భయపరచుచుండిరి. సీతాదేవి యారాక్షసస్త్రీలు జెప్పెడిమాటలను లక్ష్యపెట్టక తృణీకరించె. మఱియు నారాక్షసస్త్రీలు ఎంతబెదరించినను ప్రయోజనము గలుగదయ్యె. అంతమాంసమేయాహారముగాగల యారాక్షసస్త్రీలు బెదరించుటమొదలగు తాముజేయు ప్రయత్నములన్నిటివలన బ్రయోజనములేదని తెలిసికొని కొందఱుబోయి సీతాదేవియొక్కయభిప్రాయమును రావణాసురునకు జెప్పిరి అట్లుజెప్పి యారాక్షసస్త్రీలందఱును ఆశయుడిగి సీతాదేవిని వశపరచుకొనుటకొఱకు తాముజేయుచున్న ప్రయత్నములనువిడచి, అందురును నొక్కటిగజేరి యాసీతాదేవిని నలుప్రక్కలజుట్టుకొని పరుండికొంతసేపటికి నిద్రబోయిరి. ఆరాక్షసస్త్రీలందఱు నిద్రబోగానే పెనిమిటియొక్కమేలునే గోరుచున్నదియగు సీతాదేవి మహావ్యసనముచేత దీనురాలై మిగులదుఃఖించుచుండినది అట్టియెడ త్రిజటయను నొకరాక్షసి మేలుకొని యానిద్రించుచుండిన రాక్షసస్త్రీలనడుమగూర్చుండి యిట్లనియె.

ఓరాక్షసస్త్రీలారా! మీరుతీవ్రముగ నన్ను భక్షించండి సీతనుభక్షింపవద్దు జనకమహారాజ కుమార్తెయును, దశరథమహారాజు కోడలును, మహాపతివ్రతయును, నగు సీతాదేవి నెంతమాత్రమును నశింపదు ఓఅక్కలారా! ఇప్పుడు నేనొకకలగంటిని అదిరాక్షసులకందఱికిని నాశమును గలిగించునదిగను యీసీతకు భర్తయగు శ్రీరామునికి జయముగలిగించునదిగను, మహాభయంకరమైనదిగను, విన్నంతనే రోమములు నిక్కబొడుచుకొనునట్లు జేయునదిగనుయున్నది. దుష్టులగు నోరాక్షసస్త్రీలారా! శ్రీరాముడు మనల నందఱిని జంపకుండ కాపాడునట్లు జేయుటకు యీసీతాదేవి శక్తిమంతురాలుగానున్నది. కాబట్టి మనమందఱము యీసీతాదేవిని వేడుకొందము. అట్లుజేయుట మేలైనకార్యమని నాకుతోచుచున్నది ఎవరుగాని మిగుల వ్యసనముతో నుండునపుడు యిటువంటికలవచ్చిన యెడల, ఆస్త్రీసమస్తములైన వ్యసనములనుండి విడువబడినదియైమిగులశ్రేష్ఠమగు సౌఖ్యమును బొందును కావుననిప్పుడే మనమీసీతాదేవికి నమస్కరించి మన్ననవేడుకొందుము మనతప్పలను క్షమించి మనలను గాపాడునని త్రిజట యారాక్షసస్త్రీలతో జెప్పె. అప్పుడు సీతాదేవి తనమగనికి జయముగలుగునని త్రిజటజెప్పినమాటనువిని మహాసంతోషమును బొందినదియును సిగ్గును బొందినదియునునై వారలకిట్లనియె.

ఓరాక్షసస్త్రీలారా! త్రిజటజెప్పినమాట నిజమగునేని మీకందఱికిని అభయంబిచ్చెదనని చెప్పె. అట్టియెడనేను సీతాదేవికిగలిగిన యాభయంకరమగు దురవస్థనుజూచి చింతించి మిగులవ్యసనపడితిని. అప్పుడు నామనస్సు కొంచెముగూడ నెమ్మదినిబొందినదిగాదు. అంత నేను సీతాదేవితో మాటలాడుటకొక యుపాయమును ఆలోచించి, ఇక్ష్వాకువంశమును స్తుతించుటకారంభించితిని. అట్లు నేనుస్తుతించెడు రాజర్షి పూజితమగు మాటలనువిని సీతాదేవిమహావ్యసనముతో గూడుకొన్నదియును, కండ్లనుండి నీళ్లు గార్చుచున్నదియునునై నన్నుజూచియిట్లనియె. ఓవానరోత్తముడా! నీవెవ్వడవు ఎందుకుగానిచ్చటికివచ్చితివి? ఎవ్విధముచేతవచ్చితివి. (అనగా సముద్రమునెట్లుదాటివచ్చితివి.) శ్రీరామునకును సీతకును స్నేహితమెట్లుగలిగినది? ఈసమాచారమునంత

యనునాకు విశదముగ నెఱింగింపుమని సీతాదేవినన్నడిగి నది అంతనేను సీతాదేవియడిగినమాటవిని యిట్లనిబదులు జెప్పితిని. ఓసీతాదేవీ! చెప్పెదనువినుము. నీపెనిమిటియగు శ్రీరామునకు మిగులస్నేహితుడును, మహాభయంకరమగు శౌర్యముగలవాడును, ఎట్టికార్యమునయినను పరాక్రమించిచేయువాడును, మహాబలముగలవాడును, సుగ్రీవుడను పేరుగలవాడును, నగు వానర రాజొకడుగలడు. నేనాసుగ్రీవునకు మంత్రిని ఆంజనేయుడను పేరుగలవాడను ఎట్టి కార్యమునందుగాని వ్యసనమునుబొందనివాడును, నీపెనిమిటియును, నగు రామచంద్రుడు నిన్నువెదకుటకు బంపగా వచ్చినవాడను మిగులగీర్తిమంతురాలవగు నోసీతాదేవీ! పురుషోత్తముడును శ్రీమంతుడును, దశరథమహారాజపుత్రుడును, నగు రాముడు తానుగానే నీకు గురుతుకొఱకు యీయుంగరమును ఆనవాలుగ నిచ్చిపంపినాడు. ఓసీతాదేవీ! దీనిని దీసికొనుమని యిచ్చితిని. ఆయుంగరమునుయిచ్చి నేనిట్లంటిని. ఓదేవీ! నీవేప్రకారము ఉత్తరవుజేసెదవో నేనట్లు జేయుదును. నీవిష్టపడుదువేని నిన్నిప్పుడే రామలక్ష్మణులయొద్ద జేర్చెదను. నీవేమి సెలవిచ్చెదవనియడిగితిని. అంత జనకమహారాజపుత్రికయగు సీతాదేవి నేనుజెప్పినమాటలనువిని కొంతదడవు ఆలోచించి యిట్లనియె. ఓయాంజనేయుడా! శ్రీరాముడు తానే యీరావణాసురునిసంహరించి నన్నుదీసికొనిపోవలయునని చెప్పె. అంత నేను, మిగులపూజ్యురాలును, నిందింపబడని నడవడికగలదియును, నగుసీతాదేవికి శిరస్సాష్టాంగముగ నమస్కరించి యిట్లంటిని ఓదేవీ! శ్రీరామునకు మిగులసంతోషకరమగు నొకయానవాలిమ్మనియడిగితిని. అంతసీతాదేవి నాతోనిట్లనియె. ఓయాంజనేయుడా! నీవీరత్నమును దీసికొనిపొమ్ము. ఈశ్రేష్ఠమగు రత్నమునుజూచి మహాబాహుడగు రాముడునిన్నుమిగుల గౌరవించును. అనిచెప్పి, మిగులవ్యసనముతో గూడుకొనియున్నదియును, శ్రేష్ఠములగు పిఱుదులుగలదియును, నగు సీతాదేవి, పరమాశ్చర్యకరమగు రత్నోత్తమమును నాచేతికిచ్చి మఱికొన్నిమాటలను ఆనవాలుగజెప్పె అంతనేను మిగులత్వరపడి రామునొద్దకువొచ్చుటకు మిగులయిష్టము గలవాడనగుచు రాజపుత్రికయగు నాసీతాదేవికి ప్రదక్షిణపూర్వకముగ నమస్కారమునుజేసితిని. అప్పుడు సీతాదేవి తనమనస్సులోకొంతసేపు ఆలోచించి మఱలనాతోనిట్లనియె. ఓయాంజనేయుడా! నేననుభవించెడుదుఃఖమునాసంకటము, మొదలగుసమస్త వృత్తాంతములను శ్రీరామునకు జక్కగజెప్పుము. మఱియు నాసమాచారమునంతయువిన్నంతనే మిగులశౌర్యవంతులగు రామలక్ష్మణులిద్దరును, సుగ్రీవుడును, నతివేగముగ నిచటికివచ్చునట్లుజేయుట నీభారమైయున్నది వేరువిధమగునేని అనగా నతివేగముగ వారిచటికిరాకుండురేని రెండునెలలవరకే నేను బ్రతికియుందును. అంతవరకేనాకు గడువున్నది ఆవలరాముడు నన్నుచూడజాలడు. నేను అనాధవలెప్రాణములను విడుతును. అనిసీతాదేవి నాతోజెప్పినది నేనావ్యసనకరమగు మాటనువిన్నంతనెనాకు మహా కోపమువచ్చినది అనంతరము నేనుజేయవలసినకార్యమును ఆలోచించి నిశ్చయించితిని అట్లునిశ్చయించి నాదేహమును గొప్పపర్వతమువలెబెంచితిని. అట్లునాదేహమును బెంచి యుద్ధముజేయుటయందుమిగులయిష్టముగలవాడనై యీయశోకవనమునంతయు విఱిచినాశనముజేయనారంభించితిని. అంత నేనావనమునువిఱుచుచుండెడు ధ్వనినివిని, వికారమగు ముఖములుగల యీరాక్షసస్త్రీలు నిదురమేల్కొనిరి అట్లు ఆరాక్షసస్త్రీలుమేల్కొంచి, అందున్నసమస్తములగు చెట్లు విఱువబడియుండుటయును, అందుండిన మృగపక్షిసమూహములు మహాభయముచే గలతనుబొందియుండుటయును జూచిరి ఆవల నారాక్షసస్త్రీలు, అశోకవనమునందున్ననన్నుజూచి యీవానరుడే యీవనమును విఱిచి పాడుజేసినవాడని తెలిసికొని, అందఱును నొక్కటిగజేరి యతి వేగముగ బోయి యీవృత్తాంతమును రావణాసురునకెఱింగింపబోయి యిట్లనిజెప్పిరి. మిగుల బలపరాక్రమవంతుడవును, రాక్షసేశ్వరుడవును, నగు నో రావణాసురుడా! మిగుల దుర్బుద్ధిగలయొకవానరుడువచ్చి నీశౌర్యమును దెలిసికొనలేక నెవ్వరికిని ప్రవేశింపనలవిగాని యశోకవనమునందు బ్రవేశించి అందలిచెట్లన్నియును విఱిచిపాడుజేసె. రాజోత్తముడవగునో రావణాసురుడా! మహా దుష్టస్వభావముగలవాడును నీకు చెడుగగు కార్యమునుజేసినవాడును, నగు నీవానరుని యేవిధముగానయినననతిశీఘ్రముగ జంపుటకాజ్ఞాపింపవలయును అనిరాక్షసస్త్రీలు రావణాసురునితోజెప్పిరి అంతరాక్షసరాజగు రావణాసురుడు ఆమాటనువిని మిగులకోపమును బొంది, అజేయులును రావణాసురుని యిష్టప్రకారముగ నడుచువారును, నగు నేబదివేల కింకరులను నాపైకిపంపెను. అప్పుడాకింకరులు శూలములను, యినుపగుదియలను, ధరించి నాపైకి యుద్ధమునకువచ్చిరి నేనుయేబదివేలకింకరులను ఆయశోకవనద్వారమునందున్న యినుపగుదియతో చంపితిని. అంతనాకింకరులలో చావునకు దప్పించుకొని పారిపోయిన రాక్షసులు అతివేగముగబోయి యాపెద్దసేనయంతయు నాచేజంపబడెనని రావణాసురునకుజెప్పిరి. ఇట్లుండగ నామనస్సులో నొకతలంపుగలిగి పట్టణమునడుమ

నుండెడు చైత్యప్రాసాదముమీదికి దుమికి దానినాక్రమించితిని ఆరీతిగ దానినాక్రమించి యందొక స్తంభమును బెరికికొని దానియందున్న నూర్గురు రాక్షసులనుజంపి, ఆపట్టణమునకంతయును లంకారముగనున్న యాచైత్యప్రాసాదమునుగూడ విరగగొట్టి పాడుజేసితిని. అట్టియెడ నా రావణాసురుడు ప్రహస్తుని కొడుకగు జంబుమాలిని వానితోగూడ మిగులభయంకరాకారులగు ననేక రాక్షస సమూహములను నాపైకి యుద్ధమునకుబంపె. అప్పుడు మిగులబలపరాక్రమములతో గూడనవాడును, యుద్ధమునందుమిగులనిపుణతగలవాడుననగు నాజంబుమాలిని, అతనితోగూడ వచ్చిన యాగొప్పసేనను, బహిర్ద్వారముననున్న మిగులభయంకరమయిన నాయినుపగుదియతోనే చంపితిని అంత రాక్షసేశ్వరుడగు రావణాసురుడు ఆసమాచారమునువిని, మహాబలసంపన్నులును, కాల్బలములతోను సేనలతోనుగూడుకొన్నవారును, నగు మంత్రికుమారులను యుద్ధమునకు బంపె. అంత నేనువారినిగూడ నాయినుపగదియతోనేజంపి యమలోకమునకు బంపితిని అప్పుడు రావణాసురుడు, మహాశౌర్యవంతులగు మంత్రిపుత్రులునాచేత జంపబడిరనివిని మిగులకోపమునొంది, యుద్ధమునందసహాయశూరులగుసేనానాయకులనైదుగురుని వారిసేనలతోగూడ నాపైకిబంపె మిగులపరాక్రమశాలులగు నాసేనానాయకులను వారి సేనలతోగూడ చంపి యమలోకమునకుబంపితిని. ఆసమాచారమును పదితలలుగల రావణాసురుడువిని మహాబలపరాక్రమశాలియును, తనకుమారుడుననగు అక్షకుమారుడనువానిననేక సేనలతోగూడ నాపైకిబంపె. అప్పుడుమండోదరిపుత్రుడును, పసివాడును, యుద్ధమునందు మహాసామర్థ్యముగలవాడును, నగు నాఅక్షకుమారుడు యుద్ధము జేయుచునే తటాలునగగనమార్గమునకెగిరె నేనును మీదికెగరుచున్న నయ్యక్షుని కాళ్లు రెండును గట్టిగబట్టుకొని వానితోడ మీదికెగిరితిని అట్లువానితోడ మీదికెగిరి, డాలును కత్తియునుధరించియుండెడు నాయక్షుని నూరుమారులు గిరగిరంద్రిప్పి నేలపైగొట్టి యుద్ధముజేసితిని పిమ్మట అక్షకుమారుడు యుద్ధమునందు నాచేజంపబడెనని రావణాసురుడువిని మహాకోపమునొంది, యుద్ధమునందు జయించుటకితరులకలవిగానివాడును, మిగుల బలపరాక్రమశాలియును తనకుమారుడును, నగు నింద్రజిత్తును సేనలతోగూడ నాపైకియుద్ధమునకుబంపె. అప్పుడు నేనాయింద్రజిత్తుతోగూడ వచ్చిన సైన్యమునంతయునుజంపి. రాక్షసోత్తముడగు నాయింద్రజిత్తును యుద్ధమునందు గర్వమడంచి, వానికినామెడల పరమసంతోషమును గలుగజేసితిని. అయినను మహాబాహుడును, బలపరాక్రమశాలియును, నగు నింద్రజిత్తును రావణాసురుడు నా పైకిబంపునపుడెవ్విధముచేతనయినను నన్నుజంపి రావలయునని యాజ్ఞాపించి మిగులనమ్మకముతో, మహాబలులగు రాక్షసులతోగూడబంపె. కావున నాయింద్రజిత్తుతనబలముతగ్గుటయును, నన్నుజయించుట దుస్తరముగనుండుటయును, దెలిసికొని బ్రహ్మాస్త్రమును బ్రయోగించినన్నుబంధించె పిమ్మట అతనితోగూడనున్న రాక్షసులునన్ను త్రాళ్లతోగట్టిరి అట్లుగట్టినన్నుదీసికొనిపోయి రావణాసురునియెదటనుంచిరి మహాదుష్టుడగు నా రావణాసురుడునన్నుజూచి నాతోనిట్లనియె ఓవానరుడా! నీవెవ్వడవు? ఈలంకకేలవచ్చితివి? రాక్షసులందఱినినేలజంపితివి? అనినన్నడిగె. అంత నేనీకార్యమంతయుసీతాదేవికిగానేజేసితినని చెప్పితిని మఱియునిట్లంటి. రాక్షసేశ్వరుడవగునోరావణాసురుడా! నేనీసీతాదేవిని జూచుటకయ్యె నీపట్టణమగునీ లంకానగరమునకువచ్చితిని, నేనువాయుదేవునికుమారుడనగువానరుడను ఆంజనేయుడను పేరుగలవాడను సుగ్రీవుని మంత్రిని. శ్రీరామునికిదూతనై యిచటికివచ్చితిని. ఆరాముడుకొన్నిసంగతులను జెప్పిపంపగ వాటిని నీకెఱింగించుటకు నీయొద్దకువచ్చితిని ఓరావణాసురుడా! మహాపరాక్రమశాలియగుసుగ్రీవుడు నీక్షేమమునడుగమన్నాడు ఇదియుగాక, ధర్మార్థకామములతోగూడినదియును, నీకుమేలుగలిగించునదియును, మిగులసత్యమైనదియును, నగునొకమాటను నీతోజెప్పమనిచెప్పె ఆమాటజెప్పెదనువినుము విస్తారముగ చెట్లచే నావరింపబడియుండు ఋశ్యమూకమను పర్వతమునందు నేనునివసించియుంటిని అచటికి యుద్ధవీరుడగుశ్రీరాముడువచ్చెను. ఆరామునకును నాకును స్నేహితమైనది. అప్పుడా రాముడు నాతోనిట్లనిజెప్పెను. ఓసుగ్రీవుడా! నా భార్యదురాత్ముండగు నొకరాక్షసునిచే నపహరింపఁబడినది ఈకార్యమునందునీవలననైనమట్టుకు సమస్తవిధములగుప్రయత్నములచేత నాకుసహాయముజేయవలయును నా భార్యను నేమఱలబొందుటకుతగుమైన ప్రయత్నములుజేయవలయునని రాజశ్రేష్ఠుఁడగుశ్రీరాముఁడునన్నడిగె అంత నేనును, వాలికిని నాకునుగలవిరోధమును ఆరామునకుజెప్పి, ఆవాలినిజంపుటకొఱకునాకుతగుమైనసహాయమును జేయవలయును. ఇందునకునీవుసమ్మతించి ప్రతిజ్ఞ జేయుము. నేనునునీవిషయమునందు ప్రతిజ్ఞజేసెదనని చెప్పితిని. అప్పుడుమేమిఱువురమును ప్రతిజ్ఞజేసికొంటిమి. అంత రాజాధిరాజగు నా రాముఁడులక్ష్మణునితో గూడుకొన్నవాఁడగుచు, వాలిచే రాజ్యపదభ్రష్టుఁడనగు నాతోనగ్నిసాక్షికముగా స్నేహముజేసె. అట్లుస్నేహముజేసి కిష్కింధకుబోయి

రాముండొక్క బాణముచేతనే వాలినిజంపి, సమస్తముల
గు వానరభల్లూక సమూహములకు నన్నురాజుగా జేసె
ను కావుననీవిషయమునందు సమస్తప్రయత్నములచేతనా
రామునకు సహాయముజేయవలయును అందుచేతనేనేను
రాజధర్మమును అనుసరించి యీదూతను ముందుగా నీ
యొద్దకు బంపితినని చెప్పుము మఱియు ఓరావణాసురుడా!
మహాశౌర్యవంతులగు వానరులు నీలంకయందు బ్రవేశించి
నీసైన్యమునంతయును జంపకమునుపే యతిత్వరితముగ సీ
తాదేవిని దెచ్చి శ్రీరామునకు నియ్యుము. మన్ననపేడికొను
ము దేవతలొకప్పుడు వానరులను సహాయ మడుగగాపో
యి సకలమునుజయించి వచ్చిన వానరోత్తముల ప్రభావ
మెవ్వరికి దెలియకున్నది? ఎల్లవారికిని దెలియును అనియిట్లు
వానరరాజగు సుగ్రీవుడు నీతో జెప్పమని నాతో జెప్పపంపె
ను. అనినేనారావణాసురునకు జెప్పితిని అంతరావణాసు
రుడు మహాకోపమునుబొంది భగ్గునమండిపడి నేత్రముల
నుండి నిప్పులనుగ్రక్కుచు నన్నుకాల్చువానివలె చురుకుచూ
పులంజూచె అట్లునన్నుచురచురంజూచి, మహాభయంకర
ముగు కార్యములుగలవాడును, మిగులదురాత్ముడును, నగు
నారావణాసురుడు నాసామర్థ్యమునెఱుగక నన్ను చంప
మని యుత్తరవుజేసె. ఆమాటనువిని యతనితమ్ముడును,మి
గుల శ్రేష్ఠమగు బుద్ధిగలవాడును, నగు విభీషణుండనువాడు
నానిమిత్తముగ రాక్షసేశ్వరుడగు నారావణాసురుని యి
ట్లనివేడుకొనెను రాక్షసోత్తముడవగు నోఅన్నా! రావ
ణాసురుడా! ఇట్లుదూతను జంపవలయునని నీవు నిశ్చయిం
చిన నిశ్చయమును విడిచిపెట్టుము దూతను జంపుటను గు
రించి రాజధర్మశాస్త్రమునం దెంతమాత్రమును జెప్పబడి
యుండలేదు. ఇదిధర్మశాస్త్రవిరుద్ధమగు కార్యము. ఇట్టికా
ర్యమును నీవుచేయనెత్నింపనేరాదు ఏలననగా దూతతన
రాజెఱింగింపుమన్నకార్యమును యథార్థముగ తెలుపుట
న్యాయము. అట్లు ప్రభువుచెప్పినది చెప్పినట్లు జెప్పువాడు
మిగులశ్రేష్ఠుడు. అతడుమేలుజేయువాడు కావున నట్టివా
నినిజంపరాదు. ఈడులేని పరాక్రమముగల యోరావణా
సురుడా! దూతయగువాడు చేయగూడని మహాగొప్పతప్పు
జేసినను గూడ వానిని విరూపినిగ జేయవచ్చునని శెప్పియు
న్నదిగాని, చంపుటనుగురించి యేశాస్త్రములయందునుజె
ప్పబడలేదు. అనివిభీషణుడు రావణాసురునితో జెప్పి యత
నిని వేడుకొనెను. అంతరాక్షసేశ్వరుడగు రావణాసురు
డచ్చటనున్న రాక్షసులనుజూచి యిట్లనియె

ఓరాక్షసులారా! మీరలీవానరునితోకను గాల్చివేయుం
డని ఉత్తరవుజేసె. అంతనారాక్షసులు ఆరావణాసురుని
మాటనువిని ప్రాతగుడ్డపేలికలను, జనపనారతో నేయబ
డిన గోనెలు మొదలగువాటినిదెచ్చి నాతోకకు దిట్టముగ
జుట్టిరి. అట్లుజుట్టి మిగులభయంకరమగు పరాక్రమముగల
నారాక్షసులు సర్వమును సిద్ధపరచుకొని, కొందఱు నన్ను
త్రాళ్ళతోగట్టి తీసికొనిపోవుచు మఱికొందఱు కఱ్ఱలతో
గొట్టుచు, ఇంకకొందఱు పిడికిళ్లలో మొట్టుచు నాతోకను
నూనెలోదడిపి నిప్పుదెచ్చి ముట్టించిరి అట్లునాతోకగాల్చి,
పరాక్రమశాలులగు నారాక్షసులు నన్ను నానావిధముల
శ్రమ పెట్టుచు పట్టుకొనిపోయి, పురద్వారమునందును,రా
జవీధులయందును, నన్ను త్రాళ్ళతో గట్టియుండుటయును
నాతోకగాల్చుటయును మొదలగు విషయములను, చాటిం
చిరి. అప్పుడు నేను నాదేహమును మిగులచిన్నదిగ జేసికొ
ని యాకట్లనన్నిటిని విడిపించుకొని, మఱలనాదేహమును బెం
చుకొని, యచటనున్న యినుపగుదియను దీసికొని యారా
క్షసులనందరినిజంపితిని అట్లారాక్షసులనందఱినిజంపి యతి
వేగముగ నాపట్టణముయొక్క బహిర్ద్వారముమీది కెగిరి దు
మికితిని. అంత "ప్రళయకాలాగ్నిహోత్రుడు ప్రజలనునశిం
పజేయునట్లు" నేనాపట్టణముయొక్క బహిర్ద్వారమును,
కోటబురుజులను రాజవీధులను భ్రమలేనివాడనగుచు నా
తోకయొక్కనిప్పుతో గాల్చితిని. అట్లులంకానగరమును స
ర్వమును గాల్చి యిట్లని దుఃఖించితిని అయ్యో! సీతాదేవి
నాశనమొందియుండును. లంకయందు కొంచెము స్థలమై
నను కాల్పబడకుండయుండలేదే? పట్టణమంతయు బూడ్దె
దైపోయినదే? సీతాదేవి యెట్లుతప్పించుకొనియుండును.
నేనులంకనుగాల్చునపుడు సీతాదేవినిగూడ గాల్చేయుండు
ను. ఇందుకెంతమాత్రమును సంశయములేదు అయ్యో!
రామునియొక్క యీగొప్పకార్యము నంతయును పాడుజే
సితిని. అనియిట్లు నేను మహాదుఃఖమునొంది చింతించుచుం
టిని. అట్టియెడ ఆకాశమునందు చారణులు "సీతాదేవిద
హింపబడలేదు" అనిచెప్పుకొనుచుండిన మంగళకరంబైనది
యును, ఆశ్చర్యకరంబైనదియును, నగుమాటను వింటిని.
అట్లు మిగులనాశ్చర్యకరమగు మాటవిన్నపుడప సీతాదేవి
దహింపబడలేదని నాకు నమ్మకము గలిగినది మఱియు నీ
రీతిగనే ననేకములగు శుభసూచకములుగూడ సీతాదేవి
క్షేమముగనున్నదని తెలిపినవి. అదియునుగాక నాతోక
మండుచున్నను, నాకెంతమాత్రమును తొందరలేకుండినది
నామనస్సుగూడ యెంతమాత్రమును కించలేక మహాసం
తోషముగనుండినది. వాయువుగూడ మిగులసువాసనగలిగి
వీచుచుండినది. ఇంతకుపూర్వము అనేకమారులు సఫలము
లయిన శుభశకునములుగూడ గలిగినవి. మిగుల శ్రేష్ఠము

లగు ఋషివాక్యములు వినబడినవి. ఈసమస్త కారణములచే నామనస్సుమిగుల సంతసించినది. అంత నేను మహాసంతోషమునుబొందితిని. అంత నేను నాతోకనుసముద్రమునందు చల్లార్చుకొని మఱలసీతాదేవియొద్దకుబోయి సీతాదేవినిజూచి అనుజ్ఞవడసి యచటనుండి బైలుదేరితిని. అట్లు బైలువెడలి మిమ్ముల జూచుటయందు మిగుల యిష్టముగలవాడనై యాలంకానగరమునందుండెడు నరిష్టపర్వతమును జేరితిని. అందుండిమఱలవచ్చుటకై మీది కెగిరి, వాయువునకును, చంద్రునకును, సూర్యునకును, సిద్ధులకును, గంధర్వులకును, సంచరించెడు మార్గమగు నాకాశమార్గముచే నిచటకివచ్చిచేరి మిమ్ములనుజూచితిని. శ్రీరాముని మహిమవలనను, మీయనుగ్రహమువలనను, సుగ్రీవుని కార్యమునంతయును యథావిధిగ జేసితిని. మఱియు నిప్పుడు మీతోజెప్పిన కార్యమునంతయు నచట యథావిధిగ నెరవేర్చితిని. ఇంక జేయవలసిన కార్యమును జేయుటకు మీరుయత్నింపవలయునని ప్రార్థించెదను

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేబదియెనిమిదవ సర్గ ముగిసెను.

ఆంజనేయుడుజాంబవంతుడుమొదలగు వారితో జరుగవలసినకార్యమునుగుఱించి యాలోచించుట.

అనియిట్లు వాయుపుత్రుడగు నాంజనేయుడు సీతాదేవియొద్ద జరిగిన వృత్తాంతమంతయును జెప్పి, పిమ్మట జరుగవలసినకార్యమును గుఱించి చెప్పుటకారంభించె. ఓవానరులారా! సీతాదేవి మహాపాతివ్రత్యమును నవలంబించియున్నది. ఆసీతాదేవియొక్క పాతివ్రత్య మహిమచేత శ్రీరామునియొక్క ప్రయత్నమును, సుగ్రీవునియొక్క యుత్సాహమును ప్రయోజనముతోగూడినవగును. నామనస్సుసీతాదేవియందు మిగుల భక్తిగలిగియున్నది. అది యట్లుండనిమ్ము. రావణాసురుడు తనతపఃప్రభావముచేత సమస్తలోకములనుగాల్చుటకు సమర్థుడు. మఱియు నతడు కోపమునుబొందెనేని సమస్తలోకములను గాల్చుటకు శక్తిమంతుడు. సమస్త విధములచేతను నారావణాసురుడధికుడు. వానరులారా! మహాపతివ్రతయగు సీతాదేవిని తాకియును, నతనితపఃప్రభావముచేత నే నాశమును బొందకున్నాడు. మహాపతివ్రతయును, జనకమహారాజ పుత్రికయును నగుసీతాదేవి, తాకబడికోపమునొందింపబడినది యగునేని, యాసీతాదేవియొక్క కోపముగాల్చునట్లు నిప్పుగూడ కాల్పంజాలదు. అట్లుండియును రావణాసురుని దహింపకుండుటకు కారణమేమనగా వానిని తనపెనిమిటియగు రామునిచే జంపింపవలయునని యిష్టపడియున్నది ఈసమస్తవిషయములును మీకెఱింగించితిని. ఇంక జేయవలసిన కార్యమునందు జాంబవంతుడు మొదలగు గొప్పవానరులయొక్క యుత్తరువునుబొంది మఱల సీతాదేవి యొద్దకుబోయి సీతాదేవిని వెంటబెట్టుకొని రాజపుత్రులగు నారామలక్ష్మణులయొద్దకుబోతిమేని బాగుగానుండునని నాకు దోచుచున్నది ఇదియునుగాక నేనొక్కడను లంకానగరమున నుండెడు సమస్తరాక్షసులను, మహాబలపరాక్రమ శాలియగు రావణాసురునిగూడ నొకనిమిషమాత్రములో జంపుటకుశక్తిమంతుడనగుదును. అట్లుండగా నింకమహాబలపరాక్రమశాలులును, మిగులబుద్ధిమంతులును, అస్త్రవిద్యలను జక్కగనభ్యసించినవారును, రణవీరులును, శత్రువుల జయించుటయందు మహాయిష్టముగలవారును, నగు మీతోగూడపోయి రాక్షసులను, రావణాసురుని, జంపగలనని చెప్పనేల? మఱియు నేనొక్కడనే యుద్ధమునందు సమస్త సేనలతోడను, కుమారులతోడను, అన్నదమ్ములతోడను, మంత్రులు మొదలగు ననుచరులతోడనునుండు రావణాసురుని చంపగలను. మఱియు నింద్రజిత్తు యుద్ధమునందు చూచుటకలవిగాని బ్రహ్మదేవతాకమైన బ్రహ్మాస్త్రమునుగాని, ఐంద్రాస్త్రమునుగాని, రౌద్రాస్త్రమునుగాని, వాయవ్యాస్త్రమునుగాని, వరుణదేవతాకమైన వారుణాస్త్రమునుగాని, ప్రయోగించెనేని వాటినన్నిటిని నిరర్థకములుగజేసి, రాక్షసులనందరిని సంహరింపగలను. అంతేగాక మీరు వుత్తరవుజేయుదురేని పరాక్రమించి యాయింద్రజిత్తునుగూడ జయింపగలను. నేను యుద్ధమునందు గొప్పరాళ్లవానను గురిపించి దేవతులనైనను జంపగలను. ఇంక రాక్షసులను జంపుదునని చెప్పనేల? అందఱిని సంహరింపగలను మఱియును సముద్రంబాకవేళ చెలియలి కట్టదాటినను దాటును, మందరపర్వతము కదలినను కదులును. జాంబవంతుడు శత్రుసేనల కెంతమాత్రమును భయపడి వెన్నుజూపడు. విరోధిసైన్యములను లక్ష్యపెట్టక చంపును. మఱియు సమస్త రాక్షససమూహములను, వారిసేనాధిపతులను చంపుటకు మహాపరాక్రమశాలియును, వాలిపుత్రుడును, నగు అంగదుండొక్కడు చాలును. మఱియు మిగులబలవంతులగు పనసునియొక్కయు, నీలునియొక్కయు, తొడలవేగమునకు మందర పర్వతముగూడ కదులును. అట్లుండ రాక్షసులు నాశనమొందుదురని చెప్పనేల? మఱియు దేవతలయందుగాని, అసురులయందుగాని, యక్షులయందుగాని, రాక్షసులయందుగాని, గంధర్వులయందుగాని, ఉరగులయందుగాని, పక్షులయందుగాని, మైందద్వివిదుల యెదుట నిలిచి పోరువీ

రుడెవ్వడున్నాడు? వానరోత్తములగునీమైందద్వివిదులుఅశ్వినీదేవతలకు బుట్టినవారు. మిగులపూజ్యమైనస్వభావముగలవారు. యుద్ధమునందువీరికెదుటనిలిచిపోరుశూరులెవ్వరును లేరు. వీరుబ్రహ్మదేవునివలనవరమునుబొందిమిగులగర్వించియున్నారు. అమృతమునుపానముజేసియున్నారు. వీరువానరశ్రేష్ఠులందఱిలోపలనుత్తములు. మున్నొకప్పుడుయీయశ్వినీదేవతలుబ్రహ్మదేవునినారాధింపగానాబ్రహ్మదేవుడుమిగుల సంతుష్టినిబొందినవాడై యశ్వినీదేవతలకు పుత్రులగునీమైందద్వివిదులకు ఎవరివలనచావులేకుండునట్లు వరమును యిచ్చియున్నాడు. మఱియునీమైందద్వివిదులు బ్రహ్మదేవునివరాతిశయంబువలన గర్వించిదేవతలయొక్క గొప్పసేనలనుమర్దించి దేవతలతోగూడ నమృతమునుత్రాగియున్నారు. వానరులందురును ఆవశ్యకములేదు. ఈ మైందద్వివిదులిద్దరు మాత్రమే మిగులకోపమునుబొందినవారగుదురేని లంకానగరమునందుండెడు ఏనుగులు గుఱ్ఱములురథములతోగూడ సమస్తరాక్షససేనలను చెండాడినాశముజేయుటకు శక్తిమంతులగుదురు లంకానగరమును యిదివరకే నేనునాశమునుజేసి, బలగర్వితులగు రాక్షసులనుజంపి, పట్టణంబంతయుకాల్చి బూడ్దిజేసి, నాపేరునుబ్రచురపరచితిని. మఱియుమహాబలశాలియగు రాముడు అందరికన్నను అధికుడుగనున్నాడు. మిగులబలవంతుడగులక్ష్మణుడు సర్వోత్కృష్టుడుగనున్నాడు. వానరరాజగుసుగ్రీవుడు శ్రీరామునిచేబాలింపబడినవాడగుచు నందరికన్ననధికుడు. నేనుకోసలదేశాధీశుడగు శ్రీరామునిదాసుడను. వాయుదేవునికుమారుడను. ఆంజనేయుడనుపేరుగలవాడను. అనియీప్రకారముగ నాలంకాపట్టణమునందంతటను చాటించితిని. మహాపతివ్రతయగు సీతాదేవి మిగులదురాత్ముడగు రావణాసురునియశోకవనముయొక్కనడుమ శింశుపావృక్షముక్రింద గూర్చుండి, రాక్షసస్త్రీలచేత బరివేష్టింపబడినదియును, మహావ్యసనముచేతను, సంతాపముచేతను, కృశించుచున్నదియును, నైమేఘములయొక్క సమూహములచే నావరింపబడికాంతిహీనమయిన చంద్రరేఖవలెనున్నది. మఱియుబలముచేత గర్వించియుండెడు రావణాసురునిపైనెంతమాత్రమును మనస్సుంచక నిరంతరమును రామునే ధ్యానించుచు చూచువారలకు అమితవ్యసనమును గలుగజేయునట్లు దీనయైయున్నది. అదియునుగాక మహాపతివ్రతయును, మందరముల స్థిరుదులుగలదియును, నగుసీతాదేవి రావణాసురునిచే నిర్బంధింపబడినదియైయున్నను, మంగళ స్వరూపురాలగు సీతాదేవి రామునియందే యనురాగముగలదియై తనపూర్ణహృదయముతో నిరంతరము రామునేధ్యానింపుచు "నహుషుండెంతనిర్బంధించినను శచీదేవియతనిపై మనంబుంచక దేవేంద్రునియందేగట్టబడిన హృదయముగలదియైయున్నట్లు" సీతాదేవి మిగులదృఢముగలిగి దుఃఖించుచున్నది. మఱియుసీతాదేవి తానిచటనుండి పోవునప్పుడుధరించియున్నవస్త్రమును మఱలవిడువకదానినే గట్టుకొని యున్నదియును, దుమ్ముచేతనిండిదేహమంతయును మాసియున్నదియును, వ్యసనముచేతను సంతాపముచేతను దైన్యమునొందిడస్సిన యవయవములుగలదియును, తన పెనిమిటియొక్క క్షేమమునేగోరుచున్నదియును, నైయున్నది ఓవానరులారా! అశోకవనముయొక్క నడుమ మహాభయంకరులగురాక్షసస్త్రీలచేత బరివేష్టింపబడినదియును, వారిచేతపలుమారుబెదరింపబడుచున్నదియును, ఒకజడను ధరించియున్నదియును, నిరంతరము పెనిమిటినిధ్యానించుటయే ముఖ్యమైనవ్రతముగాగలదియును, నిరంతరము నేమియుపరుపులేనకనేలపైబరుండుటచేతవర్ణముమారినదియై హేమంతఋతువునందు తామరకొలనునున్నట్లున్నదియును, రావణాసురునిపైనెంతమాత్రము మనస్సులేనిదియును, చావడమునకు సిద్ధపడియున్నదియును, నగునాసీతాదేవినిజూచివచ్చితినిగదా? ఓవానరులారా! అట్లుసీతాదేవినిజూచి మహాప్రయాసముచేత నేనురాముడుబంపగా వచ్చినదూతనని, లేడిపిల్లకండ్లవంటి కండ్లుగలయా సీతాదేవికెఱింగించి నాయందు నమ్మకముగలుగునట్లుజేసితిని ఆసీతాదేవితో మాట్లాడిసమస్తవృత్తాంతమునుదెలిపితిని. అంతరామునకును సుగ్రీవునకును స్నేహముగలుగుటనువిని సీతాదేవిమహాసంతోషమును బొందినది. ఓవానరులారా! సీతాదేవికి సదాచారసంపత్తియునునిరంతరము పెనిమిటియందలిభక్తియును ముఖ్యముగనున్నవి. అట్లుండియు మిగుల నపరాధముగావించిన రావణాసురునిగూడ చంపకున్నది, కావున నారావణాసురుడుమిగుల మహిమగలవాడు. రావణాసుడుమహిమగలవాడయ్యును సీతాదేవిని నిరోధించియుండుటచే నాతనిమహిమంతయునశించినది. ఇంకనతనిజంపుటయందు రాముడునిమిత్తమాత్రముగనున్నాడు. స్వభావముచేతనే మిగులకృశించిన శరీరముగల సీతాదేవి రాముని యెడబాయుటవలనగలిగినవ్యసనముచేత మిక్కిలియుడిగినదగుచు "పాడ్యమినాడుజదువువానివిద్య క్షీణించునట్లు" మిగులకృశించుచున్నది. మహాభాగయగుసీతాదేవి నిరంతరమగు వ్యసనముచేత మిగుల కృశించియున్నది. ఓవానరులారా! ఈవిషయమునందు మీరేమిజేయవలయునో దానినియోచింపవలయును. అనియాంజనేయుడు వానరులతోజెప్పె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి యేబదితొమ్మిదవ

సర్గముగిసెను.

—(*)—

వానరులుమాత్రము లంకకుబోయి సీతాదేవిని దీసికొనివత్తుమని ఆలోచించుట.

అంతనామాటనువిని వాలిపుత్రుడగు అంగదుడిట్లనియె. ఓవానరులారా! మనమిప్పుడు సీతాదేవినిజూచినాము కావున నాసీతాదేవిని వెంటబెట్టుకొనిపోకయే శ్రీరామునొద్దకుబోవుటయెంతమాత్రమును యుక్తముగాదు. మఱియు నెప్పుడు మహాపరాక్రమశాలులగు మీరు రామునిదగ్గరకుబోయి "మేముసీతాదేవినిజూచివచ్చితిమిగాని వెంటబెట్టుకొని రాలేదు" అనిచెప్పుటయుచితముగ నాబుద్ధికితోచలేదు. ఓ వానరోత్తములారా! దేవదానవులతోగూడిన మూడులోకములయందును వెదకిచూచినను పరాక్రమమునందును మెగురుటయందును (అనగా నెగిరి యాకాశమార్గమునబోవుటయందు) మనకుసమానులెవ్వరును లేరు అదియునుగాక ఆంజనేయుడు రాక్షసులలో మిగులనధికులుగ నున్నవారినందఱినిజంపియున్నాడు. ఇంకమనమచట జేయవలసిన దేమియును లేదు. సీతాదేవినిదీసికొనిపోయి రామునకువప్పగించెదము అనియంగదుడు జెప్పె. అప్పుడు కార్యాకార్యములనెఱిగినవాడును, వానరులలో నుత్తముడును, నగుజాంబవంతుడు అంగదుడు జెప్పినమాటనువిని పరమసంతోషమును బొంది విశేషమగు నర్థముతోగూడినయొక మాటను జెప్పె. రాజపుత్రుడవగు నోయంగదుడా! నీవాలోచించినది మాకును బహుచక్కగానున్నట్లుదోచుచున్నది. మనముమిగుల శక్తిమంతులుగనున్నను మనకురాముండెట్లు ఉత్తరవుజేసెనో ఆప్రకారముగ జేయుటయుక్తమని తోచుచున్నది. అని జాంబవంతుడంగదునితో జెప్పె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదియవ సర్గముగిసెను

*

అంగదుడు మొదలగువారు మధువనమునందు ప్రవేశించుట

అంత అంగదుడు మొదలగు వానరవీరులందరును, నరశ్రేష్ఠుడగు నాంజనేయుడును, జాంబవంతుడు జెప్పిన మాటకు సమ్మతించిరి అంతమిగుల సంతోషముగలవారును, మేరుపర్వతముతోను మందరపర్వతముతోను సమానమైనదేహములుగలవారును, మదించిన యేనుగువలెనున్నవారును, ఆకాశమునంతయు నావరించుచున్నవారును, గొప్పశరీరములుగలవారును, మిగుల బలముగలవారును, నగు వానరులందఱును, సమస్తభూతములచేత పూజింపబడుచున్నాడును, మహాధైర్యముగలవాడును, మిగులబలముగలవాడును, అధికమైన వేగముగలవాడును, నగునాంజనేయుని, సంతోషాతిశయముచేత కన్నార్పకచూచుచు, రామునికార్యమునుసాధించి మిగులకీర్తిబొందుటకు నిశ్చయించియున్నవారును కార్యసిద్ధులైయున్నవారును, సీతాదేవినికనుగొనినయుత్సాహముచేత మిగులసంతోషమగు నీవార్తను రామునకెఱింగింపబోవుచున్నవారును, యుద్ధముజేయుటయందు మిగులయిష్టముగలవారును, శ్రీరామునకు ఉపకారముజేయుటయందు నిశ్చయించినమనస్సుగలవారును, మంచిమనస్సుగలవారును, వాయుదేవునికుమారుడగు నాంజనేయునిముందిడికొన్నవారును, నగువానరోత్తములందఱును ఏకకాలమున నామహేంద్రపర్వతమును విడిచి యాకాశమార్గంబునకెగిరిరి అంత నావానరులాకాశమార్గంబునబోవుచు, నందనవనముతో సమానమైనదియును, చెట్లతోనుతీగెలతోనునిండినదియును, నగు నామధువనముదగ్గరకుబోయిరి. ఇట్లుబోయి, సుగ్రీవునిచేత జక్కగా గాపాడబడినదియును, సమస్తప్రాణులకును కండ్లెత్తిచూడ శక్యముగానిదియును, సమస్తభూతములకు సంతోషమును గలుగజేయునదియును, మహాపరాక్రమశాలియును, వానరోత్తముడును, నగుసుగ్రీవునిమేనమామయును మహాపరాక్రమశాలియును, నగు దధిముఖునిచేత జక్కగ కాపాడబడినదియును, మఱియువానరరాజగు సుగ్రీవుని మనస్సునకత్యంతసంతోషమునుగలుగజేయునదియును, నగు నామధువనమును వానరులుజూచి మహాసంతోషమునుబొందిరి. అట్లుమధువనమునుజూచి మహాసంతోషమునొంది, తేనెవలె పింగళవర్ణముగల యావానరులు మాకు తేనియలు గావలయునని యువరాజైన యంగదునిప్రార్థించిరి. అంత అంగదుడు పెద్దలగుజాంబవంతుడు మొదలగువానరలతో నాలోచించి వారి సమ్మతిచే వానరులందఱికిని తేనెలుద్రావుటకాజ్ఞయొసగె. సీతను కనుగొనినందునమహాసంతోషమునుబొందియుండెడువానరులందఱును అంగదునిచే తేనెద్రావుటకు నుత్తరవుబొంది పరమసంతోషమును బొందినవారగుచు, మఱియుదృప్తిగద్రావుటకు ప్రేరేపింపబడినవారగుచు సంతోషాతిశయముచే నానావిధములుగ చేష్టలుజేయుచు గంతులువేయుటకారంభించిరి. కొందఱుపాడుచుండిరి కొందఱుతలక్రిందుగ గంతులువేయుచుండిరి. కొందఱునృత్యముజేయుచుండిరి. కొందఱు గట్టిగవికవికలుగనవ్వుచుండిరి. కొందఱు యెగిరిక్రిందబడుచుండిరి. కొందఱుమత్తెక్కినవారివలెతిరుగుచుండిరి. కొందఱుయెగురుచుండిరి. కొందఱుగట్టిగనఱచుచుండిరి. కొందఱు ఒకరినొకరిని కౌగలించుకొను

చుండిరి కొందఱొండొరులను పట్టుకొనుచుండిరి. మఱికొందఱు ఒకరితో నొకరు రహస్యములు జెప్పుకొనుచుండిరి.

కొందఱొండొరులతో సుపరమించుచుండిరి. కొందఱొక చెట్టుమీదనుండి మఱియొక చెట్టుమీదికి దుముకుచుండిరి. మఱికొందఱొక చెట్టుకొనకొమ్మనుండి యింకొక చెట్టుకొనకొమ్మకు దుముకుచుండిరి. కొందఱు మహావేగముతో పరుగెత్తిపోయి నేలపైనుండి పెద్దచెట్లకొనకొమ్మలకెక్కుచుండిరి. మఱికొందఱు గట్టిగ పకపక నవ్వుచు పాడుచుండిన వానిపైబడుచుండిరి మఱియొకడు తాను నవ్వుచు నవ్వుచున్నవానిపైబడెను ఒకఁడు గట్టిగ యేడ్చుచుండఁగ మఱియొకడొకనిని వానిపైకిద్రోసి నవ్వుచుండెను. ఇంకొకఁడు గట్టిగ నఱచుచు త్రోయుచున్నవానిపైబడెను. ఇట్లు వానరసైన్యమంతయును, విశేషముగ తేనెలు ద్రాగుటచే చిత్తవైకల్యముగలవారై శరీరము దెలియక విశేషముగ చేష్టలను జేయుచు మిగులఁ గలతనొందినదాయెను. వారిలో తేనె విశేషముగ ద్రావుటచేత మదమును బొందని వాడొకఁడైనను లేడు. వారి వారియిష్టముచొప్పున తేనె ద్రావి తృప్తినొందనివాడొకఁడును లేడు అట్టియెడ నావనమును గాపాడుచుండిన దధిముఖుడను వానరుఁడు, జాంబవదాదులు మధువనములో బ్రవేశించి యందలి తేనియలను ద్రావి, ఆకులు పూలను రాల్చి చెట్లన్నియును పాడుజేయుటను జూచి మహాకోపమును బొందినవాడగుచు, ఓవానరులారా! ఇట్లు వనమును పాడుజేయుట మీకుయుచితముగాదు వనమును విడిచి వెలుపలికిబొండని చెప్పె అంత నావానరులు అతనిమాటనులక్ష్యపెట్టక తమయిష్టముచొప్పున జేయుచుండిరి. అప్పుడు ఆవనమును పాలించువాడును, మిగుల భయంకరమైన శౌర్యముగలవాఁడును, వానరవీరులలో నెల్లనధికుడును, నగు దధిముఖుఁడు మధుపానమత్తులైయున్న నాయంగదుడు మొదలగువానరులచేత తిరస్కరింపఁబడినవాఁడగుచు, మధుపానమత్తులైయున్న వానరులవలన వనము పాడుగాకుండ కాపాడుటకై కొంతదడవాలోచించె. అట్లాలోచించి నిశ్చయించుకొని ఆదధిముఖుఁడు కొందఱిని మిగుల పరుషవాక్యములచే బొమ్మని చెప్పె. కొందఱిని నఱచేతితో దవడమీద గొట్టె. మఱికొందఱితో కలహము జేసె కొందఱిని మంచిమాటలతో వలదని చెప్పె. అట్లు దధిముఖుడు ఆవానరులతో వలదని చెప్పినను వినరైరి. మఱియు నాయంగదుడు మొదలగు వానరులు ఎంతమాత్రమును భయము బొందని వారును, మధుపానమత్తతచేత శరీరము దెలియక మదించినవారునునై, అందరును నొకటిగజేరి యాదధిముఖుఁ అనేకములుగ దూషించి యిటునటు నీడ్చిరి. మఱియు నాయంగదుడు మొదలగువారు మదించినవారుగావున నాదధిముఖుని గోళ్ళతో గీరి, పండ్లతో కొఱికి, చేతులతో గొట్టి, కాళ్లతో దన్ని నానావిధములుగ హింసించి, యామధువనమునందున్న తేనె మొదలగు సమస్తమును నాశనము జేసి యాగొప్పవనమునందు ఒక పదార్థముగూడ లేకుండునట్లుగ జేసిరి

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదియొకటవ సర్గము ముగిసెను.

వనపాలకుడగు దధిముఖుడు సుగ్రీవుని తో వానరులు మధువనమును నాశము జేసిరని చెప్పుట

అప్పుడు వానరోత్తముఁడగు నాంజనేయుడు ఆయంగదాదివానరులను జూచి యిట్లనియె.

ఓవానరోత్తములారా! మీరెంతమాత్రమును భయపడక మీయిష్టముచొప్పున తేనియలను ద్రావుడు మీవిరోధులు మీపైకి రాకుండునట్లు నేనడ్డగించుచుండెదను. అని యాంజనేయుఁడు జెప్పిన మాటను విని వానరోత్తముఁడగు నంగదుడు మహాసంతోషమును బొందినవాఁడగుచు నిట్లనియె. ఓవానరులారా! మీయిష్టముచొప్పున తేనియలను ద్రావుఁడు అంజనేయుఁడు కార్యమును సాధించుకొనివచ్చియున్నాఁడు గావున నాతండు, చేయగూడని కార్యమును జేయుమని చెప్పినను గూడ నేనా కార్యమును అవశ్యముగ జేయవలయును అట్లగుటవలన యిప్పుడీకార్యమును జేయనని యేల జెప్పవలయును. అని వానరోత్తముడైన యంగదుడు జెప్పగవిని వానరులందఱును పరమసంతోషమునొంది మిగుల సంతసించి, బళే; బళే; బహుబాగుగానున్నదని నతనినిమంచిమాటలచేత స్తుతించిరి. ఇట్లు వానరులందఱును, వానరోత్తముఁడగు నంగదుని అనేకవిధములుగ స్తోత్రము జేసియంత "ఏటినీటివేగము వొడ్డుననుండెడు మ్రాకులను బడద్రోయునట్లు" మధువనములోని చెట్లపైకిబోయిరి. అట్లుపోయి వారి పరాక్రమము వలనను, అంగదుని ఆజ్ఞ వలనను, సీతాదేవిని జూచివచ్చుటచేతను, నామెవృత్తాంతమంతయును జక్కగా వినుటచేతను, రెట్టించిన బలముగలవారగుచు మధువనములోనున్న మధువనపాలకులనందఱిని కట్టివేసి, అందలి తేనియలను తృప్తియగువరకు ద్రావి, రుచ్యములగు ఫలములనన్నిటిని భుజించిరి. అట్లు వానరులందఱును యథేష్టముగ మధువును ద్రావి పండ్లను భుజించి మదించినవారై నానావిధములుగ నెగురుచు నావనపాలకులనందఱిని కొట్టి యనేకవిధములుగ హింసించిరి. మఱియు నావానరులందఱు నొక్కటిగ గూడి తూమెడు ప్రమాణముగల తే

నెనుబట్టి త్రాగిరి. అందుకొందఱు తమవిరోధులను బట్టి కొట్టుచుండిరి. తేనెవలెపింగళవర్ణముగల కొందఱువానరులు జక్కఁగ తేనియలనుద్రావి యాతేనెతెట్టెలను పారవేయుచుండిరి. మఱికొందఱుమత్తులై మైనమునుదీసికొని యొండొరులను గొట్టుకొనుచుండిరి. కొందఱుమధుపానమత్తులై కదలలేక యెచ్చటనున్నవారచ్చటనే చెట్లకొమ్మలనుబట్టుకొని నిలుచుండిరి మఱికొందఱుమత్తుచేత డస్సినవారగుచు చెట్లనుండియాకులనుదూసి నేలయందువేసి బరుచుకొనిపరుండిరి ఇట్లువానరులు మధుపానమత్తులై పిచ్చిబట్టినవారివలె నానావిధములుగ చేష్టలనుజేయుచుమహాసంతోషంబుతో నొండొరులనునెట్టుకొనుచు, కొట్టుకొనుచు, పడద్రోసికొనుచునుండిరి. కొందఱునడవలేక తడబడుచుండిరి మధుపానమత్తులైనవానరులు కొందఱు సింహనాదముజేయుచుండిరి. కొందఱధిక సంతోషముచేత కూయుచుండిరి. మఱికొందఱు నేలపైబడి నిదురించిరి అందుకొందఱు, మధువనములోనున్న యాడవానరములంబట్టి (మిథునకర్మమునుగావించి) యవాచ్యకర్మమును జేసి తమలోతామునవ్వుకొనుచుండిరి. మఱికొందఱింకొక గ్రామ్యకార్యంబుజేసిరి. ఇంకకొందఱొక యవాచ్యకర్మనుజేసి దానినితరులతో జెప్పుకొనుచుండిరి. మఱికొందఱితరులు చేయుచుండినకార్యమును జూచుచుండిరి. అట్టియెడదధిముఖునిచే బ్రేరేపింపఁబడివచ్చిన వనపాలకులందఱును, మిగులభయంకరులగునంగదుడుమొదలగువానరులచేత నానావిధములుగ హింసింపఁబడినవారై దశదిశలకును బరువులిడిరి. మఱియునంగదుడుమొదలగు వానరులుఆ మధువనపాలకులయొక్క మోకాళ్ళనుతలలనుబట్టియెత్తి తలలనుగుదస్థానమునందు జేర్చిరి. అట్లుఒత్తుటచే మిగులవ్యసనముబొంది దధిముఖునియొద్దకుబోయి యిట్లనిచెప్పిరి. ఓదధిముఖుఁడా! అంగదుడుమొదలగు వానరులుఆంజనేయునిచేత ఆజ్ఞనుబొంది మహాబలముగలవారై మధువనమునంతయునాశనముజేసిరి. మఱియు మమ్ములను మోకాళ్లుబట్టియీడ్చి గుదస్థానమునుజూపిరి. అనియావానరులుమధువనపాలకుడగు దధిముఖునితో జెప్పిరి. అంతఆవానరుడు మహాకోపమునుబొంది తనభటులగునావానరులనూరడించియిట్లనియె.

ఓవానరులారా! మీరలిచటికిరండు. మనమందరమును బోయి మిగులబలగర్వితులై తేనెద్రావుచుండెడి వానరులనుబలిమిచేనడ్డగించి తఱుముదము. అనిజెప్పె. అంత, మహాశౌర్యవంతులగు నావానరులు మఱలనాదధిముఖునితోఁగూడబోయి మధువనమునందు బ్రవేశించిరి. అట్లుమధువనమునందు బ్రవేశించి, దధిముఖుఁడు మిగులపరాక్రమించియతివేగముగ నొకచెట్టునుబెరికి చేతబట్టుకొనియావానరులనడుమపరుగెత్తె. అంతతక్కినభటులగు వానరులందరును మహాకోపమునుబొందిన వారగుచు బండలనుచెట్లను పర్వతములనుచేతులంబట్టుకొని దధిముఖునివెంటనే యంగదాదివానరులున్నచోటునకుపరుగెత్తిరి. మఱియు మిగులపరాక్రమశాలులగు నావానరులు తనప్రభుడగు దధిముఖుండుజెప్పినమాటను శిరసావహించి, తాడిచెట్లనుమద్దిచెట్లను తాళ్ళను నాయుధములుగధరించి యతివేగముగబరుగెత్తిపోయిరి. అట్లుపోయి మహాశౌర్యవంతులును, మధువనరక్షకులును, నగు దధిముఖుడుమొదలగువానరులు, బలగర్వితులయి యనేకవిధములుగ చెట్లమీదను, చెట్లక్రిందను, భూమిమీదనునున్నఅంగదుడుమొదలగువానరులనందఱినినడ్డగించిరి అంతనాంజనేయుఁడుమొదలగు వానరశ్రేష్ఠులందఱును, మహాకోపముతోవచ్చుచుండినదధిముఖునిజూచి యతనికెదురుగబోయిరి. అప్పుడంగదుండు మిగులకోపమునుబొంది, చెట్టుచేతబట్టుకొని వచ్చుచున్నవాఁడును, పెద్దచేతులుగలవాఁడును, మిగులబలముగలవాఁడును, మహాసౌందర్యవంతుఁడును, పెద్దవాఁడును, నగు దధిముఖునిరెండుచేతులతో చక్కఁగాగొట్టె. మఱియు నంగదుడుమదముచేత శరీరముదెలియక పెద్దవాఁడనియును పూజనీయ్యుఁడనియును నెంతమాత్రమును యోచింపక అతివేగముగ నాదధిముఖుని భూమిమీదద్రోసిచక్కఁగాగొట్టి నలిపిరి. అప్పుడు మహాశౌర్యవంతుఁడునువానరోత్తముఁడును నగు దధిముఖుఁడుచేతులును తొడలును, మూపును, విఱిగి, సర్వావయవములు స్వాధీనముదప్పిమూర్ఛనుబొంది క్షణకాలముదేహమునందుస్మృతిలేనివాఁడైయుండె. అంతప్రభువగు సుగ్రీవునిమేనమామయైన దధిముఖుఁడుఅతిశీఘ్రముగ మూర్ఛదేరిలేచి మహాకోపమునుబొంది, మధుపానమత్తులైయున్న వానరులనుతనచేతనున్నచెట్టుతో మోదెను. అట్లుగొట్టి వానరోత్తముఁడగు నాదధిముఖుఁడు అతిప్రయాసముచే వారివలన విశేషనుపద్రవముగలుగకుండగ తప్పించుకొనిపోయి యొకరహస్యస్థలమునందుజేరి తనతోడవచ్చిన భృత్యులతోనిట్లనియె.

ఓవానరులారా! ఈయంగదుడుమొదలగు వారునిచటనేయుండనిండు. మనమందఱమును యిప్పుడుఅతివేగముగ మనప్రభువగుసుగ్రీవుఁడును, రాముఁడునుయుండెడు స్థలమునకుబోవుదము. మనముమనరాజగు సుగ్రీవునియొద్దకుబోయి దోషమునంతయునంగదునిపైనబెట్టెదము. అంత

సుగ్రీవుఁడుమనమాటవిని మహాకోపమునుబొంది వారల నందఱినిజంపును. అందు కెంతమాత్రమును సంశయములేదు. ఈమధువనము తండ్రితాతలవరుసక్రమముగ సుగ్రీవునకువచ్చినది మిగులశ్రేష్ఠమైనది. దేవతలకైనను జొరనశక్యంబైనది. ఇదిమహాపరాక్రమశాలియగు సుగ్రీవునకు మిగులప్రియమైనది. కావున, సుగ్రీవుఁడు, మరణకాలంబుసమీపించుటచే తేనెయందు మిగులనాశగొన్నయీవానరులను వారిస్నేహితులతోగూడ నందఱినిజంపనాజ్ఞాపించును. ఓవానరులారా! రాజుయొక్క ఆజ్ఞోల్లంఘనము జేసినవారుగావునమహాదుర్బుద్ధులగు నీవానరులు చంపఁదగినవారు. కావునసుగ్రీవుడువీరినిచంపును. పిదపమనపగదీరును. మనపగదీర్చుకొనుట కిదియేయుక్తమైనమార్గము. అనియిట్లు మహాబలపరాక్రమశాలియగు దధిముఖుఁడుమధువనపాలకులతోజెప్పి వారితోగూడ నాకాశమార్గమునకెగిరియతివేగముగబోయె. అట్లుఅతివేగముగ నాకాశమార్గమునబోయి యొక్కనిమిషమాత్రములో సూర్యపుత్రుఁడగు సుగ్రీవుఁడున్నస్థలమునకు బోయిచేరె అంతనాదధిముఖుడు ఆకాశమార్గమునుండియే రామలక్ష్మణ సుగ్రీవులనుజూచి, తనపరివారంబుతోగూడ మిట్టపల్లములులేనిసమప్రదేశమునందువ్రాలె. గగనమార్గముననుండి వ్రాలినవాఁడును, మహాబలపరాక్రమశాలియును, వనపాలకులకందరికిని ప్రభుడును నగు నాదధిముఖుఁడు, మధువనపాలకులచే బరివేష్టింపఁబడినవాఁడును, మిగులవ్యసనముతోగూడినముఖముగలవాఁడునునై శిరమునందు చేతులను మొగిడ్చిమంగళకరములగు సుగ్రీవునిపాదములుదాకునట్లు తనశిరస్సునుజేర్చినమస్కరించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదిరెండవసర్గముగిసెను.

సుగ్రీవుడు మధువనమును బాడుచేసిన వానరులను మన్నించితినని చెప్పుట.

అంతవానరోత్తముఁడగు సుగ్రీవుఁడు, తనపాదమూలమునందుశిరస్సునుజేర్చి నమస్కరించుచున్న దధిముఖునిజూచిమనస్సునందుమిగులభయమునుబొందియిట్లనియె.

మహాశౌర్యవంతుఁడవగు నోదధిముఖుఁడా! లెమ్ముః లెమ్ముః ఏకారణమువలన నీవునాపాదములమీద బడితివి? చెప్పుము. నీకభయంబిచ్చితిని. భయపడకుము. నీవృత్తాంతమునంతయుసవిస్తరముగజెప్పుమనె. అనియిట్లు మిగులపూజ్యమగు స్వభావముగల సుగ్రీవునిచేత నూరడింపఁబడినవాఁడైమహాబుద్ధిమంతుఁడగు దధిముఖుఁడుపాదములపైనుండిలేచియిట్లనియె.

ఓమహారాజా! సుగ్రీవుడా! నీతండ్రియగు ఋక్షరజస్సునికాలమునందుగాని, మీయన్నయగు వాలిదినములలోగాని, మున్నునీవురాజుగానుండిన కాలములోగాని, విడువఁబడినదిగాదు. ఎవ్వరికినిజొరనశక్యంబైనది. అట్టిమధువనమునునంగదాదివానరులు నాశనముజేసిరి. ఈవనపాలకులువలదనిచెప్పినను వినక లక్ష్యములేక మధువునంతయుద్రావిరి మఱియుగొందఱు తేనియలను ద్రావుచున్నారు. మఱికొందఱుత్రాగిమిగిలినతేనెను పారవేయుచున్నారు. ఈమధువనపాలకులువలదనిచెప్పినను వీరినిభయపెట్టుచుండిరి ఈవనపాలకులు మిగులసంరంభముతో గూడినవారై వలదనియడ్డగింపగ నాయంగదాదులుకోపమునుబొంది వీరినిఅనేకవిధములుగబెదరించిరి. వానరోత్తముఁడవగు నో సుగ్రీవుఁడా! అనేకులును, మహాశౌర్యవంతులును, నగు నాయంగదాదివానరులు, మధుపానమత్తతచేతయెఱ్ఱబారినకండ్లుగలవారగుచు మహాకోపముతోనే వనరక్షకులను తరిమితరిమికొట్టిరి. వీరిలోకొందఱిని చేతులతోగొట్టిరి. కొందఱినిమోకాళ్ళతోబొడిచిరి. కొందఱినికాళ్ళతోదన్నిరి. మఱికొందఱినియీడ్చిరి. గొందఱినిమెడబట్టి తలక్రిందుగవంచి గుదస్థానమునుచూపిరి. ఓసుగ్రీవుఁడా! రాజవగు నీవుఉండగానే లక్ష్యములేక ఆవానరులు మహాశూరులగు నీవనపాలకులనుబట్టి చక్కగామర్దించిరి. మఱియుమధువనమునందున్న తేనియలనుద్రావిరి. అనిదధిముఖుఁడు సుగ్రీవునితోజెప్పె. అంతమిగులబుద్ధిమంతుఁడును, వైరివీరులను సంహరించువాఁడును ప్రక్కన గూర్చుండియున్నవాడును, నగులక్ష్మణుఁడువానరోత్తముఁడగుసుగ్రీవునిజూచియిట్లనియె.

ఓవానరరాజోత్తమా! సుగ్రీవుఁడా! ఈవనపాలకుడగు వానరుడుయిచటికేలవచ్చెను? మహావ్యసనముతోగూడినవాఁడగుచు నీతోనేమిజెప్పుచున్నాఁడు? ఏవిషయమును గుఱించి మాటలాడుచున్నాడు? అనిలక్ష్మణుండు సుగ్రీవునియడిగె అప్పుడుమాట్లాడుటయందునేర్పరియగు సుగ్రీవుఁడు, మహానుభావుఁడగు లక్ష్మణునిజూచియిట్లనియె. ఆర్యుఁడవగు నోలక్ష్మణుఁడా! మహాపరాక్రమశాలులును దక్షిణపుదిశయందు వెదుకఁబోయినవారును, నగు నంగదుడుమొదలగువానరులువచ్చి మధువనమునందు ప్రవేశించి తేనియలనుద్రావిరని, మహాపరాక్రమశాలియును, మధువనరక్షకుడును, నగు నీదధిముఖుడుచెప్పుచున్నాఁడు. ఓలక్ష్మణా! ఆయంగదుడుమొదలగువారు కార్యమునుసానుకూలపఱచుకొనియే వచ్చియుందురు. లేనియెడలవారుమ

ధువనమునందు బ్రవేశించి దానినిస్వాధీనము జేసికొని, తేనియలను ద్రావి, వృక్షములను విఱిచి పాడుజేయరు. కార్యము సాధింపనివారైరేని యిట్టి కార్యమును ఎంతమాత్రమును జేయరు. మఱియు నాయంగదుడు మొదలగు వానరులు ధైర్యముజేసి మధువనమునందు బ్రవేశించుటచేతనే వారు కార్యమును జక్కబరచుకొని వచ్చియున్నారని విశదముగ దెలియవచ్చుచున్నది. సీతాదేవిని చూచివచ్చినారు. అందుకెంతమాత్రమును సంశయములేదు. అదియు, ఆంజనేయుడే చూచివచ్చియుండును. ఇతరవానరుడెవ్వడును జూచియుండడు. ఓలక్ష్మణుడా! ఆంజనేయుడు దప్పనన్యుండెవడును యిట్టిగొప్పకార్యమును సాధించుటకు సమర్థుండుగాడు. ఇదియునగాక యెట్టిపనిగాని సాధించుటకు తగినబుద్ధియును, శౌర్యమును, యత్నమును, ఉత్సాహమును మొదలగుగుణములన్నియును వానరోత్తముడగు నాంజనేయునియందే నిలకడగనున్నవి. మఱియు నొక్కవిశేషముగలదు. చెప్పెదనువినుము. ఏకార్యమునందు మహాబలులగు జాంబవంతుడును, అంగదుడును సేనానాయకులుగాను, ఆంజనేయుడు కార్యనిర్వాహకుడుగాను, నుందురో యట్టికార్యమవశ్యముగ సిద్ధించును వేరువిధముగాగానేరదు. ఓలక్ష్మణా! అంగదుడు మొదలుగాగలవానరవీరులువచ్చి మధువనమునంతయు పాడుజేసిరి. అంతనీ వనపాలకులందఱు నొక్కటైపోయి వారినివలదని యడ్డగింపగా వీరిని మోకాళ్ళచే బొడిచిరి. అనియీవృత్తాంతము దెలుపుటకే, మిగులతియ్యగమాటలాడువాడును, మహాప్రసిద్ధినొందిన శౌర్యముగలవాడును, దధిముఖుడను పేరుగలవాడును నగు నీవానరుడిచటికివచ్చినాడు. మహాబాహుడవగు లక్ష్మణుడా! సీతాదేవినివానరులుజూచివచ్చిరి. ఇందుకెంతమాత్రమును సంశయములేదు కావుననే యీవానరులందఱును మధువనములోజొరబడి తేనెను ద్రాగిరి. పురుషోత్తముడవగు నోలక్ష్మణుడా! దశదిశలయందును మిగులప్రసిద్ధినొందినవారగు నీవానరులు సీతాదేవినిజూడకుందురేని బ్రహ్మదేవుడు మాతండ్రికిచ్చినయీమధువనములో నెంతమాత్రమును బ్రవేశింపరు దీనినినాశనము జేయరు అనిసుగ్రీవుడు లక్ష్మణునితో జెప్పె. అంత మిగులధర్మాత్ముడగు లక్ష్మణుడు రామునియొద్దకుబోయి యీవృత్తాంతమును రామునితో జెప్పి మహాసంతోషమునుబొందుచుండెను మఱియు మహాబలపరాక్రమశాలులగు రామలక్ష్మణులిరువురును, సుగ్రీవునిచే జెప్పబడిన చెవులకింపగు మాటలనువిని మహాసంతోషమును బొందిరి. మిగులసుందరమగు మెడగలసుగ్రీవుడును దధిముఖుడు జెప్పినమాటలనువిని మహాసంతోషమును బొందినవాడగుచు వనరక్షకుడగు నాదధిముఖునిజూచి యిట్లనియె.

ఓదధిముఖుడా! ఆయంగదుడు మొదలగు వానరులు కార్యమును సాధించుకొనివచ్చి మధువనములో బ్రవేశించి తేనెను ద్రావి దానినంతయును పాడుజేసిరి. వారుకృతకార్యులైవచ్చి యీపనిజేసినవారుగావున, వారియొక్క తప్పును క్షమింపదగినది. నేనువారినిమన్నించితిని. వానరోత్తముడవగు నోదధిముఖుడా! కృతకృత్యులును, సింహమునకుబోలె శౌర్యముగలవారును, నగు నాంజనేయుడు మొదలగు వానరులనందఱిని జూచుటకును, సీతాదేవిని జూచుటకైవారుజేసినప్రయత్నములను వినుటకును, నేనును రామలక్ష్మణులును, మిగుల యిష్టముగలవారమైయున్నామని యాయంగదుడు మొదలగువారలకు జెప్పుమని సుగ్రీవుడు దధిముఖునితో జెప్పె మఱియు సంతోషముచేత వికసించిన నేత్రములుగలవారును, నిక్కబొడుచుకొనియున్న రోమములుగలవారును, సిద్ధించిన కార్యముగలవారును, నగు రామలక్ష్మణులనుజూచి వానరరాజగుసుగ్రీవుడు మహాసంతోషమునుబొంది తనయొక్క దేహావయవములయందుగనబడు శుభసూచకములచేత కార్యము చెయిజిక్కినదానిగనెఱింగి మిగులసంతసించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదిమూడవసర్గము ముగిసెను.

ఆంజనేయుడు మొదలగువారు రామలక్ష్మణసుగ్రీవులవద్దకు వచ్చుట.

అంత సుగ్రీవుడట్లుచెప్పగావిని దధిముఖుడు మహాసంతోషమును బొంది, శ్రీరామునకును, లక్ష్మణునకును, సుగ్రీవునికిని నమస్కరించె అట్లు దధిముఖుడు మహాబలపరాక్రమశాలులగు రామలక్ష్మణులకును, సుగ్రీవునకును, నమస్కరించి, శూరులగు మధువనరక్షకులతో గూడ నాకాశమార్గమునకెగిరె అప్పుడు దధిముఖుడు తనపరివారసమేతముగ నారీతిగ నాకాశమార్గమున కెగిరి మున్నుతానువచ్చిన మార్గముననేపోయి నేలపైదిగి మధువనమునందు బ్రవేశించె. అట్లు దధిముఖుడు మధువనమునందు బ్రవేశించి, అచట మధుపానమత్తతవలన విడువబడినవారును, దేహముదెలిసి లేచియున్నవారును, తేనియయునునీళ్లునుగలిసిన మూత్రమునువిడుచుచున్నవారును, వానరోత్తములును, నగు అంగదాదివానరుల నందఱినిజూచె. మహాశౌర్యవంతుడగు దధిముఖుడు అంగదాది వానరులనుజూచి వారి

యొద్దకుబోయి చేతులనుమొగిడ్చి అంగదునకు నమస్కారమునుజేసి మిగుల మధురమగు మాటలతో నిట్లనియె.

మిగుల తిన్ననివాడవగు నోయంగదుడా! ఈవనపాలురు మిమ్ములను తేనియలు ద్రావకుండ నివారించి నందుకు కోపముజేయవలదు వారు తెలివిలేమిచేతను, కోపముచేతను, మిమ్ములను మధువనమును విడచిపొమ్మని యడ్డగించిరి. మహాబలశాలివగు నోయంగదుడా! నీవు యువరాజవు. ఈమధువనమునకు రాజవు. తెలివిలేమిచేత మీకుఅపకారమును జేసితిమి. దానిని నీవు క్షమింపకర్తవు. పాపరహితుడవగు నోయంగదుడా! నేను మీపినతండ్రియొద్దకువెళ్ళిమీరందఱును యిచటవచ్చియున్నారని చెప్పితిని. ఈమధువనమునంతయు నాశనముజేసితిరనియును జెప్పితిని. అంత మీపినతండ్రియగు సుగ్రీవుడు మీరిచటవచ్చి యుండుటయును, మధువనమునంతయు నాశనము జేయుటయును విని మహాసంతోషమును బొందెనుగాని, యెంతమాత్రమును కోపమునొందినవాడుగాడు ఓయంగదుడా! వానరేశ్వరుడును, నీకుపినతండ్రియును, మాకుప్రభుడును, నగుసుగ్రీవుడు మహా సంతోషమును బొంది నాతో నిట్లనియె. ఓదధిముఖుడా! నీవుబోయి, ఆయంగదాదివానరులనందఱిని అతివేగముగ నిచటికి బంపుమనినాతోజెప్పెనని దధిముఖుడు అంగదునితో జెప్పె. అంతవాక్యవిశారదుడును, వానరోత్తముడునునగు అంగదుడు దధిముఖుడు జెప్పిన మధురవాక్యమునువిని తనతోగూడనున్న వానరులను జూచి యిట్లనియె.

శత్రువుల గర్వమడంచునట్టి యోవానరోత్తములారా! మనమిచటికి వచ్చియుండెడు సమాచారము శ్రీరామునికిగూడ తెలిసియేయుండును ఇందుకెంతమాత్రమును సంశయములేదు. మనమిప్పుడు కార్యమును నెరవేర్చుకొనివచ్చి యిచటనుండుట యుచితముగాదు అదియునుగాక వానరులందఱును వారివారియిష్టముచొప్పున తేనెనుద్రావి పండ్లను భుజించి యలసటదీర్చికొని యున్నారు. ఇంకేమిగావలసియున్నది ఇంకనాపినతండ్రియగు సుగ్రీవుడున్న చోటికిబోదము రండు. ఓవానరోత్తములారా! మీరందఱును నొకటిగజేరి యాలోచించి నన్నెట్లు జేయమని చెప్పెదరో యట్లుజేసెదను ఇప్పుడు చేయవలసిన కార్యమును గుఱించి యాజ్ఞాపించుటకు నేను స్వతంత్రుడనుగాను ఓవానరులారా! నేను యువరాజునుగానున్నను, ఈవిషయమునందు మిమ్మాజ్ఞాపించుటకు సమర్థుడనుగాను. మీరుకార్యమును నెరవేర్చుకొని వచ్చియున్నారు. కావుననిప్పుడు మిమ్ములను నేనుఆజ్ఞాపించుట యుచితముగాదు. అనియంగదుడుజెప్పె అంతవానరులందఱును అంగదుండుజెప్పినవెలలేనిమాటనువిని మహాసంతోషమును బొందిన మనస్సుగలవారై అంగదునితో నిట్లనిరి. ఓవానరోత్తముడా! యువరాజా! అంగదుడా! రాజగువాడెవ్వడిట్టిమాట జెప్పును? సమస్తజనులును నైశ్వర్యముచేత మత్తులై శరీరను దెలియక నేనని గర్వించియుందురు నీవు యీమాటను జెప్పుటనుచూడగా నిదినీకేతగియున్నది. నీతోసమానుడెవ్వడును లేదు. ఇట్టివినయముగలిగి యుండుటయే నీకు ముందుముందుగలుగబోయెడి వృద్ధికిని శుభమునకును, నిదియే సూచకముగనున్నది. ఓఅంగదుడా! మేమందఱమునుగూడ, వానరేశ్వరుడగు సుగ్రీవుడెచటనాశరహితుడై యున్నాడోయచటికిబోవుటకు మిగుల సంతసముగలవారమైయున్నాము. అందుకొఱకే మేమిచటికివచ్చియున్నాము. వానరోత్తముడవగు నోయంగదుడా! నీయొక్క ఉత్తరవులేకయే మేమొకయడుగైననుబెట్టి పోజాలము. నీయాజ్ఞను జవదాటిపోలేము. ఇదినిశ్చయము అనియిట్లు వానరులందఱును అంగదునితో జెప్పిరి. అంతఅంగదుడు, మంచిది. పోదములెండని చెప్పె. ఆమాటనువిని మహాబలశాలులగు వానరులందఱును నొక్కటేతూరిగ గగనమార్గమునకెగిరిరి మఱియునావానరశ్రేష్ఠులందఱును నారీతిగ నాకాశమార్గమునకెగిరి యాకాశమును నిరవకాశముగజేయుచు "యంత్రములచే నెగురగొట్టబడిన పర్వతములవలె" ఆకాశమును గప్పుకొని అంగదుని వెంబడించిపోయిరి. మహావేగముగల యావానరులందఱునుఅతివేగముగ నాకాశమార్గమునబోవుచు "వాయువుచే ప్రేరేపింపబడిన మేఘములు ధ్వనిజేయునట్లు" సింహనాదమును జేయుచు బోవుచుండిరి అంగదుడు మొదలగువారు సుగ్రీవుడున్నచోటికి రాకమునుపే, వానరరాజగు సుగ్రీవుడు, మహావ్యసనముతోనున్నవాడును, తామరతేకులవంటి నేత్రములుగలవాడును, నగు శ్రీరాముని జూచి యిట్లనియె.

ఓరామచంద్రా! నీవుఊరటనొందుము. నీకు శుభమగుగాక. సీతాదేవిని వానరులుజూచివచ్చిరి. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. ఏలననగా యిప్పుడు నారికి చెప్పిన గడువుదీరిపోయినది. వారుకార్యమును సాధించుకొనిరాకుందురేని, గడువుతీరినవెనుక నిచటికి రాజాలరు. ఇదియునుగాక కార్యముజెడియుండునేని, మహాబాహుడును, వానరులలోనుత్తముడును, యువరాజునునగు నంగదుండు నాయెదుట కెంతమాత్రమును రాజాలడు ఒకవేళ కార్యమును సాధించి నెరవేర్చుకొనకయే నాయొద్దకు వచ్చినను నాయంగదుండు మిగులదుఃఖితుండై చిత్తభ్రమను బొందినవాడైయుండును. మఱియు వానరేశ్వరుడగు నంగదుడు

మహాసంతోషమును బొందినవాడై తండ్రితాతలవలన వచ్చినదియును, పూర్వీకులచేత జక్కగా కాపాడబడినదియును, సగునీసుధువనమును నాశముజేయనొల్లడు. మిగుల శ్రేష్ఠమగు వనవాస వ్రతమునుజేయుచున్న నోరామా! కౌసల్యాదేవి మంచిసంతానము గలదియైనది. నీవు ఊరట నొందుము. సీతాదేవినిజూచి వచ్చినారు. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. సీతాదేవిని ఆంజనేయుడు జూచివచ్చెను. మఱియునితరుడెవడునుగాడు. ఇట్టికార్యమును సాధించుటయందు మొవడికిని సామర్థ్యము చాలదు. బుద్ధిమంతులలో నుత్తముడవగు నోరాముడా! కార్యమునుసాధించుటయందు సామర్థ్యమును, మంచిబుద్ధియును, వ్యవసాయమును, పరాక్రమమును మొదలగు నీగుణములు ఆంజనేయునియందు "సూర్యునియందు కాంతియుబోలె" స్థిరములుగనున్నవి. ఇదియునుగాక, ఏకార్యమునందు జాంబవంతుడును అంగదుడును నాయకులుగ నుందురో, ఆంజనేయుడు కార్యమునువహించి యుండునో, అట్టికార్యము నిశ్చయముగ నెరవేరును అందుకు సంశయము లేదు. మహాపరాక్రమవంతుడవగు నోరాముడా! నీవింకవ్యసనము ను వదలుము అనియిట్లు సుగ్రీవుడు శ్రీరాముని నూరడించుచుండె అంత ఆంజనేయునియొక్క కార్యముచేగర్వించినవారును, కిష్కింధానగరమునకు సమీపించినవారును, కార్యసిద్ధిచేత సింహనాదములు జేయుచున్నవారును, నగు వానరులయొక్క కలకలధ్వనులవలన సమీపించి వచ్చినట్లు తెలియవచ్చినది

అంతవానరోత్తముడగు సుగ్రీవుడు, అంగదుడుమొదలగువానరులుచేయుచున్న సింహనాదమునువిని మహాసంతోషముచేత మిగులపొడవుగ మీదికెత్తినతోకగలవాడగుచు మిగులఆనందముతో తోకనాడించుచుండె. అట్లు శ్రీరాముని జూడగోరుచున్నావానరులందఱును, అంగదుని నాంజనేయునిముందిడుకొనివచ్చిరి. అట్లువచ్చి, మహాశౌర్యవంతులగునాయంగదాదివానరులు మహాసంతోషముతోగూడినవారగుచు, వానరేశ్వరుడగు సుగ్రీవుదును మహాబలుడగు రాముదునున్న స్థలమునందుబోయిమ్రాలిరి. అప్పుడు మహాబాహుడగు నాంజనేయుడు శిరమునందు చేతులుమొగిడ్చి నమస్కరించి యిట్లనియె. ఓరామచంద్రా! చూచితినిసీతాదేవిని. సీతాదేవిపాతివ్రత్యనియమముతోగూడుకొని క్షేమముగనున్నది. అనియాంజనేయుడుచెప్పె. అంతసుగ్రీవుడును, లక్ష్మణుడును, పూర్వమేయీకార్యము ఆంజనేయుడు దప్ప అన్యులుజేయజాలరనియును, అతండెనిస్సంశయముగ దీనినిసాధించుకొనివచ్చియుండుననియును, నిశ్చయించుకొని యుండిరిగావున, ఆంజనేయునిమాటనువిని మహాసంతోషమునుబొంది మిగులగౌరవముతోనయ్యాంజనేయునిజూచిరి. మఱియు శత్రుసంహారకుడగు శ్రీరాముడుగూడ మహాసంతోషమునొందిన ఆంజనేయునిమిగుల బహుమానపురస్సరముగజూచిరి.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదినాలగవ సర్గముగిసెను

ఆంజనేయుడుసీతాదేవివృత్తాంతమును రామలక్ష్మణ సుగ్రీవులకు జెప్పుట.

వానరులు విచిత్రములగు నరణ్యములతో నొప్పుచుండెడుప్రస్రవణపర్వతమునుజేరి మహాబలులగు రామలక్ష్మణసుగ్రీవులకు సాష్టాంగంబుగ నమస్కరించి యువరాజగు నంగదునిముందిడికొని సీతాదేవియొక్క వృత్తాంతమునువిశదముగ నెఱింగించుటకారంభించిరి. అట్లువానరులందఱును సీతాదేవియొక్క సమాచారమును జెప్పనారంభించియిట్లనిరి. ఓరఘునందనా! రామచంద్రా! సీతాదేవిని రావణాసురుడుగొనిపోయి తన అశోకవనమునం దుంచియున్నాడు. ఆసీతాదేవికి రాక్షసస్త్రీలను కావలియుంచియున్నాడు. ఆసీతాదేవిని వారునిరంతరమును బెదరించుచున్నారు. ఎంతనిర్బంధించినను నాసీతాదేవి రావణాసురునియందు బుద్ధిలేనిదై నిరంతరమును శ్రీరామునియందే అనురాగముగలదియైయున్నది. మఱియు రావణాసురుడు సీతాదేవికొకగడువుబెట్టియున్నాడు ఆగడువుకాలములో పలతన్ను అంగీకరింపదేనిచంపెదనని చెప్పియున్నాడు. అనియిట్లుసమస్తమును శ్రీరామునకు వానరులెఱింగించిరి. అంత శ్రీరాముడు సీతాదేవి సుఖముగనున్నదనివిని వారలతోనిట్లనియె. ఓవానరులారా! సీతయెచటనున్నది? నావిషయమునందా సీతయెట్లునటించుచున్నది? ఈసమాచారమునంతయును మీరునాకువిశదముగ నెఱింగింపుడనిచెప్పె.అంతవానరులు శ్రీరాముడుచెప్పినమాటనువిని సీతాదేవిసమాచారమునంతయు విశదముగ రామచంద్రునకు జెప్పుటకు నాసీతాదేవియొక్క వృత్తాంతమంతయును జక్కగా నెఱిగియుండెడు ఆంజనేయునిపురిగొల్పిరి. అంతవాయుదేవుని కుమారుడును, మాటలయందునేర్పరియును, నగు నాంజనేయుడు వానరులచేత ప్రేరేపింపబడి సీతాదేవియుండెడుదిక్కునకు ముఖముద్రిప్పి సాష్టాంగముగనమస్కారమును జేసి, తాను సీతాదేవిని ఎవ్విధముగజూచెనో, అట్లేసర్వమును నెఱింగించుటకునారంభించె. ఓరాముడా! నేను నూరుయోజనములపొడవగు నీసముద్రమునుదాటి సీతాదే

వినిచూచుటయందు మిగులనాశగలవాడనై వెదకుచుపోతిని. అట్లుదక్షిణసముద్రముయొక్క దక్షిణపుగట్టున మహాదుష్టుడగు రావణాసురుడుండెడు లంకానగరమునుదియున్నది. ధర్మస్వభావుడవగు నోరామచంద్రా! మహాపతివ్రతయును, మిగుల సుందరమైన దేహముగలదియును, నగు సీతాదేవి నిరంతరమునిన్నే ధ్యానించుచు నాలంకానగరమున రావణాసురుని యింటియందున్నది. ఆసీతాదేవి జీవముతోనున్నది. నేనుజూచితిని. మఱియు నారావణాసురునియుద్యానవనమగు నశోకవనముననున్నది. సీతాదేవికి రాక్షసస్త్రీలుకావలియున్నారు వారుసీతాదేవిని నిరంతరమును బెదరించుచున్నారు. వ్యసనమనుభవించుటకు తగనిదియును మహాపతివ్రతయునునగు సీతాదేవి, నిరంతరమును వ్యసనపడునట్లుజేయబడుచున్నది కాకుత్థ్సవంశోద్భవుడవగు నోరామచంద్రా! రావణాంతఃపుర అశోకవనమునందు అడ్డగింపబడియున్నదియును, రాక్షసస్త్రీలచేత జక్కగకాపాడబడియున్నదియును, దువ్వటమొదలగు సంస్కారాదులులేక తలవెండ్రుకలన్నియు నొక్కటేజడగా పెనుచుకొనియున్నజడగలదియును, మహావ్యసనముతోగూడుకొనియున్నదియును, నిరంతరమును నిన్నుధ్యానించుటయేముఖ్యమైనగతిగాగలదియును, పక్కకేమియునులేక నేలమీదబండుకొనియుండుటచేత వర్ణముమారిన దేహముగలదియై, హేమంతఋతువునందలి తామరకొలనువలె నున్నదియును, రావణాసురునియందెంతమాత్రమును మనస్సుదగులనిదియును, మరణమునుబొందుటయందు మనోనిశ్చయముగలదియును, నీయందలి ప్రేమచేనింతవరకు బ్రతికియున్నదియును, నగుసీతాదేవిని నేను అధికప్రయాసముచేత జూచితిని. పాపరహితుడా! రాజశ్రేష్ఠుడవగు రాముడా! అట్లు సీతాదేవినిజూచి యనేకగురుతులచే నామెసీతయని నిశ్చయించి, ఆమెకునాయందు నమ్మకముగలుగుటకై యిక్ష్వాకువంశమును వర్ణించిచెప్పితిని. అంత సీతాదేవికి నాయందునమ్మకముగలిగినది. అనంతరము నాతోమాటలాడినది. అప్పుడునేను సమస్తసమాచారమును విశదముగజెప్పితిని. ఓరామా! నీకును సుగ్రీవునకును విహితముగలిగినదనిచెప్పగావిని మహాసంతోషమునుబొందినది. ఓరఘుకులతిలకా! రామచంద్రా! సీతాదేవిసదాచారసంపత్తితో నీయందతిభక్తిగలిగియున్నది. నీయందలిభక్తియెంతమాత్రమునుతగ్గలేదు. పురుషోత్తముడవగు నోరాముడా! మహాపూజ్యురాలగు సీతాదేవి మిగులనుగ్రతపస్సుచేతను, నీయందలిభక్తిచేతను ఒప్పియున్నది. ఇట్లు సకలసుగుణసంపత్తితో ఒప్పియుండెడునదియును, జనకమహారాజ పుత్రికయునునగు సీతాదేవినిజూచితిని అట్లునేసీతాదేవితో మాటలాడిసర్వమునుదెలిసికొని మఱలివచ్చుటకై సీతాదేవిచే ననుజ్ఞనుబొంది మఱలినవాడనై, యేదేనియొక యానవాలిమ్మనియడిగితిని అంతమహాప్రాజ్ఞుడవగు నోరాముడా! మీరుచిత్రకూటపర్వతమునందుండునపుడు, నీసమీపమున సీతాదేవిగూర్చుండియుండగా జరిగిన ఒక కాకియొక్కకథను నాకానవాలుగజెప్పినది. మఱియునాతో సీతాదేవి యిట్లనియె వాయుపుత్రుడవగు నోయాంజనేయుడా! నీవిప్పుడిచటజూచినసమస్తవిషయమును చూచినదిచూచినట్లుగానే శ్రీరామునకు దెలియజెప్పుము. ఓయాంజనేయుడా! సుగ్రీవుడు యెదుటనుండునపుడు, అతనువినుచుండగా శ్రీరామునితో నీవిషయమును జెప్పుము. మఱియు ఒకనాడు నాముఖమునందలిబొట్టుచెడిపోగా నొకమణిశిలనుదెచ్చి బొట్టుగాజేసియొకగుండ్రాతిపైబెట్టి యదినాముఖమున ప్రతిఫలించునట్లుజేసితివి. దానినిజ్ఞాపకముజేసికొనుమని చెప్పుము మహాప్రయత్నముచేత నేనుజక్కగ గాపాడుచుండిన యీచూడామణిని శ్రీరామునిచేతికిమ్ము. మహాకాంతిమంతమగు నీచూడామణిని మిగులప్రయాసముచేత జక్కగా గాపాడితిని అనియిట్లు సీతాదేవినాతో మాటలాడుచునే తీవ్రవ్యసనముచేత దేహముదెలియనిద్ర రామునినుద్దేశించి యిట్లనియె. పాపరహితుండవగు నోరాముడా! సముద్రజలమునందు బుట్టినదియును, మిగుల శ్రీమంతంబైనదియును, నగు నీచూడామణిని నీకుబంపించుచున్నాను. మహావ్యసనమునందుగూడనే నీచూడామణిజూచి నిన్నుజూచినట్లే సంతోషించుచుంటిని దశరథరాజపుత్రుడవగు నోరాముడా! నేనింకొకమాసముమాత్రము ప్రాణములను గాపాడుకొనియుండెదను. మాసమునకుమీదబ్రతుకజాలను. ఒకమాసమునకుమీద నీరాక్షసులస్వాధీనమునుబొంది ప్రాణములను విడిచెదను. అనిసీతాదేవి ప్రలాపించినది. దశరథరాజనందనుండవగునోరాముడా! మిగులకృశించిన శరీరముగలదియును, మిగులపతివ్రతయును, ధర్మమార్గమును దప్పక ప్రవర్తించుచున్నదియును, రావణాసురుని యంతఃపురమునందడ్డగింపబడియున్నదియును, లేడిపిల్లనేత్రములవంటి నేత్రములుగలదియును, వికసించిన తామరపువ్వులవంటి కండ్లుగలదియును, నగు సీతాదేవి యీప్రకారముగ నాతోజెప్పినది. ఓరాముడా! సీతాదేవినాతోయెట్లుజెప్పినదో, అట్లే సకలవృత్తాంతము నీతోజెప్పితిని. ఇప్పుడు సర్వప్రయత్నములచేతసముద్రముదాటుటకు తగునుపాయమును చింతింపుము అనియిట్లు వాయుదేవునికుమారుడగు నాంజనేయుడు, రాజపుత్రులగు రామలక్ష్మణులను యూరటనొందజేసి, సీతా

దేవియిచ్చిన గురుతగు చూడామణిని రామునకిచ్చి, సీతా దేవిచెప్పమన్న వృత్తాంతమునంతయు క్రమముగ కొంచ మైనను విడువక శ్రీరామునకుజెప్పె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదియైదవ సర్గముగిసెను.

ఆంజనేయుడు రాముని చేతికి చూడామణిని యిచ్చుట.

అంతదశరథరాజనందనుడగు రాముడు ఆంజనేయుడు జెప్పిన సమాచారమునంతయువిని, చూడామణిని దీసికొని ఱొమ్ముమీదనుంచుకొని, లక్ష్మణసమేతుడై మిగులవ్యసన మునుబొందె. అట్లుదుఃఖించుచు, మణిశ్రేష్ఠమగు చూడామ ణినిచేతబట్టుకొని మహావ్యసనపీడితుడై కన్నీరు మున్నీరై పారనేడ్చుచు, ఆమణిశ్రేష్ఠమును సుగ్రీవునకు జూపి యిట్ల నియె "పశువు తనదూడపై నతిప్రీతివలన దూడను జూడ గానే యెట్లుస్రవించుచున్నదో" అట్లే ఆమణిశ్రేష్ఠమును జూడగానే నామనస్సును స్రవించుచున్నది. ఓసుగ్రీవుడా! మహాప్రకాశమానంబగు నీచూడామణిని నామామగారగు జనకమహారాజు నావివాహకాలమునందు సీతకిచ్చెను. మఱియునాసీత దీనినితన తలలోనుంచుకొనెను సూర్యపు త్రుడవగు నోసుగ్రీవుడా! మున్నొకప్పుడు మామామగార గు జనకమహారాజు ఒక యాగముసేయగా నాయాగము చేమిగుల తృప్తినొంది మహాబుద్ధిమంతుడగు దేవేంద్రుడుజ నకునకిచ్చెను ఇదిసముద్రమునందుబుట్టినది సత్పురుషులచే తబూజింపబడినది. మిగుల సౌమ్యుడవగు నోసుగ్రీవుడా! ఇప్పుడు నేనీమణిశ్రేష్ఠమునుజూడగానే నాతండ్రియగుదశ రథమహారాజును, నామామగారగు జనకమహారాజును గూడ చూచినట్లున్నది ఈచూడామణి నాప్రియ భార్య యగు సీతయొక్క తలయందు ధరింపబడియుండినది కావు ననిప్పుడు దీనినిజూడగానే నాప్రియభార్యయగు సీతను జూ చినట్లున్నది. అనిరాముడు సుగ్రీవునితో జెప్పి ఆంజనేయుని తట్టుతిరిగిచూచి యిట్లనియె.

సౌమ్యుండవగు నోఆంజనేయుడా! జనకమహారాజు కూతురగు సీతాదేవి నన్ను తృప్తిబొందించుటకై "దప్పి గొనినవానిని నీళ్లచేబడలికదీర్చునట్లు" పలుమారుయేమని చెప్పినది. అనియిట్లు ఆంజనేయునితో జెప్పి లక్ష్మణునితట్టు తెరిగి చూచె మఱియునిచట శ్రీరాముడు శోకవేగముచే తపరితపించుచు, యిటునటుసోలుచు, యీతట్టును ఆతట్టు ను ఉన్నవారితో చెప్పకొనుచు లక్ష్మణుని తట్టుతిరిగి చూ చియిట్లనియె. సుమిత్రాపుత్రుడవగు నోతమ్ముడా! లక్ష్మ ణా! సీతనుజూడక మిగులశ్రేష్ఠమగు నీచూడామణిని జూచు చుచున్నాను. దీనికంటెమిగులవ్యసనమును గలిగించునదేమి యున్నది. ఇప్పుడుసీత నన్నువిడచి యొకనెలకాలము బ్రతి కియుండు నేని పిమ్మట స్థిరముగా బ్రతుకుననుటకు సందేహ ములేదు. సౌమ్యుడవగునోలక్ష్మణా! నేను నల్లని నేత్రములు గల సీతనువిడిచియొకక్షణమైనను బ్రతుకజాలను. అనిలక్ష్మ ణునితో జెప్పి పిమ్మట మఱలనాంజనేయునితట్టుతిరిగి యిట్ల నియె. ఓయాంజనేయుడా! నీవెచట సీతనుజూచితివో య చ్చటికినన్నుదీసికొనిపొమ్ము. ఆసీతతోనన్నుచేర్పుము. సీత యొక్క వృత్తాంతమునువిని యింకనిమిషమైనను నిలువజాల ను. సుందరములగుపిఱుదులుగలదియును, మిగులభయము నుబొందెడు స్వభావముగలదియును, నాప్రియభార్యయు ను, నగు సీత నిరంతరమును మిగుల భయంకరులగు క్రూర రాక్షసులమధ్యయుండి యెట్లుజీవించియున్నదో? ఓఆంజనే యుడా! సీతాదేవి రాక్షసులచే నావరింపబడి యుండుట చేత ఆసీతయొక్క ముఖము, "శరత్రుతువునందుదయించి నదియును, చీకటివలనవిడువంబడినదియును, మేఘములచే నావరింపబడినదియును నగుచంద్రరేఖవలెనే" ప్రకాశింప కుండును. ఓయాంజనేయుడా! సీతనాకింకేమి జెప్పినదో దా నిని యథార్థముగ జెప్పుము. "రోగిఔషధముచేత జీవించి యుండునట్లు" నేనునీవుజెప్పెడి మంచిమాటలను వినుటచే త బ్రతికియుందును. ఓయాంజనేయుడా! మిగులసౌందర్య వతియును, మనోహరముగ మాటలాడునదియును, శ్రేష్ఠ ములగు పిఱుదులుగలదియును, నన్నెడబాసి యున్నదియు ను, నగునాభార్యయైన సీతనీతోనింకేమిజెప్పినది. అదంత యు నాకువిశదముగ జెప్పుము. అనియె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదియాఱవ సర్గ ముగిసెను.

——(*)——

ఆంజనేయుడు రామునకు సీతాదేవివృత్తాంతమును విశదముగ జెప్పుట.

ఇట్లు మిగులపూజ్యమైన స్వభావముగల శ్రీరాముడ డుగగానే యాంజనేయుడు సీతాదేవియొక్క వృత్తాంత మునంతయు విశదముగ జెప్పుట కారంభించియిట్లనియె.

పురుషోత్తముడవగు నోరామచంద్రా! మహాపతివ్రత యును, నీభార్యయును, నగుసీతాదేవి, పూర్వముమీరుచి త్రకూటపర్వతమునందుండగ జరిగినసంగతిని నాకుగురుతు కొఱకు జరిగినదిజరిగినట్లు యిట్లనిచెప్పినది. ఓరామా! సీ తాదేవి నీతోగూడనిదురించి యంతనీకంటెముందుగ నిదు రలేచినదట. అప్పుడొకకాకివచ్చి తనముక్కుకొనతో సీ

తాదేవి స్తనమధ్యమునగీరెను. భరతునకుఅన్నవగు నోరామా! నీతొడమీదసీతాదేవి నిదురించిలేవగానే నాపైతొడపైనీవుపండుకొనినిదురించితివి అప్పుడాకాఁకిమఱలవచ్చి సీతాదేవిని పీడింపనారంభించె. అప్పుడామె యెంతతోలినను పోక పలుమారుసీతాదేవిని స్తనమధ్యమునబొడిచి బాధపెట్టుచుండినది. అప్పుడాకాకిపొడుచుటచే గారిననెత్తురుబొట్లచేత నీదేహముతడుపఁబడెనీవుమేలుకొంటివి విరోధులనుతపింపజేయునట్టి యోరఘునందనా! రాముడా! అట్లు నీవుమెల్కువపడగానే యాకాకిచేత మిగులబాధనుబొందుచున్న సీతాదేవి యాబాధకోర్వలేక సుఖముగనిదురించుచున్న నిన్నునిదుర లేపినది. గొప్పచేతులుగల యోరామా! స్తనమధ్యమునందుగీరఁబడి మిగులబాధనొందుచున్న యాసీతాదేవినిజూచి మిగులకోపమునుబొంది "విషసర్పమువలె" నిట్టూర్పులనువిడుచుచు నిట్లనిచెప్పితివి. భీతినొందెడుస్వభావముగల యోసీతా! ఎవ్వఁడునీకుచమధ్యమునగోటితోగీరెను మిగులకోపమునొందియుండెడు నైదుతలలుగల విషసర్పముతోనెవడు చెల్లాటము లాడుచున్నాఁడు. అనిచెప్పినీవు నాలుగుప్రక్కలనుజూచి సీతాదేవికెదుట మిగులవాడిగలవైనవియును నెత్తురుతోగూడుకొన్నవియును, నఖగోళ్లుగలదియై కూర్చుండియుండినకాకిని జూచితివి ఆకాఁకి, పక్షులలో మిగుల నుత్తమమైనది. దేవేంద్రునిపుత్రుఁడు పర్వతములలోదిరుగునది. అతివేగముగపోవుటయందు వాయుదేవునితోసమానమైనది. మహాబాహుఁడా! బుద్ధిమంతులలోనుత్తముండవగు నోరామా! అంతనీవు మహాకోపముతో నేత్రములను గిరగిరంద్రిప్పుచు నాకాకిపై మిగులకోపించి చంపనెత్నించితివి నీవట్లుయెత్నించి దర్భాసనమునుండి యొకదర్భమునుదీసికొని దానినభిమంత్రించితివి. అంతనాదర్భ ప్రళయకాలాగ్నిహోత్రమువలెమండుచు నాకాకియెదుటనిలిచినది. అప్పుడునీవు మండుచున్ననాదర్భను కాకిపైవైచితివి. అట్లువేయగానే యాకాకిలేచిపరుగెత్తె. అంతనాదర్భ భగభగమండుచు నాకాఁకిని వెంబడించితరిమెను. అప్పుడాకాఁకి మూడులోకములనుతిరిగి యెచటనురక్షించువారుగానక తనతండ్రియగు దేవేంద్రునియొద్దకుబోయినది అంతదేవేంద్రుఁడుగాని దేవతలుగాని మహాఋషులుగాని ఆకాకిని కాపాడజాలరైరి. శత్రువులనడంచునట్టి యోరామా! అంతనావాయసము మిగులభయమునుబొందినదై, అంతటనుతిరిగి మఱలనీయొద్దకేవచ్చినవి. కకుత్స్థవంశోద్భవుండవగు నోరామడా! ఆకాకి యెచ్చటనుశరణముగానక నీవేశరణంబనివచ్చి నీకాళ్ళయెదుట నేలపైబడియె. అట్లుబడియున్నవాయసమునుజూచి యదివంపఁదగినదైనను నీవుదయచేత దానినిరక్షించితివి. అట్లాకాఁకినిగాపాడి బ్రహ్మాస్త్రము నిరర్థకముచేయదగినదికాదనిచెప్పి యాకాకియొక్కకుడికంటినిపోగొట్టితివి. ఓరాముఁడా! నీవాకాకినివిడిచినంతనే ఆకాకినీకును నీతండ్రియగు దశరథమహారాజునకును నమస్కరించి తననివాసస్థానమునకుబోయె అనిసీతాదేవియీవృత్తాంతమును గురుతుగానీతో జెప్పుమనిజెప్పి పిమ్మటనాతోనిట్లనియె.

ఓయాంజనేయుఁడా! అస్త్రప్రయోగముల నెఱింగినవారలలో శ్రేష్ఠుఁడున, మిగులబలముగలవాఁడును, మంచియాచారముగలవాఁడును, నగురాముఁడు యీరాక్షసులవిషయములో బ్రహ్మాస్త్రమును ఏలసంధింపడు. మఱియు పన్నగులుగాని, గంధర్వులుగాని, సురులుగాని, అసురులుగాని, వాయుసమూహములుగాని యుద్ధమునందు రామునియెదుటనిలుచుటకు సమర్థులుగారు. వాయుపుత్రుఁడవగు నోఆంజనేయుఁడా! మిగులశౌర్యవంతుఁడగు నారామునకు నాయందుకొంచెమైనను దయగలదేని యతివేగముగ యుద్ధమునందు మిగులతీక్ష్ణములగు బాణములనుబ్రయోగించి యీరావణాసురునిచంపును అదియట్లుండనిమ్ము. శత్రువులను తపింపజేయువాఁడును, పురుషోత్తముఁడును, రఘువంశమునందు జన్మించినవాఁడును నగులక్ష్మణుఁడైనను, అన్నచేత సెలవుపుచ్చుకొనివచ్చి యీరాక్షసులను సంహరించి నన్నేలగాపాడకున్నాఁడు. ఓయాంజనేయుఁ! మిగులశక్తిమంతులును, పురుషోత్తములును, వాయుదేవునకును, అగ్నిహోత్రమునకునుబోలె పరాక్రమముగలవారును. దేవతలకైన నెదిరింపనలవిగానివారును, నగురామలక్ష్మణులు నన్నేలయుపేక్షజేసియున్నారు? వానరోత్తముఁడవగు నోయాంజనేయుఁడా! మిగులసమర్థులును, శత్రువులను జంపునట్టివారును, నగురామలక్ష్మణు లిద్దరునొకటిగ జేరియుండియే నన్నునీసంకటములనుండి తొలిగింపకుండుటనుజూడగా నేనుజేసినదుష్కృత్యము మిగులగొప్పదిగానున్నదని తోచుచున్నది ఇందుకెంతమాత్రమునుసంశయములేదు. అనిసీతాదేవి నాతోజెప్పినది. మఱియుకన్నీరుమున్నీరై పారఁ హాహాయని గట్టిగానేడ్చుచు సీతాదేవిజెప్పినది. అట్టిసీతాదేవిమాటనువిని మిగులప్రాజ్ఞురాలగు సీతాదేవితో మఱలనేనిట్లనిచెప్పితిని.

ఓతల్లీ! సీతాదేవీ! రాముఁడునీకొఱకైన వ్యసనముచేతనే యేపనినిగానిజేయనొల్లడు. ఓతల్లీ! నేనుసత్యముగజెప్పుచున్నానువినుము. రాముఁడుమిగులదుఃఖమునుబొందివిలపించుచుండునపుడు లక్ష్మణుఁడుగూడ మిగులవ్యసనపడు

చున్నాఁడు. ఓసీతాదేవీ! మహాప్రయాసముచేత నిన్నుఁ జూచితిని. ఇప్పుడువ్యసనముఁబొందుటకు సమయముగాదు నీయొక్క సమస్తవ్యసనములును శీఘ్రకాలములోనే తీరును. చింతింపకుము రాజోత్తములగు రామలక్ష్మణులిరువురును నిన్నుజూచుటయందు మహాసంతోషముగలవారైయున్నారు రాజపుత్రులగు నారామలక్ష్మణులిద్దరును శీఘ్రకాలములోనే యీలంకానగరమును నాశముజేయుదురు శ్రేష్ఠములగుపిఱుఁదులుగల యోసీతాదేవీ! శ్రీరాముడుయుద్ధరంగమునందు బంధుమిత్రసమేతముగ నయోధ్యాపట్టణమునకు తీసికొనిపోఁగలఁడు. నింద్యములేని నడవడికగలయోసీతాదేవీ! రామునకు జక్కఁగఁ దెలిసినదియును, ఆయనకు మిగులసంతోషమును గలుగఁజేయునదియును నగునింకొకగురుతును నాచేతికిమ్మనియడిగితిని మహాబలుఁడవగునోరాముఁడా! నేనట్లుఒకగురుతునడుగఁగానే, సీతాదేవి దశదిశలనుజూచి, పిమ్మట తలలోధరింపదగినదియును, మిగులశ్రేష్ఠమైనదియును, నగునీచూడామణినితనచీరెకొంగుననుండివిప్పి నాచేతికిచ్చినది. రఘువంశోద్భవుఁడనగునోరాముఁడా! నేనునీకొఱకై యీమహాశ్రేష్ఠమగు రత్నమునుదీసికొని, మిగులపూజ్యురాలగు సీతాదేవికిప్రదక్షిణపూర్వకముగ నమస్కారముజేసి, మఱలనీవద్దకువచ్చుటకుత్వరపడితిని. అంతమిగులశ్రేష్ఠమగు వర్ణముగలదియును, జనకమహారాజుకూతురును, నగుసీతాదేవి, తిరిగియిచటికివచ్చుటకై మహాసంతోషముతో దేహమునుబెంచుచున్ననన్నుజూచి మిగులవ్యసనముతో గూడుకున్నదియును, కండ్లవెంబడి బొటబొటకన్నీళ్లువిడుచుచున్నదియును, శోకాతిశయముచేతడగ్గుత్తికతోమాటలాడుచున్నదియును,వ్యసనముచేతగొట్టఁబడినహృదయముగలదియును, నగుచునాతోనిట్లనియె.

ఓయాంజనేయుఁడా! సింహములతోసమానులగునారామలక్ష్మణులిరువురకును, మంత్రులతో గూడుకొనియుండెడు సుగ్రీవునకును, తక్కినవారికందఱికిని నాక్షేమమునుజెప్పుము. మఱియు మహాబాహుఁడగు రాముఁడునన్నీ వ్యసనసముద్రముననుండి యేవిధముచేత కడతేర్చిగట్టెక్కించునో అందుకుతగినట్లు నీవుఒనగూర్పవలయును. రాముడునన్ను తీసికొనిపోవునట్లుజేయుట నీకార్యమైయున్నది. వానరవీరుఁడవగు నోఆంజనేయుఁడా! నీవుశ్రీరామునియొద్దకుపోగానే, నేననుభవించుచుండెడి యీమహావ్యసనమున, ఈరాక్షసస్త్రీలు నన్నుభయపరచుచుండుటయును, శ్రీరామునకెఱింగింపుము. అనిసీతాదేవినాతోజెప్పినది. రాజోత్తముడవగు నోరాముఁడా! మహాపూజ్యురాలగుసీతాదేవి మహావ్యసనముతో గూడుకున్నదైయీసంగతులన్నియు నీకుజెప్పుమనిచెప్పినది ఆసీతాదేవి జెప్పినసమాచారమునంతయు నీకెఱింగించితిని. కావునసీతాదేవి సమస్తవిధములచేత సుఖముగనున్నదని తెలిసికొనుము.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదియేడవసర్గముగిసెను.

(※)

{ ఆంజనేయుడు రామునితోసీతాదేవియెట్లులైననురామునిలంకకువచ్చునట్లుచేయవలయునని చెప్పినదని చెప్పుట }

పురుషోత్తముఁడవగు నోరాముఁడా! నీకునాయందు విశేషముగ ప్రీతికలిగియుండుటచేతను, నేనుతన్నువ్యసనమునుండి తరింపజేయుదునవనియును, ప్రయాణసన్నాహముచేత తొట్రుపాటుతో గూడుకొనియున్న నన్నుజూచి సీతాదేవి మిగులసన్మానించి, మీదజరగవలసినకార్యమును గుఱించి యిట్లనిచెప్పె

ఓఆంజనేయుఁడా! నీవుయేవిధముగ రామునికిఁజెప్పటచేత యతివేగముగనారాముఁడు యుద్ధసన్నద్ధుఁడైవచ్చి రావణాసురుని బంధుమిత్రసమేతముగ సంహరించి నన్నుఁదీసికొనిపోవునో, అట్లనేకవిధములచేత దశరథరాజనందనుఁడగు రామునకు నీవుజెప్పవలయును. శత్రువులనుసంహరించువాఁడా! శౌర్యవంతుఁడవగు నాంజనేయుఁడా! నీకిష్టమున్నయెడల యిచ్చటనెచటనైన నొక్కరహస్యప్రదేశమునందొకరాత్రియుండి మఱుదినమునందు ఉదయముననే లేచిపొమ్ము. మహాపరాక్రమశాలివగు నోయాంజనేయుఁడా! నీవిచటయుండువేని మిగులదురదృష్టరాలనగు నేను కొంతసేపైన యీతీవ్రవ్యసనమును ఎడబాసియుండగలను ప్రయాణసన్నాహుఁడవైయుండెడు నీవిప్పుడుయిచటనుండి బైలుదేరిపోయినతోడనే నాప్రాణములకు సంశయముగలుగును. ఒకవేళ నాప్రాణములు పోయినను పోవును ఓఆంజనేయుఁడా! రామునివియోగమువలన గలిగినవ్యసనముచేత మిగులపరితపించుచున్ననేను, ఇప్పుడునీవిచటనుండిపోవుటవలన గలిగెడువ్యసనముచేత మఱియును పరితాపమునుబొంది, దీనురాలనై మహావ్యసనముచేత మిగులపరితపింపగలను. వానరోత్తముఁడా! పరాక్రమవంతుఁడా! ఆంజనేయుఁడా! నీకుసహాయులుగానుండెడు వానరులయందును యెలుగుబంట్లయందును నాకుమిగులసందేహమున్నది. ఈదాటగూడని మహాసముద్రమును వానరులయొక్కయు,యెలుగుబంట్లయొక్కయు, సైన్యములెట్లు దాటును? మఱియు రాచకొమరులగు రామలక్ష్మణులు లె

ట్లుదాటగలరు ఓయాంజనేయుఁడా! సముద్రముదాటెడి శక్తి, నీకును, గరుత్మంతునకును, వాయుదేవునకును యీముగ్గురకు మాత్రమెగదాయున్నది, మహాపరాక్రమవంతుఁడా! కార్యాకార్యముల నెఱింగినవారిలో నుత్తముఁడవగు నోయాంజనేయుఁడా! మహాదుష్కరమగు నీకార్యమును నెరవేర్చుటకు దగునైనయుపాయమును చింతించుటకు నీవుతగినవాఁడవుగాని వేరుగాదు. వైరివీరులను సంహరించునట్టి ఓఆంజనేయుఁడా! ఈకార్యమును నెరవేర్చుటకు నీవుఒకడవేచాలును కార్యములుజేసి నెరవేర్చుటయందు నీకుగలశక్తి మిగులయధికమైనదిగదా? ఓయాంజనేయుఁడా! రాముఁడు సమస్తసేనలతోగూడి యీలంకానగరమునకువచ్చి, యుద్ధమునందు రావణాసురునిజంపి జయముగలవాఁడై నన్నుఅయోధ్యానగరమునకు దీసికొనిపోవునేని యదియీరామునకు మిగుల కీర్తికరముగనుండును. అట్లుగాక, మిగులశౌర్యవంతుఁడగు రామునిభార్యనైన నన్నురాక్షసుడగు రావణాసురుడు రామునికిభయపడి కపటముచేత నన్నెట్లుదీసికొనివచ్చెనో అట్లె రాముడుగూడ రహస్యముగ నన్నుగొనిపోవునేని యదిఆరామునకు దగినదికాదు. శత్రుసైన్యములను జంపునట్టి రాముఁడు లంకానగరమును తనసైన్యములచే నిండినదానిగజేసి, రాక్షసులసంహరించి నన్నుతీసికొనిపోవునేని యదియీరామునకు తగినదిగానుండును ఓయాంజనేయుఁడా! మహాపరాక్రమశాలియును, యుద్ధవీరుఁడును, నగు రాముఁడు తనశౌర్యమునకుతగినట్లు ప్రయత్నించునట్లుజేయుట నీభారమైయున్నదని సీతాదేవిజెప్పినది. అంతమిగుల నర్థయుక్తములైనవియును, హేతువుతో గూడుకున్నవియును నగు సీతాదేవి మాటలనువిని నేనిట్లని బదులుజెప్పితిని.

ఓసీతాదేవీ! వానరులయొక్కయు, యెలుగుబంట్లయొక్కయు, సేనలకుప్రభుడును, వానరులలోపల నుత్తముడును, మహాబలసంపన్నుఁడును, నగుసుగ్రీవుఁడు నిన్నిచటనుండి కొనిపోవుటకు తగుమైనయుపాయమును జేయుటకు సకలప్రయత్నములను జేయుచున్నాఁడు ఓసీతాదేవీ! ఎట్టిప్రయాసముచేనైనను యీకార్యమును జేయుటకునిశ్చయించియున్నాఁడు. ఆసుగ్రీవునియొక్క స్వాధీనములో, మహాశౌర్యవంతులును, బలవంతులును, మనోవేగమువంటి వేగముగలవారును, నగువానరు లనేకులున్నారు. మఱియునావానరులు, మీదుగాను, క్రిందుగాను, అడ్డముగానుబోగలవారు వారికిదశదిశలయందును గమనముగలదు. వారుమితిలేని శౌర్యముగలవారు. ఎట్టికార్యమునైనను నునాయాసముగ జేయగలరు ఓసీతాదేవీ! మిగుల పూజ్యమైన స్వభావముగలవారును, బలాతిశయముచేత గర్వించియుండువారును, వాయువుసంచరించెడి మార్గమగు నాకాశమార్గమున సంచరించువారును, నగువానరులనేకమారులు భూప్రదక్షిణముజేసి వచ్చియున్నారు ఇదియునుగాక సుగ్రీవునియొద్ద నాకుసమానులును, నాకంటెనధికులుగానే యున్నారుగాని, నాకంటె తక్కువవాడొక్కడుగూడలేడు ఓసీతాదేవీ! నేనేయిచటికి వచ్చియున్నాను. ఇంకవారు రాగలరనిచెప్పనేల? వారువచ్చుటకెంతమాత్రమును సంశయములేదు. ఎప్పుడుగానిముందుగనొకచోటికి నధికులను బంపరుగదా. ఎచటికిగాని ముందు బంపఁబడువారు తక్కువవారుగానే యుందురు ఓసీతాదేవీ! ఇంకనీవు వ్యసనపడవలదు. కోపమును విడువుము వానరులుఒక్కగంతుతో లంకానగరమునకు వచ్చిచేరెదరు నీవుసందేహింపవలదు. మిగుల శ్రేష్ఠమైన భాగ్యముగల యోసీతాదేవీ! పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణులిద్దఱును నావీపుమీదనెక్కి, యేకకాలమునందుదయించిన చంద్రసూర్యులవలె ప్రకాశించుచు నీయొద్దకురాగలరు మఱియు విరోధులను చంపువాఁడును, సింహముతో సరిబోలువాఁడును, నగుశ్రీరాముని, విల్లునుచేతంబూని లంకాద్వారముననున్న లక్ష్మణుని, నీవుమిగుల శీఘ్రకాలములోనే జూడగలవు. గోళ్లును పండ్లునే యాయుధములుగాగలవారును, మహాపరాక్రమవంతులును, సింహములయొక్కయు, పెద్దపులులయొక్కయు, పరాక్రమమువంటి పరాక్రమము గలవారును, శ్రేష్ఠములగు యేనుగులయొక్క కాంతివంటి కాంతిగలవారును, నగువానరులందరు నతిశీఘ్రముగ గుంపుగూడి లంకానగరము నందుండుటను జూడగలవు మఱియు పర్వతములతోను, మేఘములతోను, సమానమైన దేహములుగలవారును, లంకాద్వీపమునందలి మలయపర్వతపుచరియలయందు సింహనాదములు జేయుచున్నవారును, నగువానరోత్తములయొక్క సింహనాదములధ్వనిని నీవు అతిశీఘ్రకాలములోనే వినగలవు. ఓసీతాదేవీ! శత్రువులను సంహరించువాడును, వనవాసవ్రతమును నెరవేర్చుకొని అయోధ్యానగరమును జేరినవాఁడును, నీతోగూడ పట్టాభిషేకము జేసికొన్నవాడును నగుశ్రీరాముని అతిశీఘ్రకాలములోనే జూడగలవు ఇందుకెంతమాత్రమును సంశయములేదు అనినేను సీతాదేవిని యూరడించితిని. ఓరాముఁడా! అప్పుడు నామనసు నిన్నుగురించి పరమవ్యసనమును బొందుచున్నదియును, జనకమహారాజుకూతురును నగుజానకీదేవిని వ్యసనపడకుండు

నట్లు ఆసీతాదేవియెదుట మహాధైర్యముగమాటలాడి మిగుల శుభకరములైనవియును, మహాప్రియములైనవియును, నగుమాటలతో ఆసీతాదేవిని యూరటనొందించితిని. అంతనాసీతాదేవి మిగుల శాంతినిబొందినది. పిమ్మట నేను బైలుదేరివచ్చితిని. అనియిట్లు ఆంజనేయుఁడు శ్రీరామునకుఁజెప్పి మిగుల శాంతవచనములచేత నూరట నొందించె.

ఇట్లు శ్రీమత్సుందరకాండమునందలి అరువదియెనిమిదవసర్గముగిసెను.

—(*)—

ఇట్లు సకలకళాకలాప దురంధరుఁడును - బరూరు - సీతారామార్యతనూభవుఁడునునగు

బరూరు - త్యాగరాయశాస్త్రిచే రచియింపంబడిన యాంధ్రవచనకావ్య

శ్రీమద్వాల్మీకిరామాయణమునందు సుందరకాండము- ముగిసెను.

శ్రీరామచంద్రార్పణమస్తు.



DIGITAL LIBRARY OF INDIA

Hosted by
International Institute of Information Technology, Hyderabad

Declaration to be given by the Author/Publisher to Digiti
In-copyright books.

To
The Digital Library of India,
IIIT, Hyderabad

Name of the Author/Publisher: S.B.P.B.K.Sathya

Address: Kapileswarapuram
E.G. Dist

City:
State: A.P.
Phone no:
Email:

We are happy to grant permission to Digital Library of scan all the books published by our organization / written by permission in this letter also authorizes and grants an Non E right to the Digital Library of India to scan, digitize and displa books published by the said publisher / Author in the DLI/UDL with out any financial implications from DLI

We will continue to retain the copyright for the book. can make it free to the read for the general public. DLI/ provide the above contact information for anyone wishing to p the physical book from us.

SL.NO	TITLE	LANGUAGE
1	శ్రీమద్వాల్మీకి రామాయణం ఉత్తరకాండం	TELUGU
2	" " అయోధ్యకాండం, బాలకాండం	"
3	" " అరణ్య, కిష్కింధ, సుందరకాండం	"
4	" " సుందరకాండం	"
5	" " యుద్ధకాండం	"
6	కబీరుదాసు చరిత్రము	"
7	తిరుపావై	"

PS: please add separate sheet for all your titles.

Sincerely,

Signature: [signature] 8/9/08

Name: S.B.P.B.K.SATYANARAYANA

Designation: KAPILESWARAPURAM-

Company: E.G.Dist. A.P.

Date: 8.9.2008